భారతదేశ చరిత్ర, సంస్కృతి

(క్రీ.శ. 1526 - 1989)



BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు

కోర్సుటీమ్

114980
19-4-05

పాఠ్య ప్రణాళిక బృందం

సంపాదకులు
ఆచార్య వి. రామకృష్ణ

సహసంపాదకులు
ఆచార్య కె. సుబ్రమణ్యం

రచయితలు
డా. సి.వి. రామచంద్రరావు
డా. కె.యస్.యన్. శేషన్
శ్రీ జె.యస్. ప్రకాశరావు
శ్రీ ఎ.వి. కోటిరెడ్డి
శ్రీ యస్. విజయశేఖర రెడ్డి
డా. వి. రామకృష్ణా రెడ్డి

పరిష్కృత పాఠ్య ప్రణాళిక బృందం

సంపాదకులు
ఆచార్య వి. రామకృష్ణ

సహసంపాదకులు
డా. ఇ. సుధారాణి

954
CHA

రచయితలు
డా. కె. కామేశ్వరరావు
శ్రీ జి.వి. అప్పారావు
ఆచార్య ఎం.వి. సుబ్బారావు
డా. ఇ. సుధారాణి
డా. ఆర్.వి. రమణమూర్తి
ముఖచిత్రం : రమేష్

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు.

Dr. B.R.A.O.U. LIBRARY
Acc No 114980
Date 19/4/05
Call No 954 CHA

ప్రథమ ముద్రణ : 1985

పరిష్కృత ముద్రణ : 2002, 2003, 2004

© డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు, ఆం.ప్ర., ఇండియా.
అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నైనా ఉపయోగించదలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు : డైరెక్టరు (అకడమిక్) డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
జూబ్లిహిల్స్, హైదరాబాదు - 500 033

web: www.braou.ac.in
e-mail : info@braou.ac.in

Lr. No. 1088/Dr. BRAOU/DMP/PTG/F.No.06/J.O.445/2004-2005 Dt. 12-01-05. / No. of Copies 5,000
Printed At : M/s. Mahalakshmi Art Printers Punjagutta, Hyderabad. Ph.: 23742600

పరిచయం

భారతదేశ చరిత్ర సంస్కృతిలో అనేక ముఖ్య ఘట్టాలున్నాయి. దానిలో మధ్య యుగం నుంచి ఆధునిక కాలం వరకు, దాదాపు నాలుగు శతాబ్దాల భారతదేశ చరిత్ర ఎంతో రసవత్తర గాథ. ఈ పుస్తకంలో 1526 నుంచి 1989 వరకు భారతదేశ చరిత్రలో జరిగిన విషయాలు విశదీకరించబడింది. మొగల్ రాజ్యస్థాపన నుంచి, 1947లో దేశం స్వతంత్రమయ్యేంతవరకు జరిగిన చరిత్రతో పాటు స్వతంత్ర భారతదేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి, భారతదేశ విదేశాంగ విధాన చరిత్ర కూడా ఉంది.

మొగల్ యుగంలో విభిన్న సంస్కృతుల సమ్మిళితం కొరకు జరిగిన ప్రయత్నాలు, ఆనాడు దేశంలో విలసిల్లిన ఆర్థిక సంపద, అయుగానికి ఎంతో ప్రాముఖ్యతను సంపాదించాయి.

మనదేశంలో క్రీ. శ. 1757లో బ్రిటీష్‌వారి పాలన, దానికి పర్యవసానంగా భారతీయుల సుసంఘటిత పోరాటంకు ఒక ప్రత్యేకత వుంది. ప్రపంచ ఉద్యమాలన్నిటిలోనూ స్వాతంత్ర్యోద్యమం ఒక విశిష్టతను సంతరించుకుంది. బ్రిటిష్ వలస పాలకుల ప్రయోజనాలకు, భారత జాతీయ వాంఛలకు నడుమ పరస్పర సంఘర్షణలో ఆవిర్భవించిన జాతీయ భావవికాసం, నూతన ఆర్థికశక్తుల ఆవిర్భావం, విద్యావ్యాప్తి, సంస్కరణలు, జాతీయోద్యమాలు ప్రపంచ భావవెల్లువలో భారతీయులు పాల్గొనేటట్లు చేశాయి.

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పాఠ్య ప్రణాళికకు అనుగుణంగా, ఈ పుస్తకం తయారు చేశారు. ఇది బి.ఏ. రెండవ సంవత్సరం విద్యార్థుల కొరకు రూపొందించబడింది. పాఠ్య ప్రణాళిక కొన్ని ఖండాలుగా, ఖండాలు భాగాలుగా విభజించడమైంది. పుస్తకంలోని భాగాలన్నింటినీ, అనుభవం వున్న అధ్యాపకులు రాశారు. దూరంగా వుండి చదివే సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులను దృష్టిలో వుంచుకొని పాఠ్యరచన జరిగింది. విద్యార్థులు తమ అవగాహనను పరీక్షించుకోవడానికి వీలుగా, ప్రతి పాఠంలో 'మీ అవగాహన పరీక్షించుకోండి' అనే శీర్షిక క్రింద కొన్ని ప్రశ్నలు వున్నాయి. ఆ ప్రశ్నలకు పుస్తకంలోనే విద్యార్థులు జవాబులు రాయాలి. ఆ ప్రశ్నలకు జవాబులు పాఠం చివర వున్నాయి. ప్రతి భాగంలోని ముఖ్య అంశాలు, 'సంగ్రహంగా' అనే శీర్షిక క్రింద వున్నాయి. పాఠంలోని ముఖ్య అంశాలు గుర్తుంచుకోవడానికి ఆ శీర్షిక ఉపయోగపడుతుంది. ప్రతి పాఠం చివర, పరీక్ష నమూనా ప్రశ్నలు, చదవదగిన పుస్తకాల (ఉపయుక్త గ్రంథాలు) పట్టిక కూడా ఉన్నాయి. పుస్తకం చివర విశ్వవిద్యాలయ అభ్యాసాలు, పరీక్ష నమూనా ప్రశ్న పత్రం కూడా ప్రచురించాం. అభ్యాసాలకు విద్యార్థులు, సూచించిన విధంగా జవాబులు రాయాలి.

శాస్త్రీయ పరిశోధనల దృష్ట్యా, సమకాలీన చారిత్రకాంశాలను చేర్చి, నూతన పద్ధతిలో, విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడాలి అనే ఉద్దేశంతో తయారు చేసిన ఈ పరిష్కృత పుస్తకం, విద్యార్థులందరికీ ఉపయోగపడుతుందని, దీని సహాయంతో విద్యార్థులు భారత చరిత్ర, సంస్కృతిలోని వైరుధ్యాలను, సంక్లిష్టతలను పాఠ్య విషయాల ద్వారా సులభంగా అర్థం చేసుకొని అవగాహన పెంపొందించుకుంటారని ఆశిస్తున్నాం.

BRAOU

BRAOU

విషయ సూచిక

ఖండం - 1 : మొగలులు, షేర్షా

భాగం - 1 : హుమాయూన్ వరకు మొగలుల రాజకీయ చరిత్ర 3

భాగం - 2 : షేర్షా - అతని పరిపాలనా వ్యవస్థ 12

భాగం - 3 : అక్బర్ నుంచి మొగల్ రాజ్య చరిత్ర 23

భాగం - 4 : మొగలులు - పరిపాలన - ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు 52

ఖండం - 2 : మహారాష్ట్రులు 18వ శతాబ్దంలో భారతదేశం

భాగం - 5 : మహారాష్ట్రులు 77

భాగం - 6 : ప్రాంతీయ రాజ్యాల ప్రాబల్యం, సమాజం, ఆర్థిక వ్యవస్థ 91

ఖండం - 3 : భారతదేశంలో బ్రిటీష్ వలస రాజ్యస్థాపన, అభివృద్ధి

భాగం - 7 : ఐరోపావారి మొదటి స్థావరాలు 106

భాగం - 8 : భారతదేశ బ్రిటీష్ ఆక్రమణ, 1748-1856 115

భాగం - 9 : 1857 కంపెనీ పరిపాలన, ఆర్థిక విధానం 127

భాగం - 10 : 19వ శతాబ్ది ప్రథమార్ధంలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం 136

భాగం - 11 : 1857 తిరుగుబాటు 144

భాగం - 12 : విద్యా, వార్తా పత్రికల ప్రగతి - నూతన సాహిత్య ధోరణులు 154

భాగం - 13 : వ్యవసాయం, వలసవాదం, తిరోగమన పారిశ్రామికీకరణ 164

ఖండం - 4 : భారత జాతీయోద్యమం

భాగం - 14 : మత, సాంఘిక సంస్కరణోద్యమాలు 185

భాగం - 15 : భారత జాతీయ కాంగ్రెస్ పుట్టు పూర్వోత్తరాలు 202

భాగం - 16 : భారతదేశ జాతీయోద్యమ తొలి దశ 212

భాగం - 17 : తీవ్రవాద జాతీయోద్యమ విజృంభణ, కార్యక్రమాలు 221

భాగం - 18 : ముస్లింలీగ్, మతతత్వ విజృంభణ 245

భాగం - 19 : మొదటి ప్రపంచ యుద్ధం, హోంరూలు ఉద్యమం 260

భాగం - 20 : రాజ్యాంగ సంస్కరణలు 267

భాగం - 21 : గాంధీ నాయకత్వం, సహాయ నిరాకరణోద్యమం 282

భాగం - 22 : జాతీయోద్యమం, వామపక్షాల ఆవిర్భావం, 1920-1929 297

భాగం - 23 : శాసనోల్లంఘనోద్యమం 308

భాగం - 24 : కాంగ్రెస్ - సోషలిస్ట్ పార్టీ అవతరణ 318

భాగం - 25 : జాతీయోద్యమం, 1935 - 46 323

భాగం - 26 : దేశ విభజన, అధికార మార్పిడి 338

భాగం - 27 : స్వాతంత్ర్యోదమం నాటి భారతదేశ పరిస్థితులు 352

ఖండం - 5 : స్వాతంత్ర్యానంతరం భారతదేశం క్రీ.శ. 1950 - 1989

భాగం - 28 : రాజకీయాభివృద్ధి - క్రీ.శ. 1950 నుంచి 1989 వరకు 371

భాగం - 29 : ప్రణాళిక రచన, ఆర్థికాభివృద్ధి - 1950 - 1989 384

భాగం - 30 : సామాజిక అభివృద్ధి 402

భాగం - 31 : భారతదేశ విదేశాంగ విధానం 415

పాఠ్యప్రణాళిక 429

అభ్యాసాలు (Assignments) 431

పరీక్షా నమూనా పత్రం 437

BRAOU

BRAOU

ఖండం - 1 మొగలులు, షేర్షా

ఈ ఖండంలో 4 భాగాలున్నాయి. ఈ 4 భాగాలు మొగల్ సామ్రాజ్య చరిత్రకు సంబంధించినవి. షేర్షాను గురించిన వివరాలు కూడా ఈ ఖండంలోనే వున్నాయి. మొగల్ సామ్రాజ్య చరిత్ర, మొగల్ పరిపాలన, ఆకాలంనాటి ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులు, ఈ ఖండంలోని వివిధ భాగాల్లో వివరించడమైంది.

BRAOU

BRAOU

భాగం - 1 : హుమాయూన్ వరకు మొగలుల రాజకీయ చరిత్ర

విషయక్రమం

1.0 లక్ష్యాలు

1.1 పరిచయం

1.2 బాబర్ దండయాత్రాకాలం నాటి భారతదేశ రాజకీయ పరిస్థితులు

1.3 బాబర్

- 1.3.1 జీవిత విశేషాలు
- 1.3.2 భారతదేశంపై దండయాత్ర
- 1.3.3 మొదటి పానిపట్ యుద్ధం, 1526
- 1.3.4 కాణ్వా యుద్ధం, 1527
- 1.3.5 చందేరి ఆక్రమణ, 1528
- 1.3.6 గోగ్రా యుద్ధం, 1529
- 1.3.7 రాజ్య విస్తీర్ణం
- 1.3.8 బాబర్ వ్యక్తిత్వం

1.4 హుమాయూన్, 1530-1540; 1555-56

- 1.4.1 కష్టాలు
- 1.4.2 యుద్ధాలు, షేర్షాతో పోరాటం
- 1.4.3 రాజ్య భ్రష్టత
- 1.4.4 మొగల్ రాజ్య పునఃస్థాపన
- 1.4.5 మరణం, 1556
- 1.4.6 వ్యక్తిత్వం

1.5 సంగ్రహంగా

1.6 మీ అవగాహన పరీక్షించుకోండి-జవాబులు

1.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

1.8 ఉపయుక్త గ్రంథాలు

1.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. బాబర్ దండయాత్రకు పూర్వం భారతదేశంలో రాజకీయ పరిస్థితులు
2. మొదటి పానిపట్ యుద్ధం, మొగల్ రాజ్య స్థాపన
3. హుమాయూన్ మొగల్ చక్రవర్తి అగుట, షేర్షాతో యుద్ధంలో రాజ్యం కోల్పోవుట, 1555 లో మొగల్ రాజ్యం తిరిగి స్థాపించుట

1.1 పరిచయం


1526లో బాబర్ భారతదేశం మీద దండెత్తి, ఢిల్లీ సుల్తానైన ఇబ్రహీంలోడిని పానిపట్ యుద్ధంలో ఓడించి, భారతదేశంలో ఒక నూతన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. షేర్షా సూర్, అతని వారసులు (1540-1555) పరిపాలించిన పదిహేనేండ్ల స్వల్ప కాలం మినహాయించి, 1526 నుంచి 1707 వరకు మొగల్ సామ్రాజ్యం ముమారు నూట ఎనభై ఏండ్లు అవిచ్ఛిన్నంగా ఉండింది. ఈ కాలంలో. ఆరుగురు గొప్ప చక్రవర్తులు పాలించారు. వీరు వరుసగా, బాబర్, హుమాయూన్, అక్బర్, జహాంగీర్, షాజహాన్, ఔరంగజేబ్‌లు. ఔరంగజేబ్ తర్వాత ఈ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. ఈ ఆరుగురు మొగల్ రాజులను మహామొగలులని పిలిచారు.

BRAOU

1.2 బాబర్ దండయాత్రాకాలం నాటి భారతదేశ రాజకీయ పరిస్థితులు

బాబర్ దండెత్తే నాటికి భారతదేశం రాజకీయ అనైక్యతకు గురైంది. ఆనాడు చిన్న, పెద్ద హిందూ, మహ్మదీయ రాజ్యాలు పరస్పర అసూయాద్వేషాలతో తమలోతాము కలహించుకుంటూ, అంతర్గత యుద్ధాలవల్ల తమను బలహీనపరచుకొని, సునాయాసంగా భారతదేశం బాబర్ రాజ్యాధికారం క్రిందకు వచ్చుటకు అవకాశం కల్గించారు.

ఢిల్లీ, ఆగ్రా, దోఅబ్, బయానా, చందేరిలకు మాత్రమే పరిమితమైన ఢిల్లీ రాజ్యపాలకుడు ఆఫ్గన్ జాతీయుడైన ఇబ్రహింలోడి. సింధు, ముల్తాన్, జౌన్‌పూర్, బెంగాల్, ఒరిస్సాలు స్వతంత్ర రాజ్యాలుగా పరిపాలింపబడుతున్నాయి. మాళ్వా, గుజరాత్, ఖాందేష్‌లను స్వతంత్రంగా మహ్మదీయ పాలకులు పాలిస్తున్నారు. రాజస్థాన్ అనేక చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. అట్టి రాజపుత్ర రాజ్యాలలో రాణా సంగ్రామ సింగ్‌చే పాలింపబడుతున్న మేవార్ రాజ్యం అతి ముఖ్యమైంది.



దక్కన్‌లో విజయనగర, బహమని రాజ్యాలు ప్రధానమైనవి. బాబర్ దండయాత్రా కాలంనాటికి బహమని రాజ్యం ఐదు స్వతంత్ర రాజ్యాలుగా-బెరార్, అహ్మద్‌నగర్, బీజాపూర్, గోల్కొండ, బీదరులుగా చీలిపోయింది. ఈ ఐదు రాజ్యాలను మహ్మదీయ పాలకులు పాలిస్తున్నారు. ఈ ఐదు రాజవంశాలు తమలో తాము నిరంతరం కలహించుకుంటూ, తమ ఉమ్మడి శత్రువైన విజయనగర రాజ్యంతో దెబ్బలాడుతూ బలహీనంగా ఉన్నాయి. విజయనగర పాలకుడైన శ్రీ కృష్ణదేవరాయలు బాబర్ సమకాలీనుడు. బాబర్ తన **తుజక్-ఇ-బాబరీలో** పేరు

చెప్పకుండా విగ్రహారాధకులైన పాలకుల్లో, రాజ్య విస్తీర్ణంలోను సైనిక సంఖ్యలోను, విజయనగర రాజు బహుబలవంతుడని పేర్కొన్నాడు. బాబర్ దండెత్తే నాటికి ఆఫ్గన్‌లు, రాజపుత్రులు ఉత్తర భారతదేశంలోను, దక్షిణ భారతదేశంలో విజయనగర పాలకులు బలవంతులైనా, పరస్పర యుద్ధాలవల్ల, అసూయ వల్ల కలసికట్టుగా ఏకమై బాబర్ లాంటి దురాక్రమణదారుని ఎదుర్కొనుటలో విఫలమయ్యారు. ఈ రాజకీయ అనైక్యతకు తోడుగా సైనిక బలహీనత, సంప్రదాయబద్ధమైన కుల వ్యవస్థవల్ల అనైకమత్యంనకు గురైన సైనిక శక్తి, సమకాలీన పరిస్థితులకు అనుకూలంగా లేని సైనిక వ్యూహ రచనా పద్ధతి, ఉత్తర సరిహద్దుల భద్రత విషయంలో చూపించిన నిర్లక్ష్యం బాబర్ విజయానికి కారణాలుగా పేర్కొనవచ్చును. గతచరిత్ర నుంచి రాజ్యపాలకులు పాఠాలు నేర్చుకోక పోవటంచే క్రీ.శ. 1206లో ఢిల్లీ సల్తనత్ స్థాపన బాబర్‌చే మొగలాయి వంశరాజ్యాధికార స్థాపన తరువాతి కాలంలో 1757, 1764లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెని రాజ్యాధికార స్థాపనకు దారితీసాయి.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. బాబర్ దండయాత్రకు పూర్వం, భారతదేశంలోని రాజకీయ పరిస్థితి ముఖ్య లక్షణమేమి?

.....

.....

.....

.....

1.3 బాబర్

1.3.1 జీవిత విశేషాలు

బాబర్ పూర్తి పేరు జహీరుద్దీన్ మహమ్మద్ బాబర్. అతడు తండ్రి వైపునుండి తైమూర్ వంశానికి తల్లివైపు నుంచి చెంగీజ్‌ఖాన్ వంశానికి చెందినవాడు. ఈ విధంగా బాబర్‌లో, ఆసియా ఖండంలోని మహోపద్రవకారులైన ఇద్దరు మహావిజేతల రక్తం మిళితమైంది.

బాబర్ 1483లో జన్మించాడు. ఇతని తండ్రి ఉమర్ షేక్ మీర్జా. ఇతడు తైమూర్ మహాసామ్రాజ్యంలో ఒక చిన్న భాగమైన ఫర్గానాకు పాలకుడుగా ఉండేవాడు. పదకొండేళ్ళ పసిప్రాయంలోనే, బాబర్ తన తండ్రి వారసుడుగా ఫర్గానా (నేడు ఇది రష్యన్ టర్కీస్తాన్‌లో ఒక చిన్న రాష్ట్రం) సింహాసనాన్ని అధిష్ఠించాడు. అతని తొలిజీవితం కష్టాలతో కూడుకొని ఉండేది. బాబర్ భయంకరమైన ఆ కష్టాలను ఎదుర్కొన్నాడు. తైమూర్ రాజధాని అయిన సమర్‌ఖండ్‌ను ఆక్రమించటం అతని మహదాశయం. అతడు సమర్‌ఖండ్‌ను రెండుమార్లు గెలిచాడు. కాని, ఉజ్‌బెగ్ జాతుల విరోధంవల్ల, ప్రతిసారి తిరిగి దానిని కోల్పోయాడు. సమర్‌ఖండ్‌ను జయించవలెననే అతని మహదాశయం నెరవేరలేదు. అతడు ఫర్గానా నుంచి కూడా తరిమివేయబడ్డాడు. తన పూర్వీకుల రాజ్యాన్ని తిరిగి సంపాదించడానికై పదేండ్లు ప్రయత్నించి విఫలుడై తన స్వదేశాన్ని విడిచి కాబూల్‌కు పోయాడు. అచట 1504లో ఒక చిన్న రాజ్యాన్ని ఏర్పరచుకొన్నాడు.

1.3.2 భారతదేశంపై దండయాత్ర

భారతదేశపు సిరిసంపదలను గూర్చి మిక్కిలిగా విన్న బాబర్, భారతదేశాన్ని జయించ నిశ్చయించడానికి ముందు, ఇరవై ఏండ్లు కాబూల్‌లో ఉండినాడు. 1517, 1525ల మధ్య పంజాబ్ మీద నాల్గుసార్లు దండెత్తాడు. ఈ దాడులు, తాను చివరిసారిగా పెద్ద ఎత్తున దండెత్తే ప్రయత్నానికి ముందు, పరిస్థితిని తెలుసుకోడానికై చేసిన దాడులు. బలవంతుడైన, పంజాబ్ రాష్ట్ర పాలకుడు దౌలత్‌ఖాన్ లోడి యొక్క ఢిల్లీ సుల్తాన్ ఇబ్రాహీంలోడీ పినతండ్రి అయిన ఆలంఖాన్‌ల అభ్యర్థనలపై బాబర్ చివరగా అయిదవసారి భారతదేశం మీద చేసిన దండయాత్ర అతనికి గొప్ప అవకాశాన్ని చేకూర్చింది. ఎట్టి ఆలస్యం లేకుండా బాబర్ 1525 నవంబర్‌లో, తన సైన్యాలను

BRAOU

భారతదేశం మీదికి నడిపాడు. కాని దౌలత్ ఖాన్ లోడీ, ఆలంఖాన్‌లు అతనిని మోసగించి ఎదురు తిరిగారు. అందుచే, బాబర్ మొదటగా వీరితో పోరాడవలసి వచ్చింది. దౌలత్ ఖాన్‌ను ఓడించి, పంజాబ్‌ను సులభంగా ఆక్రమించాడు. అచ్చట నుంచి ఢిల్లీ మీదకు దండెత్తినాడు

1.3.3. మొదటి పానిపట్ యుద్ధం, 1526

బాబర్ ఢిల్లీ మీదికి దండెత్తి వస్తున్నాడని తెలిసి, సుల్తాన్ ఇబ్రహీం లోడీ బాబర్ నెదుర్కోవడానికై, ఢిల్లీ నుంచి ముందుకు సాగిపోయాడు. గెలిచిన వానికి భారతదేశమనే కానుక ప్రతిఫలంగా లభించటంవల్ల, పానిపట్ యుద్ధభూమిలో బాబర్, సుల్తాన్ ఇబ్రాహీం 1526 ఏప్రిల్ 21న యుద్ధానికి తలపడ్డారు. నూరు ఏనుగులు అండగా నిల్చిన, ఒక లక్షకాల్బలంతో, ఇబ్రాహీం యుద్ధభూమిలో నిలిచాడు. బాబర్ సైన్యం (12000 కాల్బలం) సంఖ్యలో ఇబ్రాహీం సైన్యానికన్నా చాలా తక్కువ; కాని అది సుశిక్షితమై, యుద్ధంలో ఆరితేరింది. అంతేగాక, బాబర్ సేవాధిపతిగా చిరకాలానుభవం కలవాడు. ఉస్తాద్ అలీ, ముస్తఫా అనే ఇద్దరు సమర్థులైన సేనానాయకుల ఆజ్ఞలో, శ్రేష్ఠమైన పెద్ద ఫిరంగి దళం అతనికి ఉండేది. పోగా, ఇబ్రాహీం యుద్ధానుభవంలేని యువకుడు. యుద్ధగమనంలో అలక్ష్యంగా ఉండేవాడు. ఎట్టి క్రమమూలేక సైన్యాన్ని నడపేవాడు; ఎట్టి పద్ధతీలేక యుద్ధాన్ని ఆపడమో, యుద్ధాన్నించి విరమించడమో చేసేవాడు; ముందు చూపులేక యుద్ధానికి తలపడేవాడు. అందుచేత, సహజ సేనాధిపతి అయిన బాబర్‌కు ఇబ్రాహీం సమ్ము ఉజ్జీకాడు. అంతేకాక, ఇబ్రాహీంకు అతని అనుచరులు విశ్వాసపాత్రులు కారు; అతని సైన్యం చాలవరకు కిలిబంట్లతో కూడింది. యుద్ధం సమాన శౌర్య ప్రతాపాలతో తీవ్రంగా సాగింది. కాని, సరైన యుద్ధ వ్యూహం లోపించడంవల్ల సుల్తాన్ ఇబ్రాహీం యుద్ధరంగంలో చనిపోయాడు. తన ఫిరంగిదళం ప్రధాన కారణంగా, బాబర్ తిరుగులేని ఘన విజయాన్ని సాధించాడు. "సర్వశక్తిమంతుడైన దేవుని కృపవల్ల కష్టమైన ఈ కార్యం సులభం చేయబడి, అంత పెద్ద సైన్యం అర్ధదినంలో దుమ్ములో కలిసిపోయిందని" బాబర్ తన జీవిత చరిత్రలో వ్రాసుకొన్నాడు. బాబర్ ఢిల్లీని ఆక్రమించాడు. యుద్ధంలో కొల్లగొట్టిన ధనాన్ని తన సైనికులకు, అనుయాయులకు పంచిపెట్టడంలో బాబర్ ఎనలేని ఔదార్యాన్ని కనపరిచాడు. ఈ విధంగా పానిపట్ యుద్ధం బాబర్‌ను ఢిల్లీ సుల్తాన్‌గా చేసింది. ఉత్తర భారతదేశంలో అత్యధిక భాగానికి అధిపతి కావడానికి ముందుగా, బాబర్ మరిమూడు యుద్ధాలలో పోరాడవలసి వచ్చింది.

1.3.4 కాణ్వ యుద్ధం, 1527

సుల్తాన్ ఇబ్రాహీం లోడీ కన్నా బలవంతమైన రాజ్యశక్తిని తరువాత బాబర్ ఎదుర్కోవలసి వచ్చింది. ఇది రాణా సంగ్రామసింహుని (రాణా సంగా) నాయకత్వాన నడచిన రాజపుత్ర రాజ్యశక్తి. రాణా సంగ్రామసింహుడు రాజపుత్ర రాజ్యాల్లో ప్రధానమైన మేవాడ్ రాజ్యాధిపతి. అతడు నూరుయుద్ధాల వీరుడని ప్రసిద్ధిగాంచినవాడు. వెనుకటిలో తైమూర్ వలె, ఢిల్లీ సుల్తాన్‌ను ఓడించిన తర్వాత బాబర్ కూడా కాబూల్‌కు వెనుకకు తిరిగి పోతాడని సంగ్రామసింహుడు తలచాడు. కాని, బాబర్ ఒక రాజ్యాన్ని స్థాపించ నిర్ణయించి ఢిల్లీలో పాదుకొన్నాడని తెలియగానే, రాణా అతనిపైకి దండెత్తాడు. రాజపుత్ర పాలకులనేకులు, హసన్‌ఖాన్ మేవాటి, సుల్తాన్ మొహమ్మద్ లోడి మొదలుగా లోడీ వంశాన్ని సమర్థించే కొంతమంది అఫ్ఘన్ (లోడీ) అమీరులు, రాణాతో చేరారు. ఆగ్రా సమీపంలోని కాణ్వ వద్ద, 1527 మార్చి 16న పోరాటం జరిగింది.

రాణా చాలా పెద్ద సైన్యాన్ని యుద్ధరంగంలో నిలిపాడు. ఈ సైన్యాన్ని చూడగానే బాబర్ సైన్యంలో ధైర్యం సడలింది. అప్పుడు బాబర్ సైనికుల నుద్బోధించి, వారి ధైర్యాన్ని కూడగట్టి యుద్ధానికి పురికొల్పాడు. అపకీర్తితో బతకడం కన్నా, కీర్తి ప్రతిష్ఠలతో మరణించడం మేలని వారిని ఉద్బోధించి, యుద్ధం నుంచి వెనుదిరగరాదని, వారిచేత దైవం మీద ప్రతిజ్ఞ చేయించాడు. జీవితంలో మద్యం ముట్టనని ప్రతిజ్ఞచేసి, ఆ ప్రతిజ్ఞను జీవితాంతం ఆచరించాడు. మొగలులు ధైర్యంతో శత్రువును ఎదుర్కొన్నారు. వారిని, వారి ఫిరంగిదళం ఎక్కువ ఆదుకొంది. తీవ్ర పోరాటం సలిపి రాజపుత్రులు ఓడిపోయారు. రాణా సంగా యుద్ధ భూమినుంచి

BRAOU

తప్పించుకొనిపోయి, రెండు సంవత్సరాల తర్వాత (1529) చనిపోయాడు. ఈ విజయం శక్తివంతమైన రాజపుత్ర కూటమిని బలహీనపరచి, బాబర్ చేయబోయే దండయాత్రలను సుగమం చేసింది. ఈ విజయం తర్వాత భారతదేశంలో బాబర్ స్థానం చాలా సుస్థిరమైంది. అందుచే, ఈ యుద్ధం మొదటి పానిపట్ యుద్ధం కన్నా ముఖ్యమైంది.

1.3.5 చందేరి ఆక్రమణ, 1528

కాన్వ విజయం తర్వాత, 1528లో చందేరి దుర్గాన్ని ఆక్రమించుకున్నాడు. ఈ దుర్గాన్ని రాణా తరపున మేదినీరాయ్ అనే రాజపుత్ర వీరుడు పాలించేవాడు.

1.3.6 గోగ్రా యుద్ధం, 1529

చందేరిని ఆక్రమించిన తర్వాత, బాబర్ బీహార్‌వైపుకు సాగిపోయాడు. అక్కడ ఇబ్రాహీం లోడి సోదరుడైన మొహమ్మద్ లోడీ నాయకత్వంలో ఆఫ్ఘన్‌లు రాజ్యమేలుతుండేవారు. 1529 లో పాట్నాకు దగ్గరగా గోగ్రా నదీతీరంలో జరిగిన ఒక యుద్ధంలో, బాబర్ ఆఫ్ఘన్‌లను ఓడించాడు. అటు తర్వాత, బెంగాల్ పాలకుడైన సుల్తాన్ నస్‌రత్‌ను తనతో సంధి కుదుర్చుకొనేటట్లు చేశాడు. 1529లో బలిష్టమైన రణతంభోర్ దుర్గం కూడా బాబర్ హస్తగతమైంది.

1.3.7 రాజ్య విస్తీర్ణం

1530లో బాబర్ మరణించాడు. పైన చెప్పిన యుద్ధాల తర్వాత, దాదాపు ఉత్తర భారతానికంతా బాబర్ అధిపతి అయ్యాడు. పంజాబ్, నేటి ఉత్తరప్రదేశ్; ఉత్తర బీహార్‌ల మీద అతని పాలన విస్తరించింది. రాజపుత్ర రాజ్యమైన మేవాడ్‌ను కూడా అతడు వశపరచుకొన్నాడు, ఈ విధంగా బాబర్ ఆక్రమణలు పంజాబ్ నుంచి బెంగాల్ సరిహద్దు వరకు, హిమాలయ పర్వతాల నుంచి గ్వాలియర్ వరకు విస్తరించాయి.

1.3.8 బాబర్ వ్యక్తిత్వం

బాబర్ శీలం, వ్యక్తిత్వం అతని స్వీయ జీవిత చరిత్ర నుంచి బాగా తెలుస్తాయి. ఈ జీవిత చరిత్ర నేడు ఉండే స్వీయ జీవిత చరిత్రలలో మిక్కిలి ఉత్తమమైంది, విశ్వాసపాత్రమైంది. **తుజక్-ఇ-బాబరి** అనే పేరు గల ఈ జీవిత చరిత్ర మొదట్లో తుర్కీ భాషలో వ్రాయబడింది. హుమాయూన్ తాను సొంతంగా దీని ప్రతిని వ్రాశాడు. ఈ జీవిత చరిత్ర, బాబర్ మిక్కిలిగా అభిమానించదగ్గ వ్యక్తిగా, శక్తివంతమైన, కళాత్మకమైన, సైనిక సంఘటనలను వర్ణించాడు. ఆనాటి ప్రసిద్ధి చెందిన వ్యక్తులను గురించి కూడా వ్రాశాడు. దేశపు భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి సౌందర్యం, దేశంలోని జంతువులు, పక్షులు, వృక్షాలు, పండ్లు మొదలైన వాటిని గురించి విపులంగా వ్రాశాడు. "హిందూస్థాన్ జనంతో నిండిన, విశేషమైన ఉత్పత్తి కలిగిన చాలా విశాలమైన దేశం" అని బాబర్ వ్రాశాడు. దేశంలో, ఎండాకాలం, వర్షాకాలం, చలికాలం అనే మూడు ఋతువులే వున్నాయని వ్రాశాడు. మామిడిపండును దేశంలోని ఉత్తమమైన పండుగా అభివర్ణించాడు. భారతదేశాన్ని బాబర్ 'అద్భుత దేశం'గా వర్ణించినప్పటికీ, ఇక్కడ, తన దేశంలోవున్న కొన్ని విశేషాలు లేనందుకు బాధపడ్డాడు. తోటలు, జలపాతాలు, మంచి గుఱ్ఱాలు, కుక్కలు, ద్రాక్ష పండ్లు, కర్బూజ పండ్లు భారతదేశంలో లేనందుకు బాబర్ విచారించాడు. బాబర్ తన తొలి జీవితదశలో ఎదుర్కొన్న కష్టాలే అతనిని ధైర్యవంతునిగా, కష్టాలలో సైతం వెనుదిరగని వాడినిగా చేశాయి. అతడు ధైర్యసాహసాలతో తొణికిసలాడేవాడు. అతని తుర్కీ అమీరులు అతనికి, బాబర్ (సింహం లేదా పులి) అనే బిరుదు ఇచ్చారు. అతనికి ఎనలేని ఆత్మవిశ్వాసముండేది. బాబర్ దృఢసంకల్పం కలవాడు; ఒక తీవ్ర పరిస్థితిలో తాగుబోతుతనాన్ని అధిగమించాడు.

బాబర్ గొప్ప సంస్కారంగల వ్యక్తి. అతడు తుర్కీ, ఫారసీ భాషలలో నిష్ణాతుడైన రచయిత. ఈ రెండు

BRAOU

భాషలలో చక్కని కవిత్వం వ్రాశాడు. సరళ శైలిలో రచించిన అతని జీవిత చరిత్రవల్ల, అతడు తుర్కీ భాషలో గొప్ప గద్య రచయితయని తెలుస్తుంది. అతడు దైవంలో నిండు విశ్వాసం గలవాడు. కానీ, మతమౌఢ్యంలేని సున్నీ ముస్లిం. సామాన్యంగా అతడు దయాదాక్షిణ్యాలతో కూడినవాడు; అరుదుగా క్రౌర్యాన్ని కనపరచేవాడు.

బాబర్ విశిష్ట గుణోపేతుడైన సేనా నాయకుడు; యుద్ధ వ్యూహరచనా చతురుడు. అతడు నాలుగేండ్ల కొద్ది కాలంలోనే, ఉత్తర భారతాన్నంతా జయించగలిగాడు. ఉత్తేజకరమైన తన ఉద్బోధంవల్ల తన సైనికులలో ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని రేకెత్తించగలిగాడు. సైనికపరంగా అఫ్ఘన్‌ల అధికారాన్ని అంతమొందించి, రాజపుత్ర రాజ్యాలను బలహీనపరచి, బాబర్ మొగల్ సామ్రాజ్యానికి పునాదులు ఏర్పరచాడు. అకాల మరణంవల్ల, అతడు తన విజయాలను ఏకీకృతం చేయలేకపోయాడు. యుద్ధాలలో, రాజకీయాలలో నిమగ్నుడైన అతనికి, పరిపాలన ఏర్పాటుచేయడానికి చాలినంత అవకాశం లేకపోయింది. అతడు తాను తలపెట్టిన పనిని పూర్తి చేయకనే చనిపోయాడు. ఫలితంగా, అతని కుమారుడైన హుమాయూన్ కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది.

బాబర్ భారతదేశ విజయాలు చరిత్రలో అతనికి ఒక స్థానాన్ని చేకూర్చాయి. ఈ విజయాలు ఒక సార్వభౌమ వంశానికి మార్గాన్ని ఏర్పరచాయి. వి.ఎ.స్మిత్ చెప్పినట్లు, బాబర్ *"అతని కాలపు ఆసియా ఖండమందలి పాలకులలో మిక్కిలి ప్రజ్ఞ కలవాడు; ఏ కాలం లేదా దేశానికి చెందిన సార్వభౌములలోనైనా, అత్యున్నత స్థానం కలవాడు"*.

1.4 హుమాయూన్, 1530-1540 : 1555 - 1556

హుమాయూన్ పూర్తి పేరు నాసిర్-ఉద్-దీన్ హుమాయూన్. హుమాయూన్ అనగా అదృష్టవంతుడు; కాని, హుమాయూన్ మిక్కిలి దురదృష్టవంతుడైన రాజవటం విధి విలాసం.

బాబర్ జ్యేష్ఠ కుమారుడుగా హుమాయూన్ సింహాసనాన్ని అధిష్ఠించేనాటికి, అతని వయస్సు ఇరవై మూడేండ్లు. సోదరులను దయతో చూడవలసిందిగా, అతనిని తండ్రి కోరాడు; ఆ కోరిక మేరకు అతడు సామ్రాజ్యాన్ని సోదరుల మధ్య పంచాడు. దీనివల్ల మిక్కిలి అపకారం జరిగింది. తన సోదరులైన కమ్రాన్‌కు కాబూల్, కాందహార్‌లను, హిందల్‌కు మేవార్, అల్వార్‌లను, మీర్జా అస్కరీకి సంభల్ (రోహిల్ ఖండ్) ను ఇచ్చాడు.

1.4.1 కష్టాలు

హుమాయూన్ కష్టాలకు ప్రధాన కారణం, బాబర్ తన సామ్రాజ్యాన్ని సంఘటిత పరచటానికి అవకాశం లేకపోవటం. బాబర్ చనిపోయిన వెంటనే, బెంగాల్, బీహార్లలోని అఫ్ఘన్‌లు, మహమ్మద్ లోడి, షేర్‌ఖాన్‌ల నాయకత్వంలో తిరుగుబాటు చేశారు; అప్లే గుజరాత్ పాలకుడైన బహదూర్‌షా తిరగబడ్డాడు. వాయవ్యంలో, హుమాయూన్ సోదరుడైన కమ్రాన్ ద్రోహి అయి, పంజాబ్ నాక్రమించాడు. అతని ఇతర సోదరులు సింహాసనాన్నపేక్షించారు. కాని, హుమాయూన్‌కు పరమశత్రువు హుమాయూనే, అతనికిగల నల్లమందు తినే వ్యసనం, కొంతవరకు అతని పతనానికి కారణంగా చెప్పవచ్చు. అతడు ఏపనిని పూర్తిగా చేయక, అర్ధాంతరంగా వదలివేసేవాడు. ఒక శత్రువును లొంగదీయకనే వదలి, మరొక శత్రువు మీదికి వెళ్లేవాడు.

1.4.2 యుద్ధాలు, షేర్షాతో పోరాటం

1531-32లో హుమాయూన్ అఫ్ఘన్‌ల మిద తన సైన్యాన్ని నడిపాడు. మహమ్మద్ లోడీని ఓడించాడు. చునార్ దుర్గాన్ని ముట్టడించాడు, అక్కడ ఉన్న షేర్‌ఖాన్, హుమాయూన్‌కు లొంగినట్లు నటించాడు. హుమాయూన్ అతనిని పూర్తిగా లొంగదీయక, ఆగ్రాకు మరలివెళ్లాడు. ఇది హుమాయూన్ చేసిన పెద్ద

BRAOU

పారపాటు. దీనివల్ల, తూర్పు దిక్కులో షేర్‌ఖాన్ తన అధికారాన్ని కూడదీసుకోవడానికి వీలయింది. హుమాయూన్, ఢిల్లీ ఆగ్రాలలో వినోద కాలక్షేపాలతో రెండేండ్లు వృధా చేశాడు. ఈ కాలంలో బహదూర్‌షా తన స్థానాన్ని బలపరచుకొన్నాడు.

1535-36లో హుమాయూన్ గుజరాత్‌పై దండయాత్ర చేసి, బహదూర్‌షాను ఓడించాడు. కొంతకాలం బహదూర్‌షా కాందిశీకుడయ్యాడు. గుజరాత్, మాల్వాలు జయింపబడ్డాయి. తర్వాత, బెంగాల్‌లో షేర్‌ఖాన్ తన అధికారాన్ని పెంపొందించుకొంటున్నాడనే వార్త, హుమాయూన్‌కు తెలిసింది. హుమాయూన్ గుజరాత్‌ను వదలి, షేర్‌ఖాన్ మీదికి దండెత్తిపోయాడు. అతడు వెళ్ళిపోవడంతో, బహదూర్‌షా గుజరాత్‌ను తిరిగి త్వరగా లాక్కొన్నాడు. మాల్వాకూడా హుమాయూన్‌కు దక్కకుండా పోయింది. ఇట్లు రెండేండ్ల లోపల, హుమాయూన్ గుజరాత్, మాల్వాలను సంపాదించడం, పోగొట్టుకోవడం జరిగింది.

1537లో హుమాయూన్ షేర్‌ఖాన్‌పై దండెత్తినాడు కాని, చునార్‌ను ఆక్రమించుకోవడంలో చాలాకాలం గడిపాడు. దీనివల్ల, షేర్‌ఖాన్‌కు రాజధానిగా ఉన్న గౌర్‌ను ఆక్రమించుకొని, అచ్చటగల విస్తారమైన ధనరాసులతో తప్పించుకొని పోవడానికి వీలుకలిగింది. హుమాయూన్ గౌర్‌ను ఆక్రమించి, అచ్చట నెలలతరబడి విలాసాలతో కాలాన్ని వృధాచేశాడు. ఈలోపల షేర్‌ఖాన్; హుమాయూన్‌కు నిత్యావసరపదార్థాలేవీ చేరకుండా, ఢిల్లీ బెంగాల్‌ల మధ్య రాకపోకలకు అంతరాయం కల్గించాడు. దానితో, హుమాయూన్ బెంగాల్ విడిచి, వెనుతిరిగిపోవలసి వచ్చింది. 1539లో వెనుదిరిగి పోతున్న సైన్యం మీద, షేర్‌ఖాన్, బక్సర్ సమీపంలో, గంగానదీ తీరాన ఉన్న చౌసావద్ద మెరుపుదాడి జరిపాడు. హుమాయూన్ సైన్యం తీవ్రంగా నష్టపోయింది. హుమాయూన్ ఎట్లో తప్పించుకుని, ఆగ్రా చేరగలిగాడు. చౌసా విజయంతో షేర్‌ఖాన్ బెంగాల్, బీహార్‌లకు అధిపతి అయ్యాడు. అతడు షేర్షా అనే బిరుదు వహించాడు.

ఆ మరుసటి సంవత్సరం అంటే 1540లో, హుమాయూన్ మరలా సైన్యాన్ని షేర్షా మీదికి నడిపాడు. కనోజ్ వద్ద పూర్తిగా ఓడింపబడి, దేశాన్ని వదలి పారిపోయాడు. షేర్షా రాజైనాడు; దానితో మరల, ఆఫ్ఘన్‌లు ఉత్తర భారతదేశ పాలకులయ్యారు.

1.4.3 రాజ్యభ్రష్టత

పరుగెత్తి పోతున్న హుమాయూన్, అతని అనుచరులను, షేర్షా లాహోర్ వరకు వెంబడించాడు. లాహోర్‌లో హుమాయూన్ సోదరులు తమ స్వార్థపూరిత అసూయను ప్రదర్శించి, హుమాయూన్‌కు రక్షణ ఇవ్వడానికి నిరాకరించారు. హుమాయూన్ ఇల్లు, వాకిలి లేని దేశదిమ్మరిగా, సింధ్‌లో, మార్వార్‌లో, తిరిగాడు. ఈ కష్టాల్లో, అతనికి కుమారుడు అక్బర్ అమర్‌కోటలో 1542 నవంబర్, 23న జన్మించాడు. ఇచటనే, తరువాత అక్బర్‌కు సంరక్షకుడుగా ప్రసిద్ధి చెందిన బైరంఖాన్ హుమాయూన్‌ను కలిశాడు.

1544లో హుమాయూన్, పర్షియా (ఇరాన్) చేరుకొన్నాడు. అచట పర్షియా చక్రవర్తి షాతమాస్ప్, హుమాయూన్‌కు ఆశ్రయమిచ్చాడు. హుమాయూన్ షియా ముస్లింగా ప్రకటించుకొనడం, కాందహార్‌ను గెలిచిన తర్వాత దానిని తనకు అప్పగించడం, అనే షరతులమీద షాతమాస్ప్ ఈ ఆశ్రయాన్ని హుమాయూన్ కిచ్చాడు. 1545లో షాతమాస్ప్ సైన్య సహాయంతో, తన తమ్ముళ్ళయిన అస్కరీ, కమ్రాన్‌లతో గట్టి పోరాటం సలిపి, హుమాయూన్ కాందహార్, కాబూల్‌లను వశపరచుకొన్నాడు. కాని యిచ్చిన మాట ప్రకారం, హుమాయూన్ కాందహార్‌ను షాతమాస్ప్‌కు అప్పగించలేదు. ఫలితంగా అప్పటినుంచి కాందహార్ మొగలుల, పర్షియన్ల మధ్య వివాదానికి కారణమైంది.

BRAOU

1.4.4 మొగల్ రాజ్య పునఃస్థాపన

ఈ లోపల, షేర్షా సూర్ చనిపోయాడు. హుమాయూన్ భారతదేశానికి తిరిగి వచ్చి, సర్‌హింద్ పాలకుడుగా ఉన్న సికందర్ సూర్‌ను ఓడించి 1555లో ఢిల్లీ, ఆగ్రాలను ఆక్రమించాడు. తన కుమారుడైన అక్బర్‌ను పంజాబ్‌కు పాలకుడుగా నియమించాడు. బైరంఖాన్‌ను అతనికి సంరక్షకుడుగా, సలహాదారుగా నియమించాడు.

1.4.5 మరణం, 1556

తాను తిరిగి సంపాదించిన రాజ్యాన్ని, హుమాయూన్ ఎక్కువ కాలం అనుభవించలేదు. అటు తరువాత కొద్ది కాలంలో, ఢిల్లీలో తన గ్రంథాలయం మేడమెట్లపై నుండి ప్రమాదవశాత్తు జారిపడి, హుమాయూన్ మరణించాడు. తిరిగి రాజ్యాన్ని సంపాదించిన తర్వాత, ఏడునెలల కన్నా ఎక్కువ కాలం పాలించలేదు.

1.4.6 వ్యక్తిత్వం

హుమాయూన్ గొప్ప పండితుడు, సంస్కారవంతుడు. ధైర్యవంతుడు, సాహసవంతుడు. భారతదేశ రాజ్యాన్ని మరల సంపాదించడమనేది అతని పట్టుదల, ఆశావాదిత్వం వల్లనే సాధ్యమైంది. అతడు తనకుమాలిన ధర్మంగా, సోదరులయెడ అభిమానం చూపించాడు. అతని నిలకడలేని ప్రయత్నాలు, నల్లమందు అలవాటు, సోమరితనం, విలాస వినోదాలు, అతని సామర్థ్యాన్ని చాలావరకు దెబ్బతీశాయి. అతనిలోని ఈ గుణదోషాలవల్ల, హుమాయూన్ రాజుగా విఫలుడయ్యాడు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి.

1. మొదటి పానిపట్, కాణ్వా యుద్ధాల ప్రాముఖ్యత తెల్పండి.

.....

.....

.....

.....

2. భారతదేశంలో బాబర్ సాధించిన ముఖ్య ఘనకార్యమేది?

.....

.....

.....

.....

3. హుమాయూన్ ఓటమికి రెండు ముఖ్య కారణములు తెల్పండి.

.....

.....

.....

.....

1.5 సంగ్రహంగా

1. భారతదేశంపై బాబర్ దండయాత్రకు పూర్వం, భారతదేశం అనేక చిన్న రాజ్యాలుగా విభజింపబడింది. అందులోకొన్నింటిని మహమ్మదీయులు, మరికొన్నింటిని హిందూ రాజులు పరిపాలించినారు.

BRAOU

2. 1526లో మొదటి పానిపట్ యుద్ధంలో విజయం సాధించి బాబర్ మొగల్ సామ్రాజ్యానికి పునాది వేసినాడు.

3. బాబర్ మరణం తర్వాత హుమాయూన్ కాలంలో షేర్షా హుమాయూన్‌ను ఓడించి 1540 నుంచి 1555 వరకు మొగల్ రాజ్యం లేకుండా చేసినాడు.

1.6 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. బాబర్ భారతదేశాన్ని దండెత్తక పూర్వం, భారతదేశంలో రాజకీయ ఐక్యత లేదు. దేశంలో అనేక చిన్న హిందూ, మహమ్మదీయ రాజ్యాలుండేవి. దక్షిణ భారతంలో విజయగనర సామ్రాజ్య ముండింది.

II. 1. 1526లో మొదటి పానిపట్ యుద్ధంలో, ఇబ్రహీం లోడిపై బాబర్ సాధించిన విజయం మొగల్ రాజ్యస్థాపనకు దారితీసింది. రెండవ పానిపట్ యుద్ధంలో బాబర్‌తో ఓడిపోయిన రాణా సంగా ఇబ్రహీంలోడీ కంటే శక్తివంతుడు. అందువల్ల కాన్వా యుద్ధానికి పానిపట్ యుద్ధం కంటే ఎక్కువ ప్రాముఖ్యత వుందని చెప్పవచ్చు.

2. భారతదేశంలో బాబర్ సాధించిన ఘనకార్యం, మొగల్ రాజ్య స్థాపన.

3. పట్టుదల లేకపోవడం, సోదరుల పట్ల అనవసరమైన ఉదారత, హుమాయూన్ ఓటమికి ముఖ్య కారణాలు.

1.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. బాబర్ తొలి జీవితాన్ని, అతని దండయాత్రలను సంక్షిప్తంగా పేర్కొనండి.
2. "మొగల్ సామ్రాజ్య యదార్థ నిర్మాత బాబర్" చర్చించండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. బాబర్ దండయాత్ర సమయంలో భారతదేశంలో గల రాజకీయ పరిస్థితులెట్టివి?
2. మొదటి పానిపట్, కాన్వాయుద్ధాలను పేర్కొని, భారతదేశ చరిత్రలో వాటి కున్న ప్రాముఖ్యతను నిరూపించండి.
3. హుమాయూన్ "జీవితంలో దొర్లాడి, జీవితం నుండి దొర్లిపోయాడు" అనే వాక్యాన్ని, అతని జీవిత విషయంలో సమర్థించండి.

1.8 ఉపయుక్త గ్రంథాలు

1. Majumdar R.C (Ed) : *The Mughal Empire, Bharatiya Vidya Bhavan Series. Vol. VII*
2. Srivatsava A.C : *Mughal Empire*
3. Sharma S.R : *The Mughal Empire in India*
4. Sharma L.P : *The Mughal Empire*
5. Tripathi R.P : *Rise and fall of the Mughal Empire*
6. ఝాన్సీ లక్ష్మి, పాటిబండ వైదేహి, అల్లాడి : *భారతదేశ చరిత్ర - సంస్కృతి* ద్వితీయ భాగం - తెలుగు అకాడమి ప్రచురణ

BRAOU

భాగం - 2 : షేర్షా - అతని పరిపాలనా వ్యవస్థ

విషయక్రమం

2.0 లక్ష్యాలు

2.1 పరిచయం

2.2 షేర్షా జీవిత విశేషాలు

2.3 హుమాయూన్‌తో పోటీ

2.4 బెంగాల్‌లో తిరుగుబాటు అణిచివేత

2.5 దండయాత్రలు

2.6 షేర్షా పరిపాలన

2.6.1 కేంద్ర ప్రభుత్వం

2.6.1.1 సుల్తాన్

2.6.1.2 వజీర్

2.6.1.3 అర్జ్-ఇ-ముమాలిక్

2.6.1.4 దీవాన్ - ఇ- రసాలత్

2.6.1.5 దబీర్ -ఇ-కాస్

2.6.2 సైన్యం

2.6.3 ఆదాయం, వ్యయం

2.6.4 రెవిన్యూ పరిపాలన

2.6.5 వ్యాపారం

2.6.6 న్యాయ పరిపాలన

2.6.7 పోలీసు వ్యవస్థ

2.6.8 గూఢచారి విభాగం

2.6.9 రాష్ట్ర పరిపాలన

2.6.10 సర్కార్

2.6.11 పరగణ

2.6.12 గ్రామం

2.6.13 అధికారుల బదిలీ

2.6.14 రహదారులు, విశ్రాంతి భవనాలు

2.6.15 నాణేలు

2.6.16 మొగల్ పరిపాలనకు ఆధారం

2.7 భవనాలు

2.8 మత విధానం

2.9 షేర్షా ఘనత అంచనా

2.10 షేర్షా వారసులు

2.11 సంగ్రహంగా

2.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

2.13 ప్రశ్నలు నమూనా పరీక్ష

2.14 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

2.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. షేర్షా జీవిత విశేషాలు
2. షేర్షా హుమాయూన్‌ను ఓడించి, భారతదేశంలో రెండవ ఆఫ్ఘన్ రాజ్యం స్థాపించిన విధానం
3. షేర్షా పరిపాలనా విధానం
4. భారతదేశంలో రెండవ ఆఫ్ఘన్ రాజ్య పతనం

2.1 పరిచయం

భారతదేశ చరిత్రలో రెండవ ఆఫ్ఘన్ రాజ్య స్థాపన లేదా సూర్ వంశ పరిపాలనకు ప్రాముఖ్యత వుంది. షేర్షా 1540 లో హుమాయూన్ పై సాధించిన విజయం, మొగల్ సామ్రాజ్య తాత్కాలిక అదృశ్యానికి కారణమైంది. షేర్షా గొప్ప సైనిక నాయకుడు, రాజ్య నిర్మాతే గాక, గొప్ప పరిపాలకుడు కూడా. అతను పరిపాలించిన ఐదు సంవత్సరాల స్వల్ప వ్యవధిలోనే, షేర్షా సమర్థవంతమైన పరిపాలనా వ్యవస్థను రూపొందించాడు. అతను రూపొందించిన పరిపాలనా వ్యవస్థ మొగల్ రాజ్య పరిపాలనకు పునాదిగా నిలిచింది. షేర్షా ఇంకా కొన్ని సంవత్సరాలు జీవించి వుండినచో బహుశ భారతదేశంలో మొగల్ సామ్రాజ్య పునఃస్థాపన జరిగి వుండేది కాదేమో!

2.2 షేర్షా జీవిత విశేషాలు

షేర్షా 1472లో జన్మించాడు. అతనిని మొదట ఫరీద్ అని పిలిచే వారు. షేర్షా తాత ఇబ్రహీం సూర్, గుఱ్ఱాల వ్యాపారి. అందులో లాభం రాకపోవడంవల్ల అతను సైన్యంలో చేరాడు. షేర్షా తండ్రి హసన్ ఖాన్. అతను ఆఫ్ఘనిస్థాన్ నుంచి భారతదేశానికి వచ్చి, పంజాబ్‌లోని హస్తినాపురం దగ్గర వున్న బజ్‌వారాలో స్థిరపడ్డాడు. ఫరీద్ అక్కడే జన్మించాడు. ఫరీద్, హసన్ ఖాన్ మొదటి భార్య కుమారుడు. హసన్ ఖాన్‌కు, తన నాల్గవ భార్యపై వున్న వ్యామోహంవల్ల అతను మొదటి భార్యను, ఆమెకు జన్మించిన ఫరీద్‌ను చిన్న చూపు చూచాడు. అందువల్ల తన 22వ ఏట ఫరీద్, తండ్రితో పోట్లాడి జాన్‌పూర్‌కు వెళ్ళాడు. అక్కడ అతను, తన తండ్రికి అప్తుడైన జమాల్ ఖాన్ వద్ద వున్నాడు. అక్కడ ఫరీద్, అరబ్బీ, పర్షియన్ భాషలు నేర్చుకుని, ప్రాచీన కాలం నాటి గొప్ప పరిపాలకుల జీవిత చరిత్రలు కూడా చదివాడు. కొంత కాలం తర్వాత జమాల్‌ఖాన్, హసన్‌ఖాన్, అతని కుమారుడు ఫరీద్‌ల మధ్య సత్సంబంధాలు నెలకొల్పగలిగాడు. అందువల్ల బీహార్‌లోని సాహాబాద్ జిల్లాలోని తమ స్వాధీనంలో వున్న సాస్రామ్, ఖవాస్‌పూర్ జాగీర్‌లకు హసన్‌ఖాన్, ఫరీద్‌ను పరిపాలకునిగా నియమించాడు. అక్కడ, ఫరీద్ తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. ఫరీద్ ఆధ్వర్యంలో, 1497 నుంచి 1518 వరకు, ఆ జాగీర్‌లో సంపద పెరిగింది. అయితే తిరిగి, తన తండ్రి అనుగ్రహాన్ని కొల్పోయిన ఫరీద్‌కు మళ్ళీ గడ్డు రోజులు ఎదురైనాయి. జాగీర్ల పరిపాలన బాధ్యత నుంచి తొలగించబడడంవల్ల అతను దౌలత్‌ఖాన్ లోడీ సహాయంతో ఆగ్రాలో ఇబ్రహీం లోడి సైన్యంలో చేరాడు. 1520 లో హసన్ ఖాన్ చనిపోయిన తర్వాత ఇబ్రహీం లోడి, ఫరీద్‌కు అతని తండ్రి జాగీరును అప్పగించినాడు.

ఫరీద్ సోదరుడు (Step brother) సులేమాన్, ఆ జాగీరును చౌంద్ జాగీర్‌దార్ తన ప్రభువు అయిన మహమ్మద్ ఖాన్ సహాయంతో తన స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించాడు. సులేమాన్ ఎత్తుగడను ఎదుర్కోవడానికి ఫరీద్, ఇబ్రహీం లోడి ప్రతినిధిగా దక్షిణ బీహార్‌ను పరిపాలిస్తున్న బహార్‌ఖాన్ లోహాని ప్రభుత్వంలో, ఉద్యోగిగా చేరినాడు. 1526లో ఇబ్రహీం లోడి, మొదటి పానిపట్ యుద్ధంలో బాబర్ చేతుల్లో పరాజయం చెందిన తర్వాత, బహార్‌ఖాన్ లోహాని సుల్తాన్ మహమ్మద్ బిరుదుతో, దక్షిణ బీహారుకు తానే స్వతంత్ర రాజని ప్రకటించుకున్నాడు. బహార్‌ఖాన్ లోహాని వద్ద వున్నప్పుడే ఫరీద్‌కు షేర్‌ఖాన్ అనే బిరుదు వచ్చింది. ఒకసారి సుల్తాన్‌తో అధవికి వెళ్ళినప్పుడు, అక్కడ ఒంటరిగా ఫరీద్ పులిని చంపాడు. అతని సాహసానికి మెచ్చుకుని

ఫరీద్‌కు, షేర్ ఖాన్ అనే బిరుదు ఇచ్చారు. 1527-28 మధ్య కాలంలో బహార్ ఖాన్ విశ్వాసాన్ని కోల్పోవడంవల్ల షేర్ ఖాన్, మొగల్ చక్రవర్తి బాబర్ దగ్గర కూడా ఉద్యోగం చేశాడు. అయితే 1528లో షేర్‌ఖాన్, బహార్‌ఖాన్ లోహాని వద్దకు తిరిగి వచ్చినాడు. 1528లో సుల్తాన్ మహమ్మద్ చనిపోయిన తర్వాత అతని వారసుడైన జలాల్‌ఖాన్‌కు షేర్‌ఖాన్ సహాయకుడుగా అప్పటినుంచి పేరుకు జలాల్‌ఖాన్ రాజ్యం చేసినా, అధికారాలన్నీ షేర్‌ఖాన్ నిర్వహించాడు. 1529లో బెంగాల్ రాజు నుస్రత్‌ఖాన్, షేర్‌ఖాన్ రాజ్యంపై దండెత్తినప్పుడు షేర్‌ఖాన్ అతనిని ఓడించినాడు. షేర్‌ఖాన్ పలుకుబడి, అధికారం ఎక్కువ కావడంవల్ల అతనిని తొలగించడానికి దక్షిణ బీహార్‌లోని అమీర్‌లు ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నం ఫలించకపోవడంవల్ల, తమను కఠినంగా శిక్షిస్తాడనే భయంతో వారందరూ, జలాల్‌ఖాన్‌తో సహా బెంగాల్ కు పారిపోయినారు. ఆ తర్వాత అంటే 1530లో దక్షిణ బీహారుకు స్వతంత్ర రాజైనాడు.

2.3 హుమాయూన్‌తో పోటీ

భారతదేశం నుంచి మొగల్ రాజును పారద్రోలడానికి షేర్‌ఖాన్ దేశంలోని అఫ్ఘన్‌ల నందరిని సమీకరించాడు. 1532లో హుమాయూన్, మహమ్మద్‌లోడిని, దౌరాయా యుద్ధంలో ఓడించిన తర్వాత, భారతదేశంలోని అఫ్ఘన్‌ల అందరికీ షేర్‌ఖాన్ నాయకుడైనాడు. అఫ్ఘన్ నాయకునిగా, మొగల్ చక్రవర్తి హుమాయూన్‌ను ఓడించి, భారతదేశంలో తిరిగి అఫ్ఘన్ సామ్రాజ్యాన్ని నెలకొల్పడానికి కృషి చేశాడు.

షేర్‌ఖాన్, హుమాయూన్‌ల మధ్య మొదటి యుద్ధం 1532లో చునాగర్‌లో జరిగింది. 4 నెలల యుద్ధం తర్వాత, చునాగర్‌ను స్వాధీనం చేసుకోలేనందున హుమాయూన్ షేర్‌ఖాన్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం షేర్‌ఖాన్ మొగల్ చక్రవర్తి అధిపత్యాన్ని గుర్తించడంవల్ల షేర్‌ఖాన్ అధీనంలోనే చునాగర్ కొనసాగింది. దక్షిణ బీహార్‌కు, షేర్‌ఖాన్ సుల్తాన్‌గా కొనసాగినాడు.

1534లో బెంగాల్ రాజు మహమ్మద్ షా, దక్షిణ బీహార్‌పై దండెత్తినాడు. ఓడిపోయిన మహమ్మద్ షా హుమాయూన్ సహాయాన్ని అర్థించడంవల్ల షేర్‌ఖాన్, హుమాయూన్‌ల మధ్య మళ్ళీ యుద్ధం జరిగింది. 1539లో చౌసా యుద్ధంలో షేర్‌ఖాన్, హుమాయూన్‌ను ఓడించాడు. ఆ తర్వాత షేర్‌ఖాన్, షేర్షా సుల్తాన్-ఇ-అదిల్ అనే బిరుదుతో పరిపాలించాడు. 1540లో షేర్షా బెంగాల్‌ను కూడా తన స్వాధీనం చేసుకున్నాడు. అదే సంవత్సరంలో, కనోజ్ దగ్గర బిల్‌గ్రామ్ వద్ద జరిగిన యుద్ధంలో షేర్షా హుమాయూన్ పై ఇంకొక విజయాన్ని సాధించి, మొగల్ రాజ్యంలో వున్న ఆగ్రా ఢిల్లీ, గ్వాలియర్, లాహోర్ పట్టణాలను తన స్వాధీనం చేసుకున్నాడు. ఆ విధంగా 1540 నాటికి షేర్షా మొగల్‌రాజ్యం స్థానంలో రెండవ అఫ్ఘన్ రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు.

2.4 బెంగాల్‌లో తిరుగుబాటు అణిచివేత

1541లో బెంగాల్‌లో గవర్నర్ ఖిజర్‌ఖాన్ తిరుగుబాటు చేశాడు. షేర్షా స్వయంగా బెంగాల్ వెళ్ళి, తిరుగుబాటు అణిచి వేసి, ఖిజర్ ఖాన్‌ను నిర్బంధించాడు. మళ్ళీ అక్కడ తిరుగుబాటు రాకుండా కూడా, షేర్షా తగిన చర్యలు తీసుకున్నాడు.

2.5 దండయాత్రలు

1542లో, ఉత్తర, దక్షిణాలకు మధ్య కీలక ప్రాంతంలో వున్న మాల్వాను, షేర్షా ఆక్రమించాడు. మాల్వా అధిపతి ఖాదిర్‌షా, షేర్షాకు లొంగి తర్వాత గుజరాత్‌కు పారిపోయాడు. 1543లో షేర్షా మండూ రాజ్యంపై దండెత్తి, ఆ రాజ్యాన్ని పరిపాలిస్తున్న పూరన్‌మల్‌ను ఓడించి, రైసిన్ దుర్గాన్ని వశపరచుకున్నాడు. 1543లోనే, షేర్షా సైన్యాధిపతి, హైబత్‌ఖాన్ నియాజీ ముల్తాన్, సింధులను జయించాడు. షేర్షా సాధించిన ఘన విజయాల్లో ఇంకొకటి, రాజపుత్రరాజు మాల్దేవపై విజయం. ఆనాటి రాజపుత్ర రాజులల్లో అత్యంత శక్తివంతుడు మాల్దేవుడు.

అతనిని ఓడించి, షేర్షా నగోర్, అజ్మీర్, జలోర్, బికనీర్, జోధ్‌పూర్‌లను తన స్వాధీనం చేసుకున్నాడు. షేర్షా మీవార్ రాజ్యంపై కూడా దండెత్తినాడు. ఆ రాజ్యాన్ని పరిపాలిస్తున్న ఉదయసింగ్ చాలా బలహీనుడు. అతను పోరాటం లేకుండానే షేర్షా సార్వభౌమత్వాన్ని అంగీకరించాడు. షేర్షా రాజస్థాన్‌లో అనేక రాజ్యాలను జయించినప్పటికి మార్వార్, రైసిన్ ప్రాంతాలను తప్ప ఇతర ప్రాంతాలను, తన రాజ్యంలో విలీనం చేయలేదు. షేర్షా సార్వభౌమత్వాన్ని అంగీకరించిన రాజపుత్ర రాజులందరినీ, వారివారి రాజ్యాలను పరిపాలించుకోవడానికి షేర్షా అనుమతించాడు. అయితే వీరి దుర్గాలను మాత్రం, షేర్షా తన ఆధీనంలో వుంచుకున్నాడు.

షేర్షా బుందేల్ ఖండ్‌లోని, భారతదేశంలో దుర్భేద్యమైన దుర్గాలలో ఒకటిగా పేరుపొందిన కలంజార్ కోటను కూడా తన స్వాధీనం చేసుకున్నాడు. కలంజార్ కోటను వశపరచుకోవడానికి షేర్షా చాలా కష్టపడ్డాడు. అందుకు మందుగుండు శక్తిని ఉపయోగించవలసి వచ్చింది. తుపాకీ మందును ఉపయోగించడంవల్ల సంభవించిన ప్రేలుడులో షేర్షా తీవ్రంగా గాయపడ్డాడు. అయినా, అతను తన సైనికులు, కలంజార్ కోటను ఆక్రమించడానికి ప్రోత్సాహాన్ని కల్పించాడు. చివరికి, కోట తన స్వాధీనమైందన్న వార్త విన్న తర్వాత 1545, మే 22వ తేదీ షేర్షా ప్రేలుడువల్ల కలిగిన తీవ్రమైన గాయాలవల్ల చనిపోయాడు. చనిపోయేనాటికి, ఇంచుమించు ఉత్తరభారతమంతా షేర్షా అధీనంలో వుండింది. కాశ్మీర్, అస్సాం, గుజరాత్‌లు మాత్రమే అతని సామ్రాజ్యం వెలుపల వున్నాయి.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. ఫరీద్ తన పరిపాలనా సామర్థ్యాన్ని ఎక్కడ చూపించాడు?

.....

.....

.....

.....

2. మొగల్ రాజ్యం స్థానంలో, రెండవ ఆఫ్ఘన్ రాజ్యాన్ని షేర్షా ఎప్పుడు ఎలా నెలకొల్పినాడు?

.....

.....

.....

.....

2.6 షేర్షా పరిపాలన

'ఆఫ్ఘన్ రాజులలో షేర్షా అందరికంటే గొప్ప పరిపాలకుడు, సైనిక ప్రతిభ కలవాడు' అన్న అభిప్రాయాన్ని కనుంగో వ్యక్తం చేశాడు. షేర్షా చూపినంత తెలివితేటలను, బ్రిటీష్ ప్రభుత్వంవారు కూడా కనబరచలేదని కీన్ చరిత్రకారుడు వ్రాశాడు. న్యాయసమ్మతంగా, ప్రజోపయోగ విధానాలను పాటించిన పరిపాలనా దక్షత కలిగిన వ్యక్తి షేర్షా. అతను సామ్రాజ్య పరిపాలన విషయంలో, స్వయంగా శ్రద్ధతో వ్యవహరించి సామ్రాజ్యంలో పటిష్టమైన పరిపాలనా వ్యవస్థను నెలకొల్పినాడు.

2.6.1 కేంద్ర ప్రభుత్వం

2.6.1.1 సుల్తాన్

మధ్య యుగంలోని అందరు సుల్తానులవలె షేర్షాకూడా, ప్రభుత్వ అధికారాలన్నీ తన చేతుల్లోనే వుంచుకున్నాడు. వివిధ ప్రభుత్వ శాఖలను నిర్వహించడానికి, సుల్తాన్ మంత్రులను నియమించేవాడు. అయితే

Dr. BRAOU LIBRARY
Acc. No. 114980
Class No. 954 CHA

ఆ మంత్రులకు విధాన నిర్ణయాలు చేసే అధికారం లేదు. వారు కేవలం విధానాలను అమలుపరిచే అధికారులు మాత్రమే.

క్రింద వివరించిన వారు అనాటి ముఖ్యమైన మంత్రులు

2.6.1.2 వజీర్

వజీర్ ఆర్థిక శాఖకు అధిపతి. ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు సంబంధించిన విషయాలు అతని పర్యవేక్షణలో వుండేవి.

2.6.1.3 అర్జ్-ఇ-ముమాలిక్

ఇతను దివాన్-ఇ-అర్జ్ శాఖకు అధిపతి. సైనిక శాఖ అతని ఆదుపులో వుండేది. సైనికుల నియామకం, వారికి జీతాలు చెల్లించడం, సైనిక వ్యవస్థకు సంబంధించిన తదితర విషయాలు అతని అధీనంలో వుండేవి.

2.6.1.4. దివాన్ -ఇ-రసాలత్

విదేశీ వ్యవహారాల మంత్రిని దివాన్-ఇ-రసాలత్ అని పిలిచేవారు.

2.6.1.5 దాబీర్-ఇ-ఖాస్

ఇతను దివాన్-ఇ-ఖాస్ శాఖకు అధిపతి. రాజ్యంలోని, ప్రభుత్వ ఉత్తరువులకు సంబంధించిన విషయాలు ఇతను చూసేవాడు. సుల్తాన్ ప్రకటనలు, ఉత్తరువులను సంబంధిత వ్యక్తులకు, దాబీర్-ఇ-ఖాస్ పంపేవాడు. పైన పేర్కొనిన మంత్రులే కాకుండా, షేర్షాకాలంలో, ముఖ్య ఖాజి, బరీద్-ఇ-ముమాలిక్ కూడా ముఖ్యమైన అధికారులు. ముఖ్యఖాజి రాజ్యంలోని ప్రధానమైన న్యాయ నిర్ణయాధికారి. సుల్తాన్ తర్వాత న్యాయ రంగంలో అతనికే ఎక్కువ అధికారాలుండేవి. బరీద్-ఇ-ముమాలిక్ గుఢాచారి విభాగానికి అధిపతి.

2.6.2 సైన్యం

అల్లావుద్దీన్ ఖిల్జీ మాదిరి షేర్షా సిద్ధ సైన్యాన్ని (Standing army) వెలకొల్పివాడు. అతని సైన్యంలో అశ్వదళం, కాల్బలం, గజదళం, పిరంగిదళం (artillery) ముఖ్యమైన భాగాలు. సైనికుల పేర్లపట్టికను వుంచే పద్ధతిని షేర్షా అనుసరించాడు. గుర్రాలను గుర్తించడానికి వాటిపై ముద్రను వేసే పద్ధతి కూడా ఈ రోజుల్లో వుండింది. సైనికులకు జీతాలు ఇచ్చే పద్ధతి వుండింది. కానీ సైన్యంలోని అధికారులకు భూములు ఇచ్చేవారు. రాజు నెలకొల్పిన సైన్యం కాకుండా, రాష్ట్రగవర్నర్లు, షేర్షాకు లోబడి పరిపాలిస్తున్న రాజులు, భూస్వాములు (nobles) కూడా తమకు ప్రత్యేకమైన సైన్యాలను సమకూర్చుకునేవారు.

2.6.3 ఆదాయం, వ్యయం

షేర్షాకాలంలో, ప్రభుత్వానికి ఆదాయం ముఖ్యంగా భూమి శిస్తు, వ్యాపారం మీద పన్ను, ఖమ్స్ (యుద్ధంలో సాధించిన సంపదలో 5వ భాగం) ద్వారా లభించేది. సైన్యం మీద ఖర్చు, యుద్ధాలు, అధికారుల జీతాలు, సుల్తాన్‌కు, అతని అంతఃపురంలో వారి పోషణ, అనాటి ముఖ్యమైన ఖర్చులు.

2.6.4. రెవిన్యూ పరిపాలన

షేర్షాకాలంలో భూమిశిస్తువల్లనే ప్రభుత్వానికి ఎక్కువగా ఆదాయం లభించేది. షేర్షా భూమి శిస్తు విధానం, రెండు సిద్ధాంతాలపై ఆధారపడింది. అవి 1) రైతుల క్షేమం 2) ప్రభుత్వానికి అంతరాయం లేకుండా ఆదాయం సమకూర్చడం. మధ్య యుగంలో వున్న మంచి భూమి శిస్తు విధానాలల్లో షేర్షా అనుసరించిన విధానం ఒకటి. అతని భూమి శిస్తు విధానంలో ఈ క్రిందివి ముఖ్యమైన అంశాలు.

BRAOU

1) భూమి నుంచి ఉత్పత్తి అయిన ధాన్యం ఆధారంగా భూమిని మూడు విధాలుగా విభజించారు.

2) భూమిని అన్ని ప్రాంతాలల్లో ఒకే రకమైన కొలతతో కొలిచేవారు.

3) ఉత్పత్తిలో మూడవ వంతు శిస్తుగా వసూలు చేసేవారు.

4) ధన రూపేణ శిస్తు వసూలు చేసేవారు. కానీ కొన్ని సందర్భాలల్లో వస్తు రూపంలో కూడా శిస్తు చెల్లించడం అనుమతించేవారు.

5) భూమి సర్వేకు, శిస్తు వసూలు అధికారులకు రుసుము రైతుల నుంచి వసూలు చేసేవారు. అందుకుగాను, ఉత్పత్తిలో 2 1/2 శాతం వసూలు చేసేవారు.

శిస్తు నిర్ణయించేటప్పుడు రైతులపట్ల సానుభూతితో వ్యవహరించ వచ్చునని, శిస్తు నిర్ణయం జరిగిన తర్వాత శిస్తు వసూలు విషయంలో సానుభూతి అనవసరమన్నది షేర్షా అభిప్రాయం. అతని అభిప్రాయానికి అనుగుణంగా శిస్తు విధానం రూపొందించడం జరిగింది. తన రాజ్య సంపద రైతుల మీదే ఆధారపడిందన్న సత్యాన్ని షేర్షా గుర్తించాడు. అందువల్ల రైతుల సంక్షేమానికి షేర్షా అనేక చర్యలు తీసుకున్నాడు. యుద్ధాలల్లో పంటలు నాశనం కాకుండా వుండడానికి షేర్షా చర్యలు తీసుకునేవాడు. రైతులను వేధించే అధికారులను శిక్షించడం కూడా జరిగింది.

2.6.5 వ్యాపారం

వ్యాపార అభివృద్ధి కొరకు షేర్షా అనేక పరిపాలనా పద్ధతులను అవలంబించాడు. వస్తువులపై పన్నును, రెండు ప్రదేశాలల్లో మాత్రమే వసూలు చేయడానికి నిర్ణయించాడు. రాజ్యంలోకి ప్రవేశించిన చోట, అమ్మకము జరిగే మార్కెట్‌లో మాత్రమే వస్తువులపై పన్ను వసూలు చేసేవారు. వ్యాపారాభివృద్ధికి కొత్త రహదారులను కూడా నిర్మించడం జరిగింది. వ్యాపారస్థులకు వారి ప్రయాణాలల్లో తగు రక్షణ కూడా కల్పించారు. ఎవరైనా వ్యాపారస్థుడు మార్గమధ్యమంలో చనిపోతే అతని ఆస్తి, అతని కుటుంబీకులకు చెందేవరకూ దానిని రక్షకభటులు సంరక్షించేవారు. ఈ చర్యలన్నీ వ్యాపార అభివృద్ధికి తోడ్పడ్డాయి.

2.6.6 న్యాయ పరిపాలన

సుల్తాన్ అత్యున్నత న్యాయాధికారి. అతని తర్వాత ముఖ్యఖాజీ, ప్రముఖ న్యాయాధికారి. ముఖ్యఖాజీ తర్వాత ఖాజీలున్నారు. పరగణాలో మున్సిఫ్, సర్కారులో మున్సిఫ్ మున్సపాన్, షిక్‌దారీ షిక్‌దారీన్‌లకు కూడా న్యాయాధికారాలుండేవి. నిష్పక్షపాతంగా న్యాయ నిర్ణయం చేయడంలో షేర్షా గొప్ప కీర్తి గడించాడు. నేరస్తులైనా, ధనవంతులైనా, తనకు బంధువులైనా, వారిని కఠినంగా శిక్షించేవాడు. ఆ రోజుల్లో శిక్షలు చాలా కఠినంగా ఉండేవి. ఉరిశిక్ష, అంగవిచ్ఛేదన, కారాగారావాసం, కొరడా దెబ్బలు మొదలైనవి ఆనాటి ముఖ్యమయిన శిక్షలు.

2.6.7 పోలీసు వ్యవస్థ

నేరస్థులను పట్టుకునే బాధ్యత స్థానిక అధికారులకు అప్పగించబడింది. గ్రామంలో నేరస్తులు పట్టుబడకపోతే గ్రామ అధికారిని శిక్షించే పద్ధతి వుండేది. దొంగలించబడిన ధనాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే కూడా గ్రామాధికారులను శిక్షించేవారు. షేర్షా రాజ్యంలో పోలీసు వ్యవస్థ ఎంతో సమర్థవంతంగా వుండడంవల్ల, ప్రయాణికులు భయంలేకుండా, ప్రయాణంలో నగలను తీసుకొని వెళ్ళేవారని సమకాలీన చరిత్రకారుడు అబ్బాస్ ఖాన్ వ్రాశాడు. శక్తిలేని ముసలి స్త్రీ కూడా తన నెత్తిన బుట్టనిండా బంగారు ఆభరణాలతో, ఎటువంటి దొంగల భయంలేకుండా ప్రయాణం చేయగల పరిస్థితి, షేర్షా నేరస్థులకు కఠినమైన శిక్ష వేస్తాడనే భయంవల్ల ఏర్పడిందని అబ్బాస్ ఖాన్ వ్రాశాడు.

BRAOU

2.6.8 గూఢచారి వ్యవస్థ

షేర్షా సమర్థవంతమైన గూఢచారి వ్యవస్థను నెలకొల్పినాడు. తనకు రాజ్యంలోని అన్ని ప్రాంతాల్లో జరిగే విషయాలను తెలియ చేయడానికి, రాజ్యంలోని అన్ని ముఖ్య ప్రదేశాల్లో గూఢచారులను నియమించాడు. సమర్థవంతమైన గూఢచారి వ్యవస్థ షేర్షా రాజకీయ పరిపాలనా విజయానికి దోహదపడింది.

2.6.9 రాష్ట్ర పరిపాలన

షేర్షాకాలంలో సుబాలు లేదా రాష్ట్రాలు వున్నాయా లేవా అన్న విషయాన్ని గురించి, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. షేర్షా రాజ్యంలో సుబాలు లేవు. అనాటి అత్యంత విశాలమైన పరిపాలనా విభాగం సర్కార్, అనే అభిప్రాయాన్ని డా॥ కనుంగో వ్యక్తంచేశాడు. కానీ, డా॥ పరమాత్మాశరన్, డా॥ ఏ.ఎల్. శ్రీవాత్సవ, డా॥ పాండే, షేర్షాకాలంలో సుబాలున్నాయని, వీటికి సైనిక గవర్నర్లు అధిపతులుగా వుండేవారని వ్రాశారు. లాహోర్, మాల్వా, అజ్మీర్‌లకు గవర్నరులు వుండేవారు. అన్ని రాష్ట్రాల పైన, షేర్షా తన పూర్తి ఆధిపత్యాన్ని నెలకొల్పుకున్నాడు. అతని కాలంలో 1541లో ఒక్క బెంగాల్‌లో తప్ప ఏ రాష్ట్రంలో కూడా తిరుగుబాటు జరుగలేదు. బెంగాల్‌లో జరిగిన తిరుగుబాటును కూడా, షేర్షా వెంటనే అణచివేయ గలిగినాడు.

2.6.10 సర్కార్

ప్రతి రాష్ట్రాన్ని కొన్ని సర్కారులుగ విభజించినారు. సర్కారును ఆధునిక కాలంలో వున్న జిల్లాతో పోల్చవచ్చు. ప్రతి సర్కారులో షిక్దార్-ఇ-దారావ్, మున్సిఫ్-ఇ-మున్సిఫన్ అనే ఇద్దరు ముఖ్యమైన అధికారులు వుండేవారు. శాంతి భద్రతల పరిరక్షణ, షిక్దార్-ఇ-షిక్దారాన్ యొక్క ముఖ్య బాధ్యత. ఇతర అధికారులపై అజమాయిషీ చేసే అధికారం కూడా అతనికి వుంది. శిస్తు వసూలు విషయంలో కూడా అతను సుల్తాన్‌కు తోడ్పడేవాడు. మున్సిఫ్-ఇ-మున్సిఫన్ ముఖ్యంగా న్యాయ నిర్ణయాధికారి.

2.6.11 పరగణ

ప్రతి సర్కారును, కొన్ని పరగణాలుగ విభజించివారు. ప్రతి పరగణలో ఒక షిక్దార్, ఒక అమీన్, ఒక మున్సిఫ్, ఒక కోశాధికారి (ఫోతేదార్) ఇద్దరు కార్కునులు వుండేవారు. షిక్దార్, శాంతి భద్రతల పరిరక్షణాధికారి. మున్సిఫ్ ముఖ్యంగా సివిల్ కేసులను పరిష్కరించే న్యాయాధికారి. ఇద్దరు కార్కునులలో ఒకడు హిందీలోను ఇంకొకడు పర్షియన్‌లోను, ప్రభుత్వ పత్రాలను వ్రాసేవారు.

2.6.12 గ్రామం

గ్రామం, స్థానిక వంశపారంపర్య అధికారుల పరిపాలనలో వుండేది. అందులో ముఖ్యమైన వారు చౌకీదార్,పట్వారీ శిస్తు వసూలు విషయంలో, శాంతి భద్రతల పరిరక్షణలో గ్రామాధికారులు, ఉన్నత అధికారులకు సహాయపడేవారు.

2.6.13 అధికారుల బదిలీ

రెండు సంవత్సరాల కొకసారి అధికారులను బదిలీ చేసే పద్ధతి షేర్షా పాటించినాడు. అయితే ఆ పద్ధతి అధికారులకు సహాయపడడానికే కాని, అవినీతిని తగ్గించడానికి కాదు.

2.6.14 రహదారులు, విశ్రాంతి భవనాలు

షేర్షా కొత్త రహదారులను, విశ్రాంతి భవనాలను నిర్మించాడు. అతని కాలంలో కొత్తగా నాలుగు రోడ్లు తయారైనాయి. అవి.

BPAOU

1) బెంగాల్ పంజాబుల మధ్య రోడ్, ధక్కా నుంచి లాహోర్‌కు,ఢిల్లీ ఆగ్రాల ద్వారా.

2) ఆగ్రా, జోధ్‌పూర్‌ల మధ్య రహదారి.

3) లాహోర్, ముల్తాన్‌ల మధ్య రహదారి.

4) ఆగ్రా, బుర్హాన్‌పూర్‌ల మధ్య రహదారి.

రోడ్లు రాజ్యానికి రక్తనాళాల వంటివి. దాదాపు 1700 విశ్రాంతి భవనాలను షేర్షా నిర్మించాడు. రోడ్ల కిరువైపుల నీడను, పండ్లను ఇచ్చే చెట్లను కూడా పెంచడం జరిగింది.

2.6.15 నాణేలు

నాణేల్లో షేర్షా కొన్ని మార్పులు చేశాడు. అతని కొన్నీ వ్యవస్థ మొగల్ రాజుల కాలంలోనే కాకుండా, ఈస్టిండియా కంపెనీవారి కాలంలో కూడా కొనసాగింది. షేర్షా కాలంలో రూపాయి 180 గ్రైనులు వుండేది. అందులో 175 గ్రైనులు వుర్తివెండి. షేర్షాకాలం నాటి రూపాయి, భారతదేశపు ఆధునిక రూపాయికి ఆధారం.

2.6.16 మొగల్ పరిపాలనకు ఆధారం

కొత్త వ్యవస్థను, పద్ధతులను రూపొందించినప్పటికీ పరమాత్మాశరన్ చెప్పినట్లు షేర్షా మొగల్ చక్రవర్తులకు, పరిపాలనా విషయంలో మార్గదర్శకుడు. రెవిన్యూ పరిపాలన, సైనిక పరిపాలన, స్థానిక పరిపాలనా రంగాల్లో, మొగల్ చక్రవర్తి అక్బర్ కొన్ని అవసరమైన మార్పులతో షేర్షా విధానాలను కొనసాగించాడు. అందువల్ల, "షేర్షా వేసిన బాటలోనే ప్రజా సంక్షేమ విధానాలను పాటించాడు, షేర్షా అక్బర్‌కు మార్గదర్శకుడు" అన్న డా॥ ఆర్.పి.త్రిపాఠి వ్యాఖ్యానం సమంజసమైంది.

2.7 భవనాలు

షేర్షా తను పరిపాలించిన తక్కువ కాలంలో కొన్ని భవనాలుకూడా నిర్మించాడు. ఢిల్లీలోని పురానా ఖిల్లాను అతను నిర్మించాడు. అతను నిర్మించిన అన్ని భవనాలలోకి అందమైంది, బీహారులోని ససారలో నిర్మించిన మసీదు భారతదేశంలోని ఎంతో చక్కగా కల్పనచేసి అత్యంత సుందరంగా రూపొందించిన భవనం అని ససారలోని షేర్షా మసీదును విన్‌సెంట్ స్మిత్ పొగిడినాడు.

2.8 మత విధానం

షేర్షా సున్నీ శాఖకు చెందిన మహమ్మదీయుడు. అతను తన మత సిద్ధాంతాలను పాటించినాడు. ఢిల్లీనుండి అంతకుముందు పరిపాలించి అఫ్ఘన్, తురుష్క రాజుల మత విధానాన్ని షేర్షా కొనసాగించాడు. వారివలెనే తన ప్రభుత్వంలో హిందువులను మహమ్మదీయులను ఉద్యోగులుగా నియమించాడు. హిందువుల పట్ల ద్వేషాన్ని కానీ, అనహనాన్ని కానీ చూపలేదు. ససారలో అతను నిర్మించిన మసీదులో, హిందూ-మహమ్మదీయ సమ్మిళిత శిల్ప కళను చూడవచ్చు. అది అతని విశాల దృక్పథంతో కూడిన మత విధానాన్ని పాటించనప్పటికీ షేర్షా మత విధానం అక్బర్ విధానానికి దగ్గరగా వుంది.

2.9 షేర్షా ఘనత అంచనా

మధ్య యుగంనాటి గొప్ప రాజులలో ఒకడిగా, భారతదేశ చరిత్రలో షేర్షాకు ప్రముఖమైన స్థానం వుంది. 'భారతదేశాన్ని పరిపాలించిన మహమ్మదీయ రాజులందరిలో గొప్పవాడు' అన్న అభిప్రాయాన్ని షేర్షా గురించి, వూల్సీహేగ్ వ్యక్తంచేశాడు. కానీ షేర్షాకంటే అక్బర్ గొప్పవాడు. అందువల్ల హేగ్ అభిప్రాయంతో

BRAOU

II. ఈ క్రింది ప్రశ్నలకు ప్రతి ఒక్కదానికి సుమారు 15 వాక్యములలో జవాబు వ్రాయండి.

1. రాజపుత్రుల పట్ల షేర్ షా పాటించిన విధానమును తెల్పండి.
2. షేర్ షా కాలమునాటి రాష్ట్ర, స్థానిక పరిపాలనలోని ముఖ్యాంశాలను తెల్పండి.
3. షేర్ షా తర్వాత భారతదేశంలోని ఆఫ్ఘన్ రాజ్యం ఎందుకు అంతరించింది?

2.14 ఉపయుక్త గ్రంథాలు

1.	Kanungo K.R.	:	*Sher Shah.*
2.	Sharma L.P.	:	*The Mughal Empire.*
3.	Sharma S.R.	:	*The Mughal Empire in India.*
4.	Srivatsava A.L.	:	*Sher Shah and his Successors*
5.	Tripathi R.P.	:	*Rise and fall of the Mughal Empire*
6.	రుూన్సిలక్ష్మీ, పాటిబండ; వైదేహి, అల్లాడి	:	భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయభాగం-తెలుగు అకాడమి ప్రచురణ

BRAOU

భాగం - 3 : అక్బర్ నుంచి మొగల్ రాజ్య చరిత్ర

విషయక్రమం

3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 అక్బర్, 1556-1605

- 3.2.1 రాజ్యానికి వచ్చుట
- 3.2.2 1556లో భారతదేశ రాజకీయ పరిస్థితి
- 3.2.3 రెండవ పానిపట్ యుద్ధము, 1556
- 3.2.4 అక్బర్ విజయాలు
  - 3.2.4.1 గోండ్వానా, 1564
  - 3.2.4.2 రాజపుత్ర రాజ్యాలు
  - 3.2.4.3 గుజరాత్ 1572
  - 3.2.4.4 బెంగాల్ 1576
  - 3.2.4.5 మేవాడ్ రాణా ప్రతాప సింహుని ఓటమి, 1576
  - 3.2.4.6 కాబూల్, కాశ్మీర్, సింధ్, బలూచిస్థాన్, కాందహార్, ఒరిస్సా, 1585-1595
  - 3.2.4.7 దక్కన్ దండయాత్రలు
    - 3.2.4.7.1 అహమ్మద్‌నగర్, 1600
    - 3.2.4.7.2 ఖాందేష్ 1601
- 3.2.5 సామ్రాజ్య నిర్మాతగా, జాతీయ చక్రవర్తిగా అక్బర్
- 3.2.6 అక్బర్ రాజపుత్ర విధానం
  - 3.2.6.1 వివాహ సంబంధాలు
  - 3.2.6.2 ఉన్నత పదవులు
- 3.2.7 మత విధానం
  - 3.2.7.1 జిజియా, యాత్రికుల పన్నుల రద్దు
- 3.2.8 సాంఘిక సంస్కరణలు

3.3 జహంగీర్, 1605 - 1627

- 3.3.1 తొలి జీవిత దశ, సింహాసన మధిష్ఠించుట
- 3.3.2 సంస్కరణలు
- 3.3.3 ఖుస్రూ తిరుగుబాటు, 1606
- 3.3.4 గురు అర్జున్‌ను ఉరితీయుట
- 3.3.5 నూర్జహాన్‌తో వివాహం
- 3.3.6 నూర్జహాన్ వ్యక్తిత్వం
- 3.3.7 నూర్జహాన్ ప్రభావం
- 3.3.8 జహంగీర్ యుద్ధాలు
  - 3.3.8.1 మేవాడ్‌తో యుద్ధము, 1614
  - 3.3.8.2 కాంగ్రా ఆక్రమణ, 1620
  - 3.3.8.3 కాందహార్ నష్టపోవుట, 1622
  - 3.3.8.4 దక్కన్, అహమద్‌నగర్‌తో యుద్ధం
- 3.3.9 ఐరోపావారితో జహంగీర్ సంబంధాలు
  - 3.3.9.1 పోర్చుగీసువారితో
  - 3.3.9.2 ఆంగ్లేయులతో

BRAOU

3.3.10 ఖుర్రమ్ తిరుగుబాటు
3.3.11 మహబత్ ఖాన్ తిరుగుబాటు
3.3.12 జహంగీర్ మరణం, 1627
3.3.13 జహంగీర్ వ్యక్తిత్వము
3.4 షాజహాన్, 1627 - 1658
3.4.1 సింహాసన మధిష్ఠించుట
3.4.2 ముంతాజ్ మహల్ మరణం, 1631
3.4.3 కరువులు
3.4.4 దక్కన్ యుద్ధాలు, 1631 - 1636
3.4.4.1 అహమద్‌నగర్ విలీనం
3.4.4.2 బీజపూర్, గోల్కొండలు లొంగిపోవుట
3.4.5 పోర్చుగీసు వారితో సంబంధాలు
3.4.6 మధ్య ఆసియా విధానం
3.4.7 కాందహార్
3.4.8 వారసత్వ యుద్ధము, 1657-58
3.5 ఔరంగజేబ్, 1658 - 1707
3.5.1 రెండవసారి పట్టాభిషేకం
3.5.2 ఔరంగజేబ్ పాలనలో రెండు విభాగాలు
3.5.3 ఉత్తరదేశంలో సంఘటనలు, 1658-1681
3.5.3.1 అస్సామ్ పై దండయాత్ర, 1661-63
3.5.3.2 అరకాన్ ఆక్రమణ, 1666
3.5.3.3 శివాజీతో యుద్ధం, 1663-1680
3.5.3.4 జాట్‌ల తిరుగుబాటు, 1669
3.5.3.5 సత్నామీల తిరుగుబాటు, 1672
3.5.3.6 తేజబహదూర్ ప్రాణ త్యాగం, 1675
3.5.3.7 జిజియా పన్ను విధించుట, 1679
3.5.3.8 రాజపుత్రులతో యుద్ధాలు, 1679-81
3.5.4 ఔరంగజేబ్ దక్కన్ విధానం
3.5.4.1 బీజపూర్, గోల్కొండల ఆక్రమణ
3.5.4.2 మహారాష్ట్రులతో యుద్ధం
3.5.4.3 దక్కన్ దండయాత్ర ఫలితాలు
3.5.4.4 ఔరంగజేబ్ మరణం, 1707
3.6 ఔరంగజేబ్ తర్వాత మొగల్ రాజులు
3.7 నాదిర్‌షా దండయాత్ర, 1739
3.8 అహమ్మద్ షా అబ్దాలీ దండయాత్రలు
3.9 మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలు
3.9.1 ఔరంగజేబ్ బాధ్యత
3.9.1.1 అతని దక్కన్ విధానం
3.9.1.2 అతని మత విధానం
3.9.1.3 అతని అనుమాన స్వభావం

BRAOU

3.9.2 ఔరంగజేబ్ తర్వాత బలహీనులైన రాజులు
3.9.3 పరాయి ప్రభుత్వం
3.9.4 కేంద్రీకృత పాలన
3.9.5 రాజ్య వారసత్వానికి సరియైన విధానం లేకపోవుట
3.9.6 అమీరుల క్షీణత
3.9.7 సైన్య బలహీనత
3.9.8 వర్గ కలహాలు
3.9.9. రాష్ట్రాలు స్వతంత్రమగుట
3.9.10 విదేశీయుల దండయాత్రలు
3.9.11 సామ్రాజ్య విస్తీర్ణం
3.9.12 నౌకాబలాన్ని అలక్ష్యం చేయుట
3.9.13 శిక్కులు, మహారాష్ట్రుల వంటి ప్రాంతీయ శక్తులు
3.10 సంగ్రహంగా
3.11 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
3.12 పరీక్ష నమూనా ప్రశ్నలు
3.13 ఉపయుక్త గ్రంథాలు

3.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాల గురించి తెలుసుకోగలగాలి.

1. 1556లో జరిగిన రెండవ పానిపట్ యుద్ధము, మొగల్ రాజ్యం స్థిరపడుట,
2. అక్బర్, జహంగీర్, షాజహాన్, ఔరంగజేబు పాలనా వివరాలు,
3. మొగల్ రాజుల మతవిధానం, దక్కన్ విధానం
4. మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలు

3.1 పరిచయం

1556లో జరిగిన రెండవ పానిపట్ యుద్ధంలో అక్బర్, హేమూను ఓడించి భారతదేశంలో మొగల్ రాజ్యాన్ని స్థిరపరిచాడు. భారతదేశంలో మొగల్ సామ్రాజ్యం అక్బర్ కాలంనుంచి ఔరంగజేబు వరకు సుస్థిరంగా వుండింది. అక్బర్ నుంచి ఔరంగజేబ్ వరకు మొగలుల చరిత్ర వారి మత, దక్కన్ విధానాలు మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలు ఈ పాఠంలో చర్చించబడ్డాయి.

3.2 అక్బర్, 1556-1605

3.2.1 రాజ్యానికి వచ్చుట

అక్బర్, హుమాయూన్, హమీదాబాను బేగం (హుమాయూన్ దేశభ్రష్టత గావించబడి, సింధూ ప్రాంత సంచరించినప్పుడు వివాహమాడిన ఇరాన్ దేశపు స్త్రీ ఈమె) లకు సింధులోని అమరకోటలో 1542లో జన్మించినట్లు పైన చెప్పాం. హుమాయూన్ చనిపోయేనాటికి, అక్బర్‌కు పదమూడేండ్లు మాత్రమే, అప్పటికతడు బైరంఖాన్ సంరక్షణలో ఉండినాడు. హుమాయూన్ అక్బర్‌ను పంజాబ్ పాలకుడుగా నియమించాడు. తన తండ్రి మరణ సమయానికి అక్బర్, తన సంరక్షకుడైన బైరంఖాన్‌తో కలసి పంజాబ్‌లో సికందర్ సూర్‌ను వెంటాడుతూ

BRAOU

ఉండినాడు. గురుదాస్‌పూర్ జిల్లాలోని కలనౌర్ వద్ద అక్బర్‌కు తండ్రి మరణ వార్త తెలిసింది. అచటనే బైరంఖాన్ 1556 ఫిబ్రవరి 14న అక్బర్‌కు పట్టాభిషేకం చేసి అతనిని పాదుషాగా ప్రకటించి, అక్బర్‌కు తాను సంరక్షకుడయ్యాడు. నియమం ప్రకారం అక్బర్ తమ్ముడు మహమ్మద్ హకీం కాబూల్ పరిపాలకుడుగా నియమింపబడ్డాడు.

3.2.2 1556 లో భారతదేశ రాజకీయ పరిస్థితి

అక్బర్ రాజ్యానికి వచ్చేనాటికి భారతదేశ రాజకీయ పరిస్థితి చాలావరకు 1526లో మొదటి పానిపట్ యుద్ధకాలంవాడు ఉన్నట్లే ఉండింది. ఉత్తర భారతదేశంలో ఎన్నో స్వతంత్ర రాజ్యాలు ఉండేవి. పశ్చిమ తీరాన్ని పోర్చుగీసులు ఆక్రమించి ఉండినారు. దక్షిణాన కూడా, అళియ రామరాజు ఆధిపత్యంలో వైభవోపేతంగా శక్తివంతంగా పాలించబడుతున్న విజయనగర సామ్రాజ్యంతో సహా, అనేక స్వతంత్ర రాజ్యాలు ఉండేవి. పంజాబ్, ఢిల్లీ, ఆగ్రాలలోని కొన్ని భాగాలు మొగల్ పాలనలో ఉండేవి. అక్బర్ తమ్ముడైన (సవతితల్లి కొడుకు) హకీమ్ కాబూల్‌ను స్వతంత్రంగా పాలించుచుండేవాడు. రాజపుత్ర పాలకులు బలవంతులై ఉండిరి. హుమాయూన్‌కు పరమ శత్రువైన షేర్షా సూర్ వారసులు, అక్బర్‌కున్నంత హక్కు తమకూ కలదని, అక్బర్‌తో భారతదేశ ఆధిపత్యానికై పోటీ పడసాగారు.

షేర్షా బంధువులైన ముహమ్మద్ అదిల్‌షా, సికందర్ సూర్ సింహాసనాన్ని కాంక్షించసాగారు. పంజాబ్‌లో సికందర్ సూర్ బలవంతుడై ఉండినాడు. అక్బర్ రాజ్యానికి వచ్చే సమయానికి బైరంఖాన్ అతనిని లొంగదీసే ప్రయత్నంలో ఉండినాడు. షేర్షా మరొక బంధువైన ముహమ్మద్ అలీ కొంతకాలం షేర్షా కుమారుడైన ఇస్లామ్‌షా వారసుడుగా స్థిరపడ్డాడు. ఉత్తర భారతంలో తన రాజకీయ ప్రయోజనాల సంరక్షణ బాధ్యతను సమర్థుడైన తన హిందూ మంత్రి హేమూకు వదలి ముహమ్మద్‌షా చునార్ దుర్గానికి వెళ్లిపోయాడు. హేమూ, అక్బర్‌కు ఘోర శత్రువైనాడు. హుమాయూన్ చనిపోగానే హేమూ ఢిల్లీ, ఆగ్రాలను ఆక్రమించి, "అధాలి" (మూర్ఖుడు) అని పిలవబడే ముహమ్మదాలీని త్రోసిరాజని విక్రమ్‌జీత్ లేదా విక్రమాదిత్య అనే బిరుదుతో తనను స్వతంత్ర పాలకుడుగా ప్రకటించుకొన్నాడు.

3.2.3 రెండవ పానిపట్ యుద్ధం, 1556

పైన పేర్కొన్న క్లిష్ట పరిస్థితిలో బైరంఖాన్ అక్బర్‌కు పెట్టనికోటగా నిలిచాడు. అతడు అక్బర్‌తో కలసి, సాహసించి స్థానేశ్వరం మీదుగా సైన్యాలను చరిత్రాత్మకమైన పానిపట్ యుద్ధరంగానికి నడిపాడు. ఇచటనే అవాటికి ముప్పైఏండ్ల క్రింద బాబర్ ఢిల్లీ సుల్తానైన ఇబ్రహీం లోడీని ఓడించి, వధించాడు. 1556 నవంబర్ 5న పానిపట్ యుద్ధరంగంలో రెండు (మొగలుల, హేమూ సేనలు) వైపుల సైన్యాలు పోరాడాయి. హేమూ ఓడి మొగలాయీల చేజిక్కి వధించబడ్డాడు. ఈ విజయంతో ఢిల్లీ, ఆగ్రాలకు అక్బర్ అధిపతి అయి, మొగలాయి సామ్రాజ్య పునఃప్రతిష్ఠాపనకు మార్గమేర్పడింది.

3.2.4 అక్బర్ విజయాలు

అక్బర్ గొప్ప సామ్రాజ్య కాంక్ష కలవాడు. భారతదేశాన్నంతా తన యేలుబడి క్రిందికి తెచ్చి పాలింపవలెననే ఆశయం కలిగినవాడు. ఈ లక్ష్యంతో అతడు సామ్రాజ్యాన్ని విస్తరింపచేసే ప్రయత్నానికి పూనుకొన్నాడు. విజయపరంపరలు సాధించి, ప్రాభవోపేతమైన భారతదేశ సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

పైన చెప్పినట్లు, 1556లో రెండవ పానిపట్ యుద్ధ ఫలితంగా ఢిల్లీ, ఆగ్రా అక్బర్ వశమైనాయి. క్రీ.శ. 1557లో పంజాబ్‌లో మానకోట వద్ద తలదాచుకొన్న సికందర్ సూర్ లొంగిపోయాడు. అంతటితో భారతదేశ సామ్రాజ్యాధిపత్యానికి సూర్ వంశస్థుల ప్రలోభ మంతమైంది. తర్వాత 1558, 1560ల మధ్య బైరంఖాన్ గ్వాలియర్, అజ్మీర్, జాన్‌పూర్‌లను గెలిచి రాజ్యాన్ని విస్తరింపచేశాడు.

BRAOU

1561లో అక్బర్, ఆఫ్ఘన్ జాతివాడైన బాజ్ బహాదూర్ పాలిస్తుండిన మాల్వాపై దండెత్తాడు. మాల్వా రాజధాని అయిన సారంగ్‌పూర్ వద్ద కొంత ప్రతిఘటించి, బాజ్ బహాదూర్ లొంగిపోయాడు. మాల్వాను మొగలులు ఆక్రమించారు.

3.2.4.1 గోండ్వానా, 1564

1564లో అసఫ్‌ఖాన్ గోండ్వానాపై దండెత్తి దానిని గెలిచాడు. ఇప్పటి మధ్యప్రదేశ్‌లోని ఉత్తర భాగమే గోండ్వానా. దానిని తన కుమారుడైన వీరనారాయణకు సంరక్షకురాలుగా రాణీ దుర్గావతి పాలిస్తుండింది. ఆమె ధైర్యశాలి, వివేకవతి, సమర్థురాలు. రాజ్యాన్ని చక్కగా, సమర్థవంతంగా పాలిస్తుండింది. అక్బర్ సైన్యాలు గోండ్వానాపై దండెత్తినపుడు జబల్‌పూర్ వద్ద దుర్గావతి వారితో ధైర్యంగా పోరాటం సలిపింది. విజయానికి గల ఆశలు అడుగంటిపోగా, తన మానరక్షణకై ప్రాణత్యాగం చేసింది. ఆమె పుత్రుడు కూడా పోరాడుతూ వీరోచిత మరణం పొందాడు.

3.2.4.2 రాజపుత్ర రాజ్యాలు

భారతదేశానికి అంతటికి చక్రవర్తి కావలెననే ఆశయం, అక్బర్ 1567లో రాజపుత్ర స్థానంలోని ప్రముఖ రాజ్యమైన మేవాడ్‌పై దండెత్తేటట్లు చేసింది. మేవాడ్ రాజధాని చిత్తోడ్. దానికి ఉదయపూర్ నగర నిర్మాత, రాజపుత్ర పాలకుల కూటమికి నాయకుడుగా ఉన్న రాణా ఉదయసింహుడు రాజుగా ఉండినాడు. చాలామంది రాజపుత్ర పాలకులు అక్బర్‌కు లొంగిపోయారు. జయపూర్ రాజైన బిహారీమల్ తన మొదటి కుమార్తెను అక్బర్ కిచ్చి పెండ్లిచేశాడు. కాని రాణా ఉదయసింగ్, అక్బర్‌కు లొంగిపోవడానికి, అతనితో వివాహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి నిరాకరించాడు. అంతేకాక, అతడు కాందిశీకుడైన మాల్వా సుల్తాన్ బాజ్ బహాదూర్‌కు ఆశ్రయమిచ్చాడు. ఇది నెపంగా 1567లో అక్బర్ ఫిరంగిదళంతో కూడిన పెద్ద సైన్యాన్ని తాను సొంతంగా నడుపుతూ రాణాపైకి దండెత్తాడు. రాణా ఉదయసింగ్, ఈ దండయాత్రకు ఎదురు నిలవలేక, దుర్గ రక్షణ శూరులైన, సేనానాయకులైన పట్టా, జయమల్‌లకు వదలి తాను కొండలలో తలదాచుకొన్నాడు. పట్టా, జయమల్ మిక్కిలి ధైర్యంతో పోరాడి నాల్గు నెలలు దుర్గాన్ని శత్రుబారి నుంచి రక్షించారు. చివరకు వారు ఓడింపబడి, దుర్గం ముట్టడి గావించబడింది. చిత్తోడ్ పతనం తర్వాత నాల్గేండ్లకు ఉదయసింహుడు చనిపోయాడు. అతని తర్వాత యుద్ధవీరుడైన అతని కుమారుడు రాణా ప్రతాపసింహుడు మొగలులతో వీరోచితంగా పోరాటం కొనసాగించాడు. కాని, చిత్తోడ్ దాని భాగ్యాన్ని అప్పటికే కోల్పోయింది. అది మరలా తన పతనం నుంచి కోలుకోలేదు.

1569లో రణతంభోర్, కలింజర్ రాజులు అక్బర్‌కు లోబడ్డారు. 1570లో జైసల్మేర్ రాజు, బికనీర్ రాజైన కళ్యాణ మల్, అక్బర్‌కు లొంగి అతనికి తమ కుమార్తెల నిచ్చి వివాహం చేశారు. అదే సంవత్సరంలో జోధ్‌పూర్ కూడా లొంగిపోయింది. పరిపూర్ణ సార్వభౌమత్వం కానప్పటికీ అక్బర్ రాజపుత్ర స్థానానికంతా అధిపతి అయ్యాడు. ఒక్క మేవాడ్ మినహాయించి, మిగిలిన రాజపుత్ర వంశాలన్నీ అక్బర్‌కు లొంగిపోయాయి. అక్బర్ రాజపుత్రుల యెడల అవలంబించిన ఆదరణ, ఉదార వైఖరివల్ల, రాజపుత్ర వీరుల్లో ముఖ్యమైన వారంతా చక్రవర్తికి భక్తి విశ్వాసాలతో కూడిన అనుచరులయ్యారు. అజ్మీర్ ప్రధాన కేంద్రంగా, రాజపుత్ర స్థానం ఒక 'సుబా' లేదా రాష్ట్రంగా లెక్కింపబడింది.

3.2.4.3 గుజరాత్, 1572

గుజరాత్ అతి సంపద గలిగిన సారవంతమైన రాష్ట్రం. దానిలో సంపన్నమైన రేవులు చాలా ఉండేవి. మూడవ ముజఫర్‌షా (1562-72) గుజరాత్‌కు నామమాత్రపు రాజుగా ఉండేవాడు. ముజఫర్ అక్బర్‌కు లొంగిపోయాడు. అక్బర్ అతనికి కొంత జీవనోపాధిని కల్పించాడు. అక్బర్ గుజరాత్‌లో మొదటిసారిగా సముద్రాన్ని దర్శించాడు. మీర్జాలు బలపడి ఉన్న సూరత్‌ను 1573లో అక్బర్ ముట్టడించి దానిని ఆక్రమించుకొన్నాడు.

BRAOU

గుజరాత్ ఆక్రమణ వ్యాపారాన్ని అభివృద్ధిచేసి, సామ్రాజ్యాదాయాన్ని పెంపొందించింది. ఆ సంవత్సరమే కాంగ్రా పాలకుడు మొగలాయీల సామంతుడయ్యాడు. అదే సంవత్సరంలో మీర్జాలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారు. అక్బర్ ఆగ్రాకు సమీపంలో నూతనంగా నిర్మించిన తన రాజధాని ఫతేపూర్ సిక్రి నుంచి అహమ్మదాబాద్‌కు, ఆశ్చర్యకరమైన వేగంతో తన సైన్యాలను నడిపి, తిరుగుబాటును అణచివేశాడు. 1574-75లో అక్బర్ రెవిన్యూ మంత్రి అయిన తోడర్‌మల్ గుజరాత్‌కు సంబంధించి భూమిశిస్తు విధానాన్ని ఏర్పాటు చేశాడు. ఈ విధానమే అటు తర్వాత తోడర్‌మల్ సామ్రాజ్యానికంతా రూపొందించిన భూమి శిస్తు విధానానికి ప్రాతిపదిక అయింది. గుజరాత్‌వల్ల సామ్రాజ్యానికి యాభై లక్షల రూపాయల అదనపు ఆదాయం చేకూరింది. సామ్రాజ్యంలో సముద్రానికి ప్రవేశమేర్పడి వాణిజ్యం అభివృద్ధి చెందింది. గుజరాత్‌లో పోర్చుగీసులతో ఏర్పడిన సంబంధం అక్బర్‌పై దాని ప్రభావాన్ని చూపి, సామ్రాజ్యాన్ని కూడా అనేక విధాలుగా ప్రభావితం చేసింది.

3.2.4.4 బెంగాల్, 1576

ఆఫ్ఘనిస్తాన్ వాడైన బెంగాల్ రాజు, సులేమాన్ కరరానీ, అక్బర్ ఆధిపత్యాన్ని అంగీకరించాడు. కాని అతని కుమారుడు దావూద్‌ఖాన్, అక్బర్ ఆధిపత్యాన్ని నిరాకరించి స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. అందుచేత, 1574లో అక్బర్ దావూద్‌ఖాన్ మీదికి సైన్యాన్ని నడిపాడు. దావూద్‌ఖాన్ ఓడి 1575లో ఒరిస్సాకు పారిపోయాడు. అక్బర్ ఈ దండయాత్రను తన సైన్యాధికారులకు అప్పగించి తాను రాజధానికి తిరిగి వచ్చాడు. చివరకు 1576లో రాజ్‌మహల్ వద్ద జరిగిన ఒక యుద్ధంలో దావూద్‌ఖాన్ చంపబడ్డాడు. బెంగాల్ మొగల్ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రం (సుబా) అయింది.

3.2.4.5 మేవాడ్, రాణా ప్రతాపసింహుని ఓటమి, 1576

1576లో హల్దీఘాట్ (లోయ) వద్ద జరిగిన యుద్ధంలో రాణా ప్రతాపసింహుడు మాన్‌సింగ్ చేత ఓడించబడ్డాడు. రాణా ప్రతాపసింహుడు కొండలలో తలదాచుకోవలసి వచ్చింది. హల్దీఘాట్ (లోయ) వద్ద గల గోగూండ, కుమిల్‌మీర్ దుర్గాలు, మొగలుల వశమైనాయి. కాని 1597లో తాను మరణించే దానికి ముందు, రాణా ప్రతాపసింహుడు ఈ దుర్గాలను తిరిగి వశం చేసుకొన్నాడు.

3.2.4.6 కాబూల్, కాశ్మీర్, సింధు, బెలూచిస్తాన్, కాందహార్, ఒరిస్సాల ఆక్రమణ, 1585-1595

1585లో కాబూల్‌ను పాలిస్తుండిన అక్బర్ సవతితల్లి కొడుకు (తమ్ముడైన) మీర్జా హకీం చనిపోవడంతో, కాబూల్ మొగల్ సామ్రాజ్యంలో చేర్చబడింది. రాజామాన్‌సింగ్ కాబూల్ పాలకుడుగా నియమింపబడ్డాడు. అటుతర్వాత వాయవ్య సరిహద్దులో దౌర్జన్యం చేస్తూ ఉండిన పఠాన్ జాతులవారు అణచబడ్డారు. కాని, వారిని అణచుటకై పంపబడిన బీర్బల్ యుద్ధంలో చంపబడ్డాడు. 1586లో అక్బర్ లాహోర్‌లో విడిదిచేసి ఉన్నప్పుడు రాజా భగవాన్ దాస్ కాశ్మీర్‌ను, దాని సుల్తానైన యూసఫ్‌షా నుంచి వశపరచుకొన్నాడు. కాశ్మీర్, కాబూల్ రాష్ట్రంలో అంతర్భాగం చేయబడింది. 1591లో సింధు, 1592లో ఒరిస్సా, 1595లో బెలూచిస్తాన్, కాందహార్ అక్బర్ సామ్రాజ్యంలో కలుపుకోబడ్డాయి.

3.2.4.7 దక్కన్

ఉత్తర భారతాన్ని, మధ్య భారతాన్ని ఆక్రమించిన తర్వాత అక్బర్ దక్షిణ భారతాన్ని ఆక్రమించ పూనుకొన్నాడు. బీజాపూర్, అహమద్‌నగర్, గోల్కొండ మొదలైన దక్కన్ రాజ్యాలు పరస్పరం కలహించుకొని యుద్ధాలు చేసుకొంటూ ఉండడం అక్బర్‌కు సదవకాశమయింది. తన ఆధిపత్యాన్ని అంగీకరించవలసిందిగా కోరుతూ అక్బర్, ఈ రాజ్యాలకు రాయబారులను పంపాడు. కాని, ఈ రాజ్యాలు మర్యాదగానే అక్బర్ షరతులను త్రోసిపుచ్చాయి. దానితో అక్బర్ వీరిపై యుద్ధం చేయవలసి వచ్చింది.

BRAOU


3.2.4.7.1 అహమద్ నగర్, 1600

అహమద్‌నగర్ వీరురాలైన సుల్తానా చాంద్‌బీబీచే పరిపాలింప బడుతుండింది. బాలుడైన అహమద్‌నగర్ రాజుకు మేనత్త అయిన చాంద్‌బీబీ, అతనికి సంరక్షకురాలుగా అహమద్‌నగర్‌ను పాలిస్తుండింది. మురాద్ అహమద్‌నగర్‌ను ముట్టడించాడు. చాంద్‌బీబీ మిక్కిలి ధైర్యంతో ముట్టడిని ప్రతిఘటించింది. మురాద్‌కు విజయం చేకూరలేదు. చివరకు ఒక శాంతి ఒప్పందం జరిగింది. దాని ప్రకారం చాంద్‌బీబీ బీరార్‌ను మొగలులకు ఇచ్చి వేయడానికి ఒప్పుకొంది (1595). అటు తర్వాత మరలా రాజకీయ కుట్రల ఫలితంగా చాంద్‌బీబీ అక్బర్‌తో పోరాడవలసి వచ్చింది. అక్బర్ కుమారుడైన దన్యాల్ అహమద్ నగర్‌ను ముట్టడించాడు. కాని, చాంద్‌బీబీని ఆమె సైన్యాధికారులే హత్య చేశారు. 1600లో రాకుమారుడు దన్యాల్ అహమద్‌నగర్‌ను జయించడంతో అది మొగల్ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది.

3.2.4.7.2. ఖాందేష్, 1601

దక్కన్‌లో అక్బర్ ఆక్రమణ యుద్ధాలు ఖాందేష్‌లోని బలిష్టమైన దుర్గమైన అసీర్‌ఘడ్‌ను పట్టుకోవడంతో అంతమైనాయి. ఖాందేష్ సుల్తానైన మీరాన్ బహదూర్‌షా, అక్బర్‌కు లొంగి ఉండటానికి ఒప్పుకొని తరవాత మనసు మార్చుకొని అక్బర్ ఆధిపత్యాన్ని కాదన్నాడు. అక్బర్ ఖాందేష్ రాజధాని అయిన బుర్హాన్‌పూర్‌ను ఆక్రమించి అటుతర్వాత ఖాందేష్‌లోని బలిష్టమైన దుర్గమైన అసీర్‌ఘడ్‌ను ముట్టడించాడు. ఉత్తర భారతం నుంచి దక్కన్‌కు పోయే మార్గంలో ఉన్న అసీర్‌ఘడ్ దుర్గం, సైనికపరంగా చాలా ముఖ్యమైంది. సుదీర్ఘంగా ఒక సంవత్సరం ముట్టడిసాగిన తర్వాత ఖాందేష్ సైన్యాధికారులకు లంచమిచ్చి లోబరచుకొని దుర్గాన్ని వశపరచుకొన్నారు. ఇదే అక్బర్ చివరగా చేసిన ఆక్రమణ.

అక్బర్ దక్కన్‌లోని ఆక్రమణలను బీహార్, అహమద్‌నగర్, ఖాందేష్ అనే మూడు రాష్ట్రాలు (సుబాలు)గా విభజించి వాటి మీద తన కుమారుడైన దన్యాల్‌ను రాజ ప్రతినిధిగా నియమించాడు.



EGRAOU

3.2.5 సామ్రాజ్య నిర్మాతగా, జాతీయ చక్రవర్తిగా అక్బర్

తాను రాజ్యానికి వచ్చిన ఇరవై ఏండ్లకు 1576 నాటికి అక్బర్, గంగా సింధు పరీవాహక ప్రదేశాలతో కూడిన భారతదేశానికంతా అధిపతి అయ్యాడు. నాటికి అతని సామ్రాజ్యం అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు, హిమాలయాల నుంచి నర్మదా నది వరకు విస్తరించింది. విస్తారమైన జన సంఖ్య, సారవంతమైన భూములు, అనేకమైన పరిశ్రమలు, విస్తృతమైన వ్యాపారంతో, అతని పాలనలోని ప్రదేశాలు అతని సామ్రాజ్యాన్ని బహుశః ప్రపంచంలో మిక్కిలి సంపన్నమైన దానినిగా చేశాయి. సామ్రాజ్యంలో తరవాత చేర్చబడిన ఒరిస్సా, కాశ్మీర్, కాందహార్, దక్కన్‌లో కొంతభాగం ఇమిడికగా ఉన్న సామ్రాజ్యాన్ని పరిపూర్ణం చేశాయి. ఈ సామ్రాజ్య విస్తరణలో గమనింపదగ్గ రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది, హిందూ రాజుల ఆమోదయోగ్యమైన సహకారాలతో అది సాధించబడింది. రెండవది, విస్తరణతోపాటు సక్రమమైన పరిపాలనను ప్రవేశపెట్టబడింది. హిందూ, ముస్లింల మధ్యయున్న తారతమ్యాలను తొలగించడం ద్వారా ఒక సంఘటిత రాజ్యాన్ని నిర్మించడమే అక్బర్ విధాన ముఖ్యోద్దేశం. ఈ విధానాన్ని అనుసరించే అక్బర్ రాజపుత్రుల నుద్దేశించి అనేక హితవైన పద్ధతుల నవలంబించాడు.

3.2.6 అక్బర్ రాజపుత్ర విధానం

అక్బర్ రాజపుత్ర విధానం *"ఆలోచనా పూరితమైన రాజనీతి విధాన ఫలితమని, ఇది విజ్ఞతతోకూడిన స్వప్రయోజన సూత్రాలపైన, యోగ్యతకు తగిన గుర్తింపుపైన, న్యాయధర్మాల మీద ఆధారపడిందని"* శ్రీవాత్సవ అంటాడు. ఇతడు హిందువుల, ప్రత్యేకించి రాజపుత్రుల ప్రేమాభిమానాలను చూరగొనడానికై ఈ క్రింది విధానాలను అనుసరించాడు.

3.2.6.1 వివాహ సంబంధాలు

అక్బర్ రాజపుత్ర కుటుంబాలతో వివాహ సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. అతడు 1562లో జయపూర్ పాలకుడైన రాజా బిహారీమల్ పెద్ద కుమార్తెను పెండ్లాడాడు. దీనితో జయపూర్ రాజపుత్ర కుటుంబం చక్రవర్తికి సన్నిహితమైంది. ఈమె మర్యం-ఇ-జమాని అనే పేరుతో పిలువబడి, యువరాజైన సలీంకు తల్లి అయింది. అటు తర్వాత 1570లో అక్బర్ బికనీర్, జైసల్మేర్ రాజపుత్ర వంశాలకు చెందిన రాజపుత్ర కన్యలను పెండ్లాడాడు. యువరాజైన సలీం కూడా, తన తల్లి అయిన మర్యం-ఇ-జమాని అన్న అయిన రాజా భగవాన్ దాస్ కూతురిని పెండ్లాడాడు. అక్బర్ తన రాజపుత్ర బంధువులను, రాజకుటుంబంలోని సభ్యులుగా ఆదరించి వారికి పరిపాలనలో, సైన్యంలో ఉన్నత పదవులు ఇచ్చాడు.

3.2.6.2 ఉన్నత పదవులు

పరిపాలనలోను, సైన్యంలోను రాజపుత్రులకు అత్యున్నత పదవులు ఇవ్వబడ్డాయి. రాజాభగవాన్‌దాస్, మాన్‌సింగ్, తోడర్‌మల్, బీర్‌బల్ మొదలైన వారందరూ అత్యున్నత పదవుల నలంకరించారు.

3.2.7 మత విధానం

అక్బర్ హిందువులకు పరిపూర్ణ మతస్వాతంత్ర్యం ఇచ్చాడు. అతని పాలనా కాలంలో ఏ హిందూ దేవాలయం కాని అపవిత్రం కావించబడలేదు, నాశనం చేయబడలేదు. హిందువుల అభిమానాన్ని పొందడానికై అక్బర్ కొన్ని దినాలలో జంతు వధ నిషేధించాడు. హిందూ శాస్త్రాభ్యాసం ప్రోత్సహించబడింది. హిందువుల తిరునాళ్ళు, ఉత్సవాలు నిరాటంకంగా జరిగినాయి. వీటిలో అక్బర్ స్వయంగా పాల్గొనేవాడు. (అక్బర్ మత విధానాన్ని గూర్చి **"మొగల్ యుగంలో సాంస్కృతికాభివృద్ధి"** అనే నాల్గవ భాగంలో వివరంగా చెప్పబడింది)

BRAOU

3.2.7.1 యాత్రికుల మీద పన్ను, జిజియా పన్ను రద్దు.

1563లో అక్బర్ హిందూ తీర్థయాత్రికుల మీద పన్ను రద్దు చేశాడు. 1564లో జిజియా పన్ను రద్దు చేశాడు. ఒక ముస్లిం రాజ్యంలో ముస్లింలు కానివారు తమ మతాన్ని అనుసరించడానికై విధించే తలపన్ను పేరే జిజియా. తమ దేశంలోనే తాము పరాయివారు కారనే భావన హిందువులలో ఏర్పడింది.

ఈ విధాన ఫలితంగా హిందువులందరూ ప్రత్యేకించి యుద్ధవీరులైన రాజపుత్రులూ మొగల్ సామ్రాజ్యానికి అంకితమైన సేవకులై, చివరకు మొగలుల పక్షంగా అంకిత భావంతో పోరాడినారు. మొగల్ సామ్రాజ్య రక్షణకు వారు ఖడ్గకేడెములయ్యారు. *"అక్బర్ రాజపుత్ర విధానం, నాల్గు తరాల మొగల్ చక్రవర్తులకు మధ్యయుగ భారతదేశం లోని గొప్ప సైనిక వీరుల, రాజనీతిజ్ఞుల సేవలను సంపాదించి పెట్టింది."* (బేనీ ప్రసాద్) ఔరంగజేబ్ ఈ విధానాన్ని మార్చడంతో హిందువులు దూరమైపోయారు. రాజపుత్రులు పరమశత్రువులైనారు. సామ్రాజ్యం క్షీణించడం ప్రారంభించింది.

3.2.8 సాంఘిక సంస్కరణలు

ఈసందర్భంలో అక్బర్ ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలను కొన్నిటిని పేర్కొనటం అసందర్భం కాదు. ఈ సంస్కరణలు అక్బర్ విశాల హృదయాన్ని తెలియపరుస్తాయి.

1. బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. చిన్న పిల్లలను (బలిగా) చంపడం నిరసించబడ్డాయి.
2. హిందూ వితంతు పునర్వివాహం చట్టబద్ధం చేయబడింది.
3. సతీ సహగమనం ఆచరణలో పెట్టకుండా ఉండటానికి ప్రయత్నాలు జరిగాయి; కాని ఈ ప్రయత్నాలు ఎక్కువగా ఫలించలేదు.
4. మత స్వాతంత్ర్యం పూర్తిగా అనుమతించబడింది.
5. యుద్ధఖైదీలను బానిసలుగా వాడటం, వారిని ఇస్లాం మతానికి మార్చడం నిషేధించబడింది.
6. యాత్రికుల మీద పన్ను, జిజియా పన్ను రద్దుపరచబడ్డాయి. మొదటిది 1563లో, రెండవది 1564లో రద్దుపరచబడ్డాయి. దీనివల్ల కోశాగారానికి చాల నష్టమేర్పడింది; కాని ఇది హిందువులను చాలా తృప్తి పరచింది.
7. సంస్కృత భాషాధ్యయనం ప్రోత్సహించబడింది.
8. కొన్ని నిర్ణీత దినాలలో జంతు వధ నిషేధించబడింది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. రెండవ పానిపట్ యుద్ధం ఎందుకు ముఖ్యమైనది?

.....

.....

.....

.....

2. హల్దీఘాట్ యుద్ధ ఫలితాలేవి?

.....

.....

BRAOU

.....

.....

3. అక్బర్ మతవిధానపు రెండు ముఖ్య లక్షణాలను తెల్పండి.

.....

.....

.....

.....

3.3 జహంగీర్, 1605 - 1627

3.3.1 తొలి జీవిత దశ, సింహాసన మధిష్ఠించుట

ప్రసిద్ధ ముస్లిం మహా పురుషుడైన షేక్ సలీం చిష్టి దీవెనల ఫలితంగా 1569లో అక్బర్‌కు జహంగీర్ జన్మించాడు. ఆ మహాపురుషుని గౌరవార్థం మొదటగా జహంగీర్‌కు సలీమ్ అనే పేరు పెట్టబడింది. సలీంకు మురాద్, దన్యాల్ అనే ఇద్దరు సోదరులుండేవారు. వారు అక్బర్ బ్రతికి ఉండగానే గతించారు. అక్బర్ చివరి పాలనాసంవత్సరాలలో సలీమ్ తన తండ్రికి ఎదురుతిరిగాడు. తన తండ్రికి నమ్మిన స్నేహితుడు, సలహాదారు అయిన అబుల్ ఫజల్‌ను హత్య గావించాడు. అక్బర్ జహాంగీర్ కొడుకైన ఖుస్రూను తన వారసుడుగా చేయాలనే ఉద్దేశాన్ని ప్రకటించాడు. సలీం తండ్రికి లొంగిపోయాడు; అక్బర్ అతనిని క్షమించి, 1604లో అతనిని యువరాజుగా ప్రకటించాడు. అక్బర్ 1605లో మరణించాడు. అక్బర్‌కు మిగిలిన ఒకే ఒక కొడుకైన సలీం, నూరుద్దీన్ మహమ్మద్ జహంగీర్ అనే బిరుదుతో రాజైనాడు. అప్పటికతనికి ముప్పై ఆరేండ్లు.

3.3.2 సంస్కరణలు

సింహాసనాన్ని అధిష్ఠించిన వెంటనే, జహంగీర్ చాలా ప్రయోజనకరమైన సంస్కరణలను ప్రవేశపెడ్తూ అజ్ఞలు జారీ చేశాడు. వీటికి పండ్రెండు శాసనాలని పేరు. వీటిలో కొన్ని ముఖ్యమైన సంస్కరణలు. 1) ముక్కు, చెవులు ఖండించడం ద్వారా అంగవైకల్యం చేయడమనే క్రూరమైన శిక్షల రద్దు. 2) మత్తుపానీయాల, మత్తు మందుల నిషేధం 3) తంఘా, మీర్ బహర్ మొదలైన రవాణా పన్నుల, సుంకాల రద్దు. 4) కొన్ని ప్రకటిత దినాలలో జంతు వధ రద్దు 5) రహదారుల్లో ఉచిత వైద్యశాలల, మసీదుల, ధర్మశాలల నిర్మాణం. ప్రజలకు న్యాయాన్ని చేకూర్చడానికై జహంగీర్ బంగారు గొలుసు గల ఒక గంటను అమర్చాడు. గొలుసును లాగి, ఈ న్యాయగంటను మ్రోగించినవాని అభియోగాన్ని రాజు విని, న్యాయం చేకూర్చేవాడు.

జహంగీర్ పరిపాలనా కాలంలోని ప్రధాన విషయాలను ఈ క్రింద పేర్కొంటున్నాం.

3.3.3 ఖుస్రూ తిరుగుబాటు, 1606

జహంగీర్ సింహాసనాన్ని అధిష్ఠించిన కొన్ని నెలల తర్వాత, అతని పెద్ద కుమారుడైన ఖుస్రూ తిరుగుబాటు చేశాడు. ఖుస్రూ అందం, ఔన్నత్యం, వివేకం కలిగి ప్రజాభిమానాన్ని సంపాదించిన రాకుమారుడు; అతని మేనమామ అయిన రాజా మాన్‌సింగ్ ప్రోత్సాహంతో అతడు తండ్రికి ఎదురు తిరిగాడు. అతడు ఆగ్రా నుంచి బయలు దేరి లాహోర్‌ను ముట్టడించాడు; కానిఅతనికి విజయం లభించలేదు. జహంగీర్ అతనిని అతివేగంగా వెంబడించి ఓడించాడు. ఖుస్రూ కాబూల్ వైపు పారిపోయాడు. కాని అతడు వజీరాబాద్ వద్ద చీనాబ్ నదిని దాటుతుండగా పట్టుకోబడి జైలులో వేయబడ్డాడు. అతడు, అతని అనుచరులు బహిరంగంగా అవమానింపబడి,

అతి క్రూరంగా శిక్షింపబడ్డారు. నూర్జహాన్ చేత ప్రేరితుడైన ఖుర్రం (షాజహాన్), ఖుస్రూను 1622లో హత్య చేసినట్లు తెలుస్తుంది.

3.3.4 గురు అర్జున్‌ను ఉరిదీయుట

ఖుస్రూ తన తండ్రి బారినుంచి పారిపోతూ ఉండగా, శిక్కు గురువైన అర్జునదేవుడు అతనికి కొంత ధన సహాయం చేసి అతనిని దీవించి పంపాడు. దీనికై, జహంగీర్ ఆ గురువును చిత్రహింసలకు గురిచేసి ఉరి తీయించాడు (1606). అర్జునదేవుని ప్రాణత్యాగం శిక్కులను దూరం చేసి వారిని మొగల్ సామ్రాజ్యానికి శత్రువులుగా చేసింది.

3.3.5 నూర్జహాన్‌తో వివాహం

1611లో జహంగీర్, నూర్జహాన్ అనే అందమైన ఇరాన్ వనితను పెండ్లాడాడు. ఆమె మొదటి పేరు మెహరున్నీసా. జహంగీర్‌తో ఆమె వివాహం జరిగిన తర్వాత ఆమెను మొదట నూర్‌మహల్ (అంతఃపుర జ్యోతి) అని, ఆ తర్వాత నూర్జహాన్ (ప్రపంచజ్యోతి) అని పిలవడం జరిగింది.

నూర్జహాన్, మీర్జా ఘీయాస్ బేగ్ అనే పర్షియా దేశపు అమీర్ కూతురు. అతడు తన అదృష్టాన్ని వెదుక్కుంటూ వచ్చి, అక్బర్ ఆస్థానంలో ప్రవేశించి మొదట ఒక చిన్న మన్సబ్‌దార్ అయి, తరువాత కాబూల్ రాష్ట్రానికి దివాన్ అయ్యాడు. మెహరున్నీసా అక్బర్ ఆస్థానంలో ఉన్నప్పుడు, జహంగీర్ ఆమెను ప్రేమించాడు. ఈ విషయం తెలిసి అక్బర్ ఆమెను షేర్ ఆఫ్ఘన్ అనబడే అలీకులీ అనే ఆఫ్ఘన్ సర్దారునకిచ్చి పెండ్లిచేసి, అతనిని బర్ద్వాన్‌కు పాలకునిగా నియమించాడు. తరువాత కొద్దికాలం లోనే జహంగీర్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. షేర్ ఆఫ్ఘన్ ఒక ద్వంద్వయుద్ధంలో చంపబడ్డాడు. షేర్ ఆఫ్ఘన్ చనిపోయిన తర్వాత నాలుగేండ్లు మెహరున్నీసా జహంగీర్ వివాహ ప్రతిపాదనలను అంగీకరించలేదు. అటు తర్వాత చివరకు ఒప్పుకొని, 1611లో అతనిని వివాహమాడింది. రాణిగా ఆమెకు నూర్జహాన్ అనే పేరు ఇవ్వబడింది.

3.3.6 నూర్జహాన్ వ్యక్తిత్వం

నూర్జహాన్ విశేష ప్రజ్ఞాపాటవాలు, నిపుణతలతో కూడిన ప్రతిభా సంపన్నురాలు. ఆమెకు పారసీ సారస్వతమన్నా, కవిత్వమన్నా అభిమానం. స్వయంగా చక్కని కవిత్వమల్లగలదు. ఆమె ఎనలేని ధైర్య పరాక్రమాలు కలది. వేటాడుటలో మక్కువ కనపరచేది. వేటలో చాలాసార్లు ఆమె పులులను చంపింది. ఆమె దయగల స్త్రీ. అయిదువందల బీద, అనాథ ముస్లిం బాలికల పెండ్లి ఖర్చు భరించి, వారి పెండ్లిండ్లు జరిపించింది. ఆమెను మిక్కిలిగా ప్రేమించిన జహంగీర్ యెడల పతిభక్తి కలది. ఆమెకు బంధుప్రీతి ఎక్కువ. కాని ఆమెలో లోపాలు లేకపోలేదు. అధికార వ్యామోహం, గొప్పతనం మీద అత్యాశ, ఇతరుల ఉన్నతిని చూచి ఓర్వలేని తనం, ఆమెలోని లోపాలు.

3.3.7 నూర్జహాన్ ప్రభావం

వివాహమైన వెంటనే నూర్జహాన్ జహంగీర్‌ను శాసించి, అధికారాన్నంతా తన హస్తగతం చేసుకొంది. పేరుకు జహంగీర్ రాజైనా, రాజ్యాధికారాన్ని యదార్థంగా ఆమె చెలాయించసాగింది. నాణేల మీద జహంగీర్ పేరుతోపాటు తన పేరును కూడా వేయించింది. తన తండ్రికి, సోదరుడికి, ఉన్నతమైన బిరుదులు ఉన్నత పదవులు ప్రసాదింపచేసింది. ఆమె తండ్రి అయిన మీర్జాఘియాస్‌కు ఇతిమాదుద్దౌలా అనే బిరుదు, ఆమె సోదరునికి ఆసఫ్‌జా అనే బిరుదు ఇవ్వబడ్డాయి. ఆమె రాజకీయ ప్రభావం, రాజ్యానికి చెడుపు చేసింది. ఆమె ఆశిత పక్షపాతం, రాజకీయ కుట్రలు, రాకుమారుడైన ఖుర్రం (షాజహాన్), ప్రసిద్ధ సేనా నాయకుడైన మహబత్ ఖాన్ తిరుగుబాటు చేసేటట్లు చేశాయి. ఈ తిరుగుబాట్లు జహంగీర్ చివరి పాలనా వత్సరాలను కలుషితం చేశాయి. "నేను ఒక గిన్నెడు ద్రాక్షాపానానికి, ఒక పాత్ర మాంసానికి , నా రాజ్యాన్ని నా ప్రియమైన రాణికి

అమ్ముకొన్నా"నని జహంగీర్ తన స్మృతులలో విచారం వ్యక్తం చేశాడు. కాని, నూర్జహాన్ ప్రభావం, జహంగీర్‌కు కొంత మేలు కూడా చేసింది. ఆమె అతని క్రౌర్యాన్ని, త్రాగుబోతుతనాన్ని అదుపులో పెట్టింది.

జహంగీర్ మరణం తర్వాత నూర్జహాన్ అధికారం కోల్పోయింది. షాజహాన్ ఆమెకు ఉదారమైన జీవనోపాధి నేర్పాటుచేశాడు. ఆమె తన చివరి జీవితం లాహోర్‌లో గడిపింది. భర్త మరణం తర్వాత ఆమె పద్దెనిమిదేండ్లు జీవించి, 1645లో చనిపోయింది. ఆమెను లాహోర్‌కు సమీపంలోని షాదరావద్ద సమాధి చేశారు. "ఈ అసాధారణ వనితవలె ప్రాభవోపేతమైన ధైర్యం, రాజనీతిజ్ఞత కనపరచిన స్త్రీలు, ప్రపంచ చరిత్రలో అరుదు"అని ఈశ్వరీ ప్రసాద్ వ్రాసినారు.

3.3.8 జహంగీర్ యుద్ధాలు

3.3.8.1 మేవాడ్‌తో యుద్ధం, 1614

ప్రసిద్ధుడైన రాణా ప్రతాపసింహుని కుమారుడు, మేవాడ్ రాజైన రాణా అమర్ సింహుడు, జహంగీర్‌కు లొంగుటకు అంగీకరించలేదు. జహంగీర్ అతని మీదికి ఎన్నో సైన్యాలను పంపాడు. చివరకు, 1614లో రాకుమారుడైన ఖుర్రం అతనిని ఓడించగా అతడు లొంగిపోయాడు. కాని, జహంగీర్ అతనిని మిక్కిలి గౌరవంతో ఆదరించాడు. అమర్‌సింగ్ చక్రవర్తి ఆస్థానానికి స్వయంగా హాజరుకావలెనని బలవంత పెట్టలేదు. రాణా కుమారుడైన కర్ణునికీ చక్రవర్తి సైన్యంలో సైనికపరంగా ఉన్నత పదవి (మన్సబ్) ఇవ్వబడింది. అంతేకాక, జహంగీర్ రాణా యొక్క అతని కుమారుని యొక్క నిలువెత్తు విగ్రహాలను ఆగ్రాలోని దర్శన గవాక్షం క్రింద ప్రతిష్ఠించి వారిని గౌరవించాడు. ఈ విధంగా జహంగీర్ మొగలులకు, మేవాడ్‌కు మధ్యగల చిరకాల వైరాన్ని అంతమొందించాడు. ఈ విజయం అతనికి గర్వకారణమైంది. ఎందువల్ల ననగా, అక్బర్ కూడా మేవాడ్ రాజపుత్ర వంశాన్ని లొంగదీయడంలో విఫలుడయ్యాడు.

3.3.8.2 కాంగ్రా ఆక్రమణ 1620

1620లో రాకుమారుడు ఖుర్రం కాంగ్రాను జయించాడు. జహంగీర్‌కు ఈ విజయం కూడా గర్వకారణమైందే. ఎందువల్లననగా, అక్బర్ ఈ దుర్గాన్ని కూడా లొంగదీయలేకపోయాడు.

3.3.8.3 కాందహార్ నష్టపోవుట, 1622

అక్బర్ కాందహార్‌ను జయించాడు కాని, 1622లో ఇరాన్ రాజైన షా అబ్బాస్, కాందహార్‌ను తిరిగి జయించాడు. ఈ నగరం మొగల్ సామ్రాజ్యంలో లేకుండా పోయింది.

3.3.8.4 దక్కన్, అహమ్మద్‌నగర్‌తో యుద్ధం

1600లో జయింపబడ్డ అహమ్మద్‌నగర్ దాని ప్రధానమంత్రి అయిన అబిసీనియా దేశస్థుడు, మాలిక్ అంబర్ ఆధ్వర్యంలో 1610లో స్వాతంత్ర్యం ప్రకటించింది. ఈ రాజ్యాన్ని లొంగదీయవలసిందిగా జహంగీర్ ఖుర్రంను పంపాడు. అహమ్మద్‌నగర్ పతనమైంది. కాని, మొగలులచట తమ అధికారాన్ని స్థాపించలేకపోయారు.

3.3.9 ఐరోపావారితో జహంగీర్ సంబంధాలు

3.3.9.1. పోర్చుగీసువారితో

మొదట జహంగీర్‌కు పోర్చుగీసువారితో సత్సంబంధాలు ఉండినాయి. వారికి చక్రవర్తి వద్ద చెప్పుకోదగ్గ పలుకుబడి ఉండింది. కాని, పోర్చుగీసుల ఈ పలుకుబడి చాలాకాలం నిలువలేదు. వారి సముద్రపు దొంగతనం వల్ల వారు చక్రవర్తి అనుగ్రహాన్ని పోగొట్టుకున్నారు. ఫలితంగా, జహంగీర్ ఇంగ్లీసువారిని అభిమానించసాగాడు.

3.3.9.2 ఆంగ్లేయులతో

కొన్ని వ్యాపార హక్కులను కోరుతూ కెప్టెన్ విలియం హాకిన్స్ అనే నౌకాధిపతి, ఇంగ్లాండు రాజైన జేమ్స్ నుంచి ఒక ఉత్తరంతో 1608లో జహంగీర్‌ను దర్శించాడు. అతడు సూరత్ వద్ద ఒక కర్మాగారాన్ని నెలకొల్పడానికి జహంగీర్ నుంచి అనుమతి సంపాదించగలిగాడు. కాని, పోర్చుగీసుల కుట్రలవల్ల ఈ అనుమతి రద్దు చేయబడింది. అటు తర్వాత ఎడ్వర్డ్స్ అనే మరొక అంగ్లేయుడు, మొదటి జేమ్స్ నుంచి ఉత్తరంతో జహంగీర్‌ను దర్శించి అతనిచే ఆదరింపబడ్డాడు. హాకిన్స్, ఎడ్వర్డ్స్‌ల వ్యాపార దౌత్యాలను వెంబడించి, సాధికారంగా సర్ థామస్ రో రాజకీయ దౌత్యం నడిచింది.

సర్ థామస్ రో 1615లో ఆగ్రా చేరాడు. అతడు సమర్థుడు. కార్యదక్షుడైన రాజనీతిజ్ఞుడు. ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీకి కొన్ని హక్కులను సంపాదించడం అతని లక్ష్యం. అతడిచ్చట మూడేండ్లుండి, జహంగీర్ నుంచి సాధికారమైన సంధిరూపంలో కాకపోయినా కొన్ని హక్కులను సంపాదించగలిగాడు. ఆంగ్లేయులు సూరత్‌లో 'ఫ్యాక్టరీ' నెలకొల్పటానికి అనుమతిపొందారు. సర్ థామస్ రో రాసి పెట్టిన దినచర్యా గ్రంథం, భారతదేశంలో అతని అనుభవాలను గూర్చి మనకు తెలుపుతూంది.

3.3.10 ఖుర్రం తిరుగుబాటు

నూర్జహాన్‌కు షేర్ అఫ్ఘన్‌వల్ల కలిగిన కూతరు లాడ్లీబేగానికి, జహంగీర్ కనిష్ట పుత్రుడైన షార్యార్‌తో వివాహం జరిగింది. అందుచేత, నూర్జహాన్ తన అల్లుడైన షార్యార్‌కు సింహాసనాన్ని కట్టబెట్టాలని కుట్రలు చేయసాగింది. ఇది తెలిసి, రాకుమారుడైన ఖుర్రం (షాజహాన్) తిరుగుబాటు చేసి, సేనతో ఆగ్రామీదికి నడిచాడు. కాని, అతడు మహబత్‌ఖాన్‌చే ఓడింపబడి, దక్కన్‌కు పారిపోయి అచ్చట తన పాత శత్రువైన మాలిక్ అంబర్‌తో చేతులు కలిపాడు. 1625లో ఖుర్రం (షాజహాన్) తన తండ్రికి లొంగి, తన కుమారులైన దారా, ఔరంగజేబ్‌లను తన తండ్రివద్ద తాకట్టు ఉంచి రోహ్‌తాస్, ఆసీర్‌ఘడ్ దుర్గాలను అప్పగించాడు. కాని, అతడు మాత్రం తన తండ్రి మరణం వరకు దక్కన్‌లోనే ఉండిపోయాడు.

3.3.11 మహబత్‌ఖాన్ తిరుగుబాటు

మహబత్ ఖాన్, జహంగీర్ సైన్యాధిపతులలో సుప్రసిద్ధుడైనవాడు. మిక్కిలి ప్రాభవం, పలుకుబడి కలవాడు. అతని ప్రాభవాన్ని చూచి అసూయ చెందిన నూర్జహాన్ అతని ప్రాముఖ్యాన్ని తగ్గించవలెననుకొంది. అతనిపై ధనాపహరణ నేరం మోపి, సంజాయిషీకై పిలువనంపింది. మహబత్‌ఖాన్ పిలుపుకు విధేయుడై వచ్చాడు. కాని, అతని అనుమానాలు అతనికుండటంచేత అతడు నాల్గు లేదా ఐదువేల సైన్య సమేతంగా వచ్చి, కాబూల్‌కు పోతున్న జహంగీర్‌ను జీలం నదీతీరంలో పట్టుకొన్నాడు. కాని, కాబూల్‌లో నూర్జహాన్ తెలివిగా జహంగీర్‌కు విముక్తి కలిగించింది. మహబత్‌ఖాన్ దక్కన్‌కు పారిపోయి, అప్పటికే తిరుగుబాటు చేసిన రాకుమారుడు ఖుర్రంతో చేరాడు.

3.3.12 జహంగీర్ మరణం, 1627

జహంగీర్ చివరి రోజులు దుఃఖంతో, దురదృష్టంతో కలుషితమయ్యాయి. అతనికి తాగుడు అలవాటైంది. అతని చివరి సంవత్సరాలలో ఉబ్బసపు వ్యాధితో బాధపడ్డాడు. అతని రెండవ కుమారుడు, పర్వేజ్ అతనికంటే ముందు గతించాడు. మూడవ కుమారుడు ఖుర్రం బాహాటంగా తిరుగుబాటు చేశాడు. అతడు 1627లో మరణించాడు. లాహోర్ సమీపంలోని షాదరావద్ద అతనికి అందమైన సమాధి నిర్మించారు.

3.3.13 జహంగీర్ వ్యక్తిత్వం

జహంగీర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన పండితుడు. అతనికి భాషలలో, చరిత్రలో, భూగోళ శాస్త్రంలో, ప్రకృతి శాస్త్రంలో, చిత్రలేఖనంలో, బొమ్మలు గీయడంలో, సంగీతంలో, వాస్తుశాస్త్రంలో, తోటపనిలో ఆసక్తి

BRAOU

ఉండింది. అతడు మంచి వేటకాడు. ఖడ్గ విద్యా ప్రవీణుడు, **'తుజక్-ఇ-జహంగీర్'** అనే పేరుగల ప్రామాణికమైన అతని స్వీయ జీవితచరిత్ర అతని పాలనలో పందొమ్మిది సంవత్సరాలను గూర్చి మనకు తెలుపుతుంది. అద్భుతమైన అతని సజీవ వ్యక్తిత్వాన్ని గూర్చి ఇది మనకు తెలుపుతూంది. ఈ గ్రంథం నుంచి జహంగీర్ పరస్పర విరుద్ధ భావాలతో కూడిన వ్యక్తిత్వం కలవాడని తెలుస్తుంది.

జహంగీర్ మిక్కిలి ధర్మాత్ముడైన పాలకుడు. అతడు మంచి హృదయం, దయ కలిగినవాడు. కాని, అప్పుడప్పుడు అతడు మితిమీరిన కోపోద్రేకం చెంది, క్రూరమైన శిక్షలు విధించేవాడు. అతడు తాగుబోతు, కాని 'నిపుణుడైన తాగుబోతుగా' పేర్కొనబడ్డాడు.

జహంగీర్ సౌందర్యారాధకుడు. అతనికి తోటలంటే ఇష్టం. అతడు శ్రీనగర్ వద్ద గల **'షాలిమార్', 'నిషాత్'** తోటలను ఏర్పరచాడు. అతనికి వాస్తువులో కూడా ప్రీతి. సికందరా వద్ద గల అక్బర్ సమాధి, ఆగ్రా వద్ద గల ఇతిమాదుద్దౌలా సమాధి, లాహోర్‌లోని గొప్ప మసీదు అతడు నిర్మించిన కట్టడాలలో చెప్పుకోదగ్గవి.

3.4. షాజహాన్, 1627 - 1658

3.4.1 సింహాసన మధిష్ఠించుట

జహంగీర్ మరణించేనాటికి అతని పుత్రులిద్దరు జీవించి ఉన్నారు. వారు ఖుర్రం (షాజహాన్), షార్యార్‌లు. వీరిలో షార్యార్, నూర్జహాన్ అల్లుడు. ఖుర్రం, నూర్జహాన్ సోదరుడైన ఆసఫ్‌జా కూతురు ముంతాజ్ మహల్‌ను పెండ్లాడాడు. జహంగీర్ మరణించేనాటికి ఖుర్రం దక్కన్‌లో ఉండినాడు. తన అల్లుడు రాజ్యానికి రావలెనని అపేక్షించిన ఆసఫ్‌జా, అతనికి వేగంగా ఒక వార్తాహరుణ్ణి పంపాడు. ఖుర్రం వచ్చే లోపల గల మధ్యంతర కాలంలో ఖుస్రూ కుమారుడైన బులాకీ అనే మారు పేరుతో వ్యవహరింపబడే, దావర్ బక్ష్‌ను తాత్కాలికంగా సింహాసనం మీద కూర్చోపెట్టాడు. లాహోర్ లో తనను చక్రవర్తిగా ప్రకటించుకొన్న షార్యార్‌ను, ఆసఫ్‌బాజాన్ లాహోర్ వద్ద ఒక యుద్ధంలో ఓడించాడు. అతనిని పట్టుకొని గుడ్డివానిని చేసి, చెరసాలలో పెట్టాడు. ఇది జరిగిన తర్వాత నూర్జహాన్ రాజకీయ జీవితం నుంచి విరమించుకొంది. ఖుర్రం హుటాహుటిగా ఆగ్రాకు వచ్చి, షాజహాన్ అనే పేరుతో సింహాసనాన్ని అధిష్ఠించాడు.

3.4.2. ముంతాజ్‌మహల్ మరణం, 1631

షాజహాన్ ప్రేమకుపాత్రురాలైన అతని భార్య ముంతాజ్ మహల్, ఆసఫ్‌బాజాన్ కుమార్తె అని పైన చెప్పాం. 1613-1631 మధ్య, ఆమెవల్ల షాజహాన్‌కు ఎనిమిదిమంది కుమారులు, ఆర్గురు కుమార్తెలు కలిగారు. ఆమె అసలు పేరు ఆర్జ్‌మంద్ బేగం. ఆమెకు నవాబ్ ఆలియాబేగం అని, ముంతాజ్ మహల్ (అంతఃపుర ఆభరణం) అని బిరుదనామాలు. ఆమె సౌందర్యం, శీలసంపద, సామర్థ్యం, పతిభక్తి కలది. 1631లో బుర్హాన్‌పూర్‌లో ఆమె ప్రసవించి చనిపోయింది. ఆమె స్మృతి చిహ్నంగా ఆగ్రా వద్ద షాజహాన్ నిర్మించిన అద్వితీయ నిర్మాణం తాజ్‌మహల్, 1632లో ప్రారంభింపబడింది.

3.4.3 కరువులు

షాజహాన్ పాలనలోని తొలిఏండ్లలో (1630-1632), దక్కన్, గుజరాత్‌లలో తీవ్రమైన కరువులు సంభవించాయి. అవి చాలా ప్రాణాలను బలిగొని, జనులకు తీవ్రమైన అనర్థాన్ని కలిగించాయని, పీటర్ మండీ అనే ఇంగ్లీష్ యాత్రికుడు వ్రాశాడు. జనుల బాధలను ఉపశమనం చేయడానికిగాను షాజహాన్ ఎట్టి హృదయపూర్వక చర్యలు తీసుకోలేదు. షాజహాన్ ఆస్థానంలో ఉన్న అబ్దుల్ హమీద్ లాహోరీ అనే చరిత్రకారుడు *"చివరకు ఎట్టి దైన్యస్థితి ఏర్పడిందంటే, మనుషులు ఒకరినొకరు తినడం ప్రారంభించారు; పుత్ర ప్రేమ కన్నా, పుత్రుని మాంసం వాంఛనీయమైంది"* అని వ్రాశాడు.

BRAOU

3.4.4 దక్కన్ యుద్ధాలు, 1631-1636

షాజహాన్ రాజ్యానికి వచ్చిన తర్వాత అక్బర్, జహంగీర్ల వలెనే, దక్కన్ ఆక్రమణ విధానాన్ని మరల ప్రారంభించాడు. ఈ ప్రయత్నంలో అతడు సఫలుడయ్యాడు.

3.4.4.1 అహమ్మద్ నగర్ విలీనం

షాజహాన్ రాజ్యానికి వచ్చిన వెంటనే దక్కన్ పాలకుడుగా ఉన్న ఖాన్‌జహాన్ లోడీ తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటులో అహమ్మద్‌నగర్ సుల్తాన్ అతనికి సహాయం చేశాడు. కాని మూడేండ్ల తర్వాత 1631లో ఖాన్‌జహాన్ లోడీ ఓడింపబడి, చంపబడ్డాడు.

ఆ తర్వాత షాజహాన్ తన దృష్టిని దక్కన్ వ్యవహారాల వైపు మళ్ళించాడు. అహమ్మద్‌నగర్ సుల్తానైన నిజాంషా, ఖాన్‌జహాన్ లోడీకి సహాయం చేశాడని పైన పేర్కొన్నాం. ఈ కారణంగా అహమ్మద్ నగర్‌పై యుద్ధం ప్రకటింపబడి, అది 1633లో మొగల్ సామ్రాజ్యంలో చేర్చబడింది. రెండేండ్ల తర్వాత దానికి స్వాతంత్ర్యం సంపాదించటానికై, శివాజీ తండ్రి అయిన షాజీ ఒక ప్రయత్నం చేశాడు కాని, అది విఫలమైంది. కడకు, 1636లో నిజాంషాహి రాజ్యం మొగలుల చేత జయింపబడింది.

3.4.4.2 బీజాపూర్, గోల్కొండలు లొంగిపోవుట

అహమ్మద్ నగర్‌ను గెలిచిన తర్వాత షాజహాన్ తన దృష్టిని షియా ముస్లిం రాజ్యాలైన బీజాపూర్, గోల్కొండల వైపు మరల్చాడు. వాటిని, తనను అధిపతిగా గుర్తించి సక్రమంగా కప్పం కట్టమన్నాడు. గోల్కొండ లొంగిపోయి కప్పం కట్టడానికి ఒప్పుకొంది. కాని, బీజాపూర్ కొంతకాలం దీనికి ఒప్పుకోక ప్రతిఘటించింది. అందుకు మొగల్ సేనలు ఆ రాజ్యాన్ని నిర్దయగా కొల్లగొట్టాయి. బీజాపూర్ సుల్తాన్ కూడా లొంగిపోయాడు. తర్వాత షాజహాన్, 1686లో పద్దెనిమిదేండ్ల యువకుడైన ఔరంగజేబ్‌ను మొగలుల క్రింద ఉన్న దక్కన్ సంతా రాజ ప్రతినిధిగా నియమించాడు. మొగలుల క్రింది దక్కన్‌లో ఖాందేష్, బీరార్, తెలంగాణా, దౌలతాబాద్ అనే రాష్ట్రాలు ఉండేవి.

అటు తర్వాత ఇరవై ఏండ్లు దక్కన్‌లో శాంతి నెలకొంది. కాని, 1656లో మరలా యుద్ధం ఏర్పడింది. కొంత స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించడానికి గోల్కొండ ప్రధాన మంత్రి మీర్ జుమ్లా యత్నించాడు. గోల్కొండ సుల్తాన్ మీర్ జుమ్లా కుమారుడిని చెరపట్టాడు. మీర్‌జుమ్లా ఈ విషయంలో ఔరంగజేబ్ సహాయ మపేక్షించాడు. ఫలితంగా యుద్ధమేర్పడి ఔరంగజేబ్ గోల్కొండను ముట్టడించాడు. కాని, మీర్‌జుమ్లా కుమారుడు చెరసాల నుంచి విముక్తుడవ్వడం మినహా, మరేమీ జరుగలేదు. అదే సంవత్సరం (1656), బీజాపూర్ రాజ్యంలో ఏర్పడిన అల్లర్ల కారణంగా బీజాపూర్ మీద కూడా దండయాత్ర జరిగింది. కాని, ఔరంగజేబ్ ఢిల్లీ సింహాసనానికై ఏర్పడిన వారసత్వ యుద్ధంలో పాల్గొనడానికై వెళ్లవలసి రావడంతో బీజాపూర్ ముట్టడిని మానుకోవలసి వచ్చింది.

3.4.5 పోర్చుగీసువారితో సంబంధాలు

పోర్చుగీసులు హుగ్లీ వద్ద ఒక ఫ్యాక్టరీని స్థాపించారు. వీరు హిందూ, ముస్లిం పిల్లలను ఎత్తుకపోయి, వారిని బలవంతంగా క్రైస్తవమతంలో చేరుస్తుండినారు. క్రూరమైన బానిస వ్యాపారం కూడా చేస్తూ ఉండినారు. ముంతాజ్ మహల్ వద్ద ఉన్న ఇద్దరు బాలికలను గూడా నిర్బంధించి, ఆమెకు ఆగ్రహం తెప్పించేటంత దురుసుగా ప్రవర్తించారు. షాజహాన్ వారిని శిక్షించ నిర్ణయించి, బెంగాల్‌ను పాలించుచున్న కాసింఖాన్‌ను, హుగ్లీని ముట్టడించవలసిందిగా ఆజ్ఞాపించాడు (1632). పోర్చుగీసులు ముట్టడిని ధైర్యంగా ప్రతిఘటించారు కాని, చివరకు ఓడిపోయారు.

BRAOU

3.4.6 మధ్యఆసియా విధానం

తన తాత, తండ్రుల వలెనే షాజహాన్‌కు కూడా, బదక్షాన్ పర్వత ప్రాంతం మీద, ఇంకా దూరంగా హిందూకుష్ పర్వతాలకు, ఆక్సస్‌నదికి మధ్యన ఉన్న బల్ఖ్ రాష్ట్రం మీద సంపూర్ణాధికారం వహించాలని తీవ్రమైన కోరిక ఉండింది. సాధ్యపడితే "ట్రాన్స్ ఆక్సియానా"ను, దాని రాజధాని అయిన సమర్ఖండ్‌ను కూడా పాలించాలనే కోరిక మొగల్ చక్రవర్తులకుండేది. వారిలోని అంతఃకలహాలవల్ల, అచ్చటి ఉజ్‌బెగ్ పాలకులు షాజహాన్ జోక్యాన్ని అర్థించారు. ఫలితంగా 1646లో, రాకుమారుడైన మురాద్ బక్ష్ అలీ, మర్దాన్ ఖాన్‌తో కలసి బదక్షాన్‌ను, బల్ఖ్‌ను వశపరచుకొన్నాడు. కాని, 1647లో ఉజెబ్‌గ్ పాలకుడు, పర్షియా సహాయంతో మొగల్ సేనలు బల్ఖ్‌ను విడిచిపోయేటట్లు చేశాడు.

3.4.7 కాందహార్

కాందహార్‌నగరం సైనికపరంగా అది ఉన్న కీలక స్థానాన్ని బట్టి పర్షియా, భారతదేశాల మధ్యగల వర్తక మార్గంలో ఉండడంవల్లా దానికి గల ప్రాముఖ్యాన్ని బట్టి పర్షియా, భారతదేశ చక్రవర్తులిరువురూ దానిని పొందాలని వాంఛించారు. కొన్ని సంవత్సరాలు హుమాయూన్ వశంలో ఆ నగరం ఉండింది. అక్బర్ దానిని 1595లో జయించాడు. కాని, దానిని జహంగీర్ పాలనాకాలంలో 1622లో పర్షియా చక్రవర్తి షా అబ్బాస్ తిరిగి జయించాడు. షాజహాన్ మరల దానిని పట్టుకోదలచాడు. పర్షియన్ చక్రవర్తి తరపున కాందహార్ రాష్ట్ర పాలకుడు ఉన్న అలిమర్దాన్ ఖాన్‌కు కొన్ని కారణాలవల్ల చక్రవర్తి అయిన షా అబ్బాస్‌తో అసంతృప్తి ఏర్పడింది. అందువల్ల, అతడు 1638లో ఆ నగరాన్ని లక్షరూపాయలకు షాజహాన్ వశం చేసి, అతని వద్ద లాభదాయకమైన అధికార్ల పదవిని సంపాదించాడు. కాని, 1649లో పర్షియన్లు తిరిగి ఆ నగరాన్ని లొగొన్నారు. షాజహాన్ దానిని మరల వశం చేసుకోడానికై, రాకుమారుడైన ఔరంగజేబ్ నాయకత్వాన ఒకటి, రాకుమారుడు దారాషుకో నాయకత్వాన మరొకటి, రెండు దండయాత్రలు పంపాడు. కాని, విజయం చేకూరలేదు. షాజహాన్ కాలంలో జరిగిన ఈ మూడు దండయాత్రలకు పండ్రెండు కోట్ల రూపాయలు, అంటే మొత్తం సామ్రాజ్య సాంవత్సరిక ఆదాయంలో సగంపైన ఖర్చయింది. మొగల్ సామ్రాజ్యం కాందహార్‌వల్ల శాశ్వతంగా నష్టపోయింది. కాందహార్‌ను మరలా పట్టుకోలేకపోవడంలో మొగల్ సైన్యం బలహీనత వ్యక్తమైంది.

3.4.8 వారసత్వ యుద్ధం, 1657-58

1657 సెప్టెంబర్‌లో షాజహాన్ ఆగ్రాలో తీవ్రంగా జబ్బునపడ్డాడు. అప్పుడతనికి అరవై అయిదేండ్లు. అతడు తిరిగి కోలుకోడనే శంక ఏర్పడింది. అతని పుత్రులలో పెద్దవాడు, యిష్టుడు అయిన దారాషుకో అతని పక్షనే ఉండినాడు. షుజా బెంగాల్‌లో ఉండినాడు ఔరంగజేబ్ దక్కన్‌లో, అందరికంటే చిన్నవాడైన మురాద్ గుజరాత్‌లో ఉండినారు. అందరు సోదరుల అధీనంలో పెద్ద సైన్యాలు ఉండినాయి. అటు తర్వాత ఏర్పడిన వారసత్వ యుద్ధంలో ఔరంగజేబ్ దారాషుకోను 1658 మే 29న, సమూఘర్ యుద్ధంలో ఓడించాడు.

జూన్ 8న ఔరంగజేబ్ అగ్రాను ఆక్రమించాడు. తన తండ్రిని సింహాసనం నుంచి తొలగించి, ఎనిమిదేండ్ల తర్వాత అతని మరణం వరకు, జీవితాంతం అతనిని ఖైదులో ఉంచాడు. షాజహాన్ ఖైదులో ఉన్నప్పుడు, అతని కూతురైన జహనారా మాత్రమే అతనికి సపర్యలు చేసింది. తర్వాత ఔరంగజేబ్ మురాద్‌ను వంచించి, 1661లో అతనిని గ్వాలియర్‌లో ఉరితీయించాడు. అతను షుజాను 1659, జనవరిలో అలహాబాద్ దగ్గర ఖజ్వా అనేచోట ఓడించాడు. ఔరంగజేబ్ యొక్క సేనాధిపతి, మీర్ జుమ్లా బర్మాలోని అరకాన్ వరకు అతనిని వెంట తరిమాడు, ఆ పైన అతనిని గూర్చి ఏమి తెలియదు. కాందిశీకుడై పారిపోవుచున్న దారాను వెనుదరిమి, బోలాన్ కనుమ వద్ద పట్టుకొన్నారు. దారాను చిరిగిన గుడ్డలు ధరింపజేసి, ఒక బక్కచిక్కిన ఏనుగు మీద ఢిల్లీపుర వీధులలో ఊరేగించారు. ఆపైన అతనిని "కాఫిర్" అని ప్రకటించి, ఉరితీశారు. ఈ విధంగా ఔరంగజేబ్ తన తండ్రి సింహాసనాన్ని ఆక్రమించాడు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. జహంగీర్ సాధించిన రెండు ఘనకార్యాలను తెల్పండి.

.....

.....

.....

.....

2. జహంగీర్ కాలంలో నూర్జహాన్ పాత్ర ఎటువంటిది?

.....

.....

.....

.....

3. షాజహాన్ దక్కన్ విధానం లక్ష్యమేది?

.....

.....

.....

.....

4. షాజహాన్ కాలంలో వారసత్వ యుద్ధం ఎందుకు జరిగింది?

.....

.....

.....

.....

BRAOU

3.5 ఔరంగజేబ్, 1658-1707

3.5.1 రెండవ సారి పట్టాభిషేకం

ఆగ్రా, ఢిల్లీల నాక్రమించిన వెంటనే ఔరంగజేబ్ 1658 జూలై 21న ఒకసారి సింహాసన మధిష్టించాడు. 1659 జూన్‌లో సర్వరాజలాంఛనాలతో, మరలా రెండవసారి పట్టాభిషేకం జరిపించుకొన్నాడు. 'ఆలంగీర్' ప్రపంచ విజేత అనే బిరుదంతో సింహాసనాన్నధిష్టించిన ఔరంగజేబ్ గొప్ప మొగల్ చక్రవర్తులలో చివరివాడు. సింహాసనాన్నధిష్టించేటప్పటికి, ఔరంగజేబ్‌కు ముమారు నలభై ఏండ్ల వయస్సు. అతడు 1658 నుంచి 1707 వరకు అంటే ముమారు యాభై ఏండ్లు పరిపాలించాడు.

3.5.2 ఔరంగజేబ్ పాలనలోని రెండు విభాగాలు

ఔరంగజేబ్ పరిపాలనా కాలాన్ని, ఒక్కొక్క దశను ఇరవై అయిదేండ్ల చొప్పున, సమానమైన రెండు దశలుగా విభజించవచ్చు. ఇందులోని 1658 నుంచి 1681 వరకు గల మొదటి దశలో, ఉత్తర భారతదేశంలో

ఉన్న రాజకీయ సంఘటనలవల్ల యుద్ధాలవల్ల, ఔరంగజేబ్ దక్కన్‌పై ఎట్టి శ్రద్ధచూపలేదు. 1682 నుంచి 1707 వరకు గల రెండవ దశలో, షియా ముస్లిం రాజ్యాలైన బీజాపూర్, గోల్కొండ రాజులతో, మరాఠాలతో పోరాడుతూ దక్కన్‌లోనే గడిపాడు. ఈ దశలో, ఉత్తర భారతదేశంలో అరాచక పరిస్థితి ఏర్పడింది.

3.5.3 ఉత్తరదేశంలో సంఘటనలు, 1658-1681

3.5.3.1 అస్సాంపై దండయాత్ర, 1661-63

షుజా పారిపోయిన తర్వాత ఔరంగజేబ్ మిక్కిలి సమర్థులైన మొగల్ సైన్యాధ్యక్షులలో ఒకడైన మీర్ జుమ్లాను బెంగాల్ రాష్ట్ర పాలకునిగా నియమించాడు. కూచ్ బీహార్ రాజు, అస్సాంలోని అహోంరాజు, అస్సాంలోని కొంత మొగల్ ప్రాంతాన్ని ఆక్రమించటం కారణంగా, మీర్ జుమ్లా అస్సాం మీద దండెత్తినాడు. తర్వాత కొద్దికాలంలోనే మీర్ జుమ్లా గాసిచెంది, గొట్టుపడి, 1663లో మరణించాడు. 1681లో గౌహతిని నష్టపోవడం జరిగింది; కాని కూచ్ బీహార్ మాత్రం శాశ్వతంగా ఆక్రమింపబడింది.

3.5.3.2 అరకాన్ ఆక్రమణ, 1666

మీర్‌జుమ్లా మరణం తర్వాత ఔరంగజేబ్ మేనమామ అయిన షాయిస్తాఖాన్ బెంగాల్ గవర్నర్‌గా నియమితుడైనాడు. అతడు అరకాన్‌ను ఆక్రమించి, సోన్‌దీప్ అనే ద్వీపాన్ని పోర్చ్‌గీస్ నుంచి స్వాధీనపర్చుకొన్నాడు. అతడు అరకాన్ రాజును ఓడించి, చిట్టాగాంగ్‌ను తన రాష్ట్రంలో కల్పుకొన్నాడు.

3.5.3.3 శివాజీతో యుద్ధం, 1663-1680

ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో, సమర్థవంతమైన శివాజీ నాయకత్వంలో దక్కన్‌లో మరాఠాలు బలపడ్డారు. శివాజీ మొగల్ ప్రాంతం కొంత ఆక్రమించాడు. అపకారాన్ని కలిగించే శివాజీ చర్యలను అరికట్టడానికి గాను షాయిస్తఖాన్ దక్కన్ రాష్ట్ర పాలకుడుగా పంపబడ్డాడు. కాని శివాజీ, అతడు పూనాలో ఉన్నప్పుడు ఒకరాత్రి ఉన్నట్టుండి అతనిమీద దాడిచేశాడు. షాయిస్తఖాన్, ఈ సందర్భంలో మూడువేళ్లను తన కుమారుడిని పోగొట్టుకొని చావు తప్పించుకొని బయటపడ్డాడు. దీని తర్వాత రాకుమారుడైన మౌజం, అంబర్ రాజైన జయసింహుడు శివాజీ పైకి పంపబడ్డారు. ఆగ్రాలో ఔరంగజేబ్ ఆస్థానానికి వచ్చేటట్లు, జయసింహుడు శివాజీని కొన్ని షరతుల మీద ఒప్పించాడు. కాని, శివాజీ ఆస్థాన మర్యాదలు పాటించలేదు. దానిమీదట, ఔరంగజేబ్ అతనిని గృహనిర్బంధంలో ఉంచాడు. శివాజీ తెలివిగా తప్పించుకొని దక్కన్ చేరగలిగాడు. శివాజీ మొగలుల మీద యుద్ధాలు కొనసాగించి తన కోటలను చాలావాటిని తిరిగి గెల్చుకున్నాడు. శివాజీ 1680లో చనిపోయాడు.

3.5.3.4 జాట్‌ల తిరుగుబాటు, 1669

1669 మొదట్లో, రాజధానికి సమీపంలో ఉన్న మధుర జిల్లాలోని జాట్‌లు వ్యవసాయదారులు. గోకుల్ అనే అతని నాయకత్వం క్రింద తిరుగుబాటు చేసి, మధుర ఫౌజ్‌దార్‌ను చంపివేశారు. ఫౌజ్‌దార్ యొక్క హింసాపూరిత విధానాన్ని వారు భరించలేకపోయారు. ఈ తిరుగుబాటు అణచబడి గోకుల్ చంపబడ్డాడు, కాని, జాట్‌లు ఔరంగజేబ్ పరిపాలనా కాలమంతా, ఔరంగజేబ్‌కు కష్టం కల్గిస్తూ ఉండినారు. అతని మరణం తర్వాత కూడా వారు మొగల్ సామ్రాజ్యానికి విపత్తుగా తయారయ్యారు. వారు 1681లో, 1683లో తిరుగుబాటు చేశారు.

3.5.3.5 సత్నామీల తిరుగుబాటు, 1672

హిందువులలో ఒక తెగకు చెందినవారు సత్నామీలు. వారు ఢిల్లీకి దగ్గరగా ఉన్న నార్నాల్‌లో నివసించేవారు. వారి సంఖ్య సుమారు నాల్గు లేదా అయిదువేలు ఉండేది. వారు మత ప్రధానమైన జీవన విధానం అనుసరిస్తూ కొంత వ్యవసాయాన్ని, వ్యాపారాన్ని కూడా చేస్తూ ఉండేవారు. ఒక ప్రభుత్వ పన్ను వసూలు అధికారి వారిలో ఒకరిని అవమానించినందువల్ల వారు 1672లో తిరుగుబాటు చేశారు. మొదట కొంత విజయం సాధించినా, వారు తర్వాత పెద్దఎత్తున వధింపబడి, అణగత్రొక్కబడ్డారు.

DRAOU

3.5.3.6 తేజ్‌బహదూర్ ప్రాణత్యాగం, 1676

సిక్కుల తొమ్మిదో గురువైన తేజ్ బహదూర్ ఆనంద్‌పూర్ సాహిబ్‌లో ఉండేవాడు. అతడు ఔరంగజేబ్ హిందూమత వ్యతిరేక విధానం యెడల తన నిరసన తెలిపాడు. ఇస్లాంమతాన్ని స్వీకరించడానికి ఒప్పుకోనందువల్ల, అతడు 1675లో ఉరితీయబడ్డాడు. అతని కుమారుడైన గురుగోవిందసింగ్ సిక్కుల నొక సైనిక వ్యవస్థగా రూపొందించి తన జీవితాంతం మొగలులతో పోరాడాడు. అతడు వీరోచితంగా పోరాడి, తన నల్గురు పుత్రులను పోగొట్టుకొని, తన దృఢనిర్ణయం నుంచి మరలలేదు.

3.5.3.7 జిజియా పన్ను విధించుట, 1679

ఔరంగజేబ్ స్థిరమైన సున్నీ ముస్లిం. అందుచేత 1679లో అతడు అక్బర్ రద్దుచేసిన జిజియా పన్నును, మరలా హిందువులమీద విధించాడు. దీనిని హిందువులు చాలా నిరసించారు.

3.5.3.8 రాజపుత్రులతో యుద్ధం, 1679-81

ఔరంగజేబ్ మతవిధానంతో రాజపుత్రులు అసంతృప్తి చెందారు. అతడు కూడా వారిని శత్రువులుగా పరిగణించాడు. అతడు రాజపుత్ర రాజ్యాలలో ప్రముఖ రాజ్యమైన మార్వార్‌ను జయించదలచాడు. దానికి త్వరలోనే అవకాశ మేర్పడింది.

పంజాబ్ సరిహద్దుల మీద ఔరంగజేబ్ సైన్యాధ్యక్షుడుగా నియమించిన మేవాడ్ రాజైన రాజా జస్వంత్‌సింగ్ 1678లో చనిపోయాడు. ఔరంగజేబ్ పాలకుడైన జస్వంత్‌సింగ్ కుమారుడు అజిత్‌సింగ్‌ను, జస్వంత్ సింగ్ భార్యను ఢిల్లీలో నిర్బంధించాడు. బాలకులైన జస్వంత్‌సింగ్ కుమారు లిద్దరినీ, ముస్లింలుగా పెంచి పెద్ద చేయవలెనని ఔరంగజేబ్ తలపెట్టాడు. ఈ పని రాజపుత్రులను ఆగ్రహపూరితులను చేసింది. అంతేకాక, 1679లో తిరిగి విధించిన జిజియాపన్ను వారిని మరీ ఆగ్రహపూరితులను చేసింది. చివరకు రాజపుత్రుల, మొగలుల మధ్య యుద్ధం సంభవించింది.

మార్వాడ్, మేవాడ్, మరి ఇతర రాజపుత్ర రాజ్యాలు తమ బలాలను ఒకటిగా చేర్చాయి. ఔరంగజేబ్ ముగ్గురి పుత్రులచేత నడుపబడ్డ మొగల్ సేనలు చాలా మార్లు తీవ్రంగా ఓడిపోయాయి. అటుపైన ఔరంగజేబ్ తన నాల్గవ కుమారుడైన అక్బర్‌ను రాజపుత్రుల మీదికి పంపాడు. కాని, రాజపుత్రుల సహాయంతో సింహాసనం సంపాదించ తలపెట్టిన అక్బర్ వారితో చేరి, తన తండ్రి కెదురుగా ఒక పెద్ద సైన్యంతో అజ్మీర్ మీద దండెత్తాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు. ఒక నకిలీ ఉత్తరం ద్వారా అక్బర్ నిజాయితీ మీద రాజపుత్రులకు అనుమానం వచ్చేట్లు చేసి, ఔరంగజేబ్ రాజపుత్రులను అక్బర్‌కు దూరం చేశాడు. రాజపుత్రులు అక్బర్‌ను వదలివేయడంతో అతడు ఇరాన్‌కు పారిపోయాడు. చివరకు 1681లో మేవాడ్‌తో ఔరంగజేబ్ సంధిచేసుకొన్నాడు. కాని, మార్వాడ్ ఔరంగజేబ్ పరిపాలనా కాలమంతా మొగలులతో పోరాడుతూనే ఉండింది. రాజపుత్రులు వారి చిరకాల నాయకుడైన దుర్గాదాస్ రాథోడ్ నాయకత్వంలో సుమారు ముప్పై సంవత్సరాలు "గెరిల్లా" (బందిపోటు) యుద్ధం కొనసాగించారు. చివరకు 1709లో ఔరంగజేబ్ వారసుడైన బహదూర్‌షా, అజిత్‌సింగ్‌ను మార్వాడ్ స్వతంత్ర పాలకునిగా గుర్తించాడు.

రాజపుత్రులతోటి యుద్ధం మొగల్ సామ్రాజ్యానికి మిక్కిలి హానికరమైనది. అప్పటి నుంచి రాజపుత్రులు మొగల్ సామ్రాజ్యానికి పగబట్టిన శత్రువులైనారు. అక్బర్ కాలం నుంచి కొనసాగిన మొగల్-రాజపుత్ర మైత్రి శాశ్వతంగా విచ్ఛిన్నమైపోయింది. ఫలితంగా ఔరంగజేబ్ తన దక్కన్ యుద్ధాలను వారి హృదయపూర్వక సహాయం లేక పోరాడవలసి వచ్చింది. దీనివల్ల చాలా హాని జరిగింది.

DRAOU

3.5.4 దక్కన్ విధానం, 1682-1707

రాజపుత్రులతో యుద్ధం పరిసమాప్తి చెందిన తర్వాత, ఔరంగజేబ్ దక్కన్‌ను లొంగదీయడానికై తన శక్తినంతా వినియోగించాడు. ఈ లక్ష్యంతో అతడు 1682లో దక్కన్ మీదికి నడచి, తన జీవితంలోని చివరిఇరవై ఆరేండ్లు అక్కడే గడిపాడు. అతడు మరలా ఢిల్లీ తిరిగి రావడమనేది జరగలేదు. దక్కన్‌కు పోవడంలో అతనికి మూడు లక్ష్యాలు ఉండినాయి. అవి :-

1. గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలను మట్టుపెట్టడం.
2. ప్రవర్ధమాన మవుతున్న మరాఠాల దౌర్జన్యాన్ని అణచడం
3. తన కెదురు తిరిగి దక్కన్‌లో ఉన్న తన కుమారుడు అక్బర్‌వల్ల ఏర్పడిన ఆపదను తొలగించడం.

3.5.4.1 బీజాపూర్, గోల్కొండ ఆక్రమణ

అనేక కారణాలు ఔరంగజేబ్‌ను ఈ రాజ్యాలమీద యుద్ధానికి పురికొల్పాయి. అవి 1) ఈ రాజ్యాలు మరాఠాలకు సహాయపడుతుండినాయి. 2) ఔరంగజేబ్ స్థిరమైన సున్నీ ముస్లిం; ఈ రాజ్యాలు షియా ముస్లిం రాజ్యాలు. 3) ఔరంగజేబ్ రాజ్య విస్తరణ కాంక్ష.

మొదట్లో ఔరంగజేబ్ తన కుమారుడు ఆజంను బీజాపూర్ జయించమని పంపించాడు. కాని, ఆజంకు ఎట్టి విజయం చేకూరలేదు. అందుచేత ఔరంగజేబ్ తానే స్వయంగా దక్కన్‌కు పోయి బీజాపూర్‌ను ఒక సంవత్సరానికి మించి ముట్టడి చేసి, దానిని పస్తు పెట్టి, 1686లో లొంగతీశాడు. దాని పాలకుడు సికందర్‌షాకు జీవనోపాధి ఏర్పాటుచేసి, బీజాపూర్‌ను మొగల్ సామ్రాజ్యంలో చేర్చివేశాడు.

1687లో, గోల్కొండను ముట్టడించాడు. గోల్కొండ సుల్తాన్, అబుల్ హసన్ వీరోచితంగా పోరాడి, ఔరంగజేబ్ సైన్యానికి తీవ్ర నష్టాన్ని కలిగించాడు. ముట్టడిని గోల్కొండ సైన్యాధ్యక్షుడూ, వీరుడైన అబ్దుల్ రజాక్ మిక్కిలి పరాక్రమంతో ప్రతిఘటించాడు. చివరకు దుర్గాన్ని పట్టుకొనే అన్ని ఆశలు ఉడిగిపోగా, ఔరంగజేబ్ దుర్గ ద్వార రక్షకుడికి లంచమివ్వగా, అతడు ఒక రాత్రి దుర్గ ద్వారాలు తెరిచాడు. అబ్దుల్ రజాక్ చివరి వరకు పోరాడి, డెబ్భై గాయాలతో యుద్ధభూమిలో పడిపోయి, బందీ అయినాడు. ఔరంగజేబ్, గోల్కొండ సుల్తాన్ అబుల్ హసన్‌కు జీవనోపాధి కల్పించి, అతనిని దౌలతాబాద్ దుర్గానికి పంపించివేశాడు. గోల్కొండను మొగల్ సామ్రాజ్యంలో చేర్చాడు. ఈ దక్కన్ ముస్లిం రాజ్య ఆక్రమణ, మరాఠా బలాన్ని పెంపొందించింది; వారు మునుపటి కన్నా ధైర్యంగా మొగల్ ప్రాంతాలను కొల్లగొట్టడం ప్రారంభించారు.


3.5.4.2 మహారాష్ట్రులతో యుద్ధం

బీజాపూర్, గోల్కొండ రాజ్యాల ఆక్రమణ తర్వాత ఒక్క మహారాష్ట్రులు మాత్రమే ఔరంగజేబ్ భారతదేశాని కంతా ఏకచ్ఛత్రాధిపతి కావడానికి అడ్డంగా నిలిచారు. అందుచేత ఔరంగజేబ్ తన దృష్టిని మహారాష్ట్రుల వైపు మరల్చి వారి ప్రాభవాన్ని పడగొట్టడానికి వారితో సుమారు ఇరవై ఏండ్లు యుద్ధం చేశాడు. కాని మహారాష్ట్రుల 'గెరిల్లా' (బందిపోటు) యుద్ధపు టెత్తులు ఔరంగజేబుకు ఎట్టి విజయం దక్కనీయలేదు.

శివాజీ 1680లో మరణించాడు. శివాజీ తర్వాత రాజ్యానికి వచ్చిన అతని కుమారుడు శంభాజీ, వీరుడే కాని భ్రష్టశీలుడు. అతడు మొగలులతో పోరి కొంత విజయం సాధించాడు; కాని 1689లో వారికి పట్టుబడి వధించబడ్డాడు. అటు తర్వాత మొగలులు, మహారాష్ట్రుల బలిష్టమైన దుర్గమైన రాయ్‌ఘడ్‌ను, శంభాజీ పుత్రుడైన సాహూతో సహా పట్టుకొన్నారు. ఔరంగజేబ్ సాహూను బంధించాడు. మహారాష్ట్రుల బలం బాగా దెబ్బతింది. ఔరంగజేబ్ తన లక్ష్యసాధనలో కృతకృత్యుడయ్యేటట్లు కనపడింది. కాని, అది జరుగలేదు. పోగా, అది అతనికి నాంది అయింది.

BRAOU

మహారాష్ట్రులు శంభాజీ తమ్ముడైన రాజారాం నాయకత్వంలో తమ పోరాటం కొనసాగించి, మొగలులకు చాలా నష్టం కల్పించారు. రాజారాం 1700లో మరణించిన తర్వాత, అతని భార్య తారాబాయ్ మిక్కిలి సామర్థ్యంతో మహారాష్ట్రులకు నాయకత్వాన్ని వహించి, పోరాటాన్ని విజయవంతంగా కొనసాగించింది.



3.5.4.3 దక్కన్ దండయాత్ర ఫలితాలు

దక్కన్ దండయాత్రలు మొగల్ సామ్రాజ్యానికి తీరని హానిని కలిగించాయి. చిరకాలం కొనసాగిన యుద్ధాలు సైన్యాన్ని, ఆర్థిక స్థితిని బలహీన పరచాయి. ఉత్తర భారత దేశంలో శిక్కులు, జాట్‌లు తిరుగుబాట్లు చేశారు. రాష్ట్ర పాలకులకు కేంద్రాధికారమంటే లక్ష్యం లేకుండా పోయింది. పరిపాలనా పటిష్టత సన్నగిల్లి, చెడిపోయింది. సామ్రాజ్యం ఒకే ఒక వ్యక్తి అదుపులో ఉంచలేనంతగా పెరిగిపోయింది. ఔరంగజేబ్ ఎవ్వరినీ నమ్మక, ఈ మహా సామ్రాజ్య వ్యవహారాలన్నీ తానే స్వయంగా చూడడానికి ప్రయత్నించాడు. జాదునాథ్ సర్కార్ మాటలలో *"దక్కన్ పుండు ఔరంగజేబ్‌ను నాశనం చేసింది"*.

రెండు కారణాలవల్ల, మహారాష్ట్రులపై ఔరంగజేబ్ నడిపిన సుదీర్ఘ దండయాత్ర విఫలమైంది. 1) మొగల్ సైన్యం బలహీనమై సుఖాన్ని కోరసాగింది; అంతేకాక, దానిలో సంక్షోభమేర్పడింది. 2) మహారాష్ట్రులు ఎప్పుడు కానీ బహిరంగ యుద్ధం చేయక ప్రచ్ఛన్న (గెరిల్లా) యుద్ధ పద్ధతులనే అనుసరించారు. వారి ఓటముల వల్ల వారు చాల కొద్దిగా నష్టపడి, వారి విజయాలవల్ల, దోపిడీ దండయాత్రలవల్ల అత్యధికంగా లాభపడ్డారు.

BRAOU

3.5.5 ఔరంగజేబ్ మరణం, 1707

1698 కి ముందు కాకపోయినా, దాదాపు అప్పటినుంచి ఔరంగజేబ్ నడిపిన సుదీర్ఘ దండయాత్ర సంపూర్ణంగా విఫలమైందని చెప్పాలి. అతను శాయశక్తులా ప్రయత్నించి కూడా మహారాష్ట్ర ప్రాభవాన్ని అతడు అణచలేకపోయాడు. అలసి, మానసికంగా క్రుంగి నిరాశతో మరలివచ్చి, ఔరంగజేబ్ 1707 ఫిబ్రవరి 21న అహమ్మద్‌నగర్‌లో మరణించాడు. దౌలతాబాద్ వద్ద గల ఖుల్దాబాద్‌లో సామాన్యమైన సమాధిలో అతనిని భూస్థాపితం చేశారు. వి.ఎ.స్మిత్ అన్నట్లు దక్కన్ ఔరంగజేబ్ ప్రతిష్టకూ, అతని శరీరానికి సమాధి అయింది.

3.6 ఔరంగజేబ్ తర్వాత మొగల్ రాజులు

ఔరంగజేబ్ చనిపోయిన తర్వాత, అతని కుమారుల మధ్య వారసత్వ యుద్ధం ఏర్పడింది. ఈ యుద్ధంలో రాకుమారుడు మౌజం నెగ్గి, 1707లో 'బహదూర్‌షా' అనే బిరుదనామంతో సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతనిని మొదటి షా ఆలం అని కూడా పిలుస్తారు. ఇతడు అసమర్థుడైన అరవైనాలుగేండ్ల ముసలివాడైనందువల్ల, ఇతనిని 'షా-ఇ-బేఖబర్' (యోచనలేని రాజు) అని పిలిచారు. ఇతడు 1707 నుంచి 1712 వరకు పాలించాడు. ఇతని తర్వాత వరుసగా జహందర్ షా (1713), ఫరూఖ్ సియర్ (1713-1719) రాజ్యానికి వచ్చారు. ఫరూఖ్ సియర్ పాలనలో ప్రముఖమైన విషయం, సిక్కుల నాయకుడైన బందా బహదూర్‌ను పట్టుకొని ఉరితీయడం. మరొక ముఖ్య విషయం, తూర్పు ఇండియా కంపెనీ సేవలో ఉన్న డాక్టర్ హామిల్టన్ అనే శస్త్రవైద్యుడు ఫరూక్ సియర్‌కు కలిగిన ఒక వ్యాధిని కుదర్చగా దానికి బదులుగా ఫరూఖ్ సియర్ బెంగాల్‌లో కంపెనీ ఎట్టి సుంకం చెల్లించకుండానే వ్యాపారాన్ని చేసుకొనే అధికారాన్నిచ్చాడు.

3.7 నాదిర్‌షా దండయాత్ర, 1739

హుసేన్ అలీ, అబ్దుల్లా అనే సయ్యద్ సోదరు లిరువురు, ఫరూఖ్ సియర్‌ను హత్యచేసి, మహమ్మద్‌షా అనేవాడిని సింహాసనం మీద కూర్చోపెట్టారు. ఈ మహమ్మద్‌షా పాలనా కాలం (1719-1748)లో, 1739లో నాదిర్ షా భారతదేశం మీద దండెత్తి వచ్చి, మొగల్ సామ్రాజ్యం మీద చావుదెబ్బ తీశాడు. నాదిర్‌షా యుద్ధ వీరులైన ఇరాన్ (పర్షియా) రాజులలో ఒకడు. కాందహార్ నుంచి పారిపోయే ఆఫ్ఘన్లను భారతదేశంలోనికి ప్రవేశింపనివ్వ వద్దన్న తన అభ్యర్థనను మహమ్మద్‌షా మన్నించలేదనే నెపంతో, నాదిర్‌షా 1739లో భారతదేశం పై దండెత్తాడు. కర్నాల్ వరకు అతనికి ఎట్టి ప్రతిఘటన లేకపోయింది. అటుతర్వాత అతడు ఢిల్లీ ప్రవేశించి, ఎర్రకోటలోని మొగల్ రాజప్రాసాదాన్ని ఆక్రమించాడు. ఢిల్లీ పౌరులు అతని సైనికులను కొందరిని చంపిసారని, నాదిర్‌షా ఆగ్రహావేశుడై, మూకుమ్మడి వధను ఆజ్ఞాపించాడు. ఈ వధ ఎనిమిది గంటలు నడిచింది. వేలకొద్ది మంది చంపబడ్డారు. నగరం దోచుకోబడింది. అందమైన కట్టడాలనేకం దగ్ధం చేయబడ్డాయి. నాదిర్‌షా ఢిల్లీ నగరంలో రెండు నెలలు ఉండి ఇరాన్‌కు మరలి వెళ్ళాడు. ఇరాన్‌కు పోతూ తనతోపాటు అనేక కోట్ల రూపాయలు, ప్రసిద్ధి చెందిన కోహినూర్ వజ్రం, షాజహాన్ నిర్మించిన నెమలి సింహాసనం, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులతో కూడిన అపార సంపదను తీసుకువెళ్ళాడు. ఇంతేకాక, సింధూనదికి అవతల వున్న మొగల్ రాజ్యాన్నంతా తన సామ్రాజ్యంలో చేర్చాడు. నాదిర్‌షా దండయాత్ర మొగల్ సామ్రాజ్యాన్ని తీవ్రంగా గాయపరచి, సాగిలపడదోసింది. ఫలితంగా అనేక స్వతంత్రరాజ్యాలు ఏర్పడ్డాయి. బెంగాల్‌లో అలివర్దీఖాన్, ఔద్‌లో సాదత్ అలీఖాన్, దక్కన్‌లో నిజాం-ముల్-ముల్క్ స్వతంత్రులయ్యారు. మహారాష్ట్రులు, శిక్కులు తమ అధికారాన్ని కూడగట్టుకొన్నారు. రాబోయే కొంతకాలం వరకు మహారాష్ట్రుల ఔన్నత్యానికి మార్గం సుగమమైంది.

BRAOU

3.8 అహమ్మద్‌షా అబ్దాలీ దండయాత్రలు

అఫ్ఘన్లలో దురానీ తెగకు నాయకుడైన అహమ్మద్ షా అబ్దాలీ, నాదిర్‌షా సైన్యాధ్యక్షులలో మిక్కిలి సమర్థుడు. నాదిర్‌షా తర్వాత అతడు అఫ్ఘనిస్తాన్‌కు స్వతంత్రప్రతిపత్తిలో రాజైనాడు. 1748-1767 మధ్య అతడు భారతదేశంపై ఏడు దండయాత్రలు చేశాడు. పంజాబ్‌ను ఆక్రమించి, ఢిల్లీని దోచాడు. అతని దండయాత్రలలో అతిముఖ్యమైంది 1761లో జరిగింది. ఆ సంవత్సరంలో జరిగిన మూడవ పానిపట్ యుద్ధంలో అతడు మహారాష్ట్రులను ఓడించాడు. అహమ్మద్‌షా దండయాత్రలు, అప్పటికే బలహీనమై వున్న మొగల్ సామ్రాజ్యాన్ని ఇంకా బలహీనపరచాయి; హిందూ సామ్రాజ్యాన్ని నెలకొల్పాలనుకొన్న మహారాష్ట్రుల యత్నాలు వమ్మైనాయి; ఆంగ్లేయులు భారతదేశంలో తమ అధికారాన్ని స్థాపించుకోగలిగారు.

సుల్తాన్ మహమ్మద్‌షా తర్వాత వచ్చిన మొగల్ రాజులు పేరుకు మాత్రమే రాజులు. వీరిలో ఇద్దరు మాత్రమే గమనించదగినవారు. రెండవ షా అలం (1758-1806) బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో 'దివానీ' అధికారాన్ని ఆంగ్లేయులకు దత్తం చేశాడు. రెండవ బహదూర్‌షా (1837-58) మొగల్ రాజులలో చివరివాడు. ఇతడు 1857లో జరిగిన తిరుగుబాటులో నాయకత్వం వహించాడు. తిరుగుబాటు అణచివేసిన తర్వాత, ఆంగ్లేయులు బహదూర్‌షాను ఖైదీగా రంగూన్‌కు పంపారు. అచటనే బహదూర్‌షా 1862లో తన ఎనభైఏడవ ఏట మరణించాడు.

3.9 మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలు

3.9.1. ఔరంగజేబ్ బాధ్యత

3.9.1.1 అతని దక్కన్ విధానం

బీజాపూర్, గోల్కొండ రాజ్యాలను ఆక్రమించడం, ఔరంగజేబ్ రాజకీయంగా చేసిన పెద్ద పొరపాటు. దక్కన్‌లో ఇవి మాత్రమే ముస్లిం రాజ్యాలు. ఔరంగజేబ్ వాటిని విచ్ఛిన్నం చేశాడు. ఈ రాజ్యాలు మహారాష్ట్రులతో నిరంతరం యుద్ధం చేస్తూ ఉండేవి. కాని వాని ఆక్రమణ తర్వాత, మహారాష్ట్రులకు అడ్డులేకుండా పోయింది. ఈ రాజ్యం నుంచి తరిమి వేయబడిన సైనికులు పోయి మహారాష్ట్ర సైన్యంలో చేరారు.

ఈ దండయాత్రలకై ఔరంగజేబ్ దాదాపు ఇరవై ఆరేండ్లు, రాజధానికి దూరంగా దక్కన్‌లో గడిపాడు. అతని సొంత పర్యవేక్షణ మీద ఆధారపడిన ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణ మట్టుపడిపోయింది. దక్కన్‌లో ఎడతెగక సాగిన ఈ దండయాత్రలు సైన్యాన్ని బలహీనం చేశాయి; కోశాగారాన్ని ఖాళీచేశాయి. చెల్లించని జీతాలకై సైనికులు తిరుగుబాట్లు చేశారు. ప్రతిచోటా దుర్మార్గం చోటుచేసుకుంది. ఏ రహదారిలో కాని, భద్రత లేకుండా పోయింది. బెంగాల్ రాష్ట్ర పాలకుడైన మూర్షిద్ కులీఖాన్ తప్ప, మిగిలిన రాష్ట్ర పాలకులందరూ భూమిశిస్తులు కేంద్ర ప్రభుత్వానికి పంపడానికి నిరాకరించారు. దక్కన్ పుండు ఔరంగజేబ్‌ను నాశనం చేసిందనుట సత్యదూరం కాదు.

3.9.1.2 అతని మత విధానం

సామ్రాజ్య పతనానికి ఔరంగజేబ్ మత విధాన మొక ప్రధాన కారణం. అతడు ప్రతివిషయాన్నీ, సున్నీ ముస్లిం దృష్టితోనే చూచేవాడు. మతం రాజనీతిని అధిగమించింది. భారతదేశాన్ని, సున్నీ ఇస్లాం మతరాజ్యంగా రూపొందించడం అతని మహదాశయం. హిందువులపై మిక్కిలి హేయమైన జిజియా పన్నును మరలా విధించాడు. వారి దేవాలయాలు కూలదోశాడు; వారిని ప్రభుత్వ పదవులకు దూరంగా వెలివేయడానికి గట్టిగా ప్రయత్నించాడు. ఫలితంగా, వారికి అతని విధానాల మీద అసహ్యమేర్పడింది. శిక్కులు, మహారాష్ట్రులు కూడా అతనికి బద్ధవిరోధులయ్యారు. మొగల్ సామ్రాజ్యానికి దాని ఖడ్గం, కేడెం అయి కాపాడినారని చెప్పకోదగ్గ

BRAOU

రాజపుత్రులు కూడా విరోధులయ్యారు. అట్లే షియా ముస్లింలు కూడా దూరమయ్యారు. ఇరాన్‌కు చెందిన, సమర్థులైన షియా ముస్లిమ్‌లు ఉద్యోగాలకై భారతదేశం రావడం మానివేశారు.

3.9.1.3 అతని అనుమాన స్వభావం

ఔరంగజేబ్ అందరినీ మిక్కిలిగా అనుమానించే స్వభావం కలవాడు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ తానే స్వయంగా చూచుకొనేవాడు. అతడు తన సైన్యాధ్యక్షులను కానీ, తన అమీర్లను కానీ, చివరకు తన కుమారులను కానీ నమ్మలేదు. ఫలితంగా, అతని కుమారులలో ఒక్కడికి కూడా పరిపాలనలో ఎట్టి అనుభవం కానీ, శిక్షణ కానీ లేకుండా పోయింది. ఇది సామ్రాజ్యానికి హానిచేసింది. ఔరంగజేబ్ చనిపోయిన తర్వాత, సామ్రాజ్యాన్ని చక్కగా నడపగల సమర్థుడెవ్వడూ లేకపోయాడు.

3.9.2 ఔరంగజేబ్ తర్వాత బలహీనులైన రాజులు

ఔరంగజేబ్ తర్వాత వచ్చిన పాలకులు మొదటి బహదూర్‌షా నుంచి రెండవ బహదూర్‌షా వరకు, వరుసగా అందరూ అలసులు, భోగలాలసులు, ధైర్యహీనులు, అసమర్థులు. వారందరూ వారి మంత్రుల చేతిలో కీలుబొమ్మలు. వారు సామ్రాజ్య రక్షణ కన్నా వారి భోగాలు, విలాసాల యెడలనే ఎక్కువ శ్రద్ధ వహించారు. అట్టి రాజులలో ఒకడు, మహమ్మద్‌షా "రంగీలా". ఫలితంగా పాలకుని వ్యక్తిత్వం మీద, సౌశీల్యం మీద ఆధారపడిన కేంద్ర ప్రభుత్వం చాలా బలహీనమైపోయింది.

3.9.3 పరాయి ప్రభుత్వం

భారతదేశ ప్రజలలో అధికులు మొగల్ ప్రభుత్వాన్ని పరాయి ప్రభుత్వంగా చూచారు. సహజంగా వారికి ఆ ప్రభుత్వమంటే ఎట్టి అభిమానం లేకపోయింది. భారతదేశంలో పర్యటించిన బెర్నియర్ అనే ఫ్రెంచి యాత్రికుడు "హిందూస్తాన్‌లో మొగల్ చక్రవర్తి విదేశీయుడు" అని వ్రాశాడు. మొగల్ సామ్రాజ్యానికి ప్రజల్లో ఆదరణ లేదు. అది దాని సైనిక బలం మీద ఆధారపడింది. అందుచేత ఈ సైనిక బలం క్షీణించినప్పుడు, సామ్రాజ్యం పడిపోవడం ప్రారంభమైంది.

3.9.4 కేంద్రీకృత పాలన

మొగల్ ప్రభుత్వం కేంద్రీకృత ప్రభుత్వం. అట్టి ప్రభుత్వం రాజు బలవంతుడుగా, సమర్థుడుగా ఉన్నప్పుడు మాత్రమే సాగిపోగలదు. బలహీనుడైన పాలకుడు దాని పతనాన్ని మాత్రమే త్వరితం చేస్తాడు. ఔరంగజేబ్ తర్వాత వరుసగా వచ్చిన బలహీనులైన పాలకులు దాని పతనాన్ని తెచ్చిపెట్టారు.

3.9.5 రాజ్య వారసత్వానికి సరియైన విధానం లేకపోవటం

మొగలులకు రాజ్య సంక్రమణ(వారసత్వం) విషయంలో నిర్ణీత విధానం లేదు. అందుచేత, ఎప్పుడు ఒక రాజు చనిపోయినా అతని పుత్రుల మధ్య వారసత్వ యుద్ధం ఏర్పడుతుంది. జహంగీర్ కుమారుల మధ్య, షాజహాన్ కుమారుల మధ్య, ఔరంగజేబ్ కుమారుల మధ్య, కలిగిన దురదృష్టకరమైన వారసత్వ యుద్ధాలు సామ్రాజ్యానికి ఎంతో హానిని చేశాయి. ఔరంగజేబ్ తర్వాత సుమారు ముప్పై సంవత్సరాల కాలంలో ఈ యుద్ధాలు మరీ పరిపాటి అయినాయి. ఈ యుద్ధాలలో చాలామంది రాకుమారులు, అమీరులు వేలకొద్దీ శిక్షితులైన సైనికులు చంపబడేవారు.

3.9.6 అమీరుల క్షీణత

అబ్దుల్ రహీమ్, ఆసఫ్‌ఖాన్, మహబత్‌ఖాన్, మీర్ జుమ్లా మొదలైన వారెందరో గొప్ప రాజనీతిజ్ఞులనే విషయాన్ని కాదనలేము. వారు మొగల్ సామ్రాజ్యానికి మూలస్తంభాలై, దానిని ఎంతో బలపరిచారు. కాని

వారు తమ సామర్థ్యంలో చివరకు సగం సామర్థ్యం కలిగిన పుత్రులుకాని పౌత్రులు కాని వదలిపోలేదు. అమీరులలో చాలామంది స్వార్థపరులై రాజకీయ కుట్రలలో నిమగ్నమై ఉండేవారు. సామ్రాజ్యంలోని అమీరుల ఈ నైతిక పతనం మొగల్ సామ్రాజ్య పతనానికి గల కారణాలలో ఒకటి.

3.9.7 సైన్యం బలహీనత

అపార సంపద, ఉష్ణ ప్రదేశం, భోగాసక్తి మొగల్ సైన్యం సుఖాన్ని అభిలషించేటట్లు చేసి దానిని బలహీన పరిచాయి. సైన్యాధికారులు యుద్ధరంగానికి పల్లకీలలో పోయేవారు. సైనికులు వారి వెంట స్త్రీ జనాన్ని తీసుకొని పోయేవారు. బాబర్ కాలంనాటి ధైర్యసాహసాలు గతస్మృతులైపోయాయి. షాజహాన్ కాలంలో, మొగల్ సైన్యాలు పర్షియన్ల నుంచి కాందహార్‌ను జయించలేకపోవటంలోనే, ఈ సామర్థ్య క్షీణత వ్యక్తమైంది. ఈ బలహీనతకు ప్రధానకారణం, వాయవ్య పర్వత ప్రాంతాల నుంచి మధ్య ఆసియా నుంచి దృఢకాయులు, పౌరుషవంతులైన సైనికులు మొగల్ సైన్యంలో చేరడానికి రాకపోవటమే ఈ మొగల్ సైన్యం యొక్క అసమర్థతే చివరకు సామ్రాజ్య పతనానికి, బహుశా ప్రధాన కారణమై ఉండవచ్చు.

3.9.8 వర్గ కలహాలు

కడపటి మొగలుల కాలంలో ముస్లిం అమీరులు, తురానీ, ఇరానీ అనే రెండు వర్గాలుగా చీలిపోయారు. తురానీ వర్గంలో మధ్య ఆసియా నుంచి వచ్చినవారు ఉండేవారు, వారందరూ సున్నీ ముస్లింలు. ఇరాన్ వర్గంలో పర్షియా నుంచి వచ్చినవారు ఉండేవారు; వారందరూ షియా ముస్లింలు. వీరి మధ్య ఎట్టి అనురాగం ఉండేది కాదు. ప్రతి వర్గం సామ్రాజ్య ప్రయోజనాలు విస్మరించి స్వార్థ ప్రయోజనాల కోసం పాటుపడేది. వారి పరస్పరవైరం, మొగల్ పాలనను బలహీన పరచింది.

3.9.9 రాష్ట్రాలు స్వతంత్ర మగుట

ఔరంగజేబ్ మరణం తర్వాత సింహాసనానికి సమర్థుడైన పాలకుడెవ్వడూ రానందువల్ల రాష్ట్రపాలకులు వారి స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నారు. ఒక రాష్ట్రం తర్వాత మరొక రాష్ట్రం, కేంద్రాధికారం నుంచి జారిపోయింది. బెంగాల్‌లో అలివర్దీఖాన్, ఔద్‌లో సాదత్ ఖాన్, దక్కన్‌లో నిజామ్-ఉల్-ముల్క్ ఆసఫ్‌జా, రోహిల్ ఖండ్‌లో రోహిల్లాలు, ఆగ్రావద్ద జాట్‌లు, ముహమ్మద్‌షా 'రంగీలా' కాలంలో స్వతంత్రులయ్యారు. ఫలితంగా, మొగల్ సామ్రాజ్యం ఎక్కువగా కుంచించుకుపోయింది.


3.9.10 విదేశీయుల దండయాత్రలు

ఈ బలహీనత అవకాశంగా, నాదిర్‌షా 1739లో భారతదేశంపై దండెత్తి, సింధూ నది కవతలి రాష్ట్రాన్ని, ఆఫ్ఘనిస్తాన్‌ను తన సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. అపారమైన సంపద తన వెంట కొనిపోయి, మొగల్ సామ్రాజ్యాన్ని సత్వహీనం చేశాడు. అతని తర్వాత ఆఫ్ఘన్ పాలకుడైన అహమ్మద్‌షా అబ్దుల్లా ఏడు దండయాత్రలు చేసి, మొగల్ సామ్రాజ్యాన్ని ఇంకా బలహీనపరచాడు. ఈ విదేశ దండయాత్రలు మొగల్ కోశాగారాన్ని ఖాళీచేశాయి. ఆఫ్ఘన్ దండయాత్రలు, పర్షియా దండయాత్రలు మొగల్ సామ్రాజ్య పతనాన్ని త్వరితం చేశాయి.

3.9.11 సామ్రాజ్య విస్తీర్ణం

ఔరంగజేబ్ కాలంలో సామ్రాజ్య విస్తీర్ణం, అదుపులో ఉంచుకోలేనంతగా విస్తరించింది. రవాణా సౌకర్యాలు, వార్తాసాధనాలు సరిగా లేని ఆ రోజులలో ఇంత విశాల సామ్రాజ్యాన్ని అదుపులో ఉంచడం కష్టసాధ్యమైన పని. సామ్రాజ్య విస్తీర్ణం, సామ్రాజ్య బలహీనతకొక కారణమైంది.

BRAOU



3.9.12 నౌకాబలాన్ని అలక్ష్యం చేయుట

మంచి నౌకాబలం, సముద్రాధికారం లేకపోవటం కూడా సామ్రాజ్య పతనానికి గల కారణాలలో ఒకటి. మంచి నౌకాబలమున్నా, సామ్రాజ్యం చివరకు పతనం కావడాన్ని ఆపి ఉండేది కాదు; కాని అది, యూరోపియన్ల విజృంభణను కొంతకాలం ఆపి ఉండేది.

3.9.13 శిక్కులు, మహారాష్ట్రుల వంటి ప్రాంతీయ శక్తులు

మహారాష్ట్రులు, శిక్కులు, వారి అధికారాన్ని మిక్కిలి వేగంగా పెంపొందించుకొంటుండినారు. మహారాష్ట్రులు దక్కన్ నుంచి బయలుదేరి, ఉత్తర భారతదేశమంతా వ్యాప్తిచెందారు. శిక్కులు పంజాబ్‌ను వశం చేసుకొన్నారు. ఇంకా అనేక యూరోపియన్ జాతులు దేశంలో నిలకడైన స్థానాన్ని సంపాదించాయి. ఇదంతా, సామ్రాజ్యం త్వరగా విచ్ఛిన్నమవడానికి దారితీసింది. 1757లో ఆంగ్లేయులు ప్లాసీ యుద్ధంలో విజయం సాధించారు. అది వారికి, భారతదేశ ఆక్రమణకు కీలకాన్ని తెలిపింది. ఈ విజయానికి తర్వాత యాభై ఏండ్ల లోపలనే, వారు ఢిల్లీని జయించారు (1803). మొగల్ చక్రవర్తి రెండవ షా ఆలం, ఆంగ్లేయులు ఇచ్చే మనోవర్తిని తీసుకొనేవాడైనాడు.

III. మీ అవగాహన పరీక్షించుకోండి.

1) ఔరంగజేబ్ దక్కన్ విధానం ముఖ్య ఫలితాలేవి?

.....

.....

.....

.....

2) నాదిర్‌షా, అహ్మద్ షా అబ్దాలీ, భారతదేశాన్ని ఎప్పుడు దండెత్తారు?

.....

.....

.....

.....

3) మొగల్ సామ్రాజ్య పతనానికి మూడు ముఖ్య కారణాలు తెలుపుము.

.....

.....

.....

.....

3.10 సంగ్రహంగా

1) 1556 లో రెండవ పానిపట్ యుద్ధంలో విజయంతో, దేశంలోని అనేక రాజ్యాలను మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేసి, తన మత సహన విధానం ద్వారా కూడా అక్బర్, భారతదేశంలోని మొగల్ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేశాడు.

2) జహంగీర్ కాలంలో సూర్జహాన్ ప్రముఖమైన పాత్ర వహించింది. అతని కాలంలో, విలియమ్ హాకిన్స్, థామస్ రోలు, తూర్పు ఇండియా కంపెనీ భారతదేశంలో కొన్ని వ్యాపార సౌకర్యాలను సాధించగలిగారు.

3. మొగల్ సామ్రాజ్య చరిత్రలో షాజహాన్ కాలం (1627-58) చాలా ముఖ్యమైంది. అతను గోల్కొండ బీజాపూర్ రాజ్యాలపై మొగల్ ఆధిక్యతను నెలకొల్పగలిగాడు.

4. తన ముగ్గురు సోదరులను యుద్ధంలో ఓడించి, ఔరంగజేబ్ చక్రవర్తి అయినాడు. అతను గోల్కొండ, బీజాపూర్‌లను జయించాడు. కాని అతను దక్కన్ మత విధానాలు, మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలైనాయి.

5. మొగల్ సామ్రాజ్య పతనానికి అనేక కారణాలున్నాయి. ఆర్థిక వ్యవస్థ బలహీనత, బలహీనులైన వారు ఔరంగజేబ్ తర్వాత రాజులగుట, విదేశీయులైన నాదిర్‌షా, అహమ్మద్ షా అబ్దాలీల దండయాత్రలు, మహారాష్ట్రుల విజృంభణ, మొగల్ సామ్రాజ్య పతనానికి ముఖ్య కారణాలు.

3.11 మీ అవగాహన పరీక్షించుకోండి-జవాబులు

I. 1) రెండవ పానిపట్ యుద్ధంలో అక్బర్ విజయంవల్ల భారతదేశంలో మొగల్ రాజ్యం స్థిరపడింది. అందువల్ల ఆ యుద్ధం ముఖ్యమైంది.

2) హల్దీఘాట్ యుద్ధంలో, అక్బర్ సైన్యాధిపతి మాన్‌సింగ్, రాణాప్రతాప్‌ను ఓడించాడు. అయితే ఓడిపోయినప్పటికి, రాణా ప్రతాప్ అక్బర్ కు లొంగిపోలేదు. అతను అడవులలో గొరిల్లా పద్ధతిలో మొగల్ రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించాడు.

3) అన్ని మతాలను గౌరవించడం, అక్బర్ మత విధాన ముఖ్య లక్షణం. హిందువులపై విధిస్తున్న, జిజియా, యాత్రికుల పన్నును అక్బర్ రద్దుచేశాడు. దీన్-ఇ-ఇలాహి అనే కొత్త మతాన్ని స్థాపించాడు.

BPAOU

II. 1) జహంగీర్ సాధించిన ఘనకార్యాలల్లో ఒకటి, మేవాడ్ రాజ్యంతో యుద్ధాన్ని ముగించడం. రాణాప్రతాప్ కుమారుడు అమర్‌సింగ్, జహంగీర్‌కు లొంగిపోయాడు. సామ్రాజ్యంలో న్యాయమైన పరిపాలన నెలకొల్పడం కూడా జహంగీర్ సాధించిన కార్యాలలో ఒకటి.

2) 1611 లో జహంగీర్, నూర్జహాను వివాహం చేసుకున్నాడు. జహంగీర్ కాలంలో నూర్జహాన్ ప్రముఖమైన పాత్ర వహించింది. అతని కాలంలో అధికారం నూర్జహాన్ చేతుల్లోనే వుండింది.

3) దక్కన్‌లోని బీజాపూర్, గోల్కొండ రాజ్యాలపై మొగల్ ఆధిపత్యాన్ని నెలకొల్పడమే షాజహాన్ దక్కన్ విధాన ముఖ్య లక్ష్యము. ఆ రాజ్యాలను మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేయాలనే ఉద్దేశం షాజహాన్‌కు లేదు.

4) మొగల్ సింహాసనాన్ని అధిష్టించాలనే ఔరంగజేబ్ కోరికవల్ల షాజహాన్ కాలంలో వారసత్వ యుద్ధం ప్రారంభమైంది. షాజహాన్, అతని జ్యేష్ట కుమారుడైన దారాషుకోను చక్రవర్తి చేస్తాడనే భయంతో, ఔరంగజేబ్ వారసత్వ యుద్ధాన్ని ప్రారంభించాడు.

III. 1) మొగల్ సామ్రాజ్య పతనానికి, ఔరంగజేబ్ దక్కన్ విధానం ఒక ముఖ్య కారణం. జాదునాథ్ సర్కార్ చెప్పినట్లు, దక్కన్‌పుండు ఔరంగజేబ్‌ను నాశనం చేసింది. ఔరంగజేబ్ విధానం, మొగల్ సైన్యాన్ని బలహీనం చేసింది. అంతే కాకుండా ఔరంగజేబ్ దక్కన్ విధానంవల్ల చక్రవర్తి ఖజానా ఖాళీ అయింది.

2) నాదిర్‌షా 1739 లో భారతదేశాన్ని దండెత్తినాడు. అహ్మద్ షా అబ్దాలీ 1748-1767 మధ్య కాలంలో ఏడుసార్లు దండెత్తినాడు. 1761లో అతను జరిపిన దండయాత్ర చాలా ముఖ్యమైంది. ఆ సంవత్సరంలో అహ్మద్‌షా అబ్దాలీ, మూడవ పానిపట్ యుద్ధంలో మహారాష్ట్రను ఓడించాడు.

3) ఔరంగజేబ్ మత విధానం, అతని దక్కన్ విధానం, మొగల్ సామ్రాజ్యంలో క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితి, విదేశీ దండయాత్రలు, ఔరంగజేబ్ తర్వాత రాజ్యానికి వచ్చినవారు బలహీనులు కావడం, మొగల్ సామ్రాజ్య పతనానికి ముఖ్య కారణాలు.

3.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. "మొగల్ సామ్రాజ్య యదార్థ నిర్మాత అక్బర్" చర్చించండి.
2. "అక్బర్ రాజపుత్ర స్వాతంత్ర్యాన్ని విజయవంతంగా జయించిన మొట్టమొదటివాడు" ఈ వ్యాఖ్యానాన్ని దృష్టిలో వుంచుకొని, అక్బర్ రాజపుత్ర విధానాన్ని చర్చించండి.
3. మొగల్ కాలంలో షాజహాన్ కాలాన్ని స్వర్ణయుగమని వర్ణించుట సమంజసమేనా?
4. ఔరంగజేబ్ మొగల్ సామ్రాజ్య పతనానికి ఎంతవరకు కారకుడు?
5. మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలు వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. "అక్బర్ భారత జాతీయవాదానికి తండ్రి వంటివాడు" నెహ్రూ- చర్చించండి.
2. నూర్జహాన్ గురించి వ్రాయండి.
3. ఔరంగజేబ్ దక్కన్ విధానాన్ని గురించి వ్రాయండి.
4. విలియమ్ హాకిన్స్, సర్‌థామస్ రోలను గురించి వ్రాయండి.

BRAOU

3.13 ఉపయుక్త గ్రంథాలు.

1.	Beni Prasad	:	*History of Jahangir*
2.	Majumdar R.C. (Ed.,)	:	*The Mughal Empire, Bharatiya Vidya Bhavan Series, Vol.VII.*
3.	Edwards & Gareet	:	*Mughal Rule in India*
4.	Irwin William	:	*Later Mughals*
5.	Iswari Prasad	:	*A Short History of the Muslim Rule in India*
6.	-Do-	:	*Medieval India*
7.	- Do-	:	*Life and Times of Humayun*
8.	Majumdar, H.C.Roy Chaudhari & Datta	:	*Advanced History of India*
9.	Perceival Spear	:	*Twilight of the Mughals*
10.	Sarma L.P.	:	*The Mughals*
11.	Smith, V.A.	:	*Akbar, the great Mughal*
12.	Srivastava, A.L	:	*Mughal Empire*
13.	ఝాన్సీ లక్ష్మి, పాటిబండ వైదేహి, అల్లాడి	:	భారతదేశ చరిత్ర, సంస్కృతి ద్వితీయ భాగం, తెలుగు అకాడమి ప్రచురణ.

BRAOU

భాగం - 4 మొగలులు - పరిపాలన - ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు

విషయక్రమం

4.0 లక్ష్యాలు
4.1 పరిచయం
4.2 కేంద్రప్రభుత్వం
4.3 రాష్ట్ర ప్రభుత్వం
4.4 సైనిక వ్యవస్థ
4.5 రెవెన్యూ విధానం
4.6 ఆర్థిక పరిస్థితులు - వ్యవసాయం
4.7 పరిశ్రమలు
4.8 వర్తక వాణిజ్యాలు
4.9 సంపన్న నగరాలు
4.10 క్షామాలు, ప్లేగు
4.11 సామాన్య ప్రజలు
4.12 సాంఘిక పరిస్థితులు
4.13 అక్బర్ మత విధానం
4.13.1 అక్బర్ వారసుల మత విధానం
4.14 భక్తి ఉద్యమం
4.14.1 కారణాలు
4.14.2 భక్తి ఉద్యమ నాయకులు
4.14.2.1 రామానుజాచార్యులు
4.14.2.2 రామానందుడు
4.14.2.3 కబీర్
4.14.2.4 గురునానక్
4.14.2.5 చైతన్య
4.14.2.6 వల్లభాచార్య
4.14.2.7 వేమన
4.14.2.8 తులసీదాస్
4.14.2.9 తుకారామ్
4.14.3 భక్తి ఉద్యమ ఫలితాలు
4.15 సాహిత్యం, కళలు
4.15.1 సాహిత్యం
4.15.2 వాస్తుకళ
4.15.3 చిత్రకళ
4.15.4 సంగీతం
4.16 సంగ్రహంగా
4.17 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
4.18 పరీక్షా నమూనా ప్రశ్నలు
4.19 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

4.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. మొగల్ పరిపాలన ముఖ్య లక్షణాలు
2. ఆనాటి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సైనిక వ్యవస్థ, రెవెన్యూ విధానాలు
3. మొగల్ పరిపాలనలోని ప్రశంసనీయమైన లక్షణాలు, లోపాలు
4. మొగల్ పాలనలో ఆర్థిక పరిస్థితులు
5. ఆకాలం నాటి వ్యవసాయం, పరిశ్రమలు, వర్తకం, వాణిజ్యం, సామాన్య ప్రజల పరిస్థితులు
6. మొగలుల కాలంనాటి సాంఘిక పరిస్థితులు
7. అక్బర్, అతని వారసుల మత విధానం
8. భక్తి ఉద్యమ కారణాలు, నాయకులు, ఫలితాలు
9. మొగలుల కాలంలో సాహిత్యం, వాస్తు, శిల్ప, చిత్రకళలు

4.1 పరిచయం

మొగల్ పరిపాలనా విధానాన్ని సంకల్పించి, రూపొందించినవాడు అక్బర్ చక్రవర్తి. భారతదేశంలో బాబర్ కాలమంతా రాజకీయాలతో, యుద్ధాలతో గడిచిపోయింది; 1530లో అతను గతించే నాటికి, తన ఆక్రమణలను కూడదీసి వానికి ఒక పాలనా విధానాన్ని ఏర్పరచే అవకాశం అతనికి లేకపోయింది./హుమాయూన్ జీవితం, పాలనా కాలం అనేక ఒడుదుడుకులతో కూడింది; అందుచే, అతనికి తనతండ్రి నుంచి పొందిన రాజ్యంలో ఒక పాలనా విధానాన్ని ఏర్పరచడానికి వీలుకాలేదు. అక్బర్ పరిపాలనా కాలం జయప్రదంగా, సుదీర్ఘంగా, సమృద్ధంగా ఉండింది; అందుచే అతనికి మొగల్ సామ్రాజ్యానికి ఒక పరిపాలనా విధానాన్ని రూపొందించే అవకాశం లభించింది. అక్బర్ రూపొందించిన ఈ పరిపాలనా విధానం, *"సంపూర్ణమయింది; జాతీయమయింది; విస్తృతమైన ఆధారం కలది; జనరంజకమయింది; ఆధునికమయింది"*. అది కొన్ని విదేశీ అంశాలతో కూడిందవడంవల్ల దానిని 'భారతీయ సమాజంలో ఏర్పరచుకొన్న పర్షియా - అరేబియా విధానం'గా వర్ణించారు.

మొగల్ పరిపాలనా విధానం ఢిల్లీ సల్తనత్ పరిపాలనా విధానానికంటే చాలా మెరుగైంది; దాని కార్యకలాపాలు శాంతి భద్రతల రక్షణకు, పన్ను వసూళ్ళకు మాత్రమే పరిమితమైనవి కావు. అక్బర్ నిర్మించిన "సంస్కృతీ రాజ్య" అవసరాలకు తగినట్లు, అది రూపొందింపబడింది. వ్యాపారం, పరిశ్రమలు, నాణేలు, రహదారులు, వైద్యశాలలు, కళలు, విద్యాసారస్వతాలు మొదలైన విషయాలతో దానికి సంబంధముండేది.

అక్బర్ తర్వాత వరుసగా రాజులందరూ ఈ విధానాన్ని కొనసాగించారు. వారు దానిలో తెచ్చిన మార్పులు చాలా కొద్ది. జహంగీర్, షాజహాన్ ఆ విధానాన్నే కొనసాగించారు; కాని, పరిపాలనా సిబ్బందిలోని మార్పు దాన్ని కొంత చెరచింది. వారికాలంలో భోగలాలసత, దుర్వ్యయం ఎక్కువయ్యాయి. ఔరంగజేబ్ కాలంలో అతని మత విధానంవల్ల, అధికారాన్నంతా అతని చేతిలోనే కేంద్రీకరించుకోవడంవల్ల, సామ్రాజ్య విస్తరణవల్ల, ఈ విధానం విచ్ఛిపోసాగింది. కాని, ఔరంగజేబ్ కాలంలో కూడా పాలనా యంత్రాంగంలో పెద్ద మార్పులేవి లేవు.

అక్బర్ విశిష్టమైన పరిపాలనా విధానాన్ని ప్రవేశపెట్టి, దాన్ని స్థిరంగా నిలబెట్టాడు. లౌకిక, సైనిక, భూమిశిస్తు విధానాలలో అతడు చేసిన సంస్కరణలే అతని సామర్థ్యానికి, సాక్ష్యం. కాని, ఇక్కడ ఒక విషయం మరువ కూడదు; చాల వరకు ఈ సంస్కరణలన్నీ అక్బర్ కంటే ముందు, షేర్షా ప్రవేశపెట్టాడు. అక్బర్‌కు పేరు తెచ్చిన అతని భూమిశిస్తు విధానం, షేర్షా భూమిశిస్తు విధానానికి నకలు. అక్బర్ సైనిక పాలనా విధానం కూడా, ఎన్నో

BRAOU

విషయాలలో షేర్షా విధానాన్ని అనుసరించింది. షేర్షా విధానాన్ననుసరించి ప్రవేశ పెట్టబడినవే. మొగలుల కాలంలో ఆర్థిక పరిస్థితి సంపన్నగా ఉండింది. మొగల్ రాజుల కాలంలో భారతదేశానికి వచ్చిన విదేశీ యాత్రికులు, భారతదేశంలోని వర్తక, వాణిజ్యాలు, కళలు అభివృద్ధి గూర్చి ఘనంగా చెప్పి ఉన్నారు. అయినా సాధారణ మానవుడు నికృష్ట జీవనాన్ని గడిపాడు. సాంఘిక పరిస్థితులను గమనిస్తే, మొగల్ కాలంలో, సామాజిక వ్యవస్థ ఫ్యూడల్ సమాజంలా కనిపిస్తుంది. ఫ్యూడల్ సమాజ అవలక్షణాలన్నీ ఇందులో చోటుచేసుకున్నాయి. అక్బర్ సహనపూరిత మత విధానాన్నవలంబించాడు. ఔరంగజేబ్ దీనికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు. మొగలుల కాలం నాటి విశిష్ట లక్షణం, నాటి భక్తి ఉద్యమం. మొగల్ చక్రవర్తులు సంస్కృతి పరిరక్షణలో భాగంగా సారస్వతాన్ని, కళలను పెంపొందించారు.

4.2 కేంద్ర ప్రభుత్వం

అక్బర్ పరిపాలన ప్రశంసా పాత్రమైంది. అతని ప్రభుత్వంలో, సామర్థ్యాన్ని బట్టి మాత్రమే పదవులు ఇవ్వబడేవి. ప్రభుత్వోద్యోగాలలో హిందువులకు, ముస్లింలకు ఇద్దరికీ ప్రవేశముండేది.

అక్బర్ నిరపేక్ష పాలకుడు. అతని మాటే శాసనం. అతడు లౌకిక పాలనా యంత్రాంగానికి అధిపతి మాత్రమే కాదు; సైన్యానికి సర్వసైన్యాధిపతికూడా. పరిపాలనలో అతనికి మంత్రులు సహాయం చేసేవారు. వారిలో ముఖ్యులు - ముఖ్యమంత్రి (వకీల్), ఆర్థికమంత్రి (వజీర్) యుద్ధ మంత్రి (మీర్ బక్ష్). మత వ్యవహారాల మంత్రి (మీర్ సాదర్), న్యాయానికంతా చక్రవర్తే మూలాధారం. ప్రధానమైన ఫిర్యాదులలో అతడే సొంతంగా న్యాయ విచారణ చేసి తీర్పు ఇచ్చేవాడు; న్యాయ పునర్విచారణ కూడా అతడే చేసేవాడు. అక్బర్ రాజనీతి విధానం, మతసహనం మీద ఆధారపడింది. అతడు రాజకీయ వ్యవహారాలలో **ఉలేమా** (ముస్లిమ్ మత గురువు) లను లక్ష్యపెట్టలేదు. ముఖ్యమంత్రిని **వకీల్** లేదా **వజీర్** అని పిలిచేవారు. రాజ్యంలో రాజు తర్వాత అతడే అత్యున్నతమైన అధికారి. పర్షియన్ రాజ భాషగా ఉండేది.

4.3 రాష్ట్ర ప్రభుత్వం

అక్బర్ పరిపాలనా కాలాంతానికి, అతని సామ్రాజ్యం **'సుబా'** లనే పేరుగల పదిహేను రాష్ట్రాలుగా విభజింపబడింది. వీటన్నిటిలో ఒకే రకమైన పాలనా విధానం ఉండేది. ఈ సుబాల పేర్లు - ఆగ్రా, అలహాబాద్, ఔద్, ఢిల్లీ, లాహోర్, ముల్తాన్, కాబూల్, అజ్మీర్, బెంగాల్, బీహార్, అహమ్మదాబాద్, మాల్వా, బీరార్, అహమ్మద్‌నగర్. ప్రతి రాష్ట్రం **'సుబాదార్'** లేదా **'సిపాహి - సాలార్'** అనే రాష్ట్ర పాలకుడి అధీనంలో ఉండేది. అతనిని ప్రభుత్వపరంగా **'నాజిమ్'** అని పిలిచేవారు. అతడు రాజకుటుంబానికి చెందిన వ్యక్తో లేదా ఉన్నతుడైన అమీరో అయి ఉండెవాడు. అతనిని చక్రవర్తి నియమించేవాడు; అతడు సైనిక, రక్షకభట, కార్యనిర్వాహక శాఖలన్నిటికీ అధిపతిగా ఉండేవాడు. ప్రతి రాష్ట్రంలో, **దివాన్, ఫౌజ్‌దార్, కాజీ అమీల్** మొదలుగా చాలామంది అధికారులుండేవారు. **దివాన్** భూమిశిస్తు (రెవెన్యూ) పరిపాలనా విషయాలు పర్యవేక్షించి, **సుబాదార్**కు పోటీగా ఉండేవాడు. **అమీల్** భూమిశిస్తును వసూలు చేసేవాడు. **కాజీ** ఫిర్యాదులను విని తీర్పుచెప్పేవాడు.

రాష్ట్రాలు సర్కారులుగా, సర్కారులు పరగణాలుగా విభజించబడ్డాయి. ప్రతి పరగణాలో అనేక గ్రామాలు ఉండేవి. జిల్లా (సర్కార్) అధికారిని **ఫౌజ్‌దార్** అని పిలచేవారు. అతని క్రింద కొంత సైన్యం ఉండేది. పరగణాపై అధికారిని, **షిక్‌దార్** అని పిలిచేవారు. నగరాలలో వ్యాజ్యాలు, వ్యవహారాలు విని, తీర్పులివ్వడానికి **కాజీలు** నియోగింపబడేవారు; న్యాయస్మృతి లిఖితంగా ఉండేదికాదు. ఖైదులో పెట్టటం, **జుల్మానా** (ధనదండన), అవయవచ్ఛేదన, కొరడాతో కొట్టడం, సామాన్య శిక్షలుగా ఉండేవి. శిరచ్ఛేదనం లేదా మరణ దండన, చక్రవర్తి అనుమతితో మాత్రమే విధించబడేది. గ్రామ వ్యవహారాలను పంచాయతులు నిర్వహించేవి.

BRAOU

I మీ అవగాహన పరీక్షించుకోండి

1) మొగల్ పరిపాలనలో చక్రవర్తి పాత్ర ఎటువంటిది?

.....

.....

.....

.....

2) సర్కార్, పరగణాలల్లో ముఖ్యమైన అధికారులెవరు?

.....

.....

.....

.....

4.4 సైనిక వ్యవస్థ

అక్బర్‌కు స్థిరమైన సైన్యం ఉండేది, కాని అది సంఖ్యలో పెద్దదికాదు. సైనిక దళాలను చాలావరకు **మన్సబ్‌దార్** లనే సైనికాధికారులు సమకూర్చేవారు. అబుల్ ఫజల్ చెప్పిన దానిని బట్టి, ఈ **మన్సబ్‌దారులు** ముప్పై మూడు తరగతులుగా ఉండేవారు. వీరు ఒక నిర్ణీత సంఖ్యలలో అశ్విక దళాన్ని చేకూర్చి, పోషించి, చక్రవర్తికి అవసరమైనప్పుడు అందించాలి. వీరిలో మిక్కిలి తక్కువ తరగతి వారు పదిమంది అశ్వికులను అత్యున్నత తరగతికి చెందిన పదివేల మంది అశ్వికులను పోషించి అందచేయాలి. అయిదు వేలకు మించి అశ్వికులను కలిగి, అత్యున్నత తరగతులకు చెందిన **మన్సబ్‌దార్** పదువులు రాజకుటుంబంలోని వ్యక్తులకు, ఉన్నత శ్రేణికి చెందిన అమీర్లకు మాత్రమే ఇవ్వబడేవి. ఒక నిబంధనగా, మన్సబ్‌దార్లకు జీతాలు ధన రూపంలో చెల్లించబడేవి; కొద్దిమందికి తాత్కాలికంగా, జాగీర్లు ఇవ్వబడినాయి. ఈ జాగీర్లను ఒక **మన్సబ్‌దార్** నుంచి మరొక **మన్సబ్‌దార్**కు మారుస్తూ ఉండేవారు. ఈ మన్సబ్‌దార్లందరూ, వారి వారి ప్రాంతాల్లో శాంతిభద్రతల రక్షణకు, భూమిశిస్తు వసూలుకు బాధ్యత వహించేవారు. వారు నేర వ్యవహారాలను కూడా విచారించేవారు.

ఈ మన్సబ్‌దారీ విధానంలోని తీవ్రలోపం, ఈ మన్సబ్‌దార్లు నిర్ణీత సంఖ్యలో పోషించవలసిన అశ్విక దళాన్ని పోషించక, లెక్క సరిచూచే సమయానికి మనుషులను ప్రోగుచేసి చూపేవారు. ఇట్టి తప్పుడు హాజరు పట్టీలు చూపకుండటానికై అక్బర్, షేర్షా విధానాన్ననుసరించి, గుర్రంకు ముద్రవేసే పద్ధతి, సైనికుల గుర్తింపు చిహ్నాలను పట్టీలలో ఎక్కించే పద్ధతి ప్రవేశపెట్టాడు. కాని, ఈ విషయంలో పూర్తిగా ఫలితాన్ని సాధించలేక పోయాడు. మన్సబ్‌దారులేగాక కొంతమంది రాజులు, పాలకులు కూడా సైనిక దళాలను చక్రవర్తికి అవసరమైనప్పుడు పంపించేవారు.

చక్రవర్తి సైన్యంలో కాల్బలం, ఫిరంగిదళం, అశ్వికదళం, ఏనుగులు, నౌకాబలం ఉండేవి. వీటన్నిటిలో అశ్వికదళం అతిముఖ్యమైంది. అందుచే, దానిమీద ప్రత్యేక శ్రద్ధ కనపరచేవారు.

4.5 రెవిన్యూ విధానం

అక్బర్ తన పరిపాలనలో సాధించిన గొప్ప విషయం, భూమి శిస్తు విధానం. దీనిని రూపొందించి అమలు పరచినవాడు, అతని భూమ్యాదాయపు (రెవిన్యూ) మంత్రి అయిన తోడర్‌మల్. తోడర్‌మల్, షేర్షా ఉదాహరణ ననుసరించి, సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో, అంతకుముందున్న విధానానికన్నా, మేలైన

BRAOU

భూమిశిస్తు నిర్ణాయక విధానాన్ని అమలుపరచాడు. ఈ విధానం **బందోబస్త్** అని ప్రసిద్ధిచెందింది. ఈ విధానంలో భూమిని ఖచ్చితంగా కొలిచి, దాని భూసారాన్నిబట్టి "తరగతి" నిర్ణయించి, భూమిశిస్తు నిర్ణయింపబడింది. ఇది **రైత్వారీ** విధానం. సాగుబడి నేల అంతా కొలిచి, భూసారాన్ని బట్టి నాలుగు తరగతులుగా విభజించారు : 1) **పోలజ్**, అంటే ఎప్పుడూ బీడుగాలేని నేల, 2) **పరౌటి**, అంటే ఒకటి, రెండేళ్ళు బీడుగా వదిలే నేల, 3) **చచార్**, అంటే మూడు నాలుగేండ్లు బీడుగా వదిలే నేల, 4) **బంజర్**, అంటే అయిదేండ్లు, అంతకు మించి బీడుగా వదిలే నేల; ప్రభుత్వానికి చెల్లించవలసిన శిస్తు సరాసరి ఫలసాయంలో మూడోవంతుగా నిర్ణయించబడింది. దీనిని ధనరూపంలోకాని, ధాన్యరూపంలోగాని చెల్లించవచ్చు. కాని అక్బర్, ముఖ్యంగా తొందరగా చెడిపోయే సరకుల విషయంలో ధనరూపంలోనే చెల్లింపును కోరేవాడు. ధన రూపంలో ఎంత చెల్లించాలో నిర్ణయించడానికి, తోడర్‌మల్ గత పదేండ్లలో ఉన్న ధరల సరాసరిని ఆధారంగా తీసుకొన్నాడు.

కరువు కాలంలో ప్రభుత్వానికి కట్టవలసిన శిస్తును తగ్గించేవారు. అలాటి సమయాలలో రైతులకు విత్తనాలు, పశువులు కొనడానికై **'తక్కావీ'** రుణాలు ఇచ్చేవారు. శిస్తు వసూలు చేసే అధికార్లు(Revenue Collectors) రైతును పీడించవద్దని, ప్రత్యేకంగా హెచ్చరింపబడ్డారు. ఫలితంగా రైతు అంతకుముందు కన్నా బాగుపడ్డాడు; ప్రభుత్వాదాయం కూడా పెరిగింది. మొదటలో భూమిశిస్తు నిర్ణయం ఏటా చేయబడింది. కాని తరువాత, పదేండ్లకొకసారి ఈ నిర్ణయం చేయబడింది. చిన్న మార్పులతో తోడర్‌మల్ రూపొందించిన ఈ భూమిశిస్తు విధానం అక్బర్ తరవాత వచ్చిన రాజుల కాలంలో కూడా కొనసాగింపబడింది.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1) రెండు వాక్యాలలో మన్సబ్‌దారీ వ్యవస్థను వర్ణించండి?

.....

.....

.....

.....

2) మొగలుల కాలంనాటి భూమిశిస్తు విధానంలోని ముఖ్య లక్షణమేది?

.....

.....

.....

.....

4.6 ఆర్థిక పరిస్థితులు; వ్యవసాయం

అక్బర్‌చే అభివృద్ధి చేయబడి, ప్రవేశపెట్టబడిన భూమిశిస్తు విధానం, వ్యవసాయానికి ఎక్కువ ప్రోత్సాహాన్నిచ్చింది. అతని పరిపాలనా కాలంలో ఆహారధాన్యాలు అతి చౌకగా లభ్యమయ్యాయి. ఆ కాలంలో, బార్లీ, గోధుమ, చెరకు, పప్పుధాన్యాలు, జొన్నలు, ప్రత్తి, నూనెగింజలు, నీలి ముఖ్యమైన పంటలు. 1604లో యూరోపియన్ వర్తకులు పొగాకును భారతదేశంలో ప్రవేశపెట్టారు. నాటినుండి, అది విస్తారంగా సాగుచేయబడింది. అక్బర్ కాలం తర్వాత అమీర్ల, జమీందార్ల, రాష్ట్ర పాలకుల నిరంకుశత్వంవల్ల, దుర్మార్గ స్వభావంవల్ల, సామాన్య మానవుడి జీవిత పరిస్థితులు నానాటికి దిగజారాయి. కొన్ని రాష్ట్రాలలో రైతులు, పనివారు క్రూరంగా అణగదొక్కబడ్డారని, ఫలితంగా వ్యవసాయం క్షీణించిందని షాజహాన్ కాలంలో భారతదేశాన్ని పర్యటించిన ఫ్రెంచి యాత్రికుడు బెర్నియర్ చెప్పాడు. షాజహాన్ పరిపాలనా కాలాంతానికి ఆకలి కడుపులతో

BRAOU

ఉన్నరైతులు పట్టణాలను, నగరాలను పోషించడానికై శ్రమించారు. మొత్తంమీద భారతదేశం వెండి, బంగారులకు బదులుగా ఉపయోగకరమైన సరకులను వదులుకొంది; మరో విధంగా చెప్పాలంటే రాళ్ళకోసమై తిండిని ధారపోసింది. ఋతువు నుంచి ఋతువుకు తీరని ఆకలితో ఉన్న స్త్రీ, పురుషులు, ఆహారం దొరికినంత కాలం తృప్తిపడి జీవించసాగారు. కాని, తరచూ జరిగినట్లు ఆ ఆహారం లభించనప్పుడు వీరికి బానిస వ్యాపారే శరణ్యమయ్యేవాడు; లేకపోతే నరమాంసభక్షణమో, ఆత్మహత్యో, ఆకలితో మాడి చావడమో మిగిలేది అని, మోర్‌లాండ్ పేర్కొన్నాడు. మొగల్ ప్రభుత్వంలో దేశ ఆర్థిక వనరుల అభివృద్ధి అసాధ్యమని బెర్నియర్ చెప్పాడు. ఔరంగజేబ్ సుదీర్ఘ పాలనలో పరిస్థితులు ఇంకా క్షీణించాయి. ఎడతెగని యుద్ధాలు, తిరుగుబాట్లు, రాజ్య ఆర్థిక అవసరాలు, చక్రవర్తుల, రాష్ట్ర పాలకుల ఆస్థాన వైభోగం వ్యవసాయంమీదా, పరిశ్రమలమీదా, వర్తకంమీదా, తీవ్ర ప్రభావాన్ని కనపరిచాయి. అయినప్పటికీ, సామాన్య ప్రజల జీవితం, ఢిల్లీ సల్తనత్ (1206-1526) కాలంలో కంటే మొగల్ సామ్రాజ్యంలో మెరుగుగా ఉండింది.

III మీ అవగాహన పరీక్షించుకోండి

1) భారతదేశంలో పాగాకు ఎప్పుడు ప్రవేశపెట్టబడింది?

.....

.....

.....

.....

2) మొగల్ సామ్రాజ్యంలో ముఖ్యమైన పరిశ్రమలేవి?

.....

.....

.....

.....

4.7 పరిశ్రమలు

మొగల్ పాలనలో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. పరిశ్రమలలో నేత పరిశ్రమ మొదటగా ఉండింది. ఆగ్రా, వారణాసి (బనారస్), పాట్నా, బుర్హాన్‌పూర్, బీదర్ మొదలుగా అనేక వస్త్ర ఉత్పత్తి కేంద్రాలు ఉండినాయి. సోనార్‌గామ్, ఢాకాలలో పట్టు పరిశ్రమ, లాహోర్‌లో శాలువల పరిశ్రమ ఉండినాయి. ముల్తాన్, ఫతేపూర్ సిక్రి తివాచీల తయారీకి పేరుమోశాయి. సియాల్‌కోటులో కాగితం ఉత్పత్తి అయ్యేది. సూరేకారం ఉత్పత్తికి బీహార్ ప్రసిద్ధిగా ఉండింది.

4.8 వర్తక, వాణిజ్యాలు

మొగలుల కాలంలో దేశీయ, విదేశీయ వాణిజ్యాలు ప్రోత్సాహాన్ని పొందాయి. దేశీయ వాణిజ్యాన్ని, దేశంలోని వాణిజ్య కులాలు చేస్తూ ఉండేవి. విదేశ వాణిజ్యం అరబ్బులు, పోర్చుగీసులు, ఫ్రెంచ్‌వారు, ఆంగ్లేయులు మొదలైన విదేశీయుల చేతిలో కేంద్రీకృతమైంది. దేశీయ వాణిజ్యం చాలావరకు నదులమీద పడవలలో జరిగేదని పీటర్‌మండీ అనే ఆంగ్ల యాత్రికుడు చెప్పాడు. సింధులో, కాంబేలో, సూరత్‌లో, బ్రోచ్‌లో, కొచ్చిన్‌లో, మచిలీపట్నంలో నౌకానిర్మాణ కేంద్రాలు ఉండినాయి. ఈ కేంద్రాలలో నిర్మించబడిన నౌకలు, ఇరవై అయిదు ఏనుగులను దాటించగలంత విశాలంగా, దృఢంగా ఉండేవి. భారతదేశం నుంచి మధ్య ఆసియాకు, కాందహార్, పర్షియాల మీదుగా భూమార్గం ఉండేది. యూరోపియన్ వర్తకులరాక, విదేశ వాణిజ్యాన్ని

BRAOU

బాగా పెంపొందించింది. నీలికి, ప్రత్తికి, ముడిపట్టుకు, క్యాలికో(క్యాలికట్ గుడ్డ)కు గిరాకీ హెచ్చింది. పదిహేడవ శతాబ్దంలో బీహార్ నుంచి తూర్పు తీరంనుంచి సురేకారం(పెట్లుప్పు) ప్రధానంగా ఎగుమతి చేయబడింది. డచ్చి వ్యాపారుల, ఆంగ్ల వర్తకులరాక ప్రధాన ఎగుమతి సరుకులైన నీలి, ప్రత్తి, క్యాలికో, పట్టు, సురేకారం ఉత్పత్తి చేసే ప్రాంతాలకు మేలు చేసింది. కాని, నౌకా నిర్మాణం దెబ్బతినింది. పదిహేడవ శతాబ్దాంతానికి 'టఫేటా' అనే సన్నని పట్టు వస్త్రాలు, బంగారు బుటేదారి పట్టూ ప్రధాన ఎగుమతులయ్యాయి. ఆంగ్లేయులకు పట్టు వస్త్రాలపై వున్న మోజువల్ల వాటి నేత, అద్దకం చాలా అభివృద్ధి చెందాయి. వస్త్ర పరిశ్రమకు బెంగాల్ ప్రసిద్ధి వహించింది. వెండి, బంగారం, రాగి, సీసం, మంచి ఉన్ని బట్టలు, సుగంధ ద్రవ్యాలు, మంచి పాగాకు, ద్రాక్షరసం, యూరప్ దేశంలోని కొన్ని వింతైన వస్తువులు, గుర్రాలు, అబిసీనియా దేశపు బానిసలు, ముఖ్యమైన దిగుమతులుగా ఉండినాయి. సింధులోని లాహోరీబందర్, కాంబే, బ్రోచ్, సూరత్, హుగ్లీ, మచిలీపట్నం, ఢాకాకు దగ్గరగా ఉన్న శ్రీపూర్ మొగల్ సామ్రాజ్యంలోని ప్రధాన రేవు పట్టణాలు.

వ్యవసాయ కూలీల మాదిరిగానే పారిశ్రామిక కార్మికులు కూడా తక్కువ వేతనాలతో నికృష్ట జీవన పరిస్థితులతో చాలా బాధ పడ్డారు. అధికారులు, అమీర్లు, పనివారిని తమ ఇండ్లలో పనిచేయడానికి బలవంతపెట్టి, వారి ఇష్టమొచ్చిన ప్రతిఫలం ముట్ట చేప్పేవారు. షాజహాన్ పరిపాలనా కాలాంతానికి *"తమ ఒంటిని కప్పుకోను గుడ్డలేని సాలెవారు ఇతరులకు బట్టలు తొడగడానికి శ్రమించేవారు"* అని తెలుస్తుంది.

4.9 సంపన్న నగరాలు

ఆ కాలంలోని ఆర్థికాభివృద్ధివల్ల ఆగ్రా, ఫతేపూర్‌సిక్రి, లాహోర్ వంటి సంపన్న నగరాలు అభివృద్ధి చెందాయి. రాల్ఫ్‌ఫిచ్ అనే ఆంగ్లేయ యాత్రికుడు ఆగ్రా, ఫతేపూర్‌సిక్రీలను రెండూ మహానగరాలనీ, రెండూ లండన్ నగరానికన్నా పెద్దవనీ, జనసమృద్ధి గలవనీ వర్ణించాడు. ఫాదర్ మాన్సరాట్ అనే జెసూట్ మత ప్రచారకుడు, లాహోర్ మహా నగరమని వర్ణించాడు. దక్కన్‌లోని అహమ్మద్ నగర్ సంపన్న స్థితిని గురించి అబుల్ ఫజల్ చెప్పి వున్నాడు.

4.10 క్షామాలు, ప్లేగు

సంపన్నమైన ఆర్థిక పరిస్థితి ఉండినప్పటికీ స్థానికంగా, దేశ వ్యాప్తంగా కరువు కాటకాలు వచ్చి రైతులు, సామాన్య ప్రజలు, చెప్పలేని బాధలు అనుభవించారు. 1555-56, 1595-98 కరువులలో, మనుషులు మనుషులనే తిన్నారని చెప్పబడింది. ఈ కాలంలోని ఘోరాలను, ఒక విధమైన 'ప్లేగు' వ్యాధి అధికం చేసింది. జహంగీర్ కాలంలో ఉత్తర భారతదేశంలో, పశ్చిమ భారతదేశంలో 'ప్లేగు' వ్యాధి వచ్చి ఎనిమిదేండ్లు ఉండింది. పైన పేర్కొన్నట్లు, షాజహాన్ పాలనా కాలంలో 1630-32 కరువులో, *"చివరకు ఎట్టి దుస్థితి ఏర్పడిందంటే మనుషులు ఒకరిని ఒకరు తినడం ప్రారంభించారు. పుత్రుని ప్రేమ కన్నా, అతని మాంసాన్ని కోరసాగారు"*. ఆంగ్ల యాత్రికుడు పీటర్ మండీ, ప్రభుత్వం ప్రజలకెట్టి సహాయం చేయలేదని రాశాడు. మొత్తం మీద కరువు కాటకాలలో, సంకట సమయాలలో, మొగల్ పాలకులు ప్రజల బాధను తీర్చడానికి ఏమీ చేయలేదని చెప్పవచ్చు.

4.11 సామాన్య ప్రజలు

మొగలుల కాలంలో సాధించిన ఆర్థికాభివృద్ధి ప్రయోజనాలు, కొంతైనా ప్రజలకు అందలేదు. *"పాలక వర్గంలో అధికులు భోగలాలసత్వంలో మునిగి ఉంటే ..... ప్రజలలో ప్రజా బాహుళ్యం, దుర్భర దారిద్ర్యంతో ఉండింది. భారతదేశ ఆర్థిక జీవనం ... చాలని ఉత్పత్తులు, అక్రమ సంపకం, మౌలిక లక్షణాలుగా ఉండింది"*. ఔరంగజేబ్ సుదీర్ఘ పాలనలో పరిస్థితులింకా దిగజారాయి. అతని మత ద్వేషం, ఎడతెగని యుద్ధాలు,

తిరుగుబాట్లు, రాజ్యావసరాలు, రాజస్థానం యొక్క భోగవిలాసాలు, వ్యవసాయానికి, పరిశ్రమలకు, వ్యాపారానికి కీడు చేసి, ఆర్థిక స్తోమతను నాశనం చేశాయి. ఔరంగజేబ్ తర్వాత వచ్చిన బలహీనులైన రాజుల కాలంలో, నాదిర్ షా, అహమ్మద్‌షా అబ్దాలీలు చేసిన దండయాత్రలు, పరిస్థితిని ఇంకా విషమింప చేశాయి.

IV మీ అవగాహన పరీక్షించుకోండి

1) మొగల్ సామ్రాజ్యంలోని ముఖ్యమైన రేవుపట్టణాలేవి?

.....

.....

.....

.....

2) మొగల్ సామ్రాజ్యంలో సంపద ఎక్కువగా వున్నప్పటికీ, సామాన్య ప్రజల పరిస్థితి ఎందుకు దీనంగా వుండింది?

.....

.....

.....

.....

4.12 సాంఘిక పరిస్థితులు

మొగల్ యుగం నాటి సాంఘిక పరిస్థితులను అర్థం చేసుకొనుటకు పనికి వచ్చు ఆధారములు తక్కువే. కాని సమకాలీన యూరోపియన్ యాత్రికుల రచనలు పర్షియన్ భాషలోను, దేశభాషల్లోను సమకాలీన రచయితలు పేర్కొన్న అంశాలు ఎంతో విలువైన సమాచారం ఇస్తున్నాయి.

మొగల్ యుగంనాటి సాంఘిక పరిస్థితులు అర్థం చేసుకోవాలంటే అనాటి జనాభా చిత్రణ కావాలె. 'ఐని అక్బరీ' లో ఇయ్యబడిన సమాచారం ఆధారంగా మోర్‌లాండ్, శ్రీన్‌మూస్వీ, అశోక్ విశాయ్‌లు అనాటి జనాభా సంఖ్యను వివరించేందుకు ప్రయత్నించారు. మొగల్ యుగంనాటి జనాభా 145 మిలియన్లు అని శ్రీన్‌మూస్వీ అభిప్రాయపడ్డారు.

మొగల్ యుగంనాటి సామాజిక వ్యవస్థ ఫ్యూడల్ సమాజంలా కనిపిస్తుందని ఆర్.సి.మజుందార్, రామ్‌చౌదరి, కె.కె. దత్తాలు రాశారు. అనాటి సమాజంలో అత్యున్నత స్థానం పాలకునిది కాగా, సామంతులు, ప్రభువులు రెండవ స్థానం ఆక్రమించగా, తక్కువ సంఖ్యలో మధ్యతరగతి వర్గం మూడవస్థానంలో కన్పిస్తారు. ఈ వర్గాలతో పోలిస్తే అధిక సంఖ్యాకులైన మిగిలిన వారు సామాజికంగా, ఆర్థికంగా హీన స్థితిలో కన్పిస్తారు. జీవన ప్రమాణంలో ఈ వర్గాల మధ్య తీవ్రమైన తేడా ఉంది. ప్రభువులు సుసంపన్నులై విలాసవంతమైన జీవితం గడపగా, మిగిలిన వారు నిండీనిండని కడుపులతో, అతి నిరాడంబరంగా జీవించారు. నగరాల్లో నివసించేవారి, గ్రామాల్లో నివసించేవారి జీవన ప్రమాణాల్లో కూడా ఎంతో వ్యత్యాసముంది.

అనాటి సామాజిక వ్యవస్థ ఖండాలుగా చీలిపోయింది. ఆ ఖండాలకు చెందినవారి మధ్య అసమానత్వం కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. పురుషులు గ్రామాల్లో తమ నడుంచుట్టూ మాత్రమే వస్త్రము ధరించేవారని బాబర్ పేర్కొన్నారు. స్త్రీలు సాధారణంగా నేత చీరెలు కట్టేవారు. రవికలు ధరించుటలో ప్రాంతీయమైన భేదాలు కన్పిస్తాయి. గ్రామాల్లో ధనవంతులు మాత్రమే పాదరక్షలు ధరించగా, సాధారణ ప్రజలు పాదరక్షలు ధరించటం

EGAOU

ఎప్పుడో కాని కన్పించదు. గ్రామాల్లోని ప్రజలు మట్టితో నిర్మించబడి, ఆకులతో కప్పబడిన ఒంటి గదిలో నివసించేవారు. ఇళ్ళకు వాడే వస్తువుల్లో ప్రాంతీయ భేదాలున్నాయి. సాధారణంగా ఇంట్లో ఉపయోగించే పాత్రలన్ని మట్టివే, కాకపోతే పెనం మాత్రం ఇనుముతో చేయబడింది ఉపయోగించారు. సాధారణ ప్రజలు ధాన్యం, పప్పు దినుసులు, కూరగాయలతో భోజనం చేసేవారు. మాంసంను పండుగలకు మాత్రమే తినేవారు.

భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోను, గ్రామాల్లోను ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఒక ముఖ్యమైన వ్యవస్థగా ప్రచారంలో వుంది. సాధారణంగా పితృస్వామిక వ్యవస్థే కుటుంబాల్లో వ్యవస్థను నడిపించాలి. కుటుంబ ఆస్తిని కుమారులు మాత్రమే పంచుకొన్నారు. అంతేగాక కుమారుడు జన్మించటాన్ని సంతోషంగా పండుగలా జరుపుకొన్నారు. గ్రామాల్లో వివాహ వ్యవస్థ ఒక ప్రధాన వ్యవస్థగా గుర్తించబడింది. బాల్యవివాహాలు సర్వసాధారణం. అబుల్‌ఫజల్ వ్రాతలవల్ల మగపిల్లవానికి 16 ఏళ్ళకు, ఆడపిల్లకు 14 ఏళ్ళకు వివాహం జరిపే వయస్సుగా అక్బర్ చేశాడని తెలుస్తుంది. కాని ఈ నిర్ణయం ఆచరణలోకి వచ్చిందో లేదో నిర్ధారణగా చెప్పలేం. హిందువుల్లోను, మహ్మదీయుల్లోను వరకట్న దురాచారం కలదు.

హిందువులు, మహ్మదీయులు తమ తమ పవిత్ర పండుగలను శ్రద్ధాభక్తులతో జరుపుకొనేవారు. అయితే హిందువులు, మహ్మదీయులు ఒకరి ప్రక్కన ఇంకొకరు కలసిమెలసి ఉండుటచే ఒకరి పండుగ మరొకరిని కూడా ప్రభావితం చేసిందని, అవిధంగానే హిందువుల శివరాత్రిని, మహమ్మదీయులు షబ్బెరాత్‌గా జరుపుకున్నారని కె.యమ్. అష్రాఫ్ అభిప్రాయం వెలిబుచ్చారు. హిందువులు, మహ్మదీయులు కూడ పండుగ సమయంలో టపాసులు పేల్చి, దీపాలతో ఇళ్ళను, మశీదులను అలంకరించేవారు. గ్రామీణులు నృత్యం చేసి, పాటలు పాడి తమ ఆనందమును పండుగల్లో వెలిబుచ్చారు.

1593నాటి తబకత్-ఇ-అక్బరి ప్రకారం ఆనాడు 120 పెద్ద నగరములు, 3200 చిన్న పట్టణాలున్నాయి. ఆనాడు నగరాల్లో నున్న జనాభా ఎంత వుందో కచ్చితంగా చెప్పలేం. అయితే ఇర్ఫాన్‌హబీబ్ లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో 1570 నగరాల్లో, పట్టణాల్లో జీవించారు. నగర, పట్టణ, గ్రామీణప్రాంతాల జీవన ప్రమాణంలో వ్యత్యాసాలు కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. కులీనులైన మహ్మదీయ స్త్రీలు పరదా విధానం పాటించగా, ఔహర్ సంప్రదాయంను రాజపుత్ర స్త్రీలు పాటించారు. చందేరి పాలకుడైన మేదినిరావు కుటుంబస్త్రీలు పాటించిన ఔహరును బాబర్ తన స్వీయ చరిత్రలో విపులంగా వర్ణించాడు.

ఉన్నత వర్గాలకు చెందిన హిందూ స్త్రీలు సహగమన సంప్రదాయం పాటించారు. బలవంతపు సహగమన సంప్రదాయమును ఆపుచేయుటకు అక్బర్ కొన్ని చర్యలు తీసుకున్నాడు. అక్బర్ స్వచ్ఛంద సహగమనమును అడ్డుకోలేదు. అక్బర్ హిందూ విధవలు వివాహం చేసుకొనుటకు 1587లో కొన్ని చర్యలను ప్రవేశపెట్టాడు. అక్బర్ స్వయంగా అక్షరజ్ఞానం కలవాడు కాకపోయినా స్త్రీ విద్యకు ప్రోత్సాహమివ్వటమేకాక, ఫతేపూర్‌సిక్రిలో ఆడపిల్లలకు పాఠశాలను స్థాపించాడు. ఆనాడు సామాన్య ప్రజానీకానికి, స్త్రీలకు విద్య అందని ద్రాక్ష పండే కాని ఉన్నత వర్గాల వారికి మాత్రమే అందుబాటులో వుంది. నల్లమందు తినటం, భంగు త్రాగటం, మత్తు పానీయాలు పుచ్చుకోవటం సర్వసాధారణం. వేశ్యావృత్తికి ఆదరణ ఎక్కువగా ఉంది. పేకాట, పాగాకు ఈకాలంలోనే ప్రవేశపెట్టబడ్డాయి. హిందూ, మహ్మదీయులు ఇరువురు మూఢనమ్మకాలు, జ్యోతిష్యశాస్త్రమును అభిమానించారు. మోర్‌లాండ్ అభిప్రాయం ప్రకారం మొగల్ యుగం ప్రత్యేక లక్షణం ఖర్చుపెట్టడం తప్ప ఆదాచేయటం కాదు. ప్యూడలిజం అవలక్షణాలన్ని ఈనాటి సమాజంలో చోటుచేసుకొన్నాయి.

4.13 అక్బర్ మత విధానం

మొదట్లో అక్బర్ సున్నీ ముస్లింగా పెంచబడ్డాడు. కాని, బహుశా బాల్యంలో కూడా అక్బర్ మతాచారాలను పూర్తిగా అనుసరించినట్లు లేదు. బాల్యంనుంచి పలువిధాలైన ప్రభావాలు మత విషయాల్లో అతని విశాల

భావాలకు కారణమై వుండవచ్చు. ఒక పర్షియన్ విద్వాంసుని కూతురైన అక్బర్ తల్లి, హమీదాబానూ బేగం, అతని సంరక్షకుడు బైరంఖాన్, షియా ముస్లిమ్‌లు; వారు అతనికి మత సహనం బోధించారు. అతని చిన్నప్పటి గురువైన అబ్దుల్ లతీఫ్, **"విశ్వశాంతి" (సులహెకుల్)** అనే గొప్ప సిద్ధాంతాన్ని అతనికి ఉపదేశించాడు. అక్బర్ ఆస్థానాన్ని అలంకరించిన షేక్‌ముబారక్, అతని కుమారులైన అబుల్ ఫజల్, ఫైజీ సూఫీమతాన్ని అనుసరించినవారు; వీరు అక్బర్‌కు అతి సన్నిహిత మిత్రులు. వారి సాంగత్యం అక్బర్ మత విశ్వాసాలను ప్రభావితం చేసింది. సూఫీమతంలో హిందూవేదాంత మూలసూత్రాలు ఉన్నాయి. అబుల్ ఫజల్ సహాయంతోనే, అక్బర్ తన నూతన మతమైన **దీన్-ఇ-ఇలాహిని** ప్రారంభించాడు. అక్బర్ రామాయణ మహాభారతాలను, భగవద్గీతను, ఫార్సీ భాషలోకి అనువదింప చేశాడు. అతని హిందూ భార్యలు, హిందూ రాజోద్యోగులు, స్నేహితులు, అతని మతాభిప్రాయాలను చాలా ప్రభావితం చేసి ఉండాలి; ఫలితంగా అతడు హిందూ మతంలోని మంచి విషయాలను గ్రహించసాగాడు. వివిధ మత సిద్ధాంతాలలో అక్బర్ ఆసక్తి కనపరచి, మత చర్చలు, వాదోపవాదాలు, అభిమానించాడు. 1575లో అతడు ఫతేపూర్‌సిక్రిలో **ఇబాదత్‌ఖానా** (ఆరాధనా గృహం)ను నిర్మించాడు. అచట వివిధ మతానుయాయుల మధ్య చర్చలు, వాద ప్రతివాదాలు జరిగేవి. ఈ చర్చలు, వాద ప్రతివాదాలు అక్బర్ మతాభిప్రాయాలను చాలా ప్రభావితం చేశాయి. అన్నిటినీ మించి, దౌర్జన్య పూరితులైన అతని ముస్లిం అమీరులతో అతని తొలినాటి కష్టాలు, హిందూ ప్రజలతో సామరస్యంగా ఉండవలసిన అవసరాన్ని అతని మనసుకుతెచ్చి ఉండవచ్చు. కాని "అతని జీవితం మీద ప్రభావాలెన్ని ఉన్నప్పటికీ, మొత్తం మీద అతని మత విధానం, వాస్తవంగా అతని ప్రతిభాముద్రితమైన అతని సొంత సృష్టే" (సత్యనాధఅయ్యర్).

1579 వరకు అక్బర్, ఆచారపరుడైన ఒక ముస్లిం చేయవలసిన కర్మలన్నిటినీ చేస్తుండిన విశ్వాసపూరితుడైన సున్నీముస్లింగా ఉండినాడు. మొదట్లో ఇస్లాం మత సంబంధమైన చర్చలు, వాద ప్రతివాదాలు చేయటానికే ఇబాదత్‌ఖానాను 1575లో నిర్మించాడు. తర్వాత ఈ చర్చలలో ఇతర మత సంప్రదాయాలను చేర్చడం జరిగింది. దీనివల్ల ఇస్లాంలో అతని విశ్వాసం సన్నగిల్లి, డలసాగింది. ఇంతకంటే ముందు 1562లో రాజపుత్ర స్త్రీలతో అతని వివాహం జరిగిన తర్వాత "విశ్వశాంతి" సిద్ధాంతంలో అతనికి గల విశ్వాసంవల్ల, హిందూ ప్రజలను ప్రోత్సహించే విధానాన్ని అతడు సాహసంతో రూపొందించాడు. 1563లో హిందూ యాత్రికుల మీద పన్నును రద్దు చేశాడు. 1564లో హిందువులు మిక్కిలిగా ఏవగించుకున్న జిజియా పన్నును రద్దు చేశాడు.

1579లో అక్బర్ ఒక అపూర్వమైన పనిచేశాడు; అతడు సిక్రీలోని మసీదులో మత ప్రవచనం చేసి, **'అల్లాహో అక్బర్'** అనే మకుటంతో ఫైజీ రచించిన మత శ్లోకాలను పఠించాడు. **"అల్లాహో అక్బర్"** అంటే "దేవుడు దయామయుడు" అని ఒక అర్థం; **"అక్బరే దేవుడ"**ని మరొక అర్థం. ఆ సంవత్సరమే సెప్టెంబర్‌లో, అక్బర్ మత విషయాలలో చక్రవర్తిని సర్వాధికారిని చేస్తూ "అమోఘత్వ ప్రకటన" (Infallibility Decree)ను జారీ చేశాడు. దీనివల్ల అక్బర్ 'మతాధిపతి మరియు రాజ్యాధిపతి' అయ్యాడు. అతడు 1580, 1582 మధ్య జెస్యూట్ మత గురువులతో, జైన మునులతో చర్చలు జరిపాడు. దీనికంతా ఫలితం 1582లో, అక్బర్ కాబూల్ నుంచి విజయంతో తిరిగి వచ్చిన తర్వాత **"దీన్-ఇ-ఇలాహి"** (దివ్యమతం) అనే నూతన మతాన్ని, తాను రూపొందించిన దానిని ప్రారంభించాడు. **దీన్-ఇ-ఇలాహికి** ప్రధాన మతాచార్యులు అబుల్ ఫజల్.

దీన్-ఇ-ఇలాహిలో అక్బర్ హిందూమతం, ఇస్లాం, జొరాస్ట్రియన్ మతం, క్రైస్తవ మతం మొదలుగా వివిధ మతాలలోని మంచి విషయాలను చేర్చాడు. అతని మతంలోని ప్రధానాంశాలు; దేవుడు ఒకడే; అక్బర్ అతని ఖలీఫా లేదా ప్రతినిధి. మూఢ విశ్వాసం మతం కాదు; మానవుడు తన మేధస్సును ఉపయోగించాలి. ప్రతి ఉదయం చక్రవర్తి సూర్యుని పూజించేవాడు; అతని అనుయాయులు సూర్యునికి సాగిలపడి నమస్కరించేవారు. మతంలోని ప్రతి సభ్యుడు తన పుట్టిన రోజున విందు చేయాలి. మాంసాహారం నిషేధింపబడింది. ఎవరిని కాని ఈ మతంలోనికి మార్చడానికి, అక్బర్ తన అధికారాన్ని, ప్రతిష్టను వినియోగించలేదు. అతని సన్నిహిత మిత్రులలో, రాజోద్యోగులలో మాన్‌సింగ్ ఈ మతాన్ని అనుసరించడానికి బొత్తిగా నిరాకరించాడు. చాల కొద్దిమంది ఈ మతాన్ని స్వీకరించారు.

BRAOU

అక్బర్ మరణంతో ఈ మతం కూడా అంతమైంది. కొంతమంది ఉద్దేశంలో, రాజకీయ వ్యవస్థగా **దీన్-ఇ-ఇలాహి** అక్బర్ ఆశయాలను సంపూర్ణంగా నెరవేర్చింది; మరికొందరు, *"అది హాస్యాస్పదమైన అహంకార ఫలితం; అదుపులేని నిరంకుశాధికార వికృతోత్పత్తి.....దీన్-ఇ-ఇలాహి అక్బర్ అవిజ్ఞతను తెల్పేదేకాని, విజ్ఞతను తెల్పేది కాదు"* అని విమర్శించారు. నూతన మత స్థాపకుడుగా అక్బర్‌ను గూర్చి ఎవరి అభిప్రాయమెట్లున్నా అతడు దైవంలో చెదరని విశ్వాసంగల యదార్థ ఆధ్యాత్మిక వాది అనే విషయాన్ని కాదనలేం.

అక్బర్ గోవులను చంపరాదనీ, గడ్డం పెంచరాదనీ, **హజ్**(మక్కా) యాత్రలు చేయరాదనీ, రంజాన్ ఉపవాసాలుండరాదనీ, మొదలుగా ముస్లింలకు చిరాకు కలిగించే కొన్ని శాసనాలు చేసినాడని, విమర్శకు లోనయ్యాడు(బదౌని). అక్బర్ శీలంలోని ప్రత్యేకత, అతనికి మత దురభిమానం లేదు; అతడు హిందువులు కానీ ముస్లింలు కానీ మరే మతానికి చెందిన వారైనా కానీ భారతదేశ ప్రజలంతా తాము ఒకే దేశానికి, ఒకే జాతికి, ఒకే సంస్కృతికి, ఒకే ప్రజాసముదాయానికి చెందిన వారమని భావించేటట్లు చేయాలనే అక్బర్ ఆశయానికి ప్రతి రూపమైనదే **దీన్-ఇ-ఇలాహి**. ఒక జాతీయ మతాన్ని రూపొందించి, దాని ద్వారా అతడు జాతీయ రాజ్యాన్ని భారత జాతీయ ఐక్యతను పెంపొందింప దలచాడు.

4.13.1 అక్బర్ వారసుల మత విధానం

అక్బర్ సర్వమానవ మత సామరస్య విధానాన్ని, జహంగీర్ భంగపరచలేదు. కాని, షాజహాన్ సామ్రాజ్యంలో కొత్తగా హిందూ దేవాలయాలు నిర్మించరాదని శాసించి, అంతకుముందున్న మత విధానాన్ని తారుమారు చేశాడు. అతని కాలంలో వారణాసి (బనారస్) జిల్లాలో డెబ్భై ఆరు దేవాలయాలు నాశనం చేయబడినాయని చెప్పబడింది. ఔరంగజేబ్ పరిపాలనా కాలంలో బహిరంగంగా హిందువులకు, హిందూ మతానికి ప్రతికూల విధానం అనుసరించబడింది. అతడు కాశీవిశ్వనాథాలయం, మథుర కేశవాలయంతో సహా అనేక హిందూ దేవాలయాలను కూలదోశాడు. హిందువులకు ప్రభుత్వోద్యోగాల్లో ప్రవేశం లేకుండా చేశాడు. వారు పల్లకీలలో, అరేబియా గుర్రాల మీద పోవడం నేరంగా ప్రకటించాడు. 1679లో హిందువులు అసహ్యించుకునే జిజియా పన్నును మరల విధించాడు. ఔరంగజేబ్ షియా తెగను కూడా ద్వేషించాడు. దక్కన్ ముస్లిం రాజ్యాలను అతడు నాశనంచేయడానికి ఒక కారణం, వారి పరిపాలకులు షియాలు కావడం, వారి మంత్రులు హిందువులు కావడం. అక్బర్ చేసిన మంచి పనిని చాలా వరకు అతడు వమ్ము చేశాడు. అతని మతదురభిమానంవల్ల ఔరంగజేబ్ శిక్కులను, మహారాష్ట్రులను, జాట్‌లను, సత్నామీలను కూడా దూరం చేసుకొన్నాడు.

4.14 భక్తి ఉద్యమం

భక్తి అనగా ఇష్టదైవం యెడల గాఢమైన అనురాగం. అది ముక్తిని సాధించుటకు ఒక మార్గం. భక్తులు వర్ణభేదాలను, జన్మ భేదాలను పాటించరు. వారు ఈశ్వరుని ఏకత్వాన్ని, మానవుల సమానత్వాన్ని, నమ్ముతారు; వారు మూఢాచారాలను, కర్మలను ప్రతిఘటించారు. వారు తమ ఇష్టదైవాన్ని ఆనంద పరవశంతో కూడిన నాట్య, సంగీతాలతో, భక్తి గీతాలతో కొలిచి, దైవభక్తి ప్రపత్తులే మోక్షమివ్వగలవని నమ్మారు.

4.14.1 కారణాలు

హిందువులలో ఈ భక్తి సిద్ధాంతం అతి ప్రాచీనం. దీనిని ఉపనిషత్తులలో, భగవద్గీతలో చూడవచ్చు. కాని, భక్తి ఉద్యమం, ఉత్తర భారతదేశంలో 15, 16 శతాబ్దాలలో మిక్కిలి శక్తివంతంగా ఉద్ధరింపబడింది. దీనికి కారణాలు;

BRAOU

1) హిందూ మతంలో అనేక దురాచారాలు చోటు చేసుకొన్నాయి. విగ్రహారాధన, అస్పృశ్యత, వర్ణభేదాలు, పనికిమాలిన ఆచారాలు అధికమయ్యాయి. చాలామంది హిందూ మత సంస్కారాన్ని వాంఛించారు.

2) ఇస్లాం మత ప్రభావంవల్ల, మతాచార్యులనేకులు దేవుని ఏకత్వాన్ని, మానవుల భ్రాతృత్వాన్ని ప్రచారం చేయడానికి ముందుకొచ్చారు.

4.14.2 భక్తి ఉద్యమ నాయకులు :

ఈ కాలంలోని భక్తి ఉద్యమ ఆచార్యులలో ఈ క్రింది వారు ముఖ్యమైనవారు.

4.14.2.1 రామానుజాచార్యులు

రామానుజాచార్యులు పండ్రెండవ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో ఉండినారు. అతడు మద్రాసువద్ద శ్రీపెరుంబుదూరు అనే గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. వారి యౌవనం కాంచీపురంలో గడచింది. అతడు దక్షిణ భారతదేశంలో వైష్ణవ మతాన్ని ప్రచారంచేసి, భక్తి ఒక్కటే ముక్తికి మార్గమని చాటారు. రామానుజాచార్యులు బోధించిన విశిష్టాద్వైతం ప్రసిద్ధి కెక్కింది. అతను వైదిక సంప్రదాయాల్ని భక్తి సిద్ధాంతంతో జోడించడానికి ప్రయత్నించాడు. జ్ఞానమార్గం కంటే భక్తి మార్గం గొప్పదని అతను బోధించాడు. కులాలతో ప్రమేయం లేకుండా, భక్తి మార్గాన్ని అందరూ అనుసరించవచ్చని రామానుజులు బోధించాడు. రామానుజునితో ప్రారంభమైన సంప్రదాయం, ఉత్తరదేశంలో రామానందుడు, వల్లభాచార్యులు కొనసాగించారు. దక్షిణ ప్రాంతంలో ఆపనిని మధ్వాచార్యులు కొనసాగించారు.

4.14.2.2 రామానందుడు

రామానందుడు పద్నాల్గవ శతాబ్దంలో ఉండినాడు. అతడు అలహాబాదులో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతడి జీవితం చాలా వరకు కాశీలో గడిచింది. అతని ద్వారా భక్తి ఉద్యమం, ఉత్తర భారతదేశ ప్రజలతో వ్యాప్తి చెందింది. అతడు హిందీ భాషలో ప్రచారం చేసిన మొదటి హిందూ సంస్కర్త.

రామానందుడు దేవున్ని అనురాగ భరితుడైన తండ్రిగా భావించి, అతనిని రాముడనే పేరుతో ఆరాధించాడు. అతని అనుయాయులు చాలామంది ఉండినారు. అతని శిష్యులు తక్కువ, ఎక్కువ భేదాలులేక అన్ని కులాల నుంచి ఉండినారు. అతని శిష్యులలో విఖ్యాతుడైన కబీర్, వృత్తిచే సాలెవాడు.

V మీ అవగాహన పరీక్షించుకోండి

1) అక్బర్, దీన్-ఇ-ఇలాహి ఎందుకు ప్రారంభించినాడు?

.....

.....

.....

.....

2) సిక్కులు, మహారాష్ట్రులు, జాట్లు, సత్నామీలు, ఔరంగజేబు కాలంలో ఎందుకు తిరుగుబాటు చేసినారు?

.....

.....

.....

.....

BRAOU

4.14.2.3 కబీర్

కబీర్ 15వ శతాబ్దంలో జన్మించాడు. అతని పుట్టుకను గూర్చి వివిధమైన కథలున్నాయి. అతడొక బ్రాహ్మణ వితంతువుకు జన్మించాడని, నీరూ అనే ముస్లిం సాలెవాని చేత, అతని భార్య నీమా చేత పెంచబడ్డాడని కొందరు చెప్తారు. మరికొందరు అతడు ముస్లింగానే పుట్టాడని, కాని హిందూ ప్రాపకంలో పెరిగాడని చెప్తారు. ఏమైనా, అతడు వృత్తిచేత సాలెవాడై, రామానందుని శిష్యులలో మిక్కిలి పేరు గన్నవాడు. అతడు లాయ్ అనే ఆమెను పెండ్లాడాడు; ఆమె అతనికి, అతని ప్రచారంలో చాలా సహాయంగా ఉండింది.

కబీర్ ఎక్కువగా బెంగాల్, బీహార్లలో ప్రచారం చేశాడు. అతడు వర్ణభేదాన్ని, బ్రాహ్మణాధిక్యతను, తీర్థయాత్రలను, విగ్రహారాధనను తీవ్రంగా నిరసించాడు. **'అల్లా'** (దేవుడు) అంతటా ఒకడేనని, ఈశ్వరుడు సర్వవ్యాప్తి అని అతడు ప్రబోధించాడు. హిందువులు, ముస్లిములు సోదరులవలె బ్రతికి, సత్య ధర్మాలతో వినయవంతమైన జీవితాలను గడపమని కోరాడు. హిందూ, ముస్లిములు కూడా అతని శిష్యులైనారు; వారిని ఒకరి నొకరికి సన్నిహితం చేయడానికతడు చాలా కృషి చేశాడు. **'దోహా'**లన బడే అతని భక్తి గీతాలు, వాటికి గల ప్రత్యేకమైన ఆకర్షణతో, ఉత్తర భారతదేశమంతా సుప్రసిద్ధమైనాయి. అతడు సికందర్ లోడి కాలం(1489-1517)లో ఉండి, మఘర్ అనే చోట మరణించాడు.

4.14.2.4 గురునానక్

గురునానక్ షేఖపురా జిల్లాలోని తల్వండీ(దీని ఇప్పటి పేరు నన్‌కానా సాహిబ్)లో జన్మించాడు. నానక్ తండ్రి పేరు కతా. కతా గ్రామ పట్వారీగా ఉండి, ఒక చిన్న అంగడి కూడా నడుపుతుండేవాడు. ముప్పై ఏండ్ల వయస్సులో నానక్ సాధువై, తన భక్తి మతాన్ని ప్రచారం చేస్తు భారతదేశమంతా పర్యటించాడు.

నానక్ బోధనలు కబీర్ బోధనలవలనే ఉండేవి. అతడు దైవ ఏకత్వాన్ని ప్రచారం చేశాడు; దేవుడు సత్య స్వరూపుడని, ఆ సత్యస్వరూపుని ఆరాధించడానికి గురువు అవసరమని చెప్పాడు. వర్ణ వ్యవస్థను విగ్రహారాధనను, బ్రాహ్మణాధిక్యతను, మూఢ నమ్మకాలను, అర్థం లేని కర్మకాండను, నానక్ నిరసించాడు. అతడు సత్కార్యాలు చేయడం, దైవభక్తి ప్రధానమని ప్రబోధించినాడు. అతని అనుచరులు 'శిక్కుల'ని పిలువబడ్డారు. నానక్ తర్వాత వరుసగా తొమ్మిది మంది శిక్కుగురువులు వచ్చారు.

నానక్ తన జీవిత చరమ దశలో కర్తార్‌పూర్ (ఇప్పటి పాకిస్తాన్‌లోని దేరా బాబా నానక్)లో స్థిరపడి, 1539లో తన, డెబ్భైవ ఏట అచటనే మరణించాడు.

4.14.2.5 చైతన్యుడు

చైతన్య మహాప్రభువు నాడియా (బెంగాల్) గ్రామంలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో, 1485లో జన్మించాడు. అతని మొదటి పేరు విశ్వంభరుడు. అతడు బాగా చదివిన వాడు. అతడు తన ఇరవై నాల్గవ ఏట, సంసారాన్ని వదలి సన్యాసి అయినాడు. శ్రీకృష్ణునికి పరమ భక్తుడైన అతడు, కృష్ణుని యెడల భక్తి ప్రపత్తులను ప్రబోధించాడు.

చైతన్యుడు పద్ధెనిమిదేండ్లు పురిస్సాలో గడిపాడు; ఆరేండ్లు బృందావనం, గౌర్, మరికొన్ని చోట్ల గడిపాడు. ఇట్లు అతడు భక్తివాదాన్ని సుమారు ఇరవైఅయిదేండ్లు ప్రచారం చేశాడు. అతని అనుచరులు నేటికి బెంగాల్‌లో, చివరకు పంజాబ్‌లో కూడా కనపడతారు. వారు తాము కృష్ణుని యొక్క గోపికలమని చెప్పుకొని కృష్ణుని నాట్య, సంగీతాలతో ఆరాధిస్తారు. చైతన్యస్వామి శిష్యులు అన్ని వర్ణాల నుంచి వచ్చారు. వారిలో ఒక ముస్లిం కూడా ఉన్నాడు. చైతన్యుడు 1533లో తన 48వ ఏట మరణించాడు. అతని పేరు బెంగాల్ ప్రజలలో బాగా వ్యాప్తిలో ఉంది. శ్రీకృష్ణుని అవతారంగా అతడు కొన్ని లక్షల ప్రజలచే పూజింపబడుతున్నాడు.

© BRAOU

4.14.2.6 వల్లభాచార్యుడు, 1479-1531

వల్లభాచార్యుడు ఆంధ్ర దేశానికి చెందినవాడు. అతడు కృష్ణ దేవరాయల ఆస్థానాన్ని దర్శించి, ఉత్తర భారత దేశంలోని మథుర, మరి ఇతర ప్రదేశాలు పర్యటించాడు. అతడు వారణాసిలో తన నివాస మేర్పరచుకొని బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు భాష్యం రాశాడు. అతడు బోధించిన తత్వానికి శుద్ధాద్వైతమని పేరు. ఆతడు జీవాత్మ, పరమాత్మ (బ్రహ్మన్)ల మధ్య అభేదతను బోధించాడు, ఆ రెండు వేరు వేరుగాక ఒకటే అన్నాడు. అతడు కృష్ణ భక్తినీ, వైవాహిక సుఖాల మీద విరక్తినీ ప్రబోధించాడు. అతడు బోధించిన 'సృష్టిమార్గం' తరువాతి కాలంలో కృష్ణుని క్రీడల ననుకరిస్తూ, ఇంద్రియ భోగలాలసత్వానికి ఆమోదంగా అర్థం కల్పింప బడింది. ప్రపంచములోని దుఃఖానుభవం ఆధ్యాత్మిక ఆనందాన్నిస్తుందని చెప్పడం అసమంజసమని చెప్పి, భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో, రాధాకృష్ణమతం, నీతి బాహ్యమైన విధంగా, ఆచరణలోకి వచ్చింది. గురు-శిష్య సంబంధం నైతికంగా పతనమై ప్రేమ, భక్తి సిద్ధాంతం, నీతికి మానమర్యాదలకు విరుద్ధంగా వక్రీకరింపబడింది.

4.14.2.7 వేమన

వేమన ఏకాలానికి చెందినవాడని చెప్పడంలో అభిప్రాయభేదాలు ఉన్నాయి. అయినా, అతడు పదిహేనవ శతాబ్దానికి కాక, పదహారవ శతాబ్దానికి చెందినవాడని పండితుల అభిప్రాయం. అతడు ఆంధ్రదేశంలోని నీతిప్రబోధకులలో మిక్కిలి గొప్పవాడు. అతని పద్యాలు ప్రజలలో బాగా వ్యాప్తిపొందాయి. అతడు అర్థంలేని పాత సంప్రదాయాలను, విగ్రహారాధనను, నిరసించాడు. సులభశైలిలో హాస్య, వ్యంగ్య ధోరణిలో, తన పద్యాలలో మూఢ నమ్మకాలను, సాంఘిక దురాచారాలను వేమన ఖండించాడు. అంటరానితనాన్ని అతను వ్యతిరేకించాడు. మానవత్వం, వేమన బోధనలలో ముఖ్యాంశము. మధ్య యుగంనాటి, కబీర్ తదితర భక్తి మార్గ కవులవలె వేమన, దేవుడొక్కడే అన్న సిద్ధాంతాన్ని విశ్వసించాడు. మానవ సౌభ్రాతృత్వంలో కూడా అతనికి అచంచల విశ్వాసం వుండింది. అయితే వేమనకు స్త్రీలను గురించి కొన్ని దురభిప్రాయాలుండేవి. స్త్రీలు నమ్మదగిన వారుకారని, అనేక పాపాలకు వారే కారకులని అతను వ్రాశాడు.

4.14.2.8 తులసీదాసు, 1532-1623

'రామచరితమానస్' గ్రంథరచయితైన తులసీదాస్ బ్రాహ్మణుడు; యమునా నదీ తీరంలో ఒకచోట జన్మించాడు. ఆతని మహా గ్రంథం 'రామచరిత్ మానస్'ను 1575 ప్రాంతంలో హిందీ భాషలో రచించాడు. అతడు రామునికి మహాభక్తుడు. అతనికి అక్బర్ ఆస్థానంతో సంబంధం లేదు; అతనికి జహంగీర్‌తో పరిచయం ఉంది. అతని జీవితం ఉన్నతమైన ధర్మప్రవృత్తితో కూడిన భక్తి ప్రచారానికి అంకితమైంది; కాని, అతడు తనదైన మత సంప్రదాయమేదీ స్థాపించలేదు. అతడు అద్వైతాన్ని అనుసరించాడు. *'హిందూస్థానంలో ప్రజలలో అధికులకు, చదువుకొన్నవారికి, చదువుకోని వారికి, అతని రామాయణమొక్కటే నీతికి ఆదర్శం'* (గ్రియర్సన్)

4.14.2.9 తుకారాం

1600 ప్రాంతంలో జన్మించిన తుకారాం పరిశుద్ధ హృదయం, నైతిక ఔన్నత్యం, భక్తికి సాధనాలని వక్కాణించాడు. అతడు **"మరాఠా కబీర్"** అని పిలువబడ్డాడు. అతడు మతంలో హేతువాద దృష్టిని, నైతిక ప్రవర్తనను ప్రబోధించాడు, విగ్రహారాధనను, అద్వైతాన్ని నిరసించాడు. "మానవ జీవిత క్షణభంగురత్వాన్ని, ఇంద్రియాలను తృప్తి పరచుటలో గల చెడును, సన్యాస జీవితంలోని వైభవాన్ని" సరళంగా, హృదయానికి హత్తుకొనేటట్లు, కరుణ రసంతో నిండిన, 'అభంగము'లనే అతని ఛందోబద్ధ పద్యాలు శివాజీని మిక్కిలిగా ఆకర్షించాయి.

4.14.3 భక్తి ఉద్యమ ఫలితాలు

"ఇస్లాంలోని ఏకేశ్వరోపాసన, సమానత్వం ప్రాతిపదికగా హిందూ మతానికిచ్చిన నూతన వ్యాఖ్యానమే భక్తి ఉద్యమం; కాని, దాని మత సిద్ధాంతం ప్రపత్తి, భగవంతునికి శరణాగతి ప్రబోధం చేసిన భగవద్గీతకు

చెందుతుంది" అని, కె.యం. పణిక్కర్ అన్నారు. భక్తి ఉద్యమ ముఖ్య ఫలితాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు. 1) ఈ ఉద్యమం వర్ణభేదాలను, జన్మభేదాలను తగ్గించింది. 2) తక్కువజాతి ప్రజలు కూడా ఆత్మగౌరవాన్ని పొందగలిగారు 3) బ్రాహ్మణాధిక్యత, పూజారుల పెత్తనం బలహీన మయ్యాయి; 4) ఈ సంస్కర్తలంతా దేశ భాషలలో బోధించారు. ఇది దేశభాషాభివృద్ధికి ప్రోత్సాహం కల్పించింది. 5) ఈ ఉద్యమం హిందూ, ముస్లిం సంబంధాలలోని వైషమ్యాన్ని తగ్గించి, వారిద్దరూ కలసిమెలసి ఉండేటట్లు చేసింది. 6) ఇస్లాంమతానికి మార్పిడి తగ్గిపోయింది; ఎందువల్లనగా, ఇస్లాంమతంలోని మంచి విషయాలు హిందూమత ధర్మాలుగా బోధించారు.

4.15 సాహిత్యం, కళలు

ఢిల్లీ సల్తనత్ రాజులలో చాలామంది వలె, మొగల్ చక్రవర్తులు తమ కార్యక్రమాలను, శాంతి భద్రతల రక్షణకు, పన్ను వసూళ్ళకు మాత్రమే పరిమితి చేసుకోలేదు. సంస్కృతీ రాజ్య లక్షణాలైన కొన్ని కార్యక్రమాలను వారు చేపట్టారు; వాటిలో సారస్వతాన్ని, కళలను పెంపొందించి, అందించడం ఒకటి.

4.15.1 సాహిత్యం

మొగల్ రాజులలో మొదటివాడైన బాబర్ గొప్ప సంగీతజ్ఞుడు; ప్రకృతిని ప్రేమించినవాడు. అతడు తుర్కీభాషలో, ఫారసీ భాషలో గొప్పకవి. అతడు గేయాత్మకమైన **'దివాన్-ఇ-బాబర్'** అనే రచన చేశాడు. అతని స్వీయ జీవితగాథ అయిన **'బాబర్‌నామా'**ను బట్టి, అతడు తుర్కీభాషలో గొప్ప గద్య రచయిత అని తెలుస్తుంది. హుమాయూన్ సంస్కారవంతుడు; కవిత్వాన్ని అభిమానించినవాడు. గణిత, ఖగోళ, జ్యోతిష శాస్త్రాలను అభ్యసించినవాడు.

సుదీర్ఘం, విజయవంతం, సంపన్నవంతమై అక్బర్ పరిపాలనా కాలం సారస్వతం, కళల అభివృద్ధికి అనుకూలంగా ఉండింది. సక్రమమైన విద్యలేని అక్బర్, తాను చదువనూ వ్రాయనూ నేర్చుకోకపోయినా, వేదాంతం, చరిత్ర, కవిత్వం మున్నగు అనేక విషయాలమీద గ్రంథాలను చదివించుకొని విని, దానితో చక్కని విషయపరిజ్ఞానాన్ని సంతరించుకొనేవాడు. అతనికి 2400 వ్రాత ప్రతులతో కూడిన చక్కని గ్రంథాలయం ఉండేది. అతడు సాహిత్యపరమైన విషయాల, మరి ఇతరంగా గూఢార్థమైన విషయాల చర్చలలో ఉత్సాహంగా పాల్గొన గలిగేవాడు. సారస్వతం, కళలు అక్బర్ నుంచి విషయ వివేచనతో కూడిన ఆదరణను పొందాయి.

అక్బర్ పరిపాలనాకాలంలో అబుల్ ఫజల్, నిజాముద్దీన్, బదౌనీ, మరి ఇతరులు ముఖ్యమైన చరిత్ర గ్రంథాలను వ్రాశారు. ఏడేళ్ళకృషి ఫలితంగా అబుల్ ఫజల్ సంతరించిన **'ఐనీ అక్బరీ'**, నాటి సామ్రాజ్యాన్ని గూర్చి అద్భుతమైన పరిశీలనను అందిస్తుంది. అతనిదే ముఖ్యమైన మరోగ్రంథం అక్బర్ చరిత్ర. అబుల్ ఫజల్ 'కవిరాజు' అని కూడా పిలవబడ్డాడు. నిజాముద్దీన్ అహమ్మద్ **'తబకాత్-ఇ-అక్బర్'** అనే చరిత్ర గ్రంథాన్ని రచించాడు. బదౌని **'తారీఖుల్ బదౌనీ'** అనే చరిత్ర గ్రంథాన్ని రచించాడు. బాబర్ కుమార్తె అయిన గుల్ బదన్ బేగం, అక్బర్ సూచనపై, **'హుమాయూన్‌నామా'**ను రచించింది. అక్బర్ ప్రోత్సాహంతో, కొన్ని ముఖ్యమైన గొప్ప సంస్కృత రచనలు ఫార్సీ భాషలోకి అనువదింపబడ్డాయి. బదౌనీ రామాయణ, మహాభారతాలను అనువదించాడు; ఇబ్రహీం సర్ హింది, అధర్వ వేదాన్ని అనువదించాడు. గణితశాస్త్ర గ్రంథమైన **'లీలావతి'**ని ఫైజీ అనువదించాడు. బాబర్ జీవితచరిత్ర **'బాబర్‌నామా'** కూడా తుర్కీ నుంచి ఫారసీలోనికి అనువదింపబడింది. అబుల్ ఫజల్, ఫైజీ అక్బర్ ఆస్థానాన్ని అలంకరించిన గొప్ప ఫారసీ కవులు.

హిందీ కవులైన గంగాకవి, తాన్‌సేన్ (ఇతడు గాయకుడు కూడా), కేశవదాస్ అక్బర్ ఆస్థానంలో వర్ధిల్లారు. అక్బర్ వద్ద రాజోద్యోగులు, సైన్యాధ్యక్షులైన అబ్దుల్ రహమాన్, మాన్‌సింగ్, భగవాన్ దాస్, బీర్‌బల్ స్వయంగా హిందీలో మంచి కవులు. కాని, ఈ యుగంలోని హిందీ కవులలో మిక్కిలి గొప్పవాడు, **'రామచరిత**

మానస్' అనే పేరుతో హిందీ రామాయణాన్ని రచించిన **తులసీదాస్**. అది తూర్పు హిందీ భాషల్లో వ్రాయబడింది. అది "నిస్సందేహంగా, ప్రపంచ సారస్వతపు అత్యుత్తమ కావ్య గ్రంథాలలో గణింప దగ్గదని" కీ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. తులసీదాస్ ఆయుగమందలి మహాపురుషుడని, అతడు అక్బర్‌కన్నా గొప్పవాడని స్మిత్ చెప్పాడు. **"సూర్‌సాగర్"** రచయితైన సూర్‌దాస్, **'పద్మావతి'** అను గ్రంథరచయిత జాయసీ, ఈ కాలమందలి ఇతర గొప్పకవులు.

జహంగీర్ ఫారసీ భాషలో మంచి రచయిత. అతడు తన జీవితస్మృతులను **'తుజక్-ఇ-జహంగీర్'** అనే పేరిట రచించాడు. షాజహాన్ ఆస్థానంలో ఆనాడు ఫారసీ, హిందీ, సంస్కృత భాషలలో ప్రసిద్ధులైన కవులు, పండితులు ఉండినారు. వీరిలో సంస్కృత కవి, అలంకారికుడు అయిన పండితరాజు జగన్నాధున్ని పేర్కొనాలి. ఇతడు **'రసగంగాధర'** మనే గొప్ప అలంకారశాస్త్ర గ్రంథాన్ని, గంగానదిని స్తుతిస్తూ **'గంగాలహరీ'** అనే కావ్యాన్ని రచించాడు. ఇవికాక, ఇతని రచనలు చాలా ఉన్నాయి. షాజహాన్ కుమారుడైన దారాషుకో, ఫారసీభాషలో మత, వేదాంత గ్రంథాలను రచించిన గొప్ప రచయిత. అతడు రెండు మహాసముద్రాల కలయిక, అనే అర్థం వచ్చే గ్రంథంలో ఇస్లాం, హిందూ మతాల తులనాత్మక పరిశీలన గావించినాడు. కాశీపండితుల సహాయంతో అతడు యాభై రెండు ఉపనిషత్తులను ఫారసీ భాషలోకి అనువదించాడు.

ఔరంగజేబ్ అరబ్బీ, ఫారసీ భాషలలో గొప్ప పండితుడు; అతనికి తుర్కీ, హిందీ భాషల పరిజ్ఞానం కూడా ఉంది. **'ఖురాన్'**ను కంఠస్థం చేశాడు; ఇస్లాంమత వేదాంతంలో, ధర్మశాస్త్రంలో ప్రవీణుడు. ముస్లిం ధర్మశాస్త్రానికి, **'ఫతవా-ఇ-అలంగీరీ'** అనే పేరుతో జరిగిన క్రోడీకరణను అతడు ఆదరించాడు కాని, అతడు కవిత్వాన్ని, సంగీతాన్ని, లలిత కళలను ద్వేషించిన పరిశుద్ధవాది (Puritan). అతడు సంగీతాన్ని లోతుగా మట్టిలో పాతిపెట్టమన్నాడు. మొత్తం మీద, ఔరంగజేబ్ ఆస్థాన వాతావరణం, కళలకు అనుకూలమైంది కాదు.

మొగల్ యుగంలో ప్రాంతీయ భాషలు కూడా అభివృద్ధి చెందినాయి. మరాఠీలో ఏకనాథ్, తుకారామ్‌లు, మంచి భక్తిరస పూరితమయిన కవిత్వాన్ని రూపొందించారు. అరకాన్ రాజ్యంలోని సూఫీ కవి అలోవాల్, బెంగాలీ భాషలో భక్తికవిత్వాన్ని సృష్టించాడు. ఈతను హిందీలో వున్న 'పద్మావతీ' అనే గ్రంథాన్ని బెంగాల భాషలోకి అనువదించాడు కూడా. అస్సామీ భాషలో శంకరదేవ (1449-1568) భక్తి వుద్యమాన్ని నడిపించి, అస్సామీ సాహిత్యంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించాడు.

దక్షిణ ప్రాంతంలో, 17వ శతాబ్దంలో మళయాళీ భాష ఒక స్వతంత్ర భాషగా రూపొందింది. మొగల్ రాజులకు సమకాలీనులైన విజయనగర రాజుల కాలంలో, తెలుగు సాహిత్యం బాగా అభివృద్ధి చెందింది. కృష్ణ దేవరాయల కాలంలో అష్ట దిగ్గజాలనే 8మంది గొప్ప కవులుండడంవల్ల ఆ కాలాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా వర్ణిస్తారు. విజయనగర రాజుల తర్వాత 16,17 శతాబ్దాలల్లో తంజావూరు, మధుర రాజులు తెలుగు సాహిత్యాన్ని పోషించారు.

మొగల్ యుగంలో, పర్షియన్ సాహిత్యమే కాకుండా అరబిక్, హిందీ, ఉర్దూ, భాషా సాహిత్యాలు కూడా అభివృద్ధి చెందినాయి. ఉర్దూ పదం ఓర్దూ అనే టర్కీ పదం నుంచి వచ్చింది. ఓర్దూ అంటే సైనిక శిబిరము. సైనిక శిబిరాలల్లో, సైనికులు వాడిన భాష నుంచి ఉచ్చరించిన భాష ఉర్దూ. మొగల్ చక్రవర్తులే కాకుండా, గుజరాత్, బీజాపూర్, గోల్కండ, బీదర్ రాజులు కూడా ఉర్దూ సాహిత్యాన్ని పోషించారు. గోల్కొండ రాజు కులీకుతుబ్‌షా (1580-1612) స్వయంగా గొప్పకవి. బీజాపూర్ రాజు రెండవ అదిల్‌షా (1580-1627) కూడా గొప్పకవి.

4.15.2 వాస్తు కళ

అక్బర్ కాలం నాటి వాస్తుకళలో హిందూ, ముస్లిమ్ (ఫారసీ) రీతులు చక్కగా మేళవింపబడ్డాయి. అక్బర్ నిర్మించిన ఫతేపూర్ సిక్రీ కోట, అతని గొప్ప వాస్తుకళా సృష్టికి నిదర్శనం. దీనికి తొమ్మిది ద్వారాలు ఉన్నాయి. ఇసుక రాతితో ఇచ్చట నిర్మించిన కట్టడాలవల్ల ఇది ప్రసిద్ధమైంది. 'జామీమసీదు', 'బులంద్ దర్వాజా'


BRAOU

'షేక్ సలీం చిస్తీ సమాధి', 'దివాన్-ఇ-ఖాస్' ఇచట ప్రసిద్ధమైన కట్టడాలలో కొన్ని. ఢిల్లీలోని హుమాయూన్ సమాధి అక్బర్ కాలం నాటి మరొక గొప్ప నిర్మాణం.


మొగల్ వాస్తుకళకు, షాజహాన్ కాలం నిరాక్షేపణీయంగా స్వర్ణయుగం. కోట్ల కొలది రూపాయలు వెచ్చించి షాజహాన్ ఆగ్రా, ఢిల్లీ, లాహోర్, మరి అనేక స్థలాలలో దేదీప్యమానమైన కట్టడాలు నిర్మించాడు. అందువల్ల, అతనిని **"వాస్తుకళా ప్రభువు"** **'ఇంజనీర్ కింగ్'** అని పిలిచారు. నేటి ఢిల్లీ నగరస్థాపకుడు షాజహాన్ (1638-48). ఢిల్లీకి చాలాకాలం 'షాజహాన్‌బాద్' అని పేరు ఉండేది. ఢిల్లీలోని ఎర్రకోట, దానికి కొద్ది దూరంలో ఉన్న **'జామా-ఇ-మసీదు'** అతని విశిష్ట నిర్మాణాలు, 'జామా-ఇ-మసీదు' ప్రపంచంలోని పెద్ద మసీదులలో ఒకటి; దాని నిర్మాణానికి పదిలక్షల రూపాయలు ఖర్చయ్యాయి. ఉస్తాద్ ఖలీల్ దాని నిర్మాణ శిల్పి. ఎర్రకోటలో **'దివాన్-ఇ-ఆమ్', 'దివాన్-ఇ-ఖాస్'** భవనాలు ఉన్నాయి. **'దివాన్-ఇ-ఖాస్'** చాలా అందమైన భవనం. దాని గోడలలో ఒక దానిపైన చక్రవర్తి ఈ క్రింది విధంగా రాయించాడు.

"భూమిపై స్వర్గమనేది ఎక్కడైనా ఉంటే
అది ఇదే, అది ఇదే, అది ఇదే".


ఆగ్రాలోని షాజహాన్ నిర్మాణాలలో తాజ్‌మహల్ ప్రసిద్ధి చెందింది. ఈ చలువరాతి సమాధి, షాజహాన్ మిక్కిలిగా ప్రేమించిన ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థం యమునా నదీ తీరంలో నిర్మింపబడింది. ఇది ప్రపంచ అద్భుతాలలో ఒకటిగా పరిగణింపబడింది. షాజహాన్ కూడా దీనిలోనే సమాధి చేయబడ్డాడు. దీని నిర్మాణానికి ఇరవైరెండేండ్లు సాగింది. దీనికైన ఖర్చు మూడుకోట్ల రూపాయలు. దీని నిర్మాణం ఇరవై రెండువేల మంది పనివారు నియోగింపబడ్డారు. మోతీ మసీదు, ముసల్మాన్ బురుజు, షాజహాన్ ఆగ్రాలో నిర్మించిన ఇతర నిర్మాణాలలో ముఖ్యమైనవి. ఆగ్రా కోటలోపల మోతీమసీదు, మూడు లక్షల రూపాయల ఖర్చుతో నిర్మింపబడింది. తెల్లని పాలరాతితో నిర్మింపబడిన ఈ నిర్మాణం పూర్తి కావడానికి నాలుగేండ్లు పట్టింది. షాజహాన్ ఆగ్రాలో **"జామామసీద్"**ను కూడా నిర్మించాడు. ముసల్మాన్ బురుజు అనేది, జహంగీర్‌కు నూర్జహాన్ నిర్మించిన సమాధిపై షాజహాన్ గొప్ప నిర్మాణం కావించాడు. అచటనే అతడు, అలీమర్దన్‌ఖాన్ పర్యవేక్షణలో షాలీమార్ ఉద్యానవనాన్ని వేయించాడు. నెమలి సింహాసనం, కోహినూర్ వజ్రం, సామ్రాజ్య వైభవాన్ని ఇంకా పెంపొందించాయి. నెమలి సింహాసనం నిర్మించడానికి ఏడేండ్లు పట్టింది; దానికి, ఒకకోటి రూపాయలు ఖర్చు అయింది. అది అపరంజి బంగారులో అనేకాలైన నవరత్నాలు పొదిగి చేయబడింది. ఔరంగజేబ్ సంకుచిత



హుమాయూన్ సమాధి, ఢిల్లీ, 1565




ఫతేపూర్ సిక్రీ బులంద్ దర్వాజా, 1571



ఫతేపూర్ సిక్రీ, బీర్బల్ భవనము, 1572

BRAOU



దివానీఖాస్, ఎఱ్ఱకోట, ఢిల్లీ, 1645

మత దృక్పథం, అన్ని కళలతోపాటు వాస్తునిర్మాణాన్ని కూడా నిరుత్సాహపరచింది. ఔరంగాబాద్ వద్ద తాజ్‌మహల్‌ను అనుకరిస్తూ అతని మొదటి భార్యకు సమాధి నిర్మింపబడింది; అందుచేత, దీనిని 'దక్కన్ తాజ్‌మహల్' అన్నారు. కాని, ఇది "చాలా నాసిరకమైన నిర్మాణం".

4.15.3 చిత్రలేఖనం

భారతదేశంలో ప్రాచీన కళ అయిన చిత్రలేఖనం అక్బర్ కాలం నుంచి ఒక కొత్త మలుపు తిరిగింది. అక్బర్ హిందూ చిత్రకళాకారులను పర్షియన్ సాంకేతిక నైపుణ్యాన్ని నేర్చుకొని, పర్షియన్ చిత్రకళారీతి ననుకరింపమని ప్రోత్సహించినాడు. ఫలితంగా భారతీయ - ఫారసీ చిత్రకళా సంప్రదాయమొకటి క్రమక్రమంగా ఏర్పడి, ఉన్నత ప్రమాణాలతో ఉన్న వర్ణచిత్రాలతో సంపన్నమైనది. ఈ సంప్రదాయానికి మొగల్ సంప్రదాయమని కూడా పేరు. మొగల సంప్రదాయంచేత ప్రభావితమై, రాజపుత్రస్థానం తనదైన కంగ్రా, ఘర్వాల్ చిత్రకళా సంప్రదాయాలను రూపొందించింది

అక్బర్ చిత్రకళను అభిమానించాడు. అక్బర్ కాలంలో తమ ప్రతిభచే పేరు మోసిన కళాకారులలో పదిహేడు మంది హిందువులు. అబ్దుస్ సమద్ మేటి అయిన చిత్రాకారుడు. అతనికి **"షిరీన్ కలమ్"** లేదా **'మధురలేఖిని'** అనే బిరుదు ఉండేది. అతని శిష్యులలో దశవంత్ ప్రసిద్ధుడు; ఒక సేవకుని కుమారుడైన ఇతనిని అక్బర్ కనిపెట్టి ప్రోత్సహించాడు. మరి ఒకగొప్ప చిత్రకారుడు బసవాన్, **'చెంఘీజ్‌నామా', 'జాఫర్‌నామా' 'రామ్ నామా', 'నలదమయంతి', 'కాళీయమర్దనం'** మొదలైనవి అక్బర్ కాలపు ప్రసిద్ధి చిత్రాలు. సిక్రీలోని కొన్ని కుడ్య చిత్రాలు తప్పిస్తే, అక్బర్ కాలం నాటి చిత్రాలు చాలా వరకు నాశనమై పోయాయి.

చిత్రలేఖనమన్న జహంగీర్‌కు అత్యంత అభిమానం. అతడు రచించిన 'జీవితస్మృతుల' నిండా, చిత్రలేఖనాన్ని గూర్చి చెప్పిన సందర్భాలు ఉన్నాయి. జహంగీర్ కాలంలో ఈ కళ పరాకాష్ట నందుకొని, యదార్థమైన

భారతీయ కళగా రూపొందింది. అబుల్ హసన్, ఉస్తాద్ మన్సూర్ నాడు ప్రఖ్యాతి వహించిన ఇద్దరు చిత్రకారులు; ఇద్దరికీ **'నాదిర్ ఉజ్ జమాన్'** (ప్రపంచ అద్భుతం) అనే బిరుదు ఉండేది. జహంగీర్ తరువాత చిత్రలేఖన కళ, క్రమంగా క్షీణించసాగింది. *"అతను పోవడంతో, మొగల్ చిత్రకళా తేజస్సుకూడా వెడలిపోయింది"*. షాజహాన్ కూడా చిత్రకళను ఆదరించాడు; కాని, వాస్తు నిర్మాణం అతనికి ప్రధానమైన ఆసక్తి. ఔరంగ్‌జేబ్ కాలంలో, ఆదరణలేక అన్ని కళలు కృశించినట్లే, చిత్రకళ కూడా కృశించిపోయింది.

4.15.4 సంగీతం

బాబర్ సంగీతంలో చెప్పుకోదగ్గ పరిజ్ఞానం కలవాడు. హుమాయూన్ కూడా సంగీతంలో తనకున్న ప్రీతిని వ్యక్తం చేశాడు; అతడు 1535లో మండూ పై దాడి చేసినప్పుడు అక్కడ పట్టుకొన్న బచ్చూ అనే గాయకుడిని తన ఆస్థాన సంగీత విద్వాంసుడుగా నియమించాడు. అక్బర్ సంగీత శాస్త్ర సిద్ధాంతాలలో సంగీత కళలో ప్రవీణుడు. సంగీతానికి ఇతడు చూపిన ఆదరణను అబ్దుల్ రహమాన్, మాన్‌సింగ్ తమ ఆదరణ చేత, పరిపూర్తిజేశారు. మాల్వారాజైన బాజ్ బహదూర్‌తో సహా ముప్పై ఆరుమంది ప్రసిద్ధ సంగీత విద్వాంసులను అబుల్ ఫజల్ పేర్కొన్నాడు. వీరిలో తాన్‌సేన్ మిక్కిలి గొప్పవాడు. జహంగీర్, షాజహాన్ సంగీతంలో తీవ్రమైన ఆసక్తిని కనపరచారు. షాజహన్ ఆస్థానాన్ని అలంకరించిన గొప్ప సంగీత విద్వాంసులలో జగన్నాథుడు, తాన్‌సేన్ అల్లుడైన లాల్‌ఖాన్ ఉండినారు. ఔరంగజేబ్ సంగీతాన్ని ద్వేషించాడు; దానిని లోతుగా భూమిలో పాతి పెట్టమన్నాడు.

4.15.5 ఇతర కళలు

మొగల్ వాస్తుకళతోపాటు దానికి అనుబంధంగా అలంకార లేఖనకళ (Calligraphy) రత్నాలు మొదలగు వానిని పొదిగే కళ అభివృద్ధి చెందాయి.

VI మీ అవగాహన పరీక్షించుకోండి

1) భక్తి ఉద్యమానికి ఒక ముఖ్య కారణము తెల్పండి?

.....

.....

.....

.....

2) మొగల్ కాలంనాటి, అందరి కంటే గొప్ప హిందీ కవి ఎవరు?

.....

.....

.....

.....

3) మొగల్ కళ ముఖ్య లక్షణమేది?

.....

.....

.....

.....

BRAOU

4.16 సంగ్రహంగా

1. మొగల్ పరిపాలన బాగా వ్యవస్థీకరించిన పరిపాలన. అది భారతదేశంలో పర్షియా - అరబిక్ వ్యవస్థ.
2. మొగల్ చక్రవర్తికి చాలా అధికారాలు వుండినాయి. అతనికి సహాయం చేయడానికి అనేక మంత్రులు వుండినారు. వారిలో ముఖ్యమైన వాడు **వజీర్** లేదా **వకీలు**.
3. రాజ్యం సుబాలుగా విభజించబడింది. ప్రతి **సుబా**, కొన్ని సర్కారులుగా, ప్రతి సర్కార్ కొన్ని పరగణాలుగా విభజింపబడ్డాయి.
4. మన్సబ్‌దారి వ్యవస్థ, మొగల్ పరిపాలనలో బహు ముఖ్య అంశం. ఆ వ్యవస్థకు అనుగుణంగా ప్రతి మన్సబ్‌దారు రాజుకు కొంతమంది నిర్ణీత సైనికులను, అశ్వాలను అందజేసేవారు.
5. మొగల్ రెవెన్యూ విధానాన్ని తోడర్‌మల్ రూపొందించాడు. భూమిని కొలవడం, వర్గీకరించడం, అందులోని ముఖ్య అంశాలు.
6. అక్బర్ కాలంలో భూమిశిస్తు విధానాన్ని సంస్కరించడంవల్ల, వ్యవసాయం అభివృద్ధి చెందింది.
7. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందింది.
8. స్వదేశీ, విదేశీ వ్యాపారం ఎక్కువైంది. యూరోపియన్ల రాకతర్వాత విదేశీ వ్యాపారం బాగా ఎక్కువైంది.
9. ఆగ్రా, లాహోర్ వంటి పట్టణాలు సంపన్న పట్టణాలుగా అభివృద్ధి చెందినాయి.
10. కరువు, ప్లేగ్ సంభవించినప్పుడు ప్రజలు చాలా ఇబ్బందులకు గురైనారు.
11. దేశంలో సంపద ఎక్కువగా వున్నప్పటికీ, సామాన్య ప్రజల పరిస్థితి ఘోరంగా వుండింది.
12. అక్బర్ మతసహన విధానాన్ని పాటించాడు. అతను దీన్-ఇ-ఇలాహి అనే కొత్త మతాన్ని స్థాపించాడు.
13. జహంగీర్, అక్బర్ మతవిధానాన్ని కొనసాగించాడు. కానీ ఆ విధానానికి వ్యతిరేకమైన విధానాన్ని షాజహాన్, ఔరంగజేబులు పాటించారు.
14. మధ్యముగంలో భక్తి ఉద్యమం ప్రజాదరణ పొందింది. భక్తి ఉద్యమం నాయకులైన రామానందుడు, కబీర్, నానక్, చైతన్య మొదలైన వారు నిజమైన భక్తి ప్రేమలకు ప్రాముఖ్యత నిచ్చినారు. వారు దేవుడు ఒక్కడే అని బోధిస్తూ హిందూ-మహమ్మదీయ ఐక్యతకు కృషి చేసినారు. కుల వ్యవస్థను వారు విమర్శించినారు.
15. మొగల్ కాలంలో ఆనాటి అధికార భాష అయిన పర్షియన్‌లో, ప్రాంతీయ భాషల్లో అనేక గ్రంథాలు వెలువడ్డాయి.
16. కళలకు మొగల్ యుగం స్వర్ణయుగం. ఈ కాలంనాటి కళ, హిందూ-మహమ్మదీయ కళా పద్ధతుల సమ్మిళితం.

4.17 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) చక్రవర్తి ప్రభుత్వ అధినేత. అతనికి అనేక అధికారాలున్నాయి. సామాన్య పరిపాలన వ్యవస్థకు, సైన్యానికి కూడా అతనే అధిపతి. అతను నియమించిన మంత్రులు అతనికి సహాయం చేసేవారు. రాష్ట్రాధిపతులు అతని అధీనంలో వుండేవారు.

2) సర్కార్, షిక్‌దార్ షిక్‌దారన్, మున్సిఫ్-మున్సిఫన్ ముఖ్యమైన అధికారులు. పరగణలో షిక్‌దార్, మున్సిఫ్ ముఖ్యమైన అధికారులు.

BRAOU

II 1) మన్సబ్‌దారీ వ్యవస్థవల్ల, చక్రవర్తికి అవసరమైన అశ్వాలు, సైనిక దళం సమకూరేవి. భూమిశిస్తు వసూలు, శాంతి భద్రతలు నెలకొల్పే బాధ్యతలు కూడా మన్‌సబ్‌దారులకు వుండేవి.

2) భూమిని పోలజ్, పరోటి, చచార్, బంజర్ అనే వర్గాలుగా విభజించడం, ఉత్పత్తిలో మూడవ వంతు శిస్తుగా చేయడం, మొగల్ కాలంనాటి భూమి శిస్తు విధానంలో ముఖ్యమైన లక్షణం.

III 1) భారతదేశంలో 1604 లో పొగాకు ప్రవేశపెట్టబడింది.

2) వస్త్ర పరిశ్రమ, కాగిత పరిశ్రమ, పెట్లుప్ప పరిశ్రమ (సురేకారం) ఆనాటి ముఖ్యమైన పరిశ్రమలు.

IV 1) మొగల్ సామ్రాజ్యంలోని ముఖ్యమైన రేవుపట్టణాలు లహరి, బందర్, కాంబే, బ్రోచ్, సూరత్, హుగ్లీ, మచిలీపట్నం, ఢాకా.

2) సంపద ఎక్కువగా రాజులు, భూస్వాములు చేతుల్లో కేంద్రీకృతం కావడంవల్ల, మొగల్ రాజ్యంలో సంపద ఎక్కువగా వున్నప్పటికీ సామాన్య ప్రజల పరిస్థితి అధ్వాన్నంగా వుండింది.

V 1) తన గర్వము, అహంకారంవల్ల, అక్బర్, దీన్-ఇ-ఇలాహి మతాన్ని స్థాపించినాడని విన్ సెంట్ స్మిత్ వ్యాఖ్యానించినాడు. కానీ ఆ అభిప్రాయం సరియైందికాదు. హిందూ-ముస్లిం ఐక్యత పట్ల అతనికి వున్న ఉత్సాహం, దీన్-ఇ-ఇలాహి మత స్థాపనకు ముఖ్యమైన కారణమై వుండవచ్చు.

2) సిక్కులు, మహారాష్ట్రులు, జాట్లు, సత్‌నామీలు, ముఖ్యంగా ఔరంగజేబు అసహన మత విధానంవల్ల తిరుగుబాట్లు చేసినారు.

VI 1) ముఖ్యంగా హిందూ మతంలో వున్న అనేక మతాచారాల(ritual)వల్ల, భక్తి ఉద్యమం ప్రారంభమైంది. మహమ్మదీయ మత ప్రభావంవల్ల కూడా ఈ ఉద్యమం ప్రారంభమైంది.

2) తులసీదాసు

3) హిందూ-మహమ్మదీయ కళా పద్ధతుల సమన్వయమే మొగల్ కళ ముఖ్య లక్షణం.

4.18 పరీక్ష నమూనా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి

1) మొగల్ పాలనా వ్యవస్థ ముఖ్య లక్షణాలను వివరించి అది షేర్షా వ్యవస్థ మీద ఎంతవరకు ఆధారపడిందో తెల్పండి.

2) అక్బర్ కాలంలో మొగల్ పరిపాలనా వ్యవస్థను వివరించండి.

3) మొగల్ కాలంలోని ఆర్థిక పరిస్థితులను వివరించండి.

4) మొగల్ కాలంలో వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధిని గురించి వ్రాయండి.

5) అక్బర్, ఔరంగజేబ్‌ల మత విధానాల మధ్య గల భేదాన్ని వివరించండి.

6) 15, 16 శతాబ్దాలలో జరిగిన భక్తి ఉద్యమానికి కారణాలు, ఆ ఉద్యమ నాయకులు, వారి బోధనలు, ఉద్యమ ఫలితాలను గురించి వ్రాయండి.

7) మొగల్ కాలంనాటి సాహిత్య, కళల అభివృద్ధి సమీక్షించండి.

BRAOU

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) మొగల్ రాజుల రెవెన్యూ విధానాన్ని వివరించండి.

2) మన్‌సబ్‌దారీ వ్యవస్థను గురించి వ్రాయండి.

3) మొగల్ సైన్యం గురించి వ్రాయండి.

4) మొగల్ రాజుల కాలంనాటి వర్తక, వాణిజ్యాలను గురించి వ్రాయండి.

5) మొగల్ కాలంలో సామాన్యప్రజల ఆర్థిక పరిస్థితులను గురించి వ్రాయండి.

6) మొగల్ కాలంలో సూఫీ ఉద్యమం గురించి వ్రాయండి.

7) దీన్-ఇ-ఇలాహి గురించి క్లుప్తంగా తెల్పండి.

8) మొగల్ కాలంలో సాహిత్య అభివృద్ధి గురించి వ్రాయండి.

9) మొగల్ కాలంలో చిత్ర లేఖనం, సంగీతం, అభివృద్ధి గురించి తెల్పండి.

10) కబీర్, గురునానక్‌ల గురించి క్లుప్తంగా వ్రాయండి.

4.19 ఉపయుక్త గ్రంథాలు

1. Chopra : *Some Aspects of Society and Culture during the Mughal Age.*
2. Akbar Habib : *The Agrarian system of Mughals India*
3. Edwards and Garret : *Mughal rule in India*
4. Eswari Prasad : *A Short History of Muslim rule in India.*
5. Karim : *Society and Culture in Medieval India*
6. Majumdar R.C. (ed) : *The Mughal empire, Bharatiya Vidya Bhavan series, Vol VII*
7. Moreland : India at the death of Akbar
8. - do - : *The Agrarian system of Muslim India from Akbar to Aurangazeb - A study in Indian Economic History*
9. Perceival Spear : *Twilight of the Mughals*
10. Qureshi, I.H. : *Administration of the Mughal Empire*
11. Srivatsava, A.C. : *Mughal Empire*
12. Sarma, L.P. : *Mughal rule in India*
13. Tripathi, R.P. : *Some Aspects of Mughal Administration*
14. ఝాన్సీ లక్ష్మి, పాటిబండ : *భారతదేశ చరిత్ర, సంస్కృతి, ద్వితీయ భాగం,*
వైదేహి, అల్లాడి : *తెలుగు అకాడమి ప్రచురణ*

BRAOU

ఖండం - 2 మహారాష్ట్రలు, 18వ శతాబ్దంలో భారతదేశం

ఈ ఖండంలో 5, 6 భాగాలున్నాయి. 5వ భాగం మహారాష్ట్రల చరిత్రకు సంబంధించినది. 6వ భాగంలో 18వ శతాబ్దిలో భారతదేశంలోని ప్రాంతీయ రాజ్యాల గురించి, ఆనాటి ఆర్థిక పరిస్థితుల గురించిన వివరణ వుంది.

BRAOU

Dr. BRAOU LIBRARY
Acc. No. 114980
Class No. 954 CHA

BRAOU

భాగం - 5 : మహారాష్ట్రులు

విషయక్రమం

5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 రాజకీయ శక్తిగా మహారాష్ట్రుల ఆవిర్భావం

5.3 శివాజి

5.3.1 జీవిత విశేషాలు

5.3.2 తొలి విజయాలు, 1646-48

5.3.3 బీజాపూర్‌తో యుద్ధం, 1656-1662

5.3.4 మొగలులతో యుద్ధం, 1663-1680

5.3.5 ఆగ్రాలో శివాజి, 1666

5.3.6 శివాజి పట్టాభిషేకం, 1674

5.3.7 రాజ్య విస్తృతి

5.3.8 పరిపాలన

5.3.8.1 కేంద్ర ప్రభుత్వం

5.3.8.2 రాష్ట్ర ప్రభుత్వం

5.3.8.3 రెవిన్యూ విధానం

5.3.8.4 సైనిక వ్యవస్థ

5.3.9 చరిత్రలో శివాజీ స్థానం అంచనా

5.4 బాలాజీ విశ్వనాథ్, 1713-20

5.5 మొదటి బాజీరావు, 1720-40

5.5.1 మహారాష్ట్ర సమ్మేళనం

5.6 బాలాజీ బాజీరావు, 1740-61

5.7 మూడవ పానిపట్ యుద్ధం, 1761

5.7.1 కారణాలు

5.7.2 యుద్ధ విశేషాలు

5.7.3 ఫలితాలు

5.7.4 మహారాష్ట్రుల ఓటమికి కారణాలు

5.8 సంగ్రహంగా

5.9 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

5.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

5.11 ఉపయుక్త గ్రంథాలు

5.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. శివాజీ జీవిత విశేషాలు, అతని దండయాత్రలు, అతని పరిపాలన
2. పీష్వాలు, బాలాజీ విశ్వనాథ్, మొదటి బాజీరావు, బాలాజీ బాజీరావు పాలనా విశేషాలు.
3. మూడవ పానిపట్ యుద్ధం కారణాలు, క్రమం, ఫలితాలు

BRAOU

5.1 పరిచయం

మరాఠులు మహారాష్ట్రకు చెందినవారు. *"వారు కురుచగా, ధృఢకాయులైనవారు. సౌందర్యం లేకపోయినా, చక్కగా ఉంటారు. వారందరూ చురుకైనవారు; కష్టపడి పనిచేసేవారు; కష్టానికి వెరవనివారు; పట్టుదల గలవారు"* (Elphinston). వారి దేశమంతా చాలా వరకు కొండలతో, అడవులతో నిండినది. నేల మిట్టపల్లాలుగా ఉంటుంది; దారులు క్లిష్టంగా ఉంటాయి. మహారాష్ట్రులను చురుకైన వారుగా, సాహసవంతులుగా; యుద్ధవీరులుగా, నిరాడంబరులుగా చేయటానికి, మహారాష్ట్ర భౌతిక స్వరూపం, స్థిరమైన అచ్చటి శీతోష్ణస్థితి పాత్ర చాలా ఉంది. మహారాష్ట్రంలోని గిరి దుర్గాలు వారికి చాలా ఉపయోగపడినాయి.

శివాజీ వచ్చి పెన్నత్యాన్ని సాధించడానికి ముందు, మహారాష్ట్రులలో ఐకమత్యంలేక దక్షిణ భారతదేశంలో చెల్లాచెదరై ఉండినారు. వారు చాలామట్టుకు బీదవారుగా ఉండి, వ్యవసాయం చేసుకొంటూ ఉండినారు. మహారాష్ట్రులలో కొందరు, దక్కన్ సుల్తానుల కొలువులో ఉండినారు. వీరు పాలనలో, యుద్ధం చేయడంలో శిక్షణ పొందారు. జ్ఞానేశ్వర్, ఏకనాథ్, తుకారాం, రామదాస్ మొదలైన వారు నాటి మత సంస్కర్తలు. మహారాష్ట్రులను దేశభక్తితో, జాత్యాభిమానంతో, మతాభిమానంతో ఉత్తేజితులను చేశారు. వారిని ఒక జాతిగా రూపొందించటానికి కావలసిందల్లా, వారికి రాజకీయ స్వాతంత్ర్యం సాధించి పెట్టగల నాయకుడు. మహా నాయకుడైన శివాజీ దీనిని సాధించాడు. అతడు మహారాష్ట్రులకు ముస్లిం పాలన నుంచి విముక్తి కలిగించి, పద్దెనిమిదవ శతాబ్దంలో భారతదేశానికి ఆధిపత్యం వహించి పటిష్టమైన జాతిగా రూపొందించాడు.

5.2 రాజకీయ శక్తిగా మహారాష్ట్రుల ఆవిర్భావం

17వ శతాబ్దంలో మహారాష్ట్రులు ఒక గణనీయమైన రాజకీయశక్తిగా అవిర్భావం చెందటం ఒక చారిత్రక యాదృచ్ఛికం ఏమాత్రంకాదు. మహారాష్ట్రులకు ఘనమైన గత చరిత్ర, కీర్తి ఉంది. అశోకుని శాసనాలు తొలి చారిత్రక దశలో మహారాష్ట్రుల ఉనికిని రుజువు చేస్తాయి. తొలి చారిత్రక యుగంలోను, మధ్య యుగంలోను సామంత పాలకులుగా ఎంతో అనుభవం సంపాదించారు. అయితే 17వ శతాబ్దానికి - భౌగోళిక ఉనికి, వాతావరణ పరిస్థితులు, భక్తి ఉద్యమం, భక్తి ఉద్యమ సాహిత్యం, మహారాష్ట్ర భాషాభివృద్ధి అనే అంశాలు మహారాష్ట్ర మనస్తత్వాన్ని ప్రభావితం చేసి, ఒక జాతిగా రూపొందింపచేసి, శివాజీ నాయకత్వంలో బలమైన రాజ్యస్థాపనకు దోహదం చేసాయి.

మరాఠా ప్రాంతపు భౌగోళిక భౌతిక అంశములు మహారాష్ట్రుల శీలమునే కాక మరాఠా ప్రజల చరిత్ర గతిని ఎంతగానో ప్రభావితం చేశాయి. మరాఠా ప్రాంతమును రెండువైపుల నుంచి సహ్యాద్రి, సాత్పూరా, వింధ్యా పర్వత శ్రేణులు రక్షణ కవచంలా ఉండగా, నర్మదా, తపతి నదులు మహారాష్ట్ర ప్రాంతమును రక్షిస్తూ రక్షణకు ఉపకరించే పర్వత కోటల నిర్మాణమునకు కారణమైనాయి. తత్ఫలితంగా ఈ ప్రాంతమును జయించుట తేలిక కాకుండా పోయింది. సారవంతంకాని, ఉత్పత్తికి పనికిరాని భూభాగం, అతి తక్కువ వర్షపాతం వ్యవసాయమునకు అనుకూలం కాకపోవటంచే, మహారాష్ట్రులు దృఢశరీరులై కష్టపడితే తప్ప కడుపునిండని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా మహారాష్ట్రులలో స్వశక్తిపై ఆధారపడేతత్వం, ధైర్యం, దీక్ష, నిరాడంబర జీవితంపై ఆసక్తి, మనిషిని మనిషిగా గుర్తించే సామాజిక సమానత్వంపై గర్వం తలెత్తి, వారిని ఒక విశిష్ట జాతిగా రూపొందింప చేసాయి.

పైన పేర్కొన్న భౌతిక, భౌగోళికాంశాల తోపాటుగా, మత సంస్కర్తలైన ఏకనాథ్, తుకారం, రామదాస్, వామన పండితుల నాయకత్వంలో ఆరంభమైన భక్తి ఉద్యమం భగవంతుని ముందర అందరూ సమానులేనన్న భావాన్ని బాగా పాతుకు పోవునట్లు చేశారు. మత సంస్కర్తల బోధనలు మహారాష్ట్రలో చైతన్యం తీసుకు వచ్చి,

BRAOU

తమ విభేదాలు మరచిపోయి, ఏక జాతిగా చేయుటకు ఉపయోగపడ్డాయి. మహారాష్ట్ర సాహిత్యం ఈ భావనను మరింత బలపరచి తమ ప్రాంతాన్ని అభివృద్ధి పరచుకొనుటకు అవసరమైన ఉదాత్త ఆశయాలను, ఆదర్శాలను పెంపొందింప చేసి ఉత్తేజ పరచింది. సమర్థ రామదాసు రచించిన 'దశబోధ' గ్రంథం శివాజీని మాత్రమే ఉత్తేజపరచక, మహారాష్ట్ర జాతిలో తమ ఆత్మ గౌరవం కాపాడుకొనుటకు నవ్యరాజ్య స్థాపన ఆవశ్యకతను పెంపొందింప చేసింది. ఈ పైన పేర్కొన్న కారణాలన్ని శివాజీ నాయకత్వంలో మహారాష్ట్ర జాతి రాజ్య నిర్మాణమునకు సహాయపడ్డాయి.

మహారాష్ట్రులు ఒక గణనీయమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించుటకై పండితులు పరస్పర విరుద్ధములైన అభిప్రాయములను తెలిపారు. మహారాష్ట్ర ఆవిర్భావమును గ్రాంట్‌డఫ్ 'సహ్యాద్రి అడవిలోని కార్చిచ్చు ఫలితమనగా, మహదేవ గోవిందరనడే విదేశీయ ఆధిపత్యంనుంచి స్వతంత్రం కొరకు జరిగిన జాతీయ పోరాటమనగా, జాదునాథ్ సర్కార్, జి.యస్. సర్దేశాయిలు ఔరంగజేబు మతతత్వ విధానమునకు హిందుపుల ప్రతిఘటన' అన్నారు. 'దక్కన్ సుల్తానులపై మొగలుల ఒత్తిడే మహారాష్ట్ర ఆవిర్భావమునకు కారణమని' ఆండ్రేలింక్ అన్నారు. 'సామాజిక, ఆర్థిక అంశముల ప్రభావ ఫలితంగా మహారాష్ట్ర ఆవిర్భావం జరిగిందని' సతీష్ చంద్ర అభిప్రాయ పడ్డారు. 'మహారాష్ట్ర ఒక రాజకీయ శక్తిగా ఆవిర్భావమునకు అణచి వేయబడ్డ రైతాంగ తిరుగుబాటు చేయాలన్న భావనకు మధ్య సంబంధముంద'ని ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయపడ్డారు. మహదేవ గోవింద రనడే, వి.కే. రాజవాడేలు మహారాష్ట్ర ధర్మమ్ స్వతంత్ర మహారాష్ట్ర రాజ్య స్థాపనకు కారణమన్నారు. మహ్మదీయ ఆధిపత్యమునకు వ్యతిరేకంగా తలెత్తిన హైందవ తిరుగుబాటు మహారాష్ట్ర ఆవిర్భావమునకు ప్రోత్సహించిన మౌలిక కారణం కాదని పి.వి. రనడే అన్నారు. మొగల్ పాలకులు స్థానిక భూస్వామ్య శక్తులను తమకు అనుకూలంగా చేసుకొని కేంద్రీకృత ధోరణులను పెంపొందించాలన్న విధానమునకు వ్యతిరేకతే మహారాష్ట్ర ఒక గణనీయమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించుటకు కారణం.

5.3 శివాజీ

5.3.1 శివాజీ తొలి జీవిత విశేషాలు

పడమటి కనుమలలో, పూనాకు సుమారు యాభైమైళ్ల దూరంలో ఉన్న శివనేర్ దుర్గంలో శివాజీ 1627లో పుట్టాడు. శివాజీ తండ్రి, షాజీ భోంస్లే, మొదట్లో అహమ్మద్ రాజ్యంలో, అటు తర్వాత బీజాపూర్ రాజ్యంలో ఉన్నత సైనికోద్యోగిగా ఉండినాడు. పూనా ప్రాంతం అతని జాగీర్‌గా ఉండేది. ఇది గాక అతనికి కర్ణాటకలో మరొక పెద్ద జాగీర్ ఉండేది. శివాజీ తల్లి అయిన జిజియాబాయి సాంఘికంగా ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చింది. ఆమె చాలా దైవభక్తి పరురాలు, మంచి ప్రజ్ఞావంతురాలు.

శివాజీ పూనాలో అతని తల్లి శ్రద్ధలో, పర్యవేక్షణలో పెంచబడ్డాడు. ఆమె తన బోధనల ద్వారా, ఆచరణ ద్వారా, ప్రసిద్ధుడైన తన కుమారుడు శివాజీకి బ్రాహ్మణులను, గోవులను, హిందూ మతాన్ని రక్షించడంలో అపరిమితమైన ఉత్సాహాన్ని కల్పించింది. శివాజీకి కొంత వయసు వచ్చిన తర్వాత పూనెలో షాజీ జాగీర్‌కు విచారణ కర్తగా ఉన్న దాదాజీ కొండదేవ్ అనే సమర్థుడు, ప్రజ్ఞాశాలి అయిన బ్రాహ్మణుడు శివాజీకి గురువుగా సంరక్షకుడుగా నియమింపబడ్డాడు. అతడు శివాజీని ఆరితేరిన యోధుడుగా, దక్షుడైన పరిపాలకుడుగా తీర్చి దిద్దాడు. మహారాష్ట్ర దేశ మతసంస్కర్తల రచనలు, శివాజీని అమితమైన మాతృభక్తితో, హిందూ మతాభిమానంతో ఉత్తేజ పరచాయి. ప్రసిద్ధిగాంచిన మహారాష్ట్ర భక్తుడు తుకారాంతో, శివాజీ సన్నిహిత సంబంధం కలిగి ఉండినాడు. కాని, శివాజీ తానుగా ఎన్నుకొన్న మార్గదర్శి మిత్రుడు, గురువు, గురు రామదాస్. రామదాస్ రచించిన 'దశబోధ' ఇట్లా హెచ్చరిస్తుంది. "మహారాష్ట్రులనంతా ఒక చోట చేర్చు; మతం మరలా జీవించేటట్లు చూడు; మనలను చూచి మన పూర్వులు స్వర్గం నుంచి నవ్విపోతున్నారు..." ఈ బోధనల ఫలితంగా శివాజీ మహారాష్ట్రుల నంతా ఒక జాతిగా రూపొందించడానికి, ముస్లిం పాలన నుంచి దేశానికి విముక్తి కలిగించడానికి, కృత నిశ్చయుడైనాడు.

BRAOU

5.3.2 తొలి విజయాలు, 1646-48

తన పందొమ్మిదవ ఏట శివాజీ తన సైనిక జీవితాన్ని ప్రారంభించాడు. బీజాపూర్ రాజ్యంలో కొన్ని కోటలను వశం చేసుకోవటంతో, తన దండయాత్రా జీవితాన్ని మొదలు పెట్టాడు. మొదట పూనాకు నైరుతి దిశగా, 34 కి.మీ దూరంలో వున్న తోర్న (తోరణ) దుర్గాన్ని పట్టుకొన్నాడు. తరవాత వరుసగా చాక్న, కొందాన, రాయఘడ్, పురంధర్ మొదలైన దుర్గాలను పట్టుకొన్నాడు. రాయగడ్ వద్ద ఒక నూతన దుర్గాన్ని నిర్మించి, దానిని తన కార్యక్రమాలకు కేంద్రం చేశాడు. శివాజీ కల్యాణి దుర్గాన్ని ముట్టడించినప్పుడు బీజాపూర్ సూల్తాన్ భయభ్రాంతుడై, శివాజీ తండ్రి అయిన షాజీ భోంస్లేను చెరలో పెట్టాడు. 1649లో, షాజహాన్ జోక్యం ద్వారా, బీజాపూర్ సుల్తాన్ కుకొందానే, బెంగుళూరు ఇచ్చివేసి, శివాజీ తన తండ్రిని చెరనుంచి విడిపించాడు. అటు తర్వాత ఆరేండ్లు (1649-55) తన దండయాత్రలు మానివేసి, తాను గెలిచిన ప్రాంతాలను, సాధన సంపత్తిని కూడదీసుకొన్నాడు.

5.3.3 బీజాపూర్‌తో యుద్ధం, 1656-1662

1656లో శివాజీ బీజాపూర్ రాజ్యంపైన తన దండయాత్రలను తిరిగి ప్రారంభించాడు. 1656లో అతడు జావలి దుర్గాన్ని "ఆలోచనా పూర్వకమైన హత్య ద్వారా, దిట్టమైన మోసం ద్వారా" పట్టుకొన్నాడు. (జె.యన్ సర్కార్). జావలిని పట్టుకోవడంలో శివాజీ ఆ దుర్గరక్షకుడైన చంద్రారావ్ మోరిని మోసంచేత హత్య చేయించాడు. నాటి నుంచి జావలి దుర్గం, శివాజీ సైనిక చర్యలకు కీలక కేంద్రమైంది. 1657లో శివాజీ మొగలులతో ఒక యుద్ధంలో ఓడిపోయాడు. మొగలులు తిరిగి వెళ్ళిపోయిన తర్వాత బీజాపూర్ రాజ్యం మీద తన దండయాత్రలను కొనసాగించాడు. అతడు ఠాణా, కొలాబా జిల్లాలతో కూడిన ఉత్తర కొంకణాన్ని, కల్యాణ దుర్గాన్ని ఆక్రమించాడు. పోర్చుగీసుల రేవు పట్టణమైన డమాన్‌ను దోచాడు.

1659లో శివాజీని చంపిగాని, ప్రాణాలతో పట్టుకొనిగాని తీసుకొని రావలసిందని, బీజాపూర్ సుల్తాన్, అఫ్‌జల్‌ఖాన్‌ను పంపించాడు. అఫ్‌జల్‌ఖాన్ కొన్ని యుద్ధాలు గెలిచాడు. చివరకు శివాజీ, అఫ్‌జల్ ఖాన్ ఒకరినొకరు కలవడానికి ఒప్పుకున్నారు. ఈ కలయిక అప్పుడు శివాజీ ఉండిన ప్రతాప్‌ఘడ్ దుర్గం దగ్గర జరిగింది. కాని, ఇద్దరికీ ఒకరి ఉద్దేశాలను గూర్చి మరొకరికి అనుమానం ఉండింది. వారిద్దరూ ఒకరినొకరు కౌగిలించుకోవడంతో, ఇద్దరి మధ్య పోరు ప్రారంభమైంది. శివాజీ **"బాఘ్‌నఖ్"** (పులిగోళ్ళు) అనే మారణాయుధంతో, అఫ్‌జల్ ఖాన్‌ను హతమార్చాడు; అతని సైనిక శిబిరంపై దండెత్తి, పూర్తిగా ఓడించాడు. శివాజీ కొల్లగొట్టిన ధనాన్ని చాలా చేజిక్కించుకున్నాడు.

5.3.4 మొగలులతో యుద్ధం, 1663-1680

అఫ్జల్‌ఖాన్ మీద శివాజీ సాధించిన విజయం. అతనిని ఇంకా ప్రోత్సాహపరచి, మొగల్ రాజ్య ప్రాంతాలను కొల్లగొట్టేటట్లు చేసింది. అందుమీదట, ఔరంగజేబ్ తన మేనమామ అయిన షాయిస్తాఖాన్‌ను శివాజీ మీదికి పంపినాడు. షాయిస్తాఖాన్ పూనేను వశపరచుకొని యథాలాపంగా నిలకడలేని యుద్ధంచేసి, కొంత కాలాన్ని గడిపాడు. శివాజీ తన బాల్యాన్ని గడిపిన ఇంటిలోనే, షాయిస్తాఖాన్ విడిదిచేశాడు. 1663 ఏప్రిల్ 15వ రాత్రి, పెళ్ళి గుంపుగా వేషాలు వేసుకున్న సాహసవంతులైన నాల్గు వందల మంది సైనికులతో పూనె ప్రవేశించి, మొగలులపై దాడి చేశాడు. చాలా మంది మొగల్ సైనికులు చంపబడ్డారు. షాయిస్తాఖాన్ తన బొటన వ్రేలు గాయంతో ఎట్లో ప్రాణాలతో బయట పడ్డాడు. కాని, అతని కుమారుడు అబ్దుల్ ఫతే చంపబడ్డాడు.

1664లో పశ్చిమ తీరంలో అతి సంపన్నమైన రేవు పట్టణమైన సూరత్‌ను కొల్లగొట్టాడు. అచట నుంచి కోటి రూపాయలకు మించిన విలువగల కొల్లగొట్టిన ధనాన్ని తీసుకెళ్ళాడు.

BRAOU

షాయిస్తఖాన్ ఇట్లా ఓటమి చెందిన తర్వాత, ఔరంగజేబ్ తన మొదటి పుత్రుడైన మౌజంను, తన సేనలో మిక్కిలి సమర్థుడైన అంబర్ సంస్థాన పాలకుడు మీర్జా, రాజా జయసింగ్‌ను శివాజీ మీదికి పంపాడు. రాజా జయసింగ్ చాలా నేర్పుతో వ్యవహరించాడు. కొన్ని విజయాలు సాధించిన తర్వాత, శివాజీని 1665లో పురంధర్ కోటలో ముట్టడించి, శివాజీ ఆగ్రాలో ఔరంగజేబ్ ఆస్థానంలో చక్రవర్తిని దర్శించుకొనేటట్లు ఒప్పించాడు. శివాజి కూడా ఇరవైమూడు దుర్గాలను మొగలులకిచ్చివేసి, పండ్రెండు దుర్గాలు మాత్రమే తాను ఉంచుకున్నాడు.


5.3.5 ఆగ్రాలో శివాజీ, 1666

1666 మేలో శివాజీ, తన కుమారుడైన శంభాజీతో కలిసి, ఆగ్రాలో ఔరంగజేబ్‌ను దర్శించాడు. కాని అచట అతడు అమర్యాదకు లోనయ్యాడు. తన విడిది గృహం చేరగానే తాను గృహ నిర్బంధంలో ఉన్నానని తెలుసుకొన్నాడు. కాని, అతడు తెలివిగా ఒక పెద్ద మిఠాయిల గంపలో దాక్కొని తప్పించుకొనిపోయి అనేక సాహసాల తర్వాత, దక్కన్ చేరటంలో సఫలీకృతుడయ్యాడు. నాటి నుంచి అతడు మొగల్ సామ్రాజ్యానికి పగతీరని శత్రువైనాడు. అతడు మొగలులకు ఇచ్చివేసిన కోటలన్ని తిరిగి పట్టుకున్నాడు. 1670లో సూరత్ పట్టణాన్ని, మరల రెండవసారి దోచి. అరవైఆరు లక్షల రూపాయల ధనాన్ని పట్టుకున్నాడు. మొగల్ రాజ్య ప్రాంతాలైన బిరార్, బగ్లానా, ఖాందేష్‌లను దోచి విశేషమైన ధనాన్ని సంపాదించాడు.

5.3.6 శివాజీ పట్టాభిషేకం, 1674

1674లో శివాజీ రాయఘడ్‌ను తనకు రాజధానిగా చేసుకొని, 1674 జూన్ 16న మిక్కిలి వైభవంగా పట్టాభిషేకాన్ని జరిపించుకొన్నాడు. ఈ పట్టాభిషేకాన్ని జరపడానికి, కాశీ నుంచి బ్రాహ్మణులు వచ్చారు. శివాజీ "ఛత్రపతి" అనే బిరుదు వహించాడు. తర్వాత కొద్దికాలంలోనే అతడు, కర్ణాటకలోని జింజి, నెల్లూరు, బళ్ళారి, మరికొన్ని కోటలు పట్టుకొన్నాడు. కర్ణాటకలో పాలిస్తున్న తన సవతి తల్లి కుమారుడు వెంకోజీచే తన ఆధిపత్యాన్ని అంగీకరించి, తంజావూరు రాజ్యంలో తనకు అర్ధభాగమిచ్చేటట్లు ఒత్తిడి చేశాడు.

శివాజీ ఆరేండ్లు మాత్రం పాలించి, తన యాభైమూడో ఏట 1680లో రాయఘడ్‌లో చనిపోయాడు.



5.3.7 రాజ్య విస్తృతి

శివాజి రాజ్యానికి 'స్వరాజ్య'మని పేరు. అది ఉత్తరాన నేటి ధర్మపూర్ (రాంనగర్) నుంచి దక్షిణాన గోవా సమీపంలోని కార్వార్ మధ్య ఉన్న పడమటి కనుమలను, కొంకణాన్ని ఆక్రమించి ఉండింది. దక్షిణంలో అది బెల్గాం నుంచి కావేరి వరకు గల పశ్చిమ కర్ణాటకలో కొంత భాగాన్ని ఆక్రమించి ఉండింది.

5.3.8 పరిపాలన

ఆ కాలంలో అన్ని పరిపాలన విధానాల వలెనే, శివాజీ పరిపాలన కూడా రాజాజ్ఞ బద్ధంగా ఉండింది. శివాజీ తన రాజ్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు.

1. నేరుగా అతని పరిపాలనాధికారంలో ఉన్న ప్రదేశానికి 'స్వరాజ్య' మని పేరు.
2. అతని రాజ్యాన్ని చుట్టూ ఆవరించి ఉన్న ప్రాంతానికి 'మొగలాయ్' అని పేరు

ఈ ప్రాంతం నుంచి అతడు చౌత్, సర్‌దేశ్‌ముఖి అనే పన్నులను వసూలు చేశాడు.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1) మహారాష్ట్రులను ఐక్యపరచడానికి కృషిచేయాలనే భావన శివాజీకి కలుగడానికి అతనిని ప్రభావితం చేసిన పరిస్థితులేవి?

.....

.....

.....

.....

2) శివాజీ రాజ్యానికి రాజధాని ఏది?

.....

.....

.....

.....

BRAOU

5.3.8.1 కేంద్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వంలో రాజు, "**అష్టప్రధాన్**" అని ఎనిమిది మంది ప్రధానులు లేదా మంత్రులతో కూడిన మంత్రి పరిషత్తు ఉండేవారు. ఈ అష్ట ప్రధానులలో

1. **పీష్వా** లేదా ముఖ్య ప్రధాని
2. **అమాత్య** లేదా **మజుందార్** - ఆర్థిక మంత్రి
3. **సుమంత** - విదేశాంగ మంత్రి లేదా కార్యదర్శి
4. **సేనాపతి** లేదా **'సర్‌నౌబత్'** - సైన్యాధ్యక్షుడు
5. **న్యాయధీశ్** - ప్రధాన న్యాయమూర్తి
6. **పచివ్** లేదా **మరనవీస్** - సమాచార మంత్రి
7. **పండితరావ్, సాదర్** లేదా **ధనాధ్యక్ష** - మత వ్యవహారాల మంత్రి
8. **మంత్రి** - ఆంతరంగిక మంత్రి లేదా ఆంతరంగిక కార్యదర్శి

ఈ మంత్రుల సహాయంతో శివాజీ తన పరిపాలన కొనసాగించాడు. రాజు వారికి నేరుగా జీతాలు చెల్లించేవాడు. వారికి పదవులలో వంశపారంపర్యపు హక్కులుగాని, జీవితభృతిగా భూశాసనాలుగాని, జాగీర్లుగాని ఇవ్వలేదు. వారికి సహాయంగా కార్యదర్శులు ఉండేవారు. వీరు అధికార యంత్రాగానికి ఆయువుపట్టుగా ఉండేవారు.

5.3.8.2 రాష్ట్ర ప్రభుత్వం

రాజ్యమంతా నాలుగు రాష్ట్రాలుగా విభజించబడింది. ప్రతిరాష్ట్రం **"మామ్లత్‌దార్"** అనే రాష్ట్ర పాలకుడి అధికారంలో ఉండేది. రాజునకు వలెనే, ఇతనికి ఎనిమిది మంది ముఖ్యోద్యోగులు ఉండేవారు. గ్రామాధికారులను **"పటేల్"** లేదా **"ముఖ్య"** లేదా **"కుల్‌కర్ణి"** అని పిలిచేవారు. వీరందరికి జీతాలు ధన రూపంలో ఇవ్వబడేవి. క్రమబద్ధంగా ఏర్పాటైన న్యాయస్థానాలు లేవు. గ్రామాలలో వ్యవహారాలను పంచాయితీలు విచారించి తీర్పులిచ్చేవి.

5.3.8.3 రెవిన్యూ విధానం

మొత్తం ఫలసాయంలో ఐదింట రెండవ వంతు (2/5) భూమిశిస్తుగా నిర్ణయింపబడింది. దీనిని ధాన్య రూపంలో కాని, ధనరూపంలోకాని చెల్లించవచ్చు. రైతులను గూర్చి ప్రభుత్వం శ్రద్ధ వహించేది. వారి కెట్టి కష్టం కలగకుండా చూచేది. భూమిశిస్తు నిర్ణయించటానికై శివాజీ ఆదేశం మీద 1678లో, అన్నాజీ వ్యవసాయ భూమిని ఖచ్చితంగా 'సర్వే' చేయించాడు. కరువు కాటకాల సమయంలో రైతులు విత్తనాలు పశువులు మొదలగునవి కొనటానికై రుణాలు ఇచ్చేవారు. రైతులు ఈ రుణాలను సులభమైన సంవత్సర వాయిదాలలో, వారికి అనువైనప్పుడు చెల్లించేవారు. దేశం కొండ ప్రాంతంగా ఉన్నందువల్ల భూమిశిస్తు కాక ఇతర విధమైన ఆదాయ మార్గాలు ప్రభుత్వానికి ఉండేవి. వీనిలో ఒకటి **'చౌత్'**. రెండవది **"సర్‌దేశ్‌ముఖి"**. మహారాష్ట్రులు దోపిడీ, దండయాత్రలకు గురికాకుండా ఉండేటందుకై కొన్ని ప్రాంతాల నుంచి వారు వసూలు చేసే పన్ను పేరే **'చౌత్'** (అంటే నాల్గవ భాగం). ఈ **"చౌత్"** జిల్లా మొత్తం మీద అంచనా వేసిన ఆదాయంలో నాల్గోవంతు ఉండేది. **"చౌత్"** గాక **"సర్‌దేశ్‌ముఖి"** అనే పన్ను, శివాజీ గౌరవార్థం చెల్లించబడేది. ఇది జిల్లా మొత్తం ఆదాయంలో పదోవంతు ఉండేది. కొల్ల ధనాన్ని రాజుకు అప్పగించాలి. ఇది, ఆదాయానికి మరో మార్గంగా ఉండేది.

5.3.8.4 సైనిక వ్యవస్థ

శివాజి సైనిక వ్యవస్థ చాలా ఉన్నత స్థాయిలో ఉండింది. అతనికి కాల్బలం, అశ్వబలంతో కూడి సమర సన్నాహమైన నిలువ సైన్యం ఉండేది. సైన్యం తెలివిగా వ్యవస్థీకరించబడింది. పదిమంది కలిగిన దళానికి అధిపతి అయిన **"నాయక్"** నుంచి, వేయిమందితో కూడిన దళానికి అధిపతి అయిన **"హజారి"** వరకు, ఆరోహణా క్రమంలో అనేక అంతస్తులుగా ఏర్పరచబడింది. సైన్యాధ్యక్షున్ని **"సేనాపతి"** అని పిలిచేవారు; ఇతడు అష్టప్రధానులలో ఒకడు. ఇంతేగాక, శివాజీకి రెండు వందల యుద్ధనౌకలు, ఎనభై ఫిరంగులు ఉండేవి. నౌకాదళం కొలాబాలో ఉండేది. *'మధ్యయుగంలో నౌకాదళ నిర్మాణావసరాన్ని గుర్తెరిగిన మొదటి భారతీయ పాలకుడు, శివాజీ'* (A.L. Srivastava). అతని మరణ సమయానికి శివాజీ సైన్యంలో ముప్పై, లేదా నలభై వేల మంది అశ్వసైనికులు సుమారు ఒక లక్షమంది కాల్బలం ఉండినారు.

శివాజీ సైనికులకు ధన రూపంలో జీతాలు చెల్లించేవారు; వారు కొల్ల ధనం మీద ఆధారపడకూడదు. తన రాజోద్యోగుల జీవన భృతికై జాగీర్లిచ్చే విధానాన్ని శివాజీ ఇష్టపడలేదు. దుర్గ రక్షణకై ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడింది. వాటిని సరిఅయిన స్థితిలో ఉంచటానికి, చాలా ధనం వెచ్చించబడేది. అవి సమర్థవంతమైన సైన్యాలను కలిగి, ఎల్లప్పుడూ సమరాయత్తంగా ఉండేవి. విశిష్ట సేవలకు గాను బిరుదులను, విశేష గౌరవాలను, పారితోషికాలను ఇవ్వటాన్ని శివాజీ ప్రోత్సహించాడు. సైనిక క్రమశిక్షణ అత్యుత్తమంగా ఉండింది. ఏ సైనికుడు కాని యుద్ధరంగానికి పోతూ, ఆడవారిని వెంట తీసుకొని పోకూడదు. ఈ నేరానికి శిక్ష మరణమే. కొల్ల ధనాన్నంతా రాజుకు సమర్పించాలి.

BRAOU

5.3.9 చరిత్రలో శివాజీ స్థానం అంచనా

శివాజీ జన్మతః నాయకుడు; అతడు యుద్ధ తంత్రంలో గొప్ప ప్రతిభాశాలి. వైభవంలో పరాకాష్ట నందివున్న మొగల్ సామ్రాజ్యంతో అతడు విజయవంతంగా పోరాడాడు. తనకు ముందు చెల్లాచెదురుగా వున్న మహారాష్ట్రులలో ఐక్యమత్య భావాన్ని, జాతీయతా భావాన్ని కలుగజేసి, వారిని ఒక జాతిగా రూపొందించడమే, శివాజీ సాధించిన ఘనవిజయం. అతని ప్రయత్న ఫలితంగా పద్దెనిమిదవ శతాబ్దంలో మిక్కిలి శక్తివంతమైన రాజకీయ శక్తిగా మహారాష్ట్రులు రూపొందారు.

శివాజీ, తన కాలంలోని తన చుట్టూ ఉన్న ఇతర రాజులలో లేనటువంటి విశిష్ట గుణాలను అలవర్చుకొని, వాటిని ఆచరణలో పెట్టాడు. శివాజీ వ్యక్తిగత జీవితం ధర్మాచరణకు, సత్‌శీలానికి ఆదర్శ ప్రాయమైంది. అతడు తన మతాన్ని అభిమానించాడు; కాని, ఇతర మతాలను ద్వేషించలేదు. అతడు ముస్లిం సాధువులను కూడా గౌరవించి ముస్లిం ప్రార్థనా మందిరాలకు భూములొసగాడు. ముస్లిం చరిత్రకారుడైనా కాఫీఖాన్, శివాజీని గూర్చి వ్రాస్తూ **"పతితుడు" "కుయుక్తులు నేర్చిన దయ్యపు బిడ్డ", "వంచనకు తండ్రి"** అని పేర్కొన్నాడు. అట్టి కాఫీఖాన్, శివాజీని గూర్చి ఇలారాస్తాడు. *"అతని సైనికులు ఎచటనైనా దోపిడికి పోయినపుడు వారు మసీదులకు, దైవగ్రంథానికి (అంటే ఖురాన్‌కు), స్త్రీలకు ఎట్టి హాని చేయకూడదని, శివాజీ శాసించాడు. ఎప్పుడైన పవిత్ర ఖురాన్ ప్రతి ఏదైనా అతనికి లభ్యపడితే దానిని అతడు గౌరవంతో చూచి, తన ముసల్మాన్ అనుయాయులలో ఎవరికైనా ఇచ్చేవాడు. హిందూ లేదా ముస్లిం స్త్రీలు అతని మనుష్యులకు బందీలుగా దొరికితే వారిని రక్షించడానికి ఎవ్వరూ లేనప్పుడు, అతడు వారి బంధువులు వచ్చి, తగు నష్టపరిహారం చెల్లించి వారిని విడిపించుకొని పోయేవరకు, వారిని కనిపెట్టి ఉండేవాడు".* శివాజీకి స్త్రీలన్న అత్యంత గౌరవం.

అన్నిటికి మించి, శివాజీ గొప్ప రాజకీయ వేత్త, మానవుల గుణదోష నిర్ణయం చేయడంలో నిపుణుడు. అతడు మహారాష్ట్రులకు కీర్తికరుడు; మొగలులకు భయంకరుడు, అతని తరవాత వారికతడు ఉత్సాహ ప్రేరపకుడు. "శివాజీ నిజమైన గొప్పతనం, అతని సత్‌శీలంలో, క్రియానుశీలమైన సామర్థ్యంలో ఉందని" సావర్కర్ పేర్కొన్నాడు.

II. మీ అవగాహనను పరీక్షించుకోండి

1) శివాజీకి ఆదాయ వనరులేవి? వాటివల్ల ప్రభుత్వానికి ఆదాయం సక్రమంగా చేకూరేదా?

.....

.....

.....

.....

2) శివాజీ సాధించిన అత్యంత గొప్ప ఘనకార్యమేది?

.....

.....

.....

.....

5.4 బాలాజీ విశ్వనాథ్, 1713-1720

బాలాజీ విశ్వనాథ్ పీష్వా వంశ స్థాపకుడు. అతనిని **"అసమానమైన సేవకుడు"** అని, **"మహారాష్ట్ర సామ్రాజ్య ద్వితీయ స్థాపకుడ"**ని పిలిచారు. అతడు గొప్ప సామర్థ్యం గల రాజనీతి వేత్త. అతడు అనేక సంస్కరణలు

ప్రవేశపెట్టి, మహారాష్ట్ర రాజ్యాన్ని నిర్మించాడు. అతడు పీష్వా పదవిని వంశపరంపరాగతం చేశాడు. అతడు పూనేను తన రాజధానిగా చేసుకున్నాడు.

బాలాజీ విశ్వనాథ్ పాలనలోని అతి ముఖ్య విషయం, అతడు సయ్యద్ సోదరులకు చేసిన సహాయం, రాజులను సృష్టించేవారని పేరొందిన సయ్యద్ సోదరులు, బాలాజీ విశ్వనాథ్‌ను ఢిల్లీకి సహాయానికి రమ్మని, మొగల్ చక్రవర్తి ఫరుక్ సియర్‌ను సింహాసన భ్రష్టుడిని చేయడంలో సఫలీకృతులైనారు. దీనివల్ల దీర్ఘ పరిణామాలు కలిగాయి. ఈ సహాయానికి బదులుగా, మహారాష్ట్రులకు దక్కన్‌లోని ఆరు రాష్ట్రాల నుంచి "చౌత్", "సర్‌దేశ్ ముఖి" పన్నులను వసూలు చేసే హక్కులు లభించాయి. ఈ విధంగా మహారాష్ట్రుల ప్రభావం దక్కన్ అంతా వ్యాప్తి చెందింది.

బాలాజీ విశ్వనాథ్ రాజ్య ఆర్థిక పరిస్థితిని కూడా అభివృద్ధి పరిచాడు. మహారాష్ట్ర నాయకులనంతా ఒక సన్నిహిత సంఘంగా చేర్చుటకు అతడొక పథకాన్ని ప్రవేశపెట్టాడు. అతడీ నాయకులను, వారు వసూలు చేసిన చౌత్ పన్నులు 2/3 వంతు తామే ఉంచుకొని, 1/3 వ వంతు మాత్రమే పీష్వాకు పంపుటకు అనుమతించాడు. మొదట్లో ఈ విధానం సక్రమంగానే జరిగింది కాని, తర్వాత ఇది మహారాష్ట్రుల పతనానికి ఒక కారణమైంది. 1720లో బాలాజీ విశ్వనాథ్ మరణించాడు.

5.5 మొదటి బాజీరావు, 1720-1740

బాలాజీ విశ్వనాథ్ తర్వాత అతని పుత్రుడు బాజీరావ్ రాజ్యానికి వచ్చాడు. అతడు విజ్ఞుడైన రాజనీతిజ్ఞుడు. చక్కని యోధుడు. ఉత్తమ అశ్వికుడు. అతడు యుద్ధతంత్రంలో ప్రతిభాశాలి; మిక్కిలి వివేకం కలవాడు. అతని ధైర్యసాహసాలవల్ల రాజనీతిజ్ఞతవల్ల, అతడు పీష్వాలలో కడుసమర్థుడుగా పరిగణింపబడ్డాడు. అతడు "రణవీరుడైన పీష్వా", "మూర్తీభవించిన హిందూశక్తి" అని ప్రసిద్ధి చెందాడు.

మొదటి బాజీరావు సామ్రాజ్య కాంక్ష కలవాడు. బాజీరావు తండ్రి దక్కన్‌లో మహారాష్ట్రుల అధికారాన్ని స్థిరపరచడానికి ప్రయత్నించగా, బాజీరావు ఈ అధికారాన్ని ఉత్తర భారతదేశంలో స్థాపించదలచాడు. "హిందుపద్ పాదుషాహీ" లేదా అఖిల భారత సామ్రాజ్యం, అతని మహోన్నత ఆశయం. మొగల్ సామ్రాజ్య హృదయాన్ని ఛేదించడమే అతని రాజనీతి విధానం. అతను సాహూతో ఒకప్పుడు "బోదెను ఛేదిస్తే ఎండిన కొమ్మలు వాటంతట అవే పడిపోతాయి" అని అన్నాడు.

బాజీరావు పరిపాలనా కాలంలో మహారాష్ట్రులు గుజరాత్, మాల్వా, బుందేల్‌ఖండ్‌లను జయించి, ఢిల్లీ వరకు చొచ్చుకొని పోయాడు. మొగల్ చక్రవర్తికి సహాయం చేయటానికి గాను హైదరాబాద్ నిజాం పెద్ద సైన్యంతో దక్కన్ నుంచి బయలు దేరి వచ్చాడు; కాని, అతనిని 1738లో మహారాష్ట్రులు భోపాల్ సమీపంలో ఓడించారు. మొదటి బాజీరావు పోర్చుగీసుల నుంచి సాల్ సెట్, బేసిన్ లను పట్టుకొన్నాడు. ఈ విధంగా మహారాష్ట్రుల అధికారం, సుదూరం విస్తరిల్లింది.

5.5.1 మహారాష్ట్ర సమ్మేళనం

మొదటి బాజీరావు పాలనా కాలంలో, "చౌత్", "సర్ దేశ్‌ముఖి" పన్నులను వసూలు చేసే కొందరు మహారాష్ట్ర నాయకులు మిక్కిలి బలవంతులై, వారి వారి ప్రాంతాలలో అన్ని విధాలా స్వతంత్రంగా ఉండినారు. 1) నాగపూర్‌లో ఉన్న రఘోజి భోంస్లే 2) బరోడా లోని పిల్లాజీ గైక్వాడ్ 3) ఇండోర్ లోని మల్హర్‌రావ్ హోల్కార్ 4) గ్వాలియర్‌లోని రానోజీ సింధియా, వారు సొంత రాజ్యాలు స్థాపించారు. పీష్వా వీరందరిని ఒక కూటమిగా చేర్చాడు. ఈ కూటమికి మహారాష్ట్ర సమ్మేళనమని పేరు. ఈ మహారాష్ట్ర సమ్మేళనానికి అధిపతి పీష్వా. 1740 లో తన నలభై రెండవ యేట బాజీరావు మరణించాడు. గొప్పవారైన మహారాష్ట్ర రాజనీతిజ్ఞులలో అతడొకడు.

BRAOU

5.6 బాలాజీ బాజీరావు, 1740-61

బాజీరావు తర్వాత పద్దెనిమిదేండ్ల అతని కుమారుడు, బాలాజీ బాజీరావు రాజ్యానికి వచ్చాడు. బాలాజీ బాజీరావు తండ్రి అంత సమర్థుడు కాడు, కాని అతడు ఎల్లప్పుడు తన జ్ఞాతి, అతి సమర్థుడు అయిన సదాశివరావు భావో సహాయాన్ని, సలహాను తీసుకునేవాడు.

బాలాజీ బాజీరావు పాలనా కాలంలో మహారాష్ట్రుల అధికారం, దాని వైభవంలో ఆకాశాన్ని తాకింది. మహారాష్ట్ర సహాయకులు అన్ని వైపులా కొత్త ప్రాంతాలను జయించారు. రఘోజి భోంస్లే మధ్య భారతాన్ని జయించి, బెంగాల్ మీద చాలా దండయాత్రలు నడిపాడు. దాని మీదట, బెంగాల్ నవాబైన అలీవర్దీఖాన్, ఆతనికి ఒరిస్సా రాష్ట్రాన్ని దత్తం చేసి బెంగాల్, బీహార్‌లతో కూడిన రాష్ట్రానికి **"చౌత్", "సర్‌దేశ్ ముఖి"** పన్నులను చెల్లించటానికి ఒప్పుకొన్నాడు.

మహారాష్ట్రులు ఉత్తరాన కూడా అనేక విజయాలు సాధించారు. 1757లో అహ్మద్‌షా అబ్దాలీ ప్రతినిధి నుంచి ఢిల్లీని జయించారు. 1758లో పీష్వా తమ్ముడైన, "రఘోబా" అని పిలువబడే రఘునాథరావు పంజాబ్‌ను వశం చేసుకొని, అచట నుంచి అహ్మద్‌షా అబ్దాలీ కుమారుడు, రాజ ప్రతినిధి అయిన తైమూరును తరిమి వేశాడు. అటక్ కోట పైన మహారాష్ట్రుల కాషాయ ధ్వజం గర్వంగా రెపరెపలాడింది.

ఇట్లా మూడవ పీష్వా హయాంలో మహారాష్ట్ర అధికారం, భారతదేశం ఒక కొన నుంచి మరియొక కొన వరకు విస్తరించింది. వారి స్వాధీనంలో నేరుగాలేని ప్రదేశాల నుంచి వారు "చౌత్", "సర్‌దేశ్‌ముఖి" పన్నులు వసూలు చేశారు.

దాదాపు భారతదేశానికంతా మహారాష్ట్రులు అధిపతులుగా ఉన్న ఇట్టి సమయంలో, అహ్మద్‌షా అబ్దాలీ మూడవ పానిపట్ యుద్ధంలో వారిని తీవ్రంగా ఓడించారు. ఈ ఓటమి మహారాష్ట్ర అధికారానికి తీవ్ర విఘాతమైంది. దీని తాకిడివల్ల సంక్షోభం చెంది 1761లో పీష్వా మరణించారు.

III. మీ అవగాహన పరీక్షించుకోండి.

1. పీష్వా ప్రాబల్యం ఎక్కువ కావడానికి కారణాలేవి?

.....

.....

.....

.....

2. మొగల్ సామ్రాజ్యముపట్ల మొదటి బాజీరావు ఎటువంటి విధానాన్ని పాటించినాడు?

.....

.....

.....

.....

BRAOU

5.7 మూడవ పానిపట్ యుద్ధం, 1761

ఈ యుద్ధం ఆఫ్ఘనిస్తాన్ రాజైన అహ్మద్‌షా అబ్దాలీకి, మహారాష్ట్రులకు మధ్య జరిగింది.

5.7.1 కారణాలు

మూడవ పీష్వా తమ్ముడైన రఘునాథరావు అహ్మద్‌షా అబ్దాలీ రాజ్యంలో చేరి వున్న పంజాబ్‌ను ఆక్రమించి అక్కడ నుంచి అబ్దాలీ రాజ ప్రతినిధిని తరిమి వేయటం, ఈ యుద్ధానికి ప్రధాన కారణం. అందువల్ల అహ్మద్‌షా అబ్దాలీ ఒక పెద్ద సైన్యాన్ని నడుపుకొని మహారాష్ట్రులపై దండెత్తి వచ్చాడు. చరిత్రాత్మకమైన పానిపట్ యుద్ధభూమిలో 1761 జనవరి 14న, తీవ్ర యుద్ధం జరిగింది.

5.7.2 యుద్ధ విశేషాలు

మహారాష్ట్ర సైన్యాధ్యక్షుడు భావో సాహెబ్ అనబడే సదాశివరావు, ఇతడు పీష్వాకు దగ్గరి బంధువు, మూడవ పీష్వా కుమారుడైన విశ్వాసరావు ఉపసైన్యాధ్యక్షుడు. భావో నిస్సంశయంగా అతి సమర్థుడైన వ్యక్తి; కాని, అతడు అహంకారి, గర్విష్టి, భరత్‌పూర్‌ను పాలించే జాట్ నాయకుడు సూరజ్‌మల్‌తో సహా అనుభవజ్ఞులైన సేనా నాయకులనేకులు ప్రత్యక్ష యుద్ధం చేయక, "గెరిల్లా" (బందిపోటు) యుద్ధం చేయమని భావోకు సలహా ఇచ్చారు. యుద్ధ తంత్ర నిపుణులైన వీరి సలహాను భావో పెడచెవిన పెట్టాడు. అందుమీదట, సూరజ్‌మల్ తన సైన్యంతో వెనుతిరిగి వెళ్ళాడు. పోగా, అహ్మద్‌షా అబ్దాలీ రోహిల్లాల, ఔద్ నవాబు యొక్క సహకారం పొందగలిగాడు.

5.7.3 ఫలితాలు

1. ఈ ఓటమి కొంత కాలం వరకు, మహారాష్ట్రుల అధికారాన్ని, ప్రాభవాన్ని అంతమొందించింది. అఖిల భారత సామ్రాజ్యాన్ని స్థాపించాలనుకొన్న వారి ఆశలు భగ్నమై పోయాయి. "అది మహారాష్ట్రులకు జాతి వ్యాప్తంగా సంభవించిన ఉపద్రవం" (జె.యన్.సర్కార్), "మొగల్ చరిత్ర ఇంతటితో అంతమైంది" (ఎల్ఫిన్‌స్టన్). "అది ఓటమి మాత్రమే కాదు, మహారాష్ట్రుల ప్రయోజనాలకు కలిగిన విపత్తు" (స్మిత్) అని చరిత్రకారులు పేర్కొన్నారు.

2. ఈ యుద్ధంవల్ల ముస్లిమ్‌లకు కూడా ఎలాంటి నికరమైన లాభం చేకూరలేదు. తన రాజ్యంలో జరుగుచున్న రాజకీయ కుట్రలవల్ల, అహ్మద్‌షా అబ్దాలీ వెనుదిరిగిపోవలసి వచ్చింది.

3. ఆంగ్లేయులకు ప్రత్యర్థులైన మహారాష్ట్రులు, ముస్లిమ్‌లు, బలహీనమైనందువల్ల, ఆంగ్లేయులకు తమ అధికారాన్ని పెంపు చేసుకొనే అవకాశం లభించింది. ఇది భారతదేశ చరిత్ర గతిని నిర్ణయించింది.

4. ఈ యుద్ధంవల్ల శిక్కులు పంజాబ్‌లో తమ ఆధిక్యతలను స్థాపించడం సులభమైంది. వారు పఠానులను తరిమి వేశారు. పఠానులు తమ స్వదేశానికి వెళ్ళిపోయారు.

5.7.4 మహారాష్ట్రుల ఓటమికి కారణాలు

మహారాష్ట్రుల ఓటమికి ప్రధానకారణాలు యివి:

1) అహ్మద్‌షా అబ్దాలీ ఆరితేరిన సైన్యాధ్యక్షుడు.

2) అతని సైన్యం బలంలో, ఆయుధాలలో, క్రమశిక్షణలో, మహారాష్ట్రుల కన్నా ఉత్తమమైంది.

3) భావో గర్విష్టి; అతడు ఇతరుల సలహాలను లక్ష్య పెట్టలేదు.

BRAOU

4) మహారాష్ట్ర సైన్యానికి ఆహార పదార్థాలు అయిపోయి, అది పస్తులుండ వలసి వచ్చింది.

5) మహారాష్ట్ర సేనా నాయకులు జాట్‌ల సలహా వినక పోయినందువల్ల, వారి అభిమానాన్ని కోల్పోయారు. పోగా, అహ్మద్‌షా అబ్దాలీ రోహిల్లాల యొక్క, ఔద్ నవాబు యొక్క సహకారాన్ని పొందగలిగాడు.

6) మహారాష్ట్రులు, వారికి అభ్యాసం లేని బహిరంగ యుద్ధం చేశారు.

IV. మీ అవగాహన పరీక్షించుకోండి

1) మహారాష్ట్రులు ఢిల్లీని ఎప్పుడు స్వాధీనం చేసుకున్నారు?

.....

.....

.....

.....

2) మూడవ పానిపట్ యుద్ధానికి ఎందుకు ప్రాముఖ్యత లభించింది?

.....

.....

.....

.....

5.8 సంగ్రహంగా

1. శివాజీ మహారాష్ట్రులను ఐక్యపరిచాడు. బీజాపూర్, మొగల్ రాజుల పరిపాలన నుంచి మహారాష్ట్రులకు విముక్తి కలిగించినాడు.
2. శివాజీ పరిపాలన సమర్థవంతంగా వుండింది. రాజ్యానికి రాజు తండ్రి వంటివాడు అనే భావనతో అతని పరిపాలన సాగింది.
3) శివాజీ మనుమడైన సాహు కాలం నుంచి, పీష్వా ప్రధానమంత్రి మహారాష్ట్ర రాజ్యానికి నిజమైన పరిపాలకుడయినాడు.
4) 1713 నుంచి 1818 వరకు పీష్వాలు మహారాష్ట్ర రాజ్యాన్ని పరిపాలించినారు. వారి రాజ్యానికి పూనా రాజధాని.
5) బాలాజీ విశ్వనాథ్ (1713-20) పీష్వా వంశ స్థాపకుడు. అతను మొగల్ చక్రవర్తి ఫరూక్ షయర్‌ను ఓడించడానికి, సయ్యద్ సోదరులకు తోడ్పడినాడు.
6) మొదటి బాజీరావు (1720-40) పీష్వాలందరిలోకి గొప్పవాడు. అతను నైజామును ఓడించి తన ఆధిపత్యాన్ని ఢిల్లీ వరకు వ్యాపింపజేసినాడు. నాగపూర్‌లోని భోంస్లే, బరోడా లోని గాయక్వాడ్, ఇండోర్‌లోని హొల్కార్, గ్వాలియర్‌లోని సింధియా రాజులను ఒక సమాఖ్యగా మొదటి బాజీరావు ఏర్పాటు చేసినాడు.
7) బాలాజీ బాజీరావు కాలంలో (1740-61) మహారాష్ట్ర ఆధిపత్యం, అత్యున్నత స్థాయినందుకుంది. 1757లో అహమద్‌షా అబ్దాలీ ప్రతినిధినుంచి, మహారాష్ట్రులు ఢిల్లీని వశపరుచుకున్నారు.
8) మూడవ పానిపట్ యుద్ధంలో మహారాష్ట్రుల ఓటమి తర్వాత, వారి ఆధిక్యత నశించింది.

BRAOU

5.9 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1) శివాజీ తల్లి జిజియాబాయి, అతని గురువు, సంరక్షకుడు, దాదాజి కొండదేవ్, మహారాష్ట్ర ప్రాంతపు మత గురువులు, తుకారామ్, రామదాస్, శివాజీని ప్రభావితం చేశారు. వారి ప్రభావంవల్లనే, శివాజీ మహారాష్ట్రుల ఐక్యతకు కృషి చేసినాడు.

2. శివాజీ, రాజ్యానికి రాజధాని రాయ్‌ఘడ్.

II. 1. భూమి శిస్తు చౌత్, సర్దేశ్‌ముఖి; యుద్ధంలో స్వాధీనం చేసుకున్న సంపద, శివాజీ ప్రభుత్వానికి ముఖ్య ఆదాయ వనరులు. అవి శివాజీ ప్రభుత్వానికి సక్రమమైన ఆదాయాన్ని కలిగించలేదు.

2. మహారాష్ట్రులను ఐక్య పరచి వారికి ఒక రాజ్యాన్ని ఏర్పరచటమే శివాజీ సాధించిన అత్యంత గొప్ప ఘనకార్యము.

III. 1. సాహూ బలహీనతవల్ల పీష్వా ప్రాబల్యం పెరిగింది.

2. మొగల్ రాజ్యంపై మహారాష్ట్రుల ఆధిపత్యాన్ని నెలకొల్పడం, మొదటి బాజీరావు లక్ష్యము. అందుకొరకు అతను, మొగల్ సామ్రాజ్య కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేసినాడు.

IV. 1. 1757

2. మూడవ పానిపట్ యుద్ధం, భారతదేశ చరిత్ర గతిని మార్చింది. ఆ యుద్ధంలో మహారాష్ట్రుల ఓటమి, భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు తోడ్పడింది. అందువల్ల మూడవ పానిపట్ యుద్ధానికి ప్రాముఖ్యత వుంది.

5.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) శివాజీ జీవితాన్ని, అతడు సలిపిన విజయ యాత్రలను సమీక్షించండి.
2) శివాజీ పరిపాలనా వ్యవస్థను వివరించండి.
3) చరిత్రలో శివాజీకున్న స్థానాన్ని విమర్శనాత్మకంగా అంచనా వేయండి.
4) మొదటి ముగ్గురు పీష్వాల కాలంలో జరిగిన మహారాష్ట్రుల అధికార అభివృద్ధిని వివరించండి.
5) మూడవ పానిపట్ యుద్ధకారణాలను, సంఘటనలను, ఫలితాలను, తెల్పండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) మహారాష్ట్రులు, వారి దేశంపై ఒక లఘువ్యాఖ్య వ్రాయండి.
2) దక్కన్, దక్షిణ ప్రాంతాలలో శివాజీ చేసిన విజయ యాత్రలను సంక్షిప్తంగా వర్ణించండి.
3) మొగల్ దాడులకు వ్యతిరేకంగా శివాజీ ఎలా నిలబడగలిగాడు?
4) శివాజీ పాలనలో ప్రజల ఆర్థిక పరిస్థితిని వివరించండి.
5) బాలాజీ
6) మహారాష్ట్రులు
7) మూడవ పానిపట్ యుద్ధం

BRAOU

5.11 ఉపయుక్త గ్రంథాలు

1. Bipan Chandra	:	*Modern India*
2. Majumdar R.C. (Ed)	:	*Bharatiya Vidya Bhavan Series Vols. Vii & VIII*
3. Majumdar R.C. & Others	:	*Advanced History of India*
4. Perceival Spear	:	*History of India Vol.II*
5. Ishwari Prasad	:	*A short history of Muslim rule in India*
-Do-	:	*Medieval India*
6. Mehta J.L.	:	*Advanced study, The history of medieval*
7. Sarkar, Jadunath	:	*History of Aurangazeb*
-Do-	:	*Fall of mughal empire*
-Do-	:	*Shivaji and his times*
8. Sen.S	:	*Shivaji Chatrapati*
9. Smith V.A.	:	*Oxford History of India*
10. Srivastava A.C.	:	*The Mughal Empire*
11. ఝాన్సీ లక్ష్మి, పాటిబండ వైదేహి, అల్లాడి	:	భారతదేశ చరిత్ర, సంస్కృతి ద్వితీయ భాగం.

BRAOU

భాగం - 6 : ప్రాంతీయ రాజ్యాల ప్రాబల్యం, సమాజం, ఆర్థిక వ్యవస్థ

విషయక్రమం

6.0 లక్ష్యాలు
6.1 పరిచయం
6.2 ప్రాంతీయ రాజ్యాలు
6.2.1 బెంగాల్
6.2.2 అయోధ్య
6.2.3 పంజాబ్
6.2.4 హైదరాబాద్
6.2.5 కేరళ (మలబార్)
6.2.6 మైసూర్
6.2.6.1 హైదరాలి
6.2.6.2 టిప్పు సుల్తాన్
6.3 దక్షిణ భారతదేశపు నాయకులు
6.3.1 మధుర నాయక రాజ్యం
6.3.2 తంజావూరు నాయకత్వం
6.4 ఆర్థిక పరిస్థితులు
6.4.1 వర్తక వాణిజ్యాలు
6.4.2 వ్యవసాయము
6.5 సమాజం, సంస్కృతి
6.5.1 సాంస్కృతిక జీవనం
6.5.2 విద్య
6.5.3 క్రైస్తవ మిషనరీలు
6.6 సంగ్రహంగా
6.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
6.8 పరీక్ష నమూనా ప్రశ్నలు
6.9 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

6.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. మొగల్ సామ్రాజ్య పతనం తర్వాత దేశంలో ప్రాంతీయ రాజ్యాల స్థాపన
2. 18వ శతాబ్దంలో అంటే మొగల్ సామ్రాజ్య క్షీణత తర్వాత సాంఘిక, ఆర్థిక పరిస్థితులు

6.1 పరిచయం

1757 జరిగిన ప్లాసీ యుద్ధంతో భారతదేశ చరిత్రలో బ్రిటీష్ యుగం మొదలవుతుందని, సాధారణంగా పరిగణించబడుతున్నది. కొందరు చరిత్రకారులు ఇది మరికొంత ఆలస్యంగా 1761లో మూడవ పానిపట్ యుద్ధంతో ప్రారంభమౌతుందని తలచారు. 1707 లో ఔరంగజేబ్ మరణం నుంచి, భారతదేశ రాజకీయ రంగంపై అర్ధ శతాబ్దంపైబడి, ఆధిపత్యం నెరపిన మహారాష్ట్రుల ప్రాముఖ్యం, 1761లో జరిపిన మూడవ పానిపట్ యుద్ధం నుంచి తగ్గిపోసాగింది. నాటి నుంచి ఈ ప్రాముఖ్యం ఇంగ్లీష్ తూర్పు ఇండియా కంపెనీ రాజకీయాలపై కేంద్రీకరింపబడింది. ఔరంగజేబ్ మరణం తరవాత మొగల్ సామ్రాజ్యం అనేక స్వతంత్ర

రాజ్యాలుగా విడిపోయింది. మొగల్ చక్రవర్తుల క్రింద సుమారు రెండు వందల ఏండ్లుగా ఉన్న రాజకీయ ఐక్యత భగ్నమై పోయింది. ఫలితంగా ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో దీర్ఘ పరిణామాలు ఏర్పడ్డాయి. భారతదేశ రాజకీయ రంగంలో ఆంగ్లేయులకు సంబంధించి, ఈ స్వతంత్రరాజ్యాలు వహించిన పాత్రను వివరంగా అధ్యయనం చేసే దానికి ఉపోద్ఘాతంగా ఈ రాజ్యాలు ఎట్లా ఏర్పడింది, ఇచట క్లుప్తంగా పేర్కొంటాము.

18వ శతాబ్దం పై చర్చ

భారతదేశ చరిత్రగతిలో, 18వ శతాబ్దమును పతన, చీకటి యుగంగా వల్లించుట సర్వసాధారణం కాని గత 3 దశాబ్దాల కాలంలో 18వ శతాబ్దపు స్వభావం, ప్రాధాన్యత గురించి తీవ్రమైన వాదోపవాదాలతో కూడిన చర్చ జరుగుతున్నది. ఈ పైన పేర్కొన్న చర్చల ఫలితంగా 18వ శతాబ్దమును ఒక ముఖ్యమైన సంధి యుగంగా గుర్తించి, ఈ కాలంలోనే మొగలాయి సామ్రాజ్యం పతనమై, క్షీణించి అనేక చిన్న రాజ్యాల ఆవిర్భావం జరిగిందని, ఒక వ్యాపార సంస్థయైన బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెని ఒక రాజకీయ శక్తిగా ఆవిర్భవించినదని అభిప్రాయం వెలిబుచ్చారు. 18వ శతాబ్దమునే ప్రాంతీయ రాజ్యాలైన బెంగాల్, మైసూర్, పంజాబ్, ఔధ్, హైద్రాబాద్‌లు ఆవిర్భవించిన యుగంగా గుర్తించారు. అయితే బెంగాల్, ఔధ్, హైద్రాబాద్‌లను **'వారసత్వ రాజ్యాలు'**(Succession States) గా గుర్తించగా, మహారాష్ట్ర, జాట్, శిక్కు, ఆఫ్ఘన్ రాజ్యాలను స్వతంత్ర రాజ్యాలన్నారు. సూక్ష్మంగా పరిశీలిస్తే హైదరాలి, టిప్పుసుల్తానుల నాయకత్వంలోని మైసూర్ పైన పేర్కొన్న వారసత్వ లేదా స్వతంత్ర రాజ్యాల తెగ క్రిందకు రాదు. అంతేగాక ఒక విభిన్నమైన రాజ్య వ్యవస్థగా గుర్తించబడుతుంది. సైనిక, ఆయుధాల తయారీలో, వ్యాపార రంగాలలో ఆధునికతను ప్రవేశ పెట్టిన మొదటి రాజ్యం మైసూర్.

పశ్చిమ దేశాల సంస్కృతుల సవాళ్ళను ఎదుర్కోవాలన్న నూతన శక్తి, ఉత్సాహాలు కావాలన్న దూరదృష్టిని మైసూర్ రాజ్యం తప్ప మరే ఇతర రాజ్యం ప్రదర్శించలేదు. మార్పుకని లోపభూయిష్టమైన సామాజిక వ్యవస్థ అన్ని రాజ్యాలలో కొనసాగగా పశ్చిమ దేశాలు తమకున్న ఉన్నతమైన ఆర్థిక విధానముతోను, అభివృద్ధి చెందిన శాస్త్రీయ సాంకేతిక జ్ఞానముతోను, భారతదేశంలో పాతుకు పోయిన పాత సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను కూలద్రోసి వలస రాజ్య వ్యవస్థను ఈ శతాబ్దంలోనే స్థాపించారు. ఈ బలవంతపు మార్పు భారతీయులపై వలస రాజ్యదోపిడి, ఆధునిక భారతదేశ ఆవిర్భావమునకు కావలసిన ఇంధనమును, శక్తిని భారతీయులకు ఇచ్చిందనటం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

6.2 ప్రాంతీయ రాజ్యాలు

6.2.1 బెంగాల్

18వ శతాబ్దంలో బెంగాల్ స్వతంత్ర రాజ్యమయింది. 18వ శతాబ్దపు ప్రారంభంలో బెంగాల్‌కు మొగల్ గవర్నర్‌గా వున్న మురిద్ ఖులిఖాన్, ఇంచుమించు స్వతంత్ర రాజుగా పరిపాలించాడు. 1727 లో మురిద్ ఖులి ఖాన్ చనిపోయిన తర్వాత అతని అల్లుడు షుజావుద్దీన్ బెంగాల్ గవర్నరయినాడు. అతను 1739 వరకు పరిపాలించాడు. ఆ సంవత్సరంలో షుజావుద్దీన్ కొడుకును చంపి అలీవర్ది ఖాన్ రాజైనాడు. 1741 లో అలీవర్దీఖాన్, తనను బెంగాల్ స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్నాడు. మురిద్ ఖులిఖాన్, షుజావుద్దీన్, అలీవర్దీఖాన్‌లు, బెంగాల్‌లో చక్కని పరిపాలన శాంతి, సంపదలు నెలకొల్పినారు. ఆ ముగ్గురు నవాబులు తమ రాజ్యంలో హిందు మహమ్మదీయులకు సమాన ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వారు వ్యాపార అభివృద్ధి విధానాన్ని కూడా అవలంబించారు.

నామమాత్రపు మొగల్ చక్రవర్తి అయిన ముహమ్మద్‌షా 'రంగీలా' (1719-1748) పరిపాలన కాలంలో బెంగాల్ రాష్ట్ర పాలకుడైన అలీవర్దీఖాన్ 1741 లో తన స్వతంత్రాన్ని ప్రకటించాడు. అతని రాజధాని మురిదాబాద్. అతడు సమర్థుడు, యుక్తిపరుడైన రాజకీయవేత్త. అతని తర్వాత 1756లో అతని దౌహిత్రుడు చరిత్రలో

BRAOU

సిరాజుద్దౌలా అని ప్రసిద్ధి చెందిన మీర్జా మహమ్మద్ తన ఇరవై ఒకటవ ఏట రాజ్యానికి వచ్చాడు. అతడు సింహాసనం అధిష్ఠించగానే అతనికి ఆంగ్లేయులతో తగువేర్పడింది. మరుసటి ఏడు, అంటే 1757లో, ఆంగ్లేయులు అతనిని ప్లాసీ యుద్ధంలో ఓడించారు. బెంగాల్ ఆంగ్లేయుల వశమైంది. ఆంగ్లేయులు అతనిని గెలిచిన మొదటి రాష్ట్రం బెంగాల్; దీనిని గెలిచినవాడు రాబర్ట్ క్లైవ్. 1764లో జరిగిన బక్సర్ యుద్ధంతో ఆంగ్లేయులు బెంగాల్‌ను ఆక్రమించడం పూర్తి అయింది.

6.2.2 అయోధ్య

1722లో మొగల్ సామ్రాజ్యంలో అయోధ్యకు గవర్నర్ అయిన సాదత్ ఖాన్, తనను అయోధ్యకు స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్నాడు. అతను అయోధ్యను 1739 వరకు పరిపాలించాడు. అతను హిందూ, మహమ్మదీయులను సమానంగా చూశాడు. తిరుగుబాటు చేసిన జమీందార్లను అణిచివేసి తన రాజ్యంలో శాంతి భద్రతలను నెలకొల్పి సంపదను పెంచాడు. సాదత్‌ఖాన్ తర్వాత, 1754 వరకు సఫ్‌దర్ జంగ్ పరిపాలించాడు. తనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లను అణిచివేయడానికి సాదత్‌ఖాన్, మహారాష్ట్రుల సైనిక సహాయాన్ని స్వీకరించాడు. అయోధ్య నవాబులు సాహిత్యాన్ని, కళను ఎక్కువగా పోషించారు. వారి పోషణవల్ల అయోధ్యలోని శాంతి, సంపదలవల్ల అయోధ్య రాజ్యంలో ఒక విశిష్టమైన సంస్కృతి అభివృద్ధి చెందింది. అయోధ్య రాజ్యంలో ముఖ్య పట్టణమయిన లక్నో, ఆ సంస్కృతికి కేంద్రమయింది. ఆ రోజుల్లో లక్నో సాంస్కృతిక రంగంలో ఢిల్లీకి ముఖ్య పోటీ కేంద్రమయింది. లక్నో చేతి పరిశ్రమలకు కూడా ప్రసిద్ధి చెందింది.

ఔద్ రాజుల మూలపురుషుడు సాదత్ ఖాన్. 1724లో అతడా రాష్ట్రానికి పాలకుడై అన్ని విధాల స్వతంత్రంగా పాలించడం ప్రారంభించాడు. 1764 లో ఔద్ నవాబుగా మొగల్ చక్రవర్తికి నవాబ్, వజీర్ లేదా ప్రధానమంత్రిగా ఉన్న షుజాఉద్దౌలా, మొగల్ చక్రవర్తి అయిన రెండవ షా ఆలంతో సహా, బెంగాల్ నవాబైనా మీర్ కాశింతో ఒక కూటమిగా చేరి ఆంగ్లేయుల నుంచి బెంగాల్‌ను వశపరచుకోవడానికి ప్రయత్నించాడు. కాని వీరు 1764లో జరిగిన బక్సర్ యుద్ధంలో ఆంగ్లేయుల చేత ఓడింపబడ్డారు. షుజాఉద్దౌలా, షాఆలం ఆంగ్లేయులకు లొంగిపోయారు. 1765 లో జరిగిన అలహాబాద్, కారా మినహాయించి, యాభై లక్షల రూపాయలు చెల్లించిన మీదట, ఆంగ్లేయులు షుజాఉద్దౌలాకు తిరిగి ఇచ్చి వేశారు. నాటి నుంచి బెంగాల్, వాయవ్య భారతాల మధ్య, ఔధ్ తటస్థమైన మిత్ర రాజ్యంగా ఉండింది. 1774లో మొదటి గవర్నర్ - జనరల్ అయిన వారన్ హేస్టింగ్స్, రోహిల్లాలకు వ్యతిరేకంగా షుజాఉద్దౌలాకు సహాయం చేసి, అతని వద్ద నుంచి నలభై లక్షల రూపాయలు కంపెనీకి సంపాదించాడు. షుజాఉద్దౌలా తర్వాత ఆసఫ్ ఉద్దౌలా ఔద్ రాజ్యానికి వచ్చాడు. వారన్ హేస్టింగ్స్ సహకారంతో ఇతడు కంపెనీకి చెల్లించవలసిన బకాయిలకు గాను, ఔద్ బేగంల నుంచి 76 లక్షల రూపాయలు పిండినాడు.

6.2.3 పంజాబ్

మొగల్ చక్రవర్తి అహ్మద్‌షా కాలం (1719-1748)లో, ఆఫ్ఘనిస్థాన్ లో నాదిర్‌షా తర్వాత రాజ్యానికి వచ్చిన అహ్మద్‌షా దురాని (అబ్దాలీ), చక్రవర్తి నుంచి పంజాబ్‌ను పొందాడు. 1761లో మూడవ పానిపట్ యుద్ధంలో అతడు ప్రముఖమైన పాత్ర వహించి మహారాష్ట్రులను ఓడించాడు. కాని అతని ఆఫ్ఘన్ అనుచరులు సహకరించనందువల్ల, అతడు తన రాజ్యమైన ఆఫ్ఘనిస్తాన్‌కు వెనుదిరిగి పోవలసి వచ్చింది. అప్పటికి ఒక సైనికబలంగా రూపొందిన శిక్కులు రావల్పిండి, యమునా నది మధ్య ఉన్న దేశాన్ని ఆక్రమించారు. వారు 1764లో లాహోర్‌ను ఆక్రమించారు. 1767లో అమర్‌సింగ్‌చే స్థాపించబడిన పాటియాలా రాజ్యం, సట్లెజ్, నదికి తూర్పున, ప్రముఖ శిక్కు రాజ్యమయింది. పంజాబ్‌లోని పండ్రెండు మిసిల్ (విభాగం) లలో ఒకటైన సుకర్ చకియా మిసిల్‌కు, 1779లో రంజిత్ సింగ్ రాజైనాడు. 1799 లో అతడు పందొమ్మిది ఏండ్ల వాడుగా ఉన్నప్పుడు, అతడు ఆఫ్ఘనిస్తాన్ పాలకుడు, అహ్మద్‌షా అబ్దాలీ మనుమడు అయిన జమన్‌షాకు, "రాజా" అనే

BRAOU

బిరుదుతో లాహౌర్ పాలకుడుగా నియమించాడు. రంజిత్‌సింగ్ చాలా దండయాత్రలు చేసి శిక్కుల అధికారాన్ని పంజాబ్‌లో, కాశ్మీర్‌లో స్థాపించాడు.

రంజిత్‌సింగ్ సాహసవంతుడైన సైనికుడు, దక్షత కలిగిన పరిపాలకుడు, చాకచక్యము కలిగిన రాజనీతిజ్ఞుడు. అతను పంజాబులో తన రాజ్యాన్ని నెలకొల్పి కాశ్మీర్, పెషావర్, ముల్తాన్‌లను జయించాడు. రంజిత్ సింగ్, క్రమశిక్షణ కలిగిన, మంచి ఆయుధాలున్న, శక్తివంతమైన సైన్యాన్ని నెలకొల్పినాడు. అతని సైనికులకు పాశ్చాత్యులు శిక్షణ ఇచ్చినారు. సైనికులకు పాశ్చాత్య ఆయుధాలను సరఫరా చేశాడు. ఆసియా ఖండంలో ఆ రోజుల్లో బ్రిటిష్ వారి సైన్యం అగ్రశ్రేణికి చెందినదని రంజిత్‌సింగ్ సైన్యం, ద్వితీయ శ్రేణికి చెందినదని కొందరు అంచనా వేయడం జరిగింది. రంజిత్ సింగ్ తన ప్రభుత్వంలో అన్ని మతాల వారిని, సిక్కులు, హిందువులు, మహ్మదీయులను నియమించాడు. సిక్కుమతాన్ని తను దీక్షతో పాటిస్తూ, ఇతర మతాలన్నిటిని గౌరవించాడు.

6.2.4 హైదరాబాద్

1722లో ఆసఫ్‌జా (చిన్‌కిలిచ్ ఖాన్) మొగల్ చక్రవర్తి ముహమ్మద్‌షా (1719-48) కు, ప్రధానమంత్రి (వజీర్) అయినాడు. కాని అతడు సామ్రాజ్యాన్ని సక్రమమైన పద్ధతిలో నడపడం అసాధ్యమని తెలుసుకొన్నాడు. అందుచేత 1723లో తన రాష్ట్రమైన దక్కన్‌కు పోయి, అచట స్వతంత్రుడై 1724లో నిజాం వంశాన్ని స్థాపించాడు. అతని క్రింద సామ్రాజ్యంలోని దక్కన్ రాష్ట్రాలన్నీ స్వతంత్రమైనాయి. నిజామ్-ఉల్-ముల్క్ ఆసఫ్‌జా తన రాజ్యంలో చక్కని పరిపాలన నెలకొల్పినాడు. జమీందార్లను తన అదుపు ఆజ్ఞలలో వుంచుకున్నాడు. రెవిన్యూ వ్యవస్థలో అవినీతిని తొలిగించడానికి కూడా ప్రయత్నించాడు. తన దివాన్‌గా పూరన్ చంద్ అనే హిందువును నియమించాడు. 1748లో **నిజామ్-ఉల్-ముల్క్** చనిపోయిన తర్వాత హైదరాబాద్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడింది.

కృష్ణానదికి దక్షిణంగా తీరస్థమైన కర్ణాటక రాష్ట్రం, మహారాష్ట్ర రాజ్యమైన తంజావూరు వరకు విస్తరించి ఉండింది. ఇది 1748లో నిజాం మరణం వరకు, అతనికి సామంత రాష్ట్రంగా ఉండింది. చోళ మండల (కోరమండల్) తీర ప్రాంతంలో కూడిన నిజాం రాజ్యానికి దక్షిణంగా, నిజాంతో సరితూగగల బలవంతమైన రాజ్యమేమి లేకపోయింది. 1748లో నిజాం చనిపోయిన తర్వాత, కర్ణాటక నవాబైన దోస్త్ అలి, స్వాతంత్ర్యం ప్రకటించే ప్రయత్నంలో తన రాజ్యాన్ని విస్తరించే ప్రయత్నాలు చేయసాగాడు.

6.2.5 కేరళ (మలబార్)

మలబార్ దాని తీరాన్ని, పడమటి కనుమలు మిగిలిన భారతదేశం నుంచి ప్రత్యేకంగా ఉంచుతాయి. ఇచట క్యాలికట్ జామోరిన్ (కల్ళి కోట రాజు) పాలిస్తుండినాడు. కేరళలో మిక్కిలి దక్షిణంగా అధికారాన్ని తిరువాన్కూరు రాజు, కొచ్చిన్ రాజు పంచుకొని ఉండినారు.

తిరువాన్కూర్ రాజ్యము 1729 తర్వాత మార్తాండ వర్మ పరిపాలనలో ప్రసిద్ధి చెందింది. అతను 18వ శతాబ్దపు రాజనీతిజ్ఞులలో ప్రముఖుడు. అతను తిరువాన్కూర్ సైన్యాన్ని పాశ్చాత్య పద్ధతిలో రూపొందించి డచ్ వారిని ఓడించగలిగాడు. వ్యవసాయ అభివృద్ధికి నీటి వనరులు ఏర్పాటు చేసి, వ్యాపార అభివృద్ధి కొరకు, రోడ్లు కాలువలను కూడా నిర్మించాడు.

6.2.6 మైసూర్

మలబార్‌కు, కర్ణాటకానికి మధ్య హిందూ రాజ్యమైన విజయనగర రాజ్యంలో ఒక భాగంగా ఉండింది. 1565లో రాక్షసతంగడి యుద్ధంలో విజయనగర సామ్రాజ్యానికి సంభవించిన విపత్తు తర్వాత, ఒడెయార్ వంశానికి చెందిన ఒక హిందూ రాజు క్రింద మైసూర్ స్వతంత్రమైంది. మైసూర్ రాజు కొల్లువులో సైనికుడుగా జీవితాన్ని

BRAOU

ప్రారంభించిన హైదరాలి, తన సామర్థ్యం చేత మైసూర్ సైన్యంలో ఫౌజుదారై, పిదప సైన్యాధ్యక్షుడయ్యాడు. 1766లో మైసూర్ రాజు చనిపోగానే, అతడు సింహాసనాన్ని ఆక్రమించి మైసూర్ సుల్తాన్ అయినాడు. పద్దెనిమిదవ శతాబ్దంలో అతడు, అతని కుమారుడు టిప్పు సుల్తాన్ ఆంగ్లేయులకు భయంకర శత్రువులైనారు.

6.2.6.1 హైదరాలి, 1721-1782

హైదరాలి సమర్థుడైన పరిపాలకుడు, ధైర్యశాలి అయిన సైనికుడిగా, చతురత కలిగిన రాజనీతిజ్ఞుడిగా కూడా హైదరాలి కీర్తి గడించాడు. సామాన్య సైనికుడిగా మైసూర్ సైన్యంలో చేరిన హైదరాలి అదే సైన్యానికి సైన్యాధ్యక్షుడయినాడు. ఫ్రెంచి వారి సహాయంతో మైసూరు సైన్యాన్ని శక్తివంతమైన సైన్యంగా అభివృద్ధి చేశాడు. 1755లో మైసూరు రాజు, నంజరాజును తొలగించి తానే సింహాసనాన్ని అధిష్ఠించాడు. తన జీవితాంతం, బ్రిటిష్, మహారాష్ట్ర, నైజామ్‌లతో పోరాటం సాగించాడు. నిరక్షరాస్యుడైనప్పటికీ హైదరాలి గొప్ప పరిపాలకుడు. బలహీనమైన మైసూర్ రాజ్యాన్ని హైదరాలి, గొప్ప రాజ్యంగా మార్చగలిగాడు. హైదరాలి మతసహన విధానాన్ని పాటించాడు. 1782లో, రెండవ ఆంగ్లేయ - మైసూర్ యుద్ధంలో బ్రిటిష్ వారితో యుద్ధం చేస్తూ హైదరాలి చనిపోయాడు.

6.2.6.2 టిప్పు సుల్తాన్

హైదరాలి కుమారుడు టిప్పు సుల్తాన్ 1782 నుంచి 1799 వరకు మైసూర్ రాజ్యాన్ని పరిపాలించాడు. తన తండ్రి వలె టిప్పు సుల్తాన్ కూడా గొప్ప సైనిక యోధుడు, సమర్థుడైన పరిపాలకుడు. అతని జీవితంలో ఎక్కువకాలం బ్రిటీష్‌వారితో యుద్ధాలు చేయడంలో గడిచింది. బ్రిటీష్ వారిపట్ల అతను అవలంబించిన విధానం అతని దూరదృష్టికి నిదర్శనం. నావికాదళం ప్రాముఖ్యత గుర్తించి టిప్పు సుల్తాన్ ఆధునిక నావికా దళ నిర్మాణానికి కృషి చేశాడు. ఫ్రెంచి విప్లవంపట్ల ఆసక్తి కలిగి శ్రీరంగ పట్నంలో "స్వేచ్ఛ మొక్కను" నాటినాడు.

హైదరాలి, టిప్పు సుల్తాన్‌ల కాలంలో మైసూర్ ఆర్థికంగా అభివృద్ధి చెందింది.

6.3 దక్షిణ భారతదేశపు నాయకులు

క్రీ.శ. 1500 నాటికి మలబార్, తిరునల్వేలి మినహా మిగిలిన దక్షిణ భారతదేశపు భూభాగమంతా విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. క్రీ.శ. 1540 నాటికి తిరునల్వేలిని విజయనగర సామ్రాజ్యం ఆక్రమించింది. 16వ శతాబ్దంలోనే ఇక్కేరి, జింజిలతోపాటుగా నాయక రాజ్యాలైన మధుర, తంజావూరులు ఆవిర్భవించటం గమనిస్తాం. ఈ రాజ్యాలన్ని విజయనగర సార్వభౌమాధికారాన్ని పూర్తిగా అంగీకరింపక పోయినా సామంత రాజ్యాలుగా ఉండేవి.. క్రీ.శ. 1565లో జరిగిన కృష్ణ -చిన్ని హట్టెయగార్ల నియంతృత్వం పెరగటం చేతను పెంజివేల్, జింజి, తంజావూరు, మధురలు స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయని కె.ఏ. నీలకంఠ శాస్త్రి అభిప్రాయపడగా నాయకరాజ్యాలు స్వతంత్రంగా అవతరించుట శ్రీకృష్ణదేవరాయల మరణానంతరమే అనగా 1530లోనేనని బర్టన్ స్టెయిన్ అభిప్రాయం. మధుర, తంజావూరు నాయక రాజ్యాలు నాయక రాజ్యాలలో ముఖ్యమైనవి కావటంచే వాటిని గురించి తెలుసుకుందాం.

6.3.1 మధుర నాయక రాజ్యం

మధురనాయక రాజ్యంలో ఈనాటి మధుర, రామనాధపురం, తిరునల్వేలి, తిరుచినాపల్లి, కోయంబత్తూరు, సేలం జిల్లాలు, ట్రావన్‌కోరులో కొంత భాగం ఇమిడి ఉన్నాయి. సంప్రదాయం ప్రకారం మధుర నాయక రాజ్య స్థాపకుడు విశ్వనాధ నాయకుడని, ఈతడు శ్రీకృష్ణ దేవరాయల కాలంలోనే స్థాపించాడు.

విశ్వనాధ నాయకుడు క్రీ.శ. 1564 వరకు పాలించాడు. అతని అనంతరం కుమారుడైన క్రిష్ణప్పనాయకుడు. క్రీ.శ. 1564 నుంచి క్రీ.శ. 1572 వరకు పాలించాడు. క్రిష్ణప్ప నాయకుని కుమారుడు వీరప్ప రెండవ వెంకట పతిరాయల పై తిరుగుబాటు చేయగా వెంకటపతి రాయలచే ఓడింపబడి క్రీ.శ. 1596లో ఇతడు చనిపోయాడు.

BRAOU

క్రీ.శ. 1603 - 1609 మధ్యకాలంలో ముద్దుక్రిష్ణప్ప క్రీ.శ. 1609 - 1623 మధ్య కాలంలో ముద్దు వీరప్పలు పాలించారు. ముద్దు వీరప్ప కుమారుడైన తిరుమల నాయకుడు, మధుర నాయక పాలకులలో అగ్రగణ్యుడుగా గుర్తింపబడ్డాడు. తిరుమలరాయ మహల్ నిర్మాతగానే కాక, తెలుగు భాషా, సాహిత్య పోషకుడుగా చిరస్థాయియైన కీర్తి గడించారు. తిరుమలరాయ కుమారుడైన చొక్కనాధుని కాలం నుంచి, మధుర నాయకరాజ్య పతనం మొదలైంది. ఈతని పరిపాలనా కాలం క్రీ.శ. 1657 నుంచి క్రీ.శ. 1682 వరకు ఈతని కుమారుడు ముద్దుక్రిష్ణప్ప 7 సంవత్సరాలు పాలించినట్లు తెలుస్తుంది. ఈతని కుమారుడు విజయరంగ చొక్కానాథుడు బాలుడగుటచే, అమ్మమ్మ మంగమ్మ రాజ్యాధికారం చేపట్టింది. విజయరంగ చొక్కానాధుడు క్రీ.శ. 1706 నుంచి క్రీ.శ. 1732 వరకు పాలించెను. అతని అనంతరం అతని భార్య మీనాక్షి పరిపాలన ఆరంభింపగా రాజస్థానంలోని కొందరి కుట్ర ఫలితంగా ఆర్కాట్ పాలకుడైన చాందా సాహెబ్ దండెత్తి వచ్చి మధురను ఆర్కాట్ రాజ్యంలో కలుపుకోగా, మీనాక్షి ఆత్మహత్య చేసుకుంది.

6.3.2 తంజావూరు నాయకత్వం.

తంజావూరు నాయక రాజ్యంలో తంజావూరు, పుదుకోట్టమ్, తిరుచినాపల్లి జిల్లాలున్నాయి. ఈ ప్రాంతాన్ని శ్రీ కృష్ణదేవరాయలు అక్రమించగా, అచ్యుతరాయలు నమ్మకస్తుడైన బంధువైన సెవ్వప్పనాయకుడ్ని పాలకుడుగా క్రీ.శ. 1535లో నియమించాడు. సెవ్వప్పనాయకుడు క్రీ.శ 1535 నుంచి క్రీ.శ. 1561 వరకు పాలించగా, అతని కుమారులు అచ్యుత నాయకుడు క్రీ.శ. 1561 నుంచి క్రీ.శ. 1614 వరకు పాలించాడు. ఈతడు విజయనగర పాలకుల విధేయుడైన సామంతుడై, వెంకటపతిరాయ తరపున మధుర నాయకులపై వల్లంకోట యుద్ధంలో పాల్గొన్నాడు. అప్పటినుంచి మధుర, తంజావూరు నాయక రాజ్యాల మధ్య శతృత్వం ఆరంభమైంది. అచ్యుత నాయకుని అనంతరం అతని కుమారుడు రఘునాధరాయలు క్రీ.శ. 1611 నుంచి క్రీ.శ. 1633 వరకు పాలించాడు. రఘునాధ రాయలు గొప్ప యుద్ధవీరుడేకాక గొప్ప తెలుగు సాహిత్య పోషకుడు. ఈతడు తంజావూరు కృష్ణ దేవరాయ అని పిలవబడ్డాడు. ఈతని కుమారుడు విజయరాఘవ క్రీ.శ. 1633 నుంచి క్రీ.శ. 1673 వరకు పాలించి, మధుర నాయకపాలకునితో కలసి విజయనగర పాలకులపై తిరుగుబాటు చేశాడు. అయితే మధుర పాలకుడైన చొక్కనాధుడు విజయ రాఘవుడ్ని, అతని కుమారుడు మన్నరుదానును చంపివేశాడు. తంజావూరు మధుర నాయక రాజ్యంలో కలసిపోగా, సవతి తమ్ముడైన చొక్కానాధ అళగిరి తంజావూరు పాలకుడైనాడు. కాని కొద్దికాలంలోనే విజయరాఘవుని విధేయుడైన సేవకుడు రాయసం వెంకోజి, చొక్కానాధ అళగిరిని సింహాసనం నుంచి తొలగించి, విజయరాఘవుని మనుమడైన చెంగమలదాసును సింహాసనంపై కూర్చుండబెట్టెను. ఈతని దుర్మార్గపు పాలనపై ప్రజలు విసిగి పోయి, ప్రజలు ఇతడ్ని తొలగించగా; శివాజి సవతి తమ్ముడైన మనోజి పాలన క్రిందకు తంజావూరు రాజ్యం వచ్చింది.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1) 18వ శతాబ్దంలో ప్రాంతీయ రాజ్యాలు ఎందుకు ఏర్పడ్డాయి?

.....

.....

.....

.....

2) 18వ శతాబ్దంలో భారతదేశంలో ముఖ్య ప్రాంతీయ రాజ్యాలేవి?

.....

.....

.....

.....

6.4 ఆర్థిక పరిస్థితులు

6.4.1 వర్తక వాణిజ్యాలు

విదేశ వాణిజ్యం చురుకుగా సాగి లాభసాటిగా ఉండింది. కాని అది భారతదేశ ఆర్థిక జీవనం మొత్తంలో, అత్యల్ప భాగం మాత్రమే. ఈ విదేశ వాణిజ్యం పూర్తిగా ఐరోపా వర్తకుల స్వాధీనంలో ఉండింది. రాకపోకలకు వసతి ఉన్నచోట, దేశంలోని సరకు పెద్ద మొత్తంలో సముద్రపు రేవులను చేరగలిగేది. కాని ఆనాడు ఒక్క నదులు మాత్రమే రాకపోకలకు వనతిగా ఉండినాయి. పద్దెనిమిదవ శతాబ్దం మూడో పాదం నాటికి, ఆంగ్లేయులకు ప్రత్యర్థులుగా ఉన్న పోర్చుగీసులు, ఫ్రెంచివారు, డచ్చివారు, వారి రాజకీయాధికారాన్ని నష్టపోవడమే కాక, వారి వర్తక వాణిజ్యాలను కూడా వదలి వేయటంతో వర్తక వాణిజ్యాలు ఆంగ్లేయులకు ఏకస్వామ్య మైపోయాయి. నాటికి పోర్చుగీసు వారి కార్యకలాపాలు అన్ని విధాలా గోవాకు పరిమితమై ఉన్నాయి. కాని గోవాలో సైనికులకంటే, వ్యాపారుల కంటే క్రైస్తవ సన్యాసులు ఎక్కువ మంది ఉండినారు. 1728, 1740ల మధ్య ఫ్రెంచి వారి ఎగుమతుల విలువ పదింతలు పెరిగింది. కాని, అదే కాలంలో బ్రిటీష్ వారు భారతదేశం నుంచి చేసిన దిగుమతులు, ఇరవై ఇంతకు మించి పెరిగాయి. దీనిని బట్టి ఫ్రెంచి వారికి, ఇంగ్లీషు వారికి వ్యాపారంలో ఉన్న తారతమ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆంగ్లేయులు బెంగాల్‌లో నూలుగుడ్డలతో, పట్టు వస్త్రాలతో, నూలులో, చక్కెరలో, సూరేకారంలో లాభసాటి అయిన వ్యాపారాన్ని కొనసాగించారు. దక్షిణ భారతంలో పట్టువస్త్రాలు, రవసెల్లాలు, కలంకారీ వస్త్రాలతో కూడిన నూలు వస్త్రాలు, ప్రధాన వ్యాపార సరుకులు, ఐరోపాలో ఈ పట్టు వస్త్రాలకు, నూలు వస్త్రాలకు ఎక్కువగా ఉన్న గిరాకిని బట్టి నేతపరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది.

మొదటలో ఆంగ్లేయులు పోర్చుగీసు, ఫ్రెంచి, డచ్చివారి పోటీకి తట్టుకోలేకపోయారు. పోర్చుగీసు వారు, ఫ్రెంచివారు, డచ్చివారు వారికి కావలసిన వస్త్రాలు నేయడానికి, నేతపనివారికి ముందుగానే కొంత డబ్బు ఇచ్చేవారు. అంతేకాక, వస్త్రాల నాణ్యాన్ని గురించి పెద్దగా పట్టించుకొనేవారు కారు. డచ్చివారు కూడా నిత్యం కావలసిన ఆహార దినుసులను చౌకగా సరఫరా చేసి నేతపనివారికి సహాయపడేవారు. ఆంగ్లేయులు ముందుగా ఏ మాత్రం పైకమిచ్చేవారు కారు. వెల తక్కువ ఇచ్చేవారు. కానీ వస్త్రాలు నాణ్యంగా ఉండాలని పట్టుబట్టేవారు. అందుచేత సహజంగా నేత పనివారు ఆంగ్లేయ వర్తకులంటే ఇష్టపడలేదు.అందుచేత ఆంగ్లేయులకు తమ ప్రత్యర్థులను తొలగదోసి, వస్త్రాల వ్యాపారంలో ఏకస్వామ్యం సంపాదించవలసిన అవసరం కలిగింది. ఇంగ్లాండులో పద్దెనిమిదవ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవ ఫలితంగా, ఆంగ్లేయులు నూలు సరకుల వ్యాపారంలో **"వాణిజ్య పద్ధతి"** (Mercantilism) ని అనుసరించారు (దీని ప్రకారం, దేశంలో వస్త్రాలను ఉత్పత్తి చేయనిచ్చేవారు కాదు). ఇంగ్లాండులో మరమగ్గాలతో తయారైన వస్త్రాలు, స్థానికంగా దేశంలో ఉత్పత్తి అయిన వస్త్రాలకు తీవ్రమైన పోటీగా తయారైనాయి. స్థానికులైన నేతపనివారిని ఇంకా నిరుత్సాహ పరచటానికై, వారికి తీరని హాని కలిగిస్తూ, కంపెనీ అధికారులు మగ్గాల పైన **'మొహతుర్కా'** అనే పన్నును విధించారు. 1850 నాటికి, ఐరోపాలో అనుకూలమైన వ్యాపారాన్ని సంతరించుకున్న చైనా, జపాన్ పట్టు వస్త్రాల పోటీకి తట్టుకోలేక, పట్టు వస్త్రాల వ్యాపారం కూడా క్షీణించింది. పారిశ్రామిక విప్లవం ఒక నూలు సరకుల వ్యాపారాన్ని మాత్రమే దెబ్బతీయలేదు. అది ఇనుప పరిశ్రమ, తోళ్ళ పరిశ్రమ మొదలైన వాటిని కూడా సమానంగా దెబ్బ తీసింది. దిగుమతి అయిన విదేశీ సరుకులపై ప్రజల మోజు అధికం కావడంతో ఈ వస్తు పరిశ్రమలలోని పనివారు, వారి సరకులకు గిరాకి లేకపోవడంతో పరిశ్రమలను వదిలి వేసి, వ్యవసాయ కూలీలుగా జీవనోపాధిని సంపాదించుకోవలసి వచ్చింది. ఈ విధంగా వ్యవసాయ కూలీలనే ఒక కొత్త వర్గం ఏర్పడింది.

పద్దెనిమిదవ శతాబ్దం మధ్య భాగానికి సుగంధ ద్రవ్యాల వ్యాపారంలో ప్రాక్ పశ్చిమాల మధ్య, మలబార్ మార్కిడి కేంద్రం కాకుండ పోయింది. తూర్పు ఇండియా దీవుల నుంచి సుగంధ ద్రవ్యాలతో గుడ్‌హోప్ అగ్రానికి, ఐరోపాకు పోయే వొకలు మలబార్ తీరాన్ని తప్పించి పోసాగాయి. వస్త్రాలలో, అద్దకంలో, సురేకారంలో

PRADOJ

ఏర్పడ్డ కొత్త వ్యాపారానికి వేరొక చోటు కేంద్రంకాగా, సుగంధ ద్రవ్యాలలో పరిమితమైన స్థానిక వ్యాపారం, చాలామంది ఐరోపా వర్తకుల స్వాధీనంలో ఉండి, ఎట్లో మిగిలి ఉండింది.

ఎక్కువ ఖర్చుతో కూడిన యుద్ధాలు, దేశంలోని మిగులు ఆదాయాన్ని పీల్చి వేశాయి. ఉత్పాదకంగా చేసిన ఖర్చు ఏమీ లేదు. విస్తృతంగా చేసిన ఖర్చు ఏమీ లేదు. విస్తృతంగా జరిగిన ఈ సైనిక చర్యలవల్ల వాటి వల్ల, ఏర్పడిన అనుబంధంవల్ల, అవి తెచ్చి పెట్టిన నాశనంవల్ల, ఉత్పత్తులు, యదార్థానికి క్షీణించసాగాయి. ఇదే కారణంవల్ల, సాధారణ జీవన ప్రమాణం తగ్గిపోవడం మొదలైంది.

6.4.2 వ్యవసాయం

ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం, అది పాత పద్ధతులలోనే కొనసాగింది. కొన్ని దేశీయ పరిశ్రమలు క్షీణించినందువల్ల, ఆ పరిశ్రమలలోని పనివారు, నిపుణులు తమ జీవనోపాధికై వ్యవసాయకూలీలుగా మారవలసి వచ్చింది. ఫలితంగా ఎక్కువ భూమి సాగులోకి తేబడింది. సాంప్రదాయకంగా పండించే ఆహారధాన్యాల కన్నా, వ్యాపారపు పంటలైన ప్రత్తి, పొగాకు, నూనె గింజలు మొదలైనవి ఎక్కువగా ఆధారపడసాగాయి. నీటిపారుదలకు చెరువులు, బావులే ప్రధాన ఆధారాలు; నదీ జలాల పారుదల, చాలా పరిమితంగా ఉండింది. పందొమ్మిదవ శతాబ్ద మధ్యభాగం దాకా, ఆంగ్లేయులు నీటిపారుదలకై నదులపై ఆనకట్టలను నిర్మించటాన్ని గూర్చి ఆలోచించలేదు. సకాలానికి వర్షాలు పడకపోతే, దేశంలో అనేక ప్రాంతాలలో కరువు కాటకాలు తరచు సంభవించేవి. 1769-70లోని బెంగాల్ కరువులో మొత్తం జనాభాలో మూడవ వంతు మరణించినట్లు, సాగుబడి భూములలో మూడవ వంతు బీడు పెట్టినట్లు చెప్పబడింది. అంటువ్యాధులు, కరువులను వెంబడించి, నాశనాన్ని సంపూర్ణం చేసేవి. ఇట్టి విపత్తులున్నా కంపెనీ అధికారులు, స్థానికులైన పెత్తందార్లు, జమీందార్లు, అతి క్రూరంగా రైతునుంచి భూమిశిస్తు వసూలు చేసి అతనికి చివరకు తిండిలేకుండా చేసేవారు. పైన పేర్కొన్న కరువువల్ల రెండు తరాల వరకు బెంగాల్‌లో, బీహార్‌లో, జనాభా చాలా తక్కువగా ఉండింది. మొత్తం సాంఘిక వ్యవస్థనే అది దెబ్బ తీసింది. చితికిపోయిన రైతుల నుంచి సక్రమంగా శిస్తులు వసూలు చేయటం సాధ్యంకాక, చాలా మంది జమీందారులు లేదా వంశపారంపర్యంగా శిస్తును గుత్తకు తీసుకొన్నవారు నాశనమైపోయారు. సహాయకచర్యలు ఏమైనా తీసుకొన్నా, అవి సక్రమంగా కాక, తాత్కాలికంగా, అనిశ్చితంగా ఉండేవి. పందొమ్మిదో శతాబ్దంలో కరువులు ఇంకా ఎక్కువగా వచ్చాయి. 1883లో గానీ, బ్రిటీషు ప్రభుత్వం దాని మొదటి కరువు చట్టాన్ని (Famine Code) రూపొందించలేదు.

1793లో అమలులోకి వచ్చిన కారన్‌వాలీస్ శాశ్వత శిస్తు విధానం, మొదట్లో బెంగాల్ రాష్ట్రానికి పరిమితం చేయబడింది. అది మద్రాసు రాష్ట్రంలోని ఉత్తర సర్కారులకు, 1802 నుంచి 1805 వరకు విస్తరించబడింది. ఈ విధానంలో పాత జమీందార్లు తొలగిపోయి వారి స్థానంలో కొత్త పన్ను వసూలు జమీందార్లు, జమీందారీ భూస్వాములుగా గుర్తించబడ్డారు. ఈ జమీందారీ వర్గం కొత్తగా ఏర్పడి, పాలక ప్రభుత్వంతో లాభసాటి అయిన సంబంధాలు కలిగి వుండింది. ఈ కొత్త జమీందారీ పన్ను వసూలుదార్లు, స్థానికంగా నివాసం చేయని భూస్వాములు; వారి ఆసక్తి అంతా రైతు నుంచి శిస్తు వసూలు చేయడంలో మాత్రమే ఉండి, రైతు క్షేమంలో ఏ మాత్రం ఉండేది కాదు. ఈ విధంగా ఈ శాశ్వత భూమిశిస్తు విధానం, స్థానికంగా నివసిస్తున్న జమీందార్ల స్థానంలో, స్థానికంగా నివసించని భూస్వాములను తెచ్చి పెట్టింది. ఫలితంగా భూస్వామికి, రైతుకు మధ్యగల వ్యక్తిగత సంబంధం పూర్తిగా తెంపబడింది. సాంవత్సరిక చెల్లింపులు ఎల్లకాలానికి ఒకేసారి నిర్ణయించబడ్డాయి. ఈ పన్ను వసూలు జమీందార్లు, రైతుల నుంచి వసూలు చేసిన శిస్తులో ప్రభుత్వానికి చెల్లించవలసినది చెల్లించి, మిగిలినదంతా తామే మిగుల్చుకోవచ్చు. జమీందారీలో ఎదిగే కొద్ది రైతులు క్రుంగి పోసాగారు. రైతులు ఇప్పుడు చట్టబద్ధంగా మక్తాచెల్లించే పాలికాపులుగా పరిగణింపబడి, భూమిలో నుంచి వెడలగొట్టబడవచ్చు; భూమిమీద హక్కంతా, పన్ను వసూలు జమీందారుకు ఇవ్వబడింది. సంప్రదాయంగా రైతులకు ఉండే అనుభవ హక్కులను వారికి ఇవ్వలేదు. కొత్తగా ఏర్పడిన కలిమిలో వారెట్టి పాలు పంచుకోలేకపోయారు. 1800 నుంచి 1807 వరకు

దత్తమండలాలకు కలెక్టరుగా, అటు తర్వాత 1820 నుంచి 1827 వరకు మద్రాసు రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్న సర్ థామస్ మన్రో "రైత్వారీ" విధానాన్ని సమర్థించి, దానిని మద్రాసు రాష్ట్రంలో ప్రవేశపెట్టాడు. రైత్వారీ విధానంలో భూమి శిస్తు నిర్ణయం, నేరుగా రైతుకో లేదా సాగుబడిదారుతో జరుగుతుంది. పోగా ఈ నిర్ణయం శాశ్వతంగా కాక, కొంతకాలానికి మాత్రమే వర్తిస్తుంది. ఇదే రైత్వారీ విధానంలోని మౌలికాంశం.

18వ శతాబ్దంలో ఎడతెరిపి లేకుండా యుద్ధాలు జరిగినప్పటికి, ఆ యుద్ధాలవల్ల ఆర్థికరంగంలో ఉత్పత్తి తగ్గలేదు. నూలు, పట్టు వస్త్రాలు, చక్కెర, జనుపనార, కళంకారి, ఆయుధాల తయారీ, లోహాలతో ఇతర వస్తువుల తయారీ, పెట్లుప్పు (Salt Petre), నూనెలు, మొదలయిన వాటి ఉత్పత్తిలో భారతదేశం ఇంకా అగ్రస్థానంలో వుండింది.

పడవల తయారీకూడా కుంటుపడలేదు. 18వ శతాబ్దంలో రష్యాను పరిపాలించిన పీటర్ చక్రవర్తి చెప్పిన మాటలు ఆనాటి భారతదేశ ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా లేదన్న సత్యాన్ని ఋజువు చేస్తాయి. *"భారతదేశ వ్యాపారమే, ప్రపంచ వ్యాపారమన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి.....ఎవరయితే ఆదేశాన్ని తమ ఆధిపత్యంలో వుంచుకోగలరో, వారే ఐరోపాను నిరంకుశంగా పరిపాలించగలరు"* అని పీటర్ అన్నాడు.

18వ శతాబ్ది ప్రారంభంలో భారతదేశం, వ్యాపారరీత్యా, పారిశ్రామికంగా, అగ్రశ్రేణిలో వున్నదన్న సత్యాన్ని పీటర్ మాటలు తెలియచేస్తున్నాయి. వ్యవసాయిక లేదా చేతి పరిశ్రమల వుత్పత్తి భారతదేశంలో, 18వ శతాబ్దంలో తగ్గలేదని ఆచార్య సతీష్‌చంద్ర స్పష్టం చేశారు. దేశంలో ఆర్థిక పరిస్థితులు, బ్రిటీష్‌వారు, తమ అధికారాన్ని నిలదొక్కుకున్న తర్వాతనే దిగజారాయి.

6.5 సమాజం, సంస్కృతి

ప్రాచీన కాలంలో వలె, 18వ శతాబ్దంలో కూడ, కులవ్యవస్థ కీలక పాత్ర వహించింది. మహమ్మదీయులలో కూడా షియా, సున్నీ అనే విభజనలు కాకుండా, జాతి, సమాజంలో స్థాయిని బట్టి వివిధ వర్గాలేర్పడినాయి. బాల్య వివాహాలుండేవి. ఉత్తర హిందూస్థానంలో సతీసహగమనం ఎక్కువగా ఉండేది. దక్షిణంలో హిందూ వితంతువుల పరిస్థితి దయనీయంగా ఉండింది.

నవాబులు, జమీందార్లు, ధనవంతుల నైతిక విలువలు పతనం చెందాయి. కాని సామాన్య మానవుల జీవితంలో అటువంటి పతనం లేదు.

బహుశా 18వ శతాబ్దంలో భారతీయ సమాజంలోని ముఖ్య లోపం, ఐరోపాలోవలె సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల సహాయంతో ముందుకు సాగకపోవడమే. ఆచార్య సతీష్ చంద్ర అన్నట్లు, 18వ శతాబ్దంలో ఎక్కువగా 17వ శతాబ్దంనాటి పరిస్థితులే కొనసాగాయి. 19వ శతాబ్దంలో బ్రిటీష్‌వారి హయాంలో ఏర్పడిన ఆర్థిక దుస్థితి, 18వ శతాబ్దంలో లేదు.

6.5.1 సాంస్కృతిక జీవనం

అస్థిరమైన, రాజకీయ పరిస్థితులవల్ల క్షీణించుచున్న ఆర్థిక పరిస్థితులవల్ల, సాధారణ సాంస్కృతిక జీవనం బాగా దెబ్బతిన్నది. సంస్కృతి యొక్క అభివృద్ధి చాలా వరకు పోషణ మీద ఆధారపడి వుంటుంది. కాని నాటి ప్రభువులు, గొప్పవారు, అధికార రాజకీయాలలో తలమునకలై వాటి నుంచి బ్రతికి బయటపడే సమస్యతో సతమత మవుతుండడంవల్ల వారికి కళాపోషణకు కావలసిన ఆర్థిక స్తోమత కాని, కాలవ్యవధి కాని లేకపోయింది. సాధారణ సాంస్కృతిక జీవనంలో ఎట్టి అభివృద్ధిలేక, క్రమక్రమంగా క్షీణించసాగింది. మహాస్థపతులు, మహాశిల్పులు ఉన్నప్పటికీ, వారికి కావలసిన ఆదరణ, విజ్ఞతతో కూడిన ప్రేరణ లేకపోయాయి. చిత్రలేఖనం, సంగీతం మొదలైన

BRAOU

ఇతర కళల పరిస్థితి కూడా ఇట్లే ఉండింది. అత్యుత్తమమైన కళాకృషికి అవకాశం ఉన్నా, నిలకడైన ఆదరణ లేకపోయింది. ప్రజ్ఞాప్రదీప్తులు క్షణభంగురమైనాయి. హిందూకళకూడా ముస్లిం కళవలెనే ఆదరణ, ఆర్థిక సహాయం చాలినంతగాలేక నష్టపడింది. స్థపతిగాని, సంగీతజ్ఞుడు కాని, కవి కాని, చిత్రకారుడు కాని, వారి కళల యోగ్యతను విచారించి, ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రోత్సహించి ఆదరించటానికి ఒక అక్బర్ కాని, జహంగీర్ కాని, షాజహాన్ కాని లేకపోయారు. పద్దెనిమిదవ శతాబ్దంలో భారతదేశంలోని కులీన వర్గానికి, కళా ప్రోత్సాహానికి తగినంత విశ్రాంతి లేకపోయింది. రాజకీయాలు, యుద్ధాలు, వారి ప్రధాన ప్రయోజనాలైనాయి. వారికి భారతీయ కళారూపాల ఉత్కృష్టత తెలుసుకోవడానికంటె ఐరోపా గుర్రాలను గూర్చి, ద్రాక్షారసాలు మొదలైన వాటిని గూర్చి తెలుసుకోవటం ప్రధానమైంది. బృహత్ సౌధనిర్మాణ సంప్రదాయం, దక్షిణ భారతదేశంలో మాత్రమే కొనసాగింది. చిత్రకళా సంప్రదాయాలు, రాజపుత్ర స్థానపు ఎడారులలోని, హిమాలయ పర్వత చరియలలోని కొన్ని చిన్న సంస్థానాలలో కొనసాగాయి.

మతసంబంధం, మేధా సంబంధం అయిన జీవనంలో కూడా, ఇట్టి పరిస్థితులే నెలకొన్నాయి. హిందూ మతంలో పదిహేను నుంచి పదిహేడవ శతాబ్దం లోపల వచ్చిన భక్తి ఉద్యమం లాంటి మత ఉద్యమం కాని. నూతన తత్వ సంప్రదాయం కాని ఈ కాలంలో ఏర్పడలేదు. ఇస్లాం మతంలో వేదాంతాలున్నా సూఫీ సాంప్రదాయం లాంటి నూతన వేదాంత సంప్రదాయం ఏర్పడలేదు. వివిధ మత భావసమ్మేళనోద్యమాలైనటువంటి గురునానక్ యొక్క శిక్కుమతం, కబీర్ యొక్క కబీర్ పంథీ, యుద్ధ సన్నద్ధమైన వ్యవస్థలుగానో లేదా శాంతి వృత్తితో కూడిన వ్యవస్థలుగానో మారి, కాలక్రమంలో క్రొత్త వర్ణాలుగా రూపొందాయి.

6.5.2 విద్య

18వ శతాబ్దంలో ప్రాథమిక విద్య విస్తృతంగా వ్యాపించింది. ఆ కాలంలో సగటు అక్షరాస్యత, తర్వాత బ్రిటీష్ వారి కాలంలో కంటే ఎక్కువగానే వుండింది. సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవం వుండింది. అయితే స్త్రీ విద్య అభివృద్ధి చెందలేదు. ఉన్నత విద్యాకేంద్రాలకు రాజులు, ధనవంతులైన జమీందార్లు, నవాబులు, ఆర్థిక సహాయం చేసేవారు. హిందువులలో ఉన్నత విద్య ఎక్కువగా సంస్కృత విద్యకు పరిమితమయింది. అది ఎక్కువగా బ్రాహ్మణులకే పరిమితమయింది. మహమ్మదీయులలో ఉన్నత విద్య పర్షియన్ భాషలో వుండేది.

అక్షర జ్ఞానాన్ని దాటిన విద్య, కళాభ్యాసం సంఘంలోని కులీన వర్గాలకు, ఆ వర్గాలలోని బాలబాలికలకు పరిమితమై ఉండింది. సాంప్రదాయకమైన మత విద్య, శాస్త్ర విద్య, ఎప్పటివలెనే బ్రాహ్మణులకు మాత్రమే పరిమితమై ఉండింది. 1835లో విలియం బెంటింక్ ఫారసీ భాష స్థానంలో ఇంగ్లీషును, ఇతర దేశ భాషలను ప్రవేశపెట్టనంత వరకు, భారతదేశంలో అంతటా ఆస్థాన భాషగాను, ఉన్నత న్యాయస్థానాల వ్యవహారాలకు సంబంధించిన భాషగాను, ఫారసీ భాష ఉండింది. కాని అప్పటికే చిరకాలంగా ఫారసీ భాషను అభ్యసించుచున్నట్లు, దీనికి గల అనుకూల ప్రయోజనాలను బట్టి, ఆంగ్ల భాషను అధ్యయనం చేయడం ప్రారంభమైంది.

మొదట్లో, కంపెనీ ప్రాచీన విద్యనే ప్రోత్సహించింది. 1781లో మొదటి గవర్నర్-జనరల్ అయిన వారన్ హేస్టింగ్స్ అరబ్బీ, ఫారసీ భాషల అధ్యయనానికై కలకత్తా "మదరసా"ను స్థాపించాడు; 1794లో జొనాథన్ డంకన్ వారణాసి సంస్కృత కళాశాలను స్థాపించాడు. ఫారసి, బెంగాలీ, ఉర్దూ భాషలు తెలిసిన హేస్టింగ్స్, భారతీయ సంస్కృతిని గూర్చి బాగా తెలుసుకొన్నాడు. ప్రాక్పశ్చిమ భాషల తులనాత్మక అధ్యయనం చేసిన సుప్రీంకోర్టు (సాదర్ అదాలత్) ప్రధాన న్యాయమూర్తి అయిన సర్ విలియమ్ జోన్స్‌ను, "**ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్**"ను స్థాపించవలసిందిగా హేస్టింగ్స్ ప్రోత్సహించాడు. జోన్స్, కాళిదాసు రచించిన సంస్కృత నాటకం అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆంగ్లభాషలోకి అనువదించాడు. హేస్టింగ్స్, విల్కిన్స్‌ను సంస్కృత భాషాధ్యయనంలో ప్రోత్సహించి, అతడు చేసిన 'భగవద్గీత' ఆంగ్లవాదాన్ని ఆదరించాడు.

BRAOU

సంఘం సాధారణంగా కట్టుబడిపోయినందువల్ల, సాంఘిక జీవనం కూడా తిరోముఖంగా నడిచింది. అక్బర్ యుగంవంటి నిలకడైన కాలంలో, క్షీణించుచున్న లేదా ప్రోత్సహింపబడని హిందూ జీవనంలోని దురాచారాలు, మరలా తమ వికృత శిరస్సులతో విజృంభించాయి. క్రూరాచారాలైన సతీసహగమనం, శిశువులను బలి యిచ్చుట అధికమయ్యాయి. హిందూ సంఘంలోని ఏహ్యమైన ఈ దురాచారాల యెడల, ప్రజల యొక్క తలంపులలో, వైఖరులలో రాజారామ్మోహనరాయ్ (1770-1880) సంస్కరణా కార్యక్రమాలు గొప్ప మార్పును తెచ్చాయి. హిందువులలో, ముస్లిములలో ఆడవారిని పర్దాలో ఉంచుట వంటి ఆచారాలు, ఎక్కువైనాయి.

6.5.3 క్రైస్తవ మిషనరీలు

భారతీయ జీవనంలో నూతనం, ప్రముఖం అయిన విషయం క్రైస్తవ మత ప్రచార సంఘాల ప్రవేశం. పద్దెనిమిదవ శతాబ్దంలోని తొలిసంఘాలు, బ్రిటీషేతర స్థావారాల నుంచి పనిచేశాయి. ట్రాంక్విబార్‌లోని డెన్మార్క్ దేశీయుల మత ప్రచార సంఘాలను, సేరంపూర్‌లో బ్రిటీషు బాప్టిస్టుల దళంతో విలియం కేరీ స్థాపించిన సంఘాన్ని ఉదాహరణంగా చెప్పవచ్చు. అటు తర్వాత వల అల్లుకొన్నట్లు, బ్రిటీషు సంఘాలు స్థాపించబడినాయి. తర్వాత కొద్దికాలంలోనే వీటిని అమెరికన్ సంఘాలు బలపరిచాయి. మత పరివర్తన మొదలు, విద్యా వైద్య సదుపాయాలు నేర్పరచటం, పెద్ద పట్టణాలలో, నగరాలలో బళ్ళు, కళాశాలలు, నడపడం మొదలుగా అనేక విధాలుగా దేశమంతా వ్యాపించి, వీరి కార్యక్రమాలు ఉండేవి. మొదట్లో, వీరికి ప్రభుత్వం నుంచి ఎట్టి సహాయం ఉండేదికాదు. అయినా, పాలకవర్గంతో వారి వ్యక్తిగతమైన, జాతిపరమైన సంబంధాలవల్ల కొంత గౌరవం చేకూరింది. ప్రభుత్వం ఆదరించకపోయినా, దాని అనుమతితో ఈ సంఘాలు హిందూ మతానికి, ఇస్లాం మతానికి, బహిరంగ ప్రత్యర్థులుగా తయారయ్యాయి. పాశ్చాత్య విలువలు, విజ్ఞానం భారతదేశానికి చేరడానికి, అతి ముఖ్యమైన మార్గాలయ్యాయి.

1821 లో జాన్ మాల్కమ్ అనే బ్రిటీష్ అధికారి ఇలా వ్రాశాడు. *'ఈ దేశంలోని ప్రజలలో వున్న మంచి గుణాలు, అనేక మార్పులు, నిరంకుశత్వం ఎదుర్కొంటున్న ఏ ఇతర దేశాల ప్రజలల్లో వున్నట్లు తెలియదు'.* ఆనాటి భారతీయుల్లో నేర ప్రవృత్తి, తాగుబోతుతనం, హింసాప్రవృత్తి లేనందుకు వారిని జాన్ మాల్కమ్ కొనియాడాడు. భారతీయుల్లో వున్న నీతి నియమాలు ఎంతో వుపయోగపడేవని, వారిలో వున్నట్లు దానగుణం, ఔదార్యం ఇతరులలో ఎక్కువగా అగుపడదని, ఆనాటి ఐరోపా రచయిత క్రాంఫర్డ్ వ్రాశాడు.

హిందూ, మహమ్మదీయుల మధ్య సత్సంబంధాలు వుండేవి. హిందువులు, మహమ్మదీయులు గ్రామాలు, పట్టణాల్లో జరిగే అన్ని వుత్సవాలల్లో కలిసి పాల్గొనేవారు. హోలీ, దుర్గాపూజ, దీపావళి మొదలయిన హిందు పండుగలలో మహమ్మదీయులు పాల్గొనేవారు. హిందువులు, మొహరం వూరేగింపులో పాల్గొనేవారు.

కొంతమంది అనుకున్నట్లు, భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దం "చీకటి యుగం" కాదు. ఆర్థికంగా దేశం, 18వ శతాబ్దంలో సుభిక్షంగా వుండింది. కళా, సాహిత్యాల అభివృద్ధి కుంటుపడలేదు. ప్రాంతీయ రాజ్యాలు, కళ, సాహిత్యాల అభివృద్ధి కేంద్రాలయినాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలుండేవి. కానీ దురాచారాలు కొత్తగా ఆ యుగంలో ఏర్పడినవి కాదు కదా!

II మీ అవగాహన పరీక్షించుకోండి

1) 18వ శతాబ్దం ఆర్థికంగా, సాంస్కృతికంగా వెనుకబడిన కాలమా?

.....

.....

.....

.....

BRAOU

2) ప్రాంతీయ సంస్కృతి అభివృద్ధికి, ప్రాంతీయ రాజ్యాలు ఏవిధంగా తోడ్పడ్డాయి.?

.....

.....

.....

.....

6.6 సంగ్రహంగా

1. మొగల్ సామ్రాజ్యపతనం తర్వాత బెంగాల్, అయోధ్య, పంజాబ్, హైదరాబాద్, ప్రాంతీయ రాజ్యాలు అభివృద్ధి చెందాయి. కేరళ, కర్ణాటక ప్రాంతాలల్లో కూడా ప్రాంతీయ రాజ్యాలకు ప్రాముఖ్యత ఏర్పడింది.
2. విదేశీ వ్యాపారం విదేశీయుల చేతుల్లో వుండింది. ఆ శతాబ్దిలో అనేక యుద్ధాలు జరిగినప్పటికి, 18వ శతాబ్దంలో భారతదేశం సుసంపన్నంగా వుండింది.
3. కొంత మంది చరిత్రకారులు అనుకున్నట్లు 18వ శతాబ్దం, భారతదేశ చరిత్రలో చీకటి యుగం కాదు. ప్రాంతీయ రాజ్యాలు, సాంస్కృతిక కేంద్రాలుగా వుండినాయి. అక్కడ సాహిత్యం, కళ, అభివృద్ధి చెందినాయి.

6.7 మీ అవగాహన పరీక్షించుకోండి : జవాబులు

I. 1) శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వం లేనందున 18వ శతాబ్దంలో, భారతదేశంలో ప్రాంతీయ రాజ్యాలు ఏర్పాడ్డాయి.

2) బెంగాల్, అయోధ్య (Oudh) పంజాబ్, హైదరాబాద్, కాలికట్, మైసూర్ భారతదేశంలో 18వ శతాబ్దంలో ముఖ్యమయిన ప్రాంతీయ రాజ్యాలు.

II. 1) 18వ శతాబ్దాన్ని ఆర్థికంగా, సాంస్కృతికంగా, వెనుకబడిన యుగంగా వర్ణించడం సమంజసం కాదు.

2) ప్రాంతీయ సంస్కృతి అభివృద్ధికి, ప్రాంతీయ రాజ్యాల రాజులు ధనసహాయం చేసి, రచయితలను, కళాకారులను ప్రోత్సహించారు.

6.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) మొగల్ సామ్రాజ్యం పతనం చెందిన తర్వాత ఏర్పడిన స్వతంత్ర రాజ్యాలను గురించి వ్రాయండి.

2) 18వ శతాబ్దంలోని ఆర్థిక పరిస్థితులను వివరించండి.

3) 18వ శతాబ్దంలోని సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను తెల్పండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) 18వ శతాబ్దంలో ఆయోధ్య, బెంగాల్ రాజ్యాల ప్రాముఖ్యత తెల్పండి.

2) 18వ శతాబ్దంలో భారతదేశంలో క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలను వివరించండి.

BRAOU

6.9 ఉపయుక్త గ్రంథాలు

1. Bipan Chandra : *Modern India*
2. Irwin William : *Later Mughals*
3. Majumdar, R.C. (Ed), : *Bharatiya Vidya Bhavan Series, Vols. VII & VIII*
4. Majumdar, R.C. & Others : *Advanced History of India.*
5. Mehta, J.L. : *Advanced Study in the History of Medieval India, Vo.III*
6. Perceival Spear : *History of India, Vol. II*
7. Satish Chandra : *India in the 18th Century.*
8. Malleson G.B. : *History of the French in India.*
9. Mukherjee, Ramakrishna : *The Rise and fall of the East India company*
10. Sen, S.P. : *The French in India (1761 & 1816)*
11. Spear, Perceival : *History of India Vol - II*

BRAOU

BRAOU

ఖండం - 3 భారతదేశంలో బ్రిటీష్ వలస రాజ్య స్థాపన, అభివృద్ధి

ఈ ఖండంలో 7 నుంచి 13 వరకు మొత్తం 7 భాగాలున్నాయి. ఇందులోని మొదటి భాగం మనదేశంలోని ఐరోపావారి మొదటి స్థావరాల గురించి 1856 వరకు బ్రిటీష్‌వారి భారతదేశ ఆక్రమణ, మనదేశంలో బ్రిటీష్ వారి పరిపాలన, వారి ఆర్థిక విధానాలు, తర్వాత భాగాలల్లో వివరించడం జరిగింది. 1857 తిరుగుబాటు గురించి కూడా ఈ ఖండంలో ఒక భాగం (భాగం 11) వుంది.

BRAOU

భాగం - 7 ఐరోపావారి మొదటి స్థావరాలు

విషయక్రమం

7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 పోర్చుగీసువారు

7.2.1 ఆల్మీడా, 1505-09

7.2.2 ఆల్బూకర్క్, 1509-1515

7.2.3 పోర్చ్‌గీస్ వారి ఆధిక్య క్షీణతకు కారణాలు

7.3 డచ్చివారు

7.4 బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ

7.4.1 సూరత్

7.4.2 మచిలీపట్నం

7.4.3 మద్రాస్

7.4.4 కలకత్తా

7.4.5 బొంబాయి

7.5 ఫ్రెంచివారు

7.6 సంగ్రహంగా

7.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

7.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

7.9 ఉపయుక్త గ్రంథాలు

7.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. భారతదేశంలో స్థావరాలు ఏర్పరచుకున్న ఐరోపావారి గురించి
2. వారు స్థావరాలు స్థాపించిన విధానం
3. వారి ముఖ్య స్థావరాలు

7.1 పరిచయం

ప్రాచీన కాలం నుంచి భారతదేశం, పాశ్చాత్య దేశాలతో వ్యాపార సంబంధాలు కలిగియుండేది. క్రీ.శ. 7వ శతాబ్దారంభం నుంచి సముద్ర వ్యాపారం అరబ్బుల స్వాధీనమైంది. వారు హిందూ మహాసముద్రం, ఎర్ర సముద్రాలపై సంపూర్ణ అధికారాన్ని కొనసాగించారు. వారు మన దేశంలోని సరుకులను కొని పాశ్చాత్య దేశాలకు రవాణా చేసి, అచ్చట అధిక ధరలకు అమ్మి లాభాలు పొందేవారు. క్రమేణా అరబ్బుల ప్రమేయం లేకుండా భారతదేశంతో సరాసరి సంబంధాలు స్థాపించుకోడానికి, పాశ్చాత్య దేశాలు ప్రయత్నించాయి. హిందూ దేశానికి సముద్ర మార్గాన్ని కనిపెట్టి వ్యాపార ప్రయోజనాలకై వచ్చిన మొదటి పాశ్చాత్య దేశం పోర్చుగల్.

BRAOU

7.2 పోర్చుగీసువారు

ఐరోపీయులు భారతదేశానికి సముద్రమార్గాన్ని అన్వేషించటానికి అనేక కారణాలున్నాయి. మధ్యయుగంలో ఐరోపా తూర్పు దేశాలతో మంచి వాణిజ్య సంబంధాలు కలిగి వుండేది. సుగంధ ద్రవ్యాలు, మస్లిన్ వస్త్రాలు భారతదేశం నుంచి ఎగుమతి చేయబడేవి. అట్టి వస్తువులను భూమార్గంగా వెనిస్, జినోవా నగర వర్తకులు పెషావర్, కాన్‌స్టాంటినోపిల్ మీదుగా కొనిపోయేవారు. అట్టి భారతీయ వస్తువుల గిరాకి పెరిగిన కారణంగా హిందూ దేశానికి సముద్రమార్గాన్ని అన్వేషించవలసి వచ్చింది. క్రీ.శ. 1453 సం॥లో తురుష్కులు బైజాన్‌టైన్ రాజ్యాన్ని ఓడించి, ప్రధాన నగరమైన కాన్‌స్టాంటినోపిల్‌ను ముట్టడించారు. ఆ నగరాన్ని వశపరచుకొన్న పిదప వారు అచ్చటి క్రైస్తవులను నానాహింసలు పెట్టడమేగాక, కాన్‌స్టాంటినోపిల్ మార్గంగా తూర్పుదేశాలకు వెళ్ళడాన్ని నిషేధించారు. కాన్‌స్టాంటినోపిల్ పతనం, హిందూదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొనడానికి ప్రత్యక్ష కారణమనవచ్చు. ఐరోపాలోని పోర్చుగల్, స్పెయిన్, ఇంగ్లాండ్ మొదలయిన దేశాలు అనేక ఔత్సాహికులైన నావికులను ప్రోత్సహించి, వారిచే దూరప్రాంతాలకు ప్రయాణాలు చేయించాయి. అనేక నావికులు గూడ అట్టి సాహస కృత్యాలకు ముందుకొచ్చిన కారణంగా, సముద్రమార్గాన్ని అన్వేషించే వీలయింది.

ఎమాన్యువల్ అను పోర్చుగల్ రాజు, తనకు దగ్గరి బంధువైన వాస్కోడిగామాను తూర్పుదేశాలకు నౌకామార్గాన్ని అన్వేషించడానికై పంపాడు. వాస్కోడిగామా, డయాజ్ మార్గాన్ని అనుసరించి 'గుడ్ హోప్' అగ్రాన్ని దాటాడు. తర్వాత మొజాంబిక్ చేరి, హిందూ మహాసముద్రంలో ప్రయాణం కొనసాగించాడు. 1498 ఏప్రిల్‌లో, అతడు మలబార్ తీరంలోని కాలికట్‌ను చేరగలిగాడు. ఆ విధంగా పోర్చుగీసు వారు హిందూదేశానికి సముద్రమార్గాన్ని కనుగొనడంలో సఫలులైనారు. ఈ సంఘటన ఐరోపా చరిత్రనే గాక, భారతదేశ చరిత్రగతిని మార్చగలిగింది.

వాస్కోడిగామా భారతదేశంలో అడుగుపెట్టిన సమయంలో మలబార్ ప్రాంతాన్ని పాలించిన జామొరిన్ పోర్చుగీసు నావికుల యెడ స్నేహ భావాన్ని చూపాడు. కాని అప్పటికే పడమటి తీరంలో వర్తకం కొనసాగిస్తు వచ్చిన అరబ్బులు, పోర్చుగీసు వారి యెడ తమకు గల వైరాన్ని వ్యక్తం చేశారు. తమ వర్తకానికి పోటీగా వచ్చిన పోర్చుగీసు వారిని, వారు ద్వేషించారు. కాని వాస్కోడిగామా అట్టి అరబ్బు వ్యాపారులను ఓడించి, జామొరిన్ మన్ననకు పాత్రుడయ్యాడు. జామొరిన్ పోర్చుగీసువారికి అనేక సుగంధద్రవ్యాలు, దంతపు వస్తువులు అనేక ఇతర ఖరీదైన బహుమానాలను ఇచ్చాడు. వాస్కోడిగామా చేసిన నౌకాయానం దానిచే మిక్కిలి లాభదాయకంగా తోచింది. మాతృదేశంలో అందరికి, హిందూ దేశంతో వాణిజ్య సంబంధాలకై ఉత్సాహం కలిగింది.

1502 సం॥లో వాస్కోడిగామా మళ్ళీ హిందూదేశానికి వచ్చి, అరబ్బులను ఓడించి, తన ఆధిక్యతను నిరూపించాడు. వారిని అతిదారుణంగా హింసించాడు. జామొరిన్ పోర్చుగీసు వారిని కాలికట్, కొచ్చిన్, క్రాంగ్‌నూర్ మొదలైన చోట్ల వాణిజ్యకేంద్రాలను స్థాపించుకోవడానికి అనుమతించాడు. వాస్కోడిగామా మరలిన పిదప, పోర్చుగీసు వారిని ఎదిరించి, వారి నుంచి కొచ్చిన్‌లోని స్థావరాన్ని ఆక్రమించుకోడానికి జామొరిన్ ప్రయత్నించాడు. కాని అందుకు అపజయం పొందిన కారణంగా, పోర్చుగీసువారి ఆధిక్యత పరోక్షంగా గుర్తింపబడింది.

7.2.1 ఆల్మీడా, 1505-09

1505వ సంవత్సరంలో పోర్చుగీసువారు, భారతదేశంలోగల తమ స్థావరాలను పరిరక్షించడానికై, మొదటిసారిగా ఫ్రాన్సిస్‌కో ఆల్మీడా అనునతనిని గవర్నరుగా నియమించారు. అంతవరకు కొనసాగిన తాత్కాలిక నౌకాయాన పద్ధతి స్థానే, శాశ్వత పాలనా పద్ధతి కొనసాగించబడింది. ఆల్మీడా భూమిపై స్థావరాల అభివృద్ధికి గాక, సముద్రాధిపత్యంపై అధిక ఆసక్తిని కనపరిచాడు. నౌకల నిర్మాణం, నౌకాదళాన్ని పటిష్టం గావించు విషయాలకు అతడు అత్యంత ప్రాధాన్యత నిచ్చాడు. హిందూ దేశంపై అధికారాన్ని చెలాయించడానికి, కోటల నిర్మాణం, సైనికుల నియామకం మొదలైనవి మిక్కిలి శ్రమతో కూడినవని, సముద్రాధిపత్యంపై అతడు శ్రద్ధ చూపాడు. అందుచే అతడు అనురించిన పద్ధతికి "నీలి నీటి విధానమని" (Blue Water Policy) పేరు.

BRAOU

7.2.2 అల్బూకర్క్, 1509-1515

అల్మీడా మరణానంతరం, పోర్చుగీసు స్థావరాలకు అతని స్థానంలో అల్బూకర్క్ గవర్నర్‌గా నియమింపబడ్డాడు. అల్మీడా అనుసరించిన "నీలి నీటి విధానాన్ని" (Blue Water Policy) త్రోసిపుచ్చి, అల్బూకర్క్ భారత భూభాగంపై స్థావరాల ఏర్పాటుకు కృషి చేశాడు. ప్రధానమైన వ్యాపార కేంద్రాలను ఆక్రమించుకొని, వాటిపై పోర్చుగీసు పాలనను స్థాపించడానికై కృషిచేశాడు. అల్బూకర్క్ పోర్చుగీసు వారికి, స్వదేశీ స్త్రీలకు మధ్య అంతర్వివాహాలను ప్రోత్సహించాడు. పోర్చుగీసు వారు స్థానికులను వివాహమాడటంచే, తమకు విధేయులైన ఒక కొత్త మార్గాన్ని సృష్టించుకోవడానికి వీలవుతుందని, అతడు అట్టి వివాహాలకు ప్రాధాన్యత నిచ్చాడు.

అల్బూకర్క్ అనేక దండయాత్రలు చేసి, రాజ్య ఆక్రమణ గావించాడు. 1510లో అతడు గోవాను ఆక్రమించి భారతదేశంలో పోర్చుగీసు అధికారానికి దానిని కేంద్రంగా మార్చాడు. ప్రాచ్య ప్రాంతంలో మలక్కా దీవిని ముట్టడించాడు. 1515లో అతడు పర్షియా అఘాతంలోని ఆర్మజ్‌ను ఆక్రమించాడు. పోర్చుగల్ నుంచి అనేక స్థానిక అధికారులను భారతదేశానికి రప్పించాడు. అదే సమయంలో భారతదేశీయులను సైన్యంలోను, పరిపాలనా విభాగంలోను, అధిక సంఖ్యలో నియమించాడు. అల్బూకర్క్ స్థానిక రాజులతో సత్సంబంధాలు ఏర్పరచుకున్నాడు. విజయనగర రాజులతో అతడు సన్నిహితంగా వుండి, వర్తక సంబంధాలు నెరపాడు. 1515లో అల్బూకర్క్ గోవాలో మరణించాడు.

7.2.3 పోర్చుగీసువారి అధిక్య క్షీణతకు కారణాలు

అల్బూకర్క్ తర్వాత వచ్చినవారు సమర్థులుగారు. అయినప్పటికి పోర్చుగీసుల అధికారం వెంటనే సన్నగిల్లలేదు. 1534 సం॥లో వారు, డయ్యూను ఆక్రమించారు. 1538లో వారు డామన్‌ను స్వాధీనపరచు కొన్నారు. అదే సంవత్సరంలో, గోవాలో వర్తక స్థావరాన్ని స్థాపించడానికి అనుమతి పొందారు. 1545లో డయ్యూలోని కోటను గుజరాత్ రాజు ముట్టడించగా, పోర్చుగీసువారు దానిని విజయవంతముగా రక్షించుకోగలిగారు. 1571లో బీజాపూర్, అహమ్మద్ నగర్ సుల్తానులు కలసి, పోర్చుగీసు వారిని ఓడించడానికి ప్రయత్నించారు. కాని అందువారు విజయాన్ని సాధించలేకపోయారు.

16వ శతాబ్దాంతానికి పోర్చుగీసువారి అధికారం, భారతదేశంలో క్షీణించనారంభించింది. దీనికి అనేక కారణాలను ఉదహరించవచ్చు. పోర్చుగల్ ఐరోపాలో మిక్కిలి చిన్న దేశం, పరిమిత సంపదలతో, అతి తక్కువ జనాభాతో పోర్చుగల్ భారతదేశ దండయాత్రలకు తగిన ధనాన్ని భరించలేకపోయింది. పోర్చుగల్ ఆసక్తి హిందూదేశంలోని తమ స్థావరాలపైనే గాక, దక్షిణ అమెరికాలోని బ్రెజిల్‌పై గూడా చూపబడిన కారణంగా, ఇచ్చటి అధికారం సన్నగిల్ల నారంభించింది. హిందూ దేశంలో వారి అధికారం సన్నగిల్లడానికి మరొక కారణం, పోర్చుగల్ ఆ సమయంలో శక్తివంతమైన ప్రభుత్వాన్ని కలిగియుండలేదు. మాతృదేశంలోని పరిస్థితులు వలస ప్రభుత్వంపై ప్రసరించిన కారణంగా హిందూ దేశంలోని వారి స్థావరాలు అభివృద్ధి చెందలేదు. అవినీతి, లంచగొండితనం ప్రబలిన కారణంగా, పరిపాలన కుంటుపడింది. అంతేగాక 1580 సం॥లో రెండవ ఫిలిప్ కాలంలో పోర్చుగల్, స్పెయిన్ రాజ్యంలో విలీనం చేయబడింది. దీనిచే, స్పెయిన్ రాజు పోర్చుగీసు వారి అవసరాలను నిర్లక్ష్యం గావించినారు. పశ్చిమ దేశాలలో స్థావరాలను స్థాపించడానికి ఎక్కువ కృషి చేసిన స్పెయిన్ ప్రభుత్వం భారతదేశంలోని పోర్చుగీసు వాణిజ్య కేంద్రాలను విస్మరించింది. అందుచే వారి అధికారం సన్నగిల్ల నారంభించింది. 1588 సం॥ లో స్పెయిన్ ఇంగ్లాండుపై యుద్ధం ప్రకటించినప్పుడు హిందూదేశంలో పోర్చుగీసు నౌకాదళాన్ని ఉపసంహరించింది. యుద్ధంలో స్పెయిన్ ఓడిపోయిన కారణంగా పోర్చుగీసు ప్రాబల్యం హిందూదేశంలో అంతరించింది. అంతేగాక 16వ శతాబ్దానికి భారత దేశంలో డచ్‌వారు, ఆంగ్లేయులు అధిక్యతను సంపాదించారు. వారు, పోర్చుగీసువారి కన్నా బలవంతులు. ఐరోపీయుల అట్టి పోటీమూలంగా పోర్చుగల్ క్రమేణా మనదేశంలో అధికారాన్ని కోల్పోయింది. మత మార్పిడి, అంతర్వివాహాలు మొదలైనవిగూడ,

పోర్చుగీసువారి యెడ స్థానికుల వ్యతిరేకతకు దారితీసింది. వారు తమ సహాయ సహకారాల నందించడానికి నిరాకరించారు. విజయనగర పతనం గూడ పోర్చుగీసు వారి అధికార క్షయానికి దారితీసినదనవచ్చు. పోర్చుగీసువారు విజయనగర ప్రభువులతో సత్సంబంధాలు గలిగి, వారితో వాణిజ్యం కొనసాగించారు. తాళికోట యుద్ధంలో విజయనగర చక్రవర్తి ఓడించబడ్డ తర్వాత, పోర్చుగీసు వారికి హిందూదేశంలో సన్నిహితులైన స్థానికులు లోపించారు.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. వాస్కోడిగామా భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొనడం, భారతదేశ చరిత్రలో ఎందుకు ప్రాముఖ్యతను సంతరించుకుంది?

.....

.....

.....

.....

2. విజయనగర రాజ్యస్థాపన భారతదేశంలో పోర్చుగీసు వారి ప్రాబల్యం తగ్గడానికి ఏ విధంగా కారణమైంది?

.....

.....

.....

.....

7.3 డచ్చివారు

స్పెయిన్ దేశానికి వలస ప్రాంతంగా కొనసాగిన డచ్ నెదర్లాండ్స్, 16వ శతాబ్దం మధ్యలో రెండవ ఫిలిప్ అధికారాన్ని ధిక్కరించి, స్వాతంత్ర్య యుద్ధాన్ని కొనసాగించి స్వతంత్ర్య దేశంగా ఆవిర్భవించింది.

స్వాతంత్ర్యానంతరం 1602 సం॥లో డచ్ తూర్పు ఇండియా సంఘం ఆమ్‌స్టర్‌డాం నగర వర్తకులచే స్థాపించబడింది. ఈ సంఘానికి వర్తకంపై గుత్యాధిపత్యమేగాక, యుద్ధాలు చేయడానికి భూప్రాంతాలను ఆక్రమించుకోడానికి, దుర్గాలను నిర్మించుకోడానికి గూడ అనుమతింపబడింది. డచ్ కంపెనీ, దూర ప్రాచ్యంలోని 'సుగంధ దీవు'లని ప్రసిద్ధి చెందిన మలయా, జావా, సుమత్రా మొదలైన ప్రాంతాలపై శ్రద్ధ వహించింది. తాము మొట్టమొదట వచ్చిన కారణంగా ఆ దీవులలోని వ్యాపారంపై గుత్తాధికారాన్ని కలిగి, స్థానిక నాయకులతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

డచ్‌వారు, బ్రిటీషువారు మలయాద్వీపకల్పంలో ప్రవేశించినప్పుడు, పరస్పరం మైత్రితో ఉండేవారు. పోర్చుగల్, స్పెయిన్ దేశాలలో ప్రోత్సహించబడిన రోమన్ కేథలిక్‌లకు వ్యతిరేకంగా వారు ప్రొటస్టాంట్‌లకు మద్ధతునిచ్చారు. కాని క్రమేణా బ్రిటీష్‌వారు తూర్పుదేశాల వ్యాపారంపై సమాన హక్కులకై ప్రయత్నించగా, డచ్ వారికి ఇంగ్లీషు వారితో పోటీ ఏర్పడింది. క్రమేణా ఒకరికొకరు తగాదాలుపడి, 1623లో డచ్‌వారు అంబాయనా దీవిలో గొప్ప మారణకాండను గావించారు. కొంతమంది బ్రిటీష్‌వారు, డచ్ వారికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారను నెపం మీద ఖైదు చేయబడి, చిత్రహింసకు గురిచేయబడ్డారు. అందు దాదాపు పదిమంది బ్రిటీష్‌వారు డచ్ వారిచే చంపబడ్డారు. ఇది అంబాయన దీవిలో జరిగిన కారణంగా, దీనికి 'అంబాయనా మారణకాండ' యను పేరు సార్థకమైంది. ఈ దారుణకాండ తర్వాత బ్రిటీష్‌వారు డచ్ వారికి భయపడి, మలయా ద్వీపకల్పాన్ని విడిచి క్రమేణా హిందూ దేశంవైపు శ్రద్ధ చూపారు. దూర ప్రాచ్యంలో, డచ్ వారికి బ్రిటీషువారి పోటీ తొలగిపోయింది. వారు మలక్కా దీవులను ఆక్రమించుకొని, సింహళాన్ని గూడా వశపరచుకొన్నారు. డచ్‌వారు ఇండోనేషియాను స్వాధీనపరుచుకొని, 1949 వరకు తమ పాలనలో కొనసాగించారు.

BRAOU

భారతదేశంలో డచ్ అధికారం కొంతకాలంపాటు, మిక్కిలి వడిగా వ్యాప్తి చెందింది. వారు మచిలీపట్నంలో స్థావరాన్ని స్థాపించారు. తర్వాత స్థావరం నెల్లూరు వద్దగల పులికాట్, 1659 సం॥లో మద్రాస్ తీరంలోని నాగపట్నం వద్ద, డచ్ స్థావరం స్థాపించబడింది. బెంగాలులో చిన్సూర, వారి ప్రధాన వాణిజ్య కేంద్రం.

భారతదేశంలో డచ్‌వారు పెద్దగా కృషిచేసి, అభివృద్ధిని సాధించలేదు. దీనికి ప్రధానంగా మూడు కారణాలున్నాయి. డచ్ వ్యాపార సంఘం ప్రభుత్వ సంస్థ. ఐరోపాలోని రాజకీయ వాతావరణం మూలంగా డచ్ ప్రభుత్వం రాజకీయాలకిచ్చిన ప్రాధాన్యతను వ్యాపారాభివృద్ధికి యివ్వలేదు. సుగంధ ద్రవ్యాలవల్ల లభించిన లాభాలతో తృప్తిపడిన డచ్ కంపెనీ, స్థావరాల ఏర్పాటుకు, రాజ్యాక్రమణకు ఆసక్తి చూపలేదు. దీనితోబాటు డచ్‌వారి అధికారం సన్నగిల్లుటకు మరొక కారణం, ఐరోపాలోని యుద్ధాలు వారికి అనుకూలంగా పరిణమించలేదు. అటు ఇంగ్లాండుతోను, ఇటు ఫ్రాన్సుతోను డచ్‌వారు పోరాడిన కారణంగా, వారి ఆర్థిక వనరులన్నీ యుద్ధాలకే సరిపోయాయి. హిందూ దేశంలో వారి అధికారం క్షీణించిపోయింది.

7.4. బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ

హిందూ దేశంలో వర్తక స్థావరాలను స్థాపించు విషయంలో బ్రిటీష్‌వారు ఇతర ఐరోపా దేశస్థులవలె గాక, మిక్కిలి నిగ్రహం చూపి, అందు విజయం సాధించారు. మనదేశ ఆక్రమణకై కొనసాగిన పోటీలో, ఇతర ఐరోపా దేశాలపై ఆధిక్యతను సాధించిన ఇంగ్లాండ్, కడపటి విజేతగా నిలదొక్కుకుంది. వ్యాపార కేంద్రాలను ప్రారంభించడంలో కొంత ఆలస్యం కనబరిచినా, అట్టి వర్తక స్థావరాలను ఎంపిక చేయటంలో అమిత దూరదృష్టి కలిగియుండి రాజకీయ ప్రయోజనాలను విస్మరించక బ్రిటీష్‌వారు ఇతర ఐరోపీయులకన్న మిన్నయని నిరూపించుకొన్నారు.

క్రీ.శ. 1600కు ముందుగా కూడ అనేక బ్రిటీష్ పౌరులు భారతదేశాన్ని సందర్శించారు. 1579లో థామస్ స్టీవెన్స్ అనునొక బ్రిటీష్ జాతీయుడు మనదేశానికి వచ్చి సాల్సెట్టిలో మత ప్రచారకుడుగా పనిచేశాడు. అతడు తన తండ్రికి వ్రాసిన అనేక ఉత్తరాలలో భారతదేశ స్థితిగతులను వివరిస్తూ ఇచ్చటి విషయాలను ఆసక్తికరంగా తెలియజేశాడు. 1583లో రాల్ఫ్ షిట్ష్, జేమ్స్ న్యూబెర్రీ, విలియం లీడ్స్ అను ముగ్గురు బ్రిటీష్ వ్యాపారులు భూమార్గంగా భారతదేశాన్ని సందర్శించారు. వారు తమ రచనలలో, భారతదేశంలో వారు చూచిన విషయాలను వివరించారు. ఆ రచనలు చదివిన బ్రిటీష్ వారికి హిందూ దేశాన్ని సందర్శించాలన్న కుతూహలం కలిగింది. 1587లో ఒక పెద్ద పోర్చుగీసు నౌక బ్రిటీష్ నౌకాదళాధికారియైన ఫ్రాన్సిస్ డ్రెక్‌చే పట్టుబడింది. భారతదేశం నుంచి వస్తున్న ఆ నౌకలోని వస్తువులు, లక్షపౌనులకు మించిన విలువగలవి. వాటిని గమనించిన బ్రిటీష్ అధికారులకు భారతదేశంలోని వస్తువుల విలువతెలిసి, అట్టి దేశంతో వ్యాపార సంబంధాలకై కృషిచేయదలచారు. 1588లో ఇంగ్లాండ్, స్పెయిన్‌పై సాధించిన విజయం తర్వాత తూర్పుదేశాలతో వ్యాపారాభివృద్ధికి తగు ప్రోత్సాహం లభించింది. 1599లో డచ్‌వారు ఇంగ్లాండ్ మార్కెట్లలో మిరియాల ధరను, మూడింతలకు పెంచారు. **"నల్లబంగారం"**గా ఇంగ్లాండ్‌లో పేరుపొందిన మిరియాలను తక్కువ ధరకు పొందడానికై హిందూ దేశంతో సరాసరి వర్తక సంబంధాలు స్థాపించడానికి బ్రిటీష్‌వారు నిర్ణయించారు.

కొంతమంది లండన్ వర్తకులు ఒక సంఘంగా ఏర్పడి, తూర్పు దేశాలలో వ్యాపారానికై అనుమతివ్వ వలసినదని, ప్రభుత్వాన్ని కోరారు. 1600 సం॥ డిసెంబరు 31వ తేదీన, అప్పటి బ్రిటీష్‌రాణి ఎలిజబెత్ అట్టి అనుమతి నిచ్చిన మీదట **"బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ"** స్థాపించబడింది. ఇది పూర్తిగా ప్రైవేటు సంస్థయైన కారణంగా అందులోని సభ్యుల వాటా ధనంతో కంపెనీ పనిజేయ మొదలైంది. అందు వచ్చిన లాభాలు, ఒక్కొక్కసారి 500 నుంచి 600 శాతం వుండేవి. కంపెనీ పరిపాలన గమనించడానికై ఒక 'గవర్నర్' వుండేవాడు. గవర్నర్‌కు సహాయంగా 24 సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటైంది. వీరు వాటాదారుల నుంచి ఎన్నికైనవారు. 1600 నుంచి 1612 వరకు ప్రత్యేక నౌకాయానాలు కొనసాగాయి. ఒక్కొక్క నౌకాయానం ముగిసిన పిదప, లాభాలను వాటాదారులు పంచుకొనేవారు. క్రమేణా ఈ పద్ధతిని తొలగించి, శాశ్వత ప్రాతిపదికపై జాయింట్

స్టాక్ పద్ధతిని అనుసరించారు. తొలుత బ్రిటీష్‌వారు భారతదేశంపై ఎక్కువ శ్రద్ధ వహించలేదు. వారు మలయా ద్వీపకల్పంపై ఎక్కువ ఆసక్తి చూపుతూ వచ్చారు. కాని, 1623లో అంబాయానా మారణకాండ పిదప, బ్రిటీష్ వారు ఆ ప్రాంతంలో కొనసాగడానికి భయపడి, హిందూ దేశంపై దృష్టిని మళ్లించారు.

7.4.1 సూరత్

బ్రిటీష్‌వారి మొదటి స్థావరాలన్నీ, పశ్చిమ కోస్తాతీరంలో స్థాపించబడ్డాయి. బ్రిటీష్ కంపెనీకై కొన్ని సౌకర్యాలను కలుగజేయవలసిందని అభ్యర్థించుటకు, బ్రిటీష్ నౌకదళాధికారియైన హాకిన్స్, 1612లో ఢిల్లీ చక్రవర్తియైన జహంగీర్ వద్దకు పంపబడ్డాడు. కాని, అప్పటికే ఢిల్లీలోని మొగల్ దర్బార్‌లో, పోర్చుగీసువారు పలుకుబడి గలిగియున్నందున, హాకిన్స్ రాయబారం ఎట్టి ఫలితాన్ని కలుగజేయలేదు. 1615లో సర్‌థామస్ రో ఇంగ్లాండ్ రాజైన ఒకటవ జేమ్స్ తరపున ఢిల్లీ చక్రవర్తిని కలుసుకొన్నాడు. అప్పటికి పోర్చుగీసు వారి ప్రాబల్యం తగ్గిన కారణంగా, జహంగీర్ థామస్ రో కోరిక ప్రకారం, సూరత్ రేవును బ్రిటీష్ వారికిచ్చి, అచ్చట పన్నులు లేకుండా వ్యాపారం కొనసాగించడానికి అనుమతిచ్చాడు. ఆ విధంగా భారతదేశంలో బ్రిటీష్‌వారు పొందిన మొదటి వర్తక స్థావరం సూరత్. 1622లో సూరత్‌లోని బ్రిటీష్‌వారు దండయాత్ర కొనసాగించి, పోర్చుగీసువారి స్వాధీనంలోని ఆర్మజ్‌ను ఆక్రమించారు.

7.4.2. మచిలీపట్నం

గోల్కొండ నవాబు అనుమతితో బ్రిటీష్‌వారు తూర్పుకోస్తాలో మచిలీపట్నం వద్ద 1613 సం॥లో ఒక వర్తక స్థావరాన్ని స్థాపించారు. కాని అచ్చట డచ్‌వారి పోటీ తీవ్రంగా ఉన్న కారణంగా, మచిలీపట్టణ స్థావరాన్ని అభివృద్ధి చేయడానికి ప్రారంభంలో కొన్ని అవరోధాలు ఎదురయ్యాయి. 18వ శతాబ్దంలో మచిలీపట్నం బ్రిటీష్‌వారి ప్రధానరేవుగా తయారైంది.

7.4.3 మద్రాస్

మచిలీపట్నం కౌన్సిల్‌లో సభ్యుడైన ఫ్రాన్సిస్ డే, ప్రస్తుతం మద్రాస్‌గా గల ప్రాంతాన్ని ఎన్నిక చేసిన పిదప 1639 సం॥లో చంద్రగిరి రాజు నుంచి కంపెనీ అధికారులు ఆ ప్రాంతాన్ని ఖరీదు చేశారు. అచ్చట మరొక కోట నిర్మించబడింది. దానికి 'సెయింట్ జార్జికోట' అని పేరు. 1652లో మద్రాసును ఒక రాష్ట్రస్థాయికి పెంచారు. మద్రాస్‌లోని బ్రిటీష్ స్థావరం మునిసిపల్ కార్పొరేషన్ హోదాకు పెంచబడిన పిదప, అది త్వరగా అభివృద్ధి చెందింది.

7.4.4 కలకత్తా

తూర్పు ప్రాంతంలో బ్రిటీష్ వారికి 1633 నుంచి బాలసోర్, హరిహరపూర్ అను రెండు అతి చిన్న వ్యాపార కేంద్రాలుండేవి. 1651లో హుగ్లీలో మరొక స్థావరం ప్రారంభించబడింది. కాని కలకత్తా, తూర్పున అతి పెద్ద స్థావరంగా రూపొందించబడి, హిందూదేశానికి చాలా కాలం ముఖ్యపట్టణంగా కూడ కొనసాగింది. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ ఒక బ్రిటీష్ వైద్యుడైన గాబ్రియల్ బౌటన్‌కు బహుమానంగా హుగ్లీ నదీతీరంలో ఇచ్చిన కొంత భూమిని బ్రిటీష్ వర్తక సంఘంవారు కొని, ఆ స్థలంలో కలకత్తా నగరాన్ని నిర్మించారు. జాబ్ ఛార్నక్ అనునతడు 1687 సం॥లో నగర నిర్మాణానికి పథకాలను పూర్తిచేశాడు. అచ్చట 'ఫోర్ట్ విలియం' అను కోట నిర్మించబడింది. అచటికి చేరువలోని సుతానుతి, గోవిందపూర్, కలికట అను మూడు గ్రామాలను కూడ బ్రిటీష్ వర్తక సంఘం కొని నగరాన్ని అభివృద్ధి గావించింది. కలికట గ్రామంవల్ల ఆ నగరానికి 'కలకత్తా' అని పేరు వచ్చిందని నమ్మకం. కలకత్తాతో సహా ఫల్టా, ఖాసింబజార్ కూడ బ్రిటీషువారి ప్రసిద్ధ తొలి వ్యాపార కేంద్రాలు.

BRAOU

7.4.5 బొంబాయి

సూరత్‌రేవులో బ్రిటీష్‌వారు సదా మహారాష్ట్రుల దండయాత్రలకు గురి అగుతూ వచ్చారు. అందుచే వారికి అచ్చట నుంచి సురక్షిత స్థావరానికి చేరవలెనను ఉద్దేశం కలిగింది. ప్రస్తుతం బొంబాయిగా నున్న దీవిని, 1667సం॥లో బ్రిటీష్ కంపెనీ తమ రాజైన రెండవ ఛార్లెస్ నుంచి కౌలుకు తీసుకొన్నది. పోర్చుగీస్ రాకుమార్తె కాథరిన్‌ను వివాహమాడి, ఆ దీవిని అతడు కట్నంగా పొందియుండెను. సూరత్ స్థావరంలోని బ్రిటీష్ అధికారి అక్సన్‌డన్, అతిశ్రద్ధ గైకొని బొంబాయిని అభివృద్ధి పరచాడు. కొద్దికాలంలోనే బొంబాయి, పశ్చిమ తీరంలో అతి ప్రధాన వర్తక కేంద్రంగా మారింది. దానిని ఒక రాష్ట్రంగా రూపొందించాడు.

పై ప్రాంతాలే గాక, బ్రిటీషువారికి కడలూర్, విశాఖపట్నం మొదలైన చోట్ల చిన్న స్థావరాలు కూడా వుండేవి.

7.5 ఫ్రెంచివారు

పోర్చుగల్, డచ్చి, ఇంగ్లీష్ దేశస్థులవలె ఫ్రెంచివారు కూడ, తూర్పుదేశాలతో వ్యాపారానికై వర్తక సంఘాన్ని స్థాపించారు. 1611సం॥లో ఫ్రెంచి రాజైన పదకొండవ లూయీ వ్యాపార సంఘాన్ని స్థాపించడానికి అనుమతిచ్చాడు. కాని ఇది విజయవంతంకాలేదు. 1664లో పదునాల్గవ లూయీ మంత్రియైన కోల్బర్ట్, ఫ్రెంచి వర్తక సంఘాన్ని స్థాపించాడు. ఈ సంఘాన్ని అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం మిక్కిలి శ్రద్ధ గైకొన్నది. 1667లో ఫ్రెంచి తూర్పు ఇండియా సంఘం ఫ్రాన్సిస్ కారాన్ అనునతని నాయకత్వం క్రింద సూరత్‌లో ఒక స్థావరాన్ని ఏర్పరిచింది. రెండేండ్ల తర్వాత, మచిలీపట్నంలో మరొక స్థావరం ప్రారంభించబడింది. కారాన్ గోల్కొండ నవాబు నుంచి, తమ వస్తువుల ఎగుమతి, దిగుమతులపై శిస్తు మినహాయింపు గూడ పొందాడు.

1672లో ఫ్రాన్సిస్ కారాన్ స్థానంలో మార్టిన్ అనునతడు ఫ్రెంచి స్థావరాలకు డైరక్టర్ జనరల్‌గా నియమింపబడ్డాడు. భారతదేశంలో ఫ్రెంచి అధికార స్థాపనకు మార్టిన్ మూలపురుషుడనవచ్చు. అతడు ఆర్కాట్ నవాబు నుంచి కడలూరుకు 15మైళ్ళ దూరంలో, తూర్పు తీరంలో కొంతభాగాన్ని పొందారు. ఆ ప్రాంతంలో ఒక పట్టణం నిర్మించబడింది. దీనికి 'పుదుచ్చేరి' (కొత్తపట్టణం) అనిపేరు. తర్వాత ఇది పాండిచ్చేరిగా ప్రసిద్ధి చెందింది. ఫ్రెంచివారు చంద్రనగర్, బాలసోర్, ఖాసింబజార్ మొదలైన చోట్ల గూడా తమ వర్తక స్థావరాలను ఏర్పరచారు. 1725లో వారు మలబార్ తీరంలో 'మాహే'ను పొందారు. 1739లో తూర్పు తీరంలో కరైకాల్ వద్ద ఒక స్థావరాన్ని ఏర్పరచారు. ఆంధ్రకోస్తాలో యానాంగూడ వారికి లభించింది. 1740 నాటికి భారతదేశంలో గణనీయమైన ఒక ఐరోపా వ్యాపార దేశంగా ఫ్రాన్స్ గుర్తింపు పొందింది.

పాండిచ్చేరిలో ఫ్రెంచివారి అధికారం అభివృద్ధి చెయ్యడంతో ఉత్తరదేశంలో వారి పలుకుబడి తగ్గుముఖం పట్టింది. 1714లో సూరత్ వారి అధికారం నుంచి తొలగిపోయింది. మచిలీపట్నం గూడా వారికి అనువుగా పరిణమించలేదు. అదేవిధంగా చంద్రనగర్‌లో ఇంగ్లీషు, డచ్‌వారి పోటీ ఎక్కువైంది. 1742లో డూప్లే ఫ్రెంచి గవర్నర్‌గా నియమింపబడునాటికి ఫ్రెంచి తూర్పు ఇండియా వర్తక సంఘం దండయాత్రలు, రాజ్యాక్రమణ ఘట్టానికి చేరింది. దీనితో బ్రిటీష్ తూర్పు ఇండియా సంఘంతో ఘర్షణ అనివార్యమైంది.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. ప్రారంభంలో, భారతదేశంలో బ్రిటీష్‌వారి ముఖ్య స్థావరాలేవి?

.....

.....

.....

.....

BRAOU

2. భారతదేశంలో ఫ్రెంచివారి ముఖ్య రాజకీయ కేంద్రాలేవి?

.....

.....

.....

.....

7.6 సంగ్రహంగా

1. 1498లో వాస్కోడిగామా భారతదేశానికి సముద్రమార్గాన్ని కనుగొనడంలో భారతదేశ చరిత్ర గతి మారింది.
2. భారతదేశంలో మొట్టమొదటి స్థావరాలు నెలకొల్పుకున్న ఐరోపావారు, పోర్చుగీస్ దేశస్తులు.
3. తర్వాత వచ్చిన వారు డచ్‌వారు. వారి ముఖ్య కేంద్రం బెంగాల్‌లో చిన్సూర.
4. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 1600 సంవత్సరము 31, డిసెంబరు నాడు నెలకొల్పబడింది. బ్రిటీష్ వారి ముఖ్య స్థావరాలు, సూరత్, మచిలీపట్నం, మద్రాసు, కలకత్తా, బొంబాయి.
5. ఫ్రెంచివారు బ్రిటీష్ వారి తర్వాత వచ్చినారు. వారి ముఖ్య కేంద్రం పుదుచ్చేరి (Pondicherry).

7.7 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) వాస్కోడిగామా భారతదేశానికి సముద్రమార్గాన్ని కనుగొనడంవల్ల, భారతదేశపు తలుపు, పాశ్చాత్యులకు మొదట వ్యాపారం కొరకు, తర్వాత రాజ్య స్థాపన కొరకు తెరువబడ్డాయి. అందువల్ల వాస్కోడిగామా భారతదేశానికి సముద్రయానం కనుగొనడానికి భారతదేశ చరిత్రలో ప్రాముఖ్యత ఉంది.

2) భారతదేశంలో పోర్చుగీస్‌వారి వ్యాపారం, ఎక్కువగా వారికి విజయనగర రాజులు ఇచ్చిన ప్రోత్సాహం మీద ఆధారపడింది. అందువల్ల విజయనగర రాజ్య పతనం, పోర్చుగీస్‌వారి ప్రాబల్యపతనానికి దారి తీసింది.

II 1) సూరత్, మచిలీపట్నం, మద్రాసు, కలకత్తా, బొంబాయి ప్రారంభంలో భారతదేశంలోని బ్రిటీష్ స్థావరాలు.

2) పుదుచ్చేరి, మచిలీపట్నం, చంద్రనగర్ భారతదేశంలో ఫ్రెంచివారి ముఖ్య స్థావరాలు.

7.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) భారతదేశంలో ఐరోపావారు స్థావరాలు ఏర్పాటు చేసుకొనుటకు తోడ్పడిన పరిస్థితులను విలువలను వివరించండి.

2) భారతదేశంలో పోర్చుగీసువారు ఎందుకు విఫలమైనారో తెల్పండి.

3) బ్రిటీష్‌వారి స్థావరాలను తెలిపి, వారు ఇతర ఐరోపావారిపై విజయం సాధించుటకు తోడ్పడిన కారణాలను తెల్పండి.

BRAOU

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) భారతదేశంలో ఫ్రెంచివారి తొలి స్థావరాలను తెల్పండి.

2) భారతదేశంలో డచ్‌వారి తొలి స్థావరాలను తెల్పండి.

7.9 ఉపయుక్త గ్రంథాలు

1. Bipan Chandra : *Modern India*
2. Dodwell, H.H., : *Cambridge History of India Vol : V Dupliex and Clive.*
3. Malleson G.B. : *History of the French in India.*
4. Mukherjee, Ramakrishna : *The Rise and fall of the East India company*
5. Sen, S.P. : *The French in India (1761 & 1816)*
6. Spear, Perceival : *History of India Vol - II*

BRAOU

భాగం - 8 : భారతదేశ బ్రిటీష్ ఆక్రమణ, 1748 - 1856

విషయక్రమం

8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 దక్షిణాన, ఫ్రెంచి-ఆంగ్లేయుల మధ్య వైరం

8.2.1 మొదటి కర్ణాటక యుద్ధం, 1744-48

8.2.2 రెండవ కర్ణాటక యుద్ధం, 1749-54

8.2.3 మూడవ కర్ణాటక యుద్ధం, 1756-63

8.3 బ్రిటిష్‌వారు బెంగాల్ నాక్రమించుట

8.3.1 ప్లాసీ యుద్ధం, 1757

8.3.2 బక్సర్ యుద్ధం, 1764

8.4 భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ

8.4.1 వారన్ హేస్టింగ్స్ ఆక్రమణలు

8.4.2 కారన్ వాలీస్ - మూడవ మైసూర్ యుద్ధము 1790-92

8.4.3 వెల్లస్లీ

8.4.3.1 సైన్య సహకార పద్ధతి

8.5 హేస్టింగ్స్

8.6 డల్హౌసీ - రాజ్య సంక్రమణ సిద్ధాంతం

8.7 సంగ్రహంగా

8.8 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

8.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.10 ఉపయుక్త గ్రంథాలు

8.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల బ్రిటిష్‌వారు భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని ఎలా నెలకొల్పి విస్తరించినారో తెలుసుకోగలగాలి. క్రింది విషయాల గురించి అవగాహన ఏర్పడాలి.

1. ఫ్రెంచి - ఆంగ్లేయుల యుద్ధాలు (కర్ణాటక యుద్ధాలు)
2. మైసూరు - ఆంగ్లేయ, మహారాష్ట్ర - ఆంగ్లేయుల యుద్ధాలు
3. వెల్లస్లీ సైన్య సహకార పద్ధతి
4. డల్హౌసి ఆక్రమణలు, రాజ్య సంక్రమణ సిద్ధాంతం

8.1 పరిచయం

కేవలం వ్యాపారం చేయు ఉద్దేశ్యంతోనే ఐరోపీయులు భారతదేశానికి వచ్చారు. వ్యాపార స్థావరాలను స్థాపించిన పిదప లాభాలను అధికం చేసుకొనుటకు ప్రతి ఒక్కరు వాణిజ్య గుత్తాధికారాన్ని సాధించడానికి ప్రయత్నించారు. అందుకే ఒకరికొకరు తగాదాలుపడి పోట్లాడుకోవడం ప్రారంభించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు వర్తకంపై మాత్రమే గాక, రాజకీయ అధికార స్థాపనకై కూడ అధిక ఆసక్తి చూపినారు. అందుచే వారు దక్కన్‌లో ఘోరపోరాటాలకు దిగినారు. బ్రిటీష్‌వారు బెంగాల్‌లో ఘన విజయాలు సాధించి, వారి అధికార స్థాపనకు పునాదులు వేశారు. అనేక గవర్నర్లు యిట్టి రాజ్యాక్రమణ పద్ధతిని కొనసాగించి, కొద్దికాలానికే దేశవ్యాప్తంగా అధికారాన్ని వ్యాప్తి చేశారు.

BRAOU

8.2 దక్షిణాన, ఫ్రెంచి - ఆంగ్లేయుల మధ్య వైరం

18వ శతాబ్దారంభానికి ఉత్తర భారతంలో మొగల్ సామ్రాజ్యం క్షీణించుచున్నా, మహారాష్ట్రుల అధికారం ఒక వైపు, స్వతంత్రించిన అనేక నవాబుల పలుకుబడి మరో వైపు అధికంగా నుండిన కారణంగా, బ్రిటీష్‌వారు తమ అధికారాన్ని విస్తరించుకోవడానికి అనువైనదిగా తోచలేదు. అందుచే మొదట వారు దక్షిణ దేశంలో తమ దృష్టిని కేంద్రీకరించారు. నిజాం-ఉల్-ముల్క్ మరణానంతరం, స్థానిక రాజుల విషయాలలో జోక్యం కలిగించుకొను వీలు ఏర్పడింది. బ్రిటీష్‌వారు, ఫ్రెంచివారు అధికార స్థాపనకై సాగించిన పోరాటాలు, కర్ణాటక యుద్ధాలుగా పరిణమించాయి. అవి మొత్తం మూడు యుద్ధాలు. అందులో మొదటిది, మూడవదీ ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య ఐరోపాలో జరిగిన ఆస్ట్రియా వారసత్వపు యుద్ధం, సప్తవర్ష సంగ్రామంలో ఇరుపక్షాలు పాల్గొన్న కారణంగా సంభవించాయి. రెండవ కర్ణాటక యుద్ధం మాత్రం స్థానిక రాజ్యాలైన ఆర్కాట్, హైదరాబాద్ ఆంతరంగిక విషయాలలో జోక్యం కలిగించుకొన్న కారణంగా ఉత్పన్నమైంది.

8.2.1 మొదటి కర్ణాటక యుద్ధం, 1744-48

1740సం॥ మార్చినెలలో, ఐరోపాలో ఆస్ట్రియా వారసత్వపు యుద్ధం ప్రారంభమైంది. అందు ఫ్రాన్స్, ఇంగ్లాండ్ పాల్గొన్న కారణంగా, వారి వాణిజ్య కంపెనీలున్న హిందూ దేశానికి కూడా వారి వైషమ్యాలు వ్యాపించాయి. బార్నెట్ నాయకత్వంలో బ్రిటీష్ నౌకాదళం, హిందూ దేశం చేరుకుంది. ఆ సమయంలో యుద్ధానికి సిద్ధంగా లేని ఫ్రెంచి గవర్నర్ డూప్లే, ఆర్కాట్ నవాబైన అన్వరుద్దీన్ వద్దకు వెళ్ళి, తన రాజ్య సరిహద్దులో గల బ్రిటీష్‌వారు ఫ్రెంచి వారిని ఎదిరించుట తగదని, వారిని వారించవలసినదిగా కోరాడు. అన్వరుద్దీన్ జోక్యం కలిగించుకొని బార్నెట్‌ను తిరిగి వెళ్ళమని ఆదేశించాడు. బ్రిటీష్‌వారు నౌకాదళాన్ని త్రిప్పి పంపారు.

ఆపద తొలగిన వెంటనే పాండిచ్చేరిలోని ఫ్రెంచి గవర్నరైన డూప్లే, బ్రిటీష్‌వారిపై దెబ్బ తీయడానికై, మారిషస్‌లోని ఫ్రెంచి గవర్నరైన మాహెడిల బోర్డోనేను ఆహ్వానించాడు. ఇద్దరూ కలసి 1746 సెప్టెంబరు 21వ తేదీన మద్రాస్‌ను ముట్టడించి ఆక్రమించారు. కాని ముందు ఫ్రెంచి వారిపై పక్షపాతం చూపిన అన్వరుద్దీన్, మద్రాస్‌ను తనకు అప్పజెప్పమని వర్తమానం పంపాడు. దీనికి డూప్లే అంగీకరించని కారణంగా, ఆర్కాట్ సేనలు మద్రాస్‌ను ముట్టడించాయి. కెప్టెన్ పారడైజ్ అను సేనాని నాయకత్వంలోని ఫ్రెంచ్ సేనలు, ఆర్కాట్ నవాబు పంపిన సైన్యాలను చిత్తుగా ఓడించాయి. మద్రాస్ ఫ్రెంచివారి అధీనంలో కొనసాగింది. 1748లో ఐరోపాలో ఆస్ట్రియా వారసత్వపు యుద్ధం, ఎలాషాపెల్ సంధితో ముగిసింది. ఆ సంధి షరతుల ప్రకారం, హిందూ దేశమందలి మద్రాస్ తిరిగి బ్రిటీష్ వారికి అప్పచెప్పబడింది. ఆ విధంగా మొదటి కర్ణాటక యుద్ధంలో ఆర్కాట్ నవాబు సైన్యాలు ఓడిపోవడం, బ్రిటీష్‌వారు మద్రాస్‌ను పోగొట్టుకొని, తిరిగి పొందడం జరిగింది.

8.2.2 రెండవ కర్ణాటక యుద్ధం, 1749 - 54

మొదటి కర్ణాటక యుద్ధంలో ఫ్రెంచివారు సాధించిన విజయాలు డూప్లేలో రాజ్యకాంక్షను ప్రేరేపించాయి. బ్రిటీష్‌వారి పలుకుబడి తగ్గించడానికై, స్థానిక రాజ్యాల అంతరంగిక విషయాలలో జోక్యం కల్గించుకొన చ్రారంభించాడు. మాలిసన్ అను చరిత్రకారుడు వ్రాసినట్లు *"అధిక రాజకీయ కాంక్షతో, ఒకరిపై ఒకరికి గల అసూయతో, సువిశాల రాజ్యస్థాపనా భావం తలుపు తట్టుతుండగా, ఐరోపీయులకు హిందూ దేశంలో శాంతియుతంగా వుండడానికి వీలెట్లు కలుగును?"* ఆర్కాట్ నవాబీలోను, హైదరాబాద్ సంస్థానంలోను సంభవించిన పరిస్థితులు ఫ్రెంచి జోక్యానికి దారి తీశాయి.

1748 సం॥లో హైదరాబాద్ నిజాంగా నున్న నిజాం-ఉల్-ముల్క్ మరణించగా అతని కుమారుడైన నాసిర్ జంగ్‌కు, మనుమడైన (కుమార్తె కొడుకు) ముజఫర్ జంగ్‌కు, మధ్య వారసత్వపు తగాదా ప్రారంభమయ్యెను. అదే సమయంలో చందాసాహెబ్ ఆర్కాట్ నవాబైన అన్వరుద్దీన్‌ను తొలగించి, ఆ పదవిని తాను దక్కించుకోడానికి

BRAOU

ప్రయత్నించాడు. దానికై చందాసాహెబ్ ఫ్రెంచి గవర్నరైన డూప్లే సహాయాన్ని అర్థించాడు. (ఆర్కాట్‌కు "కర్ణాటక నవాబి" అని కూడా పేరుండేది).

లభించిన సదవకాశాన్ని జారవన్వికి, డూప్లే వెంటనే ముజఫర్ జంగ్‌ను కర్ణాటకమునకు రావలసిందని, ఆర్కాట్‌లో పరిస్థితులను చక్కబెట్టిన తర్వాత హైదరాబాద్ సింహాసనం అతనికి చెందునట్లు సహాయపడుదునని వాగ్దానం చేశాడు. 1749లో డూప్లే ముజఫర్ జంగ్, చందా సాహెబ్ కలసి అన్వరుద్దీన్‌ను అంబూర్ యుద్ధంలో ఎదుర్కొన్నారు. యుద్ధంలో అన్వరుద్దీన్ చంపబడ్డాడు. చందాసాహెబ్ ఆర్కాట్ నవాబయ్యాడు. అప్పటికి ఎక్కువ అధికారంలో లేని బ్రిటీష్‌వారు వూరకుండక, ఫ్రెంచివారికి వ్యతిరేకంగా పనిచేయ ప్రారంభించారు. వారు తంజావూరు రాజును డూప్లేకు వ్యతిరేకంగా ప్రోత్సహించారు. హైదరాబాద్ నుంచి నాసిర్ జంగ్‌ను కర్ణాటకమునకు ఆహ్వానించి, డూప్లే అధికారాన్ని ఎదిరించ తలచారు. వారు నాసిర్‌జంగ్‌ను హైదరాబాద్‌లో నిజాంగాను, అన్వరుద్దీన్ కుమారుడైన మహ్మదాలీని ఆర్కాట్ నవాబుగాను చేయవలెనని సంకల్పించారు. బ్రిటీష్‌వారి పథకం ప్రకారం, నాసిర్ జంగ్ కర్ణాటకమునకు చేరుకొన్నాడు. కాని, 1750లో ఒక యుద్ధంలో చంపబడ్డాడు. ముజఫర్ జంగ్ హైదరాబాద్ నిజాంగా ప్రకటించుకొన్నాడు. చందాసాహెబ్ ఆర్కాట్ నవాబుగా కొనసాగాడు. డూప్లే అనుకొన్న ప్రకారం అన్నీ జరిగాయి. అతనికి పాండిచ్చేరికి చేరువగా విల్లియనల్లూర్ అను గ్రామం ఇవ్వబడింది. "డూప్లే సాహెబ్" అను బిరుదు ఒసగబడింది గూడ.

ముజఫర్ జంగ్ 1751 లో పాండిచ్చేరి నుంచి జనరల్ బుస్సీ నాయకత్వంలోని కొంత ఫ్రెంచ్ సేనతో, హైదరాబాదుకు బయలు దేరాడు. రెండు మాసాల ప్రయాణానంతరం వారు కడప సమీపంలో ప్రయాణం చేయు సమయంలో ముజఫర్ జంగ్ చంపబడ్డాడు. కాని బుస్సీ తన ఫ్రెంచి సేనలతో హైదరాబాద్ చేరి, నాసిర్ జంగ్ తమ్ముడైన సలాబత్ జంగ్‌ను నిజాంగా చేసి, ఫ్రెంచి సేనలకు రక్షణ కల్పించి, సైనికుల ఖర్చుకై కొత్త నిజాం నుంచి ఉత్తర సర్కారులని పిలువబడ్డ గంజాం, విశాఖపట్నం, గోదావరి, కృష్ణ జిల్లాలను పొందాడు. దీనితో ఫ్రెంచి అధికారం అటు హైదరాబాద్‌లోను ఇటు ఆర్కాట్‌లోను ఉన్నత స్థితికి చేరుకొంది.

ఫ్రెంచివారు సాధించిన పలుకుబడి అట్టేకాలం నిలువలేదు. రాబర్ట్ క్లైవ్ అను బ్రిటిష్ నాయకుని మూలాన, ఫ్రెంచి ప్రాబల్యం తొందరగా క్షీణించింది. అతడు కొద్ది మంది బ్రిటిష్ సేనలతో ఆరణి, కావేరిపాక్ యుద్ధాలలో ఆర్కాట్ నవాబు సేనలను ఓడించాడు. తంజావూరుతో తగాదాపడిన చందాసాహెబ్ యుద్ధంలో మరణించాడు. తిరుచినాపల్లిలో ఫ్రెంచి సేనలు ఓడింపబడ్డాయి. దీనితో, ఫ్రెంచి తూర్పు ఇండియా సంఘ డైరక్టర్లు 1754లో డూప్లేను తొలగించి గొడెహ్యూ అనునతనిని గవర్నర్‌గా నియమించారు. కొత్త గవర్నర్ వచ్చిన వెంటనే బ్రిటీష్‌వారితో సంధి కుదుర్చుకొన్నాడు. సలాబత్ జంగ్ హైదరాబాద్ నిజాంగా, మహమ్మదాలీ ఆర్కాట్ నవాబుగా స్థిరపడినారు. డూప్లే నిష్క్రమణతో, హిందూదేశంలో ఫ్రెంచి అధికారం క్షీణించిందని చెప్పవచ్చు.

8.2.3 మూడవ కర్ణాటక యుద్ధం, 1756-63

మొదటి కర్ణాటక యుద్ధంవలె, మూడవ కర్ణాటక యుద్ధం ఐరోపాలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఏర్పడిన తగాదాల మూలంగా జరిగింది. సప్తవర్ష సంగ్రామంలో ఇంగ్లాండ్-ఫ్రాన్స్‌లు పోరాటం ప్రారంభించగానే, ఆ ఇరువురి వర్తక సంఘాలు హిందూ దేశంలో గూడ తగాదా పడ్డాయి. హిందూ దేశంలో బ్రిటీషువారి ప్రాబల్యాన్ని తుదముట్టించాలనే దృఢ నిశ్చయంతో, ఫ్రెంచి ప్రభుత్వం 1757 ఏప్రిల్‌లో, కౌంట్ డి లాలీ అను నతని నాయకత్వం క్రింద ఫ్రెంచి నౌకాదళాన్ని పంపించింది.

లాలీ 1758లో భారతదేశం చేరుకున్న వెంటనే కడలూరును ముట్టడించి, ఫోర్ట్ డేవిడ్‌ను ఆక్రమించాడు. తంజావూరును గూడ ఆక్రమించ ప్రయత్నించాడు. కాని అది వీలుపడలేదు. దీని తర్వాత లాలీ మద్రాసును ఆక్రమించ తలచాడు. అందుకై హైదరాబాదులోని బుస్సీనీ రమ్మని ఆదేశించాడు. బుస్సీ హైదరాబాద్ వీడగానే

BRAOU

అచ్చట ఫ్రెంచి పలుకుబడి క్షీణించింది. బ్రిటీషువారు అదను కనిపెట్టి, ఉత్తర సర్కారులను ఆక్రమించుకొన్నారు. 1760 సం॥లో వందవాశి వద్ద జరిగిన యుద్ధంలో, బ్రిటీష్ సైన్యాధికారి సర్‌ఐర్‌కూట్, ఫ్రెంచి నాయకులైన బుస్సీ, లాలీలను ఓడించాడు. బ్రిటీషువారు పాండచ్చేరిని ముట్టడించి ఆక్రమించుకొన్నారు. మాహె, జింజి స్థావరాలు గూడ ఫ్రెంచివారు కోల్పోయారు. హిందూ దేశంలో ఫ్రెంచి అధికారం పూర్తిగా క్షీణించింది.

సప్తవర్ష సంగ్రామం 1763లో పారిస్ సంధితో ముగిసింది. సంధి షరతుల ప్రకారం పాండిచ్చేరి, ఇతర స్థావరాలు ఫ్రెంచి వారికి అప్పజెప్పబడ్డాయి కాని వాటిని సైనికపరంగా అభివృద్ధి చేయుటకు వీలులేదు. కేవలం వర్తకానికి మాత్రం ఉపయోగించుకొనవచ్చు. బ్రిటిష్‌వారు తమ ప్రత్యర్థులైన ఫ్రెంచివారి అధికారాన్ని నశింపజేసిన తర్వాత హిందూ దేశ ఆక్రమణకు సంసిద్ధులైరి.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. ఐరోపావారిలో, భారతదేశ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం, ఎవరు మొదలు పెట్టినారు?

.....

.....

.....

.....

2. కర్ణాటక యుద్ధాలల్లో బ్రిటీష్ విజయానికి కారకులెవరు?

.....

.....

.....

.....

8.3 బ్రిటీష్‌వారు బెంగాల్ నాక్రమించుట

1756 సం॥లో బెంగాల్ నవాబైన అలివర్దిఖాన్ మరణించగా, అతని మనుమడైన సిరాజుద్దౌల సింహాసనానికొచ్చాడు. సిరాజ్ 23 ఏండ్ల యువకుడు. బెంగాల్‌లో బ్రిటీష్‌వారి ఉనికిని గూడ సహించని వాడు సిరాజుద్దౌలా. ఆ సమయంలో బ్రిటీష్‌వారు కలకత్తాలో సైన్యాలను సమీకరిస్తూ, ఫోర్ట్ విలియంలో సైనిక సామగ్రిని అధికంగా నిల్వ చేయడం ప్రారంభించారు. దీనికి తోడు, బెంగాల్ నవాబుకు వ్యతిరేకులైన స్థానికులకు కలకత్తాలో బ్రిటీష్‌వారి అండ లభించేది. తన రాజ్యంలో తన అధికారాన్నే ధిక్కరించిన బ్రిటీష్‌వారి యెడ, సిరాజ్ కఠినంగా ప్రవర్తించ తలచి, తన సేనల పంపి, ఖాసిం బజార్‌ను ముట్టడించి, 1756 జూన్‌లో కలకత్తా ప్రవేశించాడు.

కలకత్తాను ఆక్రమించుకొని, అచ్చట ఖైదీలుగా దొరికిన బ్రిటీష్‌వారిలో దాదాపు 146 మందిని జూన్ 20వ తేది ఒక చిన్న గదిలో బంధించాడు. గాలి వెలుతురులేని ఆ చీకటి గదిలో, వేసవి రాత్రి వేడిని భరించలేక అనేక ఖైదీలు మరణించారు. ఈ కలకత్తా చీకటి గది ఉదంతం, బ్రిటీష్ అధికారులకు భయాందోళనలు కలిగించడమేగాక, ఉత్తరోత్తరా ప్రతీకార చర్యకు పురికొల్పి, భారతదేశ ఆక్రమణకు దారితీసిందని చెప్పవచ్చు. కాని కొద్దిమంది చరిత్రకారుల ప్రకారం కలకత్తా చీకటి గది ఉదంతం బందీలలో ఒకడైన వెల్ సృష్టించిన కథనం మాత్రమేయని, 146 మంది ఖైదీలను అతడు అన్నట్లు 18 అడుగుల చిన్నగదిలో బంధించడం అసలు అనూహ్యమని, ఇది పూర్తిగా అభూత కల్పనయని భావించారు.

BRAOU

8.3.1 ప్లాసీ యుద్ధం, 1757

కలకత్తా ముట్టడి వార్త తెలిసిన వెంటనే, మద్రాస్‌లోని బ్రిటీష్ అధికారులు ఒక పెద్ద సైన్యాన్ని రాబర్ట్ క్లైవ్ నాయకత్వం కింద, బెంగాల్ పరిస్థితులను చక్కబెట్టడానికై పంపారు. అడ్మిరల్ వాట్సన్ అనునతని అధీనంలో ఒక నౌకదళం గూడా పంపబడింది. 1757 ప్రారంభంలో బ్రిటీష్ దళాలు కలకత్తాను పునరాక్రమించుకొన్నాయి. నవాబు బ్రిటీష్‌వారి షరతులన్నిటికి ఒప్పుకొని, బెంగాల్ లోని స్థావరాలన్నింటిని వారికి తిరిగి అప్పజెప్పాడు. రాబర్ట్‌క్లైవ్ బెంగాల్‌లో కుట్రపన్ని, సిరాజుద్దౌలాను గద్దెదింపి అతని సైన్యాధిపతి మీర్‌జాఫర్‌ను, తర్వాతి సుల్తాన్‌గా చేయతలచాడు. మీర్ జాఫర్ నుంచి బ్రిటిష్‌వారికి అనేక వ్యాపార సౌకర్యాలు కలిగించుటేగాక, బ్రిటీష్ అధికారులందరికీ అమిత లాభాలు లభించునని అంచనా వేశాడు. మీర్ జాఫర్‌తో రహస్య ఒప్పందం కుదర్చడానికి అమీన్ చంద్ అనునొక పంజాబ్ వర్తీ వ్యాపారి, క్లైవ్‌కు సహాయ పడ్డాడు. ప్రతిఫలంగా ఖజానాలోని ధనంలో 5శాతం ఇమ్మని కోరిన అమీన్ చంద్‌ను, తెలివిగా నమ్మించి, క్లైవ్ కడపటికి మోసగించాడు.

క్లైవ్ 3,200 మంది సైనికులను ఆయత్తం చేసి, బెంగాల్‌కు ఆ రోజులలో ముఖ్యపట్టణమైన మూర్షిదాబాద్ వైపు బయలుదేరాడు. నవాబు వద్ద దాదాపు 50,000 సైన్యముండేది. దీనికి మీర్ జాఫర్ నాయకుడు. ఇరు సైన్యాలు 1757 జూన్ 23వ తేదీన, ప్లాసీ వద్ద పోరాడాయి. యుద్ధ సమయంలో మీర్జాఫర్ శత్రువుకు పరోక్షంగా సహాయపడుచుండిన కారణంగా, సిరాజ్ సైన్యాలు ఓడిపోయాయి. సిరాజ్ యుద్ధభూమి నుంచి పారిపోయాడుగాని, శత్రువులకు చిక్కి చంపబడ్డాడు.

మీర్జాఫర్ ప్లాసీ యుద్ధభూమిలోనే బెంగాల్‌కు కొత్త నవాబుగా క్లైవ్‌చే ప్రకటించబడ్డాడు. ప్రతిగా మీర్జాఫర్ బ్రిటీష్‌వారికి అనేక వ్యాపార సౌకర్యాలను ప్రకటించాడు. 24 పరిగణాలను కంపెనీకి ఇచ్చాడు. ఇది రెండేళ్ళ తర్వాత క్లైవ్‌కు వ్యక్తిగత జాగీర్‌గా మారింది. క్లైవ్‌కు 234 వేల పౌన్ల ధనం ముట్టింది. బెంగాల్, బీహార్‌లలో బ్రిటీష్‌వారు మిక్కిలి అధికారాన్ని పొందారు. 1758 సం॥లో క్లైవ్ కలకత్తాకు గవర్నర్‌గా నియమింపబడ్డాడు.

ప్లాసీ యుద్ధం, దాని తర్వాత బెంగాల్‌ను కొల్లగొట్టడం మూలాన బ్రిటీష్‌వారికి విశేషమైన ఆర్థిక ఆదాయం లభించింది. బెంగాల్ పైన తద్వారా పూర్తిదేశం పై సర్వాధికారం సంపాదించడానికి, ప్లాసీ యుద్ధం దోహదం చేసిందని చెప్పవచ్చు. ఆ రోజులలో బెంగాల్ మిక్కిలి సంపన్నమైనందున అచ్చటి ఆర్థిక ఆదాయం పెద్ద సైన్యాల తయారీకి పనికి వచ్చింది. ప్లాసీ యుద్ధానికి ముందు బ్రిటీష్‌వారు బెంగాల్ వ్యాపారాన్ని గుత్తాధికారం చేసుకొని నిజపాలకులయ్యారు.

8.3.2 బక్సర్ యుద్ధం, 1764

బెంగాల్ గవర్నర్‌గా రెండేండ్లు పని చేసిన పిదప 1760 సం॥లో రాబర్ట్ క్లైవ్ స్వదేశం మరలెను. అతని స్థానంలో వాన్సిటార్ట్ నియమించబడెను. మీర్జాఫర్ కంపెనీ విధించిన మొత్తాన్ని సక్రమంగా చెల్లించ లేకపోయాడు. అందుచే వాన్సిటార్ట్ మీర్జాఫర్‌ను పదవి నుంచి తొలగించి అతని అల్లుడైన మీర్ ఖాసీంను బెంగాల్‌కు కొత్త నవాబుగా నియమించాడు. మీర్ ఖాసీం బ్రిటీష్‌వారికి బర్ద్‌వాన్, మిద్నపూర్, చిట్టగాంగ్ అను మూడు జిల్లాలను అప్పజెప్పాడు. కాని మీర్ జాఫర్ వలెగాక, ఖాసీం బాగా చదువుకొన్నవాడు. ఆర్థిక విషయాలను క్షుణ్ణంగా తెలుసుకొన్నవాడు. అతడు తన ఆదాయాన్ని అభివృద్ధిపరచి, రాజ్యాన్ని మెరుగుపరచాడు. తన ప్రధాన నగరాన్ని మూర్షిదాబాద్ నుంచి మాంఘీర్‌కు మార్చి బ్రిటీష్ వారికి దూరంగా వుండదలచాడు. బ్రిటీష్ వారికి గల వ్యాపార సదుపాయాలను రద్దు చేశాడు. ఇట్టి పద్ధతులను నిరసించిన బ్రిటీష్‌వారు, మీర్‌ఖాసీం తమ ఇష్టానుసారం నడుచుకోడని నిర్ణయించుకొని, 1763లో అతనిని పదవీచ్యుతుని గావించారు. అతని స్థానంలో తిరిగి మీర్జాఫర్‌ను బెంగాల్ నవాబుగా నియమించినారు.

మీర్ ఖాసీం అయోధ్య చేరి, మొగల్ చక్రవర్తి యైన షాఆలం, అయోధ్య వజీరైనా షూజా-ఉద్దౌలాతో కలిసి గొప్ప సమాఖ్యను ఏర్పరచాడు. ఆ ముగ్గురి సైన్యాలు 50,000 మించి వుండేవి. ఇంగ్లీషువారికి గల

BRAOU

7వేల సేనలు, సర్ హెక్టర్ మన్రో నాయకత్వం కింద బక్సర్ వద్ద, ఖాసీం సైన్యాలతో యుద్ధానికి దిగినవి. 1764 అక్టోబర్ 22వ తేదీన జరిగిన బక్సర్ యుద్ధంలో మిత్ర సేనలు చిత్తుగా ఓడింపబడ్డాయి. ఖాసీం యుద్ధభూమి నుండి పారిపోయాడు. షూజా రోహిల్ ఖండ్‌కు వెళ్ళిపోయాడు. షాఆలం బ్రిటీష్‌వారితో సంధి చేసుకొన్నాడు. ప్లాసీ యుద్ధంతో ప్రారంభమైన బ్రిటీష్ అధికార స్థాపనా కార్యక్రమం, బక్సర్ యుద్ధంతో ఒక కొలిక్కి రాగలిగింది. బీహార్, బెంగాల్ ఒరిస్సాలపై బ్రిటీష్ అధికారం బక్సర్ యుద్ధానంతరం స్థిరపడిందనవచ్చు. 1765 ఫిబ్రవరి మీర్ జాఫర్ మరణించిన పిదప బ్రిటీష్‌వారు అతని కుమారుడైన నాజిమ్ ఉద్దౌలతో ఒడంబడిక కుదుర్చుకొని, అతని నుంచి సైనికాధికారాలన్నీ రద్దుగావించి, కంపెనీచే నియుక్తుడైన సుబేదార్ పాలన కొనసాగించారు. చక్రవర్తియైన షాఆలం నుంచి బెంగాల్‌లో పన్ను వసూలు చేయు అధికారాన్ని గూడ బ్రిటీష్‌వారు 1765లో సంపాదించారు. ఆ విధంగా ప్లాసీ, బక్సర్ యుద్ధాల తర్వాత బ్రిటీష్ అధికారం బెంగాల్‌లో స్థిరంగా స్థాపించబడింది.

8.4 భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణ

1772లో కంపెనీ ప్రభుత్వం వారన్ హేస్టింగ్స్‌ను బెంగాల్ గవర్నర్‌గా నియమించి, పరిపాలనను పునర్వ్యవస్థీకరించమని ఆదేశించింది. అతని నియామకం హిందూ దేశంలో కంపెనీ పాలనలో ఒక కొత్త అధ్యాయానికి నాందీగా పరిణమించింది. వారన్ హేస్టింగ్స్ బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు పునాది వేశాడు. బ్రిటీష్ అధికార వ్యాప్తి విధానం అతని వారసులైన కారన్ వాలీస్, వెల్లస్లీ, లార్డ్ హేస్టింగ్స్, లార్డ్ డల్హౌసీలచే, కొనసాగబడింది.

8.4.1 వారన్ హేస్టింగ్స్ ఆక్రమణలు

బెంగాల్ గవర్నర్‌గా నియమింపబడిన వెంటనే వారన్ హేస్టింగ్స్ హిందూ దేశంలో బ్రిటీష్ పలుకుబడిని పెంపొందించడానికి ప్రయత్నించాడు. 1772లో అతడు బెనారస్ సంధి కుదుర్చుకొని కారా, అల్హాబాద్ ప్రాంతాలను అయోధ్య నవాబుకు ఇచ్చి 50 లక్షల రూపాయలు పుచ్చుకొన్నాడు. అతనికి అవసరమైనప్పుడల్లా, సైనిక సహాయం చేయడానికి గూడ కంపెనీ ప్రభుత్వం అంగీకరించింది.

అయోధ్యకు వాయవ్య సరిహద్దులో స్థిరపడిన రోహిల్లా ఆఫ్ఘన్‌లను హింసించాడను అపవాదు, వారన్ హేస్టింగ్స్ పై గలదు. రోహిల్ ఖండ్ ప్రజలు మహారాష్ట్రుల దాడులకు గురి అగుచుండేవారు. అందుకని వారి నాయకుడు హఫీజ్ రహమత్‌ఖాన్ అయోధ్య నవాబుతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. దాని ప్రకారం మహారాష్ట్రులకు వ్యతిరేకంగా తమకు సహాయ మొనర్చిన అయోధ్య నవాబుకు 40 లక్షల రూపాయలు యివ్వడానికి హఫీజ్ అంగీకరించాడు. 1773 సం॥లో మహారాష్ట్రులు రోహిల్ ఖండ్ నుంచి నిష్క్రమించారు. కాని షుజా తన సైన్యాలను పంపకపోయినా, అనుకొన్న ప్రకారం రోహిల్ ఖండ్ తనకు ఇవ్వవలసిన 40 లక్షల రూపాయలు ఇచ్చి తీరాలని పట్టుబట్టాడు. షుజా, వారన్ హేస్టింగ్స్ సహాయంతో రోహిల్ ఖండ్‌పై దండయాత్ర కొనసాగించి దాదాపు 20 వేల రోహిల్లాలను నిరాశ్రయులుగా చేశాడు. యుద్ధంలో హఫీజ్ రహమత్ ఖాన్ గూడా ప్రాణాలను పోగొట్టుకున్నాడు. రోహిల్ ఖండ్ అయోధ్యచే ఆక్రమింపబడింది.

వారన్ హేస్టింగ్స్ మహారాష్ట్రులపై గూడ తగు సమయాన్ని వెచ్చించాడు. 1761లో జరిగిన మూడవ పానిపట్ యుద్ధం, మహారాష్ట్రుల అధికారాన్ని పూర్తిగా క్రుంగదీసింది. 1772లో మాధవరావు మరణానంతరం, అతని తమ్ముడు నారాయణరావు పీష్వాగా ప్రకటింపబడెను. కాని అతని పినతండ్రి రఘోబా, నారాయణరావును చంపించి, పీష్వాగా ప్రకటించుకున్నాడు. కాని, మహారాష్ట్ర నాయకులు నానాఫర్నవీస్ నాయకత్వంలో రఘోబాను గద్దెదింపి రెండవ మాధవరావును పీష్వాగా ప్రకటించారు. బ్రిటీష్‌వారు రఘోబాకు మద్ధతును ప్రకటించిన కారణంగా మరాఠా యుద్ధం 1775లో ప్రారంభమైంది. మొదట మరాఠా నాయకులందరు పీష్వాకు మద్ధతునిచ్చారు. వారన్ హేస్టింగ్స్ బెంగాల్ నుంచి రెండు బ్రిటీష్ సైన్యాలను పంపాడు. అవి 1780లో

BRAOU

అహమ్మదాబాద్‌ను వశపరచుకొన్నాయి. బ్రిటీష్ సేనలు గ్వాలియర్‌ను కూడా ఆక్రమించాయి. సింధియా సంధి ప్రయత్నాలు కొనసాగించాడు. 1782లో సాల్బాయ్ సంధితో యుద్ధం ముగిసింది. బ్రిటీష్‌వారు రెండవ మాధవరావును పీష్వాగా గుర్తించారు. రఘోబాకు ఏటా మూడు లక్షల రూపాయలు భరణంగా ఒసగబడింది.

1766 సం॥లో తూర్పు ఇండియా సంఘం, హైదరాబాద్ నిజాంతో ఒక ఒడంబడిక కుదుర్చుకున్నది. దాని ప్రకారం బ్రిటీష్‌వారు మైసూర్ ప్రభువైన హైదరాలీకి వ్యతిరేకంగా, నిజాంకు సహాయం చేయాలి. ప్రతిగా, నిజాం బ్రిటీష్‌వారికి తన ఆధీనంలోని ఉత్తర సర్కారులను యివ్వాలి. నిజాంతో బ్రిటీష్ వారికి కుదరిన యీ ఒప్పందం హైదరాలీకి ఆగ్రహాన్ని కలుగజేసింది. మొదటి మైసూర్ యుద్ధంలో (1767-69) హైదరాలి తన షరతులను నిర్దేశించి, బ్రిటీష్‌వారితో సంధిచేసుకోగలిగాడు. కాని 1771లో హైదరాలి మహారాష్ట్రులచే ఎదిరింపబడినప్పుడు, బ్రిటీష్‌వారు ముందు మాట ప్రకారం సహాయం అందజేయలేదు. అందుచే అతడు బ్రిటీష్‌వారిని నమ్మటానికి నిరాకరించాడు.

హైదరాలి తనకు సహాయాన్ని నిరాకరించిన బ్రిటీష్‌వారిని ఎదర్కొనడానికి సమయం కోసమై నిరీక్షించాడు. అతడు అనేక ఫ్రెంచ్ జాతీయులను తన సైన్యంలో నియమించాడు. ఫ్రెంచి ఆయుధ సామగ్రిని తెప్పించాడు. తన సైన్యాన్ని పటిష్టం చేసి 1780లో బ్రిటీష్‌వారిపై యుద్ధం ప్రకటించాడు. యుద్ధ ప్రారంభంలో హైదరాలి బ్రిటీష్‌వారిపై కొన్ని విజయాలు సాధించి, కర్ణాటక తీరాన్ని ఆక్రమించుకొన్నాడు. 1782లో ముగిసిన మరాఠాయుద్ధం బ్రిటీష్ వారిని రక్షించిందని చెప్పవచ్చు. 1781 జులైలో సర్ ఐర్ కూట్ మైసూర్ సైన్యాలను పోర్ట్‌నోవా వద్ద ఓడించాడు. ఐనప్పటికీ హైదరాలి తన పోరాటాన్ని కొనసాగించాడు. 1782 డిసెంబర్ 7వ తేదీన హైదరాలి చిత్తూరుకు ఎనిమిది మైళ్ళ దూరంలోని నరసింగరాయుని పేట వద్ద పుట్టకురుపు వ్యాధితో హఠాత్తుగా మరణించాడు. అతని కుమారుడైన టిప్పు సుల్తాన్‌చే యుద్ధం కొనసాగించబడింది. 1784 మే నెల 11వ తేదీన రెండవ మైసూర్ యుద్ధం మంగళూరు సంధితో ముగిసింది. ఇరుపక్షాలు యుద్ధ సమయంలో ఆక్రమించుకొన్న ప్రాంతాలను తిరిగి అప్పజెప్పడానికి అంగీకరించారు.

8.4.2 కారన్ వాలీస్ - మూడవ మైసూర్ యుద్ధం, 1790-92

మంగళూరు సంధి బ్రిటీష్‌వారికి, మైసూర్ నవాబుకు మధ్య శాశ్వత శాంతిని ప్రసాదించ లేకపోయింది. బ్రిటీష్‌వారు టిప్పును ప్రథమ శత్రువుగాను, టిప్పు బ్రిటీష్‌వారిని తన స్వాతంత్ర్యానికి అవరోధకులుగాను, పరిగణించారు. కారన్ వాలీస్ నిజాంతోనూ, మహారాష్ట్రులతోను సంధికుదుర్చుకొని 1790లో మైసూర్ పై యుద్ధం ప్రకటించాడు. మద్రాస్ చేరుకొన్న గవర్నర్-జనరల్ స్వయంగా సైన్యాలను వెల్లూర్, చిత్తూర్, కోలార్ మీదుగా నడిపి బెంగళూర్‌ను ముట్టడించాడు. అనేక దుర్గాలను ఆక్రమించి, టిప్పు ప్రధాన నగరమైన శ్రీరంగపట్నాన్ని సమీపించాడు. గత్యంతరంలేని టిప్పు 1792లో సంధికి ఒప్పుకొన్నాడు. శ్రీరంగపట్నం సంధి ప్రకారం టిప్పు తన రాజ్యంలో సగభాగం యివ్వడానికి, 3 1/2 కోట్ల రూపాయలు నష్టపరిహారం క్రింద చెల్లించడానికి, తన ఇద్దరు కుమారులను జామీనులుగా పంపడానికి అంగీకరించాడు. బ్రిటీష్‌వారు మలబార్, కూర్గ్, దిండిగల్, బారామహల్ ప్రాంతాలను ఆక్రమించుకొన్నారు. మహారాష్ట్రులకు వాయవ్య ప్రాంతమందలి భూభాగం; నిజాంకు ఆయన రాజ్యానికి చేరువగా గల అనేక ప్రాంతాలు, మైసూరు నుంచి ఇవ్వబడినాయి. టిప్పు రాజ్యం చాలా కుదించబడింది. బ్రిటీష్‌వారి ప్రాబల్యం మిక్కిలి విస్తరించింది.

8.4.3 వెల్లస్లీ

గవర్నర్-జనరల్‌గా నియమించబడిన వెంటనే, లార్డ్ వెల్లస్లీ టిప్పుసుల్తాన్‌పై యుద్ధం చేయ నిర్ణయించినాడు. మూడవ మైసూర్ యుద్ధానంతరం టిప్పు బ్రిటీష్‌వారితో తలపడడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. వెల్లస్లీ నిజాం, మహారాష్ట్రులతో సంధి కుదుర్చుకొన్నాడు. స్వయంగా మద్రాస్ చేరి మైసూర్‌పై దండయాత్రకై సిద్ధమయ్యాడు.

BRAOU

మైసూర్, తూర్పు పడమరలవైపు నుంచి ఎదుర్కోబడింది. జనరల్ స్టువర్ట్ నాయకత్వం కింద బొంబాయి నుంచి ఒక సైన్యం, మద్రాస్ నుంచి జనరల్ హారిస్ క్రింద మరొక సైన్యం, వెల్లస్లీకి సహాయంగా పంపబడినాయి. మైసూర్‌కు చేరువగా గల మాలవెల్లి వద్ద జరిగిన ఒక పోరాటంలో, టిప్పు ఓడింపబడ్డాడు. దీనితో టిప్పు సంప్రదింపులకు దిగాడు. బ్రిటీష్‌వారు అతని రాజ్యంలో సగభాగ మిమ్మని, రెండు కోట్ల రూపాయలు చెల్లించమని కోరినారు. కాని అప్పటికే రాజ్యంలో అధిక భాగం కోల్పోయిన టిప్పు, యీ కఠిన షరతులను నిరాకరించాడు. వీరుని వలె పోరాడి మరణించడానికే నిర్ణయించుకున్నాడు. బ్రిటీష్ సేనలు, గవర్నర్-జనరల్ తమ్ముడైన ఆర్థర్ వెల్లస్లీ నాయకత్వంలో శ్రీరంగ పట్టణాన్ని ముట్టడించి టిప్పు సేనలు ఓడించాయి. ఈ ఆర్థర్ వెల్లస్లీ తర్వాత డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్‌గా ప్రసిద్ధిగాంచాడు గూడా. 1799 మే నెల 4వ తేది, టిప్పు యుద్ధ భూమిలో చంపబడ్డాడు.

మైసూర్ రాజ్యంలో అధికభాగం వెల్లస్లీ ఆక్రమించుకొన్నాడు. కెనరా, కోయంబత్తూర్, శ్రీరంగపట్నం మొదలైన ప్రాంతాలన్నీ బ్రిటీష్‌వారికి చేరాయి. హైదరాబాద్ నిజాం తన సహాయానికి ప్రతిఫలంగా అనేక ప్రాంతాలను పొందగలిగాడు. హైదరాలిచే పదవీచ్యుతులు గావించబడ్డ వొడయారు వంశానికి చెందిన, కృష్ణరాజ అనునొక బాలుని మైసూరు సింహాసనంపై కూర్చోబెట్టారు. ఉత్తర దేశంలో ప్లాసీ, బక్సర్ యుద్ధాల తర్వాత, మైసూర్ ఆక్రమణ బ్రిటీష్‌వారి అధికార విస్తరణకు మిక్కిలి దోహదం చేసింది.

టిప్పు మరణానంతరం, మహారాష్ట్రులు ఒక్కరు మాత్రమే బ్రిటీష్‌వారికి ప్రధాన శత్రువులుగా మిగిలారు. దాదాపు ఐదుగురు మహారాష్ట్ర నాయకులు సంఘటితంగా ఎదురు నిలిచారు. వారు పీష్వా, బరోడా గాయక్వాడ్, గ్వాలియర్ ఏలిక సింధియా; ఇండోర్‌కు చెందిన హొల్కార్, నాగపూర్‌కు చెందిన భోంస్లే. ఈ ముఠా కూటమికి నాయకుడు పీష్వా. కాని పదునెనిమిదవ శతాబ్దాంతానికి, మహారాష్ట్రులలో నాయకత్వపు విషయంలో పోటీలు ఏర్పడ్డాయి. రెండవ బాజీరావును, యశ్వంతరావ్ హొల్కార్, దౌలత్‌రావ్ సింధియాలు ఎదిరించారు. బాజీరావు బేసిన్‌కు పారిపోయి, బ్రిటీష్‌వారి సహాయాన్ని అర్థించాడు.

మహారాష్ట్రులలో అంతఃకలహాలు ఏర్పడడంతో వెల్లస్లీ వాటిని ఆసరాగా తీసుకొని, వారిని ఒక్కొక్కరిని ఓడించాడు. సింధియా భోంస్లే సైన్యాలను అస్సాయే యుద్ధంలో 1803లో ఓడించారు. వారు తమ ఆధీనంలోని అనేక ప్రాంతాలను బ్రిటీష్ వారికి అప్పజెప్పారు. అహమ్మద్‌నగర్, బ్రోచ్, గంగా - యమునల మధ్య ప్రాంతం కటక్, బాలాసోర్ మొదలైన ప్రాంతాలన్నీ బ్రిటీష్ వారికి దక్కాయి. రెండవ మరాఠా యుద్ధం, మహారాష్ట్రుల అధికారానికి పెద్దదెబ్బగా పరిణమించింది. దీనిలో వెల్లస్లీ, సైన్యసహకారం పద్ధతికి అంగీకరించమని హొల్కార్‌ను కోరాడు. దానికి నిరాకరించిన కారణంగా, 1804లో హొల్కార్‌పై యుద్ధం ప్రకటించాడు. ఆ విధంగా మూడవ మరాఠా యుద్ధం ప్రారంభమైంది. 1805లో వెల్లస్లీ స్వదేశానికి రప్పించబడడంచే హొల్కార్ అధికారం పూర్తిగా విచ్ఛిన్నం కాలేదు. 1806 సం॥లో రాజ్ ఘాట్ సంధివల్ల హొల్కార్‌తో శాంతి కుదిరింది.


8.4.3.1 సైన్య సహకార పద్ధతి

వెల్లస్లీ గవర్నర్-జనరల్ పదవీకాలంలో అతడు ప్రవేశ పెట్టిన సైన్యసహకార పద్ధతికి మిక్కిలి ప్రసిద్ధి చెందింది. భారతదేశంలోని స్వదేశీ రాజ్యాలను బ్రిటీష్‌వారి అధికారానికి లోను చేయుట, యీ పద్ధతి ప్రధాన ఆశయం. వారి రాజకీయ పలుకుబడి, అధికారం దీనిచే ఇనుమడించినాయి.

సైన్య సహకార పద్ధతి ప్రకారం దీనిని అనుసరించిన స్థానిక రాజ్యాలు తమ విదేశీ వ్యవహారాలను, బ్రిటీష్‌వారికి అప్పజెప్పాలి. యుద్ధాలు ప్రకటించుట నిషేధించబడింది. ఇతర రాజ్యాలతో సంప్రదింపులు చేయుటకు కంపెనీ అనుమతి పొందాలి. పెద్ద పెద్ద స్వదేశీ రాజ్యాలు కంపెనీ ఏర్పాటు చేయు సైన్యాల ఖర్చుకై కొంత భూభాగాన్ని ఇవ్వాలి. చిన్న రాజ్యాలు ఏటా కొంత ధనాన్ని యివ్వాలి. సంస్థానాధీశులు బ్రిటీష్ రెసిడెంట్‌ను స్వీకరించాలి. వారు ఏ యితర ఐరోపా వారిని తమ రాజ్యంలో నియమించరాదు. వారి అంతరంగిక విషయాలలో జోక్యం కల్పించుకొనదని, వారికి తగు రక్షణ కల్పించునట్లు వాగ్దానం చేసింది.

హిందూ దేశంలో బ్రిటీష్‌వారి అధికార విస్తరణకు సైన్య సహకార పద్ధతి దోహదం చేసింది. స్థానిక రాజ్యాలలోని సైన్యాలు రద్దు చేయబడ్డాయి. రాజులపై బ్రిటీష్ అధికారం స్థాపించబడింది. స్వదేశీ రాజుల

వ్యయంతో బ్రిటీష్ కంపెనీ పెద్ద సైన్యాన్ని రూపొందించగలిగింది. ఫ్రెంచ్‌వారి అధికారాన్ని భారతదేశంలో పెరగకుండ చేయడానికి, సైన్యసహకార పద్ధతి వినియోగింపబడింది. స్వదేశీ రాజుల అంతఃకలహాలకు కంపెనీ ప్రభుత్వం మధ్యవర్తి అయింది. అనేక ప్రాంతాలు, సర్వ అధికారాలతో బ్రిటీష్‌వారికి సంక్రమించాయి. కాని యీ సైన్య సహకారపద్ధతిచే స్థానిక రాజుల స్వాతంత్ర్యం పూర్తిగా నశించింది. బ్రిటీష్ రెసిడెంట్లు అంతరంగిక విషయాలలో జోక్యం కల్పించుకొంటూ పరిపాలనా విషయాలలో తలదూర్చుతూ స్థానిక రాజులకు కంటక ప్రాయమైనారు. బ్రిటీష్ సైన్యాధికారులకు పెద్ద జీత, భత్యాలుండిన కారణంగా సంస్థానాధీశులు అధిక ధనాన్ని వెచ్చించవలసి వచ్చింది. స్థానిక సైన్యాలు రద్దయిన కారణంగా సైనిక విద్యలు నేర్చి నిరుద్యోగులైన సైనికులు, దొంగతనాలు, దోపిడీలకు దిగి, ప్రజలకు భయాందోళనలు కల్పిస్తూ, అరాచకానికి కారకులైనారు.



హిందూ దేశంలో సైన్య సహకార పద్ధతికి అంగీకరించిన ముఖ్య రాజ్యాలు హైదరాబాద్ నిజాం, తంజావూరు రాజు, అయోధ్య నవాబు; పీష్వా, ఆర్కాట్ నవాబు; సింధియా, బీరార్ ప్రభువు; రాజపుత్ర నాయకులైన జోధ్‌పూర్, జైపూర్, భరత్‌పూర్ పరిపాలకులు మున్నగువారు.

8.5 హేస్టింగ్స్, 1813-23


వెల్లస్లీ తర్వాత 1813 వరకు కంపెనీ ప్రభుత్వం స్థానిక రాజుల విషయాలలో జోక్యం కల్పించుకొనలేదు. లార్డ్ హేస్టింగ్స్ గవర్నర్-జనరల్‌గా నియమింపబడిన తోడనే, యీ పద్ధతికి స్వస్తి చెప్పి, స్థానిక రాజుల విషయాలలో జోక్యం చేసికొన మొదలిడింది. 1816లో నేపాల్‌కు చెందిన గూర్ఖాలను శక్తివంతంగా అణచి, సగౌలి అను సంధిని కుదుర్చుకొన్నాడు.

1817 సం॥లో మహారాష్ట్రులు తాము కోల్పోయిన అధికారాన్ని తిరిగి పొందడానికై ప్రయత్నించారు. పీష్వా మరాఠా నాయకులను సమాఖ్యగా ఏర్పరచి, నవంబర్‌లో పూనాలోని బ్రిటీష్ రెసిడెంట్‌ను ఎదిరించాడు. మరాఠా సైన్యాలు ఓడించబడి; అందరు నాయకులు తమకు చెందిన భూప్రాంతాలను బ్రిటీష్‌వారికి పోగొట్టుకున్నారు. పీష్వా పదవి రద్దు చేయబడింది. అప్పటి పీష్వా బాజీరావుకు ఏటా 8 లక్షల రూపాయల భరణంగా ఇవ్వబడింది. హోల్కర్, భోంస్లే బ్రిటీష్‌వారి సైన్యాలను స్వీకరించవలసి వచ్చింది. మహారాష్ట్రుల అధికారం పూర్తిగా అణచబడింది. వారు తిరిగి తలెత్తలేకపోయారు.

8.6 డల్హౌసి రాజ్య సంక్రమణ సిద్ధాంతం

1848-1856 మధ్యకాలంలో గవర్నర్-జనరల్‌గా పనిచేసిన డల్హౌసి పరిపాలనా కాలం ప్రధానమైంది. భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య వ్యాప్తికి అతడు మిక్కిలి కృషి చేసినాడు. స్థానిక రాజ్యాలను ఆక్రమించుకోవడానికి ఆవగింజ మాత్రం అవకాశమున్న, దానిని జారవిడువని వాడు డల్హౌసి. మరుగు పడిన మొగల్ సామ్రాజ్యపు ముసుగుతొలగించి, భారత స్వతంత్ర రాజ్యాలను రద్దు చేయదలచాడు. బ్రిటీష్ పరిపాలన మిక్కిలి ఉదాత్తమైందని, స్వదేశీ ప్రభుత్వాలకన్నా మిన్నయని భావించినాడు. అందుచే సంస్థానాధీశులను తొలగించి భారతదేశాన్ని పూర్తిగా బ్రిటీష్ ప్రభుత్వం క్రిందకి తేవడానికి కృషి చేశాడు.

డల్హౌసి రెండు ప్రధాన యుద్ధాలను కొనసాగించాడు. అవి -రెండవ శిక్కు యుద్ధం; రెండవ బర్మా యుద్ధం. ఈ రెండు యుద్ధాలవల్ల, అధిక ప్రాంతం లభించుటయేగాక వ్యాపారాభివృద్ధి గూడ సాధ్యమైంది. సిక్కింపై ఒక దండయాత్ర గావించి హెచ్చు ప్రాంతాన్ని స్వాధీన పరచుకొన్నాడు. 1856లో అయోధ్యను ఆక్రమించుకున్నాడు. మొగల్ చక్రవర్తికి భరణాన్ని రద్దుగావించాడు. ఆర్కాట్ నవాబు బిరుదును తొలగించాడు. డార్జిలింగ్ రాజుకు చెల్లిస్తూ వచ్చిన అద్దెను నిలుపుదల చేశాడు. కప్పం సరిగా చెల్లించలేదను నెపంతో అతి సారవంతమైన బీరార్ రాష్ట్రాన్ని హైదరాబాద్ నిజాం నుంచి ఆక్రమించుకొన్నాడు.



కాని డల్హౌసీ గావించిన అనేక ఆక్రమణలు, తన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని అమలు పరచినందున సాధ్యమైనవి. ఈ సిద్ధాంతం ప్రకారం సంస్థానాధీశులకు పుత్రులులేని సందర్భాన, ఆ రాజ్యాలు దత్త కుమారులకు గాక, బ్రిటీష్ కంపెనీకి చెందుతాయి. దీనికి దత్తత స్వీకార రద్దు చట్టమని గూడ పేరు. డల్హౌసీ యీ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టిన ఆ సమయంలో, అనేక స్వదేశీ సంస్థానాధీశులు కుమారులు లేకుండా మరణించిన కారణంగా, బ్రిటీష్ అధికారం వడిగా వ్యాప్తి చెందింది. ఝాన్సి, సతారా, సంబల్‌పూర్, నాగపూర్, జైల్‌పూర్, భాగత్ ఉదయ్‌పూర్ వంటి అనేక సంస్థానాలు రాజ్య సంక్రమణ సిద్ధాంతానుసారం, బ్రిటీష్‌వారి అధీనమయ్యాయి. డల్హౌసీ తన సిద్ధాంతాన్ని అమలు పరచుటలో హిందూ మత భావాలను గాయపరుస్తున్నట్లుగా గాని, భారతీయ సాంప్రదాయాలను అగౌర పరుస్తున్నట్లుగా గాని, గుర్తించలేదు. అతని యీ ఆక్రమణలు, ప్రభువులందు, ప్రజలందు కల్పించిన ఆందోళన, అనుమానం తర్వాత 1857లో జరిగిన తిరుగుబాటుకు ఎంతైనా కారణమనవచ్చు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1) బక్సర్ యుద్ధానికి ప్రాముఖ్యత ఎందుకు లభించింది?

.....

.....

.....

.....

2) భారతదేశంలో, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని విస్తరింపజేయడానికి వెల్లస్లీ, డల్హౌసీలు పాటించిన విధానాలేవి?

.....

.....

.....

.....

.....

8.7 సంగ్రహంగా

1. ఐరోపాలో ఫ్రెంచి, ఆంగ్లేయుల మధ్య వున్న పోటీవల్ల భారతదేశంలో వారిద్దరి మధ్య యుద్ధాలు జరిగినాయి. వారు భారతదేశంలోని రాజకీయాలల్లో జోక్యం చేసుకోవడంవల్ల కూడ కర్ణాటక యుద్ధాలు జరిగినాయి.
2. మొదటి కర్ణాటక యుద్ధంలో ఫ్రెంచివారు జయించినారు.
3. రెండవ కర్ణాటక యుద్ధంలో ఫ్రెంచివారు ఓడిపోవడంవల్ల, ఫ్రెంచి ప్రభుత్వం డూప్లేను భారతదేశం నుంచి వెనక్కు పిలిచింది.
4. మూడవ కర్ణాటక యుద్ధంతో భారతదేశంలో ఫ్రెంచివారి ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది.
5. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం, 1764లో జరిగిన బక్సర్ యుద్ధం, భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్యానికి పునాది వేసినాయి.
6. వార్‌న్ హేస్టింగ్స్ కాలంలో, మొదటి రెండు మైసూర్ యుద్ధాలు, మొదటి ఆంగ్లేయ - మహారాష్ట్ర యుద్ధం జరిగినాయి. మూడవ మైసూర్ యుద్ధం, కారన్ వాలీస్ కాలంలో జరిగింది. వెల్లస్లీ కాలంలో నాల్గవ మైసూర్ యుద్ధం, రెండవ ఆంగ్లేయ - మహారాష్ట్ర యుద్ధం జరిగినాయి. ఆ యుద్ధాలన్నీ, భారతదేశంలో బ్రిటీష్‌వారి ఆధిపత్యాన్ని విస్తరింపజేసినాయి.
7. వెల్లస్లీ అవలంబించిన సైన్య సహకార పద్ధతి, డల్హౌసీ పాటించిన రాజ్య సంక్రమణ సిద్ధాంతం, బ్రిటీష్‌వారు తమ సామ్రాజ్య విస్తరణకు ఉపయోగించిన ఆయుధాలు.

BRAOU

8.8 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. భారతదేశంలోని రాజ్యాల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే విధానాన్ని డూప్లే ప్రారంభించాడు.

2. కర్ణాటక యుద్ధాలల్లో బ్రిటీష్‌వారి విజయానికి క్లైవ్ కారకుడు.

II. 1. బక్సర్ యుద్ధంలో విజయంవల్ల బెంగాల్, బీహార్, ఒరిస్సాలల్లో బ్రిటీష్‌వారి ఆధిక్యత ఏర్పడింది. ఆ యుద్ధం తర్వాత మొగల్ చక్రవర్తి రెండవ షా ఆలమ్‌తో జరిగిన ఒప్పందంవల్ల బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో శిస్తు వసూలు చేసే అధికారం బ్రిటీష్ వారికి లభించింది. అందువల్ల బక్సర్ యుద్ధానికి ప్రాముఖ్యత వుంది.

2. భారతదేశంలో బ్రిటీష్‌వారి ఆధిక్యత నేర్పరచడానికి వెల్లస్లీ కొన్ని యుద్ధాలు చేయడమే కాకుండా, సైన్య సహకారపద్ధతిని అవలంబించినాడు. డల్హౌసి కూడా సామ్రాజ్య విస్తరణ కొరకు యుద్ధాలు చేయడమే కాకుండా, రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని కూడా పాటించినాడు.

8.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. దక్షిణ ప్రాంతంలో ఆంగ్లో, ఫ్రెంచి సంఘర్షణ, దాని ఫలితాలను వివరించండి.
2. బెంగాల్‌పై బ్రిటీష్‌వారి ఆధిపత్యం గురించి వ్రాయండి.
3. 1857 వరకు భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణ గురించి వ్రాయండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. 18వ శతాబ్ద ప్రారంభంలో ఇండియాపై ఫ్రెంచి ఆధిపత్యాన్ని గూర్చి చర్చించండి.
2. ప్లాసీ, యుద్ధ ప్రాముఖ్యత, ఫలితాలు తెల్పండి.
3. వెల్లస్లీ సైన్య సహకార పద్ధతి గూర్చి క్లుప్తంగా వ్రాయండి.

8.10 ఉపయుక్త గ్రంథాలు

1. Anderson G : *British Administration in India*
2. Arnold, E : *Dalhousie's Administration of British India*
3. Aspinall, A. : *Cornwall is in Bengal*
4. Bairdwood, Sir George : *Dawn of British Trade to the East Indies*
5. Blunt, Sir Edward : *The Indian Civil Service*
6. Bruice, John : *Annals of East India Company*
7. Bipan Chandra : *Modern India*
8. Dodwell : *Cambridge History of Modern India*
9. Spear, Perceival : *History of India Vol.II*
10. ఝాన్సీ లక్ష్మి, పాటిబండ; వైదేహి, అల్లాడి : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయ భాగం, తెలుగు అకాడమి ప్రచురణ

BPRAOU

భాగం - 9 : కంపెనీ పరిపాలన, ఆర్థిక విధానం

విషయక్రమం

9.0 లక్ష్యాలు

9.1 పరిచయం

9.2 రెగ్యులేటింగ్ చట్టం, 1773

9.3 పిట్ ఇండియా చట్టం, 1784

9.4 పరిపాలనా వ్యవస్థ

9.4.1 సివిల్ సర్వీసులు

9.4.2 సైన్యం

9.4.3 పోలీస్ వ్యవస్థ

9.5 న్యాయ స్థానాలు

9.6 భూమిశిస్తు పద్ధతులు

9.6.1 జమీందారీ పద్ధతి

9.6.2 రైత్వారీ పద్ధతి

9.6.3 మహల్వారీ పద్ధతి

9.7 బ్రిటిష్‌వారి ఆర్థిక విధానాలు

9.8 సంగ్రహంగా

9.9 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

9.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

9.11 ఉపయుక్త గ్రంథాలు

9.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. రెగ్యులేటింగ్ చట్టం, పిట్ ఇండియా చట్టం
2. 1875 వరకు భారతదేశంలో బ్రిటీష్‌వారి పరిపాలనా వ్యవస్థ
3. 1857 వరకు భారతదేశంలో బ్రిటిష్‌వారు పాటించిన ఆర్థిక విధానాలు, భూమిశిస్తు.

9.1 పరిచయం

1765 సం॥ లో 'దివానీ' అధికారాలను గైకొన్న మీదట, బ్రిటీష్ కంపెనీ బెంగాల్‌లో ద్వంద్వపాలనను కొనసాగించింది. ఈ పద్ధతిలో బెంగాల్ గవర్నర్ భారతీయ అధికారులకు కంపెనీ తరపున పన్ను వసూలు చేయ అనుమతిచ్చాడు. దీనివల్ల స్థానికులకు అనేక ఇబ్బందులుండేవి. పన్ను వసూలుకై నియమింపబడిన అధికారులకు బాధ్యతలు వుండేవి. బాధ్యతలులేని కంపెనీ వ్యవస్థకు అధికారాలు వుండేవి. కంపెనీ ఉద్యోగులు అవినీతికి, లంచగొండితనానికి పాల్పడేవారు. వారు వ్యక్తిగతంగా వ్యాపారం కొనసాగించి అధిక ఆదాయం పొందేవారు. కంపెనీ ఆర్థిక స్థితి దిగజారి వుండేది. అప్పులు అధికంగా వున్నందున అభివృద్ధి కార్యక్రమాలేవి లేకపోయాయి. సైన్యం అనేక సందర్భాలలో ఆశించిన విజయాలను సాధించలేకపోయింది. ఇంగ్లండ్‌లో అనేకులు కంపెనీ పనిచేయు తీరుతెన్నులను విమర్శించారు. బ్రిటీష్ ప్రభుత్వం కంపెనీ పరిపాలనలో కొంత జోక్యం కల్పించుకొన్నగాని, అది సక్రమంగా వ్యవహరించదని వారు భావించారు.

BRAOU

9.2 రెగ్యులేటింగ్ చట్టం, 1773

భారతదేశంలో బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ నిర్వర్తించ వలసిన రాజకీయ బాధ్యతలను నిర్వహించడానికి దానిని ప్రభుత్వ అదుపులో వుంచడానికై పార్లమెంట్ 1772 సం॥లో రెగ్యులేటింగ్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం కంపెనీ పాలకవర్గమైన 'బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల' నియామకంలో మార్పులు చేయబడ్డాయి. వారు ప్రభుత్వ అధీనానికీ తేబడ్డారు. బెంగాల్ గవర్నర్, గవర్నర్-జనరల్‌గా వ్యవహరింపబడ్డాడు. అతని కౌన్సిల్‌లో నలుగురు సభ్యులుంటారు. మద్రాస్, బొంబాయి రాష్ట్రాలు గవర్నర్-జనరల్ అధికారానికి లోను చేయబడ్డాయి. కలకత్తాలో ఒక సుప్రీంకోర్టు స్థాపించబడింది. అందు, ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులు నియమింపబడినారు. ఉన్నతాధికారులందరి వార్షిక జీత భత్యాలు నిర్ణయించబడ్డాయి.

రెగ్యులేటింగ్ చట్టం అనేక విషయాలలో అసంపూర్ణమైన చట్టమని చెప్పవచ్చు. భారతదేశంలోని పాలనాధికారాన్ని అటు కంపెనీగాని, ఇటు బ్రిటీష్ ప్రభుత్వంగాని పూర్తిగా స్వీకరించలేదు. ఈ చట్టం మూలంగా సమర్థవంతమైన పాలనా ఏర్పాటు జరుగలేదు. గవర్నర్-జనరల్ అధికారాలు ఇదమిత్థంగా సూచించలేదు. అందుచే రెగ్యులేటింగ్ చట్టం కంపెనీ వ్యవహారాలను అనుకొన్న విధంగా క్రమబద్ధం చేయలేకపోయింది. ఈ లోపాలు వెంటనే తెలియవచ్చాయి.

9.3 పిట్ ఇండియా చట్టం, 1784

బ్రిటిష్ ప్రధానమంత్రియైన విలియం పిట్, రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను తొలగించడానికై, ఒక ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టాడు. ఇది 1784లో పిట్ ఇండియా చట్టమను పేరుతో అమలు జేయబడింది. క్రొత్త చట్టం, కంపెనీ డైరెక్టర్ల అధికారాలన్నిటినీ హరించింది. కంపెనీ పరిపాలనా విషయాలలో బ్రిటిష్ పార్లమెంటుకు ఎక్కువ అధికారాలు సంక్రమించాయి. ఆరుగురు కమీషనర్లతో కూడిన 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' స్థాపించబడింది. భారతదేశంలో పరిపాలనా విషయాలలో యీ బోర్డ్ అత్యున్నత స్థానాన్ని ఆక్రమించింది. గవర్నర్-జనరల్‌కు ఇతర గవర్నర్లపై పూర్తి అధికారం ఇవ్వడింది. అతని కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్య నాలుగు నుంచి మూడుకు కుదించబడింది. కంపెనీ వ్యాపారంపై గుత్తాధికారం కొనసాగించింది గాని పరిపాలనాధికారాలు కోల్పోయింది. 1813లో ఛార్టర్ చట్టం మూలంగా ఆ వ్యాపారాధికారం కూడా తొలగించబడింది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ నిజానికి పరిపాలనను పర్యవేక్షించింది.

BRAOU

9.4 పరిపాలనా వ్యవస్థ

రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం బెంగాల్ గవర్నర్, గవర్నర్ జనరల్‌గా చేయబడినాడు. 1784 లోని పిట్ ఇండియా చట్టం మూలంగా అతని అధికారాలు విస్తరించబడినాయి. 1833 సం॥లో బెంగాల్ గవర్నర్-జనరల్ "భారతదేశపు గవర్నర్ జనరల్" గా గుర్తించబడినాడు. కలకత్తా ప్రధాన నగరంగా కొనసాగింది. గవర్నర్-జనరల్‌కు ఒక కౌన్సిల్ ఏర్పాటు చేయబడింది. అందు సభ్యులను, మొదట కంపెనీ నియమించేది. తర్వాత, బ్రిటీష్ ప్రభుత్వమే నియమించేది. కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్య అప్పుడప్పుడు మారుతూ వచ్చింది.

9.4.1. సివిల్ సర్వీసులు

కంపెనీ పరిపాలన సివిల్ అధికారులపై, పోలీస్ విభాగాలపై, అధికంగా ఆధారపడుతూ వచ్చింది. దేశంలో వర్తకాన్ని అభివృద్ధి చేయుట, కంపెనీ ప్రధాన ఉద్దేశమైన కారణంగా, వస్తువుల రవాణాకై తగు శాంతి భద్రతలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చింది. మన దేశంలోని సివిల్ సర్వీస్ విభాగానికి పునాది వేసిన వాడు, లార్డ్ కారన్ వాలీస్. కంపెనీ అధికార్లు తీరిక సమయాల్లో కొనసాగించిన స్వంత వ్యాపారాన్ని రద్దుపరచి వారు

బహుమానాల రూపంలో తీసుకొనే లంచాలను రద్దు పరచాడు. వారికి మంచి జీతాలనిప్పించి, ఉద్యోగ నిబంధనలను మెరుగు పరిచాడు. పుట్టుకతో బ్రిటిష్‌వారు పాలకులని, హిందూదేశస్తులు కేవలం పాలింపబడు వారు మాత్రమేనని గూడ, కారన్ వాలీస్ బహిరంగంగా చెప్పేవాడు. పరిపాలనలో చిన్న చిన్న ఉద్యోగాలు మాత్రం భారతీయుల కిచ్చాడు. లార్డ్ వెల్లస్లీ భారతదేశంలోని బ్రిటిష్‌వారికి పరిపాలనా విషయాలలో తర్ఫీదును యివ్వడానికై, ఒక కళాశాలను ఏర్పాటు చేశాడు. 1806లో కంపెనీ డైరక్టర్లు ఇంగ్లండులో హైల్స్‌బరీవద్ద, తూర్పు ఇండియా కళాశాలను స్థాపించారు. ఇది, 1858 వరకు కొనసాగింది. హిందూ దేశంలో ఉద్యోగం చేయవలెననుకొన్న ప్రతి ఒక్కరు హైల్స్‌బరి కళాశాలలో చేరి, చదువవలెనను నియమముండేది. 1852 ఛార్టర్ చట్టం ప్రకారం, పోటీ పరీక్షలు నిర్వహించి, అందు ఉత్తీర్ణులైనవారికి మాత్రమే ఉన్నతోద్యోగాలు యివ్వబడ్డాయి. ఉద్యోగ విషయంలో బ్రిటిష్‌వారు స్థానికులను దూరంగా ఉంచారు. సర్ థామస్ మన్రో అన్నట్లు, *"హిందూ దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం స్థానికులను ఉద్యోగములనుంచి వెలివేసిన విధంగా మరే దేశంలోను జరిగినట్లు ఉదాహరణ గూడ లభించదు."*

9.4.2. సైన్యం

బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీకి మొదటినుంచి సైనిక సహాయం అవసరమైంది. ఇతర ఐరోపా వారి పోటీని ఎదుర్కోవడానికి సామ్రాజ్య విస్తరణ కార్యక్రమాన్ని కొనసాగించడానికి, సైనిక అవసరం ఎక్కువగా తోచింది. సైన్యంలోని ఉన్నతోద్యోగులు మాతృదేశం నుంచి వచ్చినవారైతే సైనికులందరు స్థానికులు. సైన్య సహకార పద్ధతివల్ల బ్రిటీష్‌వారు స్థానిక సైన్యాలను రద్దుచేసి, పాశ్చాత్య పద్ధతులలో క్రొత్త సైన్యాలను రూపొందించ వీలైంది. కీలకమైన ప్రాంతాలలో, బ్రిటీష్ సేనలు సమీకరించబడ్డాయి. దీనిచే సంస్థానాధీశులను తమ అధికారం క్రింద వుంచడానికి వర్తకాన్ని పరిరక్షించడానికి, కంపెనీ ప్రభుత్వానికి సులభతరమైంది. బ్రిటీష్‌వారి ఉప్పతిన్న కారణంగా భారతీయ సైనికులు వారికే చేదోడుగా వుండి, మనదేశంలోని స్వదేశీ రాజులతో జరిపిన పోరాటాలలో ఆంగ్లేయుల విజయాలకు పాటుబడిన సందర్భాలు కోకొల్లలు.

9.4.3 పోలీస్ వ్యవస్థ

పరిపాలనా యంత్రాంగానికి ప్రాధాన్యత ఇచ్చినట్లే, కంపెనీ పాలకులు పోలీస్ విభాగానికి గూడ ప్రాధాన్యత నిచ్చారు. ఉదాహరణకు కారన్ వాలీస్ శాంతి భద్రతల పరిరక్షణకై మొట్టమొదటి సారిగా పోలీస్ విభాగాన్ని ఏర్పరచాడు. సుమారు 20 చదరపు మైళ్ళకొక పోలీస్ ఠానాను స్థాపించి, ఒక్కొక్క ఠానాకు ఒక **'దరోగా'** అను పోలీస్ అధికారిని నియమించాడు. జిల్లా విభాగంలో పోలీస్ సంస్థను పర్యవేక్షించడానికి జిల్లా సూపరింటెండెంట్ నియమించబడ్డాడు. పోలీస్ వ్యవస్థలో గూడా ఉన్నత ఉద్యోగాల్లో ఐరోపీయులు మాత్రమే నియమించబడ్డారు. స్థానికులను అట్టి ఉద్యోగాలకు దూరంగా వుంచారు. హిందూ దేశంలో శాంతి భద్రతల బాధ్యత మిక్కిలి వ్యయ ప్రయాసలతో కూడుకొన్నదని కంపెనీ అధికారులు గుర్తించారు. లార్డ్ హేస్టింగ్స్ పిండారీలను నిర్మూలించాడు. విలియం బెంటింక్ అనుచరుడైన విలియం స్లీమాన్ సహాయ సహకారాలతో, 'ఠగ్గులు' అనే దొంగల ముఠాలను అణచగలిగాడు. 1858 తర్వాత పోలీస్ వ్యవస్థ ఎక్కువగా పునర్వవస్థీకరించ బడిన కంపెనీకాలంలోనే పోలీస్ విభాగాన్ని ప్రారంభించి, పటిష్టం చేయడం జరిగింది.

మధ్యయుగంలో సర్వ సాధారణంగా ఖైదు, అంగ విచ్ఛేదం, కొరడా దెబ్బలు మొదలైన శిక్షలు విధించబడేవి. కంపెనీ ప్రభుత్వం అట్టి శిక్షా విధానాలలో మార్పులు తెచ్చింది. కాని జైళ్ళ పరిస్థితులు సంతృప్తికరంగా వుండేవి కావు. ఖైదీలు మందలుమందలుగా ఆరోగ్య సదుపాయాలు లేని జైళ్ళలో మ్రగ్గుతుండేవారు. అనేక జైళ్ళు, గాలి, వెలుతురులేక, ఖైదీల ఉచ్చులుగా వుండేవి. అట్టి పరిస్థితులు 18వ శతాబ్దాంతానికి జజన్ హూవర్డ్ సూచించిన సంస్కరణ మేరకు, సవరించబడి అభివృద్ధి చెందాయి. జైలు కేవలం శిక్షను అమలు పరచు స్థలంగా మాత్రమే గాక, ఆత్మ విమర్శనానికి నడవడి, సంస్కారానికీ అనువైన స్థలంగా రూపొందబడ్డాయి. ఖైదీల భావిజీవితాలకు పనికి వచ్చు వృత్తి పనులు గూడ, జైళ్ళలో నేర్పడం ప్రారంభించబడింది.

BRAOU

9.5 న్యాయస్థానాలు

ప్రారంభంలో ఐరోపీయుల మధ్య ఉత్పన్నమైన తగాదాలను పరిష్కరించడానికై, విచారణ న్యాయస్థానాల స్థాపనతో కంపెనీ ప్రభుత్వం సంతృప్తిపడింది. 18వ శతాబ్ది ప్రారంభంలో మద్రాస్, బొంబాయి, కలకత్తానగరాలలో 'మేయర్ కోర్టులు' స్థాపించబడ్డాయి. బెంగాల్ కంపెనీకి 'దివాని' అధికారాలు సంక్రమించినప్పుడు, క్రిమినల్ న్యాయ విచారణాధికారం నవాబు అధీనంలో వదలి పెట్టబడింది. పన్ను వసూలు చేయు అధికారం, సివిల్ నేర విచారణ కంపెనీ చేపట్టింది. కాని, ఈ పద్ధతి కొద్ది కాలంలోనే సక్రమంగా పని చేయలేదని తేలిపోయింది. వారన్ హేస్టింగ్స్ అతనికి సహాయపడడానికి హిందూ, ముస్లిమ్ అధికార్లు నియమించబడినారు. చిన్న చిన్న ఫిర్యాదులకు ప్రత్యేక సబార్డినేట్ న్యాయాధిపతులుండేవారు. వీరిపై రాష్ట్రీయ న్యాయస్థానాలు; వాటిపై 'సాదర్ దివానీ అదాలత్' అనబడే కోర్టు స్థాపించబడింది.

రెగ్యులేటింగ్ చట్టం అమలు పరచబడిన పిదప ఒక సుప్రీం కోర్టు స్థాపించబడింది. అందు ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులుండేవారు. వీరందరు బ్రిటీష్ ప్రభుత్వంచే నియమింపబడేవారు. కాని సుప్రీంకోర్టులో ఏ చట్టాల్ని అనుసరించాలనేది ఇదమిత్థంగా తెలియజేయలేదు. ఐనా, ఇంగ్లీష్ చట్టాన్ని అందులో అనుసరించారు. దిగువ న్యాయస్థానాలలో మాత్రం హిందూ, ముస్లిం చట్టాలను రెండింటినీ అనుసరించారు. పరస్పర విరుద్ధ భావాల న్యాయవిధులతో యీ న్యాయస్థానాలు, చాలాకాలం వరకు కొనసాగాయి.

సివిల్, క్రిమినల్ న్యాయ చట్టాలను క్రోడీకరించుటకు, న్యాయస్థానాలను పునర్వ్యవస్థీకరించుటకు కంపెనీ ప్రభుత్వం చర్యలు గైకొన్నది. ప్రాక్, పశ్చిమాల న్యాయచట్టాలలో మేలైన వాటినన్నింటిని కొనసాగింప చేయటానికి 1833 సం॥లో ఒక ప్రత్యేక న్యాయవిషయాల సభ్యుడు, గవర్నర్-జనరల్ కౌన్సిల్‌లో నియమించబడ్డాడు. లార్డ్ మెకాలే ఆ విధంగా మొదటి న్యాయ సభ్యుడుగా వచ్చాడు. అతని చొరవ వల్లనే, శిక్షాస్మృతి, సివిల్, క్రిమినల్ చట్టాల క్రోడీకరణ జరిగింది. వీటి రచనా తీరును అనేకులు శ్లాఘించారు. క్రిమినల్ చట్ట క్రోడీకరణ గూర్చి సర్‌జాన్ స్ట్రాచె అనునతడు యీ విధంగా చెప్పినాడు. *''హిందూ దేశంలోని అన్ని చట్టాలలోను, దీనికన్న ముఖ్యమైనది ఏదీ లేదు. ఇది శాంతి సౌఖ్యాన్ని ప్రసాదించగల అధికార యంత్రాంగాన్ని క్రమబద్ధం గావించి నేరాలను తగ్గించి నేరస్థులను శిక్షించగలది''.*

బ్రిటిష్‌వారు హిందూ దేశంలో సమన్యాయం (Rule of Law), చట్టం ముందు అందరూ సమానులనే భావాన్ని కూడా ప్రవేశపెట్టారు. బ్రిటీష్ వారికి ముందు, మనదేశంలో న్యాయ పరిపాలనలో కులతత్వ విషయాలు ప్రధాన పాత్ర వహించాయి. అట్టి వ్యత్యాసాలను బ్రిటిష్‌వారు తొలగించారు. కాని బ్రిటీష్ న్యాయస్థానాలు మిక్కిలి వ్యయంతో కూడినవని నిరూపించబడింది. అవి కాలాపహరణకు సందిగ్ధతకు పేరు పొందాయి. ముఖ్యంగా బీద ప్రజానీకానికి బ్రిటీష్ న్యాయస్థానాలు పెద్ద అవరోధాలుగా రూపొందాయి.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1) రెగ్యులేటింగ్ చట్టము ప్రాముఖ్యతేమి?

.....

.....

.....

.....

BRAOU

2) పిట్ ఇండియా చట్టంవల్ల ఏ సంస్థకు, భారతదేశ వ్యవహారాలపై అధికారం లభించింది?

.....

.....

.....

.....

3) భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వానికి స్తంభాలుగా నిలచిన మూడు వ్యవస్థలు ఏవి?

.....

.....

.....

.....

9.6 భూమి శిస్తు విధానాలు

హిందూ దేశంలోని అనేక ప్రాంతాలను ఆక్రమించిన తర్వాత బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ అప్పుడు వాడుకలో నున్న భూమిశిస్తు విధానాన్ని కొద్ది మార్పులతో కొనసాగించింది. మనదేశంలోని పన్ను వసూలు విధానం బ్రిటీష్ అధికారులకు అవగాహనగుటకు కొంత సమయం అవసరమైంది. కాని వెంటనే వారు పన్ను వసూలు విధానంలోని ప్రాంతీయ వైవిధ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి అనేక రకాలైన పద్ధతులను అనుకూలమైన రీతిలో అనుసరించారు. మిక్కిలి ప్రధానమైన రెవిన్యూ పద్ధతులు మూడు. అవి 1. జమీందారి పద్ధతి లేదా శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి 2. రైత్వారీ విధానం 3. మహల్వారి పద్ధతి.

9.6.1 జమీందారీ పద్ధతి

1765లో బెంగాల్ రాష్ట్రంలో రెవిన్యూ అధికారాలు స్వీకరించిన పిదప, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ వారు పన్ను వసూలుకు అప్పటికి మొగల్ చక్రవర్తిచే నియమింపబడి యున్న అధికారులను కొనసాగింప చేశారు. ప్రతి ఏటా ఎస్టేట్లను వేలం పద్ధతిలో, అధిక ధనమును చెల్లించడానికి అంగీకరించిన వారికి గుత్తకి యిచ్చేవారు. కాని యీ పద్ధతిలో అనేక లోపాలుండిన కారణంగా వారన్ హేస్టింగ్స్ యీ పద్ధతిని తొలగించి, ఐదేండ్ల కొకసారి శిస్తు నిర్ణయించు పద్ధతిని ప్రవేశపెట్టాడు. కాని యీ పద్ధతి మాతృదేశంలోని అధికార్లకు నచ్చని కారణంగా రద్దు చేయబడి, తిరిగి ప్రతి ఏటా నిర్ణయించు విధానమే అనుసరించబడింది. 1786లో లార్డ్ కారన్ వాలీస్ హిందూ దేశానికి గవర్నర్-జనరల్‌గా వచ్చిన తోడనే, ఇచ్చటి పన్ను వసూలు వ్యవహారాలపై దృష్టిని మళ్ళించాడు. పి.ఇ. రాబర్ట్స్ అను చరిత్రకారుడు రాసినట్లు వ్యవసాయం, వ్యాపారం క్షీణించుచుండుటను, జమీందార్లు బీదరికంతో కృంగి పోవడాన్ని, వడ్డీ వ్యాపారులు మాత్రం సంపన్నులగుటను కారన్ వాలీస్ గమనించాడు. రెవిన్యూ వ్యవహారాలను పునర్వ్యవస్థీకరించుటకు ఖచ్చితమైన ఆదేశాలు పొందియుండిన కారన్ వాలీస్ 1790లో పదేండ్ల కొకసారి శిస్తు నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టాడు. కాని యీ పదేండ్ల కాలం పూర్తిగాక మునుపే కారన్ వాలీస్ 1793లో ఒక తేదీని శాశ్వత ప్రాతిపదికపై నిర్ణయించినట్లు ప్రకటించాడు, ఆ విధంగా కారన్ వాలీస్ చేత, జమీందార్లు పన్ను వసూలు చేయు ఏజంట్ల పదవి నుంచి భూమికి స్వంతదార్లుగా చేయబడినారు. వారు కట్టవలసిన శిస్తు శాశ్వతంగా నిర్ణయించబడింది.

కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన శాశ్వత శిస్తు నిర్ణయపద్ధతి, జమీందారులకు భూమిపై పరిమిత యాజమాన్యాన్ని కలుగజేసింది. జమీందార్ల నుంచి న్యాయవిచారణ, పోలీస్ అధికారాలను తొలగించింది. ప్రభుత్వానికి క్రమబద్ధంగా శిస్తు చెల్లించకపోయినచో, వారికి చెందిన భూములలో కొంత భాగాన్ని అమ్మి వారు కట్టవలసిన మొత్తానికి సరిపెట్టేవారు.

BRAOU

శాశ్వత శిస్తు నిర్ణయ విధానంవల్ల బ్రిటీష్ వారికి అనేక లాభాలు చేకూరినాయి. ప్రతి ఏటా తమకు వచ్చు రాబడి, బ్రిటీష్‌వారికి ముందే తెలుసుకొను వీలు ఏర్పడింది. దీనిచే తాము వెచ్చించవలసిన పద్దులను ముందే నిర్ణయించుకొన వీలైంది. ఈ పద్ధతి మూలంగా బ్రిటీష్‌వారికి మిక్కిలి విధేయులైన జమీందారీ వర్గం తయారైంది. వారు స్థానికులను అదుపులో వుంచి బ్రిటీష్‌వారి పరిపాలనకు, తోడ్పడుతు వ్యవహరించినారు. 1857 విప్లవ సమయంలో గూడ జమీందార్లు బ్రిటీష్ వారికి విధేయులై మెలగుట గమనార్హం. ఈ జమీందారీ విధానం, ప్రతి ఏటా శిస్తు నిర్ణయించు పద్ధతిలోని లోపాలను, దానివల్ల కలిగే వ్యయ ప్రయాసలను తొలగించింది. రెవెన్యూ వసూలుకై వుండిన బ్రిటిష్ అధికార్లు న్యాయ విషయాలపై శ్రద్ధ చూప వీలైంది.

శాశ్వత శిస్తు పద్ధతివల్ల ఎన్నో లోపాలున్నాయి. జమీందార్లు భూమికి సొంత దార్లయిన కారణంగా కౌలుదార్ల హక్కులు నిర్లక్ష్యం చేయబడ్డాయి. వారు భూస్వాముల, జమీందార్ల, దయాదాక్షిణ్యాలకు వదలి పెట్టబడినారు. శిస్తుగా ఎంత మొత్తాన్నైనా వారు వసూలు చేయవచ్చు. శిస్తు చెల్లించని రైతులను తొలగించు అధికారం వారికి వుండేది. భూముల అభివృద్ధికి అనుకొన్న విధంగా గాక, జమీందార్లు పెద్దగా శ్రద్ధ వహించలేదు. వారు ఎల్లప్పుడు నగరాలలో నివసిస్తూ, వ్యవసాయంపై అశ్రద్ధ చూపినారు. సూర్యాస్తమయ చట్టాల (Sunset Laws) వల్ల సక్రమంగా నిధులు చెల్లించని జమీందార్లు పదవి పోగొట్టుకొన్నారు. బెంగాల్ రాష్ట్రంలోని శిస్తు శాశ్వత ప్రాతిపదికపై నిర్ణయించబడిన కారణంగా, ఇతర రాష్ట్రాలైన బొంబాయి, మద్రాస్‌లలో సదా కట్ట వలసిన శిస్తు మొత్తాలను అధికం చేస్తూ వచ్చారు. బేడన్ పోవెల్ అన్నట్లు *"శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి అనేక ఆశలను వమ్ము చేసి, అనుకోని అనేక పరిణామాలను తెచ్చి పెట్టింది."* హెూమ్స్ అను చరిత్రకారుడు దీనిని గూర్చి, ఈ విధంగా వివరించాడు. *"శాశ్వత శిస్తు చట్టం, అతి దారుణమైన పొరబాటు. చిన్నతరహా కౌలుదార్లు దీని నుంచి ఎట్టి సౌకర్యాన్ని పొందలేదు. జమీందార్లు పలుమార్లు తాము కట్టవలసిన మొత్తాలను చెల్లించలేకపోవుట చేత వారి భూములు ప్రభుత్వానికి మేలు చేకూరు విధంగా అమ్మబడేవి".*

9.6.2 రైత్వారీ పద్ధతి

కారన్ వాలీస్ జమీందారీ విధానాన్ని ప్రవేశ పెట్టుటకు కారకుడు కాగా, రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టడానికి ప్రధానకారకుడు. సర్ థామస్ మన్రో. రైత్వారీ పద్ధతిలో వ్యక్తిగత రైతులతో, ప్రభుత్వం సరాసరి శిస్తును నిర్ణయిస్తుంది. ఈ పద్ధతి మొదట 1792లో సేలం జిల్లాలోని బారామహల్ ప్రాంతంలో, అప్పటి కలెక్టరైన కెప్టెన్ రీడ్‌చే ప్రవేశపెట్టబడింది. కాని ఇది అప్పుడు ప్రచారంలోకి రాలేదు. రీడ్‌కు సహాయక కలెక్టరైన థామస్ మన్రో దత్తమండలాల కలెక్టర్‌గా నియమించబడిన తర్వాత విజయవంతంగా అమలు పరచగలిగాడు. కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురం జిల్లాలు దత్తమండలాలుగా పేరు గాంచాయి. ఈ జిల్లాలకు థామస్ మన్రో మొదటి కలెక్టర్‌గా 1800 సం॥లో నియమింపబడినాడు.

మన్రో ఉద్దేశంలో రైత్వారీ విధానం, రైతుకు భూమిపై సొంతదారుకు మిక్కిలి ప్రధానమైన సంతృప్తిని కలిగించుటచే వ్యాపారాభివృద్ధికి దోహదం చేయును. ప్రభుత్వం రైతులతో సరాసరి ఒప్పందం చేసుకొని, శిస్తును నిర్ణయించింది. ఈ పద్ధతిలో భూమిని కొలుచు పద్ధతి తప్పనిసరిగా అమలు చేయబడింది. భూమి ఫలసాయాన్ని బట్టి నీటివసతి ననుసరించి భూమి శిస్తు నిర్ణయింపబడుతుంది. సర్వసాధారణంగా రైత్వారీ పద్ధతిలో 1/3 వంతు మించని శిస్తు విధింపబడేది. భూములపై పూర్తి అధికారం రైతులదే. వారికి పట్టాలను ఇచ్చి, యీ అధికారాన్ని సంక్రమింప జేసింది. మన్రో ప్రవేశపెట్టిన యీ రైత్వారీ పద్ధతి దత్త మండలాల నుంచి మద్రాస్ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు గూడ వ్యాప్తి చెందింది. తంజావూర్, కోయంబత్తూర్, దిండిగల్, మలబార్ ప్రాంతాలలో ఇది విజయవంతంగా అనుసరించబడింది.

9.6.3 మహల్వారీ పద్ధతి

పంజాబ్, ఆగ్రా, అయోధ్య మొదలైన ప్రాంతాలలో బ్రిటీష్‌వారు మహల్వారీ విధానమును మరొక రెవిన్యూ పద్ధతిని ప్రవేశపెట్టినారు. ఈ పద్ధతిలో ప్రభుత్వం, గ్రామ ప్రజల నుంచి నిర్ణీత మొత్తాన్ని భూమి

పన్నుగా నిర్ణయించేది. ఆ గ్రామ ప్రజలు పన్ను చెల్లించడానికి ఉమ్మడి బాధ్యతను కలిగి వుంటారు. ఇది అటు జమీందారీ పద్ధతికి, ఇటు రైత్వారీ విధానానికి మధ్యే మార్గం. ఇందు శిస్తు భారం అధికంగా ఉండని కారణంగా క్రమం తప్పక గ్రామస్థులు శిస్తు చెల్లించు అవకాశముండేది. "మహల్" అనగా 'సంస్థానం' లేదా 'ఎస్టేట్' అని అర్థం. గ్రామాన్ని గాని సంస్థానాన్ని గాని ప్రామాణికంగా తీసుకొన్న యీ పద్ధతికి 'మహల్వారి' అని పేరు వచ్చింది.

బ్రిటీష్‌వారి భూమి శిస్తు విధానాలు రైతులను మిక్కిలిగా బాధించాయి. కార్ల్ మార్క్స్ అన్నట్లు "జమీందారీ, రైత్వారీ విధానాలు, రెండూ వ్యవసాయికంగా విప్లవాత్మకమైనవి. అవి ఒకదానికొకటి విరుద్ధమైనవి. ఒకటి ప్రభువర్తన (Aristocratic) సంబంధమైంది; వేరొకటి ప్రజాస్వామికమైంది. ఒకటి బ్రిటీష్‌వారి భూస్వామ్య విధానానికి నిదర్శనం. మరొకటి, ఫ్రాన్స్‌లోని రైతుస్వామ్య పద్ధతి (Peasant-Proprietorship) కి ప్రతిబింబం. రెండూ కూడా పంటలు పండించు ప్రజలకై ఉద్దేశించబడినవి కావు. భూమిపై యాజమాన్య హక్కు కలిగి యుండు వారి సౌకర్యానికి గూడా కాదు; భూమిశిస్తు వసూలు చేయు ప్రభుత్వానికి మాత్రమే అవి సౌకర్యం. రైతులు అధిక శిస్తు చెల్లించాలి. వారు జమీందార్ల చెప్పుచేతలలో వుండి, ఊడిగాలు చేయాలి. రైత్వారీ ప్రాంతాలలోని రైతులకు గూడ కష్టాలు లేకపోలేదు. అచ్చట ప్రభుత్వం అధిక భూమిశిస్తు విధించేది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అట్టే చర్యలు గైకొనకపోవడం చేత ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు; లేదా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే వారు. క్రమేణా రైతులు ఋణ బాధలకు గురియైన కారణంగా వారి భూములు వడ్డీ వ్యాపారులకు సంక్రమించాయి. ప్రభుత్వం, భూస్వామి, వడ్డీవ్యాపారి అనే యీ మూడు బరువైన స్తంభాల క్రింద, రైతు నలగవలసి వచ్చింది. దీని ఫలితంగా రైతుల జీవనం బ్రిటీష్ కంపెనీ కాలంలో దయనీయంగా పరిణమించింది.

9.7 బ్రిటీష్‌వారి ఆర్థిక విధానాలు

1757లో ప్లాసీ యుద్ధం వరకు బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ కేవలం ఒక వర్తక సంఘంగా మాత్రమే కొనసాగింది. అది హిందూ దేశానికి వస్తువులను, ఖరీదైన లోహాలను తెచ్చి, అమ్మి, ఇచ్చట నుంచి అనేక వస్తువులను తీసుకు వెళ్ళి, ఇంగ్లండ్‌లోను ఇతర ఐరోపా దేశాలలోను అధిక ధరలకు అమ్మేవారు. బ్రిటీష్ కంపెనీ వ్యాపార కార్యక్రమాలు భారతదేశంలో వస్తువుల తయారీకి ప్రోత్సాహమిచ్చింది. కాని అట్టి భారతీయ వస్తువుల తయారీకి గల ప్రోత్సాహాన్ని, బ్రిటీష్ ఉత్పత్తిదారులు ప్రతిఘటించారు. హిందూ దేశ వస్తువులు ఇంగ్లాండ్‌లో గిరాకి పొందుట, వారికి కన్ను కుట్టింది. బ్రిటీష్ పార్లమెంటులో భారతదేశీయ వస్తువుల దిగుమతులను అరికట్టుతూ, అనేక చట్టాలు ప్రవేశపెట్టినా 18వ శతాబ్ది మధ్య భాగం వరకు భారతదేశ ఉత్పత్తులు ఇంగ్లాండ్‌లో బహుళ ప్రచారంలోనే కొనసాగినాయి.

బ్రిటీష్ కంపెనీ మనదేశంలో క్రమేణా రాజ్యాక్రమణలో ఆసక్తి చూపి 1757 తర్వాత రాజకీయ అధికార విస్తరణ గావించినందున వారి వ్యాపార సరళి గూడ గొప్ప మార్పులకు గురైంది. కంపెనీ ప్రభుత్వం తన రాజకీయ, సైనిక శక్తిని ఉపయోగించి భారతీయ ఉత్పత్తిదారులను తమ సరకులను తక్కువ ధరలకు బ్రిటీష్ వర్తకులకు ప్రాతమే అమ్మునట్లు నిర్బంధించింది. కంపెనీ ఉద్యోగులు నేతపని వారికి కొంత మొత్తాలను ముందుగా అప్పుల రూపంలో యిచ్చి వారిని పరోక్షంగా బంధించినారు. తన రాజకీయ అధికారాన్ని ఉపయోగించి, పోటీ వ్యాపారులను తొలగించగలిగింది. అట్టి చర్యలవల్ల, వస్తూత్పత్తిలో, అభివృద్ధి సాధించలేకపోగా, దేశీయ ఆదాయం, ఆర్థిక ప్రగతి బాగా కృంగిపోయినాయి.

పద్దెనిమిదవ శతాబ్దపు మధ్య భాగంలో ఇంగ్లాండ్‌లో సంభవించిన పారిశ్రామిక విప్లవం, క్రొత్త రకమైన ఉత్పత్తిదారుల విజృంభణకు దారి తీసింది. హిందూ దేశంలో వ్యాపారంపై కంపెనీకి మాత్రం గల గుత్తాధిపత్యం, వారికి నచ్చలేదు. 1813 లోని చార్టర్ చట్టం ప్రకారం కంపెనీ కలిగియున్న గుత్తాధికారం అంతమైంది. హిందూ దేశంలో వ్యాపారం చేయడానికి, ప్రతి బ్రిటీష్ పౌరునికి అవకాశం కలిగింది. భారతదేశం ఇంగ్లాండు అధీనంలో

BRAOU

నుండిన కారణంగా పారిశ్రామిక ఇంగ్లండుకు ఆర్థికంగా ఒక వలసగా మాత్రమే పరిగణింపబడింది. భారతదేశ ఆర్థిక విధానం బ్రిటీష్‌వారి అవసరాలకు అనుగుణంగా మార్చబడింది. అట్టి మార్పుల మూలంగా, భారతదేశంలోని పరిశ్రమలు దెబ్బతిన్నాయి. భారతీయ చేతిపనులు, గ్రామీణ పరిశ్రమలు, బ్రిటీష్‌వారి ఆర్థిక విధానాలచే ఏ విధంగా ధ్వంసమైనదీ, తర్వాతి పాఠాలలో చదువుతారు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1) భారతదేశంలో బ్రిటీష్‌వారి మూడు భూమి శిస్తు విధానాలేవి?

.....

.....

.....

.....

2) రైత్వారీ పద్ధతి ఎవరు ప్రవేశపెట్టినారు?

.....

.....

.....

.....

3) తూర్పు ఇండియా కంపెనీ వారి గుత్త వ్యాపారం ఎప్పుడు రద్దయింది?

.....

.....

.....

.....

9.8 సంగ్రహంగా

1. 1772లో ఏర్పడిన రెగ్యులేటింగ్ చట్టంవల్ల భారతదేశంలోని కంపెనీ పరిపాలన, బ్రిటీష్ ప్రభుత్వపు అధీనములోనికి వచ్చింది.
2. 1784, పిట్ ఇండియా చట్టంవల్ల, భారతదేశంలో ప్రభుత్వ వ్యవహారాలపై బ్రిటీష్ పార్లమెంటుకు, ఎక్కువ అధికారాలు ఏర్పడినాయి. ఆ చట్టంవల్ల, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు రద్దయి దాని స్థానంలో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఏర్పడింది.
3. భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వం, ఎక్కువగా ఉన్నత ఉద్యోగ వ్యవస్థ, పోలీస్, సైన్యంపై ఆధారపడింది.
4. బ్రిటీష్‌వారి అధీనంలో ఉన్న భారతదేశంలో జమీందారీ, రైత్వారీ, మహల్వారీ భూమి శిస్తు పద్ధతులు వుండినాయి.
5. 1813 చార్టర్ చట్టంవల్ల భారతదేశంలో తూర్పు ఇండియా కంపెనీ వారి గుత్త వ్యాపారము రద్దయింది. బ్రిటీష్ పరిపాలనవల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థ, బ్రిటీష్‌వారి ఆర్థిక వ్యవస్థకు అనుబంధ వ్యవస్థ అయింది.

9.9 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1) రెగ్యులేటింగ్ చట్టం భారతదేశంలో తూర్పు ఇండియా కంపెనీ వారి పరిపాలనపై బ్రిటీష్ పార్లమెంటుకు అధికారం ఏర్పడింది. అందువల్ల రెగ్యులేటింగ్ చట్టానికి ప్రాముఖ్యత వుంది.

BRAOU

2) 6గురు కమీషనర్లు వుండే బోర్డు ఆఫ్ కంట్రోల్ పిట్ ఇండియా చట్టంవల్ల ఏర్పడింది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల స్థానంలో ఏర్పడింది. నూతనంగా ఏర్పాటయిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌కు భారతదేశంలో కంపెనీ పరిపాలనపై అధికారం ఏర్పడింది.

3) భారతదేశములో బ్రిటీష్ ప్రభుత్వానికి ఉన్నత ఉద్యోగ వ్యవస్థ (సివిల్ సర్వీసెస్), పోలీస్ వ్యవస్థ, సైన్యం, స్తంభాలుగా నిలిచాయి.

II. 1) బ్రిటీష్ ఇండియాలో జమీందారీ, రైత్వారీ, మహల్వారీ వ్యవస్థలు ముఖ్యమైన భూమి శిస్తు విధానాలు.

2) రైత్వారీ వ్యవస్థను సర్ థామస్ మన్రో ప్రవేశపెట్టినాడు.

3) 1813 చార్టర్ చట్టంతో తూర్పు ఇండియా కంపెనీవారి గుత్త వ్యాపారం రద్దయింది.

9.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. 1857 కు పూర్వం భారతదేశంలో బ్రిటీష్‌వారి పరిపాలన వ్యవస్థ ముఖ్య లక్షణాలను వివరించండి.
2. కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు వివరించండి.
3. బ్రిటీష్‌వారు భారతదేశంలో ప్రవేశ పెట్టిన రెవెన్యూ పద్ధతులను వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. రెగ్యులేటింగ్, పిట్ ఇండియా చట్టాల గురించి వ్రాయండి.
2. భారతదేశంలో బ్రిటీష్‌వారి న్యాయపాలన వ్యవస్థ.
3. రైత్వారీ పద్ధతి.

9.11 ఉపయుక్త గ్రంథాలు

1. Anderson, G. : *British Administration in India*
2. Arnold, E. : *Dalhousies Administration of British India*
3. Aspinall, A : *Cornwallis in Bengal*
4. Blunt, Sir Edward : *The Indian Civil Service*
5. Bruice John : *Annals of the East India Company*
6. Dodwell, H.H. : *Cambridge History of India, Vol. V*
7. Dutt, R.C. : *Economic History of India Vol. I*
8. Mukherjee, Ramakrishna : *The Rise and Fall of East India Company*
9. Roberts, P.E : *History of British India*
10. Spear, Perceival : *History of India Vol. II*

BRAOU

భాగం -10 : 19వ శతాబ్ది ప్రథమార్ధంలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం

విషయక్రమం

10.0 లక్ష్యాలు

10.1 పరిచయం

10.2 కంపెనీ పాలనలో సాంఘిక, సాంస్కృతిక విధానాలు

10.3 పాశ్చాత్య విద్య

10.3.1 క్రైస్తవ మిషనరీలు

10.4 బెంగాల్‌లో సాంస్కృతిక పునరుజ్జీవనం

10.4.1 రాజా రామ్‌మోహన్ రాయ్ 1774-1833

10.4.2 సాంఘిక సంస్కరణలు

10.4.2.1 సతి

10.4.2.2 స్త్రీ విద్య

10.4.3 ఈశ్వర చంద్ర విద్యాసాగర్

10.5 మహారాష్ట్ర, దక్షిణదేశం

10.6 సంగ్రహంగా

10.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

10.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

10.9 ఉపయుక్త గ్రంథాలు

10.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల, ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. భారతదేశంపై పాశ్చాత్య విద్యా ప్రభావం,
2. హెన్రీ డిరోజియో, రాజా రామ్‌మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, జ్యోతిబ పూలే మొదలైన సంఘసంస్కర్తలు,
3. వారు ప్రచారం చేసిన సంఘసంస్కరణలు, సమాజం మీద వాటి ప్రభావం.

10.1 పరిచయం

బ్రిటీష్ పరిపాలనా స్థాపనతో, హిందూ దేశానికి పాశ్చాత్య దేశాలతో సరాసరి లంకె కుదిరింది. అందుచే పాశ్చాత్య దేశాలలో అభివృద్ధి చెందిన అధునాతన భావాలు హిందూ దేశానికి ప్రసరింప మొదలిడినాయి. భారతీయ వైజ్ఞానిక జీవితంలో గొప్ప మార్పులు సంభవించి ప్రజాస్వామ్యం, ప్రజల సార్వభౌమాధికారం, మానవతావాదం, శాస్త్రీయ ఆలోచనలు మొదలైన వాటిపై ఆసక్తి కలిగింది. ఈ కొత్త విషయాల పరిజ్ఞాన ప్రభావంవల్ల హిందూ దేశస్థులు వారి సాంఘిక ఆచారాలు, ఆర్థిక స్థితిగతులు, పాలనా యంత్రాంగంపై దృష్టి మళ్లించడమే గాక అట్టి క్రొత్త విజ్ఞానంచేత బ్రిటీష్‌వారి పరిపాలనా విధానం, వారి సామ్రాజ్య తత్వాన్ని గురించి గూడ మదింపు వేయ వీలుకలిగింది.

BRAOU

10.2 కంపెనీ పాలనలో సాంఘిక, సాంస్కృతిక విధానాలు

1813 సం॥ వరకు బ్రిటీష్‌వారు భారతీయ మత, సాంఘిక, సాంస్కృతిక జీవన విధానాలలో జోక్యం కల్పించుకొనే వారు కారు. బ్రిటీష్ కంపెనీ పాలకులుగా వచ్చిన కొంతమంది విశాల దృక్పథంతో భారతీయ ప్రత్యేకతను, వారి నాగరికత, సంస్కృతిని పరిరక్షించుట అవసరమని పాశ్చాత్య భావాలకు వాటిని మార్చగూడదని వారు భావించారు. విప్లవాత్మకమైన మార్పులు, ఆధునికీకరణ కార్యక్రమాలు, ప్రజల వ్యతిరేకతను మాత్రం రేకెత్తించునని వారు అభిప్రాయ పడ్డారు. కాని పారిశ్రామిక విప్లవం, ఆధునిక పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తర్వాత ఇంగ్లండ్‌లో కూడ క్రొత్త ఆలోచనలు ప్రబలినాయి. సత్యాన్వేషణ, శాస్త్ర విజ్ఞానం, తోటి మానవుల యెడ సానుభూతి మొదలగునవి, అట్టి క్రొత్త ఆలోచనలందు ప్రధానమైనవి. ఈ పద్ధతులకు మద్ధతు నిచ్చిన తీవ్రవాదులు అప్పటికి ప్రచారంలో, ఆచరణలో వున్న వర్ణ వ్యవస్థ, అంటరాని తనం, స్త్రీలు అధములను భావన మొదలైన సాంఘిక దురాచారాలతో రాజీపడ నిరాకరించారు. భారతదేశ సాంఘిక జీవనం అట్టి దురాచారాలనరికట్టి, ఆధునికీకరణ చెందవలెనని వారు గాఢంగా నమ్మి కృషి చేశారు. క్రైస్తవ మత ప్రచారానికి వచ్చిన మత ప్రచారకులు గూడ, అట్టి ఆధునికీకరణ కార్యక్రమాలను కొనసాగించారు.

హిందూదేశానికి, పాశ్చాత్య దేశాలతో సంబంధాలు ఏర్పడు నాటికి, ఐరోపా మార్టిన్ లూథర్, బేకన్, హ్యూమ్, హాబ్స్, బెంథామ్, టామ్‌పైన్ మొదలగు అనేక సంస్కర్తల ప్రభావానికి లోనైంది. ఫ్రెంచి విప్లవ ప్రధాన ఉద్దేశాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమును వాటిచే, ప్రభావితమైన కాలమిది. విద్యావంతులైన భారత దేశస్థులందరూ, అట్టి క్రొత్త ఆశయాలకు, భావాలకు ప్రభావితులైరి. పాశ్చాత్య సంప్రదాయాలచే ప్రభావితులైన అట్టి వర్గీయులు, సంఖ్యలో కొద్ది వారేయైనా, వారు దేశంలో సాంఘిక, రాజకీయ, మత సంస్కరణ ఉద్యమాలను కొనసాగించారు.

10.3 పాశ్చాత్య విద్య

19వ శతాబ్దారంభంలో జరిగిన జాతీయ పునరుజ్జీవనం, సాంఘిక ఆధునికీకరణ మున్నగునవి చాలా వరకు విద్యావిషయాలకు, సాంఘికాచారాలకు మాత్రమే పరిమితమైనాయి. కలకత్తాలో 1817 సం॥లో హిందూ కళాశాల స్థాపించబడింది. అది కేవలం ఉన్నత విద్యా కేంద్రంగా మాత్రమే గాక 19వ శతాబ్దంలో జాతీయ పునర్వికాసానికి కీలకమైన సంస్థగా పేరు పొందింది. ఆంగ్లభాషను బోధించడానికి, నూతన విద్యావ్యాప్తికై అనేక ఇతర విద్యాసంస్థలు స్థాపించబడ్డాయి. 1836లో కలకత్తాలోనే 6 వేలకు మించిన విద్యార్థులు ఆంగ్ల భాషను అభ్యసించుచుండేవారు.

19వ శతాబ్ది ప్రథమార్ధభాగంలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం పాఠశాలలోను, కళాశాలలోను, నవీన విద్యావిధానం అతి త్వరగా వ్యాప్తి చేయుటకు, బోధనా భాషగా ఆంగ్లభాషను ప్రవేశ పెట్టుటకు దోహదం చేసింది. ఇది బెంటింక్ గవర్నర్-జనరల్‌గా నున్న సమయంలో జరిగింది. ఆంగ్లభాష లేదా సంస్కృతాన్ని ఎన్నుకొనవలసి వచ్చింది. ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకొని బెంటింక్ నిర్ణయాన్ని గైకొన్నాడు. విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం ప్రధానంగా బోధనా విషయమగునని నమ్మి బెంటింక్ ఆంగ్లభాష అందుకు అనువైందని భావించినాడు. అనేక బ్రిటీష్ పాలకులు సంస్కృత భాషను "మరణించిన బాష" యని వర్ణించినారు. భారతీయ భాషలకు బెంటింక్ వ్యతిరేకిగాడు. అతడు స్థానిక భాషలను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టెను. కాని బెంటింక్ ఉద్దేశంలో ఆంగ్లభాషను కొద్దిమంది అధ్యయనం చేసినా, వారిమూలంగా పాశ్చాత్య పద్ధతులను, విలువలను భారతదేశంలో ప్రచారం చేయించ వీలగునని నమ్మినాడు. ఆంగ్లభాషను ప్రవేశపెట్టుటలో బెంటింక్‌కు మిక్కిలి సహాయపడిన వాడు న్యాయసభ్యుడైన లార్డ్‌మెకాలే. 1835 సం॥ ఫిబ్రవరిలో అతడు ఆంగ్ల భాషను ప్రవేశ

BRAOU

పెట్టుటపై తన అభిప్రాయాన్ని తెల్పుతూ ఈ విధంగా చెప్పాడు. *"రంగు రక్తంలో భారతీయులైనను, అభిరుచులలో, అభిప్రాయాలలో, నీతి నియమాలలో, బ్రిటీష్‌వారిగా వ్యవహరించు. ఒక ప్రత్యేక తరగతిగానుండు జనులను రూపొందించుటకు మనం శక్తి కొలది కృషి చేయవలెను, అట్టి తరగతి వారికి మనం క్రమేణా సామాన్య ప్రజానీకాన్ని ప్రభావితం చేసే కార్యక్రమాన్ని అప్పజెప్పవచ్చు."*

ఆంగ్లభాషా బోధనవల్ల ప్రభుత్వం సులభంగా గుమాస్తాలను పొందవచ్చని, బ్రిటీష్ వస్తువుల గిరాకి గూడ పెరుగుతుందని భావింపబడింది. ప్రముఖ భారతీయులైన రాజా రామ్‌మోహన్ రాయ్ వంటి వారు గూడా, పాశ్చాత్య విజ్ఞానం మూలంగానే భారతదేశం ముందంజ వేయునని భావించారు. అందుచే 1835లో బెంటింక్ ప్రభుత్వం ఆంగ్ల భాషను బోధనా భాషగా ప్రవేశ పెడుతూ ఉత్తర్వులను జారీచేసింది.

ఆంగ్ల విద్యా బోధనచేత, పరిపాలనా యంత్రాంగాన్ని నడపడానికి తగు సిబ్బందిని సులభంగా ఉత్పత్తి చేయడమే గాక, దానిచే విద్యావంతులైన భారతీయులు సమకాలీన పాశ్చాత్య భావాలకు, విజ్ఞానానికి చేరువ కాగలిగారు. దీనిచే పాశ్చాత్య సాంఘిక, సాంస్కృతిక భావాలు సులభంగా ప్రసరించి, హిందూ దేశస్థుల మనోభావాలను తీరుతెన్నులను అమితంగా ప్రభావితం చేసినాయి. ఇట్టి నూతన భావవికాసం మొదట బెంగాల్‌లో ప్రచారంలోకి వచ్చింది.

10.3.1 క్రైస్తవ మిషనరీలు

విలియమ్, విల్‌బర్ ఫోర్స్, చార్లెస్ గ్రాంట్, పాశ్చాత్యీకరణవల్ల, భారతదేశంలో క్రైస్తవమతవ్యాప్తి సులభమవుతుందనే వుద్దేశంతో దేశాన్ని పాశ్చాత్యీకరణ చేయాలని వాదించారు. చార్లెస్ గ్రాంట్ తూర్పు ఇండియా కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరక్టర్లకు అధ్యక్షుడు. క్రైస్తవమిషనరీలు ప్రారంభించిన పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలు కూడా దేశంలో ఆధునిక పరిస్థితులు నెలకొల్పడానికి తోడ్పడ్డాయి.

క్రైస్తవ మత ప్రచార కలాపాలు గూడ, సాంఘిక సంస్కరణలతో దగ్గరి సంబంధాలు కలిగి వుండినాయి. ఉన్నత కులాలకు చెందిన అనేక హిందూ కుటుంబాలు, క్రైస్తవ మతాన్ని గైకొని మార్గదర్శకులైనారు. బెంగాల్ ఆ విధంగా మత మార్పిడి చేసుకొన్న ప్రముఖులు బెంగాల్ 'రైతు జీవన' మను గ్రంథ రచయిత లాల్ బెహారిడె కలకత్తా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఐన కాళీ చరణ్ బెనర్జి మొదలగు వారు. బెంగాల్ ఆ సమయంలో యువకుల ప్రభావంతో పూర్తిగా క్రైస్తవమతం వైపు మొగ్గుతుందనిపించింది.

10.4 బెంగాల్‌లో సాంస్కృతిక పునరుజ్జీవనం

19వ శతాబ్దాంతంలో, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం, సనాతనపంథాల నుంచి వైదొలగాలనే దృఢ నిశ్చయులైన కొద్దిమంది విద్యాధిక మధ్యతరగతి వారిచే సంభవమైంది. బెంగాల్‌లోని అట్టి వైజ్ఞానిక వికాసానికి, కలకత్తాలోని హిందూ కళాశాల నాయకత్వం వహించిందని చెప్పవచ్చు. హెన్రీ లూయీ డిరోజియొ అను పోర్చుగీస్ జాతీయుడు 1826 సం॥లో ఆ కళాశాలలో ఉపాధ్యాయుడుగా నియమింపబడినాడు. సత్యం, అందం చాలా ప్రధానమైనవని భావించిన అతడు వాటిని పొందడానికై తన జీవితాన్ని కైంకర్య మొనర్చినాడు. అతని ఉత్కంఠత, నిజాయితీ, నిస్వార్థత విద్యార్థులను ఎంతో ప్రభావితం చేసినాయి. అనేక సనాతనులకు డిరోజియో కంటక ప్రాయమైనాడు. వారతనిని కళాశాలనుంచి తరిమివేయ ప్రయత్నించారు గూడ. అతడు "ది ఈస్ట్ ఇండియన్" అను నొక పత్రికను కలకత్తాలో స్థాపించి 1831లో తాను మరణించు వరకు నడిపాడు. ఆ పత్రికలో సనాతన పద్ధతులను విడనాడి, క్రొత్త విధానాలను అలవరచుకొనవలసిన అగత్యాన్ని వివరించాడు. హిందూ కళాశాలలో సమకాలీన యువకులను మిక్కిలి ప్రభావితం చేసిన మరొక ఉపాధ్యాయుడు డా. రిచర్డ్‌సన్.

BRAOU

పాశ్చాత్య విద్యావేత్తలైన వారిచేత బెంగాల్ విద్యా విషయంగా, అమిత ప్రాధాన్యతను సంతరించుకొని, తర్వాత అనేక సంవత్సరాల వరకు అట్టి ప్రాముఖ్యతను కలిగి వుండింది. ఉపాధ్యాయులు ఆ కోవకు చెందిన ఇతర మేధావులు, జాతీయతా వాదాన్ని తృణీకరించి, సనాతన హిందూ సంప్రదాయాలన్నిటిని వ్యతిరేకించి, భావస్వాతంత్ర్యాన్ని మాత్రం ప్రోత్సహించినారు. ఐరోపాలో రూపొందిన అన్ని ఉద్యమాలు, హిందూదేశంలో ప్రతిధ్వనించాయి. పి.బి. షెల్లీ, లార్డ్‌బైరన్ వంటి ఆంగ్లేయ కవులు భారతీయులను అమితంగా ఆకర్షించారు. మూఢ నమ్మకాలకు తమ అసమ్మతిని బాహ్యంగా తెలియజేశారు. స్వేచ్ఛ, సత్యాలకు, మతచట్టాల నుంచి విముక్తికి, ఆలోచనా స్వాతంత్ర్యానికి, వ్యక్తి గౌరవానికి, వారు ప్రాముఖ్యత నిచ్చారు. పాఠశాలలు, కళాశాలల్లో చర్చా వేదికల నేర్పరచి అందు విగ్రహారాధన యొక్క నిష్ప్రయోజకత, పూజారుల నిరర్థకత, సత్యం యొక్క పవిత్రత మున్నగు విషయాలను విద్యార్థులు చర్చించు అవకాశాలను కలుగజేసినాయి. అనేక సందర్భాలలో వారు సనాతన బ్రాహ్మణ గృహాలలో ఆవు మాంసాన్ని విసరడం, ఇస్లాం మతానికి మత మార్పిడి ఐనట్లు డ్రామాలు వేయడం, సాగించారు. సాంఘిక సంస్కరణకు బెంగాల్ విద్యార్థులు అమిత ఆసక్తి చూపారు.

10.4.1 రాజా రామ్‌మోహన్ రాయ్, 1774-1833

పాశ్చాత్య భావ వ్యాప్తిలో ప్రభావితులైన విద్యాధిక యువకులు బెంగాల్‌లో తెచ్చిన వికాసం కన్న, వారు సంఘంలో తెచ్చిన మార్పు మిక్కిలి ప్రధానమైంది. వారి కార్యకలాపాల ప్రధాన ఫలితాలు, ఆ రోజులలో కొనసాగిన సాంఘిక మత సంస్కరణలలో 19వ శతాబ్ద ప్రథమార్ధభాగంలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం ప్రధానంగా ప్రతిఫలించినాయి. భారతీయ జాతీయ భావనా విధానాన్ని మధించిన నాయకులలో మిక్కిలి ప్రధానమైనవాడు రాజా రామ్‌మోహన్ రాయ్.

రామ్‌మోహన్ రాయ్ నవీన భారతదేశపు ప్రథమ నాయకుడుగా, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పితామహుడుగా గుర్తింపబడినవాడు. అతడు స్థాపించిన బ్రహ్మసమాజం, తిరుగుబాటుకు సంకేతమైంది. అతనిది ఐరోపాలో ప్రారంభమైన మత సంస్కరణోద్యమం వంటిది. **"బ్రహ్మసమాజం - స్వాతంత్ర్యానికి యుద్ధం"** అన్న గ్రంథంలో బిపిన్ చంద్రపాల్ వ్రాసినట్లు, *"ప్రాచీన వేదాలు నిర్వచించు వ్యక్తిగత అధికారాన్ని సమర్థించిన రామ్‌మోహన్ రాయ్, వాటియొక్క గొప్పతనాన్ని కాదనలేదు. ఏది మంచి, ఏది చెడు అన్న విషయ నిర్ణయంలో, వ్యక్తి మనస్సాక్షిని గూడా అతడు వ్యతిరేకించలేదు. అతడు నిజానికి, ప్రాచీన పవిత్ర గ్రంథాలతో వ్యక్తి హేతుకతను, వ్యక్తి అంతరాత్మతో సాంఘిక అధికారాన్ని, రాజీకుదర్చ కృషి చేశాడు."*

అందుచే రామ్‌మోహన్ రాయ్ మతాన్ని త్యజించినట్లుగాని, మతానికి ఎదురు తిరిగినట్లుగాని, చెప్పడానికి వీలులేదు. అతడు గాని, అతనిచే స్థాపించబడిన బ్రహ్మసమాజంగాని కోరినదల్లా, ప్రాచీన వైదిక మతాన్ని పునరుద్ధరిస్తూ పురోహితుల అధికారాన్ని వారు మత గ్రంథాలకు ఇచ్చిన వివరణల తీరును త్రోసి పుచ్చడం. మతం పేరుతో హిందూ మతంలోనికి చొచ్చుకొని వచ్చిన దురాచారాలను రూపు మాపడానికై ఉద్దేశించబడిన ఒక ఉద్యమమది. మధ్యయుగంలో అనుసరించబడిన మత సిద్ధాంతాలకు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా బయలుదేరిన తిరుగుబాటు ఉద్యమం. అందుచే బ్రహ్మసమాజ ప్రధాన ఉద్దేశం, సాంఘిక సంస్కరణను సాధించడం. రామ్‌మోహన్ మరణానంతరం దేవేంద్రనాథ ఠాకూర్ ఆధ్వర్యంలో బ్రహ్మసమాజం ఒక మతసంస్థగా మార్పు చెందింది. తర్వాతి నాయకుడైన కేశవ చంద్రసేన్ మరొక అడుగు ముందుకు వేసి, పూజా విధానాలు, సాంఘిక నిషిద్ధాల నుంచి మానవ ప్రవర్తనకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించుట, బ్రహ్మసమాజ ప్రధాన ఉద్దేశమని ప్రకటించినాడు.

19వ శతాబ్దంలో సంభవించిన పునరుజ్జీవనంలో రామ్‌మోహన్ రాయ్ ప్రధాననాయకుడైనా, అతని నన్నుసరించిన ఇతర నాయకులెందరో గలరు. వారిలో ద్వారకానాథ్ ఠాకూర్, ప్రసన్న కుమార్ ఠాకూర్, నందకుమార్ బోస్, తారాచంద్ చక్రవర్తి, కాశినాథ మున్షి, చంద్రశేఖర్ దేబ్ ముఖ్యులు. వారు వివిధ కులాలకు, తరగతులకు చెందినవారు. రామ్‌మోహన్ రాయ్, అతని అనుచరులు తెచ్చిన యీ క్రొత్త ఉద్యమానికి, సనాతన వర్గీయులు

BRAOU

కలత చెందారు. వారు పోటీ ఉద్యమాన్ని వెంటనే లేవదీశారు. దానికి 'ధర్మసభ' మత సిద్ధాంతాలను విమర్శల నుండి కాపాడడానికి ఉద్దేశించబడింది. కాని ఇది కొద్ది కాలానికి అంతరించిపోయింది. విద్యాధికులైన మధ్య తరగతి ప్రజలు ఏకాకిగా నిలబడక, సాంఘిక శక్తిగా రూపొందించారని ఇది బుజువు చేసింది.

10.4.2 సాంఘిక సంస్కరణలు

10.4.2.1 సతి

సాంఘిక సంస్కరణోద్యమం కూడా మధ్య తరగతికి చెందిన విద్యావంతులచే బెంగాల్‌లోను, దక్కన్ జిల్లాలోను బొంబాయి, మద్రాస్ రాష్ట్రాలలోను కొనసాగించబడింది. సతీ సహగమనం 1829 సం॥లో గవర్నర్ జనరల్ బెంటింక్‌చేత రద్దు చేయబడింది. కాని ఇది అప్పటికే గాఢంగా వ్యాపించిన ప్రజాభిప్రాయంచేత వీలైందని చెప్పక తప్పదు. అందుచే ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని అనుసరించింది గాని, మార్చలేదు. సతీ సహగమనాన్ని రద్దుచేయడాన్ని బెంగాల్ ప్రజలు మనస్ఫూర్తిగా హర్షించారనడమే, వారు అట్టి సాంఘిక దురాచారాన్ని నిరసించారనుటకు నిదర్శనం. సతీ సహగమనం బెంగాల్‌లో ఉన్నంత విపరీతంగా బొంబాయి, మద్రాస్ రాష్ట్రాలలో వ్యాపించి యుండలేదు. కాని 1830లో పై రాష్ట్రాలలో గూడ, అట్టి దురాచారాన్ని అరికట్టడానికై చట్టం చేయబడింది. స్థానిక రాజులు గూడ బ్రిటీష్ ప్రభుత్వ చట్టాన్ని ఉదాహరణగా తీసుకొని, సతీ సహగమనాన్ని తమ రాజ్యాలలో రద్దు చేయడానికి చర్యలు గైకొన్నారు.

10.4.2.2 స్త్రీ విద్య

పాశ్చాత్య ప్రభావం చేత మధ్యతరగతి విద్యాధిక యువకులు భారతీయ స్త్రీలు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి కంకణం గట్టుకొని, వారికి తగు విద్యా సౌకర్యాలకై, వితంతు వివాహాల ప్రోత్సాహానికి, బహుభార్యాత్వమును నిషేధించుటకు పాటుబడిరి. స్త్రీల విద్యావ్యాప్తి విషయంలో క్రైస్తవ మిషనరీలు మొదట చాలా శ్రద్ధ వహించారు. కాని వారు స్థాపించిన పాఠశాలలు కేవలం క్రింది తరగతి బాలికలను మాత్రమే ఆకర్షించగలిగాయి. అట్టి పాఠశాలలు, బాలికలను క్రైస్తవ మతానికి మార్పిడిని ప్రోత్సహించుచుండిన కారణంగా, అవి ఎక్కువ ఆదరణ పొందలేదు. అందుచే క్రొత్త మధ్యతరగతి రంగంలోనికి దిగకముందు, స్త్రీ విద్య చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించలేదు. 1826 సం॥లో రాజాబైద్యనాథ్ రాయ్ కేంద్రీయ బాలికల పాఠశాల స్థాపనకై 20,000 రూపాయల విరాళం ప్రకటించినాడు. పండిత గౌరీ మోహన విద్యాలంకార్ అనునతడు స్త్రీ విద్యకు బెంగాల్‌లో గణనీయమైన సేవచేశాడు. అతడు కలకత్తాలోని ఆంగ్లేయ స్త్రీలచే, ఉన్నత కుటుంబ భారతీయ స్త్రీలకు, బాలికలకు, వారి వారి గృహాలలో ప్రత్యేకంగా బోధించు ఏర్పాట్లు గావించినాడు. కాని బెంగాల్ స్త్రీ విద్యా వ్యాప్తికి ప్రముఖంగా పాటుబడిన వ్యక్తి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అని చెప్పవచ్చు.

10.4.3 ఈశ్వరచంద్ర విద్యాసాగర్

భారతీయ సంఘాన్ని సంస్కరించడానికి పాటుబడిన నాయకులలో రామ్‌మోహన్ రాయ్ తర్వాత చెప్పుకొనదగినవాడు ఈశ్వరచంద్ర విద్యాసాగర్. అతడు సంస్కర్త మాత్రమే గాక గొప్ప పండితుడు. 1820 సం॥లో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన విద్యాసాగర్, అనేక ఇబ్బందులకు లోనై చదువుకొన్నాడు. అతడు ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణాధికారిగా నియమింపబడి కొద్దికాలం తర్వాత కలకత్తాలో సంస్కృత కళాశాలలో ప్రిన్సిపాల్‌గా నియమింపబడ్డాడు. అతడు పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్నవాడు. అందుచే రెండు సంస్కృతులలోని మేలిమికి, విద్యాసాగర్ ప్రాతినిధ్యం వహించాడనవచ్చు.

సాంఘిక సంస్కరణ విషయంలో, విద్యాసాగర్ తీసుకొన్న శ్రద్ధ, చేపట్టిన కృషి, మిక్కిలి వైవిధ్యం గలవి. కాని అతడు భారతదేశంలో స్త్రీల అభ్యుదయానికి చేసిన సేవ అతి ప్రధానమైంది. వితంతు వివాహ చట్టానికి అతడు అందరికన్న మిన్నగా కారకుడయ్యాడు. దానికై విద్యాసాగర్ ఒక శక్తివంతమైన ఉద్యమాన్ని నడిపాడు. అతని చొరవ మూలంగా 1856లో వితంతు పునర్వివాహాన్ని చట్టబద్ధం గావిస్తూ, ప్రభుత్వమొక ఉత్తర్వును జారీ చేసింది. విద్యాసాగర్ అనేక బాలికల పాఠశాలలను స్థాపించి, స్త్రీవిద్యకు అమితంగా దోహదం గావించాడు.

శిశు వివాహమను దురాచారం, తమ కుమార్తెలను ధనవంతులైన వృద్ధులకిచ్చి వివాహం చేయు పద్ధతిని రామ్‌మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రామ్‌నారాయణ్, తారక రత్న మొదలైనవారు ఎదిరించారు. 1855 సం॥లో బర్ద్వాన్ మహారాజు శాసన సమితికి ఒక వినతి పత్రాన్ని సమర్పించి, అందు బహుభార్యాత్వమను దురాచారమును మాన్ప వలసినదని విజ్ఞప్తి చేశాడు. 1857 సం॥లో దాదాపు 20 వేల మంది సంతకాలతో కూడిన వినతి పత్రాలు ప్రభుత్వానికి సమర్పించి, అట్టి దురాచారాన్ని మాన్పమని ప్రజలు విజ్ఞాపనలు చేశారు. ప్రభుత్వం అట్టి చట్టమనేదే తీసుకు రాకపోయినా, ప్రజాభిప్రాయం అట్టి దురాచారానికి వ్యతిరేకంగా వ్యక్తీకరింపబడిన కారణంగా, అది తానంతట అదే అదృశ్యమైంది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1) 'యంగ్ బెంగాల్' ఉద్యమాన్ని ప్రారంభించినదెవరు?

.....

.....

.....

.....

2) 1829లో చట్టరీత్యా సతీసహగమనాన్ని రద్దుచేయడానికి బెంటింక్‌కు తోడ్పడిన పరిస్థితులేవి?

.....

.....

.....

.....

10.5 మహారాష్ట్ర - దక్షిణ దేశం

పాశ్చాత్య భావాల ప్రభావం, సంస్కరణాభిలాష, బెంగాల్‌కు మాత్రమే పరిమితమై యుండలేదు. మత, సాంఘిక సంస్కరణోద్యమాలు పశ్చిమ భారతదేశంలో కూడా కొనసాగినాయి. బొంబాయి రాష్ట్రంలో అట్టి ఉద్యమాల నాయకులు, ధనవంతులైన వ్యాపారులు, ఆంగ్ల విద్యనభ్యసించిన మధ్య తరగతి యువకులు.

ఆంగ్ల విద్యాబోధనా వ్యాప్తికి బొంబాయి రాష్ట్రంలో ప్రభుత్వాధికారులు చొరవ తీసుకొన్నారు. గవర్నర్ వెల్లింగ్‌టన్ అనేక విద్యాసంస్థలను స్థాపించాడు. ఉన్నత వర్గాల హిందువులు, పార్శీలు ఆంగ్ల విద్యను అభ్యసించి ఆధునిక ఆలోచనలకు ఆకర్షింపబడ్డారు. 1840 సం॥ నాటికి బొంబాయిలో ఎల్ఫిన్‌స్టన్ కళాశాల, పూనాలో హిందూ కళాశాల స్థాపించబడ్డాయి. మూడు ప్రభుత్వ ఆంగ్ల పాఠశాలలు, దాదాపు 115 ప్రభుత్వ మండల పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా స్థాపించబడ్డాయి. 1855 సంవత్సరం నాటికి, రాష్ట్రం విద్యారంగంలో ఎంతో అభివృద్ధిగాంచి, అప్పటికి స్థాపించబడిన పాఠశాలల్లో పని జేయడానికి కావలసిన ఉపాధ్యాయులు లభ్యమైనారు.

బొంబాయి రాష్ట్రంలోని పలుకుబడిగల స్థానికుల సహకారం పొందటానికై, ప్రభుత్వ విద్యా విధానం రూపొందింది. బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన విద్యావిధానం వల్ల అత్యంత ప్రయోజనం పొందినవారు, ఉన్నత కులస్థులు. బొంబాయి నగరంలో ఆంగ్ల విద్యకు మొదట ఆసక్తి చూపిన వారు పార్శీలు, మహారాష్ట్ర ప్రాంతంలో చిత్పవన్ బ్రాహ్మణులు, బొంబాయి నగరంలో పార్శీలు, అహమ్మదాబాద్ నగరంలో గుజరాతీ హిందువులు, పాశ్చాత్య విద్యావసరాలను గుర్తించి, ఆంగ్ల భాషాధ్యయనాన్ని గావించారు. వారు ఇతర వర్గాల ప్రజలలో ఆంగ్ల భాషా వ్యాప్తికి గూడా కారకులైరి. అట్టి ప్రచారకులలో ముఖ్యులైన బాల్‌శాస్త్రి జంభేకర్ 'బాంబేదర్పణ్'

BRAOU

అను మొదటి ఆంగ్లో మరాఠా వారపత్రికను స్థాపించి, భారతీయులకు పరిపాలనలో ప్రాతినిధ్యానికై పోరాడుతూ బ్రిటీష్‌వారి పాలనా విధానాన్ని ధైర్యంగా విమర్శించాడు. రామకృష్ణ విశ్వనాథ్, మరాఠి భాషలో భారత ప్రజలకు సన్నిహితులుగా వుండవలసిన అవసరాన్ని తెలియ జేశాడు. "ప్రభాకర్"అను పత్రికకు వ్యాసాలు వ్రాసిన గోపాల హరిదేశ్‌ముఖ్, భారతదేశం స్వాతంత్రాన్ని కోల్పోవడానికి గల కారణాలను వివరించాడు.

పాశ్చాత్య విద్యా వ్యాప్తితోబాటు, మత, సాంఘిక సంస్కరణోద్యమాలు గూడ ప్రబలినాయి. 1849 సం॥లో స్థాపించబడిన పరమహంస మండలి ఏకేశ్వరోపాసనను సమర్థించి, కులతత్వాన్ని గర్హించింది. విజ్ఞానశాస్త్రాన్ని వ్యాప్తి చేయడానికి, స్త్రీ విద్యకు ప్రాధాన్య మివ్వడానికి, అనేకసంఘాలు ప్రారంభించబడినాయి. జ్యోతిబా పూలె, విష్ణుశాస్త్రి పండిత్, అనువారు వితంతు వివాహ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సంఘ సంస్కర్తలు, విద్యావేత్తలు భారత సమాజాన్ని పాశ్చాత్య పద్ధతిలో, మానవ విలువల ప్రాధాన్యతతో పునర్నిర్మాణం గావించ తలచారు.

బెంగాల్, బొంబాయి రాష్ట్రాల్లోవలె మద్రాస్‌లో గూడ, ఆంగ్ల భాషా వ్యాప్తిమూలంగా ఆధునిక ఐరోపా భావాలు వ్యాపించాయి. గవర్నర్ ఎల్ఫిన్‌స్టన్ తీసుకొన్న చర్యల చేత, 1841 సం॥లో మద్రాస్ నగరంలో ఒక ఉన్నత పాఠశాల స్థాపించబడింది. ప్రారంభంలో స్థానికులు పాశ్చాత్య విద్యపట్ల ఆసక్తి కనపరచలేదు. కాని 1853 నాటికి, ఆంగ్లవిద్య అత్యంత ఆదరాన్ని పొందింది. ప్రైవేటు విద్యా సంస్థలకు ఆర్థిక సహాయం చేయు విధానాన్ని ప్రభుత్వం అనుసరించింది. కాని ఆంగ్ల విద్యావ్యాప్తికి అమిత కృషి చేసింది. క్రైస్తవ మిషనరీలు, సంపన్నులైన వర్తకులు. మచిలీపట్నంలోని చర్చి మిషనరీ సమాజం (Church Missionary Society) మచిలీపట్నం, ఏలూరు, విజయవాడలలో పాఠశాలలు నెలకొల్పింది. పెన్సిల్‌వేనియా సినాడ్ సమాజం, (Pennsylvania Synod Society) అమెరికన్ బాప్టిస్ట్ మిషన్, (American Baptist Mission) గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పాఠశాలలు నెలకొల్పినారు.

19వ శతాబ్దపు ప్రారంభంలో ఏనుగుల వీరాస్వామి సంఘసంస్కరణ ఆవశ్యకతను తెలియజేశాడు. మద్రాస్ వాసి, ఏనుగుల వీరాస్వామి అంటరానితనం, కులవ్యవస్థ, సతి సహగమనం, బాల్యవివాహాలు, మొదలైన సాంఘిక దురాచారాలను విమర్శించాడు. మద్రాస్ రాష్ట్రంలో ఆంగ్ల విద్యావ్యాప్తికి కూడా వీరాస్వామి కృషి చేశాడు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1) వితంతువుల పునర్వివాహానికి తీవ్రమైన ప్రచారాన్ని చేసిన బెంగాల్ సంఘసంస్కర్త ఎవరు?

.....

.....

.....

.....

2) మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మొట్టమొదటి సంఘసంస్కర్తలెవరు?

.....

.....

.....

.....

BRAOU

10.6 సంగ్రహంగా

1. 1813 వరకు భారతదేశంలో బ్రిటీష్ పరిపాలకులు సాంఘిక, మత, సాంస్కృతిక విషయాలలో జోక్యం చేసుకోలేదు.
2. ఆంగ్ల - విద్య భారతీయుల ఆలోచనా సరళిని, ఆకాంక్షలను మార్చింది.
3. రాజా రామ్‌మోహన్ రాయ్ బ్రహ్మసమాజాన్ని స్థాపించి, సంఘసంస్కరణ ఉద్యమాన్ని పాటించాడు.
4. మహారాష్ట్ర, దక్షిణ రాష్ట్రాలలో కూడా సంఘసంస్కరణ ఉద్యమం 19వ శతాబ్దం ద్వితీయార్ధంలో ప్రారంభమైంది.

10.7 మీ అవగాహన పరీక్షించుకోండి : జవాబులు

I. 1) హెన్రీ డిరోజియో

2) రాజా రామ్‌మోహన్ రాయ్, సతీ సహగమనానికి వ్యతిరేకంగా సృష్టించిన ప్రజాభిప్రాయం. భారతీయుల మీద పాశ్చాత్య విద్య ప్రభావం, సతీ సహగమనాన్ని రద్దు చేయడానికి బెంటింక్ తోడ్పడ్డాడు.

II. 1) ఈశ్వర చంద్ర విద్యాసాగర్

2) జ్యోతిబ పూలే, విష్ణుశాస్త్రి

10.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) 1857 వరకు బ్రిటీష్‌వారు భారతదేశంలో అనుసరించిన సాంఘిక, సాంస్కృతిక విధానాలను వివరించండి.

2) 19వ శతాబ్దపు భారతదేశంలోని సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారణాలు తెలిపి, దాని లక్షణాలను ఫలితాలను వివరించండి.

3) రాజా రామ్‌మోహన్ రాయ్‌ని ఆధునిక భారత నిర్మాతగా ఎందుకు పరిగణించవచ్చును?

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1) యంగ్ బెంగాల్ ఉద్యమం.

2) ఈశ్వర చంద్ర విద్యాసాగర్

3) కందుకూరి వీరేశలింగం.

10.9 ఉపయుక్త గ్రంథాలు

1. Antonova, Krotuers : *A History of India Vol.III*
2. Bhatia . B.M. : *History and Social Development*
3. Bipan Chandra : *Modern India*
4. Mitra Sisir Kumar : *Resurgent India*
5. Ramakrishna : *Social Reform in Andhra*
6. Spear, Perceival : *History of India, Vot II*
7. *Zacharias, H.C.P* : *Renascent India*

BRAOU

భాగం - 11 : 1857 తిరుగుబాటు

విషయక్రమం

11.0 లక్ష్యాలు

11.1 పరిచయం

11.2 తిరుగుబాటు కారణాలు

11.2.1 రాజకీయ కారణాలు

11.2.2 ఆర్థిక కారణాలు

11.2.3 సాంఘిక, మత కారణాలు

11.2.4 సైనిక కారణాలు

11.2.5 తక్షణ కారణం

11.3 తిరుగుబాటు గమనం

11.4 తిరుగుబాటు వైఫల్యానికి కారణాలు

11.5 తిరుగుబాటు స్వభావం

11.6 తిరుగుబాటు ఫలితాలు

11.7 సంగ్రహంగా

11.8 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

11.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

11.10 ఉపయుక్త గ్రంథాలు

11.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి


1. 1857 తిరుగుబాటుకు కారణాలు
2. తిరుగుబాటు గమనం
3. తిరుగుబాటు విఫలమవటానికి కారణాలు
4. తిరుగుబాటు స్వరూపం

11.1 పరిచయం

ఆధునిక భారతదేశ చరిత్రలో 1857 తిరుగుబాటు అతి గొప్ప సంఘటన. ప్లాసీ యుద్ధం తర్వాత సరిగ్గా ఒక శతాబ్దానికి జరిగిన ఈ తిరుగుబాటువల్ల, బ్రిటీష్ కంపెనీ పునాది కూకటి వ్రేళ్ళతో కదలించబడింది. దీనిచే కంపెనీ పరిపాలన అంతమై భారత దేశంలోని బ్రిటీష్ ఆక్రమిత ప్రాంతాలు, బ్రిటీష్ ప్రభుత్వ స్వాధీనం చేయబడ్డాయి. బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ అనేక యుద్ధాలు నిర్వహించి రాజకీయ ఆధిక్యతను, వాణిజ్యాభివృద్ధిని సాధించింది. తిరుగుబాటుకు దాదాపు ఐదు దశాబ్దాల ముందు రాజ్యాక్రమణ గమనం అధికం చేయబడింది. భారతీయుల మామూలు జీవితం స్తభించిపోయింది. రాజ్యాక్రమణ కష్టంగాకపోయినా ఆక్రమిత ప్రాంతాలను పాలించుటలో కంపెనీ అధికార్లు అనేక కష్టాలను ఎదుర్కొనవలసి వచ్చింది. తిరుగుబాట్లు, సైనిక చర్యలు పరిపాటైనాయి. 1804 సం॥లో చిత్తూరు పాళేగార్లు, కంపెనీ అధికార్లకు కప్పం చెల్లించ నిరాకరించి ఎదురు తిరిగారు. రెండేళ్ళ తర్వాత వెల్లూరు విప్లవం జరిగి, అనేక బ్రిటీష్ సైనికాధికార్లు చంపబడ్డారు. 1816 సం॥లోని బరైలి తిరుగుబాటు, 1831-33 ప్రాంతంలో సంభవించిన కోల్ ఉద్యమం గమనించ తగ్గవి. 1846

BRAOU

సం॥లో ఆంధ్రలో కోయిలకుంట నరసింహారెడ్డి తిరుగుబాటు, బ్రిటీషువారి ఎడ స్థానిక నాయకులకు కలిగిన ఏవగింపుకు ఉదాహరణ. 1848 సం॥లో కాంగ్రా, జస్వర్ రాజుల ఉద్యమం కంపెనీకి వ్యతిరేకంగా కొనసాగింది. 1855 సం॥లో సంథాల్ తిరుగుబాటు, గిరిజన రైతులు కంపెనీ పాలనలో ఎట్లు హింసింపబడినారనుటకు చక్కని దృష్టాంతం. కాని అట్టి తిరుగుబాట్లన్నిటిలోను అతి ప్రధానమైంది, దేశ చరిత్రలో అతి ముఖ్యమైంది. 1857 సం॥లో జరిగిన తిరుగుబాటు.



11.2 తిరుగుబాటుకు కారణాలు

1857 సం॥ తిరుగుబాటు అనేక సంవత్సరాలుగా పేరుకు పోయిన, బలమైన కారణాల ఫలితంగా సంభవించింది. దీనికి గల కారణాలను, రాజకీయ, సాంఘిక, మత, ఆర్థిక, సైనిక కారణాలుగా విభజించవచ్చు.

11.2.1 రాజకీయ కారణాలు

ఈశ్వరీ ప్రసాద్ అను చరిత్రకారుడు వ్రాసినట్లు *"డల్హౌసీ భారతదేశంలోని రాజకుటుంబాలను తుడిచివేసి దానితో సాంఘిక, ఆర్థిక విధానాలలో కలిగించిన మార్పులు గాఢ అసంతృప్తికి కారణాలై, యీ గొప్ప తిరుగుబాటును లేవదీశాయి"*. డల్హౌసీ ప్రవేశ పెట్టిన రాజ్య సంక్రమణ సిద్ధాంతం సంస్థానాధీశులందరి లోను

అనుమానాలను, ఆందోళనలను రేకెత్తించింది. దత్తత చేసుకొను అధికారం హిందూ రాజులకు నిరాకరించబడింది. డల్హౌసీ అట్టి సిద్ధాంతాన్ని అమలు జరిపి సతారా, జైత్‌పూర్, సంబల్‌పూర్, భాగత్, ఉదయ్‌పూర్, ఝాన్సీ, నాగపూర్ మొదలైన సంస్థానాలను ఆక్రమించుకొన్నాడు. అట్టి ఆక్రమణలను హిందువులందరు గర్హించారు. ఆర్కాట్ నవాబు, తంజావూరు రాజుల బిరుదులు హరించబడ్డాయి. బాజీరావు పీష్వాకు ఇచ్చు భరణం, అతని దత్తకుమారునికి నిరాకరించబడింది. బ్రిటీష్ వారికి మిక్కిలి విధేయులైన సంస్థానాధిపతులు కూడ భవిష్యత్తులో కొనసాగుతారను నమ్మకం లేకపోయింది. ఆక్రమణలు రాజ్య సంక్రమణ సిద్ధాంతంవల్ల గాదని అవి నైతిక విలువల విడనాడటం చేతనని అనేకులు భావించారు.

మొగల్ చక్రవర్తి బిరుదును రద్దుపరచి అతని కుటుంబీకులు ఎఱ్ఱకోటను వదలి పెట్టవలెనను బ్రిటీష్ కంపెనీ నిర్ణయాలు, భారతీయ ముస్లింలకు బాధను కలిగించినాయి. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించుటతో అనేక ప్రభువులు, అధికారులు, సైనికులు, నిరుద్యోగులైనారు. బ్రిటీష్‌వారు, వారికెట్టి ఉపాధి సౌకర్యాలు కల్పించలేదు. జమీందార్ల, తాలుక్‌దార్ల భూములను బ్రిటీష్‌వారు ఆక్రమించుకొన్నారు. ఇది, అయోధ్యలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అసంతృప్తిని కలిగించింది. సంస్థానాధీశుల కొలువు నుంచి తొలగించబడిన సైనికులు అసంతృప్తితో బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరడడానికి, అవకాశానికై ఎదురు చూశారు.

11.2.2 ఆర్థిక కారణాలు

ప్రజలలో బ్రిటీష్ పరిపాలనపట్ల కలిగిన వ్యతిరేకతకు అతిప్రధాన కారణం వారనుసరించిన ఆర్థిక దోపిడీ విధానం. బ్రిటీషువారు తమ దేశ ఆర్థిక పరిస్థితులను పెంపొందించుకోడానికై హిందూదేశ సహజ సంపదలను కొల్లగొట్ట నారంభించారు. భారతదేశం నుంచి ముడి సరుకులన్నింటిని తమ దేశానికి చేరవేశారు. స్వదేశీ పరిశ్రమలు దీనితో మరుగున పడ్డాయి. మన దేశంలో తయారైన పట్టు, నూలు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి కానీయక, వాటిపై సుంకాలను విధించారు. బీదరికం ప్రబలి, దేశం కరువు కాటకాలకు నిలయమైంది. సామాన్య ప్రజలు గూడ వేరే మార్గంలేక తమ పరిస్థితుల మెరుగు పరచుకొను ఉద్దేశంతో తిరుగుబాటులో చేతులు కలిపారు. స్థానిక సంస్థానాలను బ్రిటీష్‌వారు ఆక్రమించుట, అనేక అనర్థాలకు దారితీసింది. రాజులు తమ అధికారాన్ని పోగొట్టుకున్నారు. వారి సైన్యాలు రద్దుచేయబడినాయి. సైనికులు జీవనాధారాన్ని కోల్పోయారు. బ్రిటీష్‌వారు మాత్రం ఉన్నత పదవులకు నియమించబడినారు. విద్యావంతులైన భారతీయులు గూడ మంచి ఉద్యోగాలకు, ఉన్నత జీతాలకు, అర్హులుగా భావించబడలేదు. ఉన్నత పదవులకు భారతీయులు అనర్హులని, బహిరంగంగా బ్రిటీష్‌వారు చాటిచెప్పారు. "కట్టెలు కొట్టడానికి, నీళ్ళు చేదడానికి" భారతీయులు సరిపోదురని, భావించేవారు. బ్రిటీష్‌వారి ఆర్థిక విధానం, భారతీయ రైతాంగాన్ని, చేతిపని వారిని, స్థానిక ప్రభువులను - అందరినీ కృంగదీసింది. తిరుగుబాటు సమయంలో అన్ని తరగతుల వారు కలసి, బ్రిటీష్ వారిపై పగ తీర్చుకొన ప్రయత్నించారు.

11.2.3 సాంఘిక, మత కారణాలు

రాజకీయ అన్యాయాన్ని కొంతవరకు భరించినా సాంఘిక, అసమానత, మతపీడన, ప్రజలు భరించలేనివి. అవి సరాసరి వారి హృదయాలను స్పందింపచేయుటయే దీనికి కారణం. బ్రిటీష్ కంపెనీ పరిపాలన, ప్రజల సాంఘిక, మత విధానాలతో అనవసర జోక్యం కల్పించుకొన్నది. సతీసహగమనమును, బాల్యవివాహాలను రద్దుపరచి, వితంతు వివాహాలను చట్టబద్ధం గావించింది. బ్రిటీష్‌వారి యీ చర్యలు సాధారణ భారతీయునికి తన సాంఘిక జీవనం కదలించబడినట్లు తోచింది. క్రైస్తవ మిషనరీలు హిందువులను, ముస్లింలను తమ మతానికి మార్పిడి చేయించారు. వారు హిందూ, ఇస్లాం మతాలను బహిరంగంగా విమర్శించారు. కంపెనీ డైరెక్టర్ల అధ్యక్షుడైన మాంజెల్స్ పార్లమెంటులో క్రింది విధంగా ప్రకటించాడు. "భారతదేశం యొక్క ఒక చివరి నుంచి మరొక చివరి వరకు క్రైస్తవ పతాకం విజయవంతంగా ఎగురటకై, దేవుడు హిందూస్థాన్ సామ్రాజ్య

విస్తరణను ఇంగ్లండుకు అప్పగించాడు". మిషనరీలకు అనేక సౌకర్యాలు కల్పించబడ్డాయి. లార్డ్ కానింగ్ భారతీయులను క్రైస్తవ మతానికి మార్పిడి చేయడానికై ప్రత్యేకంగా పంపబడ్డాడనే వదంతి వ్యాపించింది. 1856 సం॥లో ప్రవేశపెట్టిన ఒక చట్టం ప్రకారం మతం మార్పిడి చేత, తండ్రి ఆస్తికి తనయుడు అధికారం కోల్పోడని తెలియజేయబడింది.

తంతి, ఆవిరి నౌకలు, రైల్వేలు ప్రవేశపెట్టబడుట కూడ ప్రజలకు అనుమానాలను కల్పించాయి. వారి మతాన్ని కించపరచుటకు పరోక్షంగా చేయు ప్రయత్నాలని వారు భావించారు. పాశ్చాత్య విద్యా వ్యాప్తి, జాతీయ విలువలను మార్చింది. పండితులు, మౌల్వీల పలుకుబడి, అవసరం తగ్గింది. వారు తమ మతం, ఆచార వ్యవహారాలు ఆపదలో వున్నాయని భయపడసాగారు. వారికి ప్రజల సహకార సానుభూతులు లేకపోలేదు. సామాన్య ప్రజానీకం గూడ బ్రిటీష్‌వారు తమ సాంఘిక, మత విషయాలలో అనవసర జోక్యం కల్గించు కొనుచున్నారను భావంతో నిరసించినారు.

11.2.4 సైనిక కారణాలు

లార్డ్ ఆక్‌లాండ్ గవర్నర్-జనరల్‌గా వున్నప్పటి నుంచి బ్రిటీష్ సైన్యంలో క్రమశిక్షణ తగ్గుముఖం పట్టింది. డల్హౌసీ యీ విషయాన్ని మాతృదేశ అధికారులకు తెలియజేస్తూ, "పెద్ద అధికారుల నుంచి చిన్న సైనికుల వరకు, సైన్యంలో క్రమశిక్షణ మిక్కిలి శోచనీయంగా తయారైంది" అని వ్రాశాడు. హిందూ దేశంలోని బ్రిటీష్ సైన్యం, భారతీయులు, ఐరోపీయులతో కూడి యుండింది. ఐరోపీయులను 'సోల్జర్లు' అని భారతీయులను "సిపాయి"లని పిలిచేవారు. వీరిద్దరి సంఖ్యాపూర్వక నిష్పత్తి వ్యత్యాసం రోజు రోజుకు అధికమగుతూ వచ్చింది. 1856 సం॥లో భారతీయ సైన్యంలో రెండు లక్షలకు మించిన స్వదేశీయులుండిరి. కాని బ్రిటీష్‌వారు కేవలం 45 వేలకు మాత్రమే పరిమితమై వుండిరి. సైన్యంలో ఇరు జాతీయుల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వాలు లోపించాయి. భారతీయ సైనికులు, బ్రిటీష్ సైనికులకన్నా లోకువగా గుర్తించబడినారు. సిపాయీలకు తగిన జీత భత్యాలిచ్చువారు కాదు. వారికి ఉద్యోగంలో పెరుగుదల వంటి సౌకర్యాలను నిరాకరించేవారు. సుబేదార్ హోదాకు మించి, భారతీయులను నియమించు వారు కాదు. ఇట్టి అసమానతలుండిన కారణంగా భారతీయ సిపాయీలు మిక్కిలి అసంతృప్తి చెంది, బ్రిటీష్ వారిపై ఎదురుతిరిగి తిరుగుబాటుకు సిద్ధపడినారు.

11.2.5 తక్షణ కారణం

1857 సం॥లో జరిగిన తిరుగుబాటుకు తక్షణ కారణం, క్రొవ్వు పూసిన తూటాలు. 1856 సం॥లో గవర్నర్-జనరల్ లార్డ్ కానింగ్, కొత్తరకమైన ఎన్‌ఫీల్డ్ తుపాకులను ప్రవేశపెట్టాడు. ఈ రకమైన తుపాకులను ఉపయోగించుటలో తూటాలకు గల సీలు కాగితాన్ని నోటితో తొలగించాలి. అట్టి తూటాలకు ఆవు, పంది క్రొవ్వును పులిమినారను వదంతి, 1857 జనవరిలో బయలుదేరింది. ఇది హిందువులను, మహ్మదీయులను కించపరచింది. వారి మతాలను నాశనం చేయడానికి అట్టి పనిని చేపట్టారని, ఇరు మతస్థులు భావించారు. అట్టి గ్రీజ్ వేసిన తూటాలను ఉపయోగించడానికి నిరాకరించిన సిపాయీలను, క్రమశిక్షణా నెపమున శిక్షించసాగిరి. 1857 మార్చి 29వ తేదీన, సిపాయీలు బారక్‌పూర్‌లో క్రొత్త తూటాలను ఉపయోగించడానికి నిరాకరించారు. మంగల్‌పాండే అనునొక సిపాయి, ఐరోపా అధికారిని కాల్చి చంపాడు. మీరట్‌లో తూటాలను ఉపయోగించడానికి నిరాకరించిన 85 మంది సిపాయీలను బంధించి వారికి కఠిన శిక్షలు విధించారు. మే నెల 10వ తేదీన సిపాయీలు బహిరంగంగా ఎదురు తిరిగి, అధికార్లను కాల్చి, తోటి సిపాయీలను విడుదల గావించి, ఢిల్లీ వైపు బయలుదేరారు.

B RAO

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. 1857 తిరుగుబాటుకు డల్హౌసీ పాటించిన ఏ విధానం ముఖ్య కారణం?

.....

.....

.....

.....

2. బ్రిటీష్‌వారి ఆర్థిక విధానాలు 1857 తిరుగుబాటుకు ఏవిధంగా కారణమయినాయి?

.....


.....

.....

.....

11.3 తిరుగుబాటు గమనం

మీరట్ విప్లవకారులు ఢిల్లీ ప్రవేశించి అచ్చటి సిపాయీలతో చేతులు కలిపారు. అనేక మంది అధికార్లను వధించి, ఢిల్లీ నగరాన్ని స్వాధీన పరచుకొన్నారు. రెండవ బహదూర్‌షా మొగల్ చక్రవర్తిగా ప్రకటించబడ్డాడు. విప్లవకారులు అతనిని తమ నాయకుడిగా ప్రకటించారు. ఢిల్లీని విప్లవకారులు ఆక్రమించుట, బ్రిటీష్‌వారి అధికార ప్రతిష్టకు తీవ్ర లోపంగా పరిణమించింది. కొద్ది కాలంలోనే విప్లవం ఉత్తర, మధ్య హిందూ దేశానికి వ్యాపించింది. లక్నో, అల్హాబాద్, కాన్పూర్, బరైలి, బెనారస్, ఆగ్రా, ఝాన్సీ, బుందేల ఖండ్ మొదలైన ప్రాంతాలు యుద్ధకేంద్రాలైనాయి. కాని పంజాబ్‌లోని శిక్కులు, నేపాల్‌లోని గుర్ఖాలు, తిరుగుబాటులో చేరలేదు. హైదరాబాద్‌లో శాంతియుత పరిస్థితులే నెలకొన్నాయి. వింధ్య పర్వతాలకు దక్షిణంగా, బ్రిటీష్ వారికి వ్యతిరేక ఉద్యమాలు లేవు.



కాన్పూర్ బయట సిపాయిలకు, బ్రిటీష్ సైనికుల మధ్య పోరాటం

BRAOU

ఢిల్లీ నగరాన్ని పునరాక్రమించుట, తమకు మానసిక ధైర్యాన్ని ప్రసాదించునని, బ్రిటీష్‌వారు భావించి, దానికై మిక్కిలి కృషి గావించారు. పంజాబ్ నుంచి రప్పించిన సేనలు, ఢిల్లీ వెలుపల సమీకరించబడ్డాయి. 1857 సెప్టెంబర్‌లో ఢిల్లీ పునరాక్రమించబడింది. రెండవ బహదూర్‌షాను బంధించి, యావజ్జీవ ఖైదు శిక్ష విధించారు. అతనిని రంగూన్‌కు పంపి అచ్చట 1862లో అతడు మరణించు వరకు, తన శేష జీవితాన్ని కారాగారమున గడుపునట్లు చేశారు. అతని ఇద్దరు కుమారులు, అతని కళ్ళ ఎదుట కాల్చి చంపబడ్డారు. మొగల్ సామ్రాజ్యం ఈ విధంగా అంత మొందింది. వేలాది సిపాయీలు, ప్రజలు నిర్దాక్షిణ్యంగా చంపబడినారు.

లక్నోలో తిరుగుబాటు, జూన్ 4వ తేదీన ప్రారంభమైంది. అచ్చటి బ్రిటీష్ రెసిడెంటైన సర్ హెన్రీ లారెన్స్ నివాసాన్ని తిరుబాటుదార్లు ముట్టడించి, అతనిని కాల్చి చంపారు. జనరల్ హేవ్‌లాక్ అనునతడు, ఆదుకోవడానికై వచ్చాడు గాని, గొప్పగా ఏదీ సాధించలేకపోయాడు. ఢిల్లీలో అతి దారుణంగా భారతీయులను చంపిన జనరల్ నీల్, లక్నోలో చంపబడ్డాడు. నవంబర్‌లో, కోలిన్ కాంప్‌బెల్ అను సేనాని లక్నో చేరి, తిరుగుబాటు దారులను ఓడించ గలిగాడు. లక్నో నగరాన్ని తిరిగి స్వాధీన పరచుకొన్నాడు. కాని, గెరిల్లా పద్ధతిలో తిరుగుబాటు దార్లు 1858లో సెప్టెంబర్ వరకు గూడ తమ పోరాటాన్ని సాగిస్తూనే వచ్చారు.

కాన్పూర్‌ను, విప్లవ నాయకులు 1857 జూన్‌లో వశపరచుకొన్నారు. నానా సాహేబ్‌ను పీష్వాగా ప్రకటించారు. అచ్చటి బ్రిటీష్ దళం లొంగిపోయింది. నానాసాహెబ్‌తో తాంతియా తోపే కలిసాడు. కాన్పూర్ పునరాక్రమణ, లక్నోలోని కార్యకలాపాలతో దగ్గరి సంబంధాన్ని కల్గి వుండింది. కాంప్‌బెల్, కాన్పూర్‌ను డిసెంబర్‌లో ముట్టడించాడు. తాంతియా తోపే తప్పించుకొని, ఝాన్సీ లక్ష్మీబాయిని చేరాడు.



ఝాన్సీలక్ష్మీబాయి

1857 జూన్ నెలలో ఝాన్సీలోని సేనలు ఎదురు తిరిగాయి. గంగాధర్‌రావు భార్యయైన లక్ష్మీబాయి రాణీగా ప్రకటించబడింది. కాని 1858 ఏప్రిల్ 3వ తేదీన సర్ హ్యూరోస్ అను ఆంగ్ల సేనాని, ఝాన్సీ రాజ్యాన్ని ఆక్రమించాడు. కాని లక్ష్మీబాయి, తాంతియా తోపే గ్వాలియర్ వైపు వెళ్ళి, భారతీయ సిపాయిలకు నాయకత్వం వహించారు. గ్వాలియర్ రాజైన సింధియా, బ్రిటీష్‌వారికి విధేయుడుగా వుండి ఆగ్రాలో వారి శరణు జొచ్చాడు. గ్వాలియర్‌ను బ్రిటీష్ సేనలు పునరాక్రమించుకొన్నాయి. ఝాన్సీరాణి యుద్ధ భూమిలో పురుష వస్త్రాలను ధరించి బ్రిటీష్‌వారి ననేకులను చంపి, తాను చంపబడి వీరమరణం పొందింది. తాంతియా యుద్ధ భూమి

BRAOU

నుంచి పారిపోయాడుగాని, బ్రిటీష్‌వారికి పట్టుబడి, ఉరితీయబడ్డాడు. వారిద్దరి మరణంతో తిరుగుబాటు అంతమైందని చెప్పవచ్చు.

తిరుగుబాటు సమయంలోనూ దాని తర్వాత పెద్ద ఎత్తున భారతీయులను విచక్షణా రహితంగా చంపినారు. బ్రిటీష్ అధికార్లు వెళ్ళు సమయంలో, విప్లవ జెండాను ఎగురవేసిన పసికందులను గూడా వారు కాల్చి చంపారు. అల్హాబాద్‌లో మాత్రం ఇమారు 6 వేల మందిని చంపినట్లు అంచనా. భారతీయుల మనస్సులలో భయాందోళనలు కలుగజేయడానికి ఇట్టి క్రూర చర్యలను కొనసాగించినారు.

11.4. తిరుగుబాటు వైఫల్యానికి కారణాలు

విప్లవ కారులు తమ ధ్యేయాన్ని పొందలేక పోయారు. తిరుగుబాటు విఫలమైంది. దీనికి అనేక కారణాలు గలవు. తిరుగుబాటు కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమై యుండి, దేశ వ్యాప్తంగా లేదు. బొంబాయి, మద్రాస్, సైన్యాలు తిరుగుబాటులో చేరక బ్రిటీష్‌వారికి విధేయులుగా వుండిపోయారు. సింధు, రాజస్థాన్, కాశ్మీర్, తూర్పు బెంగాల్, పంజాబ్ ఇందులో పాల్గొన లేదు.

బ్రిటీష్‌వారి సాధనా సంపత్తి తిరుగుబాటుదార్లకన్నా మిన్నయైనది. 1856 క్రిమియా యుద్ధం, చైనాతో యుద్ధాలు ముగిసిన కారణంగా బ్రిటీష్ సైన్యాలు తిరుగుబాటు సమయంలో హిందూ దేశానికి అధిక సంఖ్యలో రావడం జరిగింది. భారతీయ సిపాయీలకు అతికొద్ది తుపాకులున్న కారణంగా,కత్తులు, బరిసెలతో పోరాటం గావించారు. కాని బ్రిటీష్ అధునాతన యుద్ధ పరికరాలను ఉపయోగించారు. తంతి, తపాలా, రైలు మున్నగు సౌకర్యాలన్నీ బ్రిటీష్‌వారి అధీనంలో వున్న కారణంగా తిరుగుబాటు అణచివేయడానికి పనికొచ్చాయి.

1857 తిరుగుబాటు స్వతహాగా, భూస్వామ్య పద్ధతిలో సాగింది. అయోధ్య, రోహిల్‌ఖండ్ మరికొన్ని ఉత్తర హిందూదేశ ప్రాంతమందలి సంస్థానాధిపతులు తిరుగుబాటును నడిపించారు. కాని పాటియాల, జింద్, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన స్వదేశీ రాజులు తిరుగుబాటును అణచుటలో, బ్రిటీష్‌వారికి సహాయపడినారు. విధేయులైన అట్టి రాజులు, జమీందార్లు, బ్రిటీష్‌వారిచే అమితంగా శ్లాఘింపబడినారు.

తిరుగుబాటు మిక్కిలి కట్టుదిట్టంగా సంఘటిత పరచబడలేదు. విప్లవ నాయకులు ధైర్యసాహసాలు లోపించినవారు కాదు. కాని అనుభవం, సమైక్యతతో పోరాడవలెనను భావం లేనివారు. అందరూ ఒకటిగా కలిసి, బ్రిటీష్ వారిపై దెబ్బ తీయలేకపోయారు. దేశం నలుమూలలో జరిగిన తిరుగుబాట్లలో, ఒక దానితో మరొక దానికి సంబంధం లోపించింది.

విప్లవకారులలో ఒకే ధ్యేయం లేకపోయింది. బ్రిటీష్ వారియెడ వ్యతిరేక భావం అందరిలో వుండినా, ప్రతి నాయకుడు తన స్వంత విషయాలపై తిరుగుబాటులో ప్రవేశించాడు. అనేక మంది తిరుగుబాటుదార్లు, సైనిక నాయకులు కారు. తాంతియా తోపే, నానాసాహెబ్, ఝాన్సీ లక్ష్మీబాయి గొప్ప దేశభక్తులు; ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కానీ, వారు సైనిక నాయకత్వం, సైనిక శిక్షణలో, బ్రిటీష్ వారితో సరితూగలేదు. తూర్పు ఇండియా సైన్యంలో లారెన్స్ సోదరులు, నికోల్సన్, ఔట్రామ్, హేవ్‌లాక్, ఎడ్వర్డ్ మున్నగువారు అతి ప్రమాదకర యుద్ధాలలో పాల్గొని విజయవంతంగా నడిపించారు. భారతీయ సిపాయిలు స్వయంగా యుద్ధం చేయడానికి ముందంజ వేశారు.

11.5 తిరుగుబాటు స్వభావం

1857 సం॥ తిరుగుబాటు గురించి చరిత్రకారులు విభిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు. కొద్దిమంది, దానిని కేవలం **'సిపాయీల పితూరి'** అని అనగా, మరికొందరు క్రైస్తవులకు ఒక వైపు, హిందూ ముస్లింలకు

మరొక వైపు జరిగిన మత పోరాటమని పేర్కొన్నారు. కొందరి ఉద్దేశంలో అది తూర్పు పశ్చిమాల సంస్కృతీ సంఘర్షణ. అశోక్ మెహతా తన గ్రంథంలో 1857 విప్లవం జాతీయతా గుణం గలదని వ్రాశారు. వీర సావర్కర్ దీనిని భారతీయ ప్రథమ స్వాతంత్ర సమరమని నిర్ణయించినాడు. ఆర్.సి. మజుందార్, ఎస్.ఎన్.సేన్ వంటి వారు 1857 విప్లవం ముందుగా పథకాలు వేసుకొని జరిపించింది గాదని, అది దానంతటదే ఉత్పన్నమైందని భావించారు.

తిరుగుబాటు పూర్తిగా జాతీయగుణం గలదిగా కూడ చెప్పడానికి వీలులేదు. అందు, నాయకులందరు తమతమ స్వప్రయోజనాలకు యుద్ధంలో పాల్గొన్నారు. కొద్ది ప్రాంతాలలో తప్ప, తిరుగుబాటు ప్రజలందరినీ ఆకర్షించలేదు. బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన ప్రధానమైన వర్గం, సిపాయీలు మాత్రమే.

11.6 తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు అణచబడినా అది బ్రిటీష్ అధికారాన్ని పునాదులతో బాటు కదలించింది. అది లార్డ్ క్రోమర్ అన్నట్టు *'ఇంగ్లాండ్‌లోని యువకులు సిపాయీల తిరుగుబాటు చరిత్రను చదివి, గుర్తుంచుకొని, నేర్చుకొని, అంతరంగంలో జీర్ణించుకొనవలెనని నా కోరిక. అది అనేక పాఠాలను, హెచ్చరికలను కలిగి వున్నది'*. విప్లవం తర్వాత బ్రిటీష్ వారు, **'విభజించి పాలించు'** విధానాన్ని పూర్తిగా అమలు పరచారు. దేశంలోని కీలక ప్రాంతాలన్నిటిని వారు ఆక్రమించుకొని పాటించారు.

భారతదేశ పరిపాలన, తూర్పు ఇండియా వర్తక సంఘం నుంచి బ్రిటీష్ ప్రభుత్వానికి మార్పు చేయబడింది. ఈ మేరకు 1858 నవంబర్ 1వ తేదీన విక్టోరియా రాణి ప్రకటన జారీచేయబడింది. ఇంగ్లాండులో 1858 చట్టం మూలంగా **'భారతీయ కార్యదర్శి'** అను అధికారి భారతీయ విషయాలు గమనించడానికై నియమింపబడినాడు. భారతదేశంలో గవర్నర్-జనరల్, రాజప్రతినిధి **(వైస్రాయ్)** అనే బిరుదు చేర్చబడి కొనసాగినాడు. ఈ చట్టం భారతదేశ వ్యవహారాల నిర్వహణకు బ్రిటీష్ ప్రభుత్వంపై ప్రత్యక్ష బాధ్యత నుంచింది.

విక్టోరియా ప్రకటనలో బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణ నిలుపుదల చేసినట్లు, భారతీయ సంస్థానాధీశులకు అధికారాలు, గౌరవ మర్యాదలు ఎప్పటివలె ఇవ్వడానికి వాగ్దానం చేయబడింది. తిరుగుబాటు సమయంలో బంధించబడ్డ అనేకులకు క్షమాభిక్ష ఒసగబడింది. అయోధ్యలో విప్లవంలో చేరిన తాలుక్‌దార్లకు భూములు తిరిగి ఇవ్వబడినాయి. అట్టి తాలుక్‌దార్లు, బ్రిటీష్ వారికి మద్ధతుదార్లైరి.

ప్రకటనలో భారతదేశంలోని జాతివ్యత్యాసం తొలగించబడినట్లు చాటబడింది. విద్య, నిజాయితి, సమర్థత మొదలగునవి మాత్రం ఉద్యోగాలకు అర్హతలుగా తెలుపబడినాయి. అందుచే సివిల్ సర్వీస్ ఉద్యోగాలు, లండన్‌లో ఏటా జరుగు పోటీ పరీక్షలలో నెగ్గిన వారికి మాత్రం యివ్వబడ్డాయి.

1857 తిరుగుబాటు బ్రిటీష్ అధికారులను సైన్య నిర్మాణం గురించి ఆలోచింప చేసింది. సైన్యాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించారు. భారతదేశంలోని ఐరోపీయ అధికారుల సంఖ్య హెచ్చింపబడింది. బెంగాల్‌లో భారతీయ సైనికులకు, విదేశీ సైనికులకు నిష్పత్తి 2:1 గాను, బొంబాయి, మద్రాస్ రాష్ట్రాలలో 3:1 గాను కొనసాగింది.

1857 తిరుగుబాటుకు గల కారణాలలో ప్రధానమైంది, బ్రిటీష్ పరిపాలకులకు భారతదేశీయులతో తగు సంబంధాలు లోపించుటయని భావించబడింది. అందుచే 1861 కౌన్సిల్ చట్టంలో స్థానికులకు అధిక సంఖ్యలో ప్రాతినిధ్యాన్నిచ్చి, బ్రిటీష్ వారితో అభిప్రాయ భేదాలు లేకుండుటకు చర్యలు గైకొన్నారు.

BRAOU

తిరుగుబాటు తర్వాత మత కలహాలు ఎక్కువగుట శోచనీయం. బ్రిటీష్‌వారు హిందూ, ముస్లిం మతస్థులు ఐక్యత సాధించిన, తాము పాలించుట దుర్లభమని; ఆ ఇద్దరి మధ్య వైషమ్యాలను, మత విభేదాలను కల్పిస్తూ వచ్చారు. వారి జాతి గొప్పదను భావాన్ని, బ్రిటీష్‌వారు వ్యక్తీకరించారు. బ్రిటీష్‌వారి అట్టి ప్రవర్తన, భారతీయులలో జాతీయతత్వాన్నీ ప్రబోధించింది. అందుచే అప్పటి నుంచి జాతీయోద్యమం అంకురించిందని చెప్పవచ్చు.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. ఏ ప్రాంతాల్లో 1857 తిరుగుబాటు జరుగలేదు?

.....

.....

.....

.....

2. 1857 తిరుగుబాటు ముఖ్య ఫలితమేది?

.....

.....

.....

.....

11.7 సంగ్రహంగా

1. 1857 తిరుగుబాటు అనేక రాజకీయ, సాంఘిక, మత, ఆర్థిక, సైనిక కారణాలవల్ల జరిగింది.
2. మీరట్, ఢిల్లీ, లక్నో, అలహాబాద్, కాన్పూర్, బరేలీ, వారణాసి, ఆగ్రా, ఝాన్సీ తిరుగుబాటు ముఖ్య కేంద్రాలు. తిరుగుబాటులో ఇరువైపులా అనేక మంది చనిపోయారు.
3. అనేక పరిస్థితులవల్ల తిరుగుబాటు విఫలమయింది. అన్ని రంగాలలో బ్రిటీష్‌వారి ఆధిక్యత, తిరుగుబాటు వైఫల్యం అనివార్యమైంది.
4. తిరుగుబాటు, సైనిక తిరుగుబాటుగా ప్రారంభమయి స్వాతంత్ర్యానికి జాతీయ ఉద్యమంగా ముగిసింది.
5. తిరుగుబాటు తర్వాత కంపెనీ పరిపాలన ముగిసి భారతదేశం ప్రత్యక్షంగా బ్రిటీష్ ప్రభుత్వ పాలనలోకి వచ్చింది.

11.8 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) డల్హౌసి పాటించిన రాజ్య సంక్రమణ సిద్ధాంతము 1857 తిరుగుబాటుకు ముఖ్య కారణము.

2) బ్రిటీష్‌వారి ఆర్థిక విధానాలు, దేశంలోని రైతులను పేదవారిగా కృంగదీసినాయి. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. వారి ఆర్థిక విధానాలవల్ల ప్రజలందరూ అనేక కష్టాలకు గురి అయినారు. అందువల్ల ఏర్పడ్డ అసంతృప్తివల్లనే 1857 తిరుగుబాటు జరిగింది.

II 1) 1857 తిరుగుబాటు బొంబాయి, పంజాబ్, సింధు, రాజస్థాన్, కాశ్మీర్, దక్షిణ ప్రాంతాల్లో జరగలేదు.

2) భారతదేశంలో ప్రత్యక్షంగా బ్రిటీష్ ప్రభుత్వం నెలకొనడమే, 1857 తిరుగుబాటు ముఖ్యఫలితము.

BRAOU

11.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) 1857 తిరుగుబాటుకు కారణాలు వివరించండి?

2) 1857 తిరుగుబాటుకు ముఖ్య ఫలితాలను తెలుపండి.

3) 1857 తిరుగుబాటు విఫలమవడానికి ముఖ్య కారణాలేవి?

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) 1857 తిరుగుబాటు స్వభావం గురించి చర్చించండి.

2) 1857 తిరుగుబాటు నాయకులను గురించి వ్రాయండి.

3) 1857 తిరుగుబాటు సాంఘిక ఆర్థిక కారణాలేవి?

11.10 ఉపయుక్త గ్రంథాలు

1. Holmes, T.R.E. : *History of the Indian Mutiny*
2. Khan, Sir Syed Ahmed : *The causes of the Indian Unrest*
3. Majumdar, R.C. : *The Mutiny and the Revolt of 1857*
4. Mehta. Ashok : *Eighteen Fifty Seven*
5. Sen, S.N. : *Eighteen Fifty Seven*
6. Spear, Perceival : *History of Indian vol II*
7. Thompson & Garrett : *Rise and Fulfilment of the British rule in India*
8. వైదేహి, అల్లాడి : *భారత స్వాతంత్రోద్యమ చరిత్ర 1858-1947*

BRAOU

భాగం- 12 : విద్యా, వార్తా పత్రికల ప్రగతి - నూతన సాహిత్య ధోరణులు

విషయక్రమం

12.0 లక్ష్యాలు
12.1 పరిచయం
12.2 విద్యా వ్యాప్తికి బ్రిటీష్‌వారి తొలి ప్రయత్నాలు
12.3 క్రైస్తవ మిషనరీలు
12.4 ఆంగ్ల విద్యపట్ల ఆదరణకు కారణాలు
12.5 ఆంగ్ల - ప్రాచ్య, విద్యాభిమానుల మధ్య వివాదం
12.6 ఆంగ్ల భాషను ప్రవేశపెట్టుట
12.7 చార్లెస్ ఉడ్ విద్యా నివేదిక. 1854
12.8 ఆంగ్ల విద్య ప్రభావం
12.9 వార్తా పత్రికల వ్యాప్తి
12.10 నూతన సాహిత్య ధోరణులు
12.11 సంగ్రహంగా
12.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
12.13 పరీక్ష నమూనా ప్రశ్నలు
12.14 ఉపయుక్త గ్రంథాలు

12.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. భారతదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశపెట్టడానికి దారి తీసిన పరిస్థితులు
2. విద్యావ్యాప్తి కృషిలో క్రైస్తవ మిషనరీలు
3. ఉడ్ విద్యా నివేదిక
4. భారతదేశంలో ఆంగ్ల విద్య ప్రభావం
5. వార్తా పత్రికల అభివృద్ధి
6. దేశంలోని నూతన సాహిత్య పంథాలు

12.1 పరిచయం

కంపెనీ అధీనంలో వున్న భారతదేశంలోని విద్యావ్యాప్తిని, రెండు దశలుగా విభజించవచ్చు. 1772 నుంచి 1818 వరకు గల మొదటి దశను ప్రారంభదశగా భావించవచ్చు. రెండవ దశ, 1818 నుంచి 1857 వరకు కొనసాగింది. ఈ సమయంలో ఆంగ్ల విద్యావ్యాప్తికి బలమైన పునాదులు వేయబడ్డాయి. మిక్కిలి ప్రధానమైన నిర్ణయాలు గైకొనబడినాయి. మొదటి దశలో ఇంగ్లాండ్ అమెరికా స్వాతంత్ర్య సమరాన్ని ఒకవైపు, మరొక వైపు ఐరోపాలో ఫ్రెంచి విప్లవాన్ని, నెపోలియన్ యుద్ధాలను ఎదుర్కొనవలసి వచ్చింది. అందుచే విద్యా రంగంలో సంస్కరణలు ఆలస్యమైనాయి. రెండవ దశలో ఇంగ్లాండ్ శాంతియుతంగా ఉంది. నెపోలియన్ యుద్ధాలు ముగిశాయి. వీటితోబాటు ఆ సమయంలో విద్యా వ్యాప్తిపై ఖచ్చితమైన దృక్పథాలు గల పరిపాలకులు అనేకులుండడం గమనార్హం. వారు ఎల్ఫిన్‌స్టన్, థామస్ మన్రో, బెంటింక్, మెకాలే మొదలగువారు.

బ్రిటీష్ కంపెనీ భారతదేశంలో అనేక ప్రాంతాలను ఆక్రమించుకొన్న సమయంలో అప్పటి విద్యా విధానం హిందూ, ముస్లింల మత విధానాన్ని అనుసరించి వున్నట్లు తెలుసుకున్నారు. హిందువులకు పండితులు,

BRAOU

పాఠశాలలో సంస్కృతాన్ని బోధించేవారు. మౌల్వీలు మసీదులలో ముస్లింలకు పాఠాలు బోధించేవారు. కంపెనీ ప్రభుత్వం అప్పటి యీ పద్ధతిని మార్చగూడదని మొదట తలంచింది. కాని కొద్ది కాలం తర్వాత ఏర్పడిన రాజకీయ పరిణామాలతో, ఆ పద్ధతిలో విద్యా వ్యాప్తి కొనసాగడానికి వీలులేక పోయింది. రాజకీయ అధికారాన్ని కోల్పోవడంతో స్థానిక సంస్థానాలు పాఠశాలలను పోషించలేకపోయాయి. పండితులకు, మౌల్వీలకు తగు ప్రోత్సాహం లేకపోయింది. ఈ పరిస్థితుల గూర్చి 1784 సం॥లో వారన్ హేస్టింగ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు వ్రాస్తూ హిందూదేశంలోని ప్రధాన నగరాలలో, పట్టణాలలో, పాఠశాలలు క్షీణించుతున్నాయని తెలిపాడు.

12.2 విద్యావ్యాప్తికి బ్రిటీష్‌వారి తొలి ప్రయత్నాలు

1756 సం॥ నాటికి బ్రిటీష్ కంపెనీ బెంగాల్‌లో పాలనాధికారాలు చేపట్టింది. కంపెనీ ప్రభుత్వం భారతీయులను విద్యావంతులను చేయు బాధ్యత స్వీకరించ నిరాకరించినా, కంపెనీ ఉద్యోగులుగా భారతదేశానికి వచ్చిన వారందరు, విద్యావ్యాప్తికి తగు చర్యలు గైకొనవలెనని మాత్రం ప్రభుత్వాన్ని కోరారు. భారతీయ విద్యావ్యాప్తికై కంపెనీ ప్రభుత్వం అర్ధ మనస్సుతో కొంత ప్రయత్నించింది. 1781 సం॥లో వారన్ హేస్టింగ్స్ **'కలకత్తా మదరసా'**ను స్థాపించి, అరబిక్, పారశీక భాషలను బోధించు ఏర్పాట్లు గావించాడు. అతడు ఉద్దేశించినట్లు, ఆ పాఠశాల 'బాధ్యతాయుతమైన ఉన్నత ఉద్యోగాలకు, దేశీయ ముస్లింలను తర్ఫీదు చేయుట' కు స్థాపించబడింది. కొద్ది సంవత్సరాల తర్వాత జాన్ ఓవెన్ అనునతడు స్థానికులకు ఆంగ్లమును బోధించు పాఠశాలలు స్థాపించవలసిందిగా ప్రభుత్వానికి సూచించాడు. అయితే దీనిని ఎవరూ పట్టించుకోలేదు కాని, 1791 సం॥లో బెనారస్‌లోని బ్రిటీష్ ఉద్యోగి, జొనాథన్ డంకన్ అనునతని ప్రయత్నాలు ఫలించి, వాఙ్మయాన్ని, మతాన్ని పరిరక్షించడానికి ముఖ్యంగా బ్రిటీష్ న్యాయవేత్తలకు కావలసిన హిందూ సహాయకులను తయారు చేయడానికి యీ కళాశాల అవసరమైంది.

1792-93 ప్రాంతంలో బ్రిటీష్ ప్రభుత్వం కంపెనీని కొనసాగించాలా వద్దా అన్న సందిగ్ధంలో నున్న సమయంలో బ్రిటీష్ పార్లమెంట్ సభ్యుడైన విల్బర్‌ఫోర్స్ భారతదేశానికి ఉపాధ్యాయులను, మిషనరీలను అధిక సంఖ్యలో పంపవలెనని సూచించాడు. కాని భారతీయులకు అప్పటికున్న విద్యా పద్ధతులను మార్చి, విదేశీ పద్ధతులను ప్రవేశపెట్టుట అసమంజసమని భావించి, అప్పుడు కంపెనీ ప్రభుత్వం విల్బర్ ఫోర్స్ సూచనను అంగీకరించలేదు.

కంపెనీ డైరెక్టర్లలో ఒకడైన ఛార్లెస్ గ్రాంట్ భారతీయులకు విద్యా సౌకర్యాలను కల్గించి, ఆంగ్ల భాషను బోధించి, కొత్త విధానాలు ఉద్దేశాలకు చేరువగునట్లు కంపెనీ తగుశ్రద్ధ వహించాలని సూచించాడు. అతని ఉద్దేశంలో మహ్మదీయ పాలకులు భారతీయులకు పారశీక భాషను బోధించునట్లు బ్రిటీష్‌వారు ఆంగ్ల భాషను బోధించాలి. క్రమేణా ఆంగ్లమును బోధించు పాఠశాలలను స్థాపించి, విరివిగా ఆంగ్లభాషా గ్రంథాలను పంచి భారతీయులను ఆంగ్ల భాషా బోధనకు తర్ఫీదు చేయవలెనని అతడు భావించాడు. కంపెనీ ప్రభుత్వానికి చేసిన అట్టి సూచనలతోబాటు క్రైస్తవ మిషనరీలు గూడా ఆంగ్ల భాష మూలంగా మత ప్రచారం సులభమని భావించి, ఆంగ్ల విద్యావ్యాప్తికి సుముఖత చూపినారు. ప్రత్యేకంగా శేరంపూర్‌లోని మిషనరీలు, అట్టి ఆంగ్ల విద్యా విధానాన్ని ఉత్సాహంగా సమర్థిస్తూ వచ్చారు. 1800 సం॥లో లార్డ్ వెల్లస్లీ కలకత్తాలో ఫోర్ట్ విలియం కళాశాలను స్థాపించినాడు. ఇది కంపెనీ అధికారులకు భారతీయ భాషలు, ఆచార వ్యవహారాలు నేర్పడానికై ఉద్దేశింపబడింది. ఆ కళాశాల ఒక ఆంగ్ల హిందూస్థాని నిఘంటువు, హిందూస్థాని వ్యాకరణం మొదలగు అనేక ఇతర గ్రంథాలను ప్రచురించింది. కాని రెండేండ్లు మాత్రమే పనిచేసిన ఈ కళాశాల, 1802లో డైరెక్టర్ల ఉత్తర్వు మేరకు మూయబడింది.

1813 సంవత్సరంలో అమలు పరచబడిన ఛార్టర్ చట్టంలో హిందూదేశంలోని కంపెనీ అధీన ప్రాంతాలలోని విద్యాభివృద్ధికై, లక్ష రూపాయలు కేటాయించబడింది. ప్రాచీన భారతీయ భాషలను

పెంపొందించడానికి స్థానిక పండితులను ప్రోత్సహించడానికి శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి యీ ధనం ఉద్దేశించబడింది. భారతీయులు తమ భాషలలో పాండిత్యాన్ని గడించిన, కంపెనీ వ్యవహారాలకు పనికి వచ్చెదరని బ్రిటీష్‌వారు భావించారు. న్యాయస్థానాలలో బ్రిటీష్ న్యాయవేత్తలకు సంస్కృత, అరబిక్, పారశీక భాషలు తెలిసిన భారతీయుల సహాయం అవసరమైంది. సంస్థానాధీశులతో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడానికి గూడ, పారశీక అరబిక్ భాషలు తెలిసిన స్థానికుల సహాయం అవసరమైంది. రెవెన్యూ, వాణిజ్య విభాగాలు నిరక్షరాస్యులతో తమ విధులను కొనసాగించవలసి వచ్చినందున, ఆ విభాగాలలో పనిచేయు అధికారులకు స్థానిక భాషలు చేర్చుకొనవలసిన అవసరముండేది. కాని కంపెనీ ప్రభుత్వంలోని ఉన్నత పదవులను పొందుటకై ఆంగ్ల భాష, దానితో బాటు కొన్ని భారతీయ భాషలు తప్పనిసరిగా తెలిసి వుండవలసి వచ్చేది.

12.3 క్రైస్తవ మిషనరీలు

మత ప్రచారకులు విద్యావ్యాప్తికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. 1717 సం॥లో డేనిష్ మిషనరీలు మద్రాస్‌లో రెండు పాఠశాలలను స్థాపించారు. ఇతర ప్రాంతాలలో కూడా అట్టి పాఠశాలలు స్థాపించబడ్డాయి. 1793లో శేరంపూర్‌లో అనేక మిషనరీలు తమ కార్యకలాపాలను సాగించారు. 1820 నాటికి మిషనరీలు దేశవ్యాప్తంగా మత ప్రచారోద్యమాన్ని కొనసాగించినా, విద్యావ్యాప్తి వారి ప్రధాన ఉద్దేశంగాదు. ఆంగ్ల భాషావ్యాప్తి మత ప్రచారానికి సహాయపడునని వారు గుర్తించారు. ఆ ఉద్దేశంతో బొంబాయిలో **'విల్సన్ కళాశాల'**, మద్రాస్‌లో **'క్రైస్తవ కళాశాల'** స్థాపించబడ్డాయి. 1853 సంవత్సరంలో ఆగ్రాలో, **'సెయింట్ జాన్ కళాశాల'** ప్రారంభించబడింది. తర్వాత మచిలీపట్నం, నాగపూర్‌లలో గూడ మిషనరీ కళాశాలలు స్థాపించబడ్డాయి. ఈ విద్యా సంస్థలలో బైబిల్ పఠనం తప్పనిసరిగా కొనసాగించబడింది. మిషనరీలు విద్యావ్యాప్తితోబాటు, మత ప్రచారాన్ని మేళవించాలను భావన అట్టి కళాశాలల స్థాపనలో తెలుస్తూంది.

12.4 ఆంగ్ల విద్యపట్ల ఆదరణకు కారణాలు

పాశ్చాత్య విద్యావ్యాప్తికి, ఆంగ్లభాషా ప్రవేశానికి అతి ప్రధాన కారణం, ఆర్థిక అవసరం. ఆ భాషమూలంగా కంపెనీ పాలనలో ఉద్యోగావకాశముండునని, అధిక సంఖ్యలో ఆంగ్లభాషను అభ్యసించ ప్రారంభించారు. ఉదాహరణకు రాజా రామ్‌మోహన్ రాయ్, కంపెనీ ప్రభుత్వం కలకత్తా మదరసాను అభివృద్ధి చేయడాన్ని, అచ్చటి సంస్కృత కళాశాలకు అధిక నిధులను కేటాయించుటను, బెంగాల్‌లో ఇతర జాతీయ భాషలకై సంస్థలను స్థాపించుటను వ్యతిరేకించాడు. భారతీయులు ఐరోపీయా భాషలు నేర్చుకోవడానికై, విజ్ఞాన శాస్త్రాన్ని అభ్యసించడానికై, ప్రభుత్వం ఒక పాఠశాలను స్థాపించవలెనని అభ్యర్థించడానికని రామ్‌మోహన్ ఒక సంఘాన్ని గూడ స్థాపించాడు. ఫలితంగా 1817 **"హిందూ కాలేజి"** స్థాపించబడింది. మరుసటి సంవత్సరం కలకత్తా బిషప్‌చేత ఒక విద్యా సంస్థ ప్రారంభించబడింది. అది యువకులైన క్రైస్తవ మత ప్రచారకులకు తగు శిక్షణ యిచ్చుటతోబాటు హిందూ మహమ్మదీయ విద్యార్థులకు ఆంగ్ల భాషను ప్రబోధించుటకు గూడ ఉద్దేశించబడింది.

ఆంగ్లభాషా వ్యాప్తిని సమర్థిస్తూ రామ్‌మోహన్, కనబడు వస్తువులన్నీ మిథ్యయని బోధించు వేదాంత పద్ధతులచేత, యువకులు సంఘంలో సరియైన సభ్యులు కాజాలరని ఖచ్చితంగా తెలిపాడు. ఆధునిక విజ్ఞానశాస్త్ర అధ్యయనపు ఆవశ్యకతను గురించి రామ్‌మోహన్ ఇలా వ్రాశాడు. *"దేశాన్ని పూర్తిగా అంధకారంలో వుంచడం ప్రభుత్వ ఉద్దేశమైనచో, సంస్కృత విద్యకు ప్రాధాన్యతనివ్వవచ్చు. అట్లుగాక దేశ ప్రజల అభివృద్ధిని కాంక్షించినట్లైన, కొత్త ఉదాత్తమైన విద్యావిధానాన్ని చేపట్టి గణితం, సహజ వేదాంతం, రసాయన శాస్త్రం, శారీరక శాస్త్రం మొదలగు ఉపయోగపడు శాస్త్రాలను బోధించవలెను".*

కంపెనీ డైరెక్టర్లు గూడ ఆంగ్ల భాషా వ్యాప్తి, పాశ్చాత్య విద్యావిధానంవల్ల భారతదేశంలో తమ పాలనకు మేలు కలుగునని నమ్మారు. విద్యావంతులైన భారతీయులు పరిపాలనలో సహాయపడటానికి తయారగుదురని నమ్మకం వారికి కుదిరింది. బొంబాయి గవర్నరైన ఎల్ఫిన్‌స్టన్ ఆంగ్ల విద్యను, విజ్ఞాన శాస్త్రాన్ని బోధించు పాఠశాలలను స్థాపించమని విజ్ఞప్తి చేశాడు. *"ఉన్నత వర్గీయులకు మంచి విద్యాబోధన చేయించడం అత్యవసరం. ఉద్యోగాలకు స్థానికులను తయారు చేయునట్లే, విద్యావిధానపు ముఖ్య ఉద్దేశమని"* అతడు భావించాడు. బొంబాయిలో ఎల్ఫిన్‌స్టన్ ఒక పాఠశాలను స్థాపించి, ఆంగ్ల భాషను మాత్రమేగాక, ఆ భాషలో చరిత్ర, భూగోళశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం మొదలగునవి బోధించు ఏర్పాట్లు గావించాడు. 1833 సం॥లో అటువంటి పాఠశాలను పూనాలో గూడ ఏర్పాటు గావించాడు. 1834లో **'ఎల్ఫిన్‌స్టన్ కళాశాల'** బొంబాయిలో స్థాపించబడింది. పౌర పరిపాలనలో ఉన్నత ఉద్యోగాలు పొందగోరువారికై యీ కళాశాల ప్రధానంగా ఉద్దేశించబడింది.

12.5 ఆంగ్ల - ప్రాచ్య విద్యాభిమానుల మధ్య వివాదం

కంపెనీ పాలనలో క్రమేణా ఆంగ్ల భాషా బోధనా సంస్థలు ప్రారంభమగుటచే, ఆ భాషను అభ్యసించడానికి ప్రజలలో కుతూహలం ఎక్కువైంది. ఆంగ్ల భాషా గ్రంథాలకు గిరాకీ ఏర్పడి, అనేక గ్రంథాలు అమ్మబడ్డాయి. ప్రజాభిప్రాయానుసారం కలకత్తా, మద్రాసులోను, సంస్కృత కళాశాల యందును, ఆంగ్ల భాష బోధింప ప్రారంభించారు. 1811లో ప్రారంభమైన ఆగ్రా కళాశాలలో గూడ అట్టి ఆంగ్ల బోధనా తరగతులు నిర్వహించబడ్డాయి. అట్టి సందర్భాలలో బోధన ఆంగ్లంలో కొనసాగించవలెనా లేదా అరబిక్, పారశీక భాషలలో కొనసాగించవలెనా అను విషయంగా వాదోపవాదాలు బయలు దేరినాయి. అట్టి వివాదాన్ని పరిష్కరించడానికై ఒక కమిటీ నియమించబడింది. కాని ఆ కమిటీలో కొంతమంది భారతీయ విద్యలను బోధించాలని, మరికొందరు ఆంగ్లభాషను ప్రవేశ పెట్టాలని అభిప్రాయపడ్డారు. అందులోని ఒక సభ్యుడైన లార్డ్ మెకాలే, తన ఉద్దేశాన్ని 1835 సం॥లో తెలియజేస్తూ ఒక సుదీర్ఘ పత్రాన్ని తయారుచేసి, గవర్నర్-జనరల్, కౌన్సిల్‌కు నివేదించాడు. అతడు ఆంగ్లభాషాభిమాని. తన వ్యాసంలో అతడు, ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టమని కోరుతూ, *"భారతీయ భాషలన్నీ, పుస్తక భాండాగారంలోని ఒక చిన్న బీరువాలోగల ఆంగ్ల గ్రంథాలకు దీటురావని"* వాదించాడు. ఆంగ్లభాషా ప్రాముఖ్యతను గూర్చి తెల్పుతూ, *"ఆంగ్లం పరిపాలకుల భాష, అది ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యాన్ని పెంపొందించు భాష గూడ కాగలదు"* లార్డ్ మెకాలే ఉద్దేశంలో ఆంగ్లభాష మూలాన భారతదేశంలో ఒక కొత్త తరగతి ఉద్భవించగలదు. *"ఈ తరగతి వారు రక్తం, రంగులో భారతీయులుగాను భావాలు ఆచార వ్యవహారాలలో ఆంగ్లేయులుగాను వుంటారు"*. వేరు మాటలలో చెప్పవలెనన్న, భారతదేశంలో *"నల్లటి ఆంగ్లేయులను"* తయారు చేయుటయే మెకాలే ఆశయం.

12.6 ఆంగ్ల భాషను ప్రవేశపెట్టుట

గవర్నర్-జనరల్ బెంటింక్, మెకాలే ఉద్దేశాలతో ఏకీభవించి 1835 మార్చి 7వ తేదీన ఆంగ్ల భాషను బోధనా భాషగా గుర్తిస్తూ, ఉత్తరువు జారీ చేయబడింది. ఉన్నత వర్గీయులకు ఆంగ్ల భాష ద్వారా, విద్యావంతులను చేయుట, **"మెకాలే పద్ధతి"** లోని ప్రధాన ఉద్దేశం. సామాన్య ప్రజానీకానికి విద్యనందించుట మెకాలే ఉద్దేశంగాదు. *"మనకున్న పరిమితి నిధులతో భారతీయులందరికి విద్యాబోధన చేయ ప్రయత్నించుట అలవిగాని పని"* అని, అతడు విశదపరచాడు. ఆంగ్ల భాషను నేర్చుకొన్న ఉన్నత వర్గీయులు, ఇతర భారతీయ భాషలను ప్రభావితం చేయగలరని, వారు తక్కిన వారికి ఆంగ్ల భాషను బోధించుటకు కొత్త వర్గీయులుగా ఉందురని, అతడు భావించాడు.

ప్రభుత్వ ధనం ఆంగ్ల భాషా బోధనకు మాత్రమే ఉపయోగించవలెనను నియమం అనుసరింపబడిన వెంటనే, కలకత్తాలోని మహమ్మదీయులు ప్రభుత్వానికి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. అందులో ప్రభుత్వం మతం మార్పిడి ఉద్దేశంతో ఆంగ్ల భాషాభివృద్ధికి ప్రాముఖ్యత నిచ్చుచున్నారని, వారు ఆరోపించారు. అందుచే

BRAOU

గవర్నర్-జనరల్ బెంటింక్ పాఠశాలలో, కళాశాలలో మత ప్రసక్తి ఉండదని, ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని, విద్యార్థులకు క్రైస్తవ మత బోధన నిషేధించబడినట్లు ప్రకటించాడు.

1884 సం॥లో ప్రభుత్వ ఉద్యోగాలకు, పాశ్చాత్య విద్యనభ్యసించిన వారికి, ఆంగ్ల భాష తెలిసిన వారికి ప్రాధాన్యత యివ్వబడునని ప్రకటించబడింది.

12.7 చార్లెస్ ఉడ్ విద్యా నివేదిక, 1854

ఇంగ్లండ్‌లో బోర్డు ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడైన సర్ చార్లెస్ ఉడ్, ఆంగ్లజాతి, ఆంగ్లేయ సంస్థలు గొప్పవని భావించాడు. ఇవి తక్కిన వారికి అనుకరణయోగ్యమని అతని నమ్మకం. 1854లో ఉడ్ భారతదేశానికి అవసరమైన విద్యావిధానంపై, ఒక తులనాత్మక పత్రాన్ని రూపొందించాడు. "ఇది హిందూ దేశంలో ఆంగ్ల విద్యకు మాగ్నకార్ట" గా పిలువబడింది. ఇది అంతకు మునుపు యివ్వబడిన సలహాలన్నిటికన్నా, చాలా విశాల పరిధి గలిగి, ఉత్తరోత్తర విద్యావ్యాప్తికి ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలను స్థూలంగా సూచించింది.

ఐరోపాలో అభివృద్ధి గాంచిన కళలు, శాస్త్రాలు, వాఙ్మయం, వేదాంతం మొదలగు వాటిని భారతీయులలో వ్యాప్తి చేయుట ఆంగ్ల విద్యావిధానపు ప్రధాన ఆశయమని ఉడ్ ప్రకటన తెలియజేసింది. బోధనా భాషకు సంబంధించి ఉడ్, ఉన్నత విద్యకు ఆంగ్లం, ప్రాథమిక విద్యకు ప్రాంతీయ భాషలు బోధనా భాషలుగా వుండునని ప్రకటించాడు. ప్రభుత్వేతర పాఠశాలలకు ప్రభుత్వం ధన సహాయం స్థాపించారు. ఉడ్ ప్రకటనలో కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాలలో విశ్వవిద్యాలయాలు స్థాపించాలని సూచించబడింది. అవి లండన్ విశ్వ విద్యాలయ ప్రతిపదికపై వృత్తి విద్యలకు, సాంకేతిక పాఠశాలల స్థాపనకు గూడ ప్రాధాన్యత ఒసగబడింది. స్త్రీ విద్యకు కూడ ఉడ్ ప్రకటనలో ప్రాముఖ్యం యివ్వబడింది.

ఉడ్ సూచనలన్నీ ప్రభుత్వం అమలుపరిచింది. మూడు విశ్వవిద్యాలయాలు 1857 సం॥లో ప్రారంభించబడ్డాయి. బెంతూన్ అనునతని అకుంఠిత దీక్షచేత, బాలికా పాఠశాలలు అధునాతన పద్ధతిలో స్థాపించబడి, ప్రభుత్వ ధన సహాయం అందజేయబడింది. ఉడ్ ఉత్తరువులోని ఉద్దేశాలు, పద్ధతులు, విద్యారంగంలో దాదాపు అర్ధశతాబ్దం ఆచరణలో కొనసాగాయి. ఈ సమయంలో విద్యావ్యాప్తి చురుకుగా కొనసాగింది. స్వదేశీ విధానం క్రమేణ సన్నగిల్లి, పాశ్చాత్య విధానం వ్యాపించింది. పాఠశాలలన్నీ బ్రిటీష్ ప్రధానోపాధ్యాయులచే నడుపబడినవే. మిషనరీలు గూడ విద్యాలయాలను స్థాపించి నడపడంలో ప్రముఖ పాత్రను వహించాయి. 1882 సం॥లో హంటర్ కమీషన్ నివేదిక సమర్పించుబడువరకు ఉడ్ సూచనలు తప్ప మరొకటి అమలులో లేవు.

12.8 ఆంగ్ల విద్యా ప్రభావం

పాశ్చాత్య విద్యావిధానం ఆంగ్లభాషా వ్యాప్తి భారతదేశ ప్రజానీకంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. ప్రజలు అధునాతన ఉద్దేశాలకు, మరేయితర భావాలకు, ప్రజాస్వామ్య, జాతీయతా సిద్ధాంతాలకు అలవాటుపడినారు. దృక్పథాలలో ఏకీయత కలుగజేసిన ఆంగ్ల విద్య, భారతీయులలో ఒక చైతన్యాన్ని కలుగజేసిందని చెప్పవచ్చు. భారత ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను, చరిత్ర, నాణేలు, పురాతన కట్టడాలు మొదలైన వాటిని గూర్చి చదువుటచే, ప్రాచీన భారత సంస్కృతీ నాగరికతల విలువలు తెలిసినాయి. మౌర్యులు, గుప్తులు, పల్లవులు, చాళుక్యులు మొదలుగా గల ప్రాచీన రాజవంశాల గూర్చి ఆనాటి పరిస్థితుల గూర్చి విదేశీయులు చదివి వాటిపై ఆసక్తి చూపారు. స్వదేశ ప్రాచీన ప్రాశస్త్యం, భారతీయులకు ఆత్మస్థైర్యాన్ని గలిగించి, భారత చరిత్ర, వాఙ్మయాలపై గౌరవాన్ని ఇనుమడింపజేసింది. ఆంగ్ల భాషా ప్రభావంతో, భారతీయ భాషలు వికాసం చెందాయి. దీనిచే సామాన్యులు గూడ భావ ఐక్యత సాధించుటకు వీలైంది.

BRAOU

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. విలియమ్ కాలేజి ఎందుకు స్థాపించబడింది?

.....

.....

.....

.....

2. భారతదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టడాన్ని, రాజా రామ్‌మోహన్ రాయ్ ఎందుకు సమర్థించాడు.

.....

.....

.....

.....

12.9 వార్తా పత్రికల వ్యాప్తి

19వ శతాబ్దంలోని ముఖ్యమైన వార్తాపత్రికలు బెంగాలుకు చెందిన హిందూపేట్రియాట్, అమృతబజార్ పత్రిక, ఇండియన్ మిర్రర్, బెంగాలీ, సోమ్‌ప్రకాష్, సంజీవని, మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన రాస్తగోఫ్తర్, నేటివ్ ఒపినియన్, ఇందు ప్రకాష్, మరాఠా, కేసరి, మద్రాస్‌కు చెందిన హిందూ, తమిళంలో స్వదేశమిత్రన్ తెలుగులో ఆంధ్రపత్రిక, మళయాళంలో కేరళ పత్రిక, ఉత్తర ప్రదేశ్‌లోని అడ్వకేట్, హిందుస్తానీ, ఆజాద్, పంజాబ్‌లోని ట్రూచూనన్, అక్బరీఆమ్, కోహినూర్ మొదలగునవి.

పాశ్చాత్య విద్యావ్యాప్తికి పత్రికలు గూడ ప్రధాన పాత్ర వహించాయి. దేశాభిమానాన్ని పెంపొందించి, రాజకీయ చైతన్యాన్ని గలిగించడానికి గూడ పత్రికలు తోడ్పడ్డాయి. భారతీయ పత్రికల చరిత్ర ఐరోపీయుల రాక తర్వాత మాత్రమే ప్రారంభమౌతుంది. పోర్చుగీసువారు మొదటిసారిగా భారతదేశానికి ముద్రణాలయాన్ని తెచ్చినట్లు తెలుస్తుంది. 1557లో వారు గోవాలో మొట్టమొదటి పుస్తక ప్రచురణను కావించారు. 1684 సం॥లో బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ బొంబాయిలో ఒక ముద్రణాలయాన్ని స్థాపించింది. సుమారు ఒక శతాబ్దం, బ్రిటీష్‌వారు ఎట్టి వార్తా పత్రికను మన దేశంలో స్థాపించలేదు. వార్తాపత్రికలమూలంగా బ్రిటీష్‌వారి పాలనా లోపాలు మాతృదేశానికి అందునని వారి భయం. 18వ శతాబ్దంలో ఆంగ్లో ఇండియన్లు, ఐరోపీయులు పత్రికలు స్థాపించ ప్రారంభించారు. ఈ తొలి పత్రికలు సమాచారము నందజేయడానికి, పొద్దుపోకకు ఉద్దేశించబడినాయి.

1780 సం॥లో **'బెంగాల్ గెజెట్'** అను వార పత్రిక , జేమ్స్ ఆగస్టస్ హికీ అనునతనిచే ప్రారంభించబడింది. ఆ పత్రిక 1782 సంవత్సరంలో గవర్నర్-జనరల్ వారన్ హేస్టింగ్స్‌ను విమర్శించిన కారణంగా అది మూతబడింది. **'బెంగాల్ గెజెట్'** తర్వాత అనేక వార్తాపత్రికలు వచ్చాయి. **"కలకత్తా-గెజెట్'** (1784), **'బెంగాల్ జర్నల్'** (1785) **'కలకత్తా క్రానికల్'** (1786), **'మద్రాస్ కొరియర్'** (1788) **'బాంబే హెరాల్డ్'** (1789) మొదలగునవి ప్రధానమైన పత్రికలు. వాటి ప్రచురణలు మిక్కిలి పరిమితమై యుండినాయి. పత్రికా చట్టాలు లేనికారణంగా ఆ రోజులలో పత్రికలు వాటి పనితీరు కంపెనీ అధికారులపై ఆధారపడి యుండేవి.

పత్రికలపై సెన్సారును మొదట 1799 సం॥లో వెల్లస్లీ విధించాడు. ఒకవైపు ఫ్రెంచివారితోను, మరొక వైపు టిప్పు మొదలైన స్వదేశీ సంస్థానాధీశులతో, బ్రిటీషువారు నిరంతర యుద్ధాలను కొనసాగించిన సమయమిది. తన పలుకుబడిని కించపరచు ఏ విమర్శను వెల్లస్లీ సహించలేదు. ప్రతి పత్రికలో ప్రచురణ కర్త పేరు, సంపాదకుని పేరు, సొంతదారుని పేరు, తప్పనిసరిగా ప్రచురించబడవలెనని తెలియచేశాడు. దీనిని ఉల్లంఘించిన వారికి శిక్షలు విధించబడేవి. 1807 సం॥లో సెన్సార్‌షిప్ చట్టం, వార్తా పత్రికలకే గాక కరపత్రాలకు, పుస్తకాలకు గూడ వర్తించబడింది.

BRAOU

లార్డ్ హేస్టింగ్స్ (1813 - 1823) పత్రికా స్వాతంత్ర్యాన్ని పూర్తిగా నమ్మి, తన ఉదాత్త భావాలను కార్య రూపంలోనికి మార్చదలచాడు. పత్రికలపై గల ఆంక్షలను రద్దుపరిచాడు. కాని పత్రికలు ఉన్నతాధికారులపై విమర్శలు విసరరాదని సూచించబడింది. ఆంక్షలు లేని కారణంగా అనేక కొత్త పత్రికలు ప్రచురణకు వచ్చాయి. జె.ఎస్.బకింగ్‌హామ్ అనునతడు 1818లో **'కలకత్తా జర్నల్'**ను ప్రారంభించాడు. అతడు నిర్భయంగా తన రచనలను కొనసాగించేవాడు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, మద్రాస్ గవర్నర్‌ను, కలకత్తా బిషప్ మొదలగు వారిని దుయ్యబట్టడానికి వెనుదీయలేదు.

ప్రభుత్వం సర్ థామస్ మన్రోను భారతదేశంలోని పత్రికల సమస్యల గూర్చి పరిశీలించడానికై నియమించింది. ఆంగ్ల పత్రికలకు సంబంధించినంతవరకు, ఎట్టి భయంలేదని పత్రికా స్వాతంత్ర్యం చేత భారతీయ పత్రికలు సైన్యంలో అసంతృప్తిని వెదజల్లజేసి, ప్రభుత్వ పతనానికి కూడ పని చేయవచ్చునని, అతడు అభిప్రాయపడినాడు. అతని ఉద్దేశంలో *"పత్రికా స్వాతంత్ర్యం, విదేశీ పాలన అనునవి, ఒకదానికొకటి విరుద్ధమైనవి. అవి ఎప్పుడూ, సఖ్యంగా సహజీవనం కొనసాగించవు"*.

మన్రో సూచనలమేరకు, ప్రభుత్వం 1823 లో పత్రికా చట్టాలను రూపొందించింది. దీని ప్రకారం, ప్రభుత్వ ఉత్తరువు లేనిదే ఏ పత్రిక గాని, గ్రంథంగాని ప్రచరించబడరాదు. ఉత్తరువు పొంది, ప్రచురించబడినవి, ప్రభుత్వ పరిశీలనకై సమర్పించబడాలి. రాజా రామ్‌మోహన్ రాయ్, ద్వారకానాథ్ ఠాకూర్ మొదలైనవారు అట్టి పత్రికా చట్టాలకు అసమ్మతి తెలిపినా అవి 1823 ఏప్రిల్ 15వ తేది అమలులోనికి వచ్చినాయి.

లార్డ్ విలియం బెంటింక్, పత్రికల ఎడ కొంత సహకార భావాలను కలిగినవాడు. అతడు పత్రికలపై గల ఆంక్షలను తొలగించకపోయినా, అవి ఏ అంశాన్నయినా క్షుణ్ణంగా చర్చించవచ్చని సూచించాడు. చార్లెస్ మెట్కాఫ్ పత్రికల స్వాతంత్ర్యాన్ని ప్రకటించి *"భారత పత్రికలకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించిన వాడు"*గా పేరుపొందాడు. లార్డ్ మెకాలే గూడా, పత్రికలు ఎట్టి అవరోధాలు కలిగియుండకూడదని భావించాడు.

1857 తిరుగుబాటు తర్వాత ప్రభుత్వం పత్రికలకు గల స్వాతంత్ర్యాలను హరించింది. రిజిస్ట్రేషన్ పద్ధతితోబాటు లైసెన్స్ నిర్బంధాన్ని గూడ ప్రవేశపెట్టింది. ముద్రణకు ముందు అనుమతి పొందడం, ముద్రణాలయాలు స్థాపించటానికి అనుమతి పొందడం తప్పనిసరైంది. ఏ పత్రికనైనా ప్రభుత్వం నిషేధించడానికి వీలేర్పడింది.

12.10 నూతన సాహిత్య ధోరణులు

పాశ్చాత్య వాఙ్మయ పద్ధతులు, 9వ శతాబ్దపు భారతీయ భాషా వికాసం పై గొప్ప ప్రభావాన్ని చూపాయి. ఆంగ్ల వాఙ్మయం ద్వారా ఐరోపీయ భావాలను అవగాహన చేసుకొనడంచేత, భారతదేశంలో భాషా పునర్వికాసం కలిగింది. ఇది బెంగాల్ లో మొదట ప్రారంభమైంది. బెంగాలీ భాషలోని వచన రచనా చరిత్ర, ఫోర్ట్ విలియం కళాశాల స్థాపనతో ప్రారంభమైంది. దీనికి తోడ్పడిన వారిలో ముఖ్యులు రాజా రామ్‌మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ మొదలగువారు. **'వందేమాతరం'** పద్య రచయితయైన బంకించంద్ర ఛటర్జీ, బెంగాలీ భాషలోని మొదటి నవలకారుడు. దేశంలో పేరు బడసిన ఆనాటి నవలాకారులు మైకేల్ మధుసూధన దత్, హేమచంద్ర బెనర్జీ, నవీన చంద్రసేన్ మున్నగువారు. రవీంద్రనాథ్ ఠాకూర్ పేరుమోసిన రచయిత. పద్య, గద్య రచనలో, కథానికలు, నాటకాలు నవలా రంగంలో బెంగాలీ వాఙ్మయం మిక్కిలి అభివృద్ధి గాంచింది.

బెంగాలీ భాషవలె, హిందీ గద్యం గూడ ఆంగ్ల భాషా ప్రభావంచేత వికాసం చెందింది. క్రైస్తవ మిషనరీలు మత గ్రంథాలను తర్జుమా చేయించుట చేతను, ఫోర్ట్ విలియం కళాశాల వారు విద్యార్థులకు ఉపయోగపడు పాఠ్యపుస్తకాలను రూపొందించుటకు శ్రద్ధ చూపిన కారణంగాను, హిందీ గద్యం ప్రోత్సాహాన్ని పొందింది. బెనారస్‌కు చెందిన భారతేందు హరిశ్చంద్ర, ఆధునిక హిందీ వాఙ్మయ పితామహులలో ఒకడు. ఆర్యసమాజ కార్యకర్తలు తమ సిద్ధాంతాల వ్యాప్తికి హిందీని ఉపయోగించి, ఆ భాషా పెంపుకుదోహదం చేశారు.

భారతదేశంలో ఇంగ్లీష్ తూర్పు ఇండియా కంపెని, క్రైస్తవ మత ప్రచారకుల కృషి ఫలితంగా పాశ్చాత్య పద్ధతిలో విద్యా బోధన పెరగటంచే విద్యావంతులైన శ్రేణివర్గం పెరగటం మాత్రమే గాక అచ్చు మాధ్యమిక (Print media) ఉపయోగం ప్రాధాన్యత పెరిగాయి. విద్యా వ్యాప్తి, అచ్చు యంత్రం ఉపయోగ ఫలితంగాను పాశ్చాత్య సాంస్కృతిక విలువలు, పాశ్చాత్యతత్వం విద్యావంతులైన భారతీయులను ప్రభావితం చేశాయి. తత్ఫలితంగా భారతీయులలో స్వదేశాభిమానంతోపాటుగా భారతీయ సంస్కృతిపట్ల విమర్శనాత్మక, విశ్లేషణాత్మక దృక్పథం పెరిగింది. ఈ విజ్ఞాన విస్ఫోటనంవల్ల పాశ్చాత్య సాహిత్య పద్ధతులు, భావాలు 19వ శతాబ్దంలోనే భారతీయ భాషా సాహిత్యంలో చోటు చేసుకోవటం ఆరంభమైంది. ప్రాచీన కాలంనుంచి సంస్కృత, పాళీ భాషలలో విశేషమైన సాహిత్య సృష్టి భారతదేశంలో జరిగిన మాట వాస్తవమే అయినప్పటికి కొత్తగా భారతీయ భాషా సాహిత్యంలోకి పాశ్చాత్య సాహిత్య ప్రక్రియలైన నవల, చిన్నకథ, నాటకం, నాటిక, వచనంలో వ్యాసాలు వచ్చి చేరాయి. అంతవరకు భారతీయ భాషా సాహిత్యంలో శిష్ట పద్యకవిత్వానికి మాత్రమే గౌరవ ప్రదమైన స్థానం ఉండేది.

పైన పేర్కొన్న పాశ్చాత్య సాహిత్య భావాల ప్రభావం ముందుగా బెంగాల్‌లో కనిపిస్తుంది. కలకత్తాలో స్థాపించబడిన ఫోర్టు విలియం కళాశాల ఫలితంగా బెంగాలీ వచన సాహిత్యం పెరిగింది. తొలి బెంగాలీ రచన సాహిత్యకారుల్లో ఎన్నదగిన వారు రాజారామ్‌మోహన్ రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్లు. 'వందేమాతరం' గేయ రచయిత, ఆనాటి ప్రసిద్ధ బెంగాలీ కవులలో ముఖ్యులు. మైకేల్ మధుసూధన దత్తు, హేమచంద్ర బెనర్జి, నవీన్ చంద్రసేన్ తరువాతి కాలానికి చెందిన రవీంద్రనాథ టాగూర్, బెంగాలీలో సాహిత్య ప్రక్రియలైన వచనం, కవిత్వం, నవల, చిన్న కథ, నాటకాలు బహుళంగా వ్యాప్తిలోకి వచ్చాయి.

ఇతర దేశభాషలైన హిందీ, తమిళం, మరాఠి, తెలుగు, గుజరాతీలు కూడా బాగుగా అభివృద్ధి చెందాయి. ఆధునిక హిందీ భాషా నిర్మాతలలో గొప్పవాడైన భారతేందు హరీష్ చంద్ర (బెనారస్) ను ముందుగా గుర్తుంచుకోవాలి. ఉత్తర భారతదేశంలో హిందీ భాష బహుళ వ్యాప్తి పొందుటకు ముఖ్య కారణం ఆర్య సమాజం, తన భావజాలమును హిందీలో ప్రచారం చేయుటయే.

బాంబేలో విశ్వవిద్యాలయ స్థాపనతో బాంబే ప్రెసిడెన్సీలో విద్యా వ్యాప్తికి ఎంతో దోహదం జరిగింది. ఆనాటి సాహిత్య వాదులలో అధిక సంఖ్యాకులు సాంఘిక సంస్కర్తలుగానో, జాతియాతా వాదులుగానో విశేషమైన కీర్తిని గడించిన వారు కావటమే. ఈ కోవకు చెందిన వాడే ప్రసిద్ధుడైన హరినారాయణ ఆప్టే. గుజరాత్‌లో సామాజికమైన చాంధస వాదంపై భయమెరుగక ప్రతిఘటించినవాడు నర్మద. తమిళనాడు ప్రజానీకాన్ని చైతన్య వంతులైన దేశ భక్తులుగా, జాతీయవాదులుగా రూపొందించిన వారిలో ప్రముఖులు సుబ్రహ్మణ్య భారతి, రామలింగ స్వామిగళ్‌లు ఆంధ్ర దేశంలో కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తులు స్త్రీ విమోచనకు, స్త్రీ విద్యా వ్యాప్తికి, విధవా వివాహములు ప్రచారం చేయుటకు వచనమును, నాటకములను తమ మాధ్యమంగా ఎన్నుకొన్నారు. ఆంధ్ర దేశంలో ఆధునికతకు ఆద్యులుగా పేర్కొనదగినవారు కందుకూరి, గురజాడలు.

బొంబాయి విశ్వవిద్యాలయ స్థాపనానంతరం ఉన్నత విద్యావ్యాప్తితోబాటు మరాఠీ భాషాభివృద్ధి కొనసాగింది. నూతన సాహిత్య ప్రక్రియలు దేశ భాషా సాహిత్యాల్లో పెరగటం చేత కనిపించే విశిష్ట పరిణామమేమనగా చదువుకున్న వారిలోను, చదువులేని వారిలోను సాంఘిక దురాచారాలవల్ల కలుగుతున్న హాని, ఆ దురాచారాలను రూపు మాపాలన్న ఆలోచన పెరగటం. సాంఘిక సంస్కరణతోపాటు బ్రిటీష్‌వారు సాగిస్తున్న ఆర్థిక, సామాజిక దోపిడి కూడా తెలుసుకొన్న భారతీయులు ఆధునికి దృక్పథం పెంచుకొనుటకు ఎంతగానో దేశ భాషా సాహిత్యంలో చోటు చేసుకొన్న నూతన సాహిత్య ప్రక్రియలో, ధోరణులు ఎంతగానో సహాయపడ్డాయని చెప్పటం అతిశయోక్తి ఏమాత్రం కాదు.

మరాఠీ నవలాకారుడైన హరినారాయణ ఆప్టే, గొప్ప సంఘసంస్కర్త కూడా. గుజరాత్ ప్రాంతంలో ఆంగ్లభాషా వ్యాప్తి, క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలు, స్థానిక భాషాభివృద్ధికి దోహదం చేశాయి. సుప్రసిద్ధ

BRAOU

గుజరాతీ రచయిత నర్మదా శంకర్ సాంఘిక దురాచారాలను ఎదుర్కొని పేరు పొందినాడు. తమిళ ప్రాంతంలో వాఙ్మయం కొత్త రీతులు సంతరించుకొని, ఆంగ్ల భాషా ప్రభావాన్ని తెలియపరచింది. గత శతాబ్దపు ప్రధాన తమిళ కవి, రామలింగస్వామి, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వారివల్ల తెలుగు వాఙ్మయంలో సైతం, ఆంగ్ల భాషా ప్రభావం ప్రసరించింది.

దేశ వ్యాప్తంగా జరిగిన యీ వాఙ్మయ వికాసం, ప్రజలను అనేక రంగాలలో ప్రభావితం గావించింది. భాషావికాసానికి మాత్రమే పరిమితమై యుండక, సాంఘిక సంస్కరణోద్యమాలకు, తదితర కార్యక్రమాలకు, ప్రజలను ఉత్తేజ పరచింది. ఆంగ్ల భాషా ప్రభావం, దానివల్ల ఏర్పడిన క్రొత్త భావాల పరంపర, దేశంలో భావ ఐక్యతకు దానినుంచి రాజకీయ చైతన్యానికి కూడ దారిచూపాయి. పత్రికలు గూడ ఇందుకు దోహదం చేయగలిగినాయి. విదేశీయులు గూడ, భారతదేశపు నిజస్వరూపాన్ని, ప్రాచీన సంస్కృతీ నాగరికతలను అవగాహన చేసుకొనడానికి తోడ్పడినారు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. బోధనా భాష గురించి ఉడ్ చేసిన సిఫారసులేవి?

.....

.....

.....

.....

2. ఆంగ్లవిద్య భారతీయ భాషలను, సాహిత్యాన్ని ఎలా ప్రభావితం చేసింది?

.....

.....

.....

.....

3. భారతదేశంలో మొదటి వార్తా పత్రికను ఎవరు ప్రారంభించారు?

.....

.....

.....

.....

12.11 సంగ్రహంగా

1. 1813లో చార్టర్ చట్టమూ భారతదేశంలో విద్యాభివృద్ధికి, సంవత్సరానికి లక్షరూపాయలు కేటాయించడంతో, విద్యాభివృద్ధికి మొదటి చర్య తీసుకోబడింది.
2. పాఠశాలలు, కళాశాలలు స్థాపించి, క్రైస్తవ మిషనరీలు కూడా విద్యా వ్యాప్తికి సేవ చేసినారు.
3. భారతదేశంలో ఆంగ్లభాష, పాశ్చాత్య విద్య ప్రోత్సహించాలని, రాజా రామ్‌మోహన్ రాయ్ వాదించాడు. ఆంగ్ల విద్యను అతను బలపరచడంవల్ల భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడం సులభమయింది.
4. ఆంగ్ల విద్యకు అనుకూలంగా మెకాలే తయారు చేసిన పత్రంవల్ల విలియం బెంటింక్ భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రోత్సహించడానికి నిర్ణయించాడు.

BRAOU

5. 1854లో వెలువడిన ఉడ్స్ ప్రకటన భారతదేశంలో విద్యాభివృద్ధికి ఒక ప్రణాళిక. 1882 వరకు, ఉడ్స్ ప్రకటనలోని ప్రతిపాదనలే, బ్రిటీష్ ప్రభుత్వ విద్యావిధానంలో ముఖ్యాంశాలుగా వున్నాయి.

6. భారతీయులు, ఆధునిక పాశ్చాత్య ఆలోచనా సరళి దృక్పథం అలవరచుకోవడానికి ఆంగ్ల విద్యతోడ్పడింది. ఆంగ్లభాష, భారతీయులకు ఒక అనుసంధాన భాషగా ఏర్పడడమే కాకుండా భారతీయులలో జాతీయదృక్పథం అభివృద్ధి కావడానికి తోడ్పడింది.

7. 18వ శతాబ్దం చివరి భాగంలో 19వ శతాబ్దంలో ఆంగ్ల, దేశీయ భాషలలో వార్తా పత్రికలు అభివృద్ధి చెందినాయి. ఆంగ్లేయుల యాజమాన్యంలో వున్న ఆంగ్ల పత్రికలపై ఆంక్షలు లేవు. కానీ భారతీయ పత్రికలపై అనేక ఆంక్షలు విధించబడ్డాయి.

8. పాశ్చాత్య భావాల, సాహిత్య పంథాల ప్రభావంవల్ల భారతీయ భాషలు, సాహిత్యము, 19వ శతాబ్దంలో అభివృద్ధి చెందినాయి.

12.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. ఫోర్ట్ విలియం కాలేజీని 1800 సంవత్సరంలో కంపెనీ అధికారులకు శిక్షణ ఇవ్వడానికి వెల్లస్లీ ప్రారంభించినాడు.

2. ఆంగ్ల విద్యవల్లనే, భారతీయులకు ఆధునిక, వైజ్ఞానిక శిక్షణ లభిస్తుందని రాజా రామ్‌మోహన్ రాయ్ విశ్వసించాడు. అందువల్ల అతను భారతదేశంలో ఆంగ్ల విద్యా ప్రవేశాన్ని బలపరచాడు.

II. 1. ప్రాథమిక స్థాయిలో ప్రాంతీయ భాష, ఉన్నత స్థాయిలో ఆంగ్లభాష, బోధనా భాషలుగా వుండాలని ఉడ్ సిఫారసు చేశాడు.

2. ఆంగ్ల విద్య ప్రభావంవల్ల భారతీయ భాషలలో నూతన భావాలు, నూతన ప్రక్రియలు ప్రవేశించాయి. ఆంగ్ల విద్య, సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూడా దారి తీసింది.

3. 1780లో జేమ్స్ అగస్టస్ హికీ, బెంగాల్ గజెట్ అనే మొదటి వార్తా పత్రికను ప్రారంభించాడు.

12.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వ విద్యావిధానాన్ని విశదీకరించండి.
2. భారతదేశంలో ఆంగ్ల విద్యా విధాన ప్రభావాన్ని అంచనా వేయండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. భారతదేశంలో విద్యావ్యాప్తికి, క్రైస్తవ మిషనరీలు చేసిన సేవ వివరించండి.
2. 19వ శతాబ్దంలో భారతదేశంలో వార్తాపత్రికల వ్యాప్తిని గురించి తెల్పండి.
3. మెకాలే, ఉడ్ నివేదికల గురించి వ్రాయండి.

12.14 ఉపయుక్త గ్రంథాలు

1. Bipan Chandra : *Modern India*
2. Bhatia : *History and Social Development*
3. Dayal, B : *The Development of Modern Indian Education*
4. Dutt, R.C. : *India Today*
5. Mukharjee, S.N : *History of Education in India*
6. Thompson & Garrett : *Rise and Fulfilment of British rule in India*
7. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం*

BRAOU

భాగం - 13: వ్యవసాయం, వలసవాదం, తిరోగమన పారిశ్రామికీకరణ

విషయక్రమం

13.0 లక్ష్యాలు

13.1 పరిచయం

13.2 బ్రిటీష్‌వారి దోపిడీ వలస విధాన పాలనలో మూడు దశలు

13.3 సాంప్రదాయ భారతీయ ఆర్థిక వ్యవస్థ

13.4 బ్రిటీష్ పరిపాలనా ప్రభావం

13.4.1 వ్యవసాయంపై ప్రభావం

13.4.1.1 వ్యవసాయ రుణభార పెరుగుదల

13.4.2 కరువులు

13.5 కరువు నివారణ విధానాలు

13.6 భారతదేశంలో బ్రిటీష్ పెట్టుబడి పెరుగుదల; రైల్వేలు-నీటిపారుదల

13.7 తోటల పరిశ్రమ

13.8 బొగ్గుగనుల పరిశ్రమ

13.9 నూలు మిల్లుల పరిశ్రమ

13.10 జనపనార పరిశ్రమ

13.11 ఇనుము, ఉక్కు పరిశ్రమ

13.12 ఇతర పరిశ్రమలు

13.13 పరిశ్రమలు నడుపుటలో ఏజెన్సీ విధానం

13.14 స్వదేశీ, విదేశీ పెట్టుబడి,

13.14.1 పారిశ్రామిక క్షీణత లేదా తిరోగమన పారిశ్రామికీకరణ

13.15 సంగ్రహంగా

13.16 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

13.17 పరీక్ష నమూనా ప్రశ్నలు

13.18 ఉపయుక్త గ్రంథాలు

13.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. సాంప్రదాయ భారతీయ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు.
2. భారతీయ వ్యవసాయ వ్యవస్థపై బ్రిటీష్‌వారి ప్రభావము, బ్రిటీష్ పాలనలో కరువులు.
3. భారతదేశంలో బ్రిటీష్‌వారి క్షామనివారణ విధానము
4. భారతదేశంలో రైల్వేలు, నీటి పారుదల సథకాల్లో బ్రిటీష్ పెట్టుబడులు, బ్రిటీష్ పాలనలో తోటలు, బొగ్గుగనులు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు, నూలు మిల్లులు, జనపనార పరిశ్రమల అభివృద్ధి.
5. పరిశ్రమలు నడుపుటలో ఏజెన్సీ విధానం పాత్ర

13.1 పరిచయం

బ్రిటీష్ పరిపాలనా స్థాపన భారతదేశంపైన, భారత ఆర్థిక విధానంపైన, గొప్ప ప్రభావాన్ని చూపింది. ఆర్థికంగా తమ అధికారాన్ని అభివృద్ధి చేసుకొనడానికి బ్రిటీష్ విధానాలు రూపొందించబడ్డాయి.

BRAOU

ఈస్టిండియా కంపెనీ ప్రధానంగా వాణిజ్య సంస్థ. అందుచే భారతీయ వస్తువుల ఎగుమతిపై ఎక్కువ శ్రద్ధ చూపింది. అట్టి ఎగుమతులకుగాను, వస్తువులు తయారుచేయు పరిశ్రమలకు, ధనం ఋణాలుగా అందజేయబడేది. కాని 1760 సం॥లో పారిశ్రామిక విప్లవం జరిగిన పిదప ఇంగ్లండులో తయారైన వస్తువులకు, భారతీయ వస్తువులు పోటీగా కనిపించాయి. అందుచే మన దేశ వస్తువుల ఎగుమతిని, బ్రిటీష్ పారిశ్రామికవేత్తలు ప్రతిఘటించారు. అందుచే బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ క్రమేణా ఇచ్చటి పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఉపసంహరించింది. ముడిసరుకులను తమదేశానికి పంపడానికి ప్రాధాన్యత నిచ్చింది.

1858 సం॥లో భారతదేశ పరిపాలనను బ్రిటీష్ ప్రభుత్వం సరాసరి చేపట్టిన పిదప, వాణిజ్య విధానంలో ఎక్కువ జోక్యం కలిగించుకొనరాదని నిశ్చయించుకొన్నది. పరిశ్రమలు తదితర ఆర్థిక విషయాలలో ప్రభుత్వం జోక్యం అనవసరమని భావింపబడింది. హిందూదేశంలో గూడ స్వదేశీ వస్తువులు దిగుమతియైన బ్రిటీష్ పారిశ్రామికోత్పత్తుల పోటీకి నిలువలేకపోయాయి. ప్రభుత్వ స్వేచ్ఛా వ్యాపార విధానం, మనదేశ చేతిపని వస్తువుల గిరాకి పడిపోవడానికి ప్రధానకారణం. కుటీర పరిశ్రమలలో పనిజేసిన వారు ఉపాధి కోల్పోయిన కారణంగా వ్యవసాయ రంగంపై దృష్టి మళ్ళించారు. క్రమేణా భారతదేశం ఆహార ధాన్యాలు, ఇతర వ్యవసాయోత్పత్తులను ఇంగ్లండుకు ఎగుమతి చేయవలసిన వచ్చింది. స్వేచ్ఛా వ్యాపార పద్ధతి, 18వ శతాబ్దంలో పారిశ్రామికంగా ముందడుగు వేసిన భారతదేశాన్ని 19వ శతాబ్దంలో కేవలం వ్యవసాయాత్మక దేశంగా మార్చింది.

13.2 బ్రిటీష్‌వారి దోపిడీ వలస విధాన పాలనలో మూడుదశలు

రమేశ్‌చంద్ర దత్ అను భారతీయ ఆర్థిక చరిత్రకారుడు, బ్రిటీష్‌వారి దోపిడీ విధానపాలనలో మూడు దశలు గలవని అభిప్రాయ పడ్డాడు. అతని ప్రకారం మొదటిది 1757 నుంచి 1813 వరకు గల వాణిజ్య ప్రధాన దశ. ఈ సమయంలో కంపెనీ తన మిగులు ధనాన్ని వెచ్చించి తయారైన వస్తువులను తక్కువ ధరలకు కొని, గుత్తాధికారంతో అమ్ముతూ వచ్చింది. పారిశ్రామిక విప్లవం యీ పద్ధతిని పూర్తిగా మార్చింది. అందుచే 1813 నుంచి 1858 వరకు గల కాలంలో స్వేచ్ఛావ్యాపారం, పారిశ్రామిక పెట్టుబడిలో పెరుగుదల జరిగి, భారతదేశం బ్రిటీష్‌వారి వస్తుసముదాయానికి మార్కెట్‌గా మారడం, వారి పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాల నందించు దేశంగా భావింపబడడం జరిగింది. ఈ రెండవ దశలోనే భారతదేశ సాంప్రదాయక కుటీరపరిశ్రమలన్నీ కూకటివ్రేళ్లతో పెకలింపబడ్డాయి. 1858 నుంచి పెట్టుబడిదారీ సామ్రాజ్యతత్వం బయలుదేరి, పెట్టుబడి మొత్తాల ఎగుమతి విధానం అనుసరించబడింది. అదే సమయంలో బ్రిటీష్‌వారి ఆధ్వర్యంలో అనేక బ్యాంకులు స్థాపించబడ్డాయి. ఎగుమతి, దిగుమతి సంస్థలు గూడ ప్రారంభించబడ్డాయి. అందుచే యీ మూడవ దశలో భారతదేశ సంపదను మాతృదేశానికి తరలించు కార్యక్రమం, ఉధృతంగా కొనసాగింది.

13.3 సాంప్రదాయ భారతీయ ఆర్థిక వ్యవస్థ

ప్రాచీన ఆర్థిక జీవనంలో గ్రామం, ప్రధానమైందిగా భావించబడింది. గ్రామాలు స్వయంపోషకాలగుటచే రాకపోకల సౌకర్యాలు లోపించినందున ఆ రోజులలో పల్లెలు వేటికవి ఒంటరిగా కొనసాగాయి. రోడ్లు, రైల్వేలకు ముందు గ్రామవాసులకు బయటి ప్రపంచంతో సంబంధాలు బహుకొద్ది. ఐబెట్‌సన్ అనుతడు వ్రాసినట్లు *"భారతీయ గ్రామం కావలసిన ఆహార ధాన్యాలను ఉత్పత్తి గావించి, పనిముట్లను, ఇండ్లలో వాడు పాత్రలను గూడ తయారు చేసుకొనేది. పురోహితుడు గ్రామంలోనే నివసించేవాడు. వైద్యుడు లేకపోయినా పట్టించుకొనేవారు కాదు. బయటి ప్రపంచంతో గ్రామాలకు ఉప్పు, కొన్ని సుగంధద్రవ్యాలు, నాణేలు, ఉత్సవాలకు వాడేబట్టలు తప్ప, తక్కిన వాటితో పనిలేదు."*

నాణెములు నుపయోగించుట, గ్రామాలలో మిక్కిలి పరిమితమై యుండేది. ఒక విధమైన వస్తుమార్పిడి పద్ధతి కొనసాగిందని చెప్పవచ్చు. వస్తువులను మార్చుకొని జీవనం సాగించారు. కూలిపనులకు గాని, ఇతర

సేవలకు, ధాన్యరూపంలో ప్రతిఫలం చెల్లించేవారు. ప్రాచీన ఆర్థిక విధానంలో, సాంప్రదాయం ప్రధాన పాత్ర వహించింది. రైతుల భూమిశిస్తు చెల్లింపు విధానం గూడ, సాంప్రదాయంగా నుండేది. గ్రామాలలోని చేతిపనివారికి, సాలీన ధాన్యమునిచ్చు ఆచారముండెడిది.

గ్రామ ప్రజలు మూడు విధాలుగా విభజింపబడినారు. వారు 1. వ్యవసాయదారులు 2. గ్రామాధికారులు 3. చేతిపనివారు. వ్యవసాయదారులు భూకామందులే గాక రైతులు గూడా. వ్యవసాయాన్ని వారే స్వయంగా నిర్వహించి మిగులు ధాన్యాన్ని విక్రయించేవారు. గ్రామంలోని ప్రధాన అధికారులు పటేల్, పట్వారి లేదా కుల్‌కర్ణి, వెట్టి, తలారి, మొదలగువారు. పటేల్ గ్రామంలోని శాంతి భద్రతలు శిస్తు వసూలు విధులను నిర్వహించేవాడు. పట్వారి, గ్రామ చిట్టాలెక్కలను తయారు చేసేవారు. మిగిలిన వారు గ్రామ రక్షకభటులు.

ప్రతిగ్రామంలోను వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, క్షురకుడు, పురోహితుడు మున్నగు వారుండినారు. వారందరూ వ్యవసాయదారునికి సహాయపడటానికై ప్రధానంగా రూపొందింపబడినవారే. వారు తమ సేవలకు రైతునుంచి ధాన్యమును ప్రతిఫలంగా పొందేవారు. ప్రతిగ్రామం తనకు కావలసిన పనివారినందరిని కలిగియుండేది. గ్రామంలో చర్మకారుడు చనిపోయిన పశువుల చర్మం నుంచి కావలసిన పాదరక్షలు, నీరు తోడటానికి కపిలబానలను తయారు చేసేవాడు. వడ్రంగి నాగలి చెక్కగా, కమ్మరి దీనికి కావలసిన ఇనపకర్రను చేసేవాడు. కుమ్మరి వంటకై కావలసిన మట్టి పాత్రలను చేసేవాడు. ప్రతిగ్రామంలోను నూనెగానుగ వుండేది. చాకలి తప్పనిసరిగా వుండేవాడు. ప్రతి ఒక్కరు తమ సేవలను గ్రామస్తులకందిస్తూ, గ్రామాలను స్వయంపోషకాలుగా కొనసాగింపజేసేవారు.

గ్రామాలు సంఖ్యాబలం కలిగి యుండినా భారతదేశంలోని నగరాలు, పట్టణాలను విస్మరించడానికి వీలులేదు. ఆచార్య గాడ్గిల్ ఉద్దేశంలో, పట్టణాలు మూడు రకాలు. అవి 1. తీర్థయాత్రల మూలంగా ముఖ్యమైనవి; 2. నవాబులకు, రాజులకు కేంద్రాలుగా వున్నవి; 3. వ్యాపార రంగంలో ప్రసిద్ధి చెందిన పట్టణాలు.

కుటీర పరిశ్రమల వలె పట్టణాలలోని పరిశ్రమలు గూడ, బ్రిటీష్‌వారు రాక పూర్వం, గొప్పగా అభివృద్ధి సాధించాయి. బట్టల తయారీ, నగరాలలో మిక్కిలి అభివృద్ధి చెందిన పరిశ్రమ. ముఖ్యంగా నూలు బట్టల పరిశ్రమ చాలా అభివృద్ధి గాంచింది. ఢక్కా మస్లిన్ "పదార్థనీడగా", "నేయబడిన గాలి"గా పిలువబడేది. మస్లిన్ బట్టలు ఢక్కా లోనే గాక, క్రిష్ణనగర్, చందేరి మున్నగు ప్రాంతాలలో గూడ తయారు చేయబడేవి. మచిలీపట్నం 'చింటిజ్'కు, పిఠాపురం 'పీతాంబరాల'కు మిక్కిలి ప్రసిద్ధి చెందాయి. ఇరునేతగల బట్టలకు, చీరలకు, శాలువలకు, పగిడీలకు, అనేక కేంద్రాలు ప్రసిద్ధి చెందాయి. ధోవతులకు, దుప్పట్లకు, అహమ్మదాబాదు మిక్కిలి ప్రసిద్ధిచెందింది. 1850 సం॥వరకు మంచి రకాలైన నూలుబట్టలు, విదేశాలకు ఎగుమతి చేయబడ్డాయి. ప్రాచీన కాలంలో ఈజిప్టు చక్రవర్తుల మృతదేహాలను "మమ్మీలు"గా, ఢక్కా మస్లిన్‌లలో చుట్టేవారు. విశాఖపట్నం ప్రాంతంలో తయారైన సీలి "కలంకారీ" బట్టలు, ఐరోపాకు ఎగుమతి చేయబడేవి.

నూలువలె పట్టుబట్టలు గూడ భారతదేశంలో అధికంగా తయారయ్యేవి. బెనారస్, సంబల్‌పూర్, అహమ్మదాబాద్, బరోడా, కాంబే, సూరత్, మైసూర్, బెర్హంపూర్, కాంచీపురం, ఆరణి మున్నగునవి అట్టి పట్టుబట్టల తయారీకి గొప్ప కేంద్రాలు. భారతదేశాన్నుండి అమితంగా పట్టు వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. అల్లకపు పనిని, రంగుల అద్దకం మున్నగు వాటికి గూడ అనేక కేంద్రాలుండేవి. కాలికో అద్దకానికి, రాజస్థాన్ లోని జైపూర్, మిక్కిలి ప్రసిద్ధి చెందింది. కాశ్మీర్‌లో తయారైన ఉన్ని శాలువలు మిక్కిలి ప్రసిద్ధి చెందినాయి. ఉన్ని కంబళులు అమృత్‌సర్, జైపూర్, ఆగ్రా, వరంగల్ మొదలైన చోట్ల తయారయ్యేవి. అతి నాజూకైన ఆభరణాలు, అనేక నగరాలలో తయారుచేయబడ్డాయి. హైదరాబాద్, మొరాదాబాద్, లోహ పాత్రలకు అందునా నగిషీ పనులకు ప్రసిద్ధి చెందాయి. మైసూర్, తిరువాన్కూర్ మున్నగు ప్రాంతాలలో దంతపు వస్తువులు, కలపపని, రాతిశిల్పాలు మున్నగునవి కొనసాగించారు. భారతదేశంలోని గాజువస్తువులు, విదేశాలకు ఎగుమతి చేయబడేవి.

BRAOU

13.4 బ్రిటీష్ పరిపాలనా ప్రభావం

బ్రిటీష్ పరిపాలనవల్ల భారతదేశంలో అనేక మార్పులు సంభవించాయి. ఇవి 1850 తర్వాత పరిపాలన, రవాణా, వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు మొదలైనవాటిలోనేగాక సాంఘిక, రాజకీయ సంస్థలలో గూడ విశదంగా అగుపించాయి. కాని అన్నిటికన్న ముఖ్యంగా బ్రిటీష్‌వారి పాలనా ప్రభావం భారతీయ సనాతన ఆర్థిక విధానంపై కనిపించింది.

బ్రిటీష్ పాలనలో, గ్రామాలలోని స్తంభిత దృఢ జీవనం, గ్రామీణ వ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నం గావించ బడినాయి. రవాణా సౌకర్యాలు ఇతర రాకపోకల మూలంగా గ్రామాలు ఇతర ప్రాంతాలతో కలుపబడినాయి. వ్యక్తి స్వాతంత్ర్య సిద్ధాంతం పెరుగుటవల్ల ప్రజలు గ్రామాల నుంచి పట్టణాలకు తరలుట చేత గూడ, గ్రామాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. రోడ్ల-రైళ్ల నిర్మాణం, మోటారు శకటాల ఆగమనం మొదలైన వాటివలన గూడ గ్రామాల ఏకాకి జీవనం తొలగిపోయింది. యంత్రాగారాల్లో తయారైన వస్తువుల పోటీ ధాటికి, కుటీర పరిశ్రమలు తట్టుకోలేక పోయిన కారణంగా గ్రామీణ చేతిపనివారు ఉపాధి కోల్పోయినారు.

బ్రిటీష్ ఆక్రమణ తర్వాత భారతదేశ ప్రధాన ఎగుమతులు ప్రత్తి, జనుము, ఖనిజాలు, వ్యవసాయోత్పత్తులు మున్నగునవి. ఇంగ్లండ్ నుంచి దిగుమతులు, ఎక్కువగా పరిశ్రమలలో తయారైన వస్తువులుగా వుండేవి. అందుచే భారత నగరాలలో తయారైన చేతిపని వస్తువులు, ఇంగ్లండ్‌లో పెద్దెత్తున తయారై మన మార్కెట్లలో లభించే వస్తువులతో పోటీకి నిలబడలేక పోయాయి. విదేశీ పాలన మాతృదేశ క్షేమాన్ని మాత్రమే కోరిన కారణంగా భారతీయ చేతిపనివారికి ఎటువంటి సహాయాన్ని అందజేయలేదు.

బ్రిటీష్‌వారి రాకకు పూర్వం, అత్యంత ఖరీదైన విలాస వస్తువులు చాలావరకు నవాబులు, సంస్థానాధిపతులు, వారి సంస్థానాలలోని ప్రభువులు మొదలగు వారిచే కొనబడేవి. బ్రిటీష్‌వారు హిందూదేశాన్ని ఆక్రమించుకొన్న తర్వాత నవాబులు, రాజులు అదృశ్యమైనారు. వారితోబాటు ప్రభువులు, ఉన్నతాధికారులు గూడ ఆర్థికంగా దిగజారినారు. అందుచే, విలాస వస్తువుల గిరాకి తగ్గుముఖం పట్టింది. రాజులచే స్థాపించబడిన 'కార్ఖానాలు' మూతబడ్డాయి. వీటిలో పనిచేసిన వారందరూ నిరుద్యోగులైనారు.

సనాతన ప్రభువర్గాలు పోయిన తర్వాత వారి స్థానాన్ని బ్రిటీష్ అధికారులు పాశ్చాత్య విద్యనభ్యసించిన మధ్య తరగతి భారతీయులు, ఆంగ్లేయుల ననుకరించిన స్థానికులు, కొంతవరకు భర్తీచేసినారని చెప్పవచ్చు. కాని యీ మధ్య తరగతి వారు ప్రాచీన కాలంలోవలె ఖరీదైన చేతి వస్తువులను గాక, పరిశ్రమలలో తయారైన చౌక వస్తువులను కొని తృప్తిపడినారు. బ్రిటీష్‌వారి పాలనతోబాటు వారు ధరించిన బట్టలు, వారుపయోగించిన వస్తువులు ప్రచారంలోకి వచ్చాయి. ఇది భారతీయ చేతిపనులు క్షీణించడానికి దారి తీసింది.

భారతీయ వస్తువుల తయారీ క్షీణించడానికి మరొక ప్రధాన కారణం 19వ శతాబ్దాంతంలో బ్రిటీష్ వారు అనుసరించిన స్వేచ్ఛా వ్యాపారం. దీనిచే బ్రిటీష్ వస్తువులు భారత మార్కెట్లలో వెల్లువగా వచ్చిపడ్డాయి. వీటిపై సుంకాలు రద్దు చేయబడ్డాయి. భారతదేశ స్వదేశీ పరిశ్రమలను సంరక్షించడానికి, ప్రభుత్వం ఎట్టి చర్యలు గైకొన లేదు. అందుచే పెద్ద ఎత్తున, ఇంగ్లండ్‌లోని కర్మాగారాలలో తయారైన వస్తువుల ధాటికి, భారతదేశ వస్తువులు నిలువలేక పోయాయి. బ్రిటష్‌వారు ప్రవేశపెట్టిన **"ఆయుధాల చట్టం"** భారతీయులు ఆయుధాలు ధరించుటను నిషేధించింది. దీనిచే ఆయుధాల తయారీ మరుగున పడింది. ఫలితంగా అనేక వేల కుటుంబాలు, ఉపాధిని కోల్పోయాయి. బ్రిటీష్ పరిపాలనచే ఆ విధంగా గ్రామాల్లోని కుటీర పరిశ్రమలేగాక, నగరాలలోని చేతిపనులు గూడా నిరాధారాలై క్షీణించాయి.

BRAOU

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. సాంప్రదాయ భారతీయ ఆర్థిక వ్యవస్థ ముఖ్య లక్షణమేది?

.....

.....

.....

.....

2. బ్రిటీష్ పాలన కాలంలో భారతదేశంలో కుటీర పరిశ్రమలు ఎందుకు నశించాయి?

.....

.....

.....

.....

13.4.1. వ్యవసాయంపై ప్రభావం

హిందూదేశంలోని రైతులు, బ్రిటీష్‌వారు రాకపూర్వం, మిక్కిలి సాధారణమైన పద్ధతుల ననుసరించి, సహజమైన ఎరువులనుపయోగించి, పంటల మార్పిడి విధానంలో వ్యవసాయాన్ని కొనసాగించినారు. మిగులు ధాన్యాలను స్థానికంగా అమ్మేవారు. కంపెనీ ప్రభుత్వం 18వ శతాబ్దాంతానికి భారతదేశంలో వ్యవసాయోత్పత్తులైన నీలిమందు, ప్రత్తి, జనుము, నూనె గింజలు మున్నగు వాటికి ఎగుమతి ప్రాధాన్యత గలదని నిర్ణయించు కొన్నారు. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవంవల్ల విదేశాల నుంచి అనేక రకాలైన ముడి పదార్థాల దిగుమతి అవసరమైంది. ఇంగ్లండ్‌లో పరిశ్రమలు స్థాపించబడిన పిదప భారతవస్తువుల దిగుమతి నిలిపివేయబడింది. రవాణా సౌకర్యాలు పెంపొందిన కారణంగా, భారతీయ రైతు తాను కేవలం భుజించడానికి మాత్రమే గాక, విక్రయ ఉద్దేశంతో పంటలు పండించసాగినాడు. దీనితో వ్యవసాయం వ్యాపారీకరణ మైనదనవచ్చు.

వాణిజ్య పంటలు ప్రవేశపెట్టడానికి, అనేక కారణాలుగలవు. బ్రిటీష్‌వారు భూమి శిస్తును ధనరూపంలో వసూలు గావించారు. రైతులందుచే వాణిజ్య పంటలను పండించ నారంభించినారు. వ్యాపారులు గ్రామాలకు వెళ్ళి, వివిధ రకాలైన వ్యవసాయోత్పత్తులను వ్యాపారనిమిత్తం కొనుటచే గూడ, వాణిజ్య పంటలకు ప్రాధాన్యత పెరిగింది. వారు రైతులకు ఋణాలు యిప్పించి, వారి యిష్టానుసారం పంటలు పండింపజేసినారు. వార్తా సౌకర్యాలు, రాకపోకలు పెంపొందుటతో, గ్రామాలు బయటి ప్రపంచంతో కలుపబడినాయి. 1850 సం॥ తర్వాత రోడ్ల - రైళ్ళ నిర్మాణం అభివృద్ధి చెందిన కారణంగా 1869 సం॥లో సూయాజ్ కాల్వ తెరువబడిన పిదప, భారతదేశంలో వ్యవసాయోత్పత్తుల ధరలు ప్రపంచమార్కెట్టు ధరలతో పోటీ పడనారంభించినాయి. బ్రిటీష్ ప్రభుత్వం గూడ ప్రత్తి, జనుము మొదలైన వ్యాపార పంటలను మాత్రం ప్రోత్సహించింది. 1861-65 ప్రాంతంలో అమెరికాలో సంభవించిన అంతర్యుద్ధం గూడ భారతదేశంలో వాణిజ్యపంటల వ్యాప్తికి కారణమైంది. ఆసమయంలో బ్రిటీష్ నూలు మిల్లులు అమెరికా నుంచి ప్రత్తిని దిగుమతి చేసుకోలేక పోయిన కారణంగా ప్రత్తికై భారతదేశంవైపు దృష్టి మళ్ళించారు.

వాణిజ్య పంటల వ్యాప్తిచేత రైతు తన పంటలో కొంత భాగాన్ని వెంటనే అమ్మవలసిన అవసరమేర్పడింది. కొంతకాలం తర్వాత తనకు అవసరమైన ధాన్యాన్ని తిరిగి అతడు కొనవలసి వచ్చింది. సొంత వినియోగానికి భద్రపరచు ధాన్యానికన్న, అమ్మడానికి ప్రత్యేకించబడిన ధాన్యం ఎక్కువ. ఎగుమతికై ధాన్యాలను పండించిన ప్రాంతాల్లో, వాణిజ్య పంటలకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడింది. ఉదాహరణకు బర్మాలో బియ్యం, పంజాబ్‌లో గోధుమలు, తూర్పు బెంగాల్‌లో జనుము, గుజరాత్, బీహార్ ప్రాంతాలలో ప్రత్తి, ప్రధానంగా పండించబడ్డాయి.

BRAOU

భారతదేశ వ్యవసాయోత్పత్తులకు విదేశీ గిరాకి పెరిగినా, రైతుకుమాత్రం ఎట్టి లాభాలనూ ఒనకూర్చలేదు. వ్యవసాయ రంగంలో సాంకేతికాభివృద్ధిగాని, ఇతర సౌకర్యాలుగాని లేని కారణంగా అట్టి లాభాలు కలుగలేదు. ధాన్యపుధరలు పెరిగినా, రైతులకు లాభాలు రాలేదు. అనేక సందర్భాలలో భారతీయరైతు భూమికి సొంత దారు కాదు. అందుచే భూమికి తగు ఎరువులు మొదలైన వాటిని ఉపయోగించి, సాగురీతులను పెంపొందింపజేయు ఆసక్తి లేనందున, భూమి దిగుబడిలో ఎట్టి మార్పురాలేదు.

దేశంలో అనేకచోట్ల సాంప్రదాయక పైర్లకు బదులు, వాణిజ్య పంటలను అనుసరించారు. ప్రాంతీయ ప్రాతిపదికపై పంటలు పండించు విధానం, ఈ వాణిజ్య పంటల ప్రత్యేకత. ఇది దేశీయ వ్యవసాయ చరిత్రలో ప్రధాన ఘట్టమే ఐనా, దీనిచే ఆహార ధాన్యాల ఉత్పత్తి దెబ్బతిన్నది. 1866లో సంభవించిన బెంగాల్, ఒరిస్సా కాటకాలు మిక్కిలి ఉధృతమగుటకు ప్రధానకారణం. ఆ ప్రాంతాలలో ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వాణిజ్య పంటల ఉత్పత్తికి మారడం మాత్రమే. గ్రామాలు వేటికవి ప్రత్యేకంగా వుండుట అంతమై, వాణిజ్య పంటల మూలంగా బయటి ప్రపంచంతో సంబంధాలు ఏర్పరచుకొన్నాయి.

13.4.1.1 వ్యవసాయక ఋణభార పెరుగుదల

భూమి శిస్తు ధనరూపంలో కట్టవలసి రావడం, వాణిజ్య పంటల వ్యాప్తి మూలంగా సంభవించిన దుష్పలితాలలో ముఖ్యమైంది. వ్యవసాయక ఋణగ్రస్తత బ్రిటీష్‌వారి శిస్తు వసూలు విధానం, రైతులను ఋణాలకు గురి చేయడమేగాక, వ్యవసాయాన్ని స్వయంగా చేపట్టని వడ్డీ వ్యాపారులకు, తమ భూములను ఇచ్చుకొనవలసి వచ్చింది. అట్టి లోపాలను సరిచేయడానికి, భూములను చేతులు మారకుండా నిలుపడానికి, ప్రభుత్వం కొన్ని చర్యలు గైకొన్నది. ఉదాహరణకు 'దక్కన్ వ్యవసాయదారుల ఋణబాధ నివారణ చట్టం', 'మధ్యపరగణాల కౌలుదారీ చట్టం' మున్నగునవి భూముల మార్పిడిని కొంతవరకు అరికట్టగలిగాయి.

పెద్ద ఎత్తున భూములు మారుటను ప్రభుత్వం అరికట్ట గలిగినా, వడ్డీ వ్యాపారుల దురాగతాలను మాత్రం ప్రభుత్వం శక్తివంతంగా అరికట్ట లేకపోయింది. రైతుల ఋణభారాన్ని గూడ తగ్గించలేక పోయింది. భూముల విలువలు పెరుగుతూ వచ్చిన కారణంగా భూముల మార్పిడి గూడ అధికమైంది. వడ్డీ వ్యాపారి ఎలాగూ వ్యవసాయాన్ని స్వయంగా చేపట్టేవాడుకాదు కాబట్టి భూమిని పూర్వపు రైతు మాత్రమే సాగుచేస్తూ వచ్చాడు. కాని అతడు కట్టవలసిన ధనం మాత్రం ఎక్కువైంది. సామాన్యరైతు భూస్వామి యొక్క దయాదాక్షిణ్యాలకు లోబడి కొనసాగాడు.

రైతు ఋణగ్రస్తుడగుటకు సాధారణంగా, అనేక కారణాలు గలవు. వ్యవసాయంలో అప్పటికప్పుడు అగు ఖర్చులకు, కొత్త భూములను కొనడానికి, పాత అప్పులు చెల్లించడానికి, గృహాలను నిర్మించడానికి లేదా సరిచేసుకోడానికి, ప్రభుత్వానికి శిస్తు చెల్లించడానికి, వివాహాలు, వేడుకలు, ఆభరణాల కొనుగోలు మొదలగు వాటికి ప్రధానంగా రైతుకు ధనం అవసరం. వ్యవసాయ భూములపై జనాభా ఒత్తిడి, కుటీర పరిశ్రమలు నాశనమగుట, భూకమతాలు విభజింపబడుట మున్నగునవి గూడా రైతును ఋణగ్రస్తుని చేసినాయి.

19వ శతాబ్దాంతంలో జరిగిన దక్కన్ అలజడి, గ్రామీణ ప్రాంతాలలో రైతుల ఋణభారం యొక్క దుష్పలితాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ప్రభుత్వం మొదట వడ్డీ వ్యాపారాన్ని క్రమబద్ధం చేయడానికి మాత్రమే, తన దృష్టిని కేంద్రీకరించింది. కానీ తర్వాత యీ దురాచారానికి మూల కారణాలను పరిశీలించి, వాటిని తొలగించడానికి ప్రయత్నించి, సంస్థాగతమైన ఋణ సదుపాయాలను కలిగించింది. వడ్డీ ఋణాల చట్టం, వడ్డీ వ్యాపారులకు అనుమతి పత్రాలు ఇచ్చి క్రమబద్ధ కార్యక్రమాలు, భూఆక్రమణను నిషేధించడం, సహకార సంఘాల పెంపుదల, భూమి తనఖా బ్యాంకుల స్థాపన మొదలగు చర్యలు గైకొని, రైతులకు కొన్ని ఆర్థిక సౌకర్యాలు కలుగజేయబడ్డాయి.

B R A O U

13.4.2 కరువులు

బ్రిటీష్ ప్రభుత్వ రెవెన్యూ విధానాలు, వాణిజ్య పంటల వ్యాప్తి మొదలగు పద్ధతుల చేత, భూమిపై జనాభా ఒత్తిడి ఎక్కువైన కారణంగా భూకమతాలు చిన్న చిన్న ముక్కలుగా విభజింపబడ్డాయి. క్రమబద్ధంగాని ఋణసదుపాయాలు, కూలీ జనాల సంఖ్య పెరుగుటవల్ల వ్యవసాయం లాభదాయకంగా లేకపోయింది. దీనికి తోడు ఋతుపవనాలు విఫలమగుట సర్వసాధారణమైంది. 1850 సంవత్సరానికి ముందు వర్షాభావంవల్ల, ఆహార ధాన్యాల కొరత ఆయా ప్రాంతాలకు మాత్రమే పరిమితమై యుండేది. ఇతర ప్రాంతాలనుంచి అవసరమైన ఆహార ధాన్యాలను రవాణా చేసుకొను పద్ధతి, ఆరోజులలో వుండేది కాదు. కాని రవాణా సౌకర్యాలు ఏర్పడిన పిదప, భారతదేశంలోని కరువు పరిస్థితులలో గూడ మార్పు సంభవించింది.

భారతీయ వ్యవసాయం వర్షాధారమైనందున ఎల్లప్పుడు నిలకడగా లేదు. వ్యవసాయ రంగాన్ని బ్రిటీష్‌వారు పూర్తిగా విస్మరించి, నీటి పారుదల సౌకర్యాలను నిర్లక్ష్యంచేసినారు. తమ రక్షణ సదుపాయాలకు తగు రోడ్లు, రైళ్ళబాటలు వంటి వాటికి ప్రాధాన్యత నిచ్చి అమిత వ్యయం చేసినారు. గ్రామాలలో ఇతర ఉపాధి సౌకర్యాలు లేనికారణంగా వ్యవసాయం విఫలమైనప్పడల్లా, ప్రజలు ఆకలి బాధలకు గురియైనారు.

క్షామ సంఘటనలు వ్యవసాయంపై, ఆధారపడిన ప్రజలపై, అతిదారుణ ప్రభావాన్ని చూపెడివి. క్షామ ప్రభావం కరువు సందర్భాలలోనే గాక తక్కువ పెట్టుబడి మూలంగా తర్వాతి సంవత్సరాలలో కూడ ఉండేది. ముందు సంవత్సరాలలో పెట్టిన పెట్టుబడి గూడ కరువు సందర్భాలలో నష్టపడుట మూలంగా వ్యవసాయోత్పత్తి దెబ్బతినేది. 1860 సంవత్సరానికి ముందువర్షాలు లేకపోవుటచే ఏర్పడ్డ కరువు మూలంగా, ఆహారధాన్యాల కొరత, పశువుల దాణా లోపం సంభవించేది. అందుచే ప్రజలు, పశువులు అధిక సంఖ్యలో మరణించుట జరిగింది. కాని రాకపోకల సౌకర్యాలు అభివృద్ధి చెందిన మీదట ప్రభుత్వం కరువు నివారణ కార్యక్రమాలు చేపట్టుటచేత, ఆహార ధాన్యాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సులభంగా తరలించుటవల్ల కరువుల ప్రభావం తగ్గు ముఖం పట్టింది. ఆకలి చావులు పశుమరణాలు గూడ తగ్గాయి. కాని పోషకాహారం లోపించిన కారణంగా బీద ప్రజలు అనేక రోగాలకు లోనయ్యారు. కలరా, ప్లేగు వంటి అంటురోగాలు పరిపాటి అయినాయి. కరువు సందర్భాలలో పెద్ద ఎత్తున ప్రజలు వలస వెళ్లుట సర్వసాధారణమైంది. గ్రామీణ ప్రజా[illegible] దోహం, కరువు సంభవించినప్పుడు ఎదుర్కొన్న సమస్యలు వర్ణనాతీతాలు.

కంపెనీ పరిపాలన స్థాపనానంతరం, మొట్టమొదటి కరువు 1770 సం॥లో బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాలలో సంభవించింది. దాదాపు 1/3 వంతు జనాభా కరువు సమయంలో మరణించారు. 1783 సం॥లో సంభవించిన క్షామం, ఉత్తర హిందూదేశాన్ని పూర్తిగా బాధించింది. రాజస్థాన్, బొంబాయి, మద్రాస్ రాష్ట్రాలు గూడ దీని ప్రభావానికి లోనైనాయి. వర్షాలు లేకపోవడం, మిడతల బాధ, ప్రధానంగా యీ కరువుకు కారణాలుగా పేర్కొనవచ్చు. 1790 సం॥లో సంభవించిన కరువు, బొంబాయి, గుజరాత్, ఉత్తర సర్కారులు, ఒరిస్సా తదితర ప్రాంతాలను బాధించింది. 1802-04 ప్రాంతంలో వర్షాభావంవల్ల ఉధృతమైన కరువు సంభవించి, మద్రాస్ రాష్ట్రం అనేక కష్టాలకు లోనైంది. ఆ సమయంలో ఆహారం ఇతర ప్రాంతాల నుంచి తరలించబడవలసి వచ్చింది. అయినా రెవెన్యూ అధికారులు మాత్రం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించి, శిస్తువసూలులో కఠినంగా వ్యవహరించసాగినారు. 1800 నుంచి 1854 వరకు మద్రాస్ రాష్ట్రంలో దాదాపు ఆరు, బొంబాయిలో మూడు కరువు సంఘటనలు సంభవించాయి.

1857 సం॥లో జరిగిన తిరుగుబాటు, దాని తర్వాత జరిగిన ప్రతీకార చర్యలు, వ్యవసాయోత్పత్తిలో క్షోభ్యం కలిగించుకొనినవని చెప్పవచ్చు. కాంప్‌బెల్ అనునతని అధ్వర్యంలో నియమింపబడిన కమిటీ నివేదికలో కరువులకు చాలావరకు, వాతావరణ వివరాలను ముందుగా తెలుసుకొని, అట్టి సమాచారాన్ని ప్రజలకందజేయక పోవుట ప్రధాన కారణమని తెలిపాడు. రాకపోకల సౌకర్యాల లోపం, వస్తూత్పత్తి, వాటికగు గిరాకీ సిద్ధాంతాన్ని గ్రుడ్డిగా అనుసరించుట గూడ కరువులకు దోహద మిచ్చునని ఆ కమిటీ నివేదికలో తెలుపబడింది.

1868-69 ప్రాంతంలో రాజపుటానా ప్రాంతంలో సంభవించిన క్షామం మిక్కిలి ఉధృతమైంది. ఆ సంవత్సరం ఖరీఫ్ పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీనికితోడు మరుసటి సంవత్సరం మిడతల దాడివల్ల పరిస్థితులు మరీ దిగజారి పోయాయి. 1873-74లో బెంగాల్‌లో తిరిగి సంభవించిన క్షామం, అనేకుల ప్రాణాలను బలికొన్నది.

1876-78 ప్రాంతంలో దక్షిణ దేశంలో కెల్ల అతిపెద్ద క్షామం సంభవించింది. దీనికి 'పెద్ద కరువు' అని, ధాత నామ సంవత్సరంలో ప్రారంభమైన కారణంగా **"ధాత కరువు"** అని కూడ పేరు. పశుగ్రాసం పూర్తిగా లేని కారణంగా పశువులు పెద్ద సంఖ్యలో మరణించాయి. 1880 సం॥లో నియమింపబడిన 'కరువు కమీషన్' దీనిని బ్రిటీష్‌వారు పాలనారంభం నుంచి జరిగిన అన్ని కరువులలోకి, అతి దారుణమైందని పేర్కొంది.

1880 సం॥ తర్వాత కరువు నివారణ సంఘం సూచించిన మేరకు, ఉపాధి సౌకర్యాలు కల్పించ ప్రారంభించిన కారణంగా క్షామాల ప్రభావం తగ్గుముఖం పట్టింది. అయినా వర్తకులు మాత్రమే ఆహారధాన్యాల రవాణా బాధ్యతను కలిగియుండిన కారణంగా కొన్ని ఇబ్బందులు కొనసాగుతూ వచ్చాయి. 19వ శతాబ్దాంతంలో సంభవించిన మరొక కరువువల్ల మధ్యపరగణాలు, రాజపుటాన, దక్షిణ పంజాబ్, మధ్యబొంబాయి ప్రాంతాలు, పీడింపబడ్డాయి. ఈ క్షామం కారణంగా ప్రభుత్వం మరొక **"క్షామ కమిషన్"**ను నియమించింది. దీనికి, సర్ మాక్‌డోనల్ అధ్యక్షుడు. కమీషన్ నివేదిక 1901 సం॥లో సమర్పించబడింది. 20వ శతాబ్దంలో, అనేక ఇతర క్షామాలు గూడ సంభవించాయి. వాటన్నిటిలో 1943 సం॥లో సంభవించిన బెంగాల్ కరువు మిక్కిలి ప్రధానమైంది. ఈ కరువు సందర్భంలో దాదాపు 30 లక్షల మంది మరణించినట్టు అంచనా వేయబడింది. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఆహారధాన్యాలను తరలించడానికి తగు చర్యలు గైకొనక పోవడంచే ఇది కేవలం ప్రభుత్వ లోపభూయిష్ఠ పద్ధతులచేత జరిగిందని చెప్పవచ్చు.

13.5 కరువు నివారణ విధానాలు

బ్రిటీష్ పరిపాలనకు ముందు స్థానిక రాజులు తమ ప్రధాన నగరాలలో ధాన్యాగారాలను స్థాపించి, యుద్ధ సమయాలలో ప్రజలకు ఆహార సదుపాయాలు కలిగించేవారు. కరువు సందర్భాలలో గూడ, యీ ధాన్యాగారాలు ఎంతో ఉపయోగపడేవి. కరువు సంభవించినప్పుడు ప్రభువులు రోడ్లు, కాలువలు, చెరువులు, కోటలు, దేవాలయాలు మొదలైనవి కట్టించి ఉపాధి కల్పించేవారు. ఆనాటి ప్రభుత్వ చర్యలతోబాటు ప్రభుత్వేతర చర్యలుగూడ, కరువు నివారణకు వినియోగింపబడేవి. ప్రజల బాధలు తెలియజేయు సమాచార సేకరణ లోపంవల్ల రవాణా సౌకర్యాలు లేకపోవుటచేత, క్షామ నివారణ కార్యక్రమాలు కట్టుదిట్టంగా అమలు జేయడానికి వీలుండేదిగాదు.

1760 నుంచి 1857 వరకు ఈస్టిండియా కంపెనీ కరువు నివారణోపాయాలపై శ్రద్ధ వహించలేదు. కంపెనీవారు యుద్ధాలు కొనసాగించి, రాజ్యాక్రమణకు శ్రద్ధ వహించారు. కాని 19వ శతాబ్దపు ప్రారంభం నుంచి కొన్ని సందర్భాలలో బ్రిటీష్ ప్రభుత్వం ఉపాధి పథకాలను చేపట్టి, ప్రజలకు సౌకర్యాలు కలుగజేయ ప్రయత్నించింది. 1833 నాటికి గాని కంపెనీ ప్రభుత్వం ప్రజలకు ఉపాధి సౌకర్యాలు కలుగజేయవలసిన బాధ్యతను మనస్ఫూర్తిగా స్వీకరించలేదు.

1858లో బ్రిటీష్ ప్రభుత్వం స్వయంగా భారతదేశాన్ని పరిపాలించు అధికారాన్ని స్వీకరించింది. అందుచే క్షామ నివారణ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. 1876-78 ధాత నామ కరువు తర్వాత, భారత ప్రభుత్వం 1778 సంవత్సరంలో సర్ జాన్ స్ట్రాచీ అధ్యక్షతన **"కరువు నివేదిక సంఘం"**ను నియమించింది. ఈ సంఘం తన నివేదికను 1800 సం॥లో సమర్పించింది. ఆ నివేదికలో కరువు నివారణకై అనేక తాత్కాలిక, దీర్ఘకాలిక పథకాలు సూచించబడ్డాయి. రెండవ కరువు నివేదిక సంఘం (1898), సర్ జేమ్స్ లైల్ ఆధ్వర్యంలో నియమింపబడింది. ఇది గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సూచనలు అందజేసి, శిస్తు వసూలు విధానాలను సులభతరం గావించి, వెనుకబడ్డ వర్గాలకు ప్రత్యేక శ్రద్ధ చూపవలెనని సూచించింది.

BRAOU

1899 సంవత్సరం కరువు మూలంగా, మూడవ కరువు సంఘం స్థాపించబడింది. దీనికి ఆంటొని మెక్ డోనెల్ అధ్యక్షుడు. కరువు సమయాలలో ప్రభుత్వం ప్రజాక్షేమం దృష్ట్యా ఉపాధి సౌకర్యాలు కొనసాగించవలసిన అవసరమున్నదని అభిప్రాయపడింది. బీద ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కలిగించవలెనని, తక్కావి ఋణాలు యివ్వవలెనని, రెవెన్యూ వసూలు నిలుపుదల చేయవలెనని గూడ, అందులో సూచింపబడింది. 1943 సంవత్సరంలో సంభవించిన కరువు ఫలితంగా వుడ్ హెడ్ కమీషన్ నియమింపబడింది. అందులో కరువు నివారణ పథకాలు ప్రభుత్వ బాధ్యతగా సూచించబడింది. అందులో ఆహార ధాన్యాల సేకరణ బాధ్యతగా కూడ తెలియజేయబడింది.

కరువు నివారణా కార్యక్రమంలో ఎంత ముందడుగు వేసినా ప్రభుత్వం మాత్రమే అట్టి విధానాలను కట్టుదిట్టంగా అమలు చేయలేకపోయింది. స్థానిక సంస్థలుగాని, ప్రభుత్వేతర సంఘాలుగాని, అట్టి కార్యక్రమాలపై ఆసక్తి చూపవలసిన అవసరమేర్పడింది. ఉపాధి పనులకై కేటాయించిన నిధులు, పూర్తిగా ఖర్చుచేయబడలేదు. వ్యవసాయరంగానికై ఉద్దేశింపబడిన నిధులుగూడ, నీటిపారుదల సౌకర్యాలకు వెచ్చించబడనందున కరువు నివారణ పథకాలు తాత్కాలికమైనవి మాత్రమే.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. బ్రిటీష్‌వారి కాలంలో మనదేశంలో రైతుల ఋణ భారం ఎందుకు పెరిగింది?

.....

.....

.....

.....

2. రెండవ క్షామ నివారణ సంఘం ముఖ్య సిఫారసులేవి?

.....

.....

.....

.....

13.6 భారతదేశంలో బ్రిటీష్ పెట్టుబడి పెరుగుదల; రైల్వేలు, నీటిపారుదల

19వ శతాబ్దంలో బ్రిటీష్ పెట్టుబడికి భారతదేశం అనువైనచోటని భావించబడింది. భారతీయ రైల్వే సంస్థ అట్టి పెట్టుబడికి మూలకందంగా పరిణమించింది. కేవలం, రేవుపట్టణాలకు పరిమితమైన రైలు-రోడ్లు, ఇతర నగరాలకు కూడ త్వరితంగా వ్యాపించాయి. భారతదేశాన్ని ఆర్థికంగా దోచుకోవడానికి, రైల్వేలు మరింత పనికొచ్చాయి. బ్రిటీష్ పెట్టుబడిని ఆకర్షించిన మరొక రంగం, నీటివనరులు, ప్రాజెక్టులు మొదలైనవి. ఎగుమతులకై పంటలు పండించు ప్రాంతాలకు మాత్రమే పరిమితమై యుండుట గమనించతగ్గది. రైల్వేలు గాని, నీటి ప్రాజెక్టులుగాని, బ్రిటీష్‌వారి అధీనంలో మాత్రం [illegible]-బ్రిటీష్‌వారి పెట్టుబడులు, తోటల పెంపకం, కర్మాగారాల స్థాపన, గనులు మొదలైన వాటిపై గూడ వెచ్చించబడ్డాయి.

13.7 తోటల పరిశ్రమ

19వ శతాబ్దారంభం నుంచి తేయాకు భారతదేశపు ప్రధాన తోటల పరిశ్రమైంది. బెంటింక్ ఆధ్వర్యంలో 1835 సం॥లో ప్రభుత్వం ఒక ప్రయోగాత్మక క్షేత్రాన్ని స్థాపించి కొన్ని సంవత్సరాల పిదప దానిని అస్సాం తేయాకు

BRAOU

కంపెనీకి అమ్మివేసింది. 1852 సం॥లో మొట్టమొదటి తేయాకుతోట ప్రభుత్వేతర రంగంలో స్థాపించబడింది. వెంటనే అనేకులు యీ రంగంలో ప్రవేశించిన కారణంగా తేయాకు తోటలు విశేషంగా పెరిగాయి. శతాబ్దాంతానికి తేయాకు పరిశ్రమ బహుళంగా విస్తరించి భారతదేశ తేయాకు, చైనా దేశాన్నుండి అంతవరకు దిగుమతి చేసుకొన్న తేయాకు కన్న శ్రేష్ఠమైనదను పేరు గడించింది. 20వ శతాబ్దారంభంలో తేయాకు అమితంగా ఉత్పత్తి అగుటచేత ధరలు పడిపోయాయి. కాని మొదటి ప్రపంచ యుద్ధారంభం తర్వాత ధరలు అధికం కాజొచ్చినందున ఉత్పత్తి గూడ పెరిగింది. ఈ తేయాకు తోటల పెంపకం మూలంగా అంతవరకు బీడులుగా నున్న సువిశాల భూప్రాంతాలు, వ్యవసాయ యోగ్యమగుటవల్ల అనేక వ్యవసాయ కార్మికులకు ఉపాధి గూడ లభించింది.

కాఫీ మొక్కలు మొదటిసారిగా 16వ శతాబ్దంలో భారతదేశంలో ప్రవేశపెట్టబడ్డాయి. కాని కాఫీ చెట్ల పెంపకం 1830 సం॥ తర్వాత మాత్రమే, క్రమబద్ధం గావించబడింది. వాటి పెంపకంలో ప్రధాన కేంద్రాలు మైసూర్, కూర్గ్, తిరువాన్కూర్, వైనాడ్, నీలగిరి మొదలైనవి. 1860 నుంచి 1870 వరకు గల దశాబ్దంలో కాఫీ ఎగుమతులు దాదాపు పదిరెట్లు పెరిగాయి. చుట్టుప్రక్క మండలాల నుంచి కావలసిన కూలీలను రప్పించు పూర్తి అధికారం ఇచ్చు చట్టాలు రూపొందించబడ్డాయి.

రబ్బర్ తోటల పెంపకం చాలాకాలం తర్వాత అభివృద్ధిగాంచింది. 19వ శతాబ్దపు అంతిమ దశలోను, 20వ శతాబ్దపు ప్రారంభంలోను ఇది వ్యాప్తి చెందింది. రబ్బర్ ఉపయోగం రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ముఖ్యంగా తెలియవచ్చింది. అంతరంగికంగా రబ్బర్ ఉపయోగం హెచ్చింది. అందుచే రబ్బర్ తయారీ అమ్మకములకై తగు చట్టాలు రూపొందించబడ్డాయి. కేరళ, మద్రాస్, కూర్గ్ మొదలైన ప్రాంతాలు రబ్బర్ ఉత్పత్తికి ప్రధాన కేంద్రాలు.

రబ్బర్ వలెగాక నీలిమందు భారతదేశంలో గుజరాత్‌లోగాని, పశ్చిమ ప్రాంతంలో అనేక చోట్ల ప్రాచీన కాలం నుంచి పండించబడింది. నీలిమందు బట్టల తయారీకి అద్దకానికి ఉపయోగింపబడినందున, బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ యీ వాణిజ్యంలో ఎక్కువ శ్రద్ధ చూపింది. అమెరికా ఎగుమతుల పోటీవల్ల 18వ శతాబ్దాంతానికి నీలిమందు వ్యాపారం తగ్గుముఖం పట్టింది. కంపెనీ ప్రభుత్వం పశ్చిమ ఇండియాదీవులలోని బ్రిటీష్ వ్యాపారులను ప్రోత్సహించి, వారి మూలంగా బెంగాల్‌లో నీలి తోటల పెంపకాన్ని అభివృద్ధి పరచింది. 1850వరకు నీలిమందు విపరీతంగా వుత్పత్తి గావింపబడింది. ఐరోపా భూస్వాములు రైతులకు ఋణాలనిచ్చి వారి భూములలో కొంతభాగం తప్పనిసరిగా నీలిమందును పండించి, బ్రిటీష్ వర్తకులకు యివ్వవలెనను నిబంధన చేయబడింది. తోటల సొంతదారుల అఘాయిత్యాలకు వ్యతిరేకంగా నీలిమందు రైతులు 1859లో తిరుగుబాటును ప్రారంభించారు. దీని తర్వాత నీలిమందు పరిశ్రమ మధ్యపరగణాలవైపు తరలింది. కాని 1897 తర్వాత జర్మనీ రసాయనిక అద్దకాలు ప్రచారంలోనికి వచ్చిన పిదప నీలిమందు పరిశ్రమ తగ్గుముఖం పట్టింది.

III మీ అవగాహన పరీక్షించుకోండి

1. భారతదేశంలో బ్రిటీష్ పరిపాలనలో ఏర్పడిన రైల్వేలు దేశానికి ఎందుకు ఉపయోగపడలేదు?

.....

.....

.....

.....

BRAOU

2. 19వ శతాబ్దం తరువాత నీలిమందు తోటల పెంపకం ఎందుకు క్షీణించింది?

.....

.....

.....

.....

13.8 బొగ్గు గనుల పరిశ్రమ

పశ్చిమ దేశాలలో సంభవించిన పారిశ్రామిక విప్లవం బొగ్గునాధారంగా గల శక్తి పైన ఆధారపడింది. విద్యుచ్ఛక్తి వాడుకలోనికి వచ్చిన పిదప గూడ బొగ్గుకు గల ప్రాధాన్యత తగ్గలేదు. థర్మల్ విద్యుచ్ఛక్తి వాడుకలోనికి వచ్చిన పిదప గూడ బొగ్గు అవసరమగుట దీనికి కారణం. బొగ్గు పరిశ్రమ 1820 సం॥లో రాణిగంజ్ బొగ్గు గనుల త్రవ్వకాలతో ప్రారంభమైందని చెప్పవచ్చు. కాని రైల్వేలు ప్రారంభమగు వరకు, బొగ్గు ఉపయోగం అట్టే ఎక్కువ లేదు. బొగ్గును రవాణా చేయడానికి గూడా రైల్వేలు పనికొచ్చాయి. రైలురోడ్ల వ్యాప్తితో బొగ్గు గిరాకి దేశవ్యాప్తంగా పెరగజొచ్చింది. బెంగాల్ బొగ్గుగనులలో 1857లో ఉత్పత్తి 3 లక్షల టన్నులు కాగా 1880 నాటికిది 10 లక్షల టన్నులకు పెరిగింది. 1914 నాటికి దేశంలో బొగ్గు ఉత్పత్తి 165 లక్షల టన్నులైంది.

మొదట బొగ్గుగనులను ప్రారంభించుటలో పెట్టుబడి పూర్తిగా ఐరోపా నుంచి మాత్రమే వచ్చింది. కాని 19వ శతాబ్దం నాటికి భారతీయ పెట్టుబడిదారులు గూడ యీ పరిశ్రమలో ప్రవేశించారు. సాంకేతిక విషయాలపై జాగ్రత్త వహించడానికై బొగ్గు పరిశ్రమలోని ఇతర సమస్యలను పరిశీలించడానికై, అనేక కమిటీలు స్థాపించబడ్డాయి. ఉదాహరణకు భారత బొగ్గు కమిటి, బొగ్గు గనుల కమిటి, భారతీయ బొగ్గు క్షేత్రాల కమిటి మొదలగునవి.

13.9 నూలు మిల్లుల పరిశ్రమ

భారతదేశంలో మొదటి నూలుమిల్లు 1838 సం॥లో కలకత్తాలో స్థాపించబడింది. కాని 1858 సం॥లో కావాస్జి నానాభాయ్ దావర్ అను పార్శీ వ్యాపారిచేత బొంబాయిలో స్థాపించబడిన నూలు మిల్లు మిక్కిలి విజయవంతమైన మొదటిమిల్లు. 1860-70 ప్రాంతంలో నూలు పరిశ్రమ, అమెరికా అంతర్యుద్ధంచేత అనేక కష్టాలకు లోనైంది. ఆ సమయంలో ప్రత్తి ధరలు విపరీతంగా పెరిగి పోవడమే దీనికి ప్రధాన కారణం. 1885 తర్వాత అభివృద్ధికరమైన యంత్రాల ఉపయోగంతో ఈ పరిశ్రమ ముందడుగు వేయగలిగింది. మొదటి నుంచి నూలు పరిశ్రమ భారతీయులచేత నడుపబడింది.

భారతదేశంలో పెంపొందిన నూలు పరిశ్రమ, ఇంగ్లండులోని లంకాషైర్‌పై తన ప్రభావాన్ని చూపింది. 1882 సం॥లో బ్రిటీష్ నూలు మిల్లుల అలజడి కారణంగా భారతదేశంలో దిగుమతి సుంకాలు రద్దుచేయబడ్డాయి. అయినా మిల్లుల పరిశ్రమ అభివృద్ధి చెందుతూ వచ్చింది. మొదట యీ పరిశ్రమ కేవలం నూలు తీయడానికి మాత్రమే పరిమితమై యుండేది. కాని 1890-95 మధ్య నేత కూడ త్వరితంగా అభివృద్ధి చెందింది. బొంబాయి, అహమ్మదాబాద్ నూలుమిల్లులు, లంకాషైర్‌లోని మిల్లులతో పోటికి నిలబడగలిగాయి. చైనా జపాన్‌లోని నూలు మిల్లులకు గూడ తీసిపోవని పేరు పొందాయి.

19వ శతాబ్దాంతానికి ప్రత్తి మిల్లులు అనేక సమస్యల నెదుర్కొనవలసి వచ్చింది. 1896 సం॥లో బొంబాయిలో సంభవించిన ప్లేగు మూలంగా కార్మికుల సంఖ్య తగ్గిపోయి, వేతనాలు అధికమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారతదేశం తన ఎగుమతులను చాలావరకు పొగొట్టుకొన్నది.

BRAOU

నూలుమిల్లులకు కావలసిన యంత్రాలను, వస్తువులను, ఇంగ్లండ్ నుంచి దిగుమతి చేసుకొనడానికి వీలులేకపోయింది. అందుచే, యుద్ధసమయంలో నూలు మిల్లుల సంఖ్య తగ్గిపోయింది. 1921 సం॥లో,ప్రభుత్వ ఆదాయాన్ని అభివృద్ధి చేయడానికై, నూలు వస్త్రాల దిగుమతిపై సుంకాలు విధించింది. 1930 సంవత్సరంలో ప్రభుత్వం నూలు మిల్లుల సంరక్షక చట్టాన్ని ప్రవేశపెట్టి, ఇంగ్లండ్ నుంచి దిగుమతైన నూలువస్త్రాలపై 15 శాతం. ఇతర ఐరోపాదేశాల నుంచి దిగుమతైన వస్తువులపై 20 శాతం సుంకాలు విధించింది. 1832 సంవత్సరంలో నూలు మిల్లుల టారిఫ్ బోర్డ్ స్థాపించబడింది.

రెండవ ప్రపంచ యుద్ధం (1939-45) నూలు పరిశ్రమ అభివృద్ధికి అనువైన పరిస్థితులను కలిగించింది. 1951 సంవత్సరం నాటికి దేశంలో 378 నూలు మిల్లులు స్థాపించబడ్డాయి. అందులో 103 నూలు వడకుటకు, మిగిలినవి నూలు ఉత్పత్తితోబాటు బట్టలు నేయుటకు కూడ ఉద్దేశించబడ్డాయి.

13.10 జనపనార పరిశ్రమ

ప్రాచీన కాలం నుంచి బెంగాల్ జనపనార ప్రసిద్ధిగాంచింది. దారాలు, సంచులు, ప్రధానంగా జనపనార నుంచి తయారు చేసేవారు. బెంగాల్ ప్రాంతంలో జనపనార పరిశ్రమ మిక్కిలి అభివృద్ధి చెందడానికి అనేక కారణాలు గలవు. ఆ ప్రాంతంలో ముడి జనుము అధికంగా లభించుట; జనపనార మిల్లులను నడపడానికి మంచి సామర్థ్యం గల స్కాట్లండ్ పెట్టుబడిదారులు ముందుకు వచ్చుట. దీనితోబాటు చౌకగా కూలీ జనులు లభించుట ప్రధాన కారణాలు. బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ యొక్క తొలి దినాల నుంచి జనుము వ్యాపారం మిక్కిలి ప్రధానమైంది. 1830 వరకు గోనె సంచులు, జనపనార బట్టలు తయారు చేయుట, బెంగాల్ నేతపనివారి గుత్తాధికారమై యుండేది. దాని తర్వాత జనపనార పరిశ్రమ అభివృద్ధి గాంచ మొదలిడింది. 1838 నాటికి జనపనార బట్టల ఎగుమతులు క్రమంగా అధికమైనాయి.

1870 సం॥లో జనపనార ఉత్పత్తి ఉన్నట్టుండి పెద్ద ఎత్తున పెరిగింది. క్రొత్త కంపెనీలు స్థాపించబడ్డాయి; జనపనార వస్తువుల ఎగుమతులు అధికమైనాయి. 1880 నాటికి భారతదేశంలో 22 జనపనార మిల్లులు స్థాపించబడి 22,000 కార్మికులకు ఉపాధి కల్పించబడింది. 20వ శతాబ్ది ప్రారంభంలో జనపనార పరిశ్రమ వడిగా అభివృద్ధి చెంది, 1924 నాటికి 64కు పైబడి మిల్లులు స్థాపించబడ్డాయి. ప్రపంచ యుద్ధ సమయంలో ఇనుక సంచుల గిరాకి పెరిగిన కారణంగా జనపనార పరిశ్రమకు మంచి ప్రోత్సాహం లభించింది. సైన్యావసరాలకు జనపనార బట్టలు గూడ అమితంగా కావలసి వచ్చాయి.

జనపనార పరిశ్రమ మిక్కిలి కట్టుదిట్టంగా నడపబడింది. దాదాపు అన్ని జనపనార మిల్లులు, కలకత్తాకు సమీపంగా హుగ్లీ నదీతీరంలో కేంద్రీకృతమైనాయి. 1884 సం॥లో జనపనార మిల్లుల సంఘం స్థాపించబడి, వ్యాపారం క్రమబద్ధం చేయబడింది. ఈ పరిశ్రమకు ఎదురైన అతి ప్రధాన సమస్య, కార్మిక సమస్య. జనపనార పరిశ్రమ అధిక లాభాలు గడించినా, అందులో పనిచేసిన కార్మికులకు ఎట్టి సదుపాయాలు కల్పించబడలేదు. 1929లో సంభవించిన ద్రవ్యోల్బణం, 1932లో జనపనార పరిశ్రమ విచారణా సంఘం ఏర్పాటుకు దారితీసింది.

13.11 ఇనుము, ఉక్కు పరిశ్రమ

ఇనుమును కరిగించి పోత పోయడం వంటి పద్ధతులు భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి అనుసరించబడేవి. కాని పాశ్చాత్య పద్ధతులలో ఇనుము కరిగించు విధానం 19వ శతాబ్దారంభంలో మాత్రం ప్రవేశపెట్టబడింది. ప్రసిద్ధి చెందిన ఆంగ్ల నవలాకారుడైన చార్లెస్ డికెన్స్ స్నేహితుడైన జోసయా మార్షెల్ హీల్ అనునతడు, మనదేశంలో ఇనుము పరిశ్రమలో మొదటి ప్రయత్నాలు కొనసాగించాడు. మద్రాస్ రాష్ట్రంలోని దక్షిణార్కాట్ జిల్లా పోర్టోనోవోలో 1830 సం॥లో ఇనుము కార్ఖానాను స్థాపించాడు. కాని అతని కృషి పెద్దగా

ఫలితాలనివ్వలేదు. ఈ సమయంలో బెంగాల్ రాష్ట్రంలో ఇనుము పరిశ్రమలు స్థాపించడానికి ప్రయత్నాలు జరిగాయి. 1875 సం॥లో బేకర్ ఇనుప పరిశ్రమ స్థాపించబడింది. కాని ఇది నాలుగేండ్ల తర్వాత మూయబడింది. 1881 సం॥లో దీనిని ప్రభుత్వం చేపట్టింది. కాని కొద్ది కాలం తర్వాత బెంగాల్ ఇనుము - ఉక్కు కంపెనీకి స్వాధీనం చేసింది. 1905లో యీ కంపెనీ ఒక ఉక్కు విభాగాన్ని ప్రారంభించింది. కాని ఉక్కు ఉత్పత్తి ఆర్థికంగా లాభదాయకం గాకపోయింది; ఐరోపా నుంచి దిగుమతియైన ఉక్కు చౌకగా లభించుటయే, దీనికి ప్రధాన కారణం. 1919 సం॥లో బెంగాల్ - ఇనుము కంపెనీ స్థాపించబడింది.

భారతీయ ఉక్కు పరిశ్రమకు పితామహుడు జమ్‌షెడ్జీ టాటా. మధ్య పరగణాలలో ఇనుప నిల్వ గూర్చి ఒక జర్మన్ నిపుణుడు తయారు చేసిన నివేదికను చదివిన టాటా, ఇండియాలో ఇనుము - ఉక్కు పరిశ్రమ స్థాపించడానికి ఉత్సాహం చూపాడు. 1907 సం॥లో అతడు సక్చి అనుచోట, అట్టి పరిశ్రమను స్థాపించాడు. అతని పేరుతో, సక్చి 'జమ్‌షెడ్‌పూర్'గా పేర్చు మార్చబడింది. 1912 సం॥లో ఉక్కు తయారీ ప్రారంభమై 1920 నాటికి ఏటా 2 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయగలిగింది. టాటా ఉక్కు పరిశ్రమకు ప్రభుత్వం సహాయం అందజేసి, భూమిని కేటాయించి, గనుల త్రవ్వకంలో కొన్ని సౌకర్యాలు కలుగజేసి అక్కడ తయారైన రైలుపట్టాలను భారీ ఎత్తున కొని, సహాయం చేసింది.

టాటా తీసుకొన్న శ్రద్ధాసక్తులను ఉదాహరణగా గైకొని హీరాపూర్ వద్ద బర్న్ కంపెనీ అనునొక సంస్థ, 1922 సం॥లో ఇనుప పరిశ్రమను స్థాపించి, ముడి ఇనుము తయారీని ప్రారంభించింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం అనేక ఉక్కు, ఇనుము పరిశ్రమలు స్థాపించబడ్డాయి. అవి బ్రిటీష్ కర్మాగారాలలో తయారై, దిగుమతియైన ఉక్కుకు పోటీగా నిలబడవలసి వచ్చింది. టాటా కంపెనీ, అట్టి పోటికీ తట్టుకోలేక ప్రభుత్వ రక్షణ అర్థించింది. ప్రభుత్వం దిగుమతి సుంకాలను ఎక్కువ చేసి రక్షణ కలిగించింది. అందుచే ఇనుము-ఉక్కు పరిశ్రమ [redacted]త్తి పనితనంలో 1927 నుండి అభివృద్ధి చూపగలిగింది.

రెండవ ప్రపంచ యుద్ధం ఉక్కు పరిశ్రమకు అతిపెద్ద వరప్రసాదమైంది. ధరలను ప్రభుత్వం అదుపులో పెట్టింది. ఉత్పత్తిలో పెరిగిన ఖర్చు, ధరల నిర్ణయానికి ప్రాతిపదికగా తీసికొనబడింది. రక్షక సుంకాలు రద్దు చేయబడ్డాయి. యుద్ధం తర్వాత ఆయా సంస్థలు అభివృద్ధి పథకాలను చేపట్టాయి.

13.12. ఇతర పరిశ్రమలు

పంచదార పరిశ్రమ హిందూదేశంలో ప్రాచీనకాలం నుంచి స్వదేశీ పద్ధతులలో కొనసాగింది. మన దేశంలో తయారైన పంచదార, ఐరోపాలలోను ఆసియా దేశాలలోను అమిత గిరాకిని కలిగి యుండేది. ఈస్టిండియా కంపెనీ అనేక సంవత్సరాలు బెంగాల్ నుంచి చక్కెరను ఎగుమతి చేసింది. కాని తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం పశ్చిమ ఇండియా దీవుల నుంచి పంచదారను దిగుమతి చేయనారంభించింది. 19వ శతాబ్ది మధ్య భాగంలో పంచదారను శుద్ధిచేయుటలో పాశ్చాత్య పద్ధతులు ప్రవేశపెట్టబడినాయి. 1863 తర్వాత, మారిషస్ దీవుల నుంచి భారతదేశానికి పాశ్చాత్య పంచదారను భారతదేశం దిగుమతి చేసుకొన నారంభించింది. 1894 సం॥లో దిగుమతులపై సుంకం విధించబడింది. యుద్ధ సమయంలో చక్కెరపై సుంకం 10 శాతం అధికం చేయబడింది. అధిక సుంకాలచేత పంచదార దిగుమతులు తగ్గిపోవుటవల్ల స్వదేశీ పంచదార పరిశ్రమ మిక్కిలి అభివృద్ధి గాంచింది. కోయంబత్తూర్‌లో స్థాపించబడిన చెరకు అభివృద్ధి సంస్థ, ఆ పంటలో క్రొత్త రకాలు సృష్టించడానికి పరిశోధనలు కొనసాగించింది. కాన్పూర్‌లోని పంచదార తయారీ సంస్థ కృషి ఫలితంగా మేలైన పంచదార ఉత్పత్తి, మేలైన పంచదార ఉత్పత్తి విధానాలు కనిపెట్ట బడ్డాయి. 1936 సంవత్సరం నాటికి భారతదేశం పంచదార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడమేగాక, చుట్టుప్రక్క దేశాలకు ఎగుమతి చేయు స్థితికి చేరగలిగింది.

BRAOU

కాగితపు పరిశ్రమ గూడ 19వ శతాబ్దాంతానికి అమితంగా అభివృద్ధి గాంచింది. 1870లో భారతదేశపు మొదటి కాగితపు మిల్లు హుగ్లీ నదీతీరంలో స్థాపించబడింది. దానికి 'బాలీమిల్లు' అని పేరు. 1882 టిటాఘర్ కాగితపు మిల్లు, 1894లో ఇంపీరియల్ కాగితపు మిల్లు స్థాపించబడినాయి. ఈ మొదటి కాగితపు మిల్లులు, దిగుమతి చేసుకొనిన కర్ర గుజ్జును, సాబై గడ్డితో చేసిన గుజ్జును ఉపయోగించారు. లక్నో, పూనా నగరాలలో గూడ కాగితం మిల్లులు స్థాపించబడ్డాయి. 1927-28లో ఉత్పత్తి ప్రారంభించిన కర్ణాటక పేపర్ మిల్లు వరిగడ్డి నుపయోగించి కాగితమును తయారు చేసింది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బెంగాల్, బొంబాయి, ఉత్తరప్రదేశ్, మద్రాస్, తిరువాన్కూర్ ప్రాంతాలలో దాదాపు 11 కాగితం మిల్లులు పనిచేశాయి. కాగితపు ఉత్పత్తి పెరుగుతూ వచ్చినా దేశంలో విద్యా వ్యాప్తివల్ల విదేశాల నుంచి కాగితం, అట్టలు మొదలైనవి దిగుమతి చేసుకొనడం కొనసాగుతూ వచ్చింది.

భారతదేశంలోని పశుసంపద, చర్మ పరిశ్రమకు మూల కందమై వుండవలసింది. కాని మొన్నటివరకు, మనదేశం నుంచి ముడి చర్మాలు ఇతరదేశాలకు ఎగుమతి చేయబడుతూ వచ్చాయి. స్వదేశీ పద్ధతిలో చర్మాలను శుద్ధిచేయు విధానం, మధ్యయుగంలో సైతం అనుసరించబడినా, అధునాతన పద్ధతిలో దిగుమతి చేయబడిన రసాయనిక పదార్థాలతో చర్మాలను శుద్ధిచేయు విధానం 1860 సం॥లో కాన్పూర్‌లో ప్రభుత్వ కర్మాగారం స్థాపించబడినప్పటి నుంచి మాత్రమే కొనసాగిందని చెప్పవచ్చు. ప్రపంచ యుద్ధంలో సైనికులకు అవసరమైన పాదరక్షలు మొదలైనవాటి తయారీ ఎక్కువైనందున చర్మశుద్ధి పరిశ్రమ అమిత ప్రోత్సాహాన్ని పుంజుకుంది. గాజు పరిశ్రమ గూడ 19వ శతాబ్దాంతానికి మిక్కిలి అభివృద్ధి గాంచింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం, గాజు వస్తువుల దిగుమతి పెరిగిన కారణంగా స్వదేశీ ఉత్పత్తుల రక్షణకై లారిష్ బోర్డ్ స్థాపించబడింది. దాని సలహా మేరకు పదిసంవత్సరాలు గాజు వస్తువులపై సుంకాలు తగ్గించబడ్డాయి. 1930 తర్వాత గాజు దిగుమతులు తగ్గిన కారణంగా స్థానికంగా ఉత్పత్తులు అధికమైనాయి. 1945 సం॥నాటికి భారతదేశంలో 96 గాజు కార్మాగారాలు స్థాపించబడి సాలీన 1.5 లక్షల టన్నుల గాజు తయారుచేయబడింది.

1904 సం॥లో మద్రాస్ రాష్ట్రంలో పోర్ట్‌లాండ్ సిమెంట్ తయారీ ప్రారంభమైంది, కాని యీ సంస్థ కొద్దికాలం తర్వాత మూతపడింది. 1912-13 సం॥లో మూడు క్రొత్త సిమెంట్ కర్మాగారాలు స్థాపించబడ్డాయి. అవి పోరుబందర్ (గుజరాత్), కాట్ని (మధ్యప్రదేశ్), బుండి (రాజస్థాన్)లలో నెలకొల్పబడ్డాయి. కాని అవి అన్నీ కలిసి ఏటా వేయి టన్నులు గూడ ఉత్పత్తి చేయలేదు. ద్రవ్యోల్బణ సందర్భాలలో గూడ సిమెంట్ పరిశ్రమ నిరాటంకంగా అభివృద్ధి చెందిన కారణంగా రెండవ ప్రపంచ యుద్ధ సమయానికి సాలీన 12 లక్షల టన్నులకు మించి ఉత్పత్తి సాధించింది. యుద్ధకాలంలో దేశ వ్యాప్తంగా సిమెంట్ గిరాకి తగ్గిపోయింది. దీనికి ప్రధాన కారణం సిమెంట్‌తోబాటు ఉపయోగింపబడు ఉక్కు ఉత్పత్తి పడిపోవడం మాత్రమే.

అగ్గిపెట్టెలు ఉత్పత్తి చేయు కర్మాగారం మొట్టమొదటిసారిగా 1895 సం॥లో అహమ్మదాబాద్‌లో ప్రారంభించబడింది. అనేక చిన్న యంత్రాగారాలు వెంట వెంటనే స్థాపించబడ్డాయి. అనేక రసాయనిక ఇంజనీరింగ్ పరిశ్రమలు గూడ దేశవ్యాప్తంగా స్థాపించబడ్డాయి. కాని అవి ఈ శతాబ్దపు మొదటి భాగంలో మాత్రం, అభివృద్ధి చెందసాగాయి.

13.13 పరిశ్రమలు నడుపుటలో ఏజన్సీ విధానం

ప్రపంచ వ్యాప్తంగా అనుసరించబడిన 'మేనేజింగ్ ఏజన్సీ విధానం' పరిశ్రమలు నడపడంలో అనుసరించబడింది. ఈ పద్ధతి ఏదేని ఒక సంస్థను ప్రారంభించడానికి దానిని నడపడానికి అనుసరించబడింది. భారతదేశంలో పారిశ్రామిక అభివృద్ధి యీ మేనేజింగ్ ఏజన్సీ విధానపు ఆచరణ కారణంగానే జరిగిందని చెప్పవచ్చు. ఈ పద్ధతి ప్రచారంలోనికి వచ్చుటకు భారతీయ పెట్టుబడిదారులు ముందుకు రాకపోవడం, ప్రజల ఆసక్తి లోపించడం, సామర్థ్యంగల డైరెక్టర్లు లేకపోవుట, ప్రధాన కారణాలనవచ్చు. బ్రిటీష్‌వారి వ్యాపార సంస్థలు భారతదేశంలో స్థాపించబడుతూ వచ్చిన కారణంగా యీ ఏజన్సీ పద్ధతిలో పరిశ్రమలను నడుపు విధానం

అభివృద్ధి చెందింది. ధనముండి, పరిశ్రమలు నడుపు అనుభవంలేని పెట్టుబడిదార్లు, క్రొత్త పరిశ్రమలు స్థాపించి, నడుపు బాధ్యతలను నమ్మకం గల ఏజంట్లకు అప్పగించారు. దీనిచే కొద్ది కాలంలో భారతదేశంలో అనేక మేనేజింగ్ ఏజన్సీ సంస్థలు స్థాపించబడ్డాయి. వీటిలో బిర్లా సోదరులు, టాటా సంస్థ, సాహు జైన్ లిమిటెడ్, దాల్మియా కంపెనీ, జైపూరియా సోదరుల కంపెనీ, నౌరోన్‌జి వాడియా మొదలైనవి మిక్కిలి ప్రధానమైనవి.

పరిశ్రమలను నడుపు ఏజంట్లు అనేక పనులు చేపట్టినారు. సంస్థను స్థాపించడానికి గల అన్ని బాధ్యతలను వారు నెరవేర్చారు. నూలు, ఇనుము, ఉక్కు, జనుము, సిమెంట్ మొదలైన అన్ని కర్మాగారాలు వారి చొరవవల్ల మాత్రమే స్థాపించబడ్డాయి. కర్మాగారం సక్రమంగా పనిచేయుటకు మంచి పద్ధతులలో సంస్థ పురోగమించుటకు వారు కృషిచేశారు. ఈ ఏజంట్లు ప్రారంభపెట్టుబడికి పునర్వ్యవస్థీకరణకు, ఆధునికీకరణకు, వ్యాప్తికి మొదలైన వాటన్నిటికి బాధ్యత వహించినారు. వారు ముడి వస్తువులు కొనుటకు, యంత్రాలను ఖరీదు చేయడానికి, తయారైన వస్తువుల నమ్మడానికి, బీమా చేయించడానికి గూడ తగుజాగ్రత్తలు గైకొని తాము నడుపు పరిశ్రమాభివృద్ధికి అన్ని విధాల కృషిచేసినారు. ఒక్కమాటలో చెప్పవలెనన్న, పరిశ్రమలు నడపడానికి బాధ్యత ఆవహించిన యీ ఏజంట్లు, ఆ పరిశ్రమకు ప్రారంభకులు, పాలకులు, ధనసహాయకులు, ఏజంట్లు కూడ.

13.14 స్వదేశీ - విదేశీ పెట్టుబడి

బ్రిటీష్‌వారి పరిపాలన స్థాపించబడిన తర్వాత ధనవంతులైన మహమ్మదీయ ప్రభువర్గీయులు తమ ధనాన్ని చాలావరకు కోల్పోయారు కాని వర్తకులు తమ తమ వ్యాపారాలను యధావిధిగా కొనసాగించారు. ఈస్టిండియా కంపెనీ తొలిరోజులలో రాజకీయ ఒడుదుడుకుల కారణంగా ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. కాని 1770 సం॥ తర్వాత స్థానిక వ్యాపారులు వాణిజ్య విషయాలలో ఎక్కువ ఆసక్తి చూపారు. యాంత్రిక పద్ధతిలో తయారైన ఉత్పత్తులు అధికమగుటచేత స్వదేశీ పెట్టుబడి తగ్గుముఖం పట్టింది. ఈ శతాబ్దారంభంలో నమోదైన జాయింట్ స్టాక్ కంపెనీలలో స్వదేశీ పెట్టుబడి 37 కోట్ల రూపాయలకు మించి వుండిందని అంచనా వేయబడింది.

బ్రిటీష్ పరిపాలన భారతదేశాన్ని ఆధునికీకరణ చేయడానికి ఒక సాధనమన్ని వాదించువారు సాధారణంగా క్రిందివాటిని ఉదహరించుట పరిపాటి. రైల్వేల అభివృద్ధి, తోటల పెంపకం, బ్రిటీష్ పెట్టుబడులతో స్థాపించబడిన కర్మాగారాలు, గనులు, పెట్టుబడిదారీ విధానంలో ప్రవేశపెట్టబడిన పారిశ్రామికోత్పత్తులు, ఆధునిక బ్యాంకులు మొదలైనవి. భారతీయ రైలు మార్గాలు పూర్తిగా బ్రిటీష్‌వారి వాణిజ్య అవసరాలకు సైనిక సౌకర్యాలకై ఉద్దేశించబడినవి మాత్రమే. స్థానిక వర్తకులు తమ వస్తువులను రైళ్ళలో పంపడానికి బ్రిటీష్ వారికన్న ఎక్కువ రుసుం చెల్లించవలసి యుండేది. రైలు పరికరాలన్ని ఇంగ్లండ్ నుంచి దిగుమతి చేయబడినందున సంబంధిత పరిశ్రమలు తగినంతగా అభివృద్ధి చెందలేదు. తోటల పరిశ్రమ, గనులు, జనప మిల్లులు, బ్యాకింగ్, బీమా, నౌకాయానం మొదలగు పరిశ్రమలు, మేనేజింగ్ ఏజన్సీ విధానంలో నడపడంచేత అతి త్వరితంగా అభివృద్ధి చెందాయి. అవి భారతీయ ఆర్థికాభివృద్ధికి ఎంతవరకు దోహదం చేశాయనునది మరో విషయం.

విదేశీయులు భారతదేశంలో తమ పెట్టుబడిని అమిత లాభాల నార్జించు దృష్టితోనే వెచ్చించారు. తమ దేశంతో పోల్చిన ఇక్కడ కార్మిక జనులు తక్కువ ఖర్చుతో లభించినారు. ముడి సరుకులు గూడ సులభంగా సరసమైన ధరకు లభించాయి. దేశంలోగాని ప్రక్కదేశాలలో గాని సులభంగా వస్తువులనమ్ముకోడానికి మార్కెట్లు లభించాయి. వలస పాలన విదేశీ పెట్టుబడుల నాకర్షించుటకు అన్ని చర్యలు గైకొన్నది. పరిశ్రమల మూలంగా స్థానికులు ఎటువంటి లాభాలనూ పొందలేక పోయారు. సాంకేతిక సిబ్బంది చాలా వరకు విదేశీయులు. వారికి కావలసిన వస్తువులన్నీ విదేశాల నుంచి మాత్రమే తెప్పించేవారు. భారతీయులకు ఒకే ఒక లాభం కలిగింది. అదే విశేష కూలీల ఉత్పత్తి, వారు అతి కొద్దిపాటి వేతనాలతో అమిత కృషినంద జేసేవారు.

ఆ విధంగా పారిశ్రామిక పెంపుదల చాలా కుంటుపడింది. ప్రభుత్వ సాంప్రదాయక పరిశ్రమలను రక్షించడానికి ఎట్టి చర్యలు తీసుకోలేదు. ఇంగ్లండ్‌లోని పరిశ్రమలను పరిరక్షించడానికై, ప్రభుత్వం భారతదేశంలో స్వేచ్ఛా వ్యాపారాన్ని అనుసరించింది. సాంకేతిక విద్యను బోధించడానికెట్టి ప్రయత్నాలు కొనసాగించబడలేదు. దేశంలో బ్రిటీష్ దిగుమతులు ప్రోత్సహించబడ్డాయి. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి కనిపించినా బ్రిటీష్ వలస పరిపాలనలో ఆద్యంతం, సామాన్య ప్రజలు బీదరికంతో తమ జీవితాలను కొనసాగించారు. ఆధునిక భారతదేశ చరిత్రలో ప్రజానీకపు బీదతనం అన్ని సాంఘిక, రాజకీయ, సాంస్కృతికాభివృద్ధి కార్యక్రమాలకు కీలకమైనదిగా నిలిచిపోయింది. అయినా మనదేశంలో సాగిన పారిశ్రామికాభివృద్ధి, సాంఘికంగా రెండు క్రొత్త వర్గాలను సృష్టించిందని చెప్పవచ్చు. అవి పారిశ్రామిక పెట్టుబడిదారి వర్గం, కార్మిక వర్గం. ఈవిధంగా మనదేశంలో సాగిన పారిశ్రామికాభివృద్ధి ఇంగ్లండ్ ఆర్థిక విధానాన్ని పెంపొందించడానికై ఉద్దేశించబడిందని చెప్పవచ్చు.

13.14.1 పారిశ్రామిక క్షీణత లేదా తిరోగమన పారిశ్రామికీకరణ

భారతదేశంలోని వలసపాలనకు రెండు ముఖాలున్నాయి. అవి (1) తమ స్వప్రయోజనాలను దృష్టిలో నుంచుకొని స్వదేశీయ పరిశ్రమలను నాశనం చేయటం, భారతీయ వ్యవసాయంను నగ్నంగా దోపిడి చేయటం (2) 19వ శతాబ్దపు ద్వితీయ భాగంలో బ్రిటీష్ పెట్టుబడిదారులచే 'మేనేజింగ్ ఏజెన్సీ విధానం' (managing agency system) ద్వారా తోటలు, బొగ్గు, ఇనుము, ఉక్కు, వస్త్ర, జనుము పరిశ్రమల అభివృద్ధిని పెంపొందింపచేయటం.

19వ శతాబ్దపు భారతదేశంలో కన్పించే అతి ముఖ్య పరిణామం పెద్ద పెద్ద యంత్రాలతో భారీ పరిశ్రమలు స్థాపించి యాంత్రిక యుగమునకు స్వాగతం పలకటం. భారతదేశంలో బ్రిటీష్ విధానమును సూక్ష్మముగా పరిశీలిస్తే కనుపించే విషయం, వారి లక్ష్యం భారతీయులకు లాభం కలుగ చేసే పరిశ్రమలు స్థాపించటం కాదు. బ్రిటీష్‌వారు తమ చాతుర్యమంతా ఉపయోగించి తిరోగమన పారిశ్రామికీకరణకు లేదా భారతీయుల పారిశ్రామిక శక్తిని క్రమంగా చంపివేయుటకు అనుసరించిన తమ పరిశ్రమల రక్షిత విధానం. బపన్ చంద్ర మాటల్లో భారతదేశపు పారిశ్రామిక ప్రగతి అతిమెల్లగాను, బాధాకరంగా ఉండటానికి కారణం బ్రిటీష్ పారిశ్రామిక వేత్తలు, భారతదేశపు ప్రభుత్వంపై వొత్తిడి తీసుకువచ్చి భారతదేశంలో పారిశ్రామిక ప్రగతిని అడ్డుకోవటమే. పాశ్చాత్య రాజ్యాల బలమైన పోటీ నుంచి బాల్యావస్థలో నున్న భారతీయ పరిశ్రమలు రక్షించేందుకు ఏ చర్యలు చేపట్టలేదు. కొత్తగా స్థాపించబడిన పరిశ్రమలకు అవసరమైన ఆర్థిక సహాయం ఇచ్చేందుకు బ్రిటీష్ ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. 1920-1930 మధ్యలో బ్రిటీష్ ప్రభుత్వం చూపించిన భేదభావం వారి దృష్టిని స్పష్టంగా తెలుపుతుంది. భారతదేశంలో రోజురోజుకి పెరుగుతున్న జాతీయ భావ ఒత్తిడి ఫలితంగాను, భారతీయ పెట్టుబడిదారుల ఒత్తిడి ఫలితంగాను అయిష్టంగాను భారతీయ ప్రభుత్వం పరిశ్రమలను రక్షించేందుకు సుంకంను విధించింది. ఇక్కడ కనుపించే విశేషం ఏమిటంటే భారతీయులచే స్థాపించబడిన పరిశ్రమలకు కాక విదేశీయులచే పెట్టబడిన పెట్టుబడిని, విదేశీయ పరిశ్రమలను మాత్రమే రక్షించారు. పైగా భారతీయ పారిశ్రామికవేత్తల తీవ్ర ప్రతిఘటనను వ్యతిరేకించి బ్రిటీష్ దిగుమతులను సామ్రాజ్యవాదుల కనుకూలమైనవిగా ప్రచారం చేశారు.

19వ శతాబ్దపు ద్వితీయ భాగంలోను 20వ శతాబ్దపు మొదటి భాగంలోను భారతదేశపు పారిశ్రామిక ప్రగతి లేదా అభివృద్ధి పైపైన మాత్రమే జరిగింది. ఫలితంగా బ్రిటీష్ వాణిజ్య, వర్తక వర్గం మాత్రమే లాభపడింది. భారతీయ పారిశ్రామిక, వ్యవసాయక ఆర్థిక వ్యవస్థ దారిద్ర్యంలో కూరుకుపోయింది. భారతదేశంలో బ్రిటీష్ వారు అనుసరించిన విధాన ఫలితంగా కనుపించే పరిణామమేనగా, సామాజిక రంగంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గ, కార్మిక వర్గ ఆవిర్భావం. భారతదేశ తిరోగమన పారిశ్రామికీకరణ బ్రిటీష్‌వారు భారతదేశంలో అనుసరించిన వలస పాలన విధాన ఫలితమే.

BRAOU

IV మీ అవగాహన పరీక్షించుకోండి

1. 19వ శతాబ్దంలో 20వ శతాబ్దపు ప్రారంభంలో భారతదేశంలో అభివృద్ధి చెందిన పరిశ్రమలేవి?

.....

.....

.....

.....

2. భారతదేశంలో బ్రిటీష్‌వారి పారిశ్రామిక విధానపు ముఖ్య లక్షణమేది?

.....

.....

.....

.....

13.15 సంగ్రహంగా

1. భారతదేశంలో బ్రిటీష్‌వారి ఆర్థిక దోపిడీ విధానాన్ని ఆర్.సి.దత్, మూడు దశలుగా విభజించినాడు. అవి: మొదటి దశ - 1757-1857 వాణిజ్య ప్రధాన దశ

   రెండవ దశ - 1813-1857 భారతదేశం, బ్రిటన్‌లో ఉత్పత్తి అయిన వస్తువులకు మార్కెట్టుగా తయారవడం

   మూడవ దశ - 1858-1947 భారతదేశ సంపద బ్రిటన్‌కు ఎక్కువగా తరలించడం.

2. బ్రిటన్ పాలనకు పూర్వం గ్రామాలల్లో స్వయంసమృద్ధి గల ఆర్థిక వ్యవస్థ వుండేది. దేశంలో జవుళి పరిశ్రమ బాగా అభివృద్ధి చెందిన దశలోవుండేది.

3. బ్రిటీష్ పాలనవల్ల గ్రామాల స్వయం సమృద్ధి నశించింది. గ్రామ, పట్టణాలల్లోని కుటీరపరిశ్రమలు నశించాయి.

4. కుటీరపరిశ్రమలు నశించడంవల్ల భూమి మీద ఒత్తిడి ఎక్కువైంది. వ్యాపార పంటలు ఎక్కువైనాయి.

5. భూమి శిస్తును ఎక్కువగా వసూలు చేయడంవల్ల వ్యవసాయదారుల ఋణభారం పెరిగింది.

6. బ్రిటీష్ పాలనలో దేశంలో క్షామాల సంఖ్య పెరిగింది.

7. బ్రిటీష్‌వారు క్షామ నివారణ విధానాన్ని రూపొందించారు. జాన్ స్ట్రాచి అధ్యక్షతన ఏర్పడిన మొదటి క్షామ నివారణ కమీషన్, క్షామ నివారణ సహాయక చర్యలను ప్రకటించింది.

8. 19వ శతాబ్దపు మధ్యభాగం నుంచి భారతదేశంలో బ్రిటీష్ పెట్టుబడి ప్రారంభమయింది. రైల్వేలు నీటి పారుదల పథకాలు, తోటలు, బొగ్గుగనులు మొదలైన రంగాల్లో బ్రిటీష్‌వారు మూలధనం పెట్టుబడి పెట్టడం జరిగింది.

9. తేయాకు, కాఫీ, రబ్బర్, నీలిమందు తోటలను బ్రిటీష్‌వారు పెంపొందించారు.

10. 19వ శతాబ్దపు ప్రారంభంలో బెంగాల్‌లో బొగ్గుగనుల త్రవ్వకం ప్రారంభమైంది. రైల్వేలు ప్రారంభమయిన తరవాత బొగ్గుగనుల నుంచి బొగ్గు ఉత్పత్తి, 3 లక్షల టన్నుల నుంచి 10 లక్షల టన్నులకు పెరిగింది.

BRAOU

11. దేశంలోని మొట్టమొదటి నూలుమిల్లు కలకత్తాలో 1838లో ప్రారంభించబడింది. 19, 20 శతాబ్దాలలో అనేక నూలు మిల్లులు ఏర్పడ్డాయి.

12. జనపనార పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. 1924 నాటికి దేశంలో 64 జనపనార పరిశ్రమలున్నాయి.

13. ఇనుము, ఉక్కు పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. జమ్‌షెడ్‌జీ టాటా భారతీయ ఇనుము ఉక్కు పరిశ్రమ స్థాపించారు.

14. 20 శతాబ్దంలో కాగితము, చక్కెర, చర్మము, సిమెంటు, గాజు, రసాయన పదార్థాలు, ఇంజనీరింగ్ వస్తువుల ఉత్పత్తి అభివృద్ధి చెందింది.

15. పరిశ్రమల నిర్వహణకు, మేనేజింగ్ ఏజన్సీ విధానము అభివృద్ధి చెందింది. మేనేజింగ్ ఏజంట్లు ప్రోత్సాహకులుగా, పెట్టుబడిదారులుగా, మేనేజర్లుగా, ఏజంట్లుగా అనేక పనులు నిర్వహించేవారు.

16. పరిశ్రమలలో భారతీయ పెట్టుబడి కూడా పెరిగింది. బ్రిటీష్‌వారి కాలంలో పారిశ్రామిక ప్రగతి మందకొడిగా జరిగింది. ఎక్కువగా పారిశ్రామిక అభివృద్ధి బ్రిటీష్‌వారి ప్రయోజనాల కొరకే జరిగింది.

13.16 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) గ్రామీణ స్వయం సమృద్ధి, సంప్రదాయ భారతీయ ఆర్థిక వ్యవస్థ ముఖ్య లక్షణము

2) బ్రిటీష్‌వారి ప్రోత్సాహము లేనందున భారతీయ కుటీర పరిశ్రమలు నశించాయి. బ్రిటీష్ వారి స్వేచ్ఛా వ్యాపార విధానము భారతదేశంలో కుటీరపరిశ్రమల వస్తువులకు తీవ్ర పోటీ ఏర్పడడంవల్ల కూడా కుటీర పరిశ్రమలు నశించాయి.

II 1) బ్రిటీష్ పాలనలో, ముఖ్యంగా భూమి శిస్తు భారం ఎక్కువ కావడంవల్ల, రైతుల ఋణభారం ఎక్కువైంది.

2) గ్రామాలల్లో క్షామనివారణ కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని, ఉదారంగా భూమి శిస్తు క్షామపీడిత ప్రాంతాల్లో రద్దు చేయాలని, బలహీన వర్గాలకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు జరపాలని, జేమ్స్ లయల్ అధ్యక్షతన ఏర్పడిన, రెండవ క్షామ నివారణ సంఘం సూచించింది.

III 1) భారతదేశంపై బ్రిటీష్‌వారి యాజమాన్యాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో రైల్వేలు నిర్మింప బడ్డాయి. అందువల్ల ఆకాలంలో, రైల్వేలవల్ల దేశానికి ఎక్కువ లాభం కలుగలేదు.

2) జర్మనులు రసాయనిక అద్దకాలు తయారు చేయడంవల్ల 19వ శతాబ్దం తరవాత భారతదేశంలో నీలిమందు పరిశ్రమ క్షీణించింది.

IV 1) 19వ శతాబ్దంలో 20వ శతాబ్దపు ప్రారంభంలో తోటల పరిశ్రమ, గనుల పరిశ్రమ, ఇనుము, ఉక్కు పరిశ్రమ, నూలు, జనపనార, సిమెంట్, కాగితం, చక్కర, గాజు, పరిశ్రమలు భారత దేశంలో అభివృద్ధి చెందినాయి.

2) భారతదేశంలోని ముడిపదార్థాలను బ్రిటన్‌లోని పరిశ్రమలకు తరలించడం, బ్రిటన్‌లో తయారైన సరుకులను అమ్మడానికి భారతదేశాన్ని మార్కెట్‌గా ఉపయోగించుకోవడం, భారతదేశంలోని బ్రిటీష్‌వారు అనుసరించిన పారిశ్రామిక విధానపు ముఖ్య లక్షణం.

BRAOU

13.17 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) గ్రామీణ ఆర్థిక వ్యవస్థను భారతీయ చేతి వృత్తులను బ్రిటీష్ పాలన ఏ విధంగా నాశనం చేసింది?

2) భారతదేశంలో వ్యవసాయంపై బ్రిటీష్ పాలన ప్రభావం తెలియజేయండి.

3) బ్రిటీష్ పాలన కాలంలో వ్యవసాయ ఋణగ్రస్తతకు కారణాలను, ఫలితాలను సమీక్షించండి.

4) భారతదేశంలో నూలు, జనపనార, ఇనుము, ఉక్కు పరిశ్రమల పుట్టుకను, అభివృద్ధిని గూర్చి చర్చించండి.

5) భారతదేశంలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధి ముఖ్య లక్షణాలను వివరించండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) ఆర్థిక రంగంలో బ్రిటీష్‌వారి విధానాలకు సంబంధించిన వర్గీకరణను తెలుపండి.

2) సాంప్రదాయ భారత ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని వివరించండి.

3) స్వదేశీ పెట్టుబడులకు ఏర్పాటును బ్రిటీష్ విదేశీ పెట్టుబడి ఎలా ప్రభావిత మొనరించింది?

4) మేనేజింగ్ ఏజెన్సీ విధానంపై ఒక లఘు వ్యాఖ్య వ్రాయండి.

5) "19వ శతాబ్దంలో భారతదేశంలో పారిశ్రామిక ప్రగతి నెమ్మదిగా, మందకొడిగా, బాధాకరంగా జరిగింది" విశదీకరించండి.

13.18 ఉపయుక్త గ్రంథాలు

1. Antonova K. and Others : *A History of India Vol. II*
2. Bhatia B.M. : *Famines in India.*
3. Bhattacharya. Dhires : *A Concise History of the Indian Economy*
4. Chandra, Bipan : *Modern India*
5. Chandra, Bipan : *The Rise and Growth of Economic Nationalism in India*
6. Dutt R.C. : *Economic History of India, vol.II*
7. Desai, S.S.M. : *Economic History of India*
8. Gadgil D.R. : *The Industrial Evolution in India in Recent Times*
9. Sarkar, sumit : *Modern India, 1885-1947*
10. Spear, Perceival : *History of India, Vol.II*
11. ఝాన్సీలక్ష్మి, పాటిబండ్ల; వైదేహి, అల్లాడి : *భారతదేశ చరిత్ర - సంస్కృతి ద్వితీయ భాగం, తెలుగు అకాడమి ప్రచురణ.*
12. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం*

BRAOU

ఖండం - 4 భారత జాతీయోద్యమం

ఈ ఖండంలో మొత్తం 15 భాగాలున్నాయి. (భాగం 14 నుంచి భాగం 27 వరకు) ఇందులోని మొదటి భాగం (14వ భాగం) 19వ శతాబ్దిలో మనదేశంలో జరిగిన మత, సాంఘిక సంస్కరణోద్యమాల గురించి. భారత జాతీయ కాంగ్రెస్ పుట్టుక నుంచి 1947 వరకు జరిగిన జాతీయోద్యమ వివిధ దశల గురించి అనేక భాగాలున్నాయి. చివరి భాగం (27 వ భాగం)లో 1947 నాటికి దేశంలో వున్న సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల విశదీకరణ వుంది.

BRAOU

BRAOU

భాగం -14 : మత, సాంఘిక సంస్కరణోద్యమాలు

విషయక్రమం

14.0 లక్ష్యాలు
14.1 పరిచయం
14.2 బ్రహ్మ సమాజం
14.2.1 దేవేంద్రనాథ్ టాగూర్, 1817-1905
14.2.2 కేశవ్‌చంద్ర సేన్, 1838-1884
14.2.3 ప్రార్థన సమాజ్
14.3 ఎం.జి. రనడే, 1842-1901
14.4 సత్యశోధక సమాజం మరియు జ్యోతిబ ఫూలే, 1827-1890
14.5 పండిత రమాబాయ్ సరస్వతి, 1858-1992
14.6 డి.కే. కార్వే, 1858-1962
14.7 ఆర్యసమాజం
14.8 దక్షిణ భారతదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు
14.8.1 కందుకూరి వీరేశలింగం
14.8.2 రఘుపతి వెంకటరత్నం నాయుడు
14.8.3 దేశిరాజు పెదబాపయ్య
14.8.4 నారాయణగురు మరియు శ్రీ నారాయణ ధర్మ పరిపాలన యోగం ఉద్యమం 1854-1928
14.8.5 రామస్వామి నాయకర్ ఆత్మగౌరవ ఉద్యమం
14.9 బ్రహ్మ - ప్రార్థనా సమాజం
14.10 దివ్యజ్ఞాన సమాజం
14.11 రామకృష్ణ పరమహంస
14.12 స్వామి వివేకానంద
14.13 రామకృష్ణమఠం
14.14 అహ్మదీయ ఉద్యమం
14.15 వహాబి ఉద్యమం
14.16 అలీగర్ ఉద్యమం
14.17 పార్శీలు
14.18 అకాలీ ఉద్యమం
14.19 మత, సంఘ సంస్కరణోద్యమాల ప్రభావం
14.20 సంగ్రహంగా
14.21 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
14.22 పరీక్ష నమూనా ప్రశ్నలు
14.23 ఉపయుక్త గ్రంథాలు.

14.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. 19,20 శతాబ్దాలలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణ మఠం మొదలైన సాంఘిక, మత సంస్కరణోద్యమాలు.
2. అలీగర్ ఉద్యమంవంటి మహమ్మదీయ సంస్కరణోద్యమాలు
3. పార్శీ, సిక్కులలో జరిగిన సంస్కరణోద్యమాలు

BRAOU

14.1 పరిచయం

సంస్కరణోద్యమం మత, సాంఘికపరమైన రెండు ధోరణులను కలిగి యుండింది. ఇవి ఒక దానితో మరొకటి ఎడతెగని సంబంధం కలిగి యుండేవి. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, రామకృష్ణ మిషన్, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజంవంటి సంస్థల పుట్టుక, వాటి కార్యకలాపాల మూలంగా మత ధోరణులు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి.

పాశ్చాత్య (ఐరోపీయ) భావాలను అలవర్చుకొనడం, వితంతు పునర్వివాహం, కులాంతర వివాహాలు, స్త్రీ విద్య మొదలగు డిమాండుల మూలంగా సాంఘిక ధోరణులు వాటంతట అవే ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సంస్కర్తలు, ముసుగు ధరించడాన్ని (పర్దా), బాల్య వివాహాలు, బహు భార్యాత్వం, కుల వ్యత్యాసాలను నిర్మూలించాలని వాదించారు. వారు హరిజనుల యెడ వివక్షతను ఖండిస్తూ స్త్రీ, పురుషుల వివాహ వయస్సును పెంచాలని స్త్రీలకు వారసత్వ హక్కులుండాలని కూడా వాదించారు.

14.2 బ్రహ్మ సమాజం



19వ శతాబ్దం మొదటి ఏభై సంవత్సరాలలో సామాజిక, మత రంగాలలో బలమైన సంస్కరణ వెల్లువ ఉప్పొంగింది. బెంగాల్‌లో మొదలైన మత, సాంఘికోద్యమాలలో రాజా రామమోహన్ రాయ్‌దే అగ్రస్థానం. ఇది మధ్యయుగం నుంచి ఆధునిక యుగానికి పరివర్తన చెందుతున్న కాలం. బ్రహ్మ సమాజాన్ని (1828) స్థాపించిన రాజా రామమోహన్ రాయ్ (1772-1833), ఐరోపా ఉదారభావంవల్ల ప్రభావితుడైనాడు. అతడు గొప్ప మత సంస్కర్త. మానవతా వాది. నైరాశ్య స్థితి నుంచి దేశం విముక్తి చెందాలంటే సామాజిక, మత రంగాలలో తీవ్రమైన సంస్కరణలు ప్రవేశపెట్టాలనే అవసరాన్ని గుర్తించాడు. విగ్రహారాధనను వ్యతిరేకించి ఏకేశ్వరోపాసనను సమర్థించిన ఇస్లాం, సూఫీ సిద్ధాంతం, క్రైస్తవ మత నీతి బోధనలు, ఉదారవాద, హేతువాద పాశ్చాత్య సిద్ధాంతాలు, మత, ఆధ్యాత్మిక దృక్పథాలు రాజా రామమోహన్ రాయ్‌ని ప్రభావితుణ్ణి చేశాయి. రాజా రామమోహన్ భారతీయ సాంస్కృతిక జాగృతికి మూల పురుషుడు.

బ్రహ్మ సమాజం అన్ని మతాలను అనుసరించే వారి చర్చావేదిక. వర్గరహిత సమాజం పరిణామం చెందడానికి ఉత్పత్తి స్థానం. బ్రహ్మ సమాజికులు ఒకే దైవాన్ని నమ్మారు. విగ్రహారాధనను త్యజించారు. రామ్‌మోహన్ రాయ్ వర్ణ వ్యవస్థను, ఛాందస బ్రాహ్మణుల క్రౌర్యాన్ని, కర్మకాండను, విగ్రహారాధనను ఖండించాడు. హిందూ మతంలోని లోపాలను తొలగించి వేదాలను, ఉపనిషత్తులను ఆధారంగా చేసికొని, ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించాలనేదే బ్రహ్మ సమాజ ప్రధానాశయం. అతని నాయకత్వంలో బ్రహ్మ సమాజం సతీ సహగమనాన్ని, బాల్య వివాహాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ఆశ్చర్యకరమైన సంగతేమిటంటే బాల్యవివాహాలను తీవ్రంగా వ్యతిరేకించినా, రామ్‌మోహన్ మరణించేవరకు జంధ్యాన్ని ధరించాడు. అంటే, తుదివరకు హిందువుగానే జీవించాడు.

ఏకేశ్వరోపాసన బ్రహ్మ సమాజం అనుసరించిన ముఖ్య సిద్ధాంతం. బ్రహ్మ సమాజం విశ్వమానవ సౌభ్రాతృత్వ సిద్ధాంతాన్ని ఎలుగెత్తి చాటింది. అన్ని మతాలను, మత గ్రంథాలను గౌరవించాలని ఉపదేశించింది. కాని ఏ మత గ్రంథాన్ని ప్రామాణికంగా స్వీకరించలేదు. బ్రహ్మ సమాజాన్ని సాంఘిక మత సంస్కరణోద్యమంగా వర్ణించవచ్చు. ఆధునిక పాశ్చాత్య సంస్కృతీ ప్రాధాన్యతను గుర్తించి, ఆ సంస్కృతి ప్రజల్లో ప్రచారం కావడానికి దేశంలో విద్యా సంస్థలను స్థాపించింది.

హిందూ మతాన్ని త్యజించటానికి బ్రహ్మ సమాజం ఇష్టపడలేదని, పాశ్చాత్య మత సిద్ధాంతాలవల్ల ప్రతిస్పందించి ఉదార భావాలు స్వీకరించడానికి ఇష్టపడుతోందని రామ్‌సే మేక్ డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు.

BRAOU

రామ్‌మోహన్ రాయ్ మరణానంతరం విశేషానుభవజ్ఞులు సంస్కారవంతులైన దేవేంద్రనాథ టాగూర్, కేశవ చంద్రసేన్‌లు, క్షీణిస్తున్న బ్రహ్మ సమాజాన్ని పునరుద్ధరించారు. ఈ మహత్తర సంస్థ పునరుజ్జీవన కృషిలో వారి బృహత్తర పాత్రను పరిశీలిద్దాం.

14.2.1 దేవేంద్రనాథ టాగూర్, 1817-1905

ప్రాచీన భారతీయ విజ్ఞానం నూతన పాశ్చాత్య భావపరంపరల ప్రతీక, దేవేంద్రనాథుడు. 'తత్వబోధినీ సభ' అనే సాంస్కృతిక సంస్థను స్థాపించాడు. ఇతడు ప్రారంభించిన మాస పత్రిక **తత్వబోధిని** బ్రహ్మ సమాజ్ అధికార పత్రికైంది. ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజేంద్రలాల్ మిశ్రాలు ఈ పత్రికకు విలువైన వ్యాసాలను వ్రాసి పంపేవారు.

వేదాలను, ఉపనిషత్తులను బోధించడానికి తత్వబోధినీ సభను స్థాపించాడు. వేదాలు అపౌరుషేయాలని, బ్రహ్మ సమాజ సిద్ధాంతాలకు ఏకైక పునాది అని, దేవేంద్రనాథ టాగూర్ ప్రగాఢంగా నమ్మాడు. ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి చాలామంది ప్రచారకులను నియమించాడు. 1843లో దేవేంద్రనాథ టాగూర్ బ్రహ్మ సమాజ్‌ను పూర్తిగా పునర్వ్యవస్థీకరించి నవచైతన్యాన్ని రేకెత్తించాడు. బ్రహ్మ సమాజ్ వితంతు పునర్వివాహ ఉద్యమానికి పూర్తి మద్ధతునిచ్చింది. బహు భార్యాత్వాన్ని నిషేధించాలని కోరింది. స్త్రీ విద్యను ప్రోత్సహించింది.

అక్షయ కుమార్ దత్తా నాయకత్వంలో బ్రహ్మ సమాజ్‌లోని యువవర్గం, వేదాల ఆధిక్యతపట్ల, విమర్శనాత్మక దృక్పథాన్ని అలవరచుకుంది. దేవేంద్ర నాథుడు అక్షయ కుమార్ అభిప్రాయాలపట్ల సానుభూతిని చూపించాడు. ఏకేశ్వరోపాసనను సమర్థించడానికి దత్తా ఉపనిషత్తులలోని ప్రత్యేక భాగాలను సంకలనం చేశాడు. సహజ విశ్వవ్యాప్త ఆస్తికవాద సిద్ధాంతాన్ని మూర్తీభవింప చేస్తూ మత వ్యవస్థను పటిష్టం చేయడానికి ఒక కొత్త ఒప్పందాన్ని రూపొందించాడు. చివరి సంవత్సరాలలో దేవేంద్రనాథుడు, ఆధ్యాత్మిక మత గ్రంథాల అధ్యయనంలో నిమగ్నుడయ్యాడు.

14.2.2 కేశవచంద్ర సేన్, 1838-1884

కేశవచంద్ర సేన్, బ్రహ్మ సమాజ్‌లో ప్రముఖ నాయకుడు. 1875లో ఇతడు బ్రహ్మ సమాజ్‌లో చేరాడు. కొత్త మతాన్ని ప్రచారం చేయడానికి దేశంలో చాలా ప్రాంతాలను సందర్శించాడు. అతని కృషి ఫలితంగా బ్రహ్మ సమాజ్ ఉద్యమం జనాదరణ పొందింది. కేశవచంద్రుని చైతన్యవంతమైన వ్యక్తిత్వం, అకుంఠిత దీక్ష, భావావేశంతో కూడిన ఉత్సాహం, వాక్చాతుర్యాలవల్ల, ఈ ఉద్యమం విస్తృతంగా ప్రజాదరణను పొందింది. కేశవచంద్రుని నాయకత్వంలో బ్రహ్మ సమాజ్ సిద్ధాంతం, క్రైస్తవ మత సిద్ధాంతానికి అనుగుణంగా మారింది. సాంఘిక సంస్కరణల పట్ల కేశవచంద్రుడు చాలా ఉత్సాహాన్ని ప్రదర్శించాడు. సంస్కరణలు అమలు పరచడానికి తనశక్తిని ధారపోయడానికి సిద్ధమైనాడు. కేశవచంద్రుని చైతన్యవంతమైన నాయకత్వంలో వర్ణాంతర వివాహాలు, వర్ణాంతర భోజనాలు, వితంతు పునర్వివాహాలు జరగాలని, ఘోషా పద్ధతిని తొలగించాలనే ఉద్యమాలు ఎక్కువగా కొనసాగాయి. స్త్రీ విద్యను ప్రోత్సహించాలని అర్థించాడు. బాల్యవివాహాలను బహుభార్యాత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.

కేశవచంద్ర సేన్ స్థాపించిన **నవ విధాన్ బ్రహ్మ సమాజ్** హిందూ పవిత్ర గ్రంథాల నుంచి మాత్రం కాకుండా, క్రైస్తవ, బౌద్ధ, ఇస్లాం పవిత్ర గ్రంథాల నుంచి కూడా సిద్ధాంతాలను జీర్ణించుకుంది.

1878లో కేశవచంద్ర సేన్, మతపరమైన కారణాలవల్ల బ్రహ్మ సమాజ్ నుంచి విడిపోయాడు. అంతేకాకుండా తన 14 సంవత్సరాల కుమార్తెను కూచ్-బీహార్ హిందూ మహారాజుకు ఇచ్చి వివాహం చేయడంతో అతని మీద నమ్మకం సడలి, అనుచరులు తిరుగ బడ్డారు. కేశవచంద్రునితో విభేదించినవారు **'సాధారణ బ్రహ్మ సమాజ్'** అనే కొత్త సంస్థను స్థాపించారు.

BRAOU

కేశవచంద్రుని గణనీయమైన కృషివల్ల దేశ వివిధ ప్రాంతాలలో బ్రహ్మ సమాజ్ ప్రభావం పెరిగిం 1864లో మద్రాస్ **'వేద సమాజ్'** అనే ఆస్తిక సభను స్థాపించారు. ఈ 'వేద సమాజ్'నే కొంత కాలం తర్వా **'దక్షిణ భారత బ్రహ్మ సమాజ్'** అన్నారు. కేశవ చంద్రసేన్ అద్భుత ప్రసంగంవల్ల వి. రాజగోపాలాచార్యులు, సుబ్బరాయులు శెట్టి మంత్రముగ్ధులై ప్రభావితులయ్యారు. వారి కృషి ఫలితంగా వేద సమాజ్ స్థాపితమైంది. కేశవచంద్ర సేన్ స్థాపించిన **'నవ విధాన్ బ్రహ్మ సమాజ్'** సిద్ధాంతాలను పండిట్ శివనాధ శాస్త్రి, హేమచందర్ సర్కార్, సతీశ్‌చంద్ర చక్రవర్తి వంటి ప్రముఖ బెంగాలీ బ్రహ్మ ప్రచారకులు ప్రచారం చేసారు.

ఆంధ్రప్రాంతం నుంచి వచ్చి మద్రాసులో స్థిరపడిన మన్నవ బుచ్చయ్య పంతులుగారు, చాలా మంది ఉత్సాహవంతులైన ప్రజలను బ్రహ్మ సమాజ్‌లో చేర్చారు. బుచ్చయ్య పంతులుగారి నిశ్చల విశ్వాసం, నిరాడంబర జీవితం, నిష్కపట స్వభావం, ప్రజల్లో ఆయనపట్ల గౌరవాన్ని పెంపొందించాయి.

బ్రహ్మ సమాజ్ సిద్ధాంతాలను గురించి శివనాథశాస్త్రి చేసిన అద్భుత ప్రసంగాలవల్ల ప్రభావితుడైన బుచ్చయ్య పంతులు గారికి మద్రాస్ క్రైస్తవ కళాశాల విద్యార్థి అయిన రఘుపతి వెంకటరత్నంనాయుడు, ఈ సందేశాన్ని ప్రచారం చేయడంలో చాలా సహాయం చేశాడు. వెంకటరత్నం సాంఘిక కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొన్నాడు. రాజమండ్రి, బాపట్ల, మచిలీపట్నాలను ఆంధ్ర ప్రాంతపు బ్రహ్మ సమాజ్ ముఖ్య కేంద్రాలుగా పండిట్ శివనాధ శాస్త్రి వర్ణించాడు.

దేశ రాజకీయ, సామాజిక జీవన సరళిపై, బ్రహ్మ సమాజ్ ప్రభావాన్ని క్లుప్తంగా పరిశీలిద్దాం. మూఢ విశ్వాసాల సంకెళ్ళ నుంచి వ్యక్తికి స్వేచ్ఛను కల్గించాలనేదే బ్రహ్మ సమాజ్ ముఖ్యాశయం. వ్యక్తి స్వేచ్ఛ, జాతీయ సమైక్యత, సమగ్రత, సహకారం, సామాజిక సంస్థల ప్రజాస్వామ్యీకరణ సమాజంలో సంబంధాల గురించి ఎలుగెత్తి చాటి భారతీయ ప్రజలలో చైతన్యాన్ని రేకెత్తించి, బ్రహ్మ సమాజ్ కొత్త శకాన్ని ప్రారంభించింది. సంస్కరణోద్యమాలకు ప్రజాదరణను పెంపొందించి బాల్య వివాహాలు, సతీసహగమనం, బహుభార్యాత్వం, కుల నియంతృత్వంవంటి దురాచారాలను అణచివేయడానికి చాలా కృషి చేసింది. బ్రహ్మ సమాజ్ వ్యక్తి గౌరవానికి ప్రాముఖ్యాన్నిచ్చి, విగ్రహారాధనను వ్యతిరేకించి, సాంఘిక దురాచారాలను తీవ్రంగా విమర్శించింది. బ్రహ్మ సమాజమే, మన దేశంలో జాతీయ చైతన్యాన్ని ప్రథమంగా వ్యక్తపరచింది.

మతపరమైన సంస్కరణలను అమలు పరచడంతో బ్రహ్మ సమాజ్ తృప్తి పడలేదు. సాంఘిక, రాజకీయ సంస్కరణల కార్యక్రమాలను కూడా అనుసరించింది. అందువల్లే రనడే మొదలైన సంస్కర్తలు, దేశం పలు ప్రాంతాల్లో ప్రారంభించిన సాంఘిక సంస్కరణోద్యమాలకు, బ్రహ్మ సమాజ్ నాంది అని చెప్పవచ్చు.

14.2.3 ప్రార్థనా సమాజ్

ప్రార్థనా సమాజ్, బ్రహ్మ సమాజ్‌వల్ల ఉత్తేజితమైంది. 1867లో డాక్టర్ ఆత్మారామ్ పాండురంగ నాయకత్వంలో బొంబాయిలో ఈ సమాజ్ ప్రారంభమైంది. కేశవచంద్ర సేన్ ప్రోత్సాహంవల్ల ఈ సంస్థ ఉద్భవించింది. ప్రార్థనా సమాజ్ సభ్యులు ఆస్తికవాదులు. వారు నామ్‌దేవ్, తుకారాం, రామ్‌దాస్ మొదలైన మతాచార్యులు అనుసరించిన గొప్ప మత సాంప్రదాయాలకు వారసులు. కేశవచంద్ర సేన్, నవీన్‌చంద్ర రాయ్, పి.సి. మజుందార్, బాబూ మహేంద్రనాథ బోస్ మొదలైన గొప్ప బ్రహ్మ సమాజికులు బొంబాయిని సందర్శించారు. వారి బొంబాయి పర్యటన, ప్రార్థనా కార్యక్రమాలను ప్రోత్సహించింది.

ప్రార్థనా సమాజ్ ముఖ్యాశయాలను సమీక్షిద్దాం. హేతుబద్ధమైన ఆరాధనను ప్రోత్సహించడం, వర్ణాధిక్యతను నిరసించడం, వితంతు పునర్వివాహాలను ప్రవేశపెట్టుట, స్త్రీవిద్యను ప్రోత్సహించి, బాల్యవివాహాలను రద్దుచేయడం వంటివి దీని కార్యక్రమాలు. ఇవేగాక అనాధ శరణాలయాలు, వితంతువులకు గృహాలను, శరణాలయాలను, రాత్రిబడుల నిర్వహణవంటి కొన్ని సాంఘిక సేవలను కూడా చేపట్టింది. ఇది **'సుబోధ'** పత్రికను ప్రారంభించింది. దేశ పశ్చిమ ప్రాంతంలో ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలకు కేంద్రం ప్రార్థనా సమాజ్. ఇది బొంబాయి, మద్రాస్ రాష్ట్రాల్లో తన శాఖలను తెరచింది. ఆచార్య ఆర్.జి.భండార్కర్, నారాయణ్ గణేశ్ చంద్రవార్కర్,

BRAOU

పండిత రమాబాయి సరస్వతి ప్రార్థనా సమాజంలో ప్రముఖ సభ్యులు. సనాతన వర్గాల తీవ్ర ప్రతిఘటనను లక్ష్యపెట్టక, ధైర్యసాహసాలతో సాంఘిక సంస్కరణోద్యమానికి మనదేశ పశ్చిమ ప్రాంతంలో న్యాయకత్వం వహించిన సంస్కర్తల గణనీయమైన కృషిని సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

14.3 మహదేవ్ గోవింద రనడే, 1842-1901



మహారాష్ట్రంలో సాంఘికోద్యమానికి మూల పురుషుడు రనడే. ఇతడు గొప్ప సంఘ సంస్కర్త, విజ్ఞాని, విద్యావేత్త, న్యాయమూర్తి, భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకుల్లో ముఖ్యుడు. 'సార్వజనిక సభ' పత్రికలో సామాజిక, ఆర్థిక సమస్యలను గురించి, వ్యాసాలను వ్రాశాడు. వితంతు పునర్వివాహాన్ని గాఢంగా సమర్థించాడు. వారి అభ్యుదయాన్ని ఆకాంక్షించాడు. బాలికల వివాహ వయస్సు పెంచడాన్ని సమర్థించాడు. బహు భార్యాత్వాన్ని, వరకట్నాలను తీవ్రంగా ఖండించాడు. స్త్రీ విద్యను సమర్థించాడు. 1887లో మద్రాస్‌లో ముఖ్యమైన సాంఘిక సమస్యలను గురించి చర్చించడానికి, భారత జాతీయ సామాజిక సమావేశాన్ని ప్రారంభించాడు.

ఇతడు విద్యారంగంలో ఎన్నో సంస్కరణలను ప్రోత్సహించాడు. దేశం ప్రగతి పథం వైపు పురోగమించడానికి, పాశ్చాత్య విద్య గణనీయంగా తోడ్పడుతుందని, రనడే మనస్ఫూర్తిగా నమ్మాడు. రనడే దక్కన్ విద్యా సంస్థాపకుల్లో ముఖ్యుడు. ప్రగాఢ మతాభిమాని. సాంఘిక, ఆర్థిక, మత, విద్యా రంగాల్లో పూర్తిగా సంస్కరణలు అమలు జరగాలని భావించాడు.

14.4 సత్య సోధక్ సమాజం మరియు జ్యోతిబ ఫూలే (1827-1890)



జ్యోతిబ ఫూలె మహిళా విమోచనకు, అస్పృశ్యత నివారణకై, హరిజనుల పునరుద్ధరణకై ఒక పటిష్ఠమైన బ్రాహ్మణేతర ఉద్యమాన్ని నిర్వహించాడు. ఫూలె యొక్క విద్యాభ్యాసం, స్వీయ అనుభవాలు, క్రైస్తవ మిషనరీలతో గల సాన్నిహిత్యం, ఆనాటి హిందూ సంఘంలో నెలకొనివున్న దురాచారాలను విమర్శించేవారిని ప్రోత్సహించాయి. దళితులను విముక్తులను చేసి, విద్యద్వారా వారిని చైతన్యవంతులను చేసే లక్ష్యంతో జ్యోతిబ ఫూలె 1873 సం॥లో **'సత్యసోధక్ సమాజాన్ని'** స్థాపించాడు. 1884 సం॥లో **'దీనబంధు సర్వజనిక్ సభ'** అనే మరో సంస్థ స్థాపించబడింది.

1854 సం॥లో జ్యోతిబ ఫూలె దళితులకు ఒక ప్రత్యేక పాఠశాల నెలకొల్పాడు. అదేవిధంగా వితంతువులకు సహాయ మందించేందుకు ఒక అనాధ శరణాలయాన్ని కూడ స్థాపించినాడు. బడుగువర్గాల స్త్రీలకు పూనేలో ఒక ప్రత్యేక పాఠశాల ప్రారంభించి స్త్రీ విద్య ఆవశ్యకతను చాటి చెప్పాడు జ్యోతిబ ఫూలె. తన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేందుకు రెండు విమర్శనాత్మక గ్రంథాలు రచించాడు. అవి **1. సర్వజ్ఞిక్ సత్యధర్మ పుస్తక్ 2. గులాంగిరి.**

జ్యోతిబ ఫూలె ఉద్యమం యొక్క ముఖ్య లక్ష్యం, సంఘంలో అట్టడుగున వున్న కులాలవారిని బ్రాహ్మణులు, వారి సాంప్రదాయక గ్రంథాల ప్రభావం నుంచి తప్పించడం, ప్రజాబాహుళ్యాన్ని చైతన్యవంతులను చేసి, బ్రాహ్మణ ఛాందసవాదుల ఆధిపత్యంపై క్రమబద్ధమైన ప్రతిఘటనకు ఉద్యుక్తులను చేయడం. జ్యోతిబ ఫూలె స్వంత మాటల్లో "విద్య ద్వారా వారిని క్రమబద్ధమైన వ్యవస్థగా రూపొందించి, బడుగు వర్గాలవారిని ఐక్యంచేసి, వారిని తమ వునికి గుర్తించేలా చేసి ప్రాచీన, బ్రాహ్మణేతర మత సాంప్రదాయ పరిస్థితులకు తీసికొని వెళ్ళడం" ఈ ఉద్యమం మహారాష్ట్రంలో త్వరితగతిన కార్చిచ్చులా వ్యాపించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడ ఈ ఉద్యమంవల్ల ప్రభావితులైనట్లుగా కొందరి అభిప్రాయం.

BRAOU

14.5 పండిత రమాబాయి సరస్వతి, 1858-1922



రమాబాయి సరస్వతి వైదుష్యానికి మెచ్చి 'పండిత' బిరుదుతో ఆమెను సన్మానించారు. భారతదేశంలోని చాలా ప్రాంతాలలో మహిళలకు వారి సమస్యల గురించి తెలియజెయ్యడానికి, ఎంతోపట్టుదలతో పర్యటించింది. సాంఘిక అసమానతల నుంచి, క్రౌర్యం నుంచి మహిళలకు విముక్తి కల్గించడమే ఆమె ముఖ్య ధ్యేయం. హిందూ సమాజంలో మత వ్యవస్థలో ఉండే లోపాలను ఆమె తీవ్రంగా ద్వేషించింది. రమాబాయి శూద్రుని వివాహం చేసుకుంది. దురదృష్టవశాత్తు పెళ్ళి అయిన రెండు సంవత్సరాలలోనే భర్తను కోల్పోయింది. స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి, బాల్య వివాహాలను వ్యతిరేకించడానికీ పూనేలో **'మహిళా ఆర్య సమాజ్'**ను స్థాపించింది. 1883లో ఇంగ్లండ్, అమెరికాలలో పర్యటించి భారతీయ మహిళల శోచనీయ స్థితి గురించి ఉపన్యసించింది. ఆమె ప్రసంగాలవల్ల మన సమాజంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు వెలుగులోకి వచ్చాయి. విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తరవాత బొంబాయిలో **శారదా సదన్** అనే వితంతు వసతి గృహాన్ని, పాఠశాలను ప్రారంభించింది. కరువు బాధితులను ఆదుకోవడానికి, **ముక్తి సదన్** ను ప్రారంభించింది. రమాబాయి భారతీయ మహిళల విమోచనకు గణనీయమైన కృషి చేసింది.

14.6 డి.కె. కార్వే, 1858-1961

కార్వే గొప్ప విద్యా వేత్త. 1892లో పూనేలో ఫెర్గూసన్ కళాశాలలో ఆచార్య పదవిని స్వీకరించాడు. 1893లో వితంతు వివాహం చేసుకున్నాడు. వితంతు వివాహ సమాజాన్ని స్థాపించాడు. 1896లో హిందూ వితంతు భవనాన్ని (Hindu Widow Home) ప్రారంభించాడు. పునర్వివాహం చేసుకున్న స్త్రీలకు కలిగే సంతానం కోసం, ఒక వసతి గృహాన్ని ప్రారంభించాడు. 1916లో భారతీయ మహిళా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి 1932లో ఆ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షుడయ్యాడు.

విరాళాలను వసూలు చేసి 50 గ్రామాలలో ప్రాథమిక విద్యను బోధించడానికి స్వచ్ఛందంగా పాఠశాలలను ప్రారంభించాడు. సాంఘిక సంస్కరణోద్యమానికి కార్వే చేసిన విశిష్ట సేవలను గుర్తించి ప్రభుత్వం 'భారత రత్న' బిరుదునిచ్చి సత్కరించింది.

BRAOU

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. బ్రహ్మ సమాజం ముఖ్య సిద్ధాంతాలేవి?

.....

.....

.....

.....

2. బ్రహ్మ సమాజాన్ని, నవవేద సమాజాన్ని ఎవరు స్థాపించారు?

.....

.....

.....

.....

3. ప్రార్థన సమాజ ముఖ్య నాయకులెవరు?

.....

.....

.....

.....

14.7 ఆర్య సమాజ్



1875లో ఆర్య సమాజ్‌ను స్వామి దయానంద సరస్వతి స్థాపించాడు. 1876లో లాహోర్‌లో ఈ సమాజం తన కార్యక్రమాలను ప్రారంభించింది. దయానంద సర్ఞస్వతి సంస్కృతంలో గొప్ప పండితుడు. హిందూ సమాజంలోని దురాచారాలను ధైర్యంగా వ్యతిరేకించాడు. ఏకేశ్వరోపాసనను ప్రచారం చేసాడు. విగ్రహారాధనను, ఛాందసత్వాన్ని, వర్ణ వ్యవస్థను, అస్పృశ్యతను ఖండించాడు. సాంఘిక సంస్కరణలను సమర్థించాడు. మహిళాభ్యుదయాన్ని సమర్థించాడు. బాల్య వివాహాలను రద్దు చెయ్యాలని కోరాడు. వితంతు పునర్వివాహాన్ని సమర్థించాడు. వేదాలకు దయానంద సరస్వతి వ్రాసిన భాష్యం **సత్యార్థ ప్రకాష్**. పంజాబ్‌లో హిందూ మతానికి అవసరమైన శక్తిని పెంపొందించింది. దయానంద్ తన సందేశాన్ని సామాన్య ప్రజానీకంలో ప్రచారం చేసాడు. ఆయన సందేశం వైజ్ఞానిక వర్గానికి మాత్రమే పరిమితం కాలేదు. జాతీయ, సాంఘిక, మత రంగాల్లో భారతదేశ సమైక్యతను సాధించాలనే ఆశయాలతో **'శుద్ధి'** ఉద్యమాన్ని ప్రారంభించాడు. హిందూ సమాజ ద్వారాలను క్రైస్తవులకు, ముస్లింలకు తెరిచాడు.

స్వామి దయానంద సరస్వతి, ఆయన శిష్యుడు స్వామి శ్రద్ధానంద్ 'శుద్ధి' ఉద్యమానికి గట్టి ప్రోత్సాహాన్నిచ్చారు. చాలామంది హైందవేతురులను హిందూ సమాజంలోకి గౌరవంగా చేర్చుకున్నారు. దయానంద సరస్వతి హిందూ మతాన్ని, సంస్కృతిని గాఢంగా సమర్థించాడు. బ్రహ్మ సమాజ్‌లా కాకుండా ఆర్య సమాజ్ హిందూ మతంలోనే తీవ్రవాద సంస్థగా రూపొంది, ప్రాచీన మత పునరుద్ధరణలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తోంది. మన దేశంలో గోసంరక్షణకు, దయానంద సరస్వతి చాలా కృషి చేసాడు. దయానంద సరస్వతి మరణానంతరం, సమాజ్ కార్యకలాపాలను లాలా హన్స్‌రాజ్, లాలా లజపతిరాయ్, స్వామి శ్రద్ధానంద, పండిత్ గురుదత్ తదితరులు కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి, ఆయన సహచరుల కృషి ఫలితంగా సాంఘిక సంస్కరణలకు, జాతీయ విద్యకు చాలా ప్రచారం లభించింది. ఆర్య సమాజ్‌ను అనుసరించే వారు పాశ్చాత్య విద్యా ప్రయోజనాలను గుర్తించారు. లాలా హన్స్‌రాజ్, లాలా లజ్‌పతిరాయ్‌ల ప్రోత్సాహంతో, పాశ్చాత్య విద్యను ప్రచారం చెయ్యడానికి దయానంద్ ఆంగ్లో - వేదిక్ ధర్మకర్తృత్వ సంస్థను స్థాపించారు. దేశం పలుప్రాంతాల్లో ఈ సంస్థ నిర్వహించిన **పాఠశాలలు, కళాశాలలు**, పాశ్చాత్య విద్యను ప్రజలకందించాయి. ప్రాశ్చాత్య విద్యాభ్యాసం మాత్రమే కాకుండా హిందూ సంస్కృతి, తత్వశాస్త్రాలను కూడా ఈ కళాశాలలో బోధించారు. డి.ఎ.వి. (D.A.V) ధర్మకర్తృత్వ సంస్థ, దేశంలో చాలా విద్యా సంస్థలను సక్రమంగా నిర్వహించి, విద్యావ్యాప్తికి కృషి చేసింది. పాశ్చాత్య విద్యను వ్యతిరేకించినవారు 'గురుకులాల'ను స్థాపించి, ఆశ్రమాలలో ప్రాచీన పద్ధతిలో వేదవిద్యను బోధించారు.

తీవ్రవాద హిందూ పునరుజ్జీవనానికి ప్రతీక ఆర్య సమాజ్. హిందూ సమాజంలోని దురాచారాలను ప్రక్షాళన చెయ్యాలని ఆర్య సమాజ్ భావించింది. ఇతర మతాలలోకి హిందువులు మారడాన్ని నిరోధించాలన్నదే, ఆర్య సమాజ్ ముఖ్యాశయం కావడంవల్ల ఇతర మతాలకు వ్యతిరేకంగా గొప్ప ఉద్యమం ప్రారంభం కావడానికి కారణమైంది. ఆర్య సమాజ్ హిందూ తత్వానికి మాత్రమే పరిమితం కావడంవల్ల ఇస్లాంపట్ల వ్యతిరేక వైఖరిని ప్రదర్శించడంవల్ల కాలక్రమేణా ముస్లింలు మత ప్రాతిపదికపై ఒక వ్యవస్థగా రూపొందారు.

BRAOU

14.8 దక్షిణ భారతదేశంలో సంస్కరణోద్యమాలు

ఇప్పుడు దక్షిణాపథంలో సంస్కరణోద్యమం ఎలా విస్తరించిందో పరిశీలిద్దాం. చాలా మంది సంస్కరణ వాదులు పాశ్చాత్య విద్యవల్ల ప్రభావితులయ్యారు. రాజగోపాలాచార్యులు, సుబ్బరాయలుచెట్టి నాయకత్వంలో వేద సమాజ్ మతరంగంలో సంస్కరణోద్యమాన్ని ప్రారంభించినా సాధించింది మాత్రం చాలా తక్కువే అని చెప్పవచ్చు. 1862లో ఇద్దరూ మరణించడంతో సమాజ్ కార్యక్రమాలు మూలపడ్డాయి.

కలకత్తాలో శిక్షణ పొందిన బ్రహ్మ సమాజికుడైన శ్రీధరులు నాయుడు, వేద సమాజాన్ని పునరుత్తేజితం చేయడానికి ప్రయత్నించాడు. 1869లో వేద సమాజ్‌కు కార్యదర్శి అయ్యాడు. పాత ఒప్పందాల స్థానే కొత్త ఒప్పందాలను రూపొందించాడు. కానీ సాంఘిక సంస్కరణలకు ప్రాధాన్యత లేదు. 1871లో దక్షిణ భారత సమాజ్‌ను స్థాపించాడు. దేవేంద్రనాథ టాగూర్ రచించిన 'బ్రహ్మ ధర్మ' అనే ప్రామాణిక గ్రంథాన్ని తెలుగు, తమిళ భాషల్లోకి అనువదించాడు. **'తత్వ బోధిని'** అనే బ్రహ్మసమాజ్ మాస పత్రికను పునరుద్ధరించి సమర్థవంతంగా నిర్వహించాడు. బెంగుళూరు, మంగళూర్, తంజావూర్ మొదలైన నగరాలలో పర్యటించి బ్రహ్మ సమాజ్ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేసాడు.

14.8.1 కందుకూరి వీరేశలింగం, 1848-1919



ఆంధ్రప్రాంతంలో సంస్కరణోద్యమ నాయకుడు కందుకూరి వీరేశలింగం. ఆయన రాజమండ్రిలో జన్మించాడు. తెలుగు, ఇంగ్లీషు భాషలను అభ్యసించి, అధ్యాపకుడయ్యాడు. చాలా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి, రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరాడు.

తెలుగు సాహిత్య వికాసానికి వీరేశలింగం చాలా తోడ్పడ్డాడు. పుస్తకాలందరికీ అర్థం కావాలని అందువల్ల వాటిని సులభ శైలిలో వ్రాయాలని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. తెలుగు గద్య రచనలో కొత్త శైలిని సృష్టించారు. తెలుగు గద్యానికి చేసిన కృషికి, ఆయనకు **గద్య తిక్కన** అనే బిరుదు నిచ్చారు. సంఘ సంస్కరణకు సంబంధించిన తన భావాలను, ఆశయాలను, ప్రజలు సులభంగా అర్థం చేసుకోవడానికి అతడు సులభ శైలిని ఉపయోగించాడు. ప్రాంతీయ భాష ద్వారా ప్రజా బాహుళ్యానికి విద్యా బోధన చేయాలని కోరాడు. వీరేశలింగం మహా పండితుడు, బహు గ్రంథ కర్త. మూఢ విశ్వాసాలను, వర్ణ వ్యవస్థను తీవ్రంగా గర్హించాడు. 1874లో **వివేక వర్ధిని** అనే పత్రికను ప్రారంభించాడు. సాంఘిక దురాచారాలను అంతమొందించడానికి, వీరేశలింగం కంకణం కట్టుకున్నాడు.స్త్రీ విద్యను గాఢంగా సమర్థించాడు. స్త్రీ విద్యపైనే దేశ ప్రగతి ఆధారపడుతుందని ఇతను విశ్వసించాడు. బాల్య వివాహాలను ఖండించి, వితంతు పునర్వివాహాలను సమర్థించి, వితంతువుల పునరుద్ధరణకు తీవ్రమైన ఉద్యమాన్ని నిర్వహించి, సమాజంలో సంస్కరణలను ప్రవేశపెట్టిన చైతన్య మూర్తి వీరేశలింగం. భోగం మేళాలను నిషేధించడానికి కృషి చేసాడు. అవినీతి, దగాకోరు తత్వాలపై ధ్వజమెత్తాడు.

అనాథ స్త్రీలకు సహాయం చేయడానికి వితంతు గృహాలను, అనాథ శరణాలయాలను, పాఠశాలలను స్థాపించాడు. రాజమండ్రిలో హితకారిణీ ధర్మకర్తృత్వ సంస్థను స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన అనేక సంస్థలను ఈ ధర్మకర్తృత్వ సంస్థ నిర్వహించింది.

బుచ్చయ్య పంతులుగారివల్ల ప్రభావితులై, వీరేశలింగం బ్రహ్మ సమాజ్‌లో చేరాడు. ఇతడు 1878లో ప్రార్థనా సమాజ్‌ను స్థాపించాడు. బ్రహ్మ సమాజ్ కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నాడు. 1906లో దేశిరాజు పెద బాపయ్యను అనుసరించి జంధ్యాన్ని తెంచివేసి అనుష్ఠానీకుడయ్యాడు.

14.8.2 రఘుపతి వెంకటరత్నం నాయుడు, 1862-1939

ఆంధ్ర ప్రాంతంలో 'శుద్ధి' ఉద్యమాన్ని నిర్వహించిన రఘుపతి వెంకటరత్నం నాయుడు గొప్ప పండితుడు. గొప్ప విద్యావేత్త. తన వాక్చాతుర్యంవల్ల ప్రజలను ఉత్తేజ పరచిన గొప్ప వ్యక్తి. చిన్నతనంలోనే దేవేంద్రనాథ

బెనర్జీ, గంగాధర ముఖర్జీ వంటి గొప్ప అధ్యాపకులవల్ల ప్రభావితులై, బ్రహ్మ సిద్ధాంతాలవల్ల ఆకర్షితులయ్యాడు. రామ్‌మోహన్ రాయ్, విలియం బెంటింక్ ప్రవేశపెట్టిన సంస్కరణలు నాయుడుగారి మనసుపై చెరగని ముద్ర వేశాయి. సాంఘిక సంస్కరణలపట్ల ఎంతో అభిమానాన్ని ప్రకటించాడు. 'బ్రహ్మ ప్రకాశిక', 'ఫెలో వర్కర్', 'పీపుల్స్ ఫ్రెండ్' మొదలైన పత్రికలను, ఆంగ్ల భాషలో సమర్థతతో నడిపించాడు. కళావంతుల సంస్కరణోద్యమాన్ని సమర్థిస్తూ అనేక వ్యాసాలనూ వ్రాశాడు. భోగం మేళాలను వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ చెడు విధానాన్ని అనుసరించడంవల్ల కలిగే దుష్పరిణామాలను గురించి ప్రజలకు తెలియజేయడానికి అనేక సంస్థలను స్థాపించి ఎన్నో ఉపన్యాసాలనిచ్చాడు. కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాలాధ్యక్షులయ్యారు. అప్పటినుండి, కాకినాడ 'బ్రహ్మ ధర్మ' కేంద్రమైంది. వెంకటరత్నంగారు తన సర్వ శక్తులను, సంపదను, 'బ్రహ్మ ధర్మ' ప్రచారానికి అర్పించారు. వెంకటరత్నంగారివల్ల ప్రభావితులై, పిఠాపురం మహారాజా వారు స్త్రీలకు సత్రాలు, ఆసుపత్రులు కట్టించడానికి పాఠశాలలకు, కళాశాలలకు ఉదారంగా విరాళాలిచ్చారు. పిఠాపురంలో నిమ్నజాతులకు చెందిన బాలబాలికలకు అన్ని సదుపాయాలతో రెండు వసతి గృహాలను నిర్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షునిగా ఎన్నికై ఆ పదవీ బాధ్యతలను చాలా నేర్పుతో నిర్వహించారు. స్థానిక సంస్థలలో, శాసనసభలలో, సెనేట్ సభలో, ప్రధాన సభ్యులుగా ఉండి వాటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు.

14.8.3 దేశిరాజు పెదబాపయ్య

బాపట్లలో త్యాగజీవియైన దేశిరాజు పెద బాపయ్య, తన ఆదర్శప్రాయ జీవితంవల్ల చాలామందిని బ్రహ్మ ధర్మానుష్ఠానపరులను చేశాడు. మచిలీపట్నంలో వెంకటరత్నంగారి వద్ద చదువుకున్నాడు. మద్రాసు బ్రహ్మ సమాజ నాయకులైన బుచ్చయ్య పంతులు, వెంకటరత్నాలతో కలసి బ్రహ్మ ధర్మ ప్రచారాన్ని కొనసాగించాడు. యువతరంలో బ్రహ్మ ధర్మాన్ని అనుసరించిన వారిలో ముఖ్యుడు. పెద బాపయ్య, బ్రహ్మ సూత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. 1905లో పెదబాపయ్య అనుష్ఠానీకుడయ్యాడు. వీరినే, వీరేశలింగంగారు అనుసరించారు.

14.8.4 నారాయణగురు శ్రీ నారాయణ ధర్మ పరిపాలనా యోగం ఉద్యమం, 1854-1928



సమానత్వం, న్యాయం, ప్రాతిపదికలపై ఆధారపడిన నవసమాజ నిర్మాణానికి కృషి చేసిన మహానుభావుడు నారాయణగురు, తిరువేంద్రం వద్ద నిరుపేద 'ఎఝువ' కుటుంబంలో జన్మించినాడు. కేరళ రాష్ట్రంలో మత సంస్కరణోద్యమానికి సాంఘిక దృక్పథాన్ని నెలకొల్పిన ఘనత నారాయణగురునకు చెందుతుంది. ఆయన తమిళ, మలయాళ, సంస్కృత భాషలలో గొప్పపండితుడే గాక అనేక భక్తి గీతాలను రచించాడు. వెనుకబడిన వర్గాల నైతిక, సాంఘికాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశాడు. ఆయన కులవ్యవస్థలో నెలకొనివున్న కఠోర సాంప్రదాయాలపై తిరుగుబాటు చేసి, మతం పేరిట నిర్వహింపబడే జంతుబలులు నిషేధించడంలో సఫలీకృతు లైనారు.

సామాజిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక రంగాలలో 'ఎఝువ' మరియు యితర వెనుకబడిన వర్గాల ప్రజల పురోగతిని సాధించేందుకు 1903 సం॥లో శ్రీమన్నారాయణ ధర్మ పరిపాలనా యోగం (S.N.D.P.Y) స్థాపించి వుద్యమించడం. వర్ణవ్యవస్థ అడ్డుగోడలను ఛేదించడానికీ వర్గరహిత, కులరహిత సమాజాన్ని రూపొందించడానికి వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాడు. నారాయణగురు, దేవాలయ ప్రవేశ హక్కు సాధనలకై అనేక ఉద్యమాలు నిర్వహించినారు. కుల, వర్గ అడ్డుగోడలను అధిగమించి ప్రతీవారికి దేవాలయ ప్రవేశ హక్కును సాధించడం ఆయన లక్ష్యం. తాను స్వయంగా సంఘంలో అట్టడుగు వర్గానికి చెందిన వాడైనా 1880 సం॥లో అరవైపురం దేవాలయంలో తానే విగ్రహ ప్రతిష్ఠ చేసాడు. లక్షలాదిమంది హృదయాల్లో నారాయణగురు ఒక మత ప్రవక్త, పండితుడు, వేదాంతి, కవి, సంఘ సంస్కర్తగా చెరగని ముద్ర వేసాడు. నారాయణ గురు స్థాపించిన శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం ఉద్యమం తన లక్ష్యాలను సాధించడంలో సఫలీకృతమైందని చెప్పవచ్చు.

BRAOU

14.8.5 రామస్వామి నాయకర్ ఆత్మగౌరవ ఉద్యమం

అణగారిన కులాల అభ్యుదయానికి నాయకత్వం చేసిన రామస్వామి నాయకర్, తమిళనాడు ప్రాంతంలో ఆత్మ గౌరవ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. సమాజంలో బ్రాహ్మణాధిక్యతను తీవ్రంగా గర్హించాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా బ్రాహ్మణేతర వర్గాలను తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని ఆయన ఉద్బోధించాడు.

1879, సెప్టెంబర్ 17వ తేదీన ఈరోడ్ నగరంలోని ప్రఖ్యాత సాంప్రదాయక కుటుంబంలో జన్మించిన రామస్వామి నాయకర్ అస్పృశ్యత, సాంఘిక అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మత గ్రంథాలను నిశితంగా పరిశీలించడంవల్ల పండితులతో చర్చించడంవల్ల హేతువాద దృక్పథాన్ని అలవరచుకొని నాస్తికుడయ్యాడు. ఈరోడ్ పురపాలక సంఘానికి అధ్యక్షుడయ్యాడు. భారత జాతీయ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడయ్యాడు. తిరువాన్కూర్ రాజ్యంలో అస్పృశ్యులపై విధించిన నిర్బంధాలకు వ్యతిరేకంగా ఆందోళనను విజయవంతంగా నిర్వహించి ప్రజా నాయకుడయ్యాడు. రామస్వామి నాయకర్ చెరసాలలో ఉండగా ఆయన భార్య నాగమ్మాళ్ స్త్రీ విమోచనోద్యమాన్ని విజయవంతంగా నిర్వహించింది.

కాంగ్రెస్ సంస్థలో బ్రాహ్మణులదే పై చేయి అని, రామస్వామి తీవ్రంగా భావించాడు. బ్రాహ్మణేతరులకు ఉద్యోగాలలోను, శాసనసభ స్థానాలలోను, ప్రత్యేకంగా కేటాయింపు జరగాలని కోరాడు. బ్రాహ్మణేతరులపట్ల కాంగ్రెస్ దృక్పథంపట్ల తీవ్రంగా అసంతృప్తిచెంది, కాంగ్రెస్‌ను బ్రాహ్మణుల కంచుకోటగా వర్ణించి 1925లో కాంగ్రెస్ నుంచి నిష్క్రమించాడు.

నాయకర్ ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించినప్పటికే జస్టిస్ పార్టీ ఇంకా వెలుగులోనే ఉంది. ఈ పార్టీ కూడా బ్రాహ్మణాధిక్యతను వ్యతిరేకించింది. 1936 సార్వత్రిక ఎన్నికలలో ఓడిపోయి, పతనావస్థలో ఉన్న జస్టిస్ పార్టీని పునరుత్తేజితం చేసాడు.

1936లో మధురలో బ్రాహ్మణేతర వర్గాల సమావేశం జరిగింది. ఈ సమావేశం బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించాలని స్పష్టీకరించింది. రామస్వామి నాయకర్ ఆత్మగౌరవోద్యమం, జస్టిస్ పార్టీ పరస్పరం సహకరించుకున్నాయి. రామస్వామి నాయకర్ బ్రాహ్మణ వ్యతిరేకోద్యమానికి, జస్టిస్ పార్టీకి గొప్ప నాయకుడు.

14.9 బ్రహ్మ - ప్రార్థనా సమాజం

మహారాష్ట్రంలో 1849 సం॥లో పరమహంస సభ స్థాపించబడిన తర్వాత బ్రహ్మో భావాలు అచ్చటికి వ్యాపించాయి. ప్రముఖ కేశబ్‌చంద్ర ఆశీస్సులతో 1867 సం॥లో బొంబాయిలో ప్రార్థనా సమాజం సభ్యులు తాము వేరే మతానికి చెందిన వారమని కాని, ఒక కొత్త శాఖ సభ్యులమనే భావం కాని లేదు. తమ ఉద్యమం హిందూ మత ఉద్యమంలో ఒక భాగమని వారి విశ్వాసం. ఒకే దేవుడిని పూజించే సాంప్రదాయం అటుంచి, మత విశ్వాసంకన్నా వారు సంఘసంస్కరణలకు అధిక ప్రాధాన్యం యిచ్చారు. 'మానవసేవయే మాధవసేవ' అనే విశ్వాసం వారికి వుంది. ఈ సంఘ సభ్యులు హిందూ మత ఛాందసవాదులతో ఘర్షణకు యిష్టపడలేదు. వారు విద్యావ్యాప్తి ద్వారా నచ్చజెప్పడం అనే మార్గాలద్వారా తమ లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించారు.

సంఘసంస్కరణల విషయంలో ప్రార్థనా సమాజ సభ్యులు క్రింద పేర్కొన్న లక్ష్యాలపై తమ దృష్టిని కేంద్రీకరించారు. 1. కులవ్యవస్థను తిరస్కరించడం. 2. స్త్రీ, పురుషుల వివాహ వయోపరిమితిని పెంచడం. 3. వితంతు పునర్ వివాహాలు చేపట్టడం. 4. మహిళా విద్యావ్యాప్తికి కృషి. ఈ సమాజానికి చెందిన ప్రముఖ వ్యక్తులు - మహాదేవ గోవింద రనడే (1842-1901), ఆర్.జి. బండార్కర్ (1837-1925) మరియు యన్.జి. చంద్రార్కర్ (1885-1923) మొదలగు వారు. ప్రార్థనా సమాజ ప్రోత్సాహంతో బడుగు వర్గాల సంఘం, సాంఘిక సేవా సంఘం, దక్కను విద్యా కేంద్రాలు సామాజిక, విద్యా రంగాలలో, సంస్కరణలు తెచ్చేందుకు విశేషమైన కృషి చేసాయి.

మహారాష్ట్రంలో ప్రార్థనా సమాజ స్థాపకుడు మహాదేవ గోవింద రనడే. పశ్చిమ భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారకుడైన రనడేను 'సాంస్కృతిక ప్రవక్తగా' అభివర్ణిస్తారు. రనడే క్రింద పేర్కొన్న వాటిని తీవ్రంగా ఖండించారు. 1. స్వశక్తి లేని మహిళా దుస్థితి 2. సంకుచిత కులవర్గాలు 3. స్త్రీలలో ఘోషా పద్ధతి 4. విదేశీయానంపై నిషేధం 5. కుల, వర్గరహిత, సామూహిక సహపంక్తి భోజనాలపై అడ్డంకులు 6. అస్పృశ్యత. రనడే మహాశయుడు. 'పరిశుద్ధి' ఉద్యమాన్ని ప్రారంభించి యితర మతస్థులను చేర్చుకోవడమేగాక, నాట్యవృత్తిని ఖర్చులతో కూడిన ఆడంబర వివాహవేడుకలను వ్యతిరేకించారు. రనడే ప్రారంభించిన ఉద్యమం దేశానికంతటికీ విస్తరించింది.

ఆధునిక వేదాంత సూత్రాల ప్రాతిపదికగా హిందూమతం పరిశుద్ధంకావాలి, తిరిగి నిర్వచింపబడాలని రనడే ఆకాంక్షగా కనిపిస్తుంది. ఖర్కె మహాశయునితో కలసి రనడె 'స్త్రీ పునర్వివాహ' ఉద్యమాన్ని నడిపాడు. ఈ ఉద్యమం మరో ఆశయం వితంతువులకు ఉపాధ్యాయినులుగా, నర్సులుగా శిక్షణయిచ్చి, తమ కాళ్లపై తాము నిలబడగల స్వయం శక్తిని కల్పించడం. ఈ విధంగా ప్రార్థన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించబడిన సంఘసంస్కరణ ఉద్యమం, మహారాష్ట్రంపై తీవ్రమైన ప్రభావాన్ని ప్రసరింప జేసిందనటంలో సందేహం లేదు.

14.10 దివ్యజ్ఞాన సమాజం

మదాం బ్లావట్స్కీ, కల్నల్ ఓల్కాట్‌లు 1875లో న్యూయార్క్‌లో దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించారు. వారు 1879లో వచ్చి మద్రాస్ సమీపంలో అడయార్ వద్ద దివ్యజ్ఞాన సమాజ కేంద్రకార్యాలయాన్ని 1886లో నెలకొల్పారు. ఈ సమాజ సభ్యులు అన్ని మతాలను దైవిక సంబంధమైన విజ్ఞానానికి చిహ్నాలుగా గౌరవించారు. బలవంతంగా మతం మార్పిడి విధానాన్ని వీరు వ్యతిరేకించారు. హిందూ మత పునరుద్ధరణ వారి ఆశయం. పునర్జన్మను నిర్ణయించడంలో ఆత్మ దేహాంతర సిద్ధాంత ప్రభావాన్ని వారు నమ్మారు.

1889లో అనీబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో సభ్యత్వాన్ని స్వీకరించింది. వేదాల్లోను, ఉపనిషత్తుల్లోను విశ్వాసాన్ని ప్రకటించి, వేదాంతాన్ని ప్రచారం చేసి, ప్రాచీన భారతీయ సంస్కృతిని చూసి గర్వపడింది. భారతదేశంలో స్థిరపడింది. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, ఉధృతంగా ప్రచారం చేసింది. అనీబిసెంట్ విద్యావేత్త, చాలా విద్యాసంస్థలను ప్రారంభించింది. కాశీలో కేంద్రీయ పాఠశాలను తెరిచింది. అదే ఇప్పుడు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయమైంది. దక్షిణ భారతంలో పాఠశాలలను, కళాశాలలను స్థాపించింది.

అనీబిసెంట్ విద్య, దివ్యజ్ఞానం, రాజకీయాల గురించి చాలా పుస్తకాలు వ్రాసింది. 1916లో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది. **న్యూ ఇండియా, కామన్‌వీల్** అనే పత్రికలను ప్రారంభించింది. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆమె జైలుకు వెళ్ళింది. హోంరూల్ ఉద్యమాన్ని ప్రారంభించింది. 1917లో కలకత్తా సమావేశానికి అధ్యక్షురాలైంది. భారత స్వాతంత్ర్య సమరంలో ఆమె నిర్వహించిన పాత్ర, ఆమె ప్రవేశ పెట్టిన సాంఘిక సంస్కరణలు, ఆమె ప్రతిష్ఠను ఇనుమడింప చేసాయి. ప్రపంచంలో గొప్ప నాయకురాలిగా ఆమెకు గుర్తింపు లభించింది.

14.11 రామకృష్ణ పరమహంస

రామకృష్ణ పరమహంస మహా విజ్ఞాని. ఉదార భావాలు కలవాడు. గొప్ప కాళీ భక్తుడు. మహమ్మదీయ, క్రైస్తవ మతాచార్యులతో స్వేచ్ఛగా కలిసి చర్చలు జరిపాడు. అన్ని మతాలు ఒకే దేవున్ని చేరడానికి భిన్న మార్గాలను నమ్మాడు. విశ్వవ్యాప్తంగా అధ్యాత్మిక భావాలు పెంపొందించడమే రామకృష్ణుని దృష్టిలో 'మతం'అని చెప్పవచ్చు. రామకృష్ణ పరమహంస ప్రజల్లో ఆత్మ గౌరవాన్ని, స్వశక్తిపట్ల విశ్వాసాన్ని పెంపొందించాడు. కర్మకాండపై

BRAOU

ఆధారపడకుండా ప్రార్థన ప్రాముఖ్యతను స్పష్టీకరించాడు. మానవసేవే మాధవసేవని బోధించి సాంఘిక సంస్కరణలను సమర్థించాడు. రామకృష్ణ పరమహంస యొక్క విశ్వవ్యాప్త ఆధ్యాత్మికతత్వం, భారతీయుల్లో విశాల భావాల్ని పెంపొందించింది.

14.12 స్వామి వివేకానంద, 1863-1902



రామకృష్ణ పరమహంస మేటి శిష్యుడు వివేకానందుడు. సాంఘిక, మతరంగాల్లో గొప్ప సంస్కర్త. రామకృష్ణ పరమహంస గురూపదేశాన్ని భారతదేశంలోనే కాకుండా, ఇతర దేశాలలో కూడా ప్రచారం చేశాడు. వేదాంతం గురించి ఆయన చేసిన గంభీరోపన్యాసాలు, పాశ్చాత్యులను ప్రభావితం చేసాయి. 1893 సెప్టెంబర్ 11వ తేదీన చికాగోలో ప్రపంచ మత మహాసభలో, హిందూమతం గురించి ఆయన చేసిన గంభీరోపన్యాసం, పాశ్చాత్య విజ్ఞానులలో సంచలనాన్ని రేకెత్తించింది. స్వామి వివేకానంద తరచు అమెరికా, ఇంగ్లండ్ మొదలైన దేశాలలో పర్యటించి ఉపన్యసించాడు. ఆ దేశాలలో భారతదేశ సాంస్కృతిక రాయబారిగా వ్యవహరించాడు. నిస్వార్థంగా దేశసేవకు అంకితులైన యువకులకు శిక్షణ ఇవ్వటానికి, బేలూరువద్ద రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. వివేకానందుడు సాంఘిక న్యాయం, సంస్కరణల ఆవశ్యకతను గురించి నచ్చ చెప్పాడు. స్వశక్తిపైనే ఆధారపడాలని ప్రబోధించాడు. దారిద్ర్య రేఖకు దిగువనున్న పేదవారికి అండగానిల్చాడు. పేదరికాన్ని, మూఢ విశ్వాసాలను తీవ్రంగా ఖండించాడు. సామూహిక విద్యను ప్రోత్సహించాడు. పేదవారికి సేవ చేయాలని ఉద్బోధించాడు.

14.13 రామకృష్ణ మఠం

మానవ బాధానివారణకు సహాయం చేయడం కోసం సమాజ సేవ చేయడం కోసం వివేకానందుడు 1896లో రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. పాశ్చాత్య నాగరికత, నాస్తిక భావాల ప్రభావం నుంచి భారతదేశాన్ని కాపాడడమే ఈ సంస్థ ముఖ్య ఆశయం. ఈ సంస్థ హిందూమతంలోని విగ్రహారాధనను, బహుదేవతారాధనను ఆదర్శంగా స్వీకరించింది. దేశంలో పలు ప్రాంతాలలో ఈ సంస్థ శాఖోపశాఖలుగా అల్లుకుంది. ఆసుపత్రులను, పాఠశాలలను, కళాశాలలను, గ్రంథాలయాలను, అనాధశరణాలయాలను తెరచి సమాజ సంక్షేమ సేవను కొనసాగిస్తోంది. ముక్తిని సాధించుకోడానికి, సాధన చేసుకోపడం కంటె సమాజంలో మంచిని పెంచడానికీ, ఈ సంస్థ ప్రాధాన్యతనిచ్చింది. అమెరికా, ఐరోపా ఖండాలలో చాలా నగరాలలో రామకృష్ణ మఠం శాఖలను, వేదాంతతత్వాన్ని ప్రజలకు విశదీకరించాలనే ఉద్దేశ్యంతో స్థాపించారు. ఇదే ఉద్దేశ్యంతో మనదేశంలో కూడా చాలా శాఖలను నెలకొల్పారు. కరువులవల్ల, వరదలవల్ల ప్రజలు బాధ పడుతున్నప్పుడు రామకృష్ణమఠం చాల సేవచేసింది. భావప్రకటన చెయ్యలేని లక్షలాది ప్రజల సముద్ధరణే, రామకృష్ణమఠం ముఖ్య కార్యక్రమం.

14.14 అహమ్మదీయ ఉద్యమం

అహమ్మదీయ ఉద్యమ స్థాపకుడు మీర్జా గులాం అహమ్మద్ (1839-1908). ఇస్లాంమత రక్షకునిగా ఆర్యసమాజం మరియు క్రైస్తవ మత ప్రచారకుల దాడుల నుంచి ఇస్లాంమతాన్ని రక్షించేందుకు ఈ ఉద్యమాన్ని ప్రారంభించినట్లు చెప్తారు. 1889 సం॥లో తనను తానే మత ప్రవక్తగా ప్రకటించుకోవడమేగాక తాను హిందువులకు ఆరాధ్యుడైన కృష్ణుడు, క్రైస్తవులు దేవుని బిడ్డగా ఆరాధించే ఏసుక్రీస్తు యొక్క మరో అవతారంగా ప్రకటించుకొన్నాడు. బ్రహ్మ సమాజంవలె అహమ్మదీయ మతం కూడ, మానవాళికి చెందిన విశ్వమానవ సూత్రాలపై ఆధారపడి వుంది. గులాం అహమ్మద్ పాశ్చాత్యుల ఉదార భావాలు, హిందూ మత సంస్కరణోద్యమాలవల్ల ప్రభావితుడయ్యాడు. ఆయన ముస్లిమేతరులపై మత యుద్ధం వ్యతిరేకించాడు. అన్నిమతాలవారిలో స్నేహ సంబంధాలు కాంక్షించాడు. ఈ ఉద్యమ ఫలితంగా భారతీయ ముస్లింలలో పాశ్చాత్య ఉదార విద్యా వ్యాప్తి చెందడమేగాక, మహమ్మదీయుల సేవకై అనేక పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించడం జరిగింది.

BRAOU

14.15 వహాబీ ఉద్యమం

పాశ్చాత్య భావాల ఫలితంగా మహ్మదీయులలో తొలి స్పందన వహాబీ ఉద్యమంగా ఆవిర్భవించింది. ఈ ఉద్యమం ముఖ్యంగా పునరుజ్జీవ ఉద్యమం. మనదేశంలో వహాబీ ఉద్యమ స్థాపకుడు రాయ్‌బెరీలీకి చెందిన ఫకీర్ అహమ్మద్ బెరిల్వీ. అరబ్బు మత సంస్కర్త ఐన అబ్దుల్ వహబీ అనుచరులే వహాబీలు. మనదేశంలో వహాబీ ఉద్యమం ప్రారంభంలో ఇస్లాంమతం సంస్కరణోద్యమంగా ప్రారంభమై అనాటి మహమ్మదీయ సంఘంలోనికి చొచ్చుకొని వచ్చిన అవినీతిని దుయ్యబట్టింది. చివరకు వహాబీ ఉద్యమం వ్యవసాయిక తిరుగుబాట్లుగా, శిక్కులపై పవిత్ర యుద్ధంగా, పంజాబు ఆక్రమణ తర్వాత బ్రిటీష్‌వారిపై యుద్ధ స్వరూపందాల్చింది.

క్లుప్తంగా వహాబీ ఉద్యమ నాయకుడైన సయ్యద్ అహమ్మద్ లక్ష్యం *"పంజాబు నుంచి శిక్కులను, బెంగాలు నుంచి బ్రిటిష్‌వారిని తరిమివేసి, భారతదేశంలో ముస్లిం అధికారాన్ని పునఃప్రతిష్టాపన చేయడం"*. అహమ్మద్ తన అనుచరులకు సైనిక శిక్షణ యిచ్చారు. ఈ రహస్య ఉద్యమం కాబూలు, సరిహద్దు రాష్ట్రాలకు బెంగాలు, బీహారు, కేంద్ర రాష్ట్రాలకు విస్తరించింది. కాని 1831 సం॥లో అహమ్మద్ చంపబడ్డాడు. అహమ్మద్ మరణం తర్వాత అతని అనుచరులు వహబీ ఉద్యమాన్ని వాయవ్యసరిహద్దు రాష్ట్రంలో కొనసాగించారు. కొందరి అభిప్రాయంలో 1857 తిరుగుబాటు కన్నా వహాబీ ఉద్యమం మంచి వ్యూహాత్మకంగా నిర్వహించబడింది. 1830-1860 సం॥ల మధ్య వహాబీ ఉద్యమం భారతదేశంలో బ్రిటీష్‌వారి ఆధిక్యతకు వ్యూహాత్మకమైన పెనుసవాళ్లను విసిరింది. ఈ ఉద్యమకారులెప్పుడు హిందువులతో కలహించలేదు. వహాబీ ఉద్యమం యొక్క తీవ్రతను ప్రమాదాన్ని గుర్తించిన బ్రిటీష్‌వారు, దృఢమైన నిర్దాక్షిణ్యమైన చర్యలు తీసికొనడంతో 1870 సం॥ నాటికి ఈ ఉద్యమ పటిమ అంతరించింది.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. సంఘ సంస్కరణ రంగంలో కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన ముఖ్యమైన పనులు ఏవి?

.....

.....

.....

.....

2. రామస్వామి నాయకర్ ముఖ్య బోధన ఏది?

.....

.....

.....

.....

3. ఆర్యసమాజానికి బ్రహ్మ సమాజానికి భేదాలేవి?

.....

.....

.....

.....

BRAOU

14.16 అలీగర్ ఉద్యమం



19వ శతాబ్దంలో మహమ్మదీయులు రాజకీయ కార్యక్రమాల నుంచి దూరంగా ఉన్నారు. మొగల్ సామ్రాజ్య పతనానంతరం రాజకీయాధికారాన్ని కోల్పోవడంవల్ల వారు నిరాశ చెందారు. 1857 తిరుగుబాటుకు మహమ్మదీయులే ముఖ్యకారణమని భావించి, బ్రిటీష్ ప్రభుత్వం తిరుగుబాటును అణచివేసిన తర్వాత ముస్లిం వ్యతిరేక విధానాన్ననుసరించింది. అందువల్ల మహమ్మదీయులలో బ్రిటీష్ వ్యతిరేక భావాలు తీవ్రంగా రగుల్కొన్నాయి. మహమ్మదీయులు పాశ్చాత్య విద్యను వ్యతిరేకించారు. సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ చేసిన కృషివల్లే మహమ్మదీయులలో పాశ్చాత్య భావాలు పెంపొందాయి. మహమ్మదీయులలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడం, ఆధునిక విద్యను ప్రచారం చేయడం, ఈ ఉద్యమ ప్రధానాశయం. అలీగర్ ఉద్యమం మహమ్మదీయులలో మొట్టమొదటిసారి చైతన్యాన్ని రేకెత్తించింది. అలీగర్ ఉద్యమస్థాపకుడు సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్. 1876 మహమ్మదీయ ఆంగ్లో-ఓరియంటల్ కళాశాలను స్థాపించాడు. హైదరాబాద్ ప్రధానమంత్రి సాలార్ జంగ్ ప్రోత్సాహంతో ముస్లింల కేంద్ర విద్యా సంస్థగా ఈ కళాశాల రూపొందింది. మొదటి నుంచి బ్రిటీష్ అధికార వర్గాలు అలీగర్ ఉద్యమాన్ని ప్రగాఢంగా సమర్థించాయి. అన్ని వర్గాల ప్రజలకు ఈ కళాశాలలో ప్రవేశార్హత ఉన్నప్పటికీ కళాశాలాధ్యక్షుడు బెక్ ప్రభావంవల్ల ఈ కళాశాల ప్రత్యేకతను రూపొందించుకుంది. 1890 నాటికి ఈ కళాశాల అలీగర్ విశ్వవిద్యాలయంగా రూపొందడమే కాక అఖిల భారత ముస్లిం విద్యా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. భారతదేశంలో ముస్లింల సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసిన అలీగర్ ఉద్యమ ఫలితాలను సమీక్షిద్దాం.

ఈ ఉద్యమం భారతదేశంలో ముస్లిం సమైక్యతకు మొదటిమెట్టు. ఇస్లాంపట్ల తమ విధేయత బలహీన పడకుండా ముస్లింలలో పాశ్చాత్య విద్యను ప్రచారం చెయ్యడమే అలీగర్ ఉద్యమ ముఖ్య లక్ష్యం. ఈ ఉద్యమ ప్రభావంవల్ల, భారతదేశంలో ముస్లింలకు ఉర్దూ జాతీయ భాష అయింది. ఈ విధంగా ముస్లిం విద్యావంతుల్లో ప్రత్యేక భాష, ప్రత్యేక భావాలు రూపొందాయి. కాలక్రమేణా ముస్లింలు ప్రత్యేక జాతిగా పరిగణించబడాలని కోరారు.

ఈ ఉద్యమం సంస్కరణలను ప్రవేశపెట్టాలని ఆశించింది. బహు భార్యాత్వాన్ని, ఘోషా పద్ధతిని, విడాకులను ఖండించింది. స్త్రీలు కూడా పాశ్చాత్య విద్యను అభ్యసించాలని కోరింది. అలీగర్ ఉద్యమం ఖురాన్ సరళ వ్యాఖ్యానంపై ఆధారపడింది. ఆధునిక ఉదారవాద సంస్కృతితో ఇస్లాంను సమన్వయ పరచడానికి ఈ ఉద్యమం ప్రయత్నించింది. చిరాగ్ అలీ, అల్తాఫ్ హుస్సేన్ అలీ, మౌలానా షిబ్లీ నొమానీ మొదలైనవారు సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ విధానాలనే అనుసరించి, భవిష్యత్తులో రూపొందే ముస్లిం నాయకులకు శిక్షణాకేంద్రంగా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపరచారు.

ముస్లింల సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ రథ సారధి, సర్ సయ్యద్ అహమ్మద్ ప్రగాఢ దేశభక్తుడు, జాతీయవాది. భారతదేశంలోని హిందువులు, ముస్లింలు ఒకే జాతివారని భావించాడు. మతసహన విధానాన్ని నమ్మాడు. మత ఘర్షణలను వ్యతిరేకించాడు. సయ్యద్ అహమ్మద్ ఖాన్ ఉదారవాది అయినా, మొదటి నుంచి కాంగ్రెస్ ఉద్యమాన్ని వ్యతిరేకించాడు. బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్ కోరిన ప్రజాస్వామ్య ప్రభుత్వానికి అంగీకరిస్తే అధికారం అధిక సంఖ్యాకులైన హిందువులకు లభిస్తుందని భావించాడు. హిందూ ప్రాబల్యం పెరిగిపోతుందని భయపడడంవల్ల మతతత్వవాదిగా మారిపోయాడు. సయ్యద్ అహమ్మద్ ఖాన్ మరణానంతరం, భారతీయ కాంగ్రెస్‌కు పోటీగా ముస్లింలీగ్‌ను స్థాపించారు. ముస్లింలీగ్ భారతదేశంలో ముస్లింల ప్రయోజనాలను కాపాడడం కోసం, ప్రత్యేక నియోజకవర్గాలను శాసనసభల్లో కొన్ని స్థానాలకే కేటాయింపును, ఉద్యోగాల్లో కేటాయింపును కోరింది.

BRAOU

14.17 పార్సీలు


మలాబారీ

క్రీ.శ. 1850 తర్వాత బొంబాయిలోని పార్సీలలో మత సంస్కరణోద్యమం మొదలైంది. వారు సమాజంలో ప్రక్షాళనోద్యమాన్ని తలపెట్టారు. విజ్ఞానపంతులైన పార్సీలు మతాన్ని, సమాజాన్ని సంస్కరించేటందుకు 1851లో, **రెహ్నుమాయి మజ్ దయాన్** సభ అనే సంఘాన్ని స్థాపించారు. జొరాస్ట్రియన్ మతంలోని ప్రాచీన పవిత్రతను పునరుద్ధరించాలని ఈ సభ పట్టుపట్టింది. సామాజిక, మత రంగాలలో సంస్కరణలను ప్రోత్సహించడానికి పార్సీలు **రస్త్‌గఫ్‌తర్** అనే వారపత్రికను ప్రారంభించారు. నౌరోజీ పుర్‌దోర్‌జి, దాదాభాయి నౌరోజి, యస్.యస్. బెంగాలీలు, ప్రముఖ పార్సీ సంస్కర్తలు. ఈ సంఘం మత రంగంలో పాతుకుపోయిన ఛాందసత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేసింది. స్త్రీవిద్య, వివాహం, వాళ్ళ సామాజిక అంతస్తుకు సంబంధించి పార్సీ సాంఘికాచారాల ఆధునికీకరణను ప్రారంభించింది.

మలాబారీ అనే పార్సీ నాయకుడు స్త్రీలకు, పిల్లలకు, సామాజికాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం కోసం **సేవాసదన్** ను ప్రారంభించాడు. కాలక్రమేణా, భారతీయ సమాజంలో పార్సీలు అందరికంటె ఎక్కువగా పాశ్చాత్య పభ్యతను అలవర్చుకున్న వర్గంగా రూపొందారు.

14.18 అకాలీ ఉద్యమం

మత రంగంలో కల్గిన చైతన్య ప్రభావంవల్ల శిక్కులు కూడా తమ వర్గాన్ని ప్రక్షాళన చెయ్యడానికి ప్రయత్నించారు. 1890లో అమృత్‌సర్‌లో ఖాల్సా కళాశాల స్థాపించినప్పటి నుంచి వారిలో మత సంస్కరణోద్యమం మొదలైంది. గురుద్వారాలను సంస్కరించడానికి అవినీతిపరులైన మహంత్‌లను తొలగించడానికి **శిరోమణి** గురుద్వార ప్రబంధక కమిటీని శిక్కులు స్థాపించారు. 1920 తర్వాతే అంటే పంజాబ్‌లో అకాలీ ఉద్యమం ప్రజ్వరిల్లిన తర్వాతే మత సంస్కరణ కార్యక్రమం ఊపు అందుకుంది. గురుద్వారాల యాజమాన్యాన్ని ప్రక్షాళన చెయ్యాలనేదే, అకాలీల ప్రధానాశయం.

14.19 మత, సంఘ సంస్కరణోద్యమాల ప్రభావం

భారతదేశ చరిత్రపై మత, సంఘసంస్కరణోద్యమాల ప్రభావం చాలా ఉంది. ఇవి భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రోత్సహించడమే కాక, దేశ ఆధునీకరణకు సంఘంలో కరుడుకట్టుకొని ఉన్న సాంఘిక దురాచారాల నిర్మూలనకు, హిందూమత ప్రక్షాళణకు కృషి చేసి భారతదేశ పునరుజ్జీవనానికి నాంది పలికాయి.

ఈ సంస్కరణోద్యమాలు భారతీయుల్లో జాతీయతా భావాలను మేల్కొల్పి భారత జాతీయోద్యమానికి నాంది పలికాయి. అంతేగాక ఈ ఉద్యమాలు దేశ ప్రాచీన ఔన్నత్యాన్ని గుర్తు చేసుకొని గర్వపడేటట్లు భారతీయుల్ని ప్రేరేపించి, వారిని భారత జాతీయోద్యమానికి సన్నద్ధుల్ని చేసాయి.

III. మీ అవగాహన పరీక్షించుకోండి

1. సయ్యద్ అహమ్మద్ ఖాన్ ముఖ్య భావాలేవి?

.....

.....

.....

.....

BRAOU

2. పార్సీలల్లో సంస్కరణలకొరకు కృషి చేసిన ముఖ్య నాయకులెవరు?

.....

.....

.....

.....

3. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీని ఎందుకు స్థాపించినారు?

.....

.....

.....

.....

14.20 సంగ్రహంగా

1. 19వ శతాబ్దపు సాంఘిక మత సంస్కరణోద్యమాలకు, బ్రహ్మ సమాజ స్థాపకుడైన రాజా రామ్‌మోహన్ రాయ్ పితామహుడు.
2. ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణ మఠం కూడా సాంఘిక, మత సంస్కరణలకు పాటుపడ్డాయి.
3. మహమ్మదీయులలో సంస్కరణోద్యమానికి సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ నాయకుడు. 1875లో స్థాపించిన అలీగర్ కాలేజి, మహమ్మదీయుల్లో సంస్కరణలకు కేంద్రమైంది.
4. 1851లో స్థాపించిన రెహనుమాయి మజ్‌దయాన్ సభ (మత సంస్కరణ సంఘం), పార్శీల్లో సంస్కరణలకు కృషిచేసింది.
5. 1890లో స్థాపించిన ఖాల్సా కాలేజి సిక్కులలో సంస్కరణకు కేంద్రమైంది. 1920 తర్వాత సిక్కులలో సంస్కరణల వేగం పుంజుకుంది.

14.21 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I 1. బ్రహ్మ సమాజం, విగ్రహారాధనకు, బహుదేవతారాధనకు వ్యతిరేకం. బ్రహ్మ సమాజం, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించింది. హిందూమతంలోకి చొచ్చుకున్న వేదాల్లో ఉపనిషత్తుల్లో లేనటువంటి, కొన్ని దురాచారాలను తొలగించి, హిందూ మతాన్ని సంస్కరించడానికి బ్రహ్మ సమాజం ప్రయత్నించింది.

2. ఆది బ్రహ్మ సమాజాన్ని దేవేంద్రనాథ్ టాగూర్ స్థాపించినాడు. నవ విధాన్ సమాజాన్ని కేశవ చంద్రసేన్ స్థాపించినాడు.

3. డా॥ ఆత్మారామ్ పాండురంగ్, ఆచార్య ఆర్.జి.భండార్కర్, ఎన్.జి. చంద్రార్కర్, పండిత రమాబాయి ప్రార్థన సమాజ్ ముఖ్య నాయకులు.

II 1. కందుకూరి వీరేశలింగం పంతులుగారు వితంతు పునర్వివాహానికి ఉధృతమైన ప్రచారం చేసి, అందుకోసం అనేక నిర్మాణాత్మక కార్యక్రమాలను కూడా చేపట్టాడు. స్త్రీవిద్య కోసం, బాల్య వివాహ నిర్మూలన కోసం కూడా ఆయన చాలా కృషి చేశాడు.

2. ఇ.వి. రామస్వామి నాయకర్, సమాజంలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని నిరసించాడు. బ్రాహ్మణేతరులు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని అతను బోధించాడు.

3. ఆర్యసమాజ్ ముఖ్య నినాదం 'వేదాలకు తిరిగి వెళ్ళాలి'. బ్రహ్మ సమాజం క్రైస్తవ సిద్ధాంతాలు, ఆచారాలతో ప్రభావితమైంది. కానీ ఆర్య సమాజ్ క్రైస్తవ మత ప్రభావం లేదు. శుద్ధి కార్యక్రమం ద్వారా ఆర్య సమాజ కార్యకర్తలు, మహమ్మదీయులను, క్రైస్తవులను తిరిగి హిందూమతంలోనికి చేర్చారు. బ్రహ్మసమాజంలో అటువంటి కార్యక్రమం లేదు.

BRAOU

III. 1. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ మహమ్మదీయులు, ఆంగ్ల విద్య నభ్యసించడానికి కృషిచేశాడు. ఆంగ్ల విద్య, మహమ్మదీయుల ప్రగతికి బాట అని అతను విశ్వసించినాడు. మహమ్మదీయులు బ్రిటీష్ ప్రభుత్వాన్ని బలపరచాలని కూడా అతను భావించాడు.

2. దాదాబాయ్ నౌరోజీ, ఎస్.ఎస్.బెంగాలీ, నౌరోజీ పుర్‌దోరన్‌జి పార్శీల్లో సంఘసంస్కరణ కొరకు పాటుపడిన ప్రముఖ వ్యక్తులు.

3. అవినీతిపరులైన మహంత్‌లను తొలగించడానికి గురుద్వారాలను సంస్కరించడానికి శిరోమణి గురుద్వారా ప్రబంధక్ స్థాపించబడింది.

14.22 పరీక్ష నమూనా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి :

1. బ్రహ్మ సమాజ్ యొక్క ముఖ్య సూత్రాలను వివరించి దేశ సామాజిక, రాజకీయ జీవన విధానంపై వాటి ప్రభావాన్ని తెల్పండి?
2. ప్రార్థనా సమాజ్ ముఖ్య ఆశయాలేమిటి? మహారాష్ట్ర ప్రాంతంలో సంస్కరణోద్యమాన్ని ప్రచారం చేయుటలో యం.జి రనడే చేసిన కృషి ఎట్టిది?
3. ఆంధ్రప్రాంతంలో కొనసాగిన సంస్కరణ రంగంలో వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు చేసిన కృషి ఎట్టిదో వర్ణించండి?
4. మత, సాంఘిక రంగాల్లో స్వామి వివేకానంద, రామకృష్ణ మిషన్‌ల ప్రయత్నాలను వివరించి వారిని ప్రేరేపించిన ఆశయాలను చర్చించండి?
5. అలీగర్ ఉద్యమ మౌలిక లక్షణాలను సంక్షిప్తంగా వివరించి సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ సేవలను వివరించండి?
6. సాంఘిక, మత రంగాల్లో చేపట్టిన సంస్కరణలలో పార్సీలు, శిక్కులు చేసిన కృషి ఎట్టిదో సంక్షిప్తంగా వివరించండి?

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి :

1. దేవేంద్రనాథ్ టాగూర్‌కు కేశవచంద్ర సేన్‌కు మధ్య గల భేదాభిప్రాయాలను వివరించండి?
2. రామస్వామి నాయకర్ ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమ ముఖ్య లక్షణాలను తెల్పండి?
3. సాంఘిక, మత సంస్కర్తగా దయానంద సరస్వతి పాత్రను వివరించండి?
4. దివ్యజ్ఞాన సమాజం, దాని నాయకురాలైన అనిబిసెంట్ పై ఒక లఘు వ్యాఖ్య రాయండి?

14.23 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C : *Constitutional History of Indian National Movement.*
2. Bipan Chandra : *Modern India.*
3. Bipan Chandra Tripathi & Barun De : *Freedom Struggle.*
4. Majumdar, R.C : *Advanced History of India, Vols, III & IV*
5. Majumdar, R.C : *Three Phases of India's Struggle for Freedom.*
6. Perceival Spear : *History of India, Vol.II.*
7. Sumit Sarkar : *Modern India*
8. ఝాన్సీ లక్ష్మి, పాటిబండ; వైదేహి, అల్లాడి : భారతదేశ చరిత్ర-సంస్కృతి, ద్వితీయ భాగం, తెలుగు అకాడమి ప్రచురణ
9. వైదేహి అల్లాడి : భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర (1885-1947)
10. బిపన్ చంద్ర : ఆధునిక భారతదేశం
11. జితేందర్‌రెడ్డి బి. : స్వాతంత్రోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు.

BRAOU

భాగం -15 : భారత జాతీయ కాంగ్రెస్ పుట్టు పూర్వోత్తరాలు

విషయక్రమం

15.0 లక్ష్యాలు
15.1 పరిచయం
15.2 రాజకీయ చైతన్యానికి కారణాలు
15.3 తొలి సంస్థలు
15.3.1 భూస్వామ్య సంఘం
15.3.2 మద్రాసు మహాజన సభ
15.3.3 బ్రిటిష్ ఇండియా అసోషియేషన్
15.3.4 భారతీయ సంఘం
15.4 ఆనందమోహన్ బోస్
15.5 సురేంద్రనాథ్ బెనర్జీ, 1848-1925
15.6 కాంగ్రెస్ పుట్టుక
15.7 ఏ.ఓ హ్యూమ్, 1829-1912
15.7.1 డఫ్రీన్
15.8 రక్షక కవాట సిద్ధాంతం (Safety Valve Theory)
15.9 భారతీయ సంఘం (Indian Association)
15.10 భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం
15.11 సంగ్రహంగా
15.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
15.13 పరీక్ష నమూనా ప్రశ్నలు
15.14 ఉపయుక్త గ్రంథాలు

15.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. 19 వ శతాబ్దంలో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు పూర్వం ఉన్న రాజకీయ సంస్థలు
2. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన గురించి వున్న సిద్ధాంతాలు, ఆ సంస్థ లక్ష్యాలు.
3. సురేంద్రనాథ్ బెనర్జీ, ఏ.ఓ.హ్యూమ్

15.1 పరిచయం

మేధోపరమైన చైతన్యం 19వ శతాబ్దంలో ప్రధానంగా నిర్మాణాత్మక మార్పులవల్ల భారతదేశంలో మొలకెత్తింది. బ్రిటీష్‌వారు నూతన సామాజిక వర్గాన్ని సృష్టించడమే ఇందుకు కారణం. పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంవల్ల విద్యావేత్తలు సాంఘిక ఉద్యమాలను ప్రారంభించారు. బ్రిటిష్‌వారి దోపిడీని, ఆర్థిక ఆసక్తులను భారతీయులు గమనించి వారిని ఎదుర్కొన్నారు. ఈ జాగృతే భారతజాతీయతా ఆవిర్భావానికి అంకురార్పణమైంది.

15.2 రాజకీయ చైతన్యానికి కారణాలు

బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనవల్ల భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కేంద్రీకృత రాజకీయ వ్యవస్థ ఏర్పడింది. భారతదేశమంతా ఏకప్రాంతంగా పరిపాలనా సమైక్యత ఏర్పడింది. బ్రిటీష్ పాలకులు దేశానికంతకూ రూపొందించిన ఒకే విధమైన పరిపాలనా యంత్రాంగం, శాంతియుత వాతావరణం, రాజకీయ సమైక్యత,

BRAOU

పాశ్చాత్య రాజకీయ భావాల ప్రచారం, దేశంలో రాజకీయ చైతన్యాన్ని రేకెత్తించాయి. భారతదేశమంతా ఏక ప్రాంతంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందింది.

ఆంగ్ల భాషను (ఇంగ్లీషు) బోధనా భాషగా ప్రవేశ పెట్టడంవల్ల భాషా పరంగా దేశం సమైక్యమైంది. విద్యావంతులైన భారతీయులు పాశ్చాత్య, శాస్త్రీయ, సాహిత్య, రాజకీయ విజ్ఞానంవల్ల ప్రభావితులయ్యారు. విద్యావంతులైన భారతీయుల కృషి ఫలితంగా దేశంలో రాజకీయ చైతన్యం పెంపొందింది. దేశభక్తి అభ్యుదయ భావాలవల్ల వారు ప్రభావితులైయ్యారు.

భారతదేశంలో ప్రగాఢ జాతీయవాద భావాల పెరుగుదలను, పాశ్చాత్య భావపరంపరను పెంపొందించాయి. రాజకీయ చైతన్యానికి దేశభక్తి భావాలకు మన దేశం పాశ్చాత్యులకు ఋణపడింది. భారతదేశ చరిత్ర రూపురేఖలపై ఈ ప్రభావం స్పష్టంగా ఉంది. బ్రిటీష్ పరిపాలనా ప్రభావ పరిణామమే, భారత జాతీయ వాదం అని తిలక్ చక్కగా చెప్పాడు.

19వ శతాబ్దంలో బెంగాల్‌లో చాలామంది సమర్థులైన నాయకులు ఉద్భవించారు. వారు రాజకీయ, సాంస్కృతిక విషయాల్లో భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు మార్గదర్శకులయ్యారు. వారికృషి ఫలితంగా, కొత్త జాతీయోద్యమం రూపు రేఖలను సంతరించుకుంది.

15.3 తొలి సంస్థలు

1857లో బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి స్వాతంత్ర్య సాధనకు జరిగిన కృషి విఫలమైంది. అయినా, ఆధునిక జాతీయోద్యమం పెంపొందించడానికి ఈ సంఘర్షణ దారితీసింది. 1857 తిరుగుబాటు తర్వాత బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగిన భారతీయ ప్రతిఘటనోద్యమ నాయకత్వం, సాంప్రదాయక విధానాలను అనుసరించే ఉన్నత వర్గాల నుంచి ఆంగ్లభాషను అభ్యసించిన వర్గానికి మారింది. ఈ వర్గం జాతీయవాదం, పౌరహక్కులు, రాజ్యాంగబద్ధ ప్రభుత్వంవంటి కొత్త భావాలవల్ల ప్రభావితమైంది. నాయకత్వం వహించిన మేధావి వర్గం వారికి పాశ్చాత్య భావాలు-ఆధునిక జాతీయవాదం, ప్రజాస్వామ్యం - బాగా వంటపట్టాయి.

15.3.1 భూస్వామ్య సంఘం

ఆధునిక భారతదేశంలో భూస్వామ్య సంఘం (Land Holders Society) మొట్టమొదటి సంఘం. ఈ సంఘాన్ని 1837లో స్థాపించారు. బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో భూస్వాములు తమ వర్గ ప్రయోజనాలను పెంపొందించుకోవడానికి ఈ సమాజాన్ని స్థాపించారు. 1843లో సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడి, పెంపొందించడానికి **బెంగాల్, బ్రిటీష్ ఇండియన్ సొసైటి** (Bengal, British Indian Society) ని స్థాపించారు. 1851లో ఈ రెండు వ్యవస్థలు సమైక్యమై, బ్రిటీష్ ఇండియా సంఘంగా ఏర్పడింది. అదేవిధంగా 1866లో భారతదేశ సమస్యను చర్చించడానికి, దేశ శ్రేయస్సును పెంపొందించడానికి, బ్రిటీష్ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి, దాదాభాయి నౌరోజి లండన్‌లో **ఈస్ట్ ఇండియా ఆర్గనైజేషన్** (East India Organisation) ను స్థాపించాడు. భారతదేశంలో అన్ని ముఖ్య నగరాల్లో ఈ సంస్థ శాఖలను ప్రారంభం చేసాడు. 1852లో మద్రాస్, బొంబాయి రాష్ట్రాలలో వేరుగా సంఘాలు ఆరంభమయ్యాయి.

15.3.2 మద్రాస్ మహాజన సభ

యమ్. విజయరాఘవాచారి, జి. సుబ్రమణ్య అయ్యర్, ఆనందాచార్యులు మొదలైనవారు 1881లో మద్రాస్ మహాజన సభను స్థాపించారు. 1885లో **బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్** స్థాపన జరిగింది. ఫిరోజ్‌షా మెహతా, కె.టి. తెలాంగ్, బద్రుద్దీన్ త్యాబ్జీ ఈ సంఘస్థాపకులు. జస్టిస్ రనడే, తదితరులు పూనా సార్వజనిక సభను స్థాపించారు. జస్టిస్ రనడే ఆధ్వర్యంలో ఈ సభ, ఒక త్రైమాసిక పత్రికను ప్రచురించింది. ఆర్థిక సమస్యలపై మేధావులు విలువైన వ్యాసాలను వ్రాశారు.

B RAO

15.3.3 బ్రిటీష్ ఇండియా అసోసియేషన్

విస్తృత భారత ప్రాతిపదికపై రాజకీయాందోళన కొనసాగించవలసిన అవసరాన్ని **బ్రిటీష్ ఇండియా అసోసియేషన్** గ్రహించింది. ఈ సంఘం చట్టం ముందు సమానత్వాన్ని కోరింది. భారతీయులకు, పాశ్చాత్యులకు మధ్య ఎలాంటి తేడా చూపించకూడదని జ్యూరీ (Jury) పద్ధతిలో విచారణ జరపాలని కోరింది. సివిల్ సర్వీసులతో సహా అన్ని అధికార పదవులకు ఎలాంటి విచక్షణ చూపించకుండా భారతీయులకు కూడా అవకాశాలు ఇవ్వాలని ఈ సంస్థ కోరింది.

ఈ విధంగా ఆనాడు భారతదేశంలోని మేధావి వర్గం పెద్ద పెద్ద నగరాల్లో రాజకీయ సంఘాలను ఏర్పాటుచేశారు. ఈ సంఘాల ద్వారా దేశం ఎదుర్కొంటున్న చాలా సమస్యల గురించి తమ దృష్టిని కేంద్రీకరించి చర్చించారు.

15.3.4 భారతీయ సంఘం

కాంగ్రెస్‌కు ముందు మొదలైన జాతీయ సంస్థలలో చాలా ముఖ్యమైంది కలకత్తా భారతీయ సంఘం. ప్రఖ్యాత నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీ ప్రోత్సాహంతో ఈ సంఘాన్ని 1876లో స్థాపించారు.

ఈ సంస్థ ముఖ్యాశయాలు :

(1) ఉమ్మడి రాజకీయ కార్యక్రమాలతో, భారత ప్రజలను సమైక్యపరచడం

(2) హిందూ-ముస్లిం సఖ్యతను పెంపొందించడం

(3) దేశంలో బలమైన ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం

(4) నాటి ప్రజా ఉద్యమాలలో ప్రజానీకాన్ని కలుపుకోవడం

సురేంద్రనాథ్ బెనర్జీ భారతదేశమంతా పర్యటించాడు. ఆయన గంభీరోపన్యాసాలకు ప్రజలు మంత్రముగ్ధులై ఆకర్షితులయ్యారు. దేశ రాజకీయ రంగాలలో ప్రముఖ పాత్రను నిర్వహించాడు. పరీక్షల వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలకు తగ్గించడంతో ఇండియన్ అసోసియేషన్ ఈ చర్యను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇల్బర్ట్ బిల్లు వివాదం సందర్భంగా ఈ సంఘం దృఢంగా వ్యవహరించింది. ఈ సంస్థ ఇల్బర్ట్ బిల్లును సమర్థిస్తూ నిర్వహించిన ఆందోళనా పటిమను చూసి బ్రిటీష్ అధికారులు ఆశ్చర్యపడ్డారు. దేశీయ పత్రికలకు వ్యతిరేకంగా ఆమోదించిన శాసనాన్ని ఘాటుగా విమర్శించింది. లాంకాషైర్ మిల్లు వస్త్రాలకు అనుకూలంగా స్వదేశీ వస్త్ర పరిశ్రమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా దిగుబతి సుంకాలను రద్దుచెయ్యడాన్ని ఈసంఘం గర్హించింది. రిప్పన్ పరిపాలనా కాలంలో ఈ సంస్థ, ప్రజా సమస్యల చర్చావేదిక అయింది.

రాజకీయ సమైక్యతను ప్రాతిపదికగా భారతీయవాదానికి నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి ఈ సంఘం, అఖిల భారత సమావేశాన్ని నిర్వహించాలని సంకల్పించింది. 1883లో కలకత్తాలోని మొదటి జాతీయ సమావేశాన్ని నిర్వహించి, ఆనాడు భారతీయ విద్యావంతులను కలవర పరుస్తున్న రాజకీయ సమస్యల గురించి చర్చించింది. ఈ సంస్థ అనుసరించిన మాదిరి కార్యక్రమాన్నే తరవాత సమావేశమైన భారతీయ కాంగ్రెస్ ఆమోదించింది. 1886లో ఈ సంస్థ భారత జాతీయ కాంగ్రెస్‌లో విలీనమైంది.

15.4 ఆనందమోహన్ బోస్

లండన్‌లో చదువుతుండగా ఆనందమోహన్ బోస్, దాదాభాయి నౌరోజీవల్ల ప్రభావితుడైనాడు. 19వ శతాబ్దం మధ్యలో బెంగాల్‌లో పరిణామం చెందిన రాజకీయ భావాల ఫలితంగా, సురేంద్రనాథ్ బెనర్జీతోపాటు ఆనందమోహన్ బోస్ కూడా రాజకీయ కార్యక్రమాలలో ఉధృతంగా పాల్గొన్నాడు.

వలస ప్రాంతాల స్వపరిపాలన ఆశయంగా రాజకీయ జాతీయవాదం ఆవిర్భవించడం యదార్థమైంది. భారతదేశంలో ప్రతినిధులను, సెనేట్‌ను ఏర్పరచాలని బ్రిటన్ వద్ద చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఆనందమోహన్ బోస్ సూచించాడు. బెంగాల్ లోని యువజాతీయవాదులు ఆనందమోహన్ బోస్, సురేంద్రనాథ బెనర్జీల నాయకత్వంలో 1876లో 'ఇండియన్ అసోసియేషన్' స్థాపించారు. 1883లో కలకత్తాలో జరిగిన మొదటి సమావేశంలో ఆనందమోహన్ బోస్ ప్రారంభోపన్యాసంలో ఈ సమావేశాన్ని జాతీయ పార్లమెంటు స్థాపనకు మొదటి మెట్టుగా వర్ణించాడు. కొంత కాలం తర్వాత భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు.

15.5 సురేంద్రనాథ్ బెనర్జీ, 1848-1925

సురేంద్రనాథ్ బెనర్జీ ఉజ్వల రచయిత, మహావ్యక్తి. ఐ.సి.యస్. (I.C.S.) పరీక్షలో 1871లో కృతార్థుడయ్యాడు. సిల్హాట్‌లో అసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా ప్రభుత్వ యంత్రాంగంలో చేరాడు. సురేంద్రనాథ బెనర్జీని అన్యాయంగా సివిల్ సర్వీస్ నుంచి తొలగించారు. కలకత్తాలో ప్రీచర్చి కళాశాలలో, అధ్యాపక పదవిని స్వీకరించాడు. రిప్పన్ కళాశాలలను స్థాపించాడు. 1876లో కలకత్తా ఇండియన్ అసోసియేషన్ స్థాపించాడు. నిర్మాణాత్మక ఆందోళన ద్వారా రాజకీయ ఆశయాలను సాధించుకోవడానికి జాతీయ నిధిని ఏర్పరచాలని సూచించిన మొదటి నాయకుడు. త్వరితంగా పెంపొందుతున్న హిందూ-ముస్లిం ప్రత్యేక జాతీయ వాదాలను ఛేదించి భారతజాతీయవాదం పెంపొందడానికి కృషి చేశాడు. దేశ వివిధ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, గంభీరోపన్యాసాల నొనరించి ప్రజలలో చైతన్యాన్ని రగుల్కొల్పాడు. అతడు సమావేశపరచిన జాతీయ సభ (National Conference) భారత జాతీయ కాంగ్రెస్‌కు మార్గదర్శకమైంది. 1895లో పూనేలోను 1902లో అహమ్మదాబాద్ సమావేశంలోను రెండుసార్లు కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. భారత రాజకీయాలలో సురేంద్రనాథ బెనర్జీ మితవాది. బ్రిటీష్ రాజకీయ సిద్ధాంతాలపైన, బ్రిటీష్‌వారి న్యాయబుద్ధిపైన ఆయనకు అచంచల విశ్వాసం ఉంది.

15.6 కాంగ్రెస్ పుట్టుక

రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయులు, ఉమ్మడి రాజకీయ కార్యక్రమాన్ని రూపొందించడానికి అఖిల భారత ప్రాతిపదికపై ఒక వ్యవస్థను రూపొందించవలసిన అవసరాన్ని గుర్తించారని ఇదివరకే తెలుసుకున్నాం. 1885, డిసెంబర్ 25వ తేదిన బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ పేరుతో సమావేశమైంది. ఈ సమావేశానికి డబ్ల్యూ.సి. బెనర్జీ అధ్యక్షుడు. ఎ.ఓ హ్యూమ్, కె.టి. తెలాంగ్ కార్యదర్శులు. భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించాలనే ఉద్దేశ్యం హ్యూమ్‌కే కలిగింది. హ్యూమ్‌ను భారత జాతీయ కాంగ్రెస్ పితగా వర్ణించవచ్చు. ఈ సంస్థను స్థాపించడంలో చొరవ తీసుకుంటున్నందుకు ఆయన ఉద్దేశాలను పరిశీలించేముందు, ఆయన జీవిత విశేషాలను పరిశీలిద్దాం.

15.7 ఎ.ఓ. హ్యూమ్, 1829-1912

ఉదారవాద భావాలుగల స్కాటిష్ కుటుంబంలో జన్మించాడు. ఇండియన్ సివిల్ సర్వీస్‌లో సభ్యుడు. చాలా ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహించాడు. 1870లో భారత ప్రభుత్వానికి కార్యదర్శిగా పనిచేసాడు. ఉన్నతాధికారుల భావాలను లక్ష్యపెట్టకుండా, తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా తెలియచేసాడు. హ్యూమ్ భావాలు ఉన్నతాధికారులకు నచ్చకపోవడంవల్ల 1882లో పదవినుంచి విరమించాడు. విద్యావంతులైన భారతీయుల ఆశయాలపట్ల సానుభూతిని చూపించాడు. కలకత్తా విశ్వవిద్యాలయ పట్టభద్రులను ఉద్దేశించి 1882 మార్చిలో ప్రసంగిస్తూ తమ దేశానికి స్వేచ్ఛను పట్టుదలతో సాధించడానికి సంఘర్షణకు సిద్ధపడవలసిందని ఉద్బోధించాడు.

DRAOU

1885 డిసెంబర్‌లో బొంబాయిలో జరిగిన మొదటి సమావేశం విజయవంతం కావడానికి మార్గదర్శకుడయ్యాడు. చాలా సంవత్సరాలు ప్రధాన కార్యదర్శిగా ఎంతో శ్రద్ధతో, సమర్థవంతంగా నిర్వహించాడు. 1889లో లండన్‌లో కాంగ్రెస్ (బ్రిటీష్) కమిటీని ఏర్పరచడంలో సహాయం చేసాడు. ఈ కమిటీ 'ఇండియా' అనే పత్రికను ప్రారంభించింది.

15.7.1 డఫ్రిన్

డఫ్రిన్ గవర్నర్ - జనరల్‌గా ఉన్న కాలంలో ఎ.ఒ. హ్యూమ్ మానసిక, నైతిక, సాంఘిక, రాజకీయ రంగాలలో భారతీయులను పునరుత్తేజితులను చేయడానికి ఒక సంస్థను స్థాపించడానికి అధికారుల మద్ధతును సంపాదించాడు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రబలుతున్న అసంతృప్తి తిరుగుబాటుగా ప్రజర్విల్లుతుందని హ్యూమ్ గుర్తించాడు. హ్యూమ్ గవర్నర్ - జనరల్ డఫ్రిన్‌తో చర్చించాడు.

ముఖ్యమైన సాంఘిక సమస్యలను చర్చించడానికి ప్రఖ్యాత భారతీయ మేధావులను సమావేశపరచాలని హ్యూమ్ మొదట అనుకున్నాడు. లార్డ్ డఫ్రిన్ ఈ సంస్థ పార్లమెంటరీ వ్యవస్థలో ప్రతిపక్షం పాత్రను నిర్వహించాలని భావించాడు. భారతరాజకీయ నాయకులు సంవత్సరానికొకసారి సమావేశమై పరిపాలనా యంత్రాంగంలోని లోపాలను వివరించి, ఎలా మెరుగుపరచాలో ప్రభుత్వానికి తెల్పాలని కోరాడు.

దేశంలోని ప్రఖ్యాత ఉదారవాద మేధావుల సహకారంతో హ్యూమ్ భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించాడు. మొదట్లో కాంగ్రెస్ ప్రభుత్వం, స్నేహ వైఖరి ప్రదర్శించింది. కాంగ్రెస్ ప్రథమ సమావేశ చర్చల్లో, ప్రభుత్వాధికారులు చురుకుగా పాల్గొన్నారు. 1886లో కలకత్తాలో గవర్నర్ - జనరల్ లార్డ్ డఫ్రిన్ కాంగ్రెస్ ప్రతినిధులను వనభోజనానికి ఆహ్వానించాడు. 1887లో ఇదేవిధంగా మద్రాస్ గవర్నర్ కూడా కాంగ్రెస్ ప్రతినిధులను ఆహ్వానించాడు. లార్డ్ డఫ్రిన్ కాంగ్రెస్ పట్ల ఆమోదాన్ని తెలిపాడు. కాని పదవీ విరమణ చేసే ముందు మనసు మార్చుకొని, భారతీయ కాంగ్రెస్ విధానాలను, పద్ధతులను వ్యతిరేకించాడు. కాంగ్రెస్ ప్రజారాశిలో ఒక నలుసని వర్ణించాడు. లార్డ్ డఫ్రిన్ పదవీ కాలంలోనే, కాంగ్రెస్‌పట్ల ప్రభుత్వ దృక్పథం మారింది.

15.8 రక్షక కవాట సిద్ధాంతం (Safety Valve Theory)

విద్యావంతులైన మధ్యతరగతి మేధావి వర్గంలో ప్రబలిన అసంతృప్తిని పరిశీలిద్దాం. విద్యావంతులైన మేధావి వర్గంలో పెరుగుతున్న అసంతృప్తి 1870 తర్వాత ఎక్కువైంది.

భారత జాతీయ కాంగ్రెసు డిసెంబరు 1885 సం॥లో స్థాపించబడినది. ఈ ప్రారంభ సమావేశానికి దేశం అన్ని ప్రాంతాల నుంచి 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఎ.ఒ.హ్యూమ్ పదవీ విరమణ చేసిన ఆంగ్లేయాధికారి. భారత జాతీయ కాంగ్రెసు ఏర్పాటులో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. ఈ వ్యవహారం "రక్షక కవాట" సిద్ధాంత ఆవిర్భవానికి దారితీసింది. రక్షక కవాట సిద్ధాంతం ప్రకారం, రాజప్రతినిధి డఫ్రిన్ అధికార ఆదేశానుసారం, సలహా, సూచనలమేరకే ఎ.ఒ.హ్యూమ్ మరియు యితర ఆంగ్లేయ అధికారులు జాతీయ కాంగ్రెసును స్థాపించారు. ప్రజలలో ప్రజ్వరిల్లుతున్న అసంతృప్తి, ప్రజా హింసా విప్లవ రూపం ధరించకుండా ఒక సురక్షితమైన, శాంతియుతమైన రాజ్యాంగపరంగా ప్రజాభిప్రాయం వ్యక్తం చేసే "రక్షక కవాట" సంస్థను జాతీయ కాంగ్రెస్ స్థాపన ద్వారా అందించడం జరిగింది. క్లుప్తంగా ఈ సిద్ధాంతం ప్రకారం కనుచూపు మేరలో నున్న రక్తపాత విప్లవాన్ని జాతీయ కాంగ్రెసు స్థాపన ద్వారా నిరోధించారు. అనగా 1885 సం॥లో ఒక రక్షక కవాటంగా మాత్రమే జాతీయ కాంగ్రెసును స్థాపించారు.

ఈ సందర్భంగా ప్రముఖ నాయకుడైన లాలా లజపతిరాయ్ అభిప్రాయం ప్రకారం 'లార్డ్ డఫ్రిన్' ఆలోచనలమేరకు భారతదేశంలోని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ప్రమాదం నుంచి రక్షించేందుకు జాతీయ కాంగ్రెసు

BRAOU

స్థాపించబడింది. ఆర్.పాల్మ్ దత్ "రాజప్రతినిధి డఫ్రిన్‌తో చేసికొన్న రహస్య ఒప్పందం ప్రకారమే కాంగ్రెసు ఆవిర్భవించిందని" వ్యాఖ్యానించాడు.

రాష్ట్రీయ సేవక్ సమాజ్ నాయకుడైన యమ్. యస్. గోల్వాల్కర్ అభిప్రాయంలో "ఆంగ్లేయులు కాంగ్రెసును ఒక రక్షక కవాటంగా స్థాపించారు". ఈ స్థాపనలో వారి ముఖ్య లక్ష్యం 'భారతదేశంలో ప్రజ్వరిల్లుతున్న జాతీయత భావాలను అదుపులో వుంచడం మరియు జాతీయ దృక్పథాన్ని నాశనం చేయడం'. లాలా లజపతిరాయ్ రక్షక కవాట సిద్ధాంతం విషయంలో మరోసారి ఈవిధంగా వుద్ఘాటించినాడు. "హ్యూమ్, బ్రిటిష్ పాలనకు భారతదేశంలో పొంచివున్న ప్రమాదం విషయంలో లభించిన ఆధారాలు ప్రాతిపదికగా, అసంతృప్తికి ఒక రక్షక కవాటం సృష్టించేందుకు నిర్ణయించుకొన్నాడు".

ప్రముఖ నాయకుడైన డబ్ల్యు.సి. బెనర్జీ "కాంగ్రెస్, డఫ్రిన్ ప్రభువు సృష్టి" అని పేర్కొన్నాడు. హ్యూమ్ ఆలోచన ప్రతి సంవత్సరం భారతదేశ ప్రముఖ నాయకులందరిని సమావేశపరచి సామాజిక విషయాలు చర్చించాలని. కాని డఫ్రిన్ ఆదేశాల ప్రకారం "ఒక సంస్థను నెలకొల్పి రాజకీయ విషయాలు చర్చిస్తే, దేశంలోని ప్రజల అభిప్రాయం తెలుసుకొనేందుకు వీలుపడుతుందని, హ్యూమ్ అలా చేయవలసివచ్చిందని" ఆచార్య బిపన్ చంద్ర రక్షక కవాట సిద్ధాంతాన్ని ఒక కట్టు కథగా వర్ణించాడు. రక్షక కవాట సిద్ధాంతానికి ప్రాతిపదిక "సంభవించనున్న బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు". ఈ విషయంలో రహస్య నివేదికలు లేవని కొందరి వాదం. ఆచార్య బిపన్ చంద్ర రక్షక కవాట సిద్ధాంతాన్ని ఖండిస్తూ క్రింది వాటిని పేర్కొన్నాడు. 1888 సం॥లో డఫ్రిన్ జాతీయ కాంగ్రెసు, సంఘసంస్కరణలకు పరిమితం కాకుండ, రాజకీయాలలో జోక్యం చేసుకోవడం తన సెంట్ ఏండ్రూస్ చర్చి డిన్నర్ ప్రసంగంలో నిశితంగా విమర్శించడం, డఫ్రిన్ ప్రభువు బ్రిటీష్ ప్రభుత్వానికి తనుపంపిన నివేదికలలో జాతీయ కాంగ్రెసు లక్షలాది ప్రజలకు సహాయపడే సంఘ సంస్కరణలకు పరిమితం కాకుండా రాజకీయాలలో జోక్యం చేసికోవడం నిశితంగా విమర్శించాడు. డఫ్రిన్ యొక్క వ్యక్తిగత వుత్తరాలు సిద్ధాంతానికి ప్రోత్సాహం యిచ్చింది. డఫ్రిన్ రక్షక కవాట సిద్ధాంతం రుజువు చేస్తుంది.

డఫ్రిన్ కాని, మద్రాసు, బొంబాయి గవర్నర్లు కాని కాంగ్రెసు సానుభూతిపరులు కారు. 1888 సం॥లో డఫ్రిన్ ప్రభువు 'జాతీయ కాంగ్రెసు రాజకీయాలతో జోక్యం చేసికొంటే దాని వునికి, మనుగడ మేము అంగీకరించం' అని చేసిన ప్రకటన, "రక్షణ కవాట సిద్ధాంతం అభూతి కల్పన" గా ఆచార్య బిపన్ చంద్ర వుద్ఘాటించాడు. క్లుప్తంగా 'డఫ్రిన్ కోరుకొనేది ఒక సామాజిక సంస్థ కాని ఒక రాజకీయ పార్టీ ఏర్పాటుకాదు'. కావున డఫ్రిన్ రక్షక కవాట సిద్ధాంతాన్ని ప్రోత్సహించటం నిజం కాదు.

ప్రారంభం నుంచి జాతీయ కాంగ్రెసు ఒక పార్టీగా రూపొందించబడలేదు. అదొక ఉద్యమమని, పెక్కుమంది అభిప్రాయం. ప్రారంభంలో కాంగ్రెసు లక్ష్యం మత రహిత ప్రజాస్వామిక, జాతీయోద్యమం ద్వారా ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులనుచేసి, జాతీయ స్థాయిలో నాయకత్వాన్ని పెంపొందించి, వలస విధానాన్ని ద్వేషిస్తూ, జాతీయ దృక్పథాన్ని దేశంలో పెంపొందించడం.

కాబట్టి జాతీయ కాంగ్రెసు స్థాపనకు ఎ.ఒ. హ్యూమ్ ముఖ్య కార్యనిర్వాహకుడుగా వ్యవహరించాడు. కాంగ్రెసు నాయకులు ఆయనకు సహకారాన్ని అందించడంలో ముఖ్యోద్దేశ్యం జాతీయ కాంగ్రెసు స్థాపనకు, బ్రిటిష్ అధికారుల వ్యతిరేకతను నిరోధించడం. ఆచార్య బిపన్ చంద్ర వ్యాఖ్యానించినట్లుగా "హ్యూమ్ మరియు ఆంగ్లేయాధికారులు కాంగ్రెసును రక్షక కవాటంగా వాడుకొంటే, కాంగ్రెసు నాయకులు హ్యూమ్‌ను "జ్యోతిని వెలిగించేందుకు ఉపయోగపడే ఒక సాధనంగా (Lighting Conductor) ఉపయోగించుకోవాలని ఆశించారు".

1883 నాటికి ఈ అసంతృప్తి, ప్రమాద స్థాయికి చేరుకుంది. లిట్టన్ ప్రభువు ప్రవేశపెట్టిన జాతీయ పత్రికల చట్టంవంటి ప్రజా వ్యతిరేక విధానాలు, అసంతృప్తిని పెంపొందించాయి. ఆయుధ చట్టం ప్రకారం, భారతీయులు అనుమతిలేనిదే ఆయుధాలను ధరించకూడదు. సామాన్యంగా అనుమతి నిచ్చేవారుకాదు.

BRAOU

లార్డ్‌రిప్పన్ పరిపాలన కాలంలో ఇల్బర్ట్ బిల్లు వివాదం భారతీయుల-ఆంగ్లేయుల సంబంధాలను కలుషితం చేసింది. బ్రిటీష్, ఇండియన్ మేజిస్ట్రేట్లలో అధికారాలలోని చట్టపరమైన అసమానతను తొలగించడానికి వైస్రాయి కార్యనిర్వాహక వర్గంలో న్యాయ వ్యవహారాలను పరిశీలించే సభ్యుడు (Law Member) సర్ పెర్సీ ఇల్బర్ట్ బిల్లును ప్రవేశపెట్టాడు. ఈ వివాదం ఆంగ్లేయుల, భారతీయుల మధ్య ద్వేషాన్ని రగుల్కొల్పింది. ఆంగ్లేయుల జాతి దురహంకారాన్ని, విచక్షణా విధానాన్ని, భారతీయులు గర్హించారు.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. కలకత్తాలోని భారతీయ సంఘాన్ని (Indian Association) స్థాపించినదెవరు? దాని ముఖ్య లక్షణాలేవి?

.....

.....

.....

.....

2. రక్షక కవాట సిద్ధాంతము అర్థమేమి?

.....

.....

.....

.....

15.9 భారతీయ సంఘం

1880లో భారతదేశంలో అసంతృప్తి పెల్లుబికింది. 1876లో సురేంద్రనాథ్ బెనర్జీ స్థాపించిన భారతీయ సంఘం (Indian Association) జనాదరణ పొందింది. 1873లో ఈ సంస్థ నిర్వహించిన జాతీయ సమావేశం వల్ల జాతీయ భావం ఎలా పెంపొందించిందో తెలుస్తోంది. హ్యూమ్ భయంకరమైన తిరుగుబాటు జరిగే ప్రమాదాన్ని గుర్తించాడు. ఆ తిరుగుబాటును నివారించడానికి చర్య తీసుకోవాలని హ్యూమ్ తీవ్రంగా భావించాడు.

ప్రజావ్యతిరేకతను ఉపశమింపడానికి, కాంగ్రెస్ వ్యవహరించాలని హ్యూమ్ కోరాడు. ''*మన నిర్వహణ వల్ల ఉప్పొంగే మహాశక్తిని ఉపశమింప చేయడానికి తగిన మార్గాన్ని చూడడం మన తక్షణావసరం*'' అన్నాడు హ్యూమ్. భారతీయుల్లో పేరుకుపోయిన అసంతృప్తిని, నిరపాయకరంగా వెలికితీయడానికి భారత జాతీయ కాంగ్రెస్ శాంతియుతమైన రాజ్యాంగబద్ధమైన మార్గాన్ని ఏర్పరుస్తుందని హ్యూమ్ నమ్మాడు. అసంతృప్తి చెందిన జాతీయవాద మేధావి వర్గంతో అసంతృప్తి చెందిన రైతాంగం సమైక్యం కావడాన్ని నిరోధించాలనుకున్నాడు. రక్షక కవాట సిద్ధాంతం మాత్రమే కాకుండా హ్యూమ్ ఉన్నతాశయాలవల్ల ప్రభావితుడయ్యాడు. భారతదేశాన్ని పేదరైతులను, చిత్తశుద్ధితో ప్రేమించాడు. హ్యూమ్ ఉదార భావాలు గల వ్యక్తి. అభ్యుదయకరమైన సంస్కరణలు ప్రవేశపెట్టాలనే న్యాయమైన భారతీయుల కోర్కెలను సమర్థించాడు.

కాంగ్రెస్ సంస్థను స్థాపించడమే కాకుండా, ఈ సంస్థలపట్ల ప్రభుత్వ వైఖరి మారిన తర్వాత కూడా 1888 తర్వాతకూడా సంస్థలోనే ఉన్నాడు. కష్టకాలంలో కాంగ్రెస్ సంస్థకు మార్గదర్శకుడైనాడు. హ్యూమ్ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి కొమ్ముకాయలేదు. ప్రముఖ బ్రిటీష్ అధికారి ప్రారంభించిన సంస్థను, బ్రిటీష్ ప్రభుత్వం వ్యతిరేకించిందని భారతీయ నాయకులు భావించారు.

BRAOU

ఆనందమోహన్ బోస్, సురేంద్రనాథ్ బెనర్జీలు స్థాపించిన 'ఇండియన్ సంఘం' త్వరితంగా ప్రతిష్టను ఎలా పెంపొందించుకుందో ఇదివరకే పరిశీలించాం. రిప్పన్ పరిపాలనా కాలంలో ఈ సంఘం, ప్రధాన చర్చా వేదికైంది. ఈ సంఘం ఆధ్వర్యంలో 1883లో కలకత్తాలోను జరిగిన ప్రథమ జాతీయ సమావేశానికి, వందమంది హిందూ, ముస్లిం ప్రతినిధులు పాల్గొన్నారు. భారతీయ సంఘం రెండవ సమావేశం 1885 డిసెంబర్, 25,26,27 తేదీలతో కలకత్తాలో జరిగింది. భారతీయ సంఘం రెండు జాతీయ సమావేశాల్లో చర్చించిన సమస్యలనే, భారతీయ కాంగ్రెస్ బొంబాయి సమావేశంలో ప్రతినిధులు చర్చించారు.

15.10 భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం

భారత జాతీయ కాంగ్రెస్ 1885, డిసెంబర్ 28వ తేదీన బొంబాయిలో సమావేశమైంది. అంటే భారతీయ సంఘం రెండవ జాతీయ సమావేశం ముగిసిన మరునాడే, కాంగ్రెస్ సమావేశమైంది.

రెండు సమావేశాలలోని సభ్యులు ఉమ్మడి అభిప్రాయాలను ఒకే ఆశయాన్ని కల్గి ఉన్నందున జాతీయ సంఘం (నేషనల్ కాన్ఫరెన్స్) సభ్యులు కాంగ్రెస్ సంస్థలో చేరి, హృదయపూర్వకంగా కాంగ్రెస్‌తో సహకరించారు. ఈ విధంగా జాతీయ సంఘం ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోయింది. జాతీయ సంఘ సభ్యులు భారత జాతీయ కాంగ్రెస్‌తో సహకరించారు. ఎలాంటి సమస్యలేకుండా భారత జాతీయ సంఘం, భారత జాతీయ కాంగ్రెస్‌లో విలీనం కావడం, జాతీయ సమైక్యతా భావం పెంపొందిందనడానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

1885వ సంవత్సరం డిసెంబర్ నెల 28వ తేది మధ్యాహ్నం 12 గంటలకు, తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో గోకుల్ దాస్ భవనంలో మొదటి జాతీయ కాంగ్రెస్ సభ, డబ్ల్యు.సి. బెనర్జి అధ్యక్షతన సమావేశమైంది. ఎ.ఓ. హ్యూమ్, కె.టి.తెలాంగ్ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. భారత స్వతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించిన భారత రాజకీయ సంస్థ ఈ విధంగా ఆవిర్భవించింది. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కాంగ్రెస్ ఆవిర్భావం చాలా ప్రధానమైన సంఘటన.

ప్రఖ్యాతి చెందిన భారతీయ నాయకులందరూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. 70 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి వచ్చారు. వారిలో పిరోజ్‌షా మెహతా, దాదాభాయి నౌరోజీ, దిన్‌షా వాచా, డబ్ల్యు, యస్. ఆప్టే, మద్రాస్ నుంచి వచ్చిన పి. రంగయ్యనాయుడు, పి. ఆనందాచార్యులు, సుబ్రమణ్య అయ్యర్, అనంతపురం నుంచి వచ్చిన కేశవ పిళ్ళై ముఖ్యులు. ఇండియన్ మిర్రర్, కేసరి, హిందూ, ట్రిబ్యూన్ పత్రికల సంపాదకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ ప్రతినిధులలో ఎక్కువ మంది న్యాయవాదులు, పాత్రికేయులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, అధ్యాపకులు, భూస్వాములు.

బొంబాయి సమావేశానికి అధ్యక్షత వహించిన డబ్ల్యు.సి. బెనర్జి, కాంగ్రెస్ ఆశయాలను వివరించాడు. (1) జాతీయవాదంవల్ల ప్రభావితులైన కార్యకర్తల మధ్య స్నేహ బంధాలను పెంపొందించడం, (2) కుల, మత, రాష్ట్ర దురభిమానాలకు అతీతంగా, ప్రజల్లో జాతీయ సమైక్యతాభావాన్ని పెంపొందించి, దృఢ పర్చడం,(3) మనస్ఫూర్తిగా చర్చలు జరిపిన తర్వాత, విద్యావంతులైన భారతీయులు ముఖ్య సమస్యలపై తీసుకున్న నిర్ణయాలను తీర్మానించడం, (4) వచ్చే సంవత్సరంలో అమలు జరుపవలసిన కార్యక్రమాన్ని వివరించడం.

ఈ సమావేశంలో కాంగ్రెస్ చాలా తీర్మానాలను ఆమోదించింది. ఇండియా కౌన్సిల్ రద్దును కోరింది. భారత పరిపాలన వ్యవస్థ పనిచేసే తీరు గురించి వివరించడానికి ఒక విచారణ సంఘాన్ని (Royal Commission) ఏర్పరచాలని కాంగ్రెస్ కోరింది. పరీక్షలకు వయోపరిమితిని పెంచాలని ఇంగ్లాండ్, ఇండియాలలో సివిల్ సర్వీస్ పరీక్షలను అమలులో ఉన్న లెజిస్లేటివ్ కౌన్సిళ్ళలో ఎన్నికైన శాసనసభ్యులను చేర్చుకోవాలని కాంగ్రెస్ కోరింది. వాయవ్య సరిహద్దు రాష్ట్రం, అయోధ్య, పంజాబ్ రాష్ట్రాలలో కౌన్సిళ్ళను ఏర్పాటు చెయ్యాలని కాంగ్రెస్

BRAOU

కోరింది. బ్రిటీష్ ప్రభుత్వంపట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటిస్తూ, కాంగ్రెస్ చర్చలు మొదలయ్యాయి. ఉదారవాద రాజకీయవాదులు ప్రారంభించి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన, కాంగ్రెస్ సభ ఆమోదించిన తీర్మానాలు నమ్రతా భావంతో ఉన్నాయి. ఇవి పరిపాలన యంత్రాంగ సంస్కరణకు శాసనసభలో ఎన్నిక సిద్ధాంతానికి మాత్రమే పరిమితమయ్యాయి. సమావేశం ముగిసే ముందు, హ్యూమ్ కాంగ్రెస్ తరపున విక్టోరియా మహారాణికి అభినందనలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ తీర్మానం కాంగ్రెస్ విశ్వాసపూరిత విధానాన్ని స్పష్టీకరిస్తుంది.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం ఎక్కడ జరిగింది? ఆ సమావేశానికి అధ్యక్షుడెవరు?

.....

.....

.....

.....

2. మొదటి కాంగ్రెస్ సమావేశంలో ఆమోదించిన ముఖ్య తీర్మానాలేవి?

.....

.....

.....

.....

15.11 సంగ్రహంగా

1. బ్రిటీష్ ఇండియా సంఘం, మద్రాస్ నేటివ్ అసోసియేషన్, మద్రాస్ మహాజన సభ, పూనా సార్వజనిక సభ, బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్, భారతదేశంలో కాంగ్రెస్ స్థాపనకు పూర్వం ఉన్న ముఖ్యమైన రాజకీయ సంఘాలు.
2. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు పూర్వం ఉన్న సంఘాలన్నింటిలోకి ముఖ్యమైంది. కలకత్తాలోని భారతీయ సంఘం (Indian Association) 1876లో దానిని సురేంద్రనాథ్ బెనర్జీ స్థాపించాడు.
3. భారత జాతీయ కాంగ్రెస్ 1885లో స్థాపించబడింది. ఎ.ఓ. హ్యూమ్ దానిని స్థాపించినాడు. భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వానికి రక్షక కవాటంగా (Safety Valve) హ్యూమ్, కాంగ్రెస్‌ను స్థాపించినాడన్న ఒక సిద్ధాంతం ఉంది.

15.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహన్ బోస్ కలకత్తాలోని భారతీయ సంఘాన్ని స్థాపించారు. ఆ సంఘ ముఖ్య ఆశయాలు, (1) భారతీయుల్లో ఐక్యత నెలకొల్పుట (2) ముఖ్య విషయాలపై ప్రజాభిప్రాయాన్ని నిర్మించుట.

2. భారతీయుల్లో విద్యావంతుల్లో వున్న నిరాశ నుంచి బ్రిటీష్ ప్రభుత్వాన్ని రక్షించడానికే హ్యూమ్ భారత జాతీయ కాంగ్రెస్ నెలకొల్పినాడు అనే ఒక అభిప్రాయం వుంది. దానినే రక్షక కవాట సిద్ధాంతం అంటారు.

II. 1. భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశానికి ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షత వహించాడు. ఆ సమావేశం బొంబాయిలో గోకుల్ దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో జరిగింది.

BRAOU

2. మొదటి జాతీయ కాంగ్రెస్ సమావేశం, ఈ క్రింది విషయాల గురించి తీర్మానాలు చేసింది.
   1. ఇండియా కౌన్సిల్ రద్దు.
   2. భారతీయ పరిపాలనా వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ఒక రాయల్ కమీషన్ నియమించుట.
   3. పరీక్షలకు వయోపరిమితిని పెంచి, పరీక్షలు భారతదేశంలో కూడా నిర్వహించుట.
   4. శాసన సభల్లో ఎన్నికైన సభ్యులకు స్థానాలు కేటాయించారు.

15.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

1. ఇండియన్ అసోసియేషన్ (Indian Association) స్థాపనకు దారితీసిన పరిస్థితులను వివరించి, దాని ఆశయాలను, సాధించిన విజయాలను తెలియజేయండి?
2. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన గురించి రాయండి.
3. 19వ శతాబ్దంలోపు ద్వితీయ భాగంలో భారతదేశంలో జాతీయ భావం వ్యాప్తి చెందడానికి దోహదం చేసిన కారణాలు రాయండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయండి.

1. భారత జాతీయ కాంగ్రెస్‌కు పూర్వం, ఇండియన్ అసోసియేషన్ మినహా, ఉన్న సంఘాల స్వరూపం, ఆశయాలు గురించి క్లుప్తంగా రాయండి.
2. జాతీయ ఉద్యమానికి సురేంద్రనాథ్ బెనర్జీ చేసిన సేవను అంచనా వేయండి.
3. జాతీయ కాంగ్రెస్ ప్రారంభదశలో ఆ సంస్థ పట్ల బ్రిటిష్ ప్రభుత్వం పాటించిన విధానాన్ని చర్చించండి.

15.14 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C : *Constitutional History of Indian National Movement*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra Tripathi & Barun De : *Freedom Struggle*
4. Majumdar, R.C. : *Advanced History of India, Vols. III & IV*
5. Majumdar, R.C : *Three Phases of India's Struggle for Freedom*
6. Perceival Spear : *History of India vol.II*
7. Sumit Sarkar : *Modern India*
8. ఝాన్సీలక్ష్మి,పాటిబండ; వైదేహి, అల్లాడి : భారతదేశ చరిత్ర-సంస్కృతి, ద్వితీయ భాగం, తెలుగు అకాడమి ప్రచురణ
9. వైదేహి, అల్లాడి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (1885-1947)
10. బిపన్ చంద్ర : ఆధునిక భారతదేశం
11. జితేందర్‌రెడ్డి బి. : స్వాతంత్రోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు

BRAOU

భాగం - 16 : భారతదేశ జాతీయోద్యమ తొలి దశ

విషయక్రమం

16.0 లక్ష్యాలు
16.1 పరిచయం
16.2 మితవాద యుగం
16.3 బ్రిటీష్ సామ్రాజ్య ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల విమర్శ
16.3.1 సంపద తరలింపు సిద్ధాంతం
16.4 భారతదేశ జాతీయోద్యమ తొలి దశ - ఒక అంచనా
16.5 రాజకీయ యాచకత్వం
16.6 భారత జాతీయ బీజదశ
16.7 సంగ్రహంగా
16.8 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
16.9 పరీక్ష నమూనా ప్రశ్నలు
16.10 ఉపయుక్త గ్రంథాలు

16.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాల గురించి తెలుసుకోగలగాలి.

1. 1885-1905 మధ్యకాలంలో కాంగ్రెస్ లక్ష్యాలు, అనుసరించిన పద్ధతులు, సాధించిన ఘనకార్యాలు.
2. 1905 తర్వాత అతివాద అభివృద్ధికి కారణాలు
3. మితవాదులు, తీవ్రవాదుల మధ్య భేదాలు

16.1 పరిచయం

19వ శతాబ్దంలో స్వాతంత్ర్య సంగ్రామం మొదలు కానప్పటికీ భారత జాతీయవాద భావాన్ని సృష్టించి, దేశభక్తి స్వేచ్ఛా భావాలను పెంపొందించి రంగాన్ని సిద్ధపరచింది. భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు, కాంగ్రెస్ విశ్వాసపూరిత విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. కాంగ్రెస్ సంస్థలో పెత్తనం చెలాయించిన మితవాద నాయకులు బ్రిటీష్ ప్రజాస్వామ్యమందు అచంచల విశ్వాసాన్ని ప్రకటించారు.

భారత జాతీయ కాంగ్రెస్ ముఖ్య ఆశయాలు మూడు. అవి : (1) ఆంగ్లేయులకు, భారతీయులకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం. (2) భారతదేశంలోని వివిధ వర్గాలను ఒకే సంఘటితమైన జాతిగా రూపొందించడం. (3) దేశ పరిపాలనలో ఎక్కువగా పాల్గొనాలని కోరటం.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన తొలి సంవత్సరాల్లో, ప్రభుత్వ విధానాలను హుందాగా, సరళంగా విమర్శించింది. కాంగ్రెస్ ఆవిర్భవించిన కొత్తలో తీవ్రవాద భావాల సంస్థకాదు. ఈ విధంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావంతో, దేశ స్వాతంత్ర్య సాధనకోసం సంఘటిత మార్గంలో చిన్న ఎత్తున పోరాటం మొదలైంది. ఈ భారత జాతీయ కాంగ్రెస్ 1905 వరకు కార్యక్రమాలు, ఉద్యమం బలపడి, ప్రతిష్ఠను పెంపొందించుకుని, విదేశీ పరిపాలకులకు వ్యతిరేకంగా బలమైన తీవ్రవాద ఉద్యమాలను చేపట్టింది.

BRAOU

16.2 మితవాద యుగం

1885-1905 సంవత్సరాల మధ్య కాలాన్ని మితవాద, జాతీయవాద శకంగా చెప్పవచ్చు. ఈ కాలంలో భారత పాలనా యంత్రాంగంలో అంచెలవారీ సంస్కరణలను ప్రవేశపెట్టాలని అర్థించింది. ఈ కాలంలో మితవాదులు కాంగ్రెస్ సంస్థపై పెత్తనాన్ని చెలాయించారు.

1886 సంవత్సరంలో డిసెంబర్ నెలలో, కలకత్తా నగరంలో, కాంగ్రెస్ రెండవ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దాదాభాయి నౌరోజీ అధ్యక్షత వహించాడు. వివిధ సంస్థలు ఎన్నుకున్న 436 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం నుంచి జాతీయ కాంగ్రెస్ జాతీయతా భావాలు రూపొందించుకున్న సంస్థగా పేరు పొందింది. ఈ సమావేశంలో సురేంద్రనాథ్ బెనర్జీ ప్రముఖ పాత్రను నిర్వహించాడు. కాంగ్రెస్, బెంగాల్‌లో అభివృద్ధి చెందిన భావాలచే ప్రభావితమైంది.

ఇంగ్లండ్, ఇండియాలలో ఒకేసారి సివిల్ సర్వీస్ పరీక్షలు నిర్వహించాలని కాంగ్రెస్ మొదటి సమావేశంలోనే కోరింది. రెండవ సమావేశంలో పరీక్షల నిర్వహణ గురించి కొన్ని వివరాలను రూపొందించడానికి ఒక ఉప సంఘాన్ని నియమించింది. కార్యనిర్వాహకశాఖను న్యాయశాఖ నుంచి విభజించాలని ప్రభుత్వాన్ని కోరుతూ కాంగ్రెస్ తీర్మానించింది.

1887 డిసెంబర్‌లో కాంగ్రెస్ మద్రాసులో సమావేశమైంది. బ్రిటీష్ సార్వభౌమత్వంపట్ల భారతదేశం విశ్వాసాన్ని ప్రకటించడంవల్ల, సైన్యంలో ఉన్నత పదవులకు భారతీయ హక్కులను అంగీకరించమని కోరుతూ, మద్రాస్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించింది. ప్రభుత్వ అతిథి భవనంలో మద్రాస్ గవర్నర్, కాంగ్రెస్ ప్రతినిధులను వన భోజనాని కాహ్వానించాడు. ఈ విధంగా కాంగ్రెస్ అఖిల భారత ప్రాతిపదికపై బలమైన రాజకీయ సంస్థగా క్రమేపీ రూపొందింది. ఆంగ్ల విద్య నభ్యసించిన భారతీయుల రాజకీయ భావాలకు ప్రాధాన్యత నిచ్చి వాటికి నిర్దిష్టమైన రూపురేఖల నిచ్చింది.

ఇంగ్లండ్ సార్వభౌమునిపట్ల అచంచల విశ్వాసం, చట్టబద్ధమైన విధానాల ద్వారా మాత్రమే ఆందోళన నిర్వహించాలనే రెండు స్థిర భావాలతో, కాంగ్రెస్ సంస్థను స్థాపించారు. ఈ కాలంలో కాంగ్రెస్ సంస్థకు నాయకత్వం వహించిన నాయకులు, రాజ్యాంగ పద్ధతుల ద్వారా ఆందోళనను జరిపి తమ రాజకీయ ఆశయాలను సాధించగలమని గట్టిగా నమ్మారు. ఈ నాయకులు బ్రిటీష్ సామ్రాజ్యవాద దుష్పరిణామాలను ఘాటుగా విమర్శించినా బ్రిటీష్ పరిపాలనను మెచ్చుకున్నారు. బ్రిటీష్ షరిపాలన భారతదేశాన్ని పేదరికం నుంచి ఉద్ధరించడానికి వరప్రసాదమని వారు భావించారు. ఈ నాయకులు ఆంగ్లేయుల న్యాయ బుద్ధిని, నిష్పాక్షిక వైఖరిని గుడ్డిగా నమ్మారు. భారతదేశ వివిధ ప్రాంతాల నుంచి ప్రతి సంవత్సరం సమావేశమయ్యే ప్రధాన ప్రతినిధులు, భారతీయ సమైక్యతకు ప్రతీక. ఆంగ్ల విద్యాభ్యాసకులైన భారతీయులలో దేశభక్తిని పెంపొందించి, రాజకీయ చైతన్యాన్ని రేకెత్తించారు.

కాంగ్రెస్ సమావేశాల్లో నాయకులు బ్రిటీష్ ప్రభుత్వ వలస విధానాన్ని ఖండిస్తూ, గంభీరోపన్యాసాలను ఇచ్చారు. బ్రిటీష్ ప్రభుత్వ వలస విధానం ఈ దేశాన్ని పేదరికంలోకి తీసుకుపోతోందని విమర్శించి నివారణా చర్యలు తీసుకోవాలని కోరారు. భారత జాతీయ కాంగ్రెస్ 1880లో, లండన్‌లో ఒక శాఖను తెరచింది. ఈ శాఖ కార్యక్రమాలు బ్రిటీష్ ప్రభుత్వాన్ని ప్రభావితం చేశాయి.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించినప్పుడు మేధావి వర్గం, విద్యావంతులలో ఉన్నత వర్గం, మధ్య తరగతి వర్తక బృందం, దాని ముఖ్య సామాజిక ప్రాతిపదికగా ఏర్పడ్డాయి. కాంగ్రెస్ కార్యక్రమాలు భారతీయ

BRAOU

సమాజంలో ఈ వర్గ ప్రయోజనాలకు దర్పణం. ఉదారవాదులు ప్రాతినిధ్య సంస్థలకు ఎన్నిక సూత్రాన్ని సమర్థించారు. ప్రజలచే ఎన్నికైన ప్రతినిధుల సభను కోరారు. కార్యనిర్వాహక వర్గాన్ని అదుపు చెయ్యాలని కోరారు. ఈవిధంగా కొద్ది సంవత్సరాలలోనే, కాంగ్రెస్ సంస్థ పేరు ప్రఖ్యాతులు నలుదిశలా విస్తరించాయి.

భారత జాతీయ కాంగ్రెస్ అవతరించి, ప్రతిష్ఠను పెంపొందించుకుంటున్నప్పుడు బ్రిటీష్ అధికార వర్గం ఎలా స్పందించిందో పరిశీలిద్దాం. ప్రారంభదశలో కాంగ్రెస్ ప్రతినిధులను వన భోజనాలకు ఆహ్వానించి, గౌరవించారు. కాని ఈ స్నేహపూరిత వాతావరణం ఎక్కువ కాలం కొనసాగలేదు. ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక సంస్థగా కాంగ్రెస్ హక్కును తిరస్కరించాడు, లార్డ్ డఫ్రిన్. అతను కాంగ్రెస్‌ను హేళన చేసాడు.

భారత జాతీయ కాంగ్రెస్, కొద్ది మంది రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయుల చర్చావేదికగా మాత్రమే కొనసాగుతుందని, బ్రిటీష్ అధికార్లు భావించారు. కాని, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు. సమావేశాలను నిర్వహించి, కరపత్రాలను పంచి పెట్టారు. ఈ కొత్త పరిణామాలను బ్రిటీష్ అధికార్లు దేశద్రోహ చర్యగా భావించారు.

జాతీయ ఆర్థిక ఆందోళన, సామ్రాజ్యవాదపు దోపిడి స్వరూపాన్ని బట్టబయలు చేసిందని, ఆచార్య బిపన్ చంద్ర ప్రకటించారు.

అప్పటి నుంచి బ్రిటీష్ అధికార్లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, తీవ్రపదజాలంతో దుష్ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులపట్ల శత్రు భావాన్ని ప్రకటించారు జాతీయ నాయకులను ప్రభుత్వంపైన **"విశ్వాసం లేని బాబుల"**ని, **"రాజద్రోహపూరిత బ్రహ్మల"**ని, **"తీవ్రభావాలుగల దుర్మార్గుల"**ని బ్రిటీష్ అధికార్లు విమర్శించారు. కాంగ్రెస్‌ను దేశద్రోహాన్ని ప్రోత్సహించే సంస్థ అని నిందించారు. కాంగ్రెస్ నాయకులు పదవులను పొందలేక ఆశాభంగం పొంది, అసంతృప్తిచెందిన న్యాయవాదులని, వారు స్వీయ ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని, బ్రిటీష్ అధికారులు ఘాటుగా విమర్శించారు.

"కాంగ్రెస్ పతనం కావడానికి సిద్ధంగా ఉంది. నేను భారతదేశంలో ఉండగానే అది ప్రశాంతంగా కన్ను మూయడానికి సహాయ పడాలని నా కోరిక" అని 1900లో కర్జన్ ప్రకటించాడు.

భారతీయ ప్రజలలో సమైక్యత తమ పరిపాలనకు ప్రమాదాన్ని తెస్తుందని, బ్రిటీష్ అధికార్లు గుర్తించారు. కాంగ్రెస్ సంస్థ ప్రభావాన్ని తగ్గించడానికి, కాంగ్రెస్‌ను బలహీన పరచడానికి, బ్రిటీష్ అధికార్లు **విభజించి పాలించే** విధానాన్ని అనుసరించారు. సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్, బెనారస్ రాజా శివప్రసాద్ ఇంకా ఇతర బ్రిటీష్ అనుకూల శక్తుల చేత కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమాన్ని మొదలు పెట్టించి ప్రోత్సహించారు. ఇది హిందువులకు, మహమ్మదీయులకు మాత్రమే పరిమితం కాలేదు. సనాతనంగా ఫ్యూడల్ వర్గాలను కొత్త మేధావి వర్గానికి వ్యతిరేకంగా వివిధ రాష్ట్రాల, వర్గాల, జాతుల మధ్య వైషమ్యాన్ని పెంచడానికి అధికార వర్గం తీవ్రంగా ప్రయత్నించిందని, ఆచార్య బిపన్ చంద్ర ప్రకటించారు.

16.3 బ్రిటీష్ సామ్రాజ్యవాదం అనుసరించిన ఆర్థిక విధానాలపై విమర్శ

భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపన, దేశ చరిత్రలో పూర్తిగా ఒక కొత్త మలుపును తీసుకొచ్చింది. గతంలో జరిగిన విదేశీ దండయాత్రలతో ఈ మార్పును పోల్చలేము. పూర్వం భారత దేశాన్ని ఆక్రమించిన వాళ్లు, దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థ స్వరూప సమగ్రతను గుర్తించి, ఆ వ్యవస్థలో మౌలికమైన మార్పు చేయలేదు. వాళ్లు భారత ఆర్థిక, రాజకీయ జీవనంలో భాగమై పోయారు. కాని బ్రిటీష్ విజేతలు అలా అని కాకుండా తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. వాళ్ళెన్నడూ భారతీయ జీవనంలో అంతర్భాగం కాలేదు. భారతదేశంలో పరాయివాళ్లుగానే మిగిలిపోయారు.

BRAOU

భారతదేశం సామ్రాజ్యవాద దోపిడీకి నిలయమైంది. ఆంగ్లేయులు శాంతిభద్రతలను నెలకొల్పారు. ప్రాణాలకు, ఆస్తికి, రక్షణ కల్పించారు. కాని వారు కల్పించిన శాంతి, స్మశానంలో నిశ్శబ్దం లాంటిది. బ్రిటీష్ సామ్రాజ్యవాద విజృంభణ ప్రగతి, జాతీయ జీవన సరళిలో విప్లవాత్మకమైన మార్పులను తెచ్చింది.

సామ్రాజ్యవాద దగాకోరు ఆర్థిక విధానాన్ని ప్రజలకు అర్థమయ్యే ధోరణిలో విమర్శించడం, అనాటి జాతీయవాదుల ప్రధాన రాజకీయ కార్యక్రమం. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు వ్యాపారం, పరిశ్రమలు, పెట్టుబడి విధానాల ద్వారా ఒక నిర్ణీత వ్యూహం ప్రకారం దేశాన్ని కొల్లగొట్టారు. రాజకీయ, పరిపాలనా సమైక్యతవల్ల భారత ఆర్థిక వ్యవస్థపై వారు పూర్తి అజమాయిషీని సాధించి, ఆర్థిక శక్తులను స్వప్రయోజనాలకు ఉపయోగించుకోగలిగారు. బ్రిటీష్ ఆర్థిక వ్యవస్థకు, భారతీయ ఆర్థిక వ్యవస్థను గులాముగా చేయుటే బ్రిటీష్ ఆర్థిక సామ్రాజ్యవాద సారాంశమని, జాతీయ నాయకులు స్పష్టం చేశారు.

బ్రిటన్ భారతదేశాన్ని ముడిపదార్థాలు సరఫరా చేసే దేశంగా, బ్రిటీష్ వస్తువులకు విపణి వీధిగా, బ్రిటీష్ పెట్టుబడులకు సుక్షేత్రంగా చేసే విధానాన్ని, జాతీయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. బ్రిటీష్ పాలకుల కొల్లగొట్టే విధానంవల్ల, భారతదేశం తన ప్రత్యేకతను పూర్తిగా కోల్పోయి, బ్రిటీష్ ఆర్థిక వ్యవస్థకు అనుబంధమైంది.

బ్రిటీష్ పరిపాలన *'శాశ్వతంగా పాతుకుపోయి, నిత్యమూ పెరుగుతూపోయే ఒక విదేశ దురాక్రమణ'* అని దాదాభాయి నౌరోజీ ప్రకటించారు. బ్రిటీష్ పరిపాలన ఈ దేశాన్ని నిదానంగా సర్వనాశనం చేస్తోంది. ప్రభుత్వ ఆర్థిక విధానం సనాతన భారతీయ హస్తకళను ధ్వంసం చేసిందని, జాతీయ నాయకులు స్పష్టీకరించారు. నడిచే యంత్రాలమీద అతి పెద్ద యెత్తున తయారైన మన వస్తువులు, పోటీకి నిలవలేకపోయాయి. చేతివృత్తుల పతనంవల్ల, పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్య తలెత్తింది. భారతీయ రైల్వేలలో, తేయాకు తోటల్లో పరిశ్రమలలో, విదేశీ పెట్టుబడి దిగుమతి విధానాన్ని ఈ నాయకులు వ్యతిరేకించారు.

స్వదేశీ పరిశ్రమ విధ్వంసానికి జాతీయవాదులు బ్రిటీష్ వాళ్లను నిందించారు. ప్రభుత్వ విధానంవల్ల, స్వదేశీ పెట్టుబడిని అణచివేయడం జరుగుతుందని, భారత ఆర్థిక, రాజకీయ వ్యవస్థపై బ్రిటన్ ప్రభావం ఇంకా ఎక్కువౌతుందని ఈ నాయకులు భావించారు. విదేశీ పెట్టుబడిని నిరోధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని రంగాలలో భారతీయ జీవన ఆధునికీకరణ ఆవశ్యకతను వివరించారు. పేదరికాన్ని అంతమొందించడానికి ఆధునిక పరిశ్రమలను పెంపొందించాలన్నారు. సత్వర ఆధునికీకరణకు ప్రభుత్వ సహాయం అవసరం కనుక దేశం త్వరితంగా పారిశ్రామికాభివృద్ధి చెందడానికి ప్రభుత్వ సహాయాన్ని కోరారు. కొత్తగా ఏర్పాటుచేసిన పరిశ్రమలకు రక్షణ కల్పించడానికి, టారిఫ్ (Tariff) రక్షణ ఇవ్వవలసిందని అర్థించారు. స్వదేశీ పెట్టుబడిదారులు ఉక్కు, గనుల రంగాలలో పరిశ్రమలను స్థాపించలేరు కనుక, ఈ రంగాలలో ప్రభుత్వాన్ని పరిశ్రమలు స్థాపించమని అర్థించారు.

ప్రభుత్వ టారిఫ్ రక్షణ విధానం, భారతీయ పరిశ్రమల అభివృద్ధిని కుంటుపరచింది. భారతీయ పరిశ్రమలను అణచి వెయ్యాలనే ప్రధానాశయంతో బ్రిటీష్‌వారు తమ వ్యాపార విధానాలను రూపొందించారు. జాతీయవాదులు అఖిల భారత ప్రాతిపదికపై 1857-80ల మధ్య దిగుమతులపై టారిఫ్ పన్నుల రద్దుకు వ్యతిరేకంగా 1849-96 మధ్య నూలు వస్త్రాలపై ఎగుమతి సుంకానికి వ్యతిరేకంగా ఉధృతమైన ఆందోళనోద్యమాన్ని కొనసాగించారు.

దేశ నాయకులు భూమిశిస్తును తగ్గించాలని ఎడతెగకుండా ఆందోళనను కొనసాగించారు. తేయాకు తోటల్లో పనిచేసే కూలీల జీవన పరిస్థితుల మెరుగుదలకోసం వారు ఆందోళన చేసారు. పేదవారిని, మధ్య తరగతి వర్గంలో పేదవారిని వేధిస్తున్న ఉప్పుపై పన్నును, ఇతర పన్నులను రద్దు చేయాలని కోరారు. ముడి

BRAOU

పదార్థాల ఎగుమతిని, విదేశీ తయారీ వస్తువుల దిగుమతిని ప్రోత్సహించిన ప్రభుత్వ విదేశీ వాణిజ్య విధానాన్ని, రైలు మార్గాల అభివృద్ధిని, ఈ నాయకులు విమర్శించారు. అంతరంగిక ఆర్థికాభివృద్ధికి, వాణిజ్య రవాణా విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

16.3.1 సంపద తరలింపు సిద్ధాంతం (Drain theory)

సామ్రాజ్యవాద వ్యతిరేక విమర్శలో జాతీయ వాదుల ప్రధాన ఆయుధం, సంపద తరలింపు సిద్ధాంతం. భారతదేశ సంపద బ్రిటీష్ విధానంవల్ల ఇంగ్లండ్‌కు తరలిపోతుందని వివరించిన మొదటి భారతీయ నాయకుడు, దాదాభాయి నౌరోజియే అని చెప్పవచ్చు. ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడంలో దాదాభాయి నౌరోజీ తన జీవిత సర్వస్వాన్ని ధారపోశాడు. బ్రిటీష్ పరిపాలనా దమనకాండకు ప్రధాన కారణం, సంపద తరలింపు విధానమని ఆయన భావించారు. ఆయన తన అభిప్రాయాలను 'Poverty and Un-British Rule in India' అనే గ్రంథంలో ప్రకటించారు. భారతదేశం అనేక విధాల, బాధలు పడుతోందని, పేదరికంలో మ్రగ్గుతోందని, నౌరోజీ ప్రకటించారు.

భారతదేశం నుంచి సంపద ఇంగ్లండుకు నిరంతరం తరలుతోందని, ఈ సిద్ధాంతం వివరించింది. భారతదేశం దిగుమతులను ఎక్కువగా చేసుకోవడంవల్ల అంటే విదేశీ వ్యాపారంలో లోటువల్ల సంపద తరలిపోతోంది. భారతదేశం నుంచి ఎక్కువ పెట్టుబడి మొత్తాలు, సంపద, ఇంగ్లండుకు ఎగుమతి అయ్యాయి. భారతదేశానికి దీనివల్ల ఎలాంటి ప్రతిఫలం లభించలేదు. ఋణాలపై వడ్డీ కాని, మనదేశంలో బ్రిటీష్ పెట్టుబడిలో వాటాకానీ లభించలేదు. ఎలాంటి ప్రతిఫలం లభించకపోగా, భారతదేశంలో పనిచేస్తున్న బ్రిటీష్ పౌర, సైనికాధికారుల జీతభత్యాలకు, ఉపకారవేతనాలకు అయ్యే ఖర్చునంతా మనదేశమే భరించాలి.

తరలింపు సిద్ధాంత దుష్పరిణామాలను రనడే, రమేశ్ చంద్ర దత్ వంటి ప్రఖ్యాత నాయకులు సూచించారు. తొలి జాతీయ వాదులు సంపద తరలింపు విధానాన్ని ఘాటుగా విమర్శించి, సామాన్య మానవునికి వలస రాజ్యాల దోపిడీ స్వభావం తేలికగా అర్థం అయ్యేలా వివరించారు. బ్రిటీష్ విధానంవల్ల ఆర్థికంగా దేశం వెనుకబడింది. అభివృద్ధి వేగం పడిపోయింది, దేశం పేదదైంది.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. తమ లక్ష్యాలను సాధించటానికి మితవాదులు పాటించిన పద్ధతులేవి?

.....

.....

.....

.....

2. ఆర్థికరంగంలో మితవాదులు చేసిన ముఖ్యసేవ ఏది?

.....

.....

.....

.....

3. సంపద తరలింపు సిద్ధాంతం (Drain Theory) అర్థమేమి?

.....

.....

.....

.....

BPAOU

16.4 భారతదేశ జాతీయోద్యమ తొలిదశ - ఒక అంచనా

1885 సం॥ నుంచి 1905 సం॥ వరకు విస్తరించిన భారత జాతీయ ఉద్యమాన్ని తొలిదశగా వర్ణించవచ్చును. ఈ ప్రథమ భాగాన్ని **'ఉదార జాతీయతా'** కాలంగా వర్ణిస్తారు. ఈ కాలంలోనే **భారత జాతీయత** అనే ఆశయం ఆవిర్భవించి దేశప్రజలలో దేశభక్తి, స్వేచ్ఛలపై మక్కువ, అభివృద్ధి చెందటానికి తోడ్పడింది. భారత జాతీయోద్యమం ప్రారంభ దశలో ఆచితూచి చిన్న ఎత్తున హడావుడి లేకుండా ప్రారంభమైనా, పోను పోను పటిష్ఠమైంది. జాతీయోద్యమ తొలిదశలో - మితవాదులు ముఖ్యపాత్ర వహించారు.

19వ శతాబ్దంలో మొదటి సారిగా ఆర్థిక విమర్శనాత్మక సిద్ధాంతాన్ని రూపొందించిన ఘనత మితవాదులకే దక్కుతుంది. ఈ విమర్శనాత్మక ఆర్థిక సిద్ధాంతం, భారతదేశంలో జాతీయోద్యమ పురోగతికి ఎంతగానో తోడ్పడిందని పేర్కొనవచ్చును. మితవాదులు ప్రారంభంలో ఆంగ్లేయ పాలన ఎడల అనుకూల దృక్పథాన్ని పాటించారు. దానికి కారణం బ్రిటీష్‌వారు భారతదేశ ఆధునికీకరణకు సహాయపడతారనీ తమ శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానంతో వారు భారతదేశంలోని ఉత్పత్తి వ్యవస్థలను అభివృద్ధి చేస్తారని ఆశించారు. 'వలస పాలనా విధానం' లోని లోపాలపై మితవాదులకు పూర్తి అవగాహన వుంది. అయినా బ్రిటీష్‌వారు విజ్ఞతతో, భారతదేశ పునర్నిర్మాణానికి, సహాయపడతారని ఆశించారు. చివరకు 'ఆంగ్లేయుల పాలనలో భారతదేశ ఆర్థిక పురోగతి కుంటుపడిందనే' వాస్తవాన్ని మితవాదులు గ్రహించారు.

జాతీయనాయకులైన దాదాభాయి నౌరోజీ, గోవింద రనడే, ఆర్.సి. దత్ మొదలగు వారు బ్రిటీష్‌వారి ఆర్థిక విధానాలు, వలస పాలనా పద్ధతులు, మన దేశ ఆర్థిక పురోగతికి ముఖ్య అడ్డంకులు అని వ్యాఖ్యానించారు. బ్రిటీష్‌వారి సామ్రాజ్యవాద ముఖ్య లక్షణం "భారతదేశ ఆర్థికవ్యవస్థను బలహీనపర్చడమే" అనివారు అభిప్రాయ పడ్డారు. భారతదేశాన్ని ముడిసరుకులు, ఆహారపదార్థాలు ఎగుమతి చేసే దేశంగా విదేశీ పెట్టుబడులకు అనువైన కేంద్రంగా మార్చడమే బ్రిటీష్ పాలన లక్ష్యమని అభిప్రాయం వ్యక్తంచేశారు.

అందుచేత జాతీయ ఉద్యమంలో ప్రారంభ దశకు చెందిన నాయకులు జాతీయ ఆర్థిక పోరాటాన్ని నిర్వహించారు. బ్రిటీష్‌వారి పాలనలో మనదేశం నిరుపేద దేశంగా మార్చివేయబడిందనీ, అందుచేత ఆధునిక సాంకేతిక, శాస్త్రీయ విజ్ఞాన సహాయంతో భారతదేశ ఆర్థిక స్వరూపాన్ని మార్చడమే తమ లక్ష్యంగా మితవాద నాయకులు ప్రకటించారు. భారతదేశం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా, అభివృద్ధి సాధిస్తే దేశంలోగల, భిన్న దృక్పథాలు గల భారతీయులు, ఏకజాతిగా రూపొందేందుకు దోహదం చేస్తుందని వారి అభిప్రాయం.

ఈ కారణంగా మితవాద నాయకులు మనదేశం యొక్క పారిశ్రామిక ప్రగతి, స్వదేశీ పెట్టుబడులతో సాధించాలని ఆశించారు. దానికి కారణం విదేశీ పెట్టుబడులు భారతదేశాన్ని ఆర్థిక పరమైన దోపిడీకి గురిచేసి మన దేశం నిరుపేద దేశంగా మార్చి వేసిందని వారు విశ్వసించారు. అందుచేత మితవాద నాయకులు బ్రిటీష్ పాలకులు ఏవిధంగా స్వదేశీ పరిశ్రమలను నాశనం చేశారో ప్రజలకు తెలియజేసారు. 'స్వేచ్ఛా వ్యాపార పద్ధతి' మనదేశం సత్వరంగా పారిశ్రామిక పురోగతికి అడ్డుగోడగా వుందని దానిని వారు వ్యతిరేకించారు.

వలస పాలనపై మితవాద నాయకులు **డ్రెయిన్ సిద్ధాంతం** (Drain Theory) రూపొందించారు. ఈ సిద్ధాంత రూపకర్త దాదాభాయి నౌరోజీ. బ్రిటీష్‌వారు మనదేశంలో అనుసరించిన ఆర్థిక విధానాలు, మనదేశ వనరులన్నింటిని తమ దేశానికి తరలించి, భారతదేశాన్ని ఒక నిర్జీవ దేశంగా మార్చడానికి రూపొందించ బడ్డాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుచేత దాదాభాయి నౌరోజీ **"భారత ఆర్థిక వనరుల దోపిడీ - తరలింపు"** నకు వ్యతిరేకంగా ఒక ఉద్యమం నిర్వహించాడు. ఆర్.సి. దత్ కూడ "బ్రిటీష్‌వారి ఆర్థిక దోపిడీ విధానంవల్లనే ప్రపంచంలో అతి సంపన్నమైన భారత దేశాన్ని క్లామాలకు నిలయంగా మార్చివేయబడిందని" విమర్శించారు. ఈ విధంగా మితవాద నాయకులు సామ్రాజ్యవాద దేశాల లోపాలను ప్రజలకు తెలియజేయడంలో సఫలీకృతులయ్యారు.

BRAOU

బ్రిటీష్ పాలకులు ఉదారులనీ, వారి పాలన మనదేశానికి భద్రత, రక్షణ కల్పించస్తుందని కొందరు జాతీయ నాయకులు చేసిన వాదాన్ని దాదాభాయి నౌరోజీ నిశితంగా విమర్శించారు. పెట్టుబడుల ద్వారా దోచుకొని బడుగుదేశంగా దిగజారడానికి కారకులయ్యారని నౌరోజీ వాదం.

ప్రారంభంలో మితవాదనాయకులు ఆంగ్లేయుల పాలనకు రాజకీయంగా విధేయులైన ఉద్యమ తొలిదశలోనే అసంతృప్తికి, అవిధేయతకు తిరుగుబాట్లకు బీజాలు వేసి మితవాదులే బ్రిటీష్ సామ్రాజ్య పునాదులపై గొడ్డలిపెట్టు వేశారని కొందరు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

అందుచేత 1885-1905 సం॥ల మధ్యకాలాన్ని జాతీయోద్యమంలో "జాతీయదృక్పథ విస్తరణ"కు తోడ్పడిన 'మేధావుల అలజడి' కాలంగా అభివర్ణిస్తారు. క్లుప్తంగా జాతీయోద్యమంలో తొలిదశకు చెందిన జాతీయనాయకులు "జాతీయోద్యమం, పురోభివృద్ధి సాధించడానికి కావలసిన పటిష్టమైన శాశ్వత పునాదిని వేయడంలో సఫలీకృతులైనా"రని చెప్పవచ్చును.

16.5 రాజకీయ యాచకత్వం

భారత జాతీయ కాంగ్రెస్‌పై పెత్తనాన్ని చెలాయించిన మితవాద నాయకులు, కాంగ్రెస్ సమావేశాలను ప్రతి సంవత్సరం నిర్వహించి దేశ రాజకీయ, ఆర్థిక పరిపాలనా సమస్యల గురించి తీర్మానాలను ఆమోదించారు. బ్రిటీష్‌వారి న్యాయవైఖరిపై అచంచల విశ్వాసం, బ్రిటీష్ రాజకీయ భావాల ఆరాధన ఆధారంగా చట్టబద్ధమైన ఆందోళనను ప్రారంభించారు. వారి నాయకత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ పాశ్చాత్య భావాలవల్ల ప్రభావితమైంది. పరిపాలనా రంగంలో సంస్కరణలను కాంగ్రెస్ కోరింది. ఈ సంస్కరణలవల్ల విద్యావంతులకు అవకాశాలు లభిస్తాయని భావించారు. మితవాద నాయకులు భావుకులే కాని, కార్యవాదులు కాదు. ప్రతినిధి వర్గాలను తీసుకువెళ్ళి విజ్ఞాపనా పత్రాలను సమర్పించి, తమ కోర్కెలు న్యాయమైనవని ప్రభుత్వాన్ని నమ్మించడానికి ప్రయత్నించారు. ఈ విధానాన్నే "రాజకీయ యాచకత్వ"మని వేళాకోళం చేశారు. ఏవో కొద్ది రాయితీలను సంపాదించడానికి విజ్ఞాపనలను చేయగా, దానినే బిచ్చమెత్తినట్లు వెటకారం చేశారు. వారు ప్రభుత్వంతో సంఘర్షణ అంటే భయపడ్డారు. చట్టబద్ధమైన పద్ధతులను అనుసరించి, అంచెలంచెలపై సంస్కరణలను సాధించాలన్నదే వారి విధానం.

16.6 భారత జాతీయ బీజదశ

1885-1905 మధ్యకాలంలో భారత జాతీయత మొలకెత్తింది. ఎన్నో లోపాలున్నప్పటికీ ఈ జాతీయవాదులు జాతీయోద్యమం బలపడడానికి గట్టి పునాదులు వేశారు.

ఈ యాచకత్వ విధానాన్ని లాల్-బాల్-పాల్ ఘాటుగా విమర్శించారు. వేదికలపై ఉపన్యాసా లివ్వడంవల్ల తీర్మానాలను ఆమోదించడంవల్ల బ్రిటీష్‌వారు భారతీయులకు అధికారాన్ని బదలాయించరని, తీవ్రవాద నాయకులు స్పష్టంచేశారు. మంత్రాలకు చింతకాయలు రాలవన్నారు. బ్రిటీష్‌వారి అదుపులో మాత్రమే భారతదేశం ప్రగతి సాధిస్తుందనే భావాన్ని ఒప్పుకోలేదు. వారు విదేశీ పరిపాలనను తీవ్రంగా ద్వేషించారు. జాతీయోద్యమ లక్ష్యం, 'స్వరాజ్' లేదా 'స్వాతంత్ర్యం' అని స్పష్టంగా ప్రకటించారు.

బెంగాల్‌లో బంకించంద్ర చటర్జీ, సంవత్సరానికి మూడురోజులు సమావేశం జరిపే కాంగ్రెస్ సంస్థ యొక్క యాచకత్వ విధానాన్ని అపహాస్యం చేస్తూ తీవ్ర పదజాలంతో వ్రాశాడు. చాలా వ్యాసాలలో అరవిందఘోష్ కూడా భారత జాతీయ కాంగ్రెస్‌ను ఘాటుగా విమర్శించాడు.

BRAOU

మితవాదులు అనుసరించిన యాచకత్వ విధానాన్ని తిలక్ తీవ్రంగా విమర్శించాడు. 1896లో 'కేసరి' లో వ్రాసిన వ్యాసంలో కాంగ్రెస్ నాయకులు గత 12 సంవత్సరాలుగా గొంతుకలు పోయేటట్లు కేకలు పెట్టినా (అరిచినా) ప్రభుత్వంపై ఏ మాత్రం ప్రభావాన్ని కనపరచ లేకపోయారని విమర్శించాడు. కప్పలు బెకబెకమన్నట్లే తప్ప, ఎలాంటి ఫలితం లేదన్నాడు. చట్టబద్ధమైన ఆందోళనా కార్యక్రమాన్ని అమలు జరపాలని భావించాడు తిలక్, బిపిన్ చంద్రపాల్, లజపతిరాయ్ మొదలైన నాయకులు సంస్కరణలను పొందడానికి యాచకత్వ విధానాన్ని వ్యతిరేకించారు. ప్రజాబలంతో, హక్కుల కోసం పోరాడాలని నిశ్చయించారు.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. 1885-1905 మధ్య కాలాన్ని ఏమని పిలుస్తారు?

.....

.....

.....

.....

2. 20వ శతాబ్దపు ప్రారంభంలో వున్న ఇద్దరు ముఖ్యమైన తీవ్రవాద నాయకులెవరు?

.....

.....

.....

.....

16.7 సంగ్రహంగా

1. 1885, 1905 మధ్య ప్రాంతంలో కాంగ్రెస్ మితవాదుల సంస్థ. ఆకాలంలో కాంగ్రెస్ లక్ష్యాలు, పద్ధతులు మితవాదానికి సంబంధించినవి. ఆ కాలం రాజకీయ యాచకత్వపు కాలం.
2. తొలి జాతీయవాదులు సాధించిన ముఖ్యమైన ఘనకార్యం బ్రిటీష్ సామ్రాజ్య ప్రభుత్వ ఆర్థిక విధానాల విమర్శ.
3. మితవాదులపట్ల అనేకమంది భారతీయ విద్యావంతులకు అసంతృప్తి ఏర్పడడంవల్ల, 20వ శతాబ్దపు ప్రారంభంలో అతివాదులకు ప్రాముఖ్యత లభించింది.
4. 1885 నుంచి 1905 మధ్య కాలాన్ని భారత జాతీయ బీజకాలంగా వర్ణించవచ్చు.

16.8 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I
1) మితవాదులు తమ లక్ష్యాల సాధనకు పూర్తిగా శాంతియుత, రాజ్యాంగబద్ధమైన పద్ధతుల నవలంబించినారు.
2) ఆర్థిక రంగంలో బ్రిటీష్ ప్రభుత్వపు దోపిడీ విధానాలను బట్టబయలు చేయడమే మితవాదులు చేసిన అత్యంత విశిష్టమైన సేవ.
3) భారతదేశం నుంచి సంపదను బ్రిటీష్‌వారు తమ దేశానికి తరలించడంవల్ల భారతదేశం పేదరికంగా మారింది అన్నదే 'సంపద తరలింపు' సిద్ధాంత సారాంశం.

II
1) 1885-1905 మధ్య కాలాన్ని జాతీయ దృక్పథ విస్తరణకు తోడ్పడిన మేధావుల అలజడి కాలంగా పిలుస్తారు.
2) 20వ శతాబ్ది ప్రారంభంలో, బాలగంగాధర్ తిలక్, అరబిందో, అతివాదులలోని ముఖ్య నాయకులు.

BRAOU

16.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) మితవాద నాయకుల ఆధ్వర్యంలో భారత జాతీయ కాంగ్రెస్ స్వభావాన్ని, ఆశయాన్ని, పద్ధతులను వివరించండి.

2) 19వ శతాబ్ది చివరి భాగంలో బ్రిటీష్ సామ్రాజ్యవాద ఆర్థిక విధానంపై తలెత్తిన విమర్శ ప్రధాన అంశాలను వివరించండి.

3) భారత జాతీయవాద, మితవాద దిశలో జరిగిన రాజ్యాంగ పరిణామాలు ఏవి? 1892 కౌన్సిళ్ళ ప్రధాన లక్షణాలను వివరించండి.

4) 20వ శతాబ్ది ప్రారంభంలో తీవ్రవాద జాతీయవాదం విజృంభణకు గల కారణాలేవి?

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) "1885 నుంచి 1905 వరకు భారత జాతీయ వాదం అంకురార్పణకాలం" - వ్యాఖ్యానించండి.

2) దాదాభాయ్ నౌరోజీ సంపద తరలింపు సిద్ధాంతాన్ని గురించి రాయండి.

3) భారత స్వాతంత్ర్య పోరాటానికి. బాలగంగాధర్ తిలక్ చేసిన సేవలెట్టివి?

4) భారత జాతీయోద్యమానికి అరవింద ఘోష్ చేసిన సేవ వివరించండి?

5) "మితవాదులందరూ ఆదర్శాలు వల్లించేవారేగాని కార్యశూరులుకారు". పరిశీలించండి.

16.10 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, E.C. : *Constitutional History of Indian National Movement*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra Tripathi & Barun De : *Freedom Struggle*
4. Majumdar, R.C. : *Advanced History of India, Vols. III & IV*
5. Majumdar, R.C. : *Three Phases of India's Struggle for Freedom*
6. Perceival Spear : *History of India Vol.II.*
7. Sumit Sarkar : *Modern India.*
8. ఝాన్సీలక్ష్మి, పాటిబండ; వైదేహి, అల్లాడి : భారతదేశ చరిత్ర-సంస్కృతి, ద్వితీయ భాగం. తెలుగు అకాడమి ప్రచురణ
9. వైదేహి, అల్లాడి : భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947)
10. బిపన్ చంద్ర : ఆధునిక భారతదేశం
11. జితేందర్ రెడ్డి బి. : స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు.

BRAOU

భాగం - 17 : తీవ్రవాద జాతీయోద్యమ విజృంభణ, కార్యక్రమాలు

విషయక్రమం

17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 తీవ్రవాద మితవాదుల మధ్య భేదాలు

17.3 ప్రజల సమీకరణ

17.4 బెంగాల్ విభజన

17.5 బ్రిటీష్ వస్తువుల బహిష్కరణ

17.6 స్వదేశీ ఉద్యమ వ్యాప్తి

17.7 విప్లవ జాతీయవాదులు

17.7.1 లాల్, బాల్, పాల్

17.7.2 విదేశాల్లో భారతీయ విప్లవ వాదులు

17.7.2.1 ఒబైదుల్లా

17.7.2.2 బర్కతుల్లా

17.7.2.3 రాజా మహేంద్ర ప్రతాప్

17.7.2.4 మాడమ్ కామా, 1861-1936

17.7.2.5 లాలా హరదయాళ్, 1884-1939

17.7.2.6 వీరేంద్రనాథ ఛటోపాధ్యాయ, 1878-1946

17.7.2.7 చంపక రామన్ పిళ్ళై, 1891-1934

17.7.2.8 గాడిచర్ల హరిసర్వోత్తమరావు, 1883-1960

17.7.2.9 గదర్ పార్టీ

17.7.2.9.1 దరిశి చెంచయ్య

17.7.2.10 కామాగటమారు ఉదంతం

17.7.2.11 జతిన్ ముఖర్జీ

17.7.3 తీవ్రవాద ఆవిర్భావం

17.7.3.1 కారణాలు

17.7.3.2 లోకమాన్య బాలగంగాధర తిలక్

17.7.3.3 అరబిందో, 1872-1950

17.7.3.4 పునరుద్ధరణ స్వభావం

17.8 ఉగ్రవాదుల కార్యక్రమాలు

17.9 సూరత్ చీలిక

17.10 చీలిక తరవాత

17.11 సంగ్రహంగా

17.12 మీ అవగాహన పరీక్షించుకోండి-జవాబులు

17.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

17.14 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

17.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. మితవాదులు, అతివాదుల మధ్య భేదాలు
2. బెంగాల్ విభజన, స్వదేశీ ఉద్యమ వ్యాప్తి
3. విప్లవవాదుల కార్యక్రమాలు
4. భారతదేశం ఆవల విప్లవవాదుల కార్యక్రమాలు
5. సూరత్ చీలిక

17.1 పరిచయం

19వ శతాబ్దాంతం నాటికి లాలా లజపతి రాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్‌ల పటిష్ఠమైన నాయకత్వంలో తీవ్రవాద జాతీయోద్యమం భారత రాజకీయాలలో ఒక శక్తివంతమైన సాధనంగా రూపుదిద్దుకుంది. 1906 నుంచి 1920 వరకు కొనసాగిన జాతీయోద్యమ రెండవ దశను మామూలుగా సమరశీల జాతీయోద్యమం, లేదా తీవ్రవాద జాతీయోద్యమ కాలంగా పిలవడం పరిపాటి. ఈ కాలంలోనే కాంగ్రెస్ తీవ్రవాద కార్యక్రమాలను చేపట్టింది.

17.2 తీవ్రవాద, మితవాదుల మధ్య భేదాలు

తీవ్రవాదులు బ్రిటీష్ పరిపాలనను వ్యతిరేకించారు. కాంగ్రెస్ ఆందోళనతోకూడిన కార్యక్రమాన్ని అనుసరిస్తే తప్ప, బ్రిటీష్ పరిపాలకులు అధికారాన్ని వదలుకోరని తీవ్రవాదులు నమ్మారు. వారు స్వరాజ్యాన్ని, రాజకీయ స్వేచ్ఛను కోరారు. ప్రభుత్వంపై ఆర్థికపరంగా ఒత్తిడిని తీసుకురావడానికి స్వదేశీ దృక్పథాన్ని ప్రోత్సహించారు. బ్రిటీష్ వస్తువుల బహిష్కరణను సమర్థించారు. ఈ నాయకులు 'స్వరాజ్' ను గాఢంగా సమర్థించారు. ప్రతి దేశానికి స్వేచ్ఛపొందే హక్కు ఉందని భావించి, బ్రిటీష్ పరిపాలన నుంచి స్వేచ్ఛను సాధించాలని తీవ్రంగా భావించారు. సైనిక తిరుగుబాటు ఆచరణ సాధ్యం కాదు. కనుక ఈ నాయకులు సహాయ నిరాకరణోద్యమాన్ని సమర్థించారు. కొద్దిమంది ఎదిరిస్తే ఏమీ లాభంలేదని నాయకులు గుర్తించి, సామూహికంగా ప్రజలు ఉద్యమంలో పాల్గొని ప్రతిఘటించాలని భావించారు. ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తించడానికి, నాయకులు ఈ ఉద్యమానికి మత ఛాయను ఆపాదించారు. మాతృభూమిని దేవతగా ఆరాధించడానికి, బంకించంద్రుని **'వందేమాతరం'** గేయాన్ని ప్రార్థనా గీతంగా ఉపయోగించారు.

తీవ్రవాదులు రాజకీయ యాచకత్వ విధానాన్ని వ్యతిరేకించారు. బ్రిటీషు ప్రభుత్వం భారతదేశంలో అనుసరించిన ఆర్థిక దోపిడి విధానాన్ని గర్హించి, విదేశీ వస్తు బహిష్కరణను సూచించారు.

మితవాదులు బ్రిటీష్ ప్రజాస్వామ్యంపట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటించారు. సాంఘిక, సాంస్కృతిక రంగాలలో వెనుకబడిన భారతీయుల అభివృద్ధికి ప్రాతినిధ్య ప్రభుత్వ నిర్వహణకు తర్ఫీదు ఇవ్వడానికి బ్రిటన్ మార్గదర్శకం కావాలని భావించి, బ్రిటన్‌ను ఆదర్శప్రాయంగా పరిగణించారు. భారతదేశంలోని ఉదారవాదులు తమ దేశ ప్రయోజనాలు, బ్రిటన్ ప్రయోజనాలు, ఉమ్మడి ప్రయోజనాలే కాని, పరస్పరం వ్యతిరేకమైనవి కావని భావించారు. అందువల్ల వారు బ్రిటీషు ప్రభుత్వంపట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారు. మితవాదుల నాయకత్వంలో కాంగ్రెస్ సామాన్య ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహించలేదు, వారి కష్టాలను గురించి మాత్రం వ్యాఖ్యానించింది. మితవాదులు క్రమబద్ధమైన అభివృద్ధినే విశ్వసించారు. విప్లవాత్మకమైన మార్పులను

వ్యతిరేకించారు. క్రమబద్ధమైన అభివృద్ధిని విశ్వసించడంచేత విప్లవాత్మకమైన పరిణామాలను, హఠాత్తుగా జరిగే మార్పులను, తీవ్రవాద భావాలపై ఆధారపడిన పోరాటాలను తిరస్కరించారు.

మితవాదులకు, తీవ్రవాదులకు మధ్య ఆశయాల్లో, ఆచరణలో తేడాలను పరిశీలిద్దాం. మౌలికాంశాలలో ఈ రెండు వర్గాలవారు విభేదించారు. రెండు విషయాల్లో భేదాభిప్రాయాలను స్పష్టంగా చెప్పవచ్చు. రాజకీయ ఆశయం, ఆశయసాధనకు అనుసరించ వలసినమార్గం. ఆశయం గురించి తిలక్ ఒకే వాక్యంలో స్పష్టంగా చెప్పాడు "స్వరాజ్యం నా జన్మహక్కు, దానిని పొంది తీరుతాను". తీవ్రవాదుల దృష్టిలో స్వరాజ్యం అంటే, బ్రిటీష్ పరిపాలనపై ఆధారపడకుండ స్వాతంత్ర్యం సాధించడం.

కాని మితవాదులు చాలాకాలం బ్రిటీష్ పరిపాలనకు ప్రత్యామ్నాయం లేదని ప్రగాఢంగా విశ్వసించారు. "పిచ్చాసుపత్రుల వెలుపల ఉన్న పిచ్చివారు మాత్రమే స్వాతంత్ర్యం గురించి ఆలోచిస్తారని, మాట్లాడుతారని" ప్రముఖ మితవాద నాయకుడు గోఖలే చెప్పాడు. భారతీయులు చాలా రంగాలలో వెనుకబడి ఉండడం చేత, స్వపరిపాలనలో వారికి శిక్షణ లేకపోవడంవల్ల మితవాదులు ఈ అభిప్రాయానికి వచ్చారు.

తీవ్రవాద నాయకులు విజ్ఞాపనా పత్రాలను సమర్పించడం పిచ్చి పద్ధతని భావించి, శాంతియుత ప్రతిఘటనా విధానాన్ని కార్యక్రమంగా నిర్ణయించారు. బ్రిటీష్‌వారి ప్రయోజనాలను దెబ్బతీయడానికి ఆర్థిక బహిష్కరణను బలమైన ఆయుధంగా భావించారు. సామాన్య ప్రజానీకం శక్తిలో ఈ నాయకులకు అచంచల విశ్వాసం ఉంది. సామూహికోద్యమాల ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించడానికి సిద్ధమైనారు.

తీవ్రవాద నాయకులు వేద సంస్కృతీ అధిక్యతను, ఉజ్వలమైన ప్రాచీన చరిత్రను గురించి ప్రజలకు తెలిపారు. వారి ప్రబోధనలవల్ల పౌరుష ప్రధానమైన జాతీయ భావం పెంపొందింది. ఈ నాయకులు దేశ ప్రజానీకంలో భవిష్యత్తుపట్ల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింప చేసారు. ప్రాచీన హిందూమతంవల్ల ప్రభావితుడై తిలక్, జాతీయవాదానికి చైతన్యవంతమైన తత్వాన్ని అందించడానికి ప్రయత్నించాడు.

బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్‌లవల్ల ప్రభావితమై బెంగాల్‌లో జాతీయవాదం మత దృక్పథాన్ని సంతరించుకుంది. తెలిసో, తెలియకో భారతదేశమంతా జాతీయవాదంపై హిందూ లక్షణాల ముద్ర, స్ఫుటంగా వ్యక్తమైంది. బ్రిటీష్ పరిపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ఉద్దేశించిన జాతీయోద్యమం, సర్వాంతర్యామి అయిన మతోద్యమంలో భాగమైంది. జాతీయవాదం మతపరిభాషలో వ్యక్తమైంది. తీవ్రవాద నాయకుల ప్రభావం వల్ల జాతీయోద్యమ విజృంభణ, హిందూ పునర్వికాసంతో సన్నిహితంగా కలిసింది. సామాన్య ప్రజానీకం, తిలక్ చైతన్యవంతమైన విధానాలవల్ల ఆకర్షితులయ్యారు. తిలక్ జాతీయ నాయకుడయ్యాడు. 1896లో బొంబాయి రాష్ట్రంలో కరువు రక్కసి విజృంభించినప్పుడు భారతదేశ రాజకీయాలలో కొత్త మార్గాన్ని అనుసరించాడు. ప్రజలను ధైర్యంగా వ్యవహరించి, కాటకాల చట్టంవల్ల తమకు రావలసిన రాయితీలను డిమాండ్ (demand) చెయ్యవలసిందని కోరాడు. తిలక్ ఆశయాలు స్వదేశీ ఉద్యమానికి ఊపునిచ్చాయి. సామాన్య ప్రజానీకంలో చైతన్యం పెంపొందడానికి దోహదం చేసాయి. నూతన జాతీయ చైతన్యానికి ఆయన సజీవ ప్రతీక అయ్యాడు.

1905 నాటికి రాజకీయ ఆందోళనలను నిర్వహించడంలోను, రాజకీయ సంఘర్షణలకు నాయకత్వం వహించడంలోను, విశేషానుభావాన్ని సంపాదించిన నాయకులు చాలామంది వెలుగులోకి వచ్చారు. లాల్-బాల్-పాల్ వర్గం నాయకత్వం, రాజకీయ చైతన్యాన్ని రేకెత్తించడానికి, దేశంలో సర్వశక్తుల్ని ఒకే పతాకం కింద సమీకరించడానికి చట్టబద్ధమైన ఆందోళన ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పింది.

17.3 ప్రజల సమీకరణ

ప్రజల్లో జాతీయ భావాన్ని రేకెత్తించడానికి, విద్యావంతులైన వర్గానికి సామాన్య ప్రజానీకంతో సన్నిహిత సంబంధాలు పెంపొందించడానికి తిలక్ శివాజీ, గణపతి ఉత్సవాలను నిర్వహించాడు. హిందూమతాన్ని

BRAOU

కాపాడడానికి శివాజీ ముస్లింలతో జరిపిన సంఘర్షణ, జాతీయ భావానికి ఉత్తేజాన్ని కల్గిస్తుందని భావించారు. శివాజీని గొప్ప స్వాతంత్ర్య యోధునిగా కీర్తించి బ్రిటీష్‌వారి బానిసత్వం నుంచి స్వేచ్ఛను సాధించడానికి శివాజీని అనుసరించవలసిందని ప్రజలను ఉద్బోధించారు తిలక్ ప్రజలలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింప చేసాడు. ప్రజల ఆత్మవిశ్వాసంపైన, ప్రజాబలంపైన మాత్రమే ఉద్యమ శక్తి ఆధారపడుతుందని, కాంగ్రెస్ ప్రతి సంవత్సరం ఆమోదించే తీర్మానాలవల్ల కాదని తిలక్ తెలుసుకున్నాడు.

తీవ్రవాదులు మితవాదులపట్ల వ్యతిరేక భావాన్ని పెంపొందించుకున్నారు. మితవాదుల నాయకత్వంలో కాంగ్రెస్ అనుసరించిన రాజకీయ యాచకత్వ విధానంపట్ల వారు తీవ్రమైన అసంతృప్తిని ప్రకటించారు. ప్రతి సంవత్సరం కాంగ్రెస్ ఆమోదించిన శాసనాలను, బ్రిటీష్ ప్రభుత్వం నిర్లక్ష్యం చెయ్యడంతో, మితవాదులనుసరించిన చట్టబద్ధమైన విధానాలపట్ల యువత ఆశాభంగం చెందినారు. 1897 లో జరిగిన అమరావతి కాంగ్రెస్ సమావేశాన్ని, అశ్వనీకుమార్ దత్ మూడురోజుల "తమాషా"గా వర్ణించాడు. ఈ ప్రకటనవల్ల, బెంగాల్‌లో కాంగ్రెస్‌పట్ల నిరాశ వెల్లడౌతోంది. మితవాదులనుసరించిన విధానాలను, తిలక్ కూడా తీవ్రంగా విమర్శించాడు. సంవత్సరానికొకసారి కప్పలవలె బెకబెక లాడితే మనం ఎలాంటి విజయాలను సాధించలేమని తిలక్ స్పష్టంగా చెప్పాడు. ఈ విధంగా మితవాద నాయకులనుసరించిన మెతక విధానాన్ని తీవ్రవాదులు హేళనచేశారు. అంతేకాకుండా దేశంలో ప్రబలమౌతున్న అసంతృప్తిని, 1905లో స్వదేశీ ఉద్యమం ప్రారంభించడానికి వాడుకున్నారు. విదేశీ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా తిరుగబడడానికి, ప్రజలనుత్తేజపరచడానికి, దేశ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి, బెంగాల్ కాళీ, దుర్గల ఆరాధనను పునరుద్ధరించారు. జాతీయవాదాన్ని మతంతో పెల్చారు. మాతృభూమిని దుర్గ రూపంలో మూర్తీభవింప చేశారు. ప్రజలలో జాతీయ భావాన్ని రగుల్కొల్పడానికి కొత్త ఆశలను పెంపొందించడానికి, జాతి ఔన్నత్యాన్ని వివరించడానికి, ప్రాచీన దేవతలను తగిన విధంగా వ్యాఖ్యానించారు. బంకించంద్రుని **'వందేమాతరం'** గేయాన్ని, మాతృదేశాన్ని దైవ స్వరూపిణిగా ఆరాధించడానికి ప్రార్థనా గీతంగా వాడారు. గోవును హిందువులు పవిత్రమైన జంతువుగా ఆరాధిస్తారు కనుక, హిందూమతంలో గోవు పవిత్రతకు చిహ్నం కావడంవల్ల, గోవధ నిషేధోద్యమం బాగాబలపడింది.

17.4 బెంగాల్ విభజన

లార్డ్‌కర్జన్ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి ప్రతీక, ప్రధానాచార్యుడు. కర్జన్ నిరంకుశ పరిపాలన ప్రజలలో తీవ్రమైన అసంతృప్తిని పెంపొందించి, జాతీయ చైతన్యాన్ని రగుల్కొల్పింది. అతడి పరిపాలనలో భారతీయులపట్ల వ్యతిరేకభావం స్పష్టంగా వ్యక్తమైంది. అందువల్ల భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ భావాన్ని పెంపొందించింది. బెంగాల్ రాష్ట్రాన్ని విభజించి, కర్జన్ జీవితంలో పెద్ద పొరపాటు చేసాడు. బీహార్, ఒరిస్సా, ఛోటానాగపూర్ ప్రాంతాలు, అనాటి బెంగాల్ రాష్ట్రంలో భాగంగా ఉండేవి. అధికార వర్గంవారు బెంగాల్ విభజనను, పరిపాలనా సౌలభ్యం కోసం సమర్థించారు. కాని వైస్రాయి ప్రకటించిన కారణాలు ప్రజలను ఏమాత్రం తృప్తిపరచలేదు. పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసమే బెంగాల్ విభజన నిర్ణయం జరిగిందని ప్రభుత్వం ప్రకటించినా నిజానికి బెంగాల్‌లో తీవ్రవాద జాతీయవాదుల ప్రభావాన్ని తగ్గించడానికే, ఈ విభజనకు ప్రభుత్వం నిశ్చయించింది. *"అవిభక్త బెంగాల్ ఒక శక్తి. బెంగాల్‌ను విభజిస్తే బలహీనమౌతుంది. మన పరిపాలనను ప్రతిఘటించే బలమైన ప్రత్యర్థులను బలహీనపరచడమే, మన ముఖ్య లక్ష్యం"* అని అనాటి భారత ప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి రిస్లే (Resley) ప్రకటించాడు.

బెంగాల్ విభజనకు నిశ్చయించినప్పటికే కర్జన్, ముస్లింలు అధిక సంఖ్యలో ఉండే రాష్ట్రాన్ని ఏర్పరచాలనే దురుద్దేశంతో వ్యవహరించాడు. హిందువులకు ముస్లింలకు మధ్య విభేదాలు సృష్టించాలన్నదే అతని సంకల్పం. తన ప్రతిపాదనకు అనుకూలంగా ముస్లింలను రెచ్చగొట్టాడు. బ్రిటీష్ ప్రభుత్వం విభజించి పాలించే విధానంలో, ఇదొక కుటిల రాజకీయ ఎత్తు.

BRAOU

1903 లో లార్డ్ కర్జన్ ప్రతిపాదన తెలిపినప్పటి నుంచి బెంగాలీలు ఆందోళనను ప్రారంభించారు. 1903 డిసెంబరు నుంచి 1905 అక్టోబర్ లోపల, సుమారు 3000 పైగా బహిరంగ సభలను నిర్వహించారు. రాజకీయ సంఘాలు, వార్తా పత్రికలు ఈ ప్రతిపాదనను గర్హిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేసాయి. సుమారు 70,000 మంది ప్రజలు సంతకం చేసిన వినతి పత్రాన్ని, భారత రాజ్య కార్యదర్శికి (Secretary of State for India) సమర్పించారు. ఈ విధంగా ప్రకటితమై తీవ్రమైన అసంతృప్తిని నిర్లక్ష్యం చేసి, బ్రిటీష్ ప్రభుత్వం 1905, అక్టోబర్ 16వ తేదీన బెంగాల్‌ను విభజించింది.

ప్రజలు చట్టబద్ధమైన విధానాలను అనుసరించి, బెంగాల్ విభజనను నిరోధించడానికి చాలా కృషిచేసారు. బ్రిటీష్ ఇండియా చరిత్రలో ప్రభుత్వం అమలు జరిపిన ఏ నిర్ణయాన్ని, ఇంత తీవ్రంగా, నిర్విరామంగా, సమైక్యంగా, ప్రజలు వ్యతిరేకించలేదు. *"ప్రజాభిప్రాయాన్ని కర్జన్ మొండిగా నిర్లక్ష్యం చెయ్యడంవల్ల, చట్టబద్ధమైన ఆందోళనా విధానానికి సమాధి కట్టడమైందని"* ఆచార్య ఆర్.సి. మజుందార్ అభిప్రాయాన్ని ప్రకటించారు.

బెంగాల్ విభజనను అందరూ ముక్తకంఠంతో గర్హించారు. అన్ని రాజకీయ వర్గాలు బెంగాల్ విభజనను ప్రతిఘటించాయి. ఈ విభజనవల్ల బెంగాల్‌లో కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఈ నిర్ణయాన్ని బెంగాలీలు తమ ఆత్మాభిమానానికి సవాలుగా పరిగణించారు. విభజనవల్ల కల్గిన నష్టాన్ని నివారించడానికి, ఆందోళనను ప్రారంభించడానికి నిశ్చయించారు. బెంగాల్‌లో నానాటికి విజృంభిస్తున్న జాతీయ భావానికి సవాలుగా ఈ విభజనని బెంగాలీలు భావించారు. బ్రిటీష్ ప్రభుత్వం తమని ఘోరంగా అవమానపరచినట్లు, దగా చేసినట్లు భావించారు. బ్రిటీష్ ప్రభుత్వం చర్యను ఖండించడానికి సమావేశాలను ఏర్పాటు చేసారు. ఈ విభజనకు వ్యతిరేకంగా తీర్మానాలను ఆమోదించి, ప్రతిజ్ఞలు చేసారు. 1905 అక్టోబర్ బెంగాల్ విభజన అమలు జరిగినప్పుడు, బెంగాల్ రాష్ట్రం శోకతప్తమైంది.

"బెంగాల్ విభజన ప్రకటన నిశ్చేష్టులను చేసిందని" సురేంద్రనాథ్ బెనర్జీ వ్రాశారు. ఈ నిర్ణయం బెంగాలీలను ఘోరంగా అవమానపరచిందని, దగా చేసిందని ప్రకటించాడు. బెంగాలీల సమైక్యతను, చైతన్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి తీసుకున్న కుత్సిత నిర్ణయంగా, సురేంన్రాథ్ బెనర్జీ విమర్శించాడు.

తూర్పు, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలు అట్టుడికిపోయాయి. రవీంద్రనాధ టాగూర్, న్యాయమూర్తి సర్ గుర్ దాస్‌సింగ్ బెనర్జీ, మైమెన్‌సింగ్, కాశిమ్‌బజార్ మహారాజులు ఈ విభజనను వ్యతిరేకించారు. వినతి పత్రాలను సమర్పించడంవల్ల విజ్ఞాపనలవల్ల ఫలితాలు సాధించలేనప్పుడు కొన్ని విస్పష్టమైన నిర్ణయాలు తీసుకుని, ప్రభుత్వాన్ని తమ విధానాలకు అంగీకరించాలని నిర్భంధించాలనుకున్నారు. బ్రిటీష్ వస్తువులను, ముఖ్యంగా మాంచెస్టర్ నుంచి దిగుమతి అయ్యే వస్త్రాలను బహిష్కరించాలనే తీర్మానాలను ఆమోదించారు. తీర్మానాలను ఆమోదించిన తర్వాత, 'వందేమాతరం' అని దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేసారు. బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమంలో 'స్వరాజ్', 'స్వదేశీ', 'ఆర్థిక బహిష్కరణ', 'జాతీయ విద్యావిధానం' మొదలైన నినాదాలు ఆవిర్భవించాయి. బెంగాల్‌లో ఆవిర్భవించిన స్వదేశీ, ఆర్థిక బహిష్కరణ ఉద్యమాలు దేశాన్నంతా అట్టుడికించాయి.

బెంగాల్ విభజన జరిగింది.కర్జన్ ఇంగ్లండ్‌కు వెళ్ళిపోయాడు. కాని భారతదేశం మాత్రం గతంలా లేదు. బెంగాల్ విభజన మధ్యతరగతి జాతీయవాద ఆవిర్భావానికి నాంది పల్కింది. ఆందోళనకారులు సమావేశాలను ఏర్పాటుచేసి 'వందేమాతరం' అని నినాదాలు చేస్తూ, బ్రహ్మాండమైన ఊరేగింపులను నిర్వహించారు. విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను వాడడానికి ప్రజలు నిశ్చయించారు. బెంగాల్ ప్రభుత్వం ఉద్యమాన్ని అణచడానికి తీవ్రమైన చర్యలు తీసుకుంది. బెంగాల్‌లో భీభత్స వాతావరణం నెలకొనింది. బెంగాల్ విభజన అమలులోకి వచ్చిన రోజున (1905 అక్టోబర్, 16), బెంగాల్ అంతటా సంతాపదినంగా పరిగణించారు. రెండు రాష్ట్రాల మధ్య సమైక్యతకు చిహ్నంగా, ప్రజలు రక్షాబంధన మహోత్సవాన్ని పాటించారు. నేత పరిశ్రమను ఆర్థికంగా ప్రోత్సహించడానికి బహిరంగ సమావేశంలో సురేంద్రనాథ్ బెనర్జీ జాతీయ నిధిని ప్రారంభించారు. స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించడానికి రూ. 70,000లు సమావేశంలోనే వసూలు చేశారు. సురేంద్రనాథ్ బెనర్జీ,

BRAOU

బిపిన్ చంద్రపాల్ మొదలైన నాయకులు కొత్త రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి ప్రజలలో జాతీయ భావాన్ని రగుల్కొల్పి, విభజన వ్యతిరేకోద్యమంలో పాల్గొనేటట్లు ఉత్తేజపరిచారు.

17.5 బ్రిటీష్ వస్తువుల బహిష్కరణ

బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి నాయకులు విదేశీ వస్తువులను బహిష్కరించడానికి స్వదేశీ వస్తువులను ఉపయోగించడానికి ప్రజలు నిశ్చయించారు. దిగుమతి చేసుకున్న వస్త్రాలను చాలా ప్రాంతాలలో బహిరంగంగా దహనం చేసారు. ఆర్థిక బహిష్కరణోద్యమం బ్రహ్మాండంగా విజయవంతమైంది. బెంగాల్‌లో వస్త్ర వ్యాపారం అకస్మాత్తుగా తగ్గిపోయింది. కొద్దికాలం తర్వాత విదేశీ ఉప్పు, పంచదార ఇతర వస్తువులను కూడా బహిష్కరించారు. ఈ ఉద్యమం ఉధృతమౌతున్న కొద్దీ, వివిధ దశలు అధిగమించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం ప్రతి రంగంలోను బ్రిటీష్ వారికి, సహాయ నిరాకరణ చెయ్యాలనే భావం బలపడింది.

17.6 స్వదేశీ ఉద్యమ వ్యాప్తి

బ్రిటీష్ వస్తువుల ఆర్థిక బహిష్కరణవల్ల స్వదేశీ వస్తువులకు గిరాకి (demand) ఎక్కువైంది. అందువల్ల స్వదేశీ వస్తువుల ఉత్పత్తి పెంచవలసి వచ్చింది. అరవిందుడు ఈ ఉద్యమ ప్రాధాన్యతను గురించి తెల్పిన అభిప్రాయంవల్ల పూర్తిగా ఆర్థిక దృక్పథం నుండే ఈ సమస్యను పరిశీలించడం జరగలేదు. ఈ ఉద్యమం జాతీయవాదానికి ప్రత్యక్ష నిదర్శనం.

"బెంగాల్ విభజన తర్వాతే భారతదేశంలో నిజమైన చైతన్యం పెంపొందిందని, బెంగాల్ విభజన దినం బ్రిటీష్ సామ్రాజ్య విభజన దినంగా పరిగణించాలని" 1908 మోహన్ దాస్ కరంచంద్ గాంధీ తన అభిప్రాయాన్ని ప్రకటించాడు.

స్వదేశీ ఉద్యమం భారతీయ పరిశ్రమలకు గొప్ప ఊపునిచ్చింది. అనేక బట్టల మిల్లులు, అగ్గిపెట్టెలను, సబ్బులను తయారుచేసే కర్మాగారాలు, కుండలను, పాదరక్షలను తయారుచేసే కర్మాగారాలను చాలా చోట్ల స్థాపించారు. ఆచార్య పి.సి.రే (P.C.Ray) బెంగాల్ కెమికల్ కర్మాగారాన్ని (Bengal Chemical Factory) స్థాపించారు. రవీంద్రనాథ టాగూర్ స్వదేశీ స్టోర్‌ను తెరిచాడు. బ్యాంకులను, భీమా కంపెనీలను స్థాపించడానికి, చాలా మంది జమీందారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులతో కలిశారు.

స్వదేశీ ఉద్యమం సాంస్కృతిక రంగంలో కూడా చాలా ఫలితాలను సాధించింది. జాతీయ కవిత, వచనం, పత్రికా రచన వికసించాయి. రవీంద్రనాథ టాగూర్, రజనీకాంత్ సేన్, ముకుంద దాస్‌లు వ్రాసిన దేశభక్తి గేయాలను బెంగాలులో ప్రజలిప్పటికీ పాడుకుంటుంటారు.

జాతీయ భావాన్ని ప్రోత్సహించడానికి బాలగంగాధర్ తిలక్, లాలా లజపతి రాయ్ జాతీయ విద్యాభావాన్ని విస్తరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో 1906-09 ల మధ్య జాతీయ విద్యా సంస్థలను స్థాపించారు. 1906లో అరవింద ఘోష్ కళాశాలాధ్యక్షుడుగా కలకత్తాలో ఒక కళాశాలను స్థాపించాడు. 1909 లో మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ కౌన్సిల్, ఒక జాతీయ కళాశాలను స్థాపించింది.

జాతీయ భావాలు నానాటికి పెంపొందడంవల్ల, స్వదేశీ ఉద్యమం బెంగాల్ నుంచి భారతదేశంలోనే ఇతర ప్రాంతాలకు విస్తరించింది. 1905 సంవత్సరాంతానికే ఆర్థిక బహిష్కరణ - స్వదేశీ ఉద్యమం అఖిలభారత ప్రాతిపదికను సంతరించుకుంది. బెంగాల్ సమైక్యతను, విదేశీ వస్తు బహిష్కరణోద్యమాన్ని సమర్థిస్తూ బొంబాయి,

BRAOU

మద్రాస్ నగరాలలోను ఉత్తర భారతదేశంలో చాలా చోట్ల ఉద్యమాలను నిర్వహించారు. తిలక్, బిపిన్‌చంద్ర పాల్, అరబిందో, లజపతిరాయ్ మొదలైన నాయకులు బహిష్కరణోద్యమానికి జనాదరణను పెంపొందించడం కోసం, పత్రికలు, సమావేశాల ద్వారా దేశమంతటా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం వేగంగా విస్తరించింది. బ్రిటీష్‌వారి వ్యాపారం చాలావరకు తగ్గింది. బహిరంగ సమావేశాలు, ప్రదర్శనలు, హర్తాళ్‌లు జరిగాయి. స్వదేశీ ఉద్యమాన్ని విస్తరించడంలో తిలక్ ప్రముఖ పాత్ర నిర్వహించాడు.

ఆర్థిక బహిష్కరణ, స్వదేశీ ఉద్యమాలను తిలక్ పశ్చిమ భారతదేశంలో ప్రచారం చేశాడు. పూనేలో విదేశీవస్త్ర దహన కార్యక్రమాన్ని నిర్వహించాడు. స్వదేశీవస్తు ప్రచారిణీసభకు నాయకుడుగా సహకార విక్రయ కేంద్రాన్ని ప్రారంభించాడు. పూనేలో స్వదేశీనేత కంపెనీని స్థాపించాడు. తిలక్ 'కేసరి'లో ఇలా వ్రాశాడు "మనదేశం మహావృక్షం లాంటిది. స్వరాజ్యం మూలాధారం స్వదేశీ, ఆర్థిక బహిష్కారం కొమ్మలు".

బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమాన్ని బాలగంగాధర తిలక్, బిపిన్‌చంద్ర పాల్, అరవింద ఘోష్‌లు ధైర్య సాహసాలతో నిర్వహించారు. స్వదేశీ ఉద్యమంలో బెంగాల్ విద్యార్థియోధులు ప్రముఖ పాత్రను నిర్వహించారు. ఈ ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం అణచివేత విధానాన్ని అనుసరించింది. విద్యార్థులు స్వదేశీ ఉద్యమాన్ని బలపరచి, విదేశీ వస్త్రాలను అమ్మే దుకాణాల వద్ద పికెటింగ్ చేసారు. ప్రభుత్వం విద్యార్థులపై తీవ్రమైన క్రమశిక్షణా చర్యలను తీసుకుంది. చాలామంది విద్యార్థుల నుంచి ప్రభుత్వం జరిమానా వసూలు చేసింది; పాఠశాలల నుంచి కళాశాలల నుంచి బహిష్కరించింది. కొందరు విద్యార్థులను ప్రభుత్వాధికారులు నిర్బంధించారు. కొందరు విద్యార్థులను పోలీసులు లాఠీలతో బాదారు. ఈ విధంగా ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసుకున్నా విద్యార్థులను అణచివేయలేకపోయింది.

స్త్రీలు స్వదేశీ ఉద్యమంలో ప్రముఖంగా పాల్గొన్నారు. ఊరేగింపులలో పికెటింగ్‌లలో ఎంతో ఉత్సాహంతో చేరారు. పట్టణాలలో మధ్యతరగతి స్త్రీలు జాతీయోద్యమంలో ప్రముఖపాత్రను నిర్వహించారు.

మొదట్లో చాలామంది ముస్లింలు కూడా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. కాని మధ్య తరగతి, మధ్య ఉన్నత వర్గాలలో చాలామంది తటస్థంగా ఉండిపోయారు. ముస్లింలలో కొందరు ఉన్నత వర్గాలవారు, ఢక్కా నవాబు నాయకత్వంలో బెంగాల్ విభజనను సమర్థించారు. మత తత్వధోరణిని ప్రోత్సహించి బ్రిటీష్ అధికార్లు ఢక్కా నవాబును తదితర ముస్లిం ప్రముఖులను ప్రోత్సాహపరిచారు.

విభజన వ్యతిరేకోద్యమం ప్రజాదరణను పొందినప్పటికీ బెంగాల్‌లో రైతాంగాన్ని ఈ ఉద్యమం కదిలించలేదు. మొత్తంమీద ఈ ఉద్యమం పట్టణాలకు, రాష్ట్రంలో మధ్య తరగతి ప్రజలకు పరిమితమైంది.

ఆనాటి రాజకీయ అశాంతి బ్రిటీష్ ప్రభుత్వాన్ని కుదిపివేసింది. బ్రిటీష్ ప్రభుత్వం తీవ్రంగా వ్యవహరించింది. 1905-09 సంవత్సరాల మధ్య ప్రభుత్వం వేలాది ప్రజలను నిర్బంధించి, చెరసాలలకు పంపింది. శాంతియుతంగా అహింసా విధానాలను అనుసరించి, ఊరేగింపులలో పాల్గొన్న ప్రజలను పోలీసు అధికారులు లాఠీలతో బాదారు.

ప్రభుత్వం విద్యార్థులపై కఠిన చర్యలను తీసుకుంది. పోలీసులు ప్రజలను చావగొట్టి, భయానక వాతావరణాన్ని సృష్టించారు. పత్రికలపై నిర్బంధాలను విధించారు. 'వందేమాతరం' సంపాదకుడు అరవిందఘోష్, 'సంధ్య' సంపాదకుడు ఉపాధ్యాయ, 'యుగంధర్' సంపాదకుడు భూపేంద్రనాథ దత్‌లను విచారించి, శిక్షించారు. ఈ ఉద్యమాన్ని అణచడానికి బ్రిటీష్ అధికార్లు చాలామంది నాయకులను నిర్బంధించి, దేశం నుంచి పంపించివేసారు. 1907లో లజపతిరాయ్, సర్దార్ అజిత్‌సింగ్‌లను నిర్బంధించి, దేశం నుంచి బహిష్కరించారు. తిలక్‌పై విచారణ జరిపి, 1908లో 6సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధించారు. నాయకులను నిర్బంధించి చెరసాలలకు పంపడంతో ఉద్యమ ఉధృతం తగ్గింది. 1909 నాటికి బ్రిటీష్ ప్రభుత్వం తన అధికారాన్ని పునరుద్ధరించుకుంది.

BRAOU

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1) మితవాదులకు, అతివాదులకు లక్ష్యంలో వున్న ముఖ్య భేదమేమి?

.....

.....

.....

.....

2) బెంగాల్ ప్రజలు, బెంగాల్ విభజనను ఎందుకు ప్రతిఘటించారు?

.....

.....

.....

.....

17.7 విప్లవ జాతీయవాదులు

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆత్మార్పణ చేసి చరిత్రలో చెరగని ముద్రవేసుకున్న ఉగ్రవాదులు వీరోచిత పాత్రను పరిశీలిద్దాం. 1857 విప్లవం తరవాత బ్రిటీష్ ప్రభుత్వ దమననీతి, రాజకీయ పోరాట వైఫల్యం, అతివాదుల ఆతురత, వ్యక్తిగత ఉగ్రవాద విజృంభణకు కారణాలు. 1905లో స్వదేశీ ఉద్యమం విఫలమైన తర్వాత బాంబు వాదాన్ని అనుసరించారు. రహస్య సంఘాలను స్థాపించి, ప్రజా వ్యతిరేక బ్రిటీష్ అధికార్లను హత్యచేసే పద్ధతుల్ని చేపట్టారు. భారతదేశపు తూర్పు ప్రాంతంలో **'అనుశీలన్' 'యుగంతర్'** సంస్థలను స్థాపించడంతో, భారతదేశ పశ్చిమ ప్రాంతంలో **'అభినవ భారత్'** సంస్థను స్థాపించడంతో విప్లవోద్యమ కార్యక్రమాలు, దేశం పలు ప్రాంతాలలో కొనసాగాయి. ఉగ్రవాద ఉద్యమ వివరాలను పరిశీలిద్దాం.

ఉగ్రవాదం సమరశీల జాతీయవాదంలో ఒక దశగా పరిగణించవచ్చు. తిలక్ రాజకీయ తీవ్ర భావాలకు, ఉగ్రవాదం భిన్నమైంది. సైనిక శక్తిపై పూర్తిగా ఆధారపడ్డ బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని, హింసాయుత విధానాల ద్వారా తప్ప అంతమొందించడం సాధ్యం కాదని ఉగ్రవాదులు నమ్మారు. పరిపాలనా యంత్రాంగాన్ని నిర్వీర్యం చెయ్యడానికి బ్రిటీష్ వారితో సహకరించిన భారతీయులకు వ్యతిరేకంగా, హింసా విధానాన్ని అనుసరించాలని విశ్వసించారు. భారతదేశంలో తమ అధికారాన్ని కొనసాగిస్తున్న ఆంగ్లేయులను హతమార్చడమే తమవిధి అని, ఉగ్రవాదులు భావించారు. 19వ శతాబ్దాంతంలో 20వ శతాబ్ద ప్రారంభంలో ఉగ్రవాదుల కార్యక్రమాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దేశ స్వాతంత్ర్య సాధనకు రాజకీయ హత్యలను, ప్రభుత్వ ఆస్తి విధ్వంసాన్ని, ద్రోహచర్యలను వారు సమర్థించారు. బెంగాల్, పంజాబ్, మహారాష్ట్ర ప్రాంతాలు విప్లవోద్యమ హింసావాద కార్యక్రమాలకు కేంద్రాలయ్యాయి.

స్వదేశీ ఉద్యమాన్ని అణిచివేయడంతో సమరశీల జాతీయవాదం ప్రవాసంలోనికి పోయింది. దేశం వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా బెంగాల్‌లో, చాలా రహస్య విప్లవ పార్టీలు పనిచెయ్యడం ప్రారంభించాయి. విప్లవోద్యమం, ఉగ్రవాదాల్లో నమ్మకమున్న వందల కొద్దీ యువకులు, ఈ పార్టీలలో చేరారు. ఐరిష్ విప్లవకారులవల్ల రష్యన్ నిహిలిస్ట్‌లవల్ల ఉత్తేజితులై, బాంబువాదాన్ని, అంటే హింసావాదాన్ని గాఢంగా నమ్మారు.

మహారాష్ట్ర ప్రాంతం విప్లవ జాతీయోద్యమ ప్రథమ కేంద్రం. విక్టోరియా మహారాణి పట్టాభిషేక వజ్రోత్సవ దినంనాడు చాపేకర్ సోదరులు-దామోదర్, బాలకృష్ణ-ప్రజాకంటకులైన ఇద్దరు బ్రిటీష్ అధికారులైన రేండ్, అయెరస్ట్‌లను హత్యచేశారు.

17.7.1 లాల్, బాల్, పాల్

లాల్,బాల్,పాల్ జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన త్రిమూర్తులు. వారు మహోన్నత శ్రేణికి చెందిన విప్లవ జాతీయనాయకులు.

లాల్

పైన పేర్కొన్నత్రయంలో ప్రథముడు లాలా లజపతి రాయ్, లాల్‌గా ప్రసిద్ధుడయ్యాడు. ఈయన పంజాబునకు చెందిన తీవ్రవాద నాయకుడు. **"పంజాబు కేసరి"** గా ప్రసిద్ధుడు. ఆయన వితరణశీలి, నిర్భయంగా వ్యవహరించే పత్రికా విలేఖరి, సంఘ సంస్కర్త, పరిపూర్ణ జాతీయ వాది. ఆయన తీవ్రవాదంపై మొగ్గు చూపాడు. ఆయన 1907 సం॥లో భారీ ఎత్తున వ్యావసాయిక ఉద్యమాన్ని నిర్వహించడంవల్ల బర్మాకు పంపించబడ్డాడు. జాతీయ స్థాయిలో నిర్వహించబడిన సహాయ నిరాకరణోద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహించాడు. మదన్ మోహన్ మాలవ్యతో కలిసి **'హిందూ సంఘటన'** వుద్యమాన్ని నడిపాడు. ఈ ఉద్యమ ముఖ్య లక్ష్యం హిందూ ముస్లింల ఐక్యత సాధించడం. 1928 సం॥లో అక్టోబరు 30వ తేదీన లాలా లజపతి రాయ్ లాహోరులో సైమన్ కమిషన్ వ్యతిరేక ఊరేగింపునకు నాయకత్వంవహించగా **పోలీసు** లాఠీఛార్జి వల్ల తీవ్రంగా గాయపడి 18 రోజుల **తర్వాత** ఆగాయాల **ఫలితంగా** మరణించాడు. లాలా **లజపతి** రాయ్ గొప్ప రచయిత, పత్రికా వ్యాసంగముపై మక్కువ గలవాడు. ఆయన **'వందేమాతరం'** అనే ఉర్దూ పత్రిక, **'ది ప్యూపుల్'** అనే ఆంగ్ల వార పత్రిక స్థాపించాడు. సామాన్య ప్రజలయొక్క సర్వతోముఖాభివృద్ధిని సాధించడం ఆయన లక్ష్యం. మన దేశంలో ఆధునిక విద్యాపురోగతికి లాలా లజపతి రాయ్ ఎనలేని కృషిచేశాడు. ఆయన దూరదృష్టి గల మహామేధావి అనడంలో సందేహానికి తావులేదు.

బాల్

జాతీయ ఉద్యమంలో తీవ్రవాద నాయకత్రయంలో బాలగంగాధర్ తిలక్, బాల్‌గా ప్రసిద్ధుడు. భారతీయులచే లోకమాన్య బిరుదాంకితుడై, మనదేశంలో దేశభక్తి భావాన్ని విశేషంగా ప్రచారం చేసి, మకుటం లేని మహారాజుగా వెలుగొందిన తీవ్రవాద నాయకుడు. మనదేశ స్వాతంత్ర్యోద్యమంలో బాల్ మహోన్నత పాత్ర నిర్వహించాడు. ఆధునిక భారత దేశ నిర్మాతలలో తిలక్‌ను ఒకరుగా భావిస్తారు. తిలక్ సామాన్య ప్రజాబాహుళ్యానికి సన్నిహితంగా వుండాలని కోరుకొనేవారు. మహారాష్ట్రంలో గణపతి, నవరాత్రి ఉత్సవాలు భారీఎత్తున నిర్వహించి, ప్రజలలో జాతీయభావాన్ని, దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేసాడు. రనడే మహాశయునివల్ల ప్రభావితుడై ఆనాడు నెలకొని వున్న దురాచారాలపై తిలక్ పోరాటాన్ని సాగించాడు. తిలక్ **"మరాఠ" "కేసరి"** వార్తా పత్రికలను స్థాపించాడు. దేశభక్తిని ప్రబోధించే తిలక్ రచనల ఫలితంగా ప్రజలు ఉద్వేగ పూరితులయ్యారు. జాతీయ ఉద్యమంలో తీవ్రవాదం ప్రవేశపెట్టడానికి తిలక్ ముఖ్య కారణమని భావిస్తారు. **"స్వరాజ్యం నా జన్మహక్కు'** కావున స్వరాజ్యం కావాలని గర్జించాడు. కాంగ్రెసు నాయకులలో అనేక సార్లు నిర్భంధానికి గురైన ప్రముఖ నాయకుడు బాల్. లాల్, పాల్ లతో కలిసి జాతీయ పార్టీని నడిపించడంలో తిలక్ ప్రముఖ పాత్ర నిర్వహించాడు. ఆయనకు "సేవ, త్యాగాల"పై విశ్వాసం మెండు. బ్రిటిషువారు తిలక్‌ను అస్థిరతకు పితృ సమానుడుగా వర్ణించారు. క్షామ పీడిత ప్రాంతాల్లో తిలక్ 'పన్నుల వ్యతిరేక ఉద్యమాలు' నిర్వహించాడు.

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంలో **'తిలక్ ఆధునిక జాతీయతకు ప్రతీక'**. ఆయన గొప్ప పండితుడు తిలక్ రచించిన **'గీతా రహస్యం'**, వేద సాహిత్యంపై ఆయనకు గల ఆధిపత్యం విశ్లేషపూరితమైన అవగాహనకు నిదర్శనం. తిలక్ "దక్కను విద్యా సంస్థల సంఘాన్ని" స్థాపించాడు. తిలక్‌ను "రాజకీయాలలో తీవ్రవాదిగాను, సామాజిక సంస్కరణల విషయంలో ఉదారవాదిగాను" వర్ణిస్తారు.

BRAOU



లాల్, బాల్, పాల్

పాల్

పాల్‌గా ప్రసిద్ధుడైనబిపిన్ చంద్రపాల్ తీవ్రవాదత్రయంలో ఒకరు. భారతదేశంలో "తీవ్రవాద ఆలోచనా ధోరణికి పాల్ **'పితృ సమానుడి'**గా పరిగణిస్తారు. 1886 సం॥లో జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించి పాల్ తన **రాజకీయ జీవితాన్ని** ప్రారంభించినాడు. బ్రిటీష్‌వారితో సంబంధం లేని స్వరాజ్య స్థాపనకై, పాల్ ప్రబోధించాడు. ఆయన **'పారదర్శక్'** అనే బెంగాలీ పత్రిక ప్రచురించడమే గాక **'ది బెంగాలీ పబ్లిక్ ఒపినియన్'** మరియు 'ది ట్రిబ్యూన్' పత్రికలకు సహాయ సంపాదకునిగా వ్యవహరించాడు. ఆయన కుల వ్యవస్థను వ్యతిరేకించాడు. సామూహిక సహపంక్తి భోజనాలకు అన్ని వర్గాలవారు కలయికకు అవరోధంగా వున్న సాంప్రదాయాలను వ్యతిరేకించాడు. పాల్ గొప్ప రచయితయే గాక మహాగొప్పవ్యక్తి. ఆయన రచించిన 'నాజీవిత కాలంనాటి జ్ఞాపకాలు(Memories of my life and time)' ప్రసిద్ధి చెందింది. జాతీయ ఉద్యమంలో పాల్ క్రియాశీలక పాత్ర నిర్వహించాడు. దేశమంతా పర్యటించి ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి విశేషమైన కృషి చేసాడు.

17.7.2 విదేశాలలో భారతీయ విప్లవవాదులు

స్వాతంత్ర్యోద్యమంలో విదేశాలలోని భారతీయుల కృషిని పరిశీలిద్దాం. విదేశాలలోని భారతీయ విప్లవకారులు స్వాతంత్ర్య సంగ్రామంలో నిర్వహించిన పాత్ర మరపురానిది. ఈ విప్లవకారులు గొప్ప త్యాగాలుచేసి, స్వాతంత్ర్యోద్యమానికే వన్నె తెచ్చారు. అమెరికాలో స్థాపించిన గదర్ (Gadar) పార్టీ, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రముఖ సంస్థ. లాలా హర్‌దయాళ్ గొప్ప విప్లవకారుడు, తత్తవేత్త. ప్రజానీకాన్ని కదలించగల మహావ్యక్తి. లాలా హర్‌దయాళ్ **కాలిఫోర్నియా** రాష్ట్రంలోని **ఒక** నగరంలో విప్లవకారుల సమావేశాన్ని నిర్వహించాడు. ఇండియన్ అసోసియేషన్‌కు నూతనోత్తేజాన్ని కల్గించాడు. 'గదర్' (Gadar) అని పేరు పెట్టాడు. **'గదర్'** అనే పత్రికను కూడా నిర్వహించాడు. ఆ పత్రికను ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, బెంగాలీ, మరాఠీ, గుర్ముఖీ భాషల్లో ప్రచురించాడు. ఆ పత్రికను అమెరికాలో మాత్రమే కాక జపాన్, సింగపూర్, జర్మనీ, కెనడా దేశాలలో జనాదరణను పొందింది. గదర్ ఉద్యమ ఆశయాలను, ప్రజలను కదలించే వ్యాసాల ద్వారా తెలిపింది. ఇంగ్లీష్ ప్రతికి లాలా హర్‌దయాళ్ సంపాదకుడు.

1913 నవంబర్ 1వ తేదీన గదర్ పార్టీని స్థాపించాడు. ఈ పార్టీ అన్ని వర్గాల భారతీయుల మద్ధతును పొందింది. పార్టీలో చాలామంది కర్షకులు, కార్మికులు. పార్టీ సభ్యుల్లో తక్కువ మంది మాత్రమే చదువుకున్నారు. ఈ పార్టీ సభ్యులు ఆస్తిపరులకు, ధనవంతులకు దూరంగా ఉండేవారు. స్వేచ్ఛ, సమానత్వం గదర్ పార్టీ ప్రధానమైన కోర్కెలు. ఈ పార్టీ సభ్యులు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని వాంఛించారు.

ఈ పార్టీ తీవ్రమైన బ్రిటీష్ వ్యతిరేక విధానాన్ని అనుసరించింది. బ్రిటన్‌ను వ్యతిరేకించిన అన్ని దేశాలను ఈ పార్టీ సమర్థించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయులకు మద్ధతును

BRAOU

ఇవ్వాలని, అమెరికన్లను అర్థించింది. గదర్ పార్టీ ఆశయాలతో కొందరు అమెరికన్లు సానుభూతిని ప్రదర్శించారు. గదర్ పార్టీ జర్మనీపట్ల అనుకూలభావాన్ని ప్రకటించగానే బ్రిటీష్‌వారు చికాకుపడ్డారు. గదర్ పార్టీ ప్రధాన నిర్మాత హర్‌దయాళ్. మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లగానే, భారతదేశంలో బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా విప్లవోద్యమం పుంజుకుంది. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఉత్తర అమెరికా, జపాన్‌లలో కేంద్రాలను స్థాపించడానికి చాలామంది విప్లవకారులను పంపించారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లగానే, గదర్ పార్టీ సభ్యులు చాలా సంతోషించారు. బ్రిటన్ క్లిష్టసమస్యలను ఎదుర్కొంటున్నప్పుడు, స్వాతంత్రోద్యమాన్ని ప్రోత్సహించడానికి పార్టీ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలనుకున్నారు. విప్లవకారులకు జర్మనీ నుంచి ప్రోత్సాహం లభించింది. గదర్ పార్టీ సభ్యులను జర్మన్లు ప్రోత్సహించారు. భారత తిరుగుబాటు నిర్వహించడానికి, విప్లవకారులకు ఆయుధాలను, మందుగుండు సామగ్రిని, నిధులను సహాయంగా సాధించడానికి, గదర్ పార్టీ విప్లవ కారులను భారత దేశంలోకి పంపింది. సుమారు 3000 మంది విప్లవకారులు వివిధ మార్గాలలో బృందాలుగా వచ్చారు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో విప్లవకారులు, పాశ్చాత్యదేశాలకు, ఆగ్నేయాసియా దేశాలకు ప్రతినిధివర్గాలను పంపారు. ఆఫ్ఘనిస్తాన్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేశారు. జర్మనీ సహకారంతో విప్లవకారుల సంస్థలకు ఆయుధాలను, వాలంటీర్లను సరఫరా చేయడానికి ప్రయత్నించారు. కాని విప్లవకారులు జర్మన్లకు కీలుబొమ్మలు కారు.

భారతదేశానికి అమెరికా నుంచి పెద్ద మొత్తాల్లో ఆయుధాలను సరఫరా చేయడానికి జర్మన్లు తీవ్రంగా ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలు సఫలం కాలేదు. బ్రిటీష్ నౌకాదళం అప్రమత్తంగా ఉండడంవల్ల, జర్మన్లు విఫలులయ్యారు. బెంగాల్, పంజాబ్, యు.పి. (U.P) రాష్ట్రాలలో 1914-15లో మూకుమ్మడి తిరుగుబాటు ప్రయత్నాన్ని అమలు పరచడం సాధ్యంకాలేదు. బ్రిటీష్ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉండడంవల్ల భారతదేశంలోని విప్లవకారులకు, ఇతర దేశాలలోని విప్లవకారులకు మధ్య సమన్వయం కుదరలేదు.

మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోయిన తర్వాత భారతీయ విప్లవకారులు వివిధ ప్రదేశాలకు చెదిరిపోయారు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత కూడా గదర్ పార్టీ మనుగడ సాధించినా ప్రాధాన్యతను కోల్పోయి కాలగర్భంలో కలిసి పోయింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంనాటి ప్రముఖ విప్లవకారుల గురించి, స్వాతంత్రోద్యమంలో వారిపాత్రను, వారొనర్చిన వీరోచిత త్యాగాన్ని పరిశీలిద్దాం.

17.7.2.1 ఒబైదుల్లా, 1871-1944

మౌలానా ఒబైదుల్లా సిక్కుమతం నుంచి మారి, ముస్లిమ్ అయ్యాడు. తన అధ్యాపకుడు మహమ్మద్ అల్ హసన్ సలహాపై **"జమియత్ ఉల్ అన్సార్"** అనే సంస్థను స్థాపించాడు. బ్రిటీష్ వారిని భారత దేశంనుంచి తొలగించడానికి చేసిన ప్రయత్నంలో, మహమ్మద్ అల్ హసన్ ఒబైదుల్లాను 1915లో కాబూల్‌కు పంపాడు. ఆఫ్ఘనిస్తాన్ అమీర్, హబీబుల్లాఖాన్ ఈ వ్యూహంపట్ల ఆసక్తిని ప్రకటించి ఒబైదుల్లాను భారత జాతీయ కాంగ్రెస్‌తో సహకరించవలసిందని సలహానిచ్చాడు. డాక్టర్ అన్సారీ సిఫారసుపై, కాబూల్‌లో ఒబైదుల్లా అధ్యక్షతన కాంగ్రెస్ కమిటీని స్థాపించాడు. కొంతకాలం తర్వాత ఈ కమిటీ భారత జాతీయ కాంగ్రెస్ అనుబంధ సంస్థగా వ్యవహరించింది. అదే సమయంలో కాబూల్ వచ్చిన ఇండో-జర్మన్ ప్రతినిధి వర్గాన్ని అమీర్ ఎక్కువగా ప్రోత్సహించలేదు.

బెర్లిన్‌లో ఏర్పాటు చేసిన భారత స్వాతంత్ర్య కమిటీ (Indian Independence Committee) కాబూల్‌కు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపింది. ఈ ప్రతినిధి వర్గంలో రాజా మహేంద్ర ప్రతాప్, మౌలానా బర్కతుల్లా ప్రధాన మంత్రిగా, ఒబైదుల్లా భారత వ్యవహారాల మంత్రిగా, తాత్కాలిక భారత ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్తాన్‌లో స్థాపించారు. భారతదేశం నుంచి పారిపోయి కాబూల్ చేరిన పంజాబీయువకులను, విప్లవ సైన్యంలో అధికారులుగా నియమించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ, టర్కీలు ఓడిపోవడంతో విప్లవకారుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒబైదుల్లాను ఆఫ్ఘనిస్తాన్ నుంచి బహిష్కరించారు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి మాస్కోకు, అంకారాకు

BRAOU

వెళ్ళాడు. రష్యన్ విప్లవంవల్ల వచ్చిన మార్పులను, మాస్కోలో చూశాడు. అటాటర్క్ ముస్తఫా కమాల్ పాషా నాయకత్వంలో, టర్కీలో ప్రజ్వరిల్లిన విప్లవంవల్ల వచ్చిన మార్పులను చూశాడు. 1939లో భారతదేశానికి తిరిగి వచ్చాడు. 1939-44 వరకు తన సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. మతోన్మాదులవలె కాక ఒబైదుల్లా ఇస్లాంను మానవతా దృష్టి ప్రచారం చెయ్యడానికి ప్రచార సాధనంగా అన్ని మతాల భావాలకు పునాదిగా, భగవత్ తత్వాన్ని ప్రబోధించేదిగా గౌరవించాడు. విప్లవ చరిత్రలో ప్రసిద్ధిచెందిన **"సిల్క్ లేఖల"** రచయితగా ఈనాటికి ఒబైదుల్లాకు గుర్తింపు ఉంది.

17.7.2.2 బర్కతుల్లా, 1864-1928

మహమ్మద్ బర్కతుల్లా 1895లో ఇంగ్లండ్‌కు వెళ్ళాడు. అక్కడ భారత జాతీయవాదులతో సన్నిహిత సంబంధాలను పెంపొందించుకున్నాడు. భారతదేశానికి తిరిగివచ్చిన తరవాత స్వదేశీ ఉద్యమం కొనసాగిన రోజుల్లో బెంగాలీ విప్లవకారులతో కలసిపోయాడు. 1909లో జపాన్ వెళ్లాడు. **'ఇస్లామ్ ఫ్రెటర్నిటీ'** అనే పత్రికను (Islam Fraternity) ప్రచురించాడు. బ్రిటీష్ ప్రభుత్వ ఒత్తిడిపై ఈ పత్రికను జపాన్ ప్రభుత్వం నిషేధించింది. బ్రిటీష్ వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగించి, టోక్యోలో ప్రముఖ వ్యక్తిగా పేరుపొందాడు. టోక్యోలో విదేశీభాషల స్కూల్లలో ఉర్దూ (Urdu) అధ్యాపకుడుగా పనిచేశాడు. జపాన్ ప్రభుత్వం బర్కతుల్లాను ఉద్యోగం నుంచి తొలగించిన తర్వాత 1914లో బెర్లిన్‌కు వెళ్ళి, ఇండియన్ నేషనల్ పార్టీ (Indian National Party) లో సభ్యుడయ్యాడు. ఆఫ్ఘనిస్తాన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా వ్యవహరించాడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం సహకరించనందువల్ల బర్కతుల్లా జర్మనీకి వెళ్ళిపోయాడు. జర్మనీలో లాలా హర్‌దయాళ్, డాక్టర్ చంపక్ రామన్‌పిళ్లై మొదలైన విప్లవకారులతో కలిసి, ఇండియా స్వాతంత్ర్య కమిటీ (Indian Independence Committee) లో పని చేశాడు. జర్మనీలో **'నయా ఇస్లాం'** అనే పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించి, నిర్వహించాడు. తన రచనల ద్వారా భారతీయ యుద్ధఖైదీలలో, బ్రిటీష్ వ్యతిరేక భావాలను రగుల్కొల్పాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం, భారత స్వాతంత్రోద్యమాన్ని సమర్థిస్తూ ఐరోపా దేశాలలో పర్యటించాడు. 1921లో రష్యాను సందర్శించాడు. జర్మనీకి తిరిగివచ్చాడు. 1928లో ప్రవాసంలో ఉండగానే మరణించాడు.

17.7.2.3 రాజా మహేంద్ర ప్రతాప్

రాజా మహేంద్ర ప్రతాప్ జీవితకాలాధ్యక్షుడుగా 1915 డిసెంబర్ 1వ తేదీన తాత్కాలిక భారత ప్రభుత్వ స్థాపన, విదేశాలలో స్వాతంత్రోద్యమ కార్యక్రమంలో ముఖ్యఘట్టం. భారత జాతీయ కాంగ్రెస్ భారతదేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేవరకు మహేంద్ర ప్రతాప్ అధ్యక్షుడుగా ఉంటాడు. 1914 డిసెంబర్‌లో, భారత దేశం నుంచి విదేశాలకు బయలుదేరాడు. బెర్లిన్‌లో ఇండియన్ సొసైటిలో చేరాడు. 1915లో టర్కో-జర్మన్ ప్రతినిధి వర్గంతో ఆఫ్ఘనిస్తాన్‌కు కైజర్ నుంచి, టర్కీ సుల్తాన్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ అమీర్‌కు, భారత దేశంలోని సంస్థానాధీశులకు లేఖలతో మహేంద్రప్రతాప్‌ను పంపించారు. బర్కతుల్లా తాత్కాలిక ప్రభుత్వంలో ప్రధాన మంత్రి అయ్యాడు. ఒబైదుల్లా భారత వ్యవహారాల మంత్రిగా నియమితుడయ్యాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ, టర్కీలు ఓడిపోవడంవల్ల విప్లవకారుల ప్రయత్నాలు విఫలమయ్యాయి.

17.7.2.4 మాడమ్ కామా, 1861-1936



మాడమ్ కామా బొంబాయిలో ఒక సంపన్న పార్శీ కుటుంబంలో జన్మించింది. ఆమె దాదాభాయి నౌరోజీ, శ్యాంజీ కృష్ణ వర్మ పరిచయంతో రాజకీయంగా ప్రభావితులయ్యారు. 1902 సం॥ నుంచి లండన్‌లో నివాస మేర్పరుచుకొన్నారు. ఆమె గదర్ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఆమె స్టూగర్ట్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాంగ్రెసునకు హాజరై ఆ సమావేశంలో భారత త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించిన ఘనత ఆమెకే దక్కుతుంది. ఆ సమావేశంలో ఆమె భారతదేశంలో బ్రిటీష్‌వారి దోపిడీ విధానాన్ని నిశితంగా విమర్శిస్తూ చారిత్రాత్మక ఉపన్యాసమిచ్చారు. భారతదేశంలో నెలకొనివున్న క్షామ పరిస్థితులకు, అంటు వ్యాధులు

BRAOU

ప్రబలడానికి కారణం బ్రిటీష్ వారేనని ఆమె ఆరోపణ. ఆమె ఫ్రాన్సునకు చెందిన సోషలిస్టు పార్టీతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసికొన్నారు. ఆమె ఇంగ్లాండులో వుంటున్న ప్రముఖ విప్లవ నాయకులైన సావర్కర్, సర్దార్‌సింగ్ రాణా, ముకుంద్ దేశాయ్, వీరేంద్రనాథ్ చటోపాధ్యాయలతో పారిస్‌లో వుంటున్న హరిదయాళ్, శకలత్‌వాలాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసికొన్నారు. ప్రవాస భారత విప్లవవాది అయిన మాడమ్‌కామా "సాయుధ తిరుగుబాటును ప్రబోధిస్తూ" దాని ప్రచారానికై వందేమాతరం అనే పత్రిక ప్రారంభించారు. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో మాడమ్‌కామాను ఫ్రెంచి ప్రభుత్వం నిర్బంధించింది. ఆతర్వాత ఆమె ఫ్రెంచికమ్యూనిస్టులతో చేతులు కలిపి రష్యాకు చెందిన బోల్షివిక్లలో చాలా సన్నిహితమయ్యారు. 30సం॥లు పారిస్‌లో నివాసమున్న తర్వాత మాడమ్‌కామాను భారతదేశం తిరిగి రావడానికి బ్రిటీష్‌వారు అనుమతించారు. ఆమె 1936 సం॥లో పరమపదించారు.

17.7.2.5 లాలా హర్‌దయాళ్, 1884-1939

హర్‌దయాళ్ పంజాబ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన మేధావులలో ప్రముఖుడు. 1905లో పంజాబ్ రాష్ట్రం నుంచి ఉపకార వేతనాన్ని పొంది, ఇంగ్లండ్‌కు వెళ్లాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చేరాడు. ఐరోపా ఖండంలో శ్యాంజీ కృష్ణ వర్మతో కలిసి, బ్రిటీష్ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నాడు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవోద్యమాన్ని నిర్వహించడం కోసం, కొద్ది రోజులు భారత దేశంలో గడిపాడు. 1908లో ఐరోపా ఖండానికి తిరిగి వచ్చి, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ విప్లవం కొనసాగించాలని ప్రచారం చేసాడు. కొద్ది నెలలు ఫ్రాన్స్‌లో గడిపిన తర్వాత అమెరికాకు వెళ్ళాడు. గదర్ పార్టీని స్థాపించాడు. హర్‌దయాళ్ మహావక్త; పార్టీ పత్రిక 'గదర్' ద్వారా విప్లవ ప్రచారాన్ని కొనసాగించాడు. బ్రిటీష్ ప్రతినిధి ఫిర్యాదు చేయడంవల్ల అమెరికన్ అధికారులు హర్‌దయాళ్‌ను నిర్బంధించి వలస చట్టం (Immigration law) ప్రకారం విచారణ కొనసాగించారు. బెయిల్ (Bail) మీద విడుదల చేసిన తర్వాత అమెరికా నుంచి బయలుదేరి స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు చేరాడు. 'వందేమాతరం' పత్రికను ప్రచురించి కార్యక్రమాలలో పాల్గొన్నాడు.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లినప్పుడు హర్‌దయాళ్, కొందరు ఇతర విప్లవకారులు జర్మనీకి వెళ్ళి, తమ కార్యక్రమాలను అక్కడ కొనసాగించారు. భారత దేశానికి స్వేచ్ఛను సాధించే పోరాటంలో, జర్మన్ ప్రభుత్వ సహాయాన్ని అర్థించారు. బెర్లిన్‌లో భారత స్వాతంత్ర్య పోరాట నిర్వహణకు, ఒక కమిటీని (Indian Independence Committee) స్థాపించాడు. ఈ కమిటీకి జర్మనీ మద్ధతును సంపాదించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోవడంవల్ల హర్‌దయాళ్ కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. అతని కార్యక్రమాలు స్తంభించిపోయాయి.

17.7.2.6 వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ, 1878-1946

వీరేంద్రనాథ్, సరోజినీనాయుడు సోదరుడు. ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇంగ్లండ్ వెళ్ళాడు. సావర్కర్‌తో కలిశాడు; విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. పారిస్‌లో మాడమ్‌కామా 'వందేమాతరం' వర్గానికి చేరువయ్యాడు. ఇంగ్లండ్‌లో 'తల్వార్' అనే విప్లవ పత్రికకు చాలా కృషి చేసాడు. 1914లో బెర్లిన్‌లో స్థాపించబడిన ఇండియా స్వాతంత్ర్య కమిటీకి (Indian Independence Committee) కార్యదర్శిగా ఎన్నికైనాడు. రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లిన తరవాత స్వీడన్, బెర్లిన్ కమిటీ శాఖను ప్రారంభించడానికి వెళ్ళాడు. స్వీడన్‌లో ప్రముఖ బోల్షివిక్ నాయకులను కలుసుకున్నాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం, సామ్యవాద భావాలపట్ల మొగ్గు చూపాడు. రష్యా అనుకూల వైఖరిని ప్రదర్శించాడు. వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ చివరి రోజుల గురించి స్పష్టంగా ఏమీ తెలియదు.

17.7.2.7 చంపక్ రామన్ పిళ్ళై, 1891-1934

ఆయన తమిళనాడుకు చెందిన భయమెరుగని విప్లవ నాయకుడు. ఆయన 1908 సం॥లో భారతదేశం విడిచిపెట్టి చివరకు జర్మనీలో స్థిరనివాస మేర్పాటు చేసికొన్నాడు. జర్మనీ సహాయంతో భారతదేశంలో బ్రిటీష్

BRAOU

అధికారం తొలగించడమే పిళ్ళై లక్ష్యంగా భావిస్తారు. ఆయన లాలా హరదయాళ్, తారకనాథ్ దాస్, బర్కతుల్లాతో కలిసి బెర్లిన్‌లో భారతీయ జాతీయ పార్టీ స్థాపించాడు.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో పిళ్ళై జర్మనీలో "భారతీయ స్వచ్ఛంద సేవాదళా"న్ని ఏర్పాటు చేసాడు. దానిలోనికి ఐరోపాలోవున్న భారతీయ సైనికులను చేర్చుకోవడానికి ప్రయత్నించాడు. ఆయన 1916 సం॥లో ఆఫ్ఘనిస్తాన్ చేరి, అచ్చట రాజామహేంద్ర ప్రతాప్ స్థాపించిన తాత్కాలిక భారత ప్రభుత్వ అధ్యక్షుడుగా వ్యవహరించాడు. మొదటి ప్రపంచ యుద్ధం పరిసమాప్తమైన తర్వాత, రామన్ పిళ్ళై **"పీడిత జాతుల సంఘం"** ఏర్పాటు చేసి, వలసలలో గల ప్రజలకు ఒక వేదికను ఏర్పాటు చేశాడు. తదుపరి కాలంలో రామన్ పిళ్ళై, జర్మనీదేశాన్ని భారతదేశానికి మరింత సన్నిహితం చేయడానికి కృషి చేశాడు. ప్రవాస విప్లవ నాయకులలో ప్రసిద్ధుడు.

చంపక్ రామన్ పిళ్ళై ధైర్యసాహసాలుగల విప్లవకారుడు. 1908లో భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లిపోయాడు. చివరకు బెర్లిన్‌లో స్థిరపడ్డాడు. జర్మనీ మద్ధతుతో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని అంతమొందించాలని నమ్మాడు.

17.7.2.8. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 1883-1960

గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1883 సం॥లో కర్నూలులో జన్మించాడు. ఆయన ప్రాథమిక విద్య కర్నూలులోను ఉన్నత విద్య మదరాసులోను పూర్తి చేశాడు. ప్రముఖ విప్లవ నాయకుడైన బిపిన్ చంద్రపాల్ ప్రసంగాలవల్ల గాడిచర్ల, ఆంధ్రాలో నిర్వహించబడిన 'వందేమాతరం' ఉద్యమంలో పాల్గొన్నారు. దాని ఫలితంగా గాడిచర్లను రాజమండ్రి కళాశాల నుంచి బహిష్కరించినా ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హుడిగా ప్రకటించినా, గాడిచర్ల ఆంధ్రాలో వందేమాతరం ఉద్యమాన్ని నలుమూలలకు విస్తరింప జేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. అందువల్ల గాడిచర్ల హరిసర్వోత్తమ రావును ఆంధ్రలో రాజకీయాల స్థాపకుడు అని పిలుస్తారు. గాడిచర్ల గొప్పజాతీయ వాది.

ఆయన స్వరాజ్య పత్రికను స్థాపించి దాని సహాయంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. దానిఫలితంగా ఆయన మూడు సంవత్సరాలు కారాగార జీవితం మరియు అనేక బాధలు అనుభవించ వలసివచ్చెను. 1914 సం॥లో హోమ్‌రూల్ ఉద్యమ కార్యదర్శిగా ఆంధ్రదేశాన్ని చుట్టి, స్వదేశీ ఉద్యమం గురించి తీవ్రంగా ప్రచారం చేసిన ఘనత గాడిచర్లకే దక్కుతుంది. మచిలీపట్నంలో జాతీయ కళాశాల స్థాపించినది ఆయనే. ఆయన సహాయ నిరాకరణోద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహించడమేగాక 1925 సం॥లో స్వరాజ్య పార్టీలో చేరినారు. ఆయన మద్రాసు శాసన సభకు కూడ ఎన్నికయ్యెను.

గాడిచర్ల ఆంధ్రోద్యమాన్ని సమర్థించడమేగాక శ్రీబాగ్ ఒప్పందానికి ముఖ్య కారకుడు. 1928 సం॥లో దత్తమండలాలకు, రాయలసీమగా రూపొందడానికి ఆయన ముఖ్యకారకుడు. ఆయన గొప్ప జాతీయవాదేగాక, ఆంధ్ర గ్రంథాలయోద్యమాన్ని ప్రవేశ పెట్టడం, వయోజన విద్యావ్యాప్తికి ప్రచారం తన లక్ష్యంగా భావించెను. ఆయన అనేక గ్రంథాలను రచించెను. 1934 సం॥లో ఆంధ్రలో గ్రంథాలయ సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యెను. ఆయన ఆంధ్రదేశంలో అనేక గ్రంథాలయాలు స్థాపించెను. ఆయన దక్షిణ భారత వయోజన విద్యా సంఘ అధ్యక్షునిగా వయోజన విద్యా వ్యాప్తికి ఎనలేని కృషిచేసెను. 1948 సం॥లో గాడిచర్ల ఆంధ్రదేశ విద్యాప్రణాళిక సంఘ అధ్యక్షునిగా నియమించబడెను. ఆయన ఆంధ్రాలో అనేక గురుకుల విద్యా సంస్థల స్థాపనకు కారకుడు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గాడిచర్ల రైతు సంఘాలు ఏర్పాటు చేసెను. అస్పృశ్యత రూపు మాపేందుకు 'సామూహిక సహపంక్తి భోజనాలు' ప్రోత్సహించెను. 1960 సం॥లో పరమపదించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు బహుముఖ మేధావి.

BRAOU

17.7.2.9 గదర్ పార్టీ

అనేకమంది భారతీయులు అమెరికా, కెనడా, బ్రిటన్ మొదలగు దేశాలకు విద్యార్జన కొరకు కొందరు, జీవనోపాధి కోసం మరికొంతమంది వెళ్లారు. 1912 సం॥లో అమెరికాలో వుంటున్న భారతీయులు పోర్ట్‌లాండు ప్రాంతంలో **'హిందీ సంఘం'** ఏర్పాటు చేసికొన్నారు. ఆ సంఘ అధ్యక్షుడు బాబాసోహన్ సింగ్ భాక్నా. 1913 సం॥ నాటికి హిందూ సంఘాన్ని హిందుస్థానీ గదర్ పార్టీగా పిలువసాగారు. గదర్ అనగా విప్లవం. గదర్ పార్టీ యొక్క ముఖ్య లక్ష్యం, బ్రిటన్‌కి వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రేరేపించడం. క్లుప్తంగా గదర్ పార్టీ యొక్క ముఖ్య లక్ష్యం న్యాయ ప్రాతిపదికగా భారత ప్రభుత్వం ఏర్పాటు చేయడం. గదర్ పార్టీ 'గదర్' అనే పత్రిక నడిపింది. అది హిందీ ఉర్దూ భాషల్లో ముద్రించబడేది. కొద్దికాలం తర్వాత లాలా హరదయాల్ గదర్ పార్టీ కార్యదర్శి పదవి చేపట్టాడు. అమెరికాలోని **"యుగంతర్ ఆశ్రమం"**గదర్ పార్టీ ముఖ్య కేంద్రమైంది. గదర్ పత్రిక సహాయంతో **'గదర్ పార్టీ'** శాఖలు మలయా, బర్మా, సయాం, ఇండోనేషియా, హాంకాంగ్, పిలిప్పైన్సు, చైనా, జపాను, ఆఫ్రికా, ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండు దేశాల్లో స్థాపించబడ్డాయి.

గదర్ పార్టీ ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసుకొన్న పార్టీ. లాలా హరదయాళ్ గదర్ పత్రికద్వారా మరియు కరపత్రాల ద్వారా గదర్ పార్టీ కార్యక్రమాల విస్తరణకు ఎనలేని కృషి చేసాడు. గదర్ పార్టీ సభ్యులకు సైనిక శిక్షణ కూడ ఇవ్వబడింది. ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే గదర్ పార్టీ నాయకత్వం భారతసైనికులను బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేందుకు ప్రోత్సహించే వుద్దేశ్యంతో విదేశాలలో వుంటున్న గదర్ పార్టీ సభ్యులు భారతదేశం వెళ్లాలనే ఆలోచన చేసింది. బ్రిటీష్‌వారి అన్ని వలసలలోనూ అనేక తిరుగుబాట్లు నిర్వహించేందుకు గదర్ పార్టీ పథకాలు రూపొందించింది. గదర్ పార్టీ సభ్యులు *'భారతదేశాన్ని బ్రిటీష్ పాలన నుంచి విముక్తి చేయడానికి టర్కీ, జర్మనీ, సోవియట్ రష్యాదేశాల నుంచి సహాయం లభిస్తుంద'ని ఆశించారు.*

గదర్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు పృధ్వీసింగ్, మాడమ్ కామా మరియు దరిశి చెంచయ్య. గదర్ పార్టీ నాయకుల పథకం ప్రకారం బెంగాలులో వున్న తీవ్రవాదులకు, జర్మనీ నుంచి ఆయుధాలు, విదేశాలలో వుంటున్న భారతీయుల ఆర్థిక సహాయం అందేలా చేసి విప్లవాన్ని ప్రజ్వరిల్ల జేయాలి. గదర్ పార్టీ సభ్యులు అనేక త్యాగాలు చేశారు. కాని గదర్ పార్టీకి, రహస్య పార్టీకి కావలసిన నిర్వహణ ప్రతిపత్తి లేకపోవడం దురదృష్టం. అందుచేత బ్రిటీష్ ప్రభుత్వం గదర్ పార్టీ నాయకులందరినీ నిర్బంధించి గదర్ ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసింది.

17.7.2.9.1 దరిశి చెంచయ్య.


గదర్ పార్టీలో ఆంధ్రదేశానికి చెందిన దరిశి చెంచయ్య ప్రముఖ పాత్ర నిర్వహించాడు. గదర్ ఉద్యమంలో ఆయన ఒక ప్రముఖ వ్యక్తి. ఆయన గదర్ ఉద్యమంలో చాల కీలకమైన బాధ్యతలు నిర్వహించాడు. ఆయన ఉన్నత విద్యకోసం అమెరికా వెళ్ళి బెర్కిలీలోని కారిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చేరాడు. కాని లాలా హరదయాళ్ ప్రసంగాలతో ఉత్తేజితుడైన చెంచయ్య గదర్ పార్టీలో చేరి, ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరయ్యారు. బర్మాలో తిరుగుబాటు నిర్వహించే కష్టమైన బాధ్యత చెంచయ్యకు అప్పగించారు. ఆసియా, అమెరికాలకు చెందిన గదర్ నాయకుల సహాయంతో బర్మాను విముక్తి చేసి తరువాత జర్మనీ సహాయంతో భారతదేశంలో తిరుగుబాటు లేవనెత్తడం గదర్ ఉద్యమ లక్ష్యం. బర్మా సరిహద్దులో తిరుగుబాటు దళాలకు చెంచయ్య సంధానకర్తగా వ్యవహరించాడు. ఆపథకం విఫలం కావడంతో చెంచయ్య బందీయై ఖైదు చేయబడ్డాడు. నిర్బంధంలో చెంచయ్య దుర్భరమైన అమానుష చర్యలను ఎదుర్కోవలసివచ్చింది. వాటిని ధైర్యంతో, కృతనిశ్చయంతో చెంచయ్య భరించాడు. గదర్ పార్టీరహస్యాలు చెంచయ్య వద్ద నుంచి రాబట్టడానికి బ్రిటీష్ వారు అనుసరించిన మార్గాలన్ని విఫలమయ్యాయి. కాన్పూరు కుట్రకేసులో యిరికించడానికి ప్రయత్నించి, చెంచయ్యను దీర్ఘకాలం జైల్లో వుంచారు. ఖైదీగా చెంచయ్య వ్యవహరించినతీరు జైలు అధికారులకు దిగ్భ్రాంతులను చేసింది. 1919 సం॥లో నిర్బంధం నుంచి విడుదల లభించినా, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో

BRAOU

చెంచయ్యను తిరిగి నిర్బంధించారు. గదర్ పార్టీ ఉద్యమంలో ధృవతారలా ప్రకాశించిన చెంచయ్య 1948 సం॥లో క్రియా శీలక రాజకీయాల నుంచి నిష్క్రమించాడు.

17.7.2.10 కామాగటమారు సంఘటన

విదేశాలలో జరిగిన విప్లవ సంఘటనల ప్రభావంవల్ల జరిగిన ఒక ముఖ్య సంఘటన 'కామాగటమారు' (Komagatamaru Incident) సంఘటన. గదర్ పార్టీ కార్యక్రమాలకు ఈ సంఘటన ఎంతో తోడ్పడింది. **'కామాగటమారు'** అనే జపాన్ నౌకలో చాలామంది శిక్కులు, ఇండియా నుంచి గురుదత్ సింగ్ నాయకత్వంలో పశ్చిమ కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలో ప్రవేశించడానికి కోసం బయలుదేరారు. కెనడా అధికారులు నౌకలోని భారతీయులకు కెనడాలో ప్రవేశించడానికి అనుమతి నిరాకరించారు. అందువల్ల నౌక తిరిగి భారతదేశానికి బయలు దేరింది. తిరుగు ప్రయాణంలో చాలా బాధలకు ఓర్చి కష్టాలు పడి, 1914 సెప్టెంబర్ 28వ తేదీన ఈ నౌక కలకత్తాకు 17 మైళ్ళ దూరంలో ఉన్న బజ్జి నౌకాశ్రయానికి చేరింది. 'కామాగటమారు' నౌకలోని ప్రయాణీకులను విప్లవకారులని అనుమానించి, అధికారులు గట్టి బందోబస్తుతో ఒక ప్రత్యేకరైలును సిద్ధం చేశారు. ఈ ప్రత్యేక రైలులో ప్రయాణీకులను తీసుకువెళ్ళాలని ప్రభుత్వాధికారులు భావించారు. ప్రయాణీకులు ప్రత్యేక రైలులోకి వెళ్లడానికి నిరాకరించగానే, వారిని బలవంతంగా ఈడ్చి, రైలులోకి తోసివేశారు. ప్రయాణీకులు, అమెరికన్ రివాల్వరులను ప్రయోగించారు. ఈ సంఘర్షణలో కొందరు శిక్కులు మరణించారు; చాలామంది గాయపడ్డారు. బాబాగురుదత్ సింగ్‌కు కూడా గాయాలు తగిలాయి. కాని గురుదత్ సింగ్ తప్పించుకుని ప్రవాసంలోకి వెళ్లి పోయాడు. మరునాడు, మిగిలిన శిక్కులను ప్రభుత్వం బంధించి, ప్రత్యేక రైలులో పంజాబ్ పంపింది. ఈ బృందం విప్లవోద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వారని, ప్రభుత్వం అనుమానించింది. బ్రిటీష్ ప్రభుత్వ వైఖరిపట్ల, ప్రజలు తీవ్రంగా అసంతృప్తి చెందారు. ప్రజల ఆగ్రహావేశాలకు హద్దులేదు. పంజాబ్‌కు తిరిగి వచ్చిన శిక్కులు, విప్లవ కేంద్రాలను స్థాపించి, ప్రజలలో విప్లవోద్యమాన్ని కొనసాగించారు.



17.7.2.11 జతిన్ ముఖర్జీ

జతిన్ ముఖర్జీ, నరేంద్రనాథ్ భట్టాచార్య, తదితర విప్లవకారులు జర్మన్ల సహాయంతో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యడానికి ప్రయత్నించారు. 1915 సెప్టెంబర్ 9వ తేదీన, బాలాసోర్ వద్ద పోలీసులతో జరిగిన సంఘర్షణలో, జతిన్ ముఖర్జీ ఆత్మార్పణ చేసుకున్నాడు. అమరుడయ్యాడు.

BRAOU

17.7.3 తీవ్రవాద ఆవిర్భావం

20వ శతాబ్ది ప్రారంభానికి, భారతీయుల్లో చైతన్యం దిన దిన ప్రవర్ధమానం చెందుతోంది. జాతీయవాదంవల్ల ప్రభావితులైన రచయితలు, ఆందోళనాకారులు, దేశంలోని పేదరికానికి, బ్రిటీష్ పరిపాలనను నిందించారు. గ్రామీణ ప్రాంతాలలోని ఉన్నత వర్గాలలో, కర్షకులలో, కార్మికులలో తీవ్రమైన అసంతృప్తి ప్రజ్వరిల్లింది. 1885 నుంచి 1906 వరకు కాంగ్రెస్ అనేక విజ్ఞాపన పత్రాలను సమర్పించింది. ప్రతినిధి వర్గాలకు నాయకత్వం వహించి, మహజర్లను సమర్పించింది. కానీ, ఫలితం శూన్యం. కాంగ్రెస్‌కు ఆధ్వర్యం వహించిన మితవాద నాయకులు ఏమి సాధించలేకపోయారు. అందువల్ల ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ప్రబలడంవల్ల తీవ్రవాద జాతీయభావాన్ని ప్రచారం చేసిన రాజకీయ నాయకుల ప్రభావం గణనీయంగా పెరిగింది. భారతదేశ వివిధ ప్రాంతాలలో - పంజాబ్, బెంగాల్, మహారాష్ట్రలలో - లాలా లజపత్ రాయ్, బిపిన్ చంద్రపాల్, బాలగంగాధర్ తిలక్‌ల నాయకత్వంలో, తీవ్రవాద కార్యక్రమం ఉధృతమైంది. ఈ నాయకులు నిద్రాణమైన జాతిని మేల్కొలిపి, ప్రజలను చైతన్యవంతులుగా చేసారు. వీరి నాయకత్వంలోని తీవ్రవాదులు, బ్రిటీష్ వాగ్దానాలను నమ్మలేదు. ప్రజలను ఆత్మగౌరవం పెంపొందించుకోవాలని ఈ నాయకులు ఉద్బోధించారు. జాతీయవాదులను భారతీయ ప్రజల శక్తిసామర్థ్యాలపై నమ్మకముంచి ఆధారపడాలని ఈ నాయకులు కోరారు. రాజకీయ స్వేచ్ఛకోసం, సుదీర్ఘ సంఘర్షణకు దారితీసే తీవ్రవాద కార్యక్రమాన్ని అనుసరించాలని, ఈ నాయకులు ప్రగాఢంగా విశ్వసించారు.

17.7.3.1 కారణాలు

మితవాదుల కోర్కెలను ప్రభుత్వం ఏమి పట్టించుకోలేదు. ప్రభుత్వ వైఖరి ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు. 1892 ఇండియన్ కౌన్సిల్ చట్టంవల్ల నాయకులుకూడా తృప్తిపడలేదు. వారుకూడా తీవ్రంగా ఆశాభంగం చెందారు. మితవాద నాయకులు అనుసరించిన రాజ్యాంగ పద్ధతులను ప్రజలు విమర్శించారు. 19వ శతాబ్దంనాటికి భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో కరవు రక్కసి విజృంభించడంవల్ల, ప్రజల దారిద్ర్యం పరాకాష్టకు చేరింది. భయంకరమైన ప్లేగువ్యాధి దేశాన్ని ఊపివేసింది. ఎందరో ప్రజలు ఈ వ్యాధి సోకడంవల్ల రాలిపోయారు. ఈ దారుణ సంఘటనలవల్ల బ్రిటీష్ ప్రభుత్వంపట్ల ప్రజల్లో నమ్మకంపోయింది. ప్రభుత్వాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శించారు. చైతన్యవంతులైన యువకులు తీవ్రవాద భావాలవల్ల ప్రభావితులై, అసంఖ్యాకంగా ఉద్యమంలో చేరారు. ఈ విధంగా బ్రిటీష్ ప్రభుత్వం ప్రజాభిమానాన్ని కోల్పోయింది.

జాతీయోద్యమం ప్రారంభమైనప్పటి నుంచి దేశంలో సమరశీల జాతీయభావాలు వ్యాపించాయి. బెంగాల్‌లో రాజనారాయణ బోస్, అశ్వనీకుమార్‌దత్ వంటివాళ్ళు, మహారాష్ట్రలో విష్ణుశాస్త్రి, చిప్లంకర్ వంటివాళ్ళు, ఈ భావాలకు ప్రాతినిధ్యం వహించారు. తొమ్మిదవ దశాబ్దం చివరి పాదంలో భారతదేశాన్నంతా ఊపివేసిన జాతీయవాదం వెల్లువను, మితవాదుల నాయకత్వంలోని కాంగ్రెస్ అనుసరించలేకపోయింది. బెంగాల్‌లో పుంఖానుపుంఖాలుగా వెలువడిన సాహిత్య పత్రికలు పద్యాలు, పాటలు, నవలలు, నాటకాలు ప్రజాహృదయంలో దేశభక్తిని, జాతీయాభిమానాన్ని రగుల్కొల్పాయి.

ప్రజావెల్లువలో జాతీయ భావం పెంపొందుతున్నప్పుడు **ఆనందమఠం** (Anandamatt) నవలలో **'వందేమాతరం'** గేయాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ, ఈ భావాలకు ప్రతీక. మాతృదేశాన్ని కీర్తిస్తూ బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన కీర్తన **'వందేమాతరం'**తో మొదలైంది. ఈ నినాదమే ప్రజల నుత్తేజ పరచి, దేశభక్తికి, ఆత్మత్యాగానికి, పిలుపునిచ్చింది. దేశాభిమానాన్ని, మహాశక్తి ఆరాధనల అభేద్యాన్ని, బంకించంద్రుడు చాటిచెప్పాడు.

ఆనందమఠం బంకించంద్ర ఛటర్జీ రచించిన ప్రఖ్యాతనవల. మహాకాళి వలె ఆరాధ్యమైన మాతృదేశ సంరక్షణార్థం తమ కుటుంబాలను, గృహాలను వీడి, త్యాగం చేసిన కొందరు సన్యాసుల గాథే 'ఆనందమఠం' కథా వస్తువు.

BRAOU

17.7.3.2 లోకమాన్య బాలగంగాధర తిలక్

తీవ్రవాద నాయకులలో ప్రఖ్యాతనాయకుడు, బాలగంగాధర్ తిలక్, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో తిలక్ చేసిన కృషివల్ల ఆధునిక భారత నిర్మాతలలో ఒకరుగా దేశం ఆయనను గుర్తించింది. అగార్కర్, రనడే, నౌరోజీలవల్ల ప్రభావితుడై సాంఘిక, రాజకీయ దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించాడు. అగార్కర్‌తో కలసి, రెండు వార్తా పత్రికలను స్థాపించాడు. ఇంగ్లీషులో **'మరాఠా'** మరాఠీలో **'కేసరి'**ని ప్రారంభించాడు. తిలక్ మహావక్త, ఉజ్వల రచయిత. 'కేసరి' పత్రిక ద్వారా, ప్రజలలో జాతీయ భావాలను ప్రచారం చేసాడు. తిలక్ ప్రచురించిన వ్యాసాలు లక్షలాది ప్రజలను చైతన్యవంతులుగా చేసాయి. 1896-97లో సంభవించిన కాటకంవల్ల వేలకొద్ది ప్రజలు రాలిపోయారు. ఆ సందర్భంలో బ్రిటీష్ ప్రభుత్వ వైఖరిని నిష్కర్షగా ఖండించాడు. కరవు రక్కసి విజృంభించిన ప్రాంతాలలో ఉద్యమాన్ని ప్రారంభించినందుకు, ప్రభుత్వం ఆయనను నిర్బంధించింది. 18 నెలల కారాగారశిక్ష అనుభవించాడు. 1905లో బెంగాల్ విభజన తర్వాత విదేశీవస్తు బహిష్కరణ, స్వదేశీ, జాతీయ విద్యావిధానం, స్వరాజ్ భావాలను స్పష్టం చేశాడు. నూతన జాతీయ చైతన్యానికి, తిలక్ సజీవ ప్రతీక అయ్యాడు. తిలక్ మహావిజ్ఞాని. ఆయన రచించిన **'గీతా రహస్యం'** ఆయన అపారనిజ్ఞానానికి, వేద సాహిత్యంలో ఆయనకున్న పాండిత్యానికి నిదర్శనం. ఈ మహాగ్రంథంలో తిలక్, గీతా సారమంతా కర్మసిద్ధాంతం చుట్టూ పరిభ్రమించిందని, కొత్త భాష్యాన్ని చెప్పాడు.

17.7.3.3 అరబిందో, 1872-1950

తీవ్రవాద జాతీయోద్యమ నాయకులలో ప్రముఖుడు అరవిందఘోష్. బెంగాల్‌లో తీవ్రవాద జాతీయవాదం, స్వామి వివేకానందుని ఆధునిక వేదాంత ఉద్యమంవల్ల ప్రభావితమై, హిందూ మతంలోని తాంత్రిక భావాలను ఆధారంగా చేసుకుంది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో అసాధారణ ప్రతిభావంతుడైన విద్యార్థిగా గుర్తింపుపొంది, సివిల్ సర్వీస్ (I.C.S.) పరీక్షలో ఉన్నత శ్రేణిలో కృతార్థుడయ్యాడు. I.C.S. పదవిని నిరాకరించి, 1892లో భారతదేశానికి తిరిగివచ్చాడు. సాహిత్య వ్యాసంగంలో నిమగ్నుడయ్యాడు. చాలా పద్యాలను వ్రాశాడు. "New Lamps for old" అనే శీర్షికన బొంబాయికి చెందిన **'ఇందు ప్రకాశ్'** అనే పత్రికలో 1893 ఆగష్టు నుంచి 1894 మార్చి లోపల, చాలా ఘాటుగా వ్యాసాలను వ్రాశాడు. ప్రజాస్వామ్యం మొదలైన పెద్ద పదాలను చాలా తేలికగా వాడే ఈ తరుణంలో, ప్రజావాహినికి ప్రాతినిధ్యం వహించని కాంగ్రెస్ సంస్థ, ఒక ప్రత్యేక వర్గానికే ప్రాతినిధ్యం వహించిన కార్యక్రమం మాత్రమేకాదు. జాతీయత అనేది మతం. దాన్ని దైవం ప్రజలకు ఇచ్చింది. ఈ భావం హృదయానికి, ఆత్మకు సంబంధించినదని, అరవింద ఘోష్ జాతీయతను పైవిధంగా నిర్వచించాడు.

1905 బెంగాల్ విభజనానంతరం, రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నాడు. బిపిన్ చంద్రపాల్, తిలక్ లకు సన్నిహితుడై, కాంగ్రెస్ సంస్థలోని మితవాదులను సవాలు చేసాడు. **"వందేమాతరమ్"** పత్రికా నిర్వహణలో, బిపిన్ చంద్రపాల్‌తో సహకరించాడు. బెంగాల్ 'యుగంతర్' అనే దినపత్రికను ప్రారంభించాడు. 1906లో అరవింద ఘోష్ కళాశాల అధ్యక్షుడయ్యాడు. బెంగాల్ జాతీయ కళాశాలను స్థాపించి, తిలక్, బిపిన్ చంద్రపాల్‌లతో కలసి అరవిందుడు రాజ్యాంగ పద్ధతుల ద్వారా ఆందోళనను కొనసాగించి, విదేశీ వస్తు బహిష్కరణ అమలు జరిపి, దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చని సూచించాడు.

17.7.3.4 పునరుద్ధరణ స్వభావం (Revivalist Complexion)

తీవ్రవాద జాతీయ నాయకులు, హిందువుల ప్రాచీన వైభవంవల్ల ఉత్తేజితులయ్యారు. వేదాల కాలం నుంచి, హిందూవైభవం నుంచి, చంద్రగుప్తుడు, అశోకుడు మొదలగు చక్రవర్తుల పరిపాలనవల్ల రాణాప్రతాప్, శివాజీవంటి గొప్ప నాయకుల సాహసకృత్యాలవల్ల ఝాన్సీరాణి లక్ష్మీబాయి అసమాన పరాక్రమంవల్ల ఉత్తేజితులయ్యారు.

తీవ్రవాద జాతీయవాదాన్ని సమర్థించిన తత్వవేత్తలు, భారతదేశపు సర్వజ్ఞతను విశ్వసించారు. విదేశీ ప్రభుత్వ సంస్థల ప్రాబల్యం నుంచి, సంస్కృతీ ప్రభావం నుంచి స్వాతంత్ర్యం సాధించిన తర్వాతే హిందూ

సంస్కృతి శిఖరాగ్రాలను అందుకుంటుందని వారు నమ్మారు. జాతీయతను మతపరిభాషలో, మతతాంత్రిక ముసుగులో ప్రకటించారు.

హిందూమతాన్ని, హిందూ సార్వభౌమత్వ సాంప్రదాయాలను ఆధారంగా స్వరాజ్య ఉద్యమాన్ని రూపొందించినందుకు, సమరశీల జాతీయోద్యమ నాయకులపై కొంతకాలం తర్వాత విమర్శ వచ్చింది. మితవాద నాయకులు గుర్తించినట్లు, తీవ్రవాద జాతీయ నాయకులు భారతదేశ సమ్మిశ్ర సంస్కృతీ సిద్ధాంత ప్రాధాన్యతను గుర్తించలేదు. సమరశీల జాతీయ నాయకులు, జాతీయోద్యమానికి ఊపునిచ్చారు. కాని వారి చర్యలవల్ల మతోన్మాదం తిరిగి తలెత్తి, జాతీయ సమైక్యతకు గొడ్డలిపెట్టయింది. భారతీయ సంస్కృతి అంటే, హిందూ సంస్కృతి అని వారు భావించారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, భారత జాతిని, భారత సంస్కృతిని హిందూ మతంతో, హిందువులతో పోల్చారు.

జాతీయోద్యమ కార్యక్రమాన్ని దేశ ప్రజల లౌకిక ప్రయోజనాల నాధారంగా రూపొందించాలి. హిందూ భావాల ప్రాతిపదికపై భారత జాతీయత రూపొందడంవల్ల 1905 ఉద్యమంలోను, ఆ తర్వాత ముస్లింలు జాతీయోద్యమంలో చేరకపోవడానికి కారణమై ఉండవచ్చు. ఈ చర్యలవల్ల ముస్లిం ప్రజాబాహుళ్యం జాతీయోద్యమం నుంచి దూరమయ్యారు. 1906లో ముస్లిం లీగ్ స్థాపన జరిగింది.

అయితే అతివాదులంతా ముస్లిం వ్యతిరేకులని, మతతత్వవాదులని అర్థం చేసుకోకూడదు. తిలక్‌తో సహా అతివాదులలో ఎక్కువమంది, హిందూ-ముస్లిం ఐక్యతావాదులు, వాళ్ళల్లో చాలామంది, రాజకీయ చింతనలో ఆధునిక దృష్టి ఉన్నవాళ్ళు.

17.8 ఉగ్రవాదుల కార్యక్రమాలు

హింసావాదానికి బెంగాల్ ప్రధాన కేంద్రమైంది. అరవిందఘోష్ సోదరుడు బరీంద్రకుమార్ ఘోష్, స్వామి వివేకానందుని సోదరుడు భూపేంద్రనాథ దత్, విప్లవోద్యమాన్ని నిర్వహించారు. భావావేశంలో త్యాగబుద్ధిభావాన్ని పెంపొందించడానికి, నైతిక బలాన్ని వృద్ధిచేయడానికి, ఈ ఉద్యమానికి ఆధ్యాత్మిక ఛాయ రూపొందించారు. ఎలాంటి భవబంధాలను పెంచుకోకుండా నిష్కామకర్మ చెయ్యాలనే భగవద్గీత సందేశాన్ని, వీరు విస్తృతంగా ప్రచారం చేసారు. ఈ ఉద్యమ విజయంలో వారికి అచంచల విశ్వాసం ఉంది. 1906లో బరీంద్ర, భూపేంద్రనాథ్ దత్‌లు యుగంతర్ పత్రిక ఒక్కటే కాదు; 'వందేమాతరం', 'సంధ్య', 'నవశక్తి' వంటి పత్రికలు, విప్లవోద్యమాన్ని ఉధృతంగా ప్రచారం చేశాయి.

బెంగాలీ యువతను ధైర్య సాహసాలతో బ్రిటీష్ ప్రభుత్వ దమనకాండను ఎదిరించవలసిందని, తమ రక్తాన్ని స్వాతంత్ర్యం కోసం ధారపొయ్యవలసిందని, బరీంద్రుడు ఉద్బోధించాడు. రష్యన్, ఇటాలియన్ రహస్య సంఘాల నమూనాలో రహస్య సంఘాల రూపంలో ఈ రహస్య సంఘాలు పనిచేసాయి. బరీంద్రకుమార్ ఘోష్, అతని సహచరులు స్థాపించిన **'అనుశీలన్ సమితి'** చాలా ముఖ్యమైన సంస్థ. కలకత్తాలో స్థాపితమైన 'యుగంతర్' మరొక శక్తివంతమైన రహస్య సంఘం.

బెంగాల్ రాష్ట్రంలో 'అనుశీలన్ సమితి' కి 500 శాఖలున్నాయి. కలకత్తా, ఢక్కాలు రెండు ముఖ్య కేంద్రాలుగా రాష్ట్ర వ్యాప్తంగా శాఖలు కల్గిన 'అనుశీలన్ సమితి' ఉగ్రవాదుల కూడలి స్థానమైంది. ఈ సమితి విప్లవ సాహిత్యాన్ని పంచిపెట్టి, అజ్ఞాతవర్గాలను (Underground groups) నెలకొల్పింది. విప్లవకారులను బ్రిటీష్ అధికార్లు బాధించగా, ఈ వర్గాలు వారిని శిక్షించడానికి నిర్ణయించాయి.

1907, డిసెంబర్ 6వ తేదీన ఉగ్రవాదులు మిడ్నాపూర్ వద్ద బాంబు ప్రేలుడు ద్వారా, లెఫ్టినెంట్ గవర్నర్ ప్రయాణం చేస్తున్న రైలును పేల్చివేయడానికి ప్రయత్నించారు. అదే నెలలో ఢక్కా జిల్లా మాజీ మేజిస్ట్రేట్ లెవిన్‌ను కాల్చివేసారు. కలకత్తాలో మేజిస్ట్రేట్‌గా ఉన్నప్పుడు, కింగ్స్‌ఫర్డ్ విప్లవ కారులకు దీర్ఘకాలం శిక్షలు విధించి,

BRAOU

ప్రజల ఆగ్రహానికి పాత్రుడయ్యాడు. 1908లో ఖుదీరామ్ బోస్, ప్రపుల్ల చాకీలు, కింగ్స్‌ఫర్డ్ ప్రయాణం చేస్తున్నాడని దృఢంగా నమ్మి, ఒక శకటంపై బాంబును విసిరారు. వెంట్రుకవాసిలో కింగ్స్‌ఫర్డ్‌కు ప్రమాదం తప్పింది. ప్రపుల్ల చాకీ ఆత్మహత్య చేసుకున్నాడు. 15 సంవత్సరాల బాలుడు ఖుదీరామ్‌బోస్‌ను విచారణ జరిపించి ఉరితీశారు. బోస్ ప్రతిష్ఠ ఎంతో ఇనుమడించింది. వేలకొద్దీ శోకతప్తులైన ప్రజలు అతనికి ఎంతో ఆప్యాయంగా, కన్నీటితో వీడ్కోలు నిచ్చారు.

విప్లవకారులు కలకత్తాలో బాంబులు తయారుచేసే కార్మాగారాన్ని నిర్వహించారు. పోలీసులు కర్మాగారంపై దాడిచేసి చాలా బాంబులను, ప్రేలుడు పదార్థాలను, కొన్ని ముఖ్యమైన ఉత్తరాలను స్వాధీనం చేసుకున్నారు. దీనినే **'అలీపూర్ కుట్రకేసు'** అంటారు. అరవింద ఘోష్, హరీంద్ర గోశాయిన్ మొదలైన 39 మందిని నిర్బంధించారు. గోసాయిన్ ప్రభుత్వ సాక్షిగా తిరిగిపోయాడు. అతన్ని హత్యచేసారు. ఇద్దరికి ఉరిశిక్ష విధించారు. 36 గురికి కఠిన శిక్ష విధించారు. ప్రభుత్వ న్యాయవాదిగా వ్యవహరించిన అసుతోష్ బిస్వాస్‌ను కాల్చి చంపారు. సాక్ష్యాధారాలు లేనందువల్ల అరవిందఘోష్‌ను విడుదల చేశారు. బరీంద్రునితో సహా కొందరు నిందితులకు, యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 1908 నవంబర్‌లో, లెఫ్టినంట్ గవర్నర్ సర్ ఆండ్రూ ఫ్రేజర్‌పైన, హత్యాప్రయత్నం జరిగింది. మహారాష్ట్ర విప్లవకారుల్లో అగ్రగణ్యుడు, వినాయక్ దామోదర్ సావర్కార్, తన సోదరుడు గణేష్ సావర్కార్‌తో కలిసి **'మిత్రమేల'** అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థే తర్వాత **'అభినవ భారత్ సంస్థ'** అనే విప్లవ సంస్థగా రూపొందింది. 'అభినవ భారత్ సంస్థ' కార్యక్రమాలను, గణేశ్ సావర్కర్ నిర్వహించాడు.

పంజాబ్‌లో కూడా రహస్య సంఘాలు చురుకుగా పనిచేసాయి. బెంగాల్‌లోని సంఘటనలపట్ల పంజాబీలు ఆగ్రహం చెందారు. 1857 తిరుగుబాటు 50వ వార్షికోత్సవం దగ్గరౌతున్న కొద్దీ, శిక్కు రెజిమెంట్‌ను తిరుగుబాటు చెయ్యవలసిందని వక్తలు పిలుపునిచ్చారు. ఉగ్రవాద ఉద్యమానికి పంజాబ్‌లో అజిత్‌సింగ్ నాయకత్వం వహించాడు. అతనికి ఆగాహైదర్, సయ్యద్ హైదర్ రజాలు సహాయం చేశారు. లజపతిరాయ్, అజిత్‌సింగ్‌లను బహిష్కరించడంతో, పంజాబ్‌లో అందోళన తాత్కాలికంగా తగ్గింది.

మద్రాస్ రాష్ట్రంలో బిపిన్ చంద్రపాల్ అనర్గళ ఉపన్యాసాలవల్ల ప్రజలు ఉత్తేజితులయ్యారు. చిదంబరం పిళ్ళై సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తూ ఉపన్యసించాడు. సుబ్రమణ్యశివ, నీలకంఠ బ్రహ్మచారి, తిరుమలాచార్యులు మద్రాస్ రాష్ట్రంలో ప్రముఖ నాయకులు.

స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఉగ్రవాదుల సాహస కృత్యాలు మహోజ్వల ఘట్టం. ఉగ్రవాదులు ప్రాణాలకు తెగించి నిర్వహించిన కార్యక్రమాలు, ధైర్యంతో కూర్చిన వ్యూహాలు, తొట్రుపాటులేని చర్యలు, మృత్యువునే ధిక్కరించే ధైర్యం, దేశచరిత్రలో వీరికి విశిష్ట స్థానాన్ని ఇచ్చాయి. ఈ ఉద్యమం ఒక వర్గానికే పరిమితమైంది. ప్రజల్లో వీరికి బలంలేక పోవడంవల్ల, విప్లవకారుల ప్రయత్నాలు విఫలమైనాయి. మితవాదులు బహిరంగంగా వారిని తిరస్కరించారు. అతివాదులు వారిని అంగీకరించడానికి ఇష్టపడలేదు.

17.9 సూరత్ చీలిక

1905 వరకు కాంగ్రెస్ చట్టబద్ధమైన విధానాలను మాత్రమే విశ్వసించిన మితవాదుల ప్రభావంలో ఉండేది. కాంగ్రెస్ వార్షిక సమావేశాలలో వారు ఆమోదించిన తీర్మానాలు, ప్రభుత్వానికి సమర్పించిన విజ్ఞాపనలు, సుదీర్ఘ ప్రసంగాలు, ప్రభుత్వాన్ని ఏమాత్రం కదిలించలేదు. లార్డ్‌కర్జన్ వైస్రాయిగా ఉన్న కాలంలో అతడనుసరించిన విధానాలవల్ల, ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి పెరిగింది. "కలకత్తా కార్పొరేషన్ అధికారాలను తగ్గించడం, అధికారాల రహస్య చట్టం, విశ్వవిద్యాలయాల అధికారికీకరణంవల్ల విద్యకు ప్రజలు ఎక్కువ మూల్యం చెల్లించవలసిన

పరిస్థితి ఏర్పడడం, చివరకు బెంగాల్ విభజనతో ప్రజలలో ప్రభుత్వంపట్ల విశ్వాసం పోయి, జాతిలో ఒక కొత్త చైతన్యం రేకెత్తింది" (పట్టాభి సీతారామయ్య)

సురేంద్రనాథ్ బెనర్జీ, గోపాలకృష్ణ గోఖలే మొదలైన మితవాద నాయకులు, బెంగాలీ ప్రజలపట్ల ప్రభుత్వం ప్రదర్శించిన ఘాతుక విధానానికి నిర్ఘాంతపోయారు. గోఖలే లండన్ వెళ్ళి భారత రాజ్య కార్యదర్శిని కలిసి, బెంగాల్ విభజన రద్దుచెయ్యవలసిందని కోరాడు. కాని లార్డ్‌మార్లే, గోఖలే కోరికను నిర్లక్ష్యం చేశాడు. చట్టబద్ధమైన విధానాలపట్ల భారతీయులకు విశ్వాసం పోయింది. చట్టబద్ధమైన విధానాలను అనుసరించడంవల్ల, బెంగాల్ విభజనను నిరోధించ లేకపోవడంవల్ల ఈ విధానం, ప్రయోజనం ఏముందని యువకులు ప్రశ్నిస్తున్నారని గోఖలే అంగీకరించాడు.

1905 తర్వాత కాంగ్రెస్ సంస్థలో అతివాదులకు, మితవాదులకు మధ్య విభేదాలు తలెత్తినప్పుడు, బ్రిటీష్ పరిపాలకులు కాంగ్రెస్ సంస్థలో చీలిక తీసుకురావడానికి తీవ్రంగా ప్రయత్నించారు. తీవ్రవాదుల సవాలు వల్ల కాంగ్రెస్ విభేదాలు తలెత్తి 1907 సూరత్ సమావేశంలో, చీలిక అనివార్యమైంది.

భారత జాతీయ కాంగ్రెస్‌లో చీలిక ఎలా వచ్చిందో వివరంగా పరిశీలిద్దాం. బెంగాల్ విభజన జరిగిన కొద్ది రోజుల్లోనే, 1905 డిసెంబర్‌లో కాంగ్రెస్ బెనారస్‌లో సమావేశమైంది. ఈ సమావేశానికి గోఖలే అధ్యక్షత వహించాడు. ఆర్థిక బహిష్కార ఉద్యమానికి కాంగ్రెస్ మద్ధతును ప్రకటించాలని, తీవ్రవాద భావాలుగల బెంగాలీ ప్రతినిధులు కోరారు. బెనారస్ సమావేశ అధ్యక్షోపన్యాసంలో గోఖలే బెంగాల్ విభజనను ఖండించి, స్వదేశీ ఉద్యమాన్ని సమర్థించాడు. 1906లో యువరాజు భారతదేశాన్ని సందర్శించవలసి ఉంది. యువరాజు పట్ల ఎలాంటి అమర్యాద చూపకూడదని ప్రభుత్వం గాఢంగా వాంఛించింది. యువరాజుకు స్వాగతం చెబుతూ, మితవాదులు తీర్మానాన్ని ఆమోదిద్దా మనుకున్నారు. తీవ్రవాదులు, బెంగాలీ ప్రతినిధులు, ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. అందువల్ల బెంగాల్ ప్రతినిధుల సమావేశ ప్రాంగణంలో లేనప్పుడు, ఈ తీర్మానాన్ని ఆమోదించారు.

1906లో తీవ్రవాదులు మితవాదుల మధ్య విధానాలు, కార్యక్రమాల గురించి ఘాటుగా చర్చలు, పరస్పర నిందారోపణలు జరిగాయి. తీవ్రవాదులు బెంగాల్‌లోని సామూహికోద్యమాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలలో విస్తరింపచేయాలని అనుకుంటే, మితవాదులు ఈ ఉద్యమాన్ని బెంగాల్‌కు మాత్రమే పరిమితం చెయ్యాలని కోరారు. బెంగాల్‌లోని తీవ్రవాదులకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో మద్ధతును ఇచ్చారు. అతివాద, మితవాద వర్గాలు బల ప్రదర్శనకు సిద్ధమయ్యాయి. 1906లో కాంగ్రెస్ కలకత్తాలో సమావేశాన్ని నిర్వహించింది. తీవ్రవాదులు తిలక్‌ను అధ్యక్షునిగా ఎన్నుకోవాలని భావించారు. కాని మితవాదులు దాదాభాయి నౌరోజీని అధ్యక్ష పదవి స్వీకరించవలసిందని కోరి, ఒప్పించి అతివాదుల ప్రయత్నాన్ని భగ్నం చేశారు. భారతీయ కురువృద్ధుడు దాదాభాయి నౌరోజీని కాంగ్రెస్‌లోని అన్ని వర్గాల ప్రతినిధులు గౌరవించారు. గ్రేట్ బ్రిటన్, ఇతర వలస ప్రాంతాలలో వలె 'స్వపరిపాలన', 'స్వరాజ్' భారత జాతీయోద్యమ లక్ష్యం అని, బహిరంగంగా అధ్యక్షోపన్యాసంలో ప్రకటించి, దాదాభాయి నౌరోజీ జాతీయవాదులను ఆశ్చర్యచకితుల్ని చేశాడు. తీవ్రవాదుల ఒత్తిడివల్ల మితవాదులు తీవ్రవాదుల కార్యక్రమంలోని ముఖ్యాంశాలను - స్వరాజ్, స్వదేశీ, ఆర్థిక బహిష్కరణ, జాతీయ విద్యావిధానాలను ఆమోదిస్తూ, తీర్మానాలను ఆమోదించారు. కలకత్తా సమావేశం తీవ్రవాద వర్గానికి విజయంగా చెప్పవచ్చు. ఈ తీర్మానాలు తీవ్రవాదులకు విజయంగా చెప్పవచ్చు. మితవాదులకు ఈ తీర్మానాలు ఇష్టంలేదు.

కలకత్తా సమావేశంలో కాంగ్రెస్ తీవ్రవాదుల ప్రతిపాదనలను ఆమోదించినప్పటికీ, మితవాదులు ఈ తీర్మానాలను అమలుపరచడానికి సిద్ధపడలేదు. 1907 కాంగ్రెస్ సమావేశానికి ముందే, లార్డ్‌మింటో మితవాదులతో అమలు జరపవలసిన సంస్కరణల గురించి చర్చలు ప్రారంభించాడు. జాతీయోద్యమాన్ని విభజించడానికి, మితవాదులను ప్రభుత్వం వైపు ఆకర్షించుకోడానికి, ఇదొక ఎత్తుగడ. తీవ్రవాదులు ఈ సంప్రదింపులవల్ల గాభరా పడ్డారు. మితవాదులు ధైర్యంగా వ్యవహరించలేరని తీవ్రవాదులు భయపడ్డారు. అందువల్ల 1907 సమావేశంలో

BRAOU

కాంగ్రెస్ సంస్థను స్వాధీనం చేసుకోడానికి నిశ్చయించారు. కాంగ్రెస్ సమావేశాన్ని తీవ్రవాదం కేంద్రమైన నాగపూర్ నుంచి సూరత్‌కు మార్చారు. సూరత్‌లో మితవాద నాయకుడైన ఫిరోజ్‌షా మెహతాకు బలగం ఎక్కువగా ఉంది.

1907లో కాంగ్రెస్ సూరత్‌లో సమావేశమైనప్పుడు రెండు వర్గాలు కాంగ్రెస్ సంస్థపై పెత్తనాన్ని చలాయించడానికి తీవ్రంగా పోటీ పడ్డాయి. బహిరంగ సంఘర్షణను నివారించడానికి రాజీ ప్రతిపాదనలను రూపొందించి తిలక్ ప్రయత్నించాడు. కాని,విఫలుడయ్యాడు. గోఖలే రూపొందించిన కాంగ్రెస్ కొత్త నియమావళి ప్రకారం కాంగ్రెస్ ఆమోదించిన లక్ష్యాలకు, గత సంవత్సరం ఆమోదించిన లక్ష్యాలకు తేడా ఉంది. కాంగ్రెస్ ధ్యేయాన్ని బలహీనపరచడాన్ని తిలక్ వ్యతిరేకించాడు. ఈ వివాదాన్ని పరిష్కరించడానికి సమష్టి కమిటీలో చర్చలు జరపడానికి కూడా తిలక్ అంగీకరించాడు. కాని మితవాదులు సర్దుబాట్లకు ఇష్టపడలేదు. కాంగ్రెస్ సమావేశం కాగానే, మితవాదులు అధ్యక్ష పదవికి రాస్‌బిహారీ ఘోష్ పేరును ప్రతిపాదించారు. తీవ్రవాదులు లాలా లజపతిరాయ్ పేరును ప్రతిపాదించారు. లజపతిరాయ్ తన పేరును ఉపసంహరించుకున్నాడు. బహిరంగంగా ఎన్నిక జరిపించాలని తీవ్రవాదులు కోరారు. కాని, ప్రయోజనం లేకపోయింది. సమావేశంలో తీవ్రమైన గలభా జరగడంతో గొడవల మధ్య సమావేశం వాయిదా పడింది. మరునాడు రాస్‌బిహారి ఘోష్ అధ్యక్ష స్థానాన్ని అలంకరించాడు.అధ్యక్షోపన్యాసం చేయడానికి ఆయన లేవగానే, తిలక్ వేదికపైకి వచ్చి, తనకు మాట్లాడడానికి అనుమతి నివ్వాలని గట్టిగా కోరాడు. తిలక్ కోరికను అధ్యక్షుడు తిరస్కరించాడు. తిలక్ అధ్యక్షుని నిర్ణయాన్ని ఆమోదించలేదు. అందువల్ల కాంగ్రెస్ సమావేశంలో, కొట్లాటలు జరిగాయి. పోలీసులు కాంగ్రెస్ సభాస్థలిలోకి ప్రవేశించారు. మితవాద నాయకులు కొత్త నియమావళిని ఆమోదించి, తీవ్రవాదులను కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు. ఈ విధంగా సూరత్ సమావేశానంతరం, కాంగ్రెస్ రెండు ముక్కలై నవ్వులపాలైంది. తీవ్రవాద వర్గానికి తిలక్ నాయకుడు, మితవాద వర్గానికి గోఖలే నాయకత్వం వహించాడు.

17.10 చీలిక తరవాత

ప్రభుత్వం తీవ్రవాద ఉద్యమాన్ని కఠినంగా అణచివేయడం ప్రారంభించింది. తీవ్రవాద నాయకులను నిర్బంధించి, పరోక్షంగా మితవాదులకు సాయపడింది. మితవాద జాతీయవాదులను శాంతింపచేయడానికి, బ్రిటీష్ ప్రభుత్వం 1909 లో మింటో - మార్లే రాజ్యాంగ సంస్కరణలను ప్రకటించింది. మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజకవర్గాల ఎన్నిక విధానాన్ని ప్రకటించగానే, మితవాదులు తీవ్రంగా ఆశాభంగం చెందారు. సూరత్ సమావేశానంతరం 9 సంవత్సరాల కాలం, మితవాదులు ఏకాంత విధానాన్ని అనుసరించి, తమ ఆశయాల ప్రకారం కార్యక్రమాలతో కాంగ్రెస్ సంస్థపై పెత్తనం చలాయించారు. కాని ప్రజలకు వారిపై విశ్వాసం లేదు. కాంగ్రెస్ ప్రజాదరణను కోల్పోయింది.

తీవ్రవాదులు కొంతకాలం ప్రవాసానికి వెళ్ళిపోయారు. అరవిందఘోష్ రాజకీయాలకు స్వస్తి చెప్పి, పుదుచ్చేరికి వెళ్ళిపోయాడు. తిలక్‌ను ఆరు సంవత్సరాలు చెరసాలకు పంపారు.

కాని ప్రజల శ్రమ, వృధా కాలేదు. భారత రాజ్య కార్యదర్శి లార్డ్ క్రెవీ, బెంగాల్‌లో అశాంతికి, ఆందోళనకు విభజనే కారణమని గుర్తించాడు. 1912, మార్చి 22వ తేదీ ప్రకటన ద్వారా, బెంగాలీలకు జరిగిన అన్యాయాన్ని తొలగించాడు. బెంగాల్ విభజనను రద్దుచేసి, సమైక్య బెంగాల్ రాష్ట్రాన్ని తిరిగి పునరుద్ధరించారు. కేంద్రప్రభుత్వ రాజధానిని, కలకత్తా నుంచి ఢిల్లీకి బదలాయించారు.

బెంగాల్ రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ప్రారంభమైన ఆందోళన, జాతీయోద్యమంగా రూపొందింది. తీవ్రవాద జాతీయవాదం, జాతీయోద్యమంలో శాశ్వత లక్షణంగా రూపొందింది. వివిధ రాజకీయ వర్గాల ప్రజలు, అకుంఠితమైన దేశభక్తితో, ఘోరమైన అన్యాయాన్ని ప్రతిఘటించడానికి సమైక్యంగా వ్యవహరించారు. 'రాజకీయ యాచకత్వ' శకం ఈ విధంగా అంతమైంది.

BRAOU

II మీ అవగాహన పరీక్షించుకోండి

1) 20వ శతాబ్దపు ప్రారంభంలో భారతదేశంలోని ముఖ్యమైన విప్లవవాదులెవరు?

.....

.....

.....

.....

2) 1907, సూరత్ కాంగ్రెస్ ప్రాముఖ్యత ఏమి?

.....

.....

.....

.....

17.11 సంగ్రహంగా

1. మితవాదులకు, అతివాదులకు లక్ష్యాలు, పద్ధతులు విషయాలల్లో మౌలికమైన భేదాభిప్రాయాలున్నాయి. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం నడపడానికి, ప్రజా బాహుళ్యాన్ని సమీకరించాలన్నది అతివాదుల విధానం. అయితే మితవాదులు, రాజ్యాంగ బద్ధమైన,శాంతియుత విధానాలను మాత్రమే విశ్వసించారు.
2. 1905లో బెంగాల్ విభజన, భారతీయుల్లో జాతీయతను పెంపొందించింది.
3. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమయిన స్వదేశీ ఉద్యమం, దేశంలోని అనేక ప్రాంతాలకు వ్యాపించింది. స్వదేశీ ఉద్యమంలో భాగంగా, బ్రిటీష్ వస్తువులను బహిష్కరించాలని, అతివాదులు ప్రబోధించారు.
4. 20వ శతాబ్దపు ప్రారంభంలో విప్లవవాదులు కూడా విజృంభించారు.
5. మితవాదులకు, అతివాదులకు ఉన్న విభేదాలవల్ల 1907 లో సూరత్‌లో కాంగ్రెస్‌లో చీలిక ఏర్పడింది.

17.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I 1) స్వరాజ్ లేదా పూర్తి స్వాతంత్ర్యం, అతివాదుల గమ్యం. బ్రిటీష్ సామ్రాజ్యంలోనే భాగంగా వుంటూ, స్వపరిపాలన అనుభవించడం, మితవాదుల గమ్యం.

2) బెంగాలీలను, హిందువులను, మహమ్మదీయులను విడదీయడంవల్ల, బెంగాల్ ప్రజలు, బెంగాల్ విభజనను వ్యతిరేకించారు.

II 1) 20వ శతాబ్దపు ప్రారంభంలో వున్న ముఖ్య విప్లవవాదులు, సావర్‌కర్ సోదరులు, ఖుదిరాంబోస్, ప్రపుల్లచాకీ, వాంచి అయ్యర్.

2) 1907లో సూరత్ కాంగ్రెస్, కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలింది. అందువల్ల ఆ సమావేశానికి ప్రాముఖ్యత వుంది.

BRAOU

17.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. మితవాదులు, తీవ్రవాదులు అనుసరించిన పద్ధతులు, వారి ఆశయాలలో గల వ్యత్యాసాలను పరిశీలించండి.
2. తీవ్రవాద జాతీయోద్యమ కాలంలో బెంగాల్, మహారాష్ట్రలలోని జాతీయోద్యమాన్ని హిందూ పునరుజ్జీవన వాదం ఎలా ప్రభావమొనరించిందో వర్ణించి, తరువాతికాలంలో దీని పర్యవసానాలు ఎలా ఉన్నాయో వివరించండి.
3. బెంగాల్ విభజనకు దారితీసిన సంఘటనలను, వాటి ఫలితాలను వివరించండి.
4. వ్యక్తిగత ఉగ్రవాదం విజృంభించడానికి కారణాలను తెలిపి, దాని స్వభావం, పరిణామాన్ని వివరించండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి :**

1. తీవ్రవాద జాతీయవాదులు అనుసరించిన పద్ధతులపై ఒక లఘు వ్యాఖ్య వ్రాయండి.
2. స్వదేశీ - బహిష్కరణ ఉద్యమం నడచిన తీరును సమీక్షించండి.
3. 1907 సూరత్ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్‌లో చీలిక ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులను వివరించండి.
4. భారత జాతీయోద్యమంలో తీవ్రవాద కార్యకలాపాలు పెరగడంపై, ఒక లఘు వ్యాఖ్య వ్రాయండి.

17.14 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C. : *Constitutional History of India and National Movement.*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra : *Freedom Struggle Others*
4. Desai, A.R. : *Social Background of Indian Nationalism*
5. Majumdar, R.C. : *Advanced History of India*
   Three Phases of India's Struggle for Freedom
6. Natarajan and Prema Ramakrishna : *Political and Cultural History of India, Vol.II*
7. Spear, Perceival : *History of India, Vol. II*
8. Tarachand : *History of the Freedom Movement in India, Vol.III*
9. అల్లాడి, వైదేహి : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947)*
10. జితేందర్ రెడ్డి బి. : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు*
11. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం.*

BRAOU

భాగం - 18 ముస్లింలీగ్, మతతత్వ విజృంభణ

విషయక్రమం

18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 బ్రిటీష్‌వారి విభజించి పాలించు విధానం

18.3 అలీగర్ ఉద్యమం, సయ్యద్ అహమ్మద్ ఖాన్

18.4 మతతత్వ విజృంభణకు కారణాలు

18.5 మింటో వద్దకు మహమ్మదీయ ప్రతినిధి వర్గం

18.5.1 ప్రత్యేక నియోజక వర్గాలు, ప్రాతినిధ్య విధానం ఏర్పాటు

18.6 ముస్లింలీగ్ స్థాపన

18.7 లక్నో ఒప్పందానికి దారితీసిన పరిస్థితులు

18.8 లక్నో ఒప్పందం

18.9 హిందూ మహాసభ

18.10 హిందూ మహ్మదీయ సంబంధాలు

18.11 ముస్లింలీగ్ పునరుద్ధరణ

18.12 మత ఘర్షణలు

18.13 మహమ్మద్ అలీ జిన్నా

18.14 సంగ్రహంగా

18.15 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

18.16 పరీక్ష నమూనా ప్రశ్నలు

18.17 ఉపయుక్త గ్రంథాలు

18.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. భారతదేశంలో మతతత్వ విజృంభణకు కారణాలు
2. ముస్లింలీగ్ స్థాపనకు దారితీసిన పరిస్థితులు
3. హిందూ మహాసభ స్థాపన
4. 1916 లక్నో ఒప్పందానికి కారణాలు, అందులోని అంశాలు

18.1 పరిచయం

జాతీయ వాదానికి పూర్తి విరుద్ధమైన మతతత్వం, బ్రిటీష్ సామ్రాజ్యవాదపు శిశువు. మతతత్వపరమైన రాజకీయాల విజృంభణవల్ల దేశంలో విద్వేష వాతావరణం నెలకొనింది. భారతదేశంలో హిందువులు ముస్లింలు రెండు ప్రత్యేక జాతులని, ముస్లింలీగ్ ఒక కొత్త సిద్ధాంతాన్ని రూపొందించింది. ఈ అశాస్త్రీయ వ్యాఖ్యానానికి ధీటుగా, హిందూమత తీవ్రవాదులు హిందువులే భారతజాతి అని, ఇతర మతాల ననుసరించేవారు విదేశీయులని విరుచుకుపడ్డారు.

భారతదేశంపై బ్రిటీష్‌వారు తమ పెత్తనాన్ని నెలకొల్పక మునుపు, ముస్లింలు శతాబ్దాల తరబడి పరిపాలించారని మనకిదివరకే తెలుసు. బ్రిటీష్ పరిపాలనకు ముందు వారు పాలకులు కనుక అధికులమనే

BRAOU

గర్వంతో విర్రవీగారు. పరాజితులైన జాతిగా బ్రిటీష్ పరిపాలనను ముస్లింలు తీవ్రంగా నిరసించారు. హిందూ ముస్లిం వర్గాలపట్ల బ్రిటీష్ తూర్పు ఇండియా కంపెనీ దృక్పథాన్ని పరిశీలిద్దాం. మొదట్లో కంపెనీ హిందువులకు అనుకూలంగా వ్యవహరించి ప్రోత్సహించింది. ఇంగ్లీష్‌వారు ముస్లింలు తమ పరిపాలనకు వ్యతిరేకులని భావించి, కంపెనీ పరిపాలనా యంత్రాంగంలో ప్రముఖ పదవులను వారికివ్వలేదు. చాలామంది ముస్లింలు దేశీయ చేతివృత్తులపై ఆధారపడి జీవనోపాధిని సంపాదించుకునేవారు. భారతదేశంలో కుటీరపరిశ్రమలు నాశనం కావడంతో చాలామంది ముస్లింలు జీవనోపాధిని కోల్పోయారు. సైనిక దళాలలో చాలామందికి ప్రవేశంలేదు. భారత ముస్లింలు ఆర్థికంగా పతనమయ్యారు. విద్యా విషయంలో కూడా ముస్లింలు వెనుకబడ్డారు. ముస్లింలు అనుసరించిన సాంప్రదాయిక విధానాలవల్ల, ఇంగ్లీష్ విద్యపట్ల వారు వ్యతిరేక భావాన్ని పెంపొందించుకోవడంవల్ల, 1872 వరకు కొత్త ఇంగ్లీష్ విద్యా విధానంవల్ల ప్రయోజనాన్ని పొందలేకపోయారు.

1817 తిరుగుబాటులో హిందువులు, ముస్లింలు సమైక్యంగా పోరాడినా బ్రిటీష్ అధికారవర్గం ముస్లింలను మొగల్ పరిపాలనను పునరుద్ధరించే ప్రయత్నంగా భావించారు. బ్రిటీష్ పరిపాలకులు ఈ తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణచివేసారు. భారతీయ ముస్లింల చరిత్రలో తిరుగుబాటు అంతమైనకాలం, రాజకీయ సాంస్కృతిక రంగాల్లో అంధకారశకం. 1857 విప్లవం తర్వాత కొన్ని దశాబ్దాలకాలం, బ్రిటీష్ ప్రభుత్వం ముస్లింలపట్ల ప్రతీకార వైఖరిని ప్రదర్శించింది. ముస్లింలను అణచివేసి సైనిక, సివిల్ పరిపాలనా యంత్రాంగం ఉన్నత పదవులకు అనర్హులుగా ప్రభుత్వం పరిగణించింది. ముస్లిమ్‌లు అధికార్ల వైఖరిని ద్వేషించి, నిరసించారు. సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ రాజకీయ రంగంలో ప్రవేశించేపరకు ఇదే విధానం కొనసాగింది.

1871 లో రచించిన **'ఇండియన్ ముసల్మాన్‌లు'** (The Indian Mussalmans)అనే పుస్తకంలో, సర్ విలియం హంటర్ ఇలా తన అభిప్రాయాన్ని ప్రకటించాడు. ముస్లింలకు తిరుగుబాటు చేయడానికి తగినంత బలంలేదని, అందువల్ల ఆంగ్లో-ముస్లిం సహకారం ప్రాతిపదికగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఉందని భావించాడు. ముస్లింలపట్ల వ్యతిరేకతను ప్రదర్శించి వాళ్ళ శత్రుత్వం పొందడంకంటె, వారితో మైత్రి చేసుకోవడమే ప్రయోజనకరమని లార్డ్ లిట్టన్ భావించాడు.

18.2 బ్రిటీష్‌వారి విభజించి పాలించు విధానం

జాతీయోద్యమం విజృంభించడంతో బ్రిటీష్ అధికారులు ముస్లింలపట్ల అనుకూలంగా వ్యవహరించారు. మొదటినుంచి, బ్రిటీష్ అధికారులు తమ అధికారాన్ని శాశ్వతంగా కొనసాగించడానికి, **'విభజించి పాలించే'** కుటిల విధానాన్ని అనుసరించారు. బ్రిటీష్ పాలకులు భారత రాజకీయాలలో మతతత్వ వేర్పాటు ధోరణులను ప్రోత్సహించారు. ముస్లిం అల్పసంఖ్యాక వర్గాల హక్కులను రక్షించే బాధ్యతను స్వీకరించినట్లు చెప్పుకొని, ముస్లింలను, జమీందారులను, భూస్వాములను, విద్యావంతులైన మధ్యతరగతివారిని తమ విధానాలవైపు ఆకర్షించుకోడానికి ప్రయత్నించారు. భారత సమాజంలో ఎన్నో చీలికలు తేవడానికి ప్రయత్నించారు. బెంగాలీల ఆధిక్యతకు వ్యతిరేకంగా బ్రాహ్మణేతరులను, అగ్రకులాలకు వ్యతిరేకంగా క్రింది కులాలవారిని ఉసికొల్పడానికి, కులవ్యవస్థను వాడుకోవాలని చూశారు. హిందువులు, ముస్లింలు సఖ్యతతో జీవించే సంయుక్తరాష్ట్ర (U.P), బీహార్ రాష్ట్రాలలో కోర్టు భాషగా ఉర్దూని తొలగించి, హిందీని ప్రోత్సహించాలనే ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్ధతును ఇచ్చారు. భారత సమాజంలో భిన్న తరగతుల ప్రజల న్యాయసమ్మతమైన కోర్కెల్ని సైతం, భారత ప్రజల్లో విభేదాలు సృష్టించడానికి సాధనాలుగా వాడుకోవడానికి ప్రయత్నించారు. బ్రిటీష్ పాలకులు కుల, మత, ప్రాతిపదికపై, సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఈ విధంగా అధికారులు ప్రజల్లో వేర్పాటు వైఖరులను ప్రోత్సహించారు.

BRAOU

18.3 అలీగర్ ఉద్యమం, సయ్యద్ అహ్మద్ ఖాన్

కాంగ్రెస్‌తో సహకరించకుండా ఉండడానికి, ప్రభుత్వం ముస్లింలను ఆదరించింది. ముస్లింలను సమైక్యపరచి వారిలో పాశ్చాత్య విద్యా సంస్కృతులపట్ల అభిలాష పెంపొందించడానికి, ఉద్యమం ప్రారంభించిన మొదటి నాయకుడు సయ్యద్ అహ్మద్ ఖాన్, భారతీయ ముస్లింలకు, బ్రిటీష్ ప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలు పెంపొందించడానికి కృషి చేసాడు. ఇస్లాం పునరుజ్జీవనానికి ఆయన ప్రతీక. రాజా రామ్‌మోహన్ రాయ్ కృషి హిందువుల కెంత ముఖ్యమైనదో, అదే విధంగా సర్‌సయ్యద్ కృషి ముస్లింలకు అంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన గొప్ప విద్యావేత్త; సంఘ సంస్కర్త. పాశ్చాత్య విద్యపట్ల ముస్లింలలో తీవ్రమైన వాంఛను రేకెత్తించారు. తన ఆశయాల సాధనను, అలీగర్‌లో ఆంగ్ల-ఓరియంటల్ కళాశాలను స్థాపించాడు. ఆ కళాశాలే కాలక్రమేణా, అలీగర్ ముస్లిం విశ్వవిద్యాలయం అయింది. ముస్లిం సమాజ పునర్వికాసానికి, ఈ కళాశాల ప్రముఖ పాత్ర నిర్వహించింది. ఈ కళాశాల బ్రిటీష్ ప్రభుత్వంపట్ల మోజు పెంపొందించుకుని, పాశ్చాత్య సంస్కృతిపట్ల మోజు చూపించే ఆధునిక ముస్లిం మేధావి వర్గాన్ని సృష్టించింది.

మొదట్లో సర్‌సయ్యద్ అహ్మద్ ఖాన్ జాతీయ భావాలపట్ల ప్రభావితుడయ్యాడు. ఆ కాలంలో హిందూ ముస్లింల మధ్య సన్నిహిత సహకార అవసరాన్ని ప్రగాఢంగా విశ్వసించాడు. హిందూ-ముస్లిమ్ సమైక్యతను వాంఛించాడు. హిందూ-ముస్లింలు భారతదేశమనే అందమైన వధువుకు రెండు నేత్రాలని వర్ణించాడు. కలిసికట్టుగా మనసా, వాచా సమైక్యంగా వ్యవహరించాలని ఉద్బోధించాడు. సమైక్యంగా ఉంటే, పరస్పరం మద్ధతును ఇచ్చిపుచ్చుకోవచ్చునని, పరస్పర విభేదాలు రెండు వర్గాల ప్రజలను నాశనం చేస్తాయని ప్రకటించాడు.

సర్ సయ్యద్ వంటి ప్రగాఢ దేశభక్తుడు, జాతీయవాది, మతతత్వపరమైన వేర్పాటు ధోరణి ఆవిర్భావానికి ప్రముఖపాత్ర నిర్వహించడం, దేశచరిత్రలో విషాదకర సంఘటన. జాతీయవాదానికి, కాంగ్రెస్‌కు బద్ధవిరోధి అయ్యాడు. బ్రిటీష్ వారికి ఆప్తమిత్రుడై, ఆంగ్లో-ముస్లిమ్ మైత్రిని ప్రోత్సహించాడు. అలీగర్ మహమ్మడన్-ఆంగ్లో-ఓరియంటల్ కళాశాలాధ్యక్షుడు బెక్, ఆంగ్లో-ముసల్మాన్ మైత్రివల్ల ముస్లింల పరిస్థితి మెరుగౌతుందని, జాతీయవాదులతో చేయికలిపితే నానా బాధలు పడతారని చెప్పి, సర్ సయ్యద్‌ను నమ్మించి, ఒప్పించాడు. ముస్లింల ప్రయోజనాలను కాపాడాలంటే, ఆంగ్లేయులతో సహకరించవలసిన అవసరాన్ని బెక్ స్పష్టంచేసి, సర్ సయ్యద్ మనస్సుకు హత్తుకునేలా చెప్పాడు. సర్‌సయ్యద్ ముస్లిం జాతీయవాదానికి ప్రతీక. 1883లో ఒక ఉపన్యాసంలో హిందువులు, ముస్లింలు సంఘర్షణకు తలపడ్డ రెండు జాతులని, సమష్టి రాజకీయ జీవనాన్ని కొనసాగించలేరని ప్రకటించాడు.

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన తర్వాత సర్‌సయ్యద్‌లో మౌలికమైన మార్పు వచ్చింది. సర్‌సయ్యద్ భారత జాతీయ కాంగ్రెస్‌ను వ్యతిరేకించాడు. ముస్లింలు జాతీయ కాంగ్రెస్‌లో చేరడానికి ఒప్పుకోలేదు. ప్రజాస్వామిక పద్ధతులలో ప్రాతినిధ్య సంస్థలను ఏర్పాటు చెయ్యాలని, ప్రభుత్వ యంత్రాంగంలో ఎక్కువ అవకాశాలు కల్పించాలనే కాంగ్రెస్ డిమాండ్‌వల్ల ముస్లింల ప్రయోజనాలకు భంగం కలుగుతుందని ప్రగాఢంగా విశ్వసించాడు. బ్రిటీష్ పద్ధతిలో ఏర్పడే ప్రాతినిధ్య శాసనసభలవల్ల భారతదేశంలో ఎక్కువ ప్రాంతంలో ఎల్లప్పుడు హిందువులే అధిక సంఖ్యాకులుగా ఉంటారని, ముస్లింలు ఎన్నడూ అధికారంలోకి రాలేరని, తన మతంవారిని హెచ్చరించాడు. హిందువులకు అధికంగా ఆర్థిక సంపద ఉండడంవల్ల, విద్యావకాశాలవల్ల ముస్లింలకు బ్రిటీష్ ప్రభుత్వ మద్ధతులేనిదే, హిందువులు తమను పూర్తిగా అణగదొక్కుతారని సయ్యద్ ఆందోళన చెందాడు. ముస్లింలు బ్రిటీష్ ప్రభుత్వంపట్ల విశ్వాసపాత్రులై ఉండాలని సలహా ఇచ్చాడు. కాంగ్రెస్‌ను తీవ్రంగా వ్యతిరేకించాడు. ప్రజాస్వామ్య పరిపాలన అంటే, అధిక సంఖ్యాకుల పరిపాలన అని, భారతదేశంలో అధిక సంఖ్యాకుల పరిపాలన అంటే, హిందువుల పరిపాలన అని చెప్పాడు. అందువల్ల ఆంగ్లో-ముస్లిం మైత్రిని సమర్థించి, కాంగ్రెస్‌కు బద్ధ విరోధి అయ్యాడు.

BRAOU

సయ్యద్ అహ్మద్ ప్రచార ఫలితంగా ఎక్కువ మంది కాంగ్రెస్‌లో చేరలేదు. బెనారస్‌రాజా, శివరామ్ ప్రసాద్‌లతో కలిసి, 1883లో బ్రిటీష్ పరిపాలనవల్ల విశ్వాసం ప్రకటించే సంస్థను (Patriotic Association), కాంగ్రెస్‌కు పోటీగా వ్యవహరించడానికి స్థాపించాడు. ఈ సంస్థ అభ్యుదయ వ్యతిరేక దృక్పథాన్ని అనుసరించింది. కాంగ్రెస్ అభ్యుదయ భావాలను వ్యతిరేకించి, బ్రిటీష్ ప్రభుత్వంపట్ల విశ్వాసాన్ని ప్రకటించింది.

ముస్లింలు విద్యారంగంలో వెనుకబడి ఉండడంవల్ల వారిలో మతతత్వం, వేర్పాటు ధోరణులు విజృభించాయి. ముస్లిం ఉన్నత వర్గాలలో చాలామంది జమీందార్లు, కులీనులు. వారు బ్రిటీష్ వ్యతిరేక విధానాన్ని అనుసరించినారు. అంతేకాకుండా, సాంప్రదాయిక విధానాన్ని అనుసరించి, ఆధునిక విద్యపట్ల వ్యతిరేక భావాన్ని ప్రదర్శించారు. అందువల్ల భారతదేశంలో ముస్లిం విద్యావంతులు చాలా తక్కువ. శాస్త్రీయ విజ్ఞానం, ప్రజాస్వామ్యం, జాతీయభావాలకు ప్రాధాన్యతనిచ్చిన ఆధునిక పాశ్చాత్య విద్య ముస్లిం వైజ్ఞానిక వర్గంలో విస్తరించనందువల్ల వారు సాంప్రదాయిక విధానాలను అనుసరించి వెనుకబడ్డారు. కాని పాశ్చాత్య విద్యను ముందు నుంచి అభ్యసించిన హిందువులు, పరిపాలనారంగంలో ఉన్నత పదవులను చేపట్టి ముస్లింల కంటే ఎక్కువ లాభం పొందారు.

తర్వాత సయ్యద్ అహ్మద్ ఖాన్ బద్రుద్దీన్ త్యాబ్జీ మొదలగు విద్యావేత్తల కృషి ఫలితంగా, ఆధునిక విద్య ముస్లింలలో విస్తరించింది. ముస్లింలలో కొత్త మధ్యతరగతివర్గం లేనేలేదని చెప్పవచ్చు. వాణిజ్యం, పరిశ్రమల అభివృద్ధికి వారి కృషి చాలా తక్కువ. వ్యాపారం, పరిశ్రమలలో వారు పెద్దగా ఆసక్తి చూపలేదు. అందువల్ల అభివృద్ధి నిరోధకులైన భూస్వాములుకానీ వాళ్ళే మతానికి చెందినవారైనా తమ ప్రయోజనాలను కాపాడుకోడానికి బ్రిటీష్ పాలనను సమర్థించారు. హిందువులలో బాగా చదువుకున్న మేధావులు, ప్రాధాన్యతను సంతరించుకుంటున్న మధ్యతరగతివర్గంవారు, భూస్వామ్యవర్గ నాయకత్వాన్ని తొలగించారు. దురదృష్టవశాత్తు, ముస్లిమ్ ప్రజానీకాన్ని భూస్వాములు తమ గుప్పిట్లో ఉంచుకున్నారు.

18.4 మతతత్వ విజృంభణకు కారణాలు

ముస్లిం మతతత్వ విజృంభణకు సయ్యద్ అహ్మద్ ఖాన్ చాలా ఎక్కువగా కృషి చేశాడు. మత ప్రాతిపదికపై భారతదేశాన్ని విభజించాలనే బ్రిటీష్ కుటిల విధాన వ్యూహంలో అహ్మద్ ఖాన్ ఒక పావులాగ వ్యవహరించాడు.

విద్యావంతులైన ముస్లింలకు వాణిజ్య, వ్యాపార రంగాలలో ఎక్కువ అవకాశాలు లభించనందువల్ల తప్పనిసరిగా ప్రభుత్వోద్యోగాలపై ఆధారపడ్డారు. విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా ఉండడంచేత, బ్రిటీష్ అధికారులు ప్రభుత్వంపట్ల విశ్వాసం ప్రకటించిన ముస్లిమ్ నాయకులు, విద్యావంతులైన ముస్లింలను, చదువుకున్న హిందువులపై తేలికగా రెచ్చగొట్టారు. ముస్లిం విద్యావంతులు బ్రిటీష్ ప్రభుత్వానికి విధేయులుగా ఉంటే ప్రభుత్వం వారికి ఉద్యోగాలిచ్చి గౌరవిస్తుందని ముస్లిం నాయకులు ఉద్బోధించారు.

భారతదేశ చరిత్రను ప్రాచీన, మధ్య యుగాలుగా విభజిస్తూ బ్రిటీష్ చరిత్రకారులు ప్రాచీన యుగాన్ని హిందూయుగంగానూ, మధ్యయుగాన్ని ముస్లింయుగంగాను గుర్తించారు. తురుష్క, ఆఫ్ఘన్, మొగల్ రాజ వంశాలు మధ్య యుగంలో భారతదేశాన్ని పరిపాలించాయి. ఈ పాలకులను ముస్లింలుగా వర్ణించి, మధ్య యుగాన్ని ముస్లింయుగంగా గుర్తించారు. పరిపాలకులందరు ముస్లింలని, ముస్లింమేతరులు పాలితులనే భావాన్ని ప్రజల మనస్సులో హత్తుకునేలా సృష్టించారు. పరిపాలకులను ఒక వర్గంగా పరిశీలిస్తే (హిందువులు, ముస్లింలు కూడా) సామాన్య ప్రజానీకాన్ని - హిందువులను ముస్లింలను, చాలా నీచంగా పరిగణించి, స్వప్రయోజనాలకు వాడుకోవడాన్ని చరిత్రకారులు చాలావరకు నిర్లక్ష్యం చేశారు. పన్నులు వసూలు చేసే అధికారులు హిందువులను ముస్లింలను కూడా దారుణంగా హింసించారు. బ్రిటీష్ చరిత్రకారులు భారతదేశ సమ్మిశ్ర సంస్కృతిని ఎక్కువగా ప్రస్తావించలేదు.

హిందువులు, ముస్లింలను కూడా వ్యక్తి సమష్టి జీవనాల్లో మతాధిక్యతను విశ్వసించారు. అంతేకాకుండా, నిత్యజీవితంలో ఒకే జీవన సరళిని, ఆచారాలను అనుసరించారు. వేషభాషలలో, ఆహార పానీయాలలో, గృహనిర్మాణ శైలిలో, వివాహాది కార్యక్రమాలలో, వ్యాపారంలో, హిందూ-ముస్లింలు సమష్టి జీవితాన్ని గడిపారు. గ్రామాలలో, పట్టణాలలో కలిసి జీవించారు. భాషా సంస్కృతులు ఈ రెండు మతాలవారిని, ప్రత్యేకత సంతరించుకున్న వర్గాలుగా విభజించలేదు. ఉదాహరణకు మద్రాసీ ముస్లిమ్, పంజాబీ ముస్లిమ్‌ల మధ్యకంటే, మద్రాసీ ముస్లిం, మద్రాసీ హిందువుల మధ్య ఎక్కువ ఆత్మీయత ఉంది. మత విభేదాలు ఉన్నప్పటికీ, అప్పుడప్పుడూ హిందూ-ముస్లింల మధ్య సంఘర్షణలు తలెత్తినా, మొత్తం మీద రెండు మతాలవారు అన్యోన్యంగా కలిసి మెలిగారు. అప్పుడప్పుడు తలెత్తిన విభేదాలు, శతాబ్దాల తరబడి కృషి ఫలితంగా రూపొందిన సాంస్కృతిక అభేద్యతను రూపు మాపలేదు.

సమరశీల జాతీయవాదం కూడా ముస్లిం మతతత్వ విజృంభణకు తోడ్పడింది. తీవ్రవాద నాయకులు (ఉదా॥ లాల్-బాల్-పాల్, అరవింద ఘోష్ మొదలగువారు) హిందూ భావాలకు, సంప్రదాయాలకు ఇచ్చిన ప్రాధాన్యతవల్ల ముస్లింలలో అనుమానాన్ని రేకెత్తించింది. ఈ నాయకులు గొప్ప దేశభక్తులు, మతతత్వ వాదులు కారు. ముస్లిం వ్యతిరేకులు కారు. ఈ నాయకులు హిందూ-ముస్లిం ఐక్యతావాదులు. కాని ఈ పరిస్థితిని, తెలివిమీరిన మతవాదులు తమ స్వార్థానికి వాడుకున్నారు. ఈ విషయంలో, హిందువులు ముస్లింల భయాందోళనలను ఉపశమింప చేయడానికి ఎలాంటి ప్రయత్నం చెయ్యలేదు. అంతేకాకుండా కొందరు తీవ్రవాద హిందూ నాయకులు, మొగల్ చక్రవర్తులను విదేశీయులుగా వర్ణించి, ముస్లింలను ఇంకా దూరం చేసుకున్నారు. ఈ తెలివిమీరిన బ్రిటీష్ వాళ్లు, బ్రిటీష్ అనుకూలవాదులు, ఈ హిందూమతఛాయను ముస్లింల మనసుల్లో విషబీజాలు చల్లడానికి వాడుకున్నారు. హిందువుల ఆధిపత్యంలో ముస్లింల పరిస్థితి పూర్తిగా దిగజారిపోతోందని, బ్రిటీష్‌వారు ముస్లింలను భయభ్రాంతులను చేసారు. అందువల్ల, ముస్లింలలో చాలామంది విద్యావంతులు జాతీయోద్యమంపట్ల నిర్లిప్త వైఖరిని అనుసరించారు. వారిలో వేర్పాటు భావాలు పెంపొందాయి.

1905లో జరిగిన బెంగాల్ విభజన, హిందూ-ముస్లింల మధ్య అగాధాన్ని సృష్టించింది. ముస్లింలు అధిక సంఖ్యలోగల తూర్పు బెంగాల్ ప్రాంతాలలో కొత్త రాష్ట్రాన్ని ఏర్పరచి, భారత ప్రభుత్వం ముస్లింల విధేయతను బహూకరించింది. రాజకీయంగా ముందడుగు వేసిన హిందువులకు వ్యతిరేకంగా వెనుకబడిన ముస్లింలను ఉసికొల్పడానికే, మత ప్రాతిపదికపై బెంగాల్‌ను విభజించినట్లు భారతజాతీయవాదులు వర్ణించారు.

18.5 మింటో వద్దకు మహ్మదీయ ప్రతినిధి వర్గం

1906లో లార్డ్‌మింటో భారతదేశంలో కొత్త సంస్కరణలు ప్రవేశపెట్టే ఆవశ్యతకను పరిశీలించడానికి, ఒక కమిటీని నియమించాడు. మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చెయ్యడంలో, అధికారవర్గం ప్రముఖ పాత్రను నిర్వహించింది. అలీగర్ కళాశాలకు బెక్ తర్వాత అధ్యక్షుడైన ఆర్చ్‌బాల్డ్ వైస్రాయి అంతరంగిక కార్యదర్శి (Private Secretary) డన్‌లప్ స్మిత్‌తో చేతులు కలిపి, ఈ వ్యవహారాన్ని నడిపాడు. ఆగాఖాన్ నాయకత్వంలో ప్రముఖ ముస్లిం నాయకుల ప్రతినిధి వర్గం వైస్రాయిని కలుసుకుని, వినతిపత్రాన్ని సమర్పించాలని వీరు నిర్ణయించారు. ఈ ప్రతినిధి వర్గం మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను, జనాభా నిష్పత్తికి మించిన ప్రాధాన్యతను(Weightage) ఇవ్వాలని, విజ్ఞప్తి చేయడానికి నిశ్చయించారు. 1906 అక్టోబర్ 1వ తేదీన ఆగాఖాన్ నాయకత్వంలో, ఒక ముస్లిం ప్రతినిధి వర్గం సిమ్లాలో లార్డ్ మింటోను కలుసుకుంది. ఈ ప్రతినిధి వర్గం ప్రత్యేక నియోజకవర్గాలను, కేంద్ర శాసనసభ నుంచి జిల్లా కోర్టుల వరకు మత ప్రాతిపదికపై సభ్యత్వాన్ని, ముస్లింలకు జనాభా ప్రకారం కాక, ప్రత్యేక పద్ధతిపై ప్రాతినిధ్యం, తమ న్యాయసమ్మతమైన ప్రయోజనాలు కాపాడు కోవడంకోసం అవసరమని కోరింది. ఈ ప్రతినిధి వర్గం క్రొత్త ముస్లిం విశ్వవిద్యాలయాల స్థాపనకు, ప్రభుత్వ సహాయాన్ని కోరింది. గవర్నర్-జనరల్ కౌన్సిల్‌ను నియమించేటప్పుడు ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని ఈ ప్రతినిధి వర్గం విజ్ఞప్తి చేసింది.

BRAOU

18.5.1 ప్రత్యేక నియోజక వర్గాలు, ప్రాతినిధ్య విధానం

ఈ ప్రతినిధి వర్గం సమర్పించిన వినతిపత్రంలోని కోరికలపట్ల, వైస్రాయి పూర్తిగా సానుభూతిని చూపాడు. ముస్లింల రాజకీయ ప్రయోజనాలను పూర్తిగా కాపాడడం జరుగుతుందని హామీ ఇచ్చాడు. లార్డ్‌మింటో ఈ విధంగా చెప్పాడు "జనాభా లెక్కల ప్రకారం మాత్రమే కాక మీ వర్గం రాజకీయ ప్రాధాన్యతను బట్టి, సామ్రాజ్యానికి మీరు చేసిన సేవను బట్టి, మీ స్థానాన్ని పరిశీలించాలని కోరిన మీ కోరిక న్యాయమైనదే. మీతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను". వివిధ వర్గాల నమ్మకాలతో, ఆచారాలతో నిమిత్తం లేకుండా, వ్యక్తులకు వోటు హక్కునిచ్చే సంస్కరణలు భారతదేశంలో ప్రవేశపెడితే తప్పకుండా విఫలమౌతాయని, లార్డ్‌మింటో అంగీకరించాడు. మొదటి నుంచి ముస్లిం మత విధానాన్ని బ్రిటీష్ ప్రభుత్వం ఎలా ప్రోత్సహించిందీ, లార్డ్ మింటో ప్రకటనవల్ల తెలుస్తుంది. లేబర్ పార్టీకి చెందిన భారత రాజ్య కార్యదర్శి, లార్డ్ మార్లే మత ప్రాతిపదికపై నియోజక వర్గాలను వ్యతిరేకించినా, చివరకు వైస్రాయి అనుకున్నట్లే జరిగింది. 1909 చట్టంలో, దుష్పరిమాణాలను కల్పించిన ఈ సూత్రాన్ని ప్రవేశపెట్టారు. ప్రత్యేక నియోజక వర్గాలను కల్పించి, ప్రాతినిధ్యంలో ప్రాధాన్యతను గుర్తించి, ముస్లింలను లార్డ్‌మింటో ప్రత్యేకంగా గుర్తించాడు.

బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన ఈ విధాన ఫలితంగా, ముస్లింలు కాంగ్రెస్‌కు, హిందువులకు దూరమయ్యారు. ముస్లింలు రాజకీయంగా చాలా ప్రయోజనాలు పొందడానికి బ్రిటీష్ ప్రభుత్వానికి సన్నిహితులయ్యారు. మత ప్రాతిపదికపై ప్రాతినిధ్య విధానం, హిందూ-ముస్లిం వర్గాల మధ్య అగాధాన్ని పెంచింది. అందువల్ల వేర్పాటు వాద ధోరణి బలపడి, చిట్టచివరకు 1947లో భారతదేశ విభజన జరిగింది.

1909 చట్టంవల్ల జనాభాలో నిష్పత్తి కంటే అధికంగా ముస్లింలకు ప్రాతినిధ్యం లభించింది. హిందువులు-ముస్లింలు తమ అభ్యర్థులకు వేరుగా వోటుచేసి ఎన్నుకోవాలి. అందువల్ల నిజం చెప్పాలంటే, ఖిలాఫత్ ఉద్యమం జరిగిన కొద్దికాలం తప్ప, ఎన్నడూ హిందూ-ముస్లింలు సమైక్యంగా వ్యవహరించలేదు.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. సయ్యద్ అహమ్మద్ ఖాన్ మహమ్మదీయులు, కాంగ్రెస్‌లో చేరడాన్ని ఎందుకు వ్యతిరేకించినాడు.

.....

.....

.....

.....

2. మహమ్మదీయులలో వేర్పాటు ధోరణికి రెండు ముఖ్య కారణాలు తెలుపండి.

.....

.....

.....

.....

18.6 ముస్లింలీగ్ స్థాపన

ముస్లింల ప్రథమ రాజకీయ సంస్థ ముస్లింలీగ్ 1906లో స్థాపితమైంది. ఉన్నత వర్గాలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో, ఆలిండియా ముస్లింలీగ్‌ను ఆగాఖాన్, ధక్కా నవాబ్ సలిముల్లాల నాయకత్వంలో స్థాపించారు. నవాబుల, జమీందార్ల, కులీన వర్గాల ప్రత్యేక ప్రయోజనాలకు మాత్రమే, లీగ్ ప్రాతినిధ్యం

BRAOU

వహించింది. ముస్లింలీగ్‌కు సామాన్య ప్రజానీకపు మద్ధతు లేదు. కాంగ్రెస్‌ను వ్యతిరేకించడానికి, బ్రిటీష్ అధికారవర్గం ముస్లింలీగ్‌కు ప్రోత్సాహాన్నిచ్చింది. ఆలిండియా ముస్లింలీగ్ ముఖ్య ఆశయాలను పరిశీలిద్దాం.

1. బ్రిటీష్ ప్రభుత్వంపట్ల విధేయతను పెంపొందించడం.
2. భారతదేశంలోని ముస్లింల రాజకీయ హక్కులకు, ప్రయోజనాలకు రక్షణ కల్పించి పెంపొందించడం.
3. ఇతర వర్గాలపట్ల ద్వేష భావాలు పెంపొందకుండా నిరోధించడం.

భారతీయ ముస్లింల రాజకీయ పరిణామంలో, ముస్లింలీగ్ స్థాపన ఒక ముఖ్య సంఘటన. ఈ సంఘటన, ఈ సంస్థ ఆవిర్భవించినప్పటి నుంచి దేశద్రోహాన్ని ప్రోత్సహించే జాతి వ్యతిరేక సంస్థగా రూపొందింది. బ్రిటీష్ ప్రభుత్వంపట్ల విశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో వ్యవహరించింది. ఆలిండియా ముస్లింలీగ్ మొదటి సమావేశం సర్‌సయ్యద్ అలీ ఇమామ్ అధ్యక్షతను అమృతసర్‌లో జరిగింది. ఆ సమావేశంలో లీగ్ నాయకులు శాసనసభలలోను, సివిల్ సర్వీసులలోను ఎక్కువ ప్రాతినిధ్యాన్ని కోరారు. గవర్నర్-జనరల్ కార్యనిర్వాహక సంఘంలో, అధిక సంఖ్యాక వర్గంతో సమానంగా తమకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

1908లో అమృతసర్ సమావేశంలో లీగ్ మతతత్వ ధోరణి ఉన్నత, మధ్యతరగతి వర్గాల లక్షణాలు స్పష్టమౌతున్నాయి. పదవుల కోసం, ఉద్యోగాల కోసం, సంఘర్షణ కొనసాగిస్తున్న ముస్లిం వృత్తి వర్గాల ప్రయోజనాలకు మద్ధతునిచ్చింది. ముస్లింలీగ్ రాజకీయ కార్యక్రమాలు విదేశీపాలకులకు వ్యతిరేకంకాదు. ఈ రాజకీయ కార్యక్రమాలు హిందువులకు, జాతీయ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సాగాయి. కాంగ్రెస్‌తో రాజకీయ సమైక్యత సాధ్యం కాదు. ఎందుచేతంటే లీగ్ సభ్యులకు కాంగ్రెస్ వారికి సమష్టి రాజకీయ ఆశయాలు లేవని లీగ్ కార్యదర్శి నిర్మొహమాటంగా చెప్పాడు.

ముస్లింలీగ్ ముస్లిం వైజ్ఞానిక వర్గం మద్ధతును పూర్తిగా పొందలేకపోయింది. లీగ్ మతతత్వ లక్షణాలను జాతీయ నాయకులు గుర్తించారు. చాలా సంవత్సరాల కాలం జిన్నా కూడా ముస్లిం మతతత్వ విధానాన్ని ద్వేషించాడు.

1910 అలహాబాద్ కాంగ్రెస్ సమావేశంలో జిన్నా, మతతత్వం ఆధారంగా చేసుకున్న ప్రాతినిధ్య వ్యవస్థను ఖండిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ తీర్మానాన్ని మౌలానా మజహర్ ఉల్ హక్ సమర్థిస్తూ హిందూ ముస్లిం వర్గాల మధ్య ఎక్కువ స్నేహం, అవగాహన పెంపొందాలని అర్థించాడు. నవాబ్ సయ్యద్ మొహమ్మద్, షిబ్లీనౌమానీ, మౌలానా మహమ్మదాలి, మౌలానా అజాద్ మొదలైన నాయకులు ముస్లింలీగ్‌తో ఎలాంటి సంబంధాలు పెట్టుకోలేదు. అంతేకాకుండా లీగ్ అనుసరించిన మతతత్వ విధానాన్ని, బ్రిటీష్ ప్రభుత్వంపట్ల లీగ్ ప్రదర్శించిన విధేయతా విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. సయ్యద్ నజీర్ హుస్సేన్, హస్సన్, ఇమామ్, హకీమ్ అజ్ మల్ ఖాన్ మొదలైన అభ్యుదయభావాలుగల నాయకులు లీగ్ విధానాలను సమర్థించలేదు.

18.7 లక్నో ఒప్పందానికి దారితీసిన పరిస్థితులు

మింటో-మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత కొన్ని సంఘటనలవల్ల లీగ్, కాంగ్రెస్‌కు చేరువైంది. బ్రిటీష్ ప్రభుత్వం తమను సమర్థించదని, లీగ్ నాయకులు భావించారు. ముస్లిం లీగ్ కేంద్ర కార్యాలయాన్ని, అలీగర్ నుంచి లక్నోకు మార్చారు. బెక్ దుష్ప్రభావం నుంచి లీగ్ స్వేచ్ఛను పొందింది. హిందువుల ఆందోళన ఫలితంగా బెంగాల్ విభజనను బ్రిటీష్ ప్రభుత్వం రద్దు చెయ్యడంవల్ల, ముస్లింలు బ్రిటీష్ ప్రభుత్వంతో సహకరిస్తూ, విరుగుతున్న కెరటంపై ఆధారపడుతున్నారని, మహమ్మదాలీ ప్రకటించాడు. కొత్త వైస్రాయి, లార్డ్ హార్డింగ్ తటస్థ విధానాన్ని అనుసరించాడు. ఇతర ముస్లిం రాజ్యాలపట్ల బ్రిటన్ అనుసరించిన విధానంవల్ల, బ్రిటన్‌పట్ల విశ్వాసం క్షీణించింది. "హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలు సహజంగానే, బ్రిటీష్ అధికారవర్గంతో సహకరించారు. టర్కీ, పెర్షియా, మొరాకోలపట్ల ఇంగ్లండ్ వైఖరివల్ల 1911 నుంచి బ్రిటన్, ఇండియన్ ముస్లింల సానుభూతిని కోల్పోయింద"నే అభిప్రాయాన్ని, మహమ్మదాలీ ప్రకటించాడు.

ఇంగ్లండ్, టర్కీ అవలంబించిన విధానం, హిందూ-ముస్లింల సఖ్యతకు ముఖ్య కారణం. టర్కీ-ఇటాలియన్ యుద్ధంలోను, బాల్కన్ యుద్ధాలలోను, బ్రిటన్ టర్కీని సమర్థిస్తుందని, ఇండియన్ ముస్లింలు ఆశించారు. బ్రిటీష్ ప్రభుత్వ విధానంపట్ల వీరు తీవ్రంగా ఆశాభంగం చెందారు. ఇంగ్లీష్‌వారు ముస్లింలకు విశ్వాసపాత్రులైన మిత్రులు కాదని వారు భావించారు. అంతేకాకుండా మహమ్మదాలీ, సౌకతాలీ, జిన్నా వంటి నాయకులు, ముస్లింలీగ్ బ్రిటన్‌పట్ల అనుకూల విధానాన్ని త్యజించి, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనవలసిందని భావించారు. చివరకు ముస్లిం లీగ్ మొండిపట్టుదలను వదలి, కాంగ్రెస్‌కు చేరువైంది. 1913లో లక్నోలో జరిగిన సమావేశంలో బ్రిటీష్ ప్రభుత్వంపట్ల విధేయతను పెంపొందించాలి అనే ఆశయానికి బదులు, బ్రిటీష్ సార్వభౌమత్వ రక్షణలో భారతదేశానికి తగిన రీతిలో స్వపరిపాలనను సాధించడం ముఖ్యాంశమని మార్చారు.

18.8 లక్నో ఒప్పందం

1913 కాంగ్రెస్ సమావేశంలో ముస్లింలీగ్ వైఖరిలో మార్పును హర్షించారు. బ్రిటీష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా స్వపరిపాలన ఆశయాన్ని వివరిస్తూ, ఆలిండియా ముస్లింలీగ్ ఆమోదించిన తీర్మానాన్ని, కాంగ్రెస్ ప్రశంసించింది. దేశంలో వివిధ వర్గాల మధ్య సంఘీభావం, సహకారాన్ని కాంగ్రెస్ సభ్యులు హర్షించారు. 1915లో లీగ్ వార్షిక సమావేశాన్ని బొంబాయిలో నిర్వహించింది. అదే సమయంలో బొంబాయిలోనే కాంగ్రెస్‌కూడా సమావేశమైంది. గాంధీజీ, మాలవ్యా, సరోజినీ నాయుడు మొదలైన చాలామంది నాయకులు, లీగ్ సమావేశాలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు సిన్హా, లీగ్ అధ్యక్షుడు మజరుల్ హక్ సమావేశమై, పరస్పరం అభిప్రాయాలను తెలుపుకున్నారు. 1916లో కాంగ్రెస్, ముస్లింలీగ్ ఒకే సమయంలో లక్నోలో సమావేశమయ్యాయి. ఈ రెండు సంస్థలు పరస్పరం సన్నిహిత మయ్యాయి. 1916లో లక్నోలో కాంగ్రెస్-లీగ్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ నుంచి ఆర్థిక పరిపాలనా వ్యవహారాలలో సాధ్యమైనంతవరకు స్వేచ్ఛ ఉండాలి. పంజాబ్, బెంగాల్‌తో సహా అన్ని రాష్ట్రాలలో మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలు కావాలన్న లీగ్ డిమాండ్‌ను కాంగ్రెస్ అంగీకరించింది. ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలలో, వారి ప్రాతినిధ్యం హిందూ-ముస్లిం జనాభా నిష్పత్తికి రెట్టింపు ఉండాలని అంగీకరించారు. ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తూ, మైనారిటీలకు గల హక్కును కూడా ఈ ఒప్పందంవల్ల ఆమోదించారు. తమ ప్రయోజనాలకు భంగకరంగా ఉండే శాసనాన్ని తాము వ్యతిరేకించిన శాసనాన్ని తిరస్కరించడానికి కూడా మైనారిటీలకు హక్కునిచ్చారు. లక్నో ఒప్పందం, రెండు రాజకీయ పార్టీలు-కాంగ్రెస్, లీగ్‌లు-సాధించిన ఘనవిజయం. ఈ రెండు పార్టీల నాయకులు ఒకే విధమైన భావాలను, దృక్పథాన్ని ప్రదర్శించారు. జిన్నా, మహమ్మదాలీ, అన్సారీ, లీగ్ ప్రతినిధులుగా మజుందార్, సురేంద్రనాథ్ బెనర్జీ, మోతీలాల్ నెహ్రూ, తిలక్‌లు కాంగ్రెస్ ప్రతినిధులుగా ఒకే పద్ధతిలో మాట్లాడారు. స్వపరిపాలన, హోంరూల్ బాధ్యతాయుత ప్రభుత్వం, రాజ్యాంగ సవరణలవంటి చర్చనీయాంశాలను పరిశీలించారు. లక్నో ఒప్పందం మొదటి ఉదాహరణ. హిందూ ముస్లిం సమైక్యతను పెంపొందించడానికి ఈ ఒప్పదం చాలా వరకు తోడ్పడింది.

ఈ ఒప్పందంలో మతపరమైన షరతులను అంగీకరించినందుకు, భారత జాతీయ కాంగ్రెస్‌ను విమర్శించారు. నిజానికి భారత జాతీయ కాంగ్రెస్ మతతత్వాన్ని ఆమోదించింది.

లక్నో ఒప్పందం షరతులను కాంగ్రెస్, ఇక వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంవల్ల ఆమోదించింది. హిందువులు-ముస్లింలు భిన్నమార్గాలలో వ్యవహరిస్తే, స్వాతంత్ర్య ఉద్యమాన్ని కొనసాగించడం అసాధ్యమై ఉండేది. ఈ ఒప్పందం తర్వాత ముస్లింలీగ్ కాంగ్రెస్‌తో కలిసి సమైక్యంగా సౌభ్రాతృత్వ భావంతో స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొంటుందని కాంగ్రెస్ భావించింది. కాని భవిష్యత్సంఘటనలు కాంగ్రెస్ అంచనా పూర్తిగా పొరపాటని, బుజువు చేశాయి. ఒకసారి మతపరమైన డిమాండ్లను ఆమోదించగానే 1919, 1935 రాజ్యాంగ

BRAOU

సంస్కరణలు అమలు జరిపినప్పుడు కూడా మళ్ళీ తలెత్తాయి. ఈ ఒప్పందంవల్ల ఉద్భవించిన హిందూ-ముస్లిం సమైక్యత, మిథ్య. ఈ సమైక్యతా వాతావరణం ఎక్కువ కాలం నిలువలేదు. అటు తర్వాత కాంగ్రెస్ మతపరమైన కోరికలను తిరస్కరించలేక పోయింది; వ్యతిరేకించనూ లేకపోయింది. చిట్టచివరకు, భారతదేశ విభజన అనివార్యమైంది.

18.9 హిందూ మహాసభ

ఆంగ్లేయులు భారతదేశంలో అనుసరించిన వలసవిధానాల ఫలితంగా మనదేశంలో అనేక మతతత్వ సంస్థలు ఆవిర్భావానికి తగిన వాతావరణం నెలకొల్పబడింది. అలా ఆవిర్భవించిన ఒక మతతత్వ సంస్థ హిందూ మహాసభ.

హిందూ మహాసభ పుట్టుపూర్వోత్తరాల గురించి పూర్తి వివరాలు లభించవు. కాని 1910 సం॥లో అలహాబాదుకు చెందిన ప్రముఖ హిందూనాయకులు **'అఖిల భారత హిందూ మహా సభ'** ఏర్పాటునకు నిర్ణయించారు. 1911 సం॥లో పంజాబు హిందూ మహాసభ వారు అమృత్‌సర్ పట్టణంలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. హిందూ మహాసభ వారు, హరిద్వార్‌లో తమకేంద్రం నెలకొల్పి, హిందూ పండుగల సందర్భంగా హరిద్వార్‌లో అఖిల భారత సమావేశాలు ఏర్పాటు చేసేవారు. 1915 సం॥లో మొదటి అఖిలభారత హిందూమహాసభ సమావేశం, కాశింబజార్ మహారాజు అధ్యక్షతన నిర్వహించబడింది.

1922 సం॥లో సహాయ నిరాకరణోద్యమాన్ని మహాత్మాగాంధీ హఠాత్తుగా నిలిపివేయడంవల్ల మత కలహాలు ప్రజ్వరిల్లాయి. ఈ మత కలహాలలో మలబారు కోస్తా, ముల్తాను ప్రాంతంలో నివసిస్తున్న హిందువులు తీవ్రంగా నష్టపోయారు. వాటి ఫలితంగా కొంతమంది ప్రముఖ హిందూ నాయకులు 'హిందూ మహాసభ' పునరుద్ధరణ అవసరమనే నిర్ణయానికి వచ్చారు. హిందూ మహాసభ వ్యవస్థాపక సభ్యులలో 'పండిట్ మదన్ మోహన్ మాలవ్యా' ప్రముఖులు. లాల లజపతి రాయ్, యన్.సి. ఖేల్కర్ కూడా హిందూ మహా సభ సభ్యులయ్యారు.

మదన్‌మోహన్ మాలవ్యా హిందూ మహాసభ నెలకొల్పడాన్ని గట్టిగా సమర్థించినాడు. ఆనాడు మహమ్మదీయులు, క్రైస్తవమిషనరీలు పాటిస్తున్న మతాంతీకరణ విధానాలను ఎదుర్కొనేందుకు హిందువులు పటిష్ఠమైన వర్గంగా ఏర్పాటు కావడం అవసరమని నమ్మాడు. అనేక స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముస్లింలీగ్ ప్రాతినిధ్యం గురించి సమర్పించే గొంతెమ్మ కోరికలను ఎదుర్కొనేందుకు, హిందువులకు న్యాయం జరిగేందుకు హిందూ మహాసభ ఏర్పాటు అవసరమని మాలవ్యా అభిప్రాయానికి వచ్చాడు.

ప్రారంభంలో హిందూ మహాసభ శుద్ధి, సమత సూత్రాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. మాలవ్యా అభిప్రాయంలో, *'హిందూమహాసభ, సామాజిక మరియు సాంస్కృతికపరమైన లక్ష్య సాధనకు కృషి చేసే సంస్థ'*. తొలిదశలో హిందూ మహాసభ యొక్క లక్ష్యం *"హిందూ సమాజంలో ఆనాడు నెలకొనివున్న సామాజిక దురాచారాలు రూపుమాపడం"*. హిందూ మహాసభ రాజకీయాలకు సంబంధంలేని సామాజిక, సాంస్కృతిక, పరమైన సమస్యలపై దృష్టి సారిస్తుంది కాబట్టి దాని ఫలితంగా జాతీయ కాంగ్రెసు మరింత పటిష్టమౌతుందని మాలవ్యా అభిప్రాయపడ్డాడు.

1938 సం॥లో వి.డి. సావర్కర్ హిందూ మహాసభ అధ్యక్షుడయ్యాడు. అనేకసార్లు అధ్యక్షునిగా తిరిగి ఎన్నిక అయ్యాడు. సావర్కర్ నాయకత్వంలో హిందూ మహాసభ రాజకీయ కార్యక్రమం రూపొందించింది. మహమ్మదీయుల ఎడల జాతీయ కాంగ్రెసు అనుసరించే బుజ్జగింపు విధానాన్ని సావర్కర్ వ్యతిరేకించాడు. ఆ విధానాన్ని ఎదుర్కొనేందుకు సావర్కర్ 'హిందూరాష్ట్ర' స్థాపన గురించి ప్రచారం చేసేవాడు.

సావర్కర్ తర్వాత యస్.యస్. ముఖర్జీ హిందూ మహాసభ నాయకుడయ్యాడు. ముఖర్జీ కాలంలో హిందూమహాసభ ప్రజలలో జాతీయ దృక్పథాన్ని పెంపొందించడానికి కృషిచేశాడు. కాలగమనంలో తీవ్రమతవాదం

BRAOU

ఆవిర్భవించింది. ముస్లింలీగ్ పాకిస్థాన్ ఏర్పాటు కోరికకు ప్రతిగా హిందూ మహాసభ, హిందూమతాన్ని, సంస్కృతిని పరిరక్షించేందుకు **"అఖండ హిందూస్థాన్"** ఏర్పాటునకు పిలుపు యివ్వడం జరిగింది. దీనితో ముస్లిం లీగ్ పాకిస్థాన్ ఏర్పాటు కోరిక విషయంలో మరింత కఠిన వైఖరి అవలంబించింది.

తీవ్రమతవాద సంస్థలు స్వైరవిహారం చేయడంతో హిందూ మహాసభ నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సమాజ్ ఆవిర్భవించింది.

18.10 హిందూ మహమ్మదీయ సంబంధాలు

ఆంగ్ల పాలనతో సహకరించినందువల్ల వ్యక్తిగతంగా, మతపరంగా తమకు ప్రయోజనం చేకూరగలదని ముసల్మాన్లు భావించారు. 1923లో కాకినాడలోని కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించిన మహ్మద్ ఆలీ, ముసల్మాన్లు హిందువులతో సహకరించవలెనని, దానివల్ల అఖిల ఇస్లాం లక్ష్యాలు నెరవేరగలవని ప్రబోధించారు. కాని వారి అభ్యర్థన అరణ్యరోదనమే అయింది.

మునుపటి మతతత్వం తిరిగి జీవం పోసుకోవడంతో, హిందూ-ముసల్మాన్ల మధ్య చిన్న చిన్న కలహాలు ప్రారంభమైనాయి. మలబార్, ముల్తాన్, ఆగ్రా, తదితర ప్రదేశాలలో రెండు మతాల మధ్య ఎన్నో విచారకర సంఘటనలు జరిగాయి. ముసల్మాన్లు **'తంజీమ్' 'తబ్లీగ్'** అనేపేర్లతో పూర్తిగా మతపరమైన సంస్థలు స్థాపించి, మతకలహాలకు కారణంకాగా, హిందూమహాసభ పేరున హిందువులు కూడా కాలుదువ్వారు. ఉభయ మతాల ప్రజలు ఒకరినొకరు అనుమానించడం సర్వసహజ మైంది.

18.11 ముస్లింలీగ్ పునరుద్ధరణ

ముసల్మాన్లలో మితవాదులైన జాతీయ లిబరల్ పార్టీ, 1923 ఎన్నికలలో ఘోర పరాజయం పొందింది. 1924లో కాలిఫేట్‌ను ముస్తాఫా కమాల్ పాషా రద్దు చేయడంతో, ఖిలాపత్ ఉద్యమం కూడా ముగిసింది. దీనితో భారత ముస్లింలీగ్ పార్టీ పునరుద్ధరింపబడింది. ఈ సంస్థ గత నాలుగేండ్లుగా తన కార్యకలాపాలను నిలుపు చేసింది. 1924 మే నెలలో ఈ పార్టీ, మహమ్మద్ ఆలీ జిన్నా అధ్యక్షతన లాహోర్‌లో సమావేశ మయింది. స్వరాజ్యం తమధ్యేయమని ప్రకటించారు. అయితే ముసల్మాన్లకు ఆమోదకరమైన రాజ్యాంగం గూర్చి కొన్ని షరతులు సమావేశం విధించింది.

భారతదేశానికి సమాఖ్య రాజ్యాంగం ఇవ్వబడవలెనని, రాష్ట్రాలకు పూర్తి స్వయంపాలన ఉండవలెనని, కేంద్ర ప్రభుత్వాధికారాలు కేవలం రాష్ట్రాలన్నింటికి సంబంధించిన సాధారణ అధికారాలకు మాత్రమే పరిమితం కావలెనని, ముస్లింలీగ్ కోరింది. రాష్ట్ర శాసన సభాసభ్యులు ఎన్నిక పద్ధతిలో మైనారిటీలకు సరియైన, సమఆదర్శవంతమైన ప్రాతినిధ్యం ఉండేటట్లుగా రాజ్యాంగ రక్షణలు పొందుపరచవలెనని కోరారు. నాటికి వున్నరీతిలోనే, ఈ ప్రాతినిధ్యం ప్రత్యేక నియోజకవర్గాల పద్ధతిలో కొనసాగింపబడాలి. మతవిషయాలకు సంబంధించిన బిల్లు, శాసనసభలలో ఈ మతానికి చెందిన 3/4 వంతు మంది సభ్యులు వ్యతిరేకించిన, ఆమోదించకూడదు. లాహోర్ సభ మత వైషమ్యాలకు ఆర్థిక వ్యత్యాసాలే కారణమని వ్యాఖ్యానించింది. ముసల్మాన్‌లలో అత్యధికులు పేదవారని, హిందువులు వారికన్నా సుఖంగా మనుగడ సాగిస్తున్నారని, పేదముసల్మాన్లను అవకాశం దొరికినపుడల్లా భాగ్యవంతులైన హిందువులు దోచుకుంటున్నారని, ముస్లింలీగ్ కొత్తవాదాన్ని లేవదీసింది.

18.12 మత ఘర్షణలు

1923 నుంచి తీవ్రమైన మతకలహాలు చెలరేగి, భారత రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసాయి. హిందూ-ముసల్మానులు ఏడు వందల సంవత్సరాలుగా కలిసి మెలసి జీవించినా, వారు రెండు ప్రత్యేక వర్గాలుగానే

BRAOU

ఉండిపోయారు. పాతుకు పోయిన అనేక సాంఘిక, రాజకీయ, మత విభేదాలు ఈ విభజనకు కారణం. ఎంతో మంది ప్రముఖ నాయకులు ఈ రెండు మతాల మధ్య విభేదాలను తొలగించి, మత సామరస్యం సాధించడానికి కృషి చేసారు. 1921 భారత జాతీయ ఒప్పందం రూపొందించుటకై, ఒక సంఘం నియమింపబడింది. డాక్టర్ అన్సారీ, లాలా లజ్‌పతిరాయ్ కలిసి ఒక ముసాయిదా తయారు చేసి, 1923లో దానిని సంఘానికి నివేదించినారు. ఇంతలో బెంగాల్ కాంగ్రెస్ సంఘం చిత్తరంజన్‌దాస్ నాయకత్వంలో హిందూ-ముసల్మాన్‌ల మధ్య ఒక ఒప్పందాన్ని తయారుచేసి, అంగీకరించింది. స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం 60-40 శాతంతో ఉండాలి. జిల్లా జనాభాలో ఏమతస్తులు అధిక సంఖ్యాకులో, వారికి 60 శాతం ప్రాతినిధ్యం, అల్పసంఖ్యాక మతస్తులకు 40 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగాలలో 55 శాతం ముసల్మాన్‌లకు ఇవ్వాలి. మసీదుల ముందు ఎట్టి సంగీతం వినిపించరాదు. ఈ షరతు కాంగ్రెస్ బహరంగ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించబడి, నిరాకరింపబడింది. వాద్య సంగీతంతో ఆర్యసమాజం వారి ఊరేగింపు, కలకత్తాలోని ఒక మసీదు ముందుగా వెళ్ళుచుండగా 1923 మే నెలలో అతిదారుణమైన మతకలహం చెలరేగింది. మతదౌర్జన్యాలు ఎన్నో రోజులుగా కొనసాగి, ఇరువైపులా ఎందరో మరణించారు. 1924లో బక్రీద్ పండుగ రోజు మతకలహాలు పెక్కు చోట్ల సంభవించాయి. ఢిల్లీ ఈ మతకలహాలవల్ల బాగా దెబ్బతిన్నది. నాగపూర్, జబల్‌పూర్ మరికొన్ని నగరాలలో ఇరు మతాలవారు వీధులలో దౌర్జన్యాలు జరిపారు. సైన్యం కాల్పులు జరిపితేనే కాని, పరిస్థితి అదుపులోనికి రాలేదు. ఉత్తర సరిహద్దు రాష్ట్రంలో అన్నింటికన్నా దారుణమైన మతకలహాలు జరిగినాయి. ఇక్కడ ముసల్మాన్‌లు అత్యధిక ప్రజలు. 'సనాతన ధర్మసభ' అనే సభ ప్రచురించిన ఒక కరపత్రంలోని ఇస్లాం వ్యతిరేక పద్యమొకటి, ఈ కలహాలకు నాంది పలికింది. హిందువులపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. దాడులను నిరోధించడంలో పోలీసు బలగం విఫలమయింది. ఈ దారుణ మతకలహాలపై జాతీయ కాంగ్రెస్ ముస్లింలీగ్, హిందూ మహాసభ సమావేశాలలో తీవ్రమైన చర్చలు జరిగాయి.

1925-26 మధ్యకాలంలో హిందూ-ముసల్మాన్ సంబంధాలు మరింత విషమించాయి. ఉత్తరప్రదేశ్, బెంగాల్ లందు, 30 దాకా మతకలహాలు జరిగాయి. 1926లో మోతీలాల్ నెహ్రూ, అబుల్ కలాం ఆజాద్‌లు కలిసి 'ఇండియన్ నేషనల్ యూనియన్' అనే పేరిట, మత ప్రమేయంలేని సంస్థను స్థాపించుటకై ప్రణాళిక నొకదానిని తయారుచేసినారు. కాని ఈ సంస్థ స్థాపించబడలేదు. అదే సంవత్సరంలో బెంగాల్ శాసనసభలోని స్వరాజ్య పార్టీకి చెందని సభ్యులతో, సర్ అబ్దుల్ రహీమ్ బెంగాల్ ముస్లిం పార్టీని స్థాపించాడు. దేశంలోని రాజకీయ పక్షాలన్నీ మతపరమైనవేనని చెబుతూ రహీం తన మత సంస్థ ఏర్పాటును సమర్థించుకొన్నాడు. స్వామి శ్రద్ధానందను ఒక ముసల్మాన్ హత్య చేయడంతో, మతవైషమ్యం పరాకాష్ఠ నందుకొంది. ఈ మత వైషమ్యాలను తగ్గించడానికి కాంగ్రెస్, మితవాదులు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. ఈ మత రాజకీయాలు దేశ స్వాతంత్రోద్యమంపై, రాజకీయాలపై స్పష్టమైన ప్రభావాన్ని చూపాయి.

అఖిల భారత ప్రజానీకానికందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని తయారు చేయమని, ఆంగ్ల ప్రభుత్వం జాతీయ నాయకులను నవాలు చేసింది. హిందూ-ముసల్మాన్ నాయకులు తమ మధ్య వున్న తీవ్రవిభేదాలను పరిష్కరించుకొనేందుకు, సమావేశమయ్యారు. ఈ సవాలును ఎదుర్కొనుటకై, జాతీయ నాయకులు 1928 ఫిబ్రవరిలో డాక్టర్ అన్సారీ అధ్యక్షతన సమావేశమైనారు. సమావేశం ప్రారంభమైన కొద్ది సమయంలోనే, హిందూ-ముసల్మాన్‌ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన రాజ్యాంగ సూత్రాలను పరిశీలించి, నిర్ణయించడానికి ఒక సంఘం నియమింపబడింది. ఈ సంఘం తయారు చేసిన రాజ్యాంగ ముసాయిదాను, అఖిలపక్ష సమావేశం ముందుంచారు. రాజ్యాంగంలోని మత ప్రాతినిధ్య సూత్రాలను జిన్నా నాయకత్వంలోని ముస్లింలీగ్ తిరస్కరించింది. కేంద్ర శాసనసభలో ముసల్మాన్‌లకు ప్రాతినిధ్యం ఉండవలెనని, జిన్నా సవరణ ప్రతిపాదించాడు. ఈ విషయంపై ఉద్రేకపూరితమైన చర్చలు జరిగి, సవరణ వీగిపోయింది. జిన్నా సభ నుంచి నిష్క్రమించి ఆగాఖాన్, మీర్ మహమ్మద్ షఫీ నాయకత్వం లోని మిగతా ముసల్మాన్ వర్గాలతో చేరిపోయాడు. వారందరూ కలిసి, సంయుక్త ప్రతిపక్షంగా మారినారు. నెహ్రూ రాజ్యాంగాన్ని డాక్టర్ అన్సారీ, సర్ అలీ ఇమామ్ వంటి కొందరు ప్రముఖ ముసల్మాన్‌లు ఆమోదించినారు.

BRAOU

రౌండ్‌టేబుల్ సమావేశాలందు కూడా మతప్రాతినిధ్య సమస్యకు పరిష్కారం లభ్యంకాని విషయం. హిందూ ముస్లిమ్‌ల విభేదాలను అవకాశంగా తీసుకొన్న ఆంగ్ల ప్రభుత్వం, ఏరీతిగా జాతీయోద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించినది, ఇంతకు ముందు పాఠంలో చదివియున్నాం. 1920 సత్యాగ్రహ ఉద్యమంలో, గాంధీశిష్యుడైన మహమ్మదాలీ 1930 లో ఇలా పలికాడు : *"గాంధీ గారితో చేరడానికి మేము నిరాకరిస్తున్నాం. వారి ఉద్యమం భారతదేశానికి పూర్తి స్వేచ్ఛను ప్రసాదించేదికాదు. హిందూమహాసభపై ఏడుకోట్ల ముసల్మాన్‌లు ఆధారపడేటట్లు చేసేందుకై, ఇది ఉద్దేశింపబడింది"* దీనిని బట్టి ఆలీ సోదరులలో వచ్చిన మార్పును గమనించవచ్చును. అయినా వారి పలుకుబడి తగ్గిపోయి, ముసల్మానుల నాయకునిగా, ప్రతినిధిగా జిన్నా గుర్తింపబడ్డాడు.

18.13 మహమ్మద్ అలీ జిన్నా

మహమ్మద్ అలీ జిన్నా రాజకీయ చతురుడు. రాజకీయ ప్రయోజనాలకు మత భావాలను రెచ్చగొట్టి, అనుకూలంగా వాటిని వాడుకొనడంలో మిగతా ముసల్మాన్ నాయకులందరికన్నా ఎన్నో రెట్లు తెలివిగలవాడు. కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ నివేదిక అంగీకరింపబడడం, తన సవరణ వీగిపోవడం, జిన్నా అహాన్ని దెబ్బతీసింది. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ముసల్మాన్‌లకు వ్యతిరేక చర్యయని, 1929 మార్చి నెలలో ఢిల్లీలో ముస్లింలీగ్ సభను ఏర్పాటు చేసాడు. ఈ సభలో నెహ్రూ నివేదికను అభిశంసిస్తూ జిన్నా 14 సూత్రాలను ప్రకటించాడు.

ముసల్మాన్‌ల కనీస కోర్కెలుగా ప్రసిద్ధినొందిన 14 సూత్రాలలో ముఖ్యమైనవి:-

1) భావి రాజ్యాంగం, సమ్మేళన రాజ్యాంగంగా ఉండాలి. మిగులు అధికారాలు రాష్ట్రాలకు సంక్రమించాలి. రాష్ట్రాలన్నింటికి సమానమైన స్వయంపాలనాధికారాలు ఉండాలి.

2) దేశంలోని అన్ని ఎన్నిక కాబడే శాసనసభలందు, అల్పసంఖ్యాక వర్గాలకు తగిన, సమర్థమైన ప్రాతినిధ్యం వుండాలి.

3) మతప్రాతినిధ్యంతో, ముసల్మాన్‌లకు ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయింపబడాలి.

4) ఎట్టి భౌగోళిక పరమైన మార్పులు జరిగినా పంజాబ్, బెంగాల్, పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రాలలోని ముసల్మాన్‌ల మెజారిటీకి భంగం కలుగకూడదు. బొంబాయి రాష్ట్రం నుంచి సింధ్‌ను వేరుపరచాలి.

5) అన్నివర్గాలకు పూర్తి మతస్వేచ్ఛను ఇవ్వాలి. ముసల్మాన్‌ల సంస్కృతి, విద్య, భాష, శాసనాలు పరిరక్షించబడటానికి కావలసిన హామీలను రాజ్యాంగంలో పొందుపరచాలి.

6) కేంద్రంలో, రాష్ట్రాలలో ఏ మంత్రివర్గంలోనైనా, 1/3 వంతు మంది ముసల్మాన్లు ఉండాలి.

నెహ్రూ నివేదిక మరుగున పడడం, జాతీయ ముస్లిం పార్టీ క్షీణించడంతో జిన్నాకు ఎదురులేకపోయింది. మత ప్రాతినిధ్యం మరింత ఎక్కువ చేయవలసిందిగా, ఒత్తిడి ప్రారంభించాడు. హిందూ-ముసల్మాన్ల మధ్య సమన్వయ అవకాశాలు సన్నగిల్లి, రోజు రోజుకూ వారి మధ్య విభేదాలు మరిత తీవ్రతరమైనాయి. ముసల్మానులలో పెక్కు పార్టీలు వున్నా, మత ప్రాతినిధ్య విషయంలో మాత్రం, అందరూ కలసిపోయేవారు.

ప్రథమ రౌండుటేబుల్ సమావేశం ఏర్పాటును జిన్నా, అలీసోదరులు, మహమ్మద్ షఫీ తదితర ముస్లిం నాయకులు హర్షించారు. సమావేశంలో ముసల్మాన్ ప్రతినిధులు ఆ మత విషయాలను నిజంగా ప్రతిబింబించేవారుగా ఉండాల్సని వారు కోరారు. అంటే, జాతీయ ముసల్మాన్‌ల ప్రాతినిధ్యాన్ని వారు అంగీకరింపరని స్పష్టమైంది. "విభజించి-పాలించు" అనే సూత్రంపై నడుస్తున్న ఆంగ్ల ప్రభుత్వం, ఈ ప్రకటన పట్ల హర్షం వెలిబుచ్చింది. ముసల్మాన్ ప్రముఖ నాయకులందరూ ఈ రాజ్యాంగ సమావేశానికి హాజరయ్యారు. తమ ప్రయోజనాలకు సరైన రక్షణలు పొందుపరచని ఏ రాజ్యాంగమైనా, తమకు ఆమోదయోగ్యం కాదని

BRAOU

స్పష్టపరచారు. ప్రతిపాదించే రాజ్యాంగ రక్షణలు తమకు సరిపోతాయో లేదో నిర్ణయించే అధికారం కూడా, ముసల్మాన్‌ల ప్రతినిధులకే ఉండాలి. ప్రభుత్వం ఈ కోర్కెలను చాలావరకు అంగీకరించింది.

రెండో రౌండుటేబుల్ సమావేశంలో ముస్లింలీగ్‌తో అంగీకారానికి గాంధీగారు చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైనాయి. దీనితో, బ్రిటీష్ ప్రధానమంత్రి మాక్‌డొనాల్డ్ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించవలసి వచ్చింది. ఆయన ఇచ్చిన తీర్పు, ముసల్మాన్‌లకు ఘనవిజయం. సైమన్ నివేదికలో అన్యాయంగా భావింపబడిన కొన్ని రాయితీలను కూడా వారు పొందారు. ముసల్మాన్‌లకే కాక, శిక్కులకు, ఆంగ్లో-ఇండియన్లకు కూడా ప్రత్యేక నియోజకవర్గాలు ఇవ్వబడినాయి. నిమ్నజాతులకు ప్రత్యేక సీట్లు కేటాయించబడినాయి.

పూనా ఒప్పందం పిదప 1932 నవంబర్‌లో అలహాబాద్ నందు ఐక్యతా సమావేశం జరిగింది. రాజ్యాంగ విషయాలలో ప్రముఖమైన విభేదాలను పరిష్కరించేందుకై, ఒక సంఘం నియమింపబడింది. ఈ సంఘం ఉమ్మడి నియోజకవర్గాలను అంగీకరించింది. అయితే, ఏ ఒక్క అభ్యర్థి అయినా గెలవాలంటే, అతని మత ఓటర్లలో కనీసం 30 శాతం ఓట్లు సంపాదించుకోవాలి. కేంద్ర శాసనసభలో ముస్లిం ప్రాతినిధ్యం 32 శాతంగా అంగీకరింపబడింది. ఈ సంఘ సిఫార్సులకు తుదిరూపం ఇవ్వకముందే, ఆంగ్ల ప్రభుత్వం కేంద్ర శాసనసభలో 33 1/3 శాతం సీట్లు ముసల్మాన్‌లకు ఇవ్వగలమని, సింధ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించగలమని అంగీకరించింది. 'విభజించి పాలించే' ఆంగ్ల చాణక్యనీతి, జిన్నా, మొండిపట్టుదలవల్ల హిందూ-ముసల్మాన్ ఐక్యతావకాశాలు మృగ్యమైనాయి. ఈ కాలమందు ఏర్పడిన మత విభేదాలే, తరువాత కాలంలో దేశవిభజనకు దారితీసాయి.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. మొదటి ముస్లింలీగ్ సమావేశం ఎక్కడ జరిగింది? ఆ సమావేశానికి ఎవరు అధ్యక్షత వహించారు?

.....

.....

.....

.....

2. లక్నో ఒప్పందం ప్రాముఖ్యత ఏమి?

.....

.....

.....

.....

3. జిన్నా ఎప్పుడు ఎందుకు 14 కోర్కెలు ప్రకటించాడు?

.....

.....

.....

.....

18.14 సంగ్రహంగా

1. మహమ్మదీయులలో మతతత్వం అభివృద్ధి చెందడానికి అనేక కారణాలు వున్నాయి. అందులో ముఖ్యమైనవి, వారు ఆర్థికంగా వెనుకబడివుండడం, బ్రిటీష్‌వారి విభజించి పాలించు విధానం, హిందూమత చిహ్నాలను జాతీయోద్యమంలో ఉపయోగించడంవల్ల కూడా మహమ్మదీయులలో వేర్పాటు ధోరణి ఏర్పడింది.

BRAOU

2. 1906లో ఆగాఖాన్, ఢక్కానవాబు, ముస్లింలీగ్‌ను స్థాపించినారు.

3. 1916లో లక్నో ఒప్పందంవల్ల ముస్లింలీగ్-కాంగ్రెస్‌ల మధ్య తాత్కాలిక అంగీకారం కుదిరింది.

4. హిందూ-మహమ్మదీయులను ఐక్యపరిచే ఉద్యమం లేకపోవడంవల్ల 1923-27 మధ్యకాలంలో అనేక మత సంఘర్షణలు జరిగాయి.

5. 1930 నాటికి జిన్నా, ముస్లింలీగ్ అగ్రనాయకుడైనాడు.

18.15 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) మహ్మదీయులు, బ్రిటీష్ ప్రభుత్వానికి విధేయులుగా వుండడంవల్లనే, అభివృద్ధి చెందగలరని, సయ్యద్ అహ్మద్ ఖాన్ విశ్వసించాడు. కాంగ్రెస్‌లో మహమ్మదీయులు చేరితే, బ్రిటీష్ ప్రభుత్వము వారి విధేయతను శంకిస్తుందని అతను అభిప్రాయపడ్డాడు. అందువల్ల అతను మహమ్మదీయులు కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకించాడు.

2) బ్రిటీష్ 'విభజించి పాలించు' విధానము, అధిక సంఖ్యాక వర్గం తమ మీద ఆధిపత్యాన్ని చెలాయిస్తుందనే భయం, మహమ్మదీయులలో వేర్పాటు ధోరణిని అభివృద్ధి చేసింది.

II 1) ముస్లింలీగ్ మొదటి సమావేశం, అమృతసర్‌లో జరిగింది. సర్ సయ్యద్ అలీ ఇమామ్ దానికి అధ్యక్షత వహించాడు.

2) లక్నో ఒప్పందం, హిందూ-మహమ్మదీయ ఐక్యత కొరకు తీసుకొన్న ఒక ముఖ్యమైన చర్య. స్వరాజ్య సాధన కొరకు, కాంగ్రెస్ ముస్లింలీగ్‌ల మధ్య కుదిరిన మొట్టమొదటి ఒప్పంధం, లక్నో ఒప్పందం. అందువల్ల దానికి ప్రాముఖ్యత వుంది.

3. 1929లో ముస్లింలీగ్ ఢిల్లీ సమావేశంలో జిన్నా 14 కోర్కెలు ప్రకటించాడు. భారతదేశంలో మహమ్మదీయుల శ్రేయస్సు రక్షణకు అవి కనీస కోర్కెలని అతడు భావించాడు.

18.16 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) ముస్లిం మతతత్వాన్ని, దాని పర్యవసానాలను పేర్కొనండి.

2) 'విభజించి పాలించు' అనే బ్రిటీష్ విధానాన్ని వర్ణించి, దాని ప్రభావాలను పరిశీలించండి.

3) ముస్లింలీగ్ పుట్టుకకు గల కారణాలను పరిశీలించి, దాని ముఖ్యోద్దేశాలను వివరించండి.

4) 1916 వరకు కాంగ్రెస్-ముస్లింలీగ్ మధ్య సంబంధాలను పరిగణించండి.

5) 1920-28 మధ్యకాలంలోని హిందూ-ముస్లిం సంబంధాలు సమీక్షించి మతకల్లోలాలు చెలరేగుటకు గల కారణాలు పేర్కొనండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) హిందూ-ముస్లిం వర్గాల మధ్య వైషమ్యాలను సృష్టించుటలో, బ్రిటీష్ ఆసరాగా తీసుకున్న ముస్లింల వెనుకబడినతనానికి గల కారణాలను వివరించండి.

2) హిందూ మహాసభపై ఒక లఘు వ్యాఖ్య వ్రాయండి.

3) లక్నో ఒడంబడిక ప్రాముఖ్యతను, అందులోని షరతులను సంక్షిప్తంగా రాయండి.

4) భారత జాతీయోద్యమంలో సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ నిర్వహించిన పాత్రను పేర్కొనండి.

5) మతతత్వ పునరుద్ధరణ, బ్రిటీష్ ప్రభుత్వం పట్ల ముస్లింలీగ్ వైఖరి పరిశీలించండి.

BRAOU

18.17 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C. : *Constitutional History of India and National Movement*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra & Others : *Freedom Struggle*
4. Desai, .R. : *Social Background of Indian Nationalism*
5. Majumdar, R.C. : *Advanced History of India*
6. Majumdar, R.C. : *Three Phases of India's Struggle for Freedom*
7. Natarajan and Prema Rama Krishna : *Political and Cultural History of India, Vol. II*
8. Spear, Perceival : *History of India, Vol. II*
9. Tarachand : *History of the freedom Movement in India, Vol. III*
10. వైదేహి, అల్లాడి : భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947)
11. జితేందర్ రెడ్డి బి. : భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు.
12. బిపన్ చంద్ర : ఆధునిక భారతదేశం

BRAOU

భాగం -19 : మొదటి ప్రపంచ యుద్ధం, హోంరూలు ఉద్యమం

విషయక్రమం

19.0 లక్ష్యాలు
19.1 పరిచయం
19.2 మొదటి ప్రపంచయుద్ధం, భారత జాతీయోద్యమం
19.3 యుద్ధంపట్ల జాతీయ వాదుల వైఖరి
19.4 హోంరూల్ ఉద్యమం - అనిబిసెంట్, తిలక్
19.5 మాంటేగ్ ప్రకటన
19.6 రౌలట్ చట్టం
19.7 సంగ్రహంగా
19.8 మీ అవగాహన పరీక్షించుకోండి
19.9 పరీక్ష నమూనా ప్రశ్నలు
19.10 ఉపయుక్త గ్రంథాలు

19.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి.

1. భారతజాతీయోద్యమం పైన మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావం.
2. అనిబిసెంట్, తిలక్‌ల నాయకత్వంలో నడచిన హోంరూలు ఉద్యమం లక్ష్యాలు, ఉద్యమ క్రమం, ఉద్యమం సాధించిన విజయాలు.
3. 1916 లో మాంటేగ్ చేసిన ప్రకటన ప్రాముఖ్యత.

19.1 పరిచయం

1914 ఆగస్ట్ నెలలో ప్రజ్వరిల్లిన మొదటి ప్రపంచ యుద్ధం, భారత జాతీయోద్యమ రూపు రేఖలనే మార్చివేసింది. ఇది జాతీయోద్యమ వేగాన్ని పెంచడమే గాక, ఉద్యమ లక్ష్యాలను స్పష్టంగా నిర్వచించింది. ఆధునిక భారతదేశ పురోభివృద్ధిలో మొదటి ప్రపంచ యుద్ధం ఒక మైలు రాయి. ఈ యుద్ధం ప్రజ్వరిల్లిన తరువాత, భారతీయుల మనోభావాలలో విప్లవం ప్రజ్వరిల్లింది. మహాత్మాగాంధీ రాజకీయరంగంపై అవతరించాడు. 1914కు ముందు విధాన నిర్ణయాలను నిశ్చయించి అమలుపరిచే శక్తి భారత ప్రభుత్వానికి ఉండేది. కాని 1918 తర్వాత విధాన నిర్ణయాలను నిశ్చయించి, అమలుజరిపే సామర్థ్యాన్ని కాంగ్రెస్ సాధించింది. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన రోజుల్లో భారతదేశంలో జాతీయవాదం పరిణత స్థితిని పొందింది.

19.2 మొదటి ప్రపంచ యుద్ధం, భారత జాతీయోద్యమం

యుద్ధం ప్రజ్వరిల్లగానే దేశంలో ప్రభుత్వంపట్ల, ప్రజలు ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించారు. భారతదేశం నలుమూలల, ప్రభుత్వంపట్ల విధేయతా భావం వ్యాపించింది. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పటికి, దేశంలో రాజకీయ కార్యక్రమాలు చురుకుగా కొనసాగలేదు; మందగించాయి. లోకమాన్య తిలక్ ఇంకా చెరసాల నుంచి విడుదల కాలేదు. అయన నాయకత్వం వహించిన పార్టీని ప్రభుత్వం అణచివేసింది. మితవాదులకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్, వార్షిక సమావేశాలు జరిపి కొన్ని తీర్మానాలు ఆమోదించడం తప్ప, ఏ ఇతర కార్యక్రమాలను అమలు జరపలేదు. అప్పట్లో జాతీయవాదం నీరసస్థితిలో ఉంది. 1914 మద్రాస్ సమావేశంలో కాంగ్రెస్ బ్రిటీష్ చక్రవర్తిపట్ల ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించి, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, బ్రిటీష్ సామ్రాజ్యానికి మద్ధతును ఇస్తానని ప్రకటించింది.

సమాజంలో ఇతర వర్గాలు - ప్రభువులు, భూస్వాములు, వ్యాపారులు, రాజకీయాలతో సంబంధాలు లేని ఇతర వర్గాలు - విశ్వాస ప్రకటనలు చేయడంలో, రాజకీయ నాయకులతో పోటీ పడ్డారు. ఈ విధంగా యుద్ధం ప్రారంభమైనప్పుడు, దేశంలో ఎక్కువగా ఉత్సాహం వెల్లివిరిసింది. భారతదేశ ప్రజలు ప్రభుత్వానికి అన్ని విధాల సాధ్యమైనంత సహాయం చేయడానికి ఇష్టపడ్డారు. యుద్ధం భీకరంగా సాగుతున్న కాలంలో భారతీయ సైన్యాలు బ్రిటీష్ సామ్రాజ్యానికి విశిష్టమైన సేవను చేశాయి. మొదటి ప్రపంచయుద్ధం ప్రజ్వరిల్లగం వల్ల భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి వేగం పుంజుకుంది. యుద్ధం సంవత్సరాల తరబడి కొనసాగుతుండడం వల్ల బ్రిటీష్‌వారు తమ కంటె నైతికంగా, ఆర్థికంగా అధికులనే భావాన్ని, భారతీయులు వదలుకున్నారు. మధ్య ఆసియాలో ఉన్న సైన్యాలకు చిన్న ఆయుధాలు, ప్రేలుడు పదార్థాలు, వస్త్రాలు, ఆహారపదార్థాలు సరఫరా చెయ్యడానికి భారత దేశం ప్రధాన స్థావరమైంది.

యుద్ధానంతరం రాజకీయ సంస్కరణల రూపేణా ప్రతిఫలాన్ని పొందవచ్చని భావించి, చాలా మంది భారతీయులు యుద్ధ కృషికి హృదయ పూర్వకంగా మద్ధతు నిచ్చారు. ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడడంకోసం పోరాడుతున్నట్లుగా, మిత్రరాజ్యాలు ప్రకటించాయి. మిత్ర రాజ్యాలకు సహాయం చేస్తున్న భారతీయులు, యుద్ధానంతరం భారతీయులకు స్వపరిపాలన ఇస్తామని వెంటనే ప్రకటించాలని ఎదురు చూశారు. మొదటి ప్రపంచ యుద్ధంలో వివిధ రాజ్యాలు తమ వలస ప్రాంతాలను కాపాడుకోడానికి మాత్రమే పోరాడుతున్నాయనే నిజాన్ని వీరు గుర్తించలేదు.

యుద్ధం భీకరంగా కొనసాగుతున్న కాలంలో కొద్దిమంది విపరీతంగా లాభాలను ఆర్జించారు. అధిక సంఖ్యాకులు యుద్ధ భారాన్ని మోయలేక పోవడంతో అసంతృప్తి పెరిగింది. యుద్ధ నిధికి బలవంతంగా ధనాన్ని వసూలు చేయడంతో ఆర్థికంగా దేశం దివాలా తీసింది. ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంపొందింది. బ్రిటీష్ సామ్రాజ్యంపట్ల భారతీయుల భావాలలో తీవ్రమైన మార్పు వచ్చింది. బ్రిటీష్ సైన్యాలను జయించడం అసాధ్యం అనే భావం, తెల్లవాడి ఆధిక్యత మిథ్య అని స్పష్టంగా తేలిపోయింది.

మొదటి ప్రపంచ యుద్ధం కొనసాగుతున్న కాలంలో భారతీయ పరిశ్రమలు వేగంగా పెంపొందాయి. యుద్ధ పరికరాలను ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఇండియాకు, బ్రిటన్‌కు చెందిన పెట్టుబడిదారులు భారతదేశంలోని సామాన్య ప్రజలను కొల్లగొట్టి, విపరీతంగా లాభాలను ఆర్జించి, ఐశ్వర్యవంతులయ్యారు. వేతనాలు పెరిగినా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంవల్ల, దురదృష్టవశాత్తు కార్మికుల పరిస్థితి దిగజారింది. భారతీయ పెట్టుబడిదారులు బలపడడంవల్ల, మొట్టమొదటిసారి బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. యుద్ధం కొనసాగిన కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం పెద్ద పరిశ్రమలను ప్రోత్సహించి దేశాన్ని త్వరితంగా పారిశ్రామికీకరణం చెయ్యడానికి చర్యలు తీసుకుంది.

19.3 యుద్ధంపట్ల జాతీయవాదుల వైఖరి

1914-18 మధ్య ప్రజ్వరిల్లిన మొదటి ప్రపంచ యుద్ధంపట్ల, భారత జాతీయ నాయకుల దృక్పథాన్ని పరిశీలిద్దాం.

భారతీయులు బ్రిటీష్ ప్రభుత్వంపట్ల ప్రకటించిన విశ్వాసానికి మూల్యంగా, కాంగ్రెస్ రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టాలని కోరింది. 1914లో తిలక్ చెరసాల నుంచి విడుదల కాగానే, ఆయనను జాతీయోద్యమానికి గొప్ప నాయకుడుగా ప్రశంసించారు. జాతీయ వర్గాలు తిలక్ కు వీరోచిత స్వాగతాన్నిచ్చాయి. తిలక్ కూడా ప్రభుత్వ కృషికి మద్ధతునివ్వడానికే నిశ్చయించాడు. *"ఇలాంటి క్లిష్టసమయంలో గొప్పవారైనా, అల్పులైనా, ధనికులైనా, పేదవారైనా, అందరూ - ప్రతి భారతీయుడు, బ్రిటీష్ ప్రభుత్వానికి శక్తి కొలది మద్ధతునిచ్చి సహాయం చెయ్యాలని"* తిలక్ ప్రకటించాడు.

BRAOU

గాంధీజీ, సైనిక దళాలలో భారతీయులను చేరవలసిందని పిలుపునిచ్చాడు. చాలా మంది భారతీయులను సైన్యంలో చేర్పించడానికి కృషి చేసాడు. బ్రిటీష్ సామ్రాజ్య రాజనీతిజ్ఞుల సుహృద్భావంతో, స్వరాజ్‌ను సాధించవచ్చనే ఉద్దేశంతో గాంధీజీ సైనిక దళాలలో చేరవలసిందని పిలుపునిచ్చాడు.

టర్కీపట్ల బ్రిటీష్ ప్రభుత్వ వైఖరిని ముస్లిమ్‌లు నిరసించినా, ముస్లిమ్ సైనికులు టర్కీ సైనికులలో మెసపొటేమియాలో, ధైర్య సాహసాలతో పోరాడారు.

1914లో తిలక్ ఇండియాకు తిరిగి వచ్చాడు. ఆయన ప్రతిష్ట తారాపథాన్నందుకుంది. తిలక్ భారతదేశ రాజకీయాలను చైతన్యవంతం చేసాడు. తిలక్ రాక, జాతీయాభిమానానికి ఊపునిచ్చింది. కాని, అప్పటికి జాతీయ కాంగ్రెస్, మితవాద వర్గం అధీనంలో ఉంది. 1914 లో అనిబిసెంట్ భారత స్వాతంత్రోద్యమానికి మద్ధతునిచ్చింది. మొదట్లో అనిబిసెంట్ కాంగ్రెస్‌లో రెండు వర్గాల సమైక్యతను సాధించడానికి ప్రయత్నించింది. కాని ఆమె కృషి విఫలమైంది. చాలా మంది కాంగ్రెస్ వాదులు తిలక్‌తో ఏదో విధంగా రాజీ కుదుర్చుకోవాలని భావించారు. కాని గోఖలే, ఫిరోజ్‌షా మెహతాలు ఈ చర్యను వ్యతిరేకించారు. 1915లో గోఖలే, ఫిరోజ్‌షా మెహతాలు మరణించడంతో మితవాద వర్గానికి నాయకులు లేరు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరచి, అనీబిసెంట్ రెండు వర్గాలు కలిసి పని చేసేటట్లు ఒప్పించింది. తీవ్రవాదులు కాంగ్రెస్‌లో చేరడానికి అవకాశం కల్పిస్తూ. కాంగ్రెస్ తన నియమావళిని మార్చింది. దేశంలో నానాటికి పెరుగుతున్న జాతీయ భావన, దేశ సమైక్యత సాధించాలనే పట్టుదలవల్ల 1916 భారత జాతీయ కాంగ్రెస్ లక్నో సమావేశంలో రెండు చరిత్రాత్మక సంఘటనలు జరిగాయి. కాంగ్రెస్‌లోని మితవాద, తీవ్రవాద వర్గాల మధ్య రాజీ కుదిరింది. రెండు వర్గాల వారు 1916 డిసెంబర్‌లో జరిగిన లక్నో సమావేశంలో పాల్గొన్నారు. 1907 తర్వాత రెండు వర్గాల కాంగ్రెస్ సభ్యులు సమైక్యంగా పాల్గొన్న సమావేశం ఇదే. తప్పు చేసిన వ్యక్తి పశ్చాత్తాపపడి తిరిగి సంస్థలో చేరిన విధంగా కాకుండా, గొప్ప విజేతగా తిలక్ కాంగ్రెస్‌లో తిరిగి ప్రవేశించాడు. ఇదివరకెన్నడూ కనివిని ఎరుగని విధంగా, కాంగ్రెస్ జయ జయ ధ్వానాలతో స్వాగతం పల్కింది. కాంగ్రెస్ సభా ప్రాంగణంలోకి తిలక్ ప్రవేశించగానే, ఆనందోత్సాహాలతో సభ్యులు స్వాగతం చెప్పారు. తిలక్ లక్నో కాంగ్రెస్‌ను పూర్తిగా ప్రభావితం చేసాడు. అప్పటినుంచి భారతదేశ రాజకీయాలలో, తిలక్ మకుటంలేని మహారాజయ్యాడు. 1916 లక్నో కాంగ్రెస్ పునర్వికాసాన్ని పొందింది. మొట్టమొదటి సారి, కాంగ్రెస్ మధ్య తరగతి వర్గానికి చెందిన సంస్థ అయింది.

హిందూ-ముస్లిమ్ సమైక్యత కూడా లక్నో కాంగ్రెస్ సాధించిన మరొక ఘనవిజయం. కాంగ్రెస్ - ముస్లిమ్ లీగ్‌ల మధ్య కుదిరిన ఒప్పందం షరతులను ఆమోదించవలసిందని, తిలక్ కాంగ్రెస్ ప్రతినిధులను తన శక్తి యుక్తులన్నీ వినియోగించి ఒప్పించాడు. తిలక్ ఎంతో నేర్పుతో, ఈ ఒప్పందాన్ని సమర్థించక పోయినట్లయితే, లక్నో ఒప్పందాన్ని ఆమోదించడం, తిలక్ ఎదురులేని నాయకత్వానికి ఉదాహరణ.

కాంగ్రెస్, ఆలిండియా ముస్లిం లీగ్ ప్రభుత్వానికి ఉమ్మడి రాజకీయ డిమాండ్లను సమర్పించారు.

19.4 హోంరూల్ ఉద్యమం, అనిబిసెంట్, తిలక్

హోంరూల్ ఉద్యమాన్ని ప్రారంభించి, అనిబిసెంట్ భారత దేశానికి ఎంతో విశ్వాసంతో సేవచేసి అమరజీవి అయింది. హోంరూల్ ఉద్యమం, స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ప్రధాన ఘట్టం. 1914 వరకు అనిబిసెంట్ మత, విద్యా, సాంఘిక రంగాలలో మార్పులు తీసుకు రావడానికి తన శక్తినంతా ధారపోసింది. కాని 1914 తర్వాత ఆమె తన దృష్టిని రాజకీయరంగం మీదికి మరల్చింది. 1914లో **'కామన్‌వీల్'** (Common weal) అనే వారపత్రికను, 1914 ఆగస్ట్‌లో **'న్యూ ఇండియా'** అనే దినపత్రికను *"భారత దేశంలో వస్తున్న మార్పులను వివరించడానికి, బ్రిటీష్ సామ్రాజ్యంలో భారతదేశ స్థానాన్ని హక్కుగా చలాయించడానికి"* ప్రారంభించింది. స్వాతంత్ర్యోద్యమ చరిత్రను గురించి ఆమె చాలా వ్యాసాలను వ్రాసింది. 1914లో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తిలక్‌ను కాంగ్రెస్‌లో తిరిగి ప్రవేశించవలసిందని ఒప్పించడానికి, చర్యలు ప్రారంభించింది. భారతదేశానికి

స్వపరిపాలనావశ్యకతను గురించి హూందాగా, శక్తివంతంగా తెలియజేసింది. జాతీయాశయాలు సాధించడానికి, కాంగ్రెస్ సంస్థ యంత్రాంగం పటిష్ఠంగా లేకపోవడంవల్ల అనిబిసెంట్, తిలక్‌లు స్వతంత్రంగా హోంరూల్ ఉద్యమం గురించి ఆలోచించారు. అనిబిసెంట్, తిలక్‌లు హోంరూల్ ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రజలను ఉత్తేజపరిచారు.



హోంరూల్ ఉద్యమ ప్రతినిధులు

మద్రాస్ నగరంలో గోఖలే హాల్‌లో 1916 సెప్టెంబర్ నెలలో అనిబిసెంట్ హోంరూల్ లీగ్‌ను ప్రారంభించింది. తిలక్ పూనేలో హోంరూల్ లీగ్‌ను స్థాపించాడు. జాతీయవాద లక్ష్యమైన "స్వరాజ్", హోంరూల్ ఉద్యమ లక్ష్యం. అనిబిసెంట్, తిలక్‌లు హోంరూల్ ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రజలను ఉత్తేజపరిచారు.

అనిబిసెంట్, తిలక్‌లు సంయుక్తంగా రూపొందించిన వ్యూహం ప్రకారం, ఉద్యమాన్ని కొనసాగించారు. తిలక్, అనిబిసెంట్‌లు ప్రారంభించిన రెండు లీగ్‌లు కలిసి పనిచేశాయి. ఉధృతంగా ప్రచారాన్ని కొనసాగించాయి. అనిబిసెంట్ పూనేకు వచ్చి, తిలక్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఉపన్యసించింది. 'స్వదేశీ, జాతీయ విద్యావిధానం, భారతదేశానికి హోంరూల్'- ఈ లీగ్ చాటిన నినాదాలు.

హోంరూల్ ఉద్యమం ప్రత్యక్షంగా స్వాతంత్ర్య సంగ్రామాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమం యావద్భారత ప్రజలను ఆకర్షించింది. సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలో తిలక్ ప్రజల నుద్దేశించి మాట్లాడి, సామూహికోద్యమాన్ని ప్రారంభించాడు. ఈ ఉద్యమం జరిగిన కాలంలోనే తిలక్ "**స్వాతంత్ర్యం నా జన్మ హక్కు, దాన్ని నేను పొందుతాను**" అనే నినాదాన్ని ప్రారంభించాడు. ఆ నినాదం ప్రజలందర్నీ ఆకర్షించింది. ఈ రెండు లీగ్‌లు తమ కార్యక్రమాలను త్వరితంగా దేశంలో విస్తరింప చేసాయి. హోంరూల్ నినాదం దేశమంతా మార్మోగింది.

అనిబిసెంట్ కూడా తిలక్ లాగే మహోధృతంగా ప్రచారం చేసింది. ప్రచండ వేగంతో (తుఫాన్ లాగ) వివిధ ప్రాంతాలలో పర్యటించి, నిద్రాణమైన భారతీయులను మేల్కొల్పింది. హోంరూల్ ఉద్యమం వేగాన్ని పుంజుకుంది. ఇంత త్వరితంగా ఉద్యమం విజృంభించడంపట్ల ప్రభుత్వం ఆందోళన చెందింది. మహోధృతమైన ప్రచార ఫలితంగా 1917లో ఈ ఉద్యమం పరాకాష్ఠకు చేరింది.

హోంరూల్ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది. అనిబిసెంట్ 'న్యూ ఇండియా' పత్రిక నుంచి ఎక్కువ ధరావత్తును ప్రభుత్వం వసూలు చేసింది, నిషేధించింది. 1917లో అనిబిసెంట్‌ను ఉదక మండలంలో నిర్బంధించారు. అనిబిసెంట్, బి.పి. వాడియా, అరుండేల్‌లను నిర్బంధించడంవల్ల హోంరూల్ లీగ్ ప్రతిష్ఠ పెరిగింది. అధికారుల దురుసు ప్రవర్తనను, దేశంలో ప్రజలందరూ గర్హించారు. ప్రజల ఆగ్రహాన్ని తట్టుకోలేక, విధిలేక ప్రభుత్వం అనిబిసెంట్‌ను విడుదల చేసింది.

తిలక్, బిపిన్ చంద్రపాల్‌లు ఢిల్లీ, పంజాబ్‌లలో ప్రవేశించకూడదని ప్రభుత్వం శాసించింది.

BRAOU

అనిబిసెంట్ స్వాతంత్రోద్యమానికి చేసిన ఉత్కృష్ట సేవలను గుర్తించి 1917లో ఆమెను భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నుకుంది.

రెండు హోంరూల్ లీగ్‌లు రాజకీయ రంగంపై ఎక్కువ ప్రభావాన్ని కనపర్చలేదు. 1917లో మాంటేగ్ చేసిన విధాన ప్రకటన తర్వాత ఉద్యమం బలహీనమైంది. ఈ ప్రకటన భారత రాజకీయాల రూపు రేఖలనే మార్చి వేసింది. హోంరూల్‌కి అనుకూలంగా ఆందోళన కొనసాగించ వలసిన అవసరం లేదనే అభిప్రాయం బలపడింది.

భారత స్వాతంత్ర్యోద్యమంలో హోంరూల్ ఉద్యమం ఒక కొత్త పోకడను ప్రవేశ పెట్టింది. గతంలో ప్రజ్వరిల్లిన స్వదేశీ ఉద్యమంలా కాకుండా ఈ ఉద్యమం ఏ రాష్ట్రానికీ పరిమితం కాలేదు. ఈ ఉద్యమం దేశం అన్ని ప్రాంతాలలో వ్యాపించింది. యావద్భారత ప్రాతిపదికను సంతరించుకుంది. యాచకత్వ విధాన శిథిలాలపై, జాతీయ భావాలవల్ల ప్రభావితమైన భారతదేశం విజృంభించింది. సమరశీల జాతీయ నాయకుల కల ఫలించింది. స్వాతంత్ర్యోద్యమం తరువాత ఘట్టాలలో పాల్గొన్న స్వాతంత్ర్య యోధులు ప్రదర్శించిన ఉన్నతాదర్శాలకు, హోంరూల్ ఉద్యమం మార్గదర్శకమైంది.

19.5 మాంటేగ్ ప్రకటన

అతివాద, మితవాద, జాతీయవాదుల మధ్య కాంగ్రెస్-ముస్లింలీగ్‌ల మధ్య ఐక్యత, దేశంలో గొప్ప రాజకీయోత్సాహాన్ని రేకెత్తించింది. చివరకు బ్రిటీష్ ప్రభుత్వం కూడా జాతీయవాదులను సంతృప్తి పరచవలసిన అవసరాన్ని గుర్తించింది. రాజ్యాంగ సంస్కరణలను కోరిన భారతీయులను తృప్తి పరచడానికి ఎంతో విశ్వాసంతో యుద్ధకాలంలో భారతీయులు చేసిన సహాయాన్ని గుర్తించి 1917, ఆగస్ట్ 20వ తేదీన భారత రాజ్యకార్యదర్శి మాంటేగ్, ముఖ్య ప్రకటనను చేసాడు.

"పరిపాలనా శాఖలలో భారతీయులకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడమౌతుందని, స్వపరిపాలనా సంస్థలు క్రమాభివృద్ధి చెంది, సామ్రాజ్యంలో భారతదేశం క్రమక్రమంగా, అంచెలమీద బాధ్యతాయుత ప్రభుత్వం పొందుతుందని, ప్రకటించాడు. బ్రిటీష్ ప్రభుత్వ విధానంతో, భారత ప్రభుత్వం కూడా పూర్తిగా ఏకీభవించిందని తెలియచేశాడు".

ఈ ప్రకటన విపరీతార్థాలతో కూడినది, సందిగ్ధమైంది. బ్రిటీషువారి కుటిల నీతికి ఈ ప్రకటన ఒక ఉదాహరణ. ఈ ప్రకటన ఎలాంటి హామీలు ఇవ్వలేదు. మాంటేగ్ ప్రకటనను మితవాదులు హక్కుల ప్రకటనగా భావించి హర్షించారు. ఈ ప్రకటనలోని హామీలు, జాతీయవాదులను మోసగించడానికే అని తీవ్రవాదులు భావించారు.

మాంటేగ్ ప్రకటన చేసిన తరువాత జరిగిన రాజకీయ పరిణామాలను పరిశీలిద్దాం. ఈ ప్రకటన తర్వాత మితవాదులు తీవ్రవాదుల నుంచి విడిపోయారు. 1907లో మితవాదులు తీవ్రవాదులను, కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు. కాని 1918లో మితవాదులు కాంగ్రెస్ నుంచి వెళ్ళిపోయారు. కాంగ్రెస్ నుంచి మితవాదులు నిష్క్రమించడంతో, భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రనుండే వారు కనుమరుగయ్యారు. గత కాలపు వైభవాలను స్మరించుకుంటూ వారు జీవించారు.

1917 నవంబర్‌లో మాంటేగ్ భారతదేశాన్ని సందర్శించి, బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించిన హామీలను ఎలా అమలు జరపాలో, లార్డ్ చెమ్స్‌ఫర్డ్‌తో చర్చించాడు. మాంటేగ్ తయారుచేసిన నివేదికను వైస్రాయి ఆమోదించాడు. ఆ నివేదికను 1918లో ప్రకటించారు. 1919 భారత ప్రభుత్వ సంస్కరణలకు, ఈ నివేదిక ఆధారమైంది. ఈ సంస్కరణలనే మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలంటారు. వీటినే మాంట్ ఫర్డ్ సంస్కరణలని కూడా అంటారు. ఈ సంస్కరణలను 1921లో ప్రవేశపెట్టారు.

BRAOU

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. అనిబిసెంట్, హోంరూల్ లీగ్‌ను ఎప్పుడు, ఎక్కడ, స్థాపించింది?

.....

.....

.....

.....

2. 1917లో మాంటేగ్ ప్రకటనపట్ల భారతీయులు ఎందుకు సంతృప్తిని ప్రకటించలేదు?

.....

.....

.....

.....

19.6 రౌలట్ చట్టం

ప్రభుత్వం రౌలట్ చట్టాన్ని (Rowlatt Act) ప్రకటించడానికి కారణాలను పరిశీలిద్దాం. యుద్ధం కొనసాగినంత కాలం ప్రభుత్వం, విప్లవ సంఘటనలను భారత రక్షణ చట్టం (Defence of India Rules) నిబంధనల ననుసరించి విచారణ జరిపి, చర్యలు తీసుకుంది. యుద్ధం ముగిసేటప్పటికి, ఈ చట్టానికి కూడా కాలం చెల్లింది. ప్రజల స్వేచ్ఛను అరికట్టారు. విప్లవోద్యమాన్ని అదుపు చేయడానికి, ప్రభుత్వం ప్రత్యేక శాసనాలను ఆమోదించింది. స్వేచ్ఛకు బదులు ప్రభుత్వం తీవ్రంగా అణచివేత విధానాన్ని అనుసరించింది. న్యాయమూర్తి రౌలట్ అధ్యక్షతలో కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ విల్లులను రూపొందించారు, అందువల్ల రౌలట్ చట్టాలంటారు. 1919 ఫిబ్రవరి నెలలో కేంద్ర శాసనసభ (Imperial Legislative Council) లో రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ బిల్లులను దేశంలో ప్రజలందరూ నల్ల చట్టాలుగా (Black Bills) విమర్శించారు. రాజకీయ భేదాభిప్రాయాలను విస్మరించి, భారతీయులందరూ ఈ చట్టాలను గర్హించారు. శాసనసభలోని భారతీయ సభ్యులందరూ వ్యతిరేకించినా 1919 మార్చి నెలలో ప్రభుత్వం రౌలట్ చట్టాలను ఆమోదించింది. ఈ చట్టాలను అమలు జరిపితే, గాంధీజీ సత్యాగ్రహం చేస్తానని బెదరించాడు. 1919లో శాసనసభ ఆమోదించిన రౌలట్ చట్టాలు భారతీయుల ఆత్మ గౌరవానికి, ప్రతిష్ఠకు అవమానం. రాజకీయ కార్యక్రమాలను అణచివేయడానికి, ఈ శాసనాలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ శాసనాలవల్ల ప్రభుత్వానికి, విస్తృతాధికారాలు లభించాయి. ఎలాంటి విచారణ జరుపకుండా దేశద్రోహ చర్యలకు పాల్పడ్డారన్న అనుమానంపై, ప్రజలను నిర్బంధించవచ్చు. హెబియస్ కార్పస్ చట్టాన్ని (Habeas Corpus Act) అమలు పరచడాన్ని, ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. పత్రికల నోరు నొక్కేసింది. దేశంలో పెరుగుతున్న రాజకీయ అశాంతి దృష్ట్యా, ప్రభుత్వం ఈ విధమైన శాసనాలను ఆమోదించింది.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. రౌలట్ చట్టాలంటే ఏమిటి?

.....

.....

.....

.....

BRAOU

ప్రజ్వరిల్లింది. బెంగాలీల రాజకీయ కార్యక్రమాలు ఉధృతం కావడంవల్లనే, కర్జన్ బుద్ధిపూర్వకంగా బెంగాల్‌ని విభజించాడని తూర్పు బెంగాల్‌లో ముస్లింలను సమాన బలంగల వ్యతిరేక శక్తిగా - జాతీయోద్యమాన్ని వ్యతిరేకించే శక్తిగా రూపొందించడాన్ని, ప్రజలు గాఢంగా విశ్వసించారు. కర్జన్ చర్యలన్నీ జాతీయ భావాలను గాయపరిచాయి. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహాన్ని రగుల్కొల్పాయి. స్వదేశీ-ఆర్థిక బహిష్కరణ ఉద్యమం ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని, స్థిరసంకల్పాన్ని సృష్టించింది. 1892 ఇండియన్ కౌన్సిల్స్ చట్టంపట్ల ప్రజలు అప్పటికే అసంతృప్తి చెందారు. 1935 చట్టం అంతకుముందున్న శాసనాలపై ముందడుగే అయినా, భారతీయులకు సంతృప్తిని కల్పించలేదు.

20.2 రాజ్యాంగ సంస్కరణలు

భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించినప్పుడు, దేశ పరిపాలనలో భారతీయ విద్యావంతులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని కోరింది. ప్రారంభ దశలో రాజకీయ రంగంపై భారత జాతీయ కాంగ్రెస్ ప్రభావం పరిమితమైంది.

భారత జాతీయ కాంగ్రెస్ కోరిన రాజ్యాంగపరమైన సంస్కరణలు :-

1) అన్ని రాష్ట్రాలలో శాసన సభలను (Legislative Assemblies) ఏర్పాటు చెయ్యాలి.
2) సామ్రాజ్య, రాష్ట్రశాసనసభలలో సభ్యులను ఎన్నుకోడానికి, ఎన్నిక సూత్రాన్ని ఆమోదించాలి.
3) వార్షిక ఆదాయ, వ్యయ పట్టికపై (బడ్జెట్) చర్చించే హక్కు ఇవ్వాలి.

1885 నుంచి 1891 వరకు జరిగిన అన్ని సమావేశాలలోను, భారత జాతీయ కాంగ్రెస్ 1861 కౌన్సిల్ చట్టంలో మార్పులు తెచ్చి సంస్కరించాలని కోరింది.

ఈ కోర్కెలపట్ల సానుభూతిని ప్రకటించి, రాజప్రతినిధి లార్డ్ డఫ్రిన్ 1892 ఇండియన్ కౌన్సిల్ చట్టంలో పొందుపరచవలసిందిగా ఇంగ్లండ్ ప్రభుత్వానికి నచ్చ చెప్పాడు.

20.3 1892 ఇండియన్ కౌన్సిల్స్ చట్టం

1892 శాసన సభల చట్టం, భారతదేశం రాజ్యాంగ సంస్కరణల ప్రగతిలో మరొక ముఖ్యఘట్టం. 1892 చట్టంలో మూడు ముఖ్య మార్పులను గమనించాలి.

1) ఈ చట్టంవల్ల గవర్నర్-జనరల్ కౌన్సిల్‌లోను, రాష్ట్రాలలో గవర్నర్ల కౌన్సిళ్లలోను, భారతీయ సభ్యుల సంఖ్యను పెంచారు.

2) చట్టబద్ధంగా కాకపోయినా, ఆనవాయితీగా భారతీయ సభ్యులను పరోక్షపద్ధతిలో ఎన్నుకునే పద్ధతిని ప్రవేశ పెట్టారు. జిల్లాబోర్డులు, పురపాలక సంఘాలు, వాణిజ్య సంఘాలు, విశ్వవిద్యాలయ సెనేట్ల సలహాపై, సభ్యులను నియమించేవారు.

3) ఈ చట్టం ద్వారా, శాసనసభల ప్రాముఖ్యం కొంత పెచ్చింది. 1861 చట్టం ప్రకారం, కౌన్సిల్ కార్యక్రమాలకు మాత్రమే పరిమిత మయ్యాయి. కాని 1892 శాసనసభల చట్టం ప్రకారం అందులోని సభ్యులు శాసనాలు చేయడమేకాక, బడ్జెట్‌ను గురించి చర్చించడానికి, పరిపాలనా విషయాలపై ప్రశ్నించడానికి అధికారం పొందారు.

శాసన సభలలో ఎన్నికల పద్ధతిని, మనదేశంలో ఈ చట్టం ద్వారా ప్రథమంగా ప్రవేశపెట్టడమైంది. ప్రభుత్వ ఆర్థిక విధానాలను చర్చించి విమర్శించే హక్కు లభించడంవల్ల పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థకు ఈ చట్టాన్ని పునాదిగా భావించవచ్చు. ఈ చట్టం భారతీయులకు తృప్తినివ్వలేదు. కేంద్ర, రాష్ట్ర శాసన సభలలో

అధికారుల సంఖ్య ఎక్కువగా ఉండటంవల్ల, అసంతృప్తి పెరిగింది. పరోక్ష ఎన్నిక విధానంపట్ల కూడా అసంతృప్తిని ప్రకటించారు. సభ్యులకు బడ్జెట్ ప్రతిపాదనలపై వోటు చేసే హక్కు లేదు. కొద్దికాలంలోనే అనధికార సభ్యులు తమ విమర్శలవల్ల ఎలాంటి ప్రయోజనం లేదని గ్రహించారు. 1892 చట్టంవల్ల శాసన సభలలో భారతీయులకు ఎక్కువ ప్రాతినిధ్యం లభించింది. కాని కాంగ్రెస్ కోరిన ప్రకారం, ఎన్నిక విధానాన్ని మాత్రం ప్రభుత్వం ప్రవేశపెట్టలేదు. చట్టబద్ధమైన విధానాలకు మాత్రమే మితవాదులు ప్రాధాన్యత నివ్వడంవల్ల, విజృంభిస్తున్న తీవ్రవాద నాయకత్వంతో 1907లో సూరత్ కాంగ్రెస్‌లో సంఘర్షణ జరిగింది.

20.4 1909 సంస్కరణలకు దారితీసిన పరిస్థితులు

1905లో రష్యా - జపాన్ యుద్ధంలో రష్యా ఓటమి, తెల్లజాతి ఆధిక్యతా విశ్వాసాన్ని పటాపంచలు చేసింది. భారతీయులు తాము తక్కువ వారమనే నైచ్యభావాన్ని వదలిపెట్టేశారు. బ్రిటీష్ పరిపాలనను తొలగింపగలమనే ధైర్యం, వారిలో కలిగింది. జపాన్ విజయం భారతీయ యువతలో బ్రిటీష్ పరిపాలన భగవత్ వరప్రసాదం కాదనే నమ్మకాన్ని బలపరచింది. అన్ని వర్గాల ప్రజలు సమైక్యం గోఖలే యొక్క చైతన్యవంతమైన నాయకత్వంలో, రాజ్యాంగ సంస్కరణలను డిమాండ్ చేశారు.

ఇదే సమయంలో, ఇంగ్లాండ్‌లో లేబర్ పార్టీ వారు స్వాతంత్ర్యం, స్వపరిపాలనా సూత్రాలకు కట్టుబడ్డారు. ప్రజల కష్టాలను పరిశీలించడానికి అంగీకరించారు. ఇంగ్లండ్‌లోని లేబర్ పార్టీ భారతీయుల స్వాతంత్ర్యాన్ని ఆమోదించలేదు. భారతీయులకు పరిపాలనలో ఎక్కువ అవకాశాలు కల్పించడానికి, సానుభూతిని కనపరిచింది. కొత్త భారత రాజ్య కార్యదర్శి లార్డ్ మార్లే, గొప్ప విద్యావేత్త, ఆదర్శవాది, ఉదారవాది. భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ఇష్టపడకపోయినా భారత జాతీయ కాంగ్రెస్‌ను శాంతింపచేయడానికి సిద్ధమైనాడు. చాలా మంది విద్యావంతులైన భారతీయులు, లార్డ్ మార్లేను అభిమానించి, గుడ్డిగా ఆరాధించారు.

భారతదేశాన్ని పరిపాలించడానికి మార్లే తీవ్రమైన అణచివేత విధానాన్ని అనుసరిస్తూనే, సంస్కరణలపట్ల విశ్వాసాన్ని పెంపొందించాలనే మౌలిక విధానాన్ని ప్రవేశపెట్టాడు. బుజ్జగింపు విధానాన్ని, అణచివేత విధానాన్ని సమపాళ్ళలో అనుసరిస్తే సఫలమౌతుందని, అణచివేత విధానం ఒక్కటే ఫలించదని భావించాడు. ప్రభుత్వం అణచివేత విధానాన్ని అనుసరిస్తూనే, రాయితీలను ప్రకటించే విధానాన్ని అనుసరించింది. గోఖలే భారత రాజ్య కార్యదర్శి మార్లేతో సమావేశమై, భారతీయులకు చాలా రాయితీలు ప్రకటించాలని కోరాడు.

లార్డ్ కర్జన్ తర్వాత వైస్రాయిగా పదవీ స్వీకారం చేసిన లార్డ్ మింటో, మితవాద కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపి, కొన్ని నిర్ణయాలకు వచ్చాడు. మింటో కాంగ్రెస్‌ను నిర్లక్ష్యం చెయ్యదలచుకోలేదు. దేశ రాజకీయాలలో కాంగ్రెస్ ప్రాధాన్యతను గుర్తించాడు. గోఖలే భావాలు, ఆశలు అవాస్తవికమని భావించినా, కాంగ్రెస్ నాయకులలో గోఖలేని ఆమోదించాడు.

తీవ్రవాదుల ప్రచారం, హింసావాదుల కార్యక్రమాలు బ్రిటీష్ నాయకులను కదలించాయి. భారత రాజ్య కార్యదర్శి, గవర్నర్-జనరల్ తీవ్రవాదుల ప్రభావాన్ని నిరోధించడానికి, అంగీకారానికి వచ్చారు. భారతీయులను ఎల్లకాలం మోసగించలేమని వారు గ్రహించారు. భారతదేశంలో రాజకీయ అశాంతిని అంతమొందించడానికి, అణచివేత విధానాన్ని అనుసరిస్తూనే, రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

సమరశీల జాతీయవాద విజృంభణవల్ల, బ్రిటీష్ ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరించింది. ఈ విధానానికి అనుగుణంగానే 1909 ఇండియన్ కౌన్సిల్స్ చట్టం ప్రకారం, రాజ్యాంగ సంస్కరణలను ప్రకటించింది. ఈ సంస్కరణలనే 1909 మింటో-మార్లే సంస్కరణలంటారు. హిందూ-ముస్లింల మధ్య అగాధాన్ని సృష్టించాలని, కాంగ్రెస్‌ను మితవాదులుగా తీవ్రవాదులుగా విభజించాలన్నదే ప్రభుత్వాశయం.

BRAOU

1909 చట్టం, 1892లో చేసిన ఇండియన్ కౌన్సిల్స్ చట్టం కంటె, చాలా మెరుగని చెప్పవచ్చు. కాంగ్రెస్‌లోని మితవాద వర్గాన్ని సంతృప్తి పరచడంకోసం, ఈ చట్టాన్ని బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించింది. ఈ చట్టాన్ని రూపొందించే ముందు, బ్రిటీష్ ప్రభుత్వం గోఖలేతో సంప్రదించింది. ఈ చట్టంలో రూపొందించిన ప్రత్యేక నియోజక వర్గాల సృష్టి, లార్డ్ మింటో ముస్లింలను బ్రిటీష్ ప్రభుత్వానికి అనుకూలంగా, కాంగ్రెస్ ఉద్యమానికి వ్యతిరేకంగా, మార్చడానికి పన్నిన పన్నాగం.

20.5 1909 చట్టం - ప్రధానాంశాలు

భారత రాజ్య కార్యదర్శి ఆధిక్యత, పర్యవేక్షణ, బాధ్యత గతంలోవలె కొనసాగాయి. భారతదేశంలో ప్రభుత్వ సక్రమ నిర్వహణకు, ఇతడు పార్లమెంట్‌కు బాధ్యుడు. 1907లో ఇండియన్ కౌన్సిల్‌కు ఇద్దరు భారతీయులను ప్రభుత్వం నియమించింది. ఇండియన్ కౌన్సిల్ సలహా సంఘంగా మాత్రమే కొనసాగింది. కె.జి గుప్తా. సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామీలను ఇండియా కౌన్సిల్ సభ్యులుగా మార్లే నియమించాడు.

వైస్రాయి కార్యనిర్వాహక మండలిలో, ఒక భారతీయున్ని నియమించారు. ఈ మండలిలో 'లా' సభ్యుడుగా యస్.పి. సిన్హాను నియమించారు. బొంబాయి, మద్రాస్ కార్యనిర్వాహక మండలిలో సభ్యుల సంఖ్యను 3 నుంచి 4 వరకు పెంచారు. 1909లో బెంగాల్‌లో కార్యనిర్వాహక మండలిని ప్రారంభించారు. 1912లో బీహార్-ఒరిస్సాలకు కూడా ఒక కార్యనిర్వాహక మండలిని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ చట్టం ప్రకారం, రాష్ట్ర కార్యనిర్వాహక మండలిలో భారతీయులను నియమించారు.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోను, కౌన్సిళ్ళలో సభ్యుల సంఖ్యను పెంచారు. కేంద్ర శాసన సభలోను, రాష్ట్రాల్లోని శాసనసభలలోను అదనంగా భారతీయ సభ్యుల సంఖ్యను పెంచారు. రాష్ట్రాలలో కూడా అదనపు సభ్యుల సంఖ్యను పెంచారు.

కేంద్ర, రాష్ట్ర శాసన సభలలో అధికార, అనధికార సభ్యులుండేవారు. అనధికార సభ్యులను పరోక్ష ఎన్నికద్వారా ఎన్నుకోవాలి. భూస్వాములు, వర్తక సంఘాలు, పురపాలక సంఘాలు, విశ్వవిద్యాలయాలు, అనధికార సభ్యులను పరోక్షంగా ఎన్నుకొనేవారు. మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను సృష్టించాలనే ముస్లింలీగ్ కోరికను ప్రభుత్వం అంగీకరించింది. ముస్లిం ప్రతినిధులను ముస్లిం ఓటరే ఎన్నుకోవాలి.

1909 చట్టం ప్రకారం అధికార సభ్యులే అధిక సంఖ్యాకులు. భారత కేంద్ర శాసన సభ గరిష్ట సంఖ్య 60. వారిలో 28 మంది సభ్యులు అధికారులు; 32 మంది అనధికార సభ్యులు. వారిలో 27 మంది సభ్యులను మతప్రాతిపదికపై పరోక్ష ఎన్నికద్వారా ఎన్నుకోవాలి. 5గురు ఉద్యోగేతరులను వైస్రాయి నియమించేవాడు.

రాష్ట్ర శాసనసభలలో అధికార సభ్యుల మెజారిటీకి, ఈ చట్టం స్వస్తి చెప్పింది. రాష్ట్ర శాసన సభలో మొత్తం సభ్యుల సంఖ్య, రాష్ట్రాల పరిమాణంపై ఆధారపడి ఉంది. అధికార, అనధికార సభ్యుల మొత్తం సంఖ్య ఎన్నికైన సభ్యుల కంటె ఎక్కువ. అధికార సభ్యుల వర్గం, ప్రభుత్వ అనుకూల విధానాన్ని అనుసరించి, ప్రభుత్వ చర్యలన్నిటిని సమర్థించింది. పెద్ద రాష్ట్రాలలో శాసన సభ్యుల గరిష్ఠ సంఖ్యను 50కి పెంచారు. వీరిలో అధికార, అనధికార సభ్యులున్నారు. శాసనసభకు బడ్జెట్‌కొైన, ప్రజాశ్రేయస్సుకు సంబంధించిన అంశాలపైన, తీర్మానాలను ప్రతిపాదించే హక్కు లభించింది. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, వైస్రాయ్ శాసన సభ తీర్మానాలను వీటో (Veto) చేయవచ్చు.

మత వర్గాల ప్రయోజనాలకు ఎనలేని ప్రాధాన్యతను కల్పించడం, ఈ కొత్తచట్టంలోని చాలా దురదృష్టకరమైన ప్రధానాంశం. జనాభా నిష్పత్తితో సంబంధం లేకుండా, అధిక ప్రాతినిధ్యం కల్పించి, ఈ చట్టం ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించింది. కౌన్సిళ్ళలోను, ప్రభుత్వోద్యోగాలలోను, కొన్ని స్థానాలను వారికి కేటాయించారు. హిందూ-ముస్లిం ఓటర్లకు, ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు.

BRAOU

1909 చట్టం ముస్లింలకు ప్రత్యేక సదుపాయాలనిచ్చి, ముస్లిమేతరులకు తీవ్రంగా అన్యాయం చేసింది. ఉదాహరణకు రూ. 3,000ల వార్షిక ఆదాయంపై ఆదాయంపన్ను చెల్లించే ముస్లిం వ్యక్తికి, ఓటు హక్కు లభించింది. హిందువులు, క్రైస్తవులు, పార్సీలలో వ్యక్తి, పన్ను చెల్లించ వలసిన వార్షిక ఆదాయం రూ॥ 3 లక్షలైనా, ఓటు హక్కులేదు. ముస్లిం పట్టభద్రునకు 5 సంవత్సరాల తర్వాత ఓటు హక్కు లభిస్తుంది. కాని, ముస్లిమేతర వర్గాలకు చెందిన వ్యక్తికి, పట్టభద్రుడైన 20 సంవత్సరాల తర్వాతకూడా, ఓటు హక్కు లభించదు. ఎన్నికకు సంబంధించిన ముఖ్య సూత్రాల ప్రతిపాదనలను రూపొందించే అధికారం, గవర్నర్-జనరల్‌కు లభించింది. గవర్నర్-జనరల్, పరిమితంచేసే విచక్షణా పద్ధతితో కూడిన ఓటింగ్ విధానాన్ని సూచించాడు. తెగ, వర్గం, ప్రయోజనాల ప్రాతిపదికపై ప్రతినిధులను ఎన్నుకోవడానికి, నియోజక వర్గాలను విభజించారు. ఓటింగ్ అర్హతలలో కూడా రాష్ట్రానికీ రాష్ట్రానికి మార్పు ఉంది. కేంద్ర శాసనసభకు 4 రకాల నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు. సాధారణ, ప్రత్యేకించిన, వివిధ వర్గాలకు చెందిన ముస్లింలకు, నియోజకవర్గాలను సృష్టించారు. రాష్ట్ర శాసనసభలకు మాత్రం, నియోజక వర్గాలను మొదటి మూడు వర్గాలుగా విభజించారు.

1909 సంస్కరణలు కలవరాన్ని సృష్టించాయి. ఈ సంస్కరణలవల్ల ప్రాతినిధ్య ప్రభుత్వం ఆరంభమైందని చెప్పవచ్చు. కాని, శాసన సభలకు ప్రభుత్వం బాధ్యత వహించదు. ఓటింగ్ విధానం ప్రకారం, ఓటర్ల సంఖ్య చాలా తక్కువ కావడంవల్ల అవినీతి పెరిగింది. ఈ చట్టప్రకారం భూస్వాములు, వర్తకసంఘాలవంటి స్వప్రయోజనపరులకు ప్రాధాన్యత పెరిగింది. మత ప్రాతిపదికపై పరోక్షంగా ఎన్నుకోబడిన సభ్యులకు, చట్టాలను రూపొందించడంలోకాని, పరిపాలనలోకాని, ఏమాత్రం పలుకుబడిలేదు. శాసనసభలలో అధికార, అనధికార సభ్యుల మధ్య సంఘర్షణ తలెత్తింది. ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటు, భారత జాతీయ వాదానికి తీవ్రమైన హానిని కల్గించింది. ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన, భారతదేశ రాజకీయాలలో ప్రమాదకరమైన మతోన్మాదాన్ని ప్రవేశపెట్టింది. ఈ ప్రమాదం నుంచి దేశం కోల్కొన లేకపోయింది. 1909 సంస్కరణలవల్ల, జాతీయ వాదులు సంతృప్తి చెందలేదు. ఈ సంస్కరణలలో లోపాలున్నా, మితవాదులు ఈ సంస్కరణలను హర్షించారు. కాని, త్వరలోనే ఆశాభంగం చెందారు. ఆశాభంగం చెందిన మితవాదులు, తీవ్రవాదంవైపు మొగ్గారు. 20వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో, దేశంలో పెరుగుతున్న వ్యతిరేకతను అణచడానికి, ప్రభుత్వం 1908 క్రిమినల్ సవరణ చట్టాన్ని, 1910 ఇండియన్ ప్రెస్ చట్టాన్ని ఆమోదించింది.

20.6 ఇండియన్ క్రిమినల్ లా సవరణ చట్టం, 1908

సత్వర విచారణ జరిపించడానికి, ఈ చట్టం 'క్రిమినల్ లా' (Criminal Law) లో తీవ్రమైన మార్పులను చేసింది. ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన ట్రిబ్యునల్‌కు, నిందితులను విచారణ జరిపించడానికీ ఈ చట్టం ప్రకారం అవకాశం కల్పించారు. నిందితులకు బెయిల్ (bail) సదుపాయాన్ని నిరాకరించవచ్చు. ఈ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులపై అప్పీలు (appeal) చేసుకోడాన్ని నిషేధించారు. శాంతి భద్రతలకు ప్రమాదం కల్గితే, వ్యక్తులు సమావేశం జరపడాన్ని చట్టవ్యతిరేకంగా ప్రకటించే హక్కు, ఈ చట్టంవల్ల ప్రభుత్వానికి లభించింది.

1910 ఇండియన్ ప్రెస్ చట్టం ప్రకారం, దేశద్రోహకరమైన ప్రచురణలు జరిపితే ఆ పత్రికలపై ఎక్కువ జరిమానా విధించవచ్చు. ఈ ప్రెస్ చట్టాన్ని ఆమోదించడంవల్ల, పౌరహక్కులకు-పత్రికా స్వేచ్ఛ వేదిక, సమావేశాలకు - భంగం కల్గింది.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. మింటో-మార్లే సంస్కరణలు ప్రకటించడంలో, బ్రిటీష్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశాలేవి?

.....

.....

.....

.....

BRAOU

2. 1909 చట్టంలో ఎక్కువగా విమర్శకు గురి అయిన అంశమేది?

.....

.....

.....

.....

20.7 1919 చట్టం పూర్వ ఘట్టం

1919 మాంటేగ్-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టడానికి గల పూర్వ రంగాన్ని పరిశీలిద్దాం. మింటో-మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టిన 5 సంవత్సరాలలో, మొదటి ప్రపంచయుద్ధం (1914-18) ప్రజ్వరిల్లింది. స్వయం నిర్ణయాధికార సూత్రాన్ని అమలు జరపడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికీ ఈ యుద్ధం కొనసాగుతోందని, బ్రిటీష్ పరిపాలకులు ప్రకటించారు. వస్తుసామగ్రిని, వనరులను సమకూర్చి, నిధులను వసూలు చేసి, భారతీయ సైనికులను యుద్ధానికి పంపించి, ఇంగ్లండుకు భారతదేశం చాలా సహాయం చేసింది.

భారతీయ సైనికులు ఇంగ్లీషు సైనికులతో, కామన్ వెల్త్ సైనికులతో భుజం భుజం కలిపి ఐరోపా, మధ్యఆసియా యుద్ధరంగాలలో పోరాడారు. యుద్ధం ముగియగానే భారతీయులు, తాము బ్రిటీష్ వారికి యుద్ధంలో తోడ్పడినందుకు ప్రతిఫలంకోసం ఎదురు చూశారు. తిలక్, అనిబిసెంట్‌లు హోంరూల్ ఉద్యమాన్ని ఉధృతంగా ప్రారంభించారు. కాంగ్రెస్-ముస్లింలీగ్‌ల మధ్య కుదిరిన 1916 లక్నో ఒప్పందం, జాతీయోద్యమానికి కొత్త ఊపునిచ్చింది. సాధ్యమైనంత త్వరలో స్వపరిపాలనను ప్రకటించాలని కోరుతూ లీగ్, కాంగ్రెస్ సమావేశాలలో ఒకేవిధమైన తీర్మానాలు ఆమోదించబడినాయి. తిరిగి మితవాదులను తృప్తి పరచవలసిన అవసరాన్ని, బ్రిటీష్ ప్రభుత్వం ఆలోచించింది.

మొదటి ప్రపంచ యుద్ధం, భారతీయుల మనోభావాలలో విప్లవాన్ని రేకెత్తించింది. మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లగానే, ప్రపంచ రాజకీయాలలో మార్పు వేగం పుంజుకుంది. యుద్ధకాలంలో భారత జాతీయ వాదం బలపడింది. రష్యా, ఐర్లండ్, ఈజిప్ట్‌లలో జరిగిన ముఖ్య సంఘటనలు, భారతదేశంలోని మేధావి వర్గాన్ని ప్రభావితం చేసాయి. భారతదేశంలో హోంరూల్ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలోనే, 1917లో రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లింది.

20.7.1 1919 రష్యావిప్లవ ప్రభావం

రాజకీయ, న్యాయరంగాలలో భారతదేశాన్ని ప్రగాఢంగా ప్రభావితం చేసిన ఏకైక సంఘటన, రష్యన్ విప్లవం అని చెప్పవచ్చు. ఈ మహత్తర విప్లవం, సామాన్య ప్రజానీకంలోని నిక్షిప్తమైన శక్తిని తెల్పింది. వలస ప్రపంచంలోని సామాన్య ప్రజలను ఆశ్చర్య చకితుల్ని చేసింది. 1917 నవంబర్‌లో ప్రజ్వరిల్లిన రష్యన్ విప్లవ విజయం ప్రపంచాన్నంతా కుదిపివేసింది. ఈ విప్లవంవల్ల, సామ్రాజ్యవాద సౌధానికి మొదటిగండి పడింది. ప్రపంచంలోని అణగారిన యావత్తు ప్రజానీకం, క్రొత్త ఆశతో ఉద్రేక పూరితులయ్యారు. సామాన్య ప్రజానీకంలో అసామాన్యబలం, శక్తి, నిక్షిప్తమై ఉన్నాయన్న అమూల్యసత్యాన్ని, రష్యన్ విప్లవం వలస దేశాల ప్రజలకు తెలియచెప్పింది. 1917 రష్యన్ విప్లవం విజయవంతమైన తర్వాత స్థాపితమైన మొదటి సామ్యవాద రాజ్యం, భారతీయ యువతను తీవ్రంగా ఆకర్షించి, ప్రభావితం చేసింది. భూములు లేనివారికి భూములు పంచి పెట్టిన లెనిన్ శాసనాలు, మేధావి వర్గాన్ని ప్రేరేపించాయి. అణగారిన జాతుల తరపున రష్యా చేసిన విజ్ఞప్తి యువతలో అనుకూల వైఖరిని కల్గించింది. రష్యన్ విప్లవం విజయవంతమైన తర్వాత, భారతదేశంలో కార్మికోద్యమం, కర్షకుల ఆందోళన వృద్ధిచెందాయి. కమ్యూనిష్టు పార్టీ స్థాపన జరిగింది. రష్యా విప్లవ ప్రభుత్వం పొరుగు దేశాలతో గతంలో చేసుకున్న అసమాన సంధులను, ఏకపక్షంగా రద్దుచేసుకోవడం, భారతీయులను గాఢంగా ప్రభావితం చేసింది.

20.7.2 ఐర్లండ్‌లో సిన్ ఫిన్ ఉద్యమ ప్రభావం

బ్రిటీష్ ప్రభుత్వం నుంచి స్వేచ్ఛకోసం ఐర్లండ్ కొనసాగించిన పోరాటాన్ని భారతీయ నాయకులు పరిశీలించారు. ఐరిష్ దేశభక్తులు మొదటిసారి ఆర్థిక బహిష్కరణ ఆంసుధాన్ని, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రయోగించారు. ఆర్థిక బహిష్కరణ రాజకీయ సమరంలో బలమైన ఆయుధంగా తయారైంది. 1902లో గ్రిఫిత్ (Griffith) ఐరిష్ లీగ్‌ను స్థాపించి, సిన్ ఫిన్ విధానాన్ని రూపొందించాడు. అప్పటినుంచి సిన్ ఫిన్ (Sinn Feing) ఐరిష్ స్వాతంత్ర్య యోధుల యుద్ధనినాదమైంది.

సిన్ ఫిన్ విధానాన్ని అనుసరించేవారు, ఐర్లండ్ స్వయం పోషకత్వాన్ని సాధించాలని భావించారు. పార్లమెంటరీ పద్ధతులలో వారికి నమ్మకంలేదు. వారు 'ప్రత్యక్ష చర్య'కు పూనుకోవాలని, అంటే బ్రిటీష్ ప్రభుత్వంపట్ల సహాయ నిరాకరణ కొనసాగించాలని ఉపదేశించారు. ఈ సంఘర్షణను శాంతియుతంగా కొనసాగించాలని నిర్ణయించారు. మొదట్లో సిన్ ఫిన్ భావాలు, ఐరిష్ యువతలో మెల్లిగా వ్యాపించాయి. 1906లో ఇంగ్లండ్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఐరిష్ స్వాతంత్ర్యం పట్ల లేబర్ పార్టీకి సానుభూతి ఉన్నప్పటికీ, ప్రభువుల సభలో (House of Lords) కన్సర్వేటివ్‌లకు చాలా బలం ఉండడంవల్ల, లేబర్ పార్టీ ఏమీ చెయ్యలేక పోయింది. 1914లో చిట్టచివరకు, హోంరూల్ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఇదే సమయంలో, మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లింది. ఈ యుద్ధం భీకరంగా కొనసాగిన కాలంలో, బ్రిటీష్ ప్రభుత్వం ఐర్లండ్‌లో నిర్బంధ సైనిక శిక్షణను ప్రవేశపెట్టింది. ఐరిష్ ప్రజలు ఈ చర్యల పట్ల నిరసనను ప్రకటించారు. అవసరమైతే తీవ్రంగా ప్రతిఘటించడానికి నిశ్చయించారు.

1916లో 'ఈస్టర్' వారంలో డబ్లిన్ తిరుగుబాటు ప్రజ్వరిల్లింది. విప్లవకారులు 'ఐరిష్ రిపబ్లిక్'ను ప్రకటించారు. ఈ ప్రకటన భారత జాతీయోద్యమానికి గొప్ప ఉత్తేజాన్నిచ్చింది. బ్రిటీష్ అధికారులు తిరుగుబాటు నాయకులను కాల్చి చంపారు. బ్రిటీష్ ప్రభుత్వం ఈ తిరుగుబాటును అణచివేసినా, ఈ తిరుగుబాటు ఐరిష్ ప్రజలపై గొప్ప ప్రభావాన్ని కనపరిచింది. సిన్ ఫిన్ ఆశయాలు జనాదరణలను పొంది, త్వరితంగా విస్తరించాయి. మైఖేల్ కాలిన్స్ (Michael Collins) నాయకత్వంలో, ఐరిష్ గెరిల్లాలు బ్రిటీష్ అధికారులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడారు. ఐరిష్ ప్రజల వీరోచిత పోరాటాన్ని, భారతీయ మేధావి వర్గం ప్రోత్సహించింది.

20.7.3 నేషలిస్ట్ పార్టీ - ఈజిప్ట్

ఈజిప్ట్ కూడా బ్రిటీష్‌వారి పరిపాలనలో వలస ప్రాంతంగా కొనసాగింది. 19వ శతాబ్దపు చివరిపాదంలో విదేశీ వాణిజ్యం పెంపొందడంతో, క్రొత్త మధ్యతరగతి వర్గం ప్రాధాన్యతను సంతరించుకుంది. జగ్లూల్ పాషా (Zaghlul Pasha) రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ, మధ్యతరగతి వర్గం సభ్యుడయ్యాడు. జగ్లూల్ పాషా ఈజిప్ట్ స్వాతంత్ర్యోదమానికి, నేషలిస్ట్ పార్టీ (Nationalist Party) కి నాయకుడయ్యాడు. ఇతడు ఈజిప్ట్‌కు తిరుగులేని నాయకుడయ్యాడు. రైతాంగం ఇతడిని గాఢంగా ప్రేమించింది. మధ్యతరగతి వర్గంవారు, జగ్లూల్ పాషాను ఆరాధించారు. కాని, కులీన వర్గం మాత్రం ఇతడంటే ఇష్టపడలేదు. మొదటి ప్రపంచ యుద్ధంలో జగ్లూల్ పాషా నాయకత్వంలో, నేషనలిష్ట పార్టీ ప్రతిష్ఠ విశిష్టంగా పెంపొందింది.

భారతదేశంలో కోపోద్రేకంతో కూడిన వాతావరణం నానాటికి అధికమౌతుండగా ప్రభుత్వ వ్యతిరేక భావాలు బలపడడాన్ని గ్రహించి, ప్రభుత్వం రాజీ ధోరణిని-సర్దుబాటు విధానాన్ని అనుసరించడానికి నిశ్చయించింది. భారతదేశ ప్రభుత్వ పరిపాలనాశాఖలన్నిటిలో భారతీయుల ప్రవేశాన్ని అభివృద్ధి చేయడం, స్వపరిపాలనా సంస్థలను క్రమేణా నిర్మిస్తూ, బ్రిటీష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా, బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచడం బ్రిటీష్ ప్రభుత్వ విధానమని భారత రాజ్య కార్యదర్శి మాంటేగ్, పార్లమెంట్ దిగువ సభలో (House of Commons) ప్రకటించారు.

ఈ ప్రకటన చేసిన తర్వాత 1916 జులైలో మాంటేగ్ - చెమ్స్‌ఫర్డ్ నివేదికను ప్రకటించారు. ఆ నివేదిక ఆధారంగా, పార్లమెంట్ 1919 శాసనాన్ని 'భారత ప్రభుత్వ చట్టం, 1919' గా ఆమోదించింది.

B RAOU

భారతీయులలో తీవ్రమైన వ్యతిరేక భావం పెంపొందింది. మాంటేగ్ సంస్కరణలను ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, తిలక్ భావించాడు. అనిబిసెంట్ కూడా ఈ సంస్కరణలను దుయ్యబట్టింది. ఇంగ్లండ్‌కు ఈ సంస్కరణలు అమలు జరపడం తగదని భారతదేశ ఆత్మ గౌరవానికి ఈ సంస్కరణలను ఆమోదించడం తగదని, అనిబిసెంట్ ప్రకటించింది.

1918లో కాంగ్రెస్ మాంటేంగ్ సంస్కరణలను పరిశీలించి, ఈ నివేదికలో కొన్ని ప్రతిపాదనలు కొన్ని రంగాలలో ముందంజ వేసి, ప్రోత్సాహకరంగా ఉన్నా మొత్తంమీద సంస్కరణల పథకం నిరుత్సాహకరంగా, అసంతృప్తికరంగా ఉందని ప్రకటించింది. ముస్లింలీగ్ కూడా ఇలాంటి తీర్మానాన్నే ఆమోదించింది. రాష్ట్రాలలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెలకొల్పాలని కాంగ్రెస్ కోరింది. సురేంద్రనాథ్ బెనర్జీ, సెతల్‌వాడ్, చంద్రావత్‌కర్, రహమతుల్లా మొదలైన మితవాదులు, ఈ సంస్కరణలను హర్షించారు.

20.8 1919 చట్టంలోని అంశాలు

1919 చట్టం, మింటో-మార్లే చట్టాన్ని పూర్తిగా మార్చివేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వరూప, స్వభావాలలో ప్రధాన మార్పులను ప్రవేశ పెట్టింది.

20.8.1 రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం

రాష్ట్రాలలో ద్వంద్వ పరిపాలన (dyarchy) ను ప్రవేశపెట్టడం, ఈ చట్టంలో చాలా ముఖ్యమైన లక్షణం. కేంద్రం, రాష్ట్రాలు నిర్వహించవలసిన శాఖలను గురించి, ఈ కొత్త చట్టం స్పష్టంగా వివరించింది. రాష్ట్రాలలో శాఖలను రెండు రకాలుగా - ప్రభుత్వాధీన అంశాలు (Reserved subjects), శాసన సభాధీన అంశాలు (Transferred subjects) అని విభజించారు. ప్రభుత్వాధీన అంశాలను, రాష్ట్ర గవర్నర్ తన సలహాదారుల (Executive Councillors) సహాయంతో నిర్వహిస్తాడు. వారు శాసన సభకు బాధ్యులు కారు. వివిధ రాష్ట్రాలలో సలహాదారుల సంఘ సభ్యుల సంఖ్య, 2 నుంచి 4 వరకు ఉంటేది. ఆనవాయితీ ప్రకారం, సలహా సంఘసభ్యులలో సగంమంది భారతీయులు. ఆర్థిక శాఖ, శాంతి భద్రతల శాఖ మొదలైన ప్రధాన శాఖలు ప్రభుత్వాధీన అంశాలు.

శాసన సభాధీన అంశాలను, గవర్నర్ భారతీయ మంత్రుల సహాయంతో నిర్వహించాలి. ఈ మంత్రులు ప్రజా ప్రతినిధులు. వారు శాసన సభకు బాధ్యులు. గవర్నర్ విచక్షణాధికారంపై, మంత్రులు పదవిలో ఉంటారు. విద్య, ప్రజారోగ్యం, స్థానిక స్వపరిపాలన మొదలైన శాఖలు, శాసన సభాధీన అంశాలు. వ్యయానికి సంబంధించిన ప్రభుత్వశాఖలు శాసన సభాధీన అంశాలు కాగా, గవర్నర్ ఆర్థిక వనరులపై పూర్తి అజమాయిషీని కొనసాగించాడు.

రాష్ట్ర శాసన సభలలో సభ్యుల సంఖ్యను పెంచారు. ప్రత్యేక నియోజక వర్గాల ఆధారంగా, పరిమితంగా ఓటింగ్ ప్రాతిపదికపై, శాసన సభకు ఎన్నికలు నిర్వహించాలి. ఈ శాసన సభలలో 70% ఎన్నికైన సభ్యులు, 30% ప్రభుత్వం నియమించిన సభ్యులు. ఈ శాసనసభా కార్యక్రమాలను అధ్యక్షుడు నిర్వహిస్తాడు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి, సక్రమంగా ప్రభుత్వ విధులను నిర్వహించడానికి, శాసన సభలకు అధికారాలు లభించాయి. సభ్యులకు ప్రశ్నలను, అనుబంధ ప్రశ్నలను అడిగే హక్కు లభించింది. బడ్జెట్‌ను సభ్యులు తిరస్కరించవచ్చు. కాని, అవసరమైతే ప్రభుత్వం బడ్జెట్ ప్రకారం ఖర్చు చేయవచ్చు. కేంద్ర శాసనసభ అనుభవించిన ప్రత్యేక హక్కుల వంటివే, రాష్ట్ర శాసన సభలకు లభించాయి. కేంద్ర శాసన సభ నిర్ణయాలపై సర్వాధికారాలు గవర్నర్-జనరల్‌కు ఉన్నట్టుగానే, రాష్ట్రాల శాసనసభల నిర్ణయాలపై గవర్నర్‌లకు లభించాయి.

20.8.2 కేంద్ర ప్రభుత్వంలో మార్పులు

కేంద్రంలో ద్వంద్వ శాసనసభను ప్రవేశపెట్టారు. ఎగువసభ రాజ్యసభ (Council of States). దిగువ సభ భారత శాసనసభ (Legislative Assembly). మత ప్రాతిపదికపై ఏర్పడిన నియోజక వర్గాల ఆధారంగా,

సభ్యులను ఎన్నుకునేవారు. శాసనసభల పదవీకాలాన్ని వైస్రాయి అత్యవసర పరిస్థితులలో, పొడిగించవచ్చు. ఎగువ సభ సభ్యుల పదవీకాలం 5 సంవత్సరాలు. దిగువ సభ సభ్యుల పదవీకాలం, 3 సంవత్సరాలు. ప్రత్యేక పరిస్థితులలో గవర్నర్-జనరల్ శాసనసభల సమావేశాన్ని వాయిదా (ప్రోరోగ్) వేయవచ్చు; రద్దుచేయవచ్చు.

రాజ్యసభ (Council of States) సభ్యులలో, 34 మంది ఎన్నికైన సభ్యులు. 46 మందిని ప్రభుత్వం నియమిస్తుంది. ప్రభుత్వంచే నియమితులైన సభ్యులలో, 20 మందికంటె ఎక్కువగా అధికారులు ఉండరాదు; మిగిలిన వారు అనధికారులు. పరిమిత వోటింగ్ పద్ధతిపై, రాజ్యసభకు ఎన్నికలు జరిగాయి. ధనవంతులైన భూస్వాములకు, వ్యాపారులకు, రాష్ట్ర శాసనసభ మాజీ సభ్యులకు, విశ్వవిద్యాలయాల సెనేట్ సభ్యులకు, మునిసిపల్ కమిటీల అధ్యక్షులకు మాత్రమే వోటుహక్కు లభించింది. రాజ్యసభకు, దిగువ శాసనసభతో సమానంగా శాసనాధికారాలు లభించాయి. ఏ శాసనాన్నైనా ఆమోదించడానికి, రాజ్యసభ ఆమోదం అవసరం. ద్రవ్యసంబంధమైన బిల్లులకు మాత్రం, రాజ్యసభ అధికారాలు తక్కువ. రాజ్యసభ అధ్యక్షుణ్ణి సభ్యులలో నుంచి వైస్రాయి నియమిస్తాడు.

భారత శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 145, వీరిలో 105 మందిని ఎన్నుకుంటారు. 40 మంది ప్రభుత్వంచే నియమితులైనవారు. వీరిలో 26 మంది అధికారులు, 14 మంది అనధికారులు. మాంట్ ఫర్డ్ సంస్కరణలను ప్రారంభించినప్పుడు, శాసనసభాధ్యక్షున్ని వైస్రాయి, 4 సంవత్సరాలకు నియమించేవాడు. తర్వాత, శాసన సభ్యులే తమలో ఒక వ్యక్తిని, అధ్యక్షునిగా ఎన్నుకుంటారు. సంస్కరణలు ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యక్షుణ్ణి శాసనసభ్యులే ఎన్నుకున్నారు.

రాజ్యసభతో కలిసి, భారత శాసనసభ బ్రిటీష్ ఇండియా ప్రాంతానికి శాసనాలను ఆమోదించింది. ద్రవ్య సంబంధమైన బిల్లులను భారత శాసనసభలోనే ప్రవేశపెట్టాలి. దేశంలో పన్నులను విధించడానికి, ప్రభుత్వం నిధులను ఖర్చు చేయడానికి, శాసనసభ విధిగా అనుమతించాలి.

రెండు శాసనసభలు ఆమోదిస్తేనే, బిల్లు చట్టం అవుతుంది. రెండు శాసనసభల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తి ప్రతిష్టంభన ఏర్పడితే, గవర్నర్-జనరల్ ఉభయశాసనసభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయవచ్చు.

ఈ రాజ్యాంగ శాసనం, శాసనాధికార విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించింది. ఈ విభజననే కేంద్ర ప్రభుత్వ విషయాలు(Central Subjects), రాష్ట్ర ప్రభుత్వ విషయా(Provincial Subjects)లని అంటారు. దేశ రక్షణ, విదేశాంగ విధానం, రైలు మార్గాలు, తంతి, తపాలాశాఖ, సివిల్, క్రిమినల్ చట్టాలు, వాణిజ్యం, నాణేలు, ద్రవ్యం (Currency) మొదలైనవి కేంద్రప్రభుత్వ విషయాలు. అంతరంగిక శాంతి భద్రతలు, న్యాయశాఖ, చెరసాలలు, విద్య, స్థానిక స్వపరిపాలన, నీటిపారుదల, వ్యవసాయం, పారిశుధ్యం, ప్రజారోగ్యం మొదలైన విషయాలు రాష్ట్ర ప్రభుత్వ విషయాలు (Provincial Subjects). కేంద్ర, రాష్ట్రాల మధ్య శాఖలను విభజించి, కొన్ని శాఖల ఆదాయం పూర్తిగా రాష్ట్రాలకే చెందుతుందని ప్రకటించి, ఈ చట్టం రాష్ట్రాలకే ఆర్థిక వనరుల విషయంలో కొంత స్వాతంత్ర్యాన్నిచ్చింది.

ఈ చట్టం భారతీయ పరిపాలనా వ్యవస్థపై, బ్రిటీష్ పార్లమెంట్, భారత రాజ్య కార్యదర్శి అజమాయిషీని సడలించింది. భారతదేశంలో వైస్రాయి అనుసరించవలసిన విధానాల నిర్ణయ బాధ్యత, భారత రాజ్యకార్యదర్శిదే. కాని ఆయన జీతాన్ని బ్రిటీష్ ప్రభుత్వ ఆదాయం నుంచి చెల్లించేవారు. రాష్ట్ర ప్రభుత్వాలపై భారత రాజ్యకార్యదర్శి అధికారాలను, కొంతవరకు తగ్గించారు. ఏజన్సీ విధుల నిర్వహణకు, మొదటిసారి లండన్‌లో భారత హైకమీషనర్ నియామకానికి ఏర్పాటు చేసారు.

గవర్నం-జనరల్ కార్యనిర్వాహక సంఘంలో కూడా, కొన్ని మార్పులను ప్రవేశపెట్టారు. ఆరుగురు సభ్యులున్న గవర్నర్-జనరల్ కౌన్సిల్‌లో ముగ్గురు భారతీయులను చేర్చుకోడానికి ఈ చట్టంవల్ల అవకాశం

లభించింది. గవర్నర్-జనరల్, కార్యనిర్వాహక సంఘం ద్వారా పరిపాలనను నిర్వహించాడు. ఇతడు భారత ప్రభుత్వాధినేత; విస్తృతాధికారాలను చెలాయించాడు. కార్యనిర్వాహక సంఘం సమావేశాలకు అధ్యక్షత వహించాడు. మెజారిటీ సభ్యుల నిర్ణయాలను అనుసరించ నక్కరలేదు. కార్యనిర్వాహక సంఘం నిర్ణయాలను తిరస్కరించవచ్చు. శాసనసభ ఆమోదించిన బిల్లులు, గవర్నర్-జనరల్ ఆమోదం పొందనిదే చట్టాలు కావు. కొన్ని బిల్లులను శాసనభలో ప్రవేశపెట్టేముందే, గవర్నర్-జనరల్ అనుమతి పొందాలి. బిల్లులను వీటో చేసే అధికారం, రూఢిపరిచే అధికారం, అసాధారణ శాసనాలను (ordinances) ప్రకటించే అధికారం - ప్రత్యేకాధికారాలను గవర్నర్-జనరల్ పొందాడు. అత్యవసర పరిస్థితులలో, లేదా శాసనసభ సమావేశం జరపని కాలంలోను, అసాధారణ శాసనాలను ప్రకటించే అధికారం, గవర్నర్-జనరల్‌కు ఉంది. కాని 6 నెలల లోపల ఈ అసాధారణ శాసనాలను శాసనసభ ఆమోదించాలి.

1919 చట్టం, కేంద్ర కార్యనిర్వాహక సంఘ స్వరూప అధికారాలలో, ఎలాంటి మౌలికమైన మార్పులను ప్రవేశపెట్టలేదు. గవర్నర్-జనరల్ నిరంకుశాధికారాలపై అదుపు లేదు. గవర్నర్-జనరల్ అధికారాలు ఏమీ తగ్గలేదు. కేంద్రశాసనసభకు, గవర్నర్-జనరల్‌పై కట్టుదిట్టమైన అజమాయిషీ లేదు. గతంలో లాగే, పరిపాలనా యంత్రాంగంపై పూర్తి ఆధిపత్యం - సివిల్, సైనికరంగాలతో సహా గవర్నర్-జనరల్‌దే అని చెప్పవచ్చు. కార్యనిర్వాహక సంఘం సలహాలిచ్చే సంఘమే తప్ప, ప్రత్యేకాధికారాలు లేవు. కార్యనిర్వాహక సంఘం సలహా ప్రకారం ప్రవర్తించాలనే నిబంధన లేకపోవడంవల్ల ఆ సంఘం సలహాలను ఆమోదించనక్కరలేదు.

కార్యనిర్వాహక సంఘంలో సభ్యుల సంఖ్యను పెంచడంవల్ల, తన మాట జవదాటని కొద్దిమంది భారతీయులను కౌన్సిల్‌లో గవర్నర్-జనరల్ చేర్చుకున్నాడు. అతని కార్యనిర్వాహక సంఘం, ఆధిక్యత, అంటే గవర్నర్-జనరల్ నిరంకుశాధికారాలను - ఈ చట్టం అదుపు చెయ్యలేదు.

20.9 చట్టానికి జాతీయవాదుల ప్రతిస్పందన (Nationalists Response)

మొదటి ప్రపంచ యుద్ధం కొనసాగిన కాలంలో బ్రిటీష్ అధికార వర్గం చేసిన ప్రకటనలను బట్టి, భారతీయులు యుద్ధానంతరం స్వపరిపాలన వస్తుందని నమ్మారు. కాని మాంటేగ్-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రకటించగానే వారు తీవ్రంగా ఆశాభంగం పొందారు. ఈ సంస్కరణలు జాతీయవాదుల ఆశలను భగ్నం చేసాయి. ఈ చట్టం బాధ్యతాయుత కేంద్రప్రభుత్వ స్థాపనకు అవకాశం కల్పించలేదు. ద్వంద్వ పరిపాలనవల్ల, భారతీయులకు అధికారం బదలాయించడం జరుగలేదు. 1919 సంస్కరణలు అసంపూర్ణంగా ఉన్నాయి. మాంట్‌ఫర్డ్ చట్టం ప్రకారం ఇచ్చిన రాయితీలు, ఏవర్గాన్ని సంతృప్తి పరచలేదు. దేశబంధు చిత్తరంజన్ దాస్, బిపిన్ చంద్రపాల్ మొదలైన నాయకులు, 1919 చట్టం సంస్కరణలను తిరస్కరించారు. ఈ సంస్కరణలు ప్రజల ఆశయాలకు అనుగుణంగా లేవని, అసంతృప్తికరంగా ఉన్నాయని ప్రకటించారు. తిలక్ ఈ సంస్కరణలు సరైన పద్ధతిలో అమలు జరపడానికై సహకరించడానికి నిశ్చయించాడు. గాంధీజీ కూడా ఈ సంస్కరణలను విజయవంతంగా అమలు జరపడానికే ఇష్టపడ్డాడు.

కాంగ్రెస్ నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా, స్వయంపాలనా సూత్రాన్ని అనుసరించి, భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం, త్వరితంగా చర్యలు తీసుకోవలసిందని కాంగ్రెస్ బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరింది. భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన త్వరలో జరగడానికి, ఈ సంస్కరణలను అమలు జరపడానికి కాంగ్రెస్ సిద్ధపడింది.

కొద్దిమంది మితవాదులు 1918లో సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలో కాంగ్రెస్ నుంచి నిష్క్రమించి, భారతీయ నేషనల్ లిబరల్ ఫెడరేషన్ (National Liberal Federation of India) ను స్థాపించారు. ఈ విధంగా లిబరల్ పార్టీ స్థాపన జరిగింది. ఈ పార్టీ సంస్కరణలకు మద్ధతును ప్రకటించి, అమలు పరచడానికి సిద్ధమైంది. ఈ విభజన కాంగ్రెస్ రాజకీయ శక్తిని బలహీనపరచలేదు. 1919 నుంచి కాంగ్రెస్ బలాన్ని పుంజుకుంది. 1919లో సామూహికోద్యమ విజృంభణ అనివార్యమైంది.

20.10 1935 చట్టానికి దారితీసిన పరిస్థితులు

సైమన్ సంఘం తన నివేదికను సమర్పించింది. భారతదేశంలోని వివిధ రాజకీయ పక్షాలు నివేదికను అభిశంసించాయి. అయినా, ఆంగ్ల ప్రభుత్వం నివేదికను చర్చించడానికై, ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అప్పటికే, కాంగ్రెస్ నాయకులందరు నిర్బంధంలో ఉన్నందున, ఇతర పార్టీలకు, మతాలకు ప్రయోజనాలకు సంబంధించిన, తమ కనుకూలమైన వ్యక్తులను ప్రతినిధులుగా ఆంగ్ల ప్రభుత్వం ఎన్నికచేసింది సుదీర్ఘ చర్చల పిదప, రాజ్యాంగ చర్చలలో కాంగ్రెస్ ప్రాతినిధ్యపు ఆవశ్యకతను గుర్తించారు. రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో గాంధీజీ కాంగ్రెస్ ఏకైక ప్రతినిధిగా పాల్గొన్నాడు. మత ప్రాతినిధ్యం కొరకరాని కొయ్యగా మారగా, బ్రిటీష్ ప్రధాని మాక్ డొనాల్డ్ మధ్యవర్తిత్వం అంగీకరించవలసి వచ్చింది. 1932 ఆగస్ట్ 16 వ తేదీన, ఆయన తీర్పు నిచ్చాడు. దీనిని 'కమ్యూనల్ అవార్డు' అని వ్యవహరిస్తారు. ఇందు అల్ప సంఖ్యాక వర్గాలకు, దళిత వర్గాలకు ప్రత్యేక నియోజక వర్గాలు సిఫార్సు చేయబడినాయి. దళిత వర్గాలకు ప్రత్యేక నియోజక వర్గాలు మంజూరయితే, దానికి ఆమరణ నిరాహారదీక్ష పూనగలనని సెక్రటరీ ఆఫ్ స్టేట్ (రాజ్యకార్యదర్శి)ని హెచ్చరించిన గాంధీజీ, దీక్షకు పూనుకున్నాడు. పూనా ఒప్పందం ద్వారా అంగీకరించిన భారత నాయకులు, గాంధీ ప్రాణాన్ని కాపాడారు. 1932 నవంబర్ 17 నుంచి, డిసెంబర్ 24 వరకు, మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఇంతకు ముందు సమావేశం నియమించిన వివిధ ఉపసంఘాల నివేదికలు, ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించబడినాయి.

భారతదేశ భవిష్యత్ రాజ్యాంగం ప్రణాళికపై అంతిమ నిర్ణయాలు తీసుకొన్న పిదప, ప్రభుత్వం దానిపై ఒక 'శ్వేత పత్రాన్ని' ప్రచురించింది. అందు ఏవిధంగా రాష్ట్రాలలో బాధ్యతాయుత ప్రభుత్వాలు ఏర్పడగలవో, కేంద్రంలో ఏర్పడే ద్వంద్వ పాలన వివరింపబడినాయి. ఈ శ్వేతపత్రాన్ని భారత ప్రజాభిప్రాయం విమర్శించింది. అయినా, ఆంగ్ల ప్రభుత్వం ఈ నూతన ప్రణాళికను బ్రిటీష్ పార్లమెంట్ సంయుక్త సెలెక్ట్ కమిటీకి నివేదించింది. లీగ్ అధ్యక్షతనగల ఈ సంఘంలో, హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు చెందిన 16 మంది, హౌస్ ఆఫ్ కామన్స్‌కు చెందిన 16 మంది సభ్యులు, మొత్తం 32 మంది సభ్యులున్నారు. ఈ సంఘం బ్రిటీష్ పాలనలోని రాష్ట్రాల నుంచి, సంస్థానాధిపతులనుంచి, ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. సర్ తేజ్‌బహదూర్ సప్రూ, యమ్.ఆర్.జయకర్ మరికొందరు ముఖ్య వ్యక్తులు, కమిటీ ముందు సాక్ష్యమిచ్చారు. ఈ సంఘం 1934 నవంబర్ 22వ తేదీన, తన నివేదికను సమర్పించింది.

సంయుక్త సెలెక్ట్ కమిటీ సిఫార్సుల ననుసరించి బిల్లు తయారుచేసి, 1935 ఫిబ్రవరి నెలలో హౌస్ ఆఫ్ కామన్స్ నందు ప్రవేశపెట్టారు. లేబర్ పార్టీ బిల్లు అసమగ్రంగా, అసంపూర్తిగా వున్నదని విమర్శించింది. భారతదేశ స్వయంపాలనా ప్రతిపత్తి వచ్చునట్లుగా, బిల్లును మార్చడానికి వారు యత్నం చేశారు. దీనికి ప్రతిగా, విన్‌స్టన్ చర్చిల్ నాయకత్వంలో కన్సర్వేటివ్ పార్టీ, బిల్లులో మరింత ప్రజావిరుద్ధ విషయాలు ప్రవేశపెట్ట ప్రయత్నించారు. అన్ని సవరణలు వీగిపోయాయి. హౌస్ ఆఫ్ కామన్స్‌లో బిల్లు అంగీకరింపబడి, ఎగువ సభ అయిన హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు వెళ్ళింది. అక్కడ ప్రతిపాదించిన కొన్ని సవరణలను హౌస్ ఆఫ్ కామన్స్ కూడా అంగీకరించింది. 1935 ఆగస్ట్ 2వ తేదీన రాజముద్ర ఈ బిల్లు, **'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం, 1935'** గా ప్రసిద్ధమైంది.

20.11 చట్టంలోని ముఖ్యాంశాలు

1) **అఖిల** భారత సమ్మేళన రాజ్యాంగం ఇవ్వబడింది. భారతదేశంలోని రాష్ట్రాలకు, సంస్థానాలకు మధ్య ఎన్నో విభేదాలున్నాయి. కాని సమాఖ్యను రూపొందించడంలో, ఎన్నో సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చింది. రాష్ట్రాలలో కొంతవరకు ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఉండగా, సంస్థానాలు పూర్తిగా అంగ్లేయ పాలనలో రాజకీయ శాఖ అజమాయిషీలో ఉండేవి.

BRAOU

ఈ చట్టం 'పూర్తిగా క్రుళ్ళిపోయినదని, మౌలికంగా చెడ్డదని, ఏ మాత్రమూ అంగీకార యోగ్యమైంది కాదని' జిన్నా భావించాడు.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. 1919 చట్టంలోని ముఖ్య అంశమేది?

.....

.....

.....

.....

2. 1919 సంస్కరణలు నిరాశాజనకంగా వున్నాయని కాంగ్రెస్ నాయకులు ఎందుకు భావించారు?

.....

.....

.....

.....

3. 1935 చట్టం గురించి నెహ్రూ అభిప్రాయమేమిటి?

.....

.....

.....

.....

20.13 సంగ్రహంగా

1. అతివాదుల అరికట్టడానికి, విప్లవవాదుల చర్యలను ఆపడానికి, మితవాదులకు బలాన్ని చేకూర్చడానికి, మింటో-మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టబడినాయి.
2. మింటో-మార్లే సంస్కరణలవల్ల మహ్మదీయులకు, ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పడ్డాయి.
3. హోంరూల్ ఉద్యమము, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో పరిణామాలు, రష్యన్ విప్లవం ప్రభావము, ఐర్లాండ్‌లోని సిన్ ఫిన్ ఉద్యమము, 1919 సంస్కరణలకు కారణాలు.
4. 1919 సంస్కరణలవల్ల ఏర్పడ్డ ముఖ్యమైన మార్పు, రాష్ట్రాలల్లో ద్వంద్వ ప్రభుత్వాలేర్పడ్డాయి.
5. భారతీయుల స్వపరిపాలన కోరికఫలితంగా 1935 చట్టం ఏర్పడింది.
6. 1935 చట్టం భారతదేశంలో రాష్ట్రాల సమాఖ్య ఏర్పాటుకు అవకాశం కల్పించింది. కాని అమలు కాలేదు.
7. 1935 చట్టం రాష్ట్రాల్లో ద్వంద్వ పాలన అంతమొందించి స్వయం పాలన నెలకొల్పింది.
8. భారతీయులు ఆ చట్టాన్ని విమర్శించారు. నెహ్రూ 1938 చట్టాన్ని బ్రేకులు ఉండీ ఇంజను లేని యంత్రాలని విమర్శించాడు.

20.14 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) భారతీయులను శాంతపరచడానికి బ్రిటీష్ ప్రభుత్వం, మింటో-మార్లే సంస్కరణలను ప్రకటించింది. జాతీయోద్యమాన్ని అరికట్టడానికి, మితవాదులను బలపరచడానికి, ఆ సంస్కరణలను బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది.

2) మహ్మదీయులకు ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటుకు సంబంధించిన అంశం, 1909 చట్టంలో, ఎక్కువ విమర్శకు గురి అయిన అంశం.

BRAOU

II 1) రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వాల ఏర్పాటుకు సంబంధించిన అంశమే, 1919 చట్టంలోని ముఖ్యమైన అంశం.

2) 1919 చట్టం, భారతదేశంలో స్వపరిపాలనను నెలకొల్పే విషయం గురించి ప్రస్తావించి నందువల్ల, కాంగ్రెస్ నాయకులు, ఆ చట్టం నిరాశాజనకంగా వుందని భావించారు.

3) జవహర్‌లాల్ నెహ్రూ 1935 చట్టాన్ని 'శక్తిమంతమైన బ్రేకులు ఉండి ఇంజనులేని యంత్రం' అని విమర్శించాడు.

20.15 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) మింటో-మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టడానికి గల రాజకీయ కారణాలు రాయండి.

2) మింటో-మార్లే సంస్కరణల ముఖ్య అంశాలను, అందులోని లోపాలను, మంచి అంశాలను తెలుపండి.

3) 1919 సంస్కరణల ముఖ్య లక్షణాలు తెలియజేసి అందులోని లోపాలను మంచి విషయాలను తెలుపండి.

4) మాంటేగ్ ప్రకటన సారాంశం తెలిపి, దానికి జాతీయ నాయకుల రాజకీయ పార్టీల ప్రతిస్పందన వివరించండి.

5) 1935 చట్టం ఏర్పడడానికి దారితీసిన పరిస్థితులను పేర్కొనండి.

6) 1935 చట్టంలోని ప్రధానాంశాలను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) మింటో-మార్లే సంస్కరణలవల్ల ముస్లింలకు ఏర్పడిన ప్రత్యేక నియోజక వర్గాల పరిణామాలేవి?

2) 1919 సంస్కరణలు రావడానికి కారణాలేవి?

3) రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం ఎలా నడిచింది?

4) 1935 చట్టం ముఖ్య పరిమితులను వివరించండి?

20.16 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C. : *Constitutional Histroy of India and National Movement*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra & Others : *Freedom Struggle*
4. Desai, .R. : *Social Background of Indian Nationalism*
5. Majumdar, R.C. : *Advanced History of India*
6. Majumdar, R.C. : *Three Phases of India's Struggle for Freedom*
7. Natarajan and Prema Krishna : *Political and Cultural History of India, Vol. II*
8. Spear, Perceival : *History of India, Vol. II*
9. Tarachand : *History of the Freedom Movement in India, Vol. III*
10. వైదేహి, అల్లాడి : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947)*
11. జితేందర్ రెడ్డి బి. : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు.*
12. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం*

BRAOU

భాగం 21 : గాంధీ నాయకత్వం, సహాయ నిరాకరణోద్యమం

విషయక్రమం

21.0 లక్ష్యాలు
21.1 పరిచయం
21.2 దక్షిణాఫ్రికాలో గాంధీ
21.3 సత్యాగ్రహ అర్థం
21.4 చంపరాన్ సత్యాగ్రహం
21.5 అహ్మదాబాద్ సమ్మె, ఖేడా పోరాటం
21.6 రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం
21.7 జలియన్‌వాలాబాగ్ దురంతం
21.8 ఖిలాఫత్ ఉద్యమం
21.9 సహాయ నిరాకరణోద్యమం
21.10 ఆంధ్రదేశంలో సహాయ నిరాకరణోద్యమం
21.10.1 చీరాల-పేరాల పోరాటం
21.10.2 పల్నాడు సత్యాగ్రహం
21.10.3 పెదనందిపాడులో పన్నుల నిరాకరణోద్యమం
21.11 వేల్స్ రాకుమారుని పర్యటన బహిష్కరణ
21.12 ఉత్తరప్రదేశ్‌లో రైతుల పోరాటం
21.13 మోప్లా తిరుగుబాటు
21.14 చౌరీ-చౌరా సంఘటన, సహాయ నిరాకరణోద్యమం నిలుపుదల
21.15 సంగ్రహంగా
21.16 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు
21.17 పరీక్ష నమూనా ప్రశ్నలు
21.18 ఉపయుక్త గ్రంథాలు

21.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి :

1. గాంధీ జాతీయ నాయకుడగుటకు దారితీసిన పరిస్థితులు - దక్షిణాఫ్రికా, చంపరాన్, అహ్మదాబాద్, ఖేడాలలో గాంధీ కార్యకలాపాలు.
2. రౌలట్ చట్టవ్యతిరేక ఉద్యమం.
3. జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ.
4. ఖిలాఫత్ ఉద్యమం.
5. సహాయ నిరాకరణోద్యమం - లక్ష్యాలు, పద్ధతులు, క్రమం, అంతం.

21.1 పరిచయం

1919 భారత రాజకీయ చరిత్రలో మహాత్మాగాంధీ రాజకీయ నాయకునిగా ఆవిర్భవించడమేగాక, భారత రాజకీయాలలో అనేక వినూత్న పద్ధతులు, ప్రయోగాలను ప్రవేశపెట్టాడు.

BRAOU

21.2 దక్షిణాఫ్రికాలో గాంధీ

నేటి గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర విభాగంలోని పోర్‌బందర్ గ్రామంలో, గాంధీ 1869 అక్టోబర్ 2వ తేదీన జన్మించాడు. 1888లో ఇంగ్లాండ్ వెళ్లి 'బారిస్టర్' పట్టాపొంది, స్వదేశం తిరిగి వచ్చాడు. 1893 మే నెలలో పోర్‌బందర్‌లోని ముసల్మానుల కంపెనీ తరపున వకీలుగా దక్షిణాఫ్రికాలోని 'నేటాల్'కు వెళ్లాడు. దక్షిణాఫ్రికాలో నివసిస్తున్న భారతీయులపట్ల చూపబడుచున్న రాజకీయ, సాంఘిక విచక్షణా విధానాన్ని గమనించిన గాంధీ, చాలా బాధపడినాడు. పెక్కు సందర్భాలలో స్వయంగా తానే అవమానాలపాలయినాడు. భారతీయులకు **'నేటాల్ ఇండియన్ కాంగ్రెస్'** అనే శాశ్వత రాజకీయ సంస్థను ఏర్పరచాడు. నేటాల్ ప్రభుత్వం భారతీయులకు ఓటింగ్ హక్కు తీసివేస్తూ శాసనం చేయడమేగాక, భారతదేశం నుంచి వచ్చిన కార్మికులపై తలసరి వార్షిక పన్ను విధించింది. ఇట్టి అభ్యంతరకరమైన శాసనాలు, పనులు చేస్తున్నా, గాంధీజీ ఆంగ్లేయ పాలనపట్ల విధేయంగానే వుండడమేగాక, వారి పాలన సముచితమైనదిగానే భావించాడు.

దక్షిణాఫ్రికా ప్రభుత్వం మరో శాసనం చేసింది. దీని ననుసరించి, ట్రాన్స్‌వాల్‌లోని భారతీయులు ముమారు పదివేల మంది, తమ 'వేలిగుర్తులను' ముద్రిస్తూ, ప్రభుత్వ రికార్డులలో రిజిష్టర్ చేస్తారు. ఈ శాసనం దురన్యాయమని భావించి, గాంధీజీ ట్రాన్స్‌వాల్‌లో స్థిరపడిన శ్వేత జాతీయులతో పోరాటం సాగించవలసివచ్చింది. ఈ శాసనానికి విరుద్ధంగా గాంధీ ప్రప్రథమంగా, తన నూతన రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించారు. దానినే **'సత్యాగ్రహ'**మని పిలుస్తారు. అన్యాయమైన నూతన శాసనానికి విరుద్ధంగా, పోరాటం సాగించారు. భారతీయులను 'వేలి ముద్రలు' ఇవ్వవద్దని, రిజిష్టర్ చేయించుకోవద్దని, అవసరమైతే జైలుకు వెళ్ళడానికి, చావడానికి కూడా సిద్ధం కావలెనని, గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించి, 150 మంది అనుచరులతో అరెస్టు అయినాడు. ప్రభుత్వం రాజీకి వచ్చింది. ట్రాన్స్‌వాల్‌లోనికి భారతీయులను అనుమతించకుండా, 1907లో చేసిన శాసనానికి విరుద్ధంగా, గాంధీ ఇట్టి సత్యాగ్రహ ఉద్యమాన్నే నడిపినారు. కొంతమంది అనుచరులతో చట్టవిరుద్ధంగా ట్రాన్స్‌వాల్ సరిహద్దులలో ప్రవేశించి, మరోసారి జైలుకు వెళ్ళాడు. క్రైస్తవ పద్ధతులలో వివాహాలు జరుగకుండా, రిజిష్టర్ కాని వివాహాలు చెల్లనేరవని దక్షిణాఫ్రికా సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. భారతీయుల వివాహాలను చట్టబద్ధం చేస్తూ ప్రత్యేక శాసనం చేయవలసిందిగా గాంధీ ప్రభుత్వాన్ని అర్థించాడు. మహిళలతో సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించగా గాంధీ, ఆయన భార్య కస్తూరిబాయి నిర్బంధింపబడ్డారు.

భారత జాతీయులకు సానుభూతిగా 'న్యూకాజిల్'లోని ఆరువేల మంది గని కార్మికులు సమ్మె చేసారు. వారిని నివాస గృహాల నుంచి బలవంతంగా తొలగించారు. అయినా వారు లొంగ లేదు. గాంధీ వారికి నాయకత్వం వహించాడు. రెండువేల మందితో సత్యాగ్రహం ప్రారంభించాడు. గాంధీని అరెస్ట్ చేసి, తొమ్మిది నెలల కారాగార శిక్ష విధించారు. సమ్మె చేస్తున్న వారిని దారుణంగా తన్ని, కొరడాలతో కొట్టి, హింసించారు. అయినా వారు ధైర్యంగా అన్ని బాధలను సహించారు. చివరకు ప్రభుత్వం కొల్పులు సాగించింది. భారత జాతీయులు, శ్వేత జాతీయుల నిరంకుశత్వాన్ని ప్రతిఘటిస్తూ, ఒకటిగా నిలిచారు. చివరకు, బ్రిటిష్ గవర్నర్ గాంధీజీని సంప్రదింపులకు ఆహ్వానించక తప్పలేదు. సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేస్తూ, ప్రభుత్వం శాసనాన్ని చేసింది. హిందూ, ముసల్మాన్, పారశీకుల వివాహాలను చట్టబద్ధంగా అంగీకరించారు. 1920 నుంచి భారతదేశం నుంచి, కార్మికులను కొనుగోలు పద్ధతిలో తీసుకురావడం నిషేధింపబడింది. స్వేచ్ఛ పొందిన దక్షిణాఫ్రికాలోని భారతీయ కార్మికుల భార్యాబిడ్డలు, వారిని చేరవచ్చును. 1906లో మొదలైన సత్యాగ్రహ పోరాటం, 1914లో జారీ చేయబడిన 'రిలీఫ్' చట్టంతో ముగిసింది. ఇది బ్రహ్మాండమైన విజయం. దక్షిణాఫ్రికాలోని భారతీయులకు గాంధీ ఏకైక నాయకుడు. వారి పేరు ప్రతిష్టలు భారతదేశం వరకు తెలియ వచ్చినాయి.

BRAOU

21.3 సత్యాగ్రహ అర్థం

ఈ నూతన సిద్ధాంతాన్ని, ప్రయోగాన్ని, గాంధీజీ భారత రాజకీయాలలో కూడా ప్రవేశపెట్టారు. ఆయన సమర్థమైన నాయకత్వంలో **'సత్యాగ్రహం'** అనగా **'శాంతియుత ప్రతిఘటన'**గా గాంధీజీ నిర్వహించాడు. అయితే, ఈ రెంటి మధ్య ఒక ముఖ్యమైన భేదం కలదు. 'శాంతియుత ప్రతిఘటన' సామాన్యంగా పిరికివారు అనుసరించే విధానం. కొన్ని సందర్భాలలో, అది హింసాచర్యలకు దారితీయవచ్చు. కాని, సత్యాగ్రహమనే ఆయుధాన్ని ధైర్యవంతులు మాత్రమే ప్రయోగించగలరు. హింస ఎట్టిరూపంలో నైనాసరే పూర్తిగా నిషిద్ధం, శాంతియుత ప్రతిఘటనలో ప్రేమకు చోటు లేదు. సత్యాగ్రహం ప్రేమను ప్రేమిస్తుంది. అహింసా విధానం, సత్యాగ్రహ ఉద్యమానికి మూలం. అన్ని సందర్భాలలో, అన్ని రూపాలలో, హింసాత్మక చర్యలను పూర్తిగా విడనాడాలి. శత్రువును నాశనం చేయడం కాక ప్రేమతో, వాత్సల్యంతో, సహనంతో అతనిని జయించాలి. శత్రువును ఈ రీతిగా జయించడంలో మనం బాధలు పడవలసి వస్తుంది. 'సత్యాగ్రహం' చెడుపనులకు శత్రువు. ఎట్టి పరిస్థితులలోను, దురాలోచనలతో రాజిపడకూడదు. దుర్మార్గున్ని ప్రేమతో ఎదిరిస్తుంది సత్యాగ్రహం. మానవుడు స్వతహాగా మంచివాడు. వాడిలోని చెడును తొలిగించి, మంచిని పైకి తీసుకురావడమే ఈ ఉద్యమ మౌలిక లక్ష్యం. "హింసకన్నా అహింస పరమోత్కృష్టమైనది. శిక్షనివ్వటంకన్నా, క్షమించడం ధైర్యవంతుల లక్షణమ"ని గాంధీజీ పలికాడు. సహాయనిరాకరణ, శాంతియుత శాసనోల్లంఘన, సత్యాగ్రహ ఆయుధానికి రెండు బాణాలు. "బాధలను సంతోషంగా స్వీకరిస్తూ ఎదుటివానిని మార్చడమే, సత్యాగ్రహ లక్ష్యం. నిరంతర బాధలను స్వయంగా స్వీకరించడమే, అహింసా పద్ధతి యొక్క చైతన్య రూపం". సత్యాగ్రహం ఒక భౌతికమైన ఆయుధం కాదు. అది కేవలం నైతికమైనది. అందులో బాధలను స్వయంగా స్వీకరించడంవల్ల స్వయంశక్తి, నైతికబలం, పట్టుదల ఏర్పడుతాయి. రాజకీయ పోరాటాన్ని సత్యాగ్రహం ఒక ఉన్నత, ఉదాత్త శక్తిగా రూపొందించగలదు. సత్యాగ్రహ ఆయుధం శత్రువు మనస్సుపై పనిచేసి, బలహీనపరుస్తుంది. అతడు నిస్తేజుడయి, ఆత్మబలాన్ని కోల్పోతాడు. ఆ కారణంగా, బలమైన శత్రువు కూడా సత్యాగ్రహం చేత ఓడిపోగలడు. కాన రాజకీయంగా, సైనికంగా బలంలేనివారు, సత్యాగ్రహ ఆయుధం ద్వారానే తమ బలమైన శత్రువును ఓడించగలరు.

గాంధీ దక్షిణాఫ్రికా నుంచి 1915లో భారతదేశం తిరిగివచ్చారు. అప్పటికి ప్రపంచ యుద్ధం ప్రారంభమై, జర్మనీ విజయోత్సాహంతో వుంది. భారత రాజకీయాలలో తాను ఇమడ జాలనని భావించిన గాంధీజీ, వాటికి దూరంగా వుండిపోయాడు. గోఖలే సలహామేరకు ఆయన ఒక గ్రామంలో సత్యాగ్రహ ఆశ్రమాన్ని ప్రారంభించి, ఆ తరువాత దానిని అహ్మదాబాద్ దగ్గరనున్న 'సబర్మతీ'కి మార్చాడు. ఆంగ్లేయ పాలనలో పనిచేయడానికి, భారతీయ కూలీలను కొనుగోలు పద్ధతిలో తీసుకువెళ్ళే పద్ధతి, నాటికి అమలులో వుంది. ఇది అమానుషమని భావించిన గాంధీజీ, ప్రతిఘటనోద్యమాన్ని నడుపాలనే సంకల్పంతో, దేశమంతటా పర్యటించాడు. తాను 'సత్యాగ్రహ' ఉద్యమాన్ని ప్రారంభించగలనని హెచ్చరించాడు. ప్రభుత్వం ఈ పద్ధతిని రద్దు చేసింది.ఇది, భారతదేశంలో గాంధీ సత్యాగ్రహ ఉద్యమానికి ప్రథమ విజయం.

21.4 చంపరాన్ సత్యాగ్రహం

కాని, 'చంపరాన్' సత్యాగ్రహం, గాంధీ.ని ఒక జాతీయ నాయకునిగా నిలబెట్టింది. బీహార్‌లో 'చంపరాన్' జిల్లా బాగా వెనుకబడింది. ఇక్కడ రైతులు ఎక్కువగా 'నీలిమందు' పండించేవారు. ఈ నీలిమందు తోటలు ఆంగ్లేయుల స్వామ్యంలో ఉండేవి. రైతులను వారు ఎంతగానో పీడించేవారు. రైతులు తమభూములలో తప్పనిసరిగా 3/20 వంతులో నీలిమందు పండించి, ఆంగ్లేయులు చెప్పిన ధరకు అమ్మాలి. ఇట్టి పరిస్థితులు బెంగాల్‌లో ఇంతకుముందే ఉండగా, 1859-1861 మధ్య రైతులు తిరుగుబాటు చేసి, తోట యజమానుల పీడ నుంచి విముక్తులైనారు. ఈ విప్లవాన్ని 'నీలి విప్లవంగా' పిలుస్తారు.

BRAOU

దక్షిణాఫ్రికాలో గాంధీజీ సాధించిన విజయాలను గూర్చి విన్న చంపరాన్ రైతులు, తమకు సాయపడవలసిందిగా ఆయనను అర్థించినారు. 1917లో చంపరాన్ సందర్శించిన గాంధీ, భారతదేశంలోని రైతులు ఎట్టి నికృష్ట పేదరికాన్ని అనుభవిస్తున్నారో స్వయంగా చూశాడు. గాంధీగారి వెంట బాబూ రాజేంద్రప్రసాద్, కృపలానీ, మహాదేవ్‌దేశాయ్, మజహర్-ఉల్-హక్ కూడా చంపరాన్ వెళ్ళారు. ఈ బృందం 'మోతీహరీ' చేరేసరికి, ఆ ప్రదేశం నుంచి తక్షణమే వెళ్ళిపోవలసిందిగా ప్రభుత్వం ఆదేశాన్ని జారీ చేసింది. గాంధీ ప్రభుత్వ ఆదేశాన్ని ధిక్కరించి, విచారింపబడ్డాడు. తాను ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించింది వాస్తవమేనని అంగీకరించాడు. "తనకు ప్రభుత్వాధికారంపట్ల గౌరవం ఉన్నా, అంతకుమించి ఉన్నతమైన మానవ న్యాయంపట్ల, అంతఃకరణ పిలుపువల్ల ప్రభుత్వాదేశాలను ధిక్కరించవలసి వచ్చిందని" గాంధీ పలికాడు. గాంధీగారి వ్యక్తిత్వం, వారు పలికిన ఈ మాటలు భారత రాజకీయ రంగంలో నూతన మార్గానికి నాందిపలికినాయి. వేలాదిమంది ప్రజలు గాంధీని అనుసరించినారు. ప్రభుత్వం గాంధీపై మోపిన కేసును రద్దుచేసి, రైతుల ఇబ్బందులను పరిశీలించడానికి ఒక సంఘాన్ని నియమించింది. ఇది, గాంధీ సత్యాగ్రహానికి బ్రహ్మాండమైన విజయం.

21.5 అహ్మదాబాద్ సమ్మె, ఖేడా పోరాటం

వెంటనే గాంధీ, అహ్మదాబాద్‌లోని నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కంకణం కట్టుకున్నాడు. గాంధీ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొనగా, మిల్లు యజమానులు కార్మికుల జీతాలను 35 శాతం పెంచడానికి అంగీకరించారు. అక్కడ నుంచి గాంధీ గుజరాత్‌లోని 'ఖేడా'ను సందర్శించారు. అక్కడ పంటలు కొన్ని సంవత్సరాలుగా పండలేదు. సాలుసరి దిగుబడి 25 శాతానికి పడిపోయింది. భూమి శిస్తు నిలుపుదలకై ఉద్యమం ప్రారంభించాడు. వల్లభాయ్ పటేల్, తదితర నాయకులు గాంధీని బలపరచినారు. ప్రథమంలో భూమి శిస్తు రద్దుకు అంగీకరించని ప్రభుత్వం, చివరకు సత్యాగ్రహ ఉద్యమ ప్రభావంవల్ల, రైతుల కోరికలను మన్నించవలసి వచ్చింది. 'సత్యాగ్రహ' పద్ధతులు భారత రాజకీయాలల్లో అద్భుతమైన విజయాలను సాధించడం ప్రారంభమైంది.

21.6 రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం

మొదటి ప్రపంచ యుద్ధానంతరం, భారతీయుల ఏకగ్రీవాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేసి, ప్రభుత్వం 1919 మార్చిలో రౌలట్ శాసనాన్ని ఆమోదించింది. ఈ అణచివేత చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించిన తర్వాత మహాత్మాగాంధీ రాజకీయ జీవనంలో మౌలికమైన మార్పు వచ్చింది. ఆయనలో ఓర్పు నశించింది. బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిపట్ల, గాంధీజీకి గతంలో ఉండే భ్రమలన్నీ తొలగిపోయాయి. రౌలట్ చట్టాలను సత్యాగ్రహం చేసి, వ్యతిరేకించాలని నిశ్చయించాడు. 1919 ఏప్రిల్ 6వ తేదీన, గాంధీజీ రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా, ఉద్యమాన్ని ప్రారంభించాడు. ప్రజలను నిరసన ప్రకటించవలసిందని పిలుపునిచ్చాడు. దేశ ప్రజలు గాంధీజీ పిలుపుకు బ్రహ్మాండంగా ప్రతిస్పందించారు. ఏప్రిల్ 6వ తేదీన దేశం అన్ని ప్రాంతాలలోని నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, సామూహిక ప్రదర్శనలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్రజలలో రాజకీయ అసంతృప్తి విజృంభించింది. మొట్టమొదటిసారి జాతీయోద్యమం, సామూహికోద్యమంగా రూపొందింది. అణచివేత శాసనాలకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహాన్ని ప్రకటించడానికి ఊరేగింపులను నిర్వహించారు. పంజాబ్‌లో కూడా అల్లర్లు ప్రజ్వరిల్లాయి. ప్రభుత్వం గాంధీజీని పంజాబ్, ఢిల్లీలో ప్రవేశించకుండా నిషేధించింది. ఢిల్లీకి దగ్గరగా ఒక స్టేషన్‌లో గాంధీని బలవంతంగా రైలులో నుంచి దింపి, బొంబాయికి పంపించారు. గాంధీజీని నిర్బంధించిన వార్త, దేశం పలుప్రాంతాలలో దావానలంలా వ్యాపించింది. ప్రజలు ఆగ్రహావేశాలతో హింసకు తలపడ్డారు. ప్రభుత్వం తీవ్రంగా కఠిన చర్యలు తీసుకుంది. హిందువులు, ముస్లింలు పరస్పరం పూర్తిగా సహకరించారు. హింస ప్రబలిన సంఘటనలు జరగడం చేత, గాంధీజీ హఠాత్తుగా ఆందోళనను నిలిపివేశాడు.

BRAOU

21.7 జలియన్‌వాలాబాగ్ దురంతం

రౌలట్ చట్టాన్ని ప్రజలు వ్యతిరేకించడంచేత, అనేక సంఘటనలు జరిగాయి. ఈ సమయంలోనే, ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగని ఘోరమైన మారణకాండ, జలియన్‌వాలాబాగ్ వద్ద జరిగింది. జలియన్ వాలాబాగ్ హింసాకాండ దేశాన్ని కదిలించివేసింది. ఈ సంఘటనే, మహాత్మాగాంధీ యొక్క సహాయ నిరాకరణోద్యమానికి కారణమైంది.

కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సత్యపాల్, డాక్టర్ సైపుద్దీన్ కిచ్లూల నిర్బంధాన్ని వ్యతిరేకించడానికి, 1917 ఏప్రిల్ 13వ తేదీన కాంగ్రెస్ వాదులు జలియన్‌వాలాబాగ్ (అమృత్‌సర్)లో శాంతియుతంగా సమావేశం జరిపారు. సమావేశం జరిగిన ప్రదేశాన్ని, బ్రిటీష్ సైనికులు చుట్టుముట్టారు. సమావేశం జరిగే ప్రదేశం నుంచి బైటకు పోవడానికి ఒక వైపు మాత్రమే దారి ఉంది. బైటికి పోయే దోవను జనరల్ డయ్యర్ సైనికులతో మూసివేశాడు. ప్రజలు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకపోయినా, జనరల్ డయ్యర్ నిరాయుధులైన ప్రజలపై రైఫిళ్ళతో, మర తుపాకులతో కాల్పులు జరిపించాడు. తూటాలు పూర్తి అయ్యేదాకా, సైన్యం కాల్పులు జరిపింది. వేలాది ప్రజలు మరణించారు, గాయపడ్డారు. ఈ విధంగా ప్రజానీకం, పైశాచిక హింసాకాండకు గురైంది. జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన దారుణ మారణ హింసాకాండ, పంజాబ్ రాష్ట్రంలో సైనిక శాసనం, ప్రజలలో తీవ్రమైన విద్వేషాన్ని, అసంతృప్తిని, పెంపొందించాయి. ఈ ఊచకోత సంఘటనపై విచారణ జరపాలని ప్రజలు కోరినా, ఈ నరరూప రాక్షసులపైన ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్య తీసుకోలేదు.

ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చెయ్యలేక, జలియన్‌వాలాబాగ్ హింసాకాండపై దర్యాప్తు జరిపించడానికి, ప్రభుత్వం హంటర్ (Hunter) కమీషన్‌ను నియమించింది. న్యాయవిచారణ జరిపి, ఈ కమీషన్ జనరల్ డయ్యర్‌ను విడుదల చేసింది. ఈ సంఘటనలో డయ్యర్ నిర్ణయం పొరపాటని ప్రకటించి, బుద్ధిపూర్వకంగా ప్రజలను హింసించలేదని ఈ కమీషన్ నిర్ణయించింది.


జలియన్‌వాలాబాగ్ దారుణ హింసాకాండను, దేశ ప్రజలు ముక్త కంఠంతో గర్హించారు. రవీంద్రనాథ్ టాగూర్ 'నైట్‌హుడ్' (Kinghthood) బిరుదును పరిత్యజించాడు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపడానికి, కాంగ్రెస్ విచారణా సంఘాన్ని నియమించింది. ఈ సంఘంలో మోతిలాల్ నెహ్రూ, ఫజ్‌లుల్‌హక్, జయకర్, సి.ఆర్.దాస్, అబ్బాస్ త్యాబ్జి, మహాత్మాగాంధీ సభ్యులు. ఈ సంఘం తన నివేదికలో ఈ దారుణ హింసాకాండ పూర్తి బాధ్యత జనరల్ డయ్యర్‌దే అని ప్రకటించింది. జలియన్‌వాలాబాగ్ మారణకాండ తర్వాత పంజాబ్‌లో కొనసాగిన భయానక భీభత్స పరిపాలనను, తీవ్రంగా ఖండించింది. మరణించిన లేదా గాయపడిన కుటుంబాలకు నష్టపరిహారాన్ని చెల్లించాలని, ఈ కమిటి ప్రభుత్వాన్ని కోరింది. కాని, ఈ కోర్కెలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. జలియన్‌వాలాబాగ్ ఊచకోత సంఘటన మహాత్మాగాంధీలో సంపూర్ణమైన మార్పును తెచ్చింది. 1919 డిసెంబర్ వరకు, బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించాలనే గాంధీజీ భావించాడు. 1920 సెప్టెంబర్‌లో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమానికి నాయకత్వం వహించాడు.

కాంగ్రెస్ సంస్థకు మహాత్మాగాంధీ తిరుగులేని నాయకుడయ్యాడు. చైతన్యవంతమైన విధానాన్ని అనుసరించి, కాంగ్రెస్ సంస్థ కార్యక్రమాలకు జీవం పోశాడు. గోఖలే గాంధీజీకి రాజకీయ గురువు. గోఖలే తత్వం, గాంధీజీ వ్యక్తిత్వంపై చెరగని ముద్రవేసింది. 1915లో ఇండియాకు తిరిగివచ్చిన తర్వాత. బ్రిటిష్ ప్రభుత్వానికి యుద్ధ కృషిలో, ముఖ్యంగా సైనిక దళాలలో ప్రజలను చేర్చడంలో పూర్తిగా సహాయం చేసి, హృదయపూర్వకంగా మద్ధతునిచ్చాడు. గాంధీజీ చేసిన కృషికి మెచ్చి, బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు కైజర్-ఇ-హింద్' (హిందూదేశ సింహం) పతకాన్ని (medal) ఇచ్చింది. మాంట్‌ఫర్డ్ సంస్కరణలు, రౌలట్ చట్టాలు ఆయన

భ్రమలను తొలగించాయి. జలియన్‌వాలాబాగ్ ఊచకోత సంఘటన గాంధీజీని, భారత రాజకీయాలలో అగ్రశ్రేణి నాయకునిగా చేసింది. స్వాతంత్ర సమరంలో సామాన్య ప్రజల పాత్రను, సామూహికోద్యమ ఆవశ్యకతను గుర్తించిన మొదటి నాయకుడు గాంధీజీ. ఆయన నిరాడంబరత, నిజాయితీ ప్రజల నాకర్షించింది. కార్మికులలో, కర్షకులలో దేశభక్తిని పెంపొందించి, స్వాతంత్ర్య సంగ్రామంలో వారి సహకారాన్ని పొందాడు. గ్రామాలలో నివసించే నిరుపేద గ్రామస్థులతో పూర్తిగా కలిసిపోయి, వారివలె జీవనాన్ని కొనసాగించి, జాతీయ భావాలవల్ల ప్రభావితమైన నవభారత దేశానికి, సంకేతమయ్యాడు. 1920, ఆగస్ట్ 1వ తేదీన మహానాయకుడు, భారతదేశంలో జాతీయవాద నిర్మాత, లోకమాన్య తిలక్ మరణించాడు. భారతీయులు ఈ వార్త విని దిగ్భ్రాంతి చెందారు. దేశ మంతా విషాదచ్ఛాయలు అలముకొన్నాయి. యావద్భారత ప్రజలు ప్రగాఢ విషాదం ప్రకటించారు. తిలక్ మరణానంతరం, మహాత్మాగాంధీ కాంగ్రెస్ సంస్థకు నాయకత్వం స్వీకరించి, 28 సంవత్సరాలు భారత జాతీయ రంగాన్ని అప్రతిహతంగా ప్రభావితం చేసాడు. గాంధీజీ నాయకత్వంతో, కాంగ్రెస్ ఉన్నత తరగతి వర్గాలకు, మేధావి వర్గానికి మాత్రమే పరిమితం కాకుండా, జాతీయతను సంతరించుకుంది.

21.8 ఖిలాఫత్ ఉద్యమం

మొదటి ప్రపంచ యుద్ధానంతరం, ఇస్లామిక్ ఉద్యమం బలాన్ని పుంజుకుంది. టర్కీ పరాజయంపట్ల అన్ని దేశాలలోని ముస్లింలు, ఆందోళన చెందారు. టర్కీ సుల్తాన్ కాలిఫ్, ముస్లిం మత వ్యవస్థకు అధినేత. అందువల్ల ప్రపంచంలోని ముస్లింలందరూ టర్కీ సుల్తాన్‌ను ఆరాధించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ ఓడిపోయిన తర్వాత, బ్రిటన్ టర్కీపట్ల ప్రవర్తించిన విధానానికి, భారతదేశంలోని ముస్లింలు కోపించారు. బ్రిటీష్ ప్రభుత్వంపట్ల అసంతృప్తి ప్రబలింది. మహమ్మదాలీ, షౌకతాలీ, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ల నాయకత్వంలో, ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమైంది. సుల్తాన్ ప్రతిష్ఠను, గౌరవాన్ని పునరుద్ధరించడమే, ఈ ఉద్యమ ఆశయం. ఖిలాఫత్ ఆందోళన సందర్భంగా గాంధీజీ, భారతదేశ రాజకీయాలలో ప్రముఖ పాత్రను నిర్వహించాడు. 1919 నవంబర్ నెలలో, మహాత్మాగాంధీ అధ్యక్షతన అలిండియా ఖిలాఫత్ సమావేశం జరిగింది.



ఖిలాఫత్ వాలంటీర్లు

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, హిందూ-ముస్లిం సమైక్యతను సాధించి, సమష్టిగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడానికి, ఈ ఉద్యమం దోహదం చేస్తుందని, గాంధీజీ భావించాడు. ఖిలాఫత్ ఉద్యమానికి కాంగ్రెస్ సంపూర్ణంగా మద్ధతునిస్తుందని ప్రకటించాడు. హర్తాళ్‌లు, నిరసన సమావేశాలను సమష్టిగా నిర్వహించారు. దేశం వివిధ ప్రాంతాలలో హిందూ-ముస్లిం సమైక్యత స్పష్టంగా కనిపించింది. హిందూ-ముస్లిం ఐక్యతానినాదం దేశమంతటా మార్మ్రోగింది.

యుద్ధానంతరం టర్కీ భవిష్యత్తును గురించి గతంలో ఇండియన్ ముస్లింలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం ఉల్లంఘించడాన్ని గాంధీజీ నిరసించాడు. ఖిలాఫత్ ఉద్యమంలో హిందువులను పాల్గొనమని

క్లిష్టసమయంలో ముస్లింలకు సహాయం చేయవలసిందని గాంధీజీ కోరాడు. హిందూ-ముస్లిం సమస్యను గాంధీజీ పరిష్కరించిన విధానం, స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రభావితం చేసింది.

.1920 నాగపూర్ సమావేశంలో, కాంగ్రెస్ ధ్యేయాన్ని ప్రకటించింది. సాధ్యమైనంతవరకు బ్రిటీష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా స్వరాజ్‌ని సాధించాలని, అవసరమైతే బ్రిటీష్ సామ్రాజ్యం వెలుపల ఉండాలని, కాంగ్రెస్ స్పష్టీకరించింది. అప్పటి వరకు కాంగ్రెస్ తన ధ్యేయాన్ని సాధించుకోవడానికి, చట్టబద్ధమైన విధానాలను అనుసరించాలని, నాగపూర్ సమావేశం నిర్ణయించింది. మాంట్‌ఫర్డ్ సంస్కరణలు అమలులోకి వచ్చిన తరువాత జరిగిన ఎన్నికలలో, అభ్యర్థులను ఉపసంహరించుకుని, కాంగ్రెస్ మాంట్‌ఫర్డ్ సంస్కరణల పథకాన్ని తిరస్కరించింది.

21.9 సహాయ నిరాకరణోద్యమం

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఖిలాఫత్ ఉద్యమ కారణంగా హిందూ, ముసల్మానులు ఏకమైనారు. టర్కీ పట్ల మిత్ర రాజ్యాలు అనుసరించిన అన్యాయాన్ని ఎదుర్కోవడానికి, 'సహాయ నిరాకరణోద్యమ' మొక్కటే తరుణోపాయమని, గాంధీజీ భావించాడు. ఈ సలహాను కేంద్ర ఖిలాఫత్ సంఘం ఆమోదించింది.

1920లో కలకత్తాయందు, కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం జరిగింది. లాలా లజపత్‌రాయ్ అధ్యక్షత వహించాడు. అప్పటికే తిలక్ మహాశయుడు మరణించాడు. ఈ విషాద ఉద్రిక్త పరిస్థితులలో గాంధీజీ 'సహాయ నిరాకరణ' తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ తీర్మానాన్ని పదుగురు బలపరచినారు. సుదీర్ఘ చర్చ తరువాత, తీర్మానాన్ని మూడింట రెండు వంతుల అధిక్యతతో అంగీకరించబడింది. దీనితో, ఒక నూతన పోరాటం ప్రారంభమైంది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. చంపరాన్, అహ్మదాబాద్, ఖేడాలలో గాంధీజీకి సహాయం చేసినవారెవరు?

.....

.....

.....

.....

2. 1919, ఏప్రిల్ 13వ తేదీకి గల ప్రాముఖ్యత ఏమి?

.....

.....

.....

.....

3. గాంధీ ఖిలాఫత్ ఉద్యమాన్ని ఎందుకు సమర్థించాడు?

.....

.....

.....

.....

BRAOU

21.10 ఆంధ్రదేశంలో సహాయ నిరాకరణోద్యమం

భారతదేశంలో కొనసాగుతున్న సహాయ నిరాకరణోద్యమ ప్రభావం ఆంధ్రదేశంలో ప్రబలంగా వుంది. జాతీయ కాంగ్రెసు పిలుపునకు స్పందించి, ఆంధ్రదేశంలోని ప్రజలు ఎన్నికలకు, ఆంగ్లేయ విద్యాసంస్థలను, న్యాయస్థానాలను బహిష్కరించారు. బిరుదులు త్యజించడమేగాక, పన్నుల నిరాకరణ, మద్యపాన వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొనే స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించారు. ఆంధ్ర ప్రాంతంలో విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన వ్యతిరేకోద్యమాలను సమర్థనీయంగా నడిపించారు. మహాత్మాగాంధీ ఆదేశం ప్రకారం ఆంధ్రాలో నాయకులందరూ పదవులు త్యజించి ఉద్యమంలో పాల్గొన్నారు. అయ్యదేవర కాళేశ్వరరావు తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రసిద్ధ న్యాయవాది ఉన్నవ లక్ష్మీనారాయణ తన వృత్తిని త్యజించి న్యాయస్థానాలను బహిష్కరించారు. విద్యార్థులు ఆంగ్లేయ విద్యాసంస్థలను బహిష్కరించారు. ఆంధ్రానాయకుడైన కళా వెంకట్రావు చదువునాపి ఉద్యమంలోకి దూకారు.

ఆంధ్ర ప్రాంతంలో రాష్ట్ర కాంగ్రెసు అనేక కార్యక్రమాలు చేపట్టింది. స్వరాజ్య సందేశాన్ని గేయాలు, పాటలు, భజనలు, నాటకాల సహాయంతో వ్యాప్తి చేశారు. ఆంధ్ర ప్రాంతంలోని మహిళలు సహాయ నిరాకరణోద్యమంలో దువ్వూరి సుబ్బమ్మ మొదలగు మహిళా కార్యకర్తలు ఈ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. 1921 సం॥ మార్చి 31వ తేదీన విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రముఖ నాయకులతోపాటు హెచ్చు సంఖ్యల ప్రజలు కూడ హాజరైనారు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నాయకత్వంలోని రామదండు అనే స్వచ్ఛంద సేవాదళం సభా కార్యనిర్వహణ తీరు ప్రజలందరి మన్ననలు పొందింది. ఈ సమావేశంలోనే ఆంధ్రుడైన పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని జాతీయ కాంగ్రెస్ పతాకంగా ఆమోదించారు.

సహాయ నిరాకరణోద్యమ సమయంలో ఆంధ్ర ప్రాంతంలో మద్యపాన వ్యతిరేకోద్యమం తీవ్ర స్థాయికి చేరుకొంది. అబ్కారీ పన్నుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 50% పడిపోయింది. 1921 సం॥లో బ్రిటిష్ యువరాజు సందర్శనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. ఈ ఉద్యమ సందర్భంగానే గ్రామాధికారులందరూ తమ పదవులను త్యజించి ఉద్యమంలో పాల్గొనడంవల్ల భూమి శిస్తు వసూలు పెద్ద సమస్యగా మారింది.

సహాయ నిరాకరణోద్యమ సమయంలో ఆంధ్ర ప్రాంతంలో మూడు ఉద్యమాలను నిర్వహించిన తీరు బట్టి ఆంధ్ర ప్రాంతంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సహాయనిరాకరణోద్యమం ప్రభావాన్ని ఎంతో అవగాహన చేసికోవచ్చు.

21.10.1 చీరాల - పేరాల పోరాటం

అఖిల భారత కాంగ్రెస్ పిలుపుయివ్వకముందే ఆంధ్ర ప్రాంతంలో, ప్రభుత్వంతో పోరాట కార్యక్రమాలు చేపట్టారు. అందులో మొదటిది చీరాల-పేరాల పోరాటం.

నేటి ప్రకాశం జిల్లాలో వున్న చీరాల పేరాల గ్రామాలు స్వల్ప జనాభాతో, జాండ్రపేట, వీరరాఘవపేటతో కలిపి చీరాల యూనియన్‌గా పిలువబడే ఆ ప్రాంత ఆదాయం సాలుసరి రూ.4000/- మాత్రమే. 1919 సం॥లో రాష్ట్ర ప్రభుత్వం చీరాల పేరాల ప్రాంతాలను కలిపి ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. దాని ఫలితంగా ఆ ప్రాంత ప్రజలపై పన్నులభారం మోయనంతగా పెరిగింది. అందుచేత ఆ ప్రాంత ప్రజలు క్రొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీని రద్దు చేసి పాత యూనియన్‌ను పునరుద్ధరించ వలసిందిగా చేసిన విన్నపాలు పెడచెవిని పెట్టి, ప్రభుత్వం పెరిగిన పన్నులను నిర్లక్ష్యంగా వసూలు చేసింది. దానితో చీరాల పేరాల ప్రజలు మున్సిపాలిటీని బహిష్కరించేందుకు నిర్ణయించుకొన్నారు. పన్నుల వ్యతిరేకోద్యమం, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో నిర్వహించబడింది. చీరాల పేరాల పన్నుల వ్యతిరేకోద్యమం సంపూర్ణంగా విజయవంతమైంది.

BRAOU

ప్రభుత్వ దమన చర్యలను ప్రజలు సహనంతో భరించారు. ప్రతిగా, ఉద్యమ ప్రారంభానికి వేచివుండినారు. ఉద్యమం సామాన్య ప్రజలను కూడా ప్రభావితం చేసింది. ఉత్తరప్రదేశ్, బెంగాల్‌లోని వేలాది రైతులు సహాయనిరాకరణోద్యమంలో చేరారు. పంజాబ్‌లో శిక్కులు, ఇట్టి ఉద్యమాన్నే ప్రారంభించారు. అదే "అకాలీ ఉద్యమం".

21.12 ఉత్తరప్రదేశ్‌లో రైతుల పోరాటం

1921లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, ఫైజాబాద్ జిల్లాలలో పెద్ద ఎత్తున రైతుల ఆందోళనలు జరిగాయి. భూస్వాములు తమ రైతుల నుంచి ఎన్నో అన్యాక్రాంతపు వసూళ్ళు చేసేవారు. వారికి పోలీసు బలగం, న్యాయాధికారులు సహాయంగా ఉండేవారు. ఈ వసూళ్ళను ఎదిరిస్తూ, రైతులు తిరుగుబాటు చేసారు. వారు సహాయ నిరాకరణోద్యమంచే ప్రభావితులైనారు. కాన, న్యాయాధికారులు వారికి వివిధ శిక్షలు విధించినారు. ఈ తిరుబాటు పెక్కు గ్రామాలకు వ్యాపించింది. మున్షీగంజ్‌లోని జైలుపై పదివేల మంది రైతులు దాడి చేసారు. వారిని చెదరగొట్టడానికి కాల్పులు జరిగాయి. చౌరీచౌరాలో జరిగిన మరో రైతు తిరుగుబాటులో, ఎందరో పోలీసులు మరణించారు. ఈ తిరుగుబాట్లన్నింటికీ సహాయ నిరాకరణోద్యమమే కారణంగా భావించబడింది. ప్రజా నాయకులు ప్రభుత్వాధికారులను ధిక్కరించి, పన్నులు చెల్లించవద్దని, అట్లా చేసిన స్వరాజ్యం త్వరలో సిద్ధించగలదని ప్రచారం చేశారు.

21.13 మోప్లా తిరుగుబాటు

అరబ్ జాతి నుంచి వచ్చిన మోప్లా ముసల్మాన్‌లు పేదవారు, అజ్ఞానులు. మలబార్ కోస్తా ప్రాంతంలో సుమారు పది లక్షల మంది మోప్లా ముసల్మాన్‌లు స్థిరపడి, భారతీయ స్త్రీలను వివాహమాడినారు. హిందువులతో కలిసి జీవించేవారు. ఆంగ్లేయ పాలనలో వారు పెక్కుసార్లు తిరుగుబాటు చేసినా, అతి ముఖ్యమైన తిరుగుబాటు 1921లోనే సంభవించింది. ఖిలాఫత్ ఉద్యమానికి అనుబంధంగా, అనుకూలంగా జరిగిన తిరుగుబాటులో మోప్లాలు పాల్గొన్నారు. వారు భూస్వాములు విధిస్తున్న అన్యాయపు పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమం లేవదీసారు.

ఖిలాఫత్ నాయకుల ఉద్రేక ఉపన్యాసాలు, ఖిలాఫత్ సమావేశ తీర్మానాలు మోప్లాలను రెచ్చగొట్టినాయి. వారు స్థానికంగా కత్తులు, కఠారులు, బరిసెలు తయారు చేసుకొన్నారు. ఆయుధాలను సమీకరించుకొని, ఇస్లాం రాజ్యస్థాపనకు సన్నద్ధాలు చేశారు. 1921 ఆగస్ట్ 20వ తేదీన తిరురంగణి గ్రామంలోని ప్రజలవద్ద అక్రమంగా వున్న ఆయుధాలను వశం చేసుకొనడానికి, కాలికట్ మేజిస్ట్రేట్ సైన్యబలంతో వెళ్ళారు. సైనికులకు, స్థానికులకు మధ్య పెద్ద పోరాటం జరిగింది. ఈ వార్త తెలిసినవెంటనే, ఆ ప్రాంతమంతటా మోప్లాలు తిరుగుబాటు చేసారు. రహదారులకు అడ్డంకులు కల్పించి, టెలిగ్రాఫ్ తీగలను త్రెంచి, రైల్వేలైన్లను ధ్వంసం చేసారు. పెక్కు పోలీస్ స్టేషన్లపై దాడి చేసారు. ఎందరో ఐరోపీయులు హత్యచేయబడ్డారు. కొందరు తప్పించుకొని పారిపోయినారు. మోప్లాలు స్వరాజ్యాన్ని ప్రకటించి, దానిని ఖిలాఫత్ రాజ్యంగా వ్యవహరించినారు. ఈ తిరుగుబాటు సందర్భంగా ఎందరో హిందువులు కూడా దారుణంగా హత్య చేయబడ్డారు. వారి దేవాలయాలు నేల మట్టం చేయబడినాయి. బలవంతపు మార్పిడులు జరిగాయి. ప్రభుత్వం తిరుగుబాటుదారులకు పెద్దెత్తున సైన్యాన్ని తరలించింది. తిరుగుబాటుదార్లు కొండలలోనికి పారిపోయారు. వారిని పట్టుకోడానికి చాలా కాలం పట్టింది. 1921వ సంవత్సరాంతానికి శాంతి భద్రతలు పునరుద్ధరింపబడ్డాయి. తిరుగుబాటు అణచివేయబడింది. మూడు వేల మంది మోప్లాలు ఈ తిరుగుబాటులో చనిపోయారు. పెక్కుమంది సైనికులు కూడా మరణించారు. మోప్లాలు ముసల్మానుల దృష్టిలో వీరమరణం పొందిన త్యాగమూర్తులుగా నిలిచిపోయారు.

1921 డిసెంబర్ నెలలో కాంగ్రెస్ సభలు అహమ్మదాబాద్‌లో జరిగాయి. అప్పటికే 40 వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలు నిర్బంధంలో ఉన్నారు. కాంగ్రెస్ సభలకు అధ్యక్షునిగా ఎన్నికైన చిత్తరంజన్ దాస్ కూడా

BRAOU

జైలులోనే ఉన్నాడు. సహాయ నిరాకరణోద్యమ కొనసాగింపుకై కాంగ్రెస్ తీర్మానం చేసింది. ప్రజలు అహింసా పద్ధతులలో శిక్షణ పొందివున్నారు. కాన, పెద్ద ఎత్తున శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించడం సముచితమని కాంగ్రెస్ సలహానిచ్చింది. ఈ సలహా మేరకు, తాను సూరత్ జిల్లాలోని బార్డోలీలో శాసనోల్లంఘన ప్రారంభింపగలనని గాంధీజీ వైస్రాయికి లేఖ వ్రాసాడు. ప్రభుత్వం తమ దమన విధానాన్ని విడనాడి, నిర్బంధితులను విడుదల చేసి, పత్రికలపై ప్రభుత్వ ఆంక్షలను తొలగించవలసిందిగా గాంధీ వైస్రాయిని కోరినాడు. ఈ కోర్కెలు వారంలోపుగా మన్నించకపోతే, శాసనోల్లంఘన తన విధి కాగలదని హెచ్చరించాడు. ప్రభుత్వం ఈ హెచ్చరికను ఖాతరు చేయలేదు. తన సైనిక బలంలో నమ్మకం కలిగిన ప్రభుత్వం, ఉద్యమాన్ని ఎదిరింప నిశ్చయించుకొంది. గాంధీ స్వయంగా ఉద్యమాన్ని నిర్వహించడానికి బార్డోలీ నేరాడు. యావద్భారతమంతా ఈ బ్రహ్మాండమైన సంఘర్షణ ఎట్లు రూపొందగలదోనని ఆశ్చర్యచకితులై ఎదురు చూచినారు. కాని, సంఘర్షణ ప్రారంభం కాకుండానే ముగిసింది. చౌరీచౌరాలో జరిగిన సంఘటన మూలంగా, గాంధీజీ శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించకనే, నిలుపు చేసాడు.

21.14 చౌరీచౌరా సంఘటన, సహాయ నిరాకరణోద్యమం నిలుపుదల

ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలో చౌరీచౌరా, ఒక గ్రామం. 1922 ఫిబ్రవరి 5వ తేదీన, సుమారు 30 వేల మంది రైతులు ఒక పెద్ద ఊరేగింపు చేసారు. వారిపై పోలీసులు అకారణంగా కాల్పులు జరిపారు. వారి దగ్గర మందుగుండు సామగ్రి అయిపోగానే ఉద్రిక్తులైన ప్రజలు, పోలీసు ఠాణాపై దాడిచేసి, నిప్పు ముట్టించి, పోలీసులను ఆ మంటలలో వేసారు. 22 మంది పోలీసులు సజీవ దహనం పొందినారు. బరేలీలో కూడా కొన్ని హింసాత్మక చర్యలు జరిగాయి. ఈ సంఘటనలపట్ల తీవ్ర ఆవేదన పొందిన గాంధీజీ, కార్యకర్తలు ఇంకా అహింసా పద్ధతులలో శిక్షణ పొందలేదని, అందువల్ల శాసనోల్లంఘనోద్యమం విజయం సాధించలేదని భావించాడు. బలప్రయోగం ద్వారా ప్రభుత్వం ఎట్టి హింసాయుత ఉద్యమాన్ని అయినా అణచివేయగలదని గాంధీ అభిప్రాయపడినాడు. బార్డోలీలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, శాసనోల్లంఘనకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను రద్దు చేసింది. కాంగ్రెస్ కార్యకర్తలు క్రియాశీల రాజకీయాలలో శ్రద్ధచూపవలెనని సలహానిచ్చింది.

బార్డోలీ తీర్మానం, దేశాన్ని విభ్రాంతిలో ముంచివేసింది. గాంధీగారి నిర్ణయాన్ని యువనాయకులు నిరసించారు. "ప్రజా చైతన్యం పరాకాష్ఠకు చేరుకున్న సమయంలో వెనుతిరిగి ఉద్యమాన్ని నిలుపుచేయడం, జాతీయ విపత్తు" అని సుభాస్ చంద్రబోస్ వ్యాఖ్యానించగా, "ఒక్కచోట జరిగిన తప్పుకు, దేశాన్ని యావత్తు అరెస్టు చేసి, ప్రభుత్వంపట్ల అవిధేయతను వ్యాప్తి చేయుచున్నాడ"నే నేరాన్ని ఆరోపించింది. చరిత్రాత్మకమైన విచారణ పిదప, గాంధీజీకి ఆరేళ్లపాటు కారాగార శిక్ష విధింపబడింది.

ఈ విధంగా సహాయ నిరాకరణోద్యమం ముగిసింది. ఇంతలో టర్కీలో ముస్తఫా కమాల్‌పాషా అధికారానికి వచ్చి, ఆరాజ్యాన్ని మతప్రమేయం లేని లౌకికరాజ్యంగా ప్రకటించాడు. దీనితో, ఖిలాఫత్ ఉద్యమ లక్ష్యంకూడా అర్థరహితమైంది. అయితే, ఖిలాఫత్ ఉద్యమం చదువుకున్న ముసల్మానులను సహాయ నిరాకరణోద్యమం లోనికి తీసుకురావడం ద్వారా, స్వాతంత్ర్యోద్యమానికి కొంత దోహదం చేసింది. కొద్దికాలం తరవాత వారి మధ్య, మరల విభేదాలు ఏర్పడినాయి. సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘన రెండూ విఫలమైనా జాతీయ స్వాతంత్ర్యోద్యమం మాత్రం పటిష్టమైంది. ప్రప్రథమంగా సామాన్య ప్రజలు ఈ ఉద్యమం, పెక్కు ఒడుదుడుకులతో 1947లో స్వాతంత్ర్యం వచ్చేవరకు కొనసాగింది.

BRAOU

II. మీ అవగాహన పరీక్షించుకోండి.

1) సహాయ నిరాకరణోద్యమపు ముఖ్య కార్యక్రమాలేవి?

.....

.....

.....

.....

2) చీరాల-పేరాల ఉద్యమ నాయకుడెవరు?

.....

.....

.....

.....

3) పెదనందిపాడు, పన్నుల నిరాకరణోద్యమ నాయకుడెవరు?

.....

.....

.....

.....

4) గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ఎందుకు ఆపినాడు?

.....

.....

.....

.....

BRAOU

21.15 సంగ్రహంగా

1. 1919 నాటికి గాంధీ జాతీయనాయకుడైనాడు. దక్షిణాఫ్రికాలో అతని ఉద్యమాలు భారతదేశంలో, చంపరాన్, అహ్మదాబాద్, ఖేడాలలో నిర్వహించిన ఉద్యమాలు, రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమం గాంధీని, జాతీయ నాయకుని స్థాయికి ఎదిగేటట్లు చేసినాయి.

2. భారతదేశ చరిత్రలో, జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ ఒక ముఖ్యమైన మలుపు. ఆ ఉదంతంవల్ల, భారతీయుల్లో బ్రిటీష్ ప్రభుత్వంపట్ల ద్వేషం ఎక్కువైంది.

3. హిందూ, మహమ్మదీయ ఐక్యత కొరకు గాంధీ ఖిలాఫత్ ఉద్యమాన్ని బలపరిచాడు.

4. భారత స్వాతంత్ర్య పోరాటంలో, సహాయ నిరాకరణోద్యమం, మొట్టమొదటి పెద్ద ప్రజా ఉద్యమం. ఆ ఉద్యమంలో నిర్మాణాత్మక కార్యక్రమాలు కూడా వున్నాయి. చౌరీచౌరా సంఘటనతో, సహాయ నిరాకరణోద్యమం అంతమొందింది.

21.16 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I 1) చంపరాన్‌లో, గాంధీ నీలిమందు పండిస్తున్న రైతుల కోర్కెలను బలపరిచాడు. అహ్మదాబాద్‌లో, మిల్లు కార్మికులకు వేతనాలు ఎక్కువ చేయాలనే కోర్కెను బలపరచాడు. ఖేడాలో భూమిశిస్తు పెంచడాన్ని వ్యతిరేకించిన రైతులను బలపరిచాడు.

2) 1919, ఏప్రిల్ 13వ తేది, జలియన్‌వాలాబాగ్ ఉదంతం జరిగింది. ఆ దారుణ హత్యాకాండవల్ల భారతీయులలో బ్రిటీష్ ప్రభుత్వంపట్ల ద్వేషం ఎక్కువైంది.

3) హిందూ-మహమ్మదీయుల మధ్య ఐక్యతను ఏర్పరచడానికి ఖిలాఫత్ ఉద్యమం ఒక చక్కని అవకాశమని భావించి గాంధీ ఆ ఉద్యమాన్ని బలపరిచాడు.

II 1) బ్రిటీష్ సరుకుల బహిష్కరణ, బ్రిటీష్‌వారి కళాశాలల, పాఠశాలల బహిష్కరణ, వారి న్యాయస్థానాల కౌన్సిళ్ళ బహిష్కరణ, యువరాజు రాక బహిష్కరణ, సహాయ నిరాకరణోద్యమంలోని ముఖ్యమైన, బహిష్కరణ కార్యక్రమాలు. జాతీయ విద్యా సంస్థలు స్థాపించారు. ఖద్దరు బట్టలు తయారీ, స్వదేశీ భావాన్ని పెంపొందించుట, ఆ ఉద్యమంలోని ముఖ్యమైన నిర్మాణాత్మక కార్యక్రమాలు.

2) చీరాల-పేరాల ఉద్యమానికి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకుడు.

3) పెదనందిపాడు, పన్నుల నిరాకరణ ఉద్యమానికి, పర్వతనేని వీరయ్య చౌదరి నాయకుడు.

4) చౌరీ-చౌరాలో జరిగిన హింసాయుత సంఘటనవల్ల గాంధీ సహాయనిరాకరణోద్యమాన్ని ఆపినాడు.

21.17 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులను సమీక్షించి దాని ఫలితాలను రాయండి.
2. ఖిలాఫత్ ఉద్యమం ఎందుకు ప్రారంభమైంది? దాని ప్రాముఖ్యతను తెలుపండి?
3. భారతదేశంలో గాంధీ ఒక రాజకీయ నాయకుడుగా ఆవిర్భవించడాన్ని వివరించండి.
4. సహాయ నిరాకరణ ఉద్యమానికి కారణాలు, ఆ ఉద్యమ ముఖ్య లక్షణాలు, ఫలితాలు వివరించండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. రౌలట్ సత్యాగ్రహానికి కారణాలు, ఫలితాలు వివరించండి.
2. సహాయ నిరాకరణ ఉద్యమాన్ని, గాంధీ ఎందుకు రద్దు చేశాడు? ఇతర నాయకులు అందుకు ఎలా ప్రతిస్పందించారు?
3. ఆంధ్ర ప్రాంతంలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని గురించి క్లుప్తంగా రాయండి.
4. మోప్లా తిరుగుబాటు గురించి రాయండి.

BRAOU

21.18 ఉపయుక్త గ్రంథాలు

1. Louis Fisher	:	Mahatma Gandhi
2. Judith Brown	:	The Emergence of Mahatma Gandhi
3. Readers Digest (Publi)	:	Profiles of M.K. Gandhi
4. Sumit Sarkar	:	Modern India
5. Maulana A. Azad	:	India Wins Freedom
6. Tara Chand	:	History of the Freedom Movement in India, vol. 3
7. R.C. Majumdar (ed)	:	The Struggle for Freedom, Bharatiya Vidya Bhavan series, vol.X.
8. R.C. Majumdar	:	Three phases of the India's Struggle for Freedom
9. బిపన్ చంద్ర	:	ఆధునిక భారతదేశం
10. ఝాన్సీలక్ష్మి, పాటిబండ; వైదేహి, అల్లాడి	:	భారతదేశ చరిత్ర-సంస్కృతి, ద్వితీయ భాగం తెలుగు అకాడమి ప్రచురణ.
11. వైదేహి, అల్లాడి	:	భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1858-1947)

BRAOU

భాగం - 22 : జాతీయోద్యమం, వామపక్షాల ఆవిర్భావం, 1920-1929

విషయక్రమం

22.0 లక్ష్యాలు
22.1 పరిచయం
22.2 స్వరాజ్ పార్టీ
22.3 గాంధీ - స్వరాజ్ పార్టీ
22.4 వామపక్ష ఆవిర్భావం, 1920-1929
22.4.1 కమ్యూనిస్టుల ఆవిర్భావం
22.4.2 మీరట్ కుట్రకేసు
22.5 మతకలహాలు
22.6 సైమన్ కమిషన్
22.7 నెహ్రూ నివేదిక, 1928
22.8 విప్లవ కార్యక్రమాల పునరుద్ధరణ
22.8.1 బెంగాల్
22.8.2 లాహోర్ కుట్రకేసు
22.9 సంగ్రహంగా
22.10 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
22.11 పరీక్ష నమూనా ప్రశ్నలు
22.12 ఉపయుక్త గ్రంథాలు

22.0 లక్ష్యాలు

ఈ పాఠం చదివిన తర్వాత ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి :

1. స్వరాజ్ పార్టీ స్థాపనకు దారితీసిన పరిస్థితులు ఆ పార్టీ ఆశయాలు, పద్ధతులు, సాధించిన ఘనకార్యాలు.
2. కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం
3. 1922-1930 మధ్యకాలంలో విప్లవవాదుల కార్యకలాపాలు, మీరట్, లాహోర్ కుట్రకేసులు.
4. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమం.
5. నెహ్రూ నివేదిక ప్రాముఖ్యత, అందులోని అంశాలు

22.1 పరిచయం

చౌరీచౌరా సంఘటన పిదప 1922లో, గాంధీజీ సహాయనిరాకరణోద్యమాన్ని నిలుపుచేసాడు. ఆయనకు ప్రభుత్వం ఆరేళ్ళ కారాగార శిక్ష విధించింది. సహాయనిరాకరణోద్యమం ఆగిపోయి, వైఫల్యం చెందినా దానివల్ల, రెండు ముఖ్య ఫలితాలు కలిగాయి. ప్రప్రథమంగా కాంగ్రెస్, సామాన్య ప్రజల సంస్థగా రూపొందింది. సామాన్య ప్రజలు జాతీయ తత్వంచే ప్రేరణ పొందడమేగాక, స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయాలు చేసే సంస్థ స్థానం నుంచి కార్యాచరణ గలిగిన పోరాడే శక్తిగా రూపొందింది.

గాంధీ నిర్బంధం పిదప, ప్రభుత్వ వ్యతిరేక చర్యలు ఆగిపోయాయి. కాని, ప్రభుత్వం తన దమన చర్యలు మానలేదు. శాసనోల్లంఘనోద్యమాన్ని పునఃప్రారంభించవలెననే అభిప్రాయం కొందరిలో ఏర్పడింది. అఖిల భారత కాంగ్రెస్ సంస్థ ఈ విషయాన్ని పరిశీలించేందుకై, ఒక ఉపసంఘాన్ని నియమించింది. దేశవ్యాప్తంగా

BRAOU

శాసనోల్లంఘనోద్యమం ప్రారంభించడానికి, ఇంకా సమయం రాలేదని ఆ సంఘం అభిప్రాయపడింది. కొందరు కాంగ్రెస్ నాయకులు శాసనసభా బహిష్కరణను మానివేసి, 1919 చట్టం ప్రకారం జరిగే ఎన్నికలలో పాల్గొని, శాసనసభలలో ప్రవేశించి, ప్రభుత్వంతో పోరాడుట ఉచితమని భావించారు. దీనితో, కాంగ్రెస్‌లో తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయి. మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్ శాసనసభలలో ప్రవేశించవలెనని వాదించగా, రాజగోపాలాచారి నాయకత్వంలో మరోవర్గం దీనిని వ్యతిరేకించింది. మొదటి వర్గాన్ని మార్పు కోరేవారుగా, రాజగోపాలాచారి వర్గాన్ని యథాతథ స్థితిని కోరేవారుగా వ్యవహరించడం జరిగింది.

22.2 స్వరాజ్ పార్టీ

1922 డిసెంబర్ నెలలో గయలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశంలో, ఈ విషయం తీవ్రవాదోపవాదాలకు దారితీసింది. శాసనసభలలో ప్రవేశించాలని చిత్తరంజన్ దాస్ తన అధ్యక్షోపన్యాసంలో గట్టిగా కోరాడు. అయినా, శాసనసభల బహిష్కరణ విధానాన్ని కొనసాగింపవలెననే రాజగోపాలాచారి తీర్మానం, అత్యధిక మెజారిటీతో నెగ్గింది. చిత్తరంజన్ దాస్ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. ఆయన, మోతీలాల్ నెహ్రూ, మరికొందరు కాంగ్రెస్ సభ్యులు కలసి, **'కాంగ్రెస్ - ఖిలాఫత్ స్వరాజ్ పార్టీ'** అనే ప్రత్యేక సంస్థను స్థాపించారు. దీనిని 'స్వరాజ్ పార్టీ' గా పిలిచారు. కొద్ది కాలంలోనే మంచి ప్రచారం పొంది, స్వరాజ్ పార్టీ బలపడింది. 1923లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో, రాజీప్రతిపాదన వచ్చింది. సహాయనిరాకరణోద్యమ సిద్ధాంతాన్ని పునరుద్ఘాటిస్తూ, ఎవరైనా కాంగ్రెసువాదులు శాసనసభలలో ప్రవేశించవలెనన్న ఎన్నికలలో పాల్గొనడానికి ఓటింగ్ చేయడానికి కాంగ్రెస్‌కు ఎట్టి అభ్యంతరంలేదని ఈ సమావేశంలో తీర్మానింపబడింది.

1923 నవంబర్‌లో ఎన్నికలు జరుగుతాయి. కాన, స్వరాజ్య పార్టీ వెంటనే ఎన్నికల సంరంభం ప్రారంభించింది. పార్టీ సిద్ధాంతాలను, ప్రణాళికను ప్రచురించింది. తాము కాంగ్రెస్ వాదులమేనని, తమకు సహాయ నిరాకరణోద్యమంలో గట్టి నమ్మకం కలదని, వారు ప్రకటించినారు. తాము శాసనసభలకు ఎన్నికైన పిదప, రాజ్యాంగం రూపొందించుకొనే హక్కు భారతీయులకు కలదని వాదించగలమని, తెలియజేసారు. దీనికి ప్రభుత్వం అంగీకరించకపోయిన, తాము **"సమరూప, నిరంతర, నిర్దిష్ట"** పద్ధతిలో ప్రభుత్వ కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టించి, ప్రభుత్వం శాసనసభల ద్వారా కొనసాగకుండా నిరోధించగలమని, స్వరాజ్య పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో వివరించింది. ఎన్నికలలో స్వరాజ్యపార్టీ పోటీ చేయడం, దేశమంతటా సంచలనాన్ని సృష్టించింది. అతి తక్కువ కాలంలో ఎన్నికలకు తయారైన స్వరాజ్య పార్టీ, బ్రహ్మాండమైన విజయాలు సాధించింది. 'మోడరేట్' లేదా 'లిబరల్' పార్టీని పూర్తిగా ఓడించింది. సురేంద్రనాథ్ బెనర్జీ కూడా ఓడిపోయారు. 'సెంట్రల్ ప్రావిన్స్'లో స్వరాజ్యపార్టీకి మెజారిటీ లభించింది. బెంగాల్‌లో మిగతా పార్టీలకన్నా ఎక్కువసీట్లు సంపాదించుకున్న స్వరాజ్యపార్టీ ప్రతినిధులు, ఉత్తరప్రదేశ్, అస్సామ్, బొంబాయిలలో గణనీయ సంఖ్యలో ఎన్నికయినారు. మద్రాస్, పంజాబ్‌లలో కొద్దిమంది మాత్రమే ఎన్నిక కాగా, బీహార్, ఒరిస్సాలలో స్వరాజ్యపార్టీకి ఒక్కసీటు కూడా లభించలేదు.

కేంద్రశాసన సభలో స్వరాజ్యపార్టీకి 48 సీట్లు రాగా, జిన్నా నాయకత్వంలోని మరో స్వతంత్ర వర్గానికి 24 సీట్లు వచ్చాయి. స్వరాజ్యపార్టీ స్వతంత్ర వర్గంలో చేరి, శాసన సభలలో మెజారిటీ సంపాదించి, నూతన ప్రణాళికను రూపొందింపవలెనని ఆలోచించింది. తీర్మానాలు ప్రవేశపెట్టి , జాతీయ జీవనం మెరుగుపరచడానికి వలసిన కృషి చేయడం, కాంగ్రెస్‌పార్టీ క్రియాత్మక విధానాలకు రూపకల్పన చేయడం ఉచితమని స్వరాజ్యపార్టీ భావించి, తన నిరంతర, నిర్దిష్ట, నిరోధక పద్ధతిని విడనాడింది. స్వతంత్ర వర్గం స్వరాజ్యపార్టీని బలపరచినా, అప్పుడప్పుడు ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, ఓటు వేసేవారు. 1925లో సంస్కరణల విషయంలో ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ స్వరాజ్యపార్టీ శాసనసభను బహిష్కరించింది. ''మేము అందించిన సహకారాన్ని ప్రభుత్వం అవమానకరంగా తిరస్కరించింది. మా లక్ష్యసాధనకు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయవలసిన సమయమాసన్నమైంది''అని, మోతీలాల్ నెహ్రూ పలికినాడు. "మేము శాసనసభలలో ఉన్నందున ప్రయోజనమేమి కన్పించలేదు. మేము మరల ప్రజలముందుకు వెళ్ళి, వారిమద్ధతును కోరగలం. మా పోరటం నిలిపేదిలేదని" కూడా వారు

ఉద్ఘాటించినారు. ఈ విధంగా స్వరాజ్య పార్టీ శాసనసభా ప్రవేశం ముగిసింది. శాసన సభలలో ఉన్న కొద్ది కాలంలో జాతీయ భావాలను, ఆదర్శాలను, స్వరాజ్యపార్టీ ఎలుగెత్తి చాటింది. ప్రప్రథమంగా కేంద్ర శాసనసభ, జాతీయాశయాలను ప్రతిబింబించే సమావేశంగా కన్పించింది.

22.3 గాంధీ - స్వరాజ్య పార్టీ

1924 జనవరినెలలో గాంధీని కారాగారం నుంచి పూనా ఆస్పత్రికి శస్త్రచికిత్సకూ తరలించారు. యావద్భారతం కలవరపడింది. గాంధీని విడుదల చేయమని కోరుతూ, స్వరాజ్యపార్టీ శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి నిశ్చయించుకొంది. తీర్మానం ప్రతిపాదించకముందే, గాంధీగారిని వైద్యసలహాపై విడుదల చేసారు. గాంధీగారి ఆరోగ్యం కొంత కుదుట పడగానే, వారు మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్‌లతో సుదీర్ఘ చర్చలు జరిపారు. శాసనసభా ప్రవేశం గూర్చి మోతీలాల్ నెహ్రూ అభిప్రాయాలతో గాంధీ ఏకీభవించలేదు. మోతీలాల్ కూడా గాంధీ పద్ధతులను విమర్శించారు. 1924 జూన్ నెలలో అహమ్మదాబాద్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో, ఈ విభేదాలు రచ్చకెక్కాయి. సహాయ నిరాకరణ సిద్ధాంతాలకు పూర్తిగా కట్టుబడని వారిని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం నుంచి తొలగించాలని గాంధీ తీర్మానం ప్రవేశపెట్టారు. మోతీలాల్ నెహ్రూ వ్యతిరేకించినా, తీర్మానం నెగ్గింది. నెహ్రూ, చిత్తరంజన్ దాస్ సభ నుంచి తమ అనుచరులతో నిష్క్రమించారు. చివరకు గాంధీ, నెహ్రూ, చిత్తరంజన్ దాస్‌ల మధ్య రాజీ కుదిరింది. ఈ రాజీ పరిష్కారం ప్రకారం, కాంగ్రెస్ నేతలు, అస్పృశ్యతానివారణ, హిందూ-ముసల్మాన్ ఐక్యత, మొదలైన కార్యక్రమాలు చేపడుతుంది. స్వరాజ్యపార్టీ కాంగ్రెస్‌లో భాగంగా ఉంటూనే, తన నిబంధనలను రూపొందించుకొని, శాసనసభలలో వ్యవహరిస్తుంది.

ఇంతలో చిత్తరంజన్ దాస్ భావాలలో కొంతమార్పు వచ్చింది. వారు 'పూర్ణస్వరాజ్యం' కాక, స్వయంపాలనా ప్రతిపత్తి చాలునని అభిప్రాయపడిరి. కొన్ని షరతులకు లోబడి, ప్రభుత్వానికి సహకారం అందించవలెనని కూడా పలికారు. ప్రభుత్వంతో రహస్యంగా చిత్తరంజన్ దాస్ రాజీ పడ్డాడనే వదంతి ప్రచారమైంది. ఇంతలో ఆయన మరణించాడు. దాస్ మరణంతో, స్వరాజ్యపార్టీలో మరోచీలిక వచ్చే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వానికి బాధ్యతాయుత సహకారం ఇవ్వవలెననే వర్గం బలపడింది. 1926 జులైలో లాలా లజపతిరాయ్, స్వరాజ్యపార్టీకి రాజీనామా ఇచ్చాడు. మదన్‌మోహన్ మాలవ్య పార్టీ ఐక్యతకు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. 1926 ఎన్నికల నాటికి స్వరాజ్య పార్టీ స్థానంలో మూడువర్గాలు ఏర్పడ్డాయి. స్వరాజ్య పార్టీ ప్రభుత్వంతో సహకరించవలెననే వర్గం మతపరమైన వర్గంగా వారు చీలిపోయారు. నాటి నుంచి భారత రాజకీయాలలో స్వరాజ్య పార్టీ పాత్ర క్షీణించి పోయింది.

22.4 వామపక్షాల ఆవిర్భావం

1917 సం॥లో రష్యాలో సంభవించిన బోల్షివిక్ విప్లవ ఫలితంగా భారతీయ విప్లవ కారులు ముఖ్యంగా, మనదేశంలోనే వుంటున్న విప్లవకారులు వుత్తేజితులైనారు. జాతీయ ఉద్యమ కాలంలో, కాంగ్రెస్ స్వతహాగా మధ్యతరగతి వర్గాలకు చెందినదైనందున రైతు, కార్మిక సమస్యలపై దృష్టి కేంద్రీకరించడంలో విఫలమైన, మనదేశంలో కర్షక కార్మిక వర్గాల హక్కుల పరిరక్షణకై వామపక్షాలు ఆవిర్భవించడానికి దోహదం చేసాయి. అమెరికాలో నివసిస్తున్న భారతీయ విప్లవకారులు, బోల్షివిక్ విప్లవ నాయకులతో సంబంధాలు ఏర్పాటు చేసికొని, భారతదేశ విముక్తి కోసం వారి సహాయం అర్థించారు. క్లుప్తంగా బోల్షివిక్ విప్లవం, జాతీయోద్యమకాలంలో వామపక్షాలను పటిష్టం చేసి, అవి భారత స్వాతంత్ర్య సమరంలో ప్రముఖపాత్ర నిర్వహించేందుకు తోడ్పడింది.

మహోన్నతమైన బోల్షివిక్ విప్లవం తర్వాత మనదేశంలోని వామపక్ష వర్గాలు, జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించేందుకు ఒక పటిష్టమైన వర్గంగా ఏర్పడేందుకు కృషి చేసాయి. వామ పక్షాలవారు 1920 సం॥లోని లెనిన్ సిద్ధాంతంవల్ల ప్రభావితులై, తదుపరి జాతీయోద్యమంలో క్రియాశీలక పాత్ర

BRAOU

పోషించసాగారు. మనదేశంలోని వామపక్షాల వర్గాలు సంపూర్ణ స్వాతంత్ర్యము తమలక్ష్యంగా ప్రకటించి, దేశ ఆర్థిక రంగంపై సామ్రాజ్యవాదుల ఆధిపత్యం తొలగింపు, భూస్వామ్య వ్యవస్థ రద్దు, రాజభరణాలు రద్దుకై కృషి చేస్తూ భారతీయులందరికి ప్రజాస్వామిక హక్కులు లభించే అవకాశముండాలని వాదించారు. అందుకోసం అధికారం, వివిధ వర్గాలకు చెందిన భారతీయులకు అనగా కార్మికులకు, కర్షకులకు బదలాయిస్తే, బ్రిటీష్ వారిని మనదేశం నుంచి తరిమివేసే ప్రజావిప్లవంలో, కార్మిక కర్షక వర్గం వారు ప్రముఖ ప్రాత నిర్వహించి, సర్వ సత్తాక ప్రభుత్వాన్ని స్థాపించ గలరని వామపక్ష వర్గాలు విశ్వసించాయి. అంతేగాకుండా వామపక్షాలు, "జాతీయయోద్యమంలో సముచిత స్థానం పొందేందుకు వామపక్షవర్గాలన్నీ సంఘటితమై ఒకే వర్గంగా ఏర్పాటు కావలసిన అవశ్యకత"ను గుర్తించాయి.

22.4.1 కమ్యూనిస్టుల ఆవిర్భావం

మనదేశంలో కమ్యూనిజం జాతీయోద్యమంలో ఒక భాగంగానే అవతరించింది. కాంగ్రెసు విధానాలతో అసంతృప్తులైన విప్లవవాదులు, కార్మిక నాయకులు, కర్షక నాయకులు, రాజకీయ సాంఘిక స్వేచ్ఛకై నూతన మార్గాలు అన్వేషించ సాగారు. 1919 సం॥లో బోల్షివిక్ నాయకుడైన బరోడిన్‌ని కలిసిన మహేంద్రనాథ్‌రాయ్ (యమ్.యన్.రాయ్) మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించాడు. 1920 సం॥లో రాయ్ రష్యావెళ్లి రెండవ కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్‌లో పాల్గొన్నాడు.

యమ్.యన్.రాయ్ ఆఫ్ఘనిస్థాన్ ద్వార తాష్కెంటు చేరి భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించినాడు. 1922 సం॥ నాటికి భారతదేశంలోని కమ్యూనిస్టు వర్గాలలో రహస్య సంబంధాలు ఏర్పాటు చేసికొన్నాడు. అనాడు భారతదేశంలోని ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, యస్.ఎ.డాంగే, ముజఫర్ అహమ్మద్, గులాంహుసేన్ మొదలగువారు. డాంగే 1922 సం॥లో ప్రారంభించిన 'సోషలిస్టు' అనే వారపత్రిక మనదేశంలోని మొట్టమొదటి కమ్యూనిస్టు పత్రిక. చివరకు 1926వ సం॥లో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడింది. 1929 సం॥ వరకు భారత కమ్యూనిస్టులు జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. అయితే వారు కాంగ్రెసు నాయకత్వాన్ని సామ్రాజ్య వాదులతో కాంగ్రెసు రాజీ విధానాలను విమర్శిస్తూ వుండే వారు. కాంగ్రెసు వార్షిక సమావేశాలలో రాయ్ తయారు చేసిన కమ్యూనిస్టు సిద్ధాంత ప్రకటనలను, కరపత్రాలుగా పంచేవారు. గాంధీతో రాయ్ విభేదించినా గాంధీని గొప్ప మానవతావాదిగా ప్రస్తుతించేవారు.

కమ్యూనిస్టు వర్గాలు భారతదేశంలో ఆవిర్భవించడంతో, బ్రిటీష్ ప్రభుత్వం కలత చెందింది. వారి ఎడల దమననీతి ప్రయోగించి, కమ్యూనిస్టు నాయకులపై ఎన్నో కుట్ర కేసులు బనాయించారు. డాంగే, షౌకత్ ఉస్మాన్, ముజఫర్ అహమ్మద్, వలీ గుప్తా మొదలగు కమ్యూనిస్టు నాయకులపై కాన్పూరు కుట్రకేసు బనాయించి ఖైదు చేయబడ్డారు.

భారత కమ్యూనిస్టు పార్టీ, శ్రామికులు మరియు కర్షకుల (W.P.P) పార్టీ ఏర్పాటునకు కృషి చేసింది. దీని వెనుక ముఖ్యలక్ష్యం కాంగ్రెసుతో కలిసి పనిచేసి పురోగమన దృక్పథాన్ని అవలంబిస్తూ, సంపూర్ణ స్వాతంత్ర సాధనకు, సమసమాజ స్థాపనకు కమ్యూనిస్టు పార్టీని ప్రజల పార్టీగా మార్చడం. యువజన సంఘాలు, యితర వామపక్ష వర్గాలతోకలిసి కర్షకులు, శ్రామికుల పార్టీ ప్రముఖ పాత్ర నిర్వహించి కాంగ్రెసులో వామపక్ష దృక్పథాన్ని పటిష్టం చేసే జాతీయ ఉద్యమానికి వామపక్ష దృక్పథ మార్గాన్ని అందించేందుకు ప్రయత్నించింది. 1929 సం॥ నాటికి జాతీయోద్యమంపై కమ్యూనిస్టుల, శ్రామికుల కర్షకుల పార్టీ ప్రభావం నిరోధించి క్రింద పేర్కొన్న కారణాలవల్ల పూర్తిగా తుడిచిపెట్టడం జరిగింది.

1. కమ్యూనిస్టుల ఎడల నిర్దాక్షిణ్యంగా అణచివేత విధానం ద్వారా వారిపై అనేక కుట్రకేసులు బనాయించడం.
2. కమ్యూనిస్టు నాయకులను మీరట్ కుట్ర కేసులో యిరికించి వారిని జాతీయ ఉద్యమం నుంచి వేరుచేసి కార్మిక ఉద్యమాన్ని చావుదెబ్బ తీయడం.

RRAOU

వీటికితోడు కార్మిక ఉద్యమానికి నాయకత్వం లోపించడం మరియు కమ్యూనిస్టులు కాంగ్రెసు పార్టీని ఒక బూర్జువ పార్టీగా ప్రకటించి వారిని సామ్రాజ్యవాదుల తొత్తులుగా ప్రకటించి వారితో సంబంధాలు తెగ తెంపులు చేసికోవడం.

22.4.2 రైతాంగ ఉద్యమాల ఆవిర్భావం

రైతుల పోరాటాన్ని సమర్థించడంలో, నిర్వహించడంలో, కాంగ్రెస్ వైఫల్యాలవల్ల కొంతమంది ఉత్సాహకార్యకర్తలు నూతన సిద్ధాంతాలపట్ల ఆకర్షితులైనారు. జమీందారి పద్ధతిని రద్దుచేయాలని స్వామి వివేకానంద 1922లో కోరగా, 1925లో బాబా రామచంద్ర **"లెనిన్ తమప్రియతమ నాయకుడని"** పలికాడు. మధ్య తరగతి నాయకులతో ప్రభావితమైన కాంగ్రెస్, రైతు ఉద్యమాలను కొంత నిర్లక్ష్యం చేసింది. అయినా, ఆచార్య రంగా వంటి కొందరు నాయకులు **"కిసాన్ ఉద్యమాలను"** నడిపించారు. ఆంధ్రదేశంలో భూమిశిస్తు పెంపును వారు వ్యతిరేకించారు.

భారతదేశంలోని సామాన్య ప్రజలు పేదలు. వారి జీవన విధానంలో ఎట్టి మార్పులేదు. జనాభా పెరుగుదల విపరీతంకాగా, వ్యవసాయ దిగుబడి యథాతథంగానే ఉండిపోయింది. 1920లో బొంబాయి, మద్రాస్ రాష్ట్రాలలో భూమిశిస్తును పునఃపరిశీలించవలసి వుంది. నూలు మిల్లులలో, జనపనార మిల్లులలో, రైల్వే కార్ఖానాలలో వేతనాల తగ్గింపు, కొన్ని ఉద్యోగాల రద్దువల్ల, కార్మికులు ఇబ్బంది పాలైనారు. భారత నూలు మిల్లులు, లంకాషైర్ మిల్లులు, జపాన్ దిగుమతుల పోటీని ఎదుర్కోవడం కష్టమైంది. బడుగు వర్గాలలో అశాంతి ఏర్పడింది. స్థానికంగా బ్రిటీష్ పాలనా విధానం, వారి దోపిడీ పద్ధతుల పట్ల, రంపచోడవరంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో వెనుకబడిన తెగలవారు చేసిన పోరాటం, నాటి అసంతృప్తికి ఒక నిదర్శనం. సామాన్య ప్రజలు గాంధీగారి నాయకత్వంలోను, వారి సహాయ నిరాకరణోద్యమంలోను, విశ్వాసం కలిగి వున్నారు. దానివల్ల, తమ పరిస్థితులు మెరుగుకాగలవని ఆశించారు. 1920లో రాజస్థాన్ తదితర ప్రాంతాలలో, భూస్వామ్య వ్యతిరేక రైతు పోరాటాలు జరిగాయి. 1925 మే నెలలో అల్వార్ సంస్థానంలో రైతులు సత్యాగ్రహం చేసారు. అక్కడ భూమిశిస్తు 50 శాతం పెంచగా, దానికి వ్యతిరేకంగా జరిగిన రైతుల తిరుబాటులో చాలా మందిని చంపివేసారు. 150 మంది చనిపోగా, 600 మంది గాయపడినారు. కాంగ్రెస్ పార్టీ ఈ సంస్థాన విషయాలలో పెద్దగా జోక్యం చేసుకోలేదు.

22.4.3 మీరట్ కుట్రకేసు

1929 సం॥ నాటికి బ్రిటీష్ ప్రభుత్వం జాతీయోద్యమంపై కమ్యూనిస్టులు మరియు కార్మిక ఉద్యమ ప్రభావాన్ని నిరోధించాలనే కృతనిశ్చయానికి వచ్చింది. 1929 మార్చి 29వ తేదీన మెరుపుదాడులు నిర్వహించి, కమ్యూనిస్టు మరియు కార్మిక నాయకులందరినీ అదుపులోకి తీసికోవడం జరిగింది. వారితోపాటు భారతదేశంలో కార్మిక ఉద్యమ పురోగతి పరిశీలించేందుకు వచ్చిన బ్రిటీష్ కమ్యూనిస్టు నాయకులైన ఫిలిప్‌స్ప్రాట్, బ్రాడ్లీ, హచిన్‌సన్‌లు కూడా వున్నారు. ఈ చర్య కార్మిక ఉద్యమాన్ని నాశనం చేయడం మరియు జాతీయోద్యమంలో కమ్యూనిస్టులను ఏకాకులను చేయడంగా కనిపిస్తుంది.

నిర్బంధంలోకి తీసికొన్న కార్మిక, కమ్యూనిస్టు నాయకులందరిని విచారణ నిమిత్తం మీరట్ తీసికొని వెళ్లారు. దీనినే చారిత్రాత్మకమైన 'మీరట్' కుట్రకేసుగా వర్ణిస్తారు. విచారణ దీర్ఘకాలం కొనసాగింది. నాయకులందరూ దోషులుగా ప్రకటించి వారికి ఖైదు శిక్షలు విధించారు. నేరారోపణ చేయబడిన వారందరికీ, అన్ని వర్గాలకు చెందిన భారతజాతీయ నాయకుల సానుభూతి లభించడం విశేషం. నేరారోపణ చేయబడిన వారితరపున పండిత్ నెహ్రూ, కె.యన్. కట్జూ, అన్సారీ, యమ్.సి. చాగ్లా వాదించారు. మహాత్మాగాంధీ మీరట్ కుట్ర కేసులో నిర్బంధించిన నాయకులందరిని కలిసి కోవడం జరిగింది. మీరట్ కుట్రకేసు విచారణ గురించి పండిట్ నెహ్రూ ఈ విధంగా వ్యాఖ్యానించారు.

BRAOU

'మీరట్ కుట్రకేసు కార్మికోద్యమంపై బ్రిటీష్‌వారు ప్రారంభించిన దాడి యొక్క తొలిదశ" మీరట్ కుట్రకేసు విచారణవల్ల కమ్యూనిస్టులకు మనదేశంలో మంచి ప్రచారం లభించింది. అందుచేత మీరట్ కుట్రకేసు ఫలితంగా, భారతదేశంలో కమ్యూనిజానికి పటిష్టమైన స్థానం లభించింది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. స్వరాజ్య పార్టీ లక్ష్యమేమిటి?

.....

.....

.....

.....

2. మీరట్ కుట్రకేసులో నిందితులెవరు?

.....

.....

.....

.....

3. కకోరి కేసుతో సంబంధమున్న విప్లవవాదులెవరు?

.....

.....

.....

.....

22.5 మత కలహాలు

1920 తరవాత మత సంస్థలు పునరుజ్జీవనం పొందాయి. 1924లో జిన్నా ముస్లింలీగ్‌ను స్థాపించగా, దానికి ప్రతిగా హిందువులకు ప్రాతినిధ్యం వహించే **'హిందూ మహాసభ'** ఏర్పడింది. ప్రథమంలో 'హిందూమహాసభ' హిందూమతంలోని బాల్యవివాహాలు, అస్పృశ్యత మొదలైన దురాచారాలను నిర్మూలించే సాంఘిక వ్యవస్థగా స్థాపించబడి, పిదప 'ముస్లింలీగ్'కు ప్రతిగా, రాజకీయ వ్యవస్థగా రూపొందింది. ఈ కాలంలో ఎన్నో మతకలహాలు చెలరేగాయి. పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రంలోని కోహత్‌లో జరిగిన మతసంఘర్షణ అతిదారుణమైనది. వీటినిగూర్చిన వివరాలు, 26వ పాఠంలో వివరింపబడినాయి. ప్రముఖ జాతీయ నాయకులు కూడా, మతప్రాతిపదికపై విడిపోయారు.

హిందూ ముసల్మాన్ ఐక్యతను గూర్చి పదేపదే నొక్కిపలికిన గాంధీజీ, పరిస్థితులను మెరుగు పరచడానికి ప్రయత్నాలు చేసాడు. అమానుష మత కలహాలకు ప్రాయశ్చిత్తంగా, 1924 సెప్టెంబర్ నెలలో గాంధీజీ, మౌలానా మహమ్మద్ అలీ గృహమునందు, 21 రోజులపాటు నిరాహారదీక్ష కొనసాగించాడు. అయినా, వారి ప్రయత్నాలు ఫలించలేదు. మొత్తం మీద రాజకీయ స్తబ్ధత ఏర్పడింది. గాంధీగారు రాజకీయాలకు దూరంగా వుండిపోయారు. స్వరాజ్యపార్టీ ముక్క చెక్కలయింది. మతదురహంకారం ప్రజ్వరిల్లింది. "నా ఆశ ప్రార్థనలోనే కలదు - ప్రార్థనయే దీనికి సమాధానం" అని, 1927 సెప్టెంబర్ నెలలో గాంధీజీ నిరాశ వ్యక్తం చేశాడు. దేశ పరిస్థితి అంధకార బంధురంగా తోచింది.

BRAOU

22.6 సైమన్ కమిషన్

ఆ చీకటిలోనే 'జాతీయతత్వం' అనే వెలుగు, నెమ్మదిగా వుంది. భారతదేశంలో రాజ్యాంగ సంస్కరణలను గూర్చి సిఫారసు చేయమని, ఆంగ్ల ప్రభుత్వం సైమన్ సంఘాన్ని నియమించింది. దీనితో భారతజాతి తిరిగి మేలుకుంది. స్వాతంత్ర్య సమరంలో మరో అధ్యాయం ప్రారంభమైంది.

1927 నవంబర్ నెలలో ఆంగ్ల ప్రభుత్వం, రాజ్యాంగ సంస్కరణలను గూర్చి పరిశీలించమని, ఒక ఉన్నత స్థాయీసంఘాన్ని నియమించింది. దీని అధ్యక్షుడు, జాన్ సైమన్. ఈ సంఘం ఆయన పేరిట సైమన్ సంఘంగా పేరు పొందింది. భారతదేశ రాజ్యాంగ సంస్కరణలకై నియమింపబడిన ఈ సంఘంలో, సభ్యులు యావత్తూ ఆంగ్లేయులు కావడం విడ్డూరం. భారతీయులెవరికీ ఈ సంఘంలో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం, జాతీయ కోపకారణమైంది. భారతీయులు స్వయం పాలనకు అర్హులా, కాదా అనే నిర్ణయం విదేశీయులు చేయడం, భారత జాతికి అవమానంగా తలంచబడింది. ఇది, స్వయం నిర్ణయాధికారాలకు విరుద్ధం. సైమన్ సంఘ నియామకాన్ని వివిధ వర్గాలు వ్యతిరేకించాయి. మద్రాస్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్షత వహించిన డాక్టర్ అన్సారీ, సైమన్ సంఘాన్ని "అన్ని రకాలుగా, అన్ని చోట్లా" బహిష్కరించవలెనని కోరాడు. ఈ నిర్ణయాన్ని, ముస్లింలీగ్, హిందూ మహాసభలు కూడా సమర్థించాయి. సైమన్ సంఘనియామకం తాత్కాలికంగానైనా, దేశంలోని వివిధ వర్గాలను కలిపింది. సైమన్ సంఘాన్ని అన్నిచోట్లా బహిష్కరించారు. 'సైమన్ వెనక్కి వెళ్ళిపో' అనే నినాదం ప్రతిచోట వినిపించింది. అయినా, సంఘం పలు ప్రదేశాలను సందర్శించి, సాక్ష్యాలను సేకరించి, నివేదిక సమర్పించింది.

22.7 నెహ్రూ నివేదిక, 1928

ఆంగ్ల ప్రభుత్వ చర్యను సవాలుగా స్వీకరించి, ప్రముఖ జాతీయ నాయకులు సర్వామోదయోగ్యమైన రాజ్యాంగం నొకదానిని రూపొందించవలెనని సంకల్పించారు. ఐక్యతకు చిహ్నంగా, ముస్లింలీగ్ 'సంయుక్త నియోజక వర్గాల' సిద్ధాంతాన్ని ఆమోదించింది. ముసల్మాన్‌లకు కొన్ని ప్రత్యేక సీట్లు కేటాయించమని కోరినారు. ఢిల్లీ, పూనాలలో సమావేశమైన అన్ని రాజకీయ పక్షాల సమావేశం, రాజ్యాంగ రచనకై ఒక ఉపసంఘాన్ని నియమించింది. ఈ ఉపసంఘానికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షులు. అలీ ఇమామ్, తేజ్ బహదూర్ సప్రూ, సుభాస్‌చంద్ర బోస్ తదితర సభ్యులు. 1928 ఆగస్టులో ఉపసంఘం తన నివేదికను సమర్పించింది. అది **నెహ్రూ నివేదిక**'గా ప్రసిద్ధి చెందింది. 'స్వయం పాలన' తక్షణమే ఇవ్వవలెనని సంఘం కోరింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికపై భారతదేశాన్ని సంయుక్త రాజ్యంగా ప్రకటించవలెనని, కార్యనిర్వాహక వర్గం శాసనసభకు బాధ్యత వహించవలెనని, మత, అల్ప సంఖ్యాక వర్గాలకు పదేళ్ళపాటు రిజర్వేషన్లు కొనసాగాలని, వారు సిఫారసు చేశారు.

1928 డిసెంబర్ కలకత్తాలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో, నెహ్రూ నివేదిక సమర్పించబడింది. నాటికి సైమన్ సంఘానికి వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన ఉత్సాహం చల్లబడింది. ముస్లింలీగ్, హిందూ మహాసభ ఎన్నో అభ్యంతరాలను లేవదీసాయి. తిరిగి మత ప్రాతిపదికపై విభేదాలు చెలరేగినాయి. జిన్నా ముస్లింలీగ్ తరపున 14 సూత్రాలు కలిగిన కొర్కెల పత్రాన్ని ప్రకటించాడు. ముసల్మాన్‌లకు ప్రత్యేక నియోజక వర్గాలు కావలెనని, కేంద్ర శాసనసభలో మూడో వంతు సీట్లు ఇవ్వవలెనని, బెంగాల్, పంజాబ్ శాసనసభలలో జనాభా ప్రాతిపదికపై తమకు సీట్లు కేటాయించాలని పట్టుబట్టారు. నెహ్రూ నివేదిక ముసల్మాన్‌లకు అనుకూలంగా రూపొందించారని, హిందూ మహాసభ విమర్శించింది. నెహ్రూ నివేదిక ఈ రీతిగా విఫలంకాగా, మత వర్గాలు తిరిగి జాతీయ ఐక్యతకు గొడ్డలిపెట్టుగా పరిణమించాయి.

BRAOU

22.8 విప్లవ కార్యక్రమాల పునరుద్ధరణ

1922లో సహాయనిరాకరణోద్యమ నిలుపుదల, గాంధీగారి నిర్బంధం, విప్లవ చర్యలకు దారితీసింది. కాంగ్రెస్ పద్ధతులతో నిరాశ చెందిన కార్యకర్తలు, విప్లవ కార్యక్రమాలపట్ల ఆకర్షితులైనారు. **'ఆత్మశక్తి', 'సారధి'** మొదలైన బెంగాల్ పత్రికలు, బెంగాల్ లోని పాత విప్లవవాదుల సాహసాలను, త్యాగాలను గూర్చిన వ్యాసాలు ప్రచురించాయి. **'అనుశీలన్', 'యుగంతర సమాజ్'** మొదలైన విప్లవ సంఘాలు, తమ కార్యకలాపాలను పునరుద్ధరించాయి. అధికారులను చంపడం, బహిరంగ దోపిడీలు చేసే వర్గానికి సూర్యసేన్ నాయకత్వం వహించాడు. పెద్ద ఎత్తున బాంబులు తయారు చేయబడినాయి. ప్రభుత్వం కలవరం చెంది, విప్లవ కార్యకలాపాలను అదుపు చేయడానికి పెక్కుమందిని నిర్బంధించడమేగాక, నూతన శాసనాలు కూడా చేసారు. ఈ విప్లవ కార్యకలాపాలు ఒక్క బెంగాల్‌కే పరిమితం కాలేదు. ఉత్తరప్రదేశ్‌లో ఎన్నో విప్లవ సంఘాలు వెలిశాయి. 1924 అక్టోబర్ నెలలో కాన్పూర్ నందు జరిగిన సమావేశంలో, అఖిల భారత కేంద్రీయ విప్లవ సంఘం ఏర్పడింది. దీనికి, 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ సంస్థ' గా పేరుపెట్టారు. సాయుధ విప్లవం ద్వారా సమ్మేళన భారత రిపబ్లిక్‌ను స్థాపించడం, ఈ సంస్థ ధ్యేయంగా చెప్పబడింది. రామ్‌ప్రసాద్ బిస్‌మిల్ ఈ సంస్థను సమర్థవంతంగా రూపొందించినాడు. ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టవలెనని నిశ్చయించాడు. 1925 ఆగస్ట్ నెలలో ఉత్తర రైల్వేలో కాకోరివద్ద ఒక రైలులోని గార్డు పెట్టెనుంచి ధనాన్ని కొల్లగొట్టడం, వారు చేసిన దోపిడీలలో ముఖ్యమైంది. ప్రభుత్వం ఈ కుట్రను కనిపెట్టి, నాయకులను విచారించి, శిక్షలు విధించింది. నలుగురుకి మరణ శిక్ష, మరో నలుగురికి జీవితాంత దేశాంతరం విధింపబడింది. *"బ్రిటీష్ సామ్రాజ్య పతనాన్ని నేను కోరుతున్నాను"* అని రామ్‌ప్రసాద్ ఉరికంబంపై పలికాడు. అతని స్నేహితుడు "వందేమాతరం" జపిస్తూ జైలుకు వెళ్ళాడు. అష్ఫరుల్లా అనే మరో నిందితుడు, ఉరిశిక్ష అమలు పరచేముందు ఇలా పలికాడు *"నేను భారతదేశాన్ని స్వేచ్ఛా రాజ్యంగా చేయవలెనని తలచాను. ఈ ప్రయత్నం నా చావుతో ముగియదు"*.

22.8.1 బెంగాల్

1927 తరువాత విప్లవ కార్యక్రమాలలో కొంత స్తబ్ధత ఏర్పడింది. ప్రభుత్వం కూడా కొన్ని శాసనాలను సడలించింది. నిర్బంధితులను విడుదలచేసింది. ఇది జరిగిన పక్షం రోజులలోనే, చిట్టాగాంగ్ ఆయుధాగారపు దోపిడీ జరిగింది. ఇది, బహుశా విప్లవ కార్యకలాపాలన్నింటిలోను, అతిసాహసవంతమైనది. ఇట్టి దోపిడీలు దేశ వ్యాప్తంగా, ఒకే సమయంలో జరుపడానికి వ్యూహం పన్నారు.

చిట్టాగాంగ్ దోపిడీకి సూర్యసేన్ నాయకుడు. దోపిడీకి సర్వసైనిక సన్నద్ధాలు చేయబడినాయి. విప్లవ వాలంటీర్లను నాలుగు విభాగాలు చేసారు. వారిలో రెండు విభాగాలు ఆయుధాగారాన్ని దోచుకొనుచుండగా, మరోవర్గం క్లబ్‌లోని ఐరోపా వారిని హత్య చేయగలగాలి. తదితర విభాగాలు టెలిఫోన్ కార్యాలయాన్ని, టెలిగ్రాఫ్ తీగలను ధ్వంసం చేయగలగాలి. ఆయుధాగారాలు రెండూ విప్లవవాదుల వశమైనాయి. కాపలాదారులు కాల్చి చంపబడ్డారు. విప్లవవాదులు రివాల్వర్లు, రైఫిళ్ళు, మందుగుండు సామగ్రి తీసుకువెళ్ళారు. కాని, తుపాకిగుళ్ళను తీసుకువెళ్ళడం మరచారు. టెలిగ్రాఫ్ కార్యాలయంకూడా చాలావరకు ధ్వంసమైంది. సూర్యసేన్ అధ్యక్షుడుగా విప్లవవాదులు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పరచారు. ఆంగ్ల ప్రభుత్వం ప్రతిచర్యలు ప్రారంభించింది.

విప్లవవాదులు అడవులలోనికి పారిపోయారు. కొందరు టెలిగ్రాఫ్ తీగలు త్రెంచడానికి, రైళ్ళను పడగొట్టి, రైళ్ళరాకపోకలను విచ్ఛేదం చేయడానికి ప్రయత్నించారు. తిండిలేకుండా విప్లవవాదులు అడవులలో తిరుగాడ వలసి వచ్చింది. 'మెషిన్‌గన్'లతో సైనికులు వారిని వెంటాడారు. రెండువైపుల ఎందరో చనిపోయారు. సూర్యసేన్, మరికొందరు ఎన్నో రోజులు తప్పించుకొని తిరిగారు. జిల్లా అంతా గాలించినా, సూర్యసేన్ దొరకలేదు. చిట్టాగాంగ్ కుట్ర, విప్లవ దాడులలో యువకులను ఎక్కువగా ఆకర్షించింది. 1930లో కలకత్తాలోని యుగంతర్ పార్టీ నాయకులు, సాయుధ విప్లవచర్యలకు ప్రణాళిక వేసారు. బాంబుల తయారీకి పథకాలు పన్నారు. 1930-33

BRAOU

మధ్య 20 హత్యలు, 10 చోట్ల బాంబులు వేయడం, ఒక సాయుధ దోపిడీ, 8 బాంబు ప్రేలుడులు జరిగాయి. న్యాయ, పోలీస్ శాఖకు చెందిన యూరోపియన్ అధికారులు ఎక్కువగా హత్య చేయబడ్డారు. 1932 నాటికి, చిట్టాగాంగ్ దోపిడీ విచారణ ముగిసి, 14 మందికి యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష విధింపబడింది. ఎన్నో సాహసకృత్యాలు చేస్తూ తప్పించుకు తిరిగిన సూర్యసేన్ పట్టుబడి, 1933 ఫిబ్రవరిలో ఉరితీయబడినాడు.

22.8.2 లాహోర్ కుట్రకేసు

పోలీసుల కఠిన చర్యలు, నాయకుల నిర్బంధంవల్ల, హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ కార్యకలాపాలు, బెంగాల్‌లోని కాకోరీ కేసు పిదప, చాలావరకు ఆగిపోయాయి. విప్లవ కార్యకలాపాలను పునరుద్ధరించడానికి, చంద్రశేఖర్ ఆజాద్ తీవ్ర ప్రయత్నాలు చేసాడు. లాహోర్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా వున్న సాండర్స్‌ను హత్యచేయడం, టెర్రరిస్ట్ పనులలో ప్రధానమైనది. సైమన్ సంఘం లాహోర్ రైల్వేస్టేషన్‌లో దిగినపుడు, సాండర్స్ ఆజ్ఞలపై పోలీసులు లాలా లజపతిరాయ్‌ను కొట్టగా, ఆయన కొద్దికాలం పిదప, మరణించాడు. దీనికి ప్రతీకారంగా, భగత్‌సింగ్ సాండర్స్‌ను కాల్చి చంపి, పారిపోయాడు. విప్లవకారులను వెదకే మిషపై ప్రభుత్వాధికారులు, పోలీసులు లాహోర్ ప్రజలను నానా హింసలు పెట్టినారు. విప్లవవాదులు హింసాత్మక చర్యలు చేసి పారిపోవడంవల్ల, తాము బాధపడవలసి వస్తుందని సామాన్య ప్రజలలో నిరసన భావం ఏర్పడింది. అట్టి భావాన్ని పోగొట్టుటకై, భగత్‌సింగ్, అతని మిత్రుడు బతుకేశ్వరదత్ అసెంబ్లీలో ప్రవేశించి, బాంబులు విసిరారు. అరెస్టుకావడం వారి ధ్యేయం.

అసెంబ్లీలో బాంబులు వేసిన పిదప జరగిన పరిశోధనలో, లాహోర్‌లో విప్లవవాదులు స్థాపించిన ఒక పెద్ద బాంబులు తయారు చేసే కర్మాగారం కనిపెట్టబడింది. అందులో ఏడువేల బాంబులకు సరిపడే సామగ్రి వుండింది సహరాన్‌పూర్‌లో అట్టిదే మరొక కర్మాగారం కనిపించింది. విప్లవవాదులను అరెస్టుచేసి, వారిపై లాహోర్ కుట్రకేసు బనాయించబడింది. విచారణ జరుగుతున్న సందర్భంలో, నిందితులు నిరాహారదీక్ష చేయడం, ఒక ముఖ్య సంఘటన. హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్, లాహోర్ కుట్రకేసుతో పూర్తిగా భగ్నమైంది. చంద్రశేఖర్ ఆజాద్ పారిపోయి, సాయుధ విప్లవ ప్రయత్నాలు చేసాడు. పోలీసులు అతడిని పట్టుకొనడానికి సర్వప్రయత్నాలు చేసారు. చివరకు 1931 ఫిబ్రవరిలో, వారున్న స్థావరాన్ని ముట్టడించి, కాల్చి చంపివేసారు. ఈ రీతిగా ఒక విప్లవ నాయకుని జీవితం ముగిసింది. దీనితో సంఘ రహస్య కార్యకలాపాలు ముగిసాయి. 1931 మార్చి 23వ తేదీన ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, భగత్‌సింగ్, రాజగురువులను ఉరితీసారు. చనిపోయే ముందు వారు ముగ్గురు జైలు అధికారికి సంయుక్తంగా ఒక లేఖవ్రాస్తూ, *"అనతి కాలంలోనే అంతిమ యుద్ధం ప్రారంభం కాగలదు. అది నిర్ణయాత్మకమైనది కాగలదు. ఈ పోరాటంలో మేము పాల్గొన్నందుకు గర్విస్తున్నాం"* అని పలికినారు.

ఈ విప్లవవీరుల త్యాగం యువకులను ఉత్తేజితుల చేసింది. కరాచీలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో గాంధీగారు కూడా, వారి వీరావేశం ముందు తలొగ్గవలసి వచ్చింది. ఈ విప్లవ శక్తులకు స్పష్టమైన సిద్ధాంతాలు ఉండడం గమనార్హం. *"బలప్రయోగం దుర్మార్గపు పనులకు నియోగించిన, అది హింస కాగలదు. కాని, న్యాయమైన పనులకు దానిని వాడినపుడు, అది నైతికంగా సమర్థనీయం, ఆవశ్యకం"* అని వారు భావించారు. విప్లవాన్ని గూర్చిన సమగ్రమైన అవగాహన కూడా వారికి గలదు. విప్లవం యొక్క నిర్మాణాత్మక, వినాశక ప్రవృత్తులను రెండింటినీ ఆకళింపుచేసుకున్నారు. బ్రిటీష్ పాలనను అంతమొందించిన పిదప, భారతదేశాన్ని సామ్యవాద పునాదులపై నిర్మించాలని వారు భావించారు. 1934తో విప్లవ శక్తులు నశించిపోలేదు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో అవి పునరుజ్జీవనం పొందాయి.

వామపక్షాల ఆవిర్భావం, విప్లవ శక్తుల విజృంభణ, భారత స్వాతంత్ర్య పోరాటంలో అంతర్భాగమైన రెండు ముఖ్య ప్రవాహాలుగా చెప్పదగును.

DRAOU

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. సైమన్ కమిషన్ ను భారతీయులు బహిష్కరించడానికి కారణమేమి?

.....

.....

.....

.....

2. నెహ్రూ నివేదిక ప్రాముఖ్యత తెల్పండి?

.....

.....

.....

.....

22.9 సంగ్రహంగా

1. 1922లో, శాసనసభలద్వారా, స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించడానికి, చిత్తరంజన్ దాస్ స్వరాజ్ పార్టీ నెలకొల్పినాడు.
2. 1920 ప్రాంతంలో వామపక్ష వర్గాలు ఏర్పడ్డాయి. అప్పుడే ఏర్పడిన కమ్యూనిస్ట్ పార్టీకి, 1929లో జరిగిన మీరట్ కుట్ర కేసువల్ల ప్రజల సానుభూతి లభించింది.
3. 1924లో, హిందూస్థాన్ రిపబ్లికన్ సంఘం ఏర్పాటుతో విప్లవ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ కాలంలో సూర్యసేన్, రామ్‌ప్రసాద్, అన్వరుల్లా, భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, ముఖ్యమైన విప్లవవాదులు. బ్రిటీష్ వారిని దేశం నుంచి పారద్రోలి భారతదేశంలో సమసమాజ, గణతంత్రరాజ్యాన్ని నెలకొల్పడమే వారి ముఖ్య లక్ష్యం.
4. 1922-28, మధ్యకాలంలో, దేశంలోని అనేక ప్రదేశాలల్లో తరచుగా మతకలహాలు చెలరేగినాయి. మతసామరస్యాన్ని నెలకొల్పడానికి గాంధీ సత్యాగ్రహం చేశాడు.
5. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం, భారత జాతీయోద్యమానికి నూతన జీవాన్ని కల్గించింది.

22.10 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. శాసనసభల ద్వారా దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడడమే స్వరాజ్యపార్టీ లక్ష్యం.

2) కార్మిక నాయకులు, కమ్యూనిస్ట్ నాయకులు, మీరట్ కుట్రకేసులో నిందితులు.

3) కాకోరి కేసుతో సంబంధమున్న విప్లవవాదులు, రామ్‌ప్రసాద్ బిస్మిల్, అన్వరుల్లా ఖాన్.

II 1) సైమన్ కమిషన్‌లో ఒక్క భారతీయుడు కూడా లేనందున, సైమన్ కమిషన్‌ను భారతీయులు వ్యతిరేకించారు.

2) నెహ్రూ నివేదిక, మాంటేగ్ భారతీయులకు చేసిన సవాలుకు సరియైన జవాబు. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులు తయారు చేసిన తొలి రాజ్యాంగ నివేదిక, నెహ్రూ రిపోర్ట్. అది స్వతంత్ర భారత రాజ్యాంగానికి చిత్తు ప్రణాళిక. అందువల్ల ఆ నివేదికకు ప్రాముఖ్యత ఉంది.

BRAOU

22.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయండి.

1. స్వరాజ్ పార్టీ పుట్టుకను, కాంగ్రెస్‌తో దాని సంబంధాలను వివరించండి.
2. జాతీయోద్యమంలో వామపక్షం ఆవిర్భావాన్ని తెలిపి, దాని రాజకీయ కార్యకలాపాలను పరిశీలించండి.
3. ఆశయాలు, పద్ధతుల సంబంధంగా, 20వ శతాబ్ది భారతదేశంలోని తీవ్రవాద కార్యకలాపాలను చర్చించి, స్వాతంత్ర్య సంగ్రామంపై వాటి ప్రభావాన్ని పరిశీలించండి.

II ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయండి.

1. స్వరాజ్య పార్టీ విధానాలు, కార్యక్రమాల గురించి రాయండి.
2. సైమన్ కమిషన్ ఎందుకు ఏర్పడింది? దానిపట్ల భారతీయుల ప్రతిస్పందన ఎలా వుండింది?
3. నెహ్రూ నివేదిక గురించి క్లుప్తంగా రాయండి.
4. 1920 తర్వాత బెంగాల్ లోని విప్లవవాదుల కార్యక్రమాలను సమీక్షించండి.

22.12 ఉపయుక్త గ్రంథాలు

1. Judith Brown : *The Emergence of Mahatma Gandhi*
2. Louis Fisher : *Mahatma Gandhi*
3. Majumdar R.C. (ed) : *The struggle for Freedom, Bharatiya Vidya Bhavan series, Vol. X*
4. Majumdar R.C. : *Three phases of the India's Struggle for Freedom*
5. Maulana A. Azad : *India Wins Freedom*
6. Tara Chand : *History of the Freedom Movement in India, Vol.3*
7. Readers Digest (Public) : *Profiles of M.K. Gandhi*
8. Sumit Sarkar : *Modern India*
9. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం*
10. ఝాన్సీ లక్ష్మి, పాటిబండ; & వైదేహి, అల్లాడి : *భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయభాగం* తెలుగు అకాడమి ప్రచురణ
11. వైదేహి, అల్లాడి : *భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (1858-1947)*

BRAOU

భాగం - 23 శాసనోల్లంఘనోద్యమం

విషయక్రమం

23.0 లక్ష్యాలు

23.1 పరిచయం

23.2 లాహోర్ కాంగ్రెస్

23.3 శాసనోల్లంఘనోద్యమం, 1930

23.3.1 ఉప్పు సత్యాగ్రహం, 1930

23.3.2 ఉద్యమ అణచివేత విధానం

23.4 మొదటి రౌండ్ టేబుల్ సమావేశం, 1930

23.5 గాంధీ-ఇర్విన్ ఒప్పందం, 1931

23.6 రెండవ రౌండ్ టేబుల్ సమావేశం, 1931

23.7 మూడవ రౌండ్ టేబుల్ సమావేశం, 1932

23.8 శాసనోల్లంఘన అంతిమ ఘట్టం

23.9 శాసనోల్లంఘనోద్యమ అంతం

23.10 సంగ్రహంగా

23.11 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

23.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

23.13 ఉపయుక్త గ్రంథాలు

23.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి :

1. 1929 లాహోర్ కాంగ్రెస్ సమావేశపు ప్రాముఖ్యత
2. ఉప్పుసత్యాగ్రహం
3. ఇర్విన్ ఒడంబడిక
4. రౌండ్ టేబులు సమావేశాలు
5. శాసనోల్లంఘనోద్యమపు చివరి దశ

23.1 పరిచయం

1930లో ప్రారంభమైన ఉప్పుసత్యాగ్రహం, భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో, ఒక ముఖ్యమైన ఘట్టం. శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించాలని, చరిత్రాత్మకమైన లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో నిర్ణయించబడింది. శాసనోల్లంఘనోద్యమంలో లక్షలాది భారతీయులు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో, శాసనోల్లంఘనోద్యమం, ఖండ వ్యాప్తి చెందిన విదేశీ ప్రభుత్వ వ్యతిరేక ప్రజాఉద్యమంగా మారింది. గాంధీ-ఇర్విన్ ఒప్పందంతో, ఉప్పు సత్యాగ్రహం ఆగిపోయింది.

BRAOU

23.2 లాహోర్ కాంగ్రెస్

జాతీయోద్యమంలో 1929వ సంవత్సరం మరో మైలురాయి. 1929 జులై నెలలో కాంగ్రెస్ వాదులు తమ శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేయవలసిందిగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసింది. ఈ తీర్మానం సర్వసాధారణ సభ ముందు ప్రవేశ పెట్టబడగా, శాసనసభల బహిష్కరణను గాంధీగారు గట్టిగా బలపరచారు. మోతీలాల్ నెహ్రూ కూడా వారిని సమర్థించారు. తిరిగి, గాంధీజి రాజకీయాలలో చురుకుగా పాల్గొనగలరని విదితమైంది. ఆయన సహాయ నిరాకరణోద్యమం నాటికే ప్రజలను ఆకట్టుకుంది.

1920లో ఇంగ్లాండ్ సాధారణ ఎన్నికలలో లేబర్ పార్టీ విజయం సాధించి, రామ్‌సే మాక్ డొనాల్డ్ ప్రధాన మంత్రి అయ్యాడు. రాజ్యాంగ ప్రగతిని గూర్చి చర్చలు జరిపేందుకై, వారు భారత వైస్రాయి లార్డ్ ఇర్విన్‌ను లండన్ రావలసిందిగా కోరారు. లార్డ్ ఇర్విన్ భారతదేశానికి తిరిగి వచ్చిన పిదప, సైమన్ సంఘ సిఫారసులను ప్రభుత్వం అంగీకరించిందని, ఈ సిఫారసులను చర్చించడానికి త్వరలో సమావేశం ఏర్పాటు చేయగలమని ప్రకటించారు. *"1917 ప్రకటనలో చెప్పబడిన భారత రాజ్యాంగ ప్రగతి, స్వయంపాలనా ప్రతిపత్తికి పరిమితం కాగలదని, బ్రిటీష్ రాజ్యాధికారం తరపున స్పష్టం చేయమని నన్ను ఆదేశించారు"*, అని ఇర్విన్ ప్రకటించాడు. ఈ ప్రకటనను ఇంగ్లండ్‌లోని కన్సర్వేటివ్, లేబర్ పార్టీలు రెండూ విమర్శించాయి. ఈ విమర్శవల్ల, ప్రభుత్వం వెనుకంజ వేయవలసి వచ్చింది. లేబర్ పార్టీకి పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ లేదు. నెహ్రూ తదితర కాంగ్రెస్ నాయకులు ఇర్విన్‌ను కలసి, స్వయంపాలనా ప్రతిపత్తి ఇవ్వగలమనే నిర్దిష్టమైన హామీ ఇవ్వవలసిందిగా కోరినారు. ఇర్విన్ తన అశక్తత వెల్లడించాడు.

ఈ పరిస్థితుల్లో 1929 డిసెంబర్ 29వ తేదీన అఖిల భారత కాంగ్రెస్, లాహోర్ నందు ఉద్రిక్త వాతావరణంలో సమావేశమైంది. జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. ఆయన యువకుడు. చైతన్యవంతుడు. ఆయన అధ్యక్షతన సమావేశానికి ఒక వింత సొగసునందించింది. సమావేశం ఒక సుదీర్ఘ తీర్మానాన్ని ఆమోదించింది. రాజ్యాంగ ప్రగతికై వైస్రాయి చేసిన కృషిని అభినందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో దానివల్ల, ఎట్టి లాభం చేకూరదని అభిప్రాయం వ్యక్తం చేయబడింది, కాన, ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావలసిన పనిలేదని భావించారు. మోతీలాల్ నెహ్రూ నివేదికకు(1928) కూడా కాలదోషం పట్టిందని, నాటి నుంచి కాంగ్రెస్‌వాదులు భారతదేశ సంపూర్ణ స్వరాజ్య సాధనకై కృషిచేయవలెనని తీర్మానించినారు. ఈ కృషిలో ప్రథమ ఘట్టంగా, కాంగ్రెస్‌వారు కేంద్ర, రాష్ట్ర శాసనసభల నుంచి రాజీనామా చేయవలెనని, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ రానున్న ఎన్నికలలోనైనా పాల్గొనకూడదని స్పష్టం చేయబడింది. కాంగ్రెస్ వాదులు నిర్మాణాత్మక కార్యక్రమాలలో పాల్గొంటూ, అవసరమనుకున్నప్పుడు ఏ క్షణంలోనైనా పన్నుల నిరాకరణతో సహా ఎలాంటి శాసనోల్లంఘన ఉద్యమానికైనా సంసిద్ధులు కావలెనని పిలుపునిచ్చినారు.

లాహోర్ కాంగ్రెస్ ఈ విధంగా శాసనోల్లంఘనోద్యమాన్ని పునరుద్ధరించింది. దేశవ్యాప్తంగా జరిగిన హింసాయుత చర్యలకు బాధపడిన గాంధీజీ అట్టి చర్యలు పునరావృతం కాకుండా యువశక్తిని అహింసాయుత నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించాలని కోరుతూ, తీర్మానం చేయించాడు. 1929 డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి, కాంగ్రెస్ అధ్యక్షుడు నెహ్రూ ప్రశాంత గంభీరమైన ఊరేగింపుగా వచ్చి, స్వతంత్ర త్రివర్ణపతాకాన్ని ఎగురవేసాడు. ఈ సందర్భంగా నెహ్రూ *"విస్తృత ప్రజాసమూహం ఆనంద ఉద్వేగభరితులయ్యారు. వారిలో భారతదేశ బంగారు భవిష్యత్తును గూర్చిన నూతన ఆశలు చిగురించినాయి"* అని అన్నాడు.

లాహోర్ సమావేశంలో కాంగ్రెస్ స్వయం పాలనా ప్రతిపత్తిని వదలి, పూర్ణస్వరాజ్యాన్ని కాంక్షించింది. 1930 జనవరి 26వ తేదీన దేశమంతటా 'పూర్ణస్వరాజ్య' దినంగా జరపవలెనని, పట్టణాలలో, పల్లెలో ఆరోజున తీర్మాన ప్రతులను, ప్రజల ముందు చదువవలెనని నిర్ణయించారు. ఈ ప్రకటన సుదీర్ఘమైంది. ఆంగ్లప్రభుత్వం ఏకరీతిగా భారతదేశాన్ని ఎలా దోచుకున్నదీ తెలియజేస్తూ, భవిష్యత్ కార్యక్రమాన్ని వివరించారు. ప్రజలు

BRAOU

అహింసాయుత శాసనోల్లంఘనకు సిద్ధం కావలెనని, పూర్ణస్వరాజ్య సాధనకై కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఆదేశాలను అమలు పరచాలని కోరడమైంది. దేశమంతటా స్వాతంత్ర్యదినోత్సవాన్ని ఉత్సాహంగా జరిపారు. కాంగ్రెసేవారు తమ శాసనసభా సభ్యత్వాలకు రాజీనామా చేసారు. పెక్కుమంది నిర్బంధింపబడి, శిక్షలకు గురైనారు.

1930 ఫిబ్రవరిలో సబర్మతీలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, శాసనోల్లంఘన గూర్చిన తీర్మానం చేసింది. ఈ ఉద్యమాన్ని ప్రారంభించడానికి గాంధీజీకి అధికారమిస్తూ, ఉద్యమం పూర్తిగా అహింసా పద్ధతులపై నిర్వహించాలని స్పష్టంచేయబడింది. ప్రభుత్వంతో సహకరిస్తున్న ప్రజలందరూ ఆ సహకారాన్ని ఆపివేసి, ఈ అంతిమ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనాలని గాంధీజీ పిలుపునిచ్చాడు.

23.3 శాసనోల్లంఘనోద్యమం

శాసనోల్లంఘన తీర్మానం ఆమోదించబడిన నాటినుంచి, మహాత్మాగాంధీ ఆ ఉద్యమాన్ని ఎలా నిర్వహిస్తాడా అనే ఉత్సుకతతో ప్రజలు ఎదురు చూశారు. దేశమంతటా సంచలనం కలిగింది. గుజరాత్ పశ్చిమ కోస్తాలో వున్న 'దండి' గ్రామంలో ఉప్పు తయారు చేసి, సత్యాగ్రహం నిర్వహింపవలెనని గాంధీ నిశ్చయించాడు. బహిరంగంగా ఉప్పు శాసనాలను ఉల్లంఘింప సంకల్పించాడు. తన నిర్ణయాన్ని వైస్రాయికి తెలిపి, సంభాషణలకు రాగలనని తెలియచేసాడు. గాంధీ గారి చర్య చట్టవిరుద్ధమే కాక, శాంతి భద్రతలకు ముప్పుగా పరిణమించగలదని వ్యాఖ్యానిస్తూ వైస్రాయి సంప్రదింపులను నిరాకరించాడు.

23.3.1 ఉప్పు సత్యాగ్రహం

1930 మార్చి 12వ తేదీన గాంధీజీ తన అనుచరులతో సబర్మతీకి రెండు వందల మైళ్ళ దూరంలో వున్న 'దండి'కి, కాలినడకన బయలుదేరాడు. 'దండి' యాత్ర అద్భుతంగా సాగింది. వేలాది గ్రామస్థులు దారిపొడవునా బ్రహ్మాండమైన స్వాగతం పలికారు. ఏప్రిల్ 6వ తేదీన దండి చేరిన గాంధీజీ, వారి అనుచరులు కొంత ఉప్పు తయారుచేసి, శాసనధిక్కారం చేస్తూ, ఉప్పు తయారీకి నాంది పలికింది. ఉప్పు తయారీకి అనుకూలంకాని ప్రాంతాలలో తదితర శాసనాలను ఉల్లంఘించడం జరిగింది. విదేశీ బట్టలు, వస్తువుల బహిష్కరణకు ముమ్మర ప్రచారం సాగింది. ఇందులో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. బొంబాయి సెంట్రల్ ప్రావిన్స్‌లో భూమిశిస్తు, తదితర పన్నుల చెల్లింపు నిరాకరణోద్యమం ప్రారంభమైంది. ఉత్తర సరిహద్దు రాష్ట్రంలో గాంధీగా ప్రసిద్ధిచెందిన అబ్దుల గఫార్‌ఖాన్, అహింసాయుత ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించాడు. కొద్దికాలంలోనే, శాసనోల్లంఘనోద్యమం ఊపందుకుంది.



మహాత్మాగాంధి దండియాత్ర, మార్చ్, 1930

BRAOU

సూరత్ జిల్లాలోని దరసన వద్ద ఉప్పు కొటారు వశం చేసుకోగలనని గాంధీ ప్రకటించాడు. అక్కడకు బయలుదేరకముందే, అయనను అరెస్ట్ చేసి జైలులో వేశారు. అంతట గుజరాత్‌లోని పలు ప్రాంతాల నుంచి ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు దరసనకు బయలుదేరారు. ఉప్పు కొటారులపై దాడి చేసిన స్వచ్ఛంద సేవకులను పోలీసులు అమానుషంగా కొట్టి, జైలులో వేసారు. వాలంటీర్లు వీరోచితంగా, అహింసాయుతంగా సాగించిన ఈ పోరాటాన్ని విదేశీ పత్రికా విలేఖరులు ఎంతగానో ప్రశంసిస్తూ వ్రాసారు. శాసనోల్లంఘనోద్యమంలో ప్రదర్శింపబడిన త్యాగనిరతి, క్రమశిక్షణను గూర్చి గాంధీజీ తన ఆదర్శ సిద్ధాంతాలచే అనుచరులను ఎట్లు ప్రభావితం చేసిందీ, అమెరికా యునైటెడ్ ప్రెస్ విలేఖరి ఏబ్ మిల్లర్ వివరంగా ప్రస్తుతించాడు.

1930 ఏప్రిల్ నెలలో పికెటింగ్, నూలువడకడం చేపట్టుమని, గాంధీజీ మహిళలను కోరారు. వారి కోర్కెను మన్నించి, వేలాది మహిళలు తమ ఏకాంత వాసాన్ని విడనాడి, అరెస్టు అయ్యారు. ఈ మహిళా చైతన్యం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరచింది. భారత సామాజిక జీవనంపై గాంధీగారి ప్రభావానికి ఇది మచ్చుతునక. రోజురోజుకీ, శాసనోల్లంఘన కార్యకర్తల సంఖ్య పెరిగింది. దేశంకోసం త్యాగం చేయవలెననే భావం మరింత ఇనుమడించింది.

23.3.2 ఉద్యమ అణచివేత విధానం

ప్రథమంలో ప్రభుత్వం శాసనోల్లంఘనోద్యమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. పైగా తృణీకార భావాన్ని ప్రదర్శించింది. కాని, కొద్దికాలంలోనే ఉద్యమ ఉధృతాన్ని గమనించారు. దానిని గట్టి దెబ్బతీయాలని నిశ్చయించి, పెక్కుదమన చర్యలకు పూనుకున్నారు. వ్యక్తి స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తూ, ప్రభుత్వం 'ఆర్డినెన్స్'ల ద్వారా పెక్కు అధికారాలను సంతరించుకుంది. అత్యవసర పత్రికా చట్టంచేసి, 1930లో ధరావత్తు చెల్లింపలేదని తొమ్మిది పత్రికల ప్రచురణను నిలిపివేశారు. దేశం నలుమూలలా ఎందరో నిర్బంధింప బడినారు. దొంగతనం, దోపిడీ చేసినట్లుగా, వాలంటీర్లపై దొంగకేసులు బనాయించారు. 15వేల మంది జైలుకు వెళ్ళారు. నెహ్రూతో సహా కాంగ్రెస్ నాయకులు నిర్బంధింపబడినారు. 1930 మే నెలలో 4వ తేదీన గాంధీని అరెస్ట్ చేసారు. దేశం యావత్తూ కారాగార బంధితమైనట్లు కన్పించింది.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. 1930, 26వ జనవరి ప్రాముఖ్యత ఏమి?

.....

.....

.....

.....

2. గాంధీ, ఎప్పుడు, ఎక్కడ ఉప్పు చట్టాలను ఉల్లంఘించాడు?

.....

.....

.....

.....

23.4 మొదటి రౌండ్ టేబుల్ సమావేశం

1930 జూన్ నెలలో సైమన్ సంఘ నివేదిక ప్రచురించబడింది. నూతన రాజ్యాంగంలో వీలున్నంత వరకు, స్వయం అభివృద్ధికై వలసిన సూత్రాలను పొందుపరచాలని సిఫారసు చేయబడింది. భారత రాజ్యాంగం అంతిమ రూపంలో సమ్మేళన రాజ్యాంగంగా రూపొందవలెనని, రాష్ట్రాలకు శాంతి భద్రతలతో సహా అన్ని అధికారాలలో స్వయంపాలన ఉండవలెనని, సంఘం అభిప్రాయపడింది. అంతరంగిక భద్రతను గూర్చి, గవర్నర్‌కు

BRAOU

శాసనసభ చేసే శాసనాలను రద్దుచేసే అధికారాలను ఇవ్వాలి. రాష్ట్ర శాసన మండలులను విస్తృతం చేయాలి. దీని సభ్యులను రాష్ట్ర శాసనసభలను ఎన్నుకోగలవు. ఎగువ సభ యథాతథంగానే కొనసాగుతుంది. రాష్ట్రాల స్వయంపాలనకు భంగం రాకుండా వాటికి వనరులను కల్పించడానికై, 'రాష్ట్రనిధి' నొకదానిని ఏర్పాటు చేయాలి. కాబినెట్ మంత్రులను గవర్నర్-జనరల్ ఎన్నికచేసి నియమించాలి. ప్రభుత్వ నిజాధికారాలు అతనికే చెందుతాయి. భారత ప్రభుత్వ పాలనా నిర్వహణకు లోబడి, హైకోర్టులు పనిచేయాలి. 'సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆఫ్ ఇండియా' యొక్క సలహా మండలి అధికారాలను, సభ్యత్వాన్ని తగ్గించాలి. భారతదేశంలో ఐరోపా అధికారాలు, సైనికులు సుదీర్ఘకాలం ఉండవలసిన ఆవశ్యకత కలదు.

ఈ రాజ్యాంగం ప్రతిపాదనలపై 1929లో వైస్రాయి చేసిన ప్రకటన కనుగుణంగా ఆంగ్ల ప్రభుత్వాన్ని, భారతీయ ప్రతినిధుల మధ్య చర్చలు జరగాలి. కాన 1930 నవంబర్ నెలలో లండన్ నందు ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటయింది. బ్రిటీష్ రాజు సమావేశాన్ని ప్రారంభింపగా, లేబర్ పార్టీ ప్రధాన మంత్రి రామ్‌సే మెక్ డొనాల్డ్ అధ్యక్షత వహించాడు. ఇంగ్లాండులోని వివిధ పార్టీలకు చెందిన 16 మంది, సంస్థానాల నుండి 16 మంది, ఆంగ్ల పాలనలోని భారతదేశం నుంచి 57 మంది ప్రతినిధులు, చర్చలకు ఆహ్వానింపబడిరి. కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశానికి ప్రతినిధులను పంప నిరాకరించగా, మిగతా పార్టీల నాయకులు హాజరయ్యారు.

భారతదేశానికి స్వయంపాలనా ప్రతిపత్తిని, కేంద్రంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని, భారత ప్రతినిధులు కోరారు. బ్రిటీష్ పార్లమెంటరీ విధానాన్ని ప్రవేశపెట్టవలెనని కూడా వారు వాదించారు. సమ్మేళన రాజ్యాంగమునకు భారత సంస్థానాధిపతులు అంగీకరించారు. అయితే, ఈ రాజ్యాంగం ఆంగ్లపాలనలోనే ఉండవలెనని కోరినారు. సమ్మేళన రాజ్యాంగ రూపముపై చర్చలలో కొంత ప్రగతి సాధింపబడింది. కాని, డాక్టర్ అంబేద్కర్ నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయవలెనని పట్టుబట్టగా, చర్చలలో కొంత ప్రతిష్ఠంభన ఏర్పడింది. ముసల్మానులు, తదితర మైనారిటీలు పూర్తిగా సంతృప్తి చెందని రాజ్యాంగం ఏదైనా విజయవంతం కాలేదని వారి ప్రతినిధులు వాదింపగా, రాజ్యాంగ చర్చలు మరికొంత కుంటుపడినవి. ముసల్మానులలోని ఉదార వర్గ ప్రయత్నాలు ఫలించలేదు. 'ముసల్మానులకు సరియైన రాజ్యాంగ రక్షణలు లేనిచో కేంద్రంలో కాని, రాష్ట్రాలలో కాని ఎట్టి రాజ్యాంగ ప్రగతి సాధింప బడదని, అట్టి రక్షణలు లేని రాజ్యాంగం తమకు ఆమోదయోగ్యం కాదని' వారి ప్రతినిధి వర్గం ఉద్ఘాటించింది.

ఈ విభేదాలవల్ల, సమావేశం 1931 జనవరి వరకు వాయిదా వేయబడింది. కొన్ని రాజ్యాంగ సంస్కరణలను ఆమోదించిన బ్రిటీష్ ప్రధానమంత్రి, "మతపర విభేదాలను భారతీయులు తమలో తామే పరిష్కరించు కొనవలెన"ని స్పష్టం చేశాడు. నూతన రాజ్యాంగ సంస్కరణలను త్వరలో అమలు చేయవలెనని ప్రభుత్వం ఆకాంక్షిస్తుందని, శాసనోల్లంఘనోద్యమాన్ని నడుపుతున్న నాయకులు ఈ విషయంలో సహకారము అందించగలరనే ఆశాభావం వెలిబుచ్చారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశం ముగిసిన రెండు రోజులకు, 1931 జనవరిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక ప్రకటన చేస్తూ, రౌండ్ టేబుల్ సమావేశ నిర్ణయాలను తాము గుర్తించడంలేదని తెలియజేసింది. బ్రిటీష్ ప్రధానమంత్రి ప్రకటన అస్పష్టంగా వుంది. కావున కాంగ్రెస్ తన విధానాలను మార్చుకొనే పరిస్థితి లేదని స్పష్టీకరించింది. ఉద్యమాన్ని సమధికోత్సాహంతో నిర్వహింపమని ప్రజలను కోరింది. బ్రిటీష్ ప్రధాన మంత్రి చేసిన విధాన ప్రకటనలోని విషయాలను చర్చించడానికి వీలుగా, ప్రభుత్వం నిర్బంధంలో వున్న కాంగ్రెస్ నాయకులందరినీ విడుదల చేసింది.

23.5 గాంధీ-ఇర్విన్ ఒప్పందం, 1931

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నాయకులు గాంధీజీని, కాంగ్రెస్‌ను తమ బహిష్కరణ విధానాన్ని విడనాడి, వైస్రాయిని కలువమని అర్థించారు. గాంధీ 1931 ఫిబ్రవరిలో వైస్రాయి ఇర్విన్‌ను కలిసినాడు. కాంగ్రెస్

తరపున సంప్రదింపులు జరుపుటకై, వర్కింగ్ కమిటీ గాంధీగారికి అధికారమిచ్చింది. మిగతా కాంగ్రెస్ నాయకులు కూడా చర్చలలో పాల్గొన్నారు. కొన్ని దినాలపాటు చర్చలు కొనసాగి, చివరకు అంగీకారం కుదిరింది. ఈ అంగీకారాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదించింది. గాంధీ-ఇర్విన్ ఒప్పందంపై వైస్రాయి, గాంధీగారు 1931 మార్చి 5వ తేదీన సంతకాలు చేసారు.

ఈ ఒప్పందం ననుసరించి, శాసనోల్లంఘనోద్యమం నిలుపు చేయబడుతుంది. రాజ్యాంగ విషయాల చర్చకై మరో సమావేశం జరుగ గలదు. అందులో కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొనగలరు. సమ్మేళన రాజ్యాంగం, రిజర్వేషన్లు, మైనారిటీల రక్షణ, రాజ్యాంగములో అంతర్భాగంగా అంగీకరించారు. ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు లన్నింటినీ ఉపసంహరించుకుంటుంది. అంతేకాక, అత్యవసర శాసనాలను రద్దుచేయగలమని ప్రభుత్వం ప్రకటించింది. శాసనాలను ధిక్కరించకుండా విదేశీ వస్తువుల బహిష్కరణకై జరిగే శాంతియుత పికెటింగ్ అనుమతించబడగలదు. సముద్రతీరాన వున్న ప్రజలు తమ ఉపయోగానికి ఉప్పు తయారు చేసుకొనవచ్చును. కాని అమ్మకానికి చేయకూడదు.

కాంగ్రెస్ పార్టీ శాసనోల్లంఘనోద్యమాన్ని ఆపుచేసి, రాజ్యాంగ చర్చలలో పాల్గొనడానికి అంగీకరించింది. కొంతమంది నాయకులు గాంధీ-ఇర్విన్ ఒప్పందం, లాహోర్ పూర్ణస్వరాజ్య తీర్మానానికి అనుగుణంగా లేదని భావించారు. గాంధీ ఈ వాదాన్ని అంగీకరించకపోయిననూ ముఖ్యంగా యువజన సంస్థలు ఈ ఒప్పందాన్ని నిరసించాయి. సుభాష్ చంద్రబోస్ ఒప్పందాన్ని విమర్శించగా, యువజన కాంగ్రెస్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానించింది. ఈ ఒప్పందం కాంగ్రెస్ విజయమని గాంధీగారి అనుచరులు వాదించారు. కాని, వారి వాదం అంతసమంజసంగా లేదు. ఆంగ్ల ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటంలో కాంగ్రెస్ విజయావకాశాలు అంతంత మాత్రంగా వున్నందున, బహుశా గాంధీజీ ఈ ఒప్పందానికి అంగీకరించి వుండవచ్చును. అట్టి రాజీలు ఏ ప్రజా ఉద్యమంలోనైనా తప్పనిసరికాగలవు.

గాంధీ ఒప్పందాన్ని అంగీకరించడానికి కారణాలు ఏమైనా, ఆంగ్ల ప్రభుత్వ పాలనా చరిత్రలో ప్రప్రథమంగా జాతీయ కాంగ్రెస్‌ను సమరాజకీయ ప్రత్యర్థిగా గుర్తించడం జరిగింది. పరిష్కారానికి, రాజీకి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే అర్హత కల్గినట్లుగా అంగీకరించబడింది. ఆలోచనతో కాని, అనాలోచితంగాకాని, ఆంగ్ల ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి ఒక జాతీయ హోదాను, రాజకీయ అధికారాన్ని, గాంధి-ఇర్విన్ ఒప్పందం ద్వారా సంక్రమింపచేసింది.

కరాచీలోజరిగిన కాంగ్రెస్ సమావేశంలో గాంధీ-ఇర్విన్ ఒప్పందం చర్చకు వచ్చింది. యువకులు ఒప్పందంపట్ల సుముఖత వ్యక్తం చేయలేదు. భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను. లాహోర్ కుట్రకేసు సందర్భంగా ఉరితీయడం, వారి ఆగ్రహానికి కారణమైంది. ఈ వార్త దేశాన్ని యావత్తు విషాదసాగరంలో ముంచింది. గాంధీగారు ఈ విప్లవ వీరుల మరణ శిక్షను, యావజ్జీవకారాగార శిక్షగా మార్చేందుకై వైస్రాయితో గట్టిగా పట్టుబడలేదని భావించిన యువకులు, గాంధీకి కరాచీ సమావేశంలో నల్లజండాలను చూపారు. మృతవీరుల త్యాగాన్ని, ధైర్యాన్ని, ప్రశంసిస్తూ కాంగ్రెస్ ఒక తీర్మానం చేసింది. కరాచీలో కాంగ్రెస్ సమావేశమవుతున్న కాలంలోనే, కాన్పూర్ హిందూ-ముసల్మాన్‌ల మధ్య పెద్ద ఎత్తున మతకలహాలు జరిగాయి. గృహదహనాలు, దోపిడీలు, హత్యలు ముమ్మరంగా సాగాయి.

ఈ దురదృష్టకర సంఘటనవల్ల కాంగ్రెస్ సమావేశం ఉద్రిక్త పరిస్థితులలో జరిగింది. సమావేశం గాంధీ-ఇర్విన్ ఒప్పందాన్ని ఆమోదిస్తూ *"దీనివల్ల పూర్ణస్వరాజ్య ధ్యేయమును కాంగ్రెస్ విడనాడదనే"* ప్రకటన చేసాడు. ఇది కొంతవరకు ఆత్మవంచనయే. రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతినిధులను పంపడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా అంగీకరించింది. సుదీర్ఘ చర్చల పిదప, కాంగ్రెస్ గాంధీజీని తమ పార్టీ ఏకైక ప్రతినిధిగా లండన్ పంప నిశ్చయించింది. గాంధీ మత కలహాలవల్ల కలవరం చెందినాడు. రాజ్యాంగ చర్చలలో

BRAOU

ఎట్టి ప్రగతి సాధించవలెనన్నా, హిందూ-ముసల్మాన్‌ల మధ్య సమన్వయం, అంగీకారం అంత్యంత ఆవశ్యకమని గాంధీ భావించాడు. ఆయన మత సమస్యల పరిష్కారానికి ఒక ప్రణాళిక సిద్ధం చేశాడు.

ఇంతలో లార్డ్‌వెల్లింగ్‌టన్, ఇర్విన్ స్థానంలో వైస్రాయిగా విచ్చేసినాడు. గాంధీ-ఇర్విన్‌ఒప్పందంలోని పెక్కు షరతులను ఆయన తృణీకరించి, అణచివేత పద్ధతులను కొనసాగించినాడు. గాంధీగారు తాను రాజ్యాంగ చర్చలకు లండన్ వెళ్ళడంలేదని ప్రకటించినాడు. ఆ తరువాత వైస్రాయితో సమావేశమైనాడు. ఆయన కాంగ్రెస్ చేసిన ఫిర్యాదులను విచారింపగలమని హామీ ఇచ్చినాడు. అంతట రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరగుటకు అంగీకరించాడు.

23.6 రెండో రౌండ్ టేబుల్ సమావేశం, 1931

రెండో రౌండ్ టేబుల్ సమావేశం 1931 సెప్టెంబర్ నెలలో లండన్‌లో ప్రారంభమైంది. కాంగ్రెస్ ఏకైక ప్రతినిధిగా గాంధీగారు సమావేశంలో పాల్గొన్నాడు. ఆయన లండన్ నగర సందర్శన, వివిధ వర్గాల ప్రజలలో సంచలనం కల్గించింది. శాంతి, సుహృద్భావాల ఆవశ్యకతలను వివరిస్తూ, వారు పెక్కు ఉపన్యాసములు చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ఆంగ్ల ప్రజల మద్ధతును, సానుభూతిని అర్థించాడు.

సమ్మేళన రాజ్యాంగ వివరాలను ఖరారు చేయడం, అల్పసంఖ్యాక వర్గాలకు ఆమోదయోగ్యమైన ప్రణాళికను రూపొందించడం అనే రెండు ముఖ్య సమస్యలను ఈ సమావేశం పరిష్కరించవలసివుంది. గాంధీగారు కరాచీ కాంగ్రెస్ తీర్మానము ననుసరించి కేంద్రంలోను, రాష్ట్రాలలోను తక్షణమే బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు చేయవలెనని కోరినారు. "భారత జాతికి ప్రాతినిధ్యం వహింపగల ఏకైక సంస్థ కాంగ్రెసే" అని, వారు పలికినారు. మత ప్రాతినిధ్యంపై అంతులేని చర్చ జరిగింది. అయినా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం రూపొందించలేకపోయారు. నిమ్నజాతులకు శాసనసభలలో కొన్ని స్థానాలు ప్రత్యేకంగా కేటాయించవలెనని డాక్టర్ అంబేద్కర్ ప్రతిపాదించాడు. గాంధీ దీనికి అంగీకరించలేదు. అంబేద్కర్, తదితర అల్పసంఖ్యాక వర్గ ప్రతినిధులతో చేరిపోయాడు. ముసల్మాన్‌ల, ఆంగ్లో-ఇండియన్ల, నిమ్నజాతుల ప్రతినిధులు తమలో ఒక అంగీకారం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. దీనిని హిందూ, సిక్కు ప్రతినిధులు ఆమోదించలేదు. రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడింది.

రాజ్యాంగ రచన అనే ముఖ్య సమస్యను విడనాడి, అల్పసంఖ్యాక ప్రాతినిధ్య సమస్యను చర్చించడం ఉచితం కాదని గాంధీ వాదించాడు. చివరకు అల్పసంఖ్యాక ప్రాతినిధ్యం వారు బ్రిటీష్ ప్రధాని మాక్‌డొనాల్డ్ మధ్యవర్తిత్వానికి అంగీకరించారు. వారు తమ పరిష్కారాన్ని ప్రకటించగా, అది నిర్ణయంగా గాక, ఒక ప్రతిపాదనగా మాత్రమే పరిగణించింది. రెండో రౌండ్ టేబుల్ సమావేశం సమ్మేళనరాజ్యాంగ శాసనాధికారాలకు, న్యాయాధికారాలకు తుదిరూపమిచ్చింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ జరిగింది. సమాఖ్య రాజ్యంలో సంస్థానాలు చేరే పద్ధతికూడా వివరింపబడింది. అంతకు మించి ఎట్టి రాజ్యాంగ ప్రగతి సాధింపబడలేదు. గాంధీగారు వట్టి చేతులతో భారతదేశము తిరిగి వచ్చినాడు. బ్రిటన్‌లో ఏర్పడిన నూతన ప్రభుత్వమునందు, ప్రధాని మాక్ డొనాల్డ్ అయినా, కన్సర్వేటివ్‌లకు ఆధిక్యత కలదు. వారు ఈ రాజ్యాంగ సమావేశాన్ని భగ్నపరచి, కాంగ్రెస్ కార్యకలాపాలను ఎదుర్కొన నిశ్చయించినట్లుగా భావింపబడింది. ముస్లింల ప్రతినిధులు ఈ విషయంలో ఆంగ్ల ప్రభుత్వ మిత్రులుగా మారినారు. పైగా, భారత ప్రతినిధులలో సమన్వయం లేదు. దీనివల్ల, భారతదేశానికి సంతృప్తికరమైన రాజ్యాంగాన్ని రూపొందించడంలో, రెండో రౌండ్ టేబుల్ సమావేశం విఫలమైంది.

23.7 మూడో రౌండ్ టేబుల్ సమావేశం, 1932

1932 నవంబర్‌లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. ఈ సమావేశమునందు ప్రముఖంగా ఓటింగ్ అర్హత, సమ్మేళన నిధులు, రాష్ట్రాల ఆర్థిక

BRAOU

వనరులను గూర్చి చర్చించారు. మహిళలకు వోటింగ్ హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యులు సమాఖ్య ఎగువ సభ ప్రతినిధులను ఎన్నుకోవడం, ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. అప్పటికీ, సంస్థానాధిపతుల ధోరణిలో మార్పు వచ్చింది. సమాఖ్య రాజ్యంపట్ల వారి సానుభూతి తగ్గిపోయింది. 1932లో ఈ మూడో రాజ్యాంగ సమావేశం ముగిసేనాటికి, రాజ్యాంగం పట్ల భారతదేశ ప్రజలలో ఇంతకు ముందున్న ఆసక్తి క్షీణించింది.

23.8 శాసనోల్లంఘన-అంతిమ ఘట్టం

గాంధీ-ఇర్విన్ ఒప్పందం పిదప, కాంగ్రెస్ శాసనోల్లంఘన ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలుపు చేసింది. సూరత్ జిల్లాలో భూమిశిస్తు వసూలుండు పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. దీనిపై నిష్పాక్షిక విచారణ జరిపించగలమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాని, విచారణ న్యాయంగా జరుగలేదు. కాంగ్రెస్, విచారణ సంఘం నుంచి వైదొలగింది. 1931లో ఉత్తరప్రదేశ్ నందు తీవ్ర ఆర్థిక దుస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పన్నుల నిరాకరణను ఇక్కడ ప్రారంభించి, గాంధీ-ఇర్విన్ ఒప్పందం పిదప ఉద్యమాన్ని విరమించింది. ప్రభుత్వం వాగ్దానం చేసిన భూమిశిస్తు మాఫీని అమలు పరచలేదు. పైగా, వెంటనే పన్నుల బకాయిలు చెల్లింపమని నిర్బంధించింది. అంతట, భూమిశిస్తు చెల్లింపవద్దని కాంగ్రెస్ రైతులను కోరింది. ఫలితంగా, కాంగ్రెస్ నాయకులు నెహ్రూ, పురుషోత్తందాస్ టాండన్ అరెస్ట్ చేయబడ్డారు. ఉత్తర సరిహద్దు రాష్ట్రంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ "రెడ్ షర్ట్" సంస్థను నిషేధించారు. వేలాది స్వచ్ఛంద సేవకులను నిర్బంధించారు. ఇట్టి సంఘటనలు దేశవ్యాప్తంగా జరిగాయి. ఖైదీలను అమానుషంగా చూడడంవల్ల, పన్నుల నిరాకరణోద్యమ కార్యకర్తలపై అత్యాచారాలు జరుపడంవల్ల ఉద్రిక్తులైన కొందరు హింసాయుత చర్యలకు కూడా దిగినారు.

గాంధీ లండన్ వచ్చేసరికి బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తర సరిహద్దు రాష్ట్రం, తదితర ప్రాంతాలలో అణచివేత శాసనాలు అమలులో ఉన్నాయి. ప్రభుత్వ చర్యలవల్ల ఇంతకుముందున్న సుహృద్భావవైఖరి నశించిందని గాంధీ వైస్రాయికి తంతి పంపగా, ప్రభుత్వ దమన చర్యలను సమర్థిస్తూ, వైస్రాయి సమాధానమిచ్చాడు. దీనిని బట్టి కాంగ్రెస్ దెబ్బతీయడానికి ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందించినట్లుగా, స్పష్టమైంది. కొత్తగా అమలు చేసిన శాసనాల పూర్వాపరాలపై బహిరంగ, నిష్పాక్షిక విచారణ జరిపించమని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రభుత్వాన్ని సవాలు చేసింది. దీనికి ప్రభుత్వ సమాధానం రాకుంటే, శాసనోల్లంఘనను తిరిగి చేపట్టగలమని హెచ్చరించినారు. దీనికి ప్రభుత్వ సమాధానం వ్యతిరేకమేగాక, అవమానకరంకూడా. శాసనోల్లంఘన బెదిరింపుల మధ్య, గాంధీకి తనను కలిసే అవకాశమివ్వజాలనని వైస్రాయి స్పష్టంచేశాడు. ప్రభుత్వం తమ విధానాన్ని సమర్థించుకుంటూ, మరికొన్ని అత్యవసర శాసనాలు చేసింది. గాంధీ, వల్లభాయ్ పటేల్ అరెస్ట్ చేయబడ్డారు. అప్పటికే నెహ్రూ, గఫార్ ఖాన్ జైలులో ఉన్నారు. ప్రభుత్వ చర్యలను ఐరోపా జాతీయులు సమర్థించారు. ఇట్టి పరిస్థితులలో శాసనోల్లంఘనోద్యమ ఆఖరి ఘట్టం ప్రారంభమైంది.

ఈ ఉద్యమం దావానలంగా వ్యాపించింది. వేలాది ప్రజలు అరెస్టును కోరారు. పెద్ద ఎత్తున పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహింపబడింది. మహిళా వాలంటీర్లు పికెటింగ్‌లో పాల్గొన్నారు. విదేశీ వస్త్రాలను ప్రోగుచేసి దహనంచేయడం, గ్రామాలలో, పట్టణాలలో నిత్యకృత్యమైంది. సారాదుకాణాలముందు పికెటింగ్ జరిగింది. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా వూరేగింపులు జరిగాయి. ప్రభుత్వ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పికెటింగ్ చేయబడినవి. ప్రభుత్వ కార్యాలయాలపై వాలంటీర్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. అధికారులు ఆమోదించని ఎన్నో కరపత్రాలను బహిరంగంగా పంచిపెట్టారు.

ప్రభుత్వం ఉద్యమాన్ని అణచుటకై ఎన్నో దారుణమైన, అమానుష, కిరాతక చర్యలకు ఒడికట్టింది. సమన్యాయ సిద్ధాంతానికి తిలోదకాలు ఇవ్వడం జరిగింది. చివరకు స్త్రీలను, పిల్లలను కూడా పోలీసులు కొట్టారు. రాళ్ళు విసిరినారనే నెపంపై, తరచూ కాల్పులు సాగించారు. దాడులు, గృహాలలో ప్రవేశించి సోదా చేయడం, దేశవ్యాప్తంగా జరిగింది. పోలీసు నిర్బంధంలో కొట్టడం, తదితర చిత్రహింసలు పెట్టేవారు. గ్రామాలలో

BRAOU

భీతావహ పరిస్థితులను కల్పించారు. వారి ఆస్తులను దోపిడీ చేసారు. దేశంలో ఆంగ్ల ప్రభుత్వ పాలన, మధ్య యుగపు అమానుష నిరంకుశ పాలనల స్థితికి దిగజారింది.

23.9 శాసనోల్లంఘనోద్యమ అంతం

శాసనోల్లంఘన ఉద్యమం, ప్రభుత్వ అణచివేత కార్యక్రమం అత్యున్నత స్థితిలో కొనసాగుతున్న సందర్భంలో, గాంధీ అకస్మాత్తుగా ప్రత్యేక నియోజక వర్గాలను వ్యతిరేకిస్తూ, ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. సంయుక్త నియోజక వర్గాలను పునరుద్ధరించనిదే తాను దీక్ష మానని ప్రకటించాడు. దీనితో, దేశం యావత్తు కలవరపడింది. శాసనోల్లంఘనోద్యమం వెనుక పడిపోయింది. చర్చలు కొద్దికాలంపాటు ఆందోళనకర స్థితిలో జరిగాయి. చివరకు, 18 శాతం సీట్లు నిమ్నజాతులకు కేటాయించవలెననే అంబేద్కర్ వాదం నెగ్గింది. గాంధీ నిరాహార దీక్ష విరమించాడు.

నాటి నుంచి శాసనోల్లంఘన ఉద్యమ ఉధృతం తగ్గిపోయింది. గాంధీకి ఉద్యమంపై ఆసక్తి తగ్గింది. అతడు అస్పృశ్యతానివారణలో నిమగ్నమైనాడు. శాసనోల్లంఘనను ఆరువారాలపాటు నిలుపుచేయమని గాంధీ కాంగ్రెస్ అధ్యక్షులను కోరినాడు. నిర్బంధితులను విడుదలచేసి, అత్యవసర శాసనాలను రద్దుచేయమని ప్రభుత్వాన్ని అర్థించాడు. వైస్రాయి గాంధీజీ కోరికను తిరస్కరించాడు.

పూనాలో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో సామూహిక శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించి వ్యక్తిగత శాసనోల్లంఘనను ప్రారంభించాలని నిశ్చయించారు. నాటి నుంచి ఈ ఉద్యమం క్రమేణా తిరోముఖం పట్టింది.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. రౌండ్ టేబుల్ సమావేశాలప్పుడు ఇంగ్లాండు ప్రధాన మంత్రి ఎవరు?

.....

.....

.....

.....

2. గాంధీ-ఇర్విన్ ఒప్పందాన్ని, సుభాష్ చంద్రబోస్ తదితరులు, ఎందుకు విమర్శించారు?

.....

.....

.....

.....

23.10 సంగ్రహంగా

1. భారత జాతీయోద్యమంలో, 1929లో జరిగిన లాహోర్ సమావేశం, ఒక ముఖ్యమైన మలుపు. ఆ సమావేశంలో పూర్ణ స్వరాజ్యం, కాంగ్రెస్ లక్ష్యంగా ప్రకటించబడింది.
2. ఉప్పు సత్యాగ్రహం భారతీయుల్లో, బ్రహ్మాండమైన జాతీయ చైతన్యాన్ని సృష్టించింది.

BRAOU

3. 1931లో గాంధీ-ఇర్విన్ ఒడంబడికతో ఉప్పు సత్యాగ్రహం ఆగింది.

4. భారతదేశపు భవిష్యత్ రాజ్యాంగానికి సంబంధించిన విషయాలు, రౌండ్ టేబుల్ సమావేశాలల్లో చర్చించినారు. ఆచర్చలల్లో అంగీకారమేమీ కుదరలేదు.

23.11 మీ అవగాహన పరీక్షించుకోండి; జవాబులు

I 1) 1930, జనవరి 26న, దేశమంతట త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, ఆరోజు, దేశమంతటా, స్వాతంత్ర్యదినంగా ఉత్సవాలు జరిపినారు. అందువల్ల ఆ రోజుకు ప్రాముఖ్యత ఏర్పడింది.

2) ఏప్రిల్ 6వ తేదీ, 1930 నాడు దండిలో గాంధీ ఉప్పు చట్టాలను ఉల్లంఘించాడు.

II 1) రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగినప్పుడు, రామ్సే మెక్‌డోనాల్డ్ ఇంగ్లాండు ప్రధాన మంత్రి.

2) ఒప్పందంలో భారతదేశ స్వాతంత్ర్యాన్ని గురించి ఏమీ లేనందువల్ల, సుభాష్‌చంద్ర బోస్ మొదలైన వారు, గాంధీ-ఇర్విన్ ఒప్పందాన్ని విమర్శించినారు.

23.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

I **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) శాసనోల్లంఘనోద్యమం బయల్దేరటానికి దోహదం చేసిన అంశాలను సమీక్షించండి.

2) రౌండ్ టేబుల్ సమావేశాలు విఫలం కావడానికి కారణభూతమైన అంశాలను పరిశీలించండి.

3) గాంధీ-ఇర్విన్ ఒడంబడికను నిశితంగా పరిశీలించి, దాని ప్రాముఖ్యతను తెల్పండి.

II **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1) స్వాతంత్ర్యోద్యమం మీద శాసనోల్లంఘనోద్యమ ప్రభావాన్ని పరిశీలించండి.

2) రెండవ రౌండ్ టేబుల్ సమావేశం గురించి క్లుప్తంగా రాయండి.

23.13 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C. : *Constitutional Histroy of India and National Movement*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra & Others : *Freedom Struggle*
4. Desai, R. : *Social Background of Indian Nationalism*
5. Majumdar, R.C. : *Advanced History of India*
6. Majumdar, R.C. : *Three Phases of India's Struggle for Freedom*
7. Natarajan and Prema Rama Krishna : *Political and Cultural History of India, Vol. II*
8. Spear, Perceival : *History of India, Vol. II*
9. Tarachand : *History of the Freedom Movement in India, Vol. III*
10. వైదేహి, అల్లాడి : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947)*
11. జితేందర్ రెడ్డి బి. : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్వల ఘట్టాలు.*
12. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం*

BRAOU

భాగం - 24 : కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ అవతరణ

విషయక్రమం

24.0 లక్ష్యాలు

24.1 పరిచయం

24.2 సామ్యవాద భావాల ఆవిర్భావం

24.2.1 జవహర్‌లాల్ నెహ్రూ సామ్యవాద భావాలు.

24.3 కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ

24.4 కాంగ్రెస్ ప్రపంచ విషయాలు

24.5 సంస్థానాలల్లో ప్రజా ఉద్యమాలు

24.6 సంగ్రహంగా

24.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

24.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

24.9 ఉపయుక్త గ్రంథాలు

24.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి .

1. కాంగ్రెస్ నాయకులల్లో సామ్యవాద భావాల అభివృద్ధి, కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ స్థాపన
2. సంస్థానాల్లో ప్రజా ఉద్యమాల ప్రారంభం

24.1 పరిచయం

1930 నుంచి కాంగ్రెస్‌లో బయట సామ్యవాద భావాలు అభివృద్ధి చెందాయి. 1921లో ఏర్పడ్డ ఆర్థిక మాంద్యం ప్రభావం పెట్టుబడిదారీ వ్యవస్థ కల్గిన దేశాల్లోకన్నా సామ్యవాద దేశాల్లో తక్కువ అవడంతో సామ్యవాద భావాలపట్ల ఆకర్షణ ఎక్కువైంది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామాలవల్ల భారత దేశం కూడా ప్రభావితమైంది. కాంగ్రెస్ పార్టీలు యువత సామ్యవాద భావాలపై మక్కువ చూపడం ప్రారంభించడంతో కాంగ్రెస్-సోషలిస్ట్‌పార్టి స్థాపన జరిగింది.

24.2 సామ్యవాద భావాల ఆవిర్భావం

1930 నుండి కాంగ్రెస్ పార్టీలోను, బయటా సామ్యవాద భావాలు బాగా అభివృద్ధి చెందాయి. ఇంతకు ముందు పాఠంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన, సామ్యవాద ప్రభావితమైన విప్లవ సంఘాల కార్యకలాపాలను. వివరంగా చదివియున్నాం. కాంగ్రెస్ పార్టీలో కూడా యువకులు సామ్యవాద భావాలచే ప్రభావితులైనారు. 1920లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. నిరుద్యోగ రక్కసి వికటాట్టహాసం చేసింది. ఆర్థిక దుస్థితి సాంఘిక జీవనాన్ని దెబ్బతీసింది. పెట్టుబడిదారీ రాజ్యాల్లో ఉత్పత్తులు గణనీయంగా పడిపోయాయి. విదేశీ వ్యాపారం దెబ్బతిన్నది. ఒక సమయంలో, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 12 మిలియన్లు, జర్మనీలో 6 మిలియన్లు, ఇంగ్లండ్‌లో 3 మిలియన్ల నిరుద్యోగులు వున్నారు. కాని, సోవియట్ రష్యాలో ఈ ఆర్థికమాంద్య ఫలితాలు పెద్దగాలేవు. పైగా ఉత్పత్తులు పెరిగాయి. దీనితో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతిష్ట పూర్తిగా దెబ్బతిని, సామ్యవాద భావాలపట్ల ఆకర్షణ ఎక్కువైంది. కార్మికులు మార్క్సిజమ్, సోషలిజమ్ ప్రణాళికాబద్ధ అభివృద్ధి పట్ల ఆకర్షితులైనారు.

BRAOU

ఈ ప్రపంచ వ్యాప్త ఆరిక సంక్షోభం, భారత ఆర్థిక స్థితిని మరింత హీనపరచింది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 50 శాతానికి పడిపోయాయి. వేతనాలు తగ్గిపోయాయి. రైతులు జమిందారీ రద్దు, ఋణ విముక్తి, భూసంస్కరణలను కోరగా, కార్మికులు ట్రేడ్ యూనియన్ హక్కులను, మెరుగైన పని వసతులను, నిజవేతనాల పెంపును అర్థించారు. ఎన్నో కర్షక సంఘాలు ఏర్పడ్డాయి. జాతీయ రాజకీయాల్లో వారు ఉత్సాహంగా పాల్గొనడం మొదలైంది.

24.2.1 జవహర్‌లాల్ నెహ్రూ - సామ్యవాద భావాలు

1936 - 37 లలో జవహర్‌లాల్ నెహ్రూ, 1938 - 39 లో సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం, కాంగ్రెస్‌లో వామపక్ష ప్రాబల్యానికి, సామ్యవాద ప్రభావానికి నిదర్శనంగా చెప్పవచ్చు. జవహర్‌లాల్ నెహ్రూ మొదటి నుంచీ రాజకీయాలలో విప్లవవాదియే. జైలులో ఉండగా, వారికి గాంధీకి మధ్య అభిప్రాయభేదాలు స్పష్టంగా కన్పించాయి. నెహ్రూ తన కుమార్తె ఇందిరాగాంధీకి వ్రాసిన లేఖలో (ఈ లేఖలు 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ'గా) ప్రచురింపబడినవి. స్వీయ చరిత్రలో సామ్యవాద భావాలపట్ల తనకు గల ఆకర్షణను ప్రస్ఫుటించాడు. **'థిదర్ ఇండియా'** అనే లేఖల వ్యాసాలసంపుటిలో, గాంధీగారితో తనకుగల భావభేదాలను విశదీకరించాడు. సామ్యవాద సిద్ధాంతాలలో, విప్లవాత్మకమైన సాంఘిక, ఆర్థిక ప్రణాళికలను మేళవించవలెనని, నెహ్రూ పదే పదే ఉద్ఘాటించాడు. నెహ్రూ 'కమ్యూనిస్ట్ సిద్ధాంతాల పూజారి' అని బ్రిటీష్ అధికారులు పెక్కు మంది భావించారు.

1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్షోపన్యాసమిస్తూ, నెహ్రూ కాంగ్రెస్ సంస్థ సామ్యవాదాన్ని లక్ష్యంగా స్వీకరించాలని, కార్మిక, కర్షకులకు చేరువకావాలని ఆకాంక్షించాడు. సాధారణ ముసల్మాన్‌లను ఈ పద్ధతిలో, తమ మతమౌఢ్య నాయకుల నుంచి వేరుచేయ వీలౌతుందని ఆయన భావించాడు. "*ప్రపంచ, భారతదేశ సమస్యలన్నిటికి సామ్యవాదంలోనే పరిష్కారం కలదని, నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. సామ్యవాదం అనే పదాన్ని నేను, అస్పష్ట మానవతా దృష్టితో కాక శాస్త్రీయ, ఆర్థిక పరంగా ప్రయోగిస్తున్నాను. సామ్యవాదం అంటే, మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో విస్తృత విప్లవాత్మక మార్పులు రావాలి. భూమిపై, పరిశ్రమలలో గుత్తాధిపత్య ప్రభావం నశించాలి. పరిమితమైన పద్ధతిలో మినహాయించి, ప్రైవేటు ఆస్తులు రద్దుకావాలి. ప్రస్తుతపు లాభాలు సంపాదించే వ్యవస్థ స్థానంలో, సహకార సేవల లక్ష్యంగా రూపొందాలి. సంగ్రహంగా చెప్పవలెనంటే, ప్రస్తుతపు పెట్టుబడిదారీ విధాన స్థానంలో, నూతన నాగరికత ఆవిర్భవించాలి*" అని నెహ్రూ మహాశయుడు ఉద్ఘాటించాడు.

24.3 కాంగ్రెస్ - సోషలిస్ట్ పార్టీ

1933 నాసిక్ జైలులో నిర్బంధంలోనున్న కొందరు కాంగ్రెస్ వాదులు తమ చర్చలతో కాంగ్రెస్ నందు ప్రత్యేకమయిన ఒక సామ్యవాద వర్గాన్ని నిర్మించి, పార్టీ వామపక్ష విధానాలను అనుసరించేటట్లు కృషి చేయాలని భావించారు. జయప్రకాశ్ నారాయణ, అచ్యుత పట్వర్ధన్, యూసఫ్ మెహరాలీ, అశోక్ మెహతా, మినూ మసానీ, ఇందులో ఉత్సాహ కార్యకర్తలు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సంపూర్ణానంద్ దీనికి ఒక రూపకల్పన చేయగా, పాట్నా సమావేశంలో కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ స్థాపించబడింది. ఆచార్య నరేంద్రదేవ్ అధ్యక్షత వహించాడు.

కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ సిద్ధాంతాలు విప్లవ జాతీయ తత్వం, మార్క్స్ శాస్త్రీయ సామ్యవాదాల కలయిక. కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ, కాంగ్రెస్‌లో అంతర్భాగమైనా ఆ పార్టీ మితవాద నాయకత్వాన్ని ఎదిరిస్తూ, తదితర పార్టీల వామపక్ష సిద్ధాంతాలతో సహకరించడానికి సంసిద్ధమైంది. నెహ్రూ ఈ పార్టీపట్ల సానుభూతి కల్గినా, ందులో చేరలేదు. కాంగ్రెస్ పార్టీలోని మితవాదులు ఈ పార్టీని విమర్శించారు. ఈ పార్టీ సంస్థాపకులను ట్టాభి సీతారామయ్యగారు నిందించారు. ఉత్తర ప్రదేశ్, బీహార్‌లలో కాంగ్రెస్- సోషలిస్ట్ పార్టీ పలుకుబడి

బాగా పెరిగింది. ఆచార్య నరేంద్రదేవ్ కార్మిక కర్షక సాధారణ సమ్మెను నిర్వహించగా, గాంధీగారు ఆ పోకడలు ప్రమాదకరమైనవిగా, రెచ్చగొట్టేవిగా భావించాడు. కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ బీహార్, ఆంధ్రలో కొత్తగా ఆవిర్భవిస్తున్న కిసాన్ ఉద్యమాలతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకొంది. రైతులకు రాజకీయ శిక్షణనిచ్చేందుకై ఆచార్య రంగా నిడుబ్రోలులో రైతుల పాఠశాల నొక దానిని స్థాపించినాడు. బీహార్‌లోని కాంగ్రెస్ నాయకులలో ఒక వర్గం రైతుల ఉద్యమాలను బలపరచింది. క్రమేణా కాంగ్రెస్- సోషలిస్ట్ పార్టీ సభ్యులు కాంగ్రెస్‌ను వదలి, కమ్యూనిస్ట్ పార్టీలో కొందరు చేరగా, మరి కొందరు స్వాతంత్రం వచ్చిన తొలి సంవత్సరాలలో, కొత్త సోషలిస్ట్ పార్టీలను స్థాపించారు.

సామ్యవాద భావాల ప్రచారంవల్ల పి.సి. జోషి నాయకత్వంలో, కమ్యూనిస్ట్ పార్టీ స్థాపించ బడింది. 1939లో సుభాష్ చంద్రబోస్ తన వామపక్ష అనుచరులతో కలసి "ఫార్వర్డ్ బ్లాక్" సంస్థను స్థాపించాడు. ఇవన్నీ, కాంగ్రేసేతర సామ్యవాద పార్టీలు.

24.4 కాంగ్రెస్ - ప్రపంచ విషయాలు

కాంగ్రెస్ సంస్థ 1885 లో స్థాపించబడిన నాటి నుంచి భారతదేశ వనరులను, సైన్యాన్ని ఆఫ్రికా, ఆసియా వలసలలో ఇంగ్లాండ్ ప్రయోజనాలకు వినియోగించడాన్ని, వ్యతిరేకిస్తూ వచ్చింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, జాతీయ కాంగ్రెస్ క్రమేణా ఒక జాతీయ విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంది. 1927 లో బ్రస్సెల్స్ నగరంలో జరిగిన దళిత రాజ్యాల సభకు, జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ ప్రతినిధిగా హాజరైనాడు. ఆర్థిక రాజకీయ సామ్రాజ్యాల సభకు, జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ ప్రతినిధిగా హాజరైనాడు. ఆర్థిక, రాజకీయ సామ్రాజ్యవాదులంటే పీడింప బడుచున్న ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి బహిష్కరింపబడిన విప్లవవాదులు ఈ సభను ఏర్పాటు చేశారు. సామ్రాజ్యవాదం, వలస వాదాలకు వ్యతిరేకంగా దళిత జాతుల పోరాటాన్ని సమన్వయ పరచడానికి, ఈ సమావేశం జరిగింది. వామపక్ష రాజకీయాభి ప్రాయాలు కల్గిన కొందరు ఐరోపా మేధావులు కూడా, సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రసంగిస్తూ, శ్రీ నెహ్రూ ఇలా అన్నాడు. ''ఈనాడు సామ్రాజ్యవాదంచే పీడిత జాతులు, పూర్తిగా అణచివేయబడినవారు, కొంతవరకు మతతత్వ - కాంగ్రెస్ సోషలిస్ట్ అవతరణ అణగారిన ప్రజల మధ్య ఎంతో సారూప్యత కలదు. వారి శత్రువులు తరచూ ఒకటిగానే వుంటారు. అయితే, వీరు రకరకాల ముసుగులు ధరించినా, సామ్రాజ్యవాద శక్తులపై పోరాటం నెరపడానికి, ఒక సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేసింది". నెహ్రూ అందులో సభ్యుడుగా ఎన్నికైనాడు.

1927 లో మద్రాస్ నందు జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఇంగ్లాండ్ తన సామ్రాజ్య వాద ప్రయోజనాలకై జరిపే ఏ యుద్ధంలోను, భారతదేశం సహకరించలేదని స్పష్టపరిచారు. 1930 లో ప్రపంచంలో ఎక్కడైనా సామ్రాజ్యవాదానికి తాము వ్యతిరేకులమని కాంగ్రెస్ ప్రకటించింది. ఆసియా, ఆఫ్రికా దేశాలలోని జాతీయోద్యమాలకు కాంగ్రెస్ మద్ధతును ప్రకటించింది. ఇటలీ, జర్మనీ, జపాన్ లందు వెర్రితలలు వేస్తున్న ఫాసిజమ్‌ను, కాంగ్రెస్ విమర్శించింది. స్పెయిన్, ఇథోపియా, చైనా, జెకొస్లోవేకియాలపై జరిగిన ఫాసిస్ట్ దాడులను ఖండిస్తూ అక్కడి ప్రజలకు తమ సానుభూతి తెలిపింది. భారతదేశ భవిష్యత్తు, ఫాసిజమ్‌తో సామ్యవాదం, ప్రజాస్వామ్యం స్వేచ్ఛ నెరపే పోరాటంతో ముడిపడినట్లుగా, కాంగ్రెస్ పూర్తిగా విశ్వసించింది. సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య పోరాటంలో భారత ప్రభుత్వం పాల్గొనడాన్ని, కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని లక్నో కాంగ్రెస్‌లో నెహ్రూ స్పష్టపరిచాడు. సామ్రాజ్యవాదానికి, ఫాసిస్ట్ వాదానికి వ్యతిరేకంగా తమ దాస్యశృంఖలాలను త్రెంచుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా అభ్యుదయకర శక్తులు సాగిస్తున్న పోరాటానికి, తమ సహకారం వుండగలదని నెహ్రూ ప్రకటించాడు. క్రుళ్ళిపోయి, నశిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు సామ్రాజ్యవాదం, ఫాసిజమ్ రెండు రూపాలని నెహ్రూ భావన. పశ్చిమ రాజ్యాలలో సామ్రాజ్యవాదం, తూర్పు రాజ్యాలలో ప్రభవిస్తున్న జాతీయవాదం కలసి, సామ్రాజ్యవాదాన్ని, ఫాసిజమ్‌ను వ్యతిరేకించాయి.

BRAOU

24.5 సంస్థానాలలో ప్రజా ఉద్యమాలు

రాకుమారుల పాలనలో వున్న సంస్థానాలందు కూడా, ఈ కాలంలో ప్రజోద్యమాలు ప్రారంభమైనాయి. జాతీయవాదం తలెత్తింది. ఆంగ్లేయుల పాలనలోని రాష్ట్రాలలో కన్నా, ఈ సంస్థానాలలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులు మరీ నికృష్టంగా వున్నాయి. రైతులు పీడింపబడేవారు. భూమిశిస్తు చాలా ఎక్కువ. విద్య, వైద్య, సాంఘిక సేవా సంస్థలు వెనుకబడి వున్నాయి. పెక్కు సంస్థానాలలో వెట్టి చాకిరి, బానిసత్వం సర్వసహజ విషయాలు. రాకుమారుల భోగాలపై ఆదాయంలో అధిక భాగం వెచ్చింపబడేది. జాతీయోద్యమాన్ని దెబ్బతీయడానికి, ఆంగ్ల ప్రభుత్వం ఈ రాకుమారుల సంస్థాన పాలనను ప్రత్యక్షంగానో పరోక్షంగానో బలపరిచేది.

ఈ సంస్థానాలందలి ప్రజలు జాతీయభావంచే ప్రేరితులై, ప్రజాస్వామ్య హక్కులకు, ప్రజా ప్రభుత్వ స్థాపనకు ఉద్యమాలను ప్రారంభించారు. 1927 లో అఖిల భారత సంస్థానాల సమావేశం జరిగింది. 1930 లో జరిగిన శాసనోల్లంఘనోద్యమం, సంస్థాన ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పురికొల్పింది. రాజకోట్, జయపూర్, కాశ్మీర్, హైదరాబాద్, తిరువాన్కూర్ సంస్థానాలందు, ఎన్నో ప్రజా పోరాటాలు జరిగాయి. భారత జాతీయ కాంగ్రెస్ ఈ ప్రజా పోరాటాలను బలపరస్తూ, తమ తమ సంస్థానాలలో ప్రజలకు ప్రజాస్వామిక, ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటుచేసి, కొన్ని ప్రాథమిక హక్కులను కల్పించమని సంస్థానాధీశులను కోరింది. ఆంగ్లేయుల పాలనలోని భారతదేశ రాష్ట్రాలకే కాక, సంస్థానాధిపతుల పాలనలోని ప్రజలకు కూడా స్వాతంత్ర్యం ఇవ్వాలని కాంగ్రెస్ ఉద్ఘాటించింది. సంస్థానాలలోని ప్రజలను కూడా జాతీయతత్వం ప్రభావితం చేయగా, భారతదేశమందు ఏకత్వభావం నూతనంగా వ్యాపించింది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి.

1) ఏ కాంగ్రెస్ సమావేశంలో, జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ స్వామ్యవాద భావాలను తన లక్ష్యాలుగా ఆమోదించాలని కోరెను?

.....

.....

.....

.....

2) కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ ఎప్పుడు ఏర్పడింది? అందులోని ముఖ్యమైన సభ్యులెవరు?

.....

.....

.....

.....

3) భారత జాతీయ సంస్థాన ప్రజల సభ ఎప్పుడు ఏర్పడింది?

.....

.....

.....

.....

BRAOU

24.6 సంగ్రహంగా

1) రష్యన్ విప్లవంవల్ల ప్రభావితులయిన, జవహర్‌లాల్ నెహ్రూ తదితర యువనాయకులు, సామ్యవాద భావాలను ఆమోదించవలసిందని కాంగ్రెస్‌ను అర్థించారు. 1934లో కాంగ్రెస్‌లో అంతర్భాగంగా, కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ ఏర్పడింది.

2) 1927లో అఖిలభారత సంస్థాన ప్రజల సమావేశం ఏర్పాటయిన తరువాత, సంస్థానాలల్లో ప్రజాఉద్యమాలు ఉధృతమయినాయి.

24.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు.

I. 1) 1936 లక్నో సమావేశంలో, సామ్యవాదాన్ని లక్ష్యంగా ఎంచుకోవాలని నెహ్రూ కాంగ్రెస్‌ను అర్థించాడు.

2) కాంగ్రెస్-సోషలిస్ట్ పార్టీ 1934 లో ఏర్పడింది. జయప్రకాష్ నారాయణ, అచ్యుత పట్‌వర్ధన్, అశోక్ మెహతా, మినూ మసానీ ఆ పార్టీ ముఖ్య సభ్యులు.

3) అఖిల భారత సంస్థాన ప్రజల సభ, 1927 లో ఏర్పడింది.

24.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయండి.**

1. కాంగ్రెస్ పార్టీలో సామ్యవాద భావాలు వృద్ధిచెందుటకు గల కారణాలను తెల్పండి.
2. ప్రపంచ వ్యవహారాలలో కాంగ్రెస్ పార్టీకున్న అభిలాషను క్లుప్తంగా చర్చించండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు వ్రాయండి.**

1. స్వదేశ సంస్థానాలకు జాతీయోద్యమ వ్యాప్తి గురించి క్లుప్తంగా చర్చించండి.
2. మోతీలాల్ నెహ్రూ నివేదిక అంటే ఏమిటి? దాని యెడ ముస్లింలీగ్ వైఖరి ఎట్టిది.

24.9 ఉపయుక్త గ్రంథాలు

1. Agarwal, R.C. : *Constitutional History of India and National Movement*
2. Bipan Chandra : *Modern India*
3. Bipan Chandra & others : *Freedom Struggle*
4. Desai, A.R. : *Social Background of Indian Nationalism*
5. Majumdar, R.C : *Advanced History of India*
6. Majumdar, R.C : *Three Phases of India's Struggle for Freedom*
7. Natarajan and Prema Rama Krishna : *Political and Cultural History of India, Vol.II*
8. Spear, Perceival : *History of India, Vol. II*
9. Tarachand : *History of the Freedom Movement in India, Vol. III*
10. వైదేహి, అల్లాడి : భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947)
11. జితేందర్ రెడ్డి బి. : భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కొన్ని మహోజ్జ్వల ఘట్టాలు
12. బిపన్ చంద్ర : ఆధునిక భారతదేశం

BRAOU

భాగం -25 : జాతీయోద్యమం, 1935-46

విషయక్రమం

25.0 లక్ష్యాలు
25.1 పరిచయం
25.2 1935-39 మధ్య జాతీయోద్యమం
25.3 1935-39 మధ్య కాంగ్రెస్ మంత్రివర్గాలు
25.4 1935-39 మధ్య కాలంలో మత రాజకీయాలు
25.5 రెండవ ప్రపంచ యుద్ధం
25.5.1 కాంగ్రెస్ మంత్రి వర్గాల రాజీనామా
25.5.2 కాంగ్రెస్ ముస్లింలీగ్ స్పందనలు
25.5.3 ఆగస్టు ఒప్పందం
25.6 వ్యక్తిగత సత్యాగ్రహం
25.7 క్రిప్స్ రాయబారం
25.8 క్విట్ ఇండియా తీర్మానం
25.8.1 కర్నూల్ సర్కులర్
25.8.2 జాతీయోద్యమ హింసా సిద్ధాంతం ఆచరణలో గాంధీ అనుసరించిన విధానాలలో పరిణామాలు
25.9 క్విట్ ఇండియా ఉద్యమం
25.10 సుభాష్‌చంద్ర బోస్ - భారత జాతీయ సైన్యం (I.N.A)
25.11 వేవెల్ ప్రణాళిక
25.12 సిమ్లా సమావేశం, 1945
25.13 సంగ్రహంగా
25.14 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
25.15 పరీక్ష నమూనా ప్రశ్నలు
25.16 ఉపయుక్త గ్రంథాలు

25.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి :

1. 1935 నుంచి 1939 వరకు కాంగ్రెస్ మంత్రివర్గాల పనితీరు.
2. 1935 నుంచి 1939 వరకు జాతీయోద్యమం.
3. రెండవ ప్రపంచ యుద్ధానికి భారతీయుల ప్రతిస్పందన.
4. క్విట్ ఇండియా ఉద్యమానికి కారణాలు, క్రమం, స్వభావం.
5. భారతదేశ విముక్తికై సుభాష్ చంద్రబోస్ చేసిన కృషి, భారత జాతీయ సైన్యం పాత్ర.
6. 1945 సిమ్లా సమావేశం.

25.1 పరిచయం

1935-39 మధ్యకాలంలో కాంగ్రెస్ మంత్రివర్గాల పనితీరు, అదే కాలంలో జాతీయోద్యమ అభివృద్ధి, ఈ పాఠంలోని అంశాలు. రెండవ ప్రపంచ యుద్ధకాలం, భారత జాతీయోద్యమ కాలంలో ఒక కీలక ఘట్టం ప్రపంచ యుద్ధంలో తమకృషిని బ్రిటీష్‌వారు భారతీయుల సహాయాన్ని సాధించడానికి ప్రయత్నించారు. ఆ

BRAOU

కృషిలో భాగమే క్రిప్స్ రాయభారం. క్రిప్స్ రాయబారం విఫలమైన తర్వాత క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. యుద్ధ కాలంలో భారతదేశ విముక్తి కొరకు దేశం వెలుపలి నుంచి బ్రిటీష్‌వారి శత్రువుల సహాయంతో సుభాష్ చంద్రబోస్ వీరోచిత ప్రయత్నం చేశాడు. యుద్ధం చివరి దశలో భారతదేశ రాజకీయ సమస్యను పరిష్కరించడానికి 1945లో సిమ్లా సమావేశం ఏర్పాటు చేశాడు. ఆ పరిణామాలన్నీ ఈ భాగంలో చర్చించటం జరిగింది.

25.2 1935-1939 మధ్య జాతీయోద్యమం

కాంగ్రెస్ పార్టీపై మహాత్మాగాంధీ గారి ప్రభావం అలానే నిల్చిపోయినా, సామ్యవాదం, కమ్యూనిజం మొదలైన సిద్ధాంతాల ఆవిర్భావంతో, సంస్థలో కొంత మార్పు వచ్చింది. 1934లో కాంగ్రెస్ పార్టీనందు వామపక్ష సామ్యవాద ధోరణులు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. రైతులలో, విద్యార్థులలో నూతన రాజకీయ చైతన్యానికి ఇది నిదర్శనం. ఈ కాలంలోనే అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వంటి సంస్థలు స్థాపించబడినాయి. సాహిత్య రంగంలో కూడా, అభ్యుదయ రచయితలు సామ్యవాద భావ ప్రేరితులై, ప్రజాసమస్యలను ప్రతిబింబించే సాహిత్యాన్ని సృష్టించారు.

1935 జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైనాడు. కాంగ్రెస్ 1935 చట్టాన్ని తీవ్రంగా విమర్శించినా, ఎన్నికలలో పాల్గొనవలెనని నిర్ణయించింది. ఇది నెహ్రూ అభిప్రాయాలకు విరుద్ధం. ఎన్నికల వాగ్దాన పత్రాన్ని తయారుచేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో జయప్రకాశ్ నారాయణ్, నరేంద్రదేవ్, అచ్యుత పట్వర్ధన్ - ఈ ముగ్గురు సోషలిస్టులను నెహ్రూ నామినేట్ చేసారు. కాని కాలక్రమేణా, నెహ్రూ గాంధీగారి ప్రభావానికి పూర్తిగా లోనయ్యాడు. గాంధీగారి సిద్ధాంతాలను, కార్యక్రమాలను నెహ్రూ ఒక మేధావిగా విమర్శించినా, చివరకు భావోద్వేగంలో మాత్రం, వారి అధికారానికి దాసోహమనే వాడని కొందరి అభిప్రాయం. 1936లో నెహ్రూ తిరిగి కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. అప్పటికి, సోవియట్ రష్యా నూతన రాజ్యాంగాన్ని అమలు పరచింది. అక్కడ పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థ రద్దు చేయబడింది. కాంగ్రెస్‌లో ఒక వర్గం, భారత ప్రజల సంపూర్ణ సమర్థన రష్యా కివ్వాలని ఉత్సాహపడినారు. కాని, అప్పటికి నెహ్రూగారిలో చాలా మార్పువచ్చింది. "కాంగ్రెస్ భారతదేశమందు పూర్తి ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు పోరాడగలదు. కావలసింది సామ్యవాదం కాదు, ప్రజాస్వామిక రాజ్యం" అని నెహ్రూ పలికినాడు.

1935 చట్టాన్ననుసరించి 1936-37లలో సాధారణ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సందర్భంగా, ప్రజల ముందుకు వెళ్ళవలసి వచ్చింది. 3 1/2 కోట్ల మంది ప్రజలకు వోటింగ్ హక్కు రావడంతో, ప్రజలలో రాజకీయ చైతన్యంకూడా తారాస్థాయినందుకుంది. మద్రాస్, ఉత్తర ప్రదేశ్, మధ్యరాష్ట్రం (సెంట్రల్ ప్రావిన్స్), బీహార్, ఒరిస్సాలలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చింది. బొంబాయి, బెంగాల్, అస్సాం, పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రాలలో, మిగతా పార్టీలకన్నా ముందు వుంది. ఒక్క సింధ్, పంజాబ్‌లలో మాత్రం కొద్ది సీట్లే వచ్చిన కాంగ్రెస్, మైనారిటీగా వుండిపోయింది.

కాంగ్రెస్, ప్రభుత్వాన్ని స్థాపించవలెనా లేదా అనే ముఖ్య సమస్య ఎదురైంది. 1937 మార్చినెలలో ఢిల్లీలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో, ఈ విషయం రెండు రోజులపాటు చర్చింపబడింది. మెజారిటీ గల రాష్ట్రాలలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్, అంగీకరించింది. అయితే, రాష్ట్రాలలో గవర్నర్లు పాలనలో జోక్యం చేసుకోమని, హామీ ఇవ్వాలని కోరినారు. దానికి గవర్నర్లు అంగీకరించకపోవడంతో, రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని భగ్నపరచే ఎట్టి వివాదాలను కూడా తీసుకురావడం తమ అభిమతం కాదని వైస్రాయి ప్రకటించడంతో, ప్రతిష్టంభన తొలగిపోయి, మెజారిటీ వున్న చోట్ల కాంగ్రెస్ మంత్రివర్గాల ఏర్పాటుకు పార్టీ అధిష్టాన వర్గం అనుమతి నిచ్చింది.

1938లో గుజరాత్‌లో కాంగ్రెస్ వార్షిక సభ జరిగింది. అక్కడ సుభాష్‌చంద్ర బోస్ ఏకగ్రీవంగా, అధ్యక్షులుగా ఎన్నికకావడం, కాంగ్రెస్ యువకుల, వామపక్షాల బలాన్ని తెలియజేస్తుంది. 1939లో తిరిగి

కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఎన్నిక కావాలని బోస్ అభిప్రాయపడగా, గాంధీ వ్యతిరేకించినాడు. పోటీ జరిగి గాంధీగారి అభ్యర్థి పట్టాభి సీతారామయ్య ఓడిపోయి, బోస్ తిరిగి అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో పనిచేయడానికి, గాంధీ నిరాకరించాడు. ఈ ఓటమిని ఆయన తన ఓటమిగా భావించాడు. అంతట వర్కింగ్ కమిటీని నియమించవలెనని తీర్మానాన్ని ప్రతిపాదించినారు. వర్కింగ్ కమిటి సభ్యులను నియామకం చేయమని బోస్ గాంధీని వేడగా, ఆయన తిరస్కరించినాడు. అంతట, బోస్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసాడు. రాజేంద్ర ప్రసాద్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. సుభాష్‌చంద్ర బోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' అనే నూతన పార్టీని స్థాపించినాడు.

25.3 1935-39 మధ్య కాంగ్రెస్ మంత్రివర్గాలు

రాష్ట్ర స్వయంపాలనపై 1935 చట్టం ఎన్నో ఆంక్షలు విధించింది. కాన, కాంగ్రెస్ మంత్రివర్గాలు బ్రిటీష్ పాలనలోని మౌలిక సామ్రాజ్యవాద లక్షణాలను పెద్దగా మార్పు చేయలేకపోయాయి. అవి విప్లవాత్మక సంస్కరణలు ఏమి చేయలేకపోయినా, వున్న పరిమితులలో ప్రజాజీవనాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేసాయి. మంత్రులు తమ జీతాలను బాగా తగ్గించుకొని, 500/- రూపాయలు తీసుకొంటూ, రైళ్ళో సామాన్యంగా రెండో తరగతి లేదా మూడో తరగతిలో ప్రయాణాలే చేసేవారు. విద్య, వైద్య సదుపాయాలపై ఎక్కువ శ్రద్ధ చూపారు. పౌరహక్కులను కల్పించి, కార్మిక సంఘాలు అధిక వేతనాలను పొందేటట్లు కృషి చేసారు. పత్రికా స్వాతంత్ర్యం అధికమైంది. ప్రప్రథమంగా, స్వేచ్ఛావాయువులను పీలుస్తున్నట్లుగా భారతీయ ప్రజలు భావించారు.

తమకు అత్యధిక సంఖ్యాకబలం వున్న రాష్ట్రాలలోనే మంత్రివర్గాల నేర్పరచిన కాంగ్రెస్ సమర్థమైన పాలనను, నాలుగు కాలాలపాటు నిలబడగల్గే ప్రభుత్వాలను స్థాపించింది. మంత్రివర్గాల పనితీరులపై పార్టీ అజమాయిషీ వుండేది. వారికి స్పష్టమైన విధానం, సమర్థులైన నాయకులున్నారు. అన్ని శాసన సభలలో మంత్రి వర్గాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకై డాక్టర్ రాజేంద్రప్రసాద్, వల్లభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం అజాద్‌లతో ఒక ఉపసంఘాన్ని నియమించారు. మొత్తం మీద, కాంగ్రెస్ మంత్రివర్గాలు ఒక జట్టులా పనిచేసాయి.

రాజకీయ ఖైదీలను విడుదల చేయడం ద్వారా, కాంగ్రెస్ మంత్రివర్గాలు వ్యక్తి స్వేచ్ఛపై ఆంక్షలను తొలగించారు. కమ్యూనిస్టులు, తదితర వర్గాలపై వున్న నిషేధాన్ని రద్దుచేసి, వారిపై వున్న కేసులను ఉపసంహరించారు. పత్రికలు కట్టవలసిన ధరావత్తులను తిరిగి ఇచ్చివేసారు. 1937 కాంగ్రెస్ ఎన్నికల వాగ్దాన పత్రం, ప్రజలలో ఎన్నో ఆశలను కల్పించింది. పేదరికం, నిరుద్యోగం, రైతుల ఋణబాధ తీరిపోగలవని వారు ఆశపడినారు. ఈ విషయాలలో, గణనీయమైన మార్పులు ఏమీ రాలేదు. కొంతవరకు, ప్రజలలో నిరాశ, అసంతృప్తి చోటు చేసుకొన్నాయి. 1938 ఆఖరునాటికి బీహార్, ఉత్తర ప్రదేశ్ లందు అలజడులు చెలరేగినాయి. పంటలు దోచుకోబడినాయి. వాటిని రక్షించేందుకు, సాయుధ పోలీసుల అవసరమేర్పడింది. పారిశ్రామిక కార్మికుల విషయంలో కూడా, పెద్దగా మార్పు రాలేదు.

అయితే మూడు ముఖ్య సాంఘిక సంస్కరణలకు కాంగ్రెస్ మంత్రివర్గాలను అభినందించవలసి వుంది. గాంధీ పీటన్నింటిపైనా శ్రద్ధ చూపేవాడు. ప్రాథమిక విద్య, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణతో సహా దళిత వర్గాల ఉద్ధరణ, ఈ సాంఘిక కార్యక్రమాలు. ఉత్తర ప్రదేశ్, బీహార్, బొంబాయిలందు బేసిక్ విద్యా విధానం, ప్రవేశపెట్టబడింది. వయోజన విద్యను గూర్చి ప్రయోగాలు ముఖ్యమైనవి. మద్యపాన నిషేధంవల్ల, ప్రభుత్వాదాయాలు గణనీయంగా పడిపోయినా కొన్ని ప్రాంతాలలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తూ, శాసనాలు చేసారు. దొంగసారా కాయడాన్ని నిరోధించారు. దళిత వర్గాల ఉద్ధరణకు పెక్కు శాసనాలు చేయబడినాయి. ఉచిత విద్య ఇవ్వబడింది. హరిజనులకు దేవాలయ ప్రవేశం నిరాకరించిన అది శిక్షార్హం కాగలదని బొంబాయి ప్రభుత్వం శాసనాన్ని చేసింది.

BRAOU

25.4 1935-39 మధ్య మత రాజకీయాలు

1937 ఎన్నికల తరువాత ముస్లింలీగ్, కాంగ్రెస్ పార్టీల మధ్యదూరం ఎక్కువైంది. 1937లో లక్నోనందు ముస్లింలీగ్ సమావేశంలో జిన్నా ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ విధానం హిందూమతంకు అనుకూలమైనదని, మంత్రి వర్గాలలోని ముసల్మాన్ ప్రతినిధులు ఆ మతానికి నిజమైన ప్రాతినిధ్యం వహించారని విమర్శించాడు. జిన్నా ముసల్మాన్‌ల తిరుగులేని నాయకుడుగా ఎదిగినాడు. హిందూ - ముసల్మాన్‌ల ఐక్యతా ప్రయత్నాలన్నీ, బూడిదలో పోసిన పన్నీరైంది. ఎందరో స్వతంత్ర ముసల్మాన్ శాసనసభ్యులు, ముస్లింలీగ్‌లో చేరిపోయారు. లక్నో సమావేశం ముగిసిన మూడు నెలల కాలంలోనే లీగ్ 170 కొత్త శాఖలను ప్రారంభించింది. కొన్ని చోట్ల ప్రత్యక్ష చర్యలకు కూడా దిగింది.

1939లో ముసల్మాన్‌లకు ప్రత్యేక రాజ్యం కావాలనే అతివాద నినాదాన్ని ముస్లింలీగ్ లేవదీసింది. 1939లో ముస్లింలీగ్ వర్కింగ్ కమిటీ ఒక ప్రకటనచేస్తూ, "భారతీయ ముసల్మాన్‌ల సమాఖ్య రాజ్యాంగానికి వ్యతిరేకులనియు, అట్టి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ విధానంలోని ముసుగులో, అధిక సంఖ్యాకులైన హిందువుల పాలన కొనసాగునని" వ్యాఖ్యానించింది. 1940 ఫిబ్రవరిలో, జిన్నా మరో ప్రకటన చేస్తూ, ఎట్టి రాజ్యాంగ పరిష్కారమైనా, భారతదేశం ఒక జాతిగాకాక, ద్విజాతి సిద్ధాంతం పైననే ఆధారపడి వుండాలని, ముసల్మాన్‌లు ఏ ఒక్కరి మధ్యవర్తిత్వాన్ని అంగీకరింపజాలరని,తమ భవితవ్యాన్ని తాము నిర్దేశించకోగలరని, ఉద్ఘాటించినాడు. 1940 మార్చిలో లాహోర్ నందు జరిగిన ముస్లింలీగ్ సమావేశానికి, లక్షమంది హాజరైనారు. భారతదేశాన్ని మతపరంగ విభజించాలని వారు తీర్మానించారు.

25.5 రెండో ప్రపంచ యుద్ధం

1939 సెప్టెంబర్ 1వ తేదీన పోలెండ్ పై జర్మనీ జరిపిన దురాక్రమణతో, రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. ప్రథమంలో జపాన్, ఇటలీలు తటస్థంగా వున్నా, కొద్ది కాలంలోనే జర్మనీతో చేరాయి. ఆంగ్లేయ పాలిత ప్రాంతాలు, భారతదేశంకూడా యుద్ధంలో భాగస్వాములైనారు. ప్రపంచాన్ని యుద్ధమేఘాలు క్రమ్ముతున్న కాలంలోనే, కాంగ్రెస్ తన విధానాన్ని స్పష్టపరచింది. "సామ్రాజ్యవాద రాజ్యాలు ఎట్టి సాకులు చెప్పినా, వారుచేసే యుద్ధాలన్నీ సామ్రాజ్యవాద పరమైనవే. అట్టి యుద్ధాలతో మాకెట్టి ప్రమేయమూలేదు" అని 1936లోనే నెహ్రూ స్పష్టపరచాడు. "తాను స్వేచ్ఛలేకుండా స్వేచ్ఛా రాజ్యాల తరపున భారతదేశం ఎట్టి యుద్ధంలోను పాల్గొనలేదని' 'కూడా వివరించాడు. విధానానికి అనుగుణంగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, మంత్రివర్గాలు యుద్ధనిర్వహణ విషయాల్లో ఆంగ్ల ప్రభుత్వానికి ఎట్టి సహాయ సహకారాలు అందించరాదనీ, ఒక వేళ ఈ విధానం కొనసాగడం కష్టమైతే, రాజీనామాకు సంసిద్ధం కావలెననీ, ఆదేశాలిచ్చింది.

యుద్ధం ప్రారంభమైన తరుణంలో సంస్థానాధిపతులు, కాంగ్రెసేతర మంత్రివర్గాలు ఆంగ్ల ప్రభుత్వానికి పూర్తి మద్ధతును ప్రకటించాయి. కాంగ్రెస్ ఎట్టి సహకారమందివ్వడానికి నిరాకరించింది. అయితే, గాంధీ, నెహ్రూలకు ఇంగ్లండ్ పట్ల సానుభూతి వుంది. బోస్ దీనికి వ్యతిరేకం. 1939 సెప్టెంబర్ 18వ తేదీన నెహ్రూ తయారుచేసిన తీర్మానాన్ని అంగీకరించింది. ఫాసిజం,నాజిజంలను ఖండిస్తూ భారతీయుల అనుమతి లేకుండా మన దేశాన్ని యుద్ధంలో భాగస్వామిగా చేస్తూ, వైస్రాయి చేసిన ప్రకటనలకు తీవ్ర అభ్యంతరం తెలిపినారు. బ్రిటీష్ ప్రభుత్వం తన యుద్ధ లక్ష్యాలను, సామ్రాజ్యవాదం, ప్రజాస్వామ్యంపట్ల వారి అభిప్రాయాలను స్పష్టంగా వివరించవలెనని, తీర్మానంలో కోరబడింది. అంతేగాక, సామ్రాజ్యవాదం, ప్రజాస్వామ్యంపట్ల ఆంగ్లేయులకు గల భావాలను భారతదేశ విషయంలో ఏరీతిగా అమలు చేసేది, దేశానికి పూర్తి స్వాతంత్ర్యాన్నిచ్చేది, లేనిది కూడా వివరించాలని కాంగ్రెస్ కోరింది.

25.5.1 కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామా

"స్వయంపాలనా ప్రతిపత్తి" ఇవ్వడం తమ ధ్యేయమని, వైస్రాయి పునరుద్ఘాటించాడు. ఈ ప్రకటన దురదృష్టకరమైనదిగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భావించింది. ఈ ప్రకటన కేవలం సామ్రాజ్యవాద పాతనినాద

పునశ్చరణగా తలచిన కాంగ్రెస్, తమ మంత్రివర్గాలను రాజీనామా చేయవలసిందిగా ఆదేశించింది. 1939 నవంబర్ నాటికి, కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసాయి 1940 మార్చి నెలలో, రాణాఘర్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమావేశంలో, భారత ప్రజలను సంప్రదించకుండా, భారతదేశాన్ని యుద్ధంలో పాల్గొనే రాజ్యంగా ప్రకటించడానికి తీవ్ర అభ్యంతరం తెలుపుతూ, తీర్మానం చేసారు. "సంపూర్ణ స్వరాజ్యం" మినహా ఎట్టి వాగ్దానాలు తమకు ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ స్పష్టపరచింది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి.

1. 1935 -39 మధ్య కాంగ్రెస్ అమలుపరచిన సంస్కరణలెవ్వి?

.....

.....

.....

.....

2. 1935లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుభాష్‌చంద్ర బోస్ ఎందుకు రాజీనామా చేశాడు?

.....

.....

.....

.....

25.5.2 రెండవ ప్రపంచ యుద్ధం - కాంగ్రెస్, ముస్లింలీగ్ స్పందనలు

హిట్లర్, జర్మనీ సామ్రాజ్యాన్ని విస్తరించుటకు పతకం పన్నాడు. అందులో భాగంగా 'నాజీ జర్మని' (అధికార పార్టీ) పోలాండ్‌ను ఆక్రమించుటతో, 1939 సెప్టెంబర్‌లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. దీనితో బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు పోలాండ్ దేశ సహాయార్థం రంగంలో దూకవలసి వచ్చింది. 1939 సెప్టెంబర్ 3వ తేదీన, నాటివైస్రాయ్ లార్డ్‌లిన్‌లిత్‌గో రాష్ట్రాల మంత్రులతోగాని లేదా ఇతర భారతీయ నాయకులతో గాని సంప్రదించకుండానే, బ్రిటన్ జర్మనీతో చేయు యుద్ధంలో, ఇండియా బ్రిటన్ పక్షంవుండేట్లు, ఏకపక్ష నిర్ణయం చేసాడు. అయితే, ఈ సమయంలోనే సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటి, ఈ యుద్ధం ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకించి, *"సామ్రాజ్యవాద కాంక్షతో కొనసాగు యుద్ధానికి తమ సహకారముండదని"* స్పష్టంచేసింది. అదేవిధంగా, యుద్ధ ఆశయాలలో సామ్రాజ్య వాద నిర్మూలన, భారతదేశాన్ని స్వతంత్ర రాజ్యంగా పరిగణించడమనే అంశాలు ఇమిడియున్నవా లేదా అనేదాన్ని నిస్సందేహంగా వివరించమని, ఈ కమిటీ బ్రిటీష్ ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకు సంతృప్తికరమైన సమాధానం రానందున, కాంగ్రెస్ మంత్రులందరు రాజీనామా చేశారు.

వాస్తవానికి, ఫాసిస్ట్ ధోరణుల యెడ వ్యతిరేకతాదృష్టిని కలిగియున్న కాంగ్రెస్, బ్రిటన్ ఫాసిస్ట్ దాడికి గురికావడంతో, దానియెడ సానుభూతిని కనబరచింది. అయితే, ఒక బానిస రాజ్యంగా మార్చబడిన రాజ్యానికి స్వేచ్ఛ ప్రజాస్వామ్య ఆశయసాధనకై పోరాడటం ఎలా సాధ్యమవుతుందని, కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. అందుకోసం భారతదేశాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాలని, లేదా భారతదేశం యుద్ధంలో చురుకుగా పాల్గొనడానికి ముందు, కనీసం భారతీయులకు తగినంత అధికారమివ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

BRAOU

ఇంకొకవైపు, 1937 సాధారణ ఎన్నికలలో పరాభవాన్ని చవిచూసిన ముస్లింలీగ్, తిరిగి రాజకీయ రంగంలోకి దూకడానికి కాంగ్రెస్ మంత్రులు రాజీనామాను సదవకాశమని భావించింది. మనం ఇంతకు ముందు పాఠాలలో చూచినట్లు, ఉత్తర ప్రదేశ్ మంత్రిమండలి ఏర్పాటు విషయంలో, స్వతంత్ర సహకారం కంటే, అంతర్లీనమై పోవడమనే కాంగ్రెస్ విధానం, ముస్లింలీగ్ అధ్యక్షుడైన జిన్నాకు కోపం కలిగించింది. అదేవిధంగా నెహ్రూ ప్రజాసంబంధ కార్యక్రమం, హిందూ మహాసభ మతతత్వం, బ్రిటీష్ ప్రభుత్వం చర్యలు, దాని వైఖరులు ముస్లింలీగ్ నాయకుల మనస్సులలో అనుమానాస్పద ఆలోచనలను రేకెత్తించాయి. తద్వారా, కాంగ్రెస్ ముస్లింలీగ్‌కు మధ్య అగాధం విస్తృతమైంది. అందువల్ల, ముస్లింలీగ్ కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేసిన తరుణాన్ని, ఒక విముక్తి దినంగా పాటించింది. కాగా, అది ప్రభుత్వానికి తన పూర్తి మద్ధతును, సహకారాన్ని తెలిపింది.

1940 తొలిభాగంలోనే జిన్నా ద్విజాతి (two-nation) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. హిందూ, ముస్లిమ్‌లు మత, సాంస్కృతికపరంగా రెండు ప్రత్యేక, వైరుద్ధ్యంగల రాజ్యాలుగా ఏర్పడ్డారని, అతని దృఢాభిప్రాయం. 1940 మార్చి నెలలో లాహోర్‌లో జరిగిన సమావేశంలో, ద్విజాతి సిద్ధాంతాన్ననుసరించి భారతదేశాన్ని హిందూస్థాన్, పాకిస్థాన్ అను రెండు ప్రత్యేక దేశాలుగా విభజించాలని డిమాండ్ చేస్తూ, ఒక తీర్మానాన్ని ఆమోదించారు. అయితే మొదట్లో కొద్దిమంది ముస్లిం నాయకులు మాత్రమే, పాకిస్తాన్ అనే భావనను తీవ్రంగానో, లేదా చూచాయకంగానో, తీసికోవడమైంది. అదేవిధంగా, జిన్నాకు కూడా ఈ తలంపు రావడమనేది, బ్రిటీష్‌వారు కాంగ్రెస్ వారికిచ్చు రాజ్యాంగపరమైన మినహాయింపులను నిరోధించుటకు, ముస్లింల యెడ అదనపు అనుకూల వాతావరణాన్నేర్పరచుటకు ఒక బేరమాడు సాధనంగా మాత్రమే, భావించబడిందని చెప్పవచ్చు. మరొకవైపు, బ్రిటీష్‌వారు ఆ క్షణానికి భారతదేశంలో రాజ్యాంగపరమైన సంపూర్ణ ప్రతిష్టంభనం గావించుటకు, పాకిస్థాన్ అనే భావన ఉపయోగకరమైందిగా భావించారు. అందువల్ల బ్రిటీష్ ప్రభుత్వం ఉన్న పరిమితులలో, జిన్నాను ప్రోత్సహిస్తూనే అతని అన్ని డిమాండ్లను తీర్చే దృక్పథం కలిగి యుండలేదు. ఏది ఏమైనా, కాలం గడుస్తున్నకొద్దీ, జిన్నాలో పాకిస్థాన్ కొరకు పట్టుదల వేళ్ళూనుకోవడమేగాక, అది ఒక మూఢ విశ్వాసంగా పరిణమించింది. దాని తరువాత, 1947లో లీగ్ డిమాండ్‌ను అంగీకరించేంతవరకు, దాని సమస్య ముడులను విప్పుటకు చేయు ప్రయత్నాలన్నియు వ్యర్థమయ్యాయి.

ఇదే కాలంలో, అంటే 1940వ సంవత్సరం వేసవికాలంలో, యూరప్‌లోని యుద్ధం బ్రిటీష్ మిత్రరాజ్యాలకు ఎదురుదెబ్బతీయడమేగాక, జర్మనీ దేశ బాంబుల దాడికి, వినాశనంతో కూడిన ఆకాశం నుంచి చేయుదాడికి గురికావలసి వచ్చింది. ఈ సందర్భంలో కాంగ్రెస్ "బ్రిటీష్ సామ్రాజ్య పతనం నుంచి స్వాతంత్ర్యం కోరనొల్లక" ప్రాముఖ్యంగల అన్ని భారత రాజకీయ పార్టీలతో కూడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని, అతిత్వరలో ఏర్పరచాలనే షరతుతో, బ్రిటన్‌కు తన మద్ధతును తెలిపింది. ఇందుకు జవాబుగా, 1940లో వైస్రాయ్ **"ఆగస్ట్ ప్రకటన"** చేశాడు. ఈ ఆగస్ట్ ప్రకటనలో (1) యుద్ధానంతరం భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని రూపొందించుటకు, రాజ్యాంగ రచనల సంఘాన్ని ఏర్పరచుట; (2) ప్రస్తుత కార్యనిర్వాహక మండలిలో భారతీయ నాయకులను చేర్చుకోవడం ద్వారా, దానిని విస్తృత పరచడం; (3) బ్రిటీష్ ఇండియా, భారత రాజ్యాల ప్రతినిధులతో కూడిన వైస్రాయ్ యుద్ధ మండలిని స్థాపించడం; (4) సంస్కరణల నూతన పథకంలో, ప్రభుత్వ అల్ప సంఖ్యాక వర్గాల డిమాండ్‌కు తగిన ప్రాముఖ్యాన్నివ్వడం, అనే అంశాలు పేర్కొనబడ్డాయి.

వైస్రాయ్ తనతో సహకరించవలసిందిగా, అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించాడు. కాని, కాంగ్రెస్ తాను కోరిన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయుటకు కార్యనిర్వాహక మండలిని విస్తృతపరచడం, అందుకు ప్రత్యామ్నాయం కాదని, ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింది. అంతకంటె, కాంగ్రెస్ అల్ప సంఖ్యాక వర్గాల సమస్యకు (వీరికి ప్రాధాన్యతమివ్వడం అనేది) తన తీవ్ర నిరసనను తెలిపి, వీరికి వీటో అధికార మివ్వబడిందని తన అసంతృప్తిని తెలియజేసింది. ఇంకొకవైపు, ముస్లింలీగ్ అల్ప సంఖ్యాక వర్గాలవారి డిమాండ్‌కు సంబంధించి, బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆహ్వానించింది.

BRAOU

25.6 వ్యక్తిగత సత్యాగ్రహం

కాంగ్రెస్ బ్రిటీష్ ప్రభుత్వం ఎదుర్కొను సమస్యలను అవకాశంగా తీసుకొనెంచక, అదే సమయంలో బ్రిటీష్ విధానానికి తన నిరసనను వ్యక్తపరచాలని తలంచింది. అందువల్ల, మహాత్మాగాంధీ మార్గదర్శకత్వంలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత సత్యాగ్రహాన్ని పాటించుటకు అనుమతించబడింది. సామూహిక చర్య ఏ రూపంలో నుండినను నిషేధించబడింది. ఏమైనను, వ్యక్తిగత సత్యాగ్రహం బ్రిటీష్ విధానంపై ఏమంత ప్రభావాన్ని కలిగించలేదు. ఆ విధంగా, రాజ్యాంగ పరమైన సంక్షోభం ఒకటిన్నర సంవత్సరాల పైబడి కొనసాగింది.

25.7 క్రిప్స్ రాయబారం

1941 లోని యుద్ధకాలంలో, రెండు ప్రధాన మార్పులు సంభవించాయి. 1941 జూన్‌లో నాజీసేనలు సోవియట్ యూనియన్‌ను ముట్టడించాయి. ఇవి అప్పటికే పోలెండ్, బెల్జియం, హాలెండ్, నార్వే, ఫ్రాన్స్‌కు, మరియు ప్రాచ్య ఐరోపాలోని అధిక భాగాన్ని ఆక్రమించాయి. రెండవది, 1941 డిసెంబర్ నెలలో పెరల్ హార్బర్ (పెరల్ నౌకాశ్రయం) వద్ద, అమెరికా యుద్ధనౌకాదళంపై, జపాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ విధంగా, అక్షరాజ్య కూటమి పైన జర్మనీ, ఇటలీ, జపాన్‌లకు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్, అమెరికాదేశాలు యుద్ధరంగంలోనికి ఈడ్చబడ్డాయి. జపాన్ 1941 అంతిమ భాగంలో యుద్ధరంగం ప్రవేశించి, ఫిలిప్పైన్స్, ఇండో-చైనా, ఇండోనేషియా, మలయా, బర్మాలను జయించి, 1942లో రంగూన్‌ను ఆక్రమించింది. ఈ చర్య, యుద్ధాన్ని భారత సరిహద్దులకు తీసుకువచ్చింది.

ఇప్పుడు, బ్రిటీష్ ప్రభుత్వానికి మరే గత్యంతరంలేక యుద్ధ ప్రయత్నంలో భారతీయులు చురుకుగా పాల్గొనాలని తలంచింది. అంతకంటే ఎక్కువ, అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడైన యఫ్.డి.రూజ్‌వెల్ట్ బ్రిటీష్ ప్రధాన మంత్రియైన విన్‌స్టన్ చర్చిల్‌ను భారతీయ నాయకులతో ఒక ఒప్పందానికి రావలసిందిగా వత్తిడి చేశాడు. అందువల్ల, రాజ్యాంగపర సంస్కరణలు చేయు ప్రతిపాదనలతో, ప్రధానమంత్రి చర్చిల్, లేబర్ పార్టీ అతివాద నాయకుడు, నిష్ణాతుడైన దౌత్యాధికారియగు స్టాఫర్డ్ క్రిప్స్‌ను పంపాడు. క్రిప్స్ నెహ్రూకు ఒక తెలిసిన స్నేహితుడు కావడం, భారత జాతీయ పోరాటానికి సానుభూతితో కూడిన వైఖరి కలిగియుండడం వల్ల, భారతదేశంలో ఆశాజనకమైన పరిస్థితి ఏర్పడింది. ఇతడు భారత రాజకీయ పార్టీ నాయకులందరితో కలిసి, 1942 మార్చి నెలలో కింద తెలిపిన ప్రతిపాదనలను చేశాడు. అవి :

1. యుద్ధానంతరం, ఒక రాజ్యాంగ రచన సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
2. దాని సభ్యులను భారతదేశ దిగువ సభనుంచి ఎన్నుకోవాలి.
3. బ్రిటీష్ కామన్‌వెల్త్ పరిధిలోనే ఒక డొమినియన్‌గా, బ్రిటీష్ ఇండియా, భారతీయ రాజ్యాల సమాఖ్య ఏర్పడటాన్ని ఆశించింది.
4. ఈ కింది షరతులకు కట్టుబడి, రాజ్యాంగ రచనల సంఘం రూపొందించిన రాజ్యాంగాన్ని, బ్రిటన్ అంగీకరించవలసి యుంటుంది.

అ) ఏదేని బ్రిటీష్ రాష్ట్రం ఈ సమాఖ్యలో చేరనొల్లనిచో, దానికి ప్రస్తుతమున్న హోదాను, అది నిలుపుకోవచ్చు. అందుకు బ్రిటీష్ ప్రభుత్వం, ఆ రాష్ట్రానికి ఇండియన్ యూనియన్‌లోని ఇతర రాష్ట్రాలకు ఇచ్చే హోదానే, ఇవ్వవలసి వుంటుంది.

ఆ) రాజ్యాంగ రచనల సంఘం, బ్రిటీష్ ప్రభుత్వ, అల్ప సంఖ్యాక వర్గాల హక్కులతో సహా, అధికార బదిలీకి సంబంధించిన అన్ని అంశాలతో కూడిన ఒక ఒప్పందంపై సంతకం చేయవలసి వుంటుంది.

ఇ) వైస్రాయ్ క్రిప్స్ రాయబారం, రాష్ట్రాలకు అధినివేశరాజ్య ప్రతిపత్తి (Dominion Status) ని, మరియు యూనియన్ నుంచి వైదొలగే హక్కును కూడా కల్పించింది. ఈ ప్రతిపాదనను విభజన కొరకు లీగ్ కోరికను

BRAOU

పురస్కరించుకొని చేసిన మినహాయింపు. అయితే, పూర్తి విభజనను బ్రిటీష్ ఒప్పుకోనందున, లీగ్ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. కాంగ్రెస్ కూడా ఇందుకు అభ్యంతరాలను తెలిపింది. వైస్రాయ్‌కున్న అధికారాలు ఏమాత్రం తగ్గక, ఇంకా దేశ రక్షణకు అతన్నే బాధ్యుడుగా చేయడంవల్ల, ఈ తాత్కాలిక ఏర్పాట్లు అసంతృప్తిని కలిగించాయి. జపానీయుల దాడిని త్రిప్పి కొట్టటలో ప్రజల అండను, ప్రజా చైతన్యాన్ని పురికొల్పుటకు, జాతీయ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ పట్టుపట్టింది. అందుకు, యూనియన్ నుంచి రాష్ట్రం వేరుపడే ప్రతిపాదనవల్ల, అది దేశ సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని, ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ కూడా వ్యతిరేకించింది. చివరగా, బ్రిటీష్ రాజ్యపునాదులే శిథిలావస్థలో ఉన్న ఆ దశలో, ఈ అధినివేశ రాజ్య ప్రతిపత్తినిచ్చే దీర్ఘకాలిక ప్రతిపాదనను "ఒక దివాలా తీసిన బ్యాంకుకు వ్రాసిన ముందు తేదీగల చెక్కు" గా గాంధీజీ పేర్కొన్నాడు.

25.8 క్విట్ ఇండియా తీర్మానం

క్రిప్స్ రాయబార వైఫల్యం, భారతదేశ ప్రజలను బాగా విసిగించింది. రాజకీయ దిగ్బంధనాన్ని పరిష్కరించు ప్రయత్నాలు విఫలం కావడంతో ఆశాభంగం, అసంతృప్తి చెందిన కాంగ్రెస్‌కు, బ్రిటీష్ ప్రభుత్వం ఎంతకాలం వరకు దేశాన్ని పరిపాలిస్తుందో, అంతవరకు మత సమస్య పరిష్కరించబడదనే విషయం స్పష్టమైంది. అదేవిధంగా, కాంగ్రెస్‌ను ఒక హిందూ మత సంస్థగా భావించడం, లీగ్‌ను ముస్లిం వర్గానికి చెందిన ఏకైక ప్రతినిధిగా చెప్పుకొను జిన్నా అభిప్రాయాన్ని అంగీకరించే బ్రిటీష్ ధోరణిలో, కాంగ్రెస్ ఇష్టపడలేదు. రాజకీయాలలో రాజీకి సమ్మతించకుండా ఉండేటట్లు, బ్రిటీష్ ప్రభుత్వం లీగ్‌ను రహస్యంగా బలపరుస్తుందని, కాంగ్రెస్ తలంచింది. దానికంటే, బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశం నుంచి అతిత్వరగా వైదొలగడమొక్కటే, భారతదేశాన్ని జపానీయుల దాడి నుంచి నిరోధించగలదని, కాంగ్రెస్ భావించింది.

కాంగ్రెస్ దాని డిమాండును వ్యక్తపరచడానికి, 1942, ఆగస్టు 8వ తేదీన బొంబాయి సమావేశంలో, క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించింది. ఇది, అహింసా పూర్వక ప్రజాపోరాట ప్రారంభాన్ని ప్రతిపాదించింది. ఇందుకు, కాంగ్రెస్ ప్రతినిధులతో మాట్లాడుతూ, గాంధీజీ ఇట్లా అన్నాడు. "అందువల్ల తక్షణమే, ఈ రోజురాత్రే, ఒకవేళ పొందగలిగితే, తెల్లవారక ముందే స్వాతంత్ర్యం కావాలంటాను. అందుకు ఇక్కడొక మంత్రముంది. అదినేను మీకుపదేశించే చాలా చిన్న మంత్రం. దానిని మీ హృదయాల మీద ముద్రించుకోవచ్చు: మీ ప్రతిశ్వాస దానికి చిహ్నంగా ఉండవచ్చు. ఈ మంత్రమేమిటంటే ***"సాధించు లేదా చావు, Do or Die"***. మనం, భారతదేశానికి స్వేచ్ఛను కల్పిద్దాం? లేదా, దాని ప్రయత్నంలో మరణిద్దాం. మన బానిసత్వం వృద్ధిపొందటాన్ని చూడడం కోసం బ్రతకకూడదు".



గాంధీజీ, మహాదేవ దేశాయి, నెహ్రూ, ఎ.ఐ.సి.సి (క్విట్ ఇండియా తీర్మానం) సమావేశం-
బొంబాయి, 1942

BRAOU

25.8.1 కర్నూలు సర్కులర్

ఆంధ్ర ప్రజలపై క్విట్ ఇండియా ఉద్యమ ప్రభావం చాలా ప్రబలంగా వుంది. ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాలవారు ఈ ఉద్యమ ప్రభావంగా గణనీయమైన విధంగా స్పందించారు. ప్రసిద్ధి చెందిన ఆంధ్రా సర్కులర్‌ను జూన్ 29-1942 సం॥ కళా వెంకటరావు రూపొందించారు. దాన్ని పట్టాభి సీతారామయ్యద్వారా కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఆమోదంకోసం బొంబాయికి పంపించడం జరిగింది. ఆంధ్రా సర్కులర్‌కు కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఆమోదం లభించిందని కొందరి అభిప్రాయం. కర్నూలు కాంగ్రెసు ఆఫీసుపై పోలీసులు దాడి నిర్వహించినపుడు ఈ సర్కులర్‌ప్రతి పోలీసులకు లభించడం వల్ల దానికి "కర్నూలు సర్కులర్" అనే పేరు వచ్చింది.

ఆంధ్రదేశంలో క్విట్ ఇండియా ఉద్యమం ఎలా నిర్వహించబడాలో కర్నూలు సర్కులర్‌లో విశదంగా పొందుపరచబడింది. దాని ప్రకారం ఉద్యమాన్ని శాంతియుతంగా నిర్వహించాలి. ప్రభుత్వం యొక్క నిషేధపు ఉత్తర్వులు ధిక్కరించాలి. న్యాయవాదులు తమ వృత్తిని త్యజించి న్యాయస్థానాలను బహిష్కరించాలి. ఆంగ్లేయులు విద్యా సంస్థలను ప్రజలందరు బహిష్కరించాలి. రవాణా సౌకర్యాలను భగ్నం చేసేందుకు రైలు పట్టాలను వంతెనలను విధ్వంసం చేయడానికి పిలుపు యివ్వబడింది. స్థానిక సంస్థలకు పన్నులు చెల్లింపు మినహా యితర పన్నులేమీ ఆంగ్ల ప్రభుత్వానికి చెల్లించరాదు. సైనికులు ఎంపిక కేంద్రాలను (Recruiting Centres) పికెటింగు చేయడానికి పిలుపు యివ్వబడింది. బ్యాంకులకు, ప్రజలు తీసికొన్న రుణాలను చెల్లించరాదని, ప్రజలు బ్యాంకులలో దాచుకొన్న డిపాజిట్లు ఉపసంహరించుకోవాల్సిందిగా సలహా యివ్వబడింది. అన్ని భవంతులపై త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాలి. పైన పేర్కొన్న విధంగా 'ఆంధ్రదేశంలో ఆర్థికపరంగా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొల్పి బ్రిటీష్ ప్రభుత్వ ఆర్థిక పతనానికి దోహదం చేయాల'ని కర్నూలు సర్కులర్ యొక్క ముఖ్యోద్దేశంగా విశదమౌతుంది.

25.8.2 జాతీయోద్యమ కాలంలో అహింసా సిద్ధాంతం ఆచరణలో గాంధీ అనుసరించిన విధానాలలో పరిణామాలు

భారత జాతీయోద్యమంలో మహాత్మాగాంధి 1920 సం॥ నుంచి ప్రముఖ పాత్ర నిర్వహించి ఆ ఉద్యమం యొక్క మహోన్నత నాయకుడయ్యాడు. 1919 సం॥లో రౌలట్ చట్టం అమలు విషాదకరమైన జలియన్‌వాలాబాగ్ హత్యాకాండకు దారితీయడంవల్ల, మహాత్మా గాంధి పోరాటపటిమతో ఉద్యమాన్ని నిర్వహించాలనే నిర్ణయం తీసికొన్నట్లు కొందరి అభిప్రాయం. మహాత్మా గాంధి, ప్రారంభంలో అహింసా సిద్ధాంతాన్ని ఖచ్చితంగా పాటిస్తూ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపు నిచ్చాడు. ఈ ఉద్యమం శాంతియుతంగా నిర్వహించాలని గాంధీ ఆదేశించాడు. కాని చౌరీచౌరా సంఘటనలు తర్వాత సహాయనిరాకరణోద్యమం హింసారూపం ధరించడంతో ఆ ఉద్యమాన్ని వెంటనే నిలుపు చేయాల్సిందిగా గాంధీ ఆదేశించాడు. కాంగ్రెసు పార్టీలోని అన్ని వర్గాలవారు ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోయారు. సహాయ నిరాకరణోద్యమాన్ని హఠాత్తుగా నిలుపుదలచేయడంవల్ల ముస్లింలు తీవ్రంగా మనస్తాపం పొందారు.

మహాత్మాగాంధీకి 'అహింస' అనేది ఒక సిద్ధాంతం మాత్రమే. హింసను సిద్ధాంతపరంగా త్యజించ వలసిన అవసరం లేదని మహాత్మా గాంధి అభిప్రాయపడ్డారు. గాంధీజీ ఉద్దేశ్యంలో హింసాసిద్ధాంతాన్ని ఆచరించవలసిన అవసరం ఎందుకులేదంటే అహింసా సిద్ధాంతం కూడ అంతే ప్రాముఖ్యం కలిగి వుంది. ఆచార్యబిపన్ చంద్ర అహింసాసిద్ధాంతాన్ని సమర్థిస్తూ చెప్పిన మాటలు, "అహింసా సిద్ధాంతం భారత జాతీయోద్యమంలో అంతర్గత స్రవంతిలాంటిది. జాతీయోద్యమం ప్రజావుద్యమం కాబట్టి అహింసా సూత్రం దాని ముఖ్య లక్షణమైంది. జాతీయోద్యమం అహింసా సిద్ధాంత పాతిప్రదికపై నిర్వహించబడింది. కాబట్టి సామాన్య ప్రజానీకం ఆ ఉద్యమంలో పాల్గొనే అవకాశం కలిగింది. సామాన్య ప్రజానీకం హింసాయుత ఉద్యమాలలో పాల్గొనడానికి భయపడతారు. అహింస, శాంతి సూత్రాల పాతిప్రదికపై జాతీయోద్యమం నిర్వహించబడింది కాబట్టి మహిళలు పెద్ద సంఖ్యలో

ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. అహింసా పూర్వక శాంతియుత ఉద్యమాన్ని ఏవిధంగా ఎదుర్కోవాలో ఆంగ్లేయులు సందిగ్ధంలో పడ్డారు. శాంతియుతంగా నిర్వహించబడే ప్రజాఉద్యమాన్ని దమన కాండకు పాల్పడి నిర్దాక్షిణ్యంగా అణచివేస్తే ప్రపంచ దేశాలు ఏ విధంగా స్పందిస్తాయో అని ఆంగ్లేయులు భయపడ్డారని" ఆచార్య బిపన్ చంద్ర వ్యాఖ్యానించారు. నిరాయుధులై భారతీయులు, మరో ప్రత్యామ్నాయంలేకనే అహింసా సిద్ధాంత ప్రాతిపదికపై ఈ ఉద్యమం నిర్వహించారని ఆచార్య బిపన్ చంద్ర అభిప్రాయం వ్యక్తం చేశారు. అహింసా సిద్ధాంతం వలస రాజ్యాధినేతల రాజకీయ, సైనిక పటిష్టతలో సమానం. ప్రజాఉద్యమం హింసా మార్గం ద్వారా నిర్వహించి నట్లయితే ఆంగ్లేయులు ఆ ప్రజాఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసి, తమ చర్య న్యాయబద్ధమైనదిగా సమర్థించుకొనే అవకాశం యిచ్చినట్లయ్యేది. దాని ఫలితంగా దేశంలో రాజకీయ నిర్లిప్తతకు దారితీసింది. ఆచార్య బిపన్ చంద్ర పేర్కొనట్లుగా 'భారీసంఖ్యలో ప్రజలు పాల్గొన్న ప్రజాఉద్యమాలు, స్వభావరీత్యా సహజంగా అహింసా యుతంగానే వుంటాయి. అహింసా సిద్ధాంత ప్రాతిపదికగా నిర్వహించబడిన జాతీయోద్యమం సాయుధపోరాటంతో సమానమ'ని బిపన్ చంద్ర వ్యాఖ్యానించారు.

భారతదేశంలో అధికార మార్పిడి హఠాత్తుగా, సాయుధ విప్లవ ఫలితంగా జరుగలేదు. జాతీయోద్యమం దీర్ఘకాలం కొనసాగింది. నైతిక, రాజకీయ, సిద్ధాంతపరమైన రాజకీయ పరిణామాల ఫలితంగా ఆంగ్ల పాలన అంతమైంది. భారత జాతీయోద్యమం నిర్వహించిన తీరు నిశితంగా పరిశీలిస్తే ముఖ్యంగా మహాత్మా గాంధీ యొక్క రాజకీయ వ్యూహం, నాయకత్వ శైలి పరిశీలిస్తే అహింసా సిద్ధాంత ప్రాతిపదికపై నిర్వహించబడిన ఉద్యమాలు కూడ, వలస రాజ్యాల ఆధిపత్యాలకు భ్రష్టుపట్టించి, వాటి ఆధిపత్యాల నుంచి విముక్తి పొందిన వలస రాజ్యాలను ప్రజాస్వామిక వ్యవస్థలుగా మార్చగలవని రుజువైందని బిపిన్ చంద్ర వ్యాఖ్యానించారు.

25.9 క్విట్ ఇండియా ఉద్యమం, 1942

కాంగ్రెస్ తన ఉద్యమాన్ని ప్రారంభించకముందే, ప్రభుత్వం అందుకు తగిన ఏర్పాటు చేసి, ఈ ఉద్యమాన్ని ఎదురు దెబ్బతీసింది. మరుసటి రోజు తెల్లవారుజామునే గాంధీజీ, ఇతర ప్రముఖ కాంగ్రెస్ నాయకులు అరెస్టుగావించబడి, కాంగ్రెస్ ఒక అక్రమ సంస్థగా ప్రకటించబడింది.

ఈ అరెస్ట్ వార్తలు దేశం మొత్తాన్ని కలచివైచాయి. అందుకు ప్రతిస్పందనగా, దేశం నలుమూలలలో నిరసనోద్యమాలు చెలరేగాయి. దేశం అంతటను సమ్మెలు, హర్తాళ్ళు, ఊరేగింపులు జరుపబడ్డాయి. వీటికి ఒక నాయకుడుగాని, సంస్థగాని లేక, ప్రజలు వారికిష్టమొచ్చిన రీతులలో, ప్రతిచర్యలకు పూనుకొన్నారు. బ్రిటీష్ అధికారానికి సంకేతాలైన పోలీస్ స్టేషన్లు, తపాలా కార్యాలయాలు, రైల్వేలు మొదలగునవి ప్రజావెల్లువ ప్రతీకార దాహానికి గురికాబడ్డాయి. ఈ ప్రతిఘటనోద్యమానికి, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు అండగా నిలిచారు.

బ్రిటీష్ ప్రభుత్వం కొంతకాలంపాటు ఎన్నో పట్టణాలు నగరాలు, గ్రామాలపైన తన అజమాయిషీని కోల్పోయింది. మద్రాస్, మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలపై, బ్రిటీష్ ఆధిపత్యం మరుగున పడిపోయింది. ఆ విధంగా, బ్రిటీష్ వ్యతిరేక పోరాట పంధాగల ఈ 1942 తిరుగుబాటు, ఇంతకు పూర్వపు కాంగ్రెస్ ఉద్యమాలన్నిటి కంటెను మించినటువంటిది. 1942 ఆగస్టు 9వ తేదీ నుంచి జరిగిన పరిణామాలన్నింటిని, లార్డ్ లిన్‌లిత్‌గో వ్యక్తిగతంగా ఇలా వర్ణించాడు. *"1857 సిపాయిల తిరుగుబాటు కంటే గూడా, ఇది చాలా తీవ్రమైన తిరుగుబాటు, భద్రత దృష్ట్యా, దీని తీవ్రతను, విస్తృతిని ప్రపంచానికి తెలియకుండా మేము మరుగుపరచినాము".*

1942 తిరుగుబాటును అణచివేయుటకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకున్నది. అందులో భాగంగానే, వార్తాపత్రికలు నిషేధించబడ్డాయి. ప్రదర్శనలు జరుపు ప్రజలు, బాంబులకు, మరతుపాకుల గురిచేయబడ్డారు. తెనాలి, గుంటూరు, భీమవరములలో ప్రజలను బెదరగొట్టుటకు, పోలీసులు లాఠీచార్జి, కాల్పులు జరిపారు. ప్రభుత్వం, తన అణచివేత చర్యలతో, అతికష్టం మీద 1942 అంతం నాటికి, సాధారణ పరిస్థితిని

పునరుద్ధరించుటలో కృతకృత్యమైంది. తిరుగుబాటు అతిస్వల్పకాలంలోనే అణచివేయబడినప్పటికి, బిపన్ చంద్ర చెప్పినట్లు 'అది దేశంలో పెల్లుబికిన జాతీయ భావనలలోతులను, పోరాటానికి అవసరమగు సామర్థ్యతలను, ప్రజలు అలవరచుకున్న త్యాగాన్ని వ్యక్తీకరించడంలోనే, దాని ప్రాముఖ్యం నిబిడీకృతమైవుంది.'

కాంగ్రెస్ నాయకులందరిని అరెస్ట్‌చేయడం, 1942 తిరుగుబాటును అణచివేయడంవల్ల, 1945లో జరిగిన యుద్ధపరిసమాప్తి వరకు, దేశంలోపల రాజకీయ కార్యకలాపాలు మందగించాయి. 1943 మార్చి నెల 23వ తేదీన, ముస్లింలీగ్ "పాకిస్తాన్ దిన" ఉత్సవాన్ని జరుపుకొని, ముస్లింలకు ప్రత్యేక రాజ్యాన్ని సాధించు ప్రతినను పునరుద్ఘాటించింది. 1943లో బెంగాల్ క్షామానికి గురికాబడి, అకలి, మహమ్మారి రోగానికి, దాదాపు మూడు మిలియన్ల ప్రజలు మరణించారు. ఇంత భారీయెత్తున మారణహోమం జరుగకుండా, ప్రభుత్వం క్షామ నివారణ చర్యలు తీసుకోవలసి యుండెనని, ప్రజలు కోపోద్రిక్తులైయుండిరి. అయితే, ఈ ప్రజల కోపం అతి తక్కువ రాజకీయాధారాన్ని కలిగియుండెను.

I. మీ అవగాహన పరీక్షించుకోండి.

1. క్రిప్స్ ప్రతిపాదనలోని ముఖ్య అంశాలు ఏవి?

.....

.....

.....

.....

2. క్విట్ ఇండియా తీర్మానం ఎప్పుడు ఆమోదించినారు?

.....

.....

.....

.....

BRAOU

25.10 సుభాష్‌చంద్ర బోస్ - భారత జాతీయ సైన్యం (I.N.A)

దేశం లోపల రాజకీయ కార్యకలాపాలు మరుగున పడినప్పటికి, దేశ సరిహద్దుల ఆవలి నుంచి రాజకీయ కార్యకలాపాలు కొనసాగింపబడ్డాయి. 1941లో భారతదేశం నుంచి తప్పించుకొని పారిపోయిన సుభాష్‌చంద్ర బోస్, నాజీ జర్మనీతో సంబంధాలు పెంచుకున్నాడు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని జరుపుటకు, జపాన్ సహాయం పొందగోరి, 1943లో అక్షరాజ్య కూటమిలో ఒకటైన జపాన్‌కు వెళ్లాడు. భారతజాతీయ సైన్యానికి నాయకత్వం వహించుటకు, సింగపూర్‌కు తిరిగివచ్చాడు. ఆజాద్ హింద్ ఫౌజ్‌గా ప్రసిద్ధిగాంచిన భారత జాతీయ సైన్యం, బ్రిటీష్ సైన్యంలో కెప్టెన్ అయిన జనరల్ మోహన్ సింగ్, తీవ్రవాద విప్లవకారియైన రాష్ బెహారి బోస్‌ల అధ్వర్యంలో, 1942లో స్థాపించబడింది. భారత జాతీయ సైన్యానికి సుభాష్‌చంద్ర బోస్ నాయకుడు. ఇది ఆగ్నేయాసియాలోని భారతీయులను, మలయా, సింగపూర్, బర్మాలలో బందీలుగా తీసుకున్న భారతీయ సైనికులను, అధికారులను, అధిక సంఖ్యలో నియమించుకుంది. అటు తర్వాత బర్మానుంచి భారతదేశంపై జరుపు సైనిక యాత్రలో, భారత జాతీయ సైన్యం జపాన్ సైన్యంతో కలిసి, భారత సరిహద్దును చేరింది. ఆ విధంగా, రెండవ ప్రపంచ యుద్ధాన్ని మన గడప ముందుకు తీసుకొని వచ్చినట్లయింది. స్వేచ్ఛాయుత తాత్కాలిక భారత ప్రభుత్వానికి, సుభాష్‌చంద్ర బోస్ అధిపతిగా, తాము విముక్తి కారులుగా, భారతజాతీయ సైన్యం భారతదేశంలోకి ప్రవేశించాలని తలంచింది.



సుభాష్‌చంద్ర బోస్ - ఆజాద్ హింద్ ఫౌజ్

ఏదిఏమైనా, భారత జాతీయ సైన్యం, అస్సాంలోని ఇంఫాల్ దాటి, ముందుకు వెళ్ళలేకపోయింది. ఆగ్నేయాసియాలో జపాన్ సైన్యం ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చి, బ్రిటీష్ సైన్య తాకిడికి, జపాన్ సైన్యం క్రమంగా క్షీణించింది. 1944-45 లో జపాన్ పతనం కావడంతో, భారత జాతీయ సైన్యం ఓడిపోయి, బ్రిటన్ సేనలకు లొంగిపోయింది. బోస్ లేదా నేతాజీగా పిలవబడే ఈయన, తన టోకియో ప్రయాణంలో ఒక విమాన ప్రమాదంలో మరణించాడు.

బోస్ జీవిత చరిత్రలోని చివరిదశ ప్రాముఖ్యాన్ని పరిగణించుటలో, ప్రత్యక్ష సాధనకు (immediate achievement) అంతిమ ప్రభావాన్ని (ultimate impact) మధ్య భేదాన్ని తెలియజేయడం, అత్యంతావసరం, భారత జాతీయ సైన్యం సైనిక పరంగా వైఫల్యం చెందినప్పటికీ, ఇతర రంగాలలో దాని ప్రభావం ఎక్కువ. భారత జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేసి, భారత ప్రజలలోను, భారత సైన్యంను, సుభాష్‌చంద్ర బోస్ అవిరళమైన దేశభక్తి భావాన్ని రగిల్చాడు. 1945 నవంబర్‌లోను, భారత జాతీయ సైన్య సభ్యులపై బ్రిటీష్ ప్రభుత్వం విచారణ జరపడానికి వ్యతిరేకంగా, దేశమందంతటను బలమైన ప్రజాప్రదర్శనలు బయలుదేరాయి. దీనికంటే, భారత జాతీయ సైన్య అనుభవానికి, 1945-46లలో బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో బయలుదేరిన అసంతృప్తికి మధ్య సంబంధం అతి ప్రధానమైంది. ఇది 1946 ఫిబ్రవరినెలలో జరిగిన బొంబాయి నావికుల సమ్మెతో, ఉచ్ఛదశకు చేరుకుంది. దీనినే, భారతీయ నావికుల తిరుగుబాటు అని కూడా అంటారు. చాలావరకు, 1947లో భారతదేశం నుంచి వెంటనే వైదొలగేందుకు, బ్రిటీష్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక గల అతి ప్రధానమైన కారణం కూడా, అదేనని చెప్పవచ్చు.

1944, మే నెలలో అనారోగ్యకారణంవల్ల, గాంధీజీ జైలు నుంచి విడుదల గాబడ్డాడు. మత సమస్యను పరిష్కరించడానికి అతడు జిన్నాతో సుదీర్ఘ చర్చలు ప్రారంభించాడు. గాంధీజీ, తక్కువ అధికారాలు ఎక్కువ రాష్ట్రీయ స్వేచ్ఛతో కూడుకున్న సమాఖ్య ప్రభుత్వాన్ని ప్రతిపాదించగా, జిన్నా తన ద్విజాతి సిద్ధాంతాన్నే పట్టుకొన్నాడు. జిన్నా, దేశ విభజనతోటే తాను సంతృప్తి పొందుతాననే విషయాన్ని, స్పష్టంచేశాడు. పర్యవసానంగా, ఏలాంటి ఒప్పందం కుదరలేదు.

25.11 వేవెల్ ప్రణాళిక

1945 తొలిభాగంలో యూరప్‌లో యుద్ధాన్ని పరిసమాప్తి చేయడంవల్ల భారతదేశంలో బ్రిటీష్ నిరంకుశ ప్రభుత్వ పాలనను కొనసాగించాలనడంలో న్యాయంలేదు. అదే విధంగా, 1945 జూన్ మాసంలో సాధారణ ఎన్నికలు జరుగనున్నందున, టోరీపార్టీనాయకుడైన చర్చిల్, తనపార్టీ భారతదేశంలో ఒక రాజకీయ పరిష్కారాన్ని కుదుర్చుకోవడంలో ఆసక్తి కలిగియున్నదనే విషయం, బ్రిటీష్ వాటర్లకు స్పష్టం చేయాలని తలంచాడు. దానికంటేను, జపాన్ ఇంకా తన ఓటమిని ఒప్పుకోనందున, దాని వ్యతిరేక పోరాటంలో బ్రిటీష్‌కు భారత ప్రజల సహకారం ఎక్కువగా అవసరమైంది. అందువల్ల రాజ్యాంగ ప్రతిష్టంభనను తొలగించే ఉద్దేశంతో, 1945 మార్చిలో,

BRAOU

వైస్రాయ్ వేవెల్ 1942 నాటి క్రిప్స్ ప్రతిపాదనను పునర్నవం గావించాడు. అదే విధంగా, వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలోకూడా భారత రాజకీయ పార్టీల నాయకులలో నుంచి ఎంపిక చేసుకోబడినవారు కూడా ఉంటారు. వీరు ముస్లింలు, హిందువుల నుంచి సమాన ప్రతిపత్తిలో ఎంపిక కాబడతారు.

ఈ ప్రతిపాదన అర్థమేమంటే, మండలిలోని సీట్లు రాజకీయ పార్టీలకు రిజర్వ్ చేయబడక, మత సమాజాలకే కేటాయించ బడతాయన్న మాట. ఈ ప్రతిపాదనను రెండు పార్టీలు కూడా అంగీకరించలేదు. కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా యున్న ఒక లౌకిక సంస్థగా గాక, అది ఒక హిందూ సంస్థగా గుర్తించబడటాన్ని తిరస్కరించింది. అదే విధంగా ముస్లింలకు తాను మాత్రమే ప్రతినిధినని వాదిస్తూ, దాని తరపున కాంగ్రెస్‌లోని ముస్లిం సభ్యులను మండలిలోకి తీసుకోవడాన్ని అంగీకరించలేదు.

25.12 సిమ్లా సమావేశం, 1945

వైస్రాయ్ తన ప్రతిపాదనలను అమలు చేయుటకై, సిమ్లాలో భారత రాజకీయ పార్టీల సమావేశానికై ఆజ్ఞాపించాడు, అందుకు, 1942 నుంచి జైళ్ళలో మ్రగ్గుతున్న కాంగ్రెస్ నాయకులందరిని విడుదల గావించాడు. అయితే ఇంతకు ముందు చూచినట్లు, ఎలాంటి ఫలితం లేకుండానే, ఆ సమావేశం ముగిసింది. ముస్లింలకు తానే ఏకైక ప్రతినిధిగా గుర్తించబడాలనే ముస్లింలీగ్ డిమాండ్‌ను, కాంగ్రెస్ ఒప్పుకోలేదు. జిన్నాకు బలాన్ని చేకూర్చడమొక్కటే, ఈ సమావేశం ద్వారా చేకూరిన ఫలితం. ఎందుకంటే లార్డ్ వేవెల్, జిన్నాకు వీటో అధికారాన్ని కల్పించాడు. అయితే, ఇందు మూలంగానే ఈ సమావేశం విఫలమైంది. దీనివల్ల, కాంగ్రెస్‌కు, లీగ్‌కు మధ్యగల వైషమ్యాలను విషపూరితంచేసి, దాని ద్వారా దేశంలోని మొత్తం హిందూ-ముస్లిం సంబంధాలనే క్షీణింపజేయడం వల్ల, తమ వలస పాలనను దీర్ఘకాలం వరకు కొనసాగించవచ్చుననే బ్రిటీష్ పాలకులు భావించారనేది మనకు స్పష్టమవుతుంది.

జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి అను పట్టణాలపై అణుబాంబులను వేయడంతో, 1945 ఆగస్ట్‌లో అంతమైన రెండవ ప్రపంచ యుద్ధం, భారత జాతీయోద్యమ చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించింది. స్వరాజ్య సాధనకు అప్పటి నుంచి, వ్యవస్థీకృతమైన ఉద్యమాలు నిర్వహించబడలేదు. అయితే, భారతదేశం నుంచి బ్రిటీష్‌వారు వైదొలగడానికి నిర్ణయం తీసుకొను విధంగా, అంతర్గత బహిర్గత పరిస్థితులు ప్రభావపరిచాయి. ఇంగ్లండ్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి రావడం యుద్ధంవల్ల కలిగిన ఆర్థిక సంక్షోభం, ప్రజల స్వచ్ఛంద నిరసనలు (భారత జాతీయ సైన్య సభ్యుల విచారణా సమయంలో జరిగిన ప్రదర్శనలు) భారత సైన్యంలో నిరసన భావాలు రేకెత్తడం మొదలగునవి బ్రిటీష్‌వారు ఇంక ఎంతోకాలం భారతదేశాన్ని పాలించలేరనే భావాన్ని ఋజువు చేశాయి. అందువల్ల, బ్రిటన్‌లో అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ **"విభజించి పాలించు"** అనే విధానం నుంచి **"విభజించి వైదొలగుట"** అనే విధానానికి మారింది. ఈ కొత్త ప్రభుత్వం, భారత మండలులకు (కేంద్ర, రాష్ట్ర) ఎన్నికలు జరిపించి, అటు పిమ్మట వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిని పునర్నిర్మాణం చేసి, ఆ తరవాత, రాజ్యాంగ రచనల సంఘాన్ని ఏర్పాటు చేయుటకు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాలు ఏ విధంగా అమలు చేయబడ్డాయి, అధికార బదిలీ ఎలా జరిగిందనే విషయాలు, తరువాత పాఠంలో పరిశీలిద్దాం.

III. మీ అవగాహన పరీక్షించుకోండి.

1. భారత జాతీయ సైన్య స్థాపకుడెవరు?

.....

.....

.....

.....

BRAOU

2. 1945లో సిమ్లా సమావేశం, ఎందుకు ఏర్పాటైంది?

.....

.....

25.13 సంగ్రహంగా

1. రాష్ట్రాల్లోని కాంగ్రెస్ మంత్రివర్గాలు కొన్ని సంక్షేమ పథకాలను అమలు పరచాయి. బేసిక్ విద్యా విధానాన్ని, మద్యపాన నిషేధాన్ని అమలు పరచాయి. హరిజనుల పరిస్థితులను మెరుగుపరచడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వాలు చర్యలు తీసుకొన్నాయి.

2. ప్రజాప్రతినిధులతో సంప్రదించకుండా రెండవ ప్రపంచ యుద్ధంలో భారతీయులు పాల్గొనేటట్లు చేసినందుకు, కాంగ్రెస్ నాయకులు తమ అసమ్మతిని ప్రకటించారు.

3. యుద్ధ కార్యక్రమానికి భారతీయులు సహకారాన్ని అర్థించడానికి, 1942లో క్రిప్స్ సంఘం మనదేశానికి వచ్చింది. యుద్ధం ముగిసిన తర్వాత దేశానికి డొమినియన్ ప్రతిపత్తి (Dominion Status) ఇచ్చే ప్రతిపాదన క్రిప్స్ సంఘం చేసింది.

4. 1857 తరువాత బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా భారతదేశంలో జరిగిన తిరుగుబాటులన్నిటిలోకి 1942, ఆగస్ట్ 8వ తేది ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం చాలా తీవ్రమైంది.

5. సుభాష్‌చంద్ర బోస్, అతని నాయకత్వంలో, భారత జాతీయ సైన్యం (I.N.A) బ్రిటీష్‌వారితో యుద్ధం చేసి దేశాన్ని బ్రిటీష్ పాలన నుంచి విముక్తి చేయడానికి ప్రయత్నించారు.

6. దేశ రాజకీయ సమస్యను పరిష్కరించడానికి, 1945లో సిమ్లాలో వేవెల్ ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చలు విఫలమైనాయి.

25.14 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. 1935-39 మధ్య కాంగ్రెస్ మూడు ముఖ్య సంస్కరణలు చేసింది. అవి ప్రాథమిక విద్య, మద్యపాన నిషేధం, దళిత వర్గాల ఉద్ధరణ.

2. గాంధి నుంచి ఏర్పడిన వ్యతిరేకతవల్ల 1939లో సుభాష్‌చంద్ర బోస్ కాంగ్రెస్ పదవికి రాజీనామా చేసాడు.

3. స్వయం పాలనా ప్రతిపత్తి ఇస్తూ చేసిన వైస్రాయ్ ప్రకటనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ రాజీనామా చేసింది.

II. 1. యుద్ధం తర్వాత రాజ్యాంగ సభ ఏర్పాటు, భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తికి క్రిప్స్ సంఘం ప్రతిపాదించింది.

2. క్విట్ ఇండియా తీర్మానం, 1942, ఆగస్ట్ 8వ తేది ఆమోదించబడింది.

III. 1. మోహన్‌సింగ్, భారత జాతీయ సైన్య స్థాపకుడు. దానిని సుభాష్‌చంద్ర బోస్, పునర్‌వ్యవస్థీకరించి, అభివృద్ధి పరిచాడు.

2. భారతదేశ రాజకీయ సమస్యను పరిష్కరించడానికి, వేవెల్ సూచించిన ప్రతిపాదనలు చర్చించడానికి, సిమ్లా సమావేశం ఏర్పాటైంది.

PRAOU

25.15 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.**

1. 1935-39 మధ్యకాలంలో ముఖ్య రాజకీయ పరిణామాలను పరిశీలించండి.
2. రెండవ ప్రపంచ యుద్ధంలో భారతదేశం పాల్గొనే విషయంపట్ల, కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల వైఖరిని పరిశీలించండి.
3. క్రిప్స్ రాయబారి ప్రతిపాదనల నుదహరించి, దాని వైఫల్యతకు గల కారణాలను తెలపండి.
4. క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించుటకు తోడ్పడిన కారణాలను పరిశీలించి, దాని ఫలితాలను పేర్కొనండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. 1935 - 39 మధ్యగల మత రాజకీయాలను పరిశీలించండి.
2. 1940లో పాకిస్తాన్ తీర్మాన మంగీకరించబడుటకు దోహదం చేసిన పరిస్థితులెవ్వి? బ్రిటీష్ స్పందన ఎట్లుండెను?
3. భారత స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతీయ సైన్య పాత్రను పరిగణించండి.
4. "క్రిప్స్ ప్రతిపాదన, ఒక దివాలా తీసిన బ్యాంక్‌పై ముందు తేది వేసి యిచ్చిన చెక్కులాంటిది" వ్యాఖ్యానించండి.
5. 1945లో సిమ్లా సమావేశం ఎందుకు కావించబడింది? దాని ఫలితాలెవ్వి?
6. 1940 ప్రారంభ సంవత్సరాల్లో సుభాష్‌చంద్ర బోస్ భారతదేశానికావల జరిపిన కార్యకలాపాలను పరిశీలించండి.

25.16 ఉపయుక్త గ్రంథాలు

1. Bipan Chandra : *Modern India*
2. Chopra, Puri & Das : *A Social, Cultural and Economic History of India Vol. II*
3. Judith Brown : *The Emergence of Mahatma Gandhi*
4. Louis Fisher : *Mahatma Gandhi*
5. Mahajan, V.D : *India Since 1562*
6. Majumdar, R.C. (Ed) : *The Struggle for Freedom Bharatiya Vidya Bhavan Series, VolX*
   Three Phases of India's Struggle for Freedom
7. Moulana Azad : *India wins Freedom*
8. Perceival Spear : *History of India, Vol. II,*
   The Oxford History of Modern India
9. Sumit Sarkar : *Modern India*
10. Tara Chand : *History of Freedom Movemet in India*
11. ఝాన్సీలక్ష్మి, పాటిబండ; వైదేహి, అల్లాడి : *భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయభాగం,* తెలుగు అకాడమి ప్రచురణ
12. వైదేహి, అల్లాడి : *భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1858-1947)*
13. బిపన్ చంద్ర : *ఆధునిక భారతదేశం*

BRAOU

భాగం - 26 : దేశ విభజన, అధికార మార్పిడి

విషయక్రమం

26.0 లక్ష్యాలు
26.1 పరిచయం
26.2 ఆర్థిక అసంతృప్తి
26.3 భారత జాతీయ సైనికుల విచారణలు
26.4 సైన్యంలో తిరుగుబాట్లు
26.5 కాబినెట్ రాయబారం
26.6 ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్య
26.7 అట్లీ ప్రకటన
26.8 మౌంట్‌బాటెన్ పథకం, దేశ విభజన
26.9 స్వాతంత్ర్యోన్ముఖంగా
26.10 మతోన్మాదం, గాంధీజీ హత్య
26.11 సంస్థానాల విలీనం
26.11.1 జునాగడ్
26.11.2 హైదరాబాద్
26.11.2.1 సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు
26.11.2.2 ఇత్తెహాదుల్ ముస్లిం పార్టీ, రజాకార్లు
26.11.2.3 పోలీస్ చర్య
26.11.3 కాశ్మీర్
26.12 సంగ్రహంగా
26.13 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
26.14 పరీక్ష నమూనా ప్రశ్నలు
26.15 ఉపయుక్త గ్రంథాలు

26.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి :

1. బ్రిటీష్‌వారు భారతదేశాన్ని వదిలి వెళ్ళాలని నిర్ణయం తీసుకోవడానికి కారణాలు.
2. కాబినెట్ రాయబారము ప్రతిపాదనలు.
3. పాకిస్థాన్ నెలకొల్పడానికి ముస్లింలీగ్ 'ప్రత్యక్ష చర్య', మత కల్లోలాలు.
4. దేశ విభజనకు మౌంట్‌బాటెన్ ప్రతిపాదన, దానిని కాంగ్రెస్ నాయకులు ఆమోదించుట.
5. దేశవిభజన పరిణామాలు.
6. భారతదేశంలో సంస్థానాల విలీనం.

26.1 పరిచయం

1945లో బ్రిటన్‌లో అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ మొదట్లో భారతదేశానికి సంబంధించి బ్రిటీష్ విధానంలో ప్రధానమైన ఏ మార్పుకు తావీయలేదు. జులైలో వేవెల్ ప్రభువు ప్రధాని అట్లీ, భారతదేశ భవిష్యత్తును గూర్చి చర్చించి, 1942లో క్రిప్స్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం అమలుపరుస్తుందని ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర శాసన సభలకు ఎన్నికలను కూడా ప్రకటించారు. ఎన్నికలు ఎప్పుడో జరగవలసి ఉన్నాయి. కాబట్టి, ఈ

BRAOU

ప్రతిపాదనలో కొత్తఏమీ లేదు. కాని, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతర కాలంలో తీవ్రంగా విజృంభించిన వలన విధాన వ్యతిరేక ఆందోళన, భారతదేశంలో బ్రిటీష్‌వారి విధానాలలో మార్పుకు కారణమైంది.

26.2 ఆర్థిక అసంతృప్తి

భారతదేశంలోని అంతర్గత సంఘర్షణలు, ఒత్తిడులకు తోడుగా, 1945-46 లలో జరిగిన అనేక సంఘటనల ప్రభావంవల్ల, వలస వ్యతిరేక ప్రజా ఉద్యమం రూపుదిద్దుకోవటానికి వీలైంది. యుద్ధ ప్రభావంగా క్షీణిస్తూవున్న ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆహారకొరత, కార్మిక, కర్షక వర్గాల ఒకానొక నూతన, ఆందోళనా తరంగాలకు హేతువయ్యాయి. దేశంలో పలు ప్రాంతాల్లో సమ్మెలు, హర్తాళ్ళు, దైనందిన సంఘటనలయ్యాయి. పైగా, కార్మికవర్గ పోరాటానికి, విద్యార్థి వర్గ రాజకీయ ప్రదర్శనలకు సమన్వయమేర్పడింది. కార్మిక సంఘాలలోని విభిన్న రాజకీయ (దృక్పథాలుగల) వర్గాల మధ్య సహకారం బలపడింది. దేశంలో రైతుల ఆందోళన కూడ తలెత్తింది. తీవ్రవాద రైతాంగ ఉద్యమాలు తెలంగాణాలో, బెంగాల్‌లోని తేబాఘాలో, తిరువాన్కూర్ ప్రాంతంలో భూమికౌలురద్దునూ, భూస్వాముల దోపిడి అంతాన్ని కోరుతూ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలుగా రూపుదిద్దుకొన్నాయి.

26.3 భారత జాతీయ సైనికుల విచారణలు

నవంబర్ 1945లో మొదలైన భారత జాతీయ సైన్యాధికారుల (I.N.A) విచారణ, మరో ప్రజా ఉద్యమం లేవటానికి కారణభూతమైంది. షానవాజ్ ఖాన్, మరో యిద్దరు అధికారులకు సైనికన్యాయస్థానం, దీర్ఘకారాగారావాస శిక్షలను విధించింది. కాని, ప్రజలు వీరిని వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టిన యోధులుగా భావించారు. దేశ భక్తులైన భారతీయులలో, వీరికి విధించిన కారాగార శిక్షలు ఆగ్రహాన్ని కలిగించాయి. మొదట కలకత్తాలో, తర్వాత యితర పట్టణాలలో, దీనికి వ్యతిరేకంగా ఎన్నో ఊరేగింపులు జరిగాయి. ఇవి రాజకీయ సమ్మెలుగా పరిణమించాయి. కార్మికులు, విద్యార్థులు, వర్తకులు వీటిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సైనిక న్యాయ విచారణ చేసి, ప్రభుత్వం భారత జాతీయ సైనికాధికారులను రాజుకు వ్యతిరేకంగా యుద్ధంచేసిన నేరస్తులుగా ప్రకటించినప్పటికీ, ప్రజా ఉద్యమానికి తలవంచి, ప్రభుత్వం వారిని విడుదల చేయ నిశ్చయించింది.

26.4 సైన్యంలో తిరుగుబాట్లు

1946, ఫిబ్రవరిలో సైన్యాలోనుంచి కూడ కొంతమంది, ఈ ఉద్యమంలో చేరడం మొదలు పెట్టారు. దాంతో, రాజకీయ ఆందోళన పరాకాష్ఠకు చేరుకొంది. బొంబాయిలోని భారత నౌకాదళంలోని సభ్యులు (Ratings) తిరుగుబాటు చేశారు. వీరు సైన్యంలోను, నౌకాదళంలోను, ఏడుగంటలు హోరాహోరీగా పోరాడారు. భారత జాతీయ నాయకులు కోరగా, వారు లొంగిపోయారు. భారతీయ వైమానిక దళంలో కూడా విస్తృతమైన సమ్మెలు జరిగాయి. పోలీసులు, అధికారయంత్రాంగం కూడా, జాతీయతాభావంవైపు మొగ్గుచూపిస్తున్న సూచనలు కనిపించాయి. ఈ సంఘటనలన్నింటిలో, జాతీయోద్యమాన్ని ఎంతోకాలం అణచివేయలేమని బ్రిటీష్ ప్రభుత్వానికి స్పష్టమైపోయింది.

26.5 కాబినెట్ రాయబారం

ప్రజల ఆత్మ విశ్వాసం, ప్రభుత్వ వ్యతిరేకభావన, ప్రజా ఉద్యమాల ఫలితంగా బ్రిటీష్‌వారు భారతదేశాన్ని విడిచిపెట్టి వెళ్ళవలసి వచ్చింది. భారతదేశానికి అధికారాన్ని అప్పగించే విషయంలో షరతుల్ని జాతీయ నాయకులతో చర్చించడానికి గాను, మార్చి, 1946లో కాబినెట్ రాయబారాన్ని పంపించారు. విభిన్న రాజకీయ పక్షాల నాయకులతో చర్చలు జరిగిన దరిమిలా, ప్రత్యేక పాకిస్తాన్ రాజ్యాన్ని కోరిన మహమ్మదీయ నాయకుల

BRAOU

కోర్కెను, కాబినెట్ రాయబారవర్గం తోసిపుచ్చింది. మే, 1946లో కాబినెట్ రాయబారవర్గం, ఈ క్రింది సూచనలు చేసింది. 1) భారత రాజ్యం రాష్ట్రాల, సంస్థానాల సమితిగా వుంటుంది. రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ మాత్రమే కేంద్ర ప్రభుత్వం పరిధిలో వుంటాయి. రాష్ట్రాలు అత్యధిక స్వయం ప్రతిపత్తిని కల్గివుంటాయి. 2) బ్రిటీష్ ఇండియాలోని రాష్ట్రాలు మూడు విభాగాలుగా కలిసి వుంటాయి. అవి హిందూవులధికంగా వున్న ప్రాంతం, ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతం, ముస్లింలు ఎక్కువగా వున్న పశ్చిమ ప్రాంతం. అస్సాం, బెంగాల్‌లు, ముస్లింలు అధికంగా వున్న ప్రాంతాలు. ఈ మూడు విభాగాలలోని రాష్ట్రాలు వాటి సమాన లక్ష్యాలకోసం, పరస్పరాంగీకారంతో, కొత్త విభాగాలుగా ఏర్పడే స్వాతంత్ర్యాన్ని కలిగి వుంటాయి. 3) మతసంబంధమైన ప్రధాన సమస్య ఏదైనా శాసనసభలో తల ఎత్తినపుడు, ఒక్కొక్క ప్రధాన మత వర్గంలోని సభ్యుల మెజారిటీ ద్వారానూ, సభలో హాజరైవున్న అందరు సభ్యులలో మెజారిటీ ద్వారానూ (ఓటింగు ద్వారా) పరిష్కరించాలి. 4) భారత రాజ్యాంగ రచనకు, ఒక రాజ్యాంగ సభను ఏర్పాటు చేయాలి. ప్రతి రాష్ట్రానికి, దాని జనాభాను బట్టి కొన్ని స్థానాలుంటాయి. రాష్ట్రానికి వచ్చిన స్థానాలను, రాష్ట్రంలోని విభిన్న మతాలవారికి, వారి జనాభాను బట్టి కేటాయించాలి. రాజ్యాంగ సభ సభ్యులను రాష్ట్రాల శాసనసభల సభ్యులు ఎన్నుకొంటారు. 5) సాధ్యమైనంత త్వరలో, ప్రధాన రాజకీయ పక్షాల సమర్థన వున్న తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించాలి.



కాబినెట్ రాయబారవర్గం ప్రతినిధులు

ఈ విధంగా, కాబినెట్ రాయబారవర్గం తయారుచేసిన ప్రణాళిక భారత ఐక్యతను పరిరక్షించేదిగా వున్నా, ముస్లిం ఆధిక్యత గల రాష్ట్రాలు ఒక విభాగంగా ఏర్పడే అవకాశాన్ని కల్గించడంతో, పాకిస్తాన్ ఏర్పడాలనే కోరికను చాలావరకు అంగీకరించినట్లే అయింది. ఈ ప్రణాళిక మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ చాలా చర్చించిన మీదట, దీర్ఘకాలిక సంబంధమైన భాగాన్ని అంగీకరించి, తాత్కాలిక ప్రభుత్వపు ప్రతిపాదనను తిరస్కరించింది. భారత ముస్లిమ్‌లకు ఏకైక ప్రతినిధి ముస్లింలీగ్ అన్న వాదనను, కాంగ్రెస్ అంగీకరించలేదు. తర్వాత, తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింల వాటాకు సంబంధించిన స్థానాలకు సభ్యుల

నియామకం విషయంలో కాంగ్రెస్ తన హక్కును నిలబెట్టుకొంది. ముస్లింలీగ్ మొదట, ప్రణాళికను అంగీకరించింది. కాని త్వరలోనే, తాత్కాలిక ప్రభుత్వం నుంచి, రాజ్యాంగ సభ కార్యకలాపాల నుంచి, విరమించుకొంది. జూన్‌లో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో, 205 స్థానాలు కాంగ్రెస్‌కు, 73 స్థానాలు ముస్లింలీగ్‌కు లభించాయి. సభలో వోటింగ్‌లో, ఎప్పుడైనా ఓటమి ఎదురవుతుందన్న భయమే, కాబినెట్ రాయబార ప్రణాళికను ముస్లింలీగ్ తిరస్కరించడానికి కారణం. జులైలో, వేవెల్ ప్రభువు కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల ముందు మరో క్రొత్త ప్రతిపాదనను పెట్టాడు. కాంగ్రెస్‌కు 6 స్థానాలు, ముస్లింలీగ్‌కు 5 స్థానాలతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పరచాలని ఈ ప్రతిపాదన. కాంగ్రెస్‌తో సమానంగా స్థానాలు కావాలని కోరుతూ, ఈ ప్రతిపాదనను ముస్లింలీగ్ తిరస్కరించింది. కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను అంగీకరించి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఉపాధ్యక్షుడుగా తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించింది.

26.6 ముస్లింలీగ్ - ప్రత్యక్ష చర్య

ఈ సమయంలో, పాకిస్తాన్ ఏర్పాటుకు, రాజ్యాంగ విరుద్ధమైన 'ప్రత్యక్ష చర్య'ను ముస్లింలీగ్ ప్రకటించింది. ఏర్పడిన రాజకీయ ప్రతిష్ఠంభనకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని విమర్శిస్తూ, ఆగస్ట్ 16ను 'అసమ్మతి దినంగా' ప్రకటిస్తూ, ప్రత్యక్షపోరాట తీర్మానాన్ని ముస్లింలీగ్ చేసింది. ఈ అసమ్మతి దినం, మతహింసాకాండగా పరిణమించింది. హిందూ ముస్లిం కొట్లాటలు కలకత్తాలో ప్రారంభమై, అతివేగంగా బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, బొంబాయిలోని విస్తృత ప్రదేశాలకు వ్యాపించాయి. గాంధీ ఈ సమయంలో సంఘర్షణలను తీవ్రంగా ఖండిస్తూ ఆ ప్రాంతాలను సందర్శించాడు.

తాత్కాలిక ప్రభుత్వంలో చేరి, కేంద్రంలో అధికారాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొన్నదని, ముస్లింలీగ్ గ్రహించింది. తాను ఏకాకినౌతానని భయపడి, కాంగ్రెస్ తోను, రాజ ప్రతినిధితోను ఒక ఒప్పందానికి వచ్చింది. కాబినెట్ రాయబార ప్రణాళిక ఎట్లా పనిచేస్తుందో పరిశీలించి, తాత్కాలిక ప్రభుత్వంలో చేరతామన్నది. అక్టోబర్‌లో లీగ్ ప్రతినిధులు ప్రభుత్వంలో చేరారు. కాని, ప్రభుత్వంతో సహకరించడానికి గాక, పోరాడటానికే లీగ్ ప్రభుత్వంలో చేరింది. కేంద్ర ప్రభుత్వం కార్యకలాపాలకు భంగం కల్గించడానికే శాయశక్తులా పనిచేసింది. కాబినెట్ రాయబార ప్రణాళికను వ్యాఖ్యానించడంలో, కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు రెండూ, నిరంతరం కొట్లాడుకోసాగాయి. చివరికి, డిసెంబర్ 1946లో జరిగిన రాజ్యాంగ సభ ప్రథమ సమావేశంలో పాల్గొనడానికి, ముస్లింలీగ్ నిరాకరించింది. ఇలా, కాబినెట్ రాయబారం ప్రణాళిక వాస్తవానికి మృతపత్రం అయింది.

ఇదిలావుండగా, దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించసాగింది. ప్రజా ఉద్యమాలు దేశంలో పట్టణాలకూ, గ్రామాలకు విస్తరించడానికి ఇది తోడ్పడింది. 1946లో, 2000లకు పైగా సమ్మెలు జరిగాయి. కాన్పూర్, కలకత్తాలలో సమ్మెచేస్తున్న కార్మికుల మీద పోలీసులు కాల్పులు జరిపారు. బెంగాల్, తెలంగాణా, పంజాబ్‌లోని కొన్నిప్రాంతాలు, మధ్య భారత్‌లలో రైతుల ఆందోళన సాగింది. రైతుల తిరుగుబాట్లు భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగాయి. వీరు భూమి హక్కును, తక్కువ కౌళ్ళను కోరారు. కాశ్మీరులో మహారాజా భూస్వామ్యమునకు వ్యతిరేకంగా, షేక్ అబ్దుల్లా నాయకత్వంలో నేషనల్ కాన్ఫరెన్స్ 'క్విట్ కాశ్మీర్' ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ప్రజాఉద్యమాలతో పాటు, మతపరమైన హింసాకాండ కూడా కొనసాగుతూ వచ్చింది.

26.7 అట్లీ ప్రకటన

ఈ పరిస్థితులలో, బ్రిటీష్‌వారి రాజకీయ వ్యవస్థకు ఏర్పడ్డ ప్రమాదాలను బ్రిటీష్ ప్రధాని స్పష్టంగా గుర్తించాడు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితి ప్రమాదంతో కూడుకున్నదని తెలుసుకొని, రాజకీయ ఒప్పందం విషయంలో భారత రాజకీయ పక్షాలమీద బాధ్యత పడాలంటే, అధికార మార్పిడికి తేదీ నిర్ణయించాలని అట్లీ నిశ్చయించుకున్నాడు. జూన్ 1948లో గా, బ్రిటీష్ ప్రభుత్వం అధికారాన్ని భారతదేశానికి అప్పగిస్తుందనీ, ఫిబ్రవరి

DRAOU

20, 1947న అట్లీ ప్రకటించారు. ఒకటి లేదా, అంతకంటే ఎక్కువ కేంద్ర ప్రభుత్వాలకు అధికారం అప్పగించడం జరుగుతుందన్నారు. దేశవిభజన లేదా, అనేక రాజ్యాల ఏర్పాటు జరుగవచ్చునన్న సూచన ఇందులో స్పష్టంగా వుంది. దేశ విభజనను నిరోధించడానికి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న కాంగ్రెస్ ఆశలు, ఈ క్రొత్త తేదీ నిర్ణయంతో లుప్తమయిపోయాయి. రాజకీయ పక్షాలు ఏ ఒప్పందానికి రాకపోతే, ప్రభుత్వ యంత్రాంగాన్ని విభిన్న రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం జరుగుతుందనీ ప్రకటింపబడింది. దేశవిభజన కంటే, ముక్కచెక్కలై పోవుటకు ప్రధానమైన ప్రమాదమని కాంగ్రెస్ భావించింది.

అట్లీ ప్రకటనలో కొత్త ఆశలు చిగురించిన ముస్లింలీగ్, పాకిస్తాన్ సంపాదనకోసం పోరాటాన్ని ప్రత్యక్ష చర్యలద్వారా ఉధృతం చేసింది. తత్ఫలితంగా, అతిస్వల్ప కాలంలోనే ఉత్తర భారత దేశమంతటా, మతకల్లోలాలు చెలరేగాయి. మతోద్రేకాలు, అనుమానాలవల్ల జరిగిన అనేక విషాద సంఘటనలకు విదేశీ ప్రభుత్వతోడ్పాటు, ప్రోత్సాహమూ, లభించాయి. ఇదంతా సర్దార్ పటేల్, నెహ్రూల అభిప్రాయంలో, మార్పుకు కారణమైంది. చారిత్రకంగా, గత 50 ఏళ్ళుగా, హిందూముస్లిం మతతత్వం అభివృద్ధి అయినతీరు అటు దేశ విభజనకు గానీ, లేకపోతే ఇటు గందరగోళం గానీ, అరాచకత్వంగానీ ఏర్పడక తప్పని స్థితికి దారితీసిందని, వీరు అభిప్రాయపడ్డారు. ఈ నమ్మకం కారణంగానే, మార్చి 1947లో, కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం వాస్తవకదృక్పథం పేరిట, పంజాబ్ విభజనను అంగీకరిస్తూ తీర్మానించింది.

26.8 మౌంట్‌బాటెన్ పథకం - దేశ విభజన

ఈ పరిస్థితుల్లో, మార్చి 1947లో, వేవెల్ ప్రభువు స్థానంలో రాజప్రతినిధిగా మౌంట్‌బాటన్ ప్రభువు వచ్చాడు. భారతదేశ రాజకీయ, మతపరిస్థితులను, పరిశీలించిన తర్వాత, దేశవిభజన కార్యక్రమాన్ని కొనసాగించారు మౌంట్ బాటెన్. ఎట్టి పరిస్థితుల్లోను, ఒక మతం ఆధిక్యం, మరో మతం మీద వుండరాదనీ, బహుళ సంఖ్యాక వర్గాధిక్యం అల్పసంఖ్యాకుల మీద వుండరాదనీ, దేశ విభజన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తే, దాని బాధ్యత పూర్తిగా భారతీయులదేననీ, మౌంట్‌బాటెన్ స్పష్టం చేశాడు. మౌంట్‌బాటెన్ ప్రభువు నిజాయితీని, గాంధీజీ కూడ మెచ్చుకొన్నాడు. కొత్త రాజ ప్రతినిధి, కాంగ్రెస్‌లాగానే దేశవిభజనకు వ్యతిరేకి అయినప్పటికీ, *"మన యిరుపక్షాలు (హిందూ, ముస్లింలు) ఏ విషయం మీదా ఒక అంగీకారానికి రాలేనప్పుడు, రాజప్రతినిధికి మరో గత్యంతరం ఏముందని"* గాంధీజీ సూటిగా అన్నాడు. ఈ విధంగా జూన్ 1947 లో మౌంట్‌బాటెన్ పథకం వచ్చింది. ఇందులో క్రింది ప్రతిపాదనలున్నాయి.

1. భారతదేశం నుంచి బ్రిటీష్‌వాళ్ళ విరమణ జూన్ 1948లో కాక, ఆగష్టు 1947లోనే జరుగుతుంది. భారతదేశంలో తరువాతి ప్రభుత్వాలకు అధికారం అప్పజెప్పటం జరుగుతుంది. భారతదేశాన్ని భారతదేశం-పాకిస్తాన్ అని రెండుగా విభజించడం జరుగుతుంది.

2. బ్రిటీష్ అధికార విరమణతో, దేశంలోని రాజ్యాలు భారతదేశంతోగానీ, పాకిస్తాన్‌తోగానీ చేరేస్వేచ్ఛను కలిగివుంటాయి. వాటిమీద బ్రిటీష్ అధికారం పోతుంది.

3. ప్రజాభిప్రాయాన్ని కనుగొన్న తర్వాత, బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల విభజన జరుగుతుంది. ఈ రాష్ట్రాల శాసనసభలు సమావేశమై, సదరు రాష్ట్రాలు ఐక్యంగావుండాలో, విభజన కావాలో నిర్ణయిస్తాయి. వారు విభజననే నిర్ణయించినట్లయితే, ఒక సరిహద్దు సంఘాన్ని నియమించడం జరుగుతుంది.

4. ఇప్పుడున్నటువంటి రాజ్యాంగ సభ అట్లాగే కొనసాగి, భారతదేశానికి రాజ్యాంగాన్ని తయారుచేస్తుంది. పాకిస్తాన్‌కు వేరే రాజ్యాంగ సభ వుంటుంది.

రెండు ప్రధాన రాజకీయ పక్షాలూ తమ అసంతృప్తిని వెల్లడించినప్పటికీ, అటువంటి క్లిష్ట సమస్యలలో అంతకంటే మార్గంలేదనీ, అదే అన్నిటికన్న ఉత్తమమైన ప్రయోగసాధ్యమైన పరిష్కారమనీ, మౌంట్‌బాటెన్

పథకాన్ని అంగీకరించాయి "కుదించిన, చెదలుతిన్న పాకిస్తాన్"తో లీగ్ పూర్తిగా సంతృప్తి చెందకపోయినప్పటికీ, పథకాన్ని అంగీకరించింది. గందరగోళ పరిస్థితి, మత విధ్వంసకాండకు పర్యాయంగా, దేశవిభజనే ఏకైక మార్గమన్న అభిప్రాయానికి, కాంగ్రెస్ అంతకుముందే వచ్చింది. దేశ విభజనను మొదట తీవ్రంగా వ్యతిరేకించినా, కాంగ్రెస్ కోరికపై గాంధీజీ అంగీకరించాడు. కాంగ్రెస్ అంగీకరించింది. లీగ్ ప్రభావం అనుమానాస్పదంగా వున్న వాయవ్య సరిహద్దు రాష్ట్రం, అస్సాంలో సిల్‌హెట్ జిల్లాలో, జనాభిప్రాయ సేకరణ జరపవలసివుంది. రెండు రాజ్యాల సిద్ధాంతంవల్ల కలిగే హిందూ-ఇస్లాం మత ప్రాతిపదికమీద విభజన జరుగుతోందన్న భావము, కాంగ్రెస్ నాయకులు అంగీకరించలేదు.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1) కాబినెట్ సంఘ ప్రతిపాదనల ప్రకారం, కేంద్ర ప్రభుత్వానికి ఏ శాఖలు కేటాయించబడ్డాయి?

.....

.....

.....

.....

2) దేశ విభజనకు కాంగ్రెస్ ఎందుకు అంగీకరించింది?

.....

.....

.....

.....

26.9 స్వాతంత్ర్యోన్ముఖంగా

మౌంట్‌బాటెన్ పథకాన్ని భారతదేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలు అంగీకరించటంతో, భారత, పాకిస్తాన్‌ల ఆస్తులు, ఋణాలను నిర్ణయించడానికి కేంద్రంలోను, రాష్ట్రాలలోను యంత్రాంగాన్ని నియమించారు.



జవహర్ లాల్ నెహ్రూ భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన ఆగస్టు 14 రాత్రి 1947

BRAOU

సైన్యంలోను ఇతర ఉద్యోగాలలోను పనిచేసే వారిని, వారి యిష్టాన్ని అడిగారు. పంజాబ్, బెంగాల్‌లోని ప్రాంతీయ శాసనసభలు విభజనకే నిర్ణయించాయి. ముస్లిం బాహుళ్యమున్న జిల్లాలను, పాకిస్తాన్‌లో ముస్లిమేతరులు అధికంగా వున్న ప్రాంతాలు భారత సమాఖ్యలో చేరాయి. సర్ రాడ్‌క్లిఫ్ అధ్యక్షతన సరిహద్దు సంఘం పని ప్రారంభించి, 1947 ఆగస్ట్ 15 నాటికి సరిహద్దు రేఖను గీసే పనిని పూర్తిచేసింది. సంస్థానాలలోని ప్రజల వత్తిడి, సర్దార్ పటేల్ సమర్థవంతమయిన రాజనీతి, మౌంట్‌బాటెన్ సహకారం కారణంగా, 554లకు పైగా సంస్థానాలు భారత సమాఖ్యలో చేరిపోయాయి. హైదరాబాద్, జునాగఢ్, కాశ్మీర్ రాజ్యాల విలీనీకరణే మిగిలిపోయింది.

1947 జులైలో మౌంట్‌బాటెన్ పథకాన్ని, భారత స్వాతంత్ర్య చట్టంగా పార్లమెంట్ ఆమోదించింది, అధికార మార్పిడికి 1947 ఆగస్ట్ 15వ తేదీన నిర్ణయించింది. దీన్ని అనుసరించి, 1947 ఆగస్ట్ 14 అర్ధరాత్రి ఆగస్ట్ 15 ప్రారంభఘడియల్లో, ఢిల్లీలో రాజ్యాంగ సభ ప్రత్యేక సమావేశం జరిగింది. ఎఱ్ఱకోట మీద భారత జాతీయపతాకం ఎగిరింది. రాజ్యాంగ సభ శాసనబద్ధంగా, బ్రిటీష్ కామన్‌వెల్త్‌లో భాగంగా, భారతదేశ స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. భారత డొమినియన్‌కు మౌంట్‌బాటెన్ ప్రభువును కొత్త గవర్నర్-జనరల్‌గా నియమించింది. అనేక తరాల స్వాతంత్ర వీరుల పోరాటం, చివరికి ఫలించింది. ఈ జాతీయోద్యమ విజయం, భారతదేశ చరిత్రలో స్వతంత్ర అభివృద్ధి అనే నూతన ఉద్యమానికి, నాంది పల్కింది. ఆగస్ట్ 14 రాత్రి రాజ్యాంగ సభ సమావేశంలో ప్రజల అనుభవాలను వ్యక్తం చేస్తూ, పండిట్ నెహ్రూ చేసిన చారిత్రాత్మక ప్రసంగంలో యిలా అన్నాడు "అనేక సంవత్సరాల క్రితం, విధితో మనం ఒక ఒప్పందానికి వచ్చాం. ఆ ప్రతినను పూర్తిగా కాకపోయినా, తగినంతగా నెరవేర్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. ప్రపంచమంతా నిద్రపోయే యీ అర్ధరాత్రి సమయంలో, భారతదేశం బ్రతుకునూ, స్వేచ్ఛనూ పొంది, మేల్కొంటున్నది. మనం పాతనుండి కొత్తలోకి అడుగు పెట్టేటపుడు, ఒక యుగం అంత మయినపుడు, దీర్ఘకాలం అణచివేయబడిన ఒక దేశంఆత్మ తన హక్కును తిరిగి పొందినటువంటి క్షణం, చరిత్రలో అరుదుగా వస్తుంది. ఇటువంటి పవిత్ర క్షణంలో, భారత ప్రజల సేవకోసం, అంతకంటే విశాలమయిన మానవతా సంరక్షణకోసం, అంకితం కావటానికి ప్రతిజ్ఞ పూనటం ఉచితంగా వుంటుంది. దురదృష్టకరకాలం యింతటితో అంతమైంది. భారతదేశం తన్ను తాను మళ్ళా కనుక్కుంది. మనం గతంలో అనేక సార్లు తీసికున్న ప్రతిజ్ఞలను నెరవేర్చుకొనే తీవ్రమయిన ప్రయత్నం, ఈనాడు మనం జరుపుకుంటున్న విజయోత్సవం".

26.10 మతోన్మాదం - గాంధీజీ హత్య

జాతీయ విజయంవల్ల ఏర్పడ్డ ఉత్సాహ సంతోషాల వెనుకే, బాధ విషాదం కూడా పెనుగొన్నాయి. వర్ణించరాని పాశవికతతో కూడిన మత విధ్వంస కాండ ప్రభావం, రెండు కొత్త దేశాల మీద పడింది. లక్షలాది హిందువులు, మహమ్మదీయులు, మత విద్వేషాలకు బలై, తమ నివాసాలను కోల్పోయారు. ఈ మారణకాండను తప్పించుకొన్న అదృష్టవంతులు తమ ఆస్తులను, బంధువులను వదలి శరణార్థులుగా తమ యిష్టమైన దేశాలకు తరలిపోయారు. ఈ వలసలు, అసంఖ్యాకులైన ప్రజలు తమ నివాసమును విడచి పోవలసిరావడమూ, మత విద్వేషాగ్నులకు ఆజ్యం పోశాయి. దీనివల్ల, సరిహద్దు రాష్ట్రాలలో అనంతమైన ఆస్తి, ప్రాణనష్టాలు సంభవించాయి.

జాతీయ విభజన సందర్భంలో కల్గిన ఈ విషాదానికి, గాంధీజీ దుఃఖమూర్తికే ప్రతీక. ఆయన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనలేదు. అదే సమయంలో, మతావేశాలను చల్లార్చే ప్రయత్నంలో, పరస్పరాసహ్య భావనతో నిండిపోయిన బెంగాల్‌లో పర్యటిస్తున్నాడు. ముస్లింల హత్యలకు నిరసనగా, నిరాహారదీక్షపూనాడు. హిందూ ముస్లిం ఐక్యతా విషయంలో, గాంధీ విశ్వాసమనే సూత్రం మీద నిలబడ్డాడు. ప్రగతి నిరోధక మత ప్రభావం విజృంభించుచున్న సమయంలో, హిందూ-ముస్లిం ఐక్యత మీద గాంధీజీ అభిప్రాయాలు, అభివృద్ధినిరోధక వర్గాలలో అసంతృప్తిని కలిగించాయి. 1948 జనవరి 30న, ఒక హంతకుడు, మతోన్మాది, అయిన నాథూరామ్ గాడ్సె ప్రార్థనా సమావేశంలో గాంధీ మహాత్ముణ్ణి కాల్చివేశాడు. అహింస, సత్యం, ప్రేమ

సందేశాన్నిచ్చిన మహాత్ముడు, భారత ప్రజలకు ధైర్యాన్ని, పౌరుషాన్ని ప్రసాదించిన మహాత్ముడు, భారత సంస్కృతిలో మంచికంతా ప్రతీకలయిన మహాత్ముడు, తానెప్పుడూ అంకితమయిన హిందూ -ముస్లిం సమైక్యత కోసం బలైనాడు.

26.11 సంస్థానాల విలీనం

1947 భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం, భారత సంస్థానాలమీద బ్రిటీష్ సార్వభౌమాధికారం అంతమైంది. దీనివల్ల, ఈ సంస్థానాధీశులు స్వతంత్రంగా తమ భవిష్యత్తును నిర్ణయించుకునే స్వేచ్ఛనుపొందారు. వాస్తవానికి, భారత, పాకిస్తాన్‌లలో, దేనిలోనైనా, కలసిపొమ్మని సలహా పొందారు. చట్టబద్ధంగా, భారత ఉపఖండం చిన్న చిన్న రాజ్యాలుగా ముక్కలయే సూత్రం ఈ చట్టంలో వుంది. సర్దార్ పటేల్ రాజకీయ నైపుణ్యం, దేశవ్యవహారాల కార్యదర్శి వి.పి.మీనన్ సమర్థవంతమైన తోడ్పాటువల్ల, భారతదేశ సమైక్యతా సమస్య పరిష్కారమైంది.

సంస్థానాధీశుల సభా కార్యదర్శియైన పాటియాల మహారాజావంటి మేధావులయిన పరిపాలకులు, తమ సంస్థానాలను భారత సమాఖ్యలో కలుపవలసిన ఆవశ్యకతను గుర్తించారు. తక్కినచోట్ల అవలంబించిన కాఠిన్యం, పటేల్ రాజనీతిజ్ఞత, 554లకు పైగా సంస్థానాల విలీనీకరణలో విజయవంతమయ్యాయి. సంస్థానాల విలీనీకరణ గురించి వ్రాస్తూ, పెర్సివల్ స్పీర్ యిలా అన్నాడు. "కొన్ని సార్లు యిది నిర్దాక్షిణ్యంగా *ఉండేది. అయినా, యీ కార్యక్రమమూ దేశ వ్యవహారాల కార్యదర్శి వి.పి.మీనన్ నైపుణ్యంవల్ల, అంగీకార యోగ్యమయ్యేది. ఆయన యింత నమ్మకంగా సంస్థానాలు పోవడంలో లాభాలను వివరించారంటే, చివరికి కాశ్మీర్ కాక ఒక్క హైదరాబాద్ మాత్రమే నిజమైన సమస్యగా మిగిలింది".* కానీ అన్నిటికంటే ప్రధానమైన కారణం, తక్కిన అన్నిచోట్లా భారతదేశంలో కలవాలన్న ఈ సంస్థానాలలోని ప్రజల కోర్కె.

స్వాతంత్ర్యానికి ముందే, 1947లో సంస్థానాల వ్యవహారాలకోసం, ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేశారు. దీనికి దేశయాంగ మంత్రి, వల్లభాయి పటేల్ అధ్యక్షుడు. సంస్థానాధిపతులకు, పటేల్‌కు మధ్య జరిగిన అనేక చర్చల అనంతరం, సంస్థానాలను భారత సమాఖ్యలో చేర్చుకోవటానికి ఒక ప్రణాళిక సిద్ధమయింది. స్వాతంత్రదినోత్సవం ముందే, అనేక మంది సంస్థానాధిపతులు భారత డొమినియన్‌లో చేరుతూ, విలీనీకరణ పత్రంమీద సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల ప్రకారం, వారి వారి ఎస్టేట్లమీద, భూములమీద హక్కు వారికే వుంటుంది. విలీనీకరణ పత్రం మీద సంతకం చేయకముందు వారు చేసిన ఏకార్యాల గురించీ, ప్రశ్నించడానికి వీల్లేదు. వారికి, ప్రభుత్వ భరణాలు ఇవ్వటంవంటి వాగ్దానాలివ్వబడ్డాయి. కొంత మంది సంస్థానాధిపతులు ఈ పత్రం మీద వెంటనే సంతకం చేయలేదు. సర్దార్ పటేల్, వి.పి.మీనన్‌లు "సమైక్యతకు *భంగంకలిగే పక్షంలో, భారతదేశం ఉదారంగా వుండజాలదు"* అవి స్పష్టంచేశారు. ఈ దృఢసంకల్పం దేశసమైక్యత విషయంలోను, హైదరాబాద్, ఒరిస్సా, భోపాల్, తిరువాన్కూర్, కాశ్మీర్ మొదలైన సంస్థానాల్లో రూపుదిద్దుకుంటున్న భూస్వామ్య వ్యతిరేకోద్యమాల పట్ల భారత ప్రభుత్వం అవలంబించిన స్పష్టమైన వైఖరి, సంస్థానాధిపతులు విలీనీకరణ పత్రం మీద సంతకం చేయడానికి తొందర పడేటట్లు చేశాయి. ఈ విధంగా 1947-49 మధ్య సుమారు 554 సంస్థానాలు భారతదేశంలోనూ, తక్కినవి, పాకిస్తాన్ లోను, చేరిపోయాయి. ఈ విలీనీకరణ ప్రక్రియ జునాగడ్, హైదరాబాద్, కాశ్మీరుల్లో తప్ప, తక్కిన అన్ని చోట్లా చాలా వరకు మృదువుగానే సాగింది.

26.11.1 జునాగడ్

కథియవార్ ద్వీపకల్పంలోని జునాగడ్ సంస్థానంలో, 75 శాతం జనాభా హిందువులు ప్రసిద్ధమైన సోమనాధాలయంతో పాటు, ఎన్నో హిందూ, జైనదేవాలయాలు ఈ ప్రాంతంలో వున్నాయి. దీని ముస్లిం పరిపాలకుడు చాలా విచిత్రమైనవాడు. ఒకసారి తన రెండు పెంపుడు కుక్కలకు వివాహం కూడా చేయించాడు. జునాగడ్ ప్రజల ప్రయోజనాలు, భారత సమాఖ్యలోని ప్రజల ప్రయోజనాలతో కలిసివున్నప్పటికీ, నవాబ్ పాకిస్తాన్‌లో చేరతానని ప్రకటించాడు. నవాబ్ చేసిన ఈ నిర్ణయం, జునాగడ్‌లో తీవ్రమైన ఆందోళనకు దారితీసింది.

BRAOU

భారత ప్రభుత్వం సైన్యాలను పంపి, ప్రజాభిప్రాయ సేకరణ జరిపించవలసి వచ్చింది. బహుసంఖ్యాక ప్రజానీకం భారత సమాఖ్యలో సమైక్యతకుమొగ్గు చూపడంలో జునాగడ్ నవాబ్ పాకిస్తాన్ పారిపోయాడు.

26.11.2 హైదరాబాదు

26.11.2.1 సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు

నిజాం పాలనాకాలంలో తెలంగాణ అంతర్భాగంగా గల హైదరాబాదు రాష్ట్రంలో నెలకొని వున్న పరిస్థితులు దుర్భరంగా వున్నాయి. ఆనాటి సామాజిక వ్యవస్థ మాధ్యమిక యుగంలో ఐరోపాలో నెలకొనివున్న ఫ్యూడల్ వ్యవస్థను పోలివుంది. వేలాది ఎకరాల భూమి దేశముఖ్ లని పిలువబడే భూస్వాముల ఆధిపత్యంలో వుంది. నిరుపేద రైతులు కట్టుబానిసలుగా సేద్యం చేసేవారు. భూస్వాముల వద్ద నుంచి రుణాలు తీసికొన్న పేద రైతులు భూస్వాములకు ఉచితసేవ (వూడిగం) చేయాల్సి వుండేది. ఆసఫ్‌జాల పాలనలోనే తెలంగాణాలో జాగీర్దారు పద్ధతి అమలులోనికి వచ్చింది. ఆనాటి సామాజిక వ్యవస్థలో జాగీర్దార్లు స్వదేశీపాలకులు నిరుపేద రైతుల ఎడల నియంతలుగా వ్యవహరించేవారు. తెలంగాణా ప్రాంతంలో నిరుపేద రైతులు అధిక సంఖ్యలో వున్నారు. వారు దుర్భరదారిద్ర్యాన్ని అనుభవిస్తూ, బానిస బ్రతుకులు గడిపేవారు. వారిలో ఎవరైనా తిరుబాటు చేస్తే లేదా ప్రతిఘటిస్తే నిర్దాక్షిణ్యంగా చంపబడేవారు. పాలకుడైన నిజాం నియంతలా వ్యవహరించేవాడు. ప్రభుత్వాధికారులు సరేసరి, ప్రజలను ఎటువంటి విచారణ లేకుండా శిక్షించేవారు. దీనికితోడు ముస్లిం ఛాందసపరులు మరియు రజాకార్లు స్వైర విహారాలవల్ల ప్రజలు అమానుషంగా బాధింపబడేవారు. నిజాం పాలనలో తెలంగాణ ప్రాంతంలో నెలకొని వున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఆ ప్రాంతంలో 20వ శతాబ్దంలో సాయుధ పోరాటం ఆవిర్భవించడానికి దోహదం చేశాయి.

తెలంగాణా ప్రాంతంలో సాయుధ పోరాటాన్ని కొనసాగించిన ఘనత కమ్యూనిస్టులకు చెందుతుంది. సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన కమ్యూనిష్టు నాయకులు, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, చండ్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి మొదలగువారు. సాయుధ పోరాటం యొక్క ముఖ్య లక్ష్యాలు కింద పేర్కొన్నవాటిగా పరిగణిస్తారు. తెలంగాణా ప్రాంతాన్ని నిజాం దుష్పరిపాలన నుంచి విముక్తి చేయడం, భూస్వాముల దోపిడీ నుంచి పేదరైతులకు రక్షణ కల్పించడం, భూమిపై పేద ప్రజలకు హక్కును సాధించి వారికి జీవనోపాధి కల్పించడం, తెలంగాణా సాయుధ పోరాటం హింసామార్గాన్ని అవలంబించినా, ప్రజాభిమానాన్ని చూరగొంది.

1945 సం॥ నాటికి తెలంగాణా ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులై భూస్వాముల దోపిడీని ప్రతిఘటించసాగారు. తెలంగాణాలో సాయుధ పోరాటం పాలకుర్తి సంఘటనతో ప్రారంభమైంది. పాలకుర్తి గ్రామస్థులు దేశముఖ్ విసునూరి రామచంద్రారెడ్డి అనుచరుల దురాగతాలను ప్రతిఘటించడంతో, జరిగిన పోలీసు కాల్పులలో కామ్రేడ్ దొడ్డి కొమరయ్య మరణం ప్రజలను కోపోద్రిక్తులను చేసి దేశముఖ్ గృహం, తోటలు ధ్వంసం చేశారు. పోను పోను సాయుధ పోరాటం ప్రజాఉద్యమంగా మారింది. మొదట్లో ఈ పోరాటం పేద రైతుల పంటల రక్షణకు పరిమితమైన తదుపరి భూస్వాముల ఆధిపత్యంలో నున్న భూముల ఆక్రమణ మరల ఆభూములను నిరుపేదలకు పంచి యిచ్చే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సాయుధ పోరాటం కార్చిచ్చులా తెలంగాణాలో అధిక ప్రాంతానికి విస్తరించింది. ఈ పోరాటాన్ని అణచివేయడానికి నిజాం ప్రభుత్వం గైకొన్న చర్యలు విఫలమయ్యాయి. సాయుధ పోరాటంలో ఎంతో మంది అసువులుబాసారు. ప్రజలు చేసిన త్యాగాలు మరువరానివి. కాని 1946 నాటి తెలంగాణా ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని బహిష్కరించి కఠిన చర్యలు తీసికొనడంవల్ల సాయుధ పోరాటం తాత్కాలికంగా నిలిచిపోయింది.

1947 సం॥రంలో సెప్టెంబరులో తెలంగాణాలో రజాకార్ల దురాగతాలు ప్రతిఘటించే లక్ష్యంతో కమ్యూనిస్టులు సాయుధ పోరాటాన్ని తిరిగి ప్రారంభించారు. కమ్యూనిస్టులు గొరిల్లా దళాలను నెలకొల్పి, రజాకార్లవద్ద నుంచి రక్షకభటులవద్ద నుంచి ఆయుధాలను స్వాధీనం చేసికోవడమే గాక పేదలకు భూములను

BRAOU

పంచే కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రజా మద్ధతు విశేషంగా లభించినదని నిదర్శనం. ఈ సందర్భంగా కామ్రేడ్ ఎల్లసత్యం నిర్భయ వీరోచిత పాత్ర మరువలేనిది. క్లుప్తంగా తెలంగాణా సాయుధ పోరాట ఘనవిజయం సాధించిందని చెప్పవచ్చు.

26.11.2.2 ఇత్తెహాదుల్ ముస్లిం పార్టీ మరియు రజాకార్లు

ఇత్తెహాదుల్ ముస్లిం పార్టీ భారతదేశంలోని ముస్లింల ప్రయోజనాలను పరిరక్షించేందుకు 1927 సం॥లో స్థాపించబడింది. కాని 1939 నుంచి ఈ పార్టీ చురుగ్గా పని చేయడం ప్రారంభించింది. 1939-40 సం॥లో నవాబు బహదూర్‌యార్ జంగ్ ఇత్తెహాదుల్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నికై నిజాం అధికారాన్ని ధిక్కరించసాగాడు. ప్రారంభంలో నిజాం, ఇత్తెహాదుల్ పార్టీకి ప్రోత్సహించాడని కొందరి అభిప్రాయం. బహదూర్‌యార్ జంగ్ నాయకత్వంలో ఇత్తెహాదుల్ పార్టీ ఒక లక్షా ఎనభైవేలమంది హరిజనులను ఇస్లాం మతంలోనికి మార్చినట్లుగా చెప్తారు. తదుపరి ఇత్తేహాదుల్ పార్టీ సేవాదళాలను నెలకొల్పింది. వారే రజాకార్లుగా పేరుపొందారు. రజాకార్లు ప్రత్యేక దుస్తులు ఆయుధాలు ధరించేవారు. 1946 సంవత్సరంనాటికి కాశింరజ్వీ రజాకార్ల వ్యవస్థకు అధ్యక్షుడైనాడు. ఆతనితో రజాకార్లదళం ఒక వ్యక్తిగత సైన్యంగా మారిపోయింది. కాశింరజ్వీ తన సేవాదళంలో 5 లక్షలమందిని చేర్చుకోవాలని భావించాడట. రజాకార్ల సైన్యం నిజాం సైన్యం కలిసి తెలంగాణాలో దోపిడీలకు, గృహదహనాలకు పాల్పడ్డాయి. నిజాం, రజాకార్లు తనకు అండగా వుంటారని తప్పుగా అంచనా వేశారు.

పోను పోను తెలంగాణా ప్రాంతంలో రజాకార్ల దురగతాలను భరించడం కష్టమైంది. రజాకార్లు హత్యలు, మానభంగాలు, బలవంతంగా డబ్బు వసూలు చేయడం మొదలగు దుశ్చర్యలు చేపట్టారు. అందుచేత తెలంగాణా ప్రాంతంలో శాంతి భద్రతలు విచ్ఛిన్నమై ప్రజా జీవితం దుర్భరమైంది. రజాకార్ల దురగతాలను ప్రతిఘటించేందుకు కమ్యూనిస్టులు 1947సం॥లో సాయుధ పోరాటాన్ని తిరిగి ప్రారంభించారు. నిజాం నిశ్శబ్ద ప్రేక్షకుడిగా మారిపోయాడు.

26.11.2.3 హైదరాబాద్‌పై పోలీసు చర్య

1947 సంవత్సరం ఆగష్టు 15న భారతదేశం ఒక స్వతంత్రదేశంగా ఆవిర్భవించినా నిజాంమాత్రం భారతదేశంలో విలీనం కావడానికి సుముఖంగా లేడు. కాని ఆనాడు తెలంగాణా ప్రాంతంలో నెలకొని వున్న అస్తవ్యస్త పరిస్థితులవల్ల నిజాం, నవంబరు 1947సంవత్సరం భారత ప్రభుత్వంలో 'యథాతథ ఒప్పందం' చేసికొన్నాడు. కాని పాకిస్తాన్‌తో రహస్య సంప్రదింపులు కొనసాగించాడు. విదేశాల నుంచి ఆయుధాలను సేకరించాడు. హైదరాబాదులో ఆయుధోత్పత్తి కర్మాగారాలు నెలకొల్పాడు. ఇత్తెహాదుల్ ముస్లిం పార్టీ విదేశాల నుంచి విమానాలు, ఆయుధాలు కొనుగోలు కోసం ప్రయత్నించింది.

ఈలోపున కాశింరజ్వీ ఉగ్రరూపం దాల్చాడు. ఢిల్లీపై యాత్ర నిర్వహించి ఎఱ్ఱకోటపై తమ పతాకాన్ని ఆవిష్కరిస్తామని బీరాలు పలికాడు. హైదరాబాదులో నెలకొని వున్న పరిస్థితులు అంచనా వేయడానికి కె.యం. మున్షీ హైదరాబాద్ సందర్శించి పరిస్థితులు చేజారిపోకుండ చర్యతీసికోవాలని సూచించాడు. మున్షీ నివేదిక ఆధారంగా భారత ప్రభుత్వం చర్యతీసికోవడానికి నిర్ణయం తీసికొంది. 1948 సం॥ సెప్టెంబరు 13వతేదీన భారత సైన్యాలు జనరల్ జె.ఎన్ చౌదరి సారధ్యంలో హైదరాబాద్‌లో ప్రవేశించాయి. దీనినే **'ఆపరేషన్ పోలో'**గా పిలువ బడే పోలీసు చర్య తీసికొన్న ఫలితంగా, నిజాం ప్రత్యామ్నాయంలేక భారత సైన్యానికి లొంగిపోయాడు. ఈ పోలీసు చర్యఫలితంగా హైదరాబాదు రాజ్యం "భారత యూనియన్"లో విలీనమైంది. అంతేగాక తెలంగాణా ప్రజలు రాజాకార్ల దురాగతాల నుంచి విముక్తులయ్యారు. దీని ఫలితంగా కమ్యూనిస్టులు ప్రారంభించిన రెండవ దశ సాయుధ పోరాటం, 1950 సం॥ నిలుపు చేయబడింది.

తెలంగాణా సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ప్రముఖ పాత్ర నిర్వహించి ప్రజాభిమానాలు చూరగొన్నారు. పేదవారికి రక్షణ కల్పించే హక్కు వారికి జీవనోపాధి కల్పించేహక్కు కమ్యూనిస్టులు నిర్విరామ కృషి చేశారు. సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణా ప్రాంతంలో జాగీరువ్యవస్థ, కట్టుబానిసత్వం కొల్దారీ

పద్ధతి, భగీలా మొదలగు వ్యవస్థలు తొలగించబడ్డాయి. క్లుప్తంగా సాయుధ పోరాటం తెలంగాణా ప్రజలలో బానిసత్వ మనస్తత్వాన్ని రూపుమాపి వారిని నిస్సందేహంగా చైతన్యవంతులను చేసింది.

హైదరాబాద్ సమస్య మరికొంత జటిలమయింది. ముస్లిం జనాభా 15 శాతమే అయినప్పటికీ, సైన్యం పోలీసులతో సహా అన్ని ప్రముఖమయిన ప్రభుత్వోద్యోగాలలోను, మహ్మదీయులే వున్నారు. నిజాం, హైదరాబాదుకో ప్రత్యేక స్థానాన్ని, బ్రిటన్‌తో ప్రత్యక్ష సంబంధాన్ని, ఆకాంక్షించారు. బ్రిటీష్ కామన్‌వెల్త్ దేశాల్లో ఒక డొమినియన్‌గా యీ సంస్థానం చేరే వీలులేదని, మౌంట్‌బాటెన్ స్పష్టం చేశాడు. నిజాం అర్ధదారితొక్కి విలీనీకరణను ఆలస్యంచేశాడు. ఈ నేపథ్యంలో యథాతథ స్థితిని అంగీకరిస్తూ, భారత ప్రభుత్వం, నిజామ్‌ల మధ్య, 1947 అక్టోబరులో ఒక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం యథాతథ స్థితి ఒక సంవత్సరం పాటు వుంటుంది. ఆకాలంలో, నిజాం తన సైన్యశక్తిని పెంచటంగానీ, వెలుపలనుంచి సైనిక సహాయాన్ని కోరడం కాని చేయరాదు. ఈ సూత్రాలను నిజాం లక్ష్య పెట్టలేదు. 1949లో, హైదరాబాదుకు పాకిస్తాన్ నుండి భారీయెత్తున ఆయుధాలందాయి. భారత ప్రభుత్వాన్ని గణించకుండా, నిజాం పాకిస్తాన్ నుంచి ప్రత్యక్ష ప్రోత్సాహాన్ని పొందాడు. ఈ విధంగా, దేశం కడుపులో హైదరాబాద్ భయంకర వ్రణం (Ulcer) గా తయారైంది. అదే సమయంలో హైదరాబాద్‌లో ప్రజల ఆందోళన పెరగ సాగింది. నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా, 1946లో మొదలయిన ప్రజల తిరుగుబాటు, రైతాంగ విప్లవంగా రూపుదిద్దుకొని, తెలంగాణా అంతటా వ్యాపించింది. ఈ విప్లవాన్ని అణచడానికి నిజాం ప్రభుత్వం, ఇతర జమీందారులు, కాశింరజ్వీ నాయకత్వాన రజాకార్ల ముఠాలను ఏర్పరిచారు. హైదరాబాద్‌లోని ముస్లిమేతర ప్రజానీకంలో, రజాకార్లు భీతావహాన్ని సృష్టించారు.

తెలంగాణా రైతాంగ విప్లవ ప్రభావం, ఇతర ప్రాంతాలకు విస్తరించేటట్లు కనబడింది. ఈ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం, హైదరాబాద్ భారతదేశంనుంచి విడిపోకుండా చూడటానికి రైతాంగ విప్లవం ఆంధ్ర ప్రాంతానికి వ్యాపించకుండా ఆపడానికీ, 1948 సెప్టెంబర్ లో చివరి తాఖీదు యిచ్చింది. అనేక యితర విషయాలతోపాటు, నిజాం వెంటనే రజాకార్ ముఠాలను తొలగించాలని కోరింది. నిజాం లక్ష్యపెట్టకపోగా, 1948 సెప్టెంబరు 13న భారత సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలో అడుగుపెట్టాయి. భారత ప్రభుత్వం దీన్ని యుద్ధంగా కాక, రాజ్యంలో శాంతిని, శాసనాన్ని పునరుద్ధరించటానికి తీసుకొన్న "పోలీసు చర్య"గా ప్రకటించింది. రాజ్యంలో సామాన్య పరిస్థితిని నెలకొల్పటానికి రజాకార్ ముఠాలను ధ్వంసంచేసి, వామపక్ష సిద్ధాంత ప్రేరేపితమయిన తెలంగాణా రైతాంగ విప్లవానికి వ్యతిరేకంగా చర్యతీసుకుంటున్న మేజర్ జనరల్ జె.యన్. చౌదరి ఆధ్వర్యంలో, హైదరాబాద్‌ను వుంచింది. చివరికి భారతదేశంలో హైదరాబాదును చేర్చటానికి, 1949 నవంబర్‌లో నిజాం అంగీకరించారు.

26.11.3 కాశ్మీర్

జమ్మూ-కాశ్మీర్ రాజ్యం భారత సమాఖ్యకు మరో క్లిష్టమయిన సమస్య అయింది. భారత - పాకిస్తాన్ సరిహద్దులో వున్న యీ రాజ్యం, ఎందులోనయినా చేరే అవకాశం ఉంది. ముస్లిం జనాభా ఎక్కువగా వుంది కాబట్టి, దీన్ని తనలో కలుపుకోవటానికి పాకిస్తాన్ సహజంగానే ఆత్రుత కన్పరచింది. కాశ్మీర్ సమస్యను అర్థం చేసుకోవటానికి, కొంత నేపథ్యమవసరం. జమ్మూ కాశ్మీర్ జనాభా 40 లక్షలు. అందులో, 30 లక్షలు మహమ్మదీయులు. మహారాజు హిందువు. 1931 లో షేక్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్‌ను స్థాపించి, కాంగ్రెస్ పార్టీతో స్నేహ సంబంధాలను అభివృద్ధి పర్చుకొన్నాడు. మహారాజుకు వ్యతిరేకంగా 'క్విట్ కాశ్మీర్' ఉద్యమాన్ని లేవదీసినందుకు, 1946 మేలో షేక్ అబ్దుల్లాను జైల్లో పెట్టారు.

అప్పుడు గాంధీజీ ఈ రాజ్యాన్ని సందర్శించి, షేక్ అబ్దుల్లాను విడుదలచేయటానికి మహారాజును ఒప్పించాడు. "స్వాతంత్ర్యం ముందు, విలీనీకరణ తరువాత" అని, సెప్టెంబర్‌లో షేక్ అబ్దుల్లా పిలుపిచ్చాడు. తమ భవిష్యత్తు నిర్ణయించుకొనేది ప్రజలు కాని మహారాజు కాదన్నాడు. ఈ మార్గంలో ఏ విధమైన చర్య ప్రారంభం కాకముందే పాకిస్తాన్‌లోని పఠాన్ ఆదివాసులు, జమ్మూ-కాశ్మీర్ లోనికి చొచ్చుకొని వచ్చారు. పాకిస్తాన్ సైన్యాలు, వారితో చేయి కలిపాయి. మహారాజు ప్రభుత్వ యంత్రాంగం పతనమయింది. ఆయన, భారత

BRAOU

సైనిక సహాయాన్ని అర్థించారు. అక్టోబరు 26న, భారత సమాఖ్యలో చేరుతూ సంతకం చేశాడు. భారత సైన్యాలు విమానాలలో దిగి, సమయానికి అదుకోగలిగాయి. ఈ చర్యను, ప్రజా బాహుళ్యం సమర్థనవున్న 'నేషనల్ కాన్ఫరెన్స్' పక్షనాయకుడు షేక్ అబ్దుల్లా ఆమోదించాడు.

అక్టోబరు 31న షేక్ అబ్దుల్లా నాయకత్వాన, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. భారత సైన్యాల సహాయంతో, ఈ ప్రభుత్వం పాకిస్తాన్ సేనల ప్రవేశాన్ని తిరగగొట్టింది. కాని, పాక్ సైన్యాలు కొంత భూభాగాన్ని ఆక్రమించుకొని, దానికి **ఆజాద్ కాశ్మీర్** అని పేరు పెట్టాయి. 1947 డిసెంబర్‌లో, జమ్మూ-కాశ్మీర్ తాత్కాలిక ప్రభుత్వం, పాకిస్తాన్ దురాక్రమణను ఆపవల్సిందిగా, ఐక్యరాజ్యసమితి భద్రతా సంఘానికి విన్నవించింది. భారత పాకిస్తాన్‌ల వాదనలను, భద్రతా సంఘం ముందు పెట్టటం జరిగింది. కానీ, ఒక శాంతియుతమయిన పరిష్కారానికి సంఘం రాలేకపోయింది. ఈ లోపల, 1949 జనవరిలో, ఐక్యరాజ్యసమితి సంఘం కాల్పుల విరమణకు ఏర్పాటు చేసేటప్పటికి, రెండు దేశాలు ఒక సంవత్సరం పాటు యుద్ధం సాగించాయి. అంతకుముందు, భారతప్రభుత్వం విలీనీకరణ విషయంపై ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధపడింది. ఐక్యరాజ్యసమితి తీర్మానంలోని షరతులను పాటించక. ఆక్రమిత ప్రాంతాల నుంచి పాకిస్తాన్ సైన్య విరమణ చేయకపోవడంతో ప్రజాభిప్రాయ సేకరణోద్దేశం వ్యర్థమయింది. జమ్ము-కాశ్మీర్‌కు రాజ్యాంగ రచనకోసం, రాజ్యాంగ సభ 1951లో జమ్ము-కాశ్మీర్‌లో సమావేశమయింది. భారతదేశంతో చేరికను రాజ్యాంగ సభ 1954 ఫిబ్రవరిలో ఆమోదించింది. 1956 నవంబర్‌లో రాజ్యాంగ సభ, జమ్ము - కాశ్మీర్ రాష్ట్రం భారత డొమినియన్‌లో భాగమని శాసనబద్ధం చేసింది. పాకిస్తాన్ సైన్యాలు 1947లో ఆక్రమించుకున్న ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంమీద, పాకిస్తాన్ తన అధికారాన్ని నిలబెట్టుకుంది.

ఈ విధంగా, రాజ్యాల విలీనీకరణ దృఢసంకల్పంతో, నిర్దాక్షిణ్యధోరణిలో జరిగింది. భారత స్వాతంత్ర్యం, అధికార స్థిరీకరణలను గురించిన ఈ చర్యను, వి.పి.మీనన్ గారి ఈ క్రింది వాక్యాలతో మనం ముగించవచ్చు. *"554 సంస్థానాలను భారత రిపబ్లిక్ లో కలవడం, వాటిలో పరిపాలన యంత్రాంగాన్ని ప్రజాస్వామ్యీకరించడం, ఇతర రంగాలలో కూడా అటువంటి సమానమైన విజయ సాధనవైపు నడిపించాలి. భారతదేశం మొట్ట మొదటిసారిగా, సరియైన అర్థంలో సమైక్యతను పొందింది. ఒక సంపన్నమైన సంక్షేమ రాజ్యాన్ని నిర్మించటానికి, యిది పునాది మాత్రమే, అసంఖ్యాకమైన, అనిర్దిష్టమయిన అశలకు, మనం రూప కల్పన చేయాల్సి వుంటుంది. మిణుకు మిణుకు మనే ఉనికిని సాగిస్తున్న లక్షలాది ప్రజల జీవితాలకు, అర్థం కల్పించాలి".*

BRAOU

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1) భారత పాకిస్తాన్‌ల మధ్య సరిహద్దు రేఖను నిర్ణయించడానికి ఏర్పాటైన సంఘానికి అధ్యక్షుడెవరు?

.....

.....

.....

.....

2) భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం ఎప్పుడు విలీనమైంది?

.....

.....

.....

.....

26.12 సంగ్రహంగా

1. దేశంలో అధ్వాన్నమవుతున్న ఆర్థిక పరిస్థితులు, సైనికదళంలో తిరుగుబాటు, వాయుదళానికి సైనికదళానికి వ్యాప్తి చెందడంవల్ల భారతదేశంలో బ్రిటీష్‌వారు భారతీయులకు అధికారాన్ని బదిలీ చేయుటకు తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి.
2. బలహీనమైన కేంద్రంలో, స్వతంత్ర రాష్ట్రాలలో దేశం అవిభక్తంగా వుండడానికి కాబినెట్ సంఘ సభ్యులు ప్రతిపాదించారు. ముస్లిం లీగ్, ఆ ప్రతిపాదనలను వ్యతిరేకించింది.
3. పాకిస్తాన్ ఏర్పాటుకు, ముస్లిం లీగ్, ఉద్యమాన్ని తీవ్రతరం చేయడంవల్ల, దేశంలో అనేక చోట్ల మత ఘర్షణలు చెలరేగాయి.
4. దేశంలో అంతర్యుద్ధాన్ని నివారించడానికి, కాంగ్రెస్ నాయకులు, మౌంట్‌బాటెన్, దేశ విభజన ప్రతిపాదనలకు అంగీకారం తెలియజేశారు.
5. భారతదేశంలో సుమారు 554 సంస్థానాల విలీనం, ఎంతో రాజనీతితో, చాకచక్యంతో, ఓర్పుతో, సర్దార్ వల్లభాయ్ పటేల్ సాధించాడు.

26.13 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1) కాబినెట్ సంఘ ప్రతిపాదనల ప్రకారం, కేంద్ర ప్రభుత్వానికి, రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్స్ శాఖలు మాత్రమే ఉండేవి.

2) ముఖ్యంగా, దేశంలో అంతర్యుద్ధాన్ని నివారించడానికే, కాంగ్రెస్ నాయకులు, దేశ విభజన ప్రతిపాదనకు అంగీకరించారు.

II. 1) భారత పాకిస్తాన్‌ల మధ్య సరిహద్దు రేఖను నిర్ణయించడానికి ఏర్పడ్డ సంఘానికి అధ్యక్షుడు, రాడ్ క్లిఫ్.

2) 1948, సెప్టెంబర్ 17వ తేది, హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది.

26.14 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు వ్రాయండి.

1. ఫిబ్రవరి, 1947లో చేయబడిన అట్లీ ప్రకటనకు దారితీసిన సంఘటనలను తెలిపి, దాని ఫలితాలను చర్చించండి.
2. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన స్వదేశీ సంస్థానాల విలీనీకరణ ప్రక్రియను పరిశీలించండి.
3. కాశ్మీర్ సమస్య అంటే ఏమిటి? అది ఎట్లు తలెత్తింది?
4. స్వాతంత్ర్య సమయంలో హైదరాబాద్ రాష్ట్ర పరిస్థితిని, భారత యూనియన్‌లో అది ఎట్లు విలీనీకరణం చేయబడింది పరిశీలించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. కాబినెట్ రాయబారం ప్రతిపాదించిన దేమిటి? భారత రాజకీయ పార్టీలు దానికెట్లు స్పందించాయి?
2. నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంపట్ల ముస్లిం లీగ్ వైఖరిని తెలపండి.
3. అట్లీ ప్రకటనపట్ల ముఖ్య రాజకీయ పార్టీల స్పందనను పరిశీలించండి.
4. భారత యూనియన్‌లో జునాగడ్ విలీనీకరణను విశదీకరించండి.

BRAOU

26.15 ఉపయుక్త గ్రంథాలు

1.	Bipan Chandra	:	*Modern India*
2.	Chopra, Puri & Das	:	*A Social, Cultural and Economic History of India Vol.*
3.	Mahajan. V.D.	:	*India Since 1526*
4.	Majumdar. R.C.(Ed)	:	*The Struggle for Freedom. Bharatiya Vidya Bhavan Series, Vol. X*
5.	Majumdar, R.C. (Ed)	:	*Three Phases of India's Struggle for Freedom*
6.	Perceival Spear	:	*History of IndiaVol.II*
7.	Perceival Spear	:	*Th Oxford History of Modern India*
8.	Sumit Sarkar	:	*Modern India*
9.	Tara Chand	:	*History of Freedom Movement in India*
10.	ఝాన్సిలక్ష్మి, పాటిబండ, వైదేహి, అల్లాడి	:	భారతదేశ చరిత్ర సంస్కృతి, ద్వితీయ భాగం, తెలుగుఅకాడమి ప్రచురణ
11.	వైదేహి, అల్లాడి	:	భారతస్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1858-1947)
12.	బిపన్ చంద్ర	:	ఆధునిక భారతదేశం

BRAOU

భాగం -27 : స్వాతంత్ర్యోద్యమం నాటి భారతదేశ పరిస్థితులు

విషయక్రమం

27.0 లక్ష్యాలు

27.1 పరిచయం

27.2 సాంఘిక పరిస్థితులు

- 27.2.1 మత కలహాలు
- 27.2.2 కాందిశీకుల సమస్య
- 27.2.3 విద్య
- 27.2.4 స్త్రీల పరిస్థితి
- 27.2.5 కులవ్యవస్థ
- 27.2.6 వెనుకబడిన వర్గాలు, అస్పృశ్యత
- 27.2.7 సముద్ర యానం
  - 27.2.8.1 సాంఘిక సంక్షేమ పథకాలు
  - 27.2.8.2 శిశు సంక్షేమం
  - 27.2.8.3 వయోజన విద్య
- 27.2.9 కార్మిక సంక్షేమం

27.3 ఆర్థిక పరిస్థితులు

- 27.3.1 వ్యవసాయ రంగంలో మాంద్యం, క్షీణత
- 27.3.2 రైతుల బీదరికం
- 27.3.3 నూతన భూస్వాములు
- 27.3.4 చేతిపని వారి దుస్థితి
- 27.3.5 పారిశ్రామిక అభివృద్ధి
- 27.3.6 ద్రవ్య చెలామణిలో ప్రయోగాలు
- 27.3.7 వ్యాపారం, ధన లుప్తత
- 27.3.8 ఆర్థిక వ్యవస్థ

27.4 సాంస్కృతిక పరిస్థితులు

- 27.4.1 సాహిత్య అభివృద్ధి
- 27.4.2 కళ, వాస్తు కళ
- 27.4.3 మత పరిస్థితులు
  - 27.4.3.1 హిందూమతం
  - 27.4.3.2 హిందూ మహాసభ
  - 27.4.3.3 ఆర్య సమాజం
  - 27.4.3.4 బ్రహ్మ సమాజం
  - 27.4.3.5 శిక్కులు

27.5 భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు

27.6 సంగ్రహంగా

27.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

27.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

27.9 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

27.0 లక్ష్యాలు

ఈ పాఠము చదవడంవల్ల ఈ క్రింది విషయాలను గురించి అవగాహన ఏర్పడాలి.

1 1947 నాటికి భారతదేశంలో సాంఘిక పరిస్థితులు, దేశవిభజనవల్ల ఏర్పడ్డ సమస్యలు మత కల్లోలాలు, కాందిశీకుల సమస్య.

2 1947 నాటికి దేశంలోని ఆర్థిక పరిస్థితులు

3 1947 నాటికి దేశంలోని సాంస్కృతిక పరిస్థితులు

27.1 పరిచయం

దేశం స్వాతంత్ర్యాన్ని సంపాదించేటప్పటికి, సమాజంలో అనేక సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులు జరిగాయి. దేశవిభజనవల్ల మతపరమయిన మారణహోమం, కాందిశీకుల సమస్యలు ఎదుర్కో వలసివచ్చింది. ఈ పాఠంలో, ఆ విషయాలగురించి విపులంగా చర్చించడం జరిగింది.

27.2 సాంఘిక పరిస్థితులు

స్వాతంత్ర్య సముపార్జనా సమయంలో, భారతదేశంలోని పరిస్థితులను, నాడు దేశమంతటా అలుముకున్న కొత్త వాతావరణం, రాజకీయ సంఘటనలు బాగా ప్రభావితం చేశాయి. పాశ్చాత్య విద్యావ్యాప్తి, రాజకీయ (జాతీయ) జాగృతి, దేశంలో ఒక కొత్త వాతావరణం నెలకొనటానికి దోహదం చేశాయి. ఆ పరిస్థితుల్లో, హింసాపూరితమూ, విషాద భరితమూ అయిన సంఘటన లనేకం సంభవించాయి. సంఘ సంస్కరణా కార్యక్రమం కూడా చేపట్టబడింది.

27.2.1 మత కల్లోలాలు

మహమ్మదాలీ జిన్నా నాయకత్వంలో ముస్లింలీగ్ 'ప్రత్యక్ష చర్యదినం'గా ఆగస్ట్ 16, 1946ను పాటించాలని, మహమ్మదీయులందరకు పిలుపునిచ్చిన సందర్భంగా, అనాటి నుంచి మతకల్లోలాలకు నాంది పలికినట్లయింది. మార్చి, 1946లో భారతదేశాన్ని సందర్శించిన కాబినెట్ రాయబార సలహాల ననుసరించి, తాత్కాలిక ప్రభుత్వ సభ్యుల నియామకంపై జరిగిన చర్చల్లో కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య ఏర్పడ్డ వైఫల్యమే, మతకల్లోలాలకు పునాది అయింది. ముస్లింలీగ్‌కు సంబంధించని మహమ్మదీయుడు, కాంగ్రెస్‌వాటా నుండైనా సరే, సభ్యుడు కారాదనే మొండిపట్టు పట్టాడు జిన్నా. అందువల్ల, అనాటి భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడైన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ లాంటి గౌరవనీయులైన మహమ్మదీయులకూ, సభ్యత్వావకాశాన్ని తిరస్కరించాల్సిన పరిస్థితి, జిన్నా మొండిపట్టువల్ల సంభవించింది. రాజకీయంగా ఉన్నత శిఖరాల నధిరోహించటం కోసం, మతోద్రేకాలను రెచ్చగొట్టడం జరిగింది. ఫలితంగా, దేశ ఏకత్వానికీ, సంఘటనకూ ప్రమాదం ఏర్పడింది.

'ప్రత్యక్షచర్య'ను ప్రశాంతంగా వ్యతిరేకతను సూచించటమేనని, ముస్లింలీగ్ వ్యాఖ్యానించినప్పటికి, అది ఇద్దరు మతానుయాయుల మధ్య జరిగిన హింసాపూరితమయిన, రక్తపాతంతో కూడిన అంతఃకలహమే అయింది. మహమ్మదీయ మంత్రివర్గాలతో పరిపాలింపబడే బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు యీ హింసాయుతకాండకు ముఖ్య కేంద్రాలైనాయి. దూరంగా ఎక్కడో ఒక ప్రాంతంలో నివసించే, ఒక వర్గానికి చెందిన అమాయక ప్రజలను విచక్షణారహితంగా, అమానుషంగా వధించటం సాగింది. నౌఖాలీ (తూర్పు బెంగాల్) లో హిందువులపై జరిగిన అత్యాచారాలకు ప్రతిఫలంగా బీహార్‌లో మహమ్మదీయుల మీద అత్యాచారాలు జరిగాయి. రాష్ట్రాధికారులు కానీ, బ్రిటీష్ అధికారులు కానీ, పరిస్థితి నదుపు చేయటానికి ఉద్దేశపూర్వకంగా ఎలాంటి చర్య తీసుకొనలేదు. ఫలితంగా, హింసాకాండ ఒక వారం రోజుల వరకూ అదుపులేకుండా సాగింది.

BRAOU

జరిగిందేమో వర్ణించవీలు కానిది. లియోనార్డ్ మోస్లే మాటల్లో, ఆనాటి హింసా కాండ కించిన్మాత్రంగా అంచనా వేయవచ్చు. ఆయన అన్నాడు - *"ఆగస్ట్ 16, 1946 ఉదయాన్నుండి, మూడో రోజు సాయంత్రం వరకూ, కలకత్తా పౌరులు ఒకళ్ళనొకళ్ళు 6,000 మంది దాకా నరుక్కొన్నారు, వధించారు, తగలబెట్టారు. 20,000 మంది యొక్క కాళ్ళూ చేతులు నరికారు. మానభంగాలు చేశారు".* అప్పటి నుంచి, ముస్లింలీగ్ తన హేతురహితమయిన కోర్కెలను తీర్చుకొనటంలో అసఫల మయినప్పుడల్లా చివరికి దేశ విభజనకు పూర్తి అంగీకారం లభించినదాకా, ఒకసారి పరీక్షించి నిగ్గుతేల్చిన హింసా పద్ధతిని -మతోద్రేకాలను రెచ్చగొట్టడం, సాముదాయిక వధ - ఉపయోగించడం ప్రారంభించింది. అలా, 1947వ సంవత్సరంలో రాజప్రతినిధి మౌంట్‌బాటెన్ ప్రభువు ఈ సమస్య పరిష్కారానికి దేశ విభజనే ఏకైక మార్గంగా నిర్దేశించినప్పుడు పూర్తి (ముక్కలుకాని) పంజాబ్, బెంగాల్‌లను పాకిస్తాన్‌లో కలపటానికి మద్ధతు లభించకపోగా, ముస్లింలీగ్ మతకల్లోలాలను ఆయుధంగా చేపట్టింది. పంజాబ్‌లో, ఢిల్లీలో , ఆగ్నేయ సరిహద్దు రాష్ట్రంలో దోపిడీ, హింస, వధ అనవరతంగా సాగాయి. నక్కజిత్తుల రాజ ప్రతినిధి ఒకళ్ళపై నొకళ్ళను రెచ్చగొడుతూ, పరిస్థితి నదుపు చేయడానికి ఎలాంటి చర్యగైకొనలేదు. గోడమీది వ్రాత స్పష్టమే, ఒక్క గాంధి మినహా,మిగతా కాంగ్రెస్ నాయకులూ, కార్యవర్గమూ, యీ మానవ మారణహోమం ఆపటానికి దేశవిభజన తప్ప గత్యంతరం లేదని భావించారు. దేశవిభజనకు అంగీకరించారు. దైశైక్యత భంగంకాని పరిస్థితుల్లో, ముస్లింలీగ్‌కు దేశ పరిపాలనలో పైచెయ్యి యివ్వటానికి కూడ జాతిపిత అంగీకరించాడు. అయితే, పరమత అసహనంతో పంకిలమైన ఆనాటి వాతావరణంలో, మహాత్ముడి గొంతు చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందమైంది.

27.2.2 కాందిశీకుల సమస్య

ఆగస్ట్ 15, 1947 భారతదేశం స్వాతంత్ర్యం పొందిన సందర్భంగా పొందిన ఆనందోత్సాహాలు, కాందిశీకుల హత్యాకాండతో నిర్వీర్యమయి పోయాయి. జాతిపిత కాందిశీకుల పునరావాసం నిమిత్తమై, సంపూర్ణత్యాగానికై ఆయత్తమయ్యాడు. రాడ్‌క్లిఫ్ సరిహద్దు కమీషన్ వారు, 16 శాతం మహమ్మదీయులు పశ్చిమ బెంగాల్‌లోను, 42 శాతం మహమ్మదీయులు తూర్పు బెంగాల్‌లోను వుంటారని అంచనా వేశారు; పంజాబ్‌లో 38శాతం వైశాల్యంగల భూభాగం, 45 శాతం జనాభా తూర్పు పంజాబ్‌కు చెందుతుందనీ ఆదేశించారు. ఆగస్ట్ 17వ తారీఖున వెలువడిన కమీషన్ వారి నిర్ణయం, శిక్కులను రెండు సమభాగాలుగా విభజించటంవల్ల, వారు దాన్ని తీవ్రంగా నిరసించారు కొద్ది రోజుల్లోనే, తూర్పు పంజాబ్‌లోని మహమ్మదీయులను హిందువులు, శిక్కులు, పశ్చిమ పంజాబ్‌లోని శిక్కులను మహమ్మదీయులు, మట్టుబెట్టటం మొదలెట్టారు. ఒక రకమయిన యుద్ధోన్మాదం దేశమంతటా ఆవరించింది. అనేక రకాలయిన అకృత్యాలు అదుపులేకుండా సాగాయి. కొద్ది రోజుల్లోనే దీర్ఘమయిన కాందిశీకుల గుంపులు, పొరుగుదేశంలో తలదాచుకోవటానికి తూర్పుకి, పడమరకి ప్రయాణాలు సాగించాయి. 50,000 మంది బలంగల భారత సరిహద్దు గస్తీదళం, పరిస్థితి నదుపు చేయలేక పోయింది. సెప్టెంబర్ ప్రథమ భాగంలో, మత కల్లోలాల కారణంగా వచ్చిన కాందిశీకులతో ఢిల్లీ నగరం నిండిపోయింది. మహమ్మదీయ జాతినే సమూలంగా పెరికివేసినట్లయింది. ప్రభుత్వ స్థిరత్వమే అనుమానాస్పద మయింది. న్యాయమూర్తి జి.డి.ఖోస్లా, న్యాయంగా విషయాలను పరిశీలించిన మీదట, 5 లక్షల వరకూ జనులను వధించటం జరిగిందని చెప్పారు. ఈ మానవ మారణహోమమే కాక, అనుకోకుండా అధిక సంఖ్యలో జనాభా మార్పిడి జరిగింది. పంజాబ్‌లో 55 లక్షల జనం, కొత్తగా ఏర్పడ్డ భారత - పాకిస్తాన్ సరిహద్దు దాటటం జరిగిందని, అంచనా వేయబడింది. ఆ పైన 4 లక్షల హిందువులు సింధు ప్రాంతాన్నుండి భారతదేశానికి, 10 లక్షల జనాభా తూర్పు పాకిస్తాన్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు తరలి వెళ్ళారు.

హత్యాకాండ కొంత తగ్గుముఖం పట్టగానే, కొత్త ప్రభుత్వం కాందిశీకుల పునరావాస సమస్యతో తలమునకలయింది. అక్టోబర్‌లో మహాత్మాగాంధీ బెంగాల్ నుంచి ఢిల్లీ వచ్చాడు. తన శక్తి మేరకు, యీ సమస్యాపరిష్కారానికై యత్నించాడు; జనవరి, 1948లో తన రెండు కోరికల సాధనకై, నిరసన వ్రతం సాగించాడు. వాటిల్లో మొదటిది, కాశ్మీర్ వైరుధ్యం కారణంగా నిలిపివేయబడిన పాకిస్తాన్‌కు చెల్లించాల్సిన ధనం, అప్పగించాల్సిన

BRAOU

ఆస్తులు వెంటనే చెల్లించాలనీ, అప్పగించాలని; రెండవది, రాజధానీ నగరంలో శాంతి నెలకొనాలని, పాకిస్తాన్‌కు డబ్బు చెల్లించిన తరువాత, శాంతి ఒప్పందం కుదిరిన తరువాత, తాను మొండిగా సాగించిన నిరశన వ్రతాన్ని, ఆయన జనవరి 18వ తారీఖున విరమించాడు. శాంతి ఒప్పందంలో ఒక భాగంగా, కాందిశీకులతో నిండిన మసీదుల నుంచి, వారిని కాందిశీకుల శిబిరాలకు తరలించడం జరిగింది. అయితే; ధైర్యసాహసాలతో కూడిన గొప్ప కార్యాన్ని సాధించిన తదుపరి, మహాత్మాగాంధీ ఎంతో కాలం జీవించి వుండలేదు. నిజం చెప్పాలంటే ఓ విధంగా ఆయనే యీ అర్థంలేని మత కల్లోలాలతో విసిగిపోయాడు. హింసాకాండతో, ఆటవిక మనస్తత్వంతో సాగే దుష్కృత్యాలకు దూరంగా తనను తీసుకువెళ్ళమని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, 1947లో జన్మదిన సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అలాగే 12 రోజుల తర్వాత, హిందూమతోన్మాది చేతుల్లో ఆయన అసువులు బాసాడు. ఆ విధంగా, ఋషితుల్యుడు, నిస్వార్థి అయిన జాతిపిత తన దేశాన్ని, దేశీయులను సంఘటితం చేయడానికి, తన ప్రాణాలతోనే మూల్యం చెల్లించాడు.

27.2.3 విద్య

1905-47 ల మధ్య విద్యారంగంలో సాధించిన అభివృద్ధిని యీవిధంగా విశ్లేషణ చేయవచ్చు.

1. చదువుకొనే విద్యార్థుల సంఖ్యలో వృద్ధి, ముఖ్యంగా యీ వృద్ధి స్త్రీలలో , మహమ్మదీయుల్లో, పీడిత వర్గాలవారిలో అధికంగా కన్పిస్తుంది.

2. బోధనా విషయాలలో వివిధత్వం పెంపొందింపబడింది. కళలు, వాణిజ్య వ్యాపారాలు, విజ్ఞానాలతో పాటు, వైద్యం, ఇంజనీరింగ్, వ్యవసాయం, న్యాయ విద్యలకు ప్రాముఖ్యం లభించింది. గాంధీగారి బేసిక్ విద్యావిధానానికి కూడా ప్రాచుర్యం లభించింది.

3. సాంఘిక శాస్త్ర విద్యల స్థానంలో విజ్ఞాన శాస్త్రం పట్ల, సాంకేతిక విద్య పట్ల, జనంలో అధికమైన మోజు ఏర్పడింది. సమకాలీన ప్రపంచం ఎలా వీటిపట్ల ఆసక్తి పెంపొందించుకుందో, అలా భారతదేశంలోనూ వీటిపట్ల ఆకర్షణ పెరిగింది.

4. కళా, శాస్త్ర, విజ్ఞాన రంగాల్లో పరిశోధన చేయాలనే ఆకాంక్ష వృద్ధి అయింది. వృక్ష శాస్త్రజ్ఞుడైన జె.సి.బోస్, భౌతిక శాస్త్రవేత్త అయిన సర్ సి.వి.రామన్, మహాకవియైన టాగూరు, పంజాబీ కవి, తత్వవేత్త అయిన సర్ మహమ్మద్ ఇక్బాల్, చరిత్ర కారుడయిన జాదునాథ్ సర్కార్, తత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి మేధావుల, శాస్త్ర వేత్తల పరిశ్రమ, పరిశోధన, భారతదేశాన్ని సమకాలీన ప్రపంచ విద్యా సింధువులో కలిపాయి.

5. పాఠశాలల్లో విద్యాబోధనకై ఉపాధ్యాయులకు శిక్షణనివ్వట మవసరమని గుర్తించటం జరిగింది. అందుకై, ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలు స్థాపించబడినాయి.

6. పరీక్షల నిర్వహణార్థమూ, అనుబంధార్థమూ ఏర్పడిన విశ్వవిద్యాలయాలస్థానే, లేదా వాటితో పాటుగా, కాశీ హిందూ విశ్వవిద్యాలయం, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం, శాంతినికేతన్ విశ్వభారతీ విశ్వవిద్యాలయం లాంటి కేంద్రీకృతమైనవీ, విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేవీ, బోధనా విషయాన్ని ముఖ్యంగా భావించేవీ అయిన విశ్వవిద్యాలయాలు ఏర్పడినాయి. ఒక విషయం ముఖ్యంగా గమనించాల్సి వుంటుంది. విద్యపట్ల ఆసక్తి ప్రజల మనసుల్లో ఎంతగా పాదుకొని పోయిందంటే, ధనికులు, ఇవ్వగలదాతలు, కులాలవారు, విద్యాలయాల స్థాపనకు ఆర్థిక సహాయం చేయటానికి వెనకాడకుండా ముందుకువచ్చారు.

అయితే యీ కాలంలో విద్యాభివృద్ధి ఎలా తప్పటడుగులు, లోపాలు లేకుండా ముందుకు సాగిందని కాదు. మొదటగా సాధించిన అభివృద్ధి దేశావసరాలకూ, సహేతుకమైన అంచనాలమేరకు సరిపోయినదిగాలేదు. ముఖ్యంగా, ప్రాథమిక విద్యారంగంలో యీ లోపం స్పష్టమవుతుంది. ఇదే, దేశంలో చదువుకున్నవారి శాతం

నిర్ణయించేమెట్టు. రెండవదిగా, విశ్వవిద్యాలయ ప్రవేశం దాకా సాగిన తరవాతి విద్యారంగంలో, సంఖ్యాబలం సాధించినా ఆ విద్య మెరుగులేనిదిగా తయారయింది. ప్రమాణాలు పడిపోయాయి. మూడవ లోపం, చదువుకున్నవారికి ఉద్యోగావకాశాలు కల్పించలేకపోవటం. ఈ సమస్య మన పరిశీలనలో వున్న యీ కాలమంతా, ఉధృతమవుతూనే వుంది. ఈ సమస్య, సగం విద్యలో మెరుగులేకపోవటంవల్ల, సగం దాని ఫలితంగాను ఏర్పడింది. విద్యాపద్ధతి మనజాతి సంస్కృతిలో వ్రేళ్ళూనుకొని పైకి సాగినదిగాను, దానిపై ఆధారపడినదిగాను లేకపోవటంవల్ల, ఈ విద్య విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి అనుకూలంగా లేదని, కొంతమంది భావించారు. అప్పటి నుంచి పరిస్థితులు చాలావరకు మారినా, మూలభూతమైన విద్యాపద్ధతి మార్పులేకుండానే వుండిపోయింది.

27.2.4 స్త్రీల పరిస్థితి

మన పరిశీలనలో వున్న యీ కాలంలో స్త్రీల పరిస్థితి, స్థానం గమనించేటంతగా అభివృద్ధి పొందాయి. స్త్రీ విద్యావ్యాప్తి, 1905 నుంచి స్త్రీల సాంఘిక సభల్లో, జాతీయోద్యమాల్లో పాల్గొనటం - ఈ రెండు కారణాలు స్త్రీలను తమ హక్కులపట్ల జాగృతం చేశాయి. అంతేకాక, తమ హక్కుల పరిరక్షణకై ధైర్యంగా పోరాడటానికి వాటిని సాధించటానికై పని చేయటానికీ, ఉత్సాహాన్ని కల్పించాయి. పర్దా లేదా ఘోషా పద్ధతి గాలికి వదలి వేయబడింది. భారతజాతీయ సామాజిక సభ, అఖిలభారతీయ స్త్రీ సభల్లాంటి సాంఘిక వ్యవస్థలు సాగించిన ప్రచారంవల్ల, స్త్రీలకు మేలు కలిగించే కొన్ని చట్టపరమయిన మార్పులు కలిగాయి. వీటిల్లో ముఖ్యంగా మొగపిల్లలకు 18 సంవత్సరాలు, ఆడపిల్లలకు 14 సంవత్సరాలు వివాహార్హతకు వయస్సుగా నిర్ణయించటం గమనించ దగింది. ఈ విధంగా, బాల్యవివాహాలు నిరోధించుటయే యీ చట్టం ముఖ్యోద్దేశం. అంతేకాక, భర్త ఆస్తిలో హిందు విధవకు భాగం కల్పించటం, ఆస్తి విభజన కోరే హక్కును కల్పించటం, ఒక్క మద్రాసు ప్రెసిడెన్సీలోనే 2000ల సంఖ్యకు మించిన దేవదాసీ విధానాన్ని రద్దు పర్చటంలాంటి చట్టపరమైన రక్షణలు, స్త్రీలకు లభించాయి. విధవాగృహాలు, సేవాసదన్ లాంటి స్వచ్ఛంద సంస్థలు అభాగ్య స్త్రీల రక్షణకై, పురోభివృద్ధికై పాటుబడ్డాయి. రెండు ప్రపంచ యుద్ధాలు, ముఖ్యంగా రెండవది; ప్రభుత్వ పాలనా యంత్రాంగ విభాగాలను అధికంగా పెంచేశాయి; ఆ విధంగా స్త్రీలకు అధిక సంఖ్యల్లో ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఇంతకు క్రితం ఏడు శతాబ్దాల నుంచి స్తబ్ధంగావున్న ఉన్నత వర్గ హిందూ స్త్రీల మేధో, నైతిక, సామాజిక, దృక్కోణంలో, యీ ముప్పై సంవత్సరాల కాలంలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. దీనికి ముఖ్యకారణం, ఆర్థిక స్వాతంత్ర్యం; ఆపైన జాతీయ స్వాతంత్ర్యపోరాటంలో వారు పాల్గొనటం. స్త్రీ పురుషులు స్వేచ్ఛగా కలుసుకోవటం, బాలబాలికలు కలిసి చదువుకోవటం, పురుషులతో స్త్రీలు ప్రయాణించటం, నిజమైన ఏకపత్నీవ్రతం సాగించాలనే కాంక్ష, ఇంకా కులాంతర వివాహాలు - స్త్రీలకు పురుషులతో పాటు సమాన ప్రతిపత్తిని కల్గించుటలో దోహదం చేశాయి.

27.2.5 కుల వ్యవస్థ

కుల వ్యవస్థలోని చెడు, ప్రజల మీద ప్రభావాన్నెక్కువగా చూపెట్టలేకపోయింది. భారత జాతీయ సాంఘిక సభ కూడా ఒక రకమైన పలాయన వాదాన్నే చేపట్టింది. నిజం చెప్పాలంటే, మహాత్మాగాంధీ కూడా, తన అధికారం, ప్రాచుర్యం ఉచ్ఛదశలో వున్నప్పుడు, వర్ణాశ్రమ ధర్మాలను పరిరక్షించాలనీ, కులాంతర భోజనాలకూ, వివాహాలకూ అభ్యంతరం చెప్పాలనీ ఉద్బోధించారు. అయితే, సాంఘిక సభ 1928లోనే, హిందూ సమాజ సంఘటనకు కులవ్యవస్థ, గొడ్డలి పెట్టనీ, దాన్ని కులాంతర భోజన, వివాహాలను ప్రోత్సహించటం ద్వారా, అస్పృశ్యతను నిర్మూలించటం ద్వారా నాశనం చేయాలనీ నిర్ణయించింది.

అయితే కుల వ్యవస్థ, సంఘ సంస్కర్తల అన్ని ప్రయత్నాలను వమ్ముచేసి నిలదొక్కుకున్నప్పటికి, క్రొత్త యుగంలో ప్రభవించిన సామాజిక, ఆర్థిక శక్తుల ప్రభంజనాన్ని తట్టుకోలేక పోయింది. కుల వ్యవస్థాభవనపు గోడలు బీటలు వారటం, మన పరిశీలనలో వున్న కాలంలో దృగ్గోచరమవుతుంది. కులాంతర భోజనాలు,

ముఖ్యంగా పనివారలు, కార్మికులు నివసించే ప్రాంతాల్లో, శిరోధార్యాలయినాయి. విద్యార్థుల వసతి గృహాల్లో, మామూలు వసతి గృహాల్లో, సామాజిక విందు భోజనాల్లో, కులాలపట్టింపు అంతరించింది. ఉన్నత కులాల్లోనేకాక, ఉన్నత, దళిత కులాల మధ్యకూడ వర్ణాంతర వివాహాలు జరిగాయి. వాటిని క్రమంగా గుర్తించటం, లేదా తప్పనిసరి కీడుగా, అంగీకరించటం జరిగింది. అయితే, ఓ ముఖ్యవిషయం గమనించాల్సి వుంటుంది. కులవ్యవస్థ మెల్లమెల్లగా పతనమవుతూంటే, విద్యా ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏర్పడిన కొత్త సాంఘిక వర్గాలు, దాని స్థానాన్ని ఆక్రమించాయి. వీరిలో గణించదగినవారు - చదువుకొన్న మధ్యతరగతివారు, భూస్వాములు, పాలాలు కల్గిన చిన్నరైతులు, వ్యవసాయ కార్మికులు, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందీ, వ్యాపారస్తులు.

కానీ చీలికలకు దారితీసే యీ వర్గ విభజన, కులవ్యవస్థంత కీడును కల్గించలేదు. కారణం - ఈ కొత్త విభజన వ్యక్తి పుట్టుక మీద ఆధారపడక పోవడం, కులవ్యవస్థంత దిట్టమైన కట్టుబాటులేక సడలింపు కలిగి వుండటం పైగా యీ కొత్త విభజన ఎప్పుడూ కొత్త సభ్యులకు అవకాశం కల్గించటం. ఇంకా వర్ణాంతర భోజనాలకు, వివాహాలకు పట్టింపు అంతగా లేకపోవటం వలన, ఇది కులవ్యవస్థంత కీడును కల్గించలేకపోయింది.

27.2.6 వెనుకబడిన వర్గాలు, అస్పృశ్యత

పీడిత వర్గాలవారు లేదా అస్పృశ్యులు, హిందూ జనాభాలో ఐదవ వంతున్నారు. శతాబ్దాల తరబడిగా వారిని చాందసులు అనేక రకమయిన ఏవగింపు కల్గించే, దమన నీతితో కూడిన అశక్తతలకు, అభ్యంతరాలకూ లోను చేశారు. పాఠశాలలకు వారి పిల్లలు వెళ్ళరాదు; ఆసుపత్రులు, న్యాయస్థానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, ప్రజోపయోగార్థమైన బావులు, వారికే నిషేధాలయినాయి. ఈ శతాబ్దంలో, అఖిల భారత దళిత జాతుల సమాజం, హరిజన సేవా సంఘం, వారిని పైకి తీసుకురావటానికై నడుంకట్టి పనిచేశాయి. పై వాటిలో మొదటిదాన్ని, హరిజన నాయకుడైన డా॥ బి.ఆర్ అంబేద్కర్ నడిపారు. ఆయన జీవితమంతా, కుల నిరంకుశత్వంతో పోరాడటానికే వినియోగించాడు. హిందువుల నుంచి సాంఘిక న్యాయం పొందటంలో నిరాశ చెందిన అంబేద్కర్, 1945లో 'అంటరానివారికి కాంగ్రెస్, గాంధీ చేసిందేమిటి?' అనే ప్రఖ్యాతి పొందిన, దెబ్బగొట్టే గ్రంథాన్ని వ్రాశాడు. ఆ తర్వాత, అధిక సంఖ్యలో అంటరానివారు, బౌద్ధులుగా మతం మార్చుకోవటానికి, ఓ ఉద్యమం లేవదీశాడు. 1932లో హరిజన సేవక సంఘం మహాత్మాగాంధీ అధ్వర్యంలో, దళితవర్గాల విద్యా ఆర్థిక, సామాజికోన్నతి కోసం కృషి చేసింది. ఒక్క విషయం గుర్తించుకోవాలి. జాతిపిత, అంటరానితనం నిర్మూలనాన్ని స్వరాజ్య సాధనకు అనివార్యంగా భావించటంవల్లనే చేపట్టాడు. కాని, ఔదార్యంతో సంఘ సంస్కరణే పరమావధిగా చేపట్టలేదు. ఆంగ్లేయులు ముస్లింలీగ్ ఈ అంటరానితనాన్ని అవకాశంగా తీసుకోవటం, హిందువులను నిందించటానికి వాడుకోవటం, ఆయన, ఇతర కాంగ్రెసు నాయకులు గమనించారు.

ఉచిత విద్యావకాశాలు, దేవాలయ ప్రవేశం, వైద్య సహాయం, నీటి సరఫరాలాంటి కార్యక్రమాలను, దళిత వర్గాల క్షేమానికై దేశంలోని అన్ని ప్రాంతాల్లో హరిజన సేవక సంఘం, మిగతా వ్యవస్థలు పాటుపడినా, దళిత వర్గోన్నతికి దోహదం చేసిన ప్రముఖ దోహదకారులు - ప్రపంచ యుద్ధం కారణంగా ఏర్పడిన వాతావరణం, భారత జాతీయ స్వాతంత్ర్య సంగ్రామం, భారతదేశమంతటా స్వైర విహారం చేస్తున్న ఆర్థికపరమైన, ఇతరమైన మార్పులు అందరూ ఒకచోట కూర్చోవాల్సిన పరిస్థితి నేర్పరచిన నవీన రవాణా సౌకర్యసాధనాలు - రైళ్ళు, బస్సులు- ట్రాములు, ఆచారపరులైన హిందువులు, దళితవర్గాల కార్మికులు బ్రతకటానికీ, పోరాడటానికీ, (సమ్మెల సందర్భంగా), కలసి పనిచేయటానికీ అవకాశం కల్పించిన నవీన పరిశ్రమలు, కర్మాగారాలు, అన్ని వర్గాల ప్రజలు ఓ గొప్ప ఆదర్శానికై పోరాడటానికి అవకాశం కల్పించిన జాతీయ స్వాతంత్ర్య సంగ్రామం - ఇవన్నీ అన్ని వర్గాల, కులాల, మతాల ప్రజలను శారీరకంగా దగ్గరకు చేర్చి, అంటరానితనానికి, ఆదర్శపరంగా, ఆచరణపరంగా కూడా, పాడె కట్టాయి. వ్యక్తుల విలువ, వారి సమానత్వం న్యాయ దృష్టితోనే కాక, 1950లో ప్రాయబడిన భారత రాజ్యాంగ చట్టంలో నిబద్ధమై, ఆశ్వాసింపబడటంతో, చాందస హిందువుల వర్ణోన్నత్యభావనకు చావుదెబ్బ కొట్టినట్లయింది. అస్పృశ్యతా కారణంగా విధింపబడిన ఏలాంటి అశక్తతను, శిక్షార్హమైన వేరంగా చట్టం గుర్తించింది.

27.2.7 సముద్రయానం

ఎలాంటి అలజడివల్లగాని, చట్ట నిర్మాణం ద్వారాగాని తొలగింపబడే అవసరం లేకుండానే నిశ్శబ్దంగా రూపొందిన సంస్కరణ, సముద్రయాన నిషేధం తొలగిపోవటం. ఈ శతాబ్దపు మొదటి దశాబ్దంలో చదువుకోసమైనా సముద్రయానం చేసే హిందూ యువకుడు, తిరిగివచ్చిన తరువాత వెలివేయబడేవాడు. ఆపాప ప్రక్షాళనార్థమై చేసే శుద్ధికాండలో పునీతుడైన తర్వాతనే, మళ్ళీ సంఘంలో సభ్యుడయ్యేవాడు. విదేశ విద్యావసరాలు, అవకాశాలు, ఆర్థికావసరాలతో కూడిన వ్యాపార ప్రయాణాలు ఇంకా తదితర శక్తులు, ఈ నిషేధాన్ని పూర్తిగా తొలగించివేశాయి. అధిక సంఖ్యలో విదేశాలకు వెళ్ళే స్త్రీ, పురుషులు ఇప్పుడు ఎలాంటి కష్టాలను ఎదుర్కొనటంలేదు.

27.2.8 సాంఘిక సంక్షేమ పథకాలు

సంఘంలో ప్రధాన వర్గాల సంక్షేమ నిమిత్తం, ఈ కార్యక్రమాలు చేకొనబడ్డాయి. వీరు పిల్లలు, యువకులు, వికలాంగులు , కార్మికులు.

27.2.8.1 శిశు సంక్షేమం

శిశు సంక్షేమ కార్యక్రమాలు పిల్లల ఆరోగ్యం, విద్య వినోదం, సాంస్కృతిక కార్యకలాపాల క్రమబద్ధతకై ఏర్పాటయినాయి. వినోద, సాంస్కృతిక కార్యక్రమాల పెంపుకై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ, యన్.సి.సి. కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను, సెయింట్ ఆంబులెన్స్ సంస్థ, పిల్లల సాహిత్య ప్రచురణలు ముఖ్యంగా పిల్లలకొరకై పుస్తకాలు, పత్రికల ప్రచురణ-పిల్లల క్లబ్బులు, ఆకాశవాణి పిల్లలకై నిర్వహించే కార్యక్రమాలు, యువతీయువకుల సంక్షేమం నిమిత్తమై, వై.ఎమ్.సి.ఎ, వై.డబ్ల్యు.సి.ఏ కృషి చేస్తున్నాయి. సంఘసేవా కార్యక్రమాన్ని, కళాశాలల, విశ్వవిద్యాలయాలు కూడా నిర్వహించాయి.

27.2.8.2 వయోజన విద్య

వయోజన విద్యా కార్యక్రమం, 1937లో ప్రజలచేత ఎన్నుకోబడిన మంత్రివర్గాలు పాలనలోకి రాగానే, ఎంతో ఉత్సాహాన్ని పుంజుకుంది. 1938 - 42 సంవత్సరాల్లో వయోజన విద్యా కేంద్రాలు 1,88,777 వరకు పెరిగాయి. 78,18,189 మంది వయోజనులను తరగతుల్లో చేర్చుకోవడం జరిగింది. చదువుకున్న వయోజనుల సంఖ్య 29,04,068 అయింది. 1940లో కేంద్ర విద్యా సలహా సంఘం ఈ సమస్యను కూలంకషంగా పరిశీలించి, ఒక విపులమైన కార్యక్రమాన్ని రూపొందించింది. ఢిల్లీలో జామియా మిలియా, వయోజన విద్యాశాఖను స్థాపించి, సామాజిక కేంద్రాలను నిర్వహించింది; కొత్తగా చదువుకొన్న వయోజనులకై సాహిత్యాన్ని రూపొందించింది. 1937లో స్థాపించబడిన ఢిల్లీ వయోజన విద్యా సంస్థ, 1938లో ప్రథమ వయోజన విద్యాసభను నిర్వహించింది. ఆ సందర్భంగా 1939లో భారతీయ వయోజన విద్యా సంస్థ ఏర్పాటవటం, గుర్తించాల్సిన సంఘటన.

27.2.8.3 కార్మిక సంక్షేమం

కార్మిక సంక్షేమం, సంఘసేవలో ఒక భాగంగా గుర్తించబడింది. కార్మిక సంక్షేమ కార్యక్రమం, కార్మగారాలలో కార్మికుల సంక్షేమానికే పరిమితం కాక, కర్మాగారం బయటకూడ, వారి జీవిత సంక్షేమాన్ని గూర్చిన యోచన చేసింది. కార్మికుల ఆరోగ్య, నైతిక ప్రవర్తనల గూర్చి జాగ్రత్త తీసుకోవటమేగాక, సహకార సంఘాలు, వినోద కార్యక్రమాలు, విద్య మొదలైన సంక్షేమ చర్యలు కూడా చేపట్టబడ్డాయి. కార్మికుల, వారి కుటుంబాల సుఖశాంతులకూ, ఇంటి వసతులు, రవాణా సౌకర్యం, పరిశుభ్రత, వగైరాలను కూడ, చేపట్టటం జరిగింది.

కర్మాగారాల్లో కార్మికుల సంక్షేమానికై చాలా చట్టాలు చేయబడ్డాయి. 1911లో చేయబడ్డ కర్మాగార చట్టం, కర్మాగారాల్లో పనిచేసే స్త్రీ, పిల్లల స్థితిగతులను మెరుగుపర్చింది. పిల్లలు 6 గంటలు పనిచేయాలనీ పెద్దవారు 12 గంటలు పనిచేయాలనీ, పనిచేసే కాలాన్ని నియమితం చేసింది. 1922లో చేయబడ్డ చట్టం ప్రకారం, 15 సంవత్సరాల వయసులోపలి వారిని, పిల్లలుగా గుర్తించడం జరిగింది. 12 సంవత్సరాల లోపు పిల్లలు, కర్మాగారాల్లో

పనిచేయటాన్ని నిషేధించింది. 1945లో చేయబడ్డ చట్టం, కార్మికులకు జీతం మీద సెలవులను ఏర్పాటు చేసింది.

కొన్ని గుర్తింపు పొందిన కర్మాగారాలల్లో - కరీమ్‌భాయ్ సముదాయం, టాటావారి మిల్లుల్లో - కార్మిక సంక్షేమానికై ఆసక్తితో పనిచేసే శ్రీ ఎన్.ఎమ్.జోషి లాంటి వ్యక్తులు, కార్మికులకై విద్య, చేతిపనులు, వినోద కార్యక్రమాలు, సహకార సంఘాల లాంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టటం జరిగింది. ఈ మిల్లుల యాజమాన్యంవారు, యీ కార్యక్రమాల కయ్యే ఖర్చును భరించేవారు. 1922 వరకు సాగిన ఆ కార్యక్రమాలను, యాజమాన్యంవారు సంవత్సరానికి ఒక లక్ష రూపాయలవరకూ, ఐదు సంవత్సరాలపాటు వెచ్చించారు. సాంఘిక సేవా సమాఖ్య ఆధ్వర్యంలో, 1922లో అఖిల భారతీయ కార్మిక సంక్షేమ సభ ప్రారంభమయింది. అన్ని పారిశ్రామిక కేంద్రాల నుంచి సభకు హాజరయిన ప్రతినిధులు, కార్మికుల సంక్షేమాన్ని గూర్చి చర్చించారు. అక్కడే, అఖిల భారతీయ పారిశ్రామిక కార్మికుల సంస్థ ఏర్పాటవటం జరిగింది. తరువాత, 1924లో ఎన్.ఎమ్. జోషి పాశ్చాత్య శిక్షణా పాఠశాల పద్ధతిలో కార్మికులకు శిక్షణ నివ్వటానికి, వస్త్ర సాంకేతిక పాఠశాలను స్థాపించాడు.

27.3 ఆర్థిక పరిస్థితులు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో, బ్రిటీష్‌వారు ఉద్దేశ పూర్వకంగా అమలు చేసిన దోపిడీదారీ విధానాలవల్ల, ఆర్థిక పరిస్థితి దారుణమైన స్థితిలో వుంది. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్య వ్యాపారాలు, మిగిలిన ఆర్థిక రంగంలోని అన్ని రంగాలలోను, ఆంగ్లేయులు తమ లాభనష్టాలే దృష్టిలో వుంచుకొని భారతదేశ దౌర్భాగ్యానికి మూలకారకులయినారు. వారు ఎప్పుడూ తమ వారి వృద్ధికై పాటుపడ్డారు. వీరి ప్రత్యేక, ప్రమాద భరితమయిన ఆర్థిక విధానాలను, క్రింద చూపెట్టిన వివిధ శీర్షికలలో విశ్లేషించటం జరిగింది.

27.3.1 వ్యవసాయ రంగంలో మాంద్యం, క్షీణత

భారత వ్యవసాయ రంగంలో మాంద్యతకు, దాన్ని సామర్థ్యంతో నిర్వహించక పోవటానికీ, ఫలితంగా తక్కువ దిగుబడి రావటానికి, చాలా కారణాలున్నాయి. మొదటిది, భూమివత్తిడి. దీనివల్ల, ఆర్థిక నష్టాన్ని కల్గించే చిన్న చిన్న కమతాలేర్పడ్డాయి. రైతులు అధిక సంఖ్యలో బీదవారవటం, ప్రభుత్వం వారు, భూస్వాములు, వారికి దగ్గరదగ్గర సంవత్సర ఫలాదాయానికి సరిపోయే కౌలుకు భూములు, యివ్వటంవల్ల, మెరుగైన సాంకేతిక పద్ధతులలో దిగుబడి పెంచే మార్గాలను వ్యవసాయంలో ప్రవేశ పెట్టే శక్తిగాని, ప్రోత్సాహంగాని, రైతులకు లేకపోయింది. ఇంగ్లాండ్‌లోను, యింకా మిగతా పాశ్చాత్య దేశాలలో, ప్రత్యక్షంగా పొలంలో పనిచేయని భూస్వాములు అధిక దిగుబడికి కావల్సిన పెట్టుబడి పెట్టేవారు. కాని, భారతదేశ భూస్వాములు పెట్టుబడి మాటే మర్చిపోయారు. అందువల్ల కూడ, భారతీయ రైతుల కృషి, సామర్థ్యం కుంటుపడింది. పైగా భారతదేశంలో భూస్వాములు, భూమిని కౌలుకు తీసుకున్న రైతులను పిండి, అధికమైన కౌళ్ళను వసూలు చేయాలని చూసేవారు.

ప్రభుత్వంకూడా తన మేరకు తాను కిమ్మన్నాస్తిగా కూర్చుంది. రైతుల దీనస్థితిని తొలగించ ప్రయత్నించలేదు. వ్యవసాయిక వనరులను పెంచయత్నించలేదు; వ్యవసాయిక వ్యాప్తినీ, గ్రామ ప్రాంతాలలో ప్రాథమిక విద్యావ్యాప్తికి, కృషిచేయలేదు. ఫలితంగా, వ్యవసాయం, అనాది దశలోవలె పాత పద్ధతులలో జరిగింది. ఇనుపనాగళ్ళను, రసాయనిక ఎరువులను మంచి విత్తనాలను వాడటం, గుర్తించతగినంతగా లేకపోయింది. వాడినా, అతి తక్కువగా వాడటం జరిగింది. ఉదాహరణకు, 1951లో కూడా 9,30,000 యినుప నాగల్లు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. అయితే కొయ్యనాగల్లు మాత్రం 3,18,00,000 ఉపయోగింపబడేవి. చివరికి ఫలితం, ఎకరం ఒక్కింటికి దిగుబడి విపరీతంగాతగ్గి పోయింది; రైతులు, దేశం బీదవైపోయాయి.

27.3.2 రైతుల బీదరికం

బ్రిటీష్‌వారి హయాంలో, రైతులు పోనుపోను బీదవారైపోయారు. అంతఃకలహాలు, యుద్ధాలు లేకపోయినా వారి ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. వారు బీదవారైపోయారు. అధిక భూమిశిస్తులు వారిని

BRAOU

బాధించాయి. రైతులు జమీందారీలోకాని, రైత్వారీ లేదా మహల్వారీ శిస్తు పద్ధతుల క్రిందవున్నా, వారి పరిస్థితులలో మెరుగేమీ కన్పడలేదు. ఎప్పుడూ పెరుగుతూ వుండే భరించరాని కౌళ్ళు, శిస్తు వసూళ్ళు, అన్నిచోట్ల జరిగాయి. జమీందారీలలో రైతులు ఇంకా కొన్ని చట్టబద్ధంకాని పన్నులు చెల్లించాల్సి వచ్చేది. ఆ పైన, బలవంతంగా వారిచేత పనికూడ చేయించేవారు. ఒక్కోసారి ఫలసాయంలో సగంగాని, మూడొంతులకు కాని, సరిపోయే శిస్తు వసూళ్ళు చేసేవారు. ఇంతకు ముందు సంస్థానాధీశులు వసూలు చేసిన శిస్తులకంటే ఇప్పటి వసూళ్ళు చాల అధికమని కారన్ వాలీస్, బిషప్ హెబర్ లాంటి ఆంగ్ల పరిపాలకులు, రచయితలు అన్నారు.

శిస్తుల విధింపులు రైతులను దయనీయ పరిస్థితులకు దిగజార్చేవిగా వుండటమేకాక, శిస్తుల వసూళ్ళు కూడ చాల కఠినంగాను, దయారహితంగాను వుండేవి. ఫలసాయం పూర్తిగా అందనప్పుడూ, పంటలు పాడయినప్పుడుకూడా, శిస్తుల వసూళ్ళలో సడలింపుగాని, మినహాయింపుగాని వుండేదికాదు. అందువల్ల, నిస్సహాయులైన రైతులు, వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాలలో చిక్కుకుపోయేవారు; లేకపోతే, వారి పాలాలు వేలంలోకి వచ్చేవి. తమ వ్యాపారానికి చట్టపు, పాలనా యంత్రాంగపు పూర్తి మద్ధతుపొందిన వడ్డీ వ్యాపారులు, చాల అక్రమంగా రైతులను మోసం చేసేవాళ్ళు. వాళ్ళ చేతుల్లో చిక్కిన రైతులు, చివరికి తమకున్న కాస్త భూమిని పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చేది. తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆస్తిని పోగొట్టుకున్న రైతులు, చివరికి జీతానికై వ్యవసాయ కూలీలుగా మారిపోయేవారు. వ్యవసాయదారులు ప్రభుత్వం వారి ఆజ్ఞలమేరకు చాల తరచుగా శిస్తులను చెల్లించాల్సి వచ్చేది. భూస్వాములు లేదా వడ్డీ వ్యాసారం చేసే వ్యాపారస్తులు, పంట కోత కాగానే ప్రభుత్వ బలవంతంవల్ల ఏధర పలికితే ఆ ధరకు పంటను అమ్ముకోవలసివచ్చేది. పంట ధరపలికేవరకు ఆగి వుండటం కుదిరేదికాదు. అయితే, రైతుల నుంచి యింత ఎక్కువగా బలవంతంగా శిస్తు వసూళ్ళు చేసిన ప్రభుత్వం, దానికి మారుగా వారికి చేసింది ఏమీ లేదు. నీటిపారుదల సౌకర్యాలుగాని, గ్రామ రవాణా సౌకర్యాలుగాని, విద్య లేదా ఆరోగ్య పరిస్థితులను మెరుగుపర్చటానికి ప్రభుత్వం చేసిందేమిలేదు.

27.3.3 నూతన భూస్వాములు

ఆంగ్లేయుల పాలన చివరి సంవత్సరాలలో పాత జమీందారులేకాక, అసంఖ్యాకులైన వడ్డీ వ్యాపారస్తులు, ఇతర వ్యాపారస్తులు, ధనవంతులైన రైతులు, అధికమై భూములను జమ చేసుకోవటం మొదలెట్టారు. వారు భూమిని తమంతట తాము సాగుచేసే వాళ్ళు కాదు. భూమికోసం తపించే పేదరైతులకు అధికమైన కౌళ్ళకు యివ్వటం, వారికి లాభసాటిగా, సౌకర్యంగా కన్పించింది. ఈ భూమి సాగుబడి చేయనివర్గం, భూములు పొంద కృషిచేయటానికి ఇంకోకారణం, వారి ధనాన్ని పరిశ్రమలలో పెట్టుబడి పెట్టే అవకాశం లేకపోవటమే. కాని, ఇంతకంటే దయనీయమైన సత్యమేమిటంటే-కౌలు భూమికోసం జనం ఎగబడటంవల్ల, భూమిని మళ్ళీ మళ్ళీ కౌలుకివ్వటం జరిగింది. ఒకోసారి, బెంగాల్‌లో లాగా 50 విడతలు కౌలుకివ్వటం జరిగింది. భూమిని సాగుచేసే నిస్సహాయులైన కౌలుదార్లు. తమపైగల భూస్వాములనందరిని భరించాల్సి వచ్చేది. వారి దయనీయ పరిస్థితి వర్ణనాతీతం. వారిలో చాలామంది పరిస్థితి బానిసలకంటే హీనమయింది.

27.3.4 చేతిపనివారి స్థితి

భారతదేశంలోని చేతివృత్తులవారు, బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే యంత్రాలతో తయారయిన, చౌకఅయిన వస్తువులతో పోటీ పడటం, రైలు మార్గాల నిర్మాణం, చేతి వృత్తులవారిని ఆంగ్లాధికారులు బాధించటం, బ్రిటన్‌లోను ఐరోపా ఖండంలోని యితర దేశాల్లో దిగుమతి అయ్యే భారతదేశ వస్తువులపై విధించిన నిబంధనలు, అధికమైన దిగుమతి సుంకాలు, చేతివృత్తుల వారి వస్తువులకు మంచి గిట్టుబాటు దొరికే భారతీయ సంస్థానాలు, సంస్థానాధీశులు క్రమంగా నశించిపోవడం, భారతదేశం నుంచి ముడి సరుకులను ఎగుమతి చేసే బ్రిటీష్‌వారి విధానం, మొదలైనవి చేతివృత్తులవారి వినాశనానికి దారితీశాయి. పట్టణ, గ్రామ ప్రాంతాలలో వున్న భారతదేశ చేతివృత్తులవారందరూ, దీనితో దెబ్బతిన్నారు. అయితే, నవీన యాంత్రిక పరిశ్రమలు కూడా పెరగకపోవడంతో, పరిస్థితి చాలా దారుణమయింది. ఫలితంగా వృత్తులను వదిలేసుకున్న చేతిపనివారు, 'విధిలేక' బ్రతకటానికై వ్యవసాయ కూలీలుగా మారటమో, లేదా చిన్న కమతాల కౌలుదార్లుగా మారటమో,

జరిగింది. బ్రిటీష్‌వారి హయాంలో, వ్యవసాయ రంగంమీద వచ్చిన అధిక వత్తిడి, భారతదేశ నిరుపేదతనానికి ముఖ్యకారణమైంది.

27.3.5 పారిశ్రామిక అభివృద్ధి

ఈ కాలంలో, భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి చాలా మెల్లగాను, ఎదుగుదల లేకుండాను సాగింది. తేయాకు తోటల పెంపకానికీ , ప్రత్తి, జనుము, చక్కెర, సిమెంట్ పరిశ్రమలకు మాత్రమే పరిమితమైంది. అయితే, 1946లో మొత్తం కార్మికుల సంఖ్యలో 40 శాతం కార్మికులు, ప్రత్తి, జనుము పరిశ్రమలలోనే వుండేవారు. ఉత్పత్తి దృష్ట్యా, ఉద్యోగావకాశాల దృష్ట్యా కూడ, ఇతర దేశాల ఆర్థికాభివృద్ధితో పోలిస్తే, భారతీయ పారిశ్రామికాభివృద్ధి అతిస్వల్పం; పైగా, అది భారతదేశ ఆర్థికావసరాలకు కూడ, చాలినంతగా లేదు. 1951లో కూడ 35,70,00,000 జనాభాలో 2,00,000 మంది మాత్రమే నవీన పారిశ్రామికాగారాలలో పనిచేస్తున్నారంటే, భారతదేశ పారిశ్రామికాభివృద్ధి ఎంత అల్పమో స్పష్టమవుతుంది.

భారతీయ పరిశ్రమలు బ్రిటీష్ పెట్టుబడిదారుల చేతుల్లో వుండటం, భారతీయ ఉత్పాదనలకు రవాణా సౌకర్యం కల్పించడంలో పక్షపాత వైఖరితో కూడిన ప్రభుత్వం వారి రైల్వే విధానం, భారీ వస్తూత్పత్తి పరిశ్రమలు పూర్తిగా లేకుండా పోవడం, బ్రిటీష్ పారిశ్రామికుల లాభం కోసం భారతీయ పరిశ్రమలకు రక్షణ నివ్వ తిరస్కరించడం, సాంకేతిక విద్యావ్యాప్తికి సరియైన అవకాశాలు కల్పించకపోవటం, మొదలైన కారణాలు భారతదేశంలో నవీన పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడలేదు. ఇంకో మాటలో చెప్పాలంటే, భారతదేశం, బ్రిటీష్ పరిశ్రమలకు కావల్సిన ముడిపదార్థాలను సరఫరా చేసే దేశంగా, బ్రిటీష్ ఆర్థికానుబంధంగా, ఆపైన వారి ఉత్పాదనలమ్మే దుకాణంగాను తయారయింది.

27.3.6 ద్రవ్య చలామణిలో ఆంగ్లేయుల ప్రయోగాలు

బ్రిటీష్‌వారి పరిపాలన చివరి సంవత్సరాలలో వారు ద్రవ్య చలామణిలో చేసిన ప్రయోగాలు, భారతదేశానికి చాల హానికరంగా పరిణమించాయి. భారతదేశంలో యుద్ధానికై వెచ్చించే ఖర్చులకు డబ్బు సంపాదించటం, బ్రిటీష్‌వారి ధ్యేయమైంది. స్టెర్లింగ్ ఎక్స్‌చేంజ్ స్టాండర్డ్ ప్రకారం, భారతదేశపు రూపాయి స్టెర్లింగ్‌తో ముడిపెట్టబడటంవల్ల, ప్రభుత్వం స్టెర్లింగ్‌ను రిజర్వు బ్యాంకుకు పంపించి, బదులుగా యుద్ధ ఖర్చులకోసం రూపాయలను సంపాదించేది. స్టెర్లింగ్, లండన్‌లో వుండేది. దానికి బదులుగా భారతదేశంలో రూపాయినోట్ల చలామణి చాల ఎక్కువగా జరిగింది. యుద్ధం పూర్తి అయ్యే సమయానికి రూపాయినోట్ల చలామణి విపరీతమైపోయింది. 1944-45లో ద్రవ్య చలామణి 1,922 కోట్ల నుంచి 1947-48లో 2,300కోట్లకు పెరిగింది. ఫలితంగా, భారతదేశంలో యింతకు ముందెన్నడూ కాంచని అధిక ద్రవ్యోల్బణం సిద్ధించింది. రూపాయి కొనుగోలు విలువ చాలా పడిపోయింది. వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఆ విధంగా భారతదేశం స్వాతంత్ర్యం పొందే సమయానికి, బ్రిటీష్‌వారి యుద్ధకాల ఆర్థిక విధానాలవల్ల సంక్రమించిన అన్ని దుష్ట ఫలితాలకు, భారతదేశం గురి అయింది.

27.3.7 వ్యాపారం, ధనలుప్తత

20వ శతాబ్దపు ప్రథమ భాగంలో భారతదేశపు విదేశ వ్యాపారం మెల్లగా సాగినా, వస్తువుల ఎగుమతి దిగుమతుల దృష్ట్యా, పెద్ద మార్పే అని చెప్పాలి. ఈ కాలంలో ఎగుమతులు ఎక్కువగా ముడి పదార్థాలు, దిగుమతులు తయారయిన వస్తువులుగా వుండేది. కాని యీ పద్ధతి కొంత కాలంలో మెల్లగా మారింది. వస్తువుల అమరికలో మార్పు దిగుమతి వస్తువుల మార్పిడిలో కనబడుతోంది. కాని, యీ మార్పులు ఆర్థిక విధానాలలో పెద్ద రూపభేదాన్నేమీ సాధించలేదు. కారణం, మొత్తం ఆర్థిక రంగంలో, విదేశీ వ్యాపారం ఎంత పెద్దగా ఈ అభివృద్ధిని సాధించినప్పటికీ, అది చాలకొద్ది భాగం మాత్రమే ఆక్రమించింది. పైగా, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చిచూస్తే ఈ వ్యాపారం విలువ తలసరి జనాభాకు చాలా తక్కువ.

BRAOU

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో, భారతదేశం బ్రిటన్‌కు దిగుమతులకంటే ఎగుమతులెక్కువ చేసింది. ఐతే, వస్తువ్యాపారంలో సాధించినటువంటి యీ లాభం, వ్యాపారానికి సంబంధించిన లావాదేవీల, పరిపాలనా సేవాఖర్చుల తగుళ్లతో, లుప్తమయింది. సేవకు సంబంధించిన లావాదేవీలు భద్రత, రక్షణకు సంబంధించినవి. సైనికుల నియామకానికైన ఖర్చులు రైల్వేల నిర్మాణానికి అయ్యే వస్తువుల, సామగ్రి, కొనుగోళ్ళు స్టెర్లింగ్ అప్పుమీద అయ్యే వడ్డీ, నావికా రవాణా ఖర్చులు మొదలైనవి. ఇతర దేశాల్లో నివసించే భారతీయులు సంవత్సరానికి సరాసరి పొదుపుచేసిన 2 కోట్ల రూపాయలు, యింకావారు భారతదేశానికి పంపించే ధనం, వాణిజ్యానికి సంబంధించని లావాదేవీల క్రిందకు వస్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే, భారతదేశం ఎగుమతుల మిగులుద్వారా సాధించిన లాభాలు, భారతదేశం బ్రిటీష్ సామ్రాజ్యంలో ఒక భాగమైనందున, లుప్తమయ్యాయి. పైగా, యీ అన్ని సంవత్సరాలల్లో భారతదేశం బులియన్ బంగారాన్ని దిగుమతి చేసుకొంది. ఈ బంగారం చాలా గిడ్డంగులలో దాచడంవల్ల, ఇది భారతదేశ ఆర్థిక పరిస్థితికి పూర్తి నష్టకారియై కూర్చుంది.

27.3.8 ఆర్థిక వ్యవస్థ

ఈ విధంగా 1947లో ఆంగ్లేయులు తమ అధికారాన్ని మనకు హస్తగతం చేసినప్పుడు మనకు సంక్రమించింది. కుంటుపడిన ఆర్థిక వ్యవస్థ, మాంద్యతనొందిన వ్యవసాయ రంగం, అభివృద్ధిగాంచని పారిశ్రామిక రంగం, లాభాలు లుప్తమైన వాణిజ్య రంగం, దారిద్ర్యంతో ఓలలాడుతున్న కార్మికులు, రైతులు-ఇదీ, ఆనాటి మన ఆర్థిక పరిస్థితి. జవహర్‌లాల్ నెహ్రూ యిలా అన్నాడు. "భారతదేశం పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అధీనంలో వుంది కాని, దేశపు ఆర్థిక పరిస్థితి మాత్రం పెట్టుబడిదారీ కాలానికి ముందున్న పరిస్థితి. అయితే, పెట్టుబడిదారీ కాలానికి ముందున్న ఆర్థిక వ్యవస్థలోని ధనోత్పాదన లక్షణాలేవీ దీంట్లో లేవు. భారతదేశం, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానాలవల్ల, ఏర్పడే మేలులను ఎరక్కపోయినా, కీళ్ళను మాత్రం భరించింది" ఇలాంటి మృతమైన ఆర్థిక వ్యవస్థను, జాతీయ ప్రభుత్వం 1947 తరువాత, కదపాల్సివచ్చింది.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1) స్వతంత్ర భారతదేశం, వెంటనే ఎదుర్కొవలసిన సమస్యలేవి?

.....

.....

.....

.....

2) స్త్రీల పరిస్థితి, వెనుకబడిన తరగతుల వారి పరిస్థితి అభివృద్ధి చెందడానికి దోహదపడిన పరిస్థితులేవి?

.....

.....

.....

.....

3) 1911 చట్టం, కార్మికులకు ఎలా ఉపయోగపడింది?

.....

.....

.....

.....

27.4 సాంస్కృతిక పరిస్థితులు

1947లో భారతదేశ సాంస్కృతిక పరిస్థితుల మీద పాశ్చాత్య విద్య దృక్పథాలు, బలమైన ప్రభావాన్ని చూపెట్టాయి. మేధోవాతావరణం, హేతువాద, మానవతావాదంచే లక్షణ సమన్వితమైంది. అయితే, భారతీయ సాహిత్యం, కళలు, మతాల అభివృద్ధి, పాశ్చాత్య ప్రభావంవల్ల కుంటుపడలేదు. ప్రతిరంగంలోను, భారతదేశం తన కాళ్ళమీద తను నిలబడి, తన నిర్ణయాలను తీసుకొంది. పాశ్చాత్య దేశాల గూర్చి వాటి పద్ధతులను నేర్చుకోవటానికి ఇంక తానే బోధించటానికి ఎదురునిల్చి, ధైర్యంగా నిలబడింది.

27.4.1 సాహిత్యాభివృద్ధి

వచనంలాంటి సాహిత్య క్రియల్లో 19వ శతాబ్దంలో మొదలిడిన తొలిచినుకులు, ఈ శతాబ్దంలో భారీ వర్షపాత మయ్యాయి. నవల, చిన్న కథా ప్రక్రియల్లో, గొప్ప అభివృద్ధి కలిగింది. 20వ శతాబ్దపు తొలిభాగంలో, రవీంద్రనాథ్‌టాగూర్ బెంగాలీలో వ్రాసిన 'గోరా', బెంగాలీలోనే శరశ్చంద్రుని 'శేషప్రశ్న', హిందీలో ప్రేమ్‌చంద్‌ని 'గోదాన్', తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన 'వేయిపడగలు' లాంటి విఖ్యాత నవలలు వెలువడ్డాయి. ఇవన్నీ దేశ భక్తి తాత్పర్యాల నేపథ్యంలో, సామాజిక పాత్రలను వాస్తవిక ఆదర్శవాద సిద్ధాంతాలతో తీర్చిదిద్దినాయి. చిన్న కథా ప్రక్రియలో, బెంగాలీలో రవీంద్రనాథ్‌టాగూర్, హిందీలో ప్రేమ్‌చంద్, తెలుగులో గుడిపాటి వెంకటాచలం, కొడవటిగంటి కుటుంబరావు, వేలూరి శివరామశాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు మొదలగువారు ప్రఖ్యాతులు. నవలాకారులుగా, కథా రచయితలుగా ఆంగ్లభాషలో రచించి, వన్నెకెక్కిన కొందరు భారతీయులీకాలంలో వున్నారు. వారిలో ప్రముఖులు రాజారావు, ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్.కె.నారాయణ్. ఈ కాలపు భారతదేశ ఆంగ్ల కావ్యాల్లో ప్రసిద్ధిచెందినవి. టాగూరుని 'గీతాంజలి', అరవిందుని 'సావిత్రి'. వచనంలో అరవిందుడు రాసిన 'ది డివైన్ లైఫ్' కూడ గొప్పదే. సాహిత్య విమర్శ నాటక రచన కూడా ఈ కాలంలో ప్రచురితమై ప్రజల నాకర్షించాయి. నాటక కర్తలు పాత తరానికి చెందినవారైనా, నాటకాలు మాత్రం పాత భక్తిరస ప్రాధాన్యం నుంచి వైదొలగి, కొత్త రాజకీయోత్సాహాన్ని నింపుకున్నాయి. పురాణ దృశ్యాలు మారి, సామాజికార్థిక చరిత్ర నుంచి చిత్రింపబడిన దృశ్యాలు, సమకాలీన అనుభవాన్ని రంగరించుకొని వెలువడినాయి. బెంగాలీలో రవీంద్రనాథ్‌టాగూరు, హిందీలో శంకర ప్రసాద్, భారతీచరణ్ వర్మ, ఇలా చంద్రజోషి, పంజాబీలో గురబక్స్ సింగ్, కిర్పాసింగ్, మరాఠీలో పి.కె. అత్రే, ఎమ్.జ రంగనేకర్, తెలుగులో గురజాడ, విశ్వనాథ సత్యనారాయణ, పి.వి. రాజమన్నార్, నార్ల వేంకటేశ్వరరావు, ఆచార్య ఆత్రేయ మొదలగువారు, ఈ కాలపు ప్రఖ్యాత నాటక కారులు. ఒకప్పటి అంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు డా॥ పి.ఆర్. రెడ్డి, పానుగంటి లక్ష్మీనరసింహారావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, తెలుగులో ప్రామాణిక సాహిత్య విమర్శకులు. ఇందు శతాబ్దాల కాలంగా కావ్యరంగంలో మార్పువచ్చి, ఆదర్శాత్మక, గేయరూపక, విప్లవాత్మక పద్ధతుల్లో కవిత్వం రాసాగింది. మేధోవికాసానికి గుర్తుగా, భిన్న భాషల్లో అధిక సంఖ్యలో, పత్రికలు రాసాగాయి. మిగతా దేశీయ భాషలంత విరివిగా కాకపోయినా, సంస్కృతం, అరబ్బీ, ఫారసీ, ఉర్దూ భాషల్లో కూడా, రకరకాల సాహిత్య ప్రక్రియల్లో సాహిత్య సృజన జరిగింది. ఈ కాలంలో ప్రభవించిన ప్రతి సాహిత్య ప్రక్రియకు, ప్రపంచ ప్రఖ్యాతులైన రవీంద్రనాథ్‌టాగూర్ ఆద్యుడైనాడు, మార్గనిర్దేశికుడైనాడు.

27.4.2 కళ - వాస్తుకళ

భారతదేశంలో ఆంగ్లేయుల పాలనతోపాటుగా వచ్చిన పాశ్చాత్య ప్రభావం, ఏ కొద్దో మిగిలివున్న దేశీయకళా సంప్రదాయాలను పూర్తిగా తుడిచిపెట్టేసింది. పాశ్చాత్యులు భారతదేశానికి వస్తూనే, తమ పద్ధతులను, విధానాలను, ఇక్కడ ప్రవేశ పెట్టారు. అయితే, అలాటి విదేశీ సంప్రదాయాల ప్రభావం, దేశ పూర్వ వాస్తుకళను ధిక్కరించేటట్లు కన్పించదు. పోషణ లభించినా, ఎలాంటి పాశ్చాత్య వాస్తు పద్ధతి భారతదేశంలో గట్టిగా వేళ్ళూనుకొని నిలబడలేదు. కొత్త పరిస్థితుల కనుగుణంగా, హేతుబద్ధమైన, తెలివైన మార్పు దేశీయ పద్ధతులతోనే కల్పించుకోవాలనే దీక్ష దృగ్గోచరమవుతుంది.

పెద్ద పరిమాణంగల వర్ణ చిత్రాలు, జలవర్ణ చిత్రాలను ఆంగ్లేయ కళాకారులు భారతదేశంలో చిత్రించారు. అయితే, కలకత్తా ప్రభుత్వ కళల పాఠశాలకు చెందిన ఇ.జి.హెవెల్, రవీంద్రనాథ్‌టాగూర్, భారతీయ కళల పాశ్చాత్యీకరణను వ్యతిరేకించారు. పూర్వకాల వైభవాలు సంతరించుకోవటానికి, పూర్వకాల సంప్రదాయాల సన్నిహిత పరిచయాన్ని, అవసరమైతే ఇరాన్, జపాన్ దేశపు సంప్రదాయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని నొక్కిచెప్పటం జరిగింది. జపాన్ కళాశైలి, భారత సమ్మేళనమని వర్ణించటం జరిగింది. కళల్లో వ్యక్తి ప్రాధాన్యపు ఉద్యమం బలం పుంజుకుంది. దాంతోపాటు, పూర్వకాలీన లేదా సమకాలీన సంప్రదాయాల సంకెళ్ళను ఛేదించుకోవాలనే విప్లవ భావం కూడా తోడైంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో, కొత్త పద్ధతులలో భావ వ్యక్తీకరణకై చిత్రకారులు కృషిచేశారు. రంగులకలయికలో, రూప నిర్మాణంలో, వ్యక్తిగతమైన ఊహ మీద అధారపడి, కొత్త శైలులలో, పద్ధతులలో చిత్రించడం కనిపిస్తుంది.

27.4.3 మత పరిస్థితులు

ఆ కాలపు పాత కొత్త మతాల ఆదర్శాల్లో, ఆచరణలో ఎన్నో మార్పులు వచ్చాయి. స్వాతంత్ర పోరాటం ఫలితంగా ఆవిర్భవించిన ఉద్రిక్త రాజకీయ పరిస్థితి, మతాలపై ఎంతో ప్రభావాన్ని చూపెట్టింది. స్వేచ్ఛా, ప్రజాతంత్ర, జాతీయ, విప్లవశక్తులు ఏదో ఒక మతాన్ని ప్రభావితం చేస్తూ వచ్చాయి. ఆలోచనల్లో, దృక్పథంలో భిన్నధృవాలైనా, అన్ని మతాలు దేశ స్వాతంత్ర్యానికై పాటుబడ్డాయి.

27.4.3.1 హిందూమతం

హిందువులు విగ్రహారాధనలోను, అనేక దేవీ, దేవతారాధనలో నమ్మకం పోగొట్టుకోకపోయినా, రకరకాల ప్రదేశాల పూజా పద్ధతుల్లో వాటి విశ్వాసం సడలక పోయినా, యీ శతాబ్దంలో మహిమాన్వితులైన రామకృష్ణపరమహంస, వివేకానందుడు, అరవిందుడు, రమణమహర్షిలాంటి మహానుభావుల బోధనలచే ప్రజలు ప్రభావితులైనారు.

హిందూమతపు విశాల దృక్పథాన్ని, విశ్వజనీనతను చాటిచెప్పటం జరిగింది. అన్ని మతాల లక్ష్యము ఒక్కటే అని చాటటంతోపాటు, మత విషయాలలో సంకుచితత్వాన్ని ఖండించటమూ జరిగింది. శక్తి కార్యంలో అచ్ఛాదితమైన ఆత్మే మనిషి అనీ, ఈ మనిషి తనను తాను తెల్సుకోవటానికి పయనిస్తున్నాడనీ, దైవత్వాన్ని చేరుకోగలడనీ అరవిందుడు సెలవిచ్చాడు. దేశంలో అన్నిచోట్ల స్థాపించబడిన రామకృష్ణ మిషన్లు, హిందూమతపు ఉదారరూపాన్ని ప్రచారం చేసే కేంద్రాలుగా పనిచేశాయి.

27.4.3.2 హిందూ మహాసభ

ఈ విశాల దృక్పథం కలిగిన హిందూవర్గానికి వ్యతిరేకంగా, సాంప్రదాయవాదులతో కూడిన విప్లవసంస్థ ఒకటి ఏర్పడింది. దాని ప్రధాన లక్ష్యం సనాతన ధర్మ పరిరక్షణమైప్పటికీ, ముస్లింలీగుకు వ్యతిరేకంగా పోరాడే రాజకీయ శక్తిగా ప్రాముఖ్యాన్ని పొందింది. ఖిలాఫత్ ఉద్యమానికి మహాత్మాగాంధీ, కాంగ్రెసుల మద్దతు, మోప్లాలు బలవంతంగా అధిక సంఖ్యలో హిందువులను తమ మతంలోకి మార్చటం, వారు జరిపిన హిందూ మారణహోమం కారణంగా, కేవలం హిందువుల క్షేమం, రక్షణకొరకై ఏర్పడ్డదళంగా, హిందూమహాసభ ఆవిర్భవించింది. కేవలం మహమ్మదీయులకే ఇది కోపాన్ని కల్గించలేదు; హిందూ-ముస్లిమ్ ఐక్యత స్వరాజ్య సాధన తనివార్యమని తలచిన కాంగ్రెస్ పార్టీలోని హిందూ నాయకులు కూడా, హిందూమహాసభను హిందూ ముస్లిమ్ ఐక్యతకు గొర్రలిపెట్టని నిందించారు.

27.4.3.3 ఆర్య సమాజం

విద్యా, సాంఘిక, మతరంగాలలో ఆర్య సమాజం తన కార్యక్రమాలను వ్యాపింపచేసింది. విద్యారంగంలో పాశ్చాత్య విద్యాబోధనకూ, సంప్రదాయ విద్యాబోధనకూ కూడ ఉన్నత విద్యాలయాలు స్థాపించింది. లాహోర్‌లోని ఆంగ్ల వైదిక కళాశాల, కాంగ్రాలోని గురుకులం, ఆర్య సమాజం విద్యావ్యాప్తికి చేసిన కృషికి

నిదర్శనాలు. సాంఘిక రంగంలో ఆర్యసమాజీకులు స్త్రీల పరిస్థితిని మెరుగు పర్చటానికీ, అస్పృశ్యతా నివారణకూ, పారంపర్యగా వచ్చిన కులవ్యవస్థలోని మూర్ఖత్వ ప్రక్షాళనకూ కృషిచేశారు; ప్రజలలో ఆత్మగౌరవాన్నీ, తమమీద తాము ఆధారపడే తత్వాన్నీ పాదుకొల్పారు. అయితే, హిందువుల మతాంతరీకరణను నిరోధించటం, అన్యమతాలు స్వీకరించిన వారిని తిరిగి హిందువులుగా చేయటంవల్ల, ఆర్య సమాజం, 20వ శతాబ్దంలో మతతత్వాన్ని ప్రోత్సహించిన సంస్థగా పేరుపొందింది. భారత జాతీయైక్యత మతరహితమై, అన్ని మతానుయాయులను ఒక త్రాటిక్రిందకు తెచ్చేది అన్న విషయం మరుగున పడిపోయింది.

27.4.3.4 బ్రహ్మ సమాజం

బ్రహ్మ సమాజీకుల మధ్య భిన్నాభిప్రాయాల మూలంగా, 'సనాతన బ్రహ్మ సమాజ' మనే కొత్తశాఖ ఒకటి ఏర్పడింది. కొత్త పద్ధతిలో, మత సంస్థల్లో కూడ ప్రజాస్వామ్య సిద్ధాంతాలననుసరించాలని, ఈ సనాతన బ్రహ్మ సమాజం వాదించింది. అయితే, అన్ని మతాలలోని మంచి సిద్ధాంతాలను తన మతంలోకి స్వీకరించటానికి ప్రయత్నం చేసిన ఈ బ్రహ్మ సమాజం, ప్రత్యేక స్థాయిని పోగొట్టుకుని, ప్రజల ఆకర్షణ నుంచి దూరమయింది. నిజం చెప్పాలంటే, అసలు బ్రహ్మ సమాజమే శక్తి వుడిగిన వ్యవస్థ అయింది. ఆ కాలానికి బ్రహ్మసమాజ సంఘ సంస్కరణాభిప్రాయాలను హిందూమతం స్వీకరించటమే, బహుశ దీని పతనకారణమైంది. ఒక్క విగ్రహారాధన విషయంలో తప్ప, యింక ఏ విషయంలోను, ఆధునిక, హిందువుల ధార్మికాలోచనలు బ్రహ్మసమాజీకులతో భేదించలేదు. ఏమైనా, బ్రహ్మ సమాజం కొంతకాలం మాత్రమే జీవించివున్నా, భారతీయ సాంఘిక, మత చరిత్రలో క్రొత్త యుగానికి నాంది పలికిందనే విషయం నిర్వివాదం. బ్రహ్మ సమాజం హిందూమతానికి గొప్పదనాన్ని, మంచి వారసత్వాన్ని సంతరించి పెట్టింది; ఆ వారసత్వాన్నుపయోగించే హిందూమతం ధర్మసంపన్నమై, రూప నైర్మల్యంతో కళకళలాడింది.

27.4.3.5 శిక్కులు

శిక్కులు కూడ కాల పరిస్థితుల ప్రభావంవల్ల , సంస్కరణోన్ముఖులయినారు. శిక్కుల జనోద్ధరణకై, అమృతసర్‌లో ఖాల్సా కళాశాలను, దేశం అన్ని ప్రాంతాలలో శిక్కు సభలను, ఆంగ్లంలో **'శిఖ్ అడ్వొకేట్'** అనే పత్రికను స్థాపించటం జరిగింది. సంఘ సంస్కరణలో భాగంగా కుల నిర్మూలనం, బాల్య వివాహాల బహిష్కరణ, మద్యపాన నిషేధం, విధవాపునర్వివాహం, ఆంగ్ల భాషావ్యాప్తి లాంటి కార్యక్రమాలను శిక్కులు చేపట్టారు. శిక్కుగురుద్వారాల ఆస్తులు, గురుద్వారాల పాలనా వ్యవహారాలలో బ్రిటీష్‌వారితో శిక్కులకు వచ్చిన భేదాభిప్రాయాల కారణంగా శిక్కుల్లో ఉధృతమైన జాతీయ భావం మేల్కొన్నది. ఇది గుర్తుంచుకోవాల్సిన ముఖ్యవిషయం.తమ మతపరమైన, విద్యాపరమైన స్వాతంత్ర్యం కోసం, శిక్కులు 1945 దాకా అనవరతంగా పోరాటం సాగించారు. తీవ్రవాదులైన అకాలీలు యీ విషయంలో ముందంజవేశారు. విజయం సాధించారు. ఆ కారణంగా, అకాలీలు ఒట్టి మతాభినివేశం గల శక్తిగానే కాక, హేతువాద, రాజకీయ పార్టీగా లక్షణాన్వితమై ప్రాదుర్భవించింది.


ఇప్పటిదాకా మన పరిశీలన, ఒకరకమైన మిశ్రిత చిత్రాన్ని మనముందుంచుతుంది. మతకల్లోలాను, కాందిశీకుల సమస్యలను వదిలేస్తే, కన్పించే సామాజికదృశ్యం, సమానత్వం కూడినదై సరియైన అభివృద్ధిని గాంచినదిగా దృగ్గోచరమవుతుంది. కాని ఆర్థిక పరిస్థితులవల్ల పాలనవల్ల కలిగిన దుష్ట ఫలితాలకు నిదర్శనంగా నిలిచిపోతాయి. సాంస్కృతిక రంగంలో పాశ్చాత్య ప్రభావం కన్పించినా, భారతీయ పద్ధతిలో కళలు తమ స్వంత వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకున్నాయి. స్వతంత్ర భారతం ఉత్సాహంతో ముందుకు సాగటానికి, పైచెప్పిన విషయాలనోసారి అవలోకనం చేస్తే, పరిస్థితి అంత నిరాశాజనకంగా కన్పడదు.

27.5 భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు

భారత స్వాతంత్ర్య సముపార్జన తర్వాత, మనదేశ చరిత్రలో పేర్కొనవలసిన ముఖ్య పరిణామము, స్వతంత్ర భారత దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడం. స్వాతంత్ర్యానికి పరిపూర్ణత సాధించేందుకు రాజ్యాంగ

రచనకు సత్వర చర్యలు గైకొనబడ్డాయి. 1947 సం॥పు భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం ఏర్పాటైన రాజ్యాంగ సభకు (Constituent Assembly) స్వతంత్ర భారత దేశానికి రాజ్యాంగ రచన చేపట్టే అధికారం యివ్వబడింది.

1947 సంవత్సరం ఆగష్టు 29 వ తేదీన రాజ్యాంగ సభ బి.ఆర్. అంబేద్కర్ సారధ్యంలో ఏడుగురు సభ్యులగల ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం అన్ని వర్గాల ప్రజలతో కూలంకషంగా చర్చలు జరిపి, రాజ్యాంగపు ముసాయిదాను జులై 1948 సం॥ నాటికి తయారు చేసింది. ఉప సంఘం సమర్పించిన ముసాయిదా రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని మార్పులు చేర్పులు చేసిన తర్వాత 26 నవంబరు 1949 సం॥ న ఆమోదించింది. భారతరాజ్యాంగం జనవరి 26, 1950 సం॥ నుంచి అమలులోనికి వచ్చి మనదేశం ఒక సర్వ సత్తాక ప్రజాస్వామిక గణతంత్ర పరిషత్తుగా ఏర్పాటైంది.


THE CONSTITUTION OF INDIA

WE THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN SOCIALIST SECULAR DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity; and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity and integrity of the nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

BRAOU

భారత రాజ్యాంగం లిఖిత పూర్వక రాజ్యాంగం. అందులో 12 భాగాలు, 8 షెడ్యూళ్ళు పొందు పరచబడ్డాయి. భారత రాజ్యాంగం ప్రపంచ రాజ్యాంగాలలో అతి పెద్దది. కేంద్ర రాష్ట్ర సంబంధాలు, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, బడుగు వర్గాలకు కల్పించబడిన రక్షణ చర్యలు వివరంగా పొందుపరచబడ్డాయి.

నవ భారత రాజ్యాంగం యొక్క ముఖ్య లక్ష్యం దేశ పౌరులందరికీ, సామాజిక, ఆర్థిక న్యాయం, రాజకీయ స్వేచ్ఛ, సమాన అవకాశాలు కల్పించడం. రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులను పరిరక్షించేందుకు స్వతంత్రన్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయడం మరో ముఖ్య విషయం. రాజ్యాంగంలో పొందు పరచబడిన ఆదేశిక సూత్రాలు "ప్రభుత్వానికి మార్గ దర్శక" సూత్రాలు మాత్రమే.

మన దేశ రాజ్యాంగం యొక్క మరో ముఖ్యాంశం, దేశానికి ఒక స్వతంత్ర్య న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయడమేగాక న్యాయ వ్యవస్థకు న్యాయ సమీక్ష చేసే అధికారం యివ్వబడింది. అనగా న్యాయ వ్యవస్థకు ప్రాథమిక హక్కులను పరిరక్షించే బాధ్యతతో పాటు, రాజ్యాంగానికి భాష్యం చెప్పే అధికారం, కేంద్ర రాష్ట్ర

ప్రభుత్వాలు జారీ చేసిన శాసనాలు, రాజ్యాంగబద్ధంగా వున్నవీ లేనివీ చెప్పే అధికారం ఏశాసనమైనా రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా వున్నట్లయితే అవిచెల్లనేరవని ప్రకటించే సర్వాధికారాలు న్యాయ వ్యవస్థకు యివ్వబడ్డాయి.

మన రాజ్యాంగం మనదేశానికి ఒక సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ సమాఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వాములు. మన రాజ్యాంగ నిర్మాతలు మనదేశానికి పార్లమెంటు ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటునకు అవకాశం కల్పించారు.

భారత రాజ్యాంగం యొక్క మరో ముఖ్య లక్షణం, దేశానికి లౌకికరాజ్య (Secular State) వ్యవస్థ ఏర్పాటును కల్పించింది. అనగా మనదేశం మతరహిత రాజ్యం అనగా ఈ లౌకిక వ్యవస్థలో **'రాజ్య అధికార మతం'** (State Religion) అనేది వుండదు. క్లుప్తంగా అన్నిమతాలు రాజ్యం దృష్టిలో సమానం. మత పరమైన వివక్షత వుండదు.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1) బ్రిటీష్‌వారి నుంచి స్వతంత్ర భారతదేశానికి, ఎటువంటి ఆర్థిక వ్యవస్థ సంక్రమించింది?

.....

.....

.....

.....

2) 20వ శతాబ్దంలో, భారతీయ సాహిత్యంలో మార్గదర్శకుడెవరు?

.....

.....

.....

.....

27.6 సంగ్రహంగా

1. దేశవిభజనవల్ల భారతదేశం విపరీతమైన మత కల్లోలాలను, లక్షలాది కాందిశీకులను ఎదుర్కోవలసి వచ్చింది.
2. 20వ శతాబ్దంలో విద్య అనేక మందికి వ్యాపించింది. స్త్రీల పరిస్థితి మెరుగైంది.
3. బ్రిటీష్‌వారి నుంచి స్వతంత్ర భారతదేశానికి లభించిన ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి కుంటుబడిన వ్యవస్థ.
4. సాహిత్యరంగంలో, పాశ్చాత్య ప్రభావంవల్ల కొత్త సాహిత్య పోకడలు వచ్చినాయి. కానీ ఆంగ్లవిద్యకు అధిక ప్రాముఖ్యత వున్నందున దేశభాషల అభివృద్ధి కుంటుబడింది. 20వ శతాబ్దంలో, పాశ్చాత్య నమూనాలో భవనాలు కట్టబడ్డాయి. రవీంద్రనాథ్ టాగూర్ నాయకత్వంలో, దేశంలో కళారంగంలో నూతన వికాసం కూడా ఏర్పడింది.

27.7 మీ అవగాహన పరీక్షించుకోండి : జవాబులు

I. 1. మతకల్లోలాలు, కాందిశీకుల సమస్యలు - స్వతంత్ర భారతదేశం వెంటనే ఎదుర్కోవలసిన సమస్యలు.

2. విద్యావ్యాప్తి, ఆధునిక రవాణా సౌకర్యాలు, స్వాతంత్ర్యోద్యమం, సంస్కరణోద్యమాలు, స్త్రీల వెనుకబడిన వర్గాల అభివృద్ధికి తోడ్పడినాయి.

3. 1911 ఫ్యాక్టరీ చట్టంవల్ల కార్మికుల పనికాలం తగ్గించబడింది. పిల్లలకు రోజుకు 6 గంటలు, పెద్దవారికి రోజుకు 12 గంటలు పనికాలంగా ఆ చట్టం నిర్ణయించింది.

BRAOU

II. 1. బ్రిటీష్‌వారి నుంచి కుంటుబడిన ఆర్థిక వ్యవస్థను స్వతంత్ర భారతదేశం పొందింది. తక్కువ ఉత్పత్తి వున్న వ్యవసాయ రంగం, కుటీర పరిశ్రమల స్థానంలో, అభివృద్ధి చెందని పారిశ్రామిక వ్యవస్థ, బీదరికంలో మ్రగ్గుతున్న ప్రజలు, బ్రిటీష్‌వారి నుంచి స్వతంత్ర భారతదేశానికి లభించిన ఆర్థిక వారసత్వం.

2. 20వ శతాబ్దంలో, భారతీయ సాహిత్యానికి మార్గదర్శకుడు రవీంద్రనాథ్ టాగూర్.

27.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. స్వాతంత్ర్యం సిద్ధించే సందర్భంలో జరిగిన మత ఘర్షణల కారణాలు, ఫలితాలేవి?
2. కాందిశీకుల సమస్యా స్వభావాన్ని, అది పరిష్కరించబడిన విధానాన్ని తెలుపండి.
3. పీడిత వర్గాల ఉద్ధరణకు, అంటరానితనం నిర్మూలనకు జరిగిన ప్రయత్నాలను వర్ణించండి.
4. 1905-47 కాలంలో ప్రవేశపెట్టబడిన వివిధ సాంఘిక సంక్షేమ చర్యలను క్లుప్తంగా సమీక్షించండి.
5. 20వ శతాబ్ది ప్రథమార్ధ భాగంలో సాధించబడిన వాఙ్మయాభివృద్ధిని వివరించండి.
6. స్వాతంత్రసిద్ధి సమయంలో నెలకొనిన మత పరిస్థితులను క్లుప్తంగా పరిశీలించండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. 1905-47 కాలంలో స్త్రీల పరిస్థితిలో ఎటువంటి మార్పులు సంభవించాయి?
2. 1900-1947 కాలంలో కుల వ్యవస్థలో వచ్చిన మార్పులను తెలుపండి.
3. 20వ శతాబ్ది ప్రథమార్ధ భాగంలో బ్రిటీష్ పరిపాలనచేత ప్రవేశ పెట్టబడిన వివిధ కార్మిక సంక్షేమ చర్యలను వర్ణించండి.
4. బ్రిటీష్ పాలనా ద్వితీయార్ధ భాగంలో భూస్వామ్య వర్గ ప్రాదుర్భావంపై ఒక వ్యాఖ్య వ్రాయండి.
5. బ్రిటీష్ పాలనా చివరి సంవత్సరాలలో ప్రవేశ పెట్టబడిన ద్రవ్యచలామణి ప్రయోగాల ప్రభావమెట్టిది?
6. 1947లో నెలకొనిన భారత ఆర్థిక వ్యవస్థ సమగ్ర స్వరూపాన్ని వివరించండి.
7. ఆధునిక శతాబ్ది ప్రథమార్ధ భాగంలో బ్రహ్మసమాజం దాని బలాన్ని ఎందుకు కోల్పోయింది?

27.9 ఉపయుక్త గ్రంథాలు

1. Bipan Chandra : *Modern India*
2. Chopra, Puri & Das : *A Social, Cultural and Economic History of India - Vol:*
3. Mahajan, V.D. : *India Since 1526*
4. Majumdar. R.C. (Ed) : *The Struggle for Freedom, Bharatiya Vidya Bhavan Series, Vol.X*
   Three Phases of India's Struggle for Freedom.
5. Perceival Spear : *History of India, Vol.II*
6. Sumit Sarkar : *Modern India*
7. Tara Chand : *History of Freedom Movement in India*
8. ఝాన్సీలక్ష్మి పాటిబండ; వైదేహి, అల్లాడి. : *భారతదేశ చరిత్ర-సంస్కృతి, ద్వితీయ భాగం*

BRAOU

ఖండం - 5 స్వాతంత్ర్యానంతరం భారతదేశం

క్రీ.శ. 1950-1989

ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. ఈ భాగాల్లో స్వతంత్ర భారతదేశంలో క్రీ.శ. 1950 నుంచి 1989 వరకు రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాల్లో అభివృద్ధి, భారతదేశ విదేశాంగ విధానం గురించిన వివరాలు ఉన్నాయి.

BRAOU

BRAOU

భాగం - 28 : రాజకీయాభివృద్ధి - క్రీ.శ. 1950 నుంచి 1989 వరకు

విషయక్రమం

28.0 లక్ష్యాలు

28.1 పరిచయం

28.2 ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1947-1964

28.2.1 లోక్‌సభ ఎన్నికల నిర్వహణ - 1952-1962

28.2.2 అలీన విధానం

28.2.3 పంచవర్ష ప్రణాళికలు - 1952

28.2.4 రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ - 1956

22.2.5 చైనాతో యుద్ధం - 1962

28.3 ప్రధానిగా లాల్ బహదూర్‌శాస్త్రి - 1964-1966

28.3.1 హిందీ వ్యతిరేక ఉద్యమం

28.3.2 ఇండోపాక్ యుద్ధం - 1965 మరియు తాష్కెంటు ఒప్పందం.

28.4 ప్రధానిగా ఇందిరా గాంధీ - 1966-77, 1980-84

28.4.1 సాహసంతో కూడిన నూతన నిర్ణయాలు

28.4.2 1967సంవత్సర ఎన్నికలు

28.4.3 1971 సంవత్సర మధ్యంతర ఎన్నికలు

28.4.4 ఇండో-పాక్ యుద్ధం - 1971 మరియు సిమ్లా ఒప్పందం

28.4.5 అత్యయిక పాలన విధింపునకు దారితీసిన పరిస్థితులు - పరిణామాలు 1975

28.5 1977 సంవత్సర ఎన్నికలు

28.6 జనతా పార్టీ పాలన 1977-79

28.7 1980 సంవత్సర మధ్యంతర ఎన్నికలు

28.8 ప్రధానిగా రాజీవ్ గాంధీ - 1984-1989

28.8.1 8వ లోక్‌సభ ఎన్నికలు 1984 - 85

28.8.2 రాజీవ్ గాంధీ - పథకాలు

28.8.3 షాబానో ఉదంతం

28.8.4 అయోధ్య-శిలాన్యాసం

28.8.5 పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం, 1985

28.8.6 బోఫోర్సు కుంభకోణం.

28.8.7 9వ లోక్ సభ ఎన్నికలు 1989

28.9 సంగ్రహంగా

28.10 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

28.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

28.12 ఉపయుక్త గ్రంథాలు

28.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగలగాలి :-

1. 1950 నుంచి 1989 సంవత్సరం వరకు భారతదేశంలో సంభవించిన ముఖ్య రాజకీయ పరిణామాలు.
2. ప్రథమ ప్రధానిగా పండిట్ నెహ్రూ విధానాలు.

BRAOU

3. ద్వితీయ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి కాలంలో ముఖ్య సంఘటనలు
4. తృతీయ ప్రధాని - ఇందిరా గాంధీ - ఆమె చేపట్టిన సాహసంతో కూడిన నూతన విధానాలు.
5. రాజీవ్ గాంధీ ప్రధానిగా - 21వ శతాబ్దపు భారత దేశ నిర్మాణానికి ఆయన చేపట్టిన కార్యక్రమాలు.

28.1 పరిచయం

స్వాతంత్ర్య సాధన తర్వాత తొలి నాలుగు దశాబ్దాలకు భారతదేశ చరిత్రలో విశిష్ట స్థానం వుంది. ఈకాలానికి చెందిన ప్రధానులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల పాలనా కాలంలో మనదేశంలో సంభవించిన ముఖ్యరాజకీయ పరిణామాలు ఈ పాఠంలో వివరించడం జరిగింది. దానికితోడు ఈ కాలంలో భారతదేశంలో రాజకీయ వ్యవస్థ పనిచేసిన తీరు, జనతా పాలన తీరుతెన్నులు, సంకీర్ణ ప్రభుత్వాల ఆవిర్భావం, ఇందిరాగాంధి పాలనా కాలంలో అత్యయిక పాలన విధింపుకు దారితీసిన పరిస్థితులు, పరిణామాలు, చివరగా రాజీవ్‌గాంధీ 21వ శతాబ్దపు భారతదేశ నిర్మాణానికి చేపట్టిన కార్యక్రమాలను విశ్లేషించడం జరిగింది.

28.2 ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1947 - 1964

స్వాతంత్ర్య సాధన తర్వాత భారతదేశ ప్రథమ ప్రధానిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అధికారం చేపట్టి దాదాపు రెండు దశాబ్దాలు దేశ భవితవ్యాన్ని తీర్చిదిద్దాడు. దేశం ఆర్థికంగా, రాజకీయంగా సుస్థిరత సాధించేందుకు ఆయన చేసిన కృషి మరువరానిది. భారత ఉపఖండ విభజన ఫలితంగా మనదేశాన్ని గడగడలాడించిన మతకలహాలు, శరణార్థుల సమస్యలను ప్రధాని నెహ్రూ సమర్థనీయంగా ఎదుర్కొని, దేశ సమైక్యతను పరిరక్షించాడు. మనదేశానికి నవ రాజ్యాంగ రచనకు చర్యలుగైకొని 1950 సంవత్సరంలో దేశం సర్వసత్తాక గణతంత్ర పరిషత్‌గా రూపొందడానికి కారకుడయ్యాడు. స్వాతంత్ర్యం సాధించి బాల్యదశలోనున్న మనదేశానికి ప్రధాని నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయం.

28.2.1 లోక్‌సభ ఎన్నికల నిర్వహణ 1952-1962

స్వాతంత్ర్య సాధన తర్వాత మన దేశంలో, 1952, 1957, 1962 సంవత్సరాలలో ప్రజాస్వామ్యం వేళ్ళూనుకునేలా లోక్ సభకు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఘనత ప్రధాని నెహ్రూకు దక్కుతుంది. మనదేశం గణతంత్ర పరిషత్‌గా ఆవిర్భవించిన తర్వాత 1951-52 లో మొదటగా లోక్ సభకు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు చీలి, కిసాన్ మజ్దూర్ పార్టీ ఏర్పాటైనా, ఈ ఎన్నికలలో కాంగ్రెసు 364 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. ఈ ఘనవిజయం మనదేశ సుస్థిరతకు పటిష్ఠమైన చర్యలు తీసికొనే శక్తి నెహ్రూ ప్రభుత్వానికి లభించింది.

1957 సంవత్సరంలో నిర్వహించబడిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీకి విజయం పునరావృతమైంది. కాంగ్రెసులోని సోషలిస్టులు, మతవాదులు పార్టీనుంచి వెలుపలికి వచ్చి వ్యక్తిగత విధాన పరికరణాలపై స్వంత పార్టీ ఏర్పాటు చేసికొన్నా , కాంగ్రెసు విజయావకాశాలను దెబ్బతీయలేకపోయాయి. అదేవిధంగా 1962 సంవత్సరంలో నిర్వహించబడిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెసు 361 స్థానాలు సాధించి ఘన విజయం కైవసం చేసికొంది. ఈ విజయపరంపరలు ప్రధాని పండిట్ నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెసు ప్రభుత్వాన్ని పటిష్ఠం చేసి, దేశ పురోభివృద్ధికి తగిన చర్యలు గైకొనే శక్తి సామర్థ్యాలను ప్రసాదించాయి.

28.2.2 అలీన విధానం

అలీన విధాన రూపకల్పనకు ప్రధాని నెహ్రూ చేసిన కృషి శ్లాఘనీయం. ప్రపంచంలో నెలకొని వున్న ఏసైనిక కూటమితోను పొత్తు ఏర్పాటు చేసికోకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తూ అంతర్జాతీయ సహకారం,

ప్రపంచ శాంతి స్థాపనకు కృషి చేయడం అలీన విధాన ముఖ్యోద్దేశం. అనగా అమెరికా రష్యా కూటములలో ఏ ఒక్కదానితో చేరకుండా, స్వతంత్రంగా వ్యవహరించే కొన్ని దేశాలను కూడగట్టుకొని, పేదదేశాల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కాపాడవచ్చని ప్రధాని నెహ్రూ భావించాడు.

అదేవిధంగా 'పంచశీల' రూపకల్పనలో ప్రధాని నెహ్రూ పాత్ర మరువలేనిది. చైనా ప్రధాని చౌ-ఎన్-లై, యుగోస్లేవియా అధ్యక్షుడు మార్షల్ టిటో పంచశీల రూపకల్పనలో నెహ్రూజీకి సహాయ, సహకారాలను అందించారు. 1957 సంవత్సరంలో బాండుంగ్‌లో జరిగిన సమావేశం, అలీన విధానానికి రూపురేఖలు దిద్దింది. అలీన దేశాలకు అంతర్జాతీయపరంగా గుర్తింపు సాధించిన ఘనత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు దక్కుతుంది.

28.2.3 పంచవర్ష ప్రణాళికలు - 1952

మనదేశ ఆర్థిక పురోగతి ప్రణాళికా బద్ధంగానే సాధ్యమౌతుందని ప్రధాని నెహ్రూ గాఢంగా విశ్వసించాడు. సోవియట్ రష్యా పద్ధతిని అనుసరించి, 1952 సంవత్సరంలో ప్రథమ పంచవర్ష ప్రణాళిక అమలు చేయడం జరిగింది. పంచవర్ష ప్రణాళికలపై వివరణాత్మకమైన విశ్లేషణ, ఈ పుస్తకంలోనే ప్రత్యేక భాగంగా పొందుపర్చడం జరిగింది.

28.2.4 రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ - 1956

1947 సంవత్సరం తర్వాత భారతదేశాన్ని భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా పునర్‌వ్యవస్థీకరించాలని, కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి ఫలితంగా ఏర్పాటైన 'ధార్' సంఘం రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ సూత్రాన్ని తిరస్కరించింది. కాని ఆంధ్రప్రాంతంలో ప్రజాఉద్యమ ఫలితంగా, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో కేంద్ర ప్రభుత్వం 1953 సం॥లో ఆంధ్రను మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పాటు చేసింది. దాని ఫలితంగా దేశంలో అన్ని ప్రాంతాలనుంచి రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణకై వత్తిడి తీవ్రతరమైనందున పార్లమెంటు ఫజల్ అలీ సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఫజల్ అలీ సంఘ సూచనలమేరకు పార్లమెంటు 1956 సంవత్సరంలో రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని ఆమోదించింది.

ఆ చట్ట ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్ కొత్త రాష్ట్రంగా ఏర్పాటైంది. అదే విధంగా కేరళ, బొంబాయి ప్రెసిడెన్సీ కొత్త రాష్ట్రాలుగా ఏర్పాటుకు అవకాశం కల్పించారు. 1960 సంవత్సరంలో బొంబాయి ప్రెసిడెన్సీ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. 1960 సం॥లో పంజాబు రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టం ఆమోదించబడింది. మనదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రాజనీతిజ్ఞునిగా వ్యవహరించి దేశ సమగ్రతను పరిరక్షించాడు.

28.2.5 చైనాతో యుద్ధం - 1962

మనదేశానికి చెందిన, ఈశాన్య సరిహద్దుల్లో కొన్నివేల చదరపు మైళ్ళ ప్రాంతాన్ని, చైనా ఆక్రమించడం వల్ల చైనాతో యుద్ధం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. పంచశీల సిద్ధాంత రూపకల్పనలో ముఖ్యపాత్ర వహించిన రెండు దేశాల మధ్య యుద్ధపరిస్థితులు ఏర్పడటం దురదృష్టంగా పేర్కొనవలసి వుంది. చైనా యుద్ధంలో భారతదేశం ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ అవమానకరమైన ఓటమి బాధను, ప్రధాని నెహ్రూ భరించలేక పోయారని రాజకీయ పండితులు అభిప్రాయపడ్డారు.

28.3 ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి 1964-66

1964 సం॥ మే 27వ తేదీన పండిట్ నెహ్రూ పరమపదించడంతో, భారతదేశంలో ఒక శకం పరిసమాప్తమైంది. ఆతదుపరి లాల్‌బహదూర్ శాస్త్రి, నెహ్రూ వారసునిగా సాఫీగా ఎంపిక కావడం, భారతదేశంలో రాజకీయ వ్యవస్థ పరిపక్వానికి, పటిష్ఠతకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. లాల్ బహదూర్

BRAOU

శాస్త్రి ప్రధానిగా స్వల్పకాలమే పాలనా బాధ్యతలు నిర్వహించినా, ఈ కాలం ఉద్వేగ పూరితమైన సంఘటనలతో కూడి వున్నది. లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని కాలం 1965లో పాకిస్తాన్‌పై ఘనవిజయంతో ప్రారంభమై, చారిత్రాత్మకమైన 'తాష్కెంటు' ఒప్పందం జరిగిన కొద్ది గంటలలోనే హఠాన్మరణం పొందటంతో పూర్తి ఔతుంది.

28.3.1 హిందీ వ్యతిరేక ఉద్యమం

లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిన ఒక ముఖ్య సంఘటన హిందీ వ్యతిరేకోద్యమం. ఈ ఉద్యమం దక్షిణాది రాష్ట్రాలను గడగడలాడించింది. హిందీని బలవంతంగా అధికార భాషగా తమ పై రుద్దుతున్నారనే భావంతో ఈ ఉద్యమం ప్రారంభమై తమిళనాడులో హింసాత్మకంగా మారింది. శాంతి భద్రతలకు ముప్పువాటిల్లింది. ఈ ఉద్యమాన్ని ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి యుక్తితో, సమయోచితంగా ఆంగ్ల భాషను సహ అధికార భాషగా కొనసాగించేందుకు అంగీకరించి చల్లబరిచాడు.

28.3.2 ఇండో-పాక్ యుద్ధం - 1965 మరియు తాష్కెంటు ఒప్పందం

1965 సంవత్సరంలో పాకిస్తాన్ బలప్రయోగంద్వారా కాశ్మీరును ఆక్రమించడానికి ప్రయత్నించడంతో ఈ యుద్ధానికి దారితీసింది. ఈ యుద్ధంతో పాకిస్తాన్‌కు చైనాదేశం మద్ధతు ప్రకటించింది. దృఢచిత్తం, అదే సమయంలో పట్టువిడుపు ధోరణి ప్రదర్శించి, రష్యా సహాయ సహకారాలతో పాకిస్తాన్‌ను ఘోర పరాజయానికి గురి చేయడంలో సఫలీకృతుడైనాడు ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి. ఈ యుద్ధ నిర్వహణలోను, యుద్ధానంతర శాంతి చర్చల సమయంలోనూ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి అసాధారణ ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించారు. పశ్చిమ దేశాలను నొప్పించకుండా ఇండోపాక్ యుద్ధంలో సాధించిన ఘన విజయం ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వ్యక్తిగత విజయంగా పేర్కొంటారు.

రష్యాదేశం చొరవతో ఇండో-పాక్ దేశాలు యుద్ధ విరమణకు అంగీకరించాయి. ఆతదుపరి శాంతి సంప్రదింపులకై యిరుదేశాల ప్రతినిధులు తాష్కెంటులో సమావేశమయ్యారు. పాకిస్తాన్ ప్రతినిధి వర్గానికి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ నాయకత్వం వహించగా, భారత ప్రతినిధి వర్గానికి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి నాయకత్వం వహించారు. 1966 సం॥ జనవరి 3వ తేదీన తాష్కెంటు శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు తమ మధ్యగల వివాదాలు బలప్రయోగం ద్వారా కాకుండా, శాంతి యుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకొనేందుకు అంగీకరించాయి. తాష్కెంటు ఒప్పందం ఒక చారిత్రాత్మకమైన విజయంగా, ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి రాజనీతి చాతుర్యానికి నిదర్శనంగా అభివర్ణిస్తారు. దురదృష్టవశాత్తు ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి తాష్కెంటు ఒప్పందంపై సంతకం చేసిన కొద్ది గంటల్లో, తాష్కెంటు లోనే హఠాన్మరణానికి పాల్పడటం భారతీయులను దిగ్భ్రాంతులను చేసింది.

i. మీ అవగాహన పరీక్షించుకోండి.

1. అలీన విధాన ముఖ్యోద్దేశం ఏమిటి?

.....

.....

.....

.....

2. రాష్ట్రాల పునర్వవ్యవస్థీకరణ చట్టం ఎప్పుడు అమలులోకి వచ్చింది?

.....

.....

.....

.....

BRAOU

3. తాష్కెంటు ఒప్పంద ప్రాధాన్యత ఏమిటి?

.....

.....

.....

.....

28.4 ప్రధానిగా ఇందిరాగాంధీ - 1966-77, 1980-84

ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హఠాన్మరణం తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె ఇందిరా గాంధీ, 1966 సంవత్సరం జనవరి 24వ తేదీన మనదేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభంలో ప్రధాని ఇందిరాగాంధీ వూగిసలాట ధోరణి అవలంబించినా, తదుపరి తనస్థానాన్ని పటిష్ఠం చేసికొని, సాహసంతో కూడిన నూతన విధానాల దిశగా పయనించారు. అత్యంత క్లిష్ట పరిస్థితులు దేశంలో నెలకొని వున్న సమయంలో ఇందిరాగాంధీ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. 1965 సం॥లో జరిగిన ఇండో-పాక్ యుద్ధ ఫలితంగా పాశ్చాత్య దేశాలతో బెడిసికొట్టిన సంబంధాలు సరిచేయవలసిన పరిస్థితి నెలకొనివుంది. యుద్ధానంతర పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులవల్ల తలెత్తిన ఆర్థిక సంక్షోభం పరిష్కరించాలి.

నాగా, మిజో తిరుగుబాట్లు, దక్షిణాదిన హిందీ వ్యతిరేక ఉద్యమం, దేశంలో అనేక ప్రాంతాల్లో ప్రజ్వరిల్లిన గోవధ వ్యతిరేక ఉద్యమం, పంజాబీ సుబా ఏర్పాటునకై ఉద్యమం మొదలగు సవాళ్లతోపాటు అంతర్గతంగా పార్టీని శాసిస్తున్న సిండికేట్ సభ్యుల తిరుగుబాటును ఎదుర్కోవలసిన పరిస్థితి, పార్టీలోని సిండికేట్ సభ్యుల సవాళ్లను అధిగమించేందుకు, కాంగ్రెసు పార్టీ దృష్టిని వామపక్ష ఆర్థిక సంస్కరణల అమలు ఆవశ్యకతపై మరల్చారు. ప్రధాని ఇందిరాగాంధీ తన నూతన విధానాలకు ప్రజామోదం పొందేందుకు తన రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టి, 1977 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం తీసికొన్నారు.

28.4.1 సాహసంతో కూడిన నూతన నిర్ణయాలు

ప్రజాస్వామిక, సామ్యవాద సిద్ధాంతాల ప్రాతిపదికగా ప్రధాని ఇందిరా గాంధీ పేదరిక నిర్మూలనా లక్ష్యంతో కొన్ని నూతన విధానాలు అమలు చేశారు. నవ సమాజ నిర్మాణమే ఇందిరాగాంధీ ముఖ్య లక్ష్యమని రాజకీయ పండితులు అభిప్రాయపడ్డారు.

పేదరిక నిర్మూలనే ముఖ్య లక్ష్యంగా పేదవర్గాలవారికి సహాయ మందించేందుకు ప్రధాని ఇందిరా గాంధీ దేశంలోని పదునాల్గు జాతీయ బ్యాంకులను జాతీయం చేస్తూ అతిముఖ్య నిర్ణయం తీసికొన్నారు. ప్రధాని ఇందిరాగాంధీ గైకొన్న మరో ముఖ్య నిర్ణయం, రాజభరణాలరద్దు. ప్రధాని ఇందిరా గాంధీ తన నూతన విధానాల అమలుకు తలెత్తిన చట్టపరమైన, న్యాయపరమైన అడ్డంకులను 1971 సంవత్సరంలో నిర్వహించిన ఎన్నికలలో ఘన విజయం సాధించిన తర్వాత రాజ్యాంగ సవరణలు చేపట్టి, అధిగమించగలిగారు.

1971 సంవత్సర ఎన్నికల తర్వాత ప్రధాని ఇందిరాగాంధీ **"గరీబీ హఠావో"** పథకాన్ని ప్రారంభించినారు. గరీబీ హఠావో పథకం ద్వారా ఇందిరాగాంధీ దేశంలోని పేదవర్గాల వారికి ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించడం, చౌక డిపోల ద్వారా నిత్యావసర వస్తువుల సరఫరా, వారికి విద్యా, వైద్య సౌకర్యాలు మెరుగు పర్చడం ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు.

28.4.2 1967 సంవత్సర ఎన్నికలు

1967 సంవత్సరంలో లోక్‌సభకు, అనేక రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈఎన్నికలకు విశేషమైన ప్రాముఖ్యం వుంది. లోక్‌సభలో కాంగ్రెసు పార్టీ ఆధిక్యత గణనీయంగా తగ్గింది. ఈ

BRAOU

ఫలితాలు 1947 నుంచి 1967 సంవత్సరం వరకు కాంగ్రెసు పార్టీ పాలనపై నెలకొని వున్న అసంతృప్తికి దర్పణమని రాజకీయ పండితుల అభిప్రాయం. మరో విధంగా ఈ ఎన్నికలలో ఫలితాలు 1969 సంవత్సరం కాంగ్రెసు పార్టీ చీలికకు దారితీసింది.

అదేవిధంగా, 1967 లో రాష్ట్ర శాసన సభలకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ ఓటమి పాలైంది. దాని ఫలితంగా అనేక రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటునకు దారితీసింది. నంబూద్రిపాద్ నాయకత్వంలో సమైక్యకూటమి కేరళ రాష్ట్రంలో, అజయకుమార్ ముఖర్జీ నాయకత్వంలో పశ్చిమ బెంగాలులో 18 పార్టీల కూటమి, సంకీర్ణ ప్రభుత్వాలు అధికారం చేపట్టాయి. ఉత్తర ప్రదేశ్‌లో సంయుక్త విధాయక్ దళ్, పంజాబు బీహారు రాష్ట్రాలలో కూడ సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

28.4.3 1971 సంవత్సర మధ్యంతర ఎన్నికలు

ప్రధాని ఇందిరా గాంధీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలకు కాంగ్రెసు పార్టీలోనే వ్యతిరేకత బయలుదేరిన ఫలితంగా 1969 సంవత్సరంలో కాంగ్రెసు పార్టీ చీలిపోయింది. తన నూతన విధానాలకు ప్రజామోదం పొందే వుద్దేశ్యంతో, ప్రధాని ఇందిరా గాంధీ 1971 సంవత్సరంలో మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో ఇందిరా గాంధీ 350 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించి, విజయ దుందుభి మ్రోగించారు. ఈ విజయంతో ఇందిరా గాంధీ అనేక రాజ్యాంగ సవరణలు చేపట్టి, తన నూతన విధానాల అమలునకు అడ్డుగోడలను తొలగించుకొన్నారు.

28.4.4 ఇండో-పాక్ యుద్ధం - 1971, సిమ్లా ఒప్పందం

పశ్చిమ పాకిస్తాన్ పాలకుల దురాగతాలు, అణచివేత విధానాలు తూర్పు పాకిస్తాన్‌లో తిరుగుబాటుకు దోహదం చేశాయి. ఆ తిరుగుబాటును అణచి వేయడాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం చేపట్టిన అమానుష చర్యలు ఫలితంగా, 30 లక్షల మంది తూర్పు పాకిస్తాన్ ప్రజలు హత్యకు గురయ్యారు. భయోత్పాతంతో తూర్పు పాకిస్తాన్ ప్రజలు భారీఎత్తున భారతదేశానికి వలస వచ్చారు. ఈ శరణార్థుల సమస్య భారతదేశానికి ఆర్థికపరంగా పెను భారమైంది.

దానికి తోడు 1971, డిశంబరు 3వ తేదీన పాకిస్తాన్ భారతదేశ గగన తలాన్ని వుల్లంఘించి అనేక భారత పట్టణాలపై బాంబు దాడులు జరిపింది. తూర్పు పాకిస్తాన్ తిరుగుబాటునకు భారత్ సహాయం నిరోధించడమే ఆ చర్యల లక్ష్యం. అటువంటి పరిస్థితిలో ప్రధాని ఇందిరా గాంధీ తూర్పు పాకిస్తాన్ తిరుగుబాటుకు మద్ధతు అందించి దాని విముక్తికి చర్యలుగైకొన్నది.

ఈ యుద్ధంలో చైనా, పాకిస్తాన్‌కు మద్ధతు ప్రకటించినా, అమెరికా జోక్యం చేసికొనే బెదిరింపుతో తన సప్తమ నౌకా దళాన్ని(Seventh Fleet) హిందూ మహా సముద్రంలోకి తరలించినా ప్రధాని ఇందిరాగాంధీ ధైర్యసాహసాలు ప్రదర్శించి తూర్పు పాకిస్తాన్ విమోచనకు, ఆ ప్రాంతం బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించడానికి కారకురాలైంది. ఈ యుద్ధంలో భారత్ విజయానికి ఇండో-రష్యామైత్రీ ఒప్పందం ముఖ్యకారణంగా రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

1971 సంవత్సరంలో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో భారతదేశం ఘనవిజయం సాధించినా, ప్రధాని ఇందిరా గాంధీ భారత-పాకిస్తాన్ దేశాల మధ్య సమస్యల పరిష్కారానికై శాంతి సంప్రదింపులకోసం సిమ్లాలో సమావేశం కావడానికి అంగీకరించింది.

ఇండియా చారిత్రాత్మకమైన సిమ్లా ఒప్పందంపై పాకిస్తాన్ నాయకులు జులై 3, 1972 సంవత్సరంలో సంతకాలు చేశారు. సిమ్లా ఒప్పంద షరతుల ప్రకారం రెండు దేశాలు తమ మధ్యగల విభేదాలు బలప్రయోగం ద్వారా కాకుండా, శాంతియుతమైన చర్చలద్వారా పరిష్కరించుకొనేందుకు అంగీకరించాయి. ఇరుదేశాలు 1949 సంవత్సరపు యుద్ధ విరమణ రేఖను, కాశ్మీరులో కొత్త నియంత్రణ రేఖగా (Line of Control) అంగీకరించాయి.

BRAOU

28.4.5 అత్యయిక పాలన విధింపునకు దారితీసిన పరిస్థితులు, పరిణామాలు - 1975

1973-75 సం॥ల మధ్య ప్రధాని ఇందిరా గాంధీ అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. దేశంలో నెలకొనివున్న వర్షాభావ పరిస్థితులు భారతదేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోనికి నెట్టివేసాయి. ప్రభుత్వ పాలనా వ్యవస్థ, అవినీతి, లంచగొండితనం స్థైరవిహారం చేయడంవల్ల, పూర్తిగా కుంటుపడింది. దానికి తోడు ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలు, ప్రజలలో తీవ్ర అసంతృప్తికి దోహదం చేశాయని రాజకీయ పండితులు అభిప్రాయపడ్డారు.

అట్టి క్లిష్ట సమయంలో ప్రముఖ నాయకుడైన జయప్రకాశ్ నారాయణ, అజ్ఞాతవాసం వీడి, బీహారు రాష్ట్రంలో ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఆ ఉద్యమం కార్చిచ్చులా దేశం నలుమూలలకు, త్వరితగతిని విస్తరించింది. ఈ సందర్భంగానే జయప్రకాశ్ నారాయణ మన దేశంలో సంపూర్ణ విప్లవ సాధనకు ఉద్యమించవలసిందిగా ప్రజలకు పిలుపునిచ్చాడు. అదేసమయంలో 1974 సంవత్సరంలో నిర్వహించబడిన 'జాతీయ రైల్వే సమ్మె' మనదేశ ఆర్థిక పునాదుల్ని కదిల్చివేసింది. అదే సమయంలో అశనిపాతంలా, 1975, జూన్ 16వ తేదీన అలహాబాదు న్యాయస్థానం, 1971 సంవత్సర ఎన్నికలలో ఎన్నికల నియమావళి అతిక్రమణ కారణంగా ప్రధాని ఇందిరా గాంధీ పార్లమెంటునకు ఎన్నిక చెల్లదని, రద్దుచేస్తూ చారిత్రాత్మక తీర్పు ప్రకటించింది.

న్యాయస్థానం తీర్పును పాటించి, పదవీ త్యాగం చేయడానికి ప్రధాని ఇందిరా గాంధీ సుముఖంగా లేనందున ఆమెపై వత్తిడి తెచ్చేందుకు జయప్రకాశ్ నారాయణ **'పార్లమెంటునకు ప్రజాయాత్ర'** నిర్వహణకు పిలుపునిచ్చాడు. కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేయవలసిందిగా రక్షణ దళాలకు, పోలీసు యంత్రాంగానికి పిలుపునిచ్చారు. ఎటువంటి ప్రత్యామ్నాయంలేని పరిస్థితిలో ప్రధాని ఇందిరా గాంధీ **'దేశంలో అత్యయిక పాలన'** విధిస్తూ జూన్ 25, 1975 సంవత్సరం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

భారతదేశంలో అత్యయిక పాలన విధింపు ద్వారా అసాధారణ సర్వాధికారాలను ఎమర్జెన్సీ విధింపు ద్వారా కేంద్ర ప్రభుత్వం హస్తగతం చేసికొంది. ప్రజాస్వామ్యం నిరంకుశ పాలనగా మారిపోయింది. ప్రతిపక్ష నాయకులందరినీ నిర్బంధించారు. పత్రికల స్వేచ్ఛపై ఆంక్షలు విధించి, పత్రికా స్వాతంత్ర్యాన్ని కబళించడం జరిగింది. ఆంతరంగిక భద్రతా చట్టం (M.I.S.A) దేశ రక్షణా సూత్రావళి (D.I.R) నిర్దాక్షిణ్యంగా అమలుచేసి లక్షలాది మంది ప్రజలను నిర్బంధించారు. ఖైదీల ఎడల కేంద్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించినట్లు రాజకీయ పండితుల విశ్లేషణ. ఈ విధంగా దమననీతితో, నిర్దాక్షిణ్యంగా జయప్రకాశ్ నారాయణ న్యాయకత్వాన నిర్వహించబడిన అత్యయిక పాలన వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేశారు.

అత్యయిక పాలనా కాలంలో అనేక రాజ్యాంగ సవరణలు ఆమోదించి ప్రభుత్వాధికారాలను పటిష్ఠం చేశారు. 20 సూత్రాల పథకంద్వారా ఆర్థిక, సామాజికపరమైన మార్పు తీసికొనిరావడానికి చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదు. అత్యయిక పాలనా కాలంలో ప్రధాని ఇందిరా గాంధీ రెండవ కుమారుడైన సంజయ్ గాంధీ సర్వాధికారాలు చలాయిస్తూ, రాజ్యాంగేతర శక్తిగా ఎదిగాడు. సంజయ్ గాంధీ కుటుంబ నియంత్రణ అమలు, వయోజన విద్యావ్యాప్తికి, మురికి వాడల నిర్మూలనకు, రాజధాని నగరం ఢిల్లీని అందమైన నగరంగా తీర్చిదిద్దడానికి ప్రవేశ పెట్టిన తీవ్రమైన పథకాలు, వాటి అమలు తీరు ప్రజలలో తీవ్ర అసంతృప్తిని ప్రజ్వరిల్ల జేసింది. 1977 సంవత్సరంలో ప్రధాని ఇందిరా గాంధీ పదవీ భ్రష్టురాలు కావడానికి సంజయ్ గాంధీ కారకుడని రాజకీయ పండితులు అభిప్రాయపడ్డారు. *"భారతదేశంలో 1975 సంవత్సరంలో అత్యయిక పాలన విధింపు దేశంలో ఒక పెనుతుఫానుగా మారి 1977 సంవత్సరంలో ఇందిరాగాంధీని పదవినుంచి తుడిచి పెట్టిందని"* రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

BRAOU

28.5 1977 సంవత్సర ఎన్నికలు

అత్యయిక పాలనాకాలంలో నిరంకుశంగా పాలన సాగించిన ప్రధాని ఇందిర, తనరాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టి 1977 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించారు. 1977 సంవత్సరంలో నిర్వహించబడిన ఎన్నికలలో ప్రధాని ఇందిర నాయకత్వంలో కాంగ్రెసు అవమానకరమైన పరాజయాన్ని చవిచూసింది. లోక్‌సభలో 154 స్థానాలు మాత్రమే సాధించగలిగింది. అత్యయిక పాలనాకాలంలో దురాగతాల ఫలితంగానే కాంగ్రెసు ఓటమిపాలైందని రాజకీయపండితుల అభిప్రాయం.

భారతీయ లోక్‌దళ్, జనసంఘ్, సోషలిస్టు పార్టీల కలయికతో ఏర్పడిన జనతాపార్టీ 1977 ఎన్నికలలో 295 లోక్‌సభ స్థానాలు కైవసం చేసికొని కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే సంవత్సరంలో రాష్ట్ర శాసన సభలకు నిర్వహించిన ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అనేక రాష్ట్రాలలో ఆధిక్యం సాధించడంలో విఫలమైంది. క్లుప్తంగా 1977 సంవత్సరం ఎన్నికలు భారతదేశ రాజకీయాలలో సంకీర్ణ ప్రభుత్వాలకు నాంది పలికాయి. కేంద్రంలోనే గాక కేరళ, పంజాబ్, బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీన్ని ఒక ముఖ్య రాజకీయ పరిణామంగా పేర్కొనవచ్చును.

28.6 జనతా పార్టీ పాలన 1977-79

1977 సంవత్సరం ఎన్నికలలో ఘనవిజయం సాధించిన జనతాపార్టీ మొరార్జీ దేశాయి నాయకత్వంలో 1977 సంవత్సరం మార్చి 27వ తేదీన అధికార పగ్గాలు చేపట్టింది. జనతా పార్టీ కలగూరగంపవలె అనేక పార్టీల భావసారూప్యతలేని కూటమైనందున, భాగస్వామ్య పక్షాల మధ్య కీములాటలవల్ల మొరార్జీదేశాయి జులై 28,1979 సంవత్సరంలో రాజీనామా చేశారు. తదుపరి చౌదరీ చరణ్ సింగ్ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం కొద్దికాలమే కొనసాగింది. ప్రధానిగా పార్లమెంటులో ప్రవేశించకుండానే చరణ్‌సింగ్ పదవీ త్యాగం చేయవలసిన దుస్థితి ఏర్పడింది. ఈ విధంగా కేంద్రంలో 'జనతా సంకీర్ణ ప్రభుత్వం' సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైనందున ప్రజలలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. లోక్ సభలో తిరుగులేని ఆధిక్యత వున్నా జనతా పార్టీ కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోవడం గమనించాలి.

28.7 1980 సంవత్సరం మధ్యంతర ఎన్నికలు

కేంద్రంలో జనతా ప్రభుత్వం నాటకీయంగా పతనం కావడంతో 1980 సంవత్సరంలో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. జనతా పాలనతో విసుగెత్తిన ప్రజలు ఎన్నికలలో కాంగ్రెసు పార్టీకి ఘనవిజయాన్ని చేకూర్చారు. ఇందిర నాయకత్వంలోని కాంగ్రెసు 353 లోక్‌సభ స్థానాలను సాధించి 2/3 ఆధిక్యాన్ని సంపాదించడం విశేషం. ఈ ఎన్నికలలో కేంద్రంలోని జనతా కూటమి, 13 రాష్ట్రాలలోని సంకీర్ణ ప్రభుత్వాలు తుడుచు పెట్టుకొని పోయాయి. క్లుప్తంగా 1980 సంవత్సర ఎన్నికలు సంకీర్ణ ప్రభుత్వాల ప్రయోగానికి చావుదెబ్బతీశాయని చెప్పవచ్చు.

1980 ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అఖండ విజయం సాధించడంవల్ల ఇందిరాగాంధీ 1980 జులైలో రెండవసారి ప్రధానిగా అధికారపగ్గాలు చేపట్టారు. 1980-84 సంవత్సరాల మధ్య ప్రధాని ఇందిరా గాంధీ అనేక సవాళ్లను ఎదుర్కోవలసివచ్చింది. పంజాబు రాష్ట్రం తీవ్రవాదానికి ముఖ్య కేంద్రమై శాంతి భద్రతలకు ప్రమాదం వాటిల్లింది. తీవ్రవాద, సిక్కునాయకుడు బింద్రెన్‌వాలా, పవిత్ర అమృత్‌సర్ దేవాలయాన్ని సిక్కు తీవ్రవాదులు కేంద్రంగా మార్చివేసిన పరిస్థితిలో, మరో ప్రత్యామ్నాయంలేక ప్రధాని ఇందిరాగాంధీ అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంపై సైనిక చర్య (Blue star operation) కు ఆదేశించారు. ఈ చర్యవల్ల సిక్కులు తీవ్రమనస్తాపం చెందారు. ఈ అసంతృప్తి చివరకు పతాక స్థాయికి చేరుకొని సిక్కు అంగరక్షకులే ప్రధాని ఇందిరాగాంధీని అక్టోబరు 31, 1984 సంవత్సరంలో దారుణంగా హత్యచేయడం అత్యంత దురదృష్టకరమైన సంఘటన. దాదాపు 16 సంవత్సరాలు దేశభవితవ్యాన్ని తీర్చిదిద్దిన ప్రధాని ఇందిరాగాంధీ జీవితం విషాదాంతమైంది.

BRAOU

28.8 ప్రధానిగా - రాజీవ్ గాంధీ, 1984-1989

ప్రధాని ఇందిరా గాంధీ దారుణ హత్య భారతీయులను దిగ్భ్రాంతులను చేసింది. తదుపరి ఇందిరా గాంధీ పెద్ద కుమారుడైన రాజీవ్ గాంధీని కాంగ్రెసు పార్టీ, ఇందిరా గాంధీ వారసునిగా ఎంపికచేసి మరొక్కసారి భారతదేశంలో రాజకీయ వ్యవస్థ ఎంత పరిణితి చెందిందో, ఎంతటి క్లిష్టదశనైనా ఏవిధంగా అధిగమిస్తుందో రుజువు చేసింది.

రాజీవ్‌గాంధీ అక్టోబరు 31, 1984 సం॥లో దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. యువకుడైనా, అనుభవరహితుడైన ప్రధాని రాజీవ్ గాంధీ పాలనా వ్యవస్థకు క్రొత్త రూపు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో వున్నాడని కొందరి అభిప్రాయం. కొందరు ప్రధాని రాజీవ్ గాంధీని 'పరిశుద్ధుడు' (Mr. Clean) అని పిలువగా మరి కొందరు రాజీవ్ గాంధీని అమెరికా అధ్యక్షుడైన జాన్. యఫ్. కెన్నడీ తో పోల్చారు. ప్రధాని బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాజీవ్ గాంధీ జాతినుద్దేశిస్తూ చేసిన తన రేడియో ప్రసంగంలో *"విచ్ఛిన్నకరశక్తుల ప్రమాదం నుంచి దేశ సమైక్యతను పరిరక్షిస్తానని ప్రతినబూనడమేగాక, 21వ శతాబ్దపు నవభారతదేశ నిర్మాణానికి కృషి చేస్తానని* అభయమిచ్చాడు. *ఒక నూతనఅంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ స్థాపనకు కృషిచేసి తర్వాత అంతర్జాతీయ సహకారాన్ని* పెంపొందించి ప్రపంచ శాంతి కొరకై కృషి చేస్తానని" వుద్ఘాటించాడు. తన లక్ష్యసాధనకు ప్రధాని రాజీవ్ గాంధీ కొన్ని కీలక నిర్ణయాలు తీసికొన్నాడు. కాని అనుభవరాహిత్యంవల్ల, పార్టీ పెద్దల సహకారం లభించక, తన లక్ష్యంను సాధించడంతో పూర్తిగా కృతకృత్యుడు కాలేదు. అందుచేత రాజీవ్ గాంధీ ఒక స్వాప్నికుడుగా మిగిలిపోయాడని కొందరి వాదం. 1992 సంవత్సరం మే 22 తేదీన శ్రీ పెరుంబుదూర్‌లో మానవ బాంబు ప్రయోగం ద్వారా రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యాడు.

28.8.1 8వ లోక్‌సభ ఎన్నికలు, 1984-1985

రాజీవ్‌గాంధీ ప్రధానిగా తీసికొన్న మొదటి ముఖ్య నిర్ణయం లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించడం. 1984-85 సంవత్సరంలో లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో రాజీవ్ నాయకత్వంలోని కాంగ్రెసు పార్టీ 415 స్థానాలను కైవసం చేసికొని చారిత్రాత్మక విజయం సాధించింది. ఇందిరా గాంధీ దారుణ హత్యానంతరం దేశంలో ప్రజ్వరిల్లిన సానుభూతి పవనాలు కాంగ్రెసు విజయానికి దోహదం చేశాయని రాజకీయ పండితుల విశ్లేషణ, ఈ ఎన్నికల లలో లభించిన అఖండ విజయం రాజీవ్ గాంధీని కొన్ని కీలక విధానాలను అవలంబించేందుకు ప్రోత్సహించివుండ వచ్చని కొందరి అభిప్రాయం.

28.8.2 రాజీవ్ గాంధీ -పథకాలు

ప్రధాని రాజీవ్ గాంధీ ముఖ్య లక్ష్యం భారతదేశాన్ని, భయం, పేదరిక జాఢ్యం నుంచి కాపాడటంగా కనిపిస్తుంది. భారతదేశంలోని నిరుపేదల సముద్ధరణకు, 21 వశతాబ్దపు భారత దేశ నిర్మాణానికి రాజీవ్‌గాంధీ అనేక పథకాలు అమలు చేశాడు.

'ఇందిరా ఆవాస్ యోజనా' పథకం ద్వారా భారతదేశంలోని నిరుపేద వర్గాలవారికి నివాసాలు ఏర్పాటు (Dwelling huts) మంచినీటి సౌకర్యాలు పెంపొందించడం, వారి జీవన స్థితిగతులు మెరుగు పర్చడానికి పటిష్ఠమైన చర్యలు గైకొన్నాడు. పండిట్ జవహర్‌లాల్ నూరువసంతాల జన్మదిన వేడుకల సందర్భంగా, ప్రధాని రాజీవ్ గాంధీ 'జవహర్ రోజ్‌గార్ యోజన' పథకం ప్రవేశపెట్టాడు. ఈ పథకం ద్వారా ప్రతీ కుటుంబంలో కనీసం ఒకరికి ఉపాధి అవకాశం కల్పించడమే గాక, రోజ్‌గార్ పథకానికి రాజీవ్ గాంధీ 200 కోట్ల రూపాయలు నిధులు కేటాయించి మంచి ప్రోత్సాహాన్నందించాడు. ప్రధాని రాజీవ్ గాంధీ 20 సూత్రాల పథకంద్వారా గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగు పర్చడానికి తీవ్ర కృషి చేశాడు. శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞాన ఫలితాలు పేదల స్థితిగతులు మెరుగు పర్చడానికి ఉపయోగపడాలని రాజీవ్ గాంధీ విశ్వసించారు గ్రామీణ ప్రాంతాలకు త్రాగునీటి సౌకర్యం

BRAOU

కల్పించడం, జాతీయ వ్యాధి నిరోధక కార్యక్రమాలను రూపొందించడానికి ప్రత్యేక చర్యలు తీసికొనడానికి రాజీవ్ గాంధీ తన దృష్టిని కేంద్రీకరించాడు. దేశంలో అక్షరాస్యత 'ఉపగ్రహ, సమాచార వ్యవస్థల' ద్వారా పెంపొందించడానికి రాజీవ్ గాంధీ, శ్రద్ధతీసికొన్నాడు. ప్రజలందరికీ పరిశుద్ధమైన, పాలు, నాణ్యత గల నూనెగింజలు అందించే ఏర్పాటు చేశాడు. రాజీవ్ గాంధీ వార్తాప్రసార సాధనాలు మనదేశంలోనే ఉత్పత్తి కావాలని అభిలషించాడు.

మన దేశంలో టెలికాం రంగ విస్తరణవిషయంలో ప్రధాని రాజీవ్ గాంధీకి శామ్‌పిట్రోడా ముఖ్య సలహాదారుగా ఎనలేని కృషి చేశాడు. ఒక క్రొత్త కంప్యూటర్ విధానాన్ని మనదేశంలో ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుంది. ప్రతీవిభాగంలోనూ కంప్యూటర్‌ను ఉపయోగించటంలోని ఆవశ్యకతను రాజీవ్ గాంధీ గుర్తించడమే గాక ఆయన కాలంలోనే ప్రతీరంగం కంప్యూటరీకరణ చేయడంవల్ల లభించే ప్రయోజనాలు తెలియవచ్చింది. రాజీవ్‌గాంధీ టెలికామ్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ రంగాలకు విశేష ప్రోత్సాహన్నందించడంవల్ల మన దేశంలో బెంగుళూరువంటి నగరాలు గొప్ప ఎలక్ట్రానిక్ సిటీలుగా అభివృద్ధి సాధించడానికి వీలుపడింది. రాజీవ్‌గాంధీ అమెరికా నుంచి సూపర్ కంప్యూటర్ కొనుగోలు చేసి వాతావరణ పరిస్థితులు ముందుగా తెలుసుకోవడం సాధ్యంచేశారు. అంతరిక్ష, అణు పరిశోధనా కార్యక్రమాలను రాజీవ్ గాంధీ, ఎంతగానో ప్రోత్సహించి మనదేశం, శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో మంచి పురోగతి సాధించడానికి నాందిపలికాడు.

రాజీవ్ గాంధీ ప్రధానిగా అధికారం చేపట్టిన వెంటనే నూతన విద్యావిధానాన్ని ప్రకటించాడు. దాని లక్ష్యం 21వ శతాబ్దం నాటికి నూరుశాతం అక్షరాస్యత సాధించడం, వృత్తి విద్యా సౌకర్యాలు పెంపొందించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, 'బ్లాక్ బోర్డు ఆపరేషన్' పథకంద్వారా అన్ని విద్యా సంస్థలకు బోధనా సామగ్రి అందించడం, రేడియో, టెలివిజన్ సహాయంతో దూరవిద్యా సౌకర్యాలు పెంపొందించడం మరియు సార్వత్రిక విద్యాలయాల స్థాపన, నూతన విద్యావిధానం అమలునకు మానవవనరుల శాఖ ఏర్పాటు.

మనదేశంలోని మహిళల స్థితిగతులు మెరుగుపర్చడానికి ప్రధాని రాజీవ్ గాంధీ జాతీయ దృక్పథంతో పథకాలను రూపొందించారు. స్త్రీ జనోద్ధరణకై ఒక ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేయగా ఆ సంఘం స్త్రీలకు ప్రతివిభాగంలోను అట్టడుగు స్థాయిలో 50% కేటాయింపు, పంచాయితీ సంస్థలలో 30% రిజర్వేషన్‌ను సూచించింది.

భారతదేశంలో బాధ్యతాయుత పాలన అందించేందుకు రాజీవ్ గాంధీ తీసుకొన్న చర్యలు ప్రశంసనీయం. దానికొరకై రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ బిల్లు ఆమోదానికి తీవ్రమైన కృషిచేశాడు. తదుపరి పి.వి. నరసింహారావు ప్రధానిగా వున్నప్పుడు అది చట్టరూపం ధరించింది. రాజీవ్ గాంధీ ప్రధానిగా క్రింద పేర్కొన్న రెండు ఘనవిజయాలు సాధించాడు. 1) 1985 జులైలో పంజాబు ఒప్పందం 2) 1985 ఆగష్టులో అస్సాం ఒప్పందం. పై ఒప్పందాల ఫలితంగా ఆరాష్ట్రాలలో శాంతి భద్రతల సమస్య పరిష్కారమై రాజీవ్‌గాంధీ గొప్పరాజనీతిజ్ఞునిగా, శాంతిదూతగా కీర్తి సాధించాడు. రాజీవ్ గాంధీ దేశంలో నెలకొనివున్న వర్షాభావ పరిస్థితులకు తగిన చర్యలుగైకొని సమర్థనీయంగా ఎదుర్కొన్నాడు. కాని ఇందిరా గాంధీ హత్యపై దర్యాప్తు సంఘ నివేదిక మరియు ఢిల్లీ శిక్కులపై వూచకోతపై మిశ్రా సంఘ నివేదికపై ఉదాసీన వైఖరి అవలంబించి విమర్శలకు తావిచ్చాడు.

28.8.3 షాబానో ఉదంతం

ప్రధాని రాజీవ్‌గాంధీకి అతని తాతగారైన జవహర్‌లాల్ నెహ్రూ వలె మత వివక్షత లేదు. అయినా మతాభిమానులను, కొన్ని చర్యల ఫలితంగా అవమానపర్చాడు. రాజీవ్‌గాంధీ రెండు విధాలుగా సిక్కులను అవమాన పర్చాడని కొందరి అభిప్రాయం. 1. ఢిల్లీలో సిక్కుల వూచకోతపై మిశ్రా సంఘం నివేదికపై చర్య తీసికోకపోవడం 2. సిక్కులు ఆమోదించిన ఆనంద్ సాహెబ్ తీర్మానాన్ని ఎన్నికల ప్రసంగాలలో తీవ్రంగా దుయ్యబట్టడం.

ఇదేవిధంగా షాబానో వుదంతంలో కూడ రాజీవ్ గాంధీ ద్వంద్వ వైఖరి అవలంబించినట్లుగా విమర్శ. షాబానో అనే ముస్లిం మహిళ భర్త నుంచి విడాకులు తీసికొని భారతీయ శిక్షాస్మృతి ప్రకారం జీవనభృతికై సుప్రీంకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆమెకు భృతి చెల్లించాలని తీర్పు చెప్పింది. ఆతీర్పును రాజీవ్ గాంధీ హర్షించినా తదుపరి ముస్లిం నాయకుల వత్తిడి ఫలితంగా మహమ్మదీయ స్త్రీల విడాకుల చట్టాన్ని ఆమోదించి భారతీయ శిక్షాస్మృతి 125, 127 సెక్షన్లు సవరించబడ్డాయి. ఈ సవరణల ప్రకారం ఇస్లాం మతానికి చెందిన భార్యా భర్తలు యిద్దరు అంగీకరిస్తేనే భారతీయ శిక్షాస్మృతి అమలు జరుగుతుంది. లేని ఎడల మహమ్మదీయ వ్యక్తిగత చట్టం వర్తిస్తుంది. క్లుప్తంగా ఇస్లాం వ్యక్తిగత చట్టం ప్రకారం ముస్లిం మహిళకు భర్తనుంచి జీవనభృతి కోరే హక్కుండదు. ప్రారంభంలో న్యాయస్థాన తీర్పును, తదుపరి ముస్లిం నాయకుల వత్తిడి ఫలితంగా ప్రధాని రాజీవ్‌గాంధీ ముస్లిం మహిళల చట్టం ఆమోదించి, విమర్శలకు తావివ్వడం జరిగిందని విశ్లేషకుల అభిప్రాయం.

28.8.4 అయోధ్య - శిలాన్యాసం

షాబానో వుదంతంలో ముస్లిం ఛాందసవాదులు విజయాలు సాధించడంతో, హిందు ఛాందస నాయకులకు ఊపునిచ్చింది. వారిని సంతృప్తి పరిచేందుకు, చాలాకాలంగా మూసి వుంచిన అయోధ్యలోని రామాలయాన్ని తెరవడం మంచిదని సలహాదార్లు ప్రధాని రాజీవ్‌గాంధీకి నచ్చ చెప్పారు. ముస్లిం మహిళల చట్టానికి బదులుగా రామాలయాన్ని తెరచి, హిందు నాయకులను సంతృప్తిపరచాలని కొందరు సలహా యిచ్చినట్లుగా కొందరి అభిప్రాయం. న్యాయస్థానం తాత్కాలిక ఉ ర్వులు ఆధారం చేసికొని, అయోధ్యలోని రామాలయం తెరవబడింది. ఇది ఉత్సాహపూరితులైన విశ్వహిందూ పరిషత్తు నాయకులు వివాదాస్పద స్థలంలో రామాలయ నిర్మాణానికి చర్యలు తీసికొనేందుకు ప్రోత్సాహమిచ్చింది. విశ్వహిందు పరిషత్ కార్యకర్తలు లక్షాయాభైవేల ఇటుకలు వివాదాస్పద స్థలంలో ప్రోగు పెట్టడమే గాక 1986 సంవత్సరం నవంబరు 9వ తేదీన రామాలయ నిర్మాణానికి శిలాన్యాసం జరిగింది. రాజీవ్‌గాంధీ తన ఎన్నికల ప్రచారం అయోధ్యనుంచే ప్రారంభించి రామరాజ్యాన్ని స్థాపిస్తానని ప్రకటించడం విశేషం. రాజీవ్‌గాంధీ రామాలయ ద్వారాలు తెరిచేందుకు అనుమతించి శిలాన్యాసానికి దోహదం చేసి 1992 సంవత్సరంలో బాబ్రీ మసీదు విధ్వంసానికి కారకుడయ్యాడని రాజకీయ విశ్లేషకుల వాదం.

28.8.5 పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం, 1985

ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రారంభంలోనే, ప్రజలకు పరిశుద్ధ పాలన అందిస్తానని అభయమిచ్చాడు. రాజకీయ రంగంలో నెలకొని వున్న అవినీతిని నిర్మూలించేందుకు, నీతి బాహ్యమైన పార్టీ ఫిరాయింపులు నిరోధించి, సుస్థిర ప్రభుత్వం అందించేందుకు భారత రాజ్యాంగానికి సవరణ ఆమోదింపజేసాడు. దాని ఫలితంగా, 1985 సంవత్సరం జనవరి నుంచి పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం అమలులోనికి వచ్చింది. ఒక పార్టీనుంచి 1/3 వంతు సభ్యులు మరో పార్టీకి మారితే అది చెల్లుబాటు ఔతుంది. చట్టం విధించిన షరతులకు భిన్నంగా పార్టీలు మారిన శాసన సభ్యులు / పార్లమెంటు సభ్యులు అనర్హత వేటునకు గురయ్యే ఏర్పాటు ఈ చట్టంలో పొందు పరచబడింది. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం అమలుతో ఆ చట్టంలో వున్న లోపాలన్నీ బహిర్గత మయ్యాయి.

న్యాయం, ఖర్చుతో కూడినదైనందున పేదవారికి న్యాయం అందుబాటులో వుంచే లక్ష్యంతో ప్రధాని రాజీవ్‌గాంధీ, "లోక్ అదాలత్‌లు" ఏర్పాటు చేయడమేగాక, పేదవారికి వుచిత న్యాయ సహాయం అందించే ఏర్పాటు చేసినాడు. సత్వరన్యాయం పేద ప్రజలకు అందుబాటులో వుండాలని రాజీవ్ గాంధీ అభిలషించాడు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే ప్రజా సంక్షేమాన్ని పరిరక్షించే ఉద్దేశ్యంతో 'వినియోగదారుల రక్షణ చట్టం' (Consumer Protection Act) ఆమోదింపజేసి వినియోగదారులు దోపిడీనుంచి రక్షించేందుకు వినియోగదారుల న్యాయస్థానాలు కూడ నెలకొల్పబడ్డాయి.

BRAOU

28.8.6 బోఫోర్సు కుంభకోణం

రాజీవ్‌గాంధీ నాయకత్వంలోగల కాంగ్రెసు ప్రభుత్వం అనేక కుంభకోణాల పరంపరలను ఎదుర్కోవలసి వచ్చింది. వీటిలో ముఖ్యమైంది బోఫోర్సు కుంభకోణం. స్వీడన్ దేశానికి చెందిన బోఫోర్సు కంపెనీ నుంచి హౌవిట్జర్ తుపాకులు కొనుగోలు చేయడం జరిగింది. ఈ కొనుగోలులో దాదాపు 67 కోట్ల రూపాయలు చేతులు మారాయని దానిలో విన్‌చద్దా మరియు హిందుజా సోదరులు ప్రముఖ పాత్ర వహించారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. పార్లమెంటులో మంచి అధిక్యత వున్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను సమర్థనీయంగా త్రిప్పికొట్టలేక పోయింది.

28.8.7 9వ లోక్‌సభ ఎన్నికలు, 1989

తన పథకాలకు ప్రజామోదాన్ని సాధించే లక్ష్యంతో ప్రధాని రాజీవ్‌గాంధీ 1989 సంవత్సరంలో లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించాడు. 1989 సంవత్సర ఎన్నికల ఫలితాలు దాదాపు 1977 ఎన్నికల ఫలితాల వలె పునరావృతమయ్యాయి. ప్రధాని రాజీవ్‌గాంధీ యొక్క స్వాప్నిక పథకాలతో తృప్తిపడని ప్రజలు కాంగ్రెసు పార్టీ ఓటమికి కారకులయ్యారని రాజకీయ పండితుల అభిప్రాయం. లోక్‌సభలో కాంగ్రెసు పార్టీ ఆధిక్యతను సాధించడంలో విఫలమైనందున, వి.పి.సింగ్ నాయకత్వంలో జనతాదళ్ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంకీర్ణ ప్రభుత్వం కూడ ఎక్కువ కాలం కొనసాగలేదు. మండల్ కమిషన్ నివేదిక ఫలితంగా వ్యతిరేకోద్యమం ఉధృత స్వరూపం ధరించడంతో వి.పి.సింగ్ నాయకత్వంలోని జనతాదళ్ ప్రభుత్వం పతనమైనందున మధ్యంతర ఎన్నికలకు దారితీసాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ఏమంటే రాజీవ్‌గాంధీ మానవ బాంబు ప్రయోగం ద్వారా 1992 సం॥లో హత్యకు గురి కానట్లయితే, 1991/92 సం॥లలో నిర్వహించబడిన మధ్యంతర ఎన్నికలలో రాజీవ్‌గాంధీ విజయం సాధించి తిరిగి అధికారాన్ని చేపట్టి తన కలలకు వాస్తవరూపం కల్పించేందుకు ప్రయత్నంచేసివుండేవారు.

28.9 సంగ్రహంగా

ఈ పాఠ్యాంశంలో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశ సుస్థిరతకు, ఆర్థిక పురోభివృద్ధికి చేపట్టిన పథకాలు, తదుపరి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఇండో-పాక్ యుద్ధంలో ఘనవిజయం సాధించడం, ఆ తర్వాత ప్రధానమంత్రి అయిన ఇందిరాగాంధీ చేపట్టిన సంచలన విధాన నిర్ణయాలు, ఇండో-పాక్ యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావం అత్యయిక పాలన దాని దుష్పరిణామాలు మధ్యలో జనతా పాలన, సంకీర్ణ ప్రభుత్వాలు విఫలం, చివరగా ప్రధాని రాజీవ్‌గాంధీ సుస్థిర, పటిష్ఠ, 21వ శతాబ్దపు భారతదేశ నిర్మాణానికి చేపట్టిన పథకాలు గురించిన విషయాలను చర్చించటమైంది.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. సిమ్లా ఒప్పంద షరతులేమిటి?

.....

.....

.....

.....

2. షాబానో కేసుపై సుప్రీం కోర్టు తీర్పు ఏమిటి?

.....

.....

.....

.....

BRAOU

3. బోఫోర్స్ కుంభకోణం అంటే ఏమిటి?

.....

.....

.....

.....

28.10 మీ అవగాహన పరీక్షించుకోండి : జవాబులు

I. 1. ప్రపంచంలో నెలకొనిఉన్న ఏ సైనిక కూటమితోను పొత్తు లేకుండా, స్వతంత్రంగా అంతర్జాతీయ సహకారం, ప్రపంచ శాంతి స్థాపనకు కృషిచేయడం.

2. రాష్ట్రాల పునర్వవస్థీకరణ చట్టం క్రీ.శ. 1956లో అమలు లోకి వచ్చింది.

3. భారత, పాకిస్థాన్‌లు తమ మధ్యగల వివాదాలు బలప్రయోగం ద్వారా కాకుండా, శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించడానికి అంగీకరించటం.

II. 1. a) రెండు దేశాలు తమ మధ్యగల విభేదాలు బలప్రయోగం ద్వారా కాకుండా, శాంతియుతమైన చర్చలద్వారా పరిష్కరించుకోవటం.

b) ఇరుదేశాలు 1949 సంవత్సరపు యుద్ధ విరమణ రేఖను, కాశ్మీర్‌లో కొత్త నియంత్రణ రేఖ (Line of Control) గా అంగీకరించటం

2. షాబానోకు సుప్రీంకోర్టు C.P.C 125 సెక్షను ప్రకారం భర్త, జీవన భృతి ఇవ్వాలని నిర్ణయించింది.

3. స్వీడన్ దేశానికి చెందిన బోఫోర్స్ కంపెనీ నుంచి హౌవిట్జర్ తుపాకులు కొనుగోలు చేయడాన్ని బోఫోర్స్ కుంభకోణం అంటారు.

28.11 పరీక్షా నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి**

1. 1952 - 1962 సంగల మధ్య నిర్వహించబడిన లోక్‌సభ ఎన్నికల ప్రాముఖ్యత వివరించండి.
2. అత్యయిక పాలన విధించడానికి దారితీసిన కారణాలను, దాని దుష్పరిణామాలను గురించి వ్రాయండి.
3. పేదరిక నిర్మూలనకు, రాజీవ్ గాంధీ చేపట్టిన పథకాలను విశ్లేషించండి

II. **ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి**

1. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ, 1956
2. 1977 ఎన్నికల ప్రాముఖ్యత
3. బోఫోర్సు కుంభకోణం.

28.12 ఉపయుక్త గ్రంథాలు

1. Aditya Agarwal : *Rajiv Gandhi a profile*
2. Calapati Rao. M : *Jawaharlal Nehru*
3. Dan Moraes : *Mrs Gandhi*
4. Gill, S.S : *The Dynasty*
5. Hodda S. Slaugton : *Indira Gandhi*
6. Michael Edward : *Nehru*
7. Srivastava, C.P. : *Lal Bahadur Shastri*

BRAOU

భాగం - 29 : ప్రణాళిక రచన, ఆర్థికాభివృద్ధి - 1950-89

విషయక్రమం

29.0 లక్ష్యాలు
29.1 పరిచయం
29.2 అభివృద్ధి వ్యూహాలు - ప్రణాళిక
29.3 భారత ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, పనితీరు
29.3.1 1951-1956 మధ్యదశ
29.3.2 1966-1974 మధ్య దశ
29.3.3 1974-1989 మధ్యదశ
29.4 వ్యవసాయం
29.5 పరిశ్రమలు
29.5.1 పారిశ్రామిక విధానాలు
29.5.2 1950-1989 మధ్య కాలంలో పారిశ్రామిక రంగం
29.6 విదేశీ వాణిజ్యం
29.7 పేదరికం
29.8 ఉద్యోగం, నిరుద్యోగం
29.9 ద్రవ్య సంక్షోభం
29.10 అభివృద్ధి-ఆర్థికవ్యవస్థ
29.11 సంగ్రహంగా
29.12 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు
29.13 పరీక్ష నమూనా ప్రశ్నలు
29.14 ఉపయుక్త గ్రంథాలు

29.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడం వల్ల ఈ క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

1. భారతదేశంలో ప్రణాళికా వ్యూహం.
2. భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్య రంగాల్లో అభివృద్ధి
3. భారతదేశంలో పేదరికం, నిరుద్యోగం, ద్రవ్య సంక్షోభం.

29.1 పరిచయం

రెండువందల సంవత్సరాల వలస పాలనవల్ల భారతదేశం 1947లో స్వాతంత్ర్యం పొందేనాటికి అక్షరాలా వెనకబడ్డ దేశంగానే వుంది. రెండు వందల యేళ్ల వలస పాలన దోపిడీవల్ల ఆర్థిక వ్యవస్థ దిగజారింది. బయటి ప్రపంచం మీద తిండిగింజలకోసం, వస్తువులకోసం, పారిశ్రామిక పెట్టుబడికోసం ఆధారపడవలసిన స్థితిలో వుంది. వ్యవసాయం క్షీణించింది. ఇక సాంకేతికపరంగా కాక సంప్రదాయ పద్ధతులే వుండేవి. తరచూ కరువులు, క్షామాలు దాంతో ప్రజలకు అవసరమైన తిండిగింజలు ఉత్పత్తి అయ్యేవికావు. పారిశ్రామికీకరణవల్ల నేత పరిశ్రమ నాశనం అయిపోయింది. లక్షలాది నేతపనివాళ్ల నోటిదగ్గర కూడు తన్నుకుపోయింది. వాళ్లు నిరుద్యోగులయ్యారు. ఇంగ్లీషు కార్ఖానాలకీ, సంస్థలకీ లాభాలు మూటలు కట్టియిచ్చే విధానాలనే బ్రిటీష్‌వారు మినహాయింపులు లేకుండా అనుసరించేవారు. దాంతో భారతీయ పరిశ్రమ ముళ్ళకంచెల్లో పడిపోయింది. బ్రిటీష్‌వాళ్ళ విధానాలవల్ల భారతదేశం మౌలిక సరకుల ఎగుమతిదేశంగా మారింది. ఉత్పత్తి చేసిన సరకులను ఎగుమతిచేసే శక్తి - ఉదాహరణకు జౌళి ఎగుమతులు ఉడిగిపోయింది. దాంతో 20వ శతాబ్దం అడుగుపెట్టే నాటికి, ఆర్థిక వ్యవస్థ

BRAOU

నామమాత్రంగా మిగిలింది. రాయల్టీల ద్వారా దేశం నుంచి బయటకు పోయిన సొమ్మే సాలుకు స్థూల జాతీయోత్పత్తిలో 4 శాతం దాకా వుండేది అని ఒక అంచనా. దాదాభాయ్ నౌరోజీ అంచనా ప్రకారం, ఆయన ద్రవ్య వలస సిద్ధాంత ప్రముఖ ప్రతిపాదకుడు. అది 1920లో బ్రిటన్ తలసరి ఆదాయంలో 6.7 శాతం అని. జాతీయాదాయ పెరుగుదల వొట్టి 0.5 శాతం మాత్రమే ఆకాలంలో, అంటే 1900-1949 యాభైయేళ్ల కాలంలో, వుండేది. ఉత్పత్తి విభాగంలో ఉద్యోగాలు 1875 నాటి 130 మిలియన్ల నుంచి 1895 నాటికి 17 మిలియన్లకు పడిపోయాయి. వాణిజ్యంలో వున్న ప్రతికూల నియమాలవల్ల పెరుగుదలకీ, సంచయనానికీ వుండవలసిన సత్తా అణగారి పోయింది. సూక్ష్మంగా చెప్పాలంటే, స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశానికి గిడసబారిన, వృద్ధిలేని ఆర్థిక వ్యవస్థ వారసత్వంగా సంక్రమించింది. లక్షలాది జనాలకు తిండి సమకూర్చవలసిన సమస్య, ఆధునిక పరిశ్రమను నిర్మించుకోవాల్సిన సమస్య, సమాజాన్ని ఆధునికం చెయ్యవలసిన సమస్య పెనుభూతాల్లా యెదురునుంచున్నాయి.

స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుంచి భారతదేశం చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించింది. ప్రణాళిక వ్యూహాన్ని, మిశ్రమ ఆర్థిక పంథాన్ని యెంచుకుంది. మూడు దశాబ్దాలు ఆపంథా వుంది. ఫలితాలూ మిశ్రమంగానే వున్నాయని చెప్పవచ్చు. గత అర్ధ శతాబ్దితో పోల్చిచూస్తే, కచ్చితంగా అభివృద్ధి చెందిందనే చెప్పవచ్చు. అయితే అభివృద్ధి చెందిన అనేక యితర దేశాలతో పోల్చి చూస్తే, యిక్కడి పెరుగుదల తక్కువగానే వుందని చెప్పాలి. ఈభాగంలో 1950 - 89 మధ్యకాలంలో భారత ఆర్థికాభివృద్ధి గురించిన చర్చ ఉంది. ఇది రెండు విభాగాలుగా వుంటుంది. మొదటి విభాగంలో వ్యవసాయంలో, పరిశ్రమలలో, విదేశీవాణిజ్యంలో, పేదరిక నిర్మూలనలో ప్రణాళికలు, ఉద్యోగావకాశాలు, నిరుద్యోగం వుంటాయి. రెండవ విభాగంలో అభివృద్ధికి సంబంధించిన ఆర్థిక వ్యవస్థ చర్చవుంటుంది.

29.2 అభివృద్ధి వ్యూహాలు; ప్రణాళికలు

భారతదేశం స్వాతంత్ర్యం పొందేనాటికి "ప్రణాళిక" అనేది బావుటా యెగరేస్తుంది. పేద వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను, ఆధునిక పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థగా శీఘ్రగతిలో మార్చడానికి చాలా సమర్థవంతమైన పరికరంగా ప్రణాళికను పరిగణించేవారు. ప్రణాళిక ఒక అభివృద్ధి సాధనం. దీని ద్వారా ఆర్థిక స్వరూపాన్ని అమలు తీరునీ రూపొందించుకోవచ్చు. వ్యవసాయం విదేశీ వాణిజ్య పరిశ్రమ, మౌలిక సదుపాయాలు లాంటి ఆర్థిక విభాగాల్లోనూ, సాంఘిక విభాగాల్లోనూ మదుపు, ప్రతిచర్యలకు సంబంధించి సమాచారాన్ని పోగుచేసే భారీ గణాంక ప్రయోగం యిది. పెట్టుబడి ఉత్పత్తి నిష్పత్తుల్ని బట్టి మదుపుల్ని పెరుగుదల అంచనాలకు అనుగుణంగా కేటాయిస్తారు. మదుపు లక్ష్యాలని, ఆయా మంత్రిత్వ శాఖలకు అమలు కోసం పంపిస్తారు. పూర్వపు సోవియట్ యూనియన్‌లోనూ, తూర్పు యూరప్ దేశాల్లోనూ ప్రణాళికలు విజయవంతంగా అమలు జరిగేవి. అందుచేత ప్రణాళికలు అనేక వలసానంతర దేశాలలో ఆదర్శంగా వుండడమే కాదు, అభివృద్ధి చెందిన ఫ్రాన్స్, స్వీడన్ లాంటి దేశాలూ అమసరించాయి. భారతదేశంలో జవహర్‌లాల్ నెహ్రూ, 1938 నుంచీ కాంగ్రెస్‌ని ప్రభావితం చేస్తూ, జాతీయ ప్రణాళికా మండలిని (ఎన్.పి.సి) యేర్పాటు చేశాడు. అందులో నెహ్రూతోపాటు ప్రముఖ పారిశ్రామిక వేత్తలు - పురుషోత్తమ దాస్ ఠాకూర్ దాస్, వాల్ చంద్ హీరా చంద్, ఎ.డి.శ్రాఫ్, అంబాలా సారాభాయ్ లాంటివాళ్ళు - యిద్దరు ఆర్థిక వేత్తలు కె.టి.షా, రాధాకమల్ ముఖర్జీ, విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లు, సామ్యవాద భావాలున్న కె.సి. కుమరప్ప ఎన్.ఎమ్.జోషి లాంటి రాజకీయ నాయకులు, నెహ్రూ వున్నారు. కీలక పరిశ్రమలు, సేవలు, ఖనిజ వనరులు, రైల్వేలు, నీటిపారుదల, నౌకా పరిశ్రమల్లాంటివన్నీ ప్రభుత్వ యాజమాన్యంలోనే వుండాలని ఆ కమిటీ నిర్ణయించింది. పదేళ్లలో జీవన ప్రమాణం రెండింతలు (జాతీయాదాయ అభివృద్ధి స్థాయి సాలీనా 10 శాతం వృద్ధి) అవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్లానింగ్ కమిషన్ తయారు చేసిన ప్రణాళికతోపాటు యితర ప్రణాళికలూ వున్నాయి. ఎమ్.ఎన్. రాయ్ నాయకత్వాన కమ్యూనిస్టులు తయారుచేసిన "ప్రజల ప్రణాళిక" శ్రీమన్నారాయణ తయారు చేసిన గాంధేయ ప్రణాళిక లాంటివి, ప్రణాళికారహిత "స్వేచ్ఛా విపణి" (Free Market) లక్షించే పెట్టుబడిదారీ పంథా కూడా వుంది. అందులో మార్కెట్ శక్తులే సమాజ అవసరాలను చూసుకుంటాయి.

BRAOU

అభివృద్ధి క్రమం వేగవంతం చేసేటట్టు ప్రభుత్వానికి కేంద్రపాత్రని యిస్తూ ప్రణాళికా వ్యూహానికే ప్రజాభిప్రాయమూ మొగ్గుచూపింది. ఉత్పాదకత పెరగడానికీ, నిజవేతనాలను పెంచడానికి కీలకం, పెట్టుబడి ఏర్పాటు స్థాయి పెంచడంలోనే వుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. (పెట్టుబడి ఏర్పాటు లేదా పెట్టుబడి సంచయనం అంటే పెట్టుబడి నిలవ పెరగడం. అంటే ఉత్పాదక సరంజామా - అవి యంత్రాలు కావచ్చు, పరికరాలు కావచ్చు, సాధనాలు కావచ్చు, పంటలుపండే నేలకావచ్చు, ఫ్యాక్టరీలు, ఇంజన్లు, రవాణ, నీటిపారుదల వగైరాలన్నీ కావచ్చు). ప్రభుత్వం మాత్రమే అవసరమైన స్థాయిలో పాదుపు పెంచగలదని, దాన్ని ఉత్పాదక మదుపుగా మలచగలదనీ భావించారు. ఇక ఆఖరిగా రాజ్యాంగంలో పొందుపరచిన సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అన్ని రంగాల వారికీ అందచెయ్యాలన్న లక్ష్యాన్ని సాధించడానికి, ప్రభుత్వ జోక్యం విధాయకం అవుతుంది. అందరికీ జీవనాధారం కల్పించడం, సంపద, ఉత్పత్తి కేంద్రీకృతమవడాన్ని నిరోధించడం, ప్రాంతీయ అభివృద్ధి సమతూకంగా వుండేటట్టు చూడడం, ఆదేశక సూత్రాలలో వున్నాయి. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వ జోక్యం విధాయకం, దేశంలో రాజకీయ ఆర్థిక యధాతథ స్థితిని కాపాడడానికి మిశ్రమ ఆర్థిక వ్యవస్థ వ్యూహాన్ని అనుసరించాలని నిర్ణయించారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు పక్క పక్కనే మనుగడ సాగిస్తాయి. పరస్పర ప్రయోజనకరంగా పని చేసుకుంటాయి. ఇది ప్రణాళిక మొత్తం చరిత్రలో సాగుతుంది. ఇందులో ప్రజాస్వామ్యమనే స్వభావం అర్ధఫెడరల్ రూపంతో, ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థతో సాగుతుంది. ఈదేశ మహత్తర ఆర్థిక శిల్పి ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్, తొలి ప్రణాళిక మండలి అధ్యక్షులుగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆశీస్సులతో మొదటి రెండు దశాబ్దాల్లోనూ విధాన రూపకల్పనలో సూత్రధారి అయ్యాడు. (క్రమ పద్ధతిలో అనేక ఆర్థిక విషయాలకు సంబంధించిన గణాంకాలను సేకరించి, కూర్చి, ప్రచురించడానికి యావత్ భారతదేశ స్థాయిలో కేంద్ర గణాంక వ్యవస్థను యేర్పాటు చేశారు. ప్రణాళికకు దోహద పడుతుంది ఇది). ప్లానింగ్ కమిషన్‌కి రాజ్యాంగ హోదా కలిగించారు. పార్లమెంట్ చట్టం చేసింది. రాజ్యాంగ హోదా వచ్చినా, ప్రధాన బలహీనతగా మిగిలిపోయింది. ప్రణాళికను అమలు జరిపించే అధికారం యేదీ లేకపోవడమే.

భారత ప్రణాళికల దీర్ఘకాలిక లక్ష్యాలు శీఘ్ర వృద్ధి, పూర్తి ఉద్యోగం, ఆధునికీకరణ, స్వావలంబన, సాంఘిక న్యాయం. తక్కువ తలసరి ఆదాయం, అధిక సంఖ్యాకులు తక్కువ జీవన ప్రమాణంతో బతకడం, జాతీయ ఆదాయాన్ని పెంచడం అయితే, ప్రణాళిక రచన చేసినవాళ్లు పెరుగుదల వ్యూహానికి సంబంధించి ఒక్క నమూనానే అనుసరించలేదు. నాలుగు దశాబ్దాల్లోనూ కూడా మొదటి ప్రణాళిక అన్ని రకాల అభివృద్ధినీ కాంక్షించింది. పి.సి. మహలనోబిస్ పర్యవేక్షణలో రెండవ ప్రణాళిక భారీ పరిశ్రమల వ్యూహాన్ని అనుసరించింది. అదే వ్యూహాన్ని తృతీయ ప్రణాళికలోనూ అనుసరించారు. అయితే నాల్గవ ప్రణాళిక నుంచి మార్పులు ప్రవేశించాయి. ఒకటి, అన్ని విభాగాల అభివృద్ధి (అంటే వ్యవసాయం, పరిశ్రమలు కూడా) మరింత ఉదార, అభ్యుదయ, ఉమ్మడి పారిశ్రామిక, వాణిజ్య రంగం పెరుగుదలని ఉద్దేశించారు. సాలీనా అయిదు శాతం పెరుగుదల వుంటే అది పెరుగుదలకి సంబంధించీ నిరుద్యోగానికి సంబంధించీ పేదరికానికి సంబంధించీ మొత్తం జీవన ప్రమాణానికి సంబంధించీ చూసుకుంటుందన్న భావన వుండేది. నాలుగుశాతం పెట్టుబడి ఉత్పాదకత వుంటే దానికి సాలీనా 20 శాతం మదుపు (పాదుపుకూడా) అవసరం. మిగిలిన లక్ష్యాలతోబాటుగా, సాంకేతిక ఆధునికీకరణతోబాటు టెన్యూరియల్ పద్ధతి, వ్యవసాయ నిర్మాణం, ప్రైవేట్ వ్యాపారానికి వ్యవస్థ నిర్మాణంలాంటి వాటన్నిటి ఆధునికీకరణనీ దృష్టిలో వుంచుకున్నారు. స్వావలంబన కూడా విధాయకం, అంటే క్రమేపీ విదేశీ సాయం మీద ఆధారం తగ్గింపు, తొలగింపు వుండాలని, అలాగే విదేశీ పెట్టుబడి, కీలక వస్తువుల దిగుమతి కూడా తొలగాలి.

29.3 భారత ఆర్థిక వ్యవస్థ : అభివృద్ధి, పనితీరు

భారత ఆర్థిక వ్యవస్థ పనితీరును మూడు దశలుగా విభజించవచ్చు. అంటే 1951 నుంచి 1966 వరకు, 1966 నుంచి 1973 వరకు, 1973 నుంచి 1989 వరకు ఆ విధానాలనీ, ధోరణుల్లో మార్పుల్నీ దృష్టిలో వుంచుకుని యీ పరిశీలన సాగాలి.

29.3.1 · 1951-1966 మధ్యదశ

ఈదశలో సాధించిన జాతీయ ఆదాయ పెరుగుదల చెప్పుకోదగ్గంతలేదు. మొదటి మూడు పంచవర్ష ప్రణాళికల 15 యేళ్ల కాలంలోనూ, స్థూల జాతీయోత్పత్తి సాలీనా 3.5 శాతం మాత్రమే పెరిగింది. అయితే ప్రణాళిక లక్ష్యం 5.4 శాతంగా వుండింది. దీనికి కారణం, వ్యవసాయ, పారిశ్రామిక పెరుగుదల నిష్పత్తి వెనకబడడం. అయితే, సాగు నీటిపారుదల కిందవున్న నేలని విస్తరింప చెయ్యడం విషయంలో ప్రణాళికలు విజయవంతం అయ్యాయి. అలాగే మధ్య దళారుల్ని తొలగించడంలో, పరోక్ష భూస్వామ్య యజమానుల్ని తప్పించడంలో, కొంతమందికి, కౌలుదార్లకు భూమిని యివ్వడంలో ప్రణాళికలు నెగ్గాయి. అదేరకంగా పరిశ్రమల్లో, మౌలిక రంగాల్లో, అంటే ఇనుము, ఉక్కు, సిమెంట్, రసాయనాలు యంత్రపరికరాలు, రవాణా, సమాచార ప్రసారంలాంటి రంగాల్లో మరింత విస్తృత సామర్థ్యం వున్న వైవిధ్య భరిత పారిశ్రామిక పునాదిని స్థాపించారు.

అయితే మూడవ ప్రణాళిక కాలంలో ఆర్థిక వ్యవస్థను కుదిపించివేసే సంఘటనలు జరిగాయి. 1960లలో ఒకపక్క వర్షాభావ పరిస్థితులు, చైనా పాకిస్తాన్‌లతో యుద్ధంవల్ల అనుకోని విధంగా రక్షణ వ్యయం పెరగడం, విదేశీ సహాయాన్ని సమతుల్యం చేసేశాయి. ఉత్పాదక ప్రభుత్వ మదుపుల్ని 1962-65 కాలంలో పక్కకి మళ్లించడంతో, ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుంటుపడుతూ దెబ్బతింది. స్వల్ప కాలిక సర్దుబాట్లకు అంతర్జాతీయ ద్రవ్యనిధిని అప్పడగ వలసిన పరిస్థితి ఏర్పడింది, చెల్లింపుల్లో సంక్షోభం తలెత్తింది. ప్రపంచబ్యాంకు రూపాయి విలువను తగ్గించాలన్న షరతును విధించింది. ఏమైనా 1966లో రూపాయి విలువ తగ్గింపువల్ల కూడా ఎగుమతుల పెరుగుదల లక్ష్యాన్ని సాధించలేకపోయింది. భారీ ద్రవ్యోల్బణం మాత్రం దిగుమతుల ఖర్చులవల్ల పెరిగింది. ప్రణాళికను తాత్కాలికంగా రద్దుచేశారు. వ్యూహంలో మార్పులకు సంబంధించి లోతుగా ఆలోచించేందుకు 1966 నుంచి మూడేళ్ల పాటు ప్రణాళికను పక్కన పెట్టారు. భారీ పరిశ్రమ రంగంతో పోలిస్తే వ్యవసాయంలో తగినంత శ్రద్ధ పెట్టలేదు. బహుశా అది అమెరికా పి.ఎల్. 480 పథకం కింద ఓమాదిరిగా అనుకూల ఆహార సహాయం అందడంవల్ల అయి వుండొచ్చు. ఆపథకం భారతదేశం రష్యాతో సన్నిహిత సంబంధాలు క్షీణించడంవల్ల వచ్చింది. ప్రణాళికా విరామం రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ నాయకత్వ మార్పులు జరగడంతో సమసించింది 1969లో కాంగ్రెస్ పార్టీ చీలిపోయింది. దాంతో ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక పయనం అన్న నెహ్రూ అంగీకార భావన (Consensus) ముక్కలైంది. బెంగాల్‌లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ పెరుగుతున్న అసమ్మతి నిరసనలు ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా పరిణమించాయి. నత్తనడక అభివృద్ధివల్ల పైకిలేచిన అసంతృప్తి, పెరిగే దారిద్ర్యం, ప్రజాబాహుళ్య దైన్యం, నిరుద్యోగం చాలా అసంతృప్తికి కారణం అయ్యాయి. ఆదాయం పెరుగుదల సాధారణంగా వున్నా చిన్న చిన్న తుంపర్లు కిందికి దిగినంత మాత్రాన పేదరికం తొలగుతుందా అన్న భావం విస్తరించింది. కాంగ్రెస్ పార్టీలో వామపక్ష భావాల మొగ్గు ఉన్న చాలామంది నాయకులు పేదరికం మీద ప్రత్యక్ష పోరాటం జరిగేటట్టు, పేదరిక వ్యతిరేక కార్యక్రమాల రూపంలో విధానపరమైన మార్పులు వుండాలని కాంక్షించారు.

29.3.2 1966-74 మధ్య దశ

తక్షణం దృష్టి పెట్టవలసిన అంశాలుగా రెండు కనిపించాయి. మొదటిది వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సమతూక అభివృద్ధి. రెండవది ఎగుమతులని వృద్ధి చెయ్యడంద్వారా విదేశీ మారక పరిస్థితిని మెరుగుపరచుకోవడం. దాంతో చాలా కాలంగా ఉపేక్షించిన వ్యవసాయరంగం ఊపు అందుకునే దృష్టి పెట్టారు. నీటి పారుదల సౌకర్యాలను, వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించేందుకు భారీ కేటాయింపులు జరిగాయి. దిగుమతుల మీద ఆధార పడడం తగ్గించుకుని, స్వావలంబన ద్వారా పెరుగుదల సాధించడం అన్న అంశాన్ని ప్రణాళికలో పొందుపరిచారు. ఈ దశలో అంతకు ముందెన్నడూ జరగని ప్రముఖ చర్య 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చెయ్యడం. బ్యాంకు నిధుల్ని గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ వనరులుగా మళ్లించడానికి యిది గొప్ప ముందడుగు.

BRAOU

ఏమైనప్పటికీ, స్థూల జాతీయాదాయ లక్ష్యాల పెంపుదల తప్పించి వ్యూహంలో మౌలికమైన మార్పేదీ నాల్గవ ప్రణాళికలో జరగలేదు. వనరుల పరిమితి సమస్య సమర్థవంతంగా పరిష్కారం కాలేదు. ప్రముఖ బ్రిటీష్ ఆర్థికవేత్త నికలస్ కాల్డర్ సూచించిన వ్యవసాయంపై పన్ను సూచనకు వ్యవసాయరంగం గండి కొట్టింది. విదేశీ వనరుల నిర్బంధం ఆర్థికరంగాన్ని ప్రభావితం చేస్తూనేవుంది. ఆర్థిక వ్యవస్థ మెరుగుతీరు నాల్గవ ప్రణాళిక యేమీ ముందుకు సాగలేదు. స్థూలజాతీయ ఉత్పత్తి 5.5 శాతం బదులుగా 3.5 మాత్రమే వుంది. దీన్ని "హిందూ పెరుగుదల నిష్పత్తి" అని వ్యంగ్యంగా అన్నారు. నిజానికి కొన్ని ముఖ్య సూచికలు స్థిరపెట్టుబడి రూపొందడం ప్రైవేట్, ప్రభుత్వ నిజమైన మదుపులు కొట్టవచ్చినట్టు తగ్గిపోయేవి. బంగ్లాదేశ్ యుద్ధంవల్ల రక్షణ వ్యయం ఉత్పాదక పెట్టుబడిని పక్కన పెట్టేసినట్టు అయింది. ఊరటకలిగించిన అంశం వ్యవసాయం మెరుగుపడడం. దీర్ఘకాలంగా యెదురుచూస్తూ వున్న స్వావలంబన వ్యవసాయంలో హరిత విప్లవంవల్ల కనిపించింది. కరెంట్ ఎక్సేంజ్ లోటును కొంతమేరకు తగ్గించడంలో విదేశీ పరాధీనతను పాదుపు చెయ్యడంవల్ల సాధ్యపడింది.

29.3.3 1974-89 మధ్యదశ

1975లో మొదటి చమురు అంతర్జాతీయ సంక్షోభ సమయంలో ఐదవ ప్రణాళిక మొదలైంది. ఓపెక్ (OPEC) దేశాలు తమంతట తాముగా ముడిచమురు ధరలు పెంచేశారు. దాదాపు అన్ని దేశాలూ ఆ తాకిడికి గురయ్యాయి. దాంతో దేశీయ ద్రవ్యోల్బణం స్థాయి అంతకు ముందెన్నడూ లేనంతగా 25 శాతం పెరిగింది. చెల్లింపుల సమతూకం సమస్య వచ్చి పడింది. మరోపక్క, వ్యవసాయరంగంలో అస్థిరత్వం, వ్యాపారులు విస్తారంగా చీకటి బజారుకు పాల్పడ్డం, రాజకీయంగా కల్లోలం లాంటివన్నీ భారత ఆర్థిక వ్యవస్థకు పెను సవాళ్లుగా పరిణమించాయి. అయితే అధికార యంత్రాంగం సరైన చర్యలు తీసుకోవడంవల్ల 1970ల మధ్యకాలంనాటికి ఆర్థిక వ్యవస్థ కుదుట పడింది. బ్లాక్ మార్కెటర్ల మీద కఠిన చర్యలు తీసుకోవడంవల్ల, గట్టి ద్రవ్య విధానంవల్ల, ఆహారధాన్యాల ఉత్పత్తి మెరుగవడంవల్ల ఆర్థికరంగం సంక్షోభం పాలవకుండా గట్టెక్కించాయి. 1975 నాటికి భారతదేశం నూటికి నూరుశాతం స్వయం సమృద్ధిని సాధించింది. ఐ.ఎమ్.ఎఫ్ నుంచి భారీమొత్తం సేకరించడం ద్వారా చెల్లింపుల సమతూకంలో నెగ్గుకు రావడం జరిగింది. 1976-77 నాటికి ఆర్థిక వ్యవస్థ స్వాస్థ్యం చిక్కించుకుంది. ఉదార దిగుమతి విధానంవల్ల, ఎగుమతీ సబ్సిడీలవల్ల, సుంకాల రాయితీలవల్ల, ఎగుమతుల పెంపుదల ప్రయత్నాలు నెగ్గాయి. 1974-79 కాలంలో అయిదవ ప్రణాళికలో జి.డి.పి (G.D.P) పెరుగుదల కనిపించింది. పెరుగుదల క్రియాశీలత, పెట్టుబడి రూపొందడం 1979లో మరోసారి ఆర్థిక వ్యవస్థను చమురు సంక్షోభం దెబ్బకొట్టడంతో మందగించాయి. అయితే బొంబాయి తీరంలో చమురు ఉత్పాదనవల్ల భారతదేశం ముడిచమురు దిగుమతులు గణనీయంగా తగ్గడంలో రెండవ చమురు సంక్షోభం అంతగా చిక్కులు పెట్టలేదు. దీనికితోడు భారతదేశస్థులు విదేశాల నుంచి పంపించిన మొత్తాలు స్వల్పకాలిక చెల్లింపుల సంక్షోభాన్ని యెదుర్కోవడంలో యెంతగానో సహకరించాయి.

భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు నిజంగా 1980-85 మధ్యకాలంలో తుప్పు వదిలించుకుంది. మన ప్రణాళికా ప్రయత్నంలో మొట్ట మొదటిసారి జి.డి.పి. (G.D.P.) సాలుసరి 5.5 శాతాన్ని దాటింది, లక్ష్యం 5.2 శాతం అయినప్పుడు, పెరుగుదల స్థాయి అనూచానంగా వున్న 3.5 శాతాన్ని మొట్టమొదటిసారి దాటి ముందుకు పోయింది. దీనికి ఆధారం ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాలనుంచీ వచ్చిందనే చెప్పాలి. వ్యవసాయ రంగం మరింత వాతావరణ ప్రతికూలాల్ని తట్టుకోగలిగి సుస్థిర పడింది. పెట్రోలియం, విద్యుత్, ఖనిజ వాయువు, సిమెంట్, రసాయన ఎరువులు, బొగ్గు మొదలైన వాటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల వుంది. ఆరీవ పంచవర్ష ప్రణాళికలో పేదరికంలో కూడా తగ్గుదల కనిపించింది. ప్లానింగ్ కమిషన్ లెక్కల ప్రకారం, దారిద్రరేఖకు దిగువన వున్న జనాభా శాతం 48.3 నుంచి (1977-78లో) 37.4 శాతానికి 1985లో దిగింది. పేదరికం తగ్గడానికి అనేక పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, వ్యవసాయంలోనూ, వ్యవసాయేతర రంగంలోనూ ఉద్యోగ అవకాశాలు పెరగడం కారణం. మొదటి రెండు దశాబ్దాలతో పోలిస్తే ఆర్థికరంగం పనితీరు మెరుగైనా, ప్రభుత్వ వ్యయం

BRAOU

నిమిత్తం దేశీయంగా, అంతర్జాతీయంగా అందుకున్నరుణం ప్రభుత్వాన్ని అప్పుల ఊబిలో కూరేసింది (అసలు, వడ్డీలు చెల్లించడానికి తెచ్చుకునే రుణపరిస్థితిని అప్పుల ఊబి అంటారు. దీన్ని రుణ సేవలు అంటారు.) ఈ విషయాలగురించి తర్వాత వివరంగా చర్చించుకుందాం.

I మీ అవగాహన పరీక్షించుకోండి

1. భారతదేశ ప్రణాళికా రచన రూపకర్త ఎవరు?

.....

.....

.....

.....

2. భారతదేశ ప్రణాళికా ఉద్దేశ్యాలేమిటి?

.....

.....

.....

.....

3. 6వ పంచవర్ష ప్రణాళిక సాధన లేవి?

.....

.....

.....

.....

29.4 వ్యవసాయం

మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రముఖ స్థానం ఆక్రమిస్తుంది. అన్ని తృతీయ ప్రపంచ దేశాల మాదిరిగానే భారతదేశమూ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థతోనే వుంది. జనాభాలో అధిక శాతం గ్రామీణప్రాంతంలో నివసిస్తోంది. వ్యవసాయం మీద దాని అనుబంధ రంగాలమీద జీవనాధారం కోసం ఆధారపడుతుంది. స్వాతంత్రం వచ్చేనాటికి గ్రామీణ జనాభా 85 శాతం వుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం భాగం 70 శాతం వుండేది. అంత అధిక శాతం జనాభా ప్రత్యక్షంగానో పరోక్షంగానో వ్యవసాయం మీద ఆధారపడ్డంవల్ల, రెండవ అతిముఖ్య అంశమైన పారిశ్రామికరంగానికి యెక్కువ అవసరం అయిన విభాగంగా వుంటారు. అందుచేత పారిశ్రామిక రంగానికి వ్యవసాయ అభివృద్ధి అవశ్యకం అవుతుంది - ఇది రెండవది. ఇక మూడవది, అధిక జనాభా వున్న పేదదేశాల్లో జనాభా చేసే వ్యయంలో గణనీయ శాతం తిండిగింజల కోసమే అవుతుంది. అందుచేత ఆహారధాన్యాలు అందుబాటులో వుండడం చాలా ముఖ్యం. ఆ రకంగా ఆర్థిక వ్యవస్థ మీద ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు తప్పించుకునేందుకు ఆహారధాన్యాల సరఫరా చాలాముఖ్యం అవుతుంది. నాల్గవది, పేదరిక నిర్మూలన. వ్యవసాయం, ఉద్యోగ అవకాశాలకూ సన్నిహితసంబంధం వుంది. అయిదవది, వ్యవసాయం పరిశ్రమలకు అవసరమైన పత్తి, చమురుగింజలు, చెరకు, పొగాకు, జనపనార వగైరాల సరఫరాలు అందిస్తుంది. ఆఖరిగా, వ్యవసాయ ఎగుమతులు విదేశీ మారక ద్రవ్య సంపాదనకు యెంతో దోహదం చేస్తాయి. ఆరకంగా ఆర్థిక వ్యవస్థ సర్వతోముఖ అభివృద్ధికి వ్యవసాయం కీలకం అవుతుంది.

ఏమైనప్పటికీ, అభివృద్ధి పథంలో భారత వ్యవసాయం చాలా దీర్ఘకంటాకావృత మార్గంలో నడిచింది. స్వాతంత్రం వచ్చేనాటికి, భారత వ్యవసాయం అర్ధ - భూస్వామ్య (Semi-Feudal) నిర్మాణంలో వుండేది. వేలాది ఆక్షలాది ఎకరాల భూమి జమిందారీల కింద, జాగీర్ల కింద, అనేక ఇతర దోపిడీ పద్ధతుల కింద, చిన్న చిన్న

ప్రాంతాల్లో వుండేది. వ్యవసాయ భూములు, చాలా పంపిణీ సమంగా ఉండేదికాదు. మరోపక్క మదుపులు అరకొరగా వుండేవి. సాంకేతిక పరిజ్ఞానం పాతకాలం నాటిది. దాంతో సగటు తలసరి పెట్టుబడికి తగినంత రీతిలో దిగుబళ్ళు తక్కువగా వుండేవి. జమిందారీలను, జాగీర్లను, యితర మధ్య వ్యవస్థలను 1950లో రద్దు చెయ్యడం భూసంస్కరణలరీత్యా గణనీయమైన ముందడుగు. తద్వారా వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఈ భూసంస్కరణలో భారం ప్రజల నెత్తిమీద ముదరా చెల్లింపుల రూపంలో పడింది. మిగులు భూమిని బలహీన వర్గాలకు పంపిణీ చెయ్యడానికి తాత్కాలికంగా తిలోదకాలు యిచ్చారు. ఆఖరిగా, భారత ఆర్థిక వ్యవస్థ చాలా కాలం వర్షాధారం అవడంవల్ల ప్రకృతి కరుణా కటాక్షం మీద ఆధారపడవలసి వచ్చింది. దీనివల్ల వ్యవసాయ దిగుబళ్ళు మూరెడు ముందుకు, బారెడు వెనక్కు అన్నట్లు విపరీతమైన హెచ్చు తగ్గులతో వుండేవి. ఈ రంగంలో కచ్చితమైన నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం కష్టసాధ్యమైంది.

వ్యవసాయ సమస్యలు 1960లలో వున్నంత తీవ్రంగా యెన్నడూ లేవు. 2.4 మిలియన్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి 1951లో 6.4 మిలియన్లు అయింది. ఫోర్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక, వ్యవసాయ శాస్త్రవేత్తల నిపుణుల బృందం ఒక నివేదికను సమర్పించింది. *"భారతదేశ ఆర్థిక సమస్య, అధిగమించడానికి అవసరమైన చర్యలు"* అన్న పేరు మీద వెలువడిందది. 1965లో ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఆ నివేదికను యివ్వడం జరిగింది. వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వుండాలని, ఆ నివేదిక చెప్పింది. ముఖ్యంగా అధిక దిగుమతి వంగడాలు ముఖ్య ఆహారధాన్యాలకు సంబంధించి వుండాలని, రసాయనిక ఎరువులవాడకం వుండాలని, నీటి పారుదల సౌకర్యాలు వేగంగా విస్తరించాలని, యితర మౌలిక సదుపాయాల కల్పన వుండాలని ఆ నివేదిక సూచించింది. ఈ వ్యూహాల్ని మొదట్లో విడి దశల వారీగా అమలు చేసారు. అదీ కొన్ని రాష్ట్రాల్లో తర్వాత పెంచుకుంటూ వెళ్లారు. హరిత విప్లవం అన్నపేరున దాన్ని సాగించారు. నూతన సాంకేతిక పరిజ్ఞాన విస్తృతి. నీటిపారుదల సౌకర్యాల లేమివల్ల పరిమితం అయింది. వీటికి తోడు సబ్సిడీతో రుణసదుపాయం, వాణిజ్యబ్యాంకుల ద్వారా గ్రామీణ బ్యాంకుల్ని స్థాపించడం, వ్యవసాయ సహకార బ్యాంకుల్ని స్థాపించడమైంది అదీగాక ఉత్పత్తిదారులకు కేంద్రంగా నిరంతరం పెట్టుబడి పెట్టేందుకు, పెరుగుదలకు ప్రేరకంగా స్థిరీకృత ధరల పద్ధతి వుండడం తప్పనిసరి అని భావించారు. ఆరకంగా నిర్మితమైన ధర మద్ధతు, మొదట్లో, రైతులకు నిర్దిష్టమైన రాబడులు వుంటాయన్న హామీ కలిగించింది. దీన్ని అమలుచెయ్యడానికి భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ) ను 1966లో స్థాపించారు. ఆహార ధాన్యాల సేకరణను ఈ సంస్థ పుష్కలమైన దిగుబళ్ల సమయంలో చేపడుతుంది. ధరల పతనాన్ని అరికడుతుంది. పేద ప్రజలకు సబ్సిడీ ధరలకు ఆహార ధాన్యాన్ని సరఫరా చేస్తుంది. చౌకధరల దుకాణాల ద్వారా ఇది జరుగుతుంది. పంటల నష్టం సంభవించినప్పుడు మార్కెట్‌లో ధరలు పెరగకుండా ఇది అదుపుచేస్తుంది.

హరిత విప్లవ ఫలితాలు గణనీయంగా వున్నాయనే చెప్పాలి. భారత వ్యవసాయంలో ఇది నిర్మాణాత్మక పరిణామానికి దారితీస్తుంది. సంప్రదాయ వ్యవసాయ విధానం ఆధునిక, వాణిజ్య పరిశ్రమగా మారింది. 1967-68 నుంచి ఆహారధాన్యాల ఉత్పత్తి 95 మిలియన్ల స్థాయినుంచి 1975 నాటికి 125 మిలియన్లకు 1989-90 నాటికి 170 మిలియన్లకు స్థిరంగా పెరిగింది. అదేరకంగా, ఆహారేతర ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. చమురు గింజలు 7 మిలియన్లనుంచి 18 మిలియన్లకు, చెరకు 57 మిలియన్లనుంచి 240 మిలయన్ల టన్నులకు యిదేకాలంలో పెరిగాయి. 1975 నాటికి భారతదేశం ఆహారధాన్యాలకు సంబంధించి పూర్తి స్వయం సమృద్ధి సాధించింది. నూతన సాంకేతిక విజ్ఞాన విజయం, ఉద్యోగ అవకాశాల పెరుగుదల మీద స్పష్టంగా కన్పిస్తుంది. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయేతర ఉద్యోగాలు పరోక్షంగా పెరిగాయి. హరిత విప్లవ ప్రాంతాల్లో పేదరికాన్ని తగ్గించడంలో యిది కనిపించింది.

ఇంతజరిగినా యీ అభివృద్ధి క్రమంలో అనేక వాగ్దానాలు నెరవేరకుండా అలానే వుండిపోయాయి. మొట్టమొదటగా, రాజ్యాంగంలో పొందుపరచిన సర్వసమాన సామాజిక నిర్మాణం, భూసంస్కరణలు, పునఃపంపిణీ పక్కదారిపట్టడంవల్ల అలానే వుండిపోయింది. ఇకపైన సాంకేతిక సముదాయ పథకం వ్యవసాయంలో అమలు

అవలంబించింది. అయితే ఆధునిక అభివృద్ధి క్రమంలో దిగుమతుల మీద ఆధారపడ్డ అంతర్జాతీయ వాణిజ్యం సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపులో, పెట్టుబడి యేర్పడడంలో అనుకూల పాత్రనే పోషిస్తుంది. తొలిదశ విదేశీ ద్రవ్యనిల్వలు యుద్ధ నష్టాలకు రాయితీ రూపంలో వున్నాయి. అవి అప్పటి అవసరాలకు సరిపోయేవి. ఆ తర్వాత మన ఎగుమతుల్ని ప్రోత్సహించే అవసరం కనిపించింది. విదేశీమారక ద్రవ్యం ఆర్జించాల్సివచ్చింది. అది 1960ల మధ్యభాగంలో తీవ్ర పరిమితులను అందుకుంది. ఏమైనా ఎగుమతి పద్ధతి మొదటి 25 యేళ్లూ నిరూత్సాహ భరితంగానే వుంది. 1960-79 మధ్య జి.డి.పి (G.D.P) లో భారత ఎగుమతుల వాటా 13 నుంచి 15 శాతం దాకా పెరిగింది. అయితే ప్రపంచ వాణిజ్యంలో ఆవాటా 2 నుంచి 0.5 శాతానికి దిగిపోయింది.

ప్రణాళిక తొలిదశకంలో 1950లో విదేశీ మారక ఆర్జనలో భారతదేశం స్తబ్ధత చవిచూసింది. ఈ పరిస్థితి 1960లలో కొంచెం మెరుగుపడింది. విలువలలో పరిమాణంలోనూ నాలుగుశాతం పెరిగింది. 1970లలో పరిమాణంలో 6 శాతం విలువల రీత్యా 16 శాతం పెరిగింది. అయినా ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వాటా 0.42 శాతానికి నలభైల నాటి 3 శాతం నుంచి 1970లలో దిగిపోయింది. 1950-73 దశ ప్రపంచ వాణిజ్యంలో మంచి వికాసంగా వున్న దశ. అయితే భారతదేశం 1980లలో వాణిజ్యంలో స్తబ్ధత అందోళన కలిగించేదశకు చేరుకుంది. ఈ పతనం నిజానికి 1977-84 మధ్యలో జరిగింది. 1979 నుంచీ సరళీకృత విధానాలవల్ల భారత ఎగుమతులు దిగుమతులు జాతీయ ఉత్పత్తి స్థిరంగా పెరిగాయి. దిగుమతులు 25 శాతం సాలుకు పెరిగాయి. ఎగుమతులు విలువల రీత్యా 16 నుంచి 18 శాతం పెరిగాయి. ఆలోటుని స్వల్పకాలిక, దీర్ఘకాలిక విదేశీ రుణాల ద్వారా పూడ్చడం జరిగింది. విదేశాల్లో వున్న భారతీయులు పంపించే మొత్తాలు 1970 ల మధ్య నుంచీ స్థిరంగా పెరిగాయి. అలాగే, దేశీయంగా ముడిచమురు ఉత్పత్తి పెరిగింది. దాంతో విదేశాల్లో భారత పరపతి పెరిగింది. ఆ రకంగా భారతదేశం పెరుగుదల స్థాయిని నిలబెట్టడానికి వాణిజ్య వనరుల నుంచి ఎక్కువ వడ్డీలకు రుణాలు తీసుకురావడం మొదలు పెట్టింది. ఫలితంగా 1989 నాటికి భారతదేశ రుణం తల తిరిగిపోయే స్థాయికి చేరుకొంది, (40 శాతం జిడిపిలో) 89, 836 కోట్ల రూపాయలు. దేశం మొత్తం ఎగుమతి రాబడిలో 30శాతం అప్పులకే అర్పణం అయింది. విదేశీ భారతీయుల నిధుల్నీ, స్వల్పకాలిక పెట్టుబడి ప్రవాహాన్ని భారీస్థాయిలో ప్రోత్సహించారు. స్వల్పకాలిక అవసరాలను ఆదుకోవడానికి అలా చేశారు. దీన్ని "ఉష్ణధనం" (Hot Money) అన్నారు. అంటే అది ఏ దశలోనైనా దేశం నుంచి బయటకు పోవచ్చునన్నమాట. అది గల్ఫ్ యుద్ధం సమయంలో చెల్లింపుల సంక్షోభం సమయంలో అలానే పోయింది.

29.7 పేదరికం

భారత్ పేదదేశం. స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి మరీ పేదదేశం. 1951లో భారతదేశంలో సాలుసరి తలసరి ఆదాయం 244 రూపాయలు. ఏ పేదదేశంలోనైనా పేద ప్రజల భాగం సాధారణంగా అధికంగానే వుంటుంది. భారతదేశ పేదరికానికి ఆర్థిక కోణమే కాక, సామాజిక కోణం కూడా వుంది. కుల సోపాన వ్యవస్థలో పేదరిక స్థాయి కిందికి దిగే కొద్దీ ఎక్కువ అవుతూనే వుంటుంది. భారతదేశంలో వ్యవహార సౌకర్యం కోసం శుద్ధ పేదరికం నిర్వచనం చేశారు. రోజుకు పురుషులు 2300 కాలరీలు, స్త్రీలు 2100 కాలరీలు తీసుకోగల శక్తి మాత్రమే వున్న వాళ్లు మాత్రమే దారిద్ర్య రేఖ దిగువన వున్నట్టు లెక్కగట్టారు. భారతదేశంలో దారిద్ర్య రేఖ దిగువన వున్న ప్రజల సంఖ్య యెంత అన్నదాన్ని గురించి వివిధ అచరణాత్మక అధ్యయనాలు వున్నాయి. అహ్లువాలియా (1984) అంచనా ప్రకారం దారిద్ర్య రేఖ దిగువన వున్న జనాభా సంఖ్య 1951 లో 54 శాతం. 1961 లో అది 39 శాతంగా వుండింది. 1968లో 67 శాతానికి పెరిగింది. 1971లో 41 శాతానికి దిగింది. 1989లో 39శాతం వుండింది. మళ్లీ దారిద్ర్య స్థాయి ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లాంటి పేద రాష్ట్రాల్లో మరీ యెక్కువ వుంది. పేదరికం తగ్గడానికి రెండు అంశాలు దోహదం చేసినట్టు ఆధ్యయనాలు తెలియచేస్తున్నాయి. ఒకటి వ్యవసాయ ఉత్పత్తి. హరిత విప్లవంవల్ల పేదరికం తగ్గింది. ఉద్యోగం పెరిగింది. నిజవేతనాలు పెరిగాయి. రెండవది, కేరళలాంటి రాష్ట్రాల్లో కనిస వేతనాల సాధనకు వ్యవస్థ నిర్వహించిన పాత్ర, చక్కని ప్రజా పంపిణీ విధానం.

BPAOU

29.5.2 1950-89 మధ్యకాలంలో పారిశ్రామిక రంగం

పారిశ్రామిక రంగాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. మొదటిది 1950-66 మధ్య కాలం. ఈకాలంలో పెరుగుదల స్థిరంగానే వుంది. రెండవది 1966-80 మధ్య పెరుగుదల దిగజారింది. దీన్ని పారిశ్రామిక వెనుకంజ అన్నారు. ఆఖరిగా మూడవ దశ 1980-89. మళ్లీ పరిశ్రమ పుంజుకుంది. కొంతమంది, ఆర్థికవేత్తలు దీన్ని "చుట్టు తిరగడం" అన్నారు.

1950-66 తొలిదశలో పారిశ్రామిక పెరుగుదల వేగవంతం అయింది. ముఖ్యంగా లోహ, యంత్ర, రసాయన, కాగితం, కలప పరిశ్రమలు సాలీనా 10 శాతం మించి పెరుగగా వినిమయ వస్తువులు మెల్లగా పెరిగేవి. ఉదాహరణకు ఆహారం,పాగాకు, జౌళి, చర్మం ఉత్పత్తులు సాలీనా 5 శాతమే పెరిగాయి. 1966-80ల మలిదశలో భారీ, మౌలిక పరిశ్రమలు, మధ్యంతర వస్తువుల పరిశ్రమలు మందగించాయి. మరోపక్క వినిమయ వస్తువుల పెరుగుదల కొట్టవచ్చినట్టు కనిపించింది. అది 14 శాతం పెరిగింది. విద్యుత్ యంత్రాల వంటి ముడివస్తువుల ఉత్పత్తి పుంజుకున్నా యితర మౌలిక, మధ్యంతర, ఉత్పాదక వస్తువులు సాలీనా 4 నుంచి 7 శాతం దాకా పెరిగాయి. మొత్తం మీద చెప్పుకోవాలంటే, మొదటిదశలో ఉత్పాదక వస్తువులకు అనుకూలంగా వుంది. మూడవ ప్రణాళిక ముగిసేదాకా అలానే సాగింది. అదశ చివరిలో వినిమయ దీర్ఘ మౌలిక వస్తువుల ఉత్పత్తికి అనుకూలత పెరిగింది. మధ్యతరగతిలో పెరుగుతున్న ఆదాయాల్ని అది ప్రతిబింబించింది. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ నియామకాలు పెరగడం అనేది యీ డిమాండ్ ధోరణి, వినిమయ వస్తువుల ఉత్పత్తి అనే అంశాలకు చెందింది అన్నారు. ఈ వినిమయ వస్తువులలో వాహనాలు, విద్యుత్ సాకర్యాలు, పరికరాలు, జౌళి వగైరా వున్నాయి. ఈ వినిమయ వస్తువులు పెరగడానికి 1980లలో అనుసరించిన ఉదారవాద విధానాలు కారణం అంటారు. ఈ దశలో మరింత విదేశీ సహకారం భారత, విదేశీ ఉత్పత్తిదారుల మధ్యయేర్పడింది.

స్థూల జాతీయ ఉత్పత్తిలో ప్రభుత్వరంగం వాటా 1950లో 5 శాతం వుండేది. అది 1987-88 నాటికి 27.2 శాతం పెరిగింది. ప్రభుత్వరంగం పెట్టుబడి సంచయనానికి దోహదపడడం యాభైల(1950ల) తొలిదశలోనే వెల్లడి అయింది. అయితే ఉత్పాదనలో దీని ప్రాముఖ్యం క్రమేపీ పెరిగింది. ప్రభుత్వరంగ గణనీయ కృషి ఉద్యోగ నియామకాల్లో కనిపించింది. 1960-61 ల మధ్య మొత్తం పారిశ్రామిక కార్మికులలో 21 శాతం యీ రంగానిదే. అది 1985-87 నాటికి 35.5 శాతం పెరిగింది. 1950-51 లో 25శాతంవున్న ప్రభుత్వ రంగ మదువులు 1987-88 నాటికి 48 శాతం అయ్యాయి. అయితే స్థూల పొదుపులు 17శాతం నుంచి 9.3 శాతానికి పడిపోయాయి, 1980లలో ప్రభుత్వం చిక్కుకున్న ద్రవ్య సంక్షోభానికి యిది ఓ కారణం. దాంతో 1990లలో సమూల మార్పులు అవసరం అయింది. గమనించవలసిన అంశం యేమిటంటే, అనేక పారిశ్రామిక విభాగాల్లో తొలి రెండు దశాబ్దాల్లోనూ పోలిస్తే 1980లలో ప్రైవేట్ రంగం పైకి రావడం.

భారతదేశంలో పారిశ్రామిక పనితీరు మొత్తం పెరుగుదల, వైవిధ్యభరితం గావడం చెప్పుకోదగ్గట్టే వున్నా, ఉత్పత్తి అంశాల ఉత్పాదకత కొన్ని యితర దేశాలతో పోలిస్తే తక్కువ అనే చెప్పాలి. దీనికి ఆర్థికవేత్తలు చాలామంది కారణాలు చెప్పారు. ముఖ్య కారణం, పెరుగుదలకు పొదుపులు, మదుపులు మాత్రమే అని అతిగా భావించడం, నాణ్యం, సామర్థ్యం, ఉత్పత్తి వ్యయంలాంటి ఇతర ముఖ్యాంశాల్ని ఉపేక్షించడం అన్నారు. ఎగుమతుల నైరాశ్యం, విదేశీ పెట్టుబడిపట్ల సరైన దృక్పథం లేకపోవడంలాంటి సాంకేతిక వెనుకబాటుతనానికి దారితీసాయి. తత్ఫలితంగా కేపిటల్ ఉత్పాదకత స్థిరంగా పెరిగింది. ఉదార విధానాలు, అవలంబించినంతవరకు కొంత మేరకు సాంకేతిక పురోగతి వచ్చింది. జాతీయ పరిశ్రమరంగం స్థానిక పరిశోధన , అభివృద్ధి రంగాల్లో ప్రోత్సాహం కలిగించలేదు. అలా వుండివుంటే ఓ మేరకు స్వావలంబన, స్వతంత్రత లభించి వుండేవి.

29.6 విదేశీ వాణిజ్యం

తొలి సంవత్సరాల్లో భారత విదేశీ వాణిజ్య వైఖరి వలస దోపిడీవల్ల ప్రభావితం అయింది. అందుచేత నిరాశాపూరితంగానే వుండింది. స్వావలంబన దిశలోనే దృష్టి సారించింది. దిగుమతులతో సరిపెట్టుకున్న వ్యూహాన్ని

ఉత్పత్తులు ఉన్నాయి. ఈ పరిశ్రమల లోపల, కొత్త సంస్థ స్థాపించుకోవడం కోసం లేదా దాని సామర్థ్యాన్ని పెంపు చేసుకోవడం కోసం, లేదా కొత్త వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడం కోసం యీ చట్టం స్థాపించే లైసెన్సింగ్ కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ లైసెన్సింగ్ ఉద్దేశం యేమిటంటే, ప్రాంతీయ అభివృద్ధి సమంగా వుండేటట్టు చేయడం. ఆర్థిక శక్తి కేంద్రీకృతంగాకుండా వుండేటట్టు చూడడం. శ్రామికులు అధికంగా అవసరం అయ్యేటట్టూ, చిన్నతరహా పరిశ్రమలూ వుండేటట్టూ ప్రోత్సహించడం.విదేశీ మారక ద్రవ్య అవసరాలు తగ్గేటట్టు చూడడం. ఏమైనా 1951 నాటి పారిశ్రామిక విధానంలో లక్ష్యాలకు సంబంధించీ వాటి సాధనకు సంబంధించీ స్పష్టత లేకపోయింది. ఎందుకంటే ఆర్థిక పునాది మరీ దుర్బలంగా వుంది.

రెండవ పారిశ్రామిక విధాన తీర్మానం మరింత స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. రెండవ ప్రణాళిక కాలంలో రెండవ పారిశ్రామిక విధాన తీర్మానంలో వున్న లక్ష్యాలు 1. ఆర్థిక పెరుగుదలను పారిశ్రామికీకరణను వేగవంతంచెయ్యడం 2. భారీ పరిశ్రమల్ని యంత్ర నిర్మాణ పరిశ్రమల్ని అభివృద్ధి చెయ్యడం. 3. ప్రభుత్వ రంగాన్ని విస్తరించడం. 4. విస్తృత సహకార రంగాన్ని నిర్మించడం 5. ఆదాయ, సంపదలలో అసమానతల్ని తొలగించడం 6. ప్రైవేట్ గుత్త సంస్థల్ని, ఆర్థిక ఆధిపత్య కేంద్రీకరణను అడ్డగించడం. ఆ తీర్మానంలోని 'ఎ' షెడ్యూల్‌లో 17 పరిశ్రమలు వున్నాయి. అవి రక్షణ, ముడిపదార్థాలు, ఖనిజాలు, ఇనుము, ఉక్కు, నౌకా నిర్మాణం, రైలు, విమానసేవలు, టెలికామ్, విద్యుత్‌లు. వీటిని ప్రభుత్వరంగానికే ప్రత్యేకంగా కేటాయించారు. "బి" షెడ్యూల్‌లో 12 పరిశ్రమలు వున్నాయి. వీటిలో వివిధ చిన్న పరిశ్రమలూ వున్నాయి. రసాయన ఎరువులు, అల్యూమినియం, యంత్రపరికరాలు, మందులు, ప్లాస్టిక్స్, సింథెటిక్స్, రబ్బర్ వగైరా; రోడ్, సముద్ర రవాణా వున్నాయి. వీటిని క్రమేపీ ప్రభుత్వం స్వాయత్తం చేసుకోవాలని ఉద్దేశం. అయితే వీటిలో ప్రైవేట్ రంగమూ పాల్గొనవచ్చు. మిగిలిన అన్ని పరిశ్రమల్నీ ప్రైవేట్ చొరవకు దాని రంగానికి వదిలి పెట్టారు. అసలు వ్యూహం యేమిటంటే మౌలిక సదుపాయాలపైన, యంత్ర పరికరాల తయారీపైన కేంద్రీకరణ వుంచినట్లయితే, వినిమయ వస్తువుల పరిశ్రమ పెరుగుదల సులభం అవుతుంది అని. భారీ పరిశ్రమల మీద, మౌలిక పరిశ్రమల మీద ప్రైవేట్ రంగం మదుపులు పెట్టదు. అవి ఫలవంతం కావడానికి దీర్ఘకాలం పడుతుంది. లాభాలు తక్కువ వుంటాయి. అందుచేత ప్రభుత్వం వాటిలో మదుపు పెడుతుంది. అప్పుడు స్వావలంబన సాధ్యమౌతుంది.


పారిశ్రామిక రంగంలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి అవసరమైన న్యాయపర యంత్రాంగాన్ని రూపొందించారు. మొనాపలీస్ అండ్ రెస్ట్రిక్టెడ్ ట్రేడ్ ప్రాక్టీసెస్ (ఎమ్.ఆర్.టి.పి) 1970లో ప్రకటించారు. దీన్ని స్థూల ఆస్తులు 20 కోట్లు వున్న భారీ పారిశ్రామిక సంస్థలు పెరుగుదలనీ, విస్తరణనీ నియంత్రించే ఉద్దేశంతో ప్రకటించారు. ది ఇంపోర్ట్ ట్రేడ్ అండ్ కంట్రోల్ ఆర్డర్, 1955 వల్ల దాదాపు అన్నిసరకులు పరిమాణాత్మక పరిమితులకు, భారీ సుంకం విధింపునకూ గురయ్యాయి. స్థానిక పరిశ్రమలకు రక్షణ కల్పించడం యిందులో ఉద్దేశం. ఫారిన్ ఎక్స్‌ఛేంజి ఎండ్ రెగ్యులేషన్ యాక్ట్ (ఫెరా) చట్టం 1973లో వచ్చింది. భారత పరిశ్రమలమీద విదేశీ నియంత్రణను అడ్డగించడానికీ, భారత కంపెనీలలో విదేశీ ఈక్విటీలను నియంత్రించి తగ్గించడానికీ దీన్ని ఉద్దేశించారు. ఇదేరకంగా కంపెనీలు పబ్లిక్ ఈక్విటీ జారీ చెయ్యడాన్ని అదుపులో వుంచారు. కంట్రోలర్ ఆఫ్ కేపిటల్ ఇష్యూస్ అన్న పేరున అధికారిని నియమించారు. ఆరకంగా 1956-73 మధ్య పారిశ్రామిక విధానం దేశీయ, విదేశీయ పెట్టుబడి పెరుగుదల మీద చాలా నియంత్రణ చేసింది. గుత్తస్వామ్యం పెరుగుదలను నియంత్రించడానికీ, స్థానిక సమతౌల్యాన్ని ప్రోత్సహించడానికీ యీ చట్టాలు ఉద్దేశించినా, వీటిలో యే ఒక్క లక్ష్యాలను సాధించలేదన్న విమర్శలు వచ్చాయి. అంతేకాక, అనవసరమైన బ్యూరాక్రటిక్ పెత్తనం, లంచగొండితనం, అనుమతి మంజూరులో జాగు, ఎగుమతుల్ని నిరుత్సాహపరచడం, పోటీ వుండాల్సిన చోట అర్ధంకులు కలిగించడం, గుత్తయాజమాన్యం ఆధిపత్యం సంపాదించడం, సాంకేతిక వెనుకబాటుతనం లాంటివన్నీ పుట్టుకొచ్చాయి. ఈ విమర్శల పైన చెప్పుకున్న చట్టాల్లోని అంశాల పర్యవసానంగా సంస్కరణలు వచ్చాయి. 1979లో ఇందిరా గాంధీ ప్రభుత్వం, 1984 నుంచీ రాజీవ్ గాంధీ ప్రభుత్వం మరింత ఉదారవాద విధానాల్ని అవలంబించాయి.

BRAOU

జరిపినప్పుడు, వ్యవసాయ శిష్టవర్గం పూర్తిగా కూడడమే కాదు, భూసంస్కరణల అమలు, రాజకీయంగా అనుకూలత లేనిదిగా అయింది. రెండవది, అసమానతలు తీవ్రం అయ్యాయి. పెద్దకామందులు ఎక్కువగా చిన్నరైతుల కంటే లబ్ధి పొందారు. మూడవది, నూతన సాంకేతిక పరిజ్ఞానంవల్ల గోధుమ, వరిలాంటి మేలురకం మెరుగు పడ్డాయి. ముతక రకాలు దిగజారాయి. ఇక నాల్గవది, హరిత విప్లవ లాభాలు చాలాకాలంపాటు, పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, కోస్తా ఆంధ్ర, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్ లాంటి ప్రాంతాలకే పరిమితం అయ్యేవి. దీనివల్ల దేశంలో తీవ్రమైన అసమానతలు తలెత్తాయి. అయిదవది, విద్యుత్ సబ్సిడీలు, రుణాలు, నీటిపారుదల సౌకర్యాలు, రసాయనిక ఎరువులు లాంటి విషయంలో ఉదార విధానాలవల్ల రాష్ట్రాలు ద్రవ్య సంక్షోభంలో పడిపోయాయి.

29.5 పరిశ్రమలు

అనేక ప్రణాళికలలో అనుసరించిన విధానాలనుబట్టి పారిశ్రామిక అభివృద్ధి బాగా ప్రభావితం అయింది. దానికి తోడు పరిశ్రమ నిర్మాణమే ప్రణాళికా న్యాయాన్ని బట్టి వుంటుంది. వివిధ ప్రణాళికలలోని పారిశ్రామిక విధానాలగురించి, వాటి పనితీరు గురించి ఈ క్రింద చర్చిస్తాం.



29.5.1 పారిశ్రామిక విధానాలు

మొట్ట మొదటి క్రమబద్ధీకరణ చట్టం, ప్రైవేట్ పరిశ్రమలకు పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం 'ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్‌యాక్ట్' 1951లో ప్రవేశ పెట్టారు. 36 షెడ్యూల్డ్ పరిశ్రమలకు సమగ్రంగా వర్తించే తీరులో దీని పరిధిని విస్తరించారు. ఇందులో రక్షణ, పరిశ్రమలు, కేపిటల్ గూడ్స్, ఇంధనాలు, టెలికమ్యూనికేషన్లు, రవాణా, రసాయనిక ఎరువులు, రసాయనాలు, కలప, రబ్బర్, గాజు, సిరామిక్స్ వున్నాయి. వీటితోబాటు యింకా అనేకం వున్నాయి. జౌళి, మందులు, కాగితం, చక్కెర, ఆహార వస్తువులు యితర లెదర్

భారతదేశంలో పేదరికం తగ్గించడానికి అయిదవ పంచవర్ష ప్రణాళికలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఒక చోట ఒకోరకంగా అవి ఫలితాలనిచ్చాయి. జాతీయ ఆదాయం పెరుగుదలవల్ల పేదరిక వ్యతిరేక కార్యక్రమాలని ప్రవేశపెట్టారు. 1. వ్యక్తిగతంగా లబ్ధి అందించే కార్యక్రమాలు ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్‌ల (ఐ.ఆర్.డి.పి) లాంటివి. 2. ఖాయంగా ఉద్యోగ అవకాశాలు పెంపొందించే కార్యక్రమాలు క్రాష్‌స్కీమ్ ఫర్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ (సి.ఎన్.ఆర్.ఇ), పనికి ఆహారం (ఎఫ్.డబ్ల్యు.సి), జాతీయ గ్రామీణ ఉద్యోగ కార్యక్రమాలు (ఎన్.ఆర్.ఇ.పి) వాతావరణ ప్రతికూల్య ప్రాంతాల అభివృద్ధి, అంటే వర్షాభావ ప్రాంతాల అభివృద్ధి, కనీస అవసరాల కార్యక్రమాలు వగైరా. ప్రత్యక్ష లబ్ధి కార్యక్రమాల క్రింద పశువుల్ని కొనడానికి, బళ్లు కొనడానికి, భారీ సబ్సిడీలతో రుణ సౌకర్యం కల్పించడం. ఉద్యోగ భద్రత కార్యక్రమాల క్రింద, వర్షాభావ రుతువుల్లో పబ్లిక్ వర్క్స్ చేపట్టడం, ఆ వేతనాలకు ఆహార ధాన్యాల రూపంలో యివ్వడం. వీటికి తోడు అనేక రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్ని చేపట్టారు. అంటే మిగులు భూమిని షెడ్యూల్డ్ కులాల వాళ్ళకి పంపిణీ చెయ్యడం, గృహ వసతికి భూమి ఇవ్వడం, పక్కాయిల్ల నిర్మాణం, నిరుపేదలకు సబ్సిడీతో బియ్యం సరఫరా చెయ్యడం, పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, శిశు పోషణ పథకాలు లాంటివన్నీ ఇందులో వున్నాయి. ఇవన్నీ పేదరిక నిర్మూలనకు చేపట్టినవే. ఈ ప్రణాళికల రూపకల్పనలో, అమలు తీరులో వున్న అనేక పరిమితులవల్ల ఈ పథకాల ప్రభావం, విజయం వేరువేరు సందర్భాల్లో వేరువేరు విధంగా వున్నాయి. ఈ పరిమితుల్లో ప్రాథమిక క్రమాల విస్మరణ, తూట్లు, లబ్ధిదారుల అపసవ్య ఎంపిక, అవినీతి, రాజకీయాలు లాంటివన్నీ వున్నాయి. యేమైనా, యెన్ని లోటుపాట్లు వున్నా, పేదరిక వ్యతిరేక కార్యక్రమాలు సాధించే ప్రయత్నం, ఆశించినంతగా అమలు జరుగుటలేదు.

29.8 ఉద్యోగం, నిరుద్యోగం

భారతదేశం ప్రథమంగా వ్యవసాయ దేశం. 85 శాతం మంది పనివాళ్లు 1950లో యీ రంగంలోనే వున్నారు. అప్పటినుంచీ నిర్మాణపరమైన మార్పులు జరిగాయి. దీనిలో మూడు కీలకాంశాలు వున్నాయి. వ్యవసాయ భరిత శ్రామికుల సంఖ్య 1977-88 కాలంలో 66 శాతానికి తగ్గిపోయింది. రెండవది, పరిశ్రమల్లో, సేవారంగంలో శ్రామిక సంఖ్య 10శాతం నుంచి 19 శాతానికి యిదేకాలంలో పెరిగింది. మొత్తం ఉద్యోగ రంగంలో వ్యవస్థీకృత శ్రామికుల భాగం 1977-87 కాలంలో 67 నుంచి 76 శాతం పెరిగింది. మూడవది, స్వయం ఉపాధి వ్యక్తుల సంఖ్య క్రమేపీ తగ్గింది. రోజువారీ కూలీల సంఖ్య పెరిగింది. చిన్నరైతులు, సన్నరైతులు తమ వ్యవసాయం కట్టేసినందువల్లనే తమ చిన్నమళ్లని కౌలుకిచ్చి కూలీలు కావడం వల్లనో యిలా జరిగివుండచ్చు.

1972-73 నుంచి 1987 - 88 గానే మొత్తం ఉద్యోగాల్లో నియామకాలు సాలుకు 2.21 శాతం చొప్పున పెరిగాయి. గ్రామీణ ఉద్యోగాలు 1.75 శాతం చొప్పున, పట్టణ ఉద్యోగాలు 4 శాతం చొప్పున పెరిగాయి (దీని 2.4 శాతం జనాభా పెరుగుదలతో పరిశీలించి చూడాలి. ఉద్యోగ పెరుగుదల జనాభా పెరుగుదల కంటే కొంచెం మెరుగు). అదీగాక ఉద్యోగ పెరుగుదల 1960లలో 1970లలోకంటే, 1980లలో కంటే శీఘ్రగతిన సాగింది (పెరుగుదల స్థాయిని, పెరుగుదల వేగంతో చూడాలి. 1980లలో చాలా రకాలైన పెరుగుదల వుంది. కాని దాన్ని పెరుగుదల వేగంతో పోలిస్తే ముందటికంటే తక్కువ అనే చెప్పాలి). వ్యవసాయ రంగంలో ఉద్యోగ అవకాశాల పెరుగుదల 1972-78 నాటి 2.32 శాతం నుంచి 1977-83 నాటికి 1.2 శాతానికి 1983-88 నాటికి 0.65 శాతానికి పడిపోయింది. వ్యవసాయేతర రంగాల్లో 1960లలో 1970లలో ఉత్పత్తి రంగంలో ఉద్యోగం వేగంగా పెరిగింది. అవి 1972లోని 5.10 శాతం నుంచి 1987 నాటికి 2.10 శాతానికి పడిపోయింది. నిర్మాణ పరిశ్రమలోనూ, రవాణా రంగంలోనూ మాత్రమే 2.4 శాతం నుంచి 7 శాతానికి పెరుగుదల వుంది. ఉద్యోగ రంగంలో మరో చిత్రమైన విషయం యేమిటంటే అవ్యవస్థీకృత రంగంలో స్థిరమైన పెరుగుదల వుండడం, ఎక్కువ ఉద్యోగ అవకాశాలు వుండడం.

BRAOU

ప్రణాళికలో పూర్తి ఉద్యోగ కల్పన లక్ష్యంగా వుంది. అయినా దాన్ని సాధించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయింది. నిరుద్యోగం కళ్లకు కనబడేటట్టు పెరిగింది. అయినా నిరుద్యోగం యెంత వున్నదీ లెక్క గట్టడం కష్టం. యేమంటే అధిక సంఖ్యాకులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజీలలో పేరు నమోదు చేయించుకోరు. ఏమైనా అందుబాటులో వున్న గణాంక వివరాలనుబట్టి 1950-89 మధ్యకాలంలో నిరుద్యోగం పెరిగింది. 1961 విద్యార్హతలున్న నిరుద్యోగులు 5.9 లక్షలు. 1989 నాటి యీ అంకె ఒక కోటికి పెరిగింది. నిపుణతలేని నిరక్షర నిరుద్యోగుల సంఖ్య యీ సంఖ్యకంటే ఎక్కువ (అందులోవున్న నిరుద్యోగం లెక్కలూ అంత నమ్మదగ్గవికావు). పెరుగుదల శాతం దృష్ట్యా యాభైల (1950)నుంచి అరవైల(1960) నాటికి డెభైల(1970)నాటికీ క్రమేపీ దిగజారింది.

29.9 ద్రవ్య సంక్షోభం

ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చెయ్యడంలో ప్రభుత్వ పాత్ర పెరుగుతూ వచ్చింది. సామాజిక ఆర్థిక, మానవ మౌలిక సదుపాయాల లాంటివి అందించి పౌరుల ప్రాథమిక అవసరాలకు సహకరించడం ప్రభుత్వం చేతిలో వుంది. దాంతో అందుకు తగ్గ వనరులను సమకూర్చుకోవడం పెద్ద తలనొప్పిగా పరిణమించింది. వనరులను సమకూర్చుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. దాంతో దేశీయంగా, అంతర్జాతీయంగా రుణాలకు యెగబడింది. ఫలితంగా తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తింది. జి.డి.పి ప్రకారం మొత్తం పన్నులు 1950లో 6.5 శాతం వుంటే 1987లో అది 19 శాతం అయింది. ప్రభుత్వ వ్యయంతో మొత్తం పన్నుల నిష్పత్తి చూస్తే, అదేకాలంలో 73 శాతం నుంచి 65 శాతానికి పడిపోయింది. పన్నుల స్వరూపం ప్రత్యక్ష పన్నుల భాగంగా అసమంగా వుంది. మొత్తం పన్ను ఆదాయం 1950లో 37 శాతం వుంటే 1985లో 15 శాతంగా వుంది. పరోక్ష పన్నుల వాటా 63 శాతం నుంచి 85 శాతం అయింది. మొత్తం పన్నుల్లో ఇన్‌కంటాక్స్ వాటా 21 శాతం నుంచి 7.85 శాతానికి అదే కాలంలో పడిపోయింది. సరకు సుంకం మీద ఆధారపడ్డం పన్ను పునాది తగ్గడం ప్రభుత్వ వనరుల సేకరణ వైఫల్యాల్ని సూచించాయి. అటు పక్క వ్యక్తులు భారీగా పన్నులు ఎగవేశారు. కంపెనీలు వ్యాపారులు పన్నులు ఎగవేశారు. దాంతో నల్లడబ్బు భారీగా పేరుకుపోయింది. కొన్ని అంచనాల ప్రకారం నల్లడబ్బు వాటా అధికారయుత ధనమంతా వుందని తెలుస్తుంది. ప్రభుత్వం లోటు బడ్జెట్ మీద వ్యయానికి ఆధారపడింది.

29.10 అభివృద్ధి-ఆర్థిక వ్యవస్థ

రాజకీయ ఆర్థికశాస్త్రం బూర్జువా సమాజంలో వున్న భిన్న ప్రయోజనాపేక్ష బృందాల లేదా వర్గాల రాజకీయ ఆర్థిక నడవడికను అధ్యయనం చేస్తుంది. అలాంటి విశ్లేషణ ముఖ్యం. ఏమంటే పెరుగుదల, మదుపు, నిరుద్యోగం అభివృద్ధి వగైరా గురించి రాజకీయంగా తక్కువ విధానంగా మాట్లాడ్డం వంచన అపులుంది. ఏమంటే పెట్టుబడిదారీ సమాజంలో అవకాశాలు, లాభాలు, నష్టాలు వ్యక్తులకు అసమంగా దక్కుతూ వుంటాయి. బూర్జువా సమాజంలో ప్రభుత్వం ఎక్కువగా సంపన్న వర్గాల వకాల్తాదారుగా, పెత్తందారీ వర్గాలకీ, అణగారిన వర్గాలకీ మధ్యవర్తిగా వుంటుంది. అప్పుడు ప్రశ్న యేమిటంటే ఏవి పెత్తందారీ వర్గాలు, యేవి అణగారినవి అన్నవి. భారతదేశానికి వలస వారసత్వం, భూస్వామ్య పునాది నుంచి సంక్రమించింది అన్నది, వలస పాలన దాన్ని పెద్దగా కదిలించలేదు. దాంతో ఉదారవాద బూర్జువా సమాజంగా అడుగు పెట్టలేదు. ఈ కారణంగానే భారత ప్రజాస్వామ్యం "అర్ధ వ్యూడల్ ప్రజాస్వామ్యం" అని తరచూ అంటూ వుంటారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భిన్న వర్గాలు వున్నాయి. ప్రభుత్వ విధానాలవల్ల కొత్త వర్గాలు పుట్టుకొచ్చేవి. వాటిని వర్గీకరించి, విశ్లేషణా సౌకర్యం కోసం వాటిని మూడు ఆధిపత్య వర్గాలుగా చెప్పుకోవచ్చు. అంటే పారిశ్రామిక బూర్జువా వర్గం, గ్రామీణ సంపన్న భూస్వామ్య వర్గం, పట్టణ బ్యూరాక్రటిక్ వర్గం. ఇందులో ప్రతివర్గమూ వైవిధ్య భరిత అధికారాలకీ, ప్రభావాలకీ తోడుగావున్నదే. ఉదాహరణకు, పారిశ్రామిక వర్గంలో సాంప్రదాయికంగా పెద్ద వ్యవసాయ కుటుంబాలుగా వుండి భారీ పారిశ్రామిక కుటుంబాలుగా పెరిగినవీ వున్నాయి. టాటాల లాగా, బిర్లాల లాగా, కొత్తగా రెక్కలు విప్పుకున్న మధ్య, సన్నకారు స్థాయి పారిశ్రామిక వేత్తలూ వున్నారు. భూస్వామ్య సంపన్న వర్గాల్లో పెద్దస్థాయిలో కమతాల చేతిలో వున్న

సంప్రదాయ ఫ్యూడల్ కులాలూ వున్నాయి. నీటిపారుదల సౌకర్యాలు వున్న ప్రాంతాలనుంచి పైకివచ్చిన సామాన్య కమతాల వాళ్లు, సంపన్న రైతు కుటుంబాలూ కూడా వున్నాయి. బ్యూరాక్రటిక్ వర్గంలో రాష్ట్ర స్థాయికి చెందిన, కేంద్ర స్థాయికి చెందిన అనేకమంది అధికారగణం వాళ్ళు వున్నారు. ఇక యిందులో ప్రభుత్వ శాఖల్లో పెద్ద స్థాయిలో వుండే అధికార్లూ వున్నారు. మొదటి రెండు వర్గాలూ రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చి రాజకీయపరమైన పలుకుబడి పెంచుకుంటారు. ఈ విరాళాల్ని ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఇస్తూ వుంటారు. బదులుగా ఆర్థికంగా తిరిగి లబ్ధి పొందుతూ వుంటాయి. (భారతదేశంలో వున్న చిత్రమైన పరిస్థితి యేమిటంటే ఈ వర్గాలు సమరూప పాదార్థిక వర్గ ప్రయోజనాలకోసం చరించినా, వ్యక్తులు భిన్న కులాలుగా, సామాజిక సోపానశ్రేణిలో తిరిగి వర్గీకృతమయ్యారు.)

పారిశ్రామిక బూర్జువా వర్గాన్ని ప్రభుత్వం లైసెన్సులు, పర్మిట్లు, ప్రభుత్వ అధీన బ్యాంకుల రుణాలు, దిగుమతి కోటాలు, విదేశీమారకం కేటాయింపులు, సుంకం రాయితీలు, భూముల కేటాయింపులు, ఎగుమతి సబ్సిడీలు లాంటి వాటిని యిచ్చి ఆదుకుంటుంది. 1965లో అగ్రభాగంలో వుండే 20 వ్యాపార సంస్థలు మార్కెట్‌లో 65 శాతాన్ని అదుపులో వుంచుకున్నాయి. టాటా, బిర్లాల ఆధిపత్యానికి ఎదురులేకుండానే వుంది. భారత పరిశ్రమలను కాపాడే విధానంవల్ల, గుత్త సంస్థలను నియంత్రించడం అనేది కూడా బడా వ్యాపార సంస్థల ప్రయోజనాలకే దోహదపడ్డాయి. అదేవిధంగా చిన్న, పెద్ద పారిశ్రామిక వేత్తలు భారీ మొత్తాల్లో రుణాలు తీసుకుని, చెల్లించలేదు. ఉద్దేశ పూర్వకంగా, రాజకీయ ప్రయోజనాపేక్షతో, బకాయిలు పడ్డారు. అదేరకంగా అనేక ముడిసరుకులను, ఖనిజాలను, ఇంధనాలను, విద్యుత్‌ను, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వ రంగం ద్వారా సబ్సిడీకి అర్పించుకుని, తన మట్టుకు భారీ లాభాలు పరిశ్రమలతో నోరు మూసుకుని చిక్కుల్లో పడింది. ఇతర వర్గాలన్నిటితో పోలిస్తే యీ వర్గమే యీ క్రమంలో కం'పాప అని చెప్పవచ్చు.

భూస్వామ్య సంపన్నవర్గాలు భూసంస్కరణలకు గండి కొట్ట గలిగింది. ("రాజకీయ సంకల్పం" లేనట్లుగా తరచూ ఇది అభివర్ణితం. అసలు విషయం ఏమిటంటే అన్ని రాజకీయ పార్టీలలోనూ భూస్వామ్య నేపథ్యం వున్న వాళ్ళున్నారు. తమ తమ బంధు వర్గం వాళ్ళ ప్రయోజనాలను కాపాడుకుంటూ వుంటారు). వ్యవసాయ ఆదాయాన్ని పన్ను పరిధికి ఆవలే వుంచారు. మరోపక్క భారీ సబ్సిడీలు, ఉదాహరణకు విద్యుత్, నీటిపారుదల, రసాయన ఎరువులు, రుణాలు లాంటి వాటిలో యెన్నిటినో సంపాదించుకుని లబ్ధిపొందారు. వ్యవసాయ పురోగతి సాధారణంగా దేశ ప్రయోజనాల కోసమే వున్నా, యీ పురోగతి విధానాలు యీ బృందాలకు దామాషా మించి లబ్ధికలిగించాయి. సబ్సిడీలలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశ పెట్టడంవల్ల వ్యవసాయం దురాశాపరుల వడ్డీల బారినుంచి రక్షించి లాభసాటి సాగుగా వైవిధ్యభరితం అయింది. రైతులకు లాభం చేకూర్చాలన్న ఉద్దేశంతో ప్రకటించిన మద్దతు ధరలవల్ల సామాన్య ప్రజల జీవన వ్యయం పెరిగింది. విద్యుత్ సబ్సిడీలవల్ల రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఆర్థికంగా కుంటుపడ్డాయి. భూస్వామ్య సంపన్న వర్గాల ప్రయోజనాలను దేశ విస్తృత ప్రయోజనాలను దృష్ట్యా అదుపు చేశారు. ఆహార ధాన్యాలు రవాణా, పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి నిషేధం, నిర్బంధసేకరణ విధానం వగైరాలు అన్ని రైతు ప్రయోజనాపరుల బృందాల నుంచి తీవ్రంగా నిరసనకు గురయ్యాయి. ఏదిఏమైనా అవి అందుకున్న సబ్సిడీల స్థాయిలో చూస్తే (నీటిపారుదల, రసాయనిక ఎరువుల వగైరా) వాళ్ళు నష్టపోయింది తక్కువే. స్వేచ్ఛా వాణిజ్య ప్రయోజనాల యిష్టారాజ్య దుష్ప్రభావ శక్తుల బారి నుంచి వ్యవసాయాన్ని నియంత్రించడం ప్రభుత్వానికి విధాయకం.

పరిశ్రమలమీద, వాణిజ్యం మీద, వ్యవసాయం మీద ఆధిపత్యం సంపాదించడానికి గాను విధానాలని రూపొందించడంలో బ్యూరాక్రటిక్ వర్గమూ గణనీయమైన పట్టు సంపాదించింది. లైసెన్స్ - పర్మిట్- కోటా పర్యవేక్షణ స్థాపించడంలో అనేక వర్గాల నుంచి భారీ ముడుపులు పిండుకోవడంలో యీ వర్గం వలస పాలనా విధానాన్ని, చర్యలను కొనసాగించింది. తడవ తడవకీ జీతాల సవరింపునీ సాధించింది. తద్వారా పై చెయ్యిగా వున్న వినిమయ మధ్యతరగతిగా రూపొందింది. లంచగొండితనం, సర్వవ్యాప్తి అయిపోయింది.

BRAOU

చెయ్యి తడిచేస్తేనే గాని యే ప్రభుత్వ శాఖలోనూ చిన్న పనికూడ జరగని స్థితి వచ్చింది. అలాంటి వర్గం ప్రభుత్వం భారీ పాలనా విభాగాన్ని, బ్యూరాక్రసీని సృష్టించడంవల్ల వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పించినా అసలు ఎస్టేట్ ఆస్తులు పట్టణాల్లో వుండడంతో మరింత పట్టణీకరణవల్ల లబ్ధి పొందడానికి అనుకూలించాయి. ఈ వర్గం స్థానం మిగిలిన వాటితో ఎలావున్నదీ కచ్చితంగా చెప్పలేం. ప్రభుత్వ విధానాలవల్ల లబ్ధిపొందిన వర్గం యిదే.

అదే సమయంలో భారత ప్రభుత్వం బలహీన వర్గాల ప్రయోజనం కోసం అనేక సంక్షేమ విధానాలను అనుసరించింది. సబ్సిడీలతో, ఆహార సరఫరా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా (పి.డి.ఎస్) జరిపించడం, పేదరిక వ్యతిరేక కార్యక్రమాల ద్వారా రుణాల మంజూరు, ఉన్నత విద్య దాకా ఉచిత విద్య, ప్రజా వైద్యశాలలు లాంటివన్నీ యిలాంటివే. కొంతమంది పేదలు వీటివల్ల లబ్ధిపొందినా, సంపన్న వర్గాలు ప్రజా సేవలద్వారా. అది విద్య కానివ్వండి, వైద్యం కానివ్వండి, పి.డి.ఎస్ కానివ్వండి, ఎక్కువ లబ్ధిపొందాయి. శ్రామిక చట్టాలు వ్యవస్థీకృత శ్రామిక వర్గానికి రక్షణ యిచ్చాయి. కాని అవ్యవస్థీకృత శ్రామిక రంగాన్ని ఆదుకోలేక పోయాయి. కనీస వేతనాలు అనేక రాష్ట్రాల్లో అమలు అవలేదు. పేదవర్గాలకు సంక్షేమ ప్రభుత్వ పథకాలు యేదోచేశాయన్నా పేరుకు లాభం కలిగించాయంతే. అసలు పేదరికం అనుభవించేవాళ్లు నాలుగు దశాబ్దాల అభివృద్ధి తర్వాత జనాభాలో మూడింట ఒక వంతు వుండిపోయారు. ఎక్కువ సందర్భాల్లో కులసోపాన శ్రేణిలో అట్టడుగున వున్న కులాలు పూర్తిగా పక్కనే వుండిపోయాయి, అణగారే వుండిపోయాయి. రాజకీయ లబ్ధికోసం ప్రజాకర్షణంగా ప్రారంభించిన కార్యక్రమాలు, ముఖ్యంగా ఇందిరా గాంధీ 'గరీబీ హటావో', '20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాలు' వూరికే కన్నీటి తుడుపు కార్యక్రమాలుగానే మిగిలిపోయాయి. ఏదిఏమైనా గమనించవలసిన అంశం యేమిటంటే మూడున్నర దశాబ్దాల తర్వాత ప్రభుత్వం తక్షణ సమస్యలైన పేదరికం, ఆకలి వంటి వాటిని పరిష్కరించే ప్రయత్నాలు చేసింది.

చివరగా, భారత ప్రభుత్వం మిగతా ప్రపంచంతో సంబంధాలు పెట్టుకుని తన సార్వభౌమత్వాన్ని నిలిపివుంచుకునే అవసరమూ ఉంది. ప్రణాళికతో, మిశ్రమ ఆర్థిక విధాన వ్యూహంతో, అంతరంగిక వాణిజ్య వ్యూహంతో ప్రయోగాలు చేసింది. అమెరికన్ దాడిని ప్రపంచంలో సమతూకం చేసే సోవియట్ అధికారం వున్నంత కాలం అలా చేసింది. తూర్పు యూరప్ దేశాలు వుండడంవల్ల ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో సాపేక్ష స్వయం ప్రతిపత్తి వుండేటట్టు చూసుకుంది. స్వావలంబన లేకపోవడం, చలనశీల, జీవ చైతన్య పూరిత పెరుగుదల సాధించగలిగే పెట్టుబడిదారీ వర్గం లేకపోవడం అనేవి సరళీకృత విధానాలకూ, విదేశీ పెట్టుబడి ఆమోదానికీ దారితీసాయి. ప్రభుత్వరంగం అనుకున్నంత, ఆశించినంత ప్రోత్సాహం యివ్వలేకపోయింది. దాంతో ప్రణాళికా పద్ధతిమీద నిరాశ పుట్టింది, ప్రభుత్వం మీద విశ్వాసం తగ్గింది. దాంతో ప్రభుత్వం వాణిజ్య సూత్రాల్ని సరళీకృతం చేసింది. విదేశీ పెట్టుబడిరాకుండా దేశీయంగా వున్న విధానాలను సరళీకరించవలసి వచ్చింది. మొత్తం మీద, తర్వాతి దశకాల్లో బాగానే పనిచేసినా, భారతదేశం తూర్పు ఆసియా దేశాలు, కొన్ని లాటిన్ అమెరికా దేశాలు లాంటి తృతీయ ప్రపంచ దేశాలకంటే వెనకబడిపోయింది.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. మొనాపలిస్ అండ్ రెస్ట్రిక్టెడ్ ట్రేడ్ ప్రాక్టీసెస్ ఉద్దేశ్యాలేవి?

.....

.....

.....

.....

BRAOU

2. పేదరిక నిర్మూలన కార్యక్రమాలేవి?

.....

.....

.....

.....

3. ఉపాధికల్పనకై ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలేవి?

.....

.....

.....

.....

29.11 సంగ్రహంగా

1949-89 మధ్య కాలంలో భారత ఆర్థికాభివృద్ధిలో విజయాలూ వున్నాయి, అపజయాలూ ఉన్నాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థకు పరిణామం చెందడం కోసం, సమకాలీన చారిత్రక నేపథ్యంలో మిశ్రమ ఆర్థిక విధాన చట్టం వ్యూహాన్ని అనుసరించారు. ఆ వ్యూహంలో భారీ పరిశ్రమ పెరుగుదలపట్ల యెక్కువ మొగ్గుపెట్టి, సమతూక అభివృద్ధి ప్రాముఖ్యాన్ని, ఎగుమతి పెంపునీ తక్కువ చేశారు. సంపూర్తి స్వావలంబన పెరుగుదలను ప్రోత్సహించడంలో జాతీయ పారిశ్రామిక బూర్జువావర్గ పాత్రను అతిగా అంచనావేశారు. ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యాన్ని యెక్కువగా అంచనావేశారు. దానివల్ల ఆ రంగం లాభసాటికాని రంగాల్లో దూరవలసి వచ్చింది. దానివల్ల ప్రభుత్వానికి ద్రవ్య భారం యెక్కువైంది. 1960ల మధ్య భాగంలో హరిత విప్లవం రావడంతో కరువుల నుంచీ, బయట వాళ్ల మీద ఆధారపడడం నుంచీ దేశం విముక్తమైంది. వ్యవసాయం స్థిరంగా పుంజుకోవడంవల్ల పరిశ్రమల పనితీరు, ఆర్థిక రంగం మొత్తంగా స్థిరపడ్డాయి. ఎగుమతులలో పోటీ పెరగడానికీ, పరిశ్రమల్లో పోటీ పెరగడానికీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధునికం కావడానికీ సరళీకరణ క్రమంగా విధాయకరమవుతుంది. తర్వాత అర్ధభాగంలో ఎగుమతులు పెరిగాయి. విదేశాల నుంచి భారతీయులు పంపే సొమ్ము ఎక్కువ అయింది. దాంతో దేశ విదేశీ మారక నిల్వలు పెరిగాయి. భారతదేశ పరపతి పెరిగింది. దాంతో ప్రభుత్వం యెక్కువగా రుణాలు తేగలిగింది. దానివల్ల వడ్డీ భారం పెరిగింది. పెరుగుదలకోసం, అభివృద్ధి కోసం యెంతో ప్రయాసపడీనా భారతదేశం వర్ధమానదేశంగానే వుండిపోయింది. పేదరికం, నిరక్షరాస్యత, పోషికాహారలోపం, ఆకలి, నిరుద్యోగం మిగిలే వున్నాయి. చాలా ఆసియా, లాటిన్ అమెరికాదేశాల కంటే భారతదేశ పురోగతి అధ్వాన్నంగానే వుండిపోయింది. తలసరి ఆదాయం రీత్యా ఎగుమతుల రీత్యా, పారిశ్రామిక వ్యవసాయ పెరుగుదల రీత్యా యిలాంటి పరిస్థితి వుండిపోయింది.

నాలుగు దశాబ్దాల్లోనూ సాధించిన అభివృద్ధి ఫలితాలు పారిశ్రామిక వేత్తలకూ, పెద్ద రైతులకూ, బ్యూరాక్రటిక్ వర్గానికీ లాభం చేకూర్చి పెట్టింది. ప్రభుత్వ సంస్థల శ్రామికులు, వృత్తి వర్గమూ, మధ్య రైతాంగమూ యిందులో స్వల్పంగా లబ్ధి పొందారు. పేదలు, అవ్యవస్థీకృత రంగ శ్రామికులు- వాళ్లు వ్యవసాయ కార్మికులు కానివ్వండి, పట్టణ ప్రాంత సాదా రంగ కార్మికులు కానివ్వండి- యీ క్రమంలో లబ్ధిపొందింది యేమీ లేదు. ఎనభైల(1980) ఆఖరున భారతదేశం - సాధించిన విజయాలతో , ఎదుర్కొన్న అపజయాలతో, సమస్యలతో అవకాశాలతో, పూర్తి సరళీకరణ విధానాలతో- ప్రపంచీకరణ జరుగుతున్న లోకంతో సన్నద్ధమైవుంది.

BRAOU

29.12 మీ అవగాహన పరీక్షించుకోండి : జవాబులు

1. ఆచార్య పి.సి. మహాలనబిస్ భారతీయ ప్రణాళికా రచన ఘపకర్త.
2. ప్రణాళిక రచన ఉద్దేశాలు త్వరిత పెరుగుదల, పూర్తి ఉద్యోగిత, స్వావలంబన, సామాజికన్యాయం.
3. ఆరవ పంచవర్ష ప్రణాళిక సాధనలు:
   ఎ) 5.8శాతం జి.డి.పి పెరుగుదల
   బి) వ్యవసాయరంగం ప్రతికూల వాతావరణ పరిస్థితులకు నిలదొక్కుకునేదిగా మారుట
   సి) పెట్రోలియం, ఇంధనం, సహజవాయువు, సిమెంట్, ఎరువుల ఉత్పత్తిలో గణనీయ పెరుగుదల
   డి) 48.3 నుంచి 37.4 వరకు పేదరికం శాతం తరుగుదల

II. 1. 'మొనాపలీస్ అండ్ రెస్ట్రిక్టెడ్ ట్రేడ్ ప్రాక్టీసెస్' ఉద్దేశం. 20 కోట్ల స్థూల ఆస్తులున్న భారీ పారిశ్రామిక సంస్థల పెరుగుదలను నియంత్రించడం
   2. పేదరికం నిర్మూలన కార్యక్రమాలు:
      1. వ్యక్తిగతంగా లబ్ధి అందించే కార్యక్రమాలు, ఉదాహరణలు: ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల (ఏ ఆర్ డి పి) వంటివి.
      2. ఉపాధి కల్పనకై రూపొందించిన కార్యక్రమాలు
         ఎ) క్రాష్ స్కీమ్ ఫర్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ (సి.ఎస్.ఆర్.ఇ)
         బి) పనికి ఆహార పథకం (ఎఫ్.డబ్ల్యు.సి.)
         సి) జాతీయ గ్రామీణ ఉద్యోగ కార్యక్రమాలు (ఎన్.ఆర్.ఇ.పి)
         డి) వాతావరణ ప్రతికూల ప్రాంతాల అభివృద్ధి
         ఇ) కనీస అవసరాల కార్యక్రమాలు.

3. ఎ) ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా తక్కువ ధరకు ఆహార ధాన్యాల పంపిణీ
   బి) పేదరిక వ్యతిరేక కార్యక్రమాల ద్వారా రుణాల మంజూరు
   సి) ఉన్నత విద్యాస్థాయి వరకు ఉచిత విద్య
   డి) ప్రభుత్వ ఆసుపత్రులు

29.13 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

1. స్వాతంత్ర్యానంతర కాలంలో భారత అభివృద్ధి వ్యూహం గురించి వివరించండి.
2. 1950-89 మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నుల గురించి ఆమార్పులు, విధానాలు ఎలా పెరుగుదలని ప్రభావితం చేశాయో వివరించండి.
3. భారత ఆర్థిక వ్యవస్థ గణనీయ విజయాలు, వైఫల్యాలు యేమిటి?
4. భారతీయ ఆర్థికాభివృద్ధి రాజకీయార్థిక చలనశీలత యేమిటి?

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

1. నేషనల్ ప్లానింగ్ కమీషన్ గురించి వ్రాయండి.
2. ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో చేపట్టిన పేదరిక నిర్మూలన కార్యక్రమాలేవి?
3. ద్రవ్యసంక్షోభం అంటే ఏమిటి?

B R A O U

29.14 ఉపయుక్త గ్రంథాలు

1. Lucas EB Robert and Lucas : *(1988) The Indian Economy Recent Development and future Prospect (Edited), Delhi*
2. Choudhuri, Prasit : *(1978) The Indian Economy Poverty and Development, Delhi*
3. Tomlison BR : *(1998) The Economy of Modern India 1860-1970, Cambridge University press*
4. Mukerjee Dilip : *(1998) Indian Industry Problems and Prospects, Delhi*
5. Dutt, Rudder and Sundaram : *(1998) Indian Economy, Delhi*
6. Economic Surveys : *1979-80, 1984-85, 83-94 Ministry of Finance, Government of India.*

BRAOU

భాగం - 30 సామాజిక అభివృద్ధి

విషయక్రమం

30.0 లక్ష్యాలు

30.1 పరిచయం

30.2 సామాజిక-సాంస్కృతిక అభివృద్ధి

- 30.2.1 ఆధునికీకరణ
- 30.2.2 సంస్కృతీకరణ
- 30.2.3 లౌకికవాదం
- 30.2.4 సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వ ప్రయత్నములు

30.3 విద్యాభివృద్ధి

- 30.3.1 రాజ్యాంగ నిబంధనలు
- 30.3.2 విద్యాకమీషన్లు
- 30.3.3 ప్రాథమిక పాఠశాల విద్య
- 30.3.4 ఉన్నత విద్య
- 30.3.5 విద్యలో సమానత్వం
  - 30.3.5.1 మహిళా విద్యా పెంపుదల
  - 30.3.5.2 షెడ్యూల్డ్ కులముల, తెగల విద్యాభివృద్ధి
- 30.3.6 శాస్త్రీయ సాంకేతిక రంగాలు

30.4 మహిళాభివృద్ధి

- 30.4.1 మహిళల అంతస్థు లేదా స్థాయి
  - 30.4.1.1 స్త్రీల నిష్పత్తి
  - 30.4.1.2 అక్షరాస్యత
  - 30.4.1.3 ఉపాధి
- 30.4.2 రాజ్యాంగ, శాసన అంశములు
- 30.4.3 పంచవర్ష ప్రణాళికల కాలంలో మహిళాభివృద్ధి
- 30.4.4 మహిళల ఉద్యమాలు

30.5 షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి

- 30.5.1 రాజ్యాంగ సంబంధ నిబంధనలు
- 30.5.2 రిజర్వేషన్లు
- 30.5.3 పంచవర్ష ప్రణాళికల్లో కేటాయింపులు

30.6 సంగ్రహంగా

30.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

30.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

30.9 ఉపయుక్త గ్రంథాలు

30.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

1. సంస్కృతీకరణ, ఆధునికీకరణ, లౌకికవాదాల అర్థాలు,
2. మహిళల స్థాయి, మహిళా ఉద్యమాలు, మహిళాభివృద్ధికి దోహదపడిన రాజ్యాంగ, శాసన నిబంధనలు, పంచవర్ష ప్రణాళికలు.

BRAOU

3. పాఠశాల స్థాయిలో, ఉన్నత విద్యలో అభివృద్ధి, శాస్త్రీయ సాంకేతిక రంగాలు, విద్యలో న్యాయం
4. షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి సంబంధించిన వివిధ చర్యలు.

30.1 పరిచయం

సమానత్వం, అధికారశక్తిని పెంపొందించుకొనుటకు సామర్థ్యం పెంపొందింప చేయటం ఈనాటి సామాజిక అభివృద్ధిలో మౌలికమైన సమస్యలు. సమానత్వం ఒక లక్ష్యమే కాక, మానవ హక్కులకు ఒక మూల భూమికయే కాక, సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించుటకు సాధనం. విభిన్నతలకు, విశాలత్వానికి నిలయమైన భారతదేశంలో సామాజిక బంధాన్ని ఒకటిగా ఉంచేది సమానత్వం మాత్రమే. భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకత్వం ఈ వాస్తవాన్ని స్పష్టంగా అర్థం చేసుకొని, గ్రహించగలిగారు. స్వాతంత్ర్యానంతరం, ఈ లక్ష్యసాధన దిశలో అవసరమైన లక్ష్యాలను రాజ్యాంగంలో పొందుపరచారు. ఒక ప్రాంతానికి మరోప్రాంతానికి, ఒక సమూహమునకు మరొక సమూహమునకు, వ్యక్తికి వ్యక్తికి మధ్య సమానత్వమును పెంపొందింపచేయుటకు సహకరించు నిబంధనలు రాజ్యాంగంలో ఉన్నాయి. భారతీయ పౌరులందరికి లింగ, మత, కుల, విశ్వాసాల తేడా లేకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, సమానమైన అంతస్థును, అవకాశమును రాజ్యాంగం చట్టపరమైన హామీనిచ్చింది. సామాజిక అభివృద్ధి క్రమంలో సంపద, ఉత్పత్తి మార్గాలు ఒకేచోట కేంద్రీకృతం కాకుండా చూడడం. భౌతిక వనరులను అందరికి పంచటం రాజ్యబాధ్యతగా నిర్ధారించింది. జాతీయ అభివృద్ధి సాధనలో ఆదేశక సూత్రాల ద్వారా ఏ లక్ష్యాలను, ఎంత కాలంలో సాధించాలన్నది రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంటుంది.

30.2 సామాజిక-సాంస్కృతిక అభివృద్ధి

కోరుకోదగిన సామాజిక పరివర్తనే అభివృద్ధి కోరుకున్న దిశలో ఏదో ఒకటో రెండో రంగాల్లో కాక, అన్నిరంగాల్లో పెరుగుదలే అభివృద్ధి అని చెప్పవచ్చు. మన సామాజిక అభివృద్ధిని కొలిచే సాధనాలుగా విద్యాపెరుగుదల, సంపదను న్యాయబద్ధంగా పంచటం, కూలి, జీతభత్యాలలో తేడాలు ఎక్కువగా లేకుండా ఉండటం, హేతుబద్ధమైన జనాభా విధానం, అత్యధిక సంఖ్యాకుల, అల్పసంఖ్యాకుల మధ్య సుహృద్భావ సంబంధాలుండటం అన్నవాటిని చెప్పుకోవచ్చు. సోషలిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం అన్న లక్ష్యాల సాధనకు మార్గమే పైన పేర్కొన్న అంశాలలో కూడుకొన్న అభివృద్ధి.

30.2.1 ఆధునికీకరణ

పరివర్తన లేదా మార్పును తెలిపే మరోపదమే ఆధునికీకరణ. ఆధునికీకరణ ఇక కోరుకోదగినదని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. సంప్రదాయానికి వ్యతిరేకతే ఆధునికీకరణ కాదు. మనదేశంలో అనేకవేల సంవత్సరాల నుంచి ప్రచారంలో ఉన్న సంప్రదాయాలున్నాయి. అట్టి సంప్రదాయాల్లో కొన్ని కొత్తవైన సాంకేతిక పరిజ్ఞానంతో సరిపోవు. అట్టి సంప్రదాయాలను వదులుకోక తప్పదు. ఆహారమును వండుకొనుటకు గ్యాస్‌పొయ్యి లభ్యంకావటంతో, సంప్రదాయబద్ధమైన కట్టెల పొయ్యిని మరచిపోవాల్సిందే. సమగ్రమైన ఆధునికీకరణ మాత్రమే అభివృద్ధి అవుతుంది కాని, అసమగ్ర ఆధునికీకరణ కాదన్నది తెలుసుకోవాలి. పౌష్టిక ఆహారం లభ్యంకాకుండా మహిళాభివృద్ధి, బాలబాలికల అభివృద్ధి పూర్తి కాదు. ఆధునికీకరణ అభివృద్ధి పథకం వ్యూహంలో అంతర్గతమై అన్ని స్థాయిల సాంస్కృతిక, వ్యవస్థీకృత విధానములను ప్రభావితం చేస్తున్నది. భూ సంస్కరణలు, గ్రామ పంచాయితి వ్యవస్థ, కమ్యూనిటి డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు భారతీయ గ్రామీణ ప్రజానీకాన్ని ఆధునికీకరణ చేయుటలో కీలకమైన పాత్ర నిర్వహించాయి.

30.2.2 సంస్కృతీకరణ

సంస్కృతీకరణ అన్న భావనను భారతీయ సామాజిక మానవీయ శాస్త్రవేత్త ఆచార్య యమ్.యన్. శ్రీనివాస్ లోతుగా అధ్యయనం చేసి, కులవ్యవస్థతో కూడిన సమాజాల్లో సంస్కృతీకరణ కనిపిస్తుందన్నారు.

BRAOU

కుల వ్యవస్థీకరించిన సమాజ చట్రంలో ఒక ఉపజాతి లేదా ఉపకులం తన అంతస్థును పెంచుకొనుటకు పై అంతస్థులో నున్న కుల సంప్రదాయాలను, భావజాలాన్ని అనుకరించటమే సంస్కృతీకరణ. ఏ సమాజంలోనైనా, తక్కువ అంతస్థులోనున్న ఉపకులాలు పైఅంతస్థులో నున్న నీతిని, సంప్రదాయాన్ని, ఆచార వ్యవహారాలను అనుకరిస్తారు. ఎప్పుడైతే ఒక తక్కువ అంతస్థులో నున్న కులం పైఅంతస్థును అనుకరించటం మొదలు పెడుతుందో, సంస్కృతీకరణ మొదలవుతుంది. న్యాయ సంబంధమైన బలవంతంతో కాక, సామాజిక శక్తుల అనుకూలతతో మాత్రమే సంస్కృతీకరణ సాధ్యమౌతుంది.

8 శతాబ్దాల కాలాల్లో మైసూరులోని లింగాయతులు తమ జీవన విధానాన్ని సంస్కృతీకరణకు గురిచేసుకొన్నారు. ఈ మధ్యకాలంలో సంస్కృతీకరణ విస్తృతంగా కనిపిస్తుంది. కేరళకు చెందిన ఇలవన్లు, దక్షిణ భారతదేశానికి చెందిన కమ్మరివారు, పంజాబుకు చెందిన రామగరియాలు, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన చామార్లు తమ జీవనవిధానాన్ని సంస్కృతీకరణకు మూలప్రేరణం తమ సామాజిక-ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా సవాలు మాత్రమే కాని, సాంస్కృతిక అనుకరణ కాదు.

30.2.3 లౌకికవాదం

భారతదేశం ఒక లౌకిక రాజ్యం. ఇక్కడ రాజ్యం నుంచి మతాన్ని విడదీసారు. పౌరులందరకు తమకు నచ్చిన మత విశ్వాసాలను కలిగియుండుటకు, పూజించుటకు మౌలిక హక్కులను రాజ్యాంగం హామీ ఇచ్చింది. ఏ వ్యక్తికి మతపరంగా తేడా చూపించకూడదని రాజ్యాంగం నిర్ధారించింది. ప్రజాసంక్షేమం, ప్రజానీతినియమాలకు భంగం కాకుండా, ప్రతి వ్యక్తికి మత స్వేచ్ఛ ఉంది. రాజ్యాంగం భారతదేశాన్ని ఒక లౌకిక రాజ్యంగా ప్రకటించినా, ఆచరణలో అనేక అవరోధాలు లోతుగా అధ్యయనం చేసినవారికి కనుపిస్తాయి. భారతీయ సమాజంలో లౌకిక పునాదులు బలంగా లేవు. రాజకీయ సమీకరణలో మతం ఒక బలమైన ఆయుధంగా ఉపయోగింపబడుతున్నది. మత ప్రాదిపదికపైన రాజకీయ పక్షాలు ఏర్పడుతున్నాయి. ఎన్నిక ప్రక్రియలో మతభావనను బలంగా వాడుకొని లబ్ధిపొందుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు సంకుచిత దృక్పథంతో వ్యవహరించి తమ స్వప్రయోజనాలను సాధించుకుంటున్నారు. ఫలితంగా మతం రాజకీయాల్లో బలమైన శక్తి అవుతున్నది. మత విద్వేషాగ్ని భారతీయ సామాజిక, దేశ సమగ్రతకు పెద్ద ముప్పు. భారతదేశపు రాజ్యాంగం, సోషలిజం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం అనే పునాదులపై ప్రజాస్వామ్య భవంతిని నిర్మించటం తన ధ్యేయంగా పెట్టుకొన్నది.

సంస్కృతీకరణ కన్న లౌకికీకరణ విశాలమైనది. సంస్కృతీకరణ సమాజంలోని కొన్ని సమూహాలను మాత్రమే ప్రభావితం చేయగా, లౌకికీకరణ పట్టణ మధ్యతరగతి వారికి మాత్రమే నచ్చగా, సంస్కృతీకరణ తక్కువ కులాలను ఆకర్షిస్తున్నది. లౌకికీకరణ దృక్పథం ఆధునికమైనదే కాక, ఆధునికీకరణలోంచి పుట్టిన భావజాలం కాగా, సంస్కృతీకరణ సంప్రదాయంతో ముడిపడి వుంది.

30.2.4 సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వ ప్రయత్నాలు

భారతదేశంలోని విభిన్న సంస్కృతులను గుర్తించటమేకాక, వాటిని భారతీయ సంస్కృతి అనే మహా ప్రవాహంలో చేరే ఉపనదులుగా భావించిన ప్రభుత్వం, ఆ సిద్ధాంతాన్ని దృష్టిలో ఉంచుకొని, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పూనుకొంది. భారత రాజ్యాంగంలోని ఉన్నత ఆదర్శాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిదర్శనాలుగా చెప్పవచ్చును. స్వాతంత్ర్యం సాధించిన మొదటి దశాబ్దంలోనే ఎన్నో ఆటంకాలున్నప్పటికి సాంస్కృతిక రంగంలో కొన్ని విధానాలను అమలు పరచారు.

గత ఐదు దశాబ్దాలలో కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు తమ లక్ష్యానికి అనుగుణంగా కొన్ని విధానములను పరిమిత స్థాయిలో ప్రవేశపెట్టారు. అందులో కొన్ని -

- భారతీయ నాగరికత, సంస్కృతి కళలను గురించిన పాఠ్యాంశములను విద్యారంగంలో క్రమంగా ప్రవేశపెట్టడం.

భారతీయ సంస్కృతి విశేషాలను కాపాడుటకు, ప్రచారం చేయుటకు, పెంపొందింప చేయుటకు కృషి చేస్తున్న భారత పురావస్తు శాస్త్ర శాఖను పటిష్టపరచుటకు, జాతీయ మ్యూజియాన్ని స్థాపించి, ప్రాంతీయ మ్యూజియంలైన సాలార్‌జంగ్, రుధాకాష్, రామపూర్‌రాజ, విక్టోరియా మెమోరియల్ వాటిని బలోపేతం చేయుట.

- సంగీత నాటక కళా అకాడమి, లలిత కళా అకాడమి, సాహిత్య అకాడమీలనే మూడు జాతీయ అకాడమీలను, జాతీయ మ్యూజియంను న్యూఢిల్లీలో స్థాపించుటయే కాక, సాంస్కృతిక సంబంధాల పెంపుదలకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ స్థాపించారు.

స్వాతంత్ర్యానంతర భారతదేశం మిగిలిన దేశాలతో సాంస్కృతిక సంబంధాలను పెంపొందింప చేసుకొనుటకు కృషిచేయటమేకాక, ప్రత్యేక అధ్యయన కేంద్రాలైన ఇస్లామిక్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్, సంస్కృతం, ఆధునిక భారతీయ భాషల, ఇంగ్లీష్, యూరోపియన్ భాషల అధ్యయనానికి గట్టి కృషి మొదలు పెట్టింది.

30.3 విద్యాభివృద్ధి

ఏ సమాజంలోనైనా విద్యాభివృద్ధి, ఆ సమాజపు పరిణామాన్ననుసరించి, సామాజిక-ఆర్థిక వ్యవస్థలకు సమాంతరంగా జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. ఇంకా చెప్పాలంటే, *"సమాజపు ఆర్థిక, రాజకీయ అవసరాలు అంతిమంగా విద్యాభివృద్ధిని నిర్ణయిస్తాయని, అందులోను వర్గాల క్రింద విభజింపబడిన సమాజంలో, సమాజంలోని బలమైన వర్గాల అవసరాలే విద్యాభివృద్ధిని నిర్ధారిస్తాయి".*

వలస పాలనలో బ్రిటీష్‌వారిచే సమర్థింపబడిన ప్రాచ్యవాదులకు, పశ్చిమదేశాల విద్యావిధానాన్ని సమర్థించిన రాజా రామ్‌మోహన్ రాయ్‌లకు మధ్య జరిగిన వాదోపవాదాలు, ఆధునిక విద్యా విధానం నుంచి, స్వాతంత్ర్య పోరాటం నుంచి దూరం చేయుటకు భారతీయులను వర్గాలుగా చీల్చిన బ్రిటీష్ వ్యూహం గుర్తుకు తెచ్చుకొంటే పై అభిప్రాయం ఎంత నిజమో అర్థమవుతుంది. రాజా రామ్‌మోహన్ రాయ్, విద్యాసాగర్, జ్యోతిబా పూలె, సావిత్రిబాయ్ పూలె, సయ్యద్ అహ్మద్ ఖాన్ 1912లోనే శాసనం ద్వారా ప్రాథమిక విద్యను నిర్బంధం చేయాలని ప్రయత్నించిన గోఖలేలు ఆధునిక విద్యావ్యాప్తికి కృషి చేసారు. మహాత్మాగాంధీ, మహర్షి కార్వే, డా. అంబేద్కర్‌లు అభివృద్ధికరమైన విద్యా సంబంధ భావాల వ్యాప్తికి ఎంతగానో కృషి చేసారు.

30.3.1 రాజ్యాంగ నిబంధనలు

73వ, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలు వికేంద్రీకృత విద్యాప్రణాళికకు, యాజమాన్యానికి సంబంధించి నూతన దృక్పథం ప్రవేశపెట్టాయి. రాజ్యాంగంలో పేర్కొనబడ్డ ఆదేశక సూత్రాల క్రింద, 39వ అధికరణంలోని, 'ఈ' సెక్షన్ ప్రకారం "కార్మికుల, పురుషుల, స్త్రీల, చిన్న పిల్లల ఆరోగ్యాలకు, శక్తి సామర్థ్యాలకు భంగం కలిగించే చర్యలు చేపట్టకూడదన్నారు. అంతేకాక ఏ పౌరుడు కూడా తన వయస్సుకు, ఆరోగ్యానికి నష్టం కలిగించే వృత్తిని బలవంతంగా చేపట్టకుండా చూడాల"ని తెలుపుతుంది. పిల్లలకు 14 సంవత్సరముల వరకు నిర్బంధంగా ప్రభుత్వమే చదువు నేర్పాలని 45వ అధికరణ తెలుపుతుంది.

30.3.2 విద్యాకమీషన్లు

1947 అనంతరం విద్యాసంబంధమైన విషయాల అధ్యయనానికి రెండు కమీషన్లు నియమించింది. అవి (1) 1948లో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన విశ్వవిద్యాలయ విద్యాకమీషన్‌ను (2) 1952లో సెకండరీ ఎడ్యుకేషన్ కమీషన్‌ను డా. లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షతన నియమించారు. రాధాకృష్ణన్ నివేదిక సాంకేతిక నిపుణులకు తక్షణ అవసరముందని పేర్కొని, భారత దేశమంతటా అటువంటి సాంకేతిక నిపుణుల అవసరాన్ని తీర్చుటకు సంబంధిత కోర్సులు ఏర్పాటు చేయాలని, వాటిలో శిక్షణ పొందిన యువకులు సాంకేతిక

BRAOU

అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడతారని, మనం స్థాపించబోయే నూతన పరిశ్రమలలోకి కావలసినంతమందిని తయారుచేయాలని చెప్పారు.

లక్ష్మణస్వామి మొదలియార్ నివేదిక కూడా ఈ అవసరాన్నే బలంగా చెప్పి, అందుకు అవసరమైన సాంకేతిక పాఠశాలలు, పాలిటెక్నిక్‌లు, బహుళార్థక విద్యను బోధించే పాఠశాలలు, కేంద్రస్థాయి సాంకేతిక కళాశాలలు స్థాపించాలన్నది స్పష్టంగా చెప్పింది. చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య పెరగటంతో 1964లో డి. యస్. కొఠారి అధ్యక్షతన ఒక కమీషన్‌ను నియమించారు. 1966లో కొఠారి తన నివేదికను సమర్పించారు. ఆ నివేదిక పేరు **'విద్య-జాతీయాభివృద్ధి'**. ఆ నివేదిక నూతన సంక్షోభం గురించి సమగ్రపు దర్యాప్తును ప్రతిబింబిస్తుంది. కొఠారి పాత విధానంనకు (11+4) బదులుగా 10+2+3 సంవత్సరాల విద్యాకాలాన్ని సూచించింది.

1969లో ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను నడిపే తీరు గురించి పరిశీలించమని గజేంద్రగడ్కర్ కమీషన్‌ను నియమించింది. ఈ నివేదిక రాష్ట్రప్రభుత్వాలకు విశ్వవిద్యాలయాల అజమాయిషీని ఇచ్చింది. ఎదురవుతున్న అవరోధాలను దృష్టిలో ఉంచుకొని, విద్యా ప్రణాళిక రూపొందించాల్సిన ఆవశ్యకత తెలిపింది. "రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, వ్యవస్థీకృత నేపథ్యంలోను, ఆర్థిక పరమైన పరిమితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ వ్యవస్థను ఆలోచించవలసిన ఆవశ్యకతను గురించి తెలిపింది".

30.3.3 ప్రాథమిక పాఠశాల విద్య

1960 నాటికి ఆదేశక సూత్రాలు 45వ అధికరణ ప్రకారం అందరికి ప్రాథమిక పాఠశాల స్థాయి విద్య ఒక రాజ్యాంగబద్ధమైందిగా సాధించవలసియున్నది. ఈనాటికి భారతీయ విద్యావ్యవస్థ ప్రపంచంలోనే ఒక పెద్ద వ్యవస్థగా రూపుతీసుకుంది. 0.57 మిలియన్ ప్రాథమిక పాఠశాలలో 105 మిలియన్ల బాలబాలికలు చదువుకొనుచుండగా, 0.27 అనియత విద్యాకేంద్రాలున్నాయి. 0.15 మిలియన్ ఉన్నత ప్రాథమిక పాఠశాలల్లో 38.7 మిలియన్ల బాలబాలికలు చదువుకుంటున్నారు. ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాల స్థాయిలో చదువుకుంటున్నవారి సంఖ్య పెరుగుతున్నా, మధ్యలో చదువుమాని వేసే బాలబాలికలను ఆపలేకపోతున్నారు.

30.3.4 ఉన్నత విద్య

ఉన్నత విద్యను బోధించే కళాశాలలు, విశ్వవిద్యాలయాల సంఖ్య ఆశ్చర్యం కలిగించే విధంగా పెరిగింది. అదేవిధంగా చదివేవారి సంఖ్య కూడా బాగా పెరిగింది. 1947 నాటికి భారతదేశంలో 25 విశ్వవిద్యాలయాలు, 700 కళాశాలలుండగా, 1990 నాటికి విశ్వవిద్యాలయాల సంఖ్య 214 కి పెరిగి, ఈ దశాబ్ద కాలంలో మరిన్ని కొత్త విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. 1994 నాటికున్న 8210 కళాశాలలు, ప్రతి సంవత్సరం లెక్కపెట్టలేనన్ని కళాశాలలు ఆరంభం కావటంతో, వాటి సంఖ్య లెక్కపెట్టలేనంతగా పెరిగిపోయినాయి. 1947 నాటికి ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య ఒక లక్షవుండగా, 1994 నాటికి వారి సంఖ్య 5 మిలియన్లకు పెరిగి లేదా 50% రెట్లు పెరిగింది. రాజ్యాంగం ఏర్పరచుకొన్న అనంతరం ఉన్నత విద్యారంగంను అజమాయిషీ చేయుటకు స్వతంత్ర ప్రతిపత్తితో 1956 నాటి విశ్వవిద్యాలయాల విరాళాల కమీషన్ నిర్ణయం ప్రకారం యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ సంస్థను రూపొందించారు.

ఉన్నత విద్యాసంస్థలలో 1950-51 నాటికి 0.04 లక్షల మంది మహిళలు చదువుతుండగా, వారి సంఖ్య 1993-94 నాటికి 15.9 మిలియన్లకు పెరిగి, మహిళలలో చదివే వారి సంఖ్య 40 రెట్లు పెరిగింది. 1950-51 ప్రతి వందమంది పురుషులకు 14 మంది మహిళలు చదవగా, 1993-94 నాటికి వారి సంఖ్య 49కి చేరింది. మహిళలలో ఉన్నత విద్యను అభ్యసించేవారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు 1981-82 లోనున్న 27.7 శాతం నుంచి 1985-86 నాటికి 29.06 శాతంగాను, 1993-94 నాటికి 33.05 శాతంగాను అభివృద్ధి చెందింది. మహిళలకొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన విద్యాసంస్థలు ఉన్నత రంగంలో 1980-81 నాటికి 644 ఉండగా, 1990-91 నాటికి వాటి సంఖ్య 874కి పెరిగి, దశాబ్ద కాలంలో

BRAOU

మహిళా విద్యా సంస్థల సంఖ్య 35 శాతం పెరిగింది. మహిళాభ్యుదయాన్ని విమర్శనాత్మకంగా, తులనాత్మక అధ్యయనం చేయుటకు వీలుగా 'మహిళా అధ్యయనం'ను ఒక ప్రత్యేక విషయంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ వారు అనేక విశ్వవిద్యాలయాల్లో స్థాపించి సహాయపడుతున్నారు.

30.3.5 విద్యలో సమానత్వం

స్వాతంత్ర్యానంతరం విద్యా అవకాశాలు విస్తృతం కావటంతో, సామాజిక అభివృద్ధి రంగాల్లో అసమానతలను కనిష్ట స్థాయికి తీసుకురావచ్చని ఆశపడ్డాం. కాని స్వాతంత్ర్యానంతరం 25 సంవత్సరాల్లో అందరికి సమానంగా అవకాశాలుంటాయన్నది సాధ్యం కాలేదు. సమాజంలోని కొన్ని వర్గాలు మాత్రమే ఈ రకమైన విద్యావకాశాలు అందిపుచ్చుకోవటంతో, ఈ లాభం పొందని వర్గాలకు, పొందిన వర్గాలకు మధ్యనున్న వ్యత్యాసాలు మరింతగా పెరిగాయి. షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల యువతీయువకులలో విద్యా అవకాశాలు పెంచేందుకు జరుగుతున్న కృషి మంచి ఫలితాలనే ఇచ్చింది.

30.3.5.1 మహిళా విద్యా పెంపుదల

1986 నాటి జాతీయ విద్యావిధాన పత్రం "మహిళా సాధికారత సాధనలో విద్య సముచితమైన పాత్ర పోషిస్తుందని" పేర్కొంది. మహిళా విద్యను పెంపొందింప చేయటంవల్ల ఒక మహిళ మాత్రమే కాక యావత్ సమాజం అభివృద్ధి చెందుతుంది. మహిళా విద్యను పెంపొందింపచేయుటకు ఈ క్రింది చర్యలు తీసుకోబడ్డాయి.

- నల్లబల్ల పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం 93,303 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయినులను నియమించుటకు ఆదేశాలు జారీ చేసింది.
- ఈ ఉద్యోగాల్లో 69, 276 మందిని నియమించగా 57.39 శాతం మహిళలు ఉద్యోగాలు పొందారు.
- మహిళలకు స్ఫూర్తినిచ్చేందుకు ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళా సమాఖ్యలు కృషి చేస్తున్నాయి.
- విద్యారంగంలో మహిళల పాత్రను పెంపొందింప చేయుటకు వయోజన, వృత్తి విద్యారంగాల్లో మహిళలను గణనీయంగా పాల్గొన చేయుటకు కృషి జరుగుతున్నది.
- నవోదయ విద్యాలయాల్లో 28 శాతం సీట్లు బాలికలకు కేటాయించబడ్డాయి.

30.3.5.2 షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగల విద్యాభివృద్ధి

భారతదేశంలోని షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులను, మిగిలిన విద్యార్థులతో సమాన స్థాయిలో చేయుటకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఆ చర్యలు ఏమనగా

(ఎ) 14 సంవత్సరముల వయస్సు వరకు బాలబాలికలను పాఠశాలలకు పంపుటకు కుటుంబాలకు తగిన ప్రోత్సాహమిచ్చుట

(బి) పారిశుధ్యకార్మికుల పిల్లలకు ప్రిమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు చేయుట

(సి) షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల వారిని ఉపాధ్యాయులుగా తీసుకొని, నియమించుట

(డి) విస్తృతంగా బాల్వాడీలను, ఆశ్రమ పాఠశాలలను స్థాపించి సామాజికంగా వెనుకబడిన బాలబాలికల విద్యాసక్తిని పెంపొందింప చేయుట.

30.3.6 శాస్త్రీయ సాంకేతిక రంగాలు :

విద్యారంగానికి సంబంధించిన ముఖ్య అంశం శాస్త్రీయ సాంకేతిక రంగాలను విద్యతో అనుసంధానం చేయటం. మానవ వికాస క్రమంలో ఉత్పత్తి రంగంలో వచ్చిన సాంకేతిక పరిణామాలు మరెన్నో నూతన పరిణామాలకు సహాయపడ్డాయి. మానవ విజ్ఞాన పెంపుదల మార్గంలో పుస్తక ప్రచురణ అనేది ఒక గొప్ప మైలురాయి. ఆహార ఉత్పత్తి రంగంలో శాస్త్రీయ సాంకేతిక పరిణామాలు ఎన్నో గణనీయమైన మార్పులు

BRAOU

ప్రవేశపెట్టాయి. మానవ వికాస క్రమంలో ఈనాడు వ్యాప్తిలోనున్న ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ మరో ముఖ్యమైన మైలురాయి.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. సంస్కృతీకరణ అనగా నేమి?

.....

.....

.....

.....

2. నూతన విద్యావిధానంలోని మూడు ముఖ్య అంశములను తెల్పండి?

.....

.....

.....

.....

3. స్వాతంత్ర్యానంతరం స్థాపించబడిన రెండు విద్యావిషయక కమీషన్ల గురించి వ్రాయండి?

.....

.....

.....

.....

30.4 మహిళాభివృద్ధి

జనాభాలో సగంమంది అయిన మహిళలు చురుకుగా, సమాన స్థాయిలో అభివృద్ధి సాధనలో పాల్గొన్నప్పుడే సామాజిక అభివృద్ధి వాస్తవమౌతుంది.

30.4.1 మహిళల అంతస్థు లేదా స్థాయి

భారతీయ మహిళాస్థాయి అధ్యయనంలో అనేక అంశాలున్నాయి. మహిళాస్థాయి విషయంలో గణనీయమైన తేడాలున్నాయి. అందులో కొన్ని ప్రాంతీయమైనవి. మహిళా స్థాయి నిర్ధారణకు నిరక్షరాస్యత విద్యాస్థాయి, పురుష-స్త్రీ నిష్పత్తి, ఆర్థిక కార్యకలాపాల్లో స్త్రీ పాత్ర అనే సూచికలను లెక్కలోకి తీసుకోవాలి.

30.4.1.1 స్త్రీల నిష్పత్తి

స్త్రీ జనాభా సంఖ్య పెరుగుతూనే వచ్చినప్పటికి, పురుష-స్త్రీ నిష్పత్తి విషయంలో స్త్రీల సంఖ్య కాలక్రమేణా తగ్గుతూనే వచ్చిందన్నది సత్యం. 1901లో వెయ్యిమంది పురుషులకు 972 మంది స్త్రీలుండగా, 1991 నాటికి వారి సంఖ్య 928కి తగ్గింది. స్త్రీ పురుష నిష్పత్తిలో స్త్రీల సంఖ్య గణనీయంగా తగ్గుటకు కారణాలుగా బిడ్డలు పుట్టేటప్పుడు స్త్రీల ఆరోగ్యం గురించి శ్రద్ధలేకపోవటం, పుట్టిన బాలికలలో మరణాల రేటు ఎక్కువగా ఉండటం, బాలికలను అమానుషంగా హత్య చేయడం, ప్రసవంలో స్త్రీలు మరణించటం మొదలగునవి.

30.4.1.2 అక్షరాస్యత

రాజ్యాంగం అనేక చట్టబద్ధమైన అవకాశాలు కల్పించినా, స్వాతంత్ర్యం వచ్చి అర్ధశతాబ్దం దాటినా జనాభాలోని మహిళలు అధికశాతం నిరక్షరాస్యులే. 1961 నాటికి 15.34 శాతంగా ఉన్న మహిళా అక్షరాస్యత 1991 నాటికి 39.42కి పెరిగింది.

BRAOU

30.4.1.3 ఉపాధి

భారతీయ ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక పాత్ర నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామీణ స్త్రీలు అనేక వృత్తులలో పని చేస్తున్నారు. 80% మహిళలు, నిరక్షరాస్యత, నైపుణ్యం కొరతవల్ల, శిక్షణ లేకపోవటంవల్ల అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. మహిళలు ఎక్కువ గంటలు పని చేసినప్పటికి వారికిచ్చే కూలి ఎంతో తక్కువ. వ్యవసాయ కార్మికులలో షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డు తెగల స్త్రీలు 22% వున్నారు. ఈ మధ్య కాలంలోనే స్త్రీలు ప్రభుత్వ ఉద్యోగాల్లో కన్పిస్తున్నారు. సంఘటిత రంగంలో పని చేసే స్త్రీలల్లో 50% మంది ప్రాథమిక పాఠశాల స్థాయి టీచర్లుకాగా, 15% మంది సెకండరీ స్థాయి టీచర్లుగా, గుమస్తాలుగా, టైపిస్టులుగా, నియమించబడగా, మిగిలినవారు లాయర్లుగా, కళాకారులుగా, కళాశాల ఉపాధ్యాయినులుగా పని చేస్తున్నారు.

30.4.2 రాజ్యాంగ, శాసన అంశాలు

భారత రాజ్యాంగ భూమిక పౌరులందరికి సామాజిక న్యాయం, ఆర్థిక-రాజకీయ స్వేచ్ఛతో కూడిన భావ వ్యక్తీకరణ, విశ్వాసములను, పూజా, ప్రార్థనా స్వాతంత్ర్యములకు హామీనిచ్చింది. దేశ సమగ్రతను పెంపొందింపచేసే సోదర భావమును, వ్యక్తి గౌరవానికి భంగం కలుగనీయకుండా, సమాన స్థాయిని, సమాన అవకాశములను కలుగ చేస్తుంది. రాజ్యాంగంలో పొందు పరచబడిన ఈ హక్కుల ఫలితంగా, భారతీయ పురుషులవలే స్త్రీలు కూడా ఎంతో మేలును పొందారు. 14వ అధికరణం, చట్టం ముందు అందరూ సమానమని చెప్పగా, 15వ అధికరణం వ్యత్యాసాలు కూడవని స్పష్టం చేయగా, రాజ్యంలోని ఏపదవికైనా, ఏ ఉద్యోగానికైనా అందరూ సమాన అర్హతలు కలవారని అధికరణం 16(1) పేర్కొంటుంది.

రాజ్యాంగ భూమికతోపాటుగా, ఆదేశిక సూత్రాలు కూడా సంక్షేమ రాజ్య లక్ష్యాలను తెలియపరుస్తాయి. సమానత్వ సాధనకు మిగిలిన మూడవ దేశాలవలే చట్టాన్ని ఉపయోగించుకొని సామాజిక పరివర్తనకు రాజ్యం దోహదం చేసింది. స్వాతంత్ర్యానంతర తొలి దినాలలో నెహ్రూ, అంబేద్కర్‌లు **హిందూ కోడ్ బిల్లును** రూపొందించుటకు పూనుకొన్నారు. ఆనాటి న్యాయశాఖ మంత్రి డా. అంబేద్కర్ ప్రవేశపెట్టిన బిల్లులో వివాహ వయస్సును పెంచుటయేకాక, ఒకే భార్యా విధానాన్ని, స్త్రీకి విడాకుల హక్కు నిచ్చి, ఆస్తి హక్కు, భరణంలు ప్రవేశపెట్టి, స్త్రీధనమును స్త్రీల ఆస్తిగా చేసే చర్యలకు నాంది పల్కెను. సంప్రదాయిక శక్తులు ఈ బిల్లును అడ్డుకొని, వాయిదా వేయించగలిగారు. కాని, అంతిమంగా ఈ బిల్లు నాలుగు చట్టాల ద్వారా పార్లమెంటుచే ఆమోదింప చేయించగలిగారు. అవే 1955 నాటి హిందూ వివాహ చట్టం, 1956 నాటి హిందూ వారసత్వ చట్టం, హిందూ మైనారిటీ, సంరక్షణ, దత్తత చట్టం, 1961 నాటి మాతృత్వ లాభ చట్టం, కట్న నిరోధ చట్టం మొదలగునవి స్త్రీలందరికి లాభాలను కలిగించాయి. గత దశాబ్దంలో స్త్రీల హక్కులను పరిరక్షించుటకు అనేక చర్యలు చేపట్టబడ్డాయి.

1983 నాటి క్రిమినల్ లా కు సంబంధించిన రెండవ సవరణ ఇండియన్ పీనల్ కోడ్‌లో స్త్రీలకు సంబంధించినంతవరకు కీలకమైన మేలు కలిగించింది. బలాత్కారమునకు గురియైన స్త్రీకి, సరియైన న్యాయం కావాలని దేశవ్యాపితంగా 1980లో ఉద్యమం తీవ్రరూపం దాల్చగా, 1984లో వివాహ, కుటుంబ సంబంధమైన తగాదాలు సత్వరమే పరిష్కరించుటకు కుటుంబ న్యాయస్థానముల ఏర్పాటుకు అంగీకరించింది ప్రభుత్వం. మహిళా సమస్యలను అవగాహన చేసుకొనుటకు, పరిష్కారం చేసేందుకు ఒక ప్రత్యేక మంత్రిని ఏర్పాటు చేయటం, స్త్రీలను బాధలనుంచి విముక్తి చేయుటకు మహిళా కార్యాలయాలు తెరవటం, స్త్రీల స్థాయిని మార్చే దిశలో వచ్చిన ముఖ్యమైన మార్పులుగా గుర్తించాలి.

30.4.3 పంచవర్ష ప్రణాళికల కాలంలో మహిళాభివృద్ధి

మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో (1951-56) మహిళా సమస్యను రాజకీయ నాయకులు, ఉద్యోగస్వామ్యం ప్రధానంగా సామాజికంగా పరిగణించారు. ప్రభుత్వపర సంక్షేమ కార్యకలాపములు చేపట్టే సంస్థ లేకపోవటంవల్ల కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి, కమ్యూనిటి అభివృద్ధి విధానంలు ప్రభుత్వేతర

BRAOU

సంఘాలద్వారా సంక్షేమ కార్యకలాపాలను కొనసాగించారు. మూడవ, నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో కూడా ఇదే విధానం కొనసాగించబడింది. కాని మానవ వనరుల అభివృద్ధికి కాని, వ్యవస్థ నిర్మాణమునకు కాని ఎటువంటి ప్రయత్నం జరుగలేదు. 1958-59 సంవత్సరములలో మహిళా విద్యపై నియమింపబడిన జాతీయ కమిటి తన నివేదికను సమర్పించిన తరవాత మహిళా విద్యకు ప్రాధాన్యత ఇవ్వబడింది.

ప్రణాళిక సృష్టికర్తలు మహిళలను ప్రభావితం చేసిన ముఖ్య సమస్యలైన దారిద్ర్యం, నిరక్షరాస్యత, బడికి వెళ్ళక పోవటం, బడిని మధ్యలో మానటం వంటి వాటిపై తమదృష్టిని కేంద్రీకరించలేదు. భారతదేశంలోని మహిళా స్థాయిపై నియమించబడిన కమిటి (సి.యస్.డబ్ల్యు.ఐ) ఈ విధమైన నిర్లక్ష్యం పై తీవ్రంగా స్పందించింది. 1977-1980లలో ఎమర్జెన్సీ అనంతరం అధికారం చేబట్టిన ప్రభుత్వం, మహిళా సమస్యలపై తమ దృష్టిని పెట్టి కొన్ని విధానాలు రూపొందించారు. మహిళా వయోజన విద్యపై నియమించబడిన సంఘం (1977-78) నివేదిక, 1979-80లో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిలో స్త్రీలు పాల్గొనటం పై నియమించబడిన సంఘం నివేదిక, భారతదేశ మహిళా సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక వ్యూహరచన చేసారు. మహిళలకు 1/3 వంతు కోటా యివ్వాలన్న ఆలోచన లేదా నిర్ణయాన్ని ముందుగా స్వయం ఉపాధికి గ్రామీణ యువతకు ఇచ్చే శిక్షణా కార్యక్రమంలో అమలు పరచారు. నిరుద్యోగులైన మహిళలకు లాభసాటియైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ధోరణిలో స్త్రీవాద ధోరణి ప్రభావం కన్పిస్తుంది. పంచాయితి రాజ్ వ్యవస్థల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న నిర్ణయం మహిళాభివృద్ధి దిశలో గొప్పముందడుగుగా పేర్కొన వచ్చును. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం మహిళల నిమిత్తం ఒక జాతీయ దృక్పథంతో కూడిన విధానం అమలు పరచాలన్న ఆలోచన అనేక కొత్త కార్యకలాపాలకు నాంది పలికింది. ఈ కార్యకలాపాలకు సమాంతరంగా స్వయం ఉపాధి చేపట్టిన మహిళల కొరకు ఒక జాతీయ కమీషన్‌ను ఉద్యోగినులైన స్త్రీల సమస్యలను, అవసరాలను, కోర్కెలను చర్చించేందుకు, పరిష్కారం చూపేందుకు ఏర్పాటు చేశారు.

30.4.4 మహిళల ఉద్యమాలు

1975లో 'సమానత్వం కొరకు' అన్న నివేదికను రూపొందించిన 'కమిటి ఆన్ స్టేటస్ ఆఫ్ ఉమన్' మహిళలను దూరంగా నెట్టివేయడంవల్ల కలిగిన ప్రభావం గురించి వివరించింది. మహిళల దుర్భర దుస్థితిని వివిధ కోణాల నుంచి పరిశీలించిన వివిధ అధ్యయనాలు మహిళల పరిస్థితిని వేగవంతంగా మెరుగుపరచుట యొక్క అవశ్యకతను తెలిపాయి.

ఇంకా చిన్న చిన్న మహిళా సమూహాల ఆర్థిక పరిస్థితిని అధ్యయనం చేసినవారు, మహిళల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో తెలిపారు. ఈ విధంగా ఆరంభమైన మహిళా ఉద్యమాలు మొదట్లో పట్టణ చదువు చదువుకొన్న స్త్రీలకు పరిమితమై, సేవా (SEWA), WWF, అన్నపూర్ణ మహిళా మండలిగా ఏర్పడి, కాలక్రమేణా మహిళల వ్యక్తిత్వం, మహిళా సమస్యల్లో ఏవి ముందు, మహిళా ఉద్యమ లక్ష్యాల గురించిన మౌలిక ప్రశ్నలు, ముందుకు వచ్చాయో చర్చించబడ్డాయి.

మహిళా ఉద్యమాలు కొనసాగించబడిన ఫలితంగా, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ కార్యకర్తలు, ప్రణాళిక సంఘ సభ్యులు అనేక చోట్ల అనేక పర్యాయాలు కలసి, చర్చించి 1981-1985 మధ్యకాలంలో కొత్తగా రూపొందించిన 1986 నూతన విద్యావిధాన పత్రంలో 'సమానత్వం కొరకు విద్య' అన్న దానిని చేర్చారు.

మహిళా సమస్య ప్రాధాన్యతను సంతరించుకోవటంతో ఏర్పడ్డ నూతన వాతావరణంలో బీదవారైన గ్రామీణ మహిళలు, పట్టణ మహిళా సంఘాలు, 1970-80 మధ్యకాలంలో కలసి మెలసి ఆలోచించి ఈ కొత్త ప్రతిపాదనలు వ్యవస్థాపరంగా రూపొందించారు. అవి (1) భూమిలేని లేదా నివేశన స్థలంలేని బీదవారికిచ్చే పట్టాలను మగవారికి ధారాదత్తం చేయక, స్త్రీ పురుషులు అంటే భార్య, భర్తలకు ఇచ్చే విధంగా చట్టంలోను, అభివృద్ధి పథకాల్లోను మార్పు తీసుకు వచ్చారు. (2) 1992 లో జరిగిన 73వ అధికరణ సవరణ ద్వారా

మహిళలకు పంచాయితిరాజ్ వ్యవస్థలో 1/3 వంతు సీట్లు రిజర్వేషన్ ప్రవేశపెట్టి, దానిని 74వ అధికరణ సవరణ చట్టం ద్వారా పట్టణాలకు విస్తరింప చేసారు. ఈ రెండూ నిర్ణయాలు మహిళా సాధికారత సాధించుటలో చెప్పుకోదగ్గ మైలు రాళ్ళు.

1985 జనవరిలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం, మహిళా సమస్యలకు అత్యధిక ప్రాముఖ్యమిస్తామని రాష్ట్రపతి ప్రసంగం ద్వారా స్పష్టం చేసింది. సీనియర్ ఉద్యోగులు మహిళా, శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన మొదలగు విషయాలపై తమ దృష్టిని కేంద్రీకరించారు.

కాని 1986-87 నాటికి రాజకీయ వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. లింగ సమానత్వ దృక్పథం వెనుకకు నెట్టివేయబడి మత పరమైన మైనారిటి, మెజారిటి ఉద్యమాలు ముందుకు వచ్చాయి. ఈ దశలో తలెత్తినవే షాబాను కేసు(1986), దియోరాల సతి సంఘటన (1987). ఈ సంఘటనలు లింగ (స్త్రీ) సమానత్వ భావనను వెనక్కి నెట్టాయి.

30.5 షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి

భారతదేశంలో కులవ్యవస్థ పుట్టి 2500 సంవత్సరాలైంది. ఎక్కువ, తక్కువ అన్న భావనల నిచ్చెనమెట్లు కులవ్యవస్థను గాఢంగా ప్రభావితం చేసిన విషయం గురించి మనం గుర్తుంచుకోవాలి. 1920 నాటికి అణగారిన వర్గాల నాయకుడుగా డా.బి.ఆర్. అంబేద్కర్ గౌరవించబడి గుర్తించబడ్డాడు. 1936లో ఆయన స్థాపించిన స్వతంత్ర లేబర్ పార్టీ, కర్షక, కార్మికులతో కలసి 1937 రాష్ట్ర ఎన్నికల్లో బాంబే లెజిస్లేటివ్ అసెంబ్లీకి పోటీ చేసి కొన్ని సీట్లు సంపాదించింది. కాలక్రమేణా ప్రాథమిక విద్యావకాశాలు, ఆరోగ్య సదుపాయాలు, దారిద్ర్యాన్ని పారద్రోలాలన్న ఉద్యమాలు, గ్రామీణ ఉద్యోగ కల్పనా విధానం, గ్రామాల్లోని అణగారిన వర్గాలకు ఆదాయమును పెంపొందించే పథకాలు, పశుపోషణకు మేకలు, గొర్రెలు పెంచుకొనుటకు అప్పులు, సబ్సిడీలు అక్షరాస్యతను పెంపొందించే ఉద్యమాలు, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుటకు చేస్తున్న ప్రయత్నాలు షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డ్ తెగలవారి ఆర్థిక, సామాజిక పరిస్థితిని మెరుగుపరచాయి. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన పథకాలవల్ల ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డు కులములు, షెడ్యూల్డు తెగలవారు ఇళ్ళపట్టాలు పొంది, భూమిని మార్కెటు రేటుకు కొనగలిగి తమ స్థాయిని పెంచుకోగలిగారు.

30.5.1 రాజ్యాంగ సంబంధ నిబంధనలు

భారతదేశమును సర్వసత్తాక ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా రూపొందింపచేయుటకు రాజ్యాంగ భూమిక సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛలు తన ఆదర్శంగా పెట్టుకొంది.

రాజ్యాంగంలోని 14వ అధికరణం, చట్టం ముందు అందరూ సమానమని పేర్కొంటుంది.

రాజ్యాంగంలోని 15వ అధికరణం మత, కుల, లింగ, పుట్టిన స్థల ప్రాతిపదిక మీద ఎటువంటి వ్యత్యాసాలు చూపించరాదని, ఎటువంటి పదవులకు అనర్హులుగా ప్రకటించరాదని, అందరిని అన్ని స్థలములలోకి అనుమతించాలని, షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగలవారి అభివృద్ధికి అవసరమైన చర్యలు, రాజ్యం చేపట్టాలన్న దానిని ఎవరూ వ్యతిరేకించరాదని పేర్కొంది.

16వ అధికరణం ప్రభుత్వ ఉద్యోగాల్లో అందరికి సమాన అవకాశాలున్నాయని తెలుపుతుంది.

17వ అధికరణం అంటరానితనాన్ని ఏ విధంగాను ఆచరణలో పెట్టరాదని, పెట్టితే నేరమని స్పష్టంగా తెలుపుతుంది.

23వ అధికరణం వెట్టిచాకిరిని నిషేధించింది.

24వ అధికరణం 14 సంవత్సరములలోపు బాలలను ప్యాక్టరీలలో కార్మికులుగా నియమించటాన్ని ఖండించింది.

BRAOU

30.5.2 రిజర్వేషన్లు

- 330, 332 అధికరణములు పార్లమెంటులోను, రాష్ట్ర అసెంబ్లీల్లోను షెడ్యూలు కులముల, షెడ్యూల్డు తెగల వారికి సీట్లను రిజర్వు చేసింది.
- 335 అధికరణం షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల వారికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించింది.
- 338 అధికరణం మొదట్లో ఒక ప్రత్యేక అధికారిని, అనంతరం 1990 సవరణ తరవాత ఒక జాతీయ కమీషన్‌ను ఏర్పాటు చేయుటకు అవకాశం కల్పించింది.
- 339 అధికరణం షెడ్యూల్డు తెగల సంక్షేమానికి తీసుకోవలసిన చర్యలు గురించి తెలుపుతుంది.

1991 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డు కులముల జనాభా 13.82 కోట్లు కాగా, 1991 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డు తెగల జనాభా 6.78 కోట్లు. మొత్తం జనాభాలో షెడ్యూల్డు కులముల శాతం 16.48 కాగా, షెడ్యూల్డు తెగల శాతం 8.08. 1955 పౌరహక్కుల రక్షణ చట్టం, 1989 నాటి షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగలను సంరంక్షించే శాసనం వారి పరిస్థితిని మెరుగుపరచుటలో కీలక పాత్ర నిర్వహిస్తున్నాయి. షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల అభివృద్ధి కొరకు ప్రత్యేకంగా చేయబడ్డ శాసనములు 1948 కనీసవేతనాల చట్టం, వెట్టి చాకిరిని రద్దు చేయు శాసనం, 1986 నాటి బాల కార్మిక వ్యవస్థను ఖండించే శాసనాలు మొదలగునవి. అంతేగాక రాజ్యాంగమే షెడ్యూల్డు తెగల భూమిని షెడ్యూల్డు తెగలు కానివారికి బదలాయించటం చట్ట వ్యతిరేకమని స్పష్టంగా చెప్పుతుంది.

30.5.3 పంచవర్ష ప్రణాళికల్లో కేటాయింపులు

షెడ్యూల్డు కులాలవారి అభివృద్ధి నిమిత్తం మొదటి పంచవర్ష ప్రణాళిక కాలం (1951-56)లో 5.97 కోట్లు కేటాయించగా, నాలుగవ పంచవర్ష ప్రణాళిక నాటికి (1969-74) 67.76 కోట్లకు పెరగ్గా, 6వ పంచవర్ష ప్రణాళికా కాలానికి (1980-85)842.82 కోట్లకు, 7వ ప్రణాళికా కాలానికి (1985-90) 1,234.15 కోట్లకు 8వ ప్రణాళికా కాలానికి 2,291 కోట్లకు పెంచారు. 6వ ప్రణాళికా కాలంలో ఆంధ్రప్రదేశ్ 3000 కోట్లు కేటాయించగా, 7వ ప్రణాళికా కాలంనాటికి 6916 కోట్లకు పెంచగా, 8వ ప్రణాళికా కాలానికి 19,000 కోట్లకు పెరిగింది. 1978-79 సంవత్సరంలో 5 కోట్లతో మొదలైన కేంద్ర సహాయం 6వ ప్రణాళికా కాలం నాటికి 600 కోట్లకు, 7వ ప్రణాళికా కాలానికి 876 కోట్లకు, 8వ ప్రణాళికా కాలానికి 1,125 కోట్లకు పెరిగింది.

మన రాష్ట్రంలో గణనీయంగా నున్న షెడ్యూల్డు కులముల వారి అభివృద్ధి నిమిత్తం, వారు ఆదాయమును సంపాదించుటకు, పెంచుకొనుటకు అవసరమైన ఆర్థిక సహాయం చేయుటకు షెడ్యూల్డు కులముల అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసారు. జాతీయ స్థాయిలో కూడా షెడ్యూల్డు కులముల వారి సహాయం నిమిత్తం జాతీయ షెడ్యూల్డు కులముల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్‌ను స్థాపించారు. 1955 నాటి అంటరానితనం నేరచట్టానికి బదులుగా సమగ్రమైన పౌరహక్కుల రక్షణ చట్టాన్ని 1976లో రూపొందించారు. ఈ చట్టం క్రింద పెట్టబడ్డ కేసుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతున్నది. ఉదాహరణకు 1992లో 3406 కేసులు రిజిష్టర్ కాగా, 1993 నాటికి 1586 కేసులకు తగ్గినవి.

II. మీ అవగాహన పరీక్షించుకోండి

1. మహిళాభివృద్ధి నిమిత్తం ప్రవేశపెట్టబడ్డ శాసనములు ఏవి?

.....

.....

.....

.....

BRAOU

2. షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల సంక్షేమం నిమిత్తం రాజ్యాంగంలో పొందుపరచబడ్డ అంశాలు ఏమిటి?

.....

.....

.....

.....

30.6 సంగ్రహంగా

ఈ భాగంలో సామాజిక పరివర్తనకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించి, అవి ఏవిధంగా సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి దోహదం చేసిన ఆధునికీకరణ, సంస్కృతీకరణ అన్న భావనలకు దారితీసిందో చెప్పుకొన్నాం. చారిత్రకంగా విద్యాభివృద్ధిని, ప్రభుత్వ విద్యావిధానమును, సామాజిక పరివర్తనకు దారితీసే కారకంగా విద్యాపాత్రను తెలుసుకొన్నాం. మహిళా స్థాయిని సూచించే సూచికల గురించి రాజ్యాంగ, శాసన సంబంధమైన అంశాలను గురించి, మహిళాభివృద్ధికి ప్రవేశపెట్టిన ప్రభుత్వ విధానాల గురించి, మహిళా ఉద్యమాల గురించి కూడా చర్చించుకొన్నాం. భారతీయ జీవన వ్యవస్థ నేపథ్యంలో, అణచివేయబడిన, ప్రధాన జీవన స్రవంతికి దూరంగా నెట్టివేయబడిన షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి రాజ్యాంగబద్ధమైన చర్యలు గురించి చర్చించుకున్నాం.

ఈనాటి సామాజిక పరిస్థితుల్లో కొట్టవచ్చినట్లు కనిపించే విషాదం ఏమిటంటే రాజ్యాంగంలో పేర్కొన్న నిబంధనలు ఒకటైతే, వాస్తవంగా కనిపించేవి మరొకటి. స్త్రీ, పురుషుల మధ్య ఉన్నత, దిగువ కులాల మధ్య వ్యత్యాసాలు, అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయి. కొంత అభివృద్ధి కనిపించినా, ఇంకా సాధించవలసింది ఎంతో వుంది. సామాజిక అభివృద్ధికి మూలమైన సమానత్వం, సాధికారత కనుచూపుమేరలో కనిపించవు.

30.7 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I.

1. సంస్కృతీకరణ అనగా దిగువ కులాల వారు ఉన్నత కులాల వారి సంకేతాలను దత్తత తీసుకోవటం.
2. ఎ) పరిమాణాత్మక విస్తృతి
   బి) న్యాయం మరియు శ్రేష్ఠత
   సి) జాతీయ, మానవీయ, శాస్త్రీయ విలువలు
3. ఎ) డా॥ రాధాకృష్ణన్ అధ్యక్షతన 1948లో నియమించబడిన విశ్వవిద్యాలయ విద్యా కమిషన్
   బి) డా. లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షతన 1952లో నియమించబడిన సెకండరీ విద్యా కమిషన్

II.

1. ఎ) 1954 నాటి ప్రత్యేక వివాహ చట్టం
   బి) 1961 నాటి మాతృత్వ లాభ చట్టం
   సి) 1961 కట్న నిరోధక చట్టం
   డి) 1984 నాటి కుటుంబ న్యాయస్థానాలు
2. ఎ) అధికరణం - 15, మత, కుల, లింగ, పుట్టిన ప్రదేశం ఆధారంగా వ్యత్యాసాలు చూపరాదన్నది
   బి) అధికరణం - 16, సమానత్వ అవకాశం
   సి) అధికరణం - 17, అంటరానితనమును రద్దు చేయుట
   డి) అధికరణం - 23 వెట్టి చాకిరిని రద్దు చేయుట

BRAOU

30.8 పరీక్షా నమూనా ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.**

1. 1950-1989 మధ్య కాలంలో భారతదేశంలో విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యలు వర్ణించండి.
2. 1950-1989 మధ్య కాలంలో మహిళాభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం తీసుకున్న చర్యలు చర్చించండి.
3. షెడ్యూల్డ్ కులముల, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి రాజ్యాంగంలో పొందుపరచబడ్డ నిబంధనలు, పంచవర్ష ప్రణాళికా కాలాల్లో కేటాయింపులను గురించి వ్రాయండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.**

1. ఆధునికీకరణ గురించి సంక్షిప్తంగా వ్రాయండి.
2. లౌకికవాదమును కాపాడుటకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు వివరించండి.
3. శాస్త్రీయ సాంకేతిక రంగాలపై ఆధునిక విద్యాప్రభావాన్ని సంక్షిప్తంగా పరిశీలించండి.

30.9 ఉపయుక్త గ్రంథాలు

1. Bina Agarwal : *Structures of Patriarchy : State, Community and Household Modernising Asia.*
2. Bipan Chandra : *India after Independence*
3. Brij Raj Chauhan : *India, A socio-economic profile*
4. Ghahshyam Shah : *Social transformation in India.*
5. Muchkund Dubey : *Indian Society Today*
6. Usha Sharma B.M (ed) : *Women Education in Modern India*
7. Srinivas M.N. : *Social change in Modern India*
   Dimensions of social changes in India.
8. Subramanian S. : *50 years of Indian Independence*
9. Towards Equality : *Report of the Committee on status of women in India, Ministry of Education and Social Welfare, GOI 1975*
10. Vina Majumdar : *Symbols of power : Women in changing society*

BRAOU

భాగం - 31 : భారతదేశ విదేశాంగ విధానం

విషయక్రమం

31.0 లక్ష్యాలు

31.1 పరిచయం

31.2 విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే అంశాలు

31.2.1 భౌగోళికాంశాలు

31.2.2 చారిత్రకాంశాలు

31.2.3 జనాభా

31.2.4 ఆర్థిక పారిశ్రామికాంశాలు

31.2.5 శాస్త్ర సాంకేతికాంశాలు

31.2.6 సిద్ధాంతపర అంశాలు

31.2.7 ప్రకృతి వనరులు

31.2.8 ప్రభుత్వాంశాలు లేదా ప్రభుత్వ ప్రభావం

31.2.9 సైనిక సంసిద్ధత

31.3 భారతదేశ విదేశాంగ విధానం

31.3.1 విదేశాంగ విధానానికి నేపథ్యం

31.3.2 అలీన విధానం

31.3.3 ఇండోనేషియా సమస్య

31.3.4 సూయజ్ కాలువ సంక్షోభం

31.3.5 కాంగో సమస్య

31.4 పంచశీల

31.4.1 పంచశీల సూత్రాలు

31.5 శిఖరాగ్ర సమావేశాలు

31.6 ప్రభావం

31.7 ప్రయోజనాలు

31.8 అలీన విధాన సమస్యలు - సవాళ్ళు

31.9 ప్రపంచీకరణ - సరళీకరణ

31.10 సంగ్రహంగా

31.11 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

31.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

31.13 ఉపయుక్త గ్రంథాలు

31.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడంవల్ల మీరు క్రింది విషయాలు తెలుసుకోగల్గాలి.

1. విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే అంశాలు
2. భారతదేశ విదేశాంగ విధానం తీరు తెన్నులు
3. అలీన విధానం విజయాలు-సమస్యలు
4. పంచశీల సూత్రాలు, ప్రభావం, ప్రయోజనాలు
5. ప్రపంచీకరణ, సరళీకరణ

BRAOU

31.1 పరిచయం

"భారత విదేశాంగ విధానంలో విదేశీయమేమీ లేదు. అది పూర్తిగా స్వదేశీయమైనదే. అంతరంగిక పరిస్థితుల విధానాల విస్తరణే విదేశాంగ విధానానికి కారణ మవుతాయి" అని దివంగత భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గ సహచరుడు, ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి వర్గ నాయకుడుగా వ్యవహరించిన రాజనీతిదక్షుడు వి.కె. కృష్ణమీనన్ అభివర్ణించారు. ఈ వర్ణన చమత్కారపూరితంగా కనపడినా, ఇందులో చాలా యదార్థం నిక్షిప్తమై ఉంది. విదేశీ విధానం వాస్తవ సమ్మతంగా జయప్రదంగా ఉండాలంటే అది దేశ ఆంతరంగిక పరిస్థితులలో అంకురించి, వాటిని ఆలంబనంగా చేసికొని నిర్మితం కావాలి. విదేశీ విధానం జాతి ప్రయోజనాలను కాపాడుతూ, పరిరక్షిస్తూ, పెంచి పోషిస్తూ సువిశాల అంతర్జాతీయ ప్రయోజనాలపట్ల బాధ్యత కలిగి ఉండాలి. జాతీయ అంతర్జాతీయ ప్రయోజనాల మధ్య సహేతుక సమతౌల్యాన్ని పాటించాలి. విదేశ రాజ్యాలపట్ల, ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలపట్ల ఒక రాజ్యపు అనుసరించే విధానాన్ని ఆ దేశ విదేశ విధానంగా పరిగణించవచ్చు. ఈ సందర్భంలో మనదేశ రాజ్యాంగ చట్టంలోని ఆదేశిక సూత్రాలు (రాజ్యాంగ చట్టంలోని నాల్గవ భాగం) మన విదేశాంగ విధాన లక్ష్యాలను నిర్దేశించాయి. తత్సంబంధమైన ఆదేశిక సూత్రాలను, వాటి లక్ష్యాలను గుర్తు చేసుకోవడం సముచితంగా ఉంటుంది.

సూత్రం 51. అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ :

రాజ్యం ఈ దిగువ వివరించిన లక్ష్యాల సాధనకు కృషి చేస్తుంది :-

1. అంతర్జాతీయ శాంతి భద్రతల అభివృద్ధి.
2) రాజ్యాల మధ్య న్యాయసమ్మతమైన, గౌరవప్రదమైన సంబంధాలు నెలకొనేటట్లు కృషి చేయడం.
3) అంతర్జాతీయ శాసనాలపట్ల, ఒప్పంద బాధ్యతలపట్ల, సంఘటిత సమాజాలు ఒకదానిపట్ల మరొకటి గౌరవ మర్యాదలతో ప్రవర్తించడం.
4) అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడం.

31.2 విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే అంశాలు

ఏ రాజ్య విదేశాంగ విధానాన్ని అయినా ఈ దిగువ అంశాలు గాఢంగా ప్రభావితం చేస్తాయి అవి :-

1) భౌగోళికాంశాలు
2) చారిత్రకాంశాలు
3) జనాభా
4) ఆర్థిక పారిశ్రామికాంశాలు
5) శాస్త్ర సాంకేతికాంశాలు
6) సిద్ధాంతపరమైన అంశాలు
7) ప్రకృతి వనరులు
8) ప్రభుత్వాంశాలు లేదా ప్రభుత్వ స్వభావం
9) సైనిక సంసిద్ధత

31.2.1 భౌగోళికాంశాలు

సముద్రాలు, నదులు, ఎడారులు, పర్వత శ్రేణులు, దుర్గమారణ్యాలు సరిహద్దులుగాగల రాజ్యాలకున్న భద్రతాభావం, ఈ సహజ సరిహద్దులులేని రాజ్యాల భద్రతా భావం కన్నా మెండుగా ఉంటుందన్న విషయం సుస్పష్టమే. సముద్రజల పరివేష్ఠితమైన ఇంగ్లండ్ రాజ్యం రెండవ ప్రపంచయుద్ధ కాలంలో హిట్లర్

BRAOU

సేనావాహినులవల్ల తీవ్ర ఆందోళనకు గురి అయినా, మొత్తానికి, పలు శతాబ్దాలపాటు చరిత్రలో అజేయంగా నిలబడింది. ఏనాడూ పరాజయం పాలుకాక పోవడం గమనార్హం. ఈ సహజ సరిహద్దుల రక్షణ పాత్ర వర్తమాన కాలంలో వైమానిక శక్తివల్ల, క్షిపణి శక్తివల్ల క్షీణిస్తోంది. ఈ నూతన యుద్ధ పోకడలు శత్రు రణసామర్థ్యాన్ని భీతావహంగా ఛేదించగలిగినా, శత్రురాజ్యాన్ని అడుగడుగునా ఆక్రమించుకోవడంలో భౌగోళికాంశాల ప్రభావం అత్యాధునిక సాధనాలైన విమాన, క్షిపణి దాడులకు సైతం గడ్డు సమస్యలను సృష్టించగలవు.

31.2.2 చారిత్రకాంశాలు

విదేశ వ్యవహారాల రూపకల్పనలో చారిత్రకాంశాల ప్రభావం సుస్పష్టమే కాక విశిష్టం కూడ. భవిష్యత్తును వర్తమానం నడిపించినట్లే, గతం వర్తమానాన్ని శాసిస్తుంది. అశోకుని పాలన, బౌద్ధమత సూత్రాలు తొలి భారత ప్రధాని నెహ్రూ విదేశనీతిపై అమోఘ ప్రభావాన్ని చూపాయి. పలు చారిత్రకాంశాల ప్రభావ పాటవాలు అన్ని రాజ్యాల విదేశ విధానాలను నియంత్రిస్తాయి. మన చారిత్రక సాంప్రదాయాలైన సత్యాహింసలు, దురాక్రమణ, వ్యతిరేక వైఖరులు అడుగడుగునా భారత విదేశ విధాన వికాసంలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. అవే నేటికీ శిరోధార్యంగా ఉంటున్నాయి. వర్తమాన ఇండో-పాక్ సంబంధాల వెనక శతాబ్దాల రక్తసిక్తమైన చరిత్రజాడలు కనుల ముందు నిలుస్తాయి. జుగుప్సాకరమైన అచారిత్రక వైఖరుల నధిగమించి, సుహృద్భావ భరితమైన సత్సంబంధాల స్థాపనా యత్నాన్ని ఇటీవలి కార్గిల్ ఉదంతం అపహాస్యం చేస్తున్నట్టు కనపడుతుంది.

31.2.3 జనాభా

జనాభా ప్రభావాన్ని విదేశాంగ విధానంలో నిరూపించడానికి ప్రత్యేక ప్రయాస అవసరం లేదు. జనాభా పెరుగుదలలు రాజ్యాల విదేశ విధానాలను ప్రభావితం చేసిన సందర్భాలు చరిత్రలో పుష్కలంగా కనపడతాయి. ఏ రాజ్య జనాభా అయినా, ఆ దేశవనరులు (వ్యవసాయిక, పారిశ్రామిక) పోషించలేనంతగా పెరిగితే, ఆదేశం దురాక్రమణకు పాల్పడి పరభూముల నాక్రమించుకోవడం, వలసల స్థాపనకు పూనుకోవడం లేదా వర్తక వాణిజ్యాల ముసుగులో పచ్చిదోపిడీకి పూనుకోవడం జరుగుతుంది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జపాన్ తన పెరుగుతున్న జనాభాకు వసతి కల్పించడానికి కొరియాపై దురాక్రమణకు దిగింది. జర్మనీ కూడ జర్మనులకు వలస కల్పించే ప్రయత్నంలో భాగంగా డాంజిగ్‌ను ఆక్రమించుకొంది. అత్యంత సద్గుణ గరిష్ఠులైన జర్మన్ ఆర్యసంతతికి తగినంత భూభాగంలేదని వాపోతుండేవారు. చైనా తదితర ఆగ్నేయాసియా రాజ్యాలను, జపాన్ తన వలసలుగా మార్చుకోవడాన్ని రెండవ ప్రపంచ యుద్ధానికి పూనుకొంది. జర్మనీ ఇటలీల సామ్రాజ్యవాద విధానం ద్వారా తమ జనాభా, ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోజూచాయి. దీనితో జర్మనీ, జపాన్, ఇటలీలు ఒక కూటమిగా ఏర్పడి రెండవ ప్రపంచ యుద్ధానికి అంకురార్పణ చేసి మిగిలిన సామ్రాజ్యవాద దేశాలతో తలపడ్డాయి. అపార ధన, ప్రాణ నష్టాలకు వర్ణనాతీతమైన కడగండ్లకు కారణమైన రెండవ ప్రపంచ యుద్ధానికి పెరుగుతున్న జనాభాలు ఒక కారణంగా నిలవడం గమనార్హం. రెండవ ప్రపంచ యుద్ధానంతరం రాజ్యాలు తమతమ జనాభాలను పరిమితం చేసుకునే విధానాల ననుసరింపసాగాయి. జపాన్ వంటి రాజ్యాలు తమ జనాభా పెరుగుదల రేటును నిరోధించగలిగాయి. మనదేశం జనాభా పెరుగుదల రేటును నియంత్రించాలని ప్రయత్నిస్తున్నా ఆ లక్ష్యాన్ని సాధించలేకపోయింది; దృఢమైన రాజకీయ వైఖరితోపాటు, పలు రాజకీయ పక్షాల సహకారం లోపించడం కూడ కారణమని మనం గుర్తించాలి.

31.2.4 ఆర్థిక పారిశ్రామికాంశాలు

దేశ ఆర్థిక, పారిశ్రామిక వైభవానికి పుష్కలంగా ముడి సరుకులు లభ్యం కావడంగాని లేదా స్వల్ప వ్యయంతో చవకగా అందుబాటులో ఉండాలి. తక్కువ ధరలో ముడిసరుకులు, ఆ ముడిసరుకులతో తయారైన పారిశ్రామిక వస్తువులకు ఆదరణ కలిగిన స్థిరమైన నమ్మకమైన విపణులు ఉండాలి. ముడిసరుకుల సమృద్ధి, మార్కెట్లు బలమైన ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు మాత్రమే కాక, రాజ్య విదేశ విధానానికి జవసత్వాలను

BRAOU

సమకూరుస్తాయి. ఆ రాజ్యం అంతర్జాతీయ సమాజంలో గౌరవ మన్నలను పొంది నాయకత్వ స్థానానికి అర్హతను పొందుతుంది. ఆ రాజ్య సహాయ సహకారాలను పలు రాజ్యాలు అపేక్షిస్తాయి. యూరప్ ఖండంలో ముఖ్యంగా ఇంగ్లండ్ ఫ్రాన్సుల్లో పారిశ్రామిక విప్లవ కాలంలో ముడిపదార్థాల కొరకు, విపణుల కొరకు ఆరంభమైన అన్వేషణ సామ్రాజ్య విధానానికి, వలస విధానానికి కారణమైంది. అయితే కాలక్రమంలో ఈ విధానాలకు తెరపడడంతో ఉదారవర్తక వ్యాపారాలకై అన్వేషణ ప్రారంభమైంది. ఈ పరిస్థితులకు సుస్థిర అంతర్జాతీయ శాంతిభద్రతలు అనివార్యమవుతాయి. ఆర్థిక పారిశ్రామిక రంగాలలో వెనుకపడ్డ రాజ్యాలకు ముందున్న రాజ్యాల సహాయ సహకారాలు అవసరమవుతాయి. ఈ సహాయ సహకారాలు అంతర్జాతీయ శాంతి నేపథ్యంలోనే సాధ్యమవుతాయి.

31.2.5 శాస్త్ర సాంకేతికాంశాలు

విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక శాస్త్ర రంగాలలో ముందున్న రాజ్యాలు తమ విదేశ విధానాలలో స్వతంత్రంగా నిర్భయంగా వ్యవహరిస్తాయి. ఈ రాజ్యాలు ప్రబలంగాను నిర్ణయాత్మకంగాను ఉంటాయి. వాటి అనుగ్రహ ప్రాపకాలకు మిగిలిన రాజ్యాలు ఆరాటపడతాయి. తమ తమ రాజ్యాల విద్యార్థి బృందాలను, శాస్త్రవేత్తలను అభివృద్ధిచెందిన రాజ్యాలకు పంపి తాము కూడ వాటిని అనుసరించాలని వీలైతే అధిగమించాలని ప్రయత్నిస్తాయి.

31.2.6 సిద్ధాంతపర అంశాలు

సిద్ధాంతపరమైన సారూప్యత గల రాజ్యాల విదేశాంగ విధానాలు సహకార పథంలో సాగడానికి సావకాశాలు మెండుగా ఉంటాయి. ఈ రాజ్యాల మధ్య నెలకొనే స్నేహం వ్యతిరేక రాజ్యాలున్నప్పుడు మరింత దృఢంగా ఉంటుంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెట్టుబడిదారీ ఇంగ్లండ్, అమెరికాల నేతృత్వంలో ప్రజాస్వామ్య రాజ్యాలు ఒక కూటమిగా ఏర్పడి తమ సిద్ధాంతాలను ప్రపంచ వ్యాప్తం చేయాలని ఆరాటపడ్డాయి. ఇదే సమయంలో రష్యా నాయకత్వంలో కమ్యూనిస్ట్ రాజ్యకూటమి కూడ తమ సిద్ధాంత వ్యాప్తికి పూనుకోవడంతో రెండు కూటాల మధ్య కక్షలు, ద్వేషాలు విపరీతంగా పెరిగి ప్రచ్ఛన్న యుద్ధ ఆవిర్భావానికి కారణమయ్యాయి. ప్రపంచమంతా ఒకే విధానం పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యంగాని కమ్యూనిస్ట్ విధానం గాని అమలులోకి వచ్చినా వాటి మధ్య సంపూర్ణ శాంతి సహకారాలుంటాయని చెప్పలేము. పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య స్వార్థ జాతీయ ప్రయోజనాల సంఘర్షణ ఏర్పడవచ్చు. నిజానికి అవి ఏర్పడ్డాయి కూడా. అలాగే కమ్యూనిస్ట్ రాజ్యకూటమిలో నాయకత్వ పోటీ ఘర్షణలకు కారణం కావచ్చు. వాస్తవంలో ఇలాంటి ఘర్షణలు జరిగాయి కూడా. ప్రజాస్వామ్య రాజ్యాలైన ఇంగ్లండ్, అమెరికాలు లౌకిక ప్రజాస్వామ్య భారత్‌కు బాసటగా నిలవడానికి బదులు మతతత్వ, సైనిక, నియంతృత్వ పాకిస్తాన్‌కు అండగా నిలబడ్డ సందర్భాలు కూడ ఉన్నాయి. సిద్ధాంత సారూప్యత, స్వార్థ జాతీయ ప్రయోజనాలు, ప్రాబల్య సమతౌల్య భావనలు విదేశాంగ విధానాలలో ద్యోతకమవుతాయి. భారత ఉపఖండంలో ఇండియా ప్రాబల్యాన్ని నిరోధించి, అరికట్టే లక్ష్యంతో అమెరికా ఇంగ్లండ్‌వంటి రాజ్యాలు ప్రజాస్వామ్య భారత్‌ను వ్యతిరేకించడంలో తమ తమ ప్రకటిత లక్ష్యాలపట్ల ద్రోహపూర్వకంగా ప్రవర్తించాయనే విమర్శలను అవి ఖాతరు చేయలేదు. ఏతావాతా గ్రహించవలసిందేమంటే విదేశ విధానం ఆదర్శాల సంకుచిత తత్వాల సంక్లిష్ట మిశ్రమం. ఈ మిశ్రమంలో సమయానుకూలంగా ఆదర్శాలుగాని, సంకుచిత జాతీయ ప్రయోజనాలుగాని ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. భారత్ సోషలిస్ట్ విధానాలు రష్యాకు ఆమోదయోగ్యంకాగా, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పశ్చిమ రాజ్యాలకు, నాడూ, నేడూ కూడ సమ్మతమే. ప్రపంచంలో అత్యధిక జనాభాగల ప్రజాస్వామ్యంగా భారత్ మన్ననల నందుకొంది.

31.2.7 ప్రకృతి వనరులు

ఖనిజ లవణాలు విశేషంగా ఉన్న రాజ్యాలు పారిశ్రామికంగాను వాణిజ్యపరంగాను ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. వీటివల్ల రాజ్య సిరిసంపదలు పెరిగి, రాజ్యానికి అంతర్జాతీయంగా వైభవ ప్రాభవాలు

BPAOU

సమకూరతాయి. ఆరాజ్య సహాయ సహకారాలకు పలు రాజ్యాలు అర్రులు చాస్తాయి. రాజ్యానికి నాయకత్వ స్థానం లభ్యమవుతుంది. అయితే ఇక్కడ ఒక విశేషం గమనించాలి. జపాన్ దేశానికి ప్రకృతి వనరులు బహు స్వల్పం. ఆ దేశం, విదేశాలనుంచి ఖనిజ లవణాలను దిగుమతి చేసికొని, వాటినుంచి పలు పారిశ్రామిక వస్తువులు తయారుచేసి, వాటిని విదేశాలకు ఎగుమతి చేసి, అపారమైన ఆర్థిక సంపదనార్జించి ప్రపంచంలోనే అమెరికా తరువాత రెండవ ఆర్థిక శక్తిగా గుర్తింపు పొందింది. ఈమహాద్భుత విజయానికి కారణం జపాన్‌కున్న మానవ వనరులలో కనపడుతుంది. జపాన్ ప్రజల ఆదర్శప్రాయమైన క్రమశిక్షణ, నిరుపమానమైన కఠోర కృషి జపాన్‌ను అత్యున్నత స్థానంలో నిలిపాయి. ఇదే విధంగా పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ రాజ్యం కూడ కేవలం మానవ వనరులవల్ల గణనీయంగా అభివృద్ధి సాధించింది. ఇటీవలి కాలంలో పలుదేశాలు తమ తమ మానవ వనరుల నైపుణ్యాన్ని ప్రమాణాలను పెంచడానికి కృషి చేస్తున్నాయి. మానవవనరులను సక్రమంగా అభివృద్ధి చేస్తే ఎటువంటి కొరతలనైనా అధిగమించవచ్చు. మానవవనరుల అభివృద్ధికి మనదేశం కూడా నడుం కట్టింది.

31.2.8 ప్రభుత్వాంశాలు లేదా ప్రభుత్వ ప్రభావం

ప్రభుత్వ స్వభావానికి విదేశాంగ విధానానికి దగ్గర సంబంధముంది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు, నియంతృత్వాలలాగా రహస్యాలను గోప్యంగా ఉంచలేవు; ప్రజాస్వామ్యాలలోని పత్రికా స్వేచ్ఛ, శాసనసభ సమావేశాలు ఉన్నతాధికారుల పత్రికా ప్రకటనలు వగైరా పత్రికల ద్వారా బహిర్గత మవుతాయి. ప్రభుత్వ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలు పత్రికల ద్వారా వెలుగులోకి వస్తాయి. పారదర్శకత, రహస్య కార్యకలాపాలకు వ్యతిరేకం. ఇందుకు భిన్నంగా నియంతృత్వాలు నైతిక విలువలను ప్రజాభిప్రాయాన్ని విస్మరించి రహస్య సమాలోచనలతోను, శీఘ్ర నిర్ణయాలతోను, స్వ, పర భేదం లేకుండా అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. స్వార్థపూరిత నిర్ణయాలు, దురాక్రమణలు, నియంతృత్వానికి సహజాలు. ఈ కారణంగా నియంతృత్వ ప్రభుత్వాలను నమ్మటం కష్టమవుతుంది.

31.2.9 సైనిక సంసిద్ధత

నిరంతరసైనిక సంసిద్ధత దృఢమైన విదేశ విధానానికి కారణమవుతుంది. అనర్థదాయకమైన రాజీ వైఖరులకు లొంగదు. పర రాజ్యాలు కూడా సైనిక సంసిద్ధతను గమనించి జాగ్రత్తగా వ్యవహరిస్తాయి. ఉన్నత స్థాయి సైనిక సంసిద్ధత శత్రు రాజ్యాల కుయుక్తులను నిర్వీర్యం చేయగలదు. సర్వసన్నద్ధంగా ఉన్న సైనిక బలం విదేశాంగ విధానానికి ధైర్య సాహసాలను కలిగిస్తుంది. దౌత్యం విఫలమైతే సైన్యం రంగంలోకి దిగవచ్చు. దౌత్యం వెనకాల సైన్యం ఉంటుంది. ఈ సంబంధం దృష్ట్యా సైనిక సన్నద్ధత దౌత్యవేత్తల లక్ష్య సాధనకు వర్తిస్తుంది. విదేశాంగ విధాన లక్ష్యాలను సాధించగలమార్గాన్ని సైనిక సంసిద్ధత సుగమం చేయగలదు.

I. మీ అవగాహన పరీక్షించుకోండి

1. శాస్త్ర, సాంకేతికాంశాలు విదేశాంగ విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

.....

.....

.....

.....

31.3 భారతదేశ విదేశాంగ విధానం

ఇంతవరకు సంక్షిప్తంగా విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేయగల అంశాలను చర్చించాము. భారత విదేశ విధానాన్ని ఒకింత వివరంగా పరిశీలిద్దాము.

BRAOU

31.3.1 విదేశాంగ విధానానికి నేపథ్యం

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన (15-8-1947) నాటికి ప్రపంచంలో ముఖ్యంగా యూరప్‌లో నెలకొని ఉన్న పరిస్థితులను మనం తప్పనిసరిగా గమనించాలి. కనుక, రెండవ ప్రపంచ యుద్ధానంతర యూరప్ రాజకీయాలను జ్ఞాపకం చేసికోవాలి. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. కమ్యూనిస్ట్‌రష్యా, అమెరికా, ఇంగ్లండ్ తదితర పెట్టుబడిదారీ రాజ్యాలతో భుజం భుజం కలిపి జపాన్, జర్మనీ, ఇటలీల సామ్రాజ్యవాద నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడింది. ఈ యుద్ధంలో రష్యా, పశ్చిమ యూరప్ రాజ్యాలు విజయాన్ని సాధించాయి. ఈ రెండవ ప్రపంచ యుద్ధం ముగియనున్న కాలంలోను, ముగిసిన తర్వాత, కమ్యూనిస్ట్ రష్యాకు, మిగిలిన పెట్టుబడిదారీ రాజ్యాల మధ్య సిద్ధాంతపరమైన (కమ్యూనిజమ్, పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం) విభేదాలు పొడసూపి, క్రమంగా ఉద్భుతమయ్యాయి. ఇంగ్లండ్, అమెరికాల నాయకత్వంలో పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య రాజ్యాలు సంఘటితమై, రష్యాను దాని నాయకత్వంలో ఉన్న తూర్పు యూరప్ (పోలండ్, చెకొస్లోవేకియా, బల్గేరియా, రుమేనియా, హంగరీ, అల్బేనియా వగైరాలు) రాజ్యాలతో సైద్ధాంతికంగా తలపడ్డాయి. ఇంచుమించుగా ప్రపంచమంతా ఈ రెండు కూటముల మధ్య చీలిపోయింది. రాజ్యాలు పశ్చిమ రాజ్య కూటమినిగాని, తూర్పు రాజ్య కూటమి (రష్యావగైరాలు)ని గాని సమర్థింపసాగాయి. మహోధృతంగా కొనసాగిన స్పర్థలతో కక్షలతో ప్రపంచశాంతి ఎండమావిలా తయారైంది. ప్రత్యర్థి కూటమిల మధ్య ఆయుధాల పోటీ, పరస్పర సైనిక ఒప్పందాలు, ద్వేషపూరిత ప్రచారం, మిత్రరాజ్యాలకై పోటీలు, అడ్డు అదుపు లేకుండా విస్తరించడంతో సుస్థిర శాంతి అసాధ్యమనే భావన, శాంతి కాముకులను వేధింపసాగింది. శాంతి అంటే రెండు యుద్ధాల మధ్య - ఒకటి, ముగిసిన రెండవ ప్రపంచ యుద్ధం, రెండవది, ఏ క్షణంలోనైనా ఆరంభం కాగల మూడవ ప్రపంచ యుద్ధం - నెలకొన్న అనిశ్చిత పోరాట విరమణేనా? ఈ నిరాశాభావం సర్వత్రా వ్యాపింపసాగింది. ప్రపంచం అగ్నిపర్వతంపై ఆసీనమైనట్లు కన్పింపసాగింది. ప్రాక్, పశ్చిమ కూటముల మధ్య క్రోధ, ద్వేషపూరితంగా నెలకొన్న ఈసంబంధాలనే ప్రచ్ఛన్న యుద్ధమని వ్యవహరింపసాగారు.

31.3.2 అలీన విధానం

మానవ చరిత్రలో అత్యంత ప్రమాదభరితమైన ఈ విషపు ఘడియల్లో భారత్ స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా, భారత్, ప్రపంచ రాజకీయాల్లో నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించడానికి ఉద్యమించింది. రెండు ప్రత్యర్థి కూటముల మధ్య పెచ్చరిల్లుతున్న విద్వేష దావానలాన్ని తుదముట్టడించడానికి భారత్ పూనుకుంది. అలీన విధానంగా వర్ణించబడిన భారత విదేశనీతి రెండు వైరి కూటముల మధ్య ఆవిర్భవించిన అసహనాన్ని ఆగ్రహావేశాల తీవ్రతను ఉపశమింప చేయడానికెంతో దోహదపడింది. అలసిపోని ఉద్యమ స్ఫూర్తితో భారత్ ప్రత్యర్థి కూటముల మధ్య సహనాన్ని, అవగాహనను, పరస్పర రాజీ వైఖరిని నిర్విరామంగా ప్రచారం చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి రాజనీతి విశారదులు అలీన విధానంపై చేసిన సముజ్జ్వల ప్రబోధాలు, కలుషితమై విషత్యులమైన ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణంలోకి స్వచ్ఛమైన మనోరంజితమైన పిల్లవాయువులు వీచినట్లుగా కపడుతుంది. ఈ అలీన విధానం ఆరంభంలో ద్వేషపూరితమైన విమర్శకు గురి అయింది. ఈ విధానాన్ని ఆనాటి అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి, జాన్‌ఫాస్టర్ డల్లెస్, "నీతి బాహ్యమైందిగా, మూర్ఖమైందిగా, దూరదృష్టిలేనిదిగా" వర్ణించాడు. రష్యా చైనాలు కూడ ఈ విధానాన్ని అనుమానాస్పదంగా చూశాయి. కాని ఈ విధానం క్రమంగా, స్వతంత్రమైన ఆసియా, ఆఫ్రికా ఖండ రాజ్యాలకు ఆమోదయోగ్యమై, ఆచరణలోకి రావడంతో, అమెరికా రష్యాలవంటి అగ్రరాజ్యాల వైఖరిలో కూడ మార్పులు ద్యోతకమయ్యాయి. రష్యా, అమెరికాలు, ఈ విధానం మధ్యవర్తిత్వ పాత్రకు అనువైనదని భావింపసాగాయి. ఆసియా, ఆఫ్రికాఖండ రాజ్యాలలో ఈ విధానం గౌరవప్రదంగాను, యూరప్ రాజ్యాలలో గమనార్హమైంది గాను మన్ననలనందుకొంది.

BRAOU

భారత విదేశ రాజనీతి మొదటి రెండు సంవత్సరాలలోను "తటస్థ" విధానంగా వర్ణించబడింది. ఈ "తాటస్థ్య" వర్ణన, సందేహాలకు విమర్శలకు ఆస్కారం కల్పిస్తుంది. ధర్మాధర్మాలకు నడుమ సంఘర్షణ జరిగితే భారత్ "తటస్థంగా" ఉండడం, నైతిక విలువలకు పట్టంకట్టిన భారత్‌వంటి రాజ్యానికి తగనిపని. ఈ 'తటస్థ' పదంలో నైతిక ఉదాసీనత ధ్వనిస్తున్న కారణంగా, దీనికి బదులుగా "అలీన విధానం" ఆమోదయోగ్యంగా ప్రచారంలోకి వచ్చింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ "తటస్థ" పద ప్రయోగ జనితమైన అపోహలను తిరస్కరిస్తూ ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ జరిగితే, భారత్ తటస్థంగా ఉండదు. ఉండబోదు అని చెప్పారు., అలీన విధానమంటే భారత్, ఏ సైనిక కూటమిలోను విలీనంకాక, రెండు ప్రత్యర్థి కూటములకు అనగా ఆంగ్లో-అమెరికన్ పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య కూటమికి, రష్యా ఆధిపత్యంలోని కమ్యూనిస్ట్ రాజ్య కూటమికి దూరంగా ఉండడమని గ్రహించాలి. ఈ రెండు కూటములలో దేనితో చేతులుకలిపినా అది భారత్ ప్రయోజనాలను గాని, ప్రపంచ శాంతిని గాని పరిరక్షింపజాలదు. ఏ ఒక్క కూటమిలో చేరినా, అంతర్జాతీయ సమస్యలపై తన స్వంతనిర్ణయాలను త్యజించి, సామూహికంగా కూటమి నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి. అంటే స్వంత నిర్ణయాలను తాకట్టు పెట్టి, పరుల నిర్ణయాలను బలపరచవలసి వస్తుంది. నిర్నిబంధంగా ఏ కూటమిలో చేరినా, ఈ కూటముల మధ్య ఉద్రిక్తతలను, విద్వేషాలను, విరోధి భావనలను రెచ్చగొట్టి ప్రచ్ఛన్న యుద్ధ జ్వాలలను ఎగదోసినట్లవుతుంది. అందుచే ప్రత్యర్థి కూటములలో విలీనం కాకపోవడమంటే భారత్ పలు అంతర్జాతీయ సమస్యలపై స్వీయ నిర్ణయాధికారాన్ని కాపాడుకోవడమే. ఆసియా ఖండంలో భారత్‌వంటి పెద్దరాజ్యం, తన స్వతంత్ర నిర్ణయాలను అనుసరిస్తే ప్రత్యర్థి కూటములు మరింత జాగ్రత్తగా, బాధ్యతతో వ్యవహరించే అవకాశముంటుంది. కూటములలో విలీనం కాకుండా ఉండడంవల్ల, భారత్ తన ఆంతరంగిక సమస్యలపై దృష్టి ఉంచి తన శక్తి యుక్తులను సామర్థ్యాన్ని, నిర్మాణాత్మక అభివృద్ధి కార్యకలాపాలకు వినియోగించవచ్చు. ఈ అలీన విధానం, ఏ రాజ్యానికి, రాజ్యాల కూటమికి శత్రువుకాదు కనుక అమెరికా, రష్యా వంటి రాజ్యాలు భారత్ ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడవచ్చు. భారతదేశ ఆర్థిక పారిశ్రామికాభివృద్ధికి రెండు ప్రత్యర్థి కూటములనుంచి సహాయం లభించడాన్ని మనం మరువరాదు. ఈ అలీన ప్రాశస్త్యాన్ని పలు రాజ్యాలు ప్రస్తుతించడంతో భారతదేశంపై ఏ రాజ్యం దురాక్రమణకు పాల్పడదన్న ధైర్యంతో భారత రక్షణ శాఖ కొంతకాలం పాటు దుర్బలంగా ఉండిపోయింది. కాని అలీన విధానం దేశ పారిశ్రామిక వ్యవసాయరంగాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడింది. అమెరికా, రష్యాలు తమ రెచ్చగొట్టే ప్రచ్ఛన్న యుద్ధ పోకడలను విసర్జించి స్నేహ, సుహృద్భావాలతో,శాంతియుత సహజీవనం చేయాలని భారత్ అవిశ్రాంతంగా చేస్తున్న వాదాలపటిమ ఆరవదశకంలో ప్రచ్ఛన్న యుద్ధ సడలింపుతో ఫలించింది. భారత్ అలీనదేశం కనుక అమెరికా రష్యాలు రెండూ, కొరియా సంక్షోభంలోను వియత్నాం యుద్ధంలోను తలపడినప్పుడు, భారతదేశ మధ్యవర్తిత్వపాత్ర రెండు రాజ్యాలకు సమ్మతమైంది.

అంతర్జాతీయ రంగంలో అన్యాయం ఏ రూపంలో తలెత్తినా ఆ అన్యాయాన్ని అలీన విధానం ప్రతిఘటిస్తూ, నిర్మాణాత్మక పాత్రను పోషిస్తూ వచ్చింది. సామ్రాజ్యవాదాన్ని, వలసవాదాన్ని, శ్వేతజాత్యహంకారాన్ని, సైనిక కూటములను, ఆయుధాల వ్యాప్తిని, ఆర్థిక దోపిడీని, అంతర్జాతీయ వ్యవహారాలలో బలప్రయోగాన్ని భారత్ ముక్తకంఠంతో ఎదుర్కొంది. వలస రాజ్యాల స్వాతంత్ర్య ఉద్యమాలను బలపరిచింది. ఐక్యరాజ్యసమితి సభ్యత్వాన్ని విస్తృతపరచి, ఆసంస్థను పటిష్ఠపరచడానికి యత్నించింది. తృతీయ ప్రపంచ రాజ్యాలను ఉమ్మడి వేదికపై సంఘటితపరచి సామ్రాజ్యవాద రాజ్యాలపై నైతిక ప్రజాస్వామ్య ఒత్తిడిని పెంచి, సామ్రాజ్యవాదానికి భరతవాక్యం పలికింది. అలీన విధాన విశిష్టతను ఆకళించుకోడానికి కొన్ని దృష్టాంతాలను పరిశీలిద్దాం.

31.3.3 ఇండోనేషియా సమస్య

రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం ఇండోనేషియా రాజ్యం, హాలెండ్ ఏలుబడిలో ఉండేది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో, జపాన్ ఇండోనేషియాపై దాడి చేసింది. ఆదాడిని తట్టుకోలేక హాలెండ్ సైన్యం తోకముడిచింది. జపాన్ ఇండోనేషియాను ఆక్రమించుకొని పాలింపసాగింది. అయితే రెండవ ప్రపంచ యుద్ధంలో

జపాన్ ఓటమి పాలవడంతో జపాన్ సైన్యాలు, ఇండోనేషియానుంచి వైదొలగాయి. ఈ తరుణంలో ఇండోనేషియా స్వాతంత్ర్య ఉద్యమకారులు ఇండోనేషియాను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించారు. హాలెండ్, ఇండోనేషియాను పునరాక్రమించే ప్రయత్నం ముమ్మరం చేసింది. ఈదశలో జవహర్‌లాల్ నెహ్రూ చొరవతీసికొని, **"ఆసియా సంబంధాల సదస్సు"**ను నిర్వహించారు. ఈ సదస్సు 23-3-1947న ఢిల్లీలో సమావేశమైంది. ఈ సదస్సుకు 28 రాజ్యాలు హాజరయ్యాయి. 243 ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. సరోజినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును నెహ్రూ ప్రారంభించి, తమ ప్రారంభోపన్యాసంలో ప్రస్తావించిన అంశాలు భావి స్వతంత్ర భారతదేశ విదేశ విధానాన్ని నిర్దేశించాయి. ఈ ఉపన్యాసంలో కొంత భాగాన్ని స్మరించుకుంటే ఆసియా ఖండ రాజ్యాలలో నెహ్రూ ఆసక్తి విశదమవడమేకాక పశ్చిమ రాజ్యాలపట్ల ఆయన అనుసరింప తలపెట్టిన విధానం కూడ స్పష్టమవుతుంది.

"ఆసియా మరొక్కమారు తనను తాను గుర్తుంచుకొంటోంది..... భారత్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందడంతోపాటు, ఆసియాలో పలు శక్తులకు, సహజ కేంద్రంగా, కేంద్ర బిందువుగా అవతరించబోతోంది. ఆసియాఖండ వాసులమైన మనం, దీర్ఘకాలం పశ్చిమ రాజ్యాల సచివాలయాలలో, దివాణాలలో కేవలం అర్జీదారులుగా ఉండిపోయాం. దాన్ని గతించిన కథగా గుర్తించాలి. మనకాళ్ళమీద మనం నిలబడాలనే కోరుకుంటూ మనతో సహకరించడానికి సిద్ధపడిన అందరితోనూ మనం సహకరిస్తాము. కేవలం ఇతరులకు ఆటవస్తువులుగా ఉండం". ఈ ఉపన్యాసంలో భారత స్వతంత్ర్య రాజ్యంగా అవతరించబోతున్నదని, ఆసియాఖండ రాజ్యాలకు నాయకత్వ పాత్రను నిర్వహించనున్నదని ఆసియాఖండ రాజ్యాల ప్రగాఢ స్వాతంత్రేచ్ఛను, ఎవరూ అడ్డుకోలేరని పశ్చిమ రాజ్యాలు సహకరించబూనితే ఆసియా రాజ్యాలు సహకరిస్తాయని ఆసియా ఖండ రాజ్యాలు అర్జీదారులుకారని, ఆటబొమ్మలు కాదని, ఆ రాజ్యాల స్వతంత్రపిపాసను స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సదస్సు పూరించిన విజయశంఖారావం ఆసియా ఖండాన్ని జాగృతం చేసింది.

హాలెండ్, ఇండోనేషియాను వలసరాజ్యంగా పునరాక్రమించుకునే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించింది. హాలెండ్ తనకు వ్యతిరేకంగా పెరుగుతున్న అంతర్జాతీయ ప్రజాభిప్రాయానికి తలొగ్గడంతో, ఇండోనేషియా స్వతంత్ర రాజ్యమైంది.

31.3.4 సూయజ్ కాలువ సంక్షోభం (Suez Canal Crisis)

ఆంగ్లో-ఫ్రెంచి కంపెనీ 1860లో మధ్యదరా సముద్రాన్ని, ఎఱ్ఱసముద్రంతో కలుపుతూ కాలవను నిర్మించింది. ఈ కాలువవల్ల పశ్చిమ రాజ్యాలు తూర్పుదేశాలను చేరడానికి చేయవలసిన సముద్రప్రయాణం బాగా తగ్గింది. ఈ కాలువ నిర్మాణానికి కావలసిన భూమిని ఆంగ్లో-ఫ్రెంచి కంపెనీ ఈజిప్టు నుంచి 100 సంవత్సరాలకు కౌలుకు తీసికొంది. నైలునదిపై అశ్వాన్ డామ్ నిర్మాణానికి ఈజిప్టుకు ఆర్థిక సహాయం అవసరమైంది. పలు యూరోపియన్ ప్రభుత్వాలు ద్రవ్యసహాయం చేస్తామని వాగ్దానం చేసినా అవి తమ మాట నిలపెట్టుకోకపోవడంతో ఈజిప్టుకు డబ్బు సమస్య ఎదురైంది. దీనితో ఈజిప్టుకు గత్యంతరంలేక సూయజ్ కాలువను 1956 జాతీయం చేసింది. ఈ కాలువ ద్వారా ప్రయాణం చేసే నౌకలు చెల్లించే సుంకాన్ని అశ్వాన్ డామ్ నిర్మాణానికుపయోగించాలని ఈజిప్ట్ తలపెట్టింది. ఆంగ్లో-ఫ్రెంచి కంపెనీ తన పెట్టుబడికి పలు రెట్లు లాభాన్ని పొందినా, ఈజిప్ట్ ప్రభుత్వం ఈ కాలువను జాతీయం చేయడం సహించలేకపోయింది. ఈ ఆంగ్లో-ఫ్రెంచి కంపెనీకి మద్దతుగా ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాలు ఈజిప్ట్‌పై దాడిని ప్రారంభించాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ఈజిప్ట్‌పై ప్రారంభించిన బాంబుదాడులలో ఇజ్రాయిల్ కూడ చేతులు కలిపింది. భారత్ ప్రధాని ఈ దాడులను తీవ్రంగా దుయ్యబట్టి, ఇంగ్లండ్ ఫ్రాన్స్‌ల దుస్సహ సామ్రాజ్యవాదాన్ని దొడ్డితోవన పునరుద్ధరిస్తున్నాయని విమర్శించారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇజ్రాయిల్‌ల సైనిక చర్యను అన్ని రాజ్యాలు తీవ్రంగా విమర్శించాయి. అమెరికా కూడ ఈ సైనిక చర్యను గర్హించింది. ఇంగ్లండ్, ఫ్రాన్సులు సైనిక చర్యలను ఆపనియెడల రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్సులపై బాంబుదాడులు జరుపుతుందని రష్యా ప్రధాని హెచ్చరించడంతో, సైనిక

BRAOU

చర్యలంతమయ్యాయి. ఈ సంక్షోభంలో భారత ప్రధాని నెహ్రూ పలు రాజ్యాలను, ఇంగ్లండ్, ఫ్రాన్సులకు వ్యతిరేకంగా కూడగట్టారు. ఆంథోని నట్టింగ్స్ అను బ్రిటీష్ రచయిత తాను వ్రాసిన "ప్రధాన మంత్రులు, రెండవ భాగం" అను గ్రంథంలో బ్రిటిష్ ప్రధాని ఈడెన్‌ను, ఈవిధంగా విమర్శించాడు. "చివరకు బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ రాజ్యాలు దురాక్రమణ ముద్రవేశాక, తమ లక్ష్యాలను ఎంత మాత్రం సాధించకనే ఇవి సైనిక చర్యలను విరమించుకోవలసి వచ్చింది. ఈ రాజ్యాల నౌకాదళ దౌత్యం (యుద్ధం) విఫలమైంది".

31.3.5 కాంగో సమస్య

1960లో చెలరేగిన కాంగో సంక్షోభంలో, భారత్, ఆఫ్రికా ఖండ రాజ్యాల మద్ధతునే కాక, కాంగోలో అంతర్యుద్ధాన్ని సృష్టించిన "యూనియన్ మినిరే" కంపెనీని విమర్శించిన, ఇతర ఖండాల రాజ్యాల మద్ధతును కూడ కూడగట్టి, ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో అద్వితీయమైన పాత్రను నిర్వహించింది. "యూనియన్ మినిరే" కంపెనీలో బెల్జియం, ఫ్రెంచి, బ్రిటీష్ పెట్టుబడులున్న కారణంగా ఆదేశ ప్రభుత్వాలు "యూనియన్ మినిరే" కంపెనీకి దన్నుగా నిలిచాయి. కాంగో సంక్షోభంలో అపారజన నష్టం జరగడమేకాక, కాంగోదేశ ప్రధాన మంత్రి, పేట్రిస్ లుముంబా, ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి డాగ్ హామర్‌షెల్డ్‌లు కూడ అసువులు బాసారు.

1870 సంవత్సరం నుంచి, 1960 వరకు, కాంగో, బెల్జియం వలస రాజ్యంగా దారుణమైన దోపిడికి గురిఅయింది. 1960లో కాంగో స్వతంత్ర రాజ్యమయింది. కాంగో రాజ్యం అరురాష్ట్రాల సమాఖ్య రాజ్యం. ఆ రాజ్యానికి పేట్రిస్ లుముంబా ప్రధాన మంత్రి. ఈ కాంగో రాజ్యంలో పరిశ్రమలకు అత్యంత ఉపయోగమైన రాగి గనులు పుష్కలంగా ఉన్నాయి. బెల్జియం, బ్రిటీష్, ఫ్రెంచి పెట్టుబడులున్న "యూనియన్ మినిరే" కంపెనీ ఈ గనులపై ఆధిపత్యం కలిగి ఉండేది. ప్రేటిస్ లుముంబా ప్రభుత్వం ఈ రాగి గనులను జాతీయం చేయడంతో సంక్షోభం ఆరంభమైంది. పలు దశాబ్దాలుగా ఈ గనులపై లాభాలను గడిస్తున్న బ్రిటీష్, ఫ్రెంచి, బెల్జియం పెట్టుబడిదారులకు లుముంబా చేసిన జాతీయకరణ మింగుడుపడలేదు. కాంగో రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న కటాంగా రాష్ట్ర అధినేత మోయిషే షాంబేను "యూనియన్ మినిరే" కంపెనీ అధికారులు రెచ్చగొట్టారు.

ప్రేటిస్ లుముంబా ప్రధానిగా ఉన్న కాంగో రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధం చేసి, కటాంగాను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకుని దానికి అధ్యక్షుడుగా ఉండమని నూరిపోశారు. మోయిషే షాంబేకు తాము అర్థబలాన్ని, అంగబలాన్ని సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రయత్నం సఫలమైతే కటాంగా లోని రాగిని యధేచ్ఛగా కొల్లగొట్టుకోవచ్చని వారి ఆశ. మొయిషే షాంబేకు అర్థబలాన్ని, యూరప్‌నుంచి కిరాయి సైనికులను ఈ కంపెనీ సమకూర్చింది. కాకలుతీరిన కిరాయి సైనికులు కాంగోలో భీతావహమైన అంతర్యుద్ధాన్ని సృష్టించాయి. ఈ కిరాయి సేనలు కాంగో రాజ్య రాజధాని 'లిపాల్డ్‌విలి'పై దాడి చేసి ప్రధాని "పేట్రిస్ లుముంబా"ను ఆయన భార్యను అమానుషంగా హత్యచేయడంతో నాగరిక ప్రపంచం దిగ్భ్రాంతికి గురి అయింది.

ఆసియా ఆఫ్రికాఖండ రాజ్యాలు, ఐక్యరాజ్య సమితి సహాయాన్ని అపేక్షించాయి. ఐక్య రాజ్య సమితిని వెంటనే జోక్యం చేసుకుని, ఆఫ్రికాలో మారణకాండను అంతర్యుద్ధాన్ని అరికట్టమని ప్రధాన కార్యదర్శిని కోరాయి. ఇందుకవసరమైన తీర్మానాలు చేశాయి. ఐ.రా.స. కాంగోలో జోక్యం చేసుకోవడం ఇంగ్లండ్, ఫ్రాన్సు, బెల్జియం, రష్యా, చైనా (సమితిలో ఆనాటికి సభ్యరాజ్యంకాదు)లకు రుచించలేదు. ఇంగ్లండ్, ఫ్రాన్సు, బెల్జియంలు తెరచాటునుంచి, కాంగోపై పెత్తనం చేస్తూ, తమ దోపిడీ విధానాన్ని నిరాటంకంగా కొనసాగించాలని ఆరాటపడ్డాయి. రష్యా, చైనాలు తమ తమ ప్రభావాన్ని కాంగోలో సుస్థిరం చేసుకుని తద్వారా ఆఫ్రికాలో వ్యాప్తి చెందాలని ప్రయత్నించాయి. కారణాలు వేరైనా, వీరందరి లక్ష్యం ఒకటే. కాంగోలో ఐక్యరాజ్యసమితి జోక్యం కల్పించుకోరాదు. కాని ఆఫ్రికా ఖండ రాజ్యాలు, ఆసియాలో చాలా రాజ్యాలు ఐక్యరాజ్యసమితి కాంగోలో జోక్యం కల్పించుకుని, ఆరాజ్య ప్రజలను కాపాడమని సమితిలో తీర్మానాలు చేశాయి. అమెరికా ఐ.రా.స. జోక్యాన్ని వ్యతిరేకించలేదు.

BRAOU

ఈ తీర్మానాని కనుగుణంగా ఐక్యరాజ్యసమితి సభ్యరాజ్యాల సైనిక సహాయాన్ని కోరగా, పలు రాజ్యాలు సైన్యాలను పంపాయి.

వివిధ రాజ్యాల సైనిక బృందాలన్నీ ఐక్యరాజ్యసమితి సైన్యంగా కాంగోలో కిరాయి సైనిక మూకలను తుదముట్టించే కార్యక్రమాన్ని చేపట్టాయి. కాంగోలో పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించడానికి అనాటి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి డాగ్ హామర్‌షెల్డ్ న్యూయార్కు నుంచి బయలుదేరి మార్గమధ్యంలో పారిస్ విమానాశ్రయంలో కొంతసేపు ఆగి తిరిగి కాంగోకు ప్రయాణమయ్యాడు. ఆయన విమానం కాంగో అడవులలో తునాతునకలుగా పేలిపోవడంతో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి దుర్మరణం పాలయ్యాడు. ఈ విమాన దుర్ఘటనపై పలుసందేహాలు వ్యక్తమయ్యాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి మరణించినా, ఐక్యరాజ్యసమితి సేనలు జనరల్ ఇంద్రజిత్ రిఖియే (భారతీయుడు) నాయకత్వంలో సమర్థవంతంగా కృషిచేసి అంతర్యుద్ధాన్ని అణచివేశాయి. అంతేకాక ఐక్యరాజ్య సమితి తరపున పలువురు భారతీయ నిపుణులు, కాంగో ఉద్యోగులకు పాలనా రంగంలో శిక్షణనిచ్చి, వారు తమ వ్యవహారాలు చక్కదిద్దుకోడానికి తోడ్పడ్డారు. అంతర్యుద్ధ విషాద ఛాయలను అణచివేసి, అక్కడ ప్రభుత్వాన్ని పునరుద్ధరించి ప్రజలను కాపాడడానికి, భారత్‌కు దురుద్దేశాలను ఆపాదిస్తూ పశ్చిమ దేశాల పత్రికలు ముఖ్యంగా ఇంగ్లండ్, ఫ్రాన్సు, బెల్జియం పత్రికలు హేయమైన ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించాయి. భారత్ ఆఫ్రికా ఖండంలో తలెత్తిన ఈ అరాచకాన్ని అణచివేయడంలో నిరుపమానమైన, శ్లాఘనీయమైన పాత్రను పోషించింది. కాంగో రాజ్య ప్రాదేశిక సమగ్రతను కాపాడింది. అంతర్యుద్ధాన్ని తుదముట్టించింది. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడింది. ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను జయప్రదం చేసింది. దీనితో ఐక్యరాజ్యసమితి చిన్న, పేద రాజ్యాలకు ఆశాజ్యోతిగా నిలిచింది.

31.4 పంచశీల

అలీన విధాన ప్రాచుర్యతకు ప్రాముఖ్యతకు పంచశీల సూత్రాలెంతో దోహదపడ్డాయి. అలీన విధాన స్ఫూర్తి నిర్దుష్టంగా పంచశీల సూత్రాలలో వ్యక్తమైంది. టిబెట్‌పై భారత్ చైనాల మధ్య కుదిరిన ఒప్పందం సందర్భంగా భారత్ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లైలు 28-6-1954న విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈపంచశీల సూత్రాలు ప్రస్తావించబడ్డాయి. ఈ సూత్రాలు రాజ్యాల మధ్య శాంతి సహకార సుహృద్భావాలను పెంచి పోషించడానికి ఉపకరిస్తాయి.

31.4.1 పంచశీల సూత్రాలు

1. ప్రాంతీయ సమగ్రత సార్వభౌమాధికారాలను పరస్పరం గౌరవించాలి.
2. పరస్పరం దురాక్రమణకు దిగరాదు.
3. ఒకరి ఆంతరంగిక వ్యవహారాలలో మరొకరు జోక్యం కలగజేసుకోరాదు.
4. సమానత్వ సహకారాలకు పరస్పరం కృషి చేయాలి.
5. శాంతియుత సహజీవనాన్ని పాటించాలి.

భారత్, చైనా ప్రధాన మంత్రులిద్దరూ ఈ పంచశీల సూత్రాలను తాము పాటిస్తూ, ఆసియాఖండ రాజ్యాలతోను, ఇతర రాజ్యాలతో కూడ ఈ సూత్రాలకనుగుణంగా నడుచుకోడానికి అంగీకరించాయి. 1955లో, ఇండోనేషియాలోని బాండుంగ్ నగరంలో సమావేశమైన ఆసియా రాజ్యాల ప్రభుత్వాధినేతలు, ఈ అయిదు పంచశీల సూత్రాలను ఆలంబనగా చేసికొని, అంతర్జాతీయంగా రాజ్యాలు పాటించవలసిన 10 సూత్రాలను వివరించాయి. కాలక్రమంలో ఈ "పంచశీల" సూత్రాలను పలు ఆసియా, ఆఫ్రికా ఖండ రాజ్యాలు అంగీకరించాయి, సమర్థించాయి. ఈ అయిదు సూత్రాలను రాజ్యాలు విస్తృతంగా పాటిస్తే, భయాందోళనలు తొలగిపోయి, అంతర్జాతీయంగా సుస్థిర శాంతి ఏర్పడుతుందని భావించారు. ప్రాదేశిక సమగ్రతను,

BRAOU

సార్వభౌమాధికారాన్ని గౌరవించడంతో, దురాక్రమణ అంతమై శాంతియుత సహజీవనం రాజ్యాల మధ్య సాధ్యమవుతుంది. సోవియట్ యూనియన్, ఇండోనేషియా, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, యుగోస్లావియా, పోలెండ్, సౌదీ అరేబియా, లావోస్, వియత్నాం, సైబీరియాలు పంచశీలను ప్రశంసించి, అంతర్జాతీయ సంబంధాలలో ఈ సూత్రాలు ద్యోతకం కావాలని పేర్కొన్నాయి. యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో ఈ సూత్రాలు మరొక ప్రపంచ యుద్ధాన్ని నివారించగలవన్నాడు.

31.5 శిఖరాగ్ర సమావేశాలు

అలీన విధానం బహురాజ్యాల ఆదరణను పొందడంతో ఈ సిద్ధాంతాన్ని అనుసరించే రాజ్యాల సంఖ్య 100కు చేరింది. దీనితో అలీన విధానం ఒక అంతర్జాతీయ ఉద్యమంగా రూపొందింది. ఇంతవరకు 9 అలీన శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. అవి :-

1. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, బెల్‌గ్రేడ్ 1961
2. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, కెయిరో 1964
3. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, లుసాకా 1970
4. అలీన రాజ్యల శిఖరాగ్ర సమావేశం, అల్జీర్స్ 1973
5. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, కొలంబో 1976
6. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, హవానా 1979
7. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, న్యూఢిల్లీ 1983
8. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, జింబాబ్వే 1986
9. అలీన రాజ్యాల శిఖరాగ్ర సమావేశం, బెల్‌గ్రేడ్ 1989

31.6 ప్రభావం

అలీన విధానం మూడవ ప్రపంచదేశాలపై గాఢ ప్రభావాన్ని చూపటమే కాక, ఐక్య రాజ్య సమితి కార్యకలాపాల్లో తన ప్రభావాన్ని చూపింది. పశ్చిమదేశాలు క్రమంగా అలీన విధానంపై గల అనుమానాస్పద వైఖరిని వీడి, దీనిని ప్రపంచ శాంతికై మంచి సాధనంగా చూశాయి. ఈ విధంగా అలీన విధానం ప్రపంచశాంతి పరిరక్షణ సాధనంగా తన సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోవడానికి చాలా సమయం పట్టింది.

భారతదేశం రూపొందించిన అలీన విధానం అంతర్జాతీయ వ్యవహారాలలో ఒక వైవిధ్యాన్ని సంతరించుకొంది. ఫ్రాన్స్, పశ్చిమదేశాల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధ ద్వేషపూరిత వివాదాలకు భిన్నంగా శాంతి, సుహృద్భావంతో కూడిన ప్రపంచశాంతికై ఒక నూతన మార్గాన్ని చూపడం అలీన విధానం ప్రత్యేకత.

31.7 ప్రయోజనాలు

సామ్రాజ్యవాద, వలసవాద, జాత్యహంకార చట్రాలక్రింద నలిగిన దేశాల సముద్ధరణకు తోడ్పడి కొత్తగా స్వాతంత్ర్యాన్ని పొందిన ఆసియా, ఆఫ్రికా దేశాలు అలీన విధానంవల్ల కొత్త గౌరవ స్థానం పొందాయి. సామ్రాజ్యవాద, వలసవాద పాలనకింద అణగద్రొక్కబడిన ఈ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాలను శాసించే స్థాయికి ఎదిగాయి. అలీన విధానం వెనుకబడిన దేశాలకు స్థైర్యాన్నిచ్చింది. అంతర్జాతీయ రంగంలో సామ్రాజ్యవాదశక్తుల బలప్రయోగాన్ని ముక్తకంఠంతో ఎదుర్కొని, వాటిని తమపంథా మార్చుకొనేటట్లు చేసింది.

BRAOU

31.8 అలీన విధాన సమస్యలు - సావకాశాలు

ఇంగ్లండ్ అమెరికాల నాయకత్వంలోని పశ్చిమ పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య రాజ్యాల శిబిరానికి, రష్యా నాయకత్వంలోని కమ్యూనిస్ట్ రాజ్యాల శిబిరానికి మధ్య ఉద్రిక్తతలు సడలి, సామరస్యవాతావరణం నెలకొనడంతో ఈ అలీన సిద్ధాంత పాత్ర ప్రభావాలు అడుగంటాయని ఒక విమర్శ వ్యక్తమైంది. దీనికితోడు సోవియట్ రష్యా చీలిపోవడం, అక్కడ కమ్యూనిజం అంతరించడంతో శత్రుశిబిరాలమధ్య "**మధ్యవర్తిత్వ**" పాత్ర అనవసరమవడం అలీన విధాన అస్తిత్వానికి సవాలుగా మారింది.

అలీన విధానం, కాలక్రమంలో నిరంతరం పెరుగుతున్న రాజ్యాల ఆదరాభిమానాలను పొందడంతో, ఈ ఉద్యమంలో పలు రాజ్యాలు చేరాయి. వీటిలో ఉదాహరణకు, పాకిస్తాన్, క్యూబాలున్నాయి. పాకిస్తాన్ అమెరికా ప్రేరిత ఆగ్నేయాసియా రక్షణ వ్యవస్థలో సభ్యరాజ్యంగా చేరి అమెరికాతో సైనిక ఒడంబడికలు చేసుకొంది. క్యూబా నాటి కమ్యూనిస్ట్ సోవియట్ యూనియన్‌తో సంధిచేసుకొంది. ఈ రాజ్యాలు కూడ అలీన ఉద్యమంలో చేరడంతో ఉద్యమ స్ఫూర్తి కొంత దెబ్బతింది.

అలీన విధానాన్ని ప్రారంభించిన భారత్ 1972లో రష్యాతో "**20 సంవత్సరాల శాంతి, సహకార మైత్రి**" ఒప్పందం కుదుర్చుకోవడం అలీన విధాన స్ఫూర్తికి భంగమని కొందరు విమర్శకులు భావించారు. ఇది సైనిక ఒప్పందం కాదు. కానీ ఈ ఒప్పందం కుదుర్చుకొన్న నేపథ్యం అపోహలకు కారణమైనట్టు కనపడుతుంది. 1971 డిసెంబరు నెలలో స్వతంత్ర బంగ్లా రాజ్య అవతరణ సందర్భంగా భారత పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధకాలంలో ఆనాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ పాకిస్తాన్‌కు అనుకూలంగా ప్రవర్తిస్తూ, అమెరికా సప్తమనౌకా (Seventh Fleet) విభాగం నుంచి, ఒక యుద్ధ విమాన వాహక నౌకను పంపించాడు. ఈ నౌకను పంపడానికి అమెరికా ఇచ్చిన సంజాయిషీ నమ్మశక్యంగా లేదు. దేశ **ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో**, దూరదృష్టితో భారత్ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకొంది. ఈ ఒప్పందాన్ని 1992లో మరొక 20 సంవత్సరాలకు పొడిగించారు.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్ట్ వ్యవస్థ పతనమైంది. సోవియట్ యూనియన్ రాజ్య వ్యవస్థ చీలిపోయింది. దీనితో, కమ్యూనిస్ట్ సిద్ధాంతం చైనాలోను, ఇతర రాజ్యాలలోను క్షీణించింది. అమెరికాకు బలమైన ప్రత్యర్థి లేకపోవడంతో అమెరికా దుర్నిరీక్ష్యమైన రాజ్యంగా భాసిల్లసాగింది. ఈ మధ్యకాలంలో చైనా, దక్షిణ కొరియా, ఇండోనేషియా, మలేసియా, ఇండియాల ఆర్థిక పారిశ్రామిక పాటవాలు పెరిగాయి. పూర్వం నుంచి ఆర్థిక పారిశ్రామిక శక్తిగా గుర్తింపు పొందిన జపాన్, ప్రపంచంలో రెండవ ప్రబలమైన ఆర్థిక శక్తిగా కొనసాగుతూనే ఉంది. మొత్తానికి అమెరికా పారిశ్రామిక రంగం ఈ రాజ్యాల పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. అమెరికా ఈ కొత్త పరిణామాన్ని ఎదుర్కోవడానికి పలుగర్హనీయమైన పద్ధతులను అనుసరింపసాగింది. తృతీయ ప్రపంచ రాజ్యాల నుంచి లబ్ధి పొందడానికి అంతర్జాతీయంగా అమలులో ఉన్న "**వాణిజ్య సుంకాల సాధారణ ఒప్పందాన్ని**" (General Agreement on Trade and Tariffs) ప్రస్తుతం ఆర్థిక ప్రపంచంలో అప్రతిహతంగా కొనసాగుతున్న సరళీకరణను తన కనుకూలంగా మలచుకోడానికి నిందార్హమైన పద్ధతులకు దిగుతున్నదని విమర్శలు వస్తున్నాయి. వర్ధమాన ఆసియా, ఆఫ్రికా ఖండ రాజ్యాల ముందు రెండు ప్రధాన సమస్యలున్నాయి. అవి:- (1) పారిశ్రామిక, వాణిజ్య, శాస్త్ర, సాంకేతిక రంగాలలో పరస్పర సహాయ సహకారాలను పెంచుకోవడం (2) అభివృద్ధిచెందిన శక్తిమంతమైన రాజ్యాల నిరంతర దోపిడీ విధానాలను సమైక్యంగా, దృఢచిత్తంతో ఎదుర్కోడానికి సమాయత్తమవడం. భారత్‌లోనేకాక, ఇరుగు పొరుగు రాజ్యాల్లో ప్రజలు కూడ పశ్చిమ రాజ్యాల వైఖరిపై తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

శ్రీలంక రాజ్య మత్స్య, జలవనరుల మంత్రి శ్రీమహేంద్ర రాజపక్ష "హిందూ" దిన పత్రికకు (5-10-1999)న ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వ్యక్తం చేసిన భావాలు ఇందుకు ఉదాహరణ. "పశ్చిమ రాజ్యాలు

ఆర్థిక, సైనిక, శాస్త్రీయ రంగాలలో సాధించిన అభివృద్ధి కారణంగా అనుసరిస్తున్న అహంభావ వైఖరిని, పెత్తందారీతనాన్ని ఎదుర్కోడానికి ఈ ప్రాతంలోని చిన్న రాజ్యాలకు భారత్ సహాయం ఎంతైనా అవసరముంది. చారిత్రకంగా ఎన్నడూ పరభూములను గాని, పరుల పరిశ్రమలను గాని, భారత్ కైవసం చేసుకోలేదు. కనుక, భారత్ నాయకత్వాన్ని మనం శంకింపనవసరం లేదు. మనమంతా ఒకేతాటిపై చేరి, పశ్చిమ రాజ్యాలతో మనకనుకూలమైన లాభదాయకమైన షరతులను సముచితంగా సాధించడానికి భారత్‌కు స్వేచ్ఛనివ్వాలి. సువిశాల భారత్ భౌగోళిక శక్తిని ఆర్థిక, శాస్త్రీయ, సైనిక పాటవాలను సంతరించుకున్న భారతీయులను దృష్టిలో ఉంచుకుంటే మనమీ విధానాన్ని నిస్సందేహంగా పాటించవచ్చు".

31.9 ప్రపంచీకరణ - సరళీకరణ

ప్రపంచీకరణ (Globalisation) సరళీకరణ (Liberalisation)లు భారతీయ పరిశ్రమలకేకాక వర్ధమాన దేశాలలోని పరిశ్రమలకు కూడ హానికరమని పలువురు మేధావులు భావిస్తున్నారు. "**ప్రపంచీకరణ, వర్ధమాన దేశాలపై దాని పర్యవసానాలు**" అను అంశంపై 2-10-1999న ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో దేశ విదేశాలనుంచి పలువురు మేధావులు పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రపంచీకరణ, సరళీకరణల దుష్ప్రభావాలపై దృష్టి సారించింది. ప్రపంచీకరణవల్ల స్థానిక పరిశ్రమలు నాశనమవుతాయని విలాస వస్తువుల వినియోగం ఉద్ధృతమవుతుందని స్థానిక పరిశ్రమలపై విదేశీ పెట్టుబడుల పెత్తనం విజృంభిస్తుందని, నిరుద్యోగం పెరుగుతుందని, విదేశీ మారక ద్రవ్య కొరత పెరుగుతుందని, వర్ధమాన రాజ్యాలు ఋణగ్రస్తమవుతాయని ఈ సదస్సు అభిప్రాయపడింది. హానికరమైన ఈ మార్పులకు ఒక ఉదాహరణ నిచ్చారు. అమెరికా, జపాన్, జర్మనీ, ఫ్రెంచి, బ్రిటీష్, స్విట్జర్లాండ్‌ల పెట్టుబడులతో ఉన్న 180 బహుళ జాతీయ కంపెనీలు ప్రపంచం మొత్తం మీద జరుగుతున్న సగం "**స్వేచ్ఛా వ్యాపారాన్ని**" హస్తగతం చేసుకొన్నాయి.

II మీ అవగాహన పరీక్షించుకోండి

1. భారతదేశ విదేశాంగ విధానంలో అలీన విధాన పాత్ర ఎట్టిది?

.....

.....

.....

.....

2. పంచశీల సూత్రాలపై ఒప్పందం ఎవరి మధ్య కుదిరింది?

.....

.....

.....

.....

3. అలీన విధాన ప్రాధాన్యత ఏమిటి?

.....

.....

.....

.....

BRAOU

31.10 సంగ్రహంగా

ఈ భాగంలో భారతదేశ విదేశాంగ విధాన తీరుతెన్నులు, దీనిలో అలీన విధాన పాత్ర, పంచశీల సూత్రాల ప్రభావం చర్చించడమైంది. ప్రపంచీకరణ ప్రభావంగా ఉత్పన్నమైన భయానక ఆర్థిక వాస్తవాలను, పశ్చిమ రాజ్యాల ఆర్థిక సవాళ్ళను సమర్థవంతగా ఎదుర్కోడానికి తోటి ఆసియా, ఆఫ్రికాఖండ వర్ధమాన రాజ్యాలతో కలిసి అలీన విధానానికి కొత్త లక్ష్యాలను నిర్దేశించి కొత్త రూపాన్ని కల్పించి అంతర్జాతీయంగా రానున్న సమస్యల పరిష్కారానికి భారత్ సమాయత్తం కావాలి.

31.11 మీ అవగాహన పరీక్షించుకోండి - జవాబులు

I. 1. విజ్ఞానశాస్త్ర, సాంకేతిక శాస్త్రాలు రాజ్యాలు స్వతంత్రంగా, నిర్భయంగా వ్యవహరించడానికి, నిర్ణయాత్మక విధానాల ననుసరించడానికి తోడ్పడతాయి.

II. 1. అంతర్జాతీయ రంగంలో అన్యాయం ఏరూపంలో తలెత్తినా, దాన్ని ప్రతిఘటించటం, సామ్రాజ్యవాదాన్ని, వలసవాదాన్ని, శ్వేత జాత్యహంకారాన్ని, సైనిక కూటములను, ఆయుధాల వ్యాప్తిని, ఆర్థిక దోపిడీని ఎదుర్కొనడంలో అలీన విధాన పాత్ర ఉంది.

2. పంచశీలసూత్రాలపై భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, చైనా ప్రధాని చౌ-ఎన్-లైలు 1954లో సంకతం చేశారు.

3. శాంతియుత, పరస్పర సహకారంతో కూడిన ప్రపంచశాంతికై నూతన మార్గాన్ని చూపడం అలీన విధాన ప్రత్యేకత.

31.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

1. ఏ దేశ విదేశాంగ విధాన్నైనా ప్రభావితం చేసే అంశాలను విశ్లేషించండి.
2. అలీన విధాన సూత్రాలు, శిఖరాగ్ర సమావేశాలు, ప్రభావ ప్రాధాన్యతలను గురించి రాయండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

1. విదేశాంగ విధానాన్ని జనాభా ఏవిధంగా ప్రభావితం చేస్తుంది?
2. కాంగో సమస్య పరిష్కరణలో భారతదేశ పాత్ర ఎట్టిది?
3. ప్రపంచీకరణవల్ల చెడు పరిణామాలేవి?

31.13 ఉపయుక్త గ్రంథాలు

1. Antony Nuttings : *The Prime Ministers*
2. Bipan Chandra : *India after Independence*
3. Damodaram AK and Bajpai Gupta M.G. : *Indian Foreign Policy : The Indira Gandhi years*
4. G. Satchidananda Murthy : *Indian Foreign policy*
5. Sharma, Shri Ram : *Indian Foreign Policy Annual Survey, 1971*
   Indian Foreign Policy, Annual Survey, 1981
   Indian Foreign Policy : Annual Surey, 1982

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

బి.ఎ. రెండో సంవత్సరం

చరిత్ర

పాఠ్య ప్రణాళిక

కోర్స్ - 2 భారతదేశ చరిత్ర, సంస్కృతి క్రీ.శ 1526 - 1989

ఖండం - 1 : మొగలులు షేర్షా

భాగం - 1 : హుమాయూన్ వరకు మొగలుల రాజకీయ చరిత్ర

భాగం - 2 : షేర్షా అతని పరిపాలనా వ్యవస్థ

భాగం - 3 : అక్బర్ నుంచి మొగల్ రాజ్య చరిత్ర

భాగం - 4 : మొగలులు పరిపాలన - ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - 2 : మహారాష్ట్రులు 18వ శతాబ్దంలో భారతదేశం

భాగం - 5 : మహారాష్ట్రులు

భాగం - 6 : ప్రాంతీయ రాజ్యాల ప్రాబల్యం, సమాజం, ఆర్థిక వ్యవస్థ

ఖండం - 3 : భారతదేశంలో బ్రిటీష్ వలస రాజ్యస్థాపన, అభివృద్ధి

భాగం - 7 : ఐరోపావారి మొదటి స్థావరాలు

భాగం - 8 : భారతదేశ బ్రిటీష్ ఆక్రమణ, 1748-1856

భాగం - 9 : 1857 కంపెనీ పరిపాలన, ఆర్థిక విధానం

భాగం - 10 : 19వ శతాబ్ది ప్రథమార్థంలో సామాజిక, సాంస్కృతిక చైతన్యం

భాగం - 11 : 1857 తిరుగుబాటు

భాగం - 12 : విద్యా, వార్తా పత్రికల ప్రగతి - నూతన సాహిత్య ధోరణులు

భాగం - 13 : వ్యవసాయం, వలసవాదం, తిరోగమన పారిశ్రామికీకరణ

BRAOU

ఖండం - 4 : భారత జాతీయోద్యమం

భాగం - 14 : మత, సాంఘిక సంస్కరణోద్యమాలు

భాగం - 15 : భారత జాతీయ కాంగ్రెస్ పుట్టు పూర్వోత్తరాలు

భాగం - 16 : భారతదేశ జాతీయోద్యమ తొలి దశ

భాగం - 17 : తీవ్రవాద జాతీయోద్యమ విజృంభణ, కార్యక్రమాలు

భాగం - 18 : ముస్లింలీగ్, మతతత్వ విజృంభణ

భాగం - 19 : మొదటి ప్రపంచ యుద్ధం, హోంరూలు ఉద్యమం

భాగం - 20 : రాజ్యాంగ సంస్కరణలు

భాగం - 21 : గాంధీ నాయకత్వం, సహాయ నిరాకరణోద్యమం

భాగం - 22 : జాతీయోద్యమం, వామపక్షాల ఆవిర్భావం, 1920-1929

భాగం - 23 : శాసనోల్లంఘనోద్యమం

భాగం - 24 : కాంగ్రెస్ - సోషలిస్ట్ పార్టీ అవతరణ

భాగం - 25 : జాతీయోద్యమం, 1935 - 46

భాగం - 26 : దేశ విభజన, అధికార మార్పిడి

భాగం - 27 : స్వాతంత్ర్యోదమం నాటి భారతదేశ పరిస్థితులు

ఖండం - 5 : స్వాతంత్ర్యానంతరం భారతదేశం క్రీ.శ. 1950 - 1989

భాగం - 28 : రాజకీయాభివృద్ధి

భాగం - 29 : ప్రణాళిక రచన, ఆర్థికాభివృద్ధి - 1950 - 1989

భాగం - 30 : సామాజిక అభివృద్ధి

భాగం - 31 : భారతదేశ విదేశాంగ విధానం

BRAOU

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

బి.ఏ./బి.కాం./బి.యస్సి. రెండవ సంవత్సరం

కోర్సు : భారతదేశ చరిత్ర, (క్రీ.శ. 1526 - 1989)

అభ్యాసం : 1

సూచనలు

1. మీరు పుస్తకాలలో నుంచి ఉన్నది ఉన్నట్లుగా రాయకూడదు.
2. సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత వాక్యాలలో రాయాలి.
3. ఒక వేళ ఏ గ్రంథం నుండైనా చూసి రాయవలసి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను (అరఠావు) ఉపయోగించండి.
5. మీరు రాసే జవాబుపై పరీక్షకులు సూచనలివ్వడానికి తగినంత మార్జిన్‌ను (స్థలాన్ని) వదలండి.
6. ఈ అభ్యాసాన్ని పూర్తిగా రాయడానికి రెండు గంటల కంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

I Answer the following questions in about 30 lines each.

క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. Outline the causes for the downfall of the Mughal empire. How far was Aurangazeb responsible for it?

   మొగల్ సామ్రాజ్య పతనానికి కారణాలను తెలుపుతూ, ఔరంగజేబు దానికి ఎంతవరకు కారకుడో వివరించండి.

2. What was the state of society and culture in the 18th century India?

   18వ శతాబ్దిలో భారతదేశంలో సమాజ, సంస్కృతుల పరిస్థితి ఎలా ఉంది?

II Answer the following questions in about 15 lines each.

క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. Estimate Shersha's place in History?

   చరిత్రలో షేర్షా స్థానాన్ని పరిగణించండి

2. What were the important achievements of Balaji Baji Rao?

   బాలాజీ బాజీరావు సాధించిన ముఖ్య ఘన కార్యాలేవి?

BRAOU

BRAOU

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

బి.ఏ./బి.కాం./బి.యస్సి. రెండవ సంవత్సరం

కోర్సు : భారతదేశ చరిత్ర, (క్రీ.శ. 1526 - 1989)

అభ్యాసం : 2

సూచనలు

1. మీరు పుస్తకాలలో నుంచి ఉన్నది ఉన్నట్లుగా రాయకూడదు.
2. సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత వాక్యాలలో రాయాలి.
3. ఒక వేళ ఏ గ్రంథం నుండైనా చూసి రాయవలసి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను (అరఠావు) ఉపయోగించండి.
5. మీరు రాసే జవాబుపై పరీక్షకులు సూచనలివ్వడానికి తగినంత మార్జిన్‌ను (స్థలాన్ని) వదలండి.
6. ఈ అభ్యాసాన్ని పూర్తిగా రాయడానికి రెండు గంటల కంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

I Answer the following questions in about 30 lines each.

క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. Explain the impact of British rule on Indian Economy.
   భారతదేశ ఆర్థిక వ్యవస్థపై బ్రిటీష్ రాజ్య ప్రభావాన్ని వివరించండి.
2. Give an account of the Non-Cooperation Movement in Andhra?
   ఆంధ్రలో సహాయ నిరాకరణోద్యమాన్ని గురించి వివరించండి.

II Answer the following questions in about 15 lines.

క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. What were the mainfeatures of the famine relief policy of the British.
   బ్రిటీష్‌వారి క్షామ నివారణ విధాన ముఖ్య అంశాలను వివరించండి.
2. Discuss the important aspects of Montague-Chelmsford.
   మాంటేగ్-చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణల ముఖ్యాంశాలను చర్చించండి.

BRAOU

BRAOU

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

బి.ఏ./బి.కాం./బి.యస్సి. రెండవ సంవత్సరం

కోర్సు : భారతదేశ చరిత్ర సంస్కృతి (క్రీ.శ. 1526 - 1989)

అభ్యాసం : 3

సూచనలు

1. మీరు పుస్తకాలలో నుంచి ఉన్నది ఉన్నట్లుగా రాయకూడదు.
2. సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత వాక్యాలలో రాయాలి.
3. ఒక వేళ ఏ గ్రంథం నుండైనా చూసి రాయవలసి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను (అరఠావు) ఉపయోగించండి.
5. మీరు రాసే జవాబుపై పరీక్షకులు సూచనలివ్వడానికి తగినంత మార్జిన్‌ను (స్థలాన్ని) వదలండి.
6. ఈ అభ్యాసాన్ని పూర్తిగా రాయడానికి రెండు గంటల కంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

I Answer the following questions in about 30 lines each.

క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. Estimate the role of the revolutionaries in India's Struggle for Freedom.

   భారత స్వాతంత్ర్య సమరంలో విప్లవాదుల పాత్రను అంచనా వేయండి.

2. Examine the Policies undertaken by Government for the Women's Development?

   మహిళాభివృద్ధికై ప్రభుత్వం చేపట్టిన పథకాలను సమీక్షించండి.

II Answer the following questions in about 15 lines.

క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి.

1. Mention the important provisions of Gandhi - Irwin Pact.

   గాంధీ - ఇర్విన్ ఒడంబడికలో ముఖ్యాంశాలను తెల్పండి.

2. Estimate the role of Non-Alignment in solving the Suez Canal Crisis

   సూయజ్ కాలువ వివాదం పరిష్కరించంటంలో అలీన విధాన పాత్రను పరిగణించండి.

BRAOU

BRAOU

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
FACULTY OF SOCIAL SCIENCES

Subject : History
Paper II : Indian History and Culture (1526-1989 A.D.)

TIME : 3 HOURS] *[MAX. MARKS : 100*

[MIN. MARKS : 35

SECTION-A
(Marks : 4 x 15 = 60)

I *Instructions to the candidates :*

1) Answer any four of the following questions in about 30 lines each.

క్రింది ప్రశ్నల్లో ఏ నాల్గింటికైనా ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

2) Each Question carries fifteen marks

ప్రతి ప్రశ్నకు 15 మార్కులు

1. Explain the political conditions in India on the eve of Babur's invasion and estimate his personality.

బాబర్ దండయాత్రనాటి భారతదేశ రాజకీయ పరిస్థితులను వివరించి అతని వ్యక్తిత్వాన్ని పరిగణించండి.

2. What was the religious policy of Akbar?

అక్బర్ మతవిధాన మెట్టిది?

3. What were the forces that helped Shivaji to work for the unification of the Marathas?

మహారాష్ట్రుల ఐక్యతకు పాటుపడేందుకు ఏయే శక్తులు శివాజీకి దోహదం చేశాయి?

4. Give a critical appraisal of the foundation of the Indian National Congress.

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు సంబంధించిన విషయాలను విమర్శనాత్మకంగా తెలపండి.

5. Analyse the salient features of British Industrial Policy in India.

భారతదేశంలో బ్రిటీష్‌వారి పారిశ్రామిక విధాన ముఖ్యలక్షణాలను విశ్లేషించండి.

6. How did the Home Rule Movement contribute for the cause of India's Freedom?

భారత స్వాతంత్ర్యానికి స్వపరిపాలనోద్యమం ఎలా దోహదపడింది?

7. Trace the main events and the significance of the Quit India Movement.

క్విట్ ఇండియా ఉద్యమ ముఖ్య సంఘటనలు, ప్రాముఖ్యతను సమీక్షించండి.

8. Write the significance of Non-Alignment movement and write about its success.

అలీన విధాన ప్రాముఖ్యతను తెల్పి, దాని విజయాలను గురించి చర్చించండి.

BRAOU

SECTION-B
(Marks : 5 x 8 = 40)

I *Instructions to the candidates :*

1) *Answer any five of the following questions in about 30 lines each.*

   క్రింది ప్రశ్నల్లో ఏ ఐదింటికైనా ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తుల్లో జవాబులు వ్రాయండి.

2) *Each Question carries eight marks*

   ప్రతి ప్రశ్నకు 8 మార్కులు

9. Discuss Mansabdari system.
   మన్సబ్‌దారీ విధానాన్ని చర్చించండి.

10. Explain the system of 'Ashtapradhans'.
    'అష్టప్రధానుల' పద్ధతిని వివరించండి.

11. Examine the religious and social ideas of Kandukuri Veereshalingam.
    కందుకూరి వీరేశలింగం మత, సాంఘిక భావాలను పరిశీలించండి.

12. What do you know about the Young Bengal movement?
    యువ బెంగాల్ ఉద్యమాన్ని గురించి నీకు తెలిసిందేమిటి?

13. State the importance of Khilafat movement.
    ఖిలాఫత్ ఉద్యమ ప్రాధాన్యతను తెల్పండి.

14. What was the role of Bhagat Singh in the Indian National Movement?
    భారత జాతీయోద్యమంలో భగత్‌సింగ్ నిర్వహించిన పాత్ర ఎట్టిది?

15. Discuss the main features of Dyarchy that was introduced under the Act of 1919.
    1919 చట్టంక్రింద ప్రవేశపెట్టబడిన ద్వంద ప్రభుత్వ ముఖ్య లక్షణాలను చర్చించండి.

16. Analyse the role of Indian National Army in the Indian National Movement.
    భారత జాతీయోద్యమంలో భారత జాతీయ సైన్యం (INA) యొక్క పాత్రను విశ్లేషించండి.

17. What was the significance of Tashkant agreement.
    తాష్కెంట్ ఒప్పంద ప్రాధాన్యత ఏమిటి?

18. What were the legislative enactments made for the women's development in independent India.
    మహిళాభివృద్ధికై స్వతంత్ర భారతదేశంలో చేయబడిన శాసనాలేవి?

BRAOU